يُسْقَوْنَ مِن رَّحِيقٍ مَّخْتُومٍ ۝

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"వారికి ముద్రవేయబడిన సుమధుర మధువు (అర్రహీఖుల్ మఖ్‌తూమ్) త్రాపించబడుతుంది."

(ఖుర్‌ఆన్ 83 : 25)

الرَّحِيقُ الْمَخْتُومُ

మహాప్రవక్త
(సల్లల్లాహు అలైహి వ సల్లం)
జీవిత చరిత్ర

అర్రహీఖుల్ మఖ్‌తూమ్

పవిత్ర మక్కా నగరంలోని "రాబితయె ఆలమె ఇస్లామీ" సంస్థ ఆధ్వర్యంలో దైవప్రవక్త(స) జీవిత చరిత్ర (సీరత్)పై జరిగిన అంతర్జాతీయ వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి పొందిన పుస్తకం.

సంకలనం
మౌలానా సఫీయుర్రహ్మాన్ ముబారక్‌పూరీ (రహ్మెలై)

తెలుగు అనువాదం
యస్.యమ్. ఖాద్రి

అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్
హైదరాబాద్-500 059. ఆం.ప్ర. ఇండియా.

Al-Ather Islamic Center
Purani Haveli Hyderabad-2
Tel No:+91-40-32901219
E-mail: al-athercenter@g-mail.com

Maha Pravakta (S) Jeevita Charitra
Ar-Raheeq-ul-Makhtoom (Telugu)

Compiled by:
Maulana Safiur Rahman Mubarakpuri (RAH)

Telugu Translation by:
S.M. Quadri

Edited by:
Shaik Hameedullah Sharief
Divya Quran Telugu Translator

First Edition : **July 2008**

Copies : **2000**

Price : **Rs. 290/-**

Typeset at : **Al Baseer Graphics**
Hyderabad. Ph:9441055065

Printed at : **Sai Krishna Graphics**
Hyderabad. Ph:9441184732

Binding at : **M. Narsimulu & Sons,**
Hyderabad. Ph: 24751839

Published by : **AL-Huq Telugu Publications**
Edgah Compound, Akbar Bagh,
Sayeedabad,
Hyderabad- 500 059.
Phones: 24550007, 24551582

కృతజ్ఞతాంజలి!

దైవగ్రంథం ఖుర్‌ఆన్, దైవప్రవక్త(స) జీవన విధానం సున్నత్‌లను తెలుగునాట వ్యాపింపజేయటంలో, తెలుగువారిని ఒక విద్యావంతమైన సమాజంగా తీర్చిదిద్దటంలో అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్ సలుపుతున్న కృషి తెలుగు జనావళికి తెలియనిది కాదు. అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్ వారు అందజేస్తున్న ఇస్లామీయ సమాచారం ఎంతో ప్రామాణికంగా, సుబోధకంగా ఉంటోందని పాఠకుల నుంచి వస్తున్న స్పందనలు మా హృదయాంతరాళాలను మీటాయి. పాఠకుల గుండెల్లో మాకింత చోటు లభించటం నిజంగా మా అదృష్టం. ఇప్పటి వరకు మా సంస్థ తరపున 'మహాప్రవక్త(స) మహితోక్తులు' (అల్ లూలు వల్ మర్‌జాన్), 'హదీసు మకరందం' (బులూగుల్ మరామ్) మొదలైన చిన్న పెద్ద విలువైన పుస్తకాలెన్నో వెలువడి తెలుగు ప్రజల హృదయాలను అలరించాయి. ఈ పుస్తకాల మూలంగా ఎంతోమంది జనం తమ మూఢ వైఖరిని మానుకోగలిగారు. తాము నడుస్తున్న అపమార్గపు చీకట్ల నుంచి వెలుగు రేఖల వైపుకు మరలివచ్చారు. పుక్కిట పురాణాలుగా చెలామణి అవుతున్న అంధ విశ్వాసాలను విడనాడి ఇస్లామీయ చైతన్యవంతులుగా సరికొత్త జీవితాలకు నాంది పలికారు. మా సంస్థ వెలువరించిన పుస్తకాలు ఇంతమంది ప్రజల పరలోక ముక్తికి ప్రేరణగా నిలవటం మాకెంతో ఆనందంగా ఉంది. ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. మా మనోజలధి నుంచి అల్లాహ్ పట్ల కృతజ్ఞతా తరంగం ఉప్పొంగి ప్రవహిస్తోంది. పరమ ప్రభువైన అల్లాహ్‌కు సహస్రకోటి కృతజ్ఞతా భివందనలు!

పాఠకులు అందించిన ఈ అంతర్గత ప్రేరణ, ప్రేమాభిమానాలు మమ్మల్ని ఈ మార్గంలో మరింత ముందుకు నడిపించాయి. అల్ హఖ్

Maha Pravakta (S) Jeevita Charitra
Ar-Raheeq-ul-Makhtoom (Telugu)

Compiled by:
Maulana Safiur Rahman Mubarakpuri (RAH)

Telugu Translation by:
S.M. Quadri

Edited by:
Shaik Hameedullah Sharief
Divya Quran Telugu Translator

First Edition	:	**July 2008**
Copies	:	**2000**
Price	:	**Rs. 290/-**
Typeset at	:	**Al Baseer Graphics** Hyderabad. Ph:9441055065
Printed at	:	**Sai Krishna Graphics** Hyderabad. Ph:9441184732
Binding at	:	**M. Narsimulu & Sons,** Hyderabad. Ph: 24751839
Published by	:	**AL-Huq Telugu Publications** Edgah Compound, Akbar Bagh, Sayeedabad, Hyderabad- 500 059. Phones: 24550007,24551582

కృతజ్ఞతాంజలి!

దైవగ్రంథం ఖుర్ఆన్, దైవప్రవక్త(స) జీవన విధానం సున్నత్‌లను తెలుగునాట వ్యాపింపజేయటంలో, తెలుగువారిని ఒక విద్యావంతమైన సమాజంగా తీర్చిదిద్దటంలో అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్ సలుపుతున్న కృషి తెలుగు జనావళికి తెలియనిది కాదు. అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్ వారు అందజేస్తున్న ఇస్లామీయ సమాచారం ఎంతో ప్రామాణికంగా, సుబోధకంగా ఉంటోందని పాఠకుల నుంచి వస్తున్న స్పందనలు మా హృదయాంతరాళాలను మీటాయి. పాఠకుల గుండెల్లో మాకింత చోటు లభించటం నిజంగా మా అదృష్టం. ఇప్పటి వరకు మా సంస్థ తరఫున 'మహాప్రవక్త(స) మహితోక్తులు' (అల్ లూలు వల్ మర్జాన్), 'హదీసు మకరందం' (బులూగుల్ మరామ్) మొదలైన చిన్న పెద్ద విలువైన పుస్తకాలెన్నో వెలువడి తెలుగు ప్రజల హృదయాలను అలరించాయి. ఈ పుస్తకాల మూలంగా ఎంతోమంది జనం తమ మూఢ వైఖరిని మానుకోగలిగారు. తాము నడుస్తున్న అపమార్గపు చీకట్ల నుంచి వెలుగు రేఖల వైపుకు మరలివచ్చారు. పుక్కిట పురాణాలుగా చెలామణి అవుతున్న అంధ విశ్వాసాలను విడనాడి ఇస్లామీయ చైతన్యవంతులుగా సరికొత్త జీవితాలకు నాంది పలికారు. మా సంస్థ వెలువరించిన పుస్తకాలు ఇంతమంది ప్రజల పరలోక ముక్తికి ప్రేరణగా నిలవటం మాకెంతో ఆనందంగా ఉంది. ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. మా మనోజలధి నుంచి అల్లాహ్ పట్ల కృతజ్ఞతా తరంగం ఉప్పొంగి ప్రవహిస్తోంది. పరమ ప్రభువైన అల్లాహ్‌కు సహస్రకోటి కృతజ్ఞతా భివందనలు!

పాఠకులు అందించిన ఈ అంతర్గత ప్రేరణ, ప్రేమాభిమానాలు మమ్మల్ని ఈ మార్గంలో మరింత ముందుకు నడిపించాయి. అల్ హఖ్

తెలుగు పబ్లికేషన్స్ తరఫు నుంచి ఇప్పటివరకు సీరతు అంశం మీద సమగ్రమైన ఏ ఒక్క పుస్తకమూ వెలువడలేదన్న ఒక చిన్న వెలితి ఏనాటి నుంచో మా హృదయ ద్వారాలను తడుతూ ఉండింది. కొన్నేళ్ల క్రితం ఆ వెలితిని పూరించటానికి కూడా అన్ని విధాలా రంగం సిద్ధమైంది. ఆధునిక కాలంలో సీరతు అంశంపైన జరిగిన అంతర్జాతీయ వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతిని చేజిక్కించుకొని ప్రపంచ ప్రజల అభినందనలు అందుకున్న రచయిత షేఖ్ సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరీ (రహ్మాలై)గారి అద్భుత కళాఖండం "అర్రహీఖుల్ మఖ్తూమ్"ను "మహాప్రవక్త(స) జీవిత చరిత్ర" పేరుతో తెలుగులోకి అనువదింప జేయటం కూడా పూర్తయింది. తర్వాత మేము వీలైనంత త్వరగా దాన్ని ముద్రించి జగత్ ప్రవక్త జీవిత చరిత్ర తెలుసుకోవాలని తహతహలాడుతున్న పాఠకుల దాహార్తిని తీర్చాలని ఎంతగానో పరితపించాం. కాని ఇంత పెద్ద గ్రంథాన్ని ప్రచురించేమార్గంలో సహజంగానే ఎన్నో అవాంతరాలను ఎదుర్కోవలసి వస్తుంది. ఇన్ని అవాంతరాలను అధిగమించి గ్రంథాన్ని వెలువరించటం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న కార్యం. కాని అల్లాహ్ కారుణ్యం అనతికాలంలోనే ఈ గ్రంథాన్ని పాఠకుల ముందుకు తీసుకురాగలిగే సాహసాన్ని మాలో నింపింది. ఆ మొత్తం కృషి ఫలితమే ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న ఈ అర్రహీఖుల్ మఖ్తూమ్ పుస్తకం!

దైవచిత్తమయితే మరెన్నో అమూల్యమైన గ్రంథాలను మీ ముందుకు తీసుకురావాలన్నది మా ఆకాంక్ష. రచయితకు, అనువాదకునికి, ముద్రణలో తోడ్పడిన శ్రేయోభిలాషులందరికి దైవం ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించాలని, పరలోకంలో మనందరికి తన కారుణ్య నీడలో కాస్తంత చోటు లభించేలా అనుగ్రహించాలని మనసారా వేడుకుంటున్నాం.

- ప్రకాశకులు

అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్,

హైదరాబాద్

ఈ కృషి శ్లాఘనీయం

అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. వస్సలాతు వస్సలాము అలా రసూలిహిల్ కరీమ్. వ అలా ఆలిహీ వ సహ్బిహీ అజ్‌మయీన్ వ బాద్:

కలిమయె తయ్యిబ "లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మద్ రసూలుల్లాహ్" లో రెండు భాగాలున్నాయి. మొదటి భాగం "లా ఇలాహ ఇల్లల్లాహ్" తౌహీద్ వచనం కాగా, "ముహమ్మద్ రసూలుల్లాహ్" అన్నది రిసాలత్ (అంటే దైవదౌత్యానికి సంబంధించిన) వచనం. మనం రిసాలత్ వచనాన్ని విశ్వసిస్తున్నట్లయితే అందుకు ప్రతిగా మనం జీవితంలో అడుగడుగునా ప్రియప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లంను ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన అడుగుజాడల్లో నడవాలి. ఆయన ఏదైనా ఆజ్ఞ ఇస్తే ఆ ఆజ్ఞను శిరసావహించాలి. ఆయన వారించిన విషయాలకు దూరంగా ఉండాలి. ఆయన మనకు ఏదైనా సమాచారం తెలియజేస్తే పూర్తి నమ్మకంతో ఆ సమాచారాన్ని ధృవీకరించాలి. మన సకల ఆరాధనలను కేవలం ఆయన చూపిన మార్గంలోనే నిర్వర్తించాలి.

ఖుర్‌ఆన్ హదీసుల వెలుగులో దైవప్రవక్త జీవిత చరిత్రను నిత్యం మన దృష్టిలో పెట్టుకొని మసలుకున్నప్పుడే పైన పేర్కొనబడిన అత్యంత ముఖ్య కర్తవ్యాలను నిర్వర్తించడం వీలవుతుంది. ఆ మాటకొస్తే సీరతు అంశం మీద అరబీ ఉర్దూ భాషల్లో పెద్ద పెద్ద గ్రంథాలే లెక్కలేనన్ని ఉన్నాయి. కాని తెలుగు నాట సీరతు అంశం మీద ఇప్పటిదాకా ప్రామాణికమైన, విపులమైన పుస్తకం ఒక్కటీ వెలువడలేదు. ఈ మహాఅగాథాన్ని పూడ్చటానికి అల్‌హఖ్ సొసైటీ (హైదరాబాద్) వారు సీరత్‌కు సంబంధించి పుస్తకాలను అన్వేషిస్తున్నప్పుడు వారి దృష్టి మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరీ గారి ప్రఖ్యాత పుస్తకం **"అర్రహీఖుల్ మఖ్తూమ్"** మీద పడింది. అల్‌హఖ్ సొసైటీ యాజమాన్యం చేసిన ఈ మంచి ఎంపికను మేము అమితంగా అభినందిస్తున్నాము.

మౌలానా ముబారక్‌పురీ గారి వ్యక్తిత్వం తన కాలంలో ఒక విలక్షణమైన వ్యక్తిత్వంగా భాసిల్లింది. అలాగే సీరతు అధ్యాయంలో ఆయన రాసిన పుస్తకం కూడా ఒక విలక్షణమైన స్థానాన్ని కలిగి ఉంది. అది సీరత్ నిపుణుల, విద్వాంసుల దృష్టిలో అంతర్జాతీయ స్థాయి పోటీలో మొదటి బహుమతికి అర్హతను సంపాదించింది. అందుకనే హి.శ. 1398లో రాబితయె ఆలమె ఇస్లామీ సంస్థ మౌలానా గారిని పవిత్ర మక్కా నగరానికి ఆహ్వానించి మొదటి బహుమతి ప్రదానం చేసింది.

ఈ పుస్తకం పరిపూర్ణ పవిత్ర సీరతును సరైన రీతిలో ప్రతిబింబిస్తుంది. ఈ పుస్తకంలోని విషయాలన్నీ ఎంతో ప్రామాణికమైనవి. భేదాభిప్రాయాలున్న చోట ఈ పుస్తకం సాక్ష్యాధారాలతో సహా సత్యాన్ని ప్రస్ఫుటం చేస్తుంది. దైవప్రవక్త (స) గారి ధర్మ ప్రచార విధానాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ పుస్తకం రూపకల్పన జరిగింది. రచయిత శైలిలోని రమణీయత, పదాల లాలిత్యం అనువాద కృతిలోనూ ప్రస్ఫుటంగా కానవస్తోంది. మొత్తానికి ఈ పుస్తకం తెలుగు పాఠకులకు సుబోధకం అయింది.

ఈ పుస్తకం తన అశేష ప్రత్యేకతలతో తెలుగు పాఠకులను అలరించ గలదనీ, చాలా తొందరగా పండితుల సామాన్యుల దాహార్తిని తీర్చే జ్ఞానఖనిగా వెలుగొందగలదనీ గట్టిగా ఆశిస్తున్నాను. రచయిత కోసం, అనువాదకుని కోసం ఇంకా ప్రకాశకుల కోసం అల్లాహ్ ఈ పుస్తకాన్ని అత్యుత్తమమైన పరలోకనిధిగా మలచాలని ప్రార్థిస్తున్నాను. (ఆమీన్)

డా. సయీద్ అహ్మద్,
ఉమరీ, మదనీ
జనరల్ సెక్రటరీ, మర్కజ్ దారుల్ బిర్ర్
పెడన, ఆంధ్రప్రదేశ్

ముందుమాట

అఖండ బ్రహ్మాండమైన ఈ సృష్టిలో మానవ సృష్టి మహోజ్వలమైనది. ఈ సృష్టి మొత్తం అసలు మానవుడి కోసమే పుట్టించబడింది అని అంటే అది అతిశయోక్తి ఎంత మాత్రం కాదు. వర్షాలు కురుస్తాయి మానవుడి కోసం, పంటలు పండుతాయి మానవుడి కోసం, రేయింబవళ్లు ఒక దానివెంట ఒకటి పరిభ్రమిస్తాయి మానవుడి కోసం. కనుక ఇంత పెద్ద అద్భుతమైన సృష్టిని పుట్టించి, మానవుడు ఈ ప్రపంచంలో ఎందుకు పుట్టాడు? మానవ జీవిత లక్ష్యం ఏమిటి, ఏ మార్గం మంచిది, ఏ మార్గం చెడ్డది అనే విషయాలను దేవుడు మానవుడికి తెలియజెయ్యకుండా ఉంటాడా? అతన్ని అజ్ఞానపు చీకట్లల్లో కొట్టుమిట్టాడేలా చేస్తాడా? అసంభవం, అలా చెయ్యడు. ఆయన దూరదృష్టికలవాడు, అత్యంత వివేకవంతుడు. కనుకనే ఒక లక్షా ఎనభైవేల మంది దైవప్రవక్తలను అన్ని కాలాల్లో, అన్ని ప్రాంతాలకు పంపించాడు; గ్రంథాలను అవతరింపజేశాడు. తద్వారా విజ్ఞాన కాంతుల్ని వెదజల్లాడు; మానవుడు పుట్టిన దగ్గర్నుంచి మరణించేవరకు ఎలా జీవించాలో, అలా ఎందుకు జీవించాలో తెలియజేశాడు. ఇలా వచ్చిన దైవప్రవక్తల పరంపరలో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) చిట్టచివరి వారు. ఇక ప్రళయం వచ్చే వరకు దైవప్రవక్తలూ రారు, దైవగ్రంథాలూ అవతరించవు. కలకాలం ఉండే స్వర్గలోకాలకు పోదలచిన వారు, తమను తాము నరక జ్వాలల నుంచి కాపాడుకో దలచిన వారు మహాప్రవక్త ముహమ్మద్ (స)ను చివరి దైవప్రవక్త (స)గా విశ్వసించటం, ఆయన (స) గారి ఆదర్శజీవితాన్ని అనుసరించటం అత్యంతావశ్యకం.

దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) సర్వమానవులకు శుభవార్తను ఇచ్చే వారుగా, హెచ్చరిక చేసేవారుగా వచ్చారు. ఆయనకు పూర్వం కూడా ఎన్నో జాతుల వద్దకు దైవప్రవక్తలు వచ్చారు. ఆయన ప్రజలకు దేవుని వాక్యాలను వినిపిస్తారు; వారి జీవితాలను తీర్చిదిద్దుతారు; వారికి గ్రంథాన్నీ, దివ్యజ్ఞానాన్నీ బోధిస్తారు; వారికి తెలియని విషయాలు ఎన్నో వారికి నేర్పుతారు. ఆయన విశ్వ మానవులందరికీ కారుణ్యంగా వచ్చారు. ఇంకా వారికి సన్మార్గాన్ని, దైవాదేశా

లను అందజెయ్యటానికి వచ్చిన అంతిమ సందేశహరులు. మానవ జాతికి ముక్తి మార్గాన్ని చూపించటానికి నియమించబడిన మార్గదర్శి. నరకం వైపునకు పరుగులు తీస్తున్న నరనారీమణులను రక్షించటానికి ఆవిర్భవించిన రక్షకుడు. కనుకనే ఆయన (స) ప్రకాశించే దీపంగా వచ్చారు.

పురాణంలో ముహమ్మద్ (స)

ఏతస్ మిన్నంతరేమ్లేచ్ఛ ఆచార్యేణ సమన్వితః
'మహామద' ఇతిఖ్యాతః శిష్యశాఖా సమన్వితః
నృపశ్చైవ మహాదేవం మరుస్థల నివాసం

(భవిష్య పురాణం-3వ పర్వం - 3వ ఖండం-3వ అధ్యాయం 5-9 శ్లోకాలు)

అర్థం : మ్లేచ్ఛుడు, పరదేశస్థుడైన ఒక ఆచార్యుడు ఉద్భవిస్తాడు. అతనికి ఎంతో మంది శిష్యులుంటారు. మహామద అనేది అతని పేరు. ఆ మహానుభావుడు మరుస్థల నివాసి. అంటే ఎడారి ప్రదేశానికి చెందినవాడని అర్థం. 'మహామద' అంటే ముహమ్మద్ అని భావం.

వాస్తవానికి అల్లాహ్ ఒక్కడే మానవుడికీ, సకల జగత్తుకూ సృష్టికర్త, ఆరాధ్యుడు, సర్వాధికారి. ఆయనకు సొంతమైన ఈ సృష్టిరాజ్యంలో మనిషి స్వతంత్రుడూ, అధికారం కలవాడూ కాడు. ఇతరులెవ్వరికీ దాసుడు కూడా కాడు. మానవుడి విధేయతకూ, దాస్యానికీ అల్లాహ్ తప్ప మరెవ్వరూ యోగ్యులు కారు. ఈ భూలోక జీవితం ఒక పరీక్షా వ్యవధి. ఈ జీవితం తరువాత తప్పనిసరిగా మరొక జీవితం వస్తుంది. అప్పుడు దేవుడు మానవులందరి ఇహలోక కార్యకలాపాలను పరీక్షించి వారిలో ఎవరు పరీక్షలో నెగ్గారో ఎవరు అపజయం పాలయ్యారో నిర్ణయిస్తాడు - ఇది సంక్షిప్తంగా దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి సందేశం.

ప్రవాహం మాదిరిగా చక్కని శైలిలో సాగింది మిత్రులు యస్.యమ్. ఖాద్రి గారి అనువాదం. అసలు గ్రంథం అనువాదంగా అనిపించదు. ఒరిజినల్ పుస్తకంగా అనిపిస్తుంది. తెలంగాణా తెలుగు భాషలోని నుడికారాలను ఆయన వశీకరణ మంత్రంలా ప్రయోగించారు. ఆయన దిగ్విజయులు. ఆయనకు అభినందనలు.

షేఖ్ హమీదుల్లాహ్ షరీఫ్
దివ్యఖుర్ఆన్ తెలుగు అనువాదకులు

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

హదీసు గ్రంథోపాధ్యాయులు, పేరెన్నికగన్న హదీసువేత్త "మిష్కాతుల్ మసాబీహ్" వ్యాఖ్యాన గ్రంథమైన "మిర్అతుల్ మఫాతీహ్" గ్రంథ రచయిత మౌలానా ఉబైదుల్లాహ్ గారి తరఫున

శుభాకాంక్షలు

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారి జీవిత చరిత్ర గురించి ఒక సమగ్రమైన ప్రామాణికమైన, ఉపయుక్త గ్రంథాన్ని రచించటం ఎంతో సున్నితమైన పని. మిత్రులు, "సలఫియా, బనారస్" విశ్వవిద్యాలయం గురువులు మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరీ గారు "అర్రహీఖుల్ మఖ్తూమ్" అనే పేరుతో రచించిన గ్రంథానికి ఇస్లామీయ చరిత్ర నిపుణులు, దైవప్రవక్త జీవిత చరిత్ర పరిశోధకులు పాల్గొన్న అంతర్జాతీయ స్థాయి పోటీలో మొదటి బహుమతి లభించటం నాకెంతో ◆ ఆనందాన్ని కలుగజేసింది. ప్రస్తుతం దాని ఉర్దూ అనువాదం ప్రజాబాహుళ్యంలోకి వెలువడుతోంది.

అల్లాహ్ రచయిత కోసం ఈ గ్రంథాన్ని శ్రేయోశుభాల వారధిగా మలచాలనీ, పండిత పామరులందరికీ ఇది ప్రయోజనకరం కావాలనీ, పరలోకంలో రచయితకు దీని ద్వారా పరమ ప్రభువు క్షమాభిక్ష లభ్యం కావాలనీ, ఇహపరలోకాల్లోనూ గొప్ప ప్రతిఫలం లభించాలని మనసారా ప్రార్థిస్తున్నాను.

వమా జాలిక అలల్లాహి బి అజీజ్

ఉబైదుల్లాహ్ రహ్మానీ
హి.శ. 1408/14, షాబాన్

◆ ఇవి ఉర్దూ గ్రంథానికి వ్రాయబడిన తొలి పలుకులన్న విషయం పాఠకులు గమనించగలరు.

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జీవిత చరిత్రను రచించటం మామూలు విషయం కాదు. అదొక గొప్ప కళ. ఎన్నో శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటేనే ఆ కళ పరిపూర్ణం అవుతుంది. కనుక దైవప్రవక్త జీవిత చరిత్రను రచించటమంటే 'సిరాత్'ను దాటటమే. ('సిరాత్' అనేది పరలోకంలో మానవులు దాటవలసిన ఒక వంతెన.) గత పద్నాలుగు శతాబ్దాల కాలంలో దైవప్రవక్త అభిమానులెందరో లెక్కకు మించిన గ్రంథాలు రచించారు. ప్రపంచంలో ఆయన జీవితపు రంగవల్లికను తీర్చిదిద్దారు. ఆయన నైతికతా పరిమళాలను లోకంలో గుభాళింపజేశారు. ఆ గ్రంథాలు రచించి ఎన్నో వందల యేండ్లు గడిచాయి. వారు వెలిగించిన జ్ఞాన జ్యోతుల్ని ఆర్పివేయటానికి విశ్వ ప్రయత్నాలూ జరిగాయి. అయినప్పటికీ ఆ గ్రంథాలు ఈ రోజుకి కూడా తమ వైజ్ఞానిక స్థానాన్ని, పరిశోధనా ప్రాభవాన్ని కోల్పోకుండా స్థిరంగా ఉన్నాయి. దైవప్రవక్త జీవిత సాహితీవనం ఇంత సుసంపన్నంగా ఉన్నప్పటికీ ఈ మార్గంలో మరెన్నో పరిశోధనలు జరుగవలసి ఉంది. ఈ పరంపర ప్రళయం వరకు కొనసాగుతూనే ఉంటుంది.

సీరత్ (దైవప్రవక్త (స) జీవిత చరిత్ర) పేరుతో చాలామంది రచయితలు ఉన్నవీ లేనివీ కల్పించి రాస్తుంటారు. కాని వాటన్నిటిలో "అర్రహీఖుల్ మఖ్తూమ్" స్థానమే వేరు. అది చీకటి రాత్రిలో వెలిగే దీపం లాంటిది. అంధకార బంధుర రేయిలో పండు వెన్నెల లాంటిది. మొత్తానికి ఈ పుస్తకం లోని సంఘటనల ఎంపిక, సుతిమెత్తని శైలి, పదునైన భాష, పూర్వాపరాల సమకూర్పు, అందంగా, హృదయానికి హత్తుకునేలా చెప్పబడిన సామెతలు, దీనికి గల విశ్వసనీయమైన మూలాధారాలు అన్నీ కలిసి సాహిత్యపరంగానూ, పరిశోధనా పరంగానూ ఈ పుస్తకం ప్రామాణికతను మరింత పెంచేశాయి. కనుక ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న ఈ పుస్తకం అందులోని విషయ ప్రామాణికత రీత్యానూ, పరిశోధనా పరంగానూ సీరత్‌పై రాయబడిన గొప్ప గ్రంథాల్లో ఒకటన్నది ఎవరూ కాదనలేని వాస్తవం.

"అర్రహీఖుల్ మఖ్తూమ్" ప్రస్తుత కాలపు సీరత్ రచనా వ్యాసంగానికి ఒక ప్రామాణిక నమూనా. ఈ పుస్తకం మొదట అరబీ భాషలో రాయబడింది. తర్వాత దీనిని రాబితయె ఆలమె ఇస్లామీ సంస్థ నిర్వహించిన "అంతర్జాతీయ సీరత్ రచనా పోటీ"కి పంపించటం జరిగింది. అంతర్జాతీయంగా ఉన్న రచయితల నుంచి ఆ పోటీకి మొత్తం 171 ముసాయిదాలు అందాయి. మహాపండితులు, పరిశోధకులతో కూడిన ఒక బోర్డు ఆ ముసాయిదాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన మీదట 50 వేల సౌదీ రియాళ్ల విలువచేసే మొదటి బహుమతి కోసం ఈ పుస్తకాన్ని ఎంపిక చేసింది. ఈ అద్భుత రచన ప్రస్తుతం స్వయానా రచయిత గారి ద్వారానే ఉర్దూలోకి అనువదించబడి ప్రచురణకు నోచుకుంటోంది. దీని ప్రత్యేకత ఏమిటంటే పాఠకులకు ఈ పుస్తకం అనువాద పుస్తకంలా అనిపించదు. పైగా ఇది మూలగ్రంథ పఠన అనుభూతిని కలుగజేస్తుంది. అంత రసవత్తరంగా సాగింది దీని అనువాదం. ఇకపోతే ఈ పుస్తకం లోని కథనం పాఠకుణ్ణి విసిగించేంత సుదీర్ఘంగా ఉండదు. అలా అని విషయాన్ని పూర్తిగా వివరించకుండా పాఠకులకు అసంతృప్తినీ మిగల్చదు.

రచయిత మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరీ ప్రస్తుతకాలపు గొప్ప ఇస్లామీయ విద్వాంసుల్లో ఒకరు. ముబారక్‌పూర్ (ఇండియా) గ్రామంలో బాగా పేరుగాంచిన పండిత కుటుంబానికి చెందినవారు. ఆయన కుటుంబం చేసిన సాహిత్య సేవలకు, ప్రధానంగా వారు చేసిన హదీసు సేవలకుగాను యావత్ప్రపంచంలో ఎన్నో గౌరవమన్ననలు లభించాయి. రచయిత ఉర్దూ, అరబీ భాషల్లో (చిన్నవీ పెద్దవీ కలిపి) మొత్తం ఇరవై ఒక్క పుస్తకాలు రచించారు. రంగురంగుల ఆ మొగ్గల్లో వికసించి పరిమళించిన పువ్వే ఈ పుస్తకం.

ఇంత అద్భుతగ్రంథాన్ని మక్తబా సలఫియా వారు ముద్రణాపరంగానూ ఎంతో అందంగా, సర్వాంగ సుందరంగా ప్రచురించాలని కోరుకోవటం సహజమే. ఇది దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) పట్ల వారికిగల అపార ప్రేమాభిమానాలను వ్యక్తం చేస్తోంది. అల్లాహ్ వీరి కృషిని ఆమోదించుగాక! (ఆమీన్)

ప్రొఫెసర్ అబ్దుల్ జబ్బార్ షాకిర్
డైరెక్టర్ పంజాబ్ పబ్లిక్ లైబ్రరీస్
బాగె జనాహ్, లాహోర్

నా మాట

అస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహి వ ఆలిహీ వ సహ్‌బిహీ అజ్మయీన్

రబీవుల్ అవ్వల్ హి.శ. 1396 (మార్చి 1976) నాటి మాట ఇది. నాకు, కరాచీలో జరిగిన 'ఆలమె ఇస్లామీ' మొదటి సీరత్ కాన్ఫరెన్సులో పాల్గొనే అదృష్టం కలిగింది. కాన్ఫరెన్సులో 'రాబితయె ఆలమె ఇస్లామీ మక్కా' (వరల్డ్ ఇస్లామిక్ సెంటర్) ఆ కాన్ఫరెన్సులో చురుకుగా పాల్గొనడం జరిగింది. కాన్ఫరెన్సు ముగింపు సందర్భంగా 'రాబితా', ప్రపంచంలోని రచయితలందరిని ఉద్దేశించి, మహాప్రవక్త (స) సీరత్ (చరిత్ర)పై ప్రపంచ సజీవ భాష దేనిలోనైనా రచనలు రాసి పంపించమని కోరడం కూడా జరిగింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ మరియు పంచమ స్థానాలు పొందే రచనలకు వరుసగా యాభై, నలభై, ముప్పై, ఇరవై మరియు పది వేల సఊది రియాళ్ళ నగదు బహుమతి కూడా ప్రదానం చేయబడుతుందని ప్రకటించారు. ఈ ప్రకటన రాబితా అధికార పత్రిక అయిన 'అల్ ఆలమె ఇస్లామీ' యొక్క అనేక సంచికల్లో ప్రకటించడం కూడా జరిగింది. కాని నాకు మట్టుకు ఈ ప్రకటన గురించిన వివరాలు సకాలంలో తెలియలేదు.

కొన్ని రోజులు గడిచిన తరువాత నేను బెనారస్ నుండి నా స్వస్థలం ముబారక్‌పూర్‌కు వెళ్ళగా, నా మేనత్త కుమారులు అయిన ఉస్తాద్ మౌలానా అబ్దుర్రహ్మాన్ సాహెబ్ ముబారక్‌పూరీ (ఈయన షేకుల్ హదీస్ మౌలానా ఉబైదుల్లాహ్ సాహెబ్ రహ్మానీగారి పుత్రుడు) ఈ విషయాన్ని నాకు తెలుపుతూ, నేను కూడా ఈ పోటీలో పాల్గొనాలని బలవంతం చేశారు. నేను నా అల్పజ్ఞానం మరియు అనుభవ లేమి గురించి ఏకరువు పెట్టగా, మౌలానా ఆ పని నీవే చేయాలి అని పట్టుబట్టారు. ఓ సందర్భంలో, నేను ఆ పని చేయడానికి సమర్థుణ్ణికాను అని చెప్పగా ఆయన, ఇది బహుమతి పొందాలనే ఉద్దేశ్యంతో చేయవలసిన పని కాదు. ఈ మిషపై ఏదో ఒక పని జరిగి పోతుందని అనుకుంటున్నాను అని ఒత్తిడి చేయడం కూడా జరిగింది. ఆయన నాపై ఒత్తిడిని పెంచుతున్నప్పటికీ నేను మాత్రం ఈ పోటీలో పాల్గొనబోననే దృఢ సంకల్పంతోనే మిన్నకుండిపోయాను.

మరికొన్ని రోజులు గడిచిపోయిన తరువాత 'జమాఅతె అహ్లె హదీస్ హింద్' ఆర్గన్ మరియు పక్షపత్రిక అయిన 'తర్జుమాన్ దేహ్లీ'లో ఈ ప్రతిపాదన గురించిన ప్రకటన ఉర్దూ భాషలోనూ ప్రచురితమైంది. ఇప్పుడు నా ముందు ఓ విచిత్రమైన పరిస్థితి వచ్చి నిలిచినట్లయింది. జామియా సల్ఫియాకు చెందిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం చదువు ముగించుకుంటున్న ప్రస్తుత విద్యార్థులు, సాధారణంగా, నాకు తారసపడినప్పుడల్లా, నన్ను ఆ పోటీలో పాల్గొనాలని సలహాలు ఇవ్వనారంభించారు. అయినప్పటికీ నేను ఆ పోటీలో పాల్గొనబోననే నా కృతనిశ్చయాన్ని వదలలేదు. అలా కొన్ని రోజులు గడిచిపోయాయి. విద్యార్థుల సలహాలు, డిమాండులు కూడా దాదాపుగా ఆగిపోయాయనే చెప్ప వచ్చు. కాని కొందరు మాత్రం నాపై ఆ ఒత్తిడిని యధాతథంగా కొనసాగిస్తూనే ఉన్నారు. కొందరైతే రచనాశైలి ఎలాగుండాలనే విషయాన్ని కూడా చర్చించడం మొదలెట్టారు. కొందరి ప్రోత్సాహం, మరికొందరి ప్రోద్బలం మరీ అధికమైపోయింది. చివరికి నేను అన్య మనస్కంగానే దాని కోసం ఒప్పుకోవలసి వచ్చింది.

అయితే కొంచెం కొంచెంగా, మందకొడిగా పనిని ప్రారంభించాను. నా రచన ఇంకా ప్రారంభ దశలో ఉండగానే రమజాన్ మాసం సెలవులు ప్రారంభం అయ్యాయి. అటు రాబితా, వచ్చే ముహర్రం నెల మొదటి వారం లోనే రచనలు అందాలనే ప్రకటన చేసింది. ఇలా అప్పటికే ఈ మీమాంస లోనే దాదాపుగా అయిదున్నర నెలల కాలం గడిచిపోయింది. ఇక రచనలు అందాల్సిన గడువు మూడున్నర నెలలే. ఈ కాలంలో రచన పూర్తి కావాలి. దాన్ని సమయానికి అందేటట్లు పోస్టు చేయాలి. ఇటు చూస్తే ఎక్కడి పని అక్కడనే ఉండిపోయింది. ఈ స్వల్ప వ్యవధిలో రచనాక్రమాన్ని నిర్ణయించడం, దాన్ని రాయడం, సరిచూడడం, అసలు ప్రతిని తయారు చేయడం లాంటివి జరుగుతాయనే నమ్మకం కూడా లేదు. కాని నాపై ఒత్తిడిని తెచ్చేవారు మాత్రం, నేను వెనుకాముందు ఆలోచించకుండా, ఎలాంటి ఉపేక్షకు గురికాకుండా నా పనిలో పూర్తిగా నిమగ్నమైపోవాలని, రమజాన్ నెల అయిపోగానే ఆ పనులు తామే చేసి పెడతామనే భరోసానిచ్చారు. నేను కూడా నాకు వరంగా లభించిన ఈ సెలవులను వినియోగించుకొని రచనను ప్రారంభించాను. రమజాన్

సెలవులు నాకు తెలియకుండానే గడిచిపోయాయి. వారు నా వద్దకు వచ్చి నప్పటికల్లా రచన మూడింట రెండొంతులు పూర్తి అయిపోయింది. దాన్ని పునస్సమీక్ష మరియు సవరణలు చేసే సమయం నా వద్ద లేనందున దాని కోసం అసలు ముసాయిదా మొత్తాన్నే వారికి అందించాను. తక్కిన భాగానికి సంబంధించిన కొన్ని విషయాలను సేకరించడంలో కూడా వారి సహాయ సహకారాలను పొందాను. జామియా డ్యూటీ ప్రారంభం అయింది. సెలవుల్లో చేసినంత పని చేయలేకపోయాను. అయినప్పటికీ ఈదుల్ అజ్‌హా సెలవులు వచ్చేటప్పటికి రాత్రి జాగారంతో రచన చివరి దశకు చేరుకుంది. ఇంకొంత ప్రయత్నం చేసి దాన్ని పూర్తి చేయగలిగాను. ముహర్రం మాసం ఇంకా రెండు మూడు రోజుల్లో ముగుస్తుందనగా ఆ రచనను పోస్టు ద్వారా రాబితాకు పంపించగలిగాను.

కొన్ని నెలలు గడిచిన తరువాత నాకు, వారం, పది రోజుల తేడాతో రెండు రిజిష్టర్డు లేఖలు అందాయి. ఆ లేఖల సారాంశాన్నిబట్టి, నా రచన రాబితా నిర్దేశించిన షరతులకు అనుకూలంగానే ఉందని, అది పోటీకి అను మతించబడిందని తెలుసుకొని హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాను.

ఆ తరువాత రోజులు నెలలు గడిచిపోతూనే ఉన్నాయి. అలా పద్దెనిమిది నెలలు గడిచిపోయాయి. 'రాబితా' నుండి ఉలుకూ పలుకు ఏదీ లేదు. దాని విషయంలో ఏమి జరిగిందో తెలుసుకోవడానికి రెండు ఉత్తరాలు కూడా రాశాను కాని లాభం లేదు. ఆ తరువాత నాకు ఎదురైన సమస్యల్లో చిక్కుకొని, నేను పోటీలో పాల్గొన్నాననే విషయాన్ని కూడా మరచిపోయాను.

హి.శ. 1398 షాబాన్ నెలలో (1978 జులై 6,7,8 తేదీల్లో) కరాచీలో మొదటి ఆసియా ఇస్లామీయ కాన్ఫరెన్సు జరిగింది. నాకు ఆ కాన్ఫరెన్సు గురించి తెలుసుకోవాలనే కుతూహలం ఉన్నందున దానికి సంబంధించిన వార్తలు ఏవైనా ఉన్నాయా అనే ఉద్దేశ్యంతో పత్రికలను తిరిగేయ నారంభిం చాను. ఓ రోజు 'బదోహీ' స్టేషనులో లేటైన రైలు కోసం ఎదురు చూస్తూ ఓ వార్తాపత్రికను తిరిగేయనారంభించాను. అనుకోకుండా ఓ చిన్నవార్తపై నా దృష్టి నిలిచింది. ఆ వార్తలో, ఇస్లామీయ కాన్ఫరెన్సులోని ఓ సభలో రాబితా, ప్రవక్త (స) గారి జీవిత చరిత్ర రచనా పోటీల్లో గెలుపొందిన అయిదుగురి పేర్లు

ప్రకటించిందని, వారిలో ఒకరు భారతదేశానికి చెందిన వారని ముక్తసరిగా చెప్పడం జరిగింది. ఈ వార్త చదివిన తరువాత పూర్తి వివరాలేమై ఉంటాయా అని తెలుసుకునే కుతూహలం పెరగనారంభించింది నాలో. బెనారస్‌కు తిరిగి వచ్చి ఆ వివరాలను తెలుసుకోవడానికి ప్రయత్నించాను కాని ఫలితం దక్కలేదు.

జులై 10, 1978 నాడు, రాత్రంతా మరునాడు 'బజ్‌డేహా'లో జరుగబోయే 'మనాజిరా' (తర్క సంబంధమైన వాదన)కు సంబంధించిన తయారీలో గడిచిపోయినందున బాగా ప్రొద్దెక్కే వరకు (చాష్త సమయం వరకు) ఆదమరచి నిద్రపోతున్నాను. అప్పుడే నా గదికి ఆనుకొని ఉన్న మెట్ల మీద విద్యార్థుల కోలాహలం వలన నాకు నిద్రాభంగం అయింది. అప్పటికే శిష్యుల సమూహం ఒకటి నా గదిలో ప్రవేశించనే ప్రవేశించింది. వారి ముఖాలు ఆనందంతో కళకళలాడుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన నేను వారినుద్దేశించి,

"ఏం జరిగింది? వ్యతిరేక తార్కికుడు తర్కంలో పాల్గొనబోనని ఏదైనా కబురు పంపాడా ఏమిటి?" అని ప్రశ్నించాను.

"కాదు, తమకు సీరత్ రచనా పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది" అన్నారు శిష్యులు ముక్తకంఠంతో.

"అల్లాహ్! నీకు కృతజ్ఞతలు" అని చెప్పి, "మరి ఈ విషయం మీకెలా తెలిసింది?" అప్పటికే నేను లేచి కూర్చుని ఈ ప్రశ్న వేశాను.

"ఈ వార్తను తెచ్చింది మౌల్వీ ఉజైర్ షమ్స్‌గారు" విద్యార్థుల సమాధానం.

"మౌల్వీ ఉజైర్ షమ్స్' గారేరి?"

"ఆయన ఇక్కడకొచ్చే ఈ శుభవార్త అందించారు" అంది శిష్యగణం. మౌల్వీ ఉజైర్ షమ్స్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్నాన్నేను.

హి.శ. 1398 షాబాన్ నెల 22వ తారీకున (జులై 29, 1978) నాకు రాబితా నుండి ఓ రిజిష్టర్డు లేఖ అందింది. అందులో, నేను గెలుపొందినట్లు చెబుతూ రాబితా, ముహర్రం నెల 1399లో మక్కా ముకర్రమాలోని రాబితా కేంద్ర కార్యాలయంలో బహుమతి ప్రదాన ఉత్సవం జరుగుతుందని శుభవార్త అందించింది. ఆ లేఖలోనే నేను అక్కడికి రావాలని ఉంది. ఈ ఉత్సవం ఇది

వరకు చెప్పినట్లు ముహర్రం మాసానికి బదులు రబీఉల్ ఆఖిర్ 12, 1399లో ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ ఉత్సవంలో పాల్గొన్న కారణంగా నాకు మొట్టమొదటిసారి హర్మైన్ షరీఫైన్ (మక్కా మదీనా పవిత్ర స్థలాల)ను దర్శించుకునే భాగ్యం కలిగింది. రబీఉల్ ఆఖిర్ 10వ తారీఖున గురువారం 'అస్ర్' నమాజుకు ముందే నేను మక్కా పరిశుద్ధ క్షేత్రంలో కాలుమోపాను. మూడో రోజు ఉదయం గం. 8-30 లకు రాబితా కేంద్రంలో హాజరు కావాలనే ఆదేశం ఉంది. దాదాపు గం. 10-30 లకు దివ్యఖుర్ఆన్ పారాయణంతో ఆ ఉత్సవ సభ ప్రారంభం అయింది. సౌదీ న్యాయస్థానం చీఫ్ జస్టిస్ షేక్ అబ్దుల్లాహ్ బిన్ హుమైద్ (రహ్మలై) ఆ సభకు అధ్యక్షత వహించారు. మక్కా డెప్యూటీ గవర్నరు అమీర్ సఊద్ బిన్ అబ్దుల్ ముహ్సిన్(ఈయన మలిక్ అబ్దుల్ అజీజ్ మనవడు) బహుమతి ప్రదానం కోసం విచ్చేసి ఉన్నారు. ఆయన చేసిన సంగ్రహ ప్రసంగం తరువాత రాబితా జనరల్ సెక్రటరీ షేక్ అలీయిల్ ముక్తార్ ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో, ఈ పోటీ ఎందుకు నిర్వహించబడిందో, పోటీదారుల ఎంపిక జరిగిన విధానం ఎలాంటిదో వివరంగా చెప్పారు. పోటీ ప్రకటన వెలువడిన తరువాత రాబితాకు వెయ్యికిపైగా (అంటే 1182) రచనలు అందాయని, వాటిని వివిధ కోణాల నుండి పరిశీలించిన తరువాత ప్రారంభ కమిటీ వాటిలో 183 రచనలను ఎంపిక చేసి అసలు బహుమతి ఎంపిక కోసం ఎనమండుగురు నిపుణులు గల కమిటీకి పంపించిందని చెప్పారు. ఈ కమిటీకి చెందిన ఎనమండుగురు సభ్యులు, మలిక్ అబ్దుల్ అజీజ్ యూనివర్శిటీ జిద్దా శాఖ అయిన 'కులీయతు షరీయా' మక్కా (ఇప్పుడు అది జామియా ఉమ్ముల్ ఖురా) లో ప్రొఫెసర్లే కాకుండా మహాప్రవక్త ముహమ్మద్(స) గారి జీవిత చరిత్ర మరియు ఇస్లామియ చరిత్రకు సంబంధించిన నిపుణులు కూడా. వీరి పేర్లు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

1. డా॥ ఇబ్రాహీం అలీ షఉత్
2. డా॥ అబ్దుర్రహ్మాన్ ఫహీమ్ ముహమ్మద్
3. డా॥ ముహమ్మద్ సయీద్ సిద్దీకి
4. డా॥ ఫిక్రీ అహ్మద్ ఉక్కాజ్

5. డా॥ అహ్మద్ సయ్యద్ దరాజ్
6. డా॥ ఫాయిక్ బకర్ సవాఫ్
7. డా॥ షాకిర్ మహ్మూద్ అబ్దుల్ మున్యిమ్
8. డా॥ అబ్దుల్ ఫత్తాహ్ మన్సూర్,

ఈ పండితులందరూ రచనలను కూలంకషంగా పరిశీలించి, ఏక గ్రీవంగా ఈ అయిదు రచనలను ఈ క్రింది క్రమంలో బహుమతులకు అర్హులైనవిగా ప్రకటించారు.

1. అర్రహీఖుల్ మఖ్తూమ్ (అరబిక్)- రచన: సఫీఉర్రహ్మాన్ ముబారక్ పూరీ, జామె సల్ఫియా, బెనారస్, ఇండియా. (మొదటి బహుమతి)
2. ఖాతిమున్నబియ్యీన్ (స) (ఇంగ్లీషు) - రచన: డా॥ మాజిద్ అలి ఖాన్, జామె మిల్లియా ఇస్లామియా, ఢిల్లీ, ఇండియా (రెండవ బహుమతి)
3. పైగంబరె ఆజం వ ఆఖిర్ (ఉర్దూ) రచన: డా॥ నసీర్ అహ్మద్ నాసిర్, వైస్ ఛాన్సలర్, జామె ఇసామియా, బహావల్‌పూర్, పాకిస్తాన్. (మూడవ బహుమతి)
4. ముస్తఖున్నుఖూల్ ఫీ సీరతి ఆజమి రసూల్ (స) (అరబిక్) - రచన: షేక్ హామిద్ మహ్మూద్ బిన్ ముహమ్మద్ మన్సూర్ లీమూద్, జీజా, ఈజిప్ట్ (నాల్గవ బహుమతి)
5. సీరతున్నబియ్యల్ హుదా వర్రహ్మా (అరబిక్) - రచన: ఉస్తాద్ అబ్దుస్సలామ్ హాషిమ్ హాఫిజ్, మదీనా మునవ్వరా, కె.ఎస్.ఎ. (అయిదవ బహుమతి)

డెప్యూటీ సెక్రటరీ జనరల్ షేక్ అలీయిల్‌ముక్తార్ ఈపేర్లను ప్రకటించిన తరువాత శుభాకాంక్షలనందించి దుఆతో తన ప్రసంగాన్ని ముగించారు.

ఆ తరువాత నాకు మాట్లాడే అవకాశం లభించింది. నేను టూకీగా చేసిన నా ప్రసంగంలో, భారతదేశంలో సందేశ ప్రచార విషయంలో ఉపేక్షకు గురియైన కొన్ని విషయాల వైపునకు, సందేశ ప్రచారం ద్వారా ఒనగూడే ప్రభావాలు, ఫలితాల వైపునకు రాబితా దృష్టిని మళ్ళించడం జరిగింది. రాబితా

నా సూచనలను స్వీకరించి ప్రోత్సాహకరమైన సమాధానం ఇచ్చింది.

ఆ తరువాత అమీర్ సఊద్ బిన్ అబ్దుల్ హసన్ వరుసగా అయిదుగురు రచయితలకు బహుమతి ప్రదానం చేశారు. దివ్యగ్రంథ పఠనంతో ఆ సభ ముగిసింది.

రబీఉల్ ఆఖిర్ 17, గురువారం రోజున మా బృందం మదీనాకు బయలు దేరింది. మార్గమధ్యంలో 'బద్ర్' చారిత్రాత్మక యుద్ధభూమిని దర్శించి ముందుకు వెళ్ళిపోయాం. అస్ర్ నమాజుకు ముందే మేము మస్జిదె నబవీ చేరుకోగలిగాం. కొన్ని రోజుల తరువాత ఖైబర్‌కు కూడా వెళ్ళొచ్చాం. అక్కడి చారిత్రాత్మక కోట బయటి, లోపలి భాగాలను క్షుణ్ణంగా చూశాం. సాయంత్రాని కల్లా తిరిగి మదీనా మునవ్వరాకు చేరుకున్నాం. మహాప్రవక్త (స)గారి నివాసం, జిబ్రీలె అమీన్ మరియు దైవదూతలు వచ్చిపోయిన ఆ పవిత్ర ప్రదేశం అయిన ఇస్లామ్ పవిత్ర కేంద్రంలో రెండు వారాలు గడిపి తిరిగి కాబా గృహాన్ని సందర్శిం చుకోడానికి మక్కా నగరానికి బయలుదేరాం. ఆ దైవగృహం తవాఫ్ మరియు సయీలలో మరో వారం అక్కడనే గడిచిపోయింది. ఒక మక్కా మదీనాల్లోనే కాకుండా నేను వెళ్ళిన అన్ని ప్రదేశాల్లోనూ, నాకు తెలిసినవారు, దగ్గరి మిత్రులు, గురువులు, ధార్మిక పండితులు నాకు ఆహ్వానం పలికినవారే. ఇలా నేను కలలుగన్న హిజాజ్ భూభాగంలో ఒక నెల చూస్తూ చూస్తూనే గడిచి పోయింది. ఆ తరువాత నేను భారతదేశానికి ప్రయాణమై క్షేమంగా తిరిగి వచ్చేశాను.

హిజాజ్ (అరేబియా భూభాగం) నుండి తిరిగి వచ్చిన తరువాత భారత్, పాక్ దేశాల్లో ఉర్దూ మాట్లాడే వర్గం, ఈ గ్రంథాన్ని ఉర్దూ భాషలో తర్జుమా చేయ మని పట్టుబట్టింది. సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ ఆ డిమాండు అలానే కొనసాగుతూపోయింది. ఇటు కొంగ్రొత్త పనులు పైకి వచ్చిపడడం మూలంగా తర్జుమా చేసే సమయమే నాకు లభించలేదు. చివరికి ఆ పరిస్థితి లోనే నేను ఈ గ్రంథాన్ని అనువదించడానికి పూనుకున్నాను. అల్లాహ్ దయ వలన కొన్ని నెలల ప్రయత్నం తరువాత ఈ పని కూడా పూర్తి చేయగలిగాను.

చివరిగా నేను, ఈ కార్యంలో నాకు తోడ్పాటు అందించిన మిత్రులు,

సహచరులు, పెద్దల్ని, ముఖ్యంగా ఉస్తాద్ మౌలానా అబ్దుర్రహ్మాన్ సాహెబ్ రహ్మానీ గారికి, నాకు సలహాలు అందించి ప్రోత్సహించిన మదీనా యూని వర్శిటీ పట్టభద్రులు అయిన షేక్ అజీజ్ సాహెబ్ మరియు హాఫిజ్ ముహమ్మద్ ఇలియాస్ సాహెబ్‌గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలను తెలుపు కుంటున్నాను. అల్లాహ్ వారందరికి వారి ఈ కృషికి సత్ఫలితాన్ని ప్రసాదించు గాక. ఈ గ్రంథం ద్వారా, దీన్ని రచించిన నాకు, ఈ కార్యంలో సహాయపడిన వారందరికి, ఈ గ్రంథాన్ని పఠించి తద్వారా ప్రయోజనం పొందే పాఠకులందరికీ ముక్తిని ప్రసాదించమని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను. ఆమీన్.

- సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరీ

హిజ్రీ శకం 1404, రజబ్ నెల 18 వ తేది.

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

తృతీయ ప్రచురణకు రాసిన

తొలిపలుకులు

అల్‌హమ్దు లిల్లాహిల్లజీ బినీమతిహీ తతిమ్ముస్సాలిహాత్. వ అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహ్. వ అషహదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహ్. వ సఫియ్యుహూ వ ఖలీలుహ్. అద్దరిసాలత వబలగల్ అమానహ్. వ నసహల్ ఉమ్మహ్. వ తరకహా అలల్ ముహజ్జతిల్ బైజా లైలుహా కనహారిహా. సల్లల్లాహు అలైహి వ అలా ఆలిహీ వ సహాబిహీ అజ్‌మయీన్. వ రజియ అన్‌కుల్లి మన్ తబిఅ సున్నతహూ వ అమిల బిహా ఇలా యౌమిద్దీన్, వ అన్నా మఅహుమ్ బిఅఫ్విక వ రజాక యా అర్‌హమ ర్రాహిమీన్, అమ్మాబాద్:

దైవప్రవక్త (స) పవిత్ర జీవన విధానం ఓ నిత్యనూతన ఆహార్యం. ప్రళయం వరకూ సురక్షితంగా ఉండే విలువైన ధనం. దైవప్రవక్త (స) కాలం నుంచే ప్రజలు ఆ జీవన విధానాన్ని విశదీకరించటానికి, అందులోని వివిధ కోణాలను గురించి పుస్తకాలు రాయటానికి పోటీపడుతూ వస్తున్నారు. ఈ పోటీ ప్రళయం వరకు కొనసాగుతూనే ఉంటుంది. ఈ పవిత్ర జీవన విధానం ఒక క్రియాత్మక ఆదర్శాన్ని, వాస్తవ సంఘటనల కార్యక్రమాన్ని ముస్లింల ముందు నెలకొల్పుతుంది. తద్వారా ముస్లింలు తమ మాటలు, చేతలు, తమ పద్ధతి విధానాలు, ఆచార్యవహారాలన్నిటిలో ఆ జీవన విధానాన్నే ఆదర్శంగా తీసుకోవాలి. పరమ ప్రభువు పట్ల భక్తి బంధం, సొంత కుటుంబం పట్ల ప్రేమాను బంధం, తోటి ప్రజలు, సమాజంలోని ఇతర సోదరులు, సంఘంలోని వ్యక్తులు, సముదాయాలందరిపట్ల తాము కలిగి వుండే స్నేహబంధం - అన్నీ ఆ అంతిమ ఆదర్శాన్నే ప్రతిబింబించాలి. పరమప్రభువైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"మీలో పరలోకాన్ని ఆశిస్తూ, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే వారందరికీ దైవప్రవక్త (స)లో మంచి ఆదర్శం ఉంది."

దైవప్రవక్త (స) నీతి నడవడికలు ఎలా ఉండేవని ఆయన సతీమణి, విశ్వాసుల మాత అయిన ఆయిషా (రజిఅన్‌హా) గారిని అడగ్గా, "**కాన ఖులుఖుహూ అల్ ఖుర్‌ఆన్**" (ఖుర్‌ఆన్ బోధనలే ఆయనగారి నీతి నడవడికలు" అని సమాధానమిచ్చింది ఆ తల్లి.

మొత్తానికి దీని ద్వారా తేలిందేమిటంటే ఇహపరలోకాలకు సంబంధించిన వ్యవహారాలన్నిటిలో పరమ ప్రభువు సూచించిన రుజుమార్గంపై నడిచి ఈ ప్రపంచం నుంచి విముక్తి కోరుకుంటున్న వారందరూ మహాప్రవక్త ముహమ్మద్ (స) జీవన విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. విశ్వప్రభువు చూపించిన సన్మార్గం ఇదేననీ, మన నాయకులు, మన అధినేత ముహమ్మద్ (స) తన జీవితపు అన్ని రంగాల్లో క్రియాత్మకంగా అనుసరించిన రుజుమార్గం ఇదేననీ, అందువల్ల ఆ మహాత్ముని తదనంతరం ఎవరు నాయకులైనా, మరి ఎవరు వారిని అనుసరించినా, పాలకులైనా, పాలితులైనా, నేతలైనా, ధర్మ సందేశ ప్రదాతలైనా - అందరికీ సన్మార్గం ఇందులోనే ఉంది. రాజ్యపాలన, ప్రభుత్వ నిర్వహణ, ఆర్థిక సామాజిక వ్యవహారాలు, మానవ సంబంధాలు, ఉత్తమ నైతికత, అంతర్జాతీయ సంబంధాలు - అన్నింటికీ ఆయన జీవిత చరిత్రే మార్గదర్శకం.

నేడు ముస్లింలు ప్రభువు మార్గానికి దూరమైపోయారు. అజ్ఞానం, అపమార్గాల ఊబిలో చిక్కుకున్నారు. కనీసం ఇలాంటి విపత్కర సమయాల్లోనయినా ముస్లింలు జాగరూకులు కావాలి. తమ పిల్లల పాఠ్యాంశాల్లో, తాము నిర్వహించే వివిధ సదస్సులు, సమావేశాల్లో దైవప్రవక్త జీవిత చరిత్ర (సీరత్) కు పెద్దపీట వేయాలి. ఇంకొక విషయం దైవప్రవక్త జీవిత చరిత్రను ఒక వ్యక్తిగత దృక్పథంగా గాకుండా ప్రభువు వైపునకు మరలిపోయే మార్గంగా ప్రజలు గుర్తించాలి. సఫలీకృత భవబంధాలు, మెరుగైన ప్రజా సంబంధాలు, దైవప్రవక్త జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవటం ద్వారానే ఏర్పడతాయి. నైతిక, ఆచరణా రంగాల్లో దైవగ్రంథమైన దివ్యఖుర్‌ఆన్‌కు ప్రాతినిథ్యం వహించే ఏకైక జ్ఞాన మార్గం ఇదొక్కటే. దీని ద్వారానే విశ్వాసి తన విశ్వాసపాత్రుడైన అల్లాహ్‌కు చేరువవుతాడు. అల్లాహ్ విధించిన ధర్మశాస్త్రానికి (షరీఅతుకు) విధేయుడైపోతాడు. తన జీవితపు వ్యవహారాలన్నిటిలో దీనికి 'పాలక' (హాకిమ్) స్థానాన్ని ఇస్తాడు.

ఈ పుస్తకం '**అర్రహీఖుల్ మఖ్‌తూమ్**' ఓ సుప్రసిద్ధ రచయిత కరవాలం నుంచి జాలు వారిన సుమధుర పదామృతం. ఇది 'రచయిత' చేత అల్లాహ్

చేయించిన ఓ సుందర ప్రయత్నం, ఓ అద్భుత కార్యం. హిజ్రీ శకం 1396లో రాబితయె ఆలమె ఇస్లామీ సంస్థ వారు 'సీరత్ రచన పోటీ' సందర్భంగా చేసిన బహిరంగ ప్రకటనకు ప్రతిస్పందిస్తూ రచయిత ఈ పుస్తకం రూపకల్పనకు ఉపక్రమించారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పోటీలో మొదటి బహుమతి ఈ పుస్తకాన్నే వరించింది. ఈ సంఘటన వివరాలన్నీ 'రాబితయే ఆలమె ఇస్లామీ' సంస్థ మాజీ జనరల్ సెక్రటరీ ఫజీలతుష్షైఖ్ ముహమ్మద్ అలీ అల్ హర్కాన్ గారు ఈ పుస్తకానికి రాసిన 'ముందుమాట'లో పొందుపరచారు.

ఈ పుస్తకం గొప్ప ప్రజాదరణ పొందింది. జనం ఈ పుస్తకాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. మొదటిసారి ప్రచురించిన మొత్తం (పదివేల) కాపీలు హాటుకేకుల్లా పాఠకుల చేతుల్లోకి వెళ్ళిపోయాయి. ఆ తర్వాత గౌరవనీయులు హస్సాన్ హమ్‌వీ (హఫిజహుల్లాహ్) ఇంకో ఐదువేల కాపీలు ప్రచురించే బాధ్యత తీసుకున్నారు. (అల్లాహ్ ఆయనకు ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక!)

ఈ సందర్భంగానే ఆయన నన్ను ఈ తృతీయ ప్రచురణకోసం తొలి పలుకులు రాయమని కోరారు. ఆ కోరికను గౌరవిస్తూ నేను ఈ పరిచయ వాక్యాలు రాశాను. ఈ కార్యనిర్వహణలో అల్లాహ్ మనందరికీ చిత్తశుద్ధిని అనుగ్రహించాలనీ, ముస్లింలకు దీని ద్వారా ప్రయోజనం కలిగి, ప్రస్తుత వారి దీన స్థితి సౌభాగ్య స్థితిగా మారిపోవాలనీ, ముహమ్మదీయ అనుచర సమాజానికి తాము పోగొట్టుకున్న వైభవం తిరిగి లభించాలనీ, ప్రపంచ మానవులను సన్మార్గంలో నడిపించే సమున్నత స్థానం, గౌరవం ముస్లింలను వరించాలని, ఇంకా వారు -

"మానవుల కోసం వెలికి తీయబడిన ఉత్తమ సమాజం మీరు. మీరు మంచిని ఆజ్ఞాపిస్తారు. చెడును నిరోధిస్తారు. అల్లాహ్‌ను విశ్వసిస్తారు."

-అన్న పరమ ప్రభువు సూక్తికి ప్రతిరూపాలుగా నిలవాలని ప్రార్థిస్తున్నాను.

డాక్టర్ అబ్దుల్లాహ్ ఉమర్ నసీఫ్
జనరల్ సెక్రటరీ, రాబితయె ఆలమి ఇస్లామీ,
మక్కా ముకర్రమా.

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

గ్రంథ పరిచయం

అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్, ఖాలిఖిస్సమావాతి వల్ అర్జి, వ జాయిలిజ్జులుమాతి వన్నూర్. వ సల్లల్లాహు అలా సయ్యిదినా ముహమ్మదిన్ ఖాతిమిల్ అంబియాయి వర్రుసులి అజ్‌మయీన్. బష్షర వ అన్‌జర, వ వఅద వ ఔఅద, అంఖజల్లాహు బిహిల్ బషర మినజ్జలాలహ్. వ హదన్నాస ఇల స్సిరాతిల్ ముస్తఖీమ్. సిరాతిల్లాహిల్లజీ లహూ మా ఫిస్సమావాతి వమాఫిల్ అర్జ్. అలా ఇలల్లాహి తసీరుల్ ఉమూర్. వ బాద్:

పరమప్రభువైన అల్లాహ్ తన ప్రవక్త (సఅసం)కు పరలోకంలో మాన వుల గురించి సిఫారసు చేసే సమున్నత స్థానాన్ని, గౌరవప్రద హోదాను అనుగ్రహించాడు. ఆయన్ని అభిమానించమని ముస్లింలమైన మనకు ఆజ్ఞాపించాడు. ప్రవక్త అనుసరణ అల్లాహ్‌పట్ల ప్రేమకు ప్రతీకగా గుర్తించాడు.

"ఓ ప్రవక్తా! చెప్పు. ఒకవేళ మీరు అల్లాహ్‌ను ప్రేమిస్తున్నట్లయితే (ముందు) నన్ను అనుసరించండి. అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ కోసం మీ పాపాలను క్షమిస్తాడు."

ప్రజాహృదయాలకు దైవప్రవక్త వ్యక్తిత్వం అత్యంత ప్రీతిపాత్రం అయ్యే విషయంలో ఈ ఖుర్‌ఆన్ సూక్తి కీలకపాత్రను పోషిస్తుంది. దైవప్రవక్త (స) పట్ల తమకు గల అభిమానబంధాన్ని మరింత పటిష్ఠం చేసే మార్గాలను అన్వేషించేందుకు వారిని పురికొల్పుతుంది. ఈ కారణంగానే ఇస్లాం ప్రారంభకాలం నుంచే ముస్లింలు పరస్పరం పోటీపడి మరీ ఆయన జీవితపు ఔన్నత్యాన్ని లోకానికి చాటి చెబుతున్నారు. శాయశక్తులా ఆయన జీవిత చరిత్ర (సీరత్)ను ప్రపంచంలో వ్యాపింపజేస్తున్నారు. సీరత్ అంటే దైవప్రవక్త (స) మాటలు, చేతలు, ఆయన నీతి నడవడికలు, ఆయన జీవితంతో ముడిపడిన సంఘటనల సమాహారం. "కాన ఖులుఖుహూ అల్ ఖుర్‌ఆన్ (ఖుర్‌ఆన్ బోధనలే ఆయన నీతినడవడికలు)" అన్నారు అమ్మ ఆయిషా (రజి.అన్హా). దివ్యఖుర్‌ఆన్ అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథమనీ, ఆయన పలికిన పరిపూర్ణ వచనాలని మనందరికి తెలుసు. మరి ఇటువంటి గ్రంథాన్ని పుణికిపుచ్చుకున్న దైవప్రవక్త మానవులందరిలోకెల్లా ఉత్తముడు, పరిపూర్ణుడు, కావటంలో ఆశ్చర్య మేముందీ? ఈ లోకంలో దేవుడు సృష్టించిన ప్రతి వస్తువు చూపే అభిమానానికి ఆయనే అందరికంటే ఎక్కువ హక్కుదారుడు అని అంటే అందులో అబ్బురపడవలసిన విషయం ఏముంది?

దైవప్రవక్త (స) పట్ల ముస్లింలకు గల ఈ అపార ప్రేమాభిమానాలు వారి హృదయాల ఐశ్వర్యం. ఈ అభిమానం వారికి తమ ప్రాణాల కంటే విలువైన ధనం. ఈ అభిమాన వినీలాకాశం నుంచే సీరతు కాన్ఫరెన్సు కిరణాలు విరజిమ్మాయి. హిజ్రీ శకం 1396వ సంవత్సరం పాకిస్తాన్‌లో ఈ కాన్ఫరెన్సు జరిగింది. ఈ కాన్ఫరెన్సులో రాబితయె ఆలమె ఇస్లామీ సంస్థ ఒక ప్రకటన చేసింది. ఆ ప్రకటన ప్రకారం అంతర్జాతీయంగా సీరతు అంశంమీద ఒక వ్యాసరచన పోటీ జరుగుతుంది. అందులో పాల్గొన్న అత్యుత్తమమైన ఐదు వ్యాసాలకు లక్షాయాభైవేల సౌదీ రియాళ్ల పారితోషికం లభిస్తుంది. పోటీలో పాల్గొనే అభ్యర్థులు ఈ క్రింది నియమాలు పాటించాలని రాబితా సూచించింది:

1) వ్యాసం పూర్తిగా రాయాలి. అందులో చారిత్రక సంఘటనలు కాలక్రమా నికి అనుగుణంగా పొందుపరచబడి ఉండాలి.
2) వ్యాసం బాగుండాలి. అంతకుముందు అది ఎక్కడా ప్రచురించ బడనిదై ఉండాలి.
3) వ్యాసరచనకు దోహదపడిన ఆధారాలు, మూలగ్రంథాలు, పుస్తకాలు, ముసాయిదాల పేర్లు, వివరాలు సంపూర్ణంగా పేర్కొనాలి.
4) రచనలు పంపేవారు తమ జీవిత విశేషాల గురించి కూడా వివరంగా రాసిపంపాలి. తాము సంపాదించిన పాఠశాల, కళాశాల ధృవీకరణ పత్రాలు (సర్టిఫికెట్లు), చేసిన రచనలు - ఒకవేళ ఉంటే వాటిని కూడా పేర్కొనాలి.
5) వ్యాసం స్పష్టంగా, సుబోధకంగా ఉండాలి. కంపోజ్ చేయబడిన వ్యాస మయితే ఇంకా మంచిది.
6) అరబీలో గాని, వ్యవహారంలో ఉన్న ఇతర ఏ భాషలో రాసిన వ్యాసాలైనా గాని పోటీకి పంపించవచ్చు.
7) హిజ్రీ శకం 1396 రబీవుస్సానీ ఒకటో తేది నుంచి వ్యాసాలు తీసుకోవటం మొదలుపెడతారు. వ్యాసాలు అందవలసిన చివరి తేదీ హి.శ. 1397 ముహర్రమ్ ఒకటోతేది.
8) వ్యాసం సీలు చేయబడిన ఒక కవరులో ఉంచి పవిత్ర మక్కానగరం లోని రాబితయె ఆలమె ఇస్లామి సెక్రటేరియట్‌కు పంపించాలి. ఆ విధంగా అందిన వ్యాసాల మీద రాబిత ఒక ప్రత్యేకమైన గుర్తింపు సంఖ్యను నమోదు చేస్తుంది.
9) మహా పండితులు, విద్వాంసులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీ పోటీలో పాల్గొన్న వ్యాసాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తుంది.

రాబితా చేసిన ఈ ప్రకటన దైవప్రవక్త పట్ల అభిమానధనులైన రచయితలకు గొప్ప ప్రేరణను కలుగజేసింది. అమితోత్సాహంతో, నూతనోత్తేజంతో వారు ఈ పోటీలో పాల్గొన్నారు. అటు రాబితయె ఆలమె ఇస్లామీ కూడా అరబీ, ఇంగ్లీషు, ఉర్దూ ఇంకా ఇతర పలు భాషల్లో రాయబడిన వ్యాసాలను సేకరిం చటానికి రంగం సిద్ధం చేసింది.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సోదరులెందరో వివిధ భాషల్లో వ్యాసాలు పంపుతూ పోయారు. ఆ విధంగా మొత్తం 171 వ్యాసాలు పోటీలో పాల్గొన్నాయి. వాటిలో 84 వ్యాసాలు అరబీ భాషలో, 64 వ్యాసాలు ఉర్దూలో, 21 వ్యాసాలు ఇంగ్లీషులో ఉన్నాయి. ఒకటి ఫ్రెంచి భాషలో, మరొకటి హోసా భాషలో వచ్చింది.

ఈ వ్యాసాలన్నింటినీ క్షుణ్ణంగా శోధించి, బహుమతులకు అర్హతగల వ్యాసాల వరుసక్రమాన్ని నిర్ణయించటానికి గొప్ప విద్వాంసులతో కూడిన ఒక కమిటీని రాబితా నియమించింది. ఆ కమిటీ క్రింది పట్టికలో చూపిన విధంగా విజేతల జాబితా ప్రకటించింది:

వరుస క్రమం	విజేతపేరు	చిరునామా	బహుమతి విలువ
మొదటి బహుమతి	షేఖ్ సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరీ	జామియా సలఫియా ఇండియా	50 వేల సౌదీ రియాళ్ళు
రెండవ బహుమతి	డా. మాజిద్ అలీ ఖాన్	జామియా మిల్లియా ఇస్లామియా, న్యూఢిల్లీ, ఇండియా	40 వేల సౌదీ రియాళ్ళు
మూడవ బహుమతి	డా. నసీర్ అహ్మద్ నాసిర్	జామియా ఇస్లామియా అధ్యక్షులు, బహవల్ పూర్, పాకిస్తాన్	30 వేల సౌదీ రియాళ్ళు
నాల్గవ బహుమతి	హామిద్ మహ్మూద్ ముహమ్మద్ మన్సూర్ లేమూద్	ఈజిప్ట్	20 వేల సౌదీ రియాళ్లు
ఐదవ బహుమతి	అబ్దుస్సలామ్ హాషిమ్ హాఫిజ్	మదీనా మునవ్వరా సౌదీ అరేబియా	20 వేల సౌదీ రియాళ్లు

విజేతల పేర్లను రాబితా హిజ్రీ శకం 1398వ సంవత్సరం కరాచీలో

జరిగిన ఆసియా ఖండపు, ఇస్లామీయ తొలి కాన్ఫరెన్సులో ప్రకటించింది. ఇందు నిమిత్తం వార్తాపత్రికలన్నిటికి సమాచారం కూడా పంపించింది.

తర్వాత రాబితా తన సొంత ప్రదేశంలోనే అమీర్‌సవూద్ బిన్ అబ్దుల్ ముహ్సిన్ బిన్ అబ్దుల్ అజీజ్ గారి ఆధ్వర్యంలో హి.శ. 1399 రబీవుల్ ఆఖిర్ 12వ తేదీ శనివారం నాడు ఉదయం ఒక గొప్ప వేడుక జరిపింది. అమీర్ సవూద్ గారు పవిత్ర మక్కానగర గవర్నరు గారైన అమీర్ ఫవాజ్ బిన్ అబ్దుల్ అజీజ్ గారి సెక్రటరీ. ఈ శుభకార్యంలో గవర్నరుగారి తరపున ఆయనే విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఈ సందర్భంగానే బహుమతి పొందిన వ్యాసాలను వివిధ భాషల్లో ప్రచురించి పంపిణీ చేస్తామని రాబితా సెక్రటేరియట్ తరపున ప్రకటన చేశారు. ఆ ప్రకటనను సాకారం చేస్తూ షేఖ్ సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరీ (జామియా సలఫియా, ఇండియా) వారి వ్యాసం మొదటి బహుమతి పొందినది కనుక రాబితా మొట్టమొదటగా దాన్నే ప్రచురించిపాఠకుల ముందుకు తీసుకు వస్తోంది. ఇతర రచనలు కూడా ఒకదాని తర్వాత ఒకటి ప్రచారంలోకి వస్తాయి.

పరమ ప్రభువైన అల్లాహ్ మన సత్కార్యాలను తనకోసం ప్రత్యేకించుకోవాలనీ, వాటి మీద తన ఆమోద ముద్ర వేయాలనీ ప్రార్థిస్తున్నాను. నిశ్చయంగా ఆయనే గొప్ప సంరక్షకుడు, గొప్ప సహాయకుడు.

వ సల్లల్లాహు అలా సయ్యిదినా ముహమ్మదిన్ వ అలా ఆలిహీ వ సహ్‌బిహీ వ సల్లం.

ముహమ్మద్ అలీ అల్‌హర్‌కాన్

జనరల్ సెక్రటరీ, రాబితయె ఆలమె ఇస్లామీ,

మక్కా ముకర్రమా.

రచయిత గురించి

అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. వస్సలాతు వస్సలాము అలా సయ్యిదిల్ అవ్వలీన వల్ ఆఖిరీన్, ముహమ్మదిన్ ఖాతిమిన్నబియ్యీన్. వ అలా ఆలిహీ వ సహ్‌బిహీ అజ్‌మయీన్. అమ్మాబాద్

సీరత్ వ్యాసరచన పోటీలో పాల్గొనే అభ్యర్థులు తమ జీవిత విశేషాలు కూడా రాసి పంపాలని రాబితయె ఆలమె ఇస్లామీ షరతు విధించింది. అందు కని ఈ క్రింది వాక్యాల్లో నా సామాన్య జీవితంలోని కొన్ని విశేషాలు పొందు పరచాను.

వంశపరంపర : సఫీవుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ముహమ్మద్ అక్బర్ బిన్ ముహమ్మద్ అలీ బిన్ అబ్దుల్ మోమిన్ బిన్ ఫఖీరుల్లాహ్ ముబారక్‌పూరీ ఆజమీ.

జననం : సర్టిఫికెట్లో నా పుట్టినతేది 1943 జూన్ 6వ తేది అని నమోదై ఉంది. కాని అది అంచనాతో రాసింది మాత్రమే. ఆరా తీస్తే నేను 1942వ సంవత్సరం మధ్యభాగంలో పుట్టానని తెలిసింది. హుసైనాబాద్ నా జన్మస్థలం. ముబారక్‌పూర్‌కు ఉత్తరభాగాన ఒక మైలు దూరంలో ఉన్న చిన్న ఊరు అది. ముబారక్‌పూర్ ఆజమ్‌గఢ్ జిల్లాలో విద్యాపరంగా, పారిశ్రామికపరంగా బాగా పేరుగాంచిన ప్రాంతం.

విద్యాభ్యాసం : బాల్యంలో తాత, బాబాయి వాళ్ల దగ్గర ఖుర్‌ఆన్‌లోని కొంతభాగం నేర్చుకున్నాను. అనంతరం నన్ను ముబారక్‌పూర్‌లోని 'దారు త్తాలీమ్' పాఠశాలలో చేర్పించారు. ఆరు సంవత్సరాలపాటు అక్కడ ప్రాథమిక, మాధ్యమిక కోర్సులు పూర్తిచేశాను. కొంచెం పారశీక భాష కూడా నేర్చుకున్నాను. తర్వాత 1954 జూన్ నెలలో ముబారక్‌పూర్‌లోని 'ఇహ్యావుల్ ఉలూమ్' పాఠశాలలో చేరాను. అక్కడ అరబీ భాష నేర్చుకోవటం మొదలు పెట్టాను. వ్యాకరణం, నహ్వ్-సర్ఫ్, ఇంకా ఇతర విద్యలు నేర్చుకున్నాను. రెండేళ్ళ తర్వాత 'మెవూ'లోని ఫైజెఆమ్ విద్యాలయంలో చేరాను. ఆ ప్రాంతంలో ఈ పాఠశాల ఒక ప్రముఖ ధార్మిక విద్యా కేంద్రంగా భావించబడేది. మెవూనాథ్ భంజన్ ఊరు ముబారక్‌పూర్ మండలానికి 35 కి.మీ. దూరంలో ఉంది.

'ఫైజెఆమ్'లో నా విద్యాప్రవేశం 1956వ సంవత్సరం మే నెలలో జరిగింది. నేనక్కడ ఐదేళ్ళు ఉన్నాను. అరబీ భాష, వ్యాకరణం, ధార్మిక విద్యలు అనగా తఫ్సీర్ (ఖుర్ఆన్ వ్యాఖ్యానం), హదీసు (దైవప్రవక్త ప్రబోధనలు), ఉసూలె హదీసు (హదీసు సూత్రాలు), ఫికహ్ (ధర్మావగాహనం), ఉసూలె ఫికహ్ (ధర్మావగాహన సూత్రాలు) మొదలగునవి నేర్చుకున్నాను. 1961 జనవరిలో నా విద్యాభ్యాసం పూర్తయింది. విద్యాభ్యాసం పూర్తయినట్టు నాకు పట్టా (సర్టిఫికెట్) ప్రదానం చేశారు. 'ఫజీలత్ ఫిషరీఅ', 'ఫజీలత్ ఫిల్ ఉలూమ్'కు సంబంధించిన పట్టా అది. విద్యా బోధన (తద్రీస్) చేసేందుకు, ధార్మిక విషయాల్లో తీర్పులు (ఫత్వా) ఇచ్చేందుకు అనుమతిని ప్రసాదిస్తున్నట్లు కూడా అందులో ప్రస్తావించారు.

అదృష్టం కొద్దీ నేను రాసిన అన్ని పరీక్షల్లోనూ చాలా మంచి మార్కులతో పాసవుతూ వచ్చాను. విద్యార్థి దశలో ఉన్నప్పుడు నేను అలహాబాద్ బోర్డు పరీక్షలకు కూడా హాజరయ్యాను. 1959 ఫిబ్రవరిలో 'మౌల్వీ' పరీక్ష, 1960 ఫిబ్రవరిలో 'ఆలిమ్' పరీక్షలు రాశాను. రెండిట్లోనూ ప్రథమశ్రేణి (ఫస్ట్ డివిజన్) మార్కులతో పాసయ్యాను.

చాలా కాలం తర్వాత ఆధునిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 1976 ఫిబ్రవరిలో 'ఫాజిలె అదబ్' (మరియు 1978 ఫిబ్రవరిలో ఫాజిలె దీనియాత్) పరీక్షలు రాశాను. అల్లాహ్ దయవల్ల రెండిట్లోనూ ప్రథమశ్రేణి మార్కులతో పాసయ్యాను.

క్రియా జీవితంలోకి....

1961 'ఫైజెఆమ్' విద్యాలయం నుంచి పట్టా పొందిన నేను అలహాబాద్, నాగ్పూర్ పట్టణాలకు వెళ్ళాను. అక్కడ కొన్నాళ్ళు విద్యాబోధన (తద్రీస్), హితోపన్యాసాల (తఖ్రీర్, ఖుత్బాత్) కార్యాల్లో నిమగ్నమయ్యాను. రెండేళ్ళ తర్వాత 1963 మార్చి నెలలో ఒకప్పుడు నేను చదువుకున్న విద్యాలయం 'ఫైజెఆమ్' నాజింగారు స్వయంగా నన్ను తమ పాఠశాలలో విద్యాబోధనకై ఆహ్వానించారు. నేనక్కడ అతి కష్టమ్మీద రెండేళ్ళు గడిపాను. తర్వాత అక్కడి నుంచి వెళ్ళవలసి వచ్చింది. మరుసటి యేడు అజంగఢ్లోని 'జామియతుర్రషాద్'కు అంకితమయ్యింది. 1966 ఫిబ్రవరిలో మెవూ గ్రామంలోని దారుల్ హదీస్ విద్యాలయం వాళ్ళు బోధనకై ఆహ్వానించగా అక్కడ అధ్యాపకునిగా చేరాను. మూడేళ్లు అక్కడ గడిచాయి. ఇక్కడ కేవలం విద్యాబోధన మాత్రమే గాకుండా డిప్యూటీ ప్రధానోపాధ్యాయుడిగా కూడా ఉండి విద్యా సంబంధ విషయాలు, పాఠశాల అంతరంగిక వ్యవహారాలు కూడా పర్యవేక్షిస్తూ ఉండే వాణ్ణి. కొన్నేళ్ల తర్వాత అక్కడ వదలి పెట్టి మళ్లీ మదర్సా ఫైజుల్ ఉలూమ్ సియూనీలో సేవలు మొదలుపెట్టాను. అది మెవూనాథ్ భంజన్ గ్రామం నుంచి సుమారు ఏడు వందల కి.మీ. దూరంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. 1969 నుంచి నేను ఆ పాఠశాలలో విద్యాబోధనతోపాటు ప్రధానోపాధ్యాయుడిగా కూడా ఉండి పాఠశాల అంతర్బాహ్య వ్యవహారాలన్నిటినీ పర్యవేక్షించే బాధ్యతలు చేపట్టాను. అంతేకాదు జుమారోజు ఉపన్యాసం (ఖుత్బా)ఇవ్వటం, చుట్టుప్రక్కల గ్రామాల్లోకి వెళ్ళి ధర్మప్రచార (దావత్ వ తబ్లీగ్) పనులు కూడా నిర్వర్తించేవాణ్ణి. ఆ తర్వాత 1972 అంతిమం నుంచి ముబారక్పూర్లోని 'దారుత్తాలీమ్' పాఠశాలలో విద్యాబోధన బాధ్యతలు చేపట్టాను. రెండేళ్ళ తర్వాత 1974 అక్టోబరులో జామియా సలఫియాకు వచ్చేశాను. ఇక అప్పట్నుంచి ఇక్కడే పనిచేస్తున్నాను.

రచనలు :

విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ఈ సుదీర్ఘకాలంలో నేను ఎంతో కొంత రచనా వ్యాసంగంలో కూడా నిమగ్నుడనై ఉన్నాను. నేను చేసిన కొన్ని ముఖ్య రచనలు, అనువాదాలు ఇవి :

1) తజ్కిరహ్ షేఖుల్ ఇస్లామ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ (రహ్మలై) (1972) - ఈ పుస్తకం నాలుగుసార్లు ప్రచురించబడింది.

2) ఆలె సవూద్ చరిత్ర (ఉర్దూ-1972) ఈ పుస్తకం రెండుసార్లు ప్రచురించబడింది.

3) ఇత్తిహాఫుల్ కిరామ్ తాలీఖు బులూగిల్ మరామ్ లి ఇబ్నె హజర్ అస్ఖలానీ (అరబీ) 1974 ప్రచురితం.

4) ఖాదియానియత్ అప్నే అయినేమే (ఉర్దూ -1976) ప్రచురితం.

5) ఫిత్నయె ఖాదియానియత్ ఔర్ మౌలానా సనావుల్లాహ్ అమృత్సరీ (ఉర్దూ-1976) ప్రచురితం.

6) ఈ పుస్తకం. (అర్రహీఖుల్ మఖ్తూమ్)

7) ఇన్‌కారె హదీస్ హఖ్ హే యా బాతిల్ (ఉర్దూ-1977) ప్రచురితం.

8) రజ్మె హఖ్ వ బాతిల్ (బజర్‌డేహా వాదన విశేషాలు) ఉర్దూ - 1978 ప్రచురితం.

9) ఇబ్‌రాజుల్ హఖ్ఖ్ వస్సవాబి ఫీ మస్అలతిస్సుఫూరి వల్ హిజాబ్ (అరబీ-1978). పరదాకు సంబంధించి విద్వాంసులు డాక్టర్ తఖీయుద్దీన్ హిలాలీ మురాకిషీ (రహ్మలై) గారి అభిప్రాయంపై విమర్శనా వ్యాసం. జామియ సలఫియా మ్యాగజైన్‌లో ఇది ధారావాహికంగా ప్రచురించబడింది.

10) తతవ్వురిష్షుపూబి వద్దియానాతి ఫిల్ హింది వ మజాలిద్దావతిల్ ఇస్లామీయ ఫీహా (అరబీ-1979). కొంతభాగం జామియా సలఫియా మ్యాగజైన్‌లో ధారావాహికంగా ప్రచురించబడింది.

11) అల్‌ఫిర్ఖతున్నాజియా వల్ ఫిరఖుల్ ఇస్లామీయా అల్ ఉఖ్‌రా (అరబీ 1982) ప్రచురితం కాలేదు.

12) ఇస్లామ్ ఔర్ అద్‌మె తషద్దుద్ (ఉర్దూ-1984) ప్రచురితం. (ఈ పుస్తకం హిందీ, ఇంగ్లీషు భాషల్లో కూడా ప్రచురించబడింది).

13) అహ్లె తసవ్వుఫ్ కీ కారిస్తానియా (ఉర్దూ-1986) ప్రచురితం.

14) అల్ అహ్‌జాబు స్సియాసియా ఫిల్ ఇస్లామ్ (అరబీ-1986) ప్రచురితం.

ఇంకా బెనారస్ నుంచి వెలువడే 'ముహద్దిస్' మాసపత్రిక సంపాదక బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నాను.

వల్లాహుల్ మువఫ్ఫిక్, వాజిమతుల్ ఉమూరి కుల్లిహా బియదిహీ. రబ్బనా తఖబ్బల్‌హు మిన్నా బి ఖుబూలిన్ హసనిన్ వ అంబిత్‌హు నబాతన్ హసనన్.

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

శుభపరిణామం

అల్‌హమ్దు లిల్లాహిల్లజీ అర్‌సల రసూలహూ బిల్‌హుదా వ దీనిల్ హఖ్ఖి లియుజ్‌హిరహూ అలద్దీని కుల్లిహీ. ఫజఅలహూ షాహిదౌం వ్వ ముబష్షిరౌం వ్వ నజీరా. వ దాయియన్ ఇలల్లాహి బిఇజ్‌నిహీ వ సిరాజమ్ మునీరా. వ జఅల ఫీహి ఉస్‌వతన్ హసనతన్ లిమన్ కాన యర్‌జుల్లాహ వల్ యౌమల్ ఆఖిర్. వ జకరల్లాహ కసీరా. అల్లాహుమ్మ సల్లి వ సల్లిమ్ వ బారిక్ అలైహి వ అలా ఆలిహీ వ సహ్‌బిహీ వమన్ తబిఅహుమ్ బి ఇహ్‌సానిన్ ఇలా యౌమిద్దీన్. వ ఫజ్జిర్ లహుమ్ యనాబీఅ ర్రహ్మతి వర్రిజ్వాని తఫ్‌జీరా. అమ్మాబాద్.

హి.శ. 1396వ సంవత్సరం రబీవుల్ అవ్వల్ నెల పాకిస్తాన్‌లో జరిగిన సీరత్ కాన్ఫరెన్స్ ముగింపు సందర్భంగా రాబితయె ఆలమె ఇస్లామీ సంస్థ 'సీరత్' అంశంపై అంతర్జాతీయ స్థాయి వ్యాస రచన పోటీ నిర్వహిస్తున్నట్లు ప్రకటించటం ఎంతో హర్షదాయకమైన విషయం. రచయితల్లో నూతనోత్సాహాన్ని కలుగజేయటం, రచయితల దృక్పథాల్లో సమన్వయం తీసుకురావటం ఈ ప్రకటన ఉద్దేశం. నా అభిప్రాయంలో నిజంగా ఇదొక శుభపరిణామం. దీనికి కారణం కూడా లేకపోలేదు. లోతుగా అధ్యయనం చేయగా మనకు బోధపడేదేమంటే ఇస్లామీయ జీవన సాఫల్యపు చెలమలు, మానవ సమాజ సౌభాగ్యపు ఊటలు ఊరే ఏకైక జీవజల నిధి దైవప్రవక్త (స) జీవితమే. ఆయన వ్యక్తిత్వం శుభప్రదం. ఆయనపై అనంతమైన దరూద్ సలాములు వర్షించుగాక!

ఈ పోటీలో పాల్గొనే అవకాశం నాకు కూడా లభించటం నా సౌభాగ్యం. కాని మానవ నాయక శిఖామణి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి పవిత్ర జీవితం గురించి వివరించే శక్తి సామర్థ్యాలు నాకెక్కడివి? నా సౌభాగ్యమంతా దేదీప్యమానమైన ఆయన వెలుగులోని కొద్ది భాగం లభించటంలోనే ఉందని భావించే ఒక మామూలు మనిషిని నేను. అపమార్గపు చీకట్లలో తచ్చాడుతూ అంతమైపోకుండా బతికినంత కాలం ఆయన పాద చిహ్నాల్లో నడిచే అనుంగు అనుచరునిగా ఉంటూ, ఆయన చూపించిన జ్యోతిర్మయమైన

రహదారిపై నడుస్తూ జీవితం గడపాలని, చివరికి ఆ మార్గంలోనే కన్నుమూయాలనీ, అటు పిమ్మట పరలోకంలో ఆయన (స) గారి సిఫారసు మహిమతో అల్లాహ్ నా పాపాల చిట్టాను క్షమాకలంతో కొట్టివేసి నన్ను మన్నించి వదలి పెడితే చాలుననుకునే అతిసామాన్య మనిషిని నేను!

ఈ పుస్తక రచనకు సంబంధించి ఒక చిన్న విషయం పాఠకులముందు ప్రస్తావించటం సముచితమని భావిస్తున్నాను. పుస్తక రచనకు ఉపక్రమించే ముందు నేను చదువరుల మనసులకు భారంగా తోచే సుదీర్ఘ వివరణల్లోకి పోకుండా, అలాగే విషయాన్ని సంతృప్తికరంగా వివరించలేని మరీ క్లుప్తతను కూడా ఆశ్రయించకుండా పుస్తకం సైజు మధ్యస్తంగా ఉండే విధంగా పుస్తకం రూపకల్పన చేద్దామని అనుకున్నాను. కాని సీరతు గ్రంథాలను తరచి చూసిన తర్వాత నా నిర్ణయాన్ని మార్చుకోవలసి వచ్చింది. సంఘటనల క్రమంలో, విషయ వివరణల్లో పలు గ్రంథకర్తల మధ్య నాకు ఎంతో భేదాభిప్రాయం కనిపించింది. అందుకని నేను ఇలాంటి సందర్భాలు ఎదురైన చోటల్లా వాటికి సంబంధించిన వాదోపవాదాల్లోని ప్రతి కోణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, దాని ద్వారా నేను గ్రహించిన సారాన్ని ఈ పుస్తకంలో గ్రంథస్థం చేశాను. సాక్ష్యాధారాల వివరాలు, ప్రాధాన్యతా కారణాలు నేను ఈ పుస్తకంలో ప్రస్తావించలేదు. దాని మూలంగా అనవసరంగా పుస్తకం పెద్దదైపోతుంది. నా పరిశోధనా సారం పాఠకులను సంభ్రమాశ్చరానికి గురి చేస్తుందని, కొన్ని సంఘటనలకు సంబంధించి ఇతర రచయితలు ఇచ్చిన వివరణలు నా దృక్పథం దృష్ట్యా సమంజసం కాదని అనిపించిన సందర్భాల్లో మాత్రం నేను తప్పకుండా దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను కూడా ప్రస్తావించాను.

ఓ అల్లాహ్! ఇహపర లోకాలలో నా కోసం మేళ్ళను పొందుపరచు. నిశ్చయంగా నీవు క్షమించేవాడవు, అమితంగా ప్రేమించేవాడవు. సింహాసనానికి అధినేతవు. మహోన్నతుడవు, మహిమాన్వితుడవు.

సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరీ
సలఫియా విశ్వవిద్యాలయం
బెనారస్, ఇండియా.

జుమా (శుక్రవారం)
హి.శ. 1396, రజబ్ నెల 24వ తేది
1976 జులై, 23.

విషయ సూచిక

అరేబియా నైసర్గిక స్వరూపం - జాతులు 3

అరేబియా నైసర్గిక స్వరూపం -3; అరబ్బు జాతులు-4; వలస వెళ్ళిన కహ్‌లానీ తెగల్ని నాలుగు రకాలుగా విభజించవచ్చు-6;

అరబ్బు రాజ్యాలు - నాయకత్వాలు 17

యమన్ రాచరికం - 17; హీరా రాచరికం - 20; సిరియా రాచరికం-23; హిజాజ్ రాచరికం - 23; మిగతా అరబ్బు నాయకత్వాలు - 32; రాజకీయ పరిస్థితులు - 34;

అరేబియా మతాలు - ధర్మాలు 36

ఇబ్రాహీం (అ.స.) గారి ధర్మంలో ఖురైష్‌ల విపరీత పోకడలు -44 ధార్మిక పరిస్థితి-49

అజ్ఞాన కాలంనాటి అరబ్బుల సామాజిక తీరుతెన్నులు 51

సామాజిక పరిస్థితులు-51; ఆర్థిక పరిస్థితి-55; నైతిక విలువలు-56

ప్రవక్త (స) వంశావళి, జననం, నలభై ఏండ్ల పవిత్ర జీవని 59

వంశావళి - 61; ప్రవక్త (స) వంశావళి-62; ఫీల్ సంఘటన :-66;

శుభ జననం-నలభై ఏళ్ళ పవిత్ర జీవితం 72

శుభ జననం -75; బనీ సఅద్ తెగలో-75; షక్కె సద్ర్ (వక్షస్థలం చీల్చే) సంఘటన -76; మాతృ మమతానురాగాల్లో ముహమ్మద్ (స)-77; తాతగారి కారుణ్యఛాయలో -78; పినతండ్రి ప్రేమఛాయలో -79; ప్రవక్త (స) మాధ్యమంగా వర్షం గురించి వేడుకోలు -79; క్రైస్తవ సన్యాసి బుహైరా -79; ఫుజార్ యుద్ధం -80; హిల్‌ఫుల్ ఫుజూల్ -81; శ్రామిక జీవితం -82; హజ్రత్ ఖదీజా (ర.అన్హా)తో వివాహం -82; కాబా నిర్మాణం, హజ్రె అస్వద్ వివాద పరిష్కారం -84; దైవదౌత్యానికి పూర్వపు సంగ్రహ జీవితం-86;

దైవదౌత్య శకం 89

దైవదౌత్యపు ఛత్రఛాయల్లో ముహమ్మద్ (స) -91; జిబ్రీల్ (అ.స.)

దివ్యావిష్కృతి(వహీ)ని గొనివచ్చిన వేళ-92; దైవవాణి నిలిచి పోవడం-97; మలిసారి దివ్యావిష్కృతి (వహీ) అవతరణ-98; వహీ (దివ్యావిష్కృతి) రకాలు-99;

సందేశ ప్రచారాదేశం - దాని అంతరార్థం **102**

ప్రథమ దశ - దైవసందేశ ప్రచార యత్నం **107**

రహస్య సందేశ ప్రచారానికి సంబంధించిన మూడు సంవత్సరాలు-107; ప్రప్రథమ ఇస్లామ్ ధర్మానుయాయులు-107; నమాజ-110; ఖురైష్‌కు చూచాయగా అందిన సమాచారం-111;

బహిరంగ దైవసందేశ ప్రచారం **112**

దైవసందేశ ప్రకటనకు ప్రథమ ఆదేశం-112; దగ్గరి బంధువుల్లో సందేశ ప్రచారం-113; సఫాకొండ మీద-114; బాహాట సత్య ప్రకటనకు బహుదైవారాధకుల ప్రతిచర్య-116; అబూ తాలిబ్ వద్దకు వెళ్ళిన ఖురైష్ ప్రతినిధి బృందం-118; హజ్ యాత్రికులు ప్రవక్త (స) మాటలను వినకుండా చేసేందుకు సలహా సంఘం ఏర్పాటు-118; వ్యతిరేకతకు అవలంబించిన వివిధఎత్తుగడలు-121; హింసా దౌర్జన్యాలు-126; అబీసీనియా వైపు మొదటి హిజ్రత్ (వలస)-139; అబీసీనియాకు రెండో హిజ్రత్ -143; అబీసీనియా మహాజిర్లకు వ్యతిరేకంగా ఖురైష్ కుట్ర-144; అబూ తాలిబ్‌కు ఖురైష్ బెదిరింపు-149; ఖురైష్ బృందం మరోసారి అబూ తాలిబ్ వద్దకు-150; ప్రవక్త (స) ను హత్య చేసే ఆలోచన-151; హజ్రత్ హమ్‌జా (ర)గారి ఇస్లామ్ స్వీకారం- 156; హజ్రత్ ఉమర్ (ర) గారి ఇస్లామ్ స్వీకారం-157; దైవప్రవక్త (స) సన్నిధికి ఖురైష్ దూత-166; అబూ తాలిబ్, బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్‌లను సమావేశ పర్చడం-169;

సంపూర్ణ సంఘ బహిష్కరణ **171**

హింసాదౌర్జన్యాల కోసం చేసిన ప్రమాణం-171; షిఅబె అబీతాలిబ్ లో మూడేళ్ళు-172; ప్రమాణ పత్రం చించివేత-173;

అబూ తాలిబ్‌ను కలసిన ఖురైష్ చిట్టచివరి ప్రతినిధి బృందం **178**

శోక సంవత్సరం **162**

అబూ తాలిబ్ మరణం-182; హజ్రత్ ఖదీజా (ర) కాలధర్మం -184; శోకంలో వచ్చిపడ్డ మరో శోకం-185; హజ్రత్ సౌదాతో వివాహం-186;

ప్రప్రథమంగా ఇస్లాం స్వీకరించిన వారి సహన సంయమనాలను పురికొల్పిన కారణాలు **187**

అల్లాహ్ ఎడల విశ్వాసం-187; మనస్సును అలరింపజేసే నాయకత్వం-188; బాధ్యతా భావన-193; పరలోకమందు విశ్వాసం-194; దివ్యఖుర్ఆన్ ఆయత్‌లు, సూరాల అవతరణ-194; విజయం శుభవార్త-196;

తృతీయ దశ - మక్కాకు వెలుపల ఇస్లామ్ సందేశ ప్రచారం **202**

తాయెఫ్‌కు దైవప్రవక్త (స) గారి ప్రయాణం-202;

ప్రముఖ వ్యక్తులు, వివిధ తెగల్లో ఇస్లామ్ ధర్మ ప్రచారం **211**

ఇస్లామ్ ధర్మం బోధించబడిన తెగలు-211; మక్కాకు వెలుపల విస్తరించిన విశ్వాస కిరణాలు-213; యస్రిబ్‌కు చెందిన ఆరుగురు అదృష్టవంతులు-220; హజ్రత్ ఆయిషా(ర)తో నికాహ్ (వివాహం)-223;

ఇస్రా మరియు మేరాజ్ **224**

ప్రథమ బైతె అఖబా **234**

మదీనాకు ఇస్లామ్ దౌత్యప్రతినిధి - 236; కార్యంలో ఘన విజయం-236;

ద్వితీయ బైతె అఖబా **241**

వ్యవహార సాక్ష్యమాన్ని వివరించి చెప్పిన హజ్రత్ అబ్బాస్ (ర)-242; ప్రమాణం (బైత్)లోని అంశాలు-244; ప్రమాదాలతో కూడిన బైత్‌ను

తిరిగి మననం చేసుకోవడం-245; ప్రమాణం పూర్తి అయింది-247; పన్నెండు మంది సందేశ ప్రచారకుల ఎన్నిక -247; షైతాన్ ఈ ఒప్పం దాన్ని బహిర్గతం చేయడం-249; ఖురైష్‌పై దాడికి అన్సారుల సంసిద్ధత-249; యస్రిబ్ స్థితిమంతుల ఎదుట ఖురైష్ నిరసన-249; నిజం తెలిసిన తరువాత బైత్ చేసిన వారిని వెన్నాడడం-250;

హిజ్రత్‌కు ఉపక్రమించిన ప్రథమ బృందాలు 252

దారున్నద్వాలో ఖురైషుల సమావేశం 257

పార్లమెంటు చర్చ - దైవప్రవక్త (స)ను హతమార్చే తీర్మానం-259;

హిజ్రత్ చేసి మక్కాను వీడిన దైవప్రవక్త (స) 262

దైవప్రవక్త (స) ఇంటిని చుట్టుముట్టిన ముష్కర మూక-263; మహాప్రవక్త (స) తమ ఇంటిని వదిలేయడం-264; ఇంటి నుండి గుహ వరకు-266; గుహ లోపల-267; ఖురైష్ విఫలయత్నం -268; మదీనా బాటలో -270; ఖుబాకు అరుదెంచిన దైవప్రవక్త (స) -276; మదీనాలో ప్రవేశం-281;

మదీనాలో గడిపిన పవిత్ర జీవితం 287

హిజ్రత్ నాటి మదీనా పరిస్థితులు 288

నవ సమాజ నిర్మాణం 299

మస్జిదె నబవీ నిర్మాణం -299; ముస్లిముల సౌభ్రాతృత్వం -301; ఇస్లామ్ మార్గంలో పరస్పరం సహాయ సహకారాలు అందించుకునే ప్రమాణం -304; సమాజంపై పడిన ఆధ్యాత్మిక ప్రభావం-306;

యూదులతో జరిగిన ఒప్పందం 311

సాయుధ పోరాటాలు 313

హిజ్రత్ అనంతరం ఖురైషులు పన్నిన కుట్రలు, కుతంత్రాలు-313; అబ్దుల్లా బిన్ ఉబైతో జరిగిన సంప్రతింపులు -313; ముస్లిములను మస్జిదె హరాంలో ప్రవేశించకుండా అడ్డుకోవడం -314; ముహాజిర్లకు

ఖురైషుల బెదిరింపు -315; యుద్ధం అనుమతి -316; సరాయా మరియు గజ్వాలు-318;

బద్ర్ సంగ్రామం 330

గజ్వాకు పురికొల్పిన కారణాలు-330; ఇస్లామీయ సైనికశక్తి మరియు నాయకత్వ విభజన -331; బద్ర్ వైపునకు ప్రయాణమైన ఇస్లామీయ సైనిక దళం-332; మక్కాలో ప్రమాద ఘంటికలు -332; మక్కావాసుల యుద్ధ సన్నాహాలు -332; మక్కా సైన్యబలం -333; బనూ బక్ర్ తెగల సమస్య -334; యుద్ధానికి బయలుదేరిన మక్కాసైన్యం -334; ప్రమాదాన్నుండి బయటపడిన వర్తక బిడారం-335; మక్కా సైన్యంలో ఏర్పడిన చీలిక - వెనక్కు మరిలే యత్నం-335; ఇస్లామీయ సైన్యానికి ఎదురైన సంక్లిష్ట పరిస్థితి-336; ఇస్లామీయ సైనికదళం సాగించిన మిగతా ప్రయాణం - 339; శత్రువు ఆచూకీ తెలుసుకునే ప్రథమ ప్రయత్నం - 340; మక్కా సైన్యం గురించి అందిన ముఖ్యవార్తలు - 341; దైవకారుణ్యం కురిసిన వేళ - 342; ఖురైషు సైనిక కేంద్రాల వైపునకు కదిలిన ముస్లిములు - 342; యుద్ధ పర్యవేక్షణా కేంద్రం - 343; సైన్యాన్ని క్రమబద్ధం చేసి రేయి గడపడం - 345; యుద్ధరంగానికి మక్కా సైన్యం రాక - వారిలో పొడసూపిన పరస్పర మనస్పర్ధలు - 346; ఎదురెదురుగా నిలబడిన రెండు సైనిక దళాలు - 349; యుద్ధారంభం - 351; తొడ చరిచి పోరుకు పిలిచినవారు - 351; మూకుమ్మడిగా విరుచుకుపడిన శత్రువు - 353; మహాప్రవక్త (స) గారి వేడుకోలు (దుఆ) - 353; దైవదూతల అవతరణ - 354; ఎదురు దాడి - 355; యుద్ధరంగం నుండి ఇబ్లీస్ పలాయనం - 357; ఘోర పరాజయం - 358; గర్వంతో నీల్గిన అబూ జహల్ - 358; అబూ జహల్ సంహారం - 359; విశ్వాసాన్ని ఇనుమడింపజేసే సంఘటనలు - 361; యుద్ధంలో హతులైన ఇరుపక్షాల సైనికులు - 367; మక్కాకు అందిన పరాజయం కబురు - 368; మదీనాకు అందిన విజయ శుభవార్త - 371; యుద్ధంలో లభించిన యుద్ధధనం సమస్య - 372; మదీనాకు పయన మైన ఇస్లామీయ సైన్యం - 373 ; శుభాకాంక్షలు చెబుతూ ఎదురుగా వచ్చిన

బృందాలు - 374; ఖైదీల సమస్య - దాని పరిష్కారం - 375; దివ్యఖుర్‌ఆన్ వాక్యాల పునర్విమర్శ- 379; పరోక్ష సంఘటనలు- 380.

'బద్ర్' తరువాయి యుద్ధ సన్నాహాలు **380**

గజ్వయె బనీ సులైమ్ (కుద్ర్ ప్రదేశం)-383; దైవప్రవక్త (స)ను హత మార్చడానికి పన్నిన కుట్ర - 384; బనీ ఖైనుఖా పోరాటం (గజ్వయె బనీ ఖైనుఖా)-387; యూదుల ఎత్తుగడకు సంబంధించిన ఓ ఉదాహరణ- 388; బనీ ఖైనుఖా తెగ ఉల్లంఘించిన ఒప్పందం షరతులు - 390; ముట్టడి, లొంగుబాటు మరియు దేశ బహిష్కరణ - 393; గజ్వయె సవీఖ్- 394; గజ్వయె జీఅమ్ర్ - 396; కఅబ్ బిన్ అష్రఫ్ సంహారం - 397; గజ్వయె బహ్రాన్ - 403; సరియ్యా జైద్ బిన్ హారిసా-403.

ఉహద్ పోరాటం (గజ్వయె ఉహద్) **407**

ప్రతీకారాన్ని తీర్చుకోవడానికి ఖురైష్ చేస్తున్న యుద్ధ సన్నాహాలు - 407; ఖురైషుల సైన్యం, యుద్ధ సామగ్రి మరియు నాయకత్వం-407; బయలుదేరిన మక్కా సైన్యం - 409; మదీనా ముంగిట నిలిచిన మక్కా సైన్యం - 411; ఇస్లామియా సేన క్రమబద్ధీకరణ - యుద్ధ రంగానికి బయలుదేరడం - 413; సైన్యాన్ని మరోమారు పరికించిన మహాప్రవక్త (స) - 415; అబ్దుల్లా బిన్ ఉబై మరియు అతని అనుచరుల విద్రోహ చర్య - 416; తక్కిన ఇస్లామియా సేన ఉహద్ ముంగిట్లో - 418; రక్షణ వ్యూహం -419; ఇస్లామియా సేనలో ధైర్యోత్సాహాలను రేకెత్తించిన మహాప్రవక్త (స)- 421; ఖురైషుల రాజకీయ ఎత్తుగడ - 423; ఖురైష్ సైన్యానికి ధైర్యం నూరిపోయడంలో ఖురైష్ స్త్రీల పాత్ర - 424; యుద్ధాగ్నికి ఆహుతి అయిన మొదటి సమిధ -425; ప్రధాన యుద్ధ కేంద్రం మరియు యుద్ధ పతాకధారుల వధ - 426; హజ్రత్ హమ్‌జా (ర) గారి షహాదత్ (అమరగతి పొందడం) - 430; స్త్రీ కౌగిలింపును వదిలించుకొని కరవాలపు నీడల్లోకి దుమికిన యోధుడు-431; విలుకాండ్ర ఘనకార్యం- 432; ముష్రిక్కుల ఓటమి - 432; విలుకాండ్ర ఘోర తప్పిదం - 434; ఇస్లామియా పటాలాన్ని చుట్టుముట్టిన ముష్రిక్కు సేన -435; మహాప్రవక్త (స) తీసుకున్న ప్రమాదభరితమైన మరియు సాహసో పేతమైన నిర్ణయం - 435; చెల్లాచెదరవుతున్న ముస్లిములు - 436; దైవప్రవక్త (స) చుట్టూ జరుగుతున్న భీకర పోరాటం - 439; దైవప్రవక్త (స) వద్దకు సహాబా చేరుకోనారంభించడం-445; పెరుగుతున్న ముష్రిక్కుల ఒత్తిడి - 447; అద్భుతమైన పరాక్రమం - 448; మహా ప్రవక్త (స)గారి మరణవార్త - యుద్ధంపై దాని ప్రభావం-453; దైవప్రవక్త (స) యుద్ధాన్ని కొన సాగిస్తూ పరిస్థితులను నియంత్రించడం - 453; ఉబై బిన్ ఖల్ఫ్ సంహారం - 455; మహాప్రవక్త (స) గారికి ఊతమిచ్చి లేపిన హజ్రత్ తల్హా (ర) - 456; బహుదైవారాధకులు చేసిన అంతిమ దాడి - 457; అమరగతినొందిన వారిని ముస్లా చేయడం - 458; చివరి వరకు పోరాడేందుకు ముస్లిముల సన్నాహాలు - 458; లోయలో స్థిమితపడిన తరువాత - 460; అవహేళనకు దిగిన అబూ సుఫ్యాన్-హజ్రత్ ఉమర్ (ర)తో సంవాదం - 461; బద్ర్ మైదానంలో మరో యుద్ధం చేస్తానని ప్రమాణం చేయడం - 463; ముష్రిక్కుల తదుపరి కార్యక్రమాన్ని తెలుసుకునే ప్రయత్నం-463; షహీదులు మరియు క్షతగాత్రులను వెదకడం - 464; ప్రవక్తశ్రీ (స) దైవాన్ని స్తుతించటం - ఆయన్ను వేడుకోవడం - 468; మదీనాకు తిరుగు ప్రయాణం - దైవప్రవక్త (స) పట్ల అభిమానం - 470; దైవప్రవక్త (స) మదీనాలో - 471; మదీనాలో ఆత్యయిక పరిస్థితి - 472; గజ్వయె హుమరా ఉల్ అసద్ - 473; ఉహద్ యుద్ధ జయాప జయాలపై ఓ సమీక్ష - 477; ఈ పోరాటం గురించి ఖుర్‌ఆన్ చేసిన విశ్లేషణ - 479; ఆ పోరాటంలో ఇమిడి ఉన్న దైవాంతర్యాలు, దైవధ్యేయాలు-481

ఉహద్ పోరాటం తరువాతి సైనిక చర్యలు **483**

సరియ్యా అబీ సల్మా- 483; అబ్దుల్లా బిన్ ఉనీస్ (ర) గారు జరిపిన సైనిక చర్య - 485; రజీ సంఘటన - 485; 'బిఇరెమఊనా'

ఉదంతం - 488; గజ్వయె బనూ నజీర్ - 491; గజ్వయె నజద్ - 497; రెండో బద్ర్ పోరాటం- 499; గజ్వయె దూమతుల్ జందల్- 501;

గజ్వయె అహ్జాబ్ (అగడ్త యుద్ధం) 503

గజ్వయె బనూ ఖురైజా- 525;

అహ్జాబ్ మరియు ఖురైజా పోరాటాల తదుపరి సైనిక చర్యలు 536

1. సలామ్ బిన్ అబిల్ హకీక్ సంహారం- 536;
2. ముహమ్మద్ బిన్ ముస్లిమా సరియ్యా- 539;
3. గజ్వయె బనూ లహియ్యాన్- 541;
4. సరియ్య గమర్ - 542;
5. సరియ్యయె జుల్‌ఖస్సా-1- 542;
6. సరియ్యయె జుల్‌ఖస్సా-2- 542;
7. సరియ్యయె జమూమ్ - 543;
8. సరియ్యయె ఈస్- 543;
9. సరియ్యయె తర్ఫ్ లేదా తర్ఖ్- 544;
10. సరియ్యయె వాదియె ఖురా- 544;
11. సరియ్య ఖబ్త్- 545;

గజ్వయె బనీయిల్ ముస్తలిక్ 547

గజ్వయె బనీ ముస్తలిక్‌కు పూర్వం మునాఫిక్ అవలంబించిన వైఖరి - 549; గజ్వయె బనూ ముస్తలిక్‌లో మునాఫిక్‌ల పాత్ర - 556; మదీనా నుండి అతి నీచుడైన వ్యక్తిని గెంటివేసే విషయం - 556; ఇఫ్క్ సంఘటన- 559;

గజ్వయె బనీ ముస్తలిక్ తరువాత చేపట్టిన సైనిక చర్యలు 565

సరియ్యా దయారె బనీ కల్బ్ (దూమతుల్ జందల్ ప్రాంతం)- 565; సరియ్యా దయారె బనీ సఅద్ (ఫిదక్ ప్రాంతం)- 565; సరియ్యా వాదియుర్ ఖురా (ఖురా లోయ)- 566; సరియ్యా ఉర్‌నియ్యీన్- 567;

హుదైబియా ఒప్పందం 569

ఉమ్రా కొరకు వెళ్ళడానికి గల కారణాలు - 569; బయలుదేరడానికి వెలువడిన ప్రకటన- 569; మక్కా వైపునకు ముస్లిముల కదలిక - 570; కాబా గృహానికి రాకుండా ముస్లిములను అడ్డుకునే ప్రయత్నం - 571; భీకర పోరాటాన్ని తప్పించుకోవడానికి మార్గాన్ని మార్చడం - 572; బుదైల్ బిన్ వర్కా మధ్యవర్తిత్వం - 573; ఖురైష్ పంపిన దూతలు - 574; యుద్ధం జరగకుండా మిమ్మల్ని రక్షించినవాడు ఆయనే - 576; హజ్రత్ ఉస్మాన్ (ర) గారి దౌత్యం - 577; హజ్రత్ ఉస్మాన్ (ర) అమరగతి నొందారనే పుకారు - బైతె రిజ్వాన్ - 578; ఒప్పందం మరియు ఆ ఒప్పందపు షరతులు - 579; అబూ జందల్‌ను అప్పగించడం - 581; ఉమ్రా సంకల్పం నుండి బయటపడడానికి చేసిన ఖుర్బానీ మరియు శిరోముండనం- 583;

హిజ్రత్ చేసివచ్చిన మహిళల అప్పగింతను నిరాకరించడం 584

హుదైబియా ఒప్పందపు షరతుల వల్ల ఒనగూడిన ప్రయోజనాలు - - 585; ముస్లిములకు కలిగిన మనస్తాపం, హజ్రత్ ఉమర్ (ర) గారి వాగ్వివాదం - 588; బలహీన ముస్లిముల సమస్య పరిష్కరించబడింది - 590; ఖురైష్ సోదరుల ఇస్లామ్ స్వీకారం- 592;

క్రొత్త మార్పు 593

రాజులకు, సర్దారులకు పంపించిన లేఖలు-594

అబీసీనియా చక్రవర్తి 'నజాషీ' పేరున పంపిన లేఖ -595; ఈజిప్టు చక్రవర్తి ముఖౌఖిస్‌కు పంపిన లేఖ -598; పర్షియా చక్రవర్తి ఖుస్రో పర్వేజ్‌కు పంపిన లేఖ -601; రోము చక్రవర్తి కైజరుకు పంపిన లేఖ -603; మున్జిర్ బిన్ సావీ పేరున రాసిన లేఖ-609; యమామా పాలకుడు హౌజా బిన్ అలి పేరున రాసిన ఉత్తరం-611; డెమాస్కస్ పాలకుడు హారిస్ బిన్ అబీ షమర్ గస్సానీ పేరున రాసిన లేఖ-612; అమ్మాన్ రాజుకు రాసిన లేఖ-612;

హుదైబియా ఒప్పందం తరువాతి సైనిక చర్యలు 619

'గజ్వయె గాబా' లేదా 'గజ్వయె జీఖరద్'-619

గజ్వయె ఖైబర్; గజ్వయె వాదియిల్ ఖురా **622**

ఖైబర్ ప్రయాణం– 623; ఇస్లామీయ సైనిక బలం – 624; యూదులకు – 625; మునాఫిక్‌ల సహాయం – 625; ఖైబర్ మార్గం – 627; ఖైబర్ సానువుల్లో ఇస్లామీయ సైన్యం – 628; యుద్ధ సన్నాహం– ఖైబర్ కోటలు – 630; యుద్ధ ప్రారంభం నాయిమ్ కోట కైవసం– 631; సంధి సంప్రదింపులు – 637; అబుల్ హుఖైఖ్ ఇద్దరు కుమారుల మోసం – వారి హత్య – 638; విజయ ధన పంపకం – 639; హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ మరియు అష్అరీ సహాబాల రాక–641; హజ్రత్ సఫియ్యా (ర)తో వివాహం – 642; విషపూరితమైన మేక మాంసం – 643; ఖైబర్ యుద్ధంలో హతులైన ఇరుపక్షాల వారు – 644; వాదియిల్ ఖుర్ఆ (ఖుర్ఆ లోయ) – 645; తైమా – 646; మదీనాకు తిరుగు ప్రయాణం – 647; సరియ్యా అబాన్ బిన్ సయీద్– 648;

గజ్వయె జాతుర్రిఖాఖ్ (జాతుర్రిఖాఖ్ యుద్ధం– హి.శ. 7) **649**

హిజ్రీ శకం 7కు సంబంధించిన కొన్ని సరియ్యాలు– 653; సరియ్యా ఖదీద్ (సఫర్ లేదా రబీవుల్ అవ్వల్ మాసం, హి.శ. 7)– 653; సరియ్యా హుస్మీ (జమాదిల్ ఉఖ్రా మాసం, హి.శ.7)–654; సరియ్యా తర్బా (షాబాన్, హి.శ. 7)–654; ఫిదక్ పరిసరాలకు పంపిన సరియ్యా (షాబాన్ నెల, హి.శ.7)–654; సరియ్యా మైఫా (రమజాన్ నెల, హి.శ. 7)–655, సరియ్యా ఖైబర్ (షవ్వాల్ నెల, హి.శ. 7)–655, సరియ్యా యమన్ మరియు జబార్ (షవ్వాల్ నెల, హి.శ. 7)–655, సరియ్యా గాబా–656

ఉమ్రయె ఖజా **657**

మరికొన్ని సరియ్యాలు– 661; సరియ్యా అబుల్ ఇవజా (జిల్‌హజ్జా మాసం, హి.శ. 7)–661; సరియ్యా గాలిబ్ బిన్ అబ్దుల్లాహ్ (సఫర్ నెల, హి.శ. 8)–661; సరియ్యా జాతె అత్లహ్ (రబీవుల్ అవ్వల్ నెల, హి.శ. 8)–661; సరియ్యా జాతె అర్క్ (రబీవుల్ అవ్వల్ హి.శ. 8)–662;

'మూతా' పోరాటం **663**

పోరాటానికి గల కారణాలు– 663; సైన్యాధ్యక్షులు, వారికి దైవప్రవక్త (స) గారి హితబోధ– 664; ఇస్లామీయ సైన్యం బయలుదేరడం – అబ్దుల్లా బిన్ రవాహా (ర) గారి దుఃఖం – 664; ఇస్లామీయ సైన్యం ముందడుగు– అనుకోకుండా ఎదురైన గడ్డు పరిస్థితి– 665; 'మఆన్'లో సలహా సంఘం భేటీ– 666; శత్రువు వైపునకు ముందడుగు వేసిన ఇస్లా మీయ సైన్యం– 666; యుద్ధారంభం – సైన్యాధ్యక్షులు ఒకరి తరువాత మరొకరు అమరత్వం పొందడం– 667; దైవకర వాలాల్లో ఓ కరవాలం చేతిలో ఇస్లామీయ యుద్ధ పతాకం – 669; యుద్ధాంతం – 670; ఇరుపక్షా లకు చెందిన హతుల సంఖ్య– 671; ఈ యుద్ధ ప్రభావం– 671; సరియ్యా జాతుస్సలాసిల్– 672; సరియ్యా ఖిజ్రా (షాబాన్ నెల, హి.శ. 8)– 674;

మక్కా విజయం **675**

ఈ గజ్వాకు దారితీసిన కారణాలు– 675; ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి అబూ సుఫ్‌యాన్ మదీనా రాక– 677; గజ్వా (పోరాటం) కోసం సిద్ధపడడం– దాన్ని రహస్యంగా ఉంచే ప్రయత్నం చేయడం– 681; మక్కా వైపునకు తరలివెళ్ళిన ఇస్లామీయ సైన్యం– 684; మర్రజ్జహ్రాన్‌లో ఇస్లామీయ సైన్యం– 686; అబూ సుఫ్‌యాన్ దైవప్రవక్త (స) సన్నిధిలోనికి–687; మర్రజ్జహ్రాన్ నుండి బయలుదేరి మక్కా వైపు పయనమైన ఇస్లామీయ సేన– 689; హఠాత్తుగా ఖురైష్ పైకి వచ్చిపడ్డ ఇస్లామీయ సైన్యం– 691; 'జీతువా'కు చేరిన ఇస్లామీయ సైన్యం– 693; మక్కాలో ప్రవేశించిన ఇస్లామీయ సైన్యం – 693; దైవ గృహంలోనికి ప్రవేశించిన మహాప్రవక్త (స)–విగ్రహాల తొలగింపు– 694; కాబా గృహంలో దైవప్రవక్త (స) గారి నమాజు – ఖురైష్‌ను సంబోధించ చడం – 695; ఈ రోజు మీపై ఎలాంటి నింద మోపను – 696; కాబా తాళం చెవిని దాని హక్కుదారునికి అందించడం– 697; కాబా గృహ కప్పుపై నిలబడి హజ్రత్ బిలాల్ (ర)

పలికిన అజాన్ - 698; విజయం లభించినందుకు లేదా కృతజ్ఞతలు తెలుపుకోడానికి చేసిన నమాజు - 698; కరుడుగట్టిన నేరస్తుల హత్యలకు రక్తపరిహారం నాస్తి - 699; 'సుఫ్వాన్ బిన్ ఉమయ్యా' మరియు 'ఫిజాలా బిన్ ఉమైర్'ల ఇస్లామ్ స్వీకారం - 701; మక్కా విజయం మరుసటి రోజున మహాప్రవక్త (స) గారి ప్రసంగం - 702; ఆందోళనకు గురియైన అన్సారులు- 703; బైత్ (ప్రమాణం) - 704; మక్కాలో మకామేసి దైవప్రవక్త (స) చేసిన పని - 706; సరాయా మరియు ప్రతినిధి బృందాలు- 707;

మూడవ దశ 713

గజ్వయె హునైన్ (హునైన్ యుద్ధం) 714

శత్రు సైన్యం బయలుదేరి ఔతాస్‌లో విడిది చేయడం- 714; సైన్యాధ్యక్షుణ్ణి విమర్శించిన ఓ యుద్ధ నిపుణుడు- 714; శత్రువు గూఢాచారులు-716; మహాప్రవక్త (స) గారి గూఢాచారులు-716; మక్కా నుండి హునైన్‌కు బయలుదేరిన మహాప్రవక్త (స) - 717; ఇస్లామీయ సైన్యంపై హఠాత్తుగా వర్షించిన బాణాల వర్షం- 718; ఘోర పరాజయం పాలైన శత్రువు - 721; తరమబడిన శత్రువు - 722; విజయ ధనం- 722; గజ్వయె తాయెఫ్ - 723; అన్సారులలో ఏర్పడిన మనస్తాపం, అలజడులు-727; హవాజిన్ వారి ప్రతినిధి వర్గం రాక- 730; ఉమ్రా చెల్లించి మదీనాకు తిరుగు ప్రయాణం- 732 ;

మక్కా విజయం తరువాతి సైనిక చర్యలు - ప్రభుత్వాధికారుల నియామకం 734

జకాత్ వసూలు చేసే ఉమ్మాల్ (రెవెన్యూ అధికారులు)- 734; సరాయా (సైనిక చర్యలు)-735;

గజ్వయె తబూక్ (తబూక్ పోరాటం) 743

తబూక్ పోరాటం సంభవించడానికి గల కారణం- 743; రోమనులు మరియు గస్సాన్‌ల యుద్ధ సన్నాహాల వార్తలు- 744; రోమనులు, గస్సానుల యుద్ధ సన్నాహాలకు చెందిన ప్రత్యేక వార్తలు- 747; మరింత జటిలంగా మారిన పరిస్థితులు - 747; ప్రవక్త (స) మహనీయుని ఖచ్చితమైన నిర్ణయం - 747; రోమనులతో యుద్ధానికి సన్నాహాలు - 748; యుద్ధ సన్నాహాలకు ముస్లిముల ఉరుకులు పరుగులు - 749; తబూక్‌కు బయలుదేరిన ఇస్లామీయ సైన్యం - 751; తబూక్‌కు చేరిన ఇస్లామీయ సైన్యం- 753; మదీనాకు తిరుగు ప్రయాణం- 755; ముకల్లిఫీన్ (యుద్ధంలో పాల్గొనకుండా వెనుక ఉండిపోయిన వారు)-757; ఈ పోరాట ప్రభావం- 760; ఈ సంగ్రామానికి సంబంధించి అవతరించిన ఖుర్ఆన్ ఆదేశాలు- 761; ఆ సంవత్సరపు కొన్ని ప్రముఖ సంఘటనలు- 761;

హిజ్రీ శకం 9లో జరిగిన హజ్ 763

గజ్వాలపై ఓ సమీక్ష 765

దైవధర్మంలో తండోపతండాలుగా ప్రజల ప్రవేశం 770

ప్రతినిధి వర్గాలు-771;

ఇస్లామ్ ధర్మ ప్రచార సాఫల్యం - దాని ప్రభావాలు 793

హజ్జతుల్ విదా (చివరి హజ్) 797

చిట్టచివరి సైనిక యాత్ర 809

పరమాప్తుని వైపునకు ప్రస్థానం 811

అంతిమ ప్రయాణ సూచనలు-811; వ్యాధి ప్రారంభ దశ- 812; చివరి వారం- 812; మరణానికి అయిదు రోజుల ముందు- 813; నాల్గు రోజులకు ముందు - 815; ఒకటి లేదా రెండు రోజుల ముందు- 817; ఒక రోజు ముందు- 818; జీవితపు చివరి రోజు - 818; తుది శ్వాస- 820; శోక సముద్రంలో మునిగిపోయిన సహాబా (ర)- 821; హజ్రత్ ఉమర్ (ర) గారి తీరు- 822; హజ్రత్ అబూ బక్ర్ (ర) గారి తీరు- 822;

శవ సంస్కారాలు (స్నాన ఖననాలు) **824**

మహాప్రవక్త (స) కుటుంబం **824**

హజ్రత్ ఖతీజా - 827; హజ్రత్ సౌదా బిన్తె జమ్అ (ర)- 828; హజ్రత్ ఆయిషా సిద్దీకా బిన్తె అబూ బక్ర్ (ర)- 828; హజ్రత్ హఫ్సా బిన్తె ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)- 829; హజ్రత్ జైనబ్ బిన్తె కజీమా (ర)- 829; హజ్రత్ ఉమ్మె సల్మా బిన్తె అబీ ఉమయ్యా (ర)- 829; జైనబ్ బిన్తె హజష్ బిన్ రియాబ్ (ర)- 829; జువైరియా బిన్తె హారిస్ (ర)- 830; ఉమ్మె హబీబా రమలా బిన్తె అబీ సుఫ్యాన్ (ర)- 830; హజ్రత్ సఫియ్యా (ర) బిన్తె హుయ్ బిన్ అక్తబ్- 830; హజ్రత్ మైమూనా బిన్తె హారిస్ (ర)-831;

పరిపూర్ణ మూర్తిమత్వం **841**

రూపురేఖలు-841; పరిపూర్ణ వ్యక్తిత్వం - సద్గుణ ప్రాభిమ-847; ఆధార గ్రంథాలు- 857;

ఇస్లాం శుభోదయ సమయాన అరేబియా పరిస్థితి

ఇస్లాం శుభోదయ సమయాన అరేబియా పరిస్థితి

అరేబియా నైసర్గిక స్వరూపం - జాతులు

దైవ సందేశానికి అనుగుణంగా, దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం గారి జీవితం కొనసాగిన వైనాన్నే మనం 'మహాప్రవక్త (స) జీవిత చరిత్ర'గా, 'సీరతున్నబీ'గా లేదా 'దివ్యచరితం'గా చెప్పుకోవడం జరుగుతోంది. అజ్ఞానపు చీకట్లల్లో కొట్టుమిట్టాడుతున్న మానవాళిని తన దివ్యచరితం ద్వారా విజ్ఞాన కాంతి వైపునకు నడిపించారాయన. అదే కాకుండా ఆయన దాసుల దాస్యం నుండి మానవాళిని బయటకు లాగి దైవదాస్యం వైపునకు పురోగమింపజేసిన మహామనీషి. దైవసందేశావతరణకు పూర్వం, ఆ తరువాత సంభవించిన సంఘటనలను, నెలకొన్న పరిస్థితులను పోల్చి చూస్తే తప్ప, మహాప్రవక్త (స) గారి దివ్యచరిత్రను మలచడం సాధ్యం అయ్యే పని కాదు. అందుకని, అసలు చర్చకు వచ్చే ముందు ఈ అధ్యాయంలో ఇస్లాం ఆవిర్భావానికి పూర్వం దైవసందేశహరులైన ముహమ్మద్ (స) ప్రభవించిన ఆ అరబ్బు జాతులు, వాటి వృద్ధివికాసాల తీరుతెన్నులు ఎలాంటివో తప్పకుండా అధ్యయనం చేయవలసి ఉంది.

అరేబియా నైసర్గిక స్వరూపం

'అరబ్బు' అనే పదానికి నిఘంటువుల్లో 'ఎడారి', 'నిర్జల ఊసర క్షేత్రం' అని అర్థాలున్నాయి. అనాదిగా అరేబియా ద్వీపకల్పం, ఆ ద్వీపకల్పంలో నివసించే జాతుల కోసం వాడబడిన పదమిది. అరేబియాకు పశ్చిమాన ఎర్ర సముద్రం మరియు సినాయి ద్వీపకల్పం ఉన్నాయి. తూర్పున అరేబియా అఖాతమే కాకుండా దక్షిణ ఇరాఖ్‌కు చెందిన ఓ పెద్ద భూభాగం; దక్షిణాన అరేబియా సముద్రం ఉంది. నిజానికి ఇది విస్తరించిన హిందూ మహాసముద్ర

మనే అనాలి. ఉత్తర దిక్కున సిరియా దేశం, ఉత్తర ఇరాఖ్‌కు చెందిన కొంత భూభాగం కలసి ఉన్నాయి. వీటిలో కొన్ని సరిహద్దుల విషయమై భేదాభిప్రాయం ఉంది. మొత్తం భూభాగం వైశాల్యం పది నుండి పదమూడు లక్షల చదరపు మైళ్ళు ఉంటుందని అంచనా వేయడం జరిగింది.

అరేబియా ద్వీపకల్పం భౌతికంగానూ, భౌగోళికంగానూ గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకున్న భూభాగం. అంతర్గతంగా ఇది నలు వైపుల నుండి ఎడారి, కొండలు, గుట్టలతో పరివేష్ఠింపబడి ఉన్న కారణంగా, విదేశీ జాతులు దీన్ని ఏ మాత్రం జయించడానికిగానీ, తమ ప్రభావాన్ని విస్తరింపజేయడానికిగానీ వీలులేని ఒక సురక్షిత దుర్గంగా రూపొందింది. ఈ కారణంగానే అరేబియా ద్వీపానికి చెందిన ప్రజలు అనాదిగా తమ సమస్త వ్యవహారాల్లో పూర్తిగా స్వతంత్రులుగా ఉంటూ వచ్చారు. పెట్టని కోటల్లా ఉన్న ప్రకృతి సిద్ధమైన ఈ గట్టి అడ్డంకులే లేకపోతే, అరేబియా ప్రజలకు పొరుగునే ఉన్న రెండు గొప్ప శక్తిమంతమైన సామ్రాజ్యాల దండయాత్రలను అడ్డుకునే శక్తి ఏ మాత్రం లేకపోయేది.

ఇక బాహ్యాపరంగా చూస్తే, పురాతన కాలానికి చెందిన భూఖండాలన్నింటికి నట్టనడుమన అరేబియా ద్వీపకల్పం ఉంది. భూమార్గాన్నే కాకుండా సముద్ర మార్గాన కూడా ఆ ఖండాలతో సంబంధం కలిగి ఉన్న దేశమిది. అరేబియా వాయవ్య దిశ ఆఫ్రికా ఖండపు ప్రవేశ ద్వారంగాను, ఈశాన్య దిశ ఐరోపా ఖండంలో ప్రవేశించే మార్గంగాను, తూర్పు దిశ ఇరాన్, మధ్యాసియా మరియు దూర ప్రాచ్య ద్వారాలను తెరుస్తోంది. ఈ మార్గం గుండానే భారత దేశం, చైనా వరకు రాకపోకలు సాగగలవు. ఇలాగే ప్రతి ఖండం సముద్ర మార్గాన కూడా అరేబియా ద్వీపకల్పంతో సంబంధం కలిగి ఉంది. ఆ ఖండాల నుండి ఓడలు నేరుగా అరేబియా ఓడరేవుల్లోనికి వచ్చి నిలుస్తాయి.

ఈ భౌగోళిక స్వరూపం కారణంగా, అరేబియా ద్వీపకల్పం యొక్క ఉత్తర దక్షిణ భూభాగాలు వివిధ జాతులకు రక్షణ స్థావరాలుగాను, వ్యాపార వాణిజ్యాలకు, సాంస్కృతిక ధార్మిక భావాలకు మార్పిడి కేంద్రాలుగానూ విలసిల్లాయి.

అరబ్బు జాతులు

చరిత్రకారులు వంశాలు, సంతతిపరంగా అరబ్బు జాతుల్ని మూడు రకాలుగా విభజిస్తారు.

1. **బాయిదా అరబ్బులు** : అంటే పూర్తిగా మరుగున పడిపోయిన అరబ్బు తెగలు, జాతులు అన్నమాట. ఇవి ఆద్, సమూద్, తస్మ్, జదీస్, అమాలికా వగైరాలు. వీటికి సంబంధించిన వివరాలు మరుగైపోయినందున లభ్యం కాలేదు.
2. **ఆరిబా అరబ్బులు** : అంటే యారుబ్ బిన్ యష్జబ్ బిన్ ఖహ్‌తాన్ సంతతికి చెందిన అరబ్బులు అని అర్థం. వీరిని ఖహ్‌తానీ అరబ్బులని కూడా పిలుస్తారు.
3. **ముస్తారిబా అరబ్బులు** : వీరు ప్రవక్త హజ్రత్ ఇస్మాయిల్ (అ.స.) సంతతికి చెందిన అరబ్బులు. వీరిని అద్‌నానీ అరబ్బులుగా వ్యవహరిస్తారు. ఆరిబా అరబ్బులు లేక ఖహ్‌తానీ అరబ్బుల అసలు నివాసం 'యమన్' దేశం. ఇచ్చటి నుండే వారి కుటుంబాలు, తెగలు వివిధ శాఖల్లో వెలిసి విస్తరించాయి. వీరిలో రెండు మాత్రం మంచి పేరు ప్రఖ్యాతులు గడించుకున్న తెగలు. అవి: 1. హమీర్, 2. కహ్‌లాన్.

హమీర్‌కు చెందిన ప్రముఖ శాఖలు 'జైదుల్ జమ్‌హూర్', 'ఖుజాఅ' మరియు 'మకాసిక్'లు.

కహ్‌లాన్‌కు చెందిన ప్రఖ్యాత శాఖలు హమ్దాన్, అన్మార్, తై, మజ్‌హిజ్, కిందా, లఖ్మ్, జుజామ్, అజ్ద్, అవస్, ఖజ్రజ్ మరియు జుఫ్నాలు. జుఫ్నా సంతతివారు సిరియా చుట్టుపట్ల రాజ్యాలను స్థాపించి 'ఆలె గస్సాన్'గా పేరుగాంచారు.

సాధారణ కహ్‌లానీ తెగలు ఆ తరువాత యమన్‌ను వదిలి అరేబియా ద్వీపంలోని వివిధ ప్రదేశాల్లోనికి వ్యాపించాయి. 'సీలె అరిమ్' సంఘటనకు పూర్వం, రోమనులు, ఈజిప్ట్, సిరియాలను హస్తగతం చేసుకొని యమన్‌పై దండెత్తడం జరిగింది. యమన్‌కు సంబంధించిన వ్యాపార మార్గాలను, సముద్ర మార్గాన్ని వశపర్చుకున్నారు. భూమార్గ వసతులన్నిటిని తుదముట్టించి కహ్‌లానీల వ్యాపారంపై వ్రేటువేసినందున కహ్‌లానీలు మూకుమ్మడిగా దేశాన్ని వదిలేసి వలసపోవలసివచ్చింది.

కహ్‌లానీ మరియు హమీరీ కుటుంబాల నడుమ మనస్పర్థలు కూడా కహ్‌లానీల వలసకు కారణం కావచ్చు. హమీరీలు మాత్రం వలస పోకుండా

ఉండడం, కహ్‌లానీలు మాత్రమే వలసపోవడం అనే విషయం దీన్ని ధృవీకరిస్తోంది.

వలస వెళ్ళిన కహ్‌లానీ తెగల్ని నాలుగు రకాలుగా విభజించవచ్చు

1. అజ్ద్ : వీరు తమ నాయకుడు ఇమ్రాన్ బిన్ అమ్రూ మజీఖియా సలహాపై దేశాన్ని వీడినవారు. మొదట యమన్‌లోనే ఓ చోటి నుండి మరో చోటికి మారుతూవచ్చినవారు వీరు. దీని కోసం ముందే వారు ఓ గూఢాచార బృందాన్ని ఏర్పర్చుకొని, పరిస్థితులను ఆకళింపు చేసుకొని మరీ కదిలేవారు. చివరికి వీరు ఉత్తర దిశ వైపునకు వెళ్ళి వేర్వేరు ప్రదేశాల్లో శాశ్వతంగా స్థిరపడిపోయారు. ఆ శాఖల వివరాలు ఇలా ఉన్నాయి.

సాలిబా బిన్ అమ్రూ: ఈ శాఖ మొదట హిజాజ్ వైపునకు బయలుదేరి సఅల్బియా, జీకార్ల నడుమ నివాసం ఏర్పర్చుకుంది. సంతానం పెరిగి పెద్దదై శక్తి పుంజుకున్న తరువాత మదీనాకు వెళ్ళి అక్కడనే స్థిరమైపోయింది. ఈ సాలిబా సంతతి నుండే అవస్, ఖజ్రజ్ తెగలు ఉద్భవించాయి. అవస్, ఖజ్రజ్ అనేవారు సాలిబా కుమారుడైన హారిసా కొడుకులు.

హారిసా బిన్ అమ్రూ: అంటే 'ఖుజాఅ' మరియు దాని సంతతి అన్నమాట. మొదట వీరు 'హిజాజ్'లో దేశదిమ్మరులుగా తిరుగుతూ మర్రజజహ్రాన్‌లో మజిలీ చేశారు. ఆ తరువాత మక్కాపై దండెత్తి బనూ జుర్‌హుంను అచ్చటి నుండి పారద్రోలి మక్కాలోనే స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు.

ఇమ్రాన్ బిన్ అమ్రూ: అతనూ, అతని సంతానం అమ్మాన్‌లో స్థిరపడిపోయారు. అందుకే వీరు' అజ్దె అమ్మాన్'గా పిలువబడతారు.

నస్ర్ బిన్ అజ్ద్ : ఈ శాఖకు సంబంధించిన తెగలు తహామాలో స్థిరపడ్డారు. వీరు 'అజ్దెషనూవా'గా పేరుపొందారు.

జుఫ్నా బిన్ అమ్రూ : ఇతను సిరియా దేశానికి వెళ్ళి తన సంతానంతో అక్కడనే స్థిరపడిపోయాడు. ఇతనే గస్సానీ పాలకులకు మూలపురుషుడు కూడాను. వారు సిరియాకు వెళ్ళడానికి పూర్వం హిజాజ్‌లో గస్సాన్ అనే ఒయాసిస్సు వద్ద కొంతకాలం నివాసం ఉండటం వలన వారిని అలెగస్సాన్‌గా పిలుస్తారు.

2. లఖ్మా వజ్‌జామ్‌లు : హీరాకు చెందిన ఆలె మున్జిర్ రాజుల మూలపురుషుడు నస్ర్ బిన్ రబీ ఈ లక్మీల్లోని వాడే.

3. బనూ తై: ఈ తెగ, బనూ అజ్ద్ వలస వెళ్ళిన తరువాత ఉత్తరం వైపునకు పయనించి 'అజా', 'సల్మా' పేర్లుగల రెండు కొండల దరిదాపుల్లో శాశ్వతంగా స్థిరపడిపోయింది. చివరికి ఈ రెండు కొండలు 'తై' తెగ కారణంగా ఖ్యాతిని పొందాయి.

4. కిందా: వీరు మొదటగా బహ్రైన్ - ప్రస్తుత అల్ అహ్‌సార్ - లో విడిది చేశారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల దాన్ని వదిలి హజర్‌మౌత్‌కు వెళ్ళిపోయారు. అక్కడ కూడా వారికి సంరక్షణ లభించక చివరికి 'నజద్'లో విడిది చేయవలసివచ్చింది. ఇక్కడ వీరు ఓ గొప్ప పాలనకు నాంది పలికారు. అయితే ఈ పాలన అంత దృఢంగా లేకపోవడం వలన త్వరలోనే పతనమై పోయింది.

కహ్‌లాన్ ఒక్కటే కాకుండా హమీర్‌కు సంబంధించిన ఓ తెగ 'ఖుజాఅ' కూడా ఒకటుంది. హమీరీ తెగ విషయంలో కొంత అభిప్రాయభేదం ఉంది. ఇది యమన్ విడిచి ఇరాఖ్‌లోని 'బాదియతుస్సమావా' అనే ప్రాంతానికి వలస పోయింది.[1]

ముస్తారిబా అరబ్బులు : వీరికి మూలపురుషుడు ఇబ్రాహీం అలైహిస్సలాం. ఈయన ఇరాఖ్‌లోని 'ఉర్' నగర నివాసి. ఇది ఫరాత్ నది పశ్చిమ తీరంలోని 'కూఫా' దాపులో ఉండింది. త్రవ్వకాల్లో బయల్పడిన శిలా శాసనాల్లో ఆ నగరం గురించి అనేక వివరాలు వెలుగులోనికి వచ్చాయి.

హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) కుటుంబానికి చెందిన కొన్ని వివరాలు, ఆ దేశ ప్రజల ధార్మిక సామాజిక పరిస్థితులు కూడా అవగతమయ్యాయి.

హజ్రత్‌ఇబ్రాహీం (అ.స.) ఇక్కడ నుండే హిజ్రత్ చేసి (వలస వెళ్ళి) 'ఖరాన్' నగరానికి చేరారు. అక్కడి నుండి ఆయన పాలస్తీనాకు వెళ్ళి దాన్ని తన దైవదౌత్య కార్యకలాపాలకు కేంద్రంగా చేసుకున్నారు. ధర్మ బోధలో నిమగ్నులై దైవ మార్గం వైపునకు ప్రజల్ని ఆహ్వానిస్తూ దేశ విదేశాల్లో తిరగసాగారు. ఓసారి

---

1. ఈ తెగలు, వాటి వలన వివరాలు 'ముహాజిరత్ తారీకుల్ ఉమమ్ ఇస్లామియా లిల్ ఖిజ్రా- *1/11-13*, ఖల్బ్ జజీరతుల్ అరబ్, పేజీ. *231-235*లో ఉన్నాయి. వలస సంఘటనకు సంబంధించిన కాలం, దానికి కారణాలను పరిశీలించిన తరువాత సరి అయినవిగా తోచిన వాటినే ఇక్కడ పొందుపర్చడం జరిగింది.

ఆయన ఈజిప్ట్‌కు కూడా వెళ్ళారు. ఈజిప్ట్ చక్రవర్తి ఫిర్‌ఔన్ (ఫారో), ఆయన(అ.స.) భార్య 'సారా'ను గురించి విని మోహంలో పడ్డాడు. అతడు ఆమెను తన దర్బారుకు చెడు తలంపుతో పిలిపించాడు. హజ్రత్ సారా ప్రార్థనను మన్నించి అల్లాహ్ ఫిర్‌ఔన్‌కు కాళ్ళుచేతులు కొట్టుకునే వ్యాధిని సంక్రమింపజేశాడు. అతని చెడు ఉద్దేశ్యం అతని ముఖానికేసి కొట్టబడింది. ఈ వ్యాధి వల్ల ఫిర్‌ఔన్‌కు ఆమె సామాన్య స్త్రీ కాదనీ, దేవుని ప్రత్యేక దాసియనీ, దైవసామీప్యంగల భక్తురాలనీ తెలిసిపోయింది. ఆమెగారి ఈ ప్రత్యేకతకు ప్రభావితుడై తన కుమార్తె[2] 'హాజిరా'ను ఆమెకు దాసీగా చేసి పంపాడు. ఆ తరువాత హజ్రత్ సారా, హజ్రత్ హాజిరాను ఇబ్రాహీం (అ.స.)కు భార్యగా చేశారు.[3]

హజ్రత్ ఇబ్రాహీం (అ.స.), హజ్రత్ సారా, హజ్రత్ హాజిరాలను వెంట బెట్టుకొని పాలస్తీనాకు తిరిగి వచ్చేశారు. ఆ తరువాత అల్లాహ్, హజ్రత్ ఇబ్రాహీం (అ.స.)కు హాజిరా గర్భం నుండి యోగ్యుడైన ఓ కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.)ను ప్రసాదించాడు. అయితే, సంతానంలేని హజ్రత్ సారా అభిమానం దెబ్బతిన్నది. ఆమె హజ్రత్ ఇబ్రాహీం (అ.స.)ను, హజ్రత్ హాజిరాను మరియు ఆమె పసికందునూ దేశ బహిష్కరణ చేయమని బలవంతపెట్టింది. అనివార్య పరిస్థితుల వల్ల హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) హజ్రత్ సారా మాటను కాదనలేక హజ్రత్ హాజిరాను, ఆమె కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్‌ను తోడ్కొని హిజాజ్ వైపు బయలుదేరవలసివచ్చింది. అక్కడ ప్రస్తుతం దైవగృహం కాబా ఉన్న ఎడారి కొండల నడుమ గల ఓ లోయలో వదిలారు. అప్పుడు దైవగృహం ఉనికే లేదు. అక్కడ కేవలం మెట్టగా ఉండే ప్రదేశం ఒకటుంది. వరద వచ్చినప్పుడు వరద నీరు ఈ మెట్టప్రాంతానికి కుడి ఎడమ వైపుల నుండి తప్పుకుపోయేవి . అక్కడే మస్జిదె హరామ్‌కు ఎగువన జమ్‌జమ్ బావి వద్ద ఓ పెద్ద వృక్షం ఉండేది. ఆయన ఆ చెట్టు దగ్గర హజ్రత్

2. హజ్రత్ హాజిరా ఓ బానిస స్త్రీగా చెప్పుకోవడం జరుగుతుంది. అయితే అల్లామా మన్సూర్ పూరి ఈ విషయంలో పరిశోధన చేసి ఆమె బానిస స్త్రీ కాదని ఓ స్వతంత్రురాలని రుజువు చేశారు. ఆమె ఫిర్‌ఔన్ కుమార్తెయే. *(రహ్మతుల్ లిల్ ఆలమీన్- సంపుటం: 2, పుట. 36-37)*
3. *రహ్మతుల్ లిల్ ఆలమీన్- సంపుటం: 2, పుట. 34. సంఘటన వివరాల కోసం సహీ బుఖారి సం.1, పుట. 484 చూడండి.*

హాజిరా, హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.)లను వదిలివెళ్లారు. అప్పుడు మక్కాలో నీరుగానీ, ఆదమ్‌గానీ, ఆదమ్ సంతానంగానీ లేరు. అందుకని హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) వారి కోసం పాత్రలో ఖర్జూరపు పళ్ళు, ఒక తోలు సంచిలో నీరు ఉంచి తిరిగి పాలస్తీనాకు వెళ్ళిపోయారు. కాని కొన్ని రోజుల్లోనే ఆ ఖర్జూరపు పళ్ళు, నీరూ అయిపోయి పెద్ద సంకటం ఏర్పడింది. ఆ గడ్డు పరిస్థితిలో అల్లాహ్ కారుణ్యం వల్ల జమ్‌జమ్ చెలమ పుట్టుకువచ్చింది. ఇది కొంతకాలం వరకు ఆ ఇరువురి జీవితాలను కాపాడడానికి దోహదపడిన విషయం విదితమే.[4]

కొంతకాలం గడిచిన తరువాత యమన్ నుండి ఓ తెగ అక్కడికి వచ్చింది. చరిత్రలో దాన్ని 'జుర్‌హుమ్‌సాని' (రెండవ జుర్హుం)గా చెప్పుకోవడం జరిగింది. ఈ తెగ ఇస్మాయీల్ (అ.స.) మాతృమూర్తి నుండి అనుమతి పొంది మక్కాలో నివాసం ఏర్పర్చుకుంది. ఇదివరకు ఈ తెగ మక్కా చుట్టుపట్లగల కొండ లోయల్లో నివాసం ఉంటూ ఉండేది అని ప్రతీతి. సహీ బుఖారి గ్రంథంలో ఈ తెగ మక్కాలో (నివాసమేర్పర్చుకోవడానికి) హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) రాక తరువాత ఆయన యవ్వన దశకు చేరిన మధ్యకాలంలో వచ్చారని వివరణ ఉంది. అయితే ఈ లోయ నుండి వారు ఇదివరకే తరచు వచ్చిపోతుండేవారు.[5] హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) తన భార్యనూ, కుమారుణ్ణీ చూచి వెళ్ళడానికి అప్పుడప్పుడు మక్కాకు వచ్చివెళ్ళేవారు. అయితే ఆయన ఎన్ని మార్లు అక్కడికి వచ్చారో ఇతమిత్థంగా తెలియదు. అయితే చరిత్ర ఆధారంగా ఆయన నాలుగు మార్లు అక్కడికి వచ్చివెళ్ళినట్లు దాఖలాలున్నాయి.

1. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్, హజ్రత్ ఇబ్రాహీం (అ.స.)కు స్వప్నంలో తన కుమారుడు (హజ్రత్ ఇస్మాయీల్ - అ.స.) ను జిబహ్ చేస్తున్నట్లు చూపించిన విషయం వివరించడం జరిగింది. ఈ స్వప్నం ఓ రకమైన దైవాదేశం. తండ్రీ కుమారులిద్దరూ ఈ ఆదేశాన్ని శిరసావహించడానికి సిద్ధమయ్యారు. వారిద్దరు దైవాదేశానికి తల ఒగ్గి, తండ్రి తన కుమారుణ్ణి బోర్లా పడవేయగా, అప్పుడు అల్లాహ్ ఆయన్ను పిలిచి, "ఓ ఇబ్రాహీం! నీవు కలను నిజం చేసి చూపించావు. సత్కార్యం చేసేవారికి మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. ఇది ఓ స్పష్ట

4. *సహీ బుఖారీ, కితాబుల్ అంబియా- 1/474, 475.*
5. *సహీ బుఖారీ- 1/475.*

మైన పరీక్ష." అల్లాహ్ ఓ పెద్ద ఖుర్బానీని పరిహారంగా ఇచ్చి ఆ బాలుణ్ణి విడిపించాడు.[6]

బైబిల్ పాత నిబంధనలో హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.), హజ్రత్ ఇస్హాక్ (అ.స.) కంటే పదమూడేళ్లు పెద్ద అని చెప్పబడింది. దివ్యఖుర్ఆన్ ప్రకారం, ఈ సంఘటన తరువాతనే హజ్రత్ ఇస్హాక్ (అ.స.) జననం శుభ వార్తను విని పించడం జరిగింది.

ఈ సంఘటన ద్వారా రుజువయ్యే విషయం ఏమిటంటే, హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) యవ్వన దశకు చేరకముందే కనీసం ఒకసారైనా హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) మక్కాను తప్పక దర్శించి ఉంటారు. తక్కిన మూడు ప్రయాణాలను గురించిన వివరణ సహీ బుఖారీలో ఓ సుదీర్ఘ ఉల్లేఖనం ద్వారా తెలుస్తోంది. దీన్ని ఇబ్నె అబ్బాస్ (ర) ఉల్లేఖించారు.[7] దాని వివరణ ఇలా ఉంది :

2. హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) యుక్త వయస్సుకు వచ్చి జుర్హుం (తెగ) నుండి అరబీ భాష నేర్చుకున్నారు. తమకు నచ్చిన యువకుడు అయినందున ఆ తెగకు చెందిన ఓ అమ్మాయికిచ్చి పెళ్ళి చేశారు. ఆ కాలంలోనే హజ్రత్ హాజిరా (అ.స.) మరణించారు. ఇటు హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) తన భార్యా కుమారుణ్ణి చూడడానికి మక్కాకు వచ్చారు. అయితే హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.)ను కలవడానికి కుదరలేదు. కోడలితో పరిస్థితులేమిటని అడగ్గా ఆమె తమ దారిద్ర్యాన్ని ఏకరువు పెట్టింది. ఆయన కోడలితో, "ఇస్మాయీల్ ఇంటికి వచ్చిన తరువాత ఇంటి గడపను మార్చేయమని చెప్పు" అంటూ తిరిగి వెళ్ళిపోయారు. ఆయన మాటలకు అర్థం ఏమిటో హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) గ్రహించి భార్యకు విడాకులు ఇచ్చి మరో యువతిని పెళ్ళి చేసుకున్నారు. ఈమె జుర్హుం తెగ నాయకుడు మజాజ్ బిన్ అమ్రూ కుమార్తె.[8]

3. ఈ రెండవ పెళ్లి తరువాత హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) మరోసారి మక్కాకు వచ్చారు. అయితే ఈసారి కూడా హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) ఆయన్ను కలువలేకపోయారు. కోడలితో ఇంటి పరిస్థితి గురించి వాకబు

6. సాఫ్ఫాత్-103-107. 7. సహీ బుఖారి-1/475-476.
8. ఖల్బ్ జజీరతుల్ అరబ్- పుట. 23.

చేయగా, ఆమె, (దేవుని దయ వల్ల అంతా సక్రమంగానే సాగుతుంది అని) దైవస్తోత్రం చేసింది. అప్పుడు ఇబ్రాహీం (అ.స.), "ఇంటి గడపను అలాగే ఉంచమని చెప్పు" అని తాకీదు చేసి పాలస్తీనాకు వెళ్ళిపోయారు.

4. ఆ తరువాత మళ్ళీ వచ్చినప్పుడు హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) 'జమ్‌జమ్' దాపున ఉన్న చెట్టు క్రింద బాణాలు పోతపోస్తున్నారు. తండ్రిని చూడగానే పరుగున వెళ్ళి వాటేసుకున్నారు. ఈ సందర్భంలో తండ్రీకొడుకుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ కలయిక ఓ సుదీర్ఘ కాలం తరువాత జరిగింది. మృదుస్వభావుడైన, ప్రేమమయుడైన ఒక తండ్రి తన కుమారుడి నుంచి, విధేయుడైన ఒక కుమారుడు తన తండ్రి నుంచి ఇంత కాలంపాటు దూరంగా ఉండటాన్ని భరించటం ఎంతో కష్టతరమైన విషయం. తండ్రీకొడుకుల పరిస్థితి చెప్పనలవికానిది. ఆ తరువాత వారిద్దరు కలసి కాబా గృహాన్ని నిర్మించారు. పునాదులు త్రవ్వి, గోడలు పైకి లేపారు. ఇబ్రాహీం (అ.స.) ప్రపంచ ప్రజలందరనీ హజ్ కొరకు పిలిచారు.

అల్లాహ్ మజాజ్ కుమార్తె ద్వారా ఇస్మాయీల్ (అ.స.)కు పన్నెండుగురు కుమారులను ఒసిగాడు.[9] వారి పేర్లు ఇలా ఉన్నాయి. నాబిత్ లేక నబాయూత్, ఖైదార్, అద్ బాయీల్, ముబ్‌షామ్, ముష్మా, దూమా, మీషా, హదద్, తైమా, యతూర్, నఫీస్, ఖైద్‌మాన్.

ఈ పన్నెండుగురు కుమారులతో పన్నెండు తెగలు ఉనికిలోనికి వచ్చాయి. వీరంతా మక్కాలోనే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరి ఉపాధి ఎక్కువగా యమన్, ఈజిప్ట్, సిరియాలతో వ్యాపారం చేయడంపైనే ఆధార పడింది. ఆ తరువాత ఈ తెగలు అరేబియా ద్వీపంలో వివిధ ప్రదేశాల్లో- ఇంకా చెప్పాలంటే - అరేబియా అవతల కూడా వ్యాపించాయి. నాబిత్, ఖైదార్ల సంతతి తప్ప తక్కిన తెగల వివరాలు, పరిస్థితులు కాలగర్భంలో కలసి పోయాయి.

నబ్తీల సంస్కృతి ఉత్తర హిజాజ్‌లో వికసించింది. వారు ఓ శక్తిమంత మైన ప్రభుత్వాన్ని స్థాపించి చుట్టుప్రక్కల ప్రజల్ని అధీనపర్చుకున్నారు. వారి రాజధాని నగరం బత్రాన్. ఎవ్వరూ వారిని ఎదిరించడానికి సాహసించే వారు కారు. ఆ తరువాత రోమనులు వచ్చి నబ్తీల పాలనను అంతమొందించారు.

9. ఖల్బ్ జజీరతుల్ అరబ్ పేజీ-32.

మౌలానా సయ్యద్ సులైమాన్ నద్వీ (రహ్మలై) ఈ విషయాన్ని లోతుగా పరిశోధించి, 'ఆలె గస్సాన్' మరియు 'అన్సార్' అంటే అవస్ మరియు ఖజ్రజ్‌లు ఖహ్‌తానీ అరబ్బులు కాదని, వీరు ఆ ప్రాంతంలో నాబత్ బిన్ ఇస్మాయీల్ (అ.స.) సంతతిలో మిగిలిపోయిన వారి సంతానమని రుజువు చేయడం జరిగింది.[10]

ఖైదార్ బిన్ ఇస్మాయీల్ (అ.స.) సంతతి మక్కాలోనే ఉండి వికాసం పొందుతూ ఉండి పోయింది. అద్నాన్, ఆ తరువాత అతని కుమారుడు మఅద్ కాలం వచ్చేసింది. అద్నానీ అరబ్బుల సంతతి వివరాలు ఖచ్చితంగా ఇప్పటి వరకు సురక్షితంగా ఉన్నాయి.

అద్నాన్, దైవప్రవక్త (సఅసం) వంశవృక్షంలో ఇరవై ఒకటవ తరానికి చెందినవాడు. కొన్ని ఉల్లేఖనాల్లో ఆయన (స) తన వంశవృక్షాన్ని గురించి చెబుతూ అద్నాన్ వరకు వెళ్ళి ఆగిపోయేవారనీ, ఇక ముందుకు సాగిపోయే వారు కాదనీ చెప్పడం జరిగింది. వంశవృక్ష నిపుణులు చెప్పింది తప్పని ఆయన (స) చెప్పేవారు.[11] అయితే విద్వాంసుల ఓ వర్గం, అద్నాన్ కంటే పైకి కూడా ఆయన వంశ వృక్షాన్ని చెప్పవచ్చు అని అంటోంది. వారు ఈ ఉల్లేఖనాన్ని జయీఫ్ (బలహీనం) అయినదిగా ఖరారు చేస్తారు. వీరి పరిశోధన ప్రకారం, అద్నాన్ మరియు హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) నడుమ నలభై తరాలున్నాయి.

మొత్తానికి మఅద్ కుమారుడు నజార్ - నజార్ తప్ప మఅద్‌కు వేరే - సంతానంలేదు. అతని ద్వారా ఎన్నో కుటుంబాలు ఉనికిలోనికి వచ్చాయి. నిజానికి నజార్‌కు నలుగురు కుమారులు. ప్రతి కుమారుడు ఓ పెద్ద తెగకు మూలపురుషుడయ్యాడు. ఈ నలుగురి పేర్లు ఇలా ఉన్నాయి: ఇయాద్, అన్మార్, రబీయా, ముజర్. వీరిలో చివరి రెండు తెగల శాఖలు, ఆ శాఖలకు ఉప శాఖలు అనేకం పెరిగిపోయాయి. కాబట్టి రబీయా ద్వారా అసద్ బిన్ రబీయా, గజ్జా, అబ్దుల్ ఖైస్, వాయిల్, బకర్, తగ్లబ్, బనూ హనీఫా వగైరాలు ఉనికిలోనికి వచ్చాయి. ముజర్ సంతానం రెండు పెద్ద తెగల్లో విడిపోయింది.

1. ఖైస్ ఈలాన్ బిన్ ముజర్. 2. ఇల్యాస్ బిన్ ముజర్.

ఖైస్ ఈలాన్ ద్వారా బనూ సలీం, బనూ హవాజిన్, బనూ గత్ఫాన్. గత్ఫాన్ ద్వారా అబస్, జీబాన్, అష్‌జా మరియు గనీ బిన్ ఆసుర్ తెగలు ఉనికిలోనికి వచ్చాయి.

10. చూడండి. తారీఖె అర్దుల్ ఖుర్ఆన్-2/78-86.

11. తిబ్రీ : తారీఖుల్ ఉమమ్ వల్ ములూక్-2 /191-194, అల్ ఎలామ్- 5/6.

ఇల్యాస్ బిన్ ముజర్ ద్వారా తమీమ్ బిన్ ముర్రా, హుజైల్ బిన్ ముద్రికా, బనూ అసద్ బిన్ హుజైమా తెగలు పుట్టాయి. కినానా ద్వారా ఖురైష్ తెగ ఉనికి లోనికి వచ్చింది. ఈ తెగ ఫహర్ బిన్ మాలిక్ బిన్ నస్ర్ బిన్ కినానా సంతానం.

ఖురైష్ కూడా వివిధ శాఖల్లో విడిపోయారు. ప్రసిద్ధ ఖురైషీ శాఖల పేర్లు ఇలా ఉన్నాయి: జమ్‌హా, సహమ్, అద్దీ, మగ్జూమ్, తైమ్, జుహ్రా మరియు ఖుస్సై బిన్ కిలాబ్ కుటుంబాలు. అంటే అబ్దుద్దార్, అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా మరియు అబ్దె మునాఫ్‌లన్న మాట. ఈ ముగ్గురు ఖుస్సై కుమారులు. వీరిలో అబ్దె మునాఫ్‌కు నలుగురు కొడుకులు. వీరి ద్వారా ఉపశాఖలు ఉనికిలోనికి వచ్చాయి. అంటే అబ్దెషమ్స్, నౌఫిల్, ముత్తలిబ్ మరియు హాషిమ్. ఈ హాషిమ్ వంశం నుండే అల్లాహ్ మహాప్రవక్త ముహమ్మద్ (స)ను ఎంచుకున్నాడు.[12]

దైవప్రవక్త (స) ప్రవచనం ఇలా ఉంది:

"అల్లాహ్ ఇబ్రాహీం (అ.స.) సంతానం నుండి ఇస్మాయీల్ (అ.స.) ను ఎన్నుకున్నాడు. తరువాత ఇస్మాయీల్ (అ.స.) సంతానం నుండి కినానాను ఎంపిక చేశాడు. కినానా సంతతి నుండి ఖురైష్‌ను ఎన్నుకున్నాడు. ఖురైష్ నుండి బనూ హాషిమ్‌ను ఎంచుకున్నాడు. బనూ హాషిం నుండి నన్ను ఎంచు కున్నాడు."[13]

ఇబ్నె అబ్బాస్ కథనం ప్రకారం, దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ సృష్టి రచన చేసి నన్ను అతి మేలైన వర్గంలో పుట్టించాడు. రెండు మేలు వర్గాల్లోనూ మిన్న అయిన వర్గంలో ఉంచాడు. తెగలను ఎంచు కున్నప్పుడు నన్ను అన్నిటికంటే మేలైన తెగలో చోటిచ్చాడు. వంశాలను ఎంపిక చేసినప్పుడు నన్ను అతి మేలైన వంశంలో పుట్టించాడు. కాబట్టి నేను నా వ్యక్తిత్వం రీత్యా కూడా అందరికంటే మేలైనవాణ్ణి మరియు వంశం రీత్యా అందరికంటే మిన్న అయిన వంశం వాణ్ణి.[14]

మొత్తానికి అద్నాన్ వంశం బాగా వృద్ధిచెందినప్పుడు అన్నపానీయాల సముపార్జన వేటలో అరేబియాలోని వివిధ ప్రాంతాల్లో వ్యాపించింది. ఉదాహ రణకు అబ్దుల్ ఖైస్ తెగ, బక్ర్ బిన్ వాయిల్‌కు చెందిన అనేక శాఖలు మరియు బనూ తమీమ్ కుటుంబాలు బహ్‌రైన్ వైపునకు బయలుదేరి వెళ్ళాయి. ఆ ప్రాంతంలోనే స్థిరపడ్డాయి.

12. ముహాజిరాతె ఖిజ్రీ-1/14-15.

13. సహీ ముస్లిం-2/245; జామె తిర్మిజీ-2 /201.

14. తిర్మిజీ-2/201.

బనూ హనీఫా బిన్ సఅబ్ బిన్ అలి బిన్ బక్ర్ యమామా వైపునకు వెళ్ళి దాని కేంద్ర ప్రాంతమైన 'హిజ్ర్'లో స్థిరపడిపోయారు.

బక్ర్ బిన్ వాయిల్‌కు చెందిన మిగిలిన శాఖలు యమామా నుండి బహ్రైన్, 'కాజిమా తీరం', 'అఖాతం', 'సువాదె ఇరాఖ్', 'ఉబ్లా' మరియు 'హైత్' వరకు వ్యాపించి ఉన్న ప్రాంతాల్లో స్థిరపడ్డాయి.

బనూ తగ్లబ్ ఫరాతియా దీవిలో స్థిరపడింది. అయితే దానికి చెందిన కొన్ని శాఖలు బనూ బక్ర్ తెగ వెంట ఉండిపోయాయి.

బనూ తమీమ్ బాదియా బస్రాలో స్థిరపడింది.

బనూ సలీం మదీనా దాపున విడిది చేసింది. వారి నివాస ప్రాంతం వాదియుల్ ఖుర్అ (ఖుర్అ లోయ) మొదలుకొని ఖైబర్, మదీనాకు తూర్పు భాగం అయిన హుర్రా బనూ సలీం ప్రక్కనే ఉన్న రెండు కొండల వరకు విస్తరించింది.

బనూ సఖీఫ్ తెగవారు తాయిఫ్‌లో ఉండిపోయారు. బనూ హవాజిన్ మక్కా తూర్పున అవుతాస్ లోయకు చుట్టుపట్ల విడిది చేశారు. వీరి నివాస స్థలం మక్కా - బస్రా రాజమార్గంపై ఉండింది.

బనూ అసద్ తైమాకు తూర్పున మరియు కూఫాకు పశ్చిమాన స్థిర పడ్డారు. వీరి నివాసానికి తైమాకు నడుమ బనూ తైకు చెందిన ఓ తెగ బహ్తుర్ కూడా ఉండేది. బనూ అసద్ నివసించిన ప్రాంతానికి, కూఫాకు నడుమ ప్రయాణ దూరం అయిదు రోజులు.

బనూ జుబ్యాన్ తెగవారు తైమాకు దరిదాపులోవున్న 'హౌరాన్' చుట్టు ప్రక్కల స్థిరపడ్డారు.

తిహామాలో బనూ కినాన వంశం ఉండి పోయింది. వారిలో ఖురైషీ వంశం మక్కా మరియు ఆ చుట్టుపట్ల నివాసమేర్పర్చుకుంది. వీరు సంఘటితంగా ఉండకుండా దేశదిమ్మరుల్లా తిరిగేవారు. చివరికి ఖుస్సై బిన్ కిలాబ్ ఖురైషీలందరిని సంఘటితం చేసి వారికి గౌరవాన్నీ, ఔన్నత్యాన్నీ కల్పించాడు.[15]

15. ముహాజిరతె ఖిజ్రీ-1/15,16.





అరబ్బు రాజ్యాలు - నాయకత్వాలు

అరబ్బు రాజ్యాలు - నాయకత్వాలు

ఇస్లామ్ ఆవిర్భావానికి పూర్వం గల అరేబియా పరిస్థితులను చర్చించుకునేటప్పుడు అచటి పాలనలు, నాయకత్వాలు, మతాలను గురించిన ఓ స్థూల చర్చ కూడా జరగడం సమంజసమేమో. దీని ద్వారా ఇస్లామ్ శుభోదయమయ్యేటప్పుడు ఉన్న పరిస్థితి ఏమిటో సులభంగా గ్రహించడానికి వీలు పడుతుంది.

అరేబియా ద్వీపంపై ఇస్లామ్ భానుకిరణాలు ప్రసరించినప్పుడు, అక్కడ రెండు రకాల పాలకులు ఉండేవారు. వారిలో ఒకరు కిరీటధారులైన రాజులు. వారు పూర్తిగా స్వతంత్రులుగా, సార్వభౌములుగా ఉన్న రాజులు కారు. రెండో రకం పాలకులు అక్కడి తెగల సర్దారులు. వీరు అధికారాలు, గౌరవప్రతిపత్తుల్లో కిరీటధారులైన రాజులకంటే ఏమీ తీసిపోయేవారు కాదు. పైగా వీరు పూర్తిగా స్వతంత్రులు, సార్వభౌమాధికారం గలవారు. కిరీటధారులైన రాజుల్లో యమన్ రాజులు, ఆలె గస్సాన్ రాజులు (సిరియా), హీరా రాజులు (ఇరాఖ్). మిగిలిన అరబ్బు పాలకులంతా కిరీటధారులు కారు.

యమన్ రాచరికం

ఆరిబా అరబ్బుల్లో తెలిసిన అతి పురాతన జాతి 'సబా' జాతి ఒక్కటే. ఉర్ (ఇరాఖ్)లో బయటపడ్డ శిలాశాసనాల్లో, క్రీస్తుకు పూర్వం రెండు వేల సంవత్సరాల క్రితం దాని గురించిన వివరాలు లభ్యమయ్యాయి. అయితే, సబా జాతి అభివృద్ధి వికాసాల కాలం క్రీస్తుకు పూర్వం పదకొండు వందల ఏళ్ళ నుండి ప్రారంభం అయింది. దాని చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన శకాలు ఇలా ఉన్నాయి.

1. క్రీ.పూ. 650వ సంవత్సరం నుండి మొదటి శకం ప్రారంభ మయింది. ఈ శకంలో సబా రాజుల బిరుదు 'మక్రబె సబా' అని ఉండేది. వారి రాజధాని సర్వాహ్ నగరం. ఈ రాజధాని శిథిలాలు నేటికీ మారిబ్ నగరానికి పశ్చిమాన

ఒక రోజు ప్రయాణ దూరంలో ఉన్నాయి. ఇవి ఖరీబా పేరున ఖ్యాతి నొందాయి. ఈ శకంలోనే మారిబ్ నగరానికి చెందిన ప్రసిద్ధమైన ఆనకట్ట పునాదులు వేయబడ్డాయి. యమన్ చరిత్రలో దీనికి గొప్ప ప్రాముఖ్యత ఉంది. ఈ కాలంలోనే సబా సామ్రాజ్యానికి వృద్ధివికాసాలు లభించాయియని, వారు అరేబియాలోనూ, అరేబియాకు అవతల కూడా తమ క్రొత్త ఆవాసాలను నిర్మించుకున్నారు.

2. క్రీ.పూ. 650 నుండి 115 సంవత్సరాల వరకు సాగిన శకంలో సబా రాజులు తమ బిరుదైన 'మక్రబ్'ను విడనాడి క్రొత్త బిరుదు 'మలిక్' (చక్రవర్తి)గా పెట్టుకున్నారు. సర్వాహ్‌కు బదులు మారిబ్‌ను తమ రాజధానిగా చేసుకొని పరిపాలించారు. ఈ నగరం శిథిలాలు నేటికీ 'సన్ఆ'కు తూర్పున అరవై మైళ్ళ దూరాన ఉన్నాయి.

3. క్రీ.పూ. 115 నుండి క్రీ.శ. 300 వరకు సాగిన శకంలో సబా సామ్రాజ్యంపై హిమైర్ తెగకు అధికారం లభించింది. అది మారిబ్‌కు బదులు 'రైదాన్'ను తమ రాజధాని నగరంగా చేసుకొని పరిపాలించింది. ఆ తరువాత రైదాన్ పేరు కాస్తా జిఫార్‌గా మారిపోయింది. దీని శిథిలాలు నేటికీ యరీమ్ నగరం సమీపాన ముదవ్వర్ కొండపై కనబడతాయి.

ఈ శకం నుండే సబా సామ్రాజ్య పతనం ఆరంభమైంది. మొదట నబ్తీలు ఉత్తర హిజాజ్‌పై తమ అధికారాన్ని నెలకొల్పుకొని సబా జాతిని వారి క్రొత్త ఆవాసాల నుండి వెళ్ళగొట్టారు. ఆ తరువాత రోమనులు ఈజిప్ట్, సిరియా, ఉత్తర హిజాజ్‌లను ఆక్రమించుకొని వ్యాపారం చేసుకునేవారి సముద్ర మార్గాలను మూసివేశారు. ఇలా వారి వ్యాపారం క్రమక్రమంగా క్షీణించి పూర్తిగా దెబ్బతినిపోయింది. అటు ఖహ్తానీ తెగలు పరస్పరం కలహించుకో సాగాయి. ఈ పరిస్థితుల ఫలితంగా ఖహ్తానీ తెగలు తమ ప్రాంతాలను వదిలేసి దేశదిమ్మరులై తిరుగనారంభించారు.

4. క్రీ.శ. 300వ సంవత్సరం నుండి ఇస్లామ్ ధర్మం ప్రారంభకాలం వరకు సాగిన శకంలో యమన్‌లో అశాంతి, అరాచకం రాజ్యమేలింది. విప్లవాలు వచ్చాయి. అంతర్యుద్ధాలు జరిగాయి. విదేశీ జాతులు హస్తక్షేపం చేయడానికి మార్గం సుగమమైంది. చివరికి యమన్‌వాసుల స్వాతంత్ర్యం హరించబడే రోజు కూడా వచ్చేసింది. ఈ శకంలోనే రోమనులు అద్నాన్‌పై సైనికాధికారాన్ని

నెలకొల్పారు. హమీర్ మరియు హమ్దానుల మధ్య గల కలహాలను ఆసరాగా చేసుకొని రోమనుల అండదండలతో అబీసీనియనులు, క్రీ.శ. 340లో మొదటిసారిగా యమన్‌ను వశపర్చుకున్నారు. వీరి అధికారం క్రీ.శ. 378 వరకు కొనసాగింది. ఆ తరువాత యమన్ స్వాతంత్ర్యం తిరిగి పునరుద్ధరించబడినప్పటికీ మారిబ్ నగరంలోని ప్రసిద్ధ ఆనకట్టలో బీటలు పడనారంభించాయి. చివరికి అది క్రీ.శ. 450 లేదా 451వ సంవత్సరంలో తెగిపోయింది. ఫలితంగా వచ్చిన వరదల వల్ల అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. ఆ భయానక వరదలు 'సైలెఇరమ్' గా ఖుర్ఆన్‌లో సూరె 'సబా'లో ప్రస్తావించబడింది. ఈ వరదల్లో అనేక తెగలు చెల్లాచెదురైపోయాయి.

ఆ తరువాత తిరిగి క్రీ.శ.523లో ఘోరమైన మరో ప్రమాదం ముంచుకొచ్చింది. అదేమిటంటే, యమన్‌కు చెందిన యూదు రాజు 'జూనవాస్' నజ్రాన్ క్రైస్తవులపై భీకరమైన దాడి చేసి వారిని క్రైస్తవ మతం వదిలిపెట్టడానికి బలవంతపెట్టాడు. వారు దాన్ని అంగీకరించకపోవడంతో, జూనవాస్, అగ్ని గుండాలు రగిల్చి అందులో వారిని మూకుమ్మడిగా పడవేసి కాల్చి చంపాడు. దివ్య ఖుర్ఆన్ బురూజ్ సూరాలో ఈ భయంకరమైన మారణకాండకు సంబంధించిన సూచన ఇవ్వడం జరిగింది. ఈ సంఘటన ఫలితంగా, ఇదివరకే రోమను బాదుషాల అండదండలతో అరేబియాను వశపర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్న క్రైస్తవం, యూదుల ఆగడాల పగ తీర్చుకోవడానికి అబీసీనియా నీగ్రోలను యమన్‌పై దండెత్తడానికి ప్రోత్సహిస్తూ వారికి నౌకాదళాన్ని సమకూర్చింది. అబీసీనియనులు రోమనుల సహాయంతో క్రీ.శ. 525లో 'అరియాత్' నాయకత్వంలో డెబ్భై వేల సైన్యంతో యమన్‌ను తిరిగి వశపర్చుకున్నారు. ఆ ఆక్రమణలో ప్రథమ ఘట్టంగా అబీసీనియా రాజుకు గవర్నరుగా 'అరియాత్' యమన్‌ను పాలించాడు. అయితే ఆ తరువాత ఆ సైన్యానికి చెందిన ఓ క్రింది స్థాయి కమాండరు 'అబ్రహా' అతణ్ణి హతమార్చి అధికారాన్ని చేపట్టాడు. అబీసీనియా రాజును తన ఈ నిర్వాకానికి సంతృప్తి పడేటట్లు చేశాడు.

ఇతనే కాబా గృహాన్ని పడగొట్టే ప్రయత్నం చేసిన 'అబ్రహా'. ఓ పెద్ద సైన్యమే కాక ఏనుగుల్ని కూడా దండెత్తడానికి వెంట తీసుకొచ్చిన కారణంగా ఈ సైన్యపటాలం 'అస్హాబె ఫీల్' (ఏనుగుల దండు)గా ప్రఖ్యాతిగాంచింది.

ఫీల్ సంఘటనలో అబీసీనియన్లకు పట్టిన గతి ద్వారా ప్రయోజనం పొందుతూ యమన్ ప్రజలు పర్షియా రాజు సహాయంతో అబీసీనియన్లకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభమైంది. ఇలా 'సైఫ్‌జీ యజన్' కుమారుడు మఅద్ యక్రబ్ నాయకత్వంలో అబీసీనియనులను దేశం నుండి పారద్రోల గలిగారు. ఓ స్వతంత్ర జాతిగా వారు 'మఅద్ యక్రబ్'ను తమ రాజుగా ఎన్నుకోవడం జరిగింది. ఇది క్రీ.శ. 575లో జరిగిన సంఘటన.

స్వాతంత్ర్యం వచ్చాక 'మఅద్ యక్రబ్' కొందరు అబీసీనియనులను తన సేవ కోసం, మరికొందరిని రాచదర్పం కోసం తన వెంట ఉంచుకోవడం జరిగింది. అయితే ఇది అతని పాలిట శాపమైంది. ఓ రోజు వారు మోసం చేసి మఅద్ యక్రబ్‌ను హత్యచేసి జీయజన్ కుటుంబం నుంచి అధికార దీపాన్ని శాశ్వతంగా ఆర్పివేశారు. ఇటు కిస్రా (పర్షియా చక్రవర్తి) పరిస్థితిని ఆసరాగా తీసుకొని 'సన్‌ఆ'ను వశపర్చుకొని అక్కడ ఓ పర్షియా జాతి గవర్నరును నియమించి యమన్‌ను పర్షియాకు చెందిన ఓ రాజ్యంగా ప్రకటించాడు. ఆ తరువాత యమన్‌లో పర్షియాకు చెందిన గవర్నర్లు ఒకరి తరువాత ఒకర్ని నియమించడం జరిగింది. చిట్టచివరి గవర్నరు బాజాన్, క్రీ.శ. 628లో ఇస్లామ్ స్వీకరించాడు. దానితో యమన్ పర్షియా అధికారం నుండి బయటపడి ఇస్లాం సామ్రాజ్యంలో చేరిపోయింది.[1]

హీరా రాచరికం

ఇరాఖ్, దాని చుట్టుప్రక్కల ప్రాంతంపై 'కోర్‌విష్ కబీర్' (కోరస్ లేక సైరస్ జుల్ కర్నైన్ క్రీ.పూ. 557 -529) కాలం నుండే పర్షియనుల అధికారం సాగుతూ ఉండేది. అది శక్తిమంతమైన సామ్రాజ్యం గనక దాన్ని ఎదిరించే ధైర్యం ఎవరికీ లేకపోయింది. చివరికి క్రీ.పూ. 326లో మెసిడోనియాకు చెందిన 'అలెగ్జాండర్', మొదటి 'దారా'ను ఓడించి పర్షియనులను నిర్వీర్యం చేశాడు. ఫలితంగా దేశం

1. *సయ్యద్ సులైమాన్ నద్వి తన గ్రంథం తారీఖ్ అర్దె ఖుర్‌ఆన్ 1/133 నుండి గ్రంథం చివరి వరకు అనేక చారిత్రక ఆధారాల వెలుగులో సబా జాతి గురించిన వివరాలు ఎంతో వివరంగా రాశారు. మౌలానా మౌదూది (రహ్మాలై) తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ 4/195-198లోను కొన్ని వివరాలను ఏకరువుపెట్టారు. అయితే చారిత్రక ఆధారాలు, శకాల విషయంలో అభిప్రాయభేదాలున్నాయి. కొందరు పరిశోధకులు మాత్రం ఈ వివరాలను కట్టుకథలుగా ఖరారు చేశారు.*

ముక్కచెక్కలైపోయి రాజకీయ అస్థిరత ఏర్పడింది. ఈ అస్థిరత క్రీ.శ. 230 వరకు కొనసాగింది. ఈ కాలంలోనే ఖహ్‌తానీ తెగలు దేశాన్ని వదిలి ఇరాఖ్‌కు సంబంధించిన సారవంతమైన సరిహద్దు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆ తరువాత 'అద్‌నానీ' కాందిశీకులు వచ్చి పోరాడి ఫరాతియా దీవిని తమ స్థిరనివాసంగా ఏర్పర్చుకున్నారు.

ఇటు క్రీ.శ. 226లో 'అర్దషీర్' సాసానీ రాజ్యస్థాపన చేసినప్పుడు పారశీకులు తమ బలాన్ని క్రమక్రమంగా పుంజుకోనారంభించారు. అర్దషీర్ పర్షియనులను సంఘటితం చేసి తన దేశ సరిహద్దుల్లో ఉన్న అరబ్బులను ఓడించాడు. దీని ఫలితంగానే 'ఖుజాఅ' తెగ సిరియా వైపునకు వెళ్ళిపోయింది. 'హీరా' మరియు 'అంబార్' అరబ్బులు కప్పం కట్టడానికి సిద్ధపడ్డారు.

అర్దషీర్ పరిపాలనా కాలంలో బాదియతుల్ అరబ్ మరియు ద్వీపానికి చెందిన రబీయా, ముజరీ తెగలపై జజీమతుల్ వజాహ్ పెత్తనం సాగుతూ ఉండేది. బహుశా అరబ్బులపై నేరుగా పరిపాలన సాగించడం, వారిని సరిహద్దుల దోపిడీల నుండి వారించడం సాధ్యం కాదని, వారి తెగలోనే బాగా పలుకుబడి ఉన్న నాయకుణ్ణి పాలకునిగా చేస్తే తప్ప ఇది సాధ్యమయ్యే విషయం కాదని అర్దషీర్ తలచి ఉండవచ్చు. దీని వల్ల ఓ ప్రయోజనం కూడా ఉంది. అవసరమైనప్పుడు రోమనులకు వ్యతిరేకంగా వారి సహాయాన్ని తీసుకోవచ్చు. అదే కాకుండా సిరియాకు చెందిన రోమ్ అనుయాయ అరబ్బులకు వ్యతిరేకంగా వీరిని నిలబెట్టనూవచ్చు. హీరా రాజుల వద్ద పర్షియా సైన్యపు ఓ విభాగం ఎల్లప్పుడూ ఉండేది. ఇది దోపిడీలకు పాల్పడుతూ ఎడారిలో తిరిగే అరబ్బులను అణచివేస్తూ ఉండేది.

సుమారు క్రీ.శ. 268లో జజీమా మరణించాడు. అతని స్థానంలో అమ్రూ బిన్ అద్దీ బిన్ నస్ర్ లక్మీ పట్టాభిషిక్తుడయ్యాడు. ఇతను లక్మ్ తెగకు చెందిన మొదటి పాలకుడు. ఇతను షాపూర్, అర్దషీర్ల సమకాలికుడు. ఇతని తరువాత ఖుబాజ్ బిన్ ఫిరోజ్ పరిపాలనా కాలం వరకు హీరాపై లక్మీల ఎడతెగని పాలన కొనసాగింది. ఖుబాజ్ కాలంలో 'ముజ్దక్' పైకి వచ్చాడు. ముజ్దక్ 'అబాహి' మత (ఒక విధమైన భౌతికవాదం) అనుయాయి. ఖుబాజ్, అతనికి సంబంధించిన అనేకులు ముజ్దక్‌ను అనుసరించారు. ఆ తరువాత ఖుబాజ్, హీరా రాజైన 'మున్జర్ బిన్ మాఉస్సమా'కు లేఖ రాస్తూ ఈ మతాన్నే

అవలంబించమని సందేశం పంపించాడు. మున్జర్ గొప్ప ఆత్మాభిమాని అయి నందున దీన్ని నిరాకరించాడు. ఫలితంగా ఖుబాజ్ అతణ్ణి పదవీచ్యుతునిగా చేసి అతని స్థానంలో ముజ్దక్ మతావలంబీకుడైన 'హారిస్ బిన్ అమ్రూ బిన్ హిజ్ర్ కిందీ' ని హీరాకు రాజుగా చేశాడు.

ఖుబాజ్ తరువాత పర్షియా పగ్గాలు 'కిస్రా నౌషీర్వాన్' చేతికి వచ్చాయి. అతనికి ఈ మతం అంటే గిట్టదు. అతను ముజ్దక్‌ను, అతని అనుయాయులు అనేక మందిని చంపించాడు. మున్జర్‌ను తిరిగి హీరా పాలకునిగా చేసి హారిస్ బిన్ అమ్రూను బంధించి తెమ్మని ఆదేశాలిచ్చాడు. అయితే అతను బనూ కల్బ్ తెగకు చెందిన ప్రాంతానికి పారిపోయి అక్కడనే తన శేష జీవితాన్ని గడిపాడు.

మున్జర్ బిన్ మాఉస్సమా తరువాత నోమాన్ బిన్ మున్జర్ కాలం వరకు హీరా పాలన, ఆయన వంశంలోనే కొనసాగుతూ వచ్చింది. తదుపరి జైద్ బిన్ అద్దీ అనేవాడు నోమాన్ బిన్ మున్జర్‌కు వ్యతిరేకంగా కిస్రాకు అబద్ధాలు నూరి పోయడం వలన కిస్రా అగ్గి మీద గుగ్గిలమై నోమాన్‌ను తన దర్బారుకు పిలిపించాడు. నోమాన్ ఎవ్వరికీ తెలియకుండా బనూ షైబాన్ సర్దారైన హాని బిన్ మస్ఊద్ వద్దకు వెళ్ళి తన కుటుంబ సభ్యుల్ని, సంపదను అతని వద్ద అమానతుగా ఉంచి కిస్రా వద్దకు వెళ్ళాడు. కిస్రా అతణ్ణి ఖైదు చేయగా ఖైదీగానే అతను మరణించాడు.

కిస్రా, నోమాన్‌ను ఖైదు చేసిన తరువాత అతని స్థానంలో 'ఇయాస్ బిన్ ఖబీసా తాయీ'ని పాలకునిగా చేసి, హాని బిన్ మస్ఊద్ నుండి నోమాన్ అమానతును తీసుకురమ్మని ఆదేశించాడు. హాని ఆత్మాభిమాని కావడం వలన అమానతు ఇవ్వనని నిరాకరించడమే కాకుండా యుద్ధం ప్రకటించాడు. ఇంకేముంది! ఇయాస్ తన వెంట కిస్రా సైన్యాన్ని, సరిహద్దు రాష్ట్రాల గవర్నర్లను వెంటబెట్టుకొని బయలుదేరాడు. 'జీఖార్' యుద్ధ మైదానంలో ఇరు సేనల నడుమ భీకర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో బనూషైబాన్ విజయం పొందాడు. పారసీకులు ఘోరపరాజయం పాలయ్యారు. అరబ్బులు అరబ్బేతరులపై విజయం సాధించిన మొట్టమొదటి సంఘటన ఇది. ఈ సంఘటన దైవప్రవక్త (స) జన్మించిన కొన్ని రోజుల తరువాత జరిగింది. ఆయన (స) 'ఇయాస్' హీరాకు రాజైన ఎనిమిదవ నెలలో జన్మించారు.

ఇయాస్ తరువాత కిస్రా 'హీరా' పాలన కోసం ఓ పర్షియా పాలకుణ్ణి

నియమించాడు. అయితే క్రీ.శ. 632లో 'లఖ్మీ'లు తిరిగి అధికారంలోనికి వచ్చేశారు. మున్జిర్ బిన్ మారూర్ తెగకు చెందిన ఓ వ్యక్తి హీరా పాలకుడయ్యాడు. కాని ఇతను అధికారంలోనికి వచ్చిన ఎనిమిది నెలలలోనే హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజిఅన్) ఇస్లాం సైన్యంతో హీరాలో ప్రవేశించారు.

సిరియా రాచరికం

అరబ్బు తెగలు విరివిగా వలసపోయే కాలంలో, 'ఖుజాఅ' తెగకు చెందిన కొన్ని శాఖలు సిరియా సరిహద్దుల్లోకి వెళ్ళి అక్కడ స్థిరపడ్డాయి. వీరు 'బనీ సలీం బిన్ హల్వాన్'కు సంబంధించినవారు. వారిలోనే ఓ తెగ బనూ జజ్అమ్ బిన్ సలీం ఒకటి. ఇది 'జజాయిమా'గా పేరుగాంచింది. ఖుజాఅకు చెందిన ఈ శాఖను రోమనులు, అరేబియా ఎడారికి చెందిన బిద్దూల (పామరుల) దోపిడీని అడ్డుకోవడానికి, పర్షియనులకు వ్యతిరేకంగా వాడుకోవడానికి అండదండలను అందిస్తూ, ఈ శాఖకు చెందిన ఓ వ్యక్తినే పాలకునిగా ప్రకటించారు. ఆ తరువాత చాలా కాలం వరకు ఈ పాలన కొనసాగింది. వీరిలో ప్రఖ్యాతిగాంచిన రాజు "జయ్యాద్ బిన్ హెవలా." జజాయిమా పరిపాలనా కాలం పూర్తిగా క్రీ.శ. రెండవ శతాబ్దం వరకు కొనసాగిందని అంచనావేయడం జరిగింది. ఆ తరువాత ఈ రాజ్యం 'ఆలె గస్సాన్" హస్తగతమై జజాయిమా పరిపాలన పూర్తిగా అంతమైపోయింది. ఆలె గస్సాన్, బనూ జజ్అమ్‌ను ఓడించి పూర్తి రాజ్యాన్ని వశపర్చుకున్నారు. ఈ పరిస్థితిని గమనించిన రోమనులు, వారినే జజాయిమా స్థానంలో సిరియాలోని అరబ్బులకు రాజుగా గుర్తించారు. ఆలె గస్సాన్ రాజధాని 'దూమతుల్ జందల్'. రోమనుల కీలుబొమ్మలుగా ఆలె గస్సాన్ సిరియాను పాలిస్తూ వచ్చారు. చివరికి ఉమర్ (ర) గారి ఖిలాఫత్ హి.శ. 13లో యర్మూక్ యుద్ధంలో ఆలె గస్సాన్ చివరి రాజు అయిన 'జబ్లా బిన్ అయిహం' ఇస్లామ్ స్వీకరించాడు.[2] ఇతని గర్వం ఇస్లామీయ సమానత్వ సిద్ధాంతాన్ని భరించక తిరిగి అతను ఇస్లామ్ ధర్మాన్ని విడిచిపెట్టాడు.

హిజాజ్ రాచరికం

మక్కాలో హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) కాలం నుండే ప్రజలు వచ్చి స్థిర పడిన విషయం మనకు తెలిసినదే. ఆయన 137 సంవత్సరాల వరకు

---

2. *ముహాజిరాత్ ఖిజ్రీ-1/34; తారీఖ్ అర్దుల్ ఖుర్ఆన్-2/80-82.*

జీవించారు.[3] బ్రతికి ఉన్నంత వరకు బైతుల్లా (కాబా గృహం) సంరక్షకులుగా ఉన్నారు[4]. ఆయన తరువాత ఆయన కుమారులు 'నాబిత్', ఆ తరువాత ఖైదార్, తదుపరి నాబిత్, ఒకరి తరువాత మరొకరు మక్కాకు పాలకులుగా ఉంటూ వచ్చారు. వారి తరువాత 'నానాముజాజ్ బిన్ అమ్రూ జుర్హమీ' పాలనా పగ్గాలను తన చేతిలోనికి తీసుకున్నాడు. ఇలా మక్కా పాలన బనూ జుర్హుమ్ చేతిలోనికి వచ్చింది. చాలా కాలం వరకు అధికారం వారి చేతుల్లోనే ఉండి పోయింది. హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) (తన తండ్రిగారైన ఇబ్రాహీం (అ.స.)తో కలిసి) బైతుల్లాహ్‌ను నిర్మించారు కాబట్టి ఆయన సంతానానికి గౌరవ స్థానం దక్కుతూ వచ్చింది. అయితే అధికారంలో మాత్రం వారికి ఎలాంటి ప్రమేయం లేకపోయింది.[5]

అలా కాలం గడిచినకొద్దీ హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) సంతానం మరుగున పడుతూ వచ్చింది. చివరికి 'బుఖ్తనస్సర్' పైకి వచ్చిన కొంతకాలానికి పూర్వమే బనూ జుర్హుమ్ శక్తి క్షీణించి, మక్కా దిఙ్మండలంపై అద్నాన్ రాజకీయ నక్షత్రం ప్రకాశించసాగింది. దీనికి ఆధారం ఏమిటంటే బుఖ్తనస్సర్, జాతె ఇరాఖ్‌లో అరబ్బులతో చేసిన యుద్ధంలో అరబ్బుల సైన్యాధ్యక్షుడు జుర్హుం తెగకు సంబంధించినవాడు కాకపోవడం.[6]

తరువాత బుఖ్తనస్సర్ క్రీ.పూ. 587లో మరో దాడి చేసినప్పుడు బనూ అద్నాన్ వంశం వారు పారిపోయి యమన్ చేరారు. ఆ కాలంలో బనీ ఇస్రాయీల్‌కు హజ్రత్ యర్మియాహ్ ప్రవక్తగా ఉండేవారు. ఆయన అద్నాన్ కుమారుడు 'మఅద్'ను తోడ్కొని సిరియా దేశానికి వెళ్ళారు. బుఖ్త నస్సర్ శక్తి క్షీణించిన తరువాత ఆయన మఅద్‌తో కలిసి మక్కా వచ్చారు. అప్పుడు మక్కాలో జుర్హుమ్‌కు చెందిన 'జర్షుమ్ బిన్ జుల్‌హమా' అనే ఓ వ్యక్తి కలిశాడు. మఅద్ అతని కుమార్తె 'ముఅనా'ను పెళ్ళాడాడు. ఆమె గర్భాన 'నజార్' జన్మించాడు.[7]

---

3. *బైబిల్ పాత నిబంధన-25 : 17.*
4. *ఖల్బ్ జజీర అరబ్ -పేజీ-230, 237.*
5. *ఇబ్నె హష్షామ్-1/111-113, ఇస్మాయీల్ (అ.స.) సంతానంలో కేవలం నాబిత్ కాబా గృహం సంరక్షణ గురించే రాశాడు.*
6. *ఖల్బ్ జజీరతుల్ అరబ్-పేజీ. 230.*
7. *రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/48.*

కాలం గడిచిన కొద్దీ జుర్హుమ్ పరిస్థితులు విషమించనారంభించాయి. దారిద్ర్యం అలుముకున్న ఫలితంగా వారు హజ్‌యాత్రికులపై విరుచుకుపడి అన్యాయాలు చేయసాగారు. దైవ గృహానికి చెందిన సంపదను కూడా కాజేయ నారంభించారు.[8] ఇటు బనీ అద్నాన్ వారి ఆగడాలను భరించలేక లోలోనే బాధపడుతూ ఉండేవారు. 'బనూ ఖుజాఅ', ముర్రజ్జహ్రాన్‌కు వచ్చినప్పుడు, బనూ అద్నాన్, బనూ జుర్హుమ్ ఎడల కోపోద్రిక్తులైన విషయం గ్రహించాడు. వీరి కోపతాపాల ప్రయోజనం పొందుతూ అద్నానీ తెగ (బనూ బక్ర్ బిన్ అబ్దె మునాఫ్ బిన్ కనానా)ను వెంటబెట్టుకొని బనూ జుర్హుమ్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించాడు. బనూజుర్హుమ్‌ను మక్కా నుండి గెంటివేసి అధికారం చేజిక్కించుకున్నాడు. ఈ సంఘటన క్రీ.శ. 200 మధ్యకాలం నాటిది.

బనూ జుర్హుమ్ మక్కాను వదిలి వెళ్ళేటప్పుడు 'జమ్‌జమ్' బావిలో అనేక చారిత్రక ఆధారాలను పడవేసి పూడ్చి దాన్ని నామరూపాల్లేకుండా చేశారు. ముహమ్మద్ బిన్ ఇస్హాక్ కథనం ప్రకారం, జుర్హుమ్ తెగకు చెందిన అమ్రూ బిన్ హారిస్ బిన్ మజాజ్[9] దైవగృహం కాబాకు చెందిన రెండు బంగారు లేళ్ళు,[10] కాబా మూలన పొదిగి ఉన్న రాయి - హజ్రె అస్వద్-ను తీసి జమ్‌జమ్ బావిలో పూడ్చేసి తన తెగతో సహా యమన్ వెళ్ళిపోయాడు. మక్కా నుండి వెళ్ళగొట్ట బడడం, అక్కడి పాలన అంతమైపోవడం గురించి బనూ జుర్హుమ్ వారు చాలా బాధపడేవారు. వారు తరచు ఈ గీతాన్ని ఆలపించేవారు.

"హజూన్ నుండి సఫా వరకు తెలిసినవాడెవ్వడూ కనబడడం లేదు. ఏ కథకుడూ మా విషయంలో కథలను వల్లించేవాడుగా కానరావడం లేదు. మేము అచ్చటి పౌరులమే అయినా మా దురదృష్టం, కాలచక్రం మమ్మల్ని పూర్తిగా అక్కడి నుండి పెకిలి వేసింది."[11]

---

8. *ఖల్బ్ జజీరతుల్ అరబ్-పేజీ. 231.*
9. *ఇతను, హజ్రత్ ఇస్మాయీల్ (అ.స) గారి చరిత్రలో చెప్పబడిన మజాజ్ జుర్హుమీ కాదు.*
10. *మస్ఊది తన గ్రంథంలో రచించినట్లుగా, పర్షియా రాజులు దైవగృహం కాబా కోసం తరచు ధన సంపద, వజ్రవైఢూర్యాలు కానుకగా పంపిస్తూ ఉండేవారు. సాసాన్ బిన్ బాబక్ బంగారంతో పోత పోసిన రెండు లేళ్ళు, వజ్రాలు, ఖడ్గాలు ఇంకా పెద్ద మొత్తంలో బంగారం పంపించాడు. అమ్రూ వీటన్నిటిని జమ్‌జమ్ బావిలో పడవేశాడు (మురూజుజ్జహబ్ 1/205)*
11. *ఇబ్నె హష్షామ్ 1/114, 115.*

హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) కాలం క్రీ.పూ. 2000 సంవత్సరాలు. ఈ లెక్కన మక్కాలో జుర్హుమ్ తెగ ఉనికి రెండు వేల ఒక వంద సంవత్సరాలు. వారి పాలన దాదాపు రెండు వేల సంవత్సరాల వరకు సాగింది.

బనూ ఖుజాఅ మక్కాను జయించిన తరువాత బనూ బక్ర్ సహాయం లేకుండానే తమ పాలనను నెలకొల్పారు. అయితే మూడు ప్రముఖమైన, విశిష్ఠమైన హోదాలు మాత్రం ముజ్రీ తెగలకు దక్కాయి.

1. హజ్ యాత్రికులను అరఫాత్ నుండి ముజ్దలిఫా తీసుకొని వెళ్ళడం మరియు యౌమున్నఫర్ - పదమూడు జీహజ్జాకు సంబంధించిన చివరి రోజు- మినా నుండి బయలుదేరే అనుమతినివ్వడం. ఈ గౌరవం ఇల్యాస్ బిన్ ముజిర్ కుటుంబం బనూ గౌస్ బిన్ ముర్రాకు దక్కింది. వీరిని 'సూఫా'లనే వారు. ఈ గౌరవం ఎలాంటిది అంటే పదమూడు జీహజ్జా నాడు, మొదట సూఫాకు చెందిన వ్యక్తి గులకరాళ్ళు విసరనంత వరకు ఏ హాజీ కూడా గులకరాయిని విసరడానికి వీల్లేదు. ఆ తరువాత హాజీలు గులకరాళ్ళను విసిరి మినా నుండి బయలుదేరేవారు. ఈ సమయంలో సూఫాకు చెందినవారు మినా నుండి బయలుదేరే ఏకైక మార్గంలో రెండు వైపులా వరుసకట్టి నిలబడేవారు. వారు ఆ మార్గం నుండి బయలుదేరేంత మట్టుకు ఏ హాజీని కూడా బయటకు పోనిచ్చేవారు కారు. వీరు వెళ్లిపోగానే తక్కిన వారి కోసం మార్గం ఏర్పడేది. సూఫా కుటుంబం అంతమైపోయిన తరువాత ఈ గౌరవం 'బనూ తమీమ్' కుటుంబం బనూ సఅద్ బిన్ జైద్‌ను వరించింది.

2. పదవ జీహజ్జా నాడు ఉదయాన్నే ముజ్దలిఫా నుండి 'మినా' వైపు అఫాజా (బయలుదేరడం) చేసే గౌరవం బనూ ఉద్వాన్‌కు దక్కింది.

3. నిషిద్ధ మాసాలను అటూ ఇటూ మార్చడం. ఈ గౌరవం బనూ కనానాకు చెందిన ఓ శాఖ బనూ తమీమ్ అద్దీకి లభించింది.[12]

మక్కాపై బనూ ఖుజాఅ అధికారం దాదాపు మూడు వందల ఏండ్ల వరకు కొనసాగింది.[13]

అద్నానీ తెగలు మక్కా మరియు హిజాజ్ నుండి బయలుదేరి నజద్, ఇరాఖ్ చుట్టుప్రక్కల మరియు బహ్రైన్ లోనికి వ్యాపించిన కాలమిది. మక్కా

12. ఇబ్నె హష్షామ్-1/44,119,122. 13. యాకూత్ : మాద్దయె మక్కా.

చుట్టుపట్ల కొన్ని ఖురైష్ శాఖలు ఉండిపోయాయి. వీరు దేశదిమ్మరులు. వీరు గుంపులు గుంపులుగా ఉంటూ వచ్చేవారు. 'బనూ కనానా'లో వారికి సంబంధించిన కొన్ని భిన్న కుటుంబాలు ఉంటూ ఉండేవి. అయితే మక్కా పరిపాలన మరియు బైతుల్లా (కాబా గృహం) పౌరోహిత్యంలో వారికి ఎలాంటి భాగం లేకుండా ఉండేది. చివరికి ఖుస్సై బిన్ కిలాబ్ పైకి వచ్చాడు.[14]

ఖుస్సై బిన్ కిలాబ్ ఇంకా శిశువుగానే ఉన్నప్పుడు అతని తండ్రి చనిపోయినట్లు చెప్పుకోవడం జరుగుతోంది. ఆ తరువాత అతని తల్లి బనూ ఉజ్రాకు చెందిన వ్యక్తి రబీయా బిన్ హిరామ్‌ను పెళ్ళాడింది. ఈ తెగ సిరియా పరిసరాల్లో నివసిస్తూ ఉండేది. కాబట్టి ఖుస్సై తల్లి కూడా తన కుమారుణ్ణి వెంటబెట్టుకొని అక్కడికి వెళ్ళిపోయింది. ఖుస్సై పెరిగి పెద్దవాడై యవ్వన దశకు చేరుకున్న తరువాత మక్కాకు తిరిగివచ్చాడు. అప్పుడు మక్కాను హులైల్ బిన్ జషియాక జాయీ పాలిస్తూవున్నాడు. ఖుస్సై అతని కుమార్తెను వివాహ మాడదలచి వివాహ సంబంధం కోసం మనిషిని పంపాడు. దానికి హులైల్ సమ్మతించి తన కుమార్తెనిచ్చి పెళ్ళి చేశాడు.[15] ఆ తరువాత హులైల్ మరణించినప్పుడు, మక్కా మరియు కాబా గృహ సంరక్షణకు సంబంధించి ఖురైష్ మరియు 'ఖుజాఅ' నడుమ యుద్ధం జరిగింది. ఫలితంగా మక్కా, కాబా గృహాలపై ఖుస్సై అధికారం ఏర్పడింది.

ఆ యుద్ధానికి కారణం ఏమిటీ? అనే విషయంలో మూడు కథనాలు వినబడతాయి. ఒకదాని ప్రకారం, ఖుస్సై సంతానం బాగా వృద్ధి చెంది ధన సంపదలు పుష్కలంగా పెరిగినప్పుడు ఆ కుటుంబానికి మంచి పలుకుబడి వచ్చింది. ఇటు హులైల్ మరణించగా, బనూ ఖుజాఅ, బనూ బక్ర్‌ల కంటే కాబా గృహసంరక్షణకు, మక్కా పాలనకు తానే ఎక్కువ హక్కుదారుణ్ణని ఖుస్సై తలచాడు. అదీకాక ఖురైష్‌లు స్వచ్ఛమైన ఇస్మాయీల్ వంశానికి చెందిన అరబ్బులని, తక్కిన ఇస్మాయీలీయులకు నాయకులు కూడా (కాబట్టి నాయకత్వానికి తానే అర్హుడు) అని అనుకొని, ఖురైష్ మరియు బనూ ఖుజాఅ పెద్దలు కొందరితో చర్చించి, బనూ ఖుజాఅ, బనూ బక్ర్‌లను మక్కా నుండి ఎందుకు గెంటివేయకూడదు? అని తీర్మానించాడు. వారంతా ఈ అభిప్రాయంతో ఏకీభవించారు.[16]

14. ముహాజిరాతె ఖిజ్రీ-1/35, ఇబ్నె హష్షామ్-1/117.

15. ఇబ్నె హష్షామ్-1/117,118. 16. ఇబ్నె హష్షామ్-1/117, 118.

రెండవ కథనం ప్రకారం - ఖుజాఅ చెప్పినట్లుగా - హులైల్ స్వతహాగా ఖుస్సైకు మరణశాసనం చేస్తూ మక్కా అధికారాన్ని, కాబా గృహ సంరక్షణను చేపట్టమని చెప్పాడు.[17]

మూడవ కథనం ప్రకారం, హులైల్ తన కుమార్తె హబీకు కాబా గృహ సంరక్షణ బాధ్యతను అప్పగించి, అబూ గబ్‌షాన్ (ఖుజాయి తెగవాడు)ను ఆమెకు వకీలుగా చేశాడు. కాబట్టి హబీ సహాయకునిగా అతనే కాబా గృహ తాళపుచెవులు పెట్టుకునేవాడు. హులైల్ మరణించాక ఖుస్సై, అబూ గబ్‌షాన్ నుండి ఓ తోలు తిత్తి నిండా సారాయి ఇచ్చి కాబా గృహ సంరక్షణ బాధ్యతల్ని కొనుక్కున్నాడు. అయితే ఖుజాఅ ఈ బేరాన్ని సమ్మతించక ఖుస్సైని కాబా గృహ సంరక్షణ నుండి అడ్డుకోజూశారు. దీనికి ఖుస్సై బనూ ఖుజాఅను మక్కా నుండి తరిమివేయడానికి ఖురైష్ మరియు బనూ కనానాను సమావేశ పరిచాడు. వారు ఖుస్సై పిలుపును అందుకోగానే సమావేశమయ్యారు.[18]

మొత్తానికి కారణమేదైనప్పటికి జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి: హులైల్ మరణం తరువాత సూఫా ఇదివరకు అవలంబించిన మార్గాన్నే అవలంబించారు. ఖుస్సై, ఖురైష్ మరియు కనానాకు చెందిన వారిని వెంటబెట్టుకొని, ఉఖ్బా దాపున చేరి ఉన్న వారి దగ్గరకి వచ్చి, "మీకంటే మేమే ఆ గౌరవానికి అర్హులం" అని చెప్పాడు. దానికి సూఫా వారు యుద్ధాన్ని ప్రకటించారు. అయితే ఖుస్సై వారిని ఓడించి ఈ గౌరవాన్ని వారి నుండి లాక్కున్నాడు. ఈ సందర్భంగా ఖుజాఅ, బనూ బక్ర్‌లు ఖుస్సైకి దూరం కాగా అతడు వారితోనూ యుద్ధానికి కాలుదువ్వాడు. ఇంకేముంది! ఉభయుల నడుమ భీకర యుద్ధం ప్రారంభం అయింది. ఉభయ సైన్యాల్లోని అనేకులు హతమయ్యారు. ఆ తరువాత జరిగిన సంధి సంప్రతింపుల్లో బనూ బక్ర్ తెగకు చెందిన ఓ వ్యక్తి యామర్ బిన్ ఔఫ్‌ను తీర్పు చెప్పమని ఎన్నుకోవడం జరిగింది. యామర్ తన తీర్పులో, ఖుజాఅకు బదులు ఖుస్సైయే కాబా సంరక్షణకు, మక్కా అధికారానికి అర్హుడంటూ తీర్పునిచ్చాడు. అదే కాకుండా ఆ తీర్పులో ఖుస్సై ద్వారా జరిగిన రక్తపాతం అంతా వృధాగా పోతుందని, దాన్ని నేను నా కాళ్ళ క్రిందవేసి నలిపేస్తున్నానని చెబుతూ, ఖుజాఅ మరియు బనూ బక్ర్ తెగలు ఎవరినయితే చంపారో దానికి వారు రక్తపరిహారం చెల్లించుకోవాలని, దైవ

17. ఇబ్నె హష్షామ్-1/118.

18. రహ్మాతుల్ లిల్ ఆలమీన్-2 /55.

గృహాన్ని వెంటనే ఖుస్సైకు అప్పగించాలని చెప్పాడు. ఈ తీర్పు వల్ల యామర్ బిరుదు "షద్దాఖ్"[19]గా పడిపోయింది. షద్దాఖ్ అంటే కాళ్ళక్రింద వేసి నలిపేవాడు అని అర్థం.

ఈ తీర్పు ఫలితంగా ఖుస్సై మరియు ఖురైష్‌లకు మక్కాపై పూర్తి అధికారం, నాయకత్వం లభించాయి. ఖుస్సై బైతుల్లాహ్ (దైవగృహం కాబా)కు ధర్మకర్త అయిపోయాడు. ఈ దైవగృహాన్ని సందర్శించడానికి అరేబియా మారుమూల ప్రాంతాల నుండి ప్రజలు రావటం ప్రారంభించారు. మక్కాపై ఖుస్సై అధికారానికి సంబంధించిన ఈ సంఘటన క్రీ.శ. 500 మధ్యకాలం నాటిది. అంటే క్రీ.శ. 440వ సంవత్సరం అన్న మాట.[20]

ఖుస్సై మక్కా నియంత్రణ కోసం మక్కా చుట్టుప్రక్కల నివసిస్తున్న ఖురైష్ తెగ వారందరిని పిలిపించి పూర్తి నగరాన్ని వారి మధ్య పంచిపెట్టాడు. ప్రతి కుటుంబం వారు ఉండడానికి స్థలాలను కేటాయించాడు. అయితే నిషిద్ధ మాసాలను వెనకాముందు మార్చేవారైన 'ఆలె సుఫ్యాన్', 'బనీ ఉద్వాన్' మరియు 'బనూ ముర్రా బిన్ ఔఫ్'ల హోదాలను వారి దగ్గరనే ఉండేటట్లు చూశాడు. దీనికి కారణం, అతని దృష్టిలో ఇది కూడా ధర్మానికి సంబంధించిన విషయమే, ఇందులో మార్పులు చేర్పులు చేయడం సరికాదు అని తలచడమే.[21]

ఖుస్సై చేసిన ఘనకార్యాల్లో, హరమ్ (కాబా గృహం) ఉత్తరాన 'దారున్నద్వా'ను నిర్మించడం (దీని ద్వారం మస్జిద్ వైపునకు ఉండేది). దారున్నద్వా నిజానికి ఖురైష్‌ల పార్లమెంటు అని చెప్పాలి. అక్కడ పెద్ద పెద్ద మరియు ముఖ్యమైన వ్యవహారాల గురించి తీర్పులు జరిగేవి. ఖురైష్‌లు దారున్నద్వాకు రుణపడి ఉన్నారు. కారణం, అది వారి ఏకత్వాన్ని నిలిపి ఉంచింది. ఇచ్చటనే వారి చిక్కు సమస్యలన్నీ సునాయాసంగా పరిష్కరింపబడేవి.[22]

ఖుస్సై కాబా ధర్మకర్తగా ఈ క్రింది గౌరవప్రదమైన మహోన్నత హోదాలను చేబట్టాడు. అవి-

19. ఇబ్నె హష్షామ్-1/123, 124.

20. ఖల్బ్ జజీరతుల్ అరబ్-పేజీ. 232.

21. ఇబ్నె హష్షామ్,-1/124, 125.

22. ఇబ్నె హష్షామ్-1/125; ముహాజిరాతె ఖిజ్రీ - 1/36; అక్బారుల్ కిరామ్ -పేజి 152.

1. **దారున్నద్వా అధ్యక్ష పీఠం-** అక్కడ గొప్ప గొప్ప వ్యవహారాలకు సంబంధించి సలహా సంప్రతింపులు జరిగేవి. అక్కడనే మక్కాకు చెందిన వారు తమ కుమార్తెల వివాహాలు చేసేవారు.
2. **లువా** - అంటే యుద్ధ పతాకం ఖుసై తన చేతుల మీదుగా కట్టేవాడు.
3. **హిజాబత్** - అంటే కాబాగృహ సంరక్షణ- కాబా గృహద్వారం ఖుసై మాత్రమే తెరిచేవాడు. అతనే దాని బాగోగులను చూస్తూ తాళపుచెవులను తన వద్దనే ఉంచుకునేవాడు.
4. **సిఖాయా (దాహం తీర్చడం)**-కొన్ని తొట్టెల్లో హాజీల కోసం నీరు నిలువ చేసి అందు ఖర్జూర పండ్లు, కిష్మిష్ వేసి దానిని మధురంగా మార్చేవారు. హాజీలు మక్కా వచ్చినప్పుడు దాన్ని త్రాగేవారు.[23]
5. **రిఫాదా (హాజీల ఆతిథ్యం)** - అంటే హాజీల విందు కోసం భోజనం తయారు చేయడం. దీని కోసం ఖుసై, ఖురైష్ తెగ వారు తప్పనిసరిగా తమ ఆదాయం నుండి కొంత చెల్లించాలని నిబంధన పెట్టాడు.

ఇది హజ్ కాలంలో ఖుసై వద్ద జమ అయ్యేది. ఖుసై ఆ డబ్బుతో హాజీల కోసం భోజనం తయారు చేయించేవాడు. బొత్తిగా డబ్బులేనివారు లేదా దారి బత్తెము లేనివారు ఈ భోజనాన్ని భుజించేవారు.[24]

ఈ హోదాలన్నీ ఖుసై వద్దనే ఉండేవి. ఖుసై పెద్ద కుమారుడు 'అబ్దుద్దార్'. అయితే, ఇతనికి బదులు అతని రెండవ కుమారుడు 'అబ్దె మునాఫ్', ఖుసై జీవిత కాలంలోనే నాయకత్వ లక్షణాలను పొందాడు. అందుకని ఖుసై అబ్దుద్దార్‌ను ఉద్దేశించి, వీరు గౌరవప్రతిపత్తుల్లో నీకంటే మెరుగైనప్పటికి నేను నిన్ను అంతటివాణ్ణిగా చేస్తాను అని చెప్పాడు. కాబట్టి ఖుసై తన హోదాలన్నీ అబ్దుద్దార్‌కు చెందేటట్లు వీలునామా రాయించాడు. అంటే, దారున్నద్వా అధ్యక్ష పదవి, కాబా గృహ సంరక్షణ, లువా, సిఖాయా మరియు రిఫాదాలన్నిటిని అబ్దుద్దార్‌కు ఇచ్చివేశాడు. ఏ విషయంలోను ఖుసై మాటను వ్యతిరేకించడంగాని, అతని ఆదేశాన్ని రద్దు చేయడంగాని లేకపోవడం, పైగా అతని ప్రతి ఆదేశం అతని జీవితంలోను, మరణానంతరం కూడా అనుసరించడం ధర్మంగా తలచబడేది. కాబట్టి ఖుసై మరణం తరువాత అతని కుమారులు ఎలాంటి

23. ముహాజిరాతె ఖిజ్రి-1/36. 24. ఇబ్నె హష్షామ్-1/130.

జగడాలు లేకుండా అతని వీలునామాను జవదాటలేదు. అయితే అతని రెండవ కుమారుడు అబ్దె మునాఫ్ చనిపోయిన తరువాత అతని కుమారులు ఆ హోదాల విషయంలో తమ దాయాదులైన అబ్దుద్దార్ కుమారులతో పేచీకి దిగారు. దీని ఫలితంగా ఖురైష్ రెండు వర్గాలుగా చీలిపోవాల్సివచ్చింది. ఉభయ వర్గాల నడుమ యుద్ధ వాతావరణం నెలకొన్నప్పుడు వారిలో కొందరు సంధికి పిలుపునివ్వడం, ఆ హోదాలను పరస్పరం పంచుకోవడం జరిగింది. పంపకంలో సికాయా, రిఫాదా హోదాలు బనూ అబ్దె మునాఫ్‌కూ, దారున్నద్వా నాయకత్వం, లువా మరియు హిజాబత్ హోదాలు బనూ అబ్దుద్దార్ వాటాకు వచ్చాయి. ఆ తరువాత బనూ అబ్దె మునాఫ్ తమ వాటాకు వచ్చిన హోదాలను పంచుకోవాలని వారు చీటీలు వేయగా అదృష్టం హాషిం బిన్ అబ్దె మునాఫ్‌ను వరించింది. కాబట్టి హాషిం బిన్ అబ్దె మునాఫ్ తన జీవితాంతం సికాయా, రిఫాదాలకు సంబంధించిన సౌకర్యాలను చూస్తూ వచ్చాడు. హాషిం చనిపోయిన తరువాత అతని సోదరుడు ముత్తలిబ్ ఆ హోదాలను తన చేతుల్లోకి తీసుకున్నాడు. కాని ముత్తలిబ్ మరణానంతరం ఆయన సోదరుని కుమారుడు అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిం-ఈయనే దైవప్రవక్త ముహమ్మద్ (స)కు తాత-ఈ హోదాలను నిర్వహించారు. ఆయన తరువాత ఆయన సంతానం ఆ వ్యవహారాలను చూస్తూ వచ్చింది. చివరికి ఇస్లాం శకారంభం అయిన తరువాత ఈ హోదాను కలిగి ఉన్న వ్యక్తి హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ గారే.[25]

ఇవే కాకుండా మరికొన్ని హోదాలను ఖురైష్‌లు పరస్పరం పంచుకున్నారు. ఈ హోదాలు, వ్యవస్థలు పకడ్బందీగా సాగడం వలన ఖురైష్‌లు ఓ చిన్న పరిపాలన ఏర్పరచారు- ఇంకా చెప్పాలంటే ఇది ఓ పరిపాలన వ్యవస్థ - ఏర్పరచారా అన్నట్లుగా కనబడేది. ఆ వ్యవస్థకు సంబంధించిన ప్రభుత్వ సంస్థలు, రూపురేఖలు నేటి పార్లమెంటు సభల్లా అలరారేవి. ఆ హోదాల రూపురేఖలు ఈ క్రింది విధంగా ఉండేవి.

1. **ఈసార్** - అంటే భవిష్యత్తు గురించి తెలుసుకోవడానికి విగ్రహాల దగ్గర ఏ బాణాలైతే ఉండేవో వాటి సంరక్షణ. ఈ హోదా 'బనూ జమ్‌హా' వద్ద ఉండేది.

25. ఇబ్నె హష్షామ్- 1/129-132, 137,142,178,179.

2. **రెవెన్యూ వ్యవస్థ** - విగ్రహాల అనుగ్రహం పొందడానికి ప్రజలు సమర్పించే కానుకలను, బలులను కాపాడడం. ఇదే కాకుండా జగడాలకు, సమస్యలకు తీర్పు చెప్పడం. ఈ పని 'బనూ సహమ్'కు అప్పగించబడింది.
3. **షూరా** - సలహా సంఘం. ఈ గౌరవం 'బనూ అసద్'కు దక్కింది.
4. **అష్నాక్** - అంటే రక్తపరిహారం, జరిమానాలు - ఈ హోదా 'బనూ తైమ్' వద్ద ఉండేది.
5. **అఖాబ్** - అంటే జాతీయ పతాకాన్ని పొంది ఉండడం- ఈ హోదా 'బనూ ఉమ్మియా' వాటాకు వచ్చింది.
6. **ఖుబా** - సైనిక క్యాంపు బాగోగులను చూడడం, గుర్రపు రౌతుల నాయకత్వం- ఇది 'బనూ మగ్జూమ్' తెగ వద్ద ఉండేది.
7. **సిఫారత్** - దౌత్యం - ఈ హోదా 'బనూ అద్దీ'ని వరించింది.[26]

మిగతా అరబ్బు నాయకత్వాలు

వెనుకటి పుటల్లో, ఖహ్తానీ, అద్నానీ తెగల వలస గురించి చెప్పి ఉన్నాం. అరేబియా దేశమంతా వారి నడుమ విభజించబడిన విషయం కూడా చర్చించుకున్నదే. ఆ తరువాత వారి పెత్తనం, నాయకత్వాల రూపురేఖలు ఇలా మారిపోయాయి. ఏ తెగలైతే 'హీరా' నలువైపుల వ్యాపించాయో వారిని 'హీరా' పాలితులుగా, మరే తెగలయితే బాదియతుష్షామ్ (సిరియా)లో స్థిరపడిపోయాయో వారిని గస్సానీ పాలకుల అధీనంలో ఉన్నట్లుగా ఖరారు చేయడం జరిగింది. అయితే వారి ఈ పరాధీనత కేవలం నామమాత్రమైనదే. ఈ రెండు ప్రదేశాలను తప్పనిచ్చి మిగిలిన అరేబియా తెగలు సర్వస్వతంత్రులుగా ఉండేవారు.

ఈ తెగల్లో ప్రతీ తెగకు ఓ సర్దారు ఉండడం ఆనవాయితి. ఆ తెగలు తమ సర్దారును తామే ఎన్నుకునేవారు. ప్రతీ తెగ ఓ చిన్న సామ్రాజ్యంగా అలరారేది. రాజకీయ సంరక్షణ తెగల ఐక్యత విషయంలో తెగకు- తెగకు నడుమ ఉండే ఆత్మాభిమానం మరియు వాటి భూభాగాల సంరక్షణ అందుకు కారణం.

తెగల సర్దారుల హోదా వారి జాతిలో ఓ రాజులాంటిది. ప్రతీ తెగ,

26. తారీక్ అర్జుల్ ఖుర్ఆన్-2/104, 105, 106.

మొత్తానికి, తమ సర్దారు తీర్పును శిరసావహించేది. ఎట్టి పరిస్థితుల్లోను దాన్ని జవదాటేది కాదు. ప్రతి సర్దారుకు ఓ డిక్టేటరు (నియంత)కుండే అధికారాలే ఉండేవి. కొందరు సర్దారుల పరిస్థితి ఎలాగుండేదంటే, వారికి కోపం వచ్చినప్పుడల్లా, ఆ కోపానికి కారణం ఏమిటీ అని అడగకుండానే వేలాది ఖడ్గాలు ఒరల నుండి బయటికి వచ్చేవి. అది అలా ఉండగా, ఒకే కుటుంబానికి చెందిన దాయాదుల్లో నాయకత్వం కోసం సంఘర్షణలు కూడా జరిగేవి. అందుకని ఆ సర్దారులు తమ పాలితుల ఎడల సామరస్యంగా మెలగడం, బాగా డబ్బు ఖర్చు చేయడం, వారికి ఆతిథ్యాలివ్వడం, ధైర్యసాహసాలను ప్రదర్శించడం, ఆత్మాభిమానాన్ని దెబ్బకొట్టే విషయాల్లో తమ తెగ కొమ్ముకాయడంలో ముందడుగుగా ఉండేవారు. ఇలా ప్రవర్తించడం వలన ప్రజల దృష్టిలో, ముఖ్యంగా కవుల దృష్టిలో వారికి బాగా పలుకుబడి రావాలన్నది (ఆ కాలంలో కవులే జాతికి నాలుకగా ఉండేవారు). ఇలా ప్రతీ సర్దారు తన ప్రత్యర్థులకు పై స్థాయిలో ఉండాలని ప్రయత్నించేవాడు.

సర్దారులకు కొన్ని ప్రత్యేకమైన హక్కులుండేవి. ఆ హక్కుల గురించి ఓ కవి ఇలా వివరించాడు.

"మా నడుమ (ఓ సర్దార్) నీకు యుద్ధ ధనంలో నాల్గోవంతు ప్రత్యేకంగా కేటాయించబడిన సంపద ఉంది. నీవు తీర్పు చేసిన ధనం కూడా నీదే. మార్గమధ్యంలో నీ చేత చిక్కింది, పంచగా మిగిలిన ధనమంతా నీదే."

ఆ ధనసంపద లభించే నాలుగు విధాలు ఇవి:

1. **మిర్బా** : యుద్ధంలో లభించిన ధనం (యుద్ధధనం).

2. **సఫీ** : పంపకానికి ముందే సర్దారు తన కోసం కేటాయించుకున్న ధనం.

3. **నషీత్** : జాతి దాకా చేరకముందే సర్దారు చేతికి చిక్కిన ధనం.

4. **ఫుజూల్** : పంచగా మిగిలిపోయిన ధనం, యుద్ధంలో పాల్గొని విజయం సాధించిన గాజీల సంఖ్యలో సమంగా పంచబడని ధనం. ఉదాహరణకు పంచగా మిగిలిపోయిన ఒంటెలు, గుర్రాలు వగైరా.

ఈ నాలుగు రకాల ధనసంపదనంతా తెగ సర్దారు తానే ఉంచుకునే హక్కు కలిగి ఉండేవాడు.

రాజకీయ పరిస్థితులు

అరేబియా ద్వీపకల్పానికి చెందిన పాలనలు, పాలకుల గురించి తెలుసుకున్న తరువాత వారి రాజకీయ పరిస్థితుల గురించి తెలుసుకోవడం కూడా అవసరమే.

అరేబియాకు పొరుగున ఉన్న మూడు సరిహద్దు ప్రాంతాల రాజకీయ పరిస్థితి, అరాచకం, అస్థిరత మరియు పతనావస్థకు దిగజారిపోయింది. మానవుడు యజమాని మరియు బానిసగా లేదా పాలకుడు మరియు పాలితునిగా రెండు వర్గాల్లో విభజించబడి ఉన్న కాలమది. ప్రయోజనాలన్నీ పాలకుల-ప్రముఖంగా విదేశీ పాలకుల- హస్తగతమై, బరువు భారమంతా బానిసలపైనే మోపబడి ఉండేది. ఇంకా వివరంగా చెప్పాలంటే, ప్రజలు నిజానికి ఓ వ్యవసాయ క్షేత్ర సదృశంగా ఉండి, పాలకులకు డబ్బు, ఆదాయం సమకూర్చేదిగా మారిపోయింది. ప్రభుత్వం ఆ ఆదాయాన్ని తమ భోగాలకు, ఐశ్వర్యాలకు, కామక్రీడలకు, ప్రజలపై అత్యాచారాలకు ఉపయోగిస్తూ ఉండేది. ప్రజల పరిస్థితి చీకట్లో కొట్టుమిట్టాడుతున్నట్లు కనబడేది. ఎటు చూసినా అఘాయిత్యాలు, అక్రమాలు, అత్యాచారాలు ప్రబలిపోయాయి. ప్రజలు వీటికి వ్యతిరేకంగా పల్లెత్తు మాట కూడా మాట్లాడడానికి వీలు లేదు. ప్రభుత్వ పీడనను, అఘాయిత్యాలను, దౌర్జన్యాన్ని సహించడం తప్ప మార్గమేదీ లేకపోయింది. కారణం, ప్రభుత్వం ఓ నియంతగా వ్యవహరించడమే. మానవ హక్కుల ఉనికే లేదు.

ఈ ప్రాంతాల పొరుగున ఉండే తెగలు ఎటూ పాలుపోక, స్వార్థం కోసం, మనోవాంఛల పరిపూర్తి కోసం ఊగులాడుతూ, ఇరాఖ్ పాలకులతో ఓసారి, సిరియా పాలకులతో మరోసారి చేయి కలిపేవారు.

అరేబియా మధ్యభాగంలో నివసించే తెగలు కూడా రాజకీయ అస్థిరతకు లోనై బలహీనంగానే ఉన్నారు. ఎటు చూసినా వర్గవైషమ్యాలు, జాతి కలహాలు, మత విభేదాలు రాజ్యమేలుతుండేవి. ప్రతీ తెగకు చెందిన వారు, తాము న్యాయం కోసం పోరాడుతున్నా, అన్యాయం కోసం పోరాడుతున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ తమ సొంత తెగకే వంతపాడేవారు. కాబట్టి ఓ తెగకు సంబంధించిన ఓ కవి ఇలా అంటున్నాడు.

"నేనైతే 'గజియా' తెగకు చెందినవాడను. అది తప్పుడు త్రోవను అవలంబించినా నేను ఆ మార్గాన్నే ఎన్నుకుంటాను. ఒకవేళ అది సరి అయిన మార్గాన్ని ఎంచుకుంటే నేను కూడా ఆ సక్రమమైన మార్గాన్నే అవలంబిస్తాను."

అరేబియాలో ఆ తెగలకు ఊతమిచ్చేవాడు, వారి కష్టాలను కడతేర్చేవాడు ఏ ఒక్క రాజు లేకుండాపోయాడు.

అయితే హిజాజ్ ప్రభుత్వాన్ని మాత్రం ప్రజలు గౌరవించేవారు. దాన్ని ధార్మిక కేంద్ర నాయకత్వంగా, ధర్మాన్ని పరిరక్షించే ప్రభుత్వంగా తలచేవారు. ఈ ప్రభుత్వం ఓ రకంగా ప్రాపంచిక నాయకత్వం మరియు ధార్మిక నాయకత్వంతో కూడిన కలగూరగంపగా ఉండేది. అరబ్బులపై ధార్మిక నాయకత్వం పేరున ఔన్నత్యం కలిగి ఉండేది. హరమ్ (మక్కా) మరియు మక్కా చుట్టుప్రక్కల ఆ ప్రభుత్వ చట్టాలే చెల్లేవి. హజ్ యాత్రికుల అవసరాలను తీర్చే వ్యవస్థను ఏర్పర్చింది, ఇబ్రాహీం (అ.స.) ధర్మం ప్రకారం నడిచేటట్లు ప్రజల్ని కట్టడి చేసిందీ ఈ ప్రభుత్వమే. ఈ ప్రభుత్వం వద్ద పార్లమెంటు సంస్థల్లాంటి సంస్థలు, వ్యవస్థలు కూడా ఉండేవి. అయితే ఈ ప్రభుత్వం, మధ్య అరేబియాలోని అరబ్బుల బాధ్యతలను స్వీకరించలేనంత బలహీనమైనది. అబీసీనియా దాడి జరిగినప్పుడు బయటపడింది.

అరేబియా మతాలు - ధర్మాలు

అరేబియా సాధారణ ప్రజలంతా హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) పిలుపు, మత ప్రచారం కారణంగా ఇబ్రాహీం (అ.స.) చూపిన మార్గంలోనే నడిచేవారు. కేవలం ఒకే దైవాన్ని ఆరాధించేవారు (ఏకేశ్వరోపాసన). అయితే కాలం గడిచిన కొద్దీ వారు దైవసందేశానికి సంబంధించిన ఓ భాగాన్ని పూర్తిగా మరచిపోయారు. అయినప్పటికీ ఏకేశ్వర భావన, ఇబ్రాహీం (అ.స.) ధర్మానికి సంబంధించిన కొన్ని గుర్తులు మాత్రం 'బనూ ఖుజాఅ సర్దారు' అమ్రూ బిన్ లుహై' పైకి వచ్చేంత వరకు వారి నడుమన ఉండిపోయాయి. అతను పెరిగి పెద్దయినది సత్కార్యాలు, దానధర్మాలు, ధార్మిక ఆచారాలుగల కుటుంబంలో. అతను కూడా పెద్దయిన తరువాత ఈ విషయాల్లో మంచి ప్రోత్సాహం కనబరిచాడు. ప్రజలు అతనంటే ఇష్టపడేవారు. అతన్ని గొప్ప ధార్మిక పండితుడుగా, దైవానికి ఇష్టమైన వారిలో ఒకనిగా తలచి అతనినే అనుసరించనారంభించారు. అమ్రూ బిన్ లుహై సిరియాకు వెళ్ళినప్పుడు అక్కడి ప్రజలు విగ్రహాలను ఆరాధించడం గమనించాడు. ఈ మార్గమే మేలైన, సత్యమైన మార్గమని తలచాడు. కారణం, సిరియా దైవ ప్రవక్తలు, దైవ గ్రంథాల అవతరణకు పుట్టినిల్లు కావడం. కాబట్టి ఇది సవ్యమైన మార్గమని తలపోసి తన వెంట 'హుబల్' అనే విగ్రహాన్ని తెచ్చుకున్నాడు. దాన్ని కాబా గృహంలో ప్రతిష్ఠించి, మక్కా ప్రజలకు అల్లాహ్‌తో పాటు పూజ చేయమని పిలుపునిచ్చాడు. ప్రథమంగా అరేబియాలో 'షిర్క్' (బహుదైవారాధన) ప్రారంభం అయింది ఇక్కడి నుండే. మక్కా ప్రజలు అతని పిలుపుకు స్వాగతం పలికారు. ఆ తరువాత అనతి కాలంలోనే హిజాజ్ ప్రజలంతా, మక్కా ప్రజలు దైవగృహ సంరక్షకులు, హరమ్‌కు చెందిన వారు గనుక వారి అడుగుజాడల్లో నడుచుకోనారంభించారు.[1]

హుబల్ దేవతే కాకుండా, అరేబియా పురాతన దైవవిగ్రహాల్లో 'మనాత్'

1. ముఖ్తసర్ సీరతె రసూల్, రచన; షేక్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ నజది. పుట.12.

దేవతా విగ్రహం ఒకటి. ఇది ఎర్ర సముద్రం తీరంలోని 'ఖుదైద్' దాపులో ఉన్న 'ముసల్లల్'[2] అనే చోట ప్రతిష్ఠించబడి ఉండేది. ఆ తరువాత 'తాయెఫ్'లో 'లాత్' పేరుగల దేవతా విగ్రహం కూడా ఉండేది. ఆ తరువాత 'నక్లా' కొండ లోయలో 'ఉజ్జా' పేరుగల దేవతా విగ్రహాన్ని ప్రతిష్ఠించడం జరిగింది. ఈ మూడు దేవతా విగ్రహాలు అరేబియాలోని పెద్ద విగ్రహాలు. ఆ తరువాత హిజాజ్‌లో షిర్క్ బాగా పెరిగిపోవడం వలన దేవతా విగ్రహాలు విరివిగా వెలిశాయి. ఓ 'జిన్' కూడా అమ్రూ బిన్ లుహైకు లోబడి ఉన్నట్లుగా, అతడు నూహ్ (నోవా) (అ.స.)జాతికి చెందిన విగ్రహాలు 'వద్ద్', 'సవా', 'యగూస్', 'యావూఖ్' మరియు 'నస్ర్'లు జిద్దాలో పాతి ఉన్నట్లుగా చెప్పాడని, జిన్ ఆచూకీ మేరకు అమ్రూ బిన్ లుహై జిద్దా వెళ్ళాడని, వాటిని త్రవ్వి తీశాడని, ఆ తరువాత వాటిని 'తిహామా'కు తెచ్చి హజ్ కాలం రాగానే వివిధ తెగలకు ఇచ్చాడని, ఆ తెగలవారు తమ తమ ప్రాంతాల్లో తీసుకువెళ్ళి ప్రతిష్ఠించుకున్నారని ప్రతీతి. ఆ తరువాత ప్రతి తెగలోను, ప్రతి ఇంటిలోను ఓ విగ్రహం వెలిసిపోయింది.

తదుపరి బహుదైవారాధకులు మస్జిదె హరామ్ (కాబా మస్జిద్)ను కూడా విగ్రహాలతో నింపేశారు. మక్కా జయించబడినప్పుడు బైతుల్లా (కాబా) చుట్టు ప్రక్కల మూడు వందల అరవై విగ్రహాలున్నాయి. వాటిని స్వయంగా దైవప్రవక్త (స) తమ చేతుల మీదుగా ధ్వంసం చేశారు. ఆయన (స) ప్రతి విగ్రహాన్ని తన చేతి కర్రతో త్రోసినప్పుడు అది క్రిందపడిపోయేది. ఆ తరువాత ఆయన వాటన్నిటిని మస్జిదె హరామ్ నుండి బయటకు తీసి కాల్చేయమని ఆదేశించారు.[3]

మొత్తానికి బహుదైవారాధన, విగ్రహారాధన అజ్ఞానకాలం నాటి అరబ్బుల ధర్మానికి గొప్ప ప్రతీకగా నిలిచిపోయింది. వారు ఇబ్రాహీం(అ.స.) ధర్మంపైనే నడుస్తున్నామని విర్రవీగేవారు.

అదేకాకుండా అజ్ఞాన కాలపు అరబ్బుల్లో విగ్రహారాధనకు సంబంధించిన కొన్ని ప్రత్యేకమైన ఆచార పద్ధతులు, సంప్రదాయాలు కూడా చోటు చేసుకొని ఉండేవి. అవన్నీ అమ్రూ బిన్ లుహై కనుగొన్నవే. వీరు అమ్రూ బిన్

2. సహీ బుఖారి-1/222.
3. ముక్తసర్ సీరతుర్రసూల్-రచన: షేఖ్ ముహమ్మద్ బిన్ వహ్హాబ్ (రహ్మాలై) పుట-13,50, 51, 52, 54.

లుహై ప్రవేశపెట్టిన ఈ ఆచార సంప్రదాయాలను ఇబ్రాహీం (అ.స.) ధర్మం యొక్క భాగమని, ఆ ధర్మంలో ఎలాంటి మార్పు కావని, ఆ ధర్మానికి అనుగుణంగానే తయారు చేసిన బిద్అతె హసనా అని (శుభప్రదమైన కొత్త ఆచారాలని) తలచేవారు. క్రింది పేరాల్లో మేము ఆ అజ్ఞాన కాలం నాటి విగ్రహారాధనకు సంబంధించిన కొన్ని ఆచారాలను సూచిస్తున్నాము.

1. అజ్ఞాన కాలం నాటి బహుదైవారాధకులు విగ్రహాల వద్ద పురోహితులై కూర్చునేవారు. వాటిని శరణు వేడేవారు. తమను కష్టాల నుండి ఆదుకొమ్మని, అభీష్టాలను నెరవేర్చమని కేకలు వేసి మరీ మ్రొక్కుతూ వేడుకునేవారు. ఈ దేవతలు అల్లాహ్‌కు సిఫారసు చేసి తమ అభీష్టాలను నెరవేరుస్తాయని తలచేవారు.

2. విగ్రహాల హజ్ చేసేవారు (సందర్శించేవారు) వాటి చుట్టు ప్రదక్షిణలు చేసేవారు. వారి ముందు మోకరిల్లుతూ సజ్దాలు చేసేవారు.

3. విగ్రహాలకు కానుకలు, బలులు సమర్పించేవారు. బలి పశువులను విగ్రహాలుండే గుళ్ళ వద్దకు తీసుకువెళ్ళి జిబహ్ చేసేవారు. అప్పుడప్పుడు వారి పేరు మీద ఎక్కడైనా జిబహ్ చేయడం కూడా జరిగేది. జిబహ్‌కు సంబంధించిన ఈ రెండు రకాల గురించి అల్లాహ్ తన గ్రంథం దివ్యఖుర్‌ఆన్‌లో ఉటంకిస్తూ,

وَلَا تَأْكُلُوا مِمَّا لَمْ يُذْكَرِ اسْمُ اللَّهِ عَلَيْهِ

"ఏ జంతువులయితే దేవతా విగ్రహాల వద్ద జిబహ్ చేయబడతాయో అవి కూడా హరామ్ (నిషిద్ధం)" అని (6-121) సూచించాడు.

అంటే, అల్లాహ్ పేరును ఉచ్చరించకుండా జిబహ్ చేసే జంతువు మాంసం తినకండి అని అర్థం.

4. దేవతా విగ్రహాల సంతుష్టి కోసం బహుదైవారాధకులు తమ స్తోమతనను సరించి ఆహార పదార్థాలు, పంటలు, పశుసంపద నుండి ఓ భాగం కేటాయించి విగ్రహాలకు సమర్పించుకునేవారు. ఈ విషయంలో వారి ఆచారం ఏమిటంటే, వారు అల్లాహ్ కొరకు కూడా తమ పంటల నుండి, పశువుల నుండి ఓ భాగాన్ని ప్రత్యేకించడం; ఆ తరువాత వివిధ కారణాల వల్ల అల్లాహ్‌కు ప్రత్యేకించిన ఆ భాగాన్ని దేవతా విగ్రహాలకు

చెందేటట్లు చేయడం. అయితే దేవతా విగ్రహాలకు చెందిన భాగాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోను అల్లాహ్‌కు చెందేటట్లు చేసేవారు కాదు. దీని గురించి దివ్యగ్రంథం ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

وَجَعَلُوا لِلَّهِ مِمَّا ذَرَأَ مِنَ الْحَرْثِ وَالْأَنْعَامِ نَصِيبًا فَقَالُوا هَٰذَا لِلَّهِ بِزَعْمِهِمْ وَهَٰذَا لِشُرَكَائِنَا ۖ فَمَا كَانَ لِشُرَكَائِهِمْ فَلَا يَصِلُ إِلَى اللَّهِ ۖ وَمَا كَانَ لِلَّهِ فَهُوَ يَصِلُ إِلَىٰ شُرَكَائِهِمْ ۗ سَاءَ مَا يَحْكُمُونَ

"అల్లాహ్ కొరకు ఈ ప్రజలు స్వయంగా ఆయనే సృష్టించిన పొలాల నుండి, పశువుల నుండి ఒక భాగాన్ని కేటాయించేవారు. ఇది అల్లాహ్ కొరకు, ఇది మేము ప్రతిష్ఠించిన భాగస్వాముల కొరకు అని స్వయంగా తామే తీర్మానించుకొని అంటారు. వారు నిలబెట్టిన భాగస్వాములకు చెందే భాగం అల్లాహ్‌కు ఎలాగూ చేరదు. కాని అల్లాహ్‌కు చెందేది మాత్రం వారు నిలబెట్టిన భాగస్వాములకు చేరిపోతుంది. ఎలాంటి తప్పుడు నిర్ణయాలు చేస్తారు ఈ ప్రజలు?." (6-137)

5. విగ్రహాల సామీప్యాన్ని పొందటానికి బహుదైవారాధకులు పశువులకు సంబంధించి వివిధ రకాల మ్రొక్కుల్ని మ్రొక్కేవారు. అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిస్తున్నాడు:

وَقَالُوا هَٰذِهِ أَنْعَامٌ وَحَرْثٌ حِجْرٌ لَا يَطْعَمُهَا إِلَّا مَنْ نَشَاءُ بِزَعْمِهِمْ وَأَنْعَامٌ حُرِّمَتْ ظُهُورُهَا وَأَنْعَامٌ لَا يَذْكُرُونَ اسْمَ اللَّهِ عَلَيْهَا افْتِرَاءً عَلَيْهِ

"వారిలా అంటారు: ఈ జంతువులు, ఈ పొలాలు నిషేధించబడ్డాయి. మేము తినిపించదలచిన వారే వీటిని తినగలరు. వాస్తవానికి ఈ కట్టుబాటు వారు స్వయంగా కల్పించుకున్నదే. ఇంకా, వారు కొన్ని జంతువులపై స్వారీ చేయడాన్ని, వాటిచే బరువు లాగించడాన్ని నిషేధించారు. మరికొన్ని

జంతువులపై వారు అల్లాహ్ నామాన్ని ఉచ్చరించరు. ఇవన్నీ వారు అల్లాహ్‌కు అంటగట్టిన అబద్ధాలు." (6-138)

6. ఈ పశువుల్లోనే బహీరా, సాయిబా, వసీలా మరియు హామీ పేర్లు గల జంతువులుండేవి. 'ఇబ్నె ఇస్‌హాక్' కథనం ప్రకారం, బహీరా సాయిబా పెంటి దూడ. సాయిబా అంటే, ఎడతెగకుండా పది ఈతలు పెంటి దూడ లను మాత్రమే ఈనిన ఒంటె. మధ్యలో పోతు దూడను ఈనడానికి వీల్లేదు. ఇలాంటి ఒంటెను కట్టకుండా స్వేచ్ఛగా వదిలిపెట్టడం జరిగేది. దానిపై స్వారీ చేయడం గాని, దాని వెంట్రుకుల్ని కత్తిరించడం గాని జరగకపోయేది. అతిథి తప్ప దాని పాలను ఎవ్వరూ త్రాగేవారు కాదు. దీని తరువాత ఆ ఒంటె మరో పెంటి దూడను ఈనితే దాని చెవిని చీల్చేవారు. దాన్ని కూడా తల్లి వెంట స్వేచ్ఛగా తిరగడానికి వదిలేసేవారు. దానిపై కూడా స్వారీ చేయడంగాని, వెంట్రుకల్ని కత్తిరించడంగాని జరిగేది కాదు. అతిథి తప్ప దాని పాలు ఎవ్వరూ త్రాగడానికి వీల్లేదు. ఇదే బహీరా.

'వసీలా' అంటే ఎడతెగకుండా అయిదు ఈతలు రెండేసి పెంటి పిల్లలు పెట్టిన మేక (అయిదు ఈతల్లో మొత్తం పది పెంటి పిల్లలన్న మాట). మధ్యలో పోతు పిల్లను ఈనకూడదు. ఈ మేకను 'వసీలా' అనడానికి కారణం, ఆ మేక పెట్టిన పెంటి పిల్లల్ని ఓ మందగా కలపడం. ఆ తరువాత ఆ మేక ఈనిన పిల్లల మాంసం కేవలం పురుషులే తినేవారు. స్త్రీలకు అందులో భాగం ఉండక పోయేది. అయితే చనిపోయి పుట్టిన పిల్లను మాత్రం స్త్రీ పురుషులు కలిసి తినవచ్చు.

జతకట్టడం వలన ఎడతెగకుండా పది పెంటి పిల్లలు పుట్టడానికి కారణమైన పోతు ఒంటెను 'హామీ' అంటారు. మధ్యలో పోతు పిల్ల పుట్టడానికి వీల్లేదు. ఈ ఒంటె స్వారీకి నిషిద్ధం. దాని వెంట్రుకలు కూడా కత్తిరించడానికి వీల్లేదు. దాన్ని ఒంటెల మందలో విత్తనం కోసం వదిలిపెట్టేవారు. అది తప్ప మరే పనికి దాన్ని వినియోగించేవారు కాదు. అజ్ఞాన కాలం నాటి విగ్రహారాధనకు సంబంధించిన ఆచారాలను ఖండిస్తూ ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్

ఇలా సెలవిస్తున్నాడు.

مَا جَعَلَ اللّٰهُ مِنْۢ بَحِيْرَةٍ وَّلَا سَآئِبَةٍ وَّلَا وَصِيْلَةٍ وَّلَا حَامٍ ۙ وَّلٰكِنَّ
الَّذِيْنَ كَفَرُوْا يَفْتَرُوْنَ عَلَى اللّٰهِ الْكَذِبَ ؕ وَاَكْثَرُهُمْ لَا يَعْقِلُوْنَ ۝

"అల్లాహ్ 'బహీరా'ను గాని, 'సాయిబా'ను గాని, 'వసీలా'ను గాని, 'హామ్'ను గాని ఎంత మాత్రం నిర్ణయించలేదు. అయినా ఈ అవిశ్వాసులు అల్లాహ్‌పై అబద్ధాన్ని మోపుతున్నారు. వారిలో చాలా మంది బుద్ధిలేనివాళ్ళు." (5-103)

మరో చోట - ఇంకా ఇలా అంటారు,

وَقَالُوْا مَا فِيْ بُطُوْنِ هٰذِهِ الْاَنْعَامِ خَالِصَةٌ لِّذُكُوْرِنَا
وَمُحَرَّمٌ عَلٰۤى اَزْوَاجِنَا ۚ وَاِنْ يَّكُنْ مَّيْتَةً فَهُمْ فِيْهِ شُرَكَآءُ ؕ

"ఈ జంతువుల గర్భంలో ఉన్నది మా పురుషు లకు ప్రత్యేకం, మా స్త్రీలకు నిషిద్ధం. కాని మరణించినదయితే ఉభయులూ కలసి దాన్ని తినవచ్చు." (6-139)

పైన చెప్పిన పశువులు బహీరా, సాయిబాలకు వేరే భావాలు కూడా ఉన్నాయి.[4] ఇది ఇబ్నె ఇస్హాక్ కథనానికి కొంత విరుద్ధమైనవి.

హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మాలై) గారి ప్రకారం, ఈ జంతువులు విగ్రహాల కోసం కేటాయించబడ్డాయి.[5] సహీ బుఖారిలోని ఓ ఉల్లేఖనం ప్రకారం, దేవతా విగ్రహాల పేరున జంతువుల్ని మొట్టమొదటగా వదిలే ఆచారం 'అమ్రూ బిన్ లుహై' చేసినదే అని ఉంది.[6]

అరబ్బులు, ఈ విగ్రహాలు వారిని అల్లాహ్‌కు చేరువగా చేస్తాయని, అల్లాహ్ సమక్షంలో తమకు అనుకూలంగా సిఫార్సు చేస్తాయనే నమ్మకంతో ఈ ఆచారాలన్నీ నిర్వహించేవారు. కాబట్టి దివ్యఖుర్ఆన్‌లో బహుదైవారాధకుల మనోగతాన్ని ప్రస్ఫుటం చేస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

مَا نَعْبُدُهُمْ اِلَّا لِيُقَرِّبُوْنَاۤ اِلَى اللّٰهِ زُلْفٰى ؕ

---

4. సీరతె ఇబ్నె హష్షామ్-1/89, 90. *5. సహీ బుఖారి-1/499.*

6. సహీబుఖారి - 1/499.

"వారు మమ్మల్ని అల్లాహ్ వద్దకు చేరుస్తారని మాత్రమే మేము వారిని ఆరాధిస్తున్నాము." **(39-3)**

وَ يَعۡبُدُوۡنَ مِنۡ دُوۡنِ اللّٰهِ مَا لَا يَضُرُّهُمۡ وَلَا يَنۡفَعُهُمۡ وَيَقُوۡلُوۡنَ هٰٓؤُلَآءِ شُفَعَآؤُنَا عِنۡدَ اللّٰهِ ؕ

"ఈ ప్రజలు అల్లాహ్‌ను కాదని తమకు నష్టాన్నిగానీ, లాభాన్నిగానీ కలిగించ లేని వారిని పూజిస్తున్నారు. 'వారు అల్లాహ్ వద్ద మా కొరకు సిఫారసు చేస్తారు' అని అంటారు." **(10-18)**

అరబ్బు విగ్రహారాధకులు 'అజ్‌లామ్,' అంటే శకునాల కోసం బాణాలను ఉపయోగిుచేవారు (అజ్‌లామ్, జల్మ్‌కు బహువచనం. జల్మ్ అంటే ఈకలు కట్టబడని బాణం). శకునాలను తెలుసుకోవడానికి ఉపయోగించే బాణాలు మూడు రకాలు. ఒకటి, కేవలం 'అవును లేదా కాదు' అని రాయబడి ఉన్న బాణాలు. ఈ బాణాలు ప్రయాణం మరియు వివాహం లాంటి పనుల కోసం వాడడం జరిగేది. శకునం చూసేటప్పుడు 'అవును' అనే బాణం బయట పడితే అనుకున్న కార్యాన్ని నెరవేర్చేవారు. 'కాదు' అని బయటపడితే ఒక సంవత్సరం వరకు దాని జోలికి పోయేవారు కారు. మరుసటి సంవత్సరం మరలా శకునం చూడడం జరిగేది.

శకునాలు చూసే రెండవ రకం బాణాలపై రక్తశుల్కం, నీరు వగైరాలు రాయబడి ఉండేవి. మూడవ రకం బాణాలపై 'వీరు మీ వారే' లేదా 'మీ వారు కాదు', లేదా 'మీకు సంబంధించినవాడు' లేదా 'మీతో జతకట్టినవాడు' అని వ్రాసి ఉండేది. ఈ బాణాల ఉపయోగం, ఒకరి గురించి వారు తమ సంతతికి చెందినవారా కాదా అని అనుమానం వచ్చినప్పుడు జరిగేది. అలాంటి అవసరం ఏర్పడినప్పుడు ఆ వ్యక్తిని వంద ఒంటెలతో సహా 'హుబల్' దేవత వద్దకు తీసుకొని వెళ్ళేవారు. ఆ ఒంటెల్ని బాణాలు కలిగి ఉన్న పూజారికి సమర్పించగా అతడు ఆ బాణాలన్నింటిని కలిపి త్రిప్పేవాడు. అందుండి ఓ బాణం బయటకు లాగి దానిపై రాసి ఉన్న అక్షరాలను చదివేవాడు. బాణంపై 'మీకు అయినవాడే' అని తేలితే ఆ వ్యక్తి, ఆ తెగలో ఓ గౌరవప్రదమైన వ్యక్తిగా భావించబడేవాడు. ఒకవేళ 'మీవాడు కాదు' అని తేలితే ఆ వ్యక్తి ఆ తెగకు మిత్రునిగా తలచడం జరిగేది.

'మీకు సంబంధించినవాడు' అని తేలితే ఆ వ్యక్తి ఇటు ఆ తెగకు చెందిన వ్యక్తిగా గాని, అటు దాని మిత్రునిగా గాని తలచడం జరగకపోయేది.[7]

ఇలాంటి మరో ఆచారం బహుదైవారాధకుల్లో ఉండేది. ఇది జూదం, జూదానికి సంబంధించిన అంబులను ఉపయోగించే ఆచారం. ఈ బాణం సూచన మేరకు వారు జూదపు ఒంటెను జిబహ్ చేసి దాని మాంసాన్ని పంచేవారు.[8]

అరేబియా బహుదైవారాధకులు (ముష్రిక్కులు) కాహిన్‌లు, అర్రాఫులు, నుజూమీలపై నమ్మకం కలిగి ఉండేవారు. 'కాహిన్' అంటే మున్ముందు జరుగ బోయే విషయాల గురించి జోస్యం చెప్పేవాడని అర్థం. కొందరు కాహిన్‌లయితే, ఓ జిన్ను తమకు ఆధీనుడై ఉన్నాడని, తెలియని విషయాలను వారికి అందిస్తాడని చెప్పేవారు. మరికొందరైతే అగోచర విషయాలను తెలుసుకునే విద్య వారి వద్ద ఉందని వాదించేవారు.

దొంగతనం, దొంగసొత్తు, దొంగిలించబడిన పశువులు మొదలైనవాటి గురించి సోదె అడగడానికి వచ్చిన వారిని, వారి సంభాషణ, ప్రవర్తన లేదా అతని పరిస్థితుల గురించి అంచనావేసి వారికి ఆ ఆచూకీని తెలిపేవారు కొందరు. వారినే అరబ్బులు అర్రాఫ్‌లని అంటారు.

నక్షత్రాలు, గ్రహాల గమనాన్ని లెక్కకట్టి ప్రపంచంలో ముందు ఏమి జరుగబోతుందోనని భవిష్యవాణి చేసే వారిని 'నుజూమి' (జ్యోతిష్యులు) అని పిలిచేవారు.[9] ఈ నుజూమీల మాటలను నమ్మడం అంటే, గ్రహాలు, నక్షత్రాల శక్తిని విశ్వసించడం అన్న మాట. అరేబియా బహుదైవారాధకులు ఫలానా నక్షత్ర బలం వల్ల వర్షం కురిసింది అని విశ్వసించేవారు.[10]

---

7. *ముహాజిరాత్ ఖిజ్రీ-1/56; ఇబ్నె హిష్షామ్-1/102, 103.*
8. *జూదం ఆడేవారు ఓ ఒంటెను జిబహ్ చేసి దాన్ని పది లేక ఇరవై ఎనిమిది పోగులుగా వేసేవారు. ఆ తరువాత బాణాలు తీసి చూసేవారు. ఏ బాణం పైనైతే విజయం గుర్తు ఉన్న వ్యక్తి భాగానికి అది వస్తే అతడు తన వాటాను తీసుకునేవాడు. విజయ చిహ్నం లేని వ్యక్తి ఓడినట్లు లెక్క. అతడు ఆ మాంసాన్ని ఖరీదు కట్టి మరీ తీసుకునేవాడు.*
9. *మర్క్ ఆతుల్ మఫాతీహ్, షరహ్ మిష్కాతుల్ మసాహితబ్-2/2,3*
10. *సహీ ముస్లిమ్ : కితాబుల్ ఈమాన్-అధ్యాయం, అవిశ్వాసం-1/95*

అరబ్బు ముష్రిక్కుల్లో శకునాలకు సంబంధించిన సంప్రదాయం కూడా ఉండేది. దాన్ని అరబ్బీలో 'తియరా' అని అంటారు. మంచి శకునంగాని, దుశ్శకునాన్నిగాని తెలుసుకునే విధానం ఒకటుండేది. ఓ పక్షిని లేదా ఓ లేడిని బెదరగొట్టి లేపేవారు. అది కుడి వైపునకు పరిగెత్తితే మంచి శకునంగాను విజయ సూచనగానూ, ఎడమ వైపునకు పరుగిడితే దుశ్శకునంగాను తలచి దానికి అనుగుణంగా తమ పనులను మానుకునేవారు. అలాగే పక్షి అయినా, జంతువైనా వారు వెళ్ళే మార్గానికి అడ్డంగా వెడితే అది కూడా వారి దృష్టిలో దుశ్శకునమే.

ఇవే కాకుండా మరికొన్ని మూఢాచారాలు అరేబియా అరబ్బుల్లో చోటు చేసుకొని ఉండేవి. కుందేలు కాలి చీలమండ ఎముకను వారి ఇంటి ముందు వ్రేళ్ళాడదీసేవారు. వారంలో కొన్ని దినాలను, సంవత్సరంలోని మాసాల్లో కొన్ని మాసాలను, కొన్ని రకాల జంతువుల్ని, కొన్ని ఇండ్లను, కొందరు స్త్రీలను వారు అశుభాలుగా, కలిసిరానివిగా తలచేవారు. అంటువ్యాధులుకాని కొన్ని వ్యాధుల్ని అంటువ్యాధులగా తలచి రోగి వద్దకు వెళ్ళేవారే కాదు. ఆత్మ గుడ్ల గూబ రూపం దాలుస్తుందని నమ్మేవారు. అంటే హతుని ఆత్మ, హంతకునితో పగతీర్చుకోనంత వరకు ఎడారిలో సంచరిస్తూ 'దాహం, దాహం, నా దాహాన్ని తీర్చండని' అరుస్తూ తిరుగుతుందని, పగతీర్చుకుంటే తప్ప దానికి శాంతి లభించదని తలచేవారు.[11]

ఇబ్రాహీం (అ.స.) గారి ధర్మంలో ఖురైష్ల విపరీత పోకడలు

అజ్ఞాన కాలపు అరబ్బు జాతిలో పైన తెలిపిన ఆచారాలపై నమ్మకాలు చోటు చేసుకొని ఉండడమే కాకుండా వారి నడుమ ఇబ్రాహీం (అ.స.) చూపిన మార్గానికి సంబంధించిన కొన్ని ఆచారాలు నమ్మకాలు కూడా ఉంటూ ఉండేవి. వారు పూర్తిగా ఇబ్రాహీం (అ.స.) ధర్మాన్ని వీడలేదు. అందుకని వారు విధిగా దైవగృహాన్ని గౌరవించడం, దాని చుట్టూ తవాఫ్ (ప్రదక్షిణ) చేయడం కూడా చేస్తూ ఉండేవారు. హజ్, ఉమ్రాలు నిర్వహించేవారు. అరఫాత్, ముజ్దలిఫాలో విడిది చేసేవారు. దానికి తోడు 'హదీ' పశువుల (అల్లాహ్ కోసం బలికి కేటాయించే పశువుల) ఖుర్బానీ కూడా చేసేవారు. అయితే ఇబ్రాహీం (అ.స.) ధర్మంలో అనేక బిద్అత్లను (క్రొత్త ఆచారాలను) చేర్చారు.

11. సహీ బుఖారి 2/851, 857 వివరణతో సహా.

ఉదాహరణకు కొన్ని.

వారు ఏర్పరచుకున్న బిద్అత్లలో ఒక బిద్అత్ ఏమిటంటే, మేము హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) సంతానం, బైతుల్లా సంరక్షకులం, కాబా గృహం మా సొత్తు, ఏ ఒక్కరు మా హోదాకు సాటిరారు, ఇంకొకరి హక్కులు మా హక్కులకు సమానం కావు అని తలచడం - ఈ కారణంగానే వారు తమ సంతతిని 'హుమ్స్' (వీరులు) గా పిలుచుకునేవారు- కాబట్టి మేము 'హరమ్' (మక్కా) సరిహద్దులను దాటి బయటికి వెళ్ళడం మా హోదాకు తగినది కాదు అంటూ హజ్ కాలంలో 'అరఫాత్' మైదానానికి వెళ్ళేవారు కాదు. అక్కడ 'ఇఫాజా' (విడిది) చేసేవారు కాదు. పైగా ముజ్దలిఫాలోనే ఇఫాజా చేసేవారు. అల్లాహ్ ఈ బిద్అత్ను సవరిస్తూ ఖుర్ఆన్లో ఇలా సెలవిచ్చాడు.

ثُمَّ أَفِيضُوا مِنْ حَيْثُ أَفَاضَ النَّاسُ

"మీరున్నూ, అందరు ఇఫాజా చేసే స్థలం నుండే ఇఫాజా చేయండి."[12]

(2-119)

వీరి మరో బిద్అత్ ఏమిటంటే, హుమ్స్ (అంటే ఖురైష్ వంశం వారు) ఇహ్రామ్ వస్త్రధారణ స్థితిలో జున్ను, నెయ్యి తయారుచేయడం సరికాదని, నీడ కోసం తోలు గుడారాల్లో మాత్రమే ఉండాలని, వెంట్రుకలతో తయారుచేసిన గొంగళి గుడారాలు నిషిద్ధమని తలచడం.[13]

కల్పించుకున్న మరో ఆచారం.

హజ్, ఉమ్రా కోసం హరమ్ (మక్కా) వెలుపలి నుండి వచ్చే యాత్రికులు తెచ్చుకున్న ఆహార పదార్థాలను వీరు తినడం సరికాదని తలచడం.[14]

హరమ్ వెలుపల నుండి హజ్, ఉమ్రా యాత్రికులు హరమ్లోనికి ప్రవేశించిన తరువాత మొదటి 'తవాఫ్' (ప్రదక్షిణ) హుమ్స్ ఇచ్చిన వస్త్రాలు కట్టుకునే చేయాలని ఆదేశించడం మరో బిద్అత్. ఆ వస్త్రాలు లభ్యం కాకపోతే పురుషులు నగ్నంగానే తవాఫ్ చేసేవారు. స్త్రీలు తాము ధరించిన వస్త్రాలన్నిటిని విప్పేసి కేవలం ఓ చిన్న సైజు కలిగిన శరీరం కనబడే చొక్కాను ధరించి కాబా గృహ ప్రదక్షిణ చేసేవారు. ప్రదక్షిణ చేస్తూ ఈ క్రింది పద్యపాదాలను వల్లించేవారు.

12. ఇబ్నె హిషామ్-1/199, సహీబుఖారి-1/226
13. ఇబ్నె హిషామ్-1/202.
14. ఇబ్నె హిషామ్-1/202.

"నేడు మర్మాంగాలు కొంచెమో లేదా పూర్తిగానో బయటపడితే నేను దాన్ని చూడడం ధర్మసమ్మతంగా తలచను" అని.

అల్లాహ్ ఈ అర్థంలేని పనుల్ని ఖండిస్తూ వారిని ఇలా హెచ్చరించాడు.

يٰبَنِيْٓ اٰدَمَ خُذُوْا زِيْنَتَكُمْ عِنْدَ كُلِّ مَسْجِدٍ

"ఓ ఆదమ్ సంతానమా! ప్రతి ఆరాధనా సమయంలో మీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ చూపండి " (7-31)

మొత్తానికి స్త్రీగాని, పురుషుడుగాని, ఎవరైనా గౌరవంగా ఉండాలనే తలంపుతో, హరమ్ వెలుపలి నుండి తెచ్చిన వస్త్రాలను ధరించి తవాఫ్ చేస్తే, తవాఫ్ అయిన తరువాత ఆ వస్త్రాలను బయట పారేసేవాడు. వాటితో తిరిగి తానుగాని, ఇతరులుగాని ఎవ్వరూ ప్రయోజనం పొందేవారు కాదు.[15]

ఖురైషులు కల్పించుకున్న బిద్అత్‌లలో, ఇహ్రామ్ కట్టుకొని ఇంట్లో ప్రవేశ ద్వారం గుండా లోనికి ప్రవేశించకుండా ఇంటి వెనుక భాగంలో పెద్ద రంధ్రం చేసి అందులో నుంచి లోనికి ప్రవేశించడం, ఆ నిర్వాకాన్ని వారు సత్కార్యంగా భావించడం మరొకటి. దివ్య ఖుర్ఆన్ ఈ ఆచారాన్ని కూడా నిషేధించింది. (2-189)

ఈ ధర్మమే - అంటే బహుదైవారాధన, షిర్క్, మూఢనమ్మకాలు, అర్థం లేని పనుల ధర్మం - అరేబియా ప్రజల్లో సర్వసాధారణమైపోయిన ధర్మం.

ఇదేకాకుండా అరేబియా ద్వీపకల్పం చుట్టూ గల ఇతర ప్రాంతాల్లోని యూదు మతం, క్రైస్తవ మతం, అగ్ని ఆరాధకులు, సాబీ మతం కూడా ప్రవేశించే అవకాశాలు కలిగి ఉండేవి. కాబట్టి వాటి చారిత్రక రూపం టూకీగా ఇక్కడ చెప్పుకుందాం.

అరేబియా ద్వీపంలో యూదుల శకాలు రెండు గడిచాయి. వీటిలో మొదటి శకం, పాలస్తీనాలో 'బాబిలోనియా' మరియు 'ఆషూర్' సామ్రాజ్యాల విజయం ఫలితంగా యూదులు వలస వెళ్ళడానికి సంబంధించింది. ఆ పరిపాలన దమనకాండ, రాజు 'బక్త్ నసర్' యూదు బస్తీలను సర్వనాశనం చేయడం, వారి 'హైకల్' (యూదుల ప్రార్థనా మందిరం) విధ్వంసం, యూదు

15. ఇబ్నె హష్షామ్-1/202, 203; సహీబుఖారి-1/226.

లను పెద్ద సంఖ్యలో బాబిలోనియాకు తరిమివేయడం వగైరాల ఫలితంగా యూదులు పాలస్తీనాను వదలి హిజాజ్ ఉత్తర దిశనగల చుట్టుపట్ల ప్రాంతాలకు వచ్చి స్థిరపడడానికి సంబంధించింది.[16]

రెండవ శకం, రోమ్‌కు చెందిన 'టైటస్' నాయకత్వంలో క్రీ.శ.70వ సంవత్సరంలో రోమనులు పాలస్తీనాను వశపర్చుకున్నప్పుడు యూదులపై రోమనులు చేసిన ఆగడాలు వారి హైకల్‌ను నాశనం చేసిన ఫలితంగా అనేక యూదు తెగలు హిజాజ్‌కు కాందిశీకులుగా పారిపోయి రావడం. వీరు యస్రిబ్, ఖైబర్, తైమాలో వచ్చి స్థిరపడి తమ జనవాసాలను నిర్మించుకోవడమే కాక, కోటను, దుర్గాలను నిర్మించుకున్నారు. ఈ వలస వచ్చిన యూదు మతస్థుల ద్వారా అరేబియా ప్రజల్లోను కొంత వరకు యూదు మతం చోటు చేసుకుంది. ఇస్లాం ఆవిర్భావానికి పూర్వం, ఇస్లామ్ ప్రారంభకాలంలోను రాజకీయ ఒడిదుడుకుల్లోను దాని ప్రభావం ఏర్పడటమే. ఇస్లాం ఆవిర్భావం నాటి యూదు తెగల్లో ఖైబర్, నజీర్, ముస్తలక్, ఖురైజా మరియు ఖైనుఖా ప్రముఖమైనవి. వఫా ఉల్ వఫా అనే గ్రంథకర్త సమ్‌హూది ఆ గ్రంథం పుట 116లో ఈ యూదు తెగల సంఖ్య ఇరవైకంటే అధికమని రాశాడు.[17]

యూదు మతానికి యమన్‌లోనూ వికాసం లభించింది. అక్కడ అది వృద్ధినొందడానికి కారణం 'తబాన్ అస్అద్ అబూ కరబ్' అనే వ్యక్తి. ఇతను యుద్ధం చేస్తూ యస్రిబ్ చేరాడు. అక్కడనే యూదు మతాన్ని స్వీకరించాడు. బనూ ఖురైజాకు చెందిన ఇద్దరు యూదు పండితుల్ని తమ వెంట తోడుకొని యమన్ దేశానికి వచ్చాడు. వారి ద్వారా యమన్‌లో యూదమతం వ్యాప్తి చెందింది. అబూ కరబ్ అనంతరం అతని కుమారుడు 'యూసుఫ్ జూనువాస్' యమన్‌కు రాజయ్యాడు. అతను యూదు మతం పిచ్చిలో నజ్రాన్‌కు చెందిన క్రైస్తవులపై దాడి చేశాడు. వారిని యూదు మతం స్వీకరించడానికి ఒత్తిడి చేయగా వారు దాన్ని నిరాకరించారు. అందుకు జూనువాస్ ఓ పెద్ద కందకం త్రవ్వించి అందులో అగ్నిని రాజేశాడు. ఆ అగ్నిగుండంలో స్త్రీ, బాల, వృద్ధులు అనే విచక్షణ లేకుండా వారందరిని పడవేసి కాల్చి చంపాడు. చనిపోయిన వారి సంఖ్య ఇరవై, నలభై వేల నడుమ ఉంటుంది అని చెప్పుకోవడం జరుగు

16. ఖల్బ్ జజీరతుల్ అరబ్-పుట. 251.
17. ఖల్బ్ జజీరతుల్ అరబ్-పుట. 251.

తుంది. ఇది క్రీ.శ. అక్టోబరు, 532వ సంవత్సరపు సంఘటన. దివ్య ఖుర్ఆన్ లోని బురూజ్ సూరాలో దీని ప్రస్తావన ఉంది.[18]

ఇక క్రైస్తవం విషయానికొస్తే, అరేబియాలో వారి ప్రవేశం అబీసీనియా మరియు రోమనుల ఆక్రమణ ద్వారా జరిగింది. యమన్‌ను అబీసీనియనులు క్రీ.శ. 340లో ఆక్రమించుకున్న విషయం మనం ఇదివరకే చర్చించుకున్నాం. ఇది మొదటి ఆక్రమణ. ఇది క్రీ.శ. 378 వరకు కొనసాగింది. ఈ మధ్య కాలంలో యమన్ దేశంలో క్రైస్తవ మిషనరీలు పని చేశాయి. దాదాపు అదే కాలంలో ఓ క్రైస్తవ సన్యాసి 'ఫీమూన్' నజ్రాన్‌కు వచ్చాడు. అక్కడి ప్రజల్లో క్రైస్తవ మత ప్రచారం చేశాడు. ఆ సన్యాసి మహత్యాలను, ఆ మతం ఔన్నత్యాన్ని చాటే కొన్ని సూచనలు చూసి నజ్రాన్‌వాసులు క్రైస్తవులుగా మారి పోయారు.[19]

ఆ తరువాత జూనువాస్ చర్యకు ప్రతిచర్యగా అబీసీనియనులు తిరిగి యమన్‌ను వశపర్చుకోవడం జరిగింది. 'అబ్రహా'యమన్ పాలనాపగ్గాలను తన చేతిలో తీసుకొని ఎంతో ఉత్సాహంతో పెద్ద ఎత్తున క్రైస్తవాన్ని విస్తరింపజేసే ప్రయత్నం చేశాడు. ఈ ఉన్మాదంలోనే అతడు యమన్‌లోనే ఓ కాబా గృహాన్ని నిర్మించి అరబ్బు జాతీయులందరిని (మక్కా దైవగృహాన్ని విడిచి) తాను నిర్మించిన కాబా హజ్ చేయించడానికి ప్రయత్నం చేశాడు. మక్కాలోని కాబాను ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా, అల్లాహ్ అతని ఈ దుస్సాహసానికి తగిన శిక్ష విధించాడు. ఇది అందరికి ఓ గుణపాఠంగా మిగిలిపోయింది.

మరో ప్రక్క రోమను సామ్రాజ్యం పొరుగున ఉన్న కారణంగా ఆలె గస్సాన్, బనూ తగ్లబ్ మరియు బనూ తై వగైరా అరబ్బు తెగల్లో క్రైస్తవం వ్యాపించింది. సరికదా, హీరాకు చెందిన కొందరు అరబ్బు రాజులు సయితం క్రైస్తవ మతాన్ని స్వీకరించారు.

మజూసి (అగ్ని ఆరాధక) మతం. అది చాలా మట్టుకు పర్షియా పొరుగున అరబ్బుల్లో వ్యాప్తి చెందింది. ఉదాహరణకు, అరేబియాలోని ఇరాఖ్ ప్రాంతం, బహ్రైన్ (అల్ అహ్సా), హిజ్ర్ మరియు అరేబియా అఖాత తీరప్రాంతాలు.

18. ఇబ్నె హష్షామ్-1/20, 21, 22, 27,31,35,36. అదే కాకుండా బురూజ్ సూరా వ్యాఖ్యానం గురించి ఖుర్ఆన్ వ్యాఖ్యాన గ్రంథాలను చూడవచ్చు.

19. ఇబ్నె హష్షామ్-1/31-34.

ఇవే కాకుండా యమన్‌పై పర్షియన్ అధికార సమయాన అక్కడ కూడా కొంత మంది ఈ మతాన్ని స్వీకరించడం జరిగింది.

ఇక మిగిలింది 'సాబీ' మతం. ఇరాఖ్ వగైరాల్లో జరిగిన పురాతన శిథిలాల త్రవ్వ కాల్లో బయల్పడిన శిలాశాసనాల ద్వారా ఇది హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) కు చెందిన కల్దాని జాతి మతం అని తెలిసింది. పురాతన కాలంలో సిరియా, యమన్‌వారనేకులు ఈ మతానుయాయులే. అయితే యూదు మతం, ఆ తరువాత క్రైస్తవ వికాసం ఊపందుకున్నప్పుడు ఈ మత పునాదులే కదిలిపోయి నామరూపాల్లేకుండాపోయింది. అయినప్పటికి, మజూసీ మతంతో కలగా పులగమై లేదా వారి పొరుగున్నే ఇరాఖ్ మరియు అరేబియా అఖాత తీరంలోను ఈ మతానుయాయులు కొందరు మిగిలి ఉండేవారు.[20]

ధార్మిక పరిస్థితి

అరేబియా ద్వీపంపై ఇస్లామ్ కిరణాలు ప్రసరించినప్పుడు అక్కడ మనుచున్న మతాలు ధర్మాలు ఇవే. అయితే ఈ మతాలన్నీ చీలికపేలికలై ఉండేవి. ఇబ్రాహీం (అ.స.) ధర్మాన్నే అనుసరిస్తున్నాం అంటున్న ముష్రిక్‌లు (బహుదైవారాధకులు) సయితం ఆయన బోధనలకు ఆమడ దూరంలోనే ఉన్నారు. ఇబ్రాహీం (అ.స.) ఏ నైతికతలను బోధించారో అవి ఆ ముష్రిక్‌లలో నామ మాత్రానికైనా కానరాకపోయేవి. పాపపంకిలంలోపడి, ఓ సుదీర్ఘకాలం గడిచి పోయినందున వారిలోనూ విగ్రహారాధనకు సంబంధించిన ఆచారాలు సంప్రదాయాలు చోటుచేసుకున్నాయి. ఇవి కూడా ధార్మిక పుణ్యకార్యాలుగానే భావించేవారు. ఈ ఆచారసంప్రదాయాలు వారి రాజకీయ, ధార్మిక జీతవింపై గొప్ప ప్రభావం కలిగి ఉండేవి.

యూదు మత పరిస్థితి కేవలం ప్రదర్శనాబుద్ధి, పెత్తనం చెలాయించడం మట్టుకే మిగిలిపోయింది. యూదు మత గురువులు అల్లాహ్‌కు బదులు తామే ప్రభువులై కూర్చున్నారు. ప్రజలపై తమ ఇష్టాన్ని రుద్దేవారు. ప్రజల మనస్సుల్లోని మాటలను తెలిసినట్లుగా నటిస్తూ, వారి పెదాల నుండి బయటకు వచ్చే ప్రతీ మాటను పరీక్షించేవారు. సంపద, రాజ్యం ఎలా సొంతం చేసుకోవాలన్న

20. తారీఖ్ అర్దుల్ ఖుర్ఆన్-2/193 - 208.

విషయంపైనే వారి దృష్టి కేంద్రీకరించబడి ఉండేది. వారి ఈ ప్రవర్తన మూలంగా యూదు ధర్మం ఎంత నాశనమైనా సరే, అవిశ్వాసం నాస్తికత్వం ఎంత ప్రబలిపోయినా సరే, ఆ మతానుయాయులకు దైవం ఇచ్చిన ఆదేశాలు, బోధనలు ఎంత దెబ్బతిన్నా సరే.

క్రైస్తవం అనుకోని విధంగా ఓ విగ్రహారాధనగా మారిపోయింది. వారు అల్లాహ్‌ను మరియు మానవుణ్ణి అద్భుతంగా మిశ్రమం చేసేశారు. ఏ అరబ్బులయితే ఈ మతాన్ని స్వీకరించారో వారిపై ఈ మత ప్రభావం ఏ మాత్రం లేకుండా ఉండేది. కారణం, ఈ మత బోధనలు వారికి ప్రియమైన స్వదేశ జీవితానికి సరిపోకపోవడమే. వారు తమ జీవన సరళిని మానుకోకపోవడమే.

తక్కిన అరేబియా మతాలను అవలంబించేవారి పరిస్థితి ముష్రిక్‌లకు భిన్నమైనదేమీ కాదు. వారి ఊహలు, వారి నమ్మకాలు, వారి ఆచార సంప్రదాయాలల్లో అవినాభావ సంబంధం ఉండడమే దానికి కారణం.

అజ్ఞాన కాలంనాటి అరబ్బుల సామాజిక తీరుతెన్నులు

ఆనాటి అరేబియా ద్వీపం యొక్క రాజకీయ, ధార్మిక పరిస్థితులను చర్చించుకున్న తరువాత ఇప్పుడు అక్కడి సామాజిక, ఆర్థిక మరియు నైతిక పరిస్థితులు ఎలా ఉండేవో క్లుప్తంగా తెలుసుకుందాం.

సామాజిక పరిస్థితులు

అరేబియా జనసంఖ్య వివిధ వర్గాల కలగాపులగం. ప్రతి వర్గం పరిస్థితి, ఇంకో వర్గం పరిస్థితి కంటే భిన్నంగా ఉండేది. ఉన్నత వర్గంలోని స్త్రీ పురుషుల నడుమగల సంబంధ బాంధవ్యాలు చెప్పుకోదగినంత ఆధునికంగా ఉండేవి. స్త్రీకి ఆ సమాజంలో చాలా మట్టుకు స్వాతంత్ర్యం ఉండేది. ఆమె సలహాను పాటించడం జరిగేది. ఒక్కోసారి ఆమె సంరక్షణ, గౌరవం విషయంలో యుద్ధాలు కూడా జరిగేవి. అరబ్బులకు తమ శౌర్యప్రతాపాలను చాటుకోవడం అంటే మహా ఇష్టం. దీనికోసం ఓ అరబ్బు వ్యక్తి తన కీర్తిని చాటుతూ స్త్రీనే సంబోధించే వాడు. అప్పుడప్పుడు స్త్రీ అనుకుంటే తెగలన్నిటిని సంధి కోసం ఏకత్రం చేయగలిగేది. కావాలంటే తన ఒక్క సైగపై యుద్ధ జ్వాలలు రగిల్చి రక్తపాతం జరిగేటట్లు కూడా ప్రవర్తించేది. ఏది ఏమైనప్పటికీ, పురుషుడే కుటుంబానికి పెద్దగా తలచబడేవాడు. అతని మాటే తీర్పు. ఈ వర్గంలో స్త్రీ పురుషుల సంబంధం నికాహ్ (వివాహం) ద్వారా ఏర్పడేది. ఈ నికాహ్‌ను స్త్రీ సంరక్షకులు తమ చేతుల మీదనే జరిపేవారు. సంరక్షకుడు లేకుండా ఏ స్త్రీ అయినా తాను సొంతంగా నికాహ్ చేసుకోవడానికి వీల్లేదు.

ఓ వైపు ఉన్నత తరగతి పరిస్థితి ఇలా ఉంటే, మరో వైపు ఇతర తరగతుల్లో స్త్రీ పురుషుల విచ్చలవిడి కలయికకు సంబంధించిన అనేక పద్ధతులు కూడా ఉండేవి. ఈ కలివిడితనానికి అశ్లీలం, వ్యభిచారం తప్ప మరో పేరు పెట్టడానికి వీల్లేదు. హజ్రత్ ఆయిషా (ర.అ.) కథనం ప్రకారం, అజ్ఞాన

కాలంలోని అరబ్బుల్లో నికాహ్ (వివాహం)కు సంబంధించిన రకాలు నాలుగు. ఒకటి, నేడు సాధారణంగా అమలులో ఉన్న ఆచారం. ఇది, ఓ వ్యక్తి మరో వ్యక్తికి అతని సంరక్షణలో ఉన్న అమ్మాయిని వివాహం చేసుకుంటానని కబురు పంపడం. అతని ఈ సంబంధం స్వీకరించబడినప్పుడు ఆ వ్యక్తి మహర్ (స్త్రీ ధనం) చెల్లించి ఆ అమ్మాయిని పెళ్ళాడేవాడు. రెండవ రకం వివాహం ఎలా జరిగేదంటే, రుతుస్రావం నుండి పరిశుద్ధత పొందిన స్త్రీని, ఆమె భర్త ఫలానా వ్యక్తి దగ్గరకు పంపిస్తూ, ఈమె మర్మాంగాన్ని పొందమని (అంటే ఈమెతో వ్యభిచరించమని) చెప్పి పంపేవాడు. భర్త మాత్రం ఆ వ్యక్తి ద్వారా ఆమె గర్భం దాల్చింది అని తెలిసేటంత మట్టుకు ఆమెకు దూరంగా ఉండేవాడు. నెలలు నిండిన తరువాత భర్త అనుకుంటే ఆమెతో సంభోగించేవాడు. ఇలా చేయ డానికి కారణం పుట్టబోయే బిడ్డ యోగ్యుడుగా ఉండాలన్నదే. ఈ రకం నికాహ్ 'నికాహె ఇస్తెబ్‌జా'గా పిలువబడేది (దీన్నే భారత దేశంలో నియోగ్ అంటారు). నికాహ్‌కు సంబంధించిన మూడవ రకం, పది మంది పురుషులకు తక్కువ సంఖ్యగల ఓ సమూహం ఓ చోట చేరేది. అందరూ ఒకరి తరువాత మరొకరు ఆ స్త్రీతో సంభోగించేవారు. ఆ స్త్రీ గర్భవతి అయి శిశువు జన్మించగా ప్రసవం అయిన కొన్ని రోజుల తరువాత అందరినీ పిలువనంపేది. అందరూ తప్పని సరిగా అక్కడ చేరాలన్న నిబంధన ఉన్నందున వారంతా ఆమె దగ్గర చెప్పిన సమయానికి వచ్చి చేరేవారు. ఆ తరువాత ఆమె వారితో, జరిగిన విషయం మీకందరికి తెలిసినదే. నా గర్భం నుండి జన్మించిన ఈ బిడ్డ మీలోని ఓ ఫలానా వ్యక్తి బిడ్డ అని వారిలోని ఓ వ్యక్తి పేరు చెప్పేది. ఆ బిడ్డ అతని సంతానంగా అందరూ గుర్తించేవారు.

నాలుగవ రకం వివాహం (నికాహ్)లో చాలా మంది కూడి ఒకే స్త్రీని సంభోగించేవారు. ఆమె తన వద్దకు వచ్చిన ఏ పురుషుణ్ణీ కాదనకపోయేది. ఇలాంటి స్త్రీలు కులటలు. ఈ రకం స్త్రీలు తమ ఇంటి ముందు, "ఇది ఫలానా వ్యభిచారిణి ఇల్లు, ఎలాంటి సంకోచం లేకుండా ఎవరైనా రావచ్చు" అని తెలియడానికి జెండాలు కట్టి ఉంచేవారు. ఇలాంటి స్త్రీ గర్భందాల్చి బిడ్డకు జన్మనిస్తే ఆమెతో వ్యభిచరించిన వారంతా ఆమె దగ్గరకు వచ్చి చేరేవారు. అప్పుడు ఓ ముఖసాముద్రికుణ్ణి (Physiognomist- ముఖ లక్షణములను బట్టి తండ్రి ఎవరో నిర్ణయించేవాడు) పిలిపించేవారు. అతను తన అంచనా ప్రకారం

ఆ బిడ్డను అందులోని ఓ వ్యక్తికి అంటగట్టేవాడు. ఆ తరువాత ఆ బిడ్డ అతని బిడ్డగానే చెలామణి అయ్యేది. అతడు ఆ తీర్పును తప్పకుండా శిరసావహించ వలసిందే. అల్లాహ్, ముహమ్మద్ (స)ను ప్రభవింపజేసిన తరువాత అజ్ఞాన కాలంనాటి ఈ రకం నికాహ్‌లన్నీ రద్దు చేయబడ్డాయి. కేవలం నేడు ఆచరణలో ఉన్న ఒక్క నికాహ్ మాత్రమే మిగిలి ఉంది.[1]

అరేబియాలో స్త్రీ పురుషుల సంబంధాలకు చెందిన రకాలు కొన్ని ఖడ్గం, బరిశె మొనల నీడన ఉనికిలోనికి వచ్చేవి. అంటే తెగల పోరాటాల సందర్భంలో విజయం పొందిన తెగ, ఓడిపోయిన తెగల స్త్రీలను ఖైదు చేసి తన భార్యలుగా చేసుకోవడం అన్నమాట. అయితే, అలాంటి స్త్రీలకు జన్మించిన సంతానం జీవితాంతం దాన్ని అవమానంగానే భావించేది.

అజ్ఞాన కాలంలో ఎలాంటి పరిమితి లేకుండా అనేక భార్యలను కలిగి ఉండడం పరిపాటి. స్వయాన ఒకే తల్లి గర్భంలో జన్మించిన అక్కచెల్లెళ్ళను సయితం భార్యగా చేసుకోవడంలో ఆనాడు తప్పులేదు. తండ్రి విడాకులివ్వగా లేదా మరణించగా కుమారుడు తన మారు తల్లిని నికాహ్ చేసుకునేవాడు. తలాక్ (విడాకులు)ఇచ్చే అధికారం కేవలం పురుషులదే. దానికి ఓ హద్దూపద్దూ అనేది లేకుండా ఉండేది.[2]

వ్యభిచారం అన్నిరకాల వర్గాల్లోను సర్వసామాన్యమై తారాస్థాయికి చేరుకుంది. ఏలాంటి వ్యక్తికిగాని, వర్గానికిగాని ఈ విషయంలో మినహా యింపే లేదు. అయితే కొందరు స్త్రీ పురుషుల ఔన్నత్య భావన వారిని ఈ పాపపంకిలంలో పడకుండా అడ్డుకునేది. అదేకాదు, స్వతంత్ర స్త్రీలు, బానిస స్త్రీలకంటే మెరుగ్గా ఉండేవారు. వ్యభిచారానికి అసలు మూలం కేవలం బానిస స్త్రీలే. అజ్ఞాన కాలపు అరబ్బు జాతి అధిక సంఖ్య ఈ పాపంలో పడినందుకు సిగ్గుపడేదే కాదు. కాబట్టి 'సునన్ అబూ దావూద్' వగైరా హదీసు గ్రంథాల్లోని కథనాల ప్రకారం, ఓ వ్యక్తి నిలబడి, "ఓ దైవప్రవక్తా (స)! ఫలానా వ్యక్తి నా కుమారుడు. నేను అజ్ఞాన కాలంలో అతని తల్లితో వ్యభిచరించాను" అని

1. సహీబుకారి, కితాబున్నికాహ్-2/769, అబూదావూద్; అధ్యాయం- వుజూ హున్నికాహ్.
2. అబూ దావూద్, మూడు తలాకుల తరువాత తిరిగి భార్యను ఉంచుకోవడం, రెండు తలాకుల సమస్యకు సంబంధించిన వ్యాఖ్యాన గ్రంథాలు.

అడిగాడు. దానికి దైవప్రవక్త (స), ఇస్లాం ధర్మంలో ఇలాంటి ప్రశ్నలకు తావే లేదు. అజ్ఞాన కాలం నాటి విషయాలు ఇప్పుడు లేవు. ఇప్పుడు ఆ పిల్లవాని తల్లి ఎవరి భార్యో లేదా ఎవరి బానిసో ఆ పిల్లవాడు అతని కుమారునిగానే తలచడం జరుగుతుంది. వ్యభిచారానికి శిక్ష రాళ్ళే (అంటే రాళ్ళతో కొట్టి చంపడమే అన్నమాట). హజ్రత్ సఅద్ బిన్ అబీ విఖాస్ (ర) మరియు 'అబ్దుల్లా జమ్అ' నడుమ, 'జమ్అ బానిస స్త్రీ కుమారుడు - అబ్దుర్రహ్మాన్ బిన్ జమ్అ - గురించి వచ్చిన తగాదా గురించి అందరికీ తెలిసిందే.[3]

అజ్ఞాన కాలంలో తండ్రీకుమారుల సంబంధం కూడా భిన్నంగా ఉండేది. కొందరయితే, "మా సంతానం భూమిపై తిరగాడే మా గుండెలు" అని సగర్వంగా చెప్పుకునేవారు.

అయితే మరోవైపు కొందరు అవమానభారంగా భావించి లేదా దారిద్ర్య భయంతో ఆడపిల్లల్ని సజీవంగా పాతిపెట్టేసేవారు. పిల్లలను దారిద్ర్యభయం వల్ల చంపడమూ జరిగేది.[4] కాని ఈ కాఠిన్యం అందరిలోనూ ఉండేదనడం సరికాదు. కారణం ఏమిటంటే, అరబ్బులు తమ శత్రువుల నుండి రక్షణ కోసం ఇతరుల కంటే తమ సంతానంపైనే అధికంగా ఆధారపడి ఉండడం; ఈ విషయం వారికి బాగా తెలిసిన విషయం.

సొంత సోదరులు, అన్నదమ్ముల పిల్లలు, కుటుంబ సభ్యులు మరియు తమ తెగవారి నడుమగల సంబంధానికి వస్తే ఇవి బాగా పటిష్ఠంగా ఉండేవి. అరబ్బులు తమ తెగల కొమ్ముగాసే అలవాటు ఆధారంగానే జీవించేవారు. దాని కోసమే తమ ప్రాణాల్ని సయితం అర్పించేవారు. తెగల నడుమ పరస్పర సహాయ సహకారాలు, సామూహికతలు సంపూర్తిగా ఉండేవి. దీనికి కొమ్ముగాసే విధానం మరీ పదును పెట్టేది. నిజం చెప్పాలంటే, ఈ వెనుకేసుకు వచ్చే విధానం, సంబంధబాంధవ్యాలే వారి సామాజిక జీవితానికి ఆటపట్టుగా ఉండేదనడంలో సందేహం లేదు. "మీ సోదరుణ్ణి ఆదుకోండి, అతడు దౌర్జన్యపరుడైనా, దౌర్జన్యానికి గురి అయినా" అనే అర్థం వచ్చే సామెతనే అనుసరించేవారు. ఇస్లామ్ ఆవిర్భావం తరువాత ఇలాంటి సామెత అర్థాన్ని పూర్తిగా సంస్కరించడం జరిగింది. ఇస్లాం ధర్మం చేసిన సంస్కరణలో దౌర్జన్యపరునికి సహాయపడడమంటే అతణ్ణి దౌర్జన్యం చేయకుండా అడ్డుకోవడం అన్నమాట.

---

3. సహీ బుఖారి-2/999, 1025, అబూ దావూద్-అల్‌వలదులిల్ ఫరాష్.

4. దివ్యఖుర్‌ఆన్-6-101, 16-58, 59; 17-31; 81-8.

గౌరవం, నాయకత్వంలో ఒకరికంటే మరొకరు మించిపోయే ఆలోచన, అనేక మార్లు ఒకే వ్యక్తి ద్వారా ఉనికిలోనికి వచ్చిన తెగల నడుమ యుద్ధానికి కారణభూతమయ్యేది. దానికి ఉదాహరణ ఔస్ మరియు ఖజ్‌రజ్, అబస్ మరియు జుబ్‌యాన్, ఇంకా బక్ర్ మరియు తగ్లబ్ వగైరా తెగల నడుమ సంభవించిన సంఘటనల్లో మనం చూడవచ్చు.

వివిధ తెగల నడుమ గల సంబంధ బాంధవ్యాల వ్యవహారానికొస్తే, ఇవి పూర్తిగా ముక్కచెక్కలై, వాటి శక్తినంతా మరో తెగతో పోరాడటంలోనే ఖర్చయిపోయేది. అయితే ధర్మం, మతం మరియు తాము స్వంతంగా ఏర్పరచుకున్న ఆచార సంప్రదాయాల సంగమం వల్ల ఏర్పడిన నమ్మకాల కారణంగా అప్పుడప్పుడు యుద్ధజ్వాలల్లోని తీవ్రత కొంత తగ్గుముఖం కూడా పట్టేది. కొన్ని సమయాల్లోనయితే పరస్పర స్నేహం, ప్రమాణ స్వీకారం, విధేయతా సూత్రాలపై తెగలన్నీ ఓ త్రాటిపై నడవడం కూడా కద్దు. అదే కాకుండా నిషిద్ధ మాసాలు వారి జీవనోపాధికి గొప్ప వరంగా పరిణమించేవి.

చెప్పొచ్చిందేమిటంటే, వారి సామాజిక పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉండి అజ్ఞానం ఎల్లెడలా రాజ్యం చేస్తుండేది. తాము ఏర్పరచుకున్న ఆచారాల్లో నిండా మునిగి పశువుల్లా జీవనం గడిపేవారు. స్త్రీ ఓ వ్యాపార వస్తువు. కొన్ని సమయాల్లో స్త్రీల ఎడల మట్టి, రాళ్ళ కంటే నీచంగా ప్రవర్తించడం జరిగేది. జాతుల పరస్పర సంబంధాలు బలహీనమై ఉండడమే కాదు, విచ్ఛిన్నమైపోయి ఉండేవి కూడా. పాలకుల ఆశయం కేవలం ప్రజలను పీడించి వసూలు చేసిన ధనార్జనతో తమ బొక్కసాలు నింపడం, శత్రువులతో యుద్ధానికి ప్రజలను యుద్ధారంగాల్లోనికి పంపించడం మట్టుకే పరిమితమై ఉండేది.

ఆర్థిక పరిస్థితి

ఆర్థిక పరిస్థితి, సామాజిక పరిస్థితిని అనుసరించేది. అరబ్బుల ఉపాధిపై దృష్టిని సారిస్తే తప్ప దీన్ని అంచనావేయలేము. వ్యాపారమే వారి జీవనోపాధికి, భృతికి ప్రధానమైన మార్గం గనక వ్యాపార మార్గాల్లో శాంతి వాతావరణం నెలకొంటే తప్ప ఇది సాధ్యమయ్యే విషయం కాదని అందరికీ తెలుసు. అరేబియా పరిస్థితి ఏమిటంటే; కేవలం నిషిద్ధ మాసాల్లోనే, ఉక్కాజ్, జిల్‌మజాజ్ మరియు మజిన్నా పేరుగల సంతలు అరేబియాలో పెట్టడం జరిగేది.

పరిశ్రమల విషయానికొస్తే, అరబ్బులు ఈ రంగంలో ప్రపంచం మొత్తం లోనూ వెనుకబడి ఉండేవారు. బట్టలు నేయడం, చర్మానికి పదనుపెట్టడం (Tanning) లాంటి కొన్ని పరిశ్రమలున్నా, చాలా మట్టుకు అవి యమన్, హీరా మరియు సిరియాకు పొరుగున ఉన్న అరేబియా ప్రాంతాల్లోనే ఉండేవి. అయితే అరేబియా మధ్యభాగంలో మాత్రం వ్యవసాయం, పశుపోషణ కొంతవరకు జరిగేది. అరబ్బు స్త్రీలందరూ నూలు వడికేవారు. అయితే వీరి కష్టం అంతా యుద్ధాలు, పోరాటాలకు సమిధగా మారేది. ఆకలి, దారిద్ర్యం అరేబియాలో రాజ్యమేలుతుండడం మూలంగా ప్రజలు తాము రోజూ తొడిగే దుస్తులు సైతం పొందలేకపోయేవారు.

నైతిక విలువలు

అజ్ఞాన కాలపు అరబ్బుల్లో నీచపు అలవాట్లు, భ్రష్టు భావాలు, అవివేకం మరియు స్థిరబుద్ధికి భిన్నమైన చేష్టలు ఉండివుండడం నిర్వివాదాంశం. అయితే వారిలో కొన్ని నైతిక విలువలు కూడా ఉండేవి. వాటిని గమనించిన ఏ వ్యక్తి అయినా ముక్కుపై వ్రేలు వేసుకోకమానడు. ఉదాహరణకు కొన్ని :

1. దాతృత్వం : ఈ సుగుణం అజ్ఞాన అరబ్బులందరిలోనూ కానవచ్చేది. ఈ దాతృత్వ గుణంలో ఒకరికంటే మరొకరు మించిపోయే ప్రయత్నం చేసేవారు. అరేబియా కవన సాహిత్యంలోని సగానికిపైగా పద్యపాదాలు ఈ దాతృత్వంతో నిండిపోయినందుకు వారు గర్వించేవారు. ఈ దాతృత్వం పునాదులపైనే ఒకరు తన గురించి గొప్పలు చెప్పుకుంటే మరొకడు ఇంకొకరి దాతృత్వాన్ని శ్లాఘించే వాడు. తీవ్రమైన చలి, పస్తుల కాలంలో ఎవరైనా అతిథి ఇంటికి వస్తే ఆ గడ్డుకాలంలోనూ దాతృత్వపు భావన పెల్లుబికి ఆ ఇంటి యజమాని, తన కుటుంబానికి జీవనాధారంగా ఉన్న ఏకైక పెంటి ఒంటెను జిబహ్ చేసి ఆతిథ్యమిచ్చేవాడు. ఈ ఔదార్యం ఫలితంగానే వారు పెద్ద పెద్ద రక్తపరిహారా లను, జరిమానాలను, ఆర్థిక భారాలను నెత్తికేసుకునేవారు. ఇలా ప్రజలను వినాశనం, రక్తపాతం నుండి రక్షించి ఇతర ధనవంతులు, సర్దారులను తలదన్నినట్లుగా గర్వించేవారు.

ఈ ఔదార్య భావన ఫలితంగానే వారు మద్యపానంపై విర్రవీగేవారు. మద్యపానం గర్వించదగిన విషయం కాదు అని వారికి తెలిసినా, అది ఔదార్యాన్ని, దాతృత్వాన్ని సులభతరం చేస్తుందని వారి నమ్మకం. ఎందుకంటే,

నిషా మత్తులో సంపదను నీళ్ళప్రాయంగా దానమివ్వడం మనిషికి అంత కష్టంగా అనిపించకపోవడమే. కాబట్టి వీరు ద్రాక్ష చెట్టును ఔదార్యంగాను, ద్రాక్ష సారాయిని 'బిన్తుల్ కరమ్' (ఔదార్యజనితం)గాను భావించేవారు. అజ్ఞాన కాలపు కవనాల్లో ఈ ఔదార్యగుణం, పొగడ్త, స్వోత్కర్ష, ఔన్నత్యాన్ని చాటే ఓ అధ్యాయంగా కనబడుతుంది. 'అంత్రా బిన్ షద్దాద్ అబసీ' తన గ్రంథం 'ముఅల్లకా'లో ఈ అర్థం వచ్చే పద్యపాదాలను ఉటంకించాడు.

"మధ్యాహ్న తీవ్రత తగ్గిన తరువాత, నేను నా ఎడమ వైపున ఉన్న గాజు సీసాలో, సీలు చేయబడిన పసుపు రంగు గల పరిశుభ్రమైన మధువును సేవిం చాను. దాన్ని త్రాగినప్పుడల్లా నా సంపదను వెదజల్లుతాను. అయినా నా మర్యాదకు ఎలాంటి భంగం కలుగదు. మత్తు దిగినా, నేను దానం చేయడంలో వెనుకాడను. నా నైతికత, నా ఔదార్యం ఎలాంటిదో మీ అందరికీ తెలుసు."

వారు జూదమూ ఆడేవారు. ఇదీ ఆ ఔదార్యగుణ ఫలితమే. అది కూడా దానధర్మాలు చేసే ఓ మార్గమని తలచేవారు. జూదమాడే వారికి వచ్చిన లాభం నుండి మిగిలినదంతా నిరుపేదలకు పంచిపెట్టడం జరిగేది. అందుకే దివ్యఖుర్ఆన్, సారాయి, జూదపు ప్రయోజనాన్ని నిరాకరించకుండా ఇలా సెలవిచ్చింది.

وَإِثْمُهُمَآ أَكْبَرُ مِن نَّفْعِهِمَا

"ఈ రెంటి పాపం వాటి నుండి వచ్చే లాభం కంటే అధికం" (2-219)

2. మాటకు కట్టుబడి ఉండటం: ఇది కూడా అజ్ఞాన కాలపు అరబ్బుల్లోని నైతిక సుగుణాల్లో ఒకటి. ప్రమాణం అంటే వారి దృష్టిలో ధర్మం లాంటిది. సతతం దానికి కట్టుబడి ఉండేవారు. ఈ మార్గంలో తమ సంతానం యొక్క ప్రాణాలు పోయినా, ఇల్లు గుల్లయిపోయినా వారికి తక్కువే. దీన్ని అర్థం చేసుకోవాలంటే, హానీ బిన్ మస్ఊద్ షైబానీ, సమూఅయిల్ బిన్ ఆద్ లేదా హాజిబ్ బిన్ జరారహ్ సంఘటనలు చాలు.

3. ఆత్మాభిమానం: ఆత్మాభిమానై ఉండడం, దౌర్జన్యం, పీడనను సహిం చకపోవడం కూడా అజ్ఞానపు నైతిక విలువల్లో ఒకటి. దీని కారణంగా వారిలో శౌర్యం, ఆత్మాభిమానం హద్దుమీరిపోయి ఉండేది. వెంటనే రోషపూరితు లయ్యేవారు. అవమానకరమని అనిపించే చిన్ని చిన్న విషయాల్లో సయితం కత్తులు దూసి నిలబడేవారు. రక్తపాతం కూడా జరిగేది. ఈ మార్గంలో వారికి

ప్రాణం అంటే లెక్కే ఉండేది కాదు.

4. సంకల్ప సాధన: అజ్ఞాన అరబ్బులు ఓ పనిని గౌరవప్రదమైనది, కీర్తిదాయిని అని అనుకుంటే దాన్ని సాధించడానికి తమ ప్రాణాలను సయితం పణంగా పెట్టి దాన్ని సాధించడానికి ప్రయత్నం చేసేవారు. అది వారిలోని ఓ ప్రత్యేకత.

5. సహనం, సంయమనం: ఇది కూడా అజ్ఞాన అరబ్బుల్లో ఉండిన శ్లాఘనీయ ప్రత్యేకత. అయితే ఇది వారి మితిమీరిన శౌర్యపరాక్రమాలు మరియు ఎల్లవేళలా యుద్ధాలలోపాల్గొనడం వల్ల బయటకు కానవచ్చేది కావు.

6. ఎడారి దేశదిమ్మరుల నిరాడంబరత: అంటే నాగరికత, కల్మషాలు, ఎత్తుగడలు తెలియకపోవడం. దీని ఫలితంగా వారిలో సత్యం, నీతి, నిజాయితి చోటుచేసుకొని ఉండడం. మోసం, దగా, మాటను జవదాటడం అంటే అసహ్యించుకునేవారు.

అరేబియా ద్వీపానికి మిగతా ప్రపంచంతోగల భౌగోళిక సంబంధ బాంధవ్యాలే కాకుండా అరబ్బుల్లోని ఈ నైతిక విలువల కారణంగానే మానవాళి నాయకత్వానికి మరియు దైవదౌత్య భారం మోయడానికే ఈ జాతిని ఎన్నుకోవడం జరిగిందేమో అని మేము అనుకుంటున్నాం. ఎందుకంటే ఈ నైతిక విలువలు కొన్ని సందర్భాల్లో కల్లోలాన్ని, అశాంతిని రేకెత్తించడానికి కారణభూతమై అప్పుడప్పుడు భయంకర సంఘటనలు కూడా చోటుచేసుకునేవి. అయితే స్వతహాగా ఇవి చాలా అమూల్యమైన నైతిక విలువలు. కొంత సంస్కరణతో మానవ సమాజానికి ప్రయోజనకరమైనవిగా మారడానికి ఆస్కారముంది. ఈ కార్యాన్నే ఇస్లామ్ ధర్మం నిర్వహించగలిగింది.

బహుశా ఈ నైతికతల్లో మాటకు కట్టుబడి ఉండడం అనే సుగుణం తరువాత ఆత్మాభిమానం, దాని దృఢత్వం; సంకల్పసాధన అతి విలువైనవి, ప్రయోజనకరమైనవి. కారణం, ఈ ప్రచండ శక్తి, సంకల్పశుద్ధి, సంకల్పసాధన లేకుండా అరాచకాన్ని, కల్లోలాన్ని అంతమొందించి న్యాయ వ్యవస్థను పునరుద్ధరించడం సాధ్యం కాకపోయేది.

అజ్ఞాన అరబ్బుల్లో మరికొన్ని సుగుణాలు కూడా ఉండేవి కాని వాటిని వివరించడం ఇక్కడ అనవసరం.

ప్రవక్త (స) వంశావళి, జననం, నలభై ఏండ్ల పవిత్ర జీవని

ప్రవక్త (స) వంశావళి

వంశం : దైవప్రవక్త (స) వంశావళిని మూడు భాగాలుగా విభజించ వచ్చు. మొదటి భాగం, చరిత్రకారులు, వంశజ్ఞులు అందరూ ఏకీభవించిన భాగం. ఈ వంశావళి 'అద్నాన్' వరకు వెళ్ళి ఆగిపోతుంది. రెండవ భాగం గురించి చరిత్రకారుల మధ్య అభిప్రాయభేదం ఉంది. కొందరు దీన్ని ఒప్పు కుంటారు, కొందరు నిరాకరిస్తారు. ఈ వంశావళి అద్నాన్ పైన ఇబ్రాహీం (అ.స.) వరకు వెళ్ళి ఆగుతుంది. ఇక మూడవ భాగం. ఇందులో కొన్ని తప్పులు దొరిలాయి. ఈ వంశావళి ఇబ్రాహీం (అ.స.) నుండి పైకి హజ్రత్ ఆదం (అ.స.) వరకు వెళ్ళి ఆగుతుంది. వెనుకటి పుటల్లో ఈ విషయాన్ని చూచాయగా చెప్పుకోవడం జరిగింది. క్రింది పంక్తుల్లో ఈ మూడు భాగాలను గురించి పేర్కొనటం జరుగుతుంది.

మొదటి భాగం

ముహమ్మద్ (స) తండ్రి అబ్దుల్లాహ్, ఆయన తండ్రి అబ్దుల్ ముత్తలిబ్ (షైబా), ఆయన తండ్రి హాషిమ్ (అమ్రూ). హాషిమ్ తండ్రి అబ్దె మునాఫ్ (ముగీరా). ఆయన తండ్రి ఖుసై (జైద్). ఖుసై తండ్రి కిలాబ్. కిలాబ్ తండ్రి ముర్రా. ముర్రా తండ్రి కఅబ్. ఆయన తండ్రి లువీ. లువీ తండ్రి గాలిబ్. ఆయన తండ్రి ఫహర్ (ఈయన బిరుదే ఖురైష్. ఆయన ఈ బిరుదు వల్లనే ఆ తెగకు ఖురైష్ తెగగా పేరు పడింది). ఫహర్ తండ్రి మాలిక్. ఆయన తండ్రి నజ్ర్ (ఖైస్). నజ్ర్ తండ్రి కనానా. ఆయన తండ్రి ఖుజైమా. ఖుజైమా తండ్రి ముద్రికా (ఆమిర్). ముద్రికా ఇలియాస్ కుమారుడు. ఇలియాస్ తండ్రి ముజ్ర్. ఈయన నజార్ కుమారుడు. నజార్ తండ్రి మఅద్. మఅద్ తండ్రి అద్నాన్.[1]

రెండవ భాగం

అద్నాన్‌కు పైన. అంటే అద్నాన్ తండ్రి 'ఔ'. ఆయన తండ్రి 'హమీసా'. హమీసా తండ్రి 'సలామాన్', సలామాన్ తండ్రి 'ఔస్', ఆయన తండ్రి 'యూజ్', యూజ్ తండ్రి 'ఖమ్‌వల్'. ఖమ్‌వల్ తండ్రి 'ఉబై'. ఆయనకు తండ్రి 'అవామ్', అవామ్ తండ్రి 'నాషిద్', నాషిద్ 'హిజా' కుమారుడు. హిజాకు తండ్రి 'బల్దాస్'. బల్దాస్ తండ్రి 'యద్‌లాఫ్', యద్‌లాఫ్ 'తాబిక్' కుమారుడు. తాబిక్ 'జాహిమ్'కుమారుడు. జాహిమ్ 'నాహిష్' కుమారుడు. నాహిష్ తండ్రి 'మాకీ'. ఆయన తండ్రి 'అయిజ్', అయిజ్ 'అబ్కర్' కుమారుడు. అబ్కర్ 'ఉబైద్' కుమారుడు. ఆయన తండ్రి 'అద్దఆ'. ఈయన 'హమ్దాన్' కుమారుడు. హమ్దాన్ 'సంబర్'కు, సంబర్ 'యస్రబీ'కి, యస్రబీ 'యహ్జన్'ల కుమారులు. యహ్జన్ తండ్రి 'అర్అవీ', అర్అవీ తండ్రి అయిజ్‌లు. అయిజ్ జీషాన్‌కు, జీషాన్ అసీర్‌కు, అసీర్ ఉఫ్నాద్‌కు తండ్రులు. ఉఫ్నాద్ 'అయిహామ్' కుమారుడు. అయిహామ్ తండ్రి మఖ్సర్, ఆయన తండ్రి నాహిస్, ఆయనకు తండ్రి జిరాహ్. సమీ జిరాహ్ తండ్రి. జిరాహ తండ్రి మజీ. ఈయన 'ఔజా' కుమారుడు. ఔజా 'అరామ్' కుమారుడు. అరామ్ తండ్రి కైదార్. కైదార్ తండ్రి ఇస్మాయీల్ (అ.స.), ఇస్మాయీల్ (అ.స.) తండ్రి ఇబ్రాహీం (అ.స.).[2]

మూడవ భాగం

హజ్రత్ ఇబ్రాహీం (అ.స.)కు పైన. ఇబ్రాహీం (అ.స.) తండ్రి తారెహ్ (ఆజర్), తారెహ్ తండ్రి నాహూర్, నాహూర్ తండ్రి సారూ (లేదా సారూగ్), సారూ తండ్రి రాఊ, రాఊకు తండ్రి ఫాలిక్, ఫాలిక్ తండ్రి ఆబిర్. ఈయన షాలిక్ కుమారుడు. షాలిక్‌కు తండ్రి అర్ఫక్షద్. అర్ఫక్షద్ తండ్రి సామ్. సామ్ తండ్రి నూహ్ (అ.స.), నూహ్ (అ.స.) తండ్రి లామిక్. ఈయనకు తండ్రి ముతవష్లక్. ముతవష్లక్ తండ్రి అక్నూక్ (ఇది ఇద్రీస్ (అ.స.) గారి పేరుగా చెప్పుకోవడం జరుగుతోంది), అక్నూక్ తండ్రి యర్ద్, యర్ద్ తండ్రి మహ్లాయీల్, మహ్లాయీల్

1. *ఇబ్నె హష్షామ్-1/201, తల్ఖీహ్‌ఫహూమ్ అహ్లల్ అస్ర్-పుట 5,6; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/11 నుండి 14, 52.*
2. *అల్లామా మన్సూరి లోతైన పరిశోధన చేసి ఈ వంశవృక్ష భాగాన్ని, కలబీ మరియు ఇబ్నె అసద్ ఉల్లేఖనాల నుండి సంకలనం చేశారు. చూడండి. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/14-17. చరిత్ర ఆధారాల్లో ఈ భాగం గురించి అభిప్రాయ భేదాలున్నాయి.*

తండ్రి ఖీనాన్, ఈయనకు తండ్రి అనూషా, అనూషా తండ్రి షైస్ (అ.స.), షైస్ (అ.స.) తండ్రి ఆదం (అ.స.).[3]

ప్రవక్త (స) వంశావళి : దైవప్రవక్త (స) గారి వంశావళి ఆయన ముత్తాత హాషిమ్ బిన్ అబ్దె మునాఫ్‌తోగల సంబంధం రీత్యా హాషిమీ వంశంగా పేరు గాంచింది. కాబట్టి హాషిమ్, ఆ తరువాతి కొందరు వ్యక్తుల వివరాలను క్లుప్తంగా తెలియజేయడం అవసరమనిపిస్తోంది.

1. హాషిమ్ : ఇదివరకు మేము చెప్పినట్లు, బనూ అబ్దె మునాఫ్ మరియు బనూ అబ్దుద్దార్ నడుమ హోదాల పంపకం విషయమై రాజీ కుదిరినప్పుడు అబ్దె మునాఫ్ సంతానంలో హాషిమ్ ఒక్కడికే 'సికాయా' మరియు 'రిఫాదా' అంటే హజ్ యాత్రికులకు నీళ్లు త్రాపే, వారికి ఆతిథ్యం ఇచ్చే హోదాలు లభిం చాయి. హాషిమ్ మంచి గౌరవం, సంపద కలిగిన వ్యక్తి. మొట్టమొదట హాజీలకు మాంసపు చారు (Borth)లో రొట్టె ముక్కలను వేసి తినిపించే ఆనవాయితీ వేసిన మొదటి వ్యక్తి ఆయన. ఈయన అసలు పేరు అమ్రూ. అయితే రొట్టెల్ని ముక్కలుగా చేసి చారులో కలపడం వలన ఆయనకు హాషిమ్ అనే పేరు వచ్చింది. హాషిమ్ అంటే ముక్కలుగా చేసేవాడని అర్థం. అదే కాదు, ఖురైష్ కోసం ఎండా కాలం, చలికాలాల్లో ఏడాదికి రెండు వ్యాపార బిడారాలను పంపే పునాది వేసిన మొట్టమొదటి వ్యక్తి కూడా ఈ హాషిమే. ఈయన గురించి ఓ కవి ఇలా పొగిడాడు:

"కరువుపీడిత సమయాల్లో తన బలహీన జాతికి మక్కాలో రొట్టెలను త్రుంచి మాంసపు చారులో వేసి తడిపి తినిపించినవాడూ, ఎండా కాలం, చలి కాలాల్లో రెండు ప్రయాణాలను ప్రారంభించినవాడూ ఈ అమ్రూయే."

ఈయనకు సంబంధించిన ఓ ముఖ్య సంఘటన ఇలా ఉంది. ఆయన వ్యాపారం చేయడానికి సిరియా దేశానికి వెళ్ళాడు. ప్రయాణం చేస్తూ మదీనా వెళ్ళినప్పుడు అక్కడ బనీ నజ్జార్ తెగకు చెందిన ఓ యువతి సల్మా బిన్తె అమ్రూను వివాహమాడి కొన్ని రోజులు అక్కడే మకాం వేశాడు. భార్యను గర్భ వతిగా పుట్టింటనే వదలి సిరియాకు వెళ్ళిపోయాడు. అక్కడకు వెళ్ళి పాలస్తీనా

3. *ఇబ్నె హష్షామ్-1 /2-4; తల్గీహుల్ ఫహూం-పుట.6; ఖులా సతుస్సియర్-పుట. 6; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/18. కొన్ని పేర్ల విషయంలో వాటి ఆధారాల్లో అభిప్రాయ భేదం ఉంది. కొన్ని పేర్లు కొన్ని ఆధారాల్లో కానరావు.*

నగరమైన గజ్జాలో మరణించాడు. ఇటు సల్మా ఓ మగ శిశువుకు జన్మనిచ్చింది. ఇది క్రీ.శ.497 నాటి మాట. పిల్లవాని తల వెంట్రుకల్లో తెలుపు వెంట్రుకలు ఉన్నందున సల్మా ఆ పిల్లవానికి 'షైబా' అని పేరు పెట్టింది.[4] యస్రిబ్ (మదీనా) లోనే ఆ పిల్లవాణ్ణి సాకింది. భవిష్యత్తులో ఈ కుర్రవాడే అబ్దుల్ ముత్తలిబ్‌గా పేరు పొందాడు. చాలా కాలం వరకు హాషిమ్ కుటుంబానికి ఈ పిల్లవాని గురించి ఏమీ తెలియలేదు. హాషిమ్‌కు మొత్తం నలుగురు కుమారులు, అయిదుగురు కుమార్తెలుండేవారు. వారి పేర్లు ఇలా ఉన్నాయి. అసద్, అబూ సైఫీ, నజ్లా మరియు అబ్దుల్ ముత్తలిబ్ - కుమార్తెలు, షిఫా, ఖాలిదా, జయీఫా, రుఖియా మరియు జంతా.[5]

2. అబ్దుల్ ముత్తలిబ్ : వెనుకటి పుటల్లో మనం, హాషిమ్ తరువాత ఆయన సోదరుడు 'ముత్తలిబ్'కు సికాయా, రిఫాదా హోదాలు దక్కాయి అని చదువుకున్నాం. 'ముత్తలిబ్' కూడా ఆయన జాతిలోని ఓ గౌరవోన్నతులుగల వ్యక్తి. ఆయన మాటకు ఎదురు ఉండేది కాదు. ఆయన దాతృత్వం మూలంగా ఖురైషులు ఆయనను 'ఫయ్యాజ్' (దాత) అనే బిరుదుతో పిలిచేవారు. 'షైబా'కు (అంటే అబ్దుల్ ముతల్లిబ్‌కు) పదేళ్ళ ప్రాయం వచ్చినప్పుడు ఆ బాలుణ్ణి పిలుచుకురావడానికి బాబాయి ముత్తలిబ్ మదీనా వెళ్ళాడు. యస్రిబ్ సమీపాన వెళ్ళినప్పుడు షైబాను చూశారు. వెంటనే ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. హృదయానికి హత్తుకుని తన వాహనంపై ఎక్కించుకొని మదీనాకు బయలుదేరాడు. కాని షైబా, తల్లి అనుమతి లేకుండా ఆయన వెంట వెళ్ళడాన్ని నిరాకరించాడు. అందుకని ముత్తలిబ్ షైబా తల్లి అనుమతి కోరగా ఆమె అనుమతి ఇవ్వలేదు. చివరికి ముత్తలిబ్ ఆమెతో, ఈ పిల్లవాడు తన తండ్రి రాజ్యానికి, హరమ్ (కాబా) వైపునకు వెళుతున్నాడు కాబట్టి తప్పక పంపించితీరాలని పట్టుబట్టాడు. దీనికి షైబా తల్లి పిల్లవాణ్ణి తీసుకు వెళ్ళడానికి అనుమతి ఇచ్చింది. ముత్తలిబ్ తన ఒంటెపై ఎక్కించుకొని మక్కా వచ్చారు. మక్కా ప్రజలు అది చూసి, ఈ పిల్లవాడు అబ్దుల్ ముత్తలిబ్ (ముత్తలిబ్ బానిస) అని చెప్పుకోవడం ముత్తలిబ్‌కు వినిపించింది. దానికి సమాధానంగా ముత్తలిబ్, కాదు కాదు ఇతడు నా సోదరుడు హాషిమ్ కుమారుడని నచ్చజెప్పడం జరిగింది.

4. *ఇబ్నె హష్షామ్-1/137; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/26, 2/24.*
5. *ఇబ్నె హష్షామ్-1/137; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/107.*

షైబా ముత్తలిబ్ దగ్గరే ఉండి పెరిగి పెద్దయ్యాడు. షైబా యవ్వన దశలో కాలిడినప్పుడు ముత్తలిబ్, యమన్ దేశంలో రూమాన్ అనే చోట మరణించాడు. ఆయన హోదాలన్నీ అబ్దుల్ ముత్తలిబ్‌కు దక్కాయి. అబ్దుల్ ముత్తలిబ్ తన జాతిలో ఇదివరకు వారి తాత తండ్రులు గడించలేని గౌరవోన్నతులను పొందాడు. జాతి యావత్తూ ఆయన్ను ప్రాణంకన్నా మిన్నగా, అమిత గౌరవంగా చూసుకుంది.[6]

ముత్తలిబ్ మరణించగానే నౌఫిల్, అబ్దుల్ ముత్తలిబ్ ఇంటిని, ప్రాంగణాన్ని బలవంతంగా ఆక్రమించుకున్నాడు. అబ్దుల్ ముత్తలిబ్ తన పినతండ్రికి వ్యతిరేకంగా ఖురైష్‌కు చెందిన కొందరు పెద్దల సహాయం అర్ధించారు. అయితే వారు, మేము నీకూ, నీ పినతండ్రికి నడుమ తలదూర్చమని నిక్కచ్చిగా చెప్పేశారు. చివరికి అబ్దుల్ ముత్తలిబ్ బనీ నజ్జార్ తెగకు చెందిన తన మేనమామకు కొన్ని పద్యపంక్తుల్ని రాసి పంపించాడు. ఆ పద్యపంక్తుల్లో, మేనమామను వచ్చి తనను ఆదుకొమ్మని వేడుకున్నాడు. దీనికి ప్రతిస్పందించిన మేనమామ అబూ సఅద్ బిన్ అద్దీ ఎనభై మంది అశ్వారూఢులతో మక్కాకు బయలుదేరి మక్కా దాపున ఉన్న 'అబ్‌తహ్' అనే ప్రదేశంలో విడిది చేశాడు. అబ్దుల్ ముత్తలిబ్ ఆయన్ను అక్కడే కలుసుకొని, మామగారూ! ఇంటికి రండి అని ఆహ్వానించాడు. దానికి అబూ సఅద్, కాదు, దైవసాక్షి! నౌఫిల్‌ను కలుసుకోనంతమట్టుకు నేను ఎటూ రాను అని ప్రతిజ్ఞ చేశాడు. ఆ తరువాత అబూ సఅద్ అక్కడి నుండి బయలుదేరి నౌఫిల్ ఉన్న చోటికి చేరుకున్నాడు. అప్పుడు నౌఫిల్ 'హతీమ్' (కాబా గృహాన్ని ఆనుకొని ఉన్న ప్రదేశం)లో ఖురైష్ పెద్దలతో కూర్చుని మంతనాలాడుతున్నాడు. అబూ సఅద్ కత్తిదూసి, ఈ పవిత్ర దైవ గృహం సాక్షి! నీవు నా మేనల్లుడి భూమిని తిరిగి ఇచ్చేయకపోతే ఈ ఖడ్గంతో నిన్ను ముక్కలుగా చేసేస్తానని బెదిరించాడు. అప్పుడు నౌఫిల్ సరే నేను దాన్ని ఆయనకు ఇచ్చేశానని చెప్పాడు. ఈ సంఘటనకు అక్కడున్న ఖురైష్ పెద్దల్ని సాక్షులుగా చేశాడు. అబ్దుల్ ముత్తలిబ్ ఇంటికి వెళ్ళి అక్కడ మూడు రోజుల వరకు ఉండి 'ఉమ్రా' చేసిన తరువాత మదీనాకు వెళ్ళిపోయాడు.

ఈ సంఘటన జరిగిన తరువాత, నౌఫిల్, బనీ హాషిమ్‌కు వ్యతిరేకంగా బనీ అబ్దుషమ్స్‌తో పరస్పరం సహాయసహకారాలు అందించే ఒప్పందం చేసుకున్నాడు. ఇటు బనూ నజ్జార్ అబ్దుల్ ముత్తలిబ్‌కు చేసిన సహాయాన్ని గమనిం

6. *ఇబ్నె హష్షామ్-1/137, 138.*

చిన 'బనూ ఖుజాఅ', బనూ నజ్జార్‌తో "అబ్దుల్ ముత్తలిబ్! నీకు సంతానం ఎలాగో అలాగే ఆయన మాకూ సంతానమే. కాబట్టి మేము దానికి సహాయసహకారాలందించడం మా హక్కు" అని అన్నారు- దీనికి ఓ కారణం ఉంది. అదేమిటంటే, అబ్దె మునాఫ్ తల్లి కూడా ఖుజాఅ తెగకు చెందిన స్త్రీ కావటం - కాబట్టి బనూ ఖుజాఅ దారున్నద్వాకు వెళ్ళి బనూ అబ్దుష్షమ్స్ మరియు నౌఫిల్‌కు వ్యతిరేకంగా బనూ హాషింను సమర్ధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞే మునుముందు, ఇస్లామీయ పరిపాలనలో మక్కా విజయానికి దోహదపడింది. వివరాలు సందర్భాన్నిబట్టి రాబోతున్నాయి.[7]

అబ్దుల్ ముత్తలిబ్ విషయంలో, బైతుల్లాకు (కాబా గృహానికి) సంబంధించి రెండు ప్రధాన సంఘటనలు జరిగాయి. ఒకటి, జమ్‌జమ్ బావి త్రవ్వకం, రెండు, 'ఫీల్' సంఘటన.

జమ్‌జమ్ బావి త్రవ్వకం: దీని వివరాలు ఇలా ఉన్నాయి. అబ్దుల్ ముత్తలిబ్‌కు స్వప్నంలో జమ్ జమ్ బావి త్రవ్వమని ఆదేశించడం జరిగింది. స్వప్నంలోనే ఆ ప్రదేశాన్ని కూడా చూపడం జరిగింది. దానికి అనుగుణంగా ఆయన త్రవ్వకం మొదలెట్టారు. బనూ జుర్హుమ్ మక్కాను వదిలేస్తూ అందులో పూడ్చిపెట్టిన వస్తుసామగ్రి క్రమక్రమంగా బయటపడనారంభించాయి. ఆ వస్తువుల్లో ఖడ్గాలు, కవచాలు మరియు రెండు బంగారు లేళ్ళు కూడా ఉన్నాయి. అబ్దుల్ ముత్తలిబ్ ఖడ్గాలను కరిగించి కాబాగృహ సింహద్వారాన్ని పోతపోశారు. రెండు బంగారు లేళ్ళను ఆ ద్వారంలోనే రెండు వైపులా బిగించారు. హాజీలకు జమ్‌జమ్ నీరు త్రాగించే బందోబస్తూ చేశారు.

త్రవ్వకంలో జమ్‌జమ్ బావి పూర్తిగా బయటపడినప్పుడు ఖురైష్ తెగవారు అబ్దుల్ ముత్తలిబ్‌తో, వారిని కూడా త్రవ్వకంలో పాలుపంచుకునేటట్లు చేయమని వాదులాడారు. దానికి సమాధానంగా అబ్దుల్ ముత్తలిబ్, లేదు, నేనలా చేయలేను. ఈ పని కోసం నేనొక్కడినే ప్రత్యేకించబడ్డాను అని తెగేసి చెప్పారు. కాని ఖురైషీలు వెనక్కుతగ్గలేదు. చివరికి తీర్పు కోసం వీరంతా బనూ సఅద్‌కు చెందిన ఓ మంత్రగత్తె (కాహిన్ స్త్రీ) వద్దకు వెళ్ళాలని నిర్ణయం జరిగింది. ప్రజలు మక్కా నుండి బయలుదేరారు కూడా. కాని మార్గమధ్యంలో అల్లాహ్ వారికి చూపిన కొన్ని సూచనల ద్వారా జమ్‌జమ్ బావి త్రవ్వకం పని

7. ముక్తసీర్ సరీతెరసూల్, షెకుల్ ఇస్లాం ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ నజదీ- పుట. 41,42.

దైవం తరపున అబ్దుల్ ముత్తలిబ్‌కే కేటాయించబడిందని తెలిసిపోయింది. వారంతా ప్రయాణాన్ని మానుకొని వెనక్కు మరలివచ్చారు. ఈ సందర్భంలోనే అబ్దుల్ ముత్తలిబ్, దైవంతో, తనకు పది మంది కుమారులను అనుగ్రహించి, వారంతా పెరిగి పెద్దవారై తనను రక్షించే స్థాయికి వస్తే వారిలో ఒక కుమారుణ్ణి కాబా గృహం దగ్గర బలి ఇస్తాను అని మొక్కుకోవడం జరిగింది.[8]

ఫీల్ సంఘటన : రెండవ సంఘటన వివరం ఇలా ఉంది. అబ్రహా సబాహ్ అనే అబీసీనియా నీగ్రో (ఇతను అబీసీనియా రాజు 'నజాషీ' తరఫున యమన్‌కు గవర్నరుగా నియమించబడినవాడు), అరబ్బులు కాబా గృహం హజ్ చేస్తున్నారని ఓర్వలేక 'సనా' అనే చోట ఓ పెద్ద చర్చీని నిర్మించాడు. అరబ్బులు కాబా గృహం హజ్ చేయకుండా ఈ చర్చికొచ్చి ఆరాధనలు చేయాలని తలచాడు. కాని బనూ కనానాకు చెందిన ఓ వ్యక్తికి ఈ ఎత్తుగడ తెలిసి, ఓ రాత్రి చీకటి సమయాన ఆ చర్చిలోనికి వెళ్ళి ప్రార్థన చేసే స్థలానికి అభిముఖంగా (ఖిబ్లా) ఉన్న గోడకు మలమును పులిమాడు. అబ్రహాకు ఈ విషయం తెలియగానే అగ్గిమీద గుగ్గిలమై అరవై వేల ఓ పెద్ద సైన్యాన్ని వెంటబెట్టుకొని కాబా గృహాన్ని నేలమట్టం చేసే ఉద్దేశ్యంతో బయలుదేరాడు. అతను తన కోసం ఓ మంచి ఏనుగును కూడా ఎంచుకున్నాడు. సైన్యపటాలంలో తొమ్మిది లేక పదమూడు ఏనుగులు ఉన్నాయి. అబ్రహా యమన్ నుండి బయలుదేరి 'ముగమ్మస్' అనే చోటికి చేరుకున్నాడు. తన సైన్యాన్ని యుద్ధం కోసం సన్నద్ధం చేసి, ఏనుగులను క్రమబద్ధం చేసి మక్కాలో ప్రవేశించడానికి బయలుదేరాడు. 'ముజ్‌దలిఫా' మరియు 'మినా'ల నడుమగల 'ముహస్సిర్' కొండ లోయకు చేరుకున్నప్పుడు ఏనుగు కూలబడిపోయింది. కాబా వైపునకు బయలుదేరడానికి ససేమిరా కదలలేదు. ఏనుగు ముఖం ఉత్తరం, దక్షిణం లేదా తూర్పు వైపునకు త్రిప్పినప్పుడు లేచి పరుగులు తీసేది. కాని కాబా వైపునకు త్రిప్పినప్పుడల్లా కూలబడిపోయేది. ఈ సందర్భంలోనే అల్లాహ్, చిన్న చిన్న పక్షుల (పిచ్చుకల) ఓ గుంపును ఆ సైన్యం పైకి పంపించాడు. ఈ పక్షుల గుంపు సైన్యంపై కాల్చిన గట్టి మట్టి లాంటి గులకరాళ్ళను వర్షించింది. ఇలా అల్లాహ్ ఆ సైన్యాన్ని ధాన్యపు పొట్టులా మార్చేశాడు. ఈ పక్షులు అబాబీల్ మరియు పిచ్చుకల్లాంటి పక్షులు. ప్రతి పక్షి వద్ద మూడేసి గులకరాళ్ళు ఉన్నాయి. ఒకటి ముక్కున తక్కిన రెండు, రెండు కాళ్ళ వేళ్ళ సందుల్లో. ఇవి

8. ఇబ్నె హిషామ్-1/142-147.

చాలా పదునుగా ఉండి ఎవరికైనా తగిలితే అతని శరీరావయవాలు తెగిపోయేవి. అక్కడనే ప్రాణాలు వదిలేవాడు. ఈ రాళ్ళు అందరికీ తగల్లేదు. అయితే సైన్యంలో జరిగిన త్రొక్కిసలాట కారణంగా ఒకరిని మరొకరు త్రొక్కుకుంటూ పరుగులు తీశారు. త్రొక్కిసలాటలో ప్రతి దారిలోను, ప్రతి నీటి చెలమ దగ్గరా చనిపోనారంభించారు. ఇటు అబ్రహాపై అల్లాహ్ శిక్ష పడిన తీరు ఎలాంటిదంటే చేతివేళ్ళ గోర్లు చిగురుల నుండి వేరై క్రిందపడిపోయాయి. సన్ఆకు చేరే లోపలే అతని వక్షస్థలం బ్రద్దలై గుండె బయటపడి మరణించాడు.

అబ్రహా చేసిన ఈ దాడికి మక్కా పౌరులు ప్రాణభీతితో కొండ లోయల్లోకి పారిపోయారు. కొండ శిఖరాల్లో తలదాచుకున్నారు. సైన్యంపై దైవశిక్ష అవతరించిన తరువాత వారు ప్రశాంతంగా తమ ఇళ్ళకు చేరుకున్నారు.[9]

ఈ సంఘటన, అనేక చరిత్రకారుల ప్రకారం - దైవప్రవక్త (స) గారి జననానికి కేవలం యాభై రోజులు లేదా యాభై అయిదు రోజుల ముందు ముహర్రమ్ నెలలో సంభవించింది. కాబట్టి ఇది క్రీ.శ. 571 ఫిబ్రవరి చివరి రోజులు లేదా మార్చి నెల ప్రారంభ కాలానికి సంబంధించిన సంఘటన. ఇది నిజంగా హెచ్చరికతో కూడుకున్న ఒక సూచన. దానిని అల్లాహ్ తన ప్రవక్త (స) కోసం, తన కాబా గృహం కోసం అవతరింపజేశాడు. ఎందుకంటే, బైతుల్ మక్దిస్ విషయానికి వస్తే ఆ కాలం నాటి ఇస్లామ్‌కు ఖిబ్లాగా ఉండేది. అక్కడి ప్రజలూ ముస్లిములే అయినప్పటికీ దాన్ని అల్లాహ్ శత్రువు లైన బహుదైవారాధకులు (ముష్రిక్కులు) హస్తగతం చేసుకోవడం జరిగింది. బుఖ్తెనసర్ దాడి క్రీ.పూ. 587 మరియు రోమనుల ఆక్రమణ క్రీ.శ. 70 లాంటి సంఘటనలతో ఈ విషయం అర్థమవుతుంది. కాని దీనికి భిన్నంగా కాబా గృహంపై క్రైస్తవులకు ప్రాబల్యం లభించలేదు. వాస్తవానికి అప్పటి కాలంలో ఈ క్రైస్తవులే ముస్లింలు కాని కాబా పౌరులు ముష్రిక్కులు.

అదే కాదు, ఈ సంఘటన జరిగినప్పటి పరిస్థితుల దృష్ట్యా చూస్తే, ఆనాటి సభ్య ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు అంటే రోమ్, పర్షియా వగైరాలకు ఈ వార్త వెనువెంటనే ప్రాకిపోయింది. అబీసీనియాకు రోమ్ సామ్రాజ్యంతో సత్సంబంధం ఉండేది. మరోవంక పారసీకులు రోమనుల కార్యకలాపాలను ఓ కంట కనిపెడుతూనే ఉన్నారు. వారు రోమను మిత్ర రాజ్యాల్లో సంభవించే సంఘటనలను తరచి చూస్తూ ఉండేవారు. ఈ కారణాల మూలంగా ఈ సంఘటన జరిగిన వెనువెంటనే పర్షియనులు శీఘ్రగతిన యమన్‌ను వశపరచుకున్నారు. ఈ రెండు గొప్ప సామ్రాజ్యాలే అప్పటి నాగరిక ప్రపంచానికి సంబంధించిన ప్రముఖ ప్రాంతాలను పాలించేవి గనుక, ఈ సంఘటన కారణంగా ప్రపంచ దేశాల దృష్టి అంతా కాబా గృహం వైపునకు మరలింది. వాటికి కాబాగృహ ఔన్నత్యం, గౌరవానికి సంబంధించిన ఒక స్పష్టమైన దైవ సూచనలా అగుపించింది. ఈ గృహాన్ని అల్లాహ్ తన పవిత్రతను కొనియాడటం కోసం ఎంచుకున్నాడన్న విషయం ప్రతి హృదయంలో బాగా నాటుకుపోయింది. కాబట్టి, ఇక్కడి ప్రజల్లో ఏ వ్యక్తి అయినా దైవదౌత్యం చాటుతూ లేచినిలబడడం నేరుగా ఈ సంఘటనతో సంబంధం కలిగి ఉంటుందని, ప్రకృతి నియమాలకు భిన్నంగా విశ్వాసులకు కాకుండా బహుదైవారాధకులకే సహాయం చేయడంలో దైవలీల ఔచిత్యం ఎంతైనా ఉందని తెలుసుకోవడం జరిగింది.

9. ఇబ్నె హష్షామ్-1/43, 56.

అబ్దుల్ ముత్తలిబ్‌కు మొత్తం పది మంది కుమారులు. వారి పేర్లు ఇలా ఉన్నాయి. హారిస్, జుబైర్, అబూ తాలిబ్, అబ్దుల్లాహ్, హమ్‌జా (ర), అబూ లహబ్, గైదాక్, మకూమ్, సఫార్ మరియు అబ్బాస్ (ర). కొందరు పదకొండు మంది కుమారులని, అతడి పేరు ఖసమ్ అని అంటారు. మరికొందరు పదముగ్గురని, వారిలో ఒకడి పేరు అబ్దుల్ కాబా, మరొకని పేరు హజల్ అని కూడా వాదిస్తారు. అయితే పది మందే అని చెప్పేవారు, మకూమ్‌కు మారుపేరే అబ్దుల్ కాబా అని, గైదాక్‌నే హజల్ అంటారని చెబుతారు. ఖసమ్ అనే పేరు అబ్దుల్ ముత్తలిబ్ సంతానంలోనే లేదు - అబ్దుల్ ముత్తలిబ్‌కు ఆరుగురు కుమార్తెలు. వారి పేర్లు ఇవి: ఉమ్ముల్ హకీమ్. ఈమె పేరే 'బైజా' కూడాను. బర్రా, ఆతికా, సఫియా, అర్వా మరియు మైమూనా.[10]

3. అబ్దుల్లాహ్ - దైవప్రవక్త (స)గారి తండ్రి: ఈయన తల్లి పేరు ఫాతిమా. ఈమె అమ్రూ బిన్ ఆయిజ్ బిన్ ఇమ్రాన్ బిన్ మగ్జూమ్ బిన్ యఖ్జా బిన్ ముర్రా కుమార్తె. అబ్దుల్ ముత్తలిబ్ సంతానంలో అబ్దుల్లాహ్ అందరికంటే అందమైన, మచ్చలేని, ప్రియమైన కుమారుడు. ఈయన 'జబీహ్'గా కూడా పిలువబడేవాడు. జబీహ్‌గా పేరు పొందడానికి కారణం కూడా ఉంది. అబ్దుల్ ముత్తలిబ్ కుమారుల సంఖ్య పూర్తిగా పదుగురై తండ్రి ఆస్తిపాస్తులను సంరక్షించే వయస్సుకు చేరిన తరువాత అబ్దుల్ ముత్తలిబ్ తాను మొక్కుకున్న మొక్కు

10. తల్గీహుల్ ఫహూం-పుట. 8,9; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/56,66;

బడిని గురించి వారికి తెలియజేశాడు. అందరూ తండ్రి మాటను శిరసావహించారు. ఆ తరువాత అబ్దుల్ ముత్తలిబ్ అదృష్టం చూపే అంబులపై వారి పేర్లు వ్రాసి, హుబల్ దేవత పూజారికి అందజేశారు. అతను ఈ అంబులను త్రిప్పి ఓ బాణాన్ని తీయగా అందు అబ్దుల్లాహ్ పేరు వచ్చింది. అబ్దుల్ ముత్తలిబ్, అబ్దుల్లాహ్ చేయి పట్టుకొని కత్తితో సహా కాబాగృహం వద్దకు తీసుకువెళ్ళారు. కాని ఖురైష్ ప్రజలు, ముఖ్యంగా అబ్దుల్లాహ్ తల్లి వైపువారైన బనూ మఖ్జూమ్ తెగవారు, అబ్దుల్లాహ్ సోదరుడు అబూ తాలిబ్ అడ్డుకున్నారు. దానికి అబ్దుల్ ముత్తలిబ్ వారితో నా మ్రొక్కుబడి సంగతేమిటి? అని అడిగారు. ఓ అర్రాఫా (స్త్రీ జ్యోతిష్కురాలు) వద్దకు వెళ్ళి ఆమెను అడుగుదాం అని సలహా ఇచ్చారు. అబ్దుల్ ముత్తలిబ్ ఓ అర్రాఫా వద్దకు వెళ్ళి అడగ్గా ఆమె, అబ్దుల్లాహ్ మరియు పది ఒంటెలకు చీటీ వేయండి. అబ్దుల్లాహ్ పేరే వస్తే మరో పది ఒంటెల్ని పొడిగిస్తూపోండి. ఇలా ఒంటెల్ని హెచ్చిస్తూ అబ్దుల్లాహ్ పేర చీటి వేస్తూపోండి. ఇది అల్లాహ్ ప్రసన్నుడైనంత వరకూ చేస్తూ పోండి అని, ఒంటెల పేరునే చీటి వస్తే వాటిని జిబహ్ చేయండి అని సలహా ఇచ్చింది. అబ్దుల్ ముత్తలిబ్ తిరిగి వచ్చి అబ్దుల్లాహ్ మరియు పది ఒంటెల నడుమ చీటీ వేశారు. కాని చీటి అబ్దుల్లాహ్ పేరునే పడింది. ఆ తరువాత పదేసి ఒంటెల్ని పెంచుతూపోయారు. అయినా అబ్దుల్లాహ్ పేరే రానారంభించింది. ఇక పూర్తి నూరు ఒంటెల చీటి వేయగా చీటీ ఒంటెల పేరునే పడింది. అప్పుడు అబ్దుల్ ముత్తలిబ్, అబ్దుల్లాహ్‌కు బదులుగా ఆ ఒంటెల్ని జిబహ్ చేశారు. వాటిని మనుషులు, పక్షులు, క్రూరమృగాల కోసం వదిలేశారు. ఈ సంఘటనకు పూర్వం అరేబియాలో రక్తపరిహారం (దీత్) పరిమాణం పది ఒంటెలే ఉండేది. దీని తరువాత అది నూరు ఒంటెలుగా నిర్ణయించబడింది. ఇస్లామ్ కూడా ఈ పరిమితినే యధాతథంగా కొనసాగించింది. దైవప్రవక్త (స) ప్రవచనం ఇలా ఉంది: "నేను ఇద్దరు జబీహ్‌ల సంతానాన్ని, ఒకరు హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.), రెండవ వారు నా తండ్రి అబ్దుల్లాహ్."[11]

అబ్దుల్ ముత్తలిబ్ తన కుమారుడు అబ్దుల్లాహ్ వివాహానికి హజ్రత్ ఆమినాను ఎన్నుకున్నారు. ఈమె వహబ్ బిన్ అబ్దె మునాఫ్ బిన్ జహ్రా బిన్ కిలాబ్ కుమార్తె. వంశం, హోదాల రీత్యా ఖురైష్‌కు చెందిన అత్యుత్తమ స్త్రీలో

11. ఇబ్నె హష్షామ్-1/151, 155; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/89,90; ముక్తతసర సరీతుర్రసూల్ (స)- షేక్ అబ్దుల్లా నజదీ-పుట.12, 22, 23.

లెక్కించబడే మహిళ. ఈమె తండ్రి వంశం మరియు గౌరవం రెంటిలోనూ బనూ జహ్రా తెగ సర్దారు. ఆమె మక్కాలోనే తన పుట్టింటి నుండి మెట్టినింటికి వచ్చారు. కొన్ని రోజుల అనంతరం అబ్దుల్ ముత్తలిబ్, అబ్దుల్లాహ్‌ను ఖర్జూరాలు తెమ్మని మదీనాకు పంపించారు. ఆయన అక్కడనే మరణించాడు.

కొందరు చరిత్రకారుల ప్రకారం, ఆయన వ్యాపారార్థం సిరియా దేశానికి వెళ్ళారని, ఖురైష్‌కు చెందిన ఓ వ్యాపార బిడారం వెంట తిరిగి వస్తూ వ్యాధిగ్రస్తుడై మదీనాలో ఆగిపోయారనీ, అక్కడనే మరణించారనీ ఉంది. ఖననం 'నాబిగాజాదీ' ఇంట జరిగింది. అప్పుడు ఆయన వయస్సు పాతిక ఏళ్ళు. అత్యధిక మంది చరిత్రకారులు, దైవప్రవక్త (స) ఇంకా జన్మించలేదని చెప్పారు. అయితే కొందరు మాత్రం ఆయన (స), తన తండ్రి మరణానికి రెండు నెలల ముందే జన్మించారని చెబుతారు.[12] ఆయన మరణవార్త మక్కాకు చేరగానే, హజ్రత్ ఆమినా తీవ్ర దుఃఖంలో ఈ మర్సియా చెప్పారు.

"బత్హా ఒడి హాషిం కుమారుడు లేకుండా ఖాళీ అయింది. ఆయన ఓ సమాధిలో నిద్రపోతున్నాడు. మరణం పిలువగానే ఆయన ఆ పిలుపుకు సమాధానమిచ్చాడు. మరణం, ప్రజల్లో హాషిమ్ కుమారుని లాంటి వ్యక్తిని లేకుండా చేసింది. ప్రజలు ఆయన్ను బల్లపై పెట్టుకొని మోస్తూ వెళ్ళిన ఆ సంధ్యాసమయం ఎంత వ్యధాభరితమైనది! మరణం ఆయన అస్తిత్వాన్ని రూపుమాపితేనేమీ? ఆయన గుణగణాల ముద్రలు మాత్రం చెరపివేయలేదు కదా! ఆయన గొప్ప దాత, కారుణ్య హృదయుడూను."

అబ్దుల్లాహ్ మరణించేటప్పుడు వదలివెళ్ళిన ఆస్తి (తరకా) అంతా ఇదే. అయిదు ఒంటెలు, ఒక మేకల మంద. ఓ నీగ్రో స్త్రీ బానిస. ఆమె పేరు బర్కత్. అందరు పిలిచే పేరు ఉమ్మె అయిమన్. ఈ ఉమ్మె అయిమనే దైవప్రవక్త (స)ను చిన్నప్పుడు ఎత్తుకొని ఆడించేది.

12. ఇబ్నె హష్షామ్-1/156, 158; ఫిక్కతుసీరహ్-ముహమ్మద్ గజాలి-పుట.45; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/9.

శుభ జననం-నలభై ఏళ్ళ పవిత్ర జీవితం

శుభ జననం

దైవప్రవక్త (స) మక్కాలో షిఅబె బనీ హాషిం అనే చోట, 'ఫీల్' సంఘటన జరిగిన మొదటి సంవత్సరం, రబీ ఉల్ అవ్వల్ మాసం, తొమ్మిదవ తారీఖున సోమవారం పూర్వ సంధ్యాసమయాన జన్మించారు. అప్పుడు నౌషీర్వాన్ పట్టాభిషేకమై నలభైవ సంవత్సరం నడుస్తోంది. క్రీస్తు శకం ఏప్రిల్ నెల 20 లేదా 21వ తారీఖు 571వ సంవత్సరం అది. అల్లామా ముహమ్మద్ సులైమాన్, మన్సూర్ పూరీ (రహ్మలై) మరియు మహ్మూద్ పాషా ఫల్కీ పరిశోధన ఇది.[1]

ఇబ్నె సఅద్ ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స) గారి మాతృమూర్తి 'ఆమినా' ఇలా చెప్పారని ఉంది. "దైవప్రవక్త (స) జన్మించినప్పుడు నా శరీరం నుండి ఓ జ్యోతిర్మయ కాంతి బయటకు వచ్చింది. దీని ఫలితంగా సిరియా మహళ్ళు వెలిగిపోయాయి." ఇమామె అహ్మద్, ఈ విషయానికే సంబంధించిన ఓ ఉల్లేఖనాన్ని హజ్రత్ 'అరియాజ్ బిన్ సారియా' చెప్పినట్లు తన గ్రంథంలో ఉటంకించారు.[2]

కొన్ని ఉల్లేఖనాల్లో, జనన సమయాన కొన్ని సంఘటనలు దైవదౌత్యపు ముందస్తు సూచనలుగా చెప్పడం జరిగింది. అంటే కిస్రా దర్బారులోని పదునాల్గు స్తంభాలు పడిపోయాయి. అగ్ని ఆరాధకులైన మజూస్‌ల అగ్నిగుండం చల్లారిపోయింది.

'సావా' సముద్రం ఎండిపోయింది. చుట్టుపట్ల గల చర్చీలు పడి

1. *తారీఖె ఖిజ్రీ 1/62; రహ్మతుల్ లిల్ ఆలమీన్ 1/38, 39. ఏప్రిల్ నెల గురించిన అభిప్రాయ భేదం గ్రిగేరియన్ కాలెండరుకు సంబంధించిన భిన్నాభిప్రాయానికి సంబంధించింది.*
2. *ముక్తసరుసీరత్-షేక్ అబ్దుల్లా, పుట.12; ఇబ్నె సఅద్ 1/63.*

పోయాయి. ఇది బైహఖి ప్రవచనం.[3] అయితే ముహమ్మద్ గజాలి ఇది సరయినదని ఒప్పుకోరు.[4]

జననం తరువాత ప్రవక్త (స) గారి మాతృమూర్తి ఈ శుభవార్తను అబ్దుల్ ముత్తలిబ్‌కు చేరవేశారు. ఆనందపరవశులై పరుగున అక్కడికి వచ్చారు ఆయన. శిశువును కాబా గృహంలోనికి తీసుకొని వెళ్ళి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ప్రార్థించారు. ఆ శిశువు పేరు 'ముహమ్మద్' అని పెట్టారు. ఈ పేరు అరేబియాలో చెలామణిలో ఉన్న పేరు కాదు అప్పట్లో. అరబ్బు సంప్రదాయం ప్రకారం ఏడవ రోజు 'ఖత్నా' (సున్తీ) చేశారు.[5]

దైవప్రవక్త (స)కు తల్లి తరువాత అందరికంటే ముందు అబూలహబ్ బానిసరాలు 'సూబియా' పాలు పట్టింది. అప్పుడు ఆమెకు మస్రూహ్ అనే పాలు త్రాగే తనయుడున్నాడు. సూబియా ప్రియప్రవక్త (స) కంటే పూర్వం అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడు 'హమ్‌జా'కు కూడా పాలుపట్టింది. ప్రవక్త (స) తరువాత ఈమె అబూ సల్మా బిన్ అబ్దుల్ అసద్ మఖ్జూమీకి కూడా పాలుపట్టింది.[6]

బనీ సఅద్ తెగలో

అరేబియా ప్రజల సంప్రదాయం ప్రకారం, వారు తమ పిల్లలను నగర వాతావరణానికి దూరంగా రోగాల నుండి రక్షణ కోసం, పాలుపట్టే బద్‌వీ స్త్రీలకు (పల్లె స్త్రీలకు) అప్పజెప్పేవారు. అదే కాదు, పల్లె వాతావరణంలో పెరగడం వల్ల వారి శరీరం దృఢంగా, సౌష్టవంగా మారాలని, పైపెచ్చు చిన్నప్పటి నుండే స్వచ్ఛ మైన అరబీ ఉచ్చారణ నేర్చుకోవాలని కోరేవారు. ఈ సంప్రదాయం ప్రకారమే అబ్దుల్ ముత్తలిబ్ పాలుపట్టే దాయాను వెదుకనారంభించారు. ఇలా దైవప్రవక్త (స)ను అబూ జువైబ్ కుమార్తె అయిన 'హలీమా'కు అప్పజెప్పడం

3. *ముక్తసరుస్సీరత్-షేక్ అబ్దుల్లా-పుట.12.*
4. *ఫిక్హుస్సీరత్ - ముహమ్మద్ గజాలి-పుట.46.*
5. *ఇబ్నె హష్షామ్-1/159, 160; తారీఖె ఖిజ్రీ-1/62. ఓ ఉల్లేఖనం ప్రకారం- ఆయన (స) సున్తీ చేయబడే జన్మించినట్లుంది. చూడండి, (తలీహుల్ ఫహూం)-పుట.4. కాని ఇబ్నె ఖైమ్ మాత్రం ఇలాంటి హదీసు ఎక్కడా కనబడలేదని అంటారు. చూడండి, జాదుల్ ముఆద్-1/18.*
6. *తల్ఖీహుల్ ఫహూం-పుట.4; ముక్తసరుసీరత్-పుట.13.*

జరిగింది. ఈమె బనీ సఅద్ బిన్ బకర్ తెగకు చెందిన మహిళ. ఈమె భర్త పేరు హారిస్ బిన్ అబ్దుల్ ఉజ్జా. అబూ కబ్షా పేరున పిలువబడేవాడు. ఈయన కూడా బనీ సఅద్ తెగలోని వ్యక్తే.

తల్లి పాలు త్రాగే విషయంగా, దైవప్రవక్త (స) కు సోదరీ సోదరులైన హారిస్ సంతానం వీరు: 1. అబ్దుల్లాహ్ 2. అనీసా 3. హజాఫా లేక జజామా, ఈమెకే 'షైమా' అనే బిరుదు కూడా ఉంది. ఈ పేరునే ఆమె బాగా గుర్తించబడేది. ఈ అమ్మాయి దైవప్రవక్త (స)ను ఎత్తుకొని ఆడించేది. వీరే కాకుండా, అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడైన హారిస్ తనయుడు అబూ సుఫ్యాన్ (ఈయన ప్రవక్త (స)కు పినతండ్రి కుమారుడు) కూడా హలీమా పాలు త్రాగడం వలన ఈయన (స) కు సోదరుడే. దైవప్రవక్త (స) పినతండ్రి హజ్రత్ హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ కూడా చిన్నప్పుడు బనూ సఅద్ తెగకు చెందిన ఓ మహిళకు పాలు పట్టే విషయమై అప్పజెప్పబడినవారే. ఈ మహిళ కూడా ఓ రోజున హలీమా ఒడిలో ఉన్న దైవప్రవక్త (స)ను ఎత్తుకొని పాలు పట్టేసింది. ఇలా దైవప్రవక్త (స) హజ్రత్ హమ్జాకు రెండు వైపుల నుండి సోదరుడవుతారు. ఒకటి, సూబియా మాధ్యమంగా, రెండు, బనూ సఅద్‌కు చెందిన ఈ మహిళ మాధ్యమంగా.[7]

పాలుపట్టే కాలంలో హజ్రత్ హలీమా, దైవప్రవక్త (స) గారి వలన కలిగిన శుభాలను చూసి సంభ్రమాశ్చర్యాలకు గురైనారు. హజ్రత్ హలీమా ఇలా చెప్పారని ఇబ్నె ఇసహాక్ ఉల్లేఖించారు. "నేను నా భర్త వెంట పాలు త్రాగే కుమారుణ్ణి ఎత్తుకొని బనూ సఅద్‌కు చెందిన కొందరు స్త్రీలతో ఊరిని వదలి పాలుత్రాగే పిల్లలను వెదుకుతూ బయలుదేరాము. అది కరువుకాలం. కరువు వల్ల ఎవరి వద్ద ఏమీ మిగల్లేదు. నేను నా తెల్ల కంచర గాడిదను ఎక్కి ఉన్నాను. వెంట ఓ పెంటి ఒంటె కూడా ఉంది. కాని అది ఓ చుక్క పాలు ఇస్తే ఒట్టు. ఇటు ఆకలికి నా పిల్లవాడు ఏడవడం వల్ల రాత్రి వేళల్లో మాకు నిదుర కూడా కరువైంది. నా వక్షస్థలంలోనూ పాలచుక్క లేదు. ఒంటె పాలిచ్చేది కాదు. మేము వర్షం కోసం ఎదురుచూస్తున్న రోజులవి. నేను నా కంచర గాడిదను ఎక్కి బయలుదేరగా అది బలహీనంగా, బక్కచిక్కి ఉండడం వలన అడుగులో అడుగు వేసుకుంటూ నీరసంగా నడవడం వలన మా బిడారం వాళ్ళందరికి

7. జాదుల్ మఆద్-1/19.

చిరాకు కలుగుతోంది. ఎట్టకేలకు మేము పాలు త్రాగే పిల్లలను వెదుకుతూ మక్కా చేరాం. మాలో ప్రతి ఒక్కరు దైవప్రవక్త(స)ను చూపడం కూడా జరిగింది. అయితే ఆయన ఓ అనాధ బాలుడని తెలియగానే మేము ఆ పిల్లవానికి తండ్రిలేనందున తగిన ప్రతిఫలం లభించదనే ఉద్దేశ్యంతో నిరాకరించి వెళ్ళిపోయాము. ఈ పిల్లవాడు అనాధ. వితంతువు అయిన ఈ బాలుని తల్లిగాని, తాతగాని మనకేమిస్తాడు అని అనుకున్నాం. ఈ కారణం వల్లనే మాలో ఎవరూ ఈ బాలుణ్ణి తీసుకోవడానికి ముందుకు రాలేదు.

నా వెంట వచ్చిన స్త్రీలందరికీ ఎవరో ఒక పిల్లవాడు లభించాడు. కేవలం నాకే లభించలేదు. తిరుగు ప్రయాణం చేసే సమయం రాగానే నేను నా భర్తతో, "దైవసాక్షి! ఇదేం బాగాలేదు. నా స్నేహితురాళ్ళందరూ పిల్లలను ఎత్తుకుంటే పిల్లవాడు లేకుండా నేనెలా తిరిగి వెళ్ళేది? వెళ్ళి, ఆ పిల్లవాణ్ణే తీసుకువస్తానని చెప్పాను. ఫర్వాలేదు! బహుశా అల్లాహ్ ఇందులోనే మనకు శుభం కలిగించవచ్చని ధైర్యం చెప్పాడాయన. నేను వెళ్ళి ఆ అనాధ బాలుణ్ణే ఎత్తుకున్నాను. కేవలం మరే బాలుడు లభించకపోవడమే దానికి కారణం."

హజ్రత్ హలీమా (ర) ఇంకా ఇలా అన్నారు: "పిల్లవాణ్ణి తీసుకొని, తిరిగి నా గుడారంలోనికి వచ్చి నా ఒళ్ళో పడుకోబెట్టుకోగానే నా పాలిండ్లు పాలతో నిండిపోయాయి. అతను కడుపార పాలు త్రాగాడు. ఆ తరువాత అతని సోదరుడు కూడా కడుపార పాలు త్రాగాడు. ఆ తరువాత మేము ఆదమరచి నిద్రపోయాము. అంతకు మునుపు మేము ఎప్పుడూ మా పిల్లవానితోపాటు నిద్రించేవారమే కాదు. ఇటు నా భర్త ఒంటె పాలు పితకడానికి వెళ్ళగా దాని పొదుగు పాలతో నిండుగా ఉంది. ఆయన పితికిన పాలను మేము కడుపునిండా త్రాగాం. ఎంతో హాయిగా రాత్రి గడిచిపోయింది. ఉదయాన్నే నా భర్త, 'హలీమా! దైవసాక్షి! నీవు ఓ శుభంగల ఆత్మను పొందావు' అని అన్నాడు. నేను కూడా అదే ఆలోచిస్తున్నానప్పుడు."

హలీమా (ర) ఇంకా ఇలా అంటారు. "మా బిడారం బయలుదేరింది. నేను నా బలహీనమైన కంచర గాడిదనెక్కి కూర్చున్నాను. ఆ పిల్లవాడు కూడా నా ఒడిలోనే ఉన్నాడు. అయితే దైవసాక్షిగా చెబుతున్నాను. ఆ గాడిద బిడారం మొత్తాన్ని దాటేసి ముందుకు వెళ్ళిపోయింది. మరే గాడిద కూడా దాని గమనాన్ని అందుకోలేకపోయింది. ఇది చూసిన నా స్నేహితురాళ్ళు నన్ను

పిలుస్తూ, 'ఓ అబూ జువైబ్ కూతురా! ఇదేమిటే? మమ్మల్ని కూడా కాస్త చూడు. నీవు మా వెంట వచ్చేటప్పుడు ఎక్కి వచ్చిన కంచర గాడిదేగా ఇది?' అని అరిచారు. 'ఔనౌను, దైవసాక్షి! ఇది ఆ కంచర గాడిదే సుమా! దీనికి ఏదో ప్రత్యేకత ఏర్పడిందమ్మా' అని బదులిచ్చాన్నేను."

బనూ సఅద్ తెగ నివాస ప్రదేశంలోని మా ఇండ్లకు మేము చేరుకున్నాం. ఆ కాలంలో మా ప్రాంతం అంతటి కరువు ప్రాంతం ఈ భూమిపై మరొకటి ఉందన్న విషయం నాకయితే తెలియదుగాని, మేము తిరిగి వచ్చిన తరువాత నా మేకలు మేత కోసం బయటకు వెడితే కడుపునిండా మేసి నిండు పొదుగులతో తిరిగి వచ్చేవి. ఆ పాలను పితికి మేము త్రాగేవాళ్ళం. ఆ కాలంలో ఏ వ్యక్తికీ ఒక్క చుక్క పాలు లభించేవి కాదు. వారి పశువుల పొదుగులు ఎండిపోయి చుక్క పాలు కూడా లేకుండా ఉండేవి. చివరికి మా జాతి ప్రజలు తమ పశువు కాపరులతో, "మూర్ఖుల్లారా! అబూ జువైబ్ కూతురి కాపరి పశువుల్ని ఎక్కడ మేపుతున్నాడో అక్కడికే మీరు కూడా తీసుకు వెళ్ళి మేపండని" చెప్పి మరీ పంపేవారు. అయినా వారి మేకలు అర్ధాకలితోనే తిరిగివచ్చేవి. వాటి పొదుగుల్లో చుక్క పాలు కూడా ఉండేవి కావు. నా మేకలు మాత్రం నిండిన పొదుగులతో ఇంటికి వచ్చేవి. ఇలా మేము అల్లాహ్ తరపున క్రమం తప్పకుండా శుభాల వృద్ధే జరుగుతున్నట్లు గమనిస్తూపోయాం. బాలునికి రెండేళ్ళ ప్రాయం వచ్చింది. పాలు పట్టడం మానేశాను. రెండేళ్ళు పూర్తి అయ్యే లోపల ఈ బాలుడు ఇతర బాలుర్లకంటే శారీరకంగా దృఢంగా, అంగసౌష్టవంతో పెరిగిపోయాడు. ఆ తరువాత అతణ్ణి మేము అతని తల్లి వద్దకు తీసుకువెళ్ళాం. అయితే మేము అనుభవిస్తున్న శుభాలను దృష్టిలో ఉంచుకొని, అతను మా వద్దనే ఉండాలనే అభిలాష మాలో పుట్టుకు వచ్చింది. అందుకని మేము అతని తల్లితో మాట్లాడాం. 'అమ్మా! ఈ పిల్లవాణ్ణి ఇంకొంత ఆరోగ్యవంతుడు, మరింత శారీరక దారుఢ్యం వచ్చే వరకు మా దగ్గరనే ఎందుకుంచరూ? మక్కాలోని వ్యాధుల గురించి మాకు భయంగా ఉంది' అని వేడుకున్నాం. మా ప్రోత్సలంపై ఆమె తిరిగి పిల్లవాణ్ణి మా వెంట పంపడానికి ఇష్టపడి పంపించేశారు."[8]

షక్కే సద్ర్ (వక్షస్థలం చీల్చే) సంఘటన

ఇలా దైవప్రవక్త (స) పాలు త్రాగే గడువు పూర్తి అయిన తరువాత కూడా బనూ సఅద్ తెగలోనే ఉండిపోయారు. చివరికి ఆయన జన్మించిన నాల్గవ

8. ఇబ్నె హష్షామ్-1/162, 163, 164.

లేదా ఐదవ ఏట[9] షక్కె సద్ర్ (వక్షస్థలాన్ని చీల్చే) సంఘటన జరిగింది. ఈ సంఘటన వివరాలు హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖించినట్లుగా సహీ ముస్లిమ్ గ్రంథంలో ఇలా ఉన్నాయి. దైవప్రవక్త (స) వద్దకు హజ్రత్ జిబ్రీల్ (అ.స.) వచ్చినప్పుడు ఆయన పిల్లలతో ఆడుకుంటున్నారు. హజ్రత్ జిబ్రీల్ (అ.స.) ఆయన్ను పట్టుకొని క్రిందపడవేశారు. వక్షస్థలాన్ని చీల్చి గుండెకాయను బయటకు లాగారు. ఆ తరువాత గుండె నుండి ఓ భాగాన్ని తీసి "ఇది నీలోని షైతాన్ స్థావరం" అని చెప్పారు. ఆ తరువాత ఓ పళ్లెంలో ఉంచి జమ్‌జమ్ నీటితో శుభ్రపరిచారు. దాన్ని సరిచేసి దాని స్థానంలో పెట్టి వెళ్ళిపోయారు. ఇది చూసిన మిగిలిన పిల్లలంతా దాయా హలీమా వద్దకు పరుగున వెళ్ళి ముహమ్మద్ హత్యకు గురయ్యారని చెప్పారు. ఆ ఇంటి వారంతా పరుగెత్తుకుంటూ అక్కడికి చేరగా ప్రవక్త (స) ముఖకవళికలు మారిపోయి ఉన్నాయి.[10]

మాతృ మమతానురాగాల్లో ముహమ్మద్ (స)

ఈ సంఘటన జరిగిన పిదప హలీమా (ర) ప్రమాదాన్ని శంకించారు. ఆమె ముహమ్మద్ (స)ను అతని మాతృమూర్తికి అప్పజెప్పి వచ్చేశారు. ఆయన ఆరేళ్ళ వరకు మాతృ మమతానురాగాల్లోనే పెరిగి పెద్దయ్యారు.[11]

హజ్రత్ ఆమినాకు, యస్రిబ్‌లో ఖననం అయివున్న తన భర్త సమాధిని చూసి రావాలనే కోరిక కలిగింది. తన అనాథ తనయుడు ముహమ్మద్ (స), తన సేవకురాలు ఉమ్మె అయిమన్‌ను వెంటపెట్టుకొని సంరక్షకుడైన అబ్దుల్ ముత్తలిబ్ వెంట దాదాపు అయిదు వందల కిలోమీటర్ల దూరాన ఉన్న మదీనాకు బయలుదేరారు. అక్కడ ఓ నెల రోజులు ఉండి వెనుదిరిగారు. కాని ప్రయాణ ప్రారంభంలోనే కొంత దూరం వచ్చిన తరువాత వ్యాధిగ్రస్తులైపోయారు. ఈ వ్యాధి బాగా ముదిరిపోయి మక్కా మరియు మదీనాకు నడుమ గల ఓ ప్రదేశం 'అబ్వా' చేరగానే ఆమె మరణించారు.[12]

9. సాధారణ సీరత్ (జీవిత చరిత్ర) రచయితల అభిప్రాయం కూడా ఇదే. అయితే ఇబ్నె ఇస్‌హాక్ ఉల్లేఖనం ప్రకారం, ఈ సంఘటన మూడు సంవత్సరాల ప్రాయం లోనే జరిగింది అని తెలుస్తోంది. చూడండి. ఇబ్నె హష్షామ్-1/164,165.
10. సహీ ముస్లిమ్; బాబుల్ అస్రా-1/92
11. తల్ఖీహుల్ ఫహూమ్-పుట7; ఇబ్నె హష్షామ్-1/168.
12. ఇబ్నె హష్షామ్-1/168; తల్ఖీహుల్ ఫహూమ్-పుట.7; తారీఖె ఖిజ్రీ-1/63; ఫిక్హె సీరతె గజాలీ-పుట.50.

తాతగారి కారుణ్యఛాయలో

వృద్ధులైన అబ్దుల్ ముత్తలిబ్ తన మనుమణ్ణి వెంటబెట్టుకొని మక్కాకు వచ్చారు. ఆయన హృదయం తన అనాథ మనుమడి మమతానురాగాలతో నిండి పరితపిస్తోంది. కారణం, కోడలి మరణం మరో క్రొత్త విఘాతం. ఇది పాత గాయాల్ని తిరిగి తోడిన సంఘటన. అబ్దుల్ ముత్తలిబ్ భావోద్రేకాల్లో తన మనుమని ఎడల గల తపన, హృదయ స్పందన, ఆయన సొంత కుమారుల ఎడల కూడా కానవచ్చేదే కాదు. విధి ఆ బాలుణ్ణి ఏకాంతపు ఎడారిలో తెచ్చి నిలబెట్టిన తీరును చూచి అబ్దుల్ ముత్తలిబ్ తల్లడిల్లిపోయారు. బాలుణ్ణి ఎటూకాకుండా చేయడానికి ఆయన సిద్ధపడలేదు. తన సంతానం కంటే ప్రేమిస్తూ, పెద్దవారిని గౌరవించినట్లు ఆయన్ను గౌరవించేవారు. ఇబ్నె హష్షామ్ కథనం ప్రకారం, అబ్దుల్ ముత్తలిబ్ కోసం కాబా గృహం నీడన పరుపు వేసి, కుమారులంతా దాని చుట్టూ క్రింద కూర్చునేవారు. అబ్దుల్ ముత్తలిబ్ వచ్చి ఆ పరుపుపై కూర్చునేవారు. ఆయన గౌరవార్థం ఏ కుమారుడూ ఆ పరుపు దగ్గరకు కూడా పోయేవాడు కాడు. కాని దైవప్రవక్త (స) వచ్చి ఆ పరుపుపైన్నే కూర్చునేవారు. ఆయన ఇంకా చిన్న పిల్లవాడే. పినతండ్రులు ఆయన్ను పరుపుపై నుండి క్రిందికి తెచ్చి కూర్చోబెట్టేవారు. అలా చేస్తూ ఉండగా అబ్దుల్ ముత్తలిబ్ కుమారుల్ని ఉద్దేశించి, "నా ఈ కుమారుణ్ణి వదిలేయండి. దైవసాక్షి! ఈయన ఘనతే వేరు." అంటూ తిరిగి పిల్లవాణ్ణి ఎత్తుకొని తన దగ్గర కూర్చుండ బెట్టుకొని వీపు తట్టేవారు. అతని చేష్టలు చూసి ఆనందపడేవారు.[13]

ప్రవక్త (స) గారి వయస్సు ఇంకా ఎనిమిది సంవత్సరాల రెండు నెలల పది రోజులైందో లేదో అబ్దుల్ ముత్తలిబ్ సానుభూతి ఛాయ కూడా ఆయనకు దూరమైపోయింది. అబ్దుల్ ముత్తలిబ్ మక్కాలో మరణించారు. మరణానికి ముందు ఆయన ప్రవక్త పినతండ్రి అయిన అబూతాలిబ్‌కు - ఈయన ప్రవక్త(స)గారి తండ్రి అబ్దుల్లాహ్ సొంత సోదరుడు - సంరక్షణ బాధ్యతలను స్వీకరించమని అప్పజెప్పడం జరిగింది.[14]

పినతండ్రి ప్రేమఛాయలో

అబూతాలిబ్ తన సోదర కుమారుని సంరక్షణా బాధ్యతలను ఎంతో

13. ఇబ్నె హష్షామ్-1/168.
14. తల్ఖీహుల్ ఫహూమ్-పుట.7; ఇబ్నె హష్షామ్-1/149.

చక్కగా నిర్వర్తిస్తూ ఆయన్ను తన కుమారునిలా చూసుకున్నారు. మరీ చెప్పాలంటే అంతకు మిన్నగానే చూసుకున్నారు. ఆయన ఎడల ఎంతో గౌరవంగా మెలుగుతూ నలభై ఏండ్ల కంటే అధిక కాలం వరకు ఆయనకు అండదండగా నిలిచారు. ప్రవక్త (స) విషయమై చెలరేగిన శతృత్వం, మిత్రత్వం వివరాల సందర్భానుసారం రాబోతున్నాయి.

ప్రవక్త (స) మాధ్యమంగా వర్షం గురించి వేడుకోలు

జహ్‌లిమా బిన్ అరఫ్‌తా ఉల్లేఖనాన్ని 'ఇబ్నె అసాకర్' పొందుపరచిన విధం ఇలా ఉంది. జహ్‌లిమా ఇలా ఉల్లేఖించారు: "నేను మక్కా నగరానికి వచ్చినప్పుడు ప్రజలు కరువుతో పీడించబడుతున్నారు. ఖురైష్‌లు అబూ తాలిబ్‌తో, "అబూ తాలిబ్! మన నగరం కరువుకోరల్లో చిక్కుకొని ఉంది. చిన్నా పెద్దా అందరూ పస్తులుంటున్నారు. పదండి, వర్షం గురించి ప్రార్థిద్దాం" అని అన్నారు. అబూతాలిబ్ ఓ పిల్లవాణ్ణి వెంట తీసుకొని బయలుదేరారు. పిల్లవాడు అప్పుడే మబ్బు వదలిన సూర్యునిలా ప్రకాశిస్తున్నాడు. ఆ బాలుని చుట్టూ ఇతర బాలురు కూడా ఉన్నారు. అబూతాలిబ్ ఆ బాలుని చేయి పట్టుకొని కాబా గృహం వద్దకు వెళ్ళారు. అతని వీపును కాబా గృహానికి ఆనించి వ్రేలు పట్టుకొని నిలబడ్డారు. అప్పుడు ఆకాశంలో ఓ మబ్బుతునక మచ్చుకైనా కనబడలేదు. కాని చూస్తూ ఉండగానే అన్ని వైపుల నుండి మేఘాలు క్రమ్ముకోనారంభించాయి. కురిసిన కుంభవృష్టికి ఆ లోయలో వరదలు వచ్చాయి. నగరం, కొండాకోనలన్నీ జలమయమైపోయాయి. ఆ తరువాత ఓ సందర్భంగా అబూతాలిబ్ ఈ సంఘటన గురించి చెబుతూ, ముహమ్మద్ (స)ను ఇలా పొగిడారు.

"ఆయన అందగాడు. ఆయన ముఖారవిందం ద్వారా వర్షాన్ని కోరు కోవడం జరుగుతుంది. అనాథల ఆశ్రయం, వితంతువుల సంరక్షకుడాయన."[15]

క్రైస్తవ సన్యాసి బుహైరా

అనుమానాస్పద ప్రామాణికతలు గల కొన్ని ఉల్లేఖనాల ప్రకారం, దైవప్రవక్త (స) గారి వయస్సు పన్నెండేళ్ళు, మరో వివరణాత్మక ఉల్లేఖనం ప్రకారం, పన్నెండేళ్ళ రెండు నెలల పది రోజుల[16] కు చేరినప్పుడు అబూతాలిబ్

15. ముఖ్తసరుసీరత్-షేక్ అబ్దుల్లా-పుట-15,16.
16. ఇబ్నె జూజీ.

ఆయనను వెంట పెట్టుకొని సిరియాకు వ్యాపార రీత్యా ప్రయాణానికి బయలుదేరి 'బస్రా' చేరారు. 'బస్రా' సిరియా దేశానికి చెందిన 'హూరాన్'కు రాజధానిగా ఉండేది. రోమనులు ఆక్రమించుకున్న అరేబియా ద్వీపకల్ప ప్రాంతాలకు రాజధాని అది. ఆ నగరంలో 'బుహైరా' అనే బిరుదుతో పిలువబడే జర్జీస్ అనే పేరుగల ఓ క్రైస్తవ సన్యాసి ఉండేవాడు. బిడారం అక్కడ విడిది చేయగానే ఆ సన్యాసి తన చర్చీ నుండి బయలుదేరి వారి వద్దకు వచ్చాడు. వారినందరిని భోజనాలకు ఆహ్వానించాడు. ఇంతకుమునుపెన్నడూ ఈ సన్యాసి బయటకు వచ్చేవాడు కాదు. అతను దైవప్రవక్త(స)ను ఆయన గుణగణాలను చూసి గుర్తుపట్టాడు. ఆయన చేయి పట్టుకొని, "ఈయన విశ్వనాయకుడు. అల్లాహ్ ఈయన్ను కారుణ్యమూర్తిగా చేసి పంపిస్తాడు" అని అన్నాడు. దానికి అబూతాలిబ్, "నీకు ఇదంతా ఎలా తెలుసు?" అని అడగగా, ఆ సన్యాసి, "మీరు ఈ లోయలో అడుగుపెట్టగానే ఇక్కడి ఏ చెట్టూ, ఏ రాయీ ఆయనకు సాష్టాంగపడకుండా లేదు. ఈ వస్తువులు ఓ ప్రవక్త తప్ప మరే దాని ఎదుట సాష్టాంగ పడవు. అదే కాదు, నేనీయనను 'ప్రవక్త గుర్తు' ద్వారా కనుగొన్నాను. ఈ గుర్తు వీపుపై, మెడ క్రింద ఉన్న మెత్తటి ఎముకపై యాపిల్ ఆకారంలో ఉంది. ఇది మా గ్రంథాల్లో ఉన్న విషయం" అని చెప్పాడు.

ఆ తరువాత 'బుహైరా' సన్యాసి అబూతాలిబ్‌ను ఉద్దేశించి, వెంటనే ఈయన్ను వెనక్కు పంపించేయండి. సిరియాకు తీసుకొని వెళ్ళకండి. అక్కడ యూదుల ద్వారా ప్రమాదం పొంచి ఉంది అని చెప్పగా, అబూతాలిబ్ కొందరు బానిసల వెంట ఆయన్ను (ముహమ్మద్) మక్కాకు పంపించేశారు.[17]

ఫుజార్ యుద్ధం

దైవప్రవక్త (స) పదిహేనేండ్ల ప్రాయంలో ఉన్నప్పుడు ఫుజార్ యుద్ధం సంభవించింది. ఇది ఖురైష్, వారి మిత్రులు బనూ కనానాకు, ఖైస్ అయిలాన్‌కు నడుమ జరిగిన యుద్ధం. ఖురైష్, కనానాల సైన్యాధ్యక్షుడు హరబ్ బిన్ ఉమయ్యా. ఇతను తన వయస్సు, గౌరవం రీత్యా ఖురైష్

17. ముక్తసర్‌సరీత్ -షేక్ అబ్దుల్లా, పుట.16, ఇబ్నె హష్షామ్-1/180, 183; తిర్మిజీ వగైరాల్లో ఉన్న ఉల్లేఖనంలో దైవప్రవక్త (స)ను హజ్రత్ బిలాల్ వెంట పంపడం జరిగిందని ఉంది. అయితే ఇది పెద్ద పొరపాటు. బిలాల్ అప్పటికి బహుశా పుట్టి ఉండలేదేమో. పుట్టినా, ఆయన అబూ తాలిబ్‌కు లేదా అబూ బక్ర్ (ర)కు బానిసగా ఉండలేదు. జాదుల్-ముఆద్-1/17.

మరియు కనానాల దృష్టిలో పెద్దవాడు. యుద్ధంలో మొదట ఖైస్ తెగకే ఆధిక్యత లభించినప్పటికీ మధ్యాహ్నం అయ్యేసరికి కనానా సైన్యమే ఆధిక్యత సంపాదించింది. ఈ యుద్ధాన్ని, ఫుజార్ యుద్ధం అనడానికి కారణం ఏమిటంటే, ఇది హరమ్ (దైవగృహం) దగ్గర నిషిద్ధ మాసాలలో జరిగిన యుద్ధం. ఈ రెంటి గౌరవాన్ని మంటగలిపిన యుద్ధం. ఈ యుద్ధంలో దైవప్రవక్త (స) కూడా పాల్గొన్నారు. ఆయన ఆ యుద్ధంలో తన పినతండ్రులకు అంబులను అందించారు.[18]

హిల్ఫుల్ ఫుజూల్

ఈ యుద్ధం జరిగిన అనంతరం ఓ నిషిద్ధ మాసం 'జీఖాదా'లో హిల్ఫుల్ ఫుజూల్ అనే ఒప్పందం ఒకటి జరిగింది. కొన్ని ఖురైష్ తెగలు, అంటే బనీ హాషిమ్, బనీ ముత్తలిబ్, బనీ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా, బనీ జహ్రా బిన్ కిలాబ్ మరియు బనీ ఖైమ్ బిన్ ముర్రాలు దీన్ని నిర్వహించాయి. వీరంతా అబ్దుల్లా బిన్ జుద్ఆన్ తైమీ ఇంట చేరారు. వయస్సులోను, గౌరవంలోను అతను అందరికంటే మిన్నకావడం అందుకు కారణం. అందరూ ఓ మాట మీద నిలబడి, మక్కాలో ఏ పీడితుడు కనబడినా, అతడు మక్కా వాసి అయినా కాకపోయినా సరే, కలసికట్టుగా అతనికి సహాయం చేద్దామని, అతని హక్కును అతనికి ఇప్పిద్దామని ప్రమాణం చేశారు. ఈ ప్రమాణ సభలో దైవప్రవక్త (స) కూడా ఉన్నారు. దైవదౌత్య బాధ్యతలు స్వీకరించిన తరువాత కూడా ఆయన (స) ఇలా సెలవిస్తూ ఉండేవారు.

"నేను అబ్దుల్లా బిన్ జుద్ఆన్ ఇంట జరిగిన ఒప్పందంలో చేరి ఉన్నవాణ్ణి. దానికి బదులు నాకు ఎర్ర ఒంటెలు కూడా నచ్చవు. ఒకవేళ ఇస్లామ్ (కాలం)లో నన్ను ఈ ఒప్పందం కోసం పిలిస్తే తప్పక వెళ్ళేవాణ్ణి.[19]

తెగల దురభిమానానికి ఈ ఒప్పందం గొడ్డలిపెట్టు అయింది. దీని వెనుక ఉన్న కారణం ఏమిటంటే, జుబైద్ తెగకు చెందిన ఓ వ్యక్తి వర్తక సామగ్రి విక్రయించడానికి మక్కా వచ్చాడు. 'ఆస్ బిన్ వాయిల్' అనే వ్యక్తి ఆ సరుకును కొన్నాడు కాని ధర చెల్లించలేదు. అతను తన తెగ మిత్రులైన అబ్దుదార్,

18. ఇబ్నె హష్షామ్-1/184-186; ఖల్బ్ జజీరీతుల్ అరబ్-పుట. [illegible]; తారీఖె ఖిజ్రీ-1/63.

19. ఇబ్నె హష్షామ్-1/133, 135; ముక్త సరుస్సీరత్-షేక్ అబ్దుల్లాహ్-పుట.30, 31.

మగ్జూమ్, జమహ్, సహమ్ మరియు అద్దీ తెగల సర్దారుల సహాయాన్నర్థించగా వారు ఏ మాత్రం శ్రద్ధ తీసుకోలేదు. అప్పుడు ఆ వ్యక్తి అబూఖైస్ కొండపైకెక్కి బిగ్గరగా కొన్ని పద్యపాదాల్ని చదివాడు. ఆ పద్యపాదాల్లో తనకు జరిగిన అన్యాయాన్ని ఏకరువు పెట్టాడు. అది విన్న జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్, ఈ వ్యక్తి ఇంత నిస్సహాయుడెలా అయ్యాడు? అని బాధపడుతూ పైన పేర్కొన్న ఖురైష్ తెగలన్నింటిని ఓ చోట చేర్చడం జరిగింది. మొదట ఒప్పందం చేసుకొని ఆ తరువాత ఆస్ బిన్ వాయిల్ నుండి ఆ వ్యక్తికి రావలసిన హక్కును ఇప్పించడం జరిగింది.[20]

శ్రామిక జీవితం

యుక్తవయస్సులో దైవప్రవక్త (స)కు నిర్ణీతమైన పని అంటూ ఏదీ లేదు. అయితే, ఆయన (స) మేకలు కాసేవారని అనేక ఉల్లేఖనాలు చెబుతున్నాయి. ఆయన (స) మొదట బనీ సఅద్ మేకల్ని కాశారు.[21] మక్కాలోనూ మక్కావాసుల మేకల్ని కొన్ని 'కీరాత్'ల కూలీపై కాసేవారు.[22] పాతికేండ్ల వయస్సు రాగానే హజ్రత్ ఖదీజా (ర) సరుకును తీసుకొని వ్యాపారార్థం సిరియాకు వెళ్ళారు.

ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, ఖౌలీద్ కుమార్తె ఖదీజా (ర) ఓ గౌరవనీయమైన ధనవంతురాలైన మహిళ. తన సరుకును భాగస్వామ్య ప్రాతిపదికపై కొందరికిచ్చి వ్యాపారం చేయడానికి పంపించేవారు. ఖురైష్ తెగ ప్రజల వృత్తి పూర్తిగా వ్యాపారమే. ఆమెకు దైవప్రవక్త (స) గారి సత్యసంధత, అమానతు భావం, నీతీ నిజాయితీలను గురించి తెలియగా, తన బానిస మైసరా వెంట సిరియా వెళ్ళి తన సరుకును అమ్మమని, ఇతర వ్యాపారులకు ఇచ్చే ప్రతిఫలం కంటే అధికంగా ముట్టజెబుతానని ముహమ్మద్ (స)కు కబురు పంపారు. దైవప్రవక్త (స) ఆమె ఈ కోరికను మన్నించి ఆమె సరుకు తీసుకొని బానిస మైసరా వెంట సిరియాకు వెళ్ళారు.[23]

హజ్రత్ ఖదీజా (ర.అన్హా)తో వివాహం

సిరియాలో వ్యాపారం చేసి తిరిగి వచ్చారు దైవప్రవక్త (స). హజ్రత్ ఖదీజా (ర) తన వ్యాపారంలో జరిగిన అభివృద్ధిని, ముహమ్మద్ (స) గారి

20. ముఖ్తసరుస్సీరత్-పుట-30, 31.
21. ఇబ్నె హష్షామ్-1/166.
22. సహీ బుఖారి-అల్ ఇజారాత్-బాబ్ రఅయుల్‌గనమ్ అలల్ ఖీరాత్-1/130.
23. ఇబ్నె హష్షామ్-1/187, 188.

నిజాయితీని చూసి ముగ్ధురాలై తన బానిస మైసరా ద్వారా విషయాన్ని తెలుసుకున్నారు. మైసరా ముహమ్మద్ (స) గారి నిజాయితీనీ ఉన్నత గుణగణాలనూ సందర్భోచితంగా తీసుకున్న నిర్ణయాలను ఏకరువుపెట్టినప్పుడు, ఖదీజా (ర), తాను పొగొట్టుకున్న ఆణిముత్యం తిరిగి లభ్యం అయినట్లు సంబరపడిపోయారు. అంతకుపూర్వం గొప్ప గొప్ప సర్దారులు, ధనవంతులు ఆమెను వివాహమాడాలని ప్రయత్నం చేసినప్పటికి ఆమె ఒప్పుకోలేదు. ఇప్పుడామె తన మనసులోని మాట తన స్నేహితురాలు 'నఫీసా బిన్తె మంబా'కు చెప్పారు. నఫీసా దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి మాట్లాడారు. ఆయన (స) వివాహానికి అంగీకరించి పినతండ్రులతో ఈ విషయమై చర్చించారు. వారు హజ్రత్ ఖదీజా (ర) గారి పినతండ్రితో పెళ్ళి సంబంధమై మాట్లాడారు. ఆ తరువాత వివాహం జరిగిపోయింది. నికాహ్‌కు బనీ హాషిం తెగవారు, ముజర్ ధనవంతులందరూ హాజరయ్యారు.

ఇది సిరియా దేశం నుండి తిరిగొచ్చిన రెండు నెలల తరువాత జరిగిన విషయం. దైవప్రవక్త (స) 'మహ్ర్'గా ఇరవై ఒంటెల్ని ఖదీజా (ర)కు ఇచ్చారు. అప్పుడు హజ్రత్ ఖదీజా (ర) గారి వయస్సు నలభై సంవత్సరాలు. ఆమె వంశం, సంపద, వివేకం రీత్యా తన జాతిలోనే అతి గౌరవనీయురాలైన ఉత్తమ మహిళ. దైవప్రవక్త (స) వివాహమాడిన మొదటి మహిళ ఈమే. ఆమె జీవించినంత వరకు ఆయన (స) మరో మహిళను వివాహమాడలేదు.[24]

ఒక్క 'ఇబ్రాహీం' తప్ప దైవప్రవక్త (స) గారి తక్కిన సంతానమంతా ఆమె గర్భాన జన్మించిందే. ప్రథమంగా జన్మించింది 'ఖాసిం'. ఆయన పేరు మీదనే ఆయన (స)కు 'అబుల్ ఖాసిం' అనే పేరు వచ్చింది. ఆ తరువాత జైనబ్ (ర), రుకయ్యా (ర), ఉమ్మె కుల్సుమ్ (ర), ఫాతిమా (ర), అబ్దుల్లాహ్‌లు జన్మించారు. అబ్దుల్లాహ్‌నే తయ్యిబ్ మరియు తాహిర్‌గా పిలిచేవారు. కుమారులంతా బాల్యంలోనే మరణించారు. అయితే, కుమార్తెలందరూ ఇస్లాం హయాం చూసినవాళ్ళే. ఇస్లామ్ స్వీకరించి 'హిజ్రత్' గౌరవాన్ని పొందినవారే. కాని ఫాతిమా (ర) తప్ప మిగిలిన కుమార్తెలందరూ ప్రవక్త (స) గారి జీవిత కాలంలోనే పరమపదించారు. హజ్రత్ ఫాతిమా (ర) దైవప్రవక్త (స) మరణానంతరం ఆరు నెలల తర్వాత చనిపోయారు.[25]

24. ఇబ్నె హష్షామ్-1/189, 190; ఫిక్హుస్సీరత్-పుట.59, తల్ఖీహుల్ ఫహూమ్-పుట.7
25. ఇబ్నె హుష్షామ్-1/190, 191; ఫిక్హుస్సీరత్-పుట, 60; ఫతహుల్ బారీ-7/105,

కాబా నిర్మాణం, హజ్రె అస్వద్ వివాద పరిష్కారం

ఖురైష్, కాబాగృహ పునర్నిర్మాణాన్ని ప్రారంభించిన రోజులవి. అప్పుడు మహాప్రవక్త (స)కు ముప్పై అయిదు సంవత్సరాల వయస్సు. ఈ నిర్మాణానికి కారణం ఇది. అప్పటికి కాబాగృహం కేవలం కొంచెం ఎత్తుగల నాలుగు గోడలతో నలుచదరంగా ఉండేది. హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) కాలం నుండే దాని ఎత్తు తొమ్మిది మూరలు. దాని పైకప్పు లేదు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని కొందరు దొంగలు అందులో దాచి పెట్టిన ధనాన్ని దోచుకోవడం జరిగింది. ఈ కారణమే కాకుండా దాని నిర్మాణం జరిగి చాలా కాలం అయింది. కట్టడం బలహీనంగా కూడా అయింది. గోడల్లో పగుళ్ళు కనిపిస్తున్నాయి. ఆ సంవత్సరమే పెద్ద వరదలు వచ్చాయి. వరదల ప్రవాహం కాబా గృహంవైపే ఉండటం వల్ల అది ఏ క్షణాన్నయినా కూలిపోయే ప్రమాదం ఏర్పడింది. అందుకని ఖురైష్, దాని హోదాను, పవిత్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతో దాన్ని తిరిగి నిర్మించడానికి పూనుకున్నారు.

ఈ దశలో ఖురైష్ తెగవారు, కాబా గృహ నిర్మాణంలో కేవలం ధర్మసమ్మతమైన డబ్బునే వాడాలని, దీనికి వ్యభిచారం నుండి వసూలైన సొమ్ముగాని, వడ్డీ ద్వారా లభించిన డబ్బుగాని, ఒకరి హక్కును కొల్లగట్టి సంపాదించిన ధనాన్నిగాని వాడరాదని ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. క్రొత్త కట్టడాన్ని నిర్మించడానికి పాత కట్టడాన్ని కూల్చవలసివచ్చింది. పాత కట్టడాన్ని కూల్చడానికి ఎవరికీ ధైర్యం చాలడం లేదు. చివరికి వలీద్ బిన్ ముగీరా మగ్జూమీ అనే వ్యక్తి ఆ పనిని ప్రారంభించాడు. అతను ఎలాంటి దైవ శిక్షకు గురికాలేదని గ్రహించిన వారు కూల్చడంలో అతనికి తోడ్పడ్డారు. అలా ఇబ్రాహీం (అ.స.) నిర్మించిన పునాదుల వరకు కూలుస్తూ వెళ్ళిన తరువాత అక్కడి నుండి కాబా గృహంను తిరిగి నిర్మించనారంభించారు. ఈ నిర్మాణ కార్యక్రమంలో ప్రతి తెగకు వారి పని అప్పగించబడింది. ప్రతి తెగ తమ వంతు రాళ్ళను ప్రోగు చేసుకున్నారు. నిర్మాణం ప్రారంభం అయింది. బాకూమ్ అనే పేరుగల రోమన్ నిర్మాణ నిపుణుడు ఒకడు ఆ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్నాడు. కట్టడం గోడలు

చారిత్రక ఆధారాల్లో కొంత తేడా ఉంది. నా దృష్టిలో సరి అయిన దాన్ని ఇక్కడ పొందుపరిచాను.

హజ్రె అస్వద్ (నల్లరాయి) స్థానం వరకు లేవగానే, హజ్రె అస్వద్‌ను దాని స్థానంలో ప్రతిష్టించే గౌరవం, ఔన్నత్యం ఎవరికి దక్కాలనే వివాదం తలెత్తింది. ఈ వివాదం నాలుగయిదు రోజుల వరకు కొనసాగింది. క్రమంగా అది తీవ్ర రూపాన్ని దాల్చి హరమ్ (మక్కా) లాంటి పవిత్రస్థలంలో రక్తపాతం జరిగేటంత వరకూ వెళ్ళింది. కాని అబూ ఉమయ్యా మగ్జూమీ అనే ఓ వ్యక్తి దానికి పరిష్కార మార్గాన్ని చూపెట్టాడు. దాని ప్రకారం మస్జిదె హరామ్ ద్వారం నుండి ఏ వ్యక్తి అయితే మొదట ప్రవేశిస్తాడో అతణ్ణి తమ వివాదానికి పరిష్కర్తగా చేసుకోవాలని సలహా ఇచ్చాడు. అందరూ ఈ సలహాను శిరసావహించారు. దైవలీల ఏమిటోగాని, ఆ సలహా తరువాత మొట్టమొదటగా దైవప్రవక్తే ఆ ద్వారం గుండా లోనికి ప్రవేశించారు. ప్రజలు ఆయన్ను చూడగానే, "ఓహో! ఈయన ముహమ్మద్ (స). ఈయన అమానతుదారుడు అమీన్. మేము ఆయన చెప్పినట్లుగానే నడుచుకుంటాము" అని ముక్తకంఠంతో అరిచారు. ఆయన దగ్గరకు రాగానే అందరూ ఆ వివాదం వివరాలు వివరించి తీర్పు చెప్పమని అడిగారు. ఆయన (స) ఓ దుప్పటిని తెప్పించి పరచి మధ్యలో హజ్రె అస్వద్‌ను ఉంచారు. వాదులాడుతున్న సర్దారులందరినీ పిలిచి, మీరంతా దుప్పటి అంచుల్ని పట్టి పైకెత్తండి అని కోరారు. అందరూ ఆయన చెప్పినట్లుగానే దుప్పటిని పైకి ఎత్తారు. దుప్పటి హజ్రె అస్వద్ స్థానం వరకు పైకి లేవగానే దైవప్రవక్త (స) తన చేతుల మీదుగా హజ్రె అస్వద్‌ను దాని స్థానంలో ఉంచేశారు. ఈ తీర్పు ఎంతో సమంజసమైన తీర్పు. జాతి అంతా దాన్ని స్వీకరించింది, గౌరవించింది.

ఇటు ఖురైషీయులకు ధర్మసమ్మతమైన సొమ్ము సరిపోలేదు. అందుకని వారు ఉత్తరాన కాబా నిడివిలో దాదాపు ఆరు మూరల పొడవును తగ్గించాల్సి వచ్చింది. కాబా గృహపు మిగిలిపోయిన ఈ స్థల భాగం 'హిజ్ర్' మరియు 'హతీమ్'గా పిలువబడుతోంది. ఈసారి నిర్మాణం సమయంలో కాబాలో ప్రతివాడు ప్రవేశించకుండా కేవలం అనుమతి పొందినవాడే ప్రవేశించాలనే ఉద్దేశ్యంతో కాబా గృహ ద్వారాన్ని భూమికి కొంత ఎత్తున కట్టారు. కాబా గృహపు గోడ ఎత్తు పదిహేను మూరలు అయిన తర్వాత లోపల ఆరు స్తంభాలు నిలబెట్టి పైనుండి కప్పు వేయడం జరిగింది. కాబా గృహం పూర్తి నిర్మాణ దశకు చేరినప్పుడు దాదాపు నలుచదరంగా తయారయింది. హజ్రె అస్వద్ ఉన్న గోడ దానికి ఎదురుగా ఉన్న గోడ అంటే దక్షిణ, ఉత్తర కుడ్యాల

పొడవు పదేసి మీటర్లు. హజ్రె అస్వద్ ప్రదక్షిణ చేసే నేలకు ఒకటిన్నర మీటర్ల ఎత్తున ఉంది. ద్వారం ఉన్న గోడ, దానికి ఎదురుగా ఉన్న గోడ అంటే తూర్పు పడమరల గోడల పొడవు పన్నెండేసి మీటర్లు. ద్వారం భూమికి రెండు మీటర్ల ఎత్తున ఉంది. గోడల చుట్టూ, క్రింది భాగంలో, చుట్టూ ఉన్న పీఠం సరాసరి ఎత్తు 25 సెంటీమీటర్లు, సరాసరి వెడల్పు 30 సెంటీమీటర్లు. దీన్ని 'షాజె రవాన్' అని అంటారు. ఇది కూడా దైవగృహంలోని భాగమే. అయితే ఖురైష్ దాన్ని కూడా కట్టకుండా వదిలేశారు.[26]

దైవదౌత్యానికి పూర్వపు సంగ్రహ జీవితం

దైవప్రవక్త (స) గారిలో, వివిధ వర్గాలకు చెందిన గొప్పవారి సుగుణాలన్నీ కలగలిపిపోసిన ప్రతిరూపం అనడం సమంజసం. ఆయన ఆలోచనా పటుత్వం, దూరదృష్టి, సత్యసంధతకు మారుపేరు. ఆయనకు చురుకైన బుద్ధికుశలత, దృఢచిత్తం, లక్ష్యసాధనా ధైర్యం లాంటి సుగుణాలు అధికంగానే అబ్బాయి. తన సుదీర్ఘ మౌనం ద్వారా, ఆలోచనా లోతుల్లోనికి వెళ్ళి శాశ్వత పరిష్కారాన్ని, సత్యాన్ని అన్వేషించే ప్రయత్నం చేసేవారు. దైవప్రవక్త (స) తన చురుకైన బుద్ధికుశలత, సహజ ధోరణి ద్వారా జీవిత పరమార్థాన్ని, ప్రజల వ్యవహారాలను, సమాజాల స్థితిగతులను అధ్యయనం చేశారు. ఏ మూఢాచారాల్లో ఈ జాతులు నిండా మునిగి ఉండేవో వాటి ఎడల వెగటును కూడా ప్రదర్శించేవారు. కాబట్టి ఆయన వీటన్నిటికి దూరంగా ఉంటూ పూర్తి స్ఫూర్తితో ప్రజల నడుమ జీవితం గడిపారు. అంటే, ప్రజలు ఆచరించే సత్కార్యాల్లో పాలుపంచుకుంటూ, ఇతర అర్థంలేని పనులకు దూరంగా ఉండి తన ఏకాంతం వైపునకు మరలేవారు. కాబట్టి ఆయన మద్యాన్ని ముట్టలేదు, దైవేతరుల సంతుష్టి కోసం బలి చేసిన పశువుల మాంసాన్ని తినలేదు. విగ్రహాల కోసం చేసే జాతరలలో, పండుగల్లో ఎన్నడూ పాల్గొనలేదు.

ఆయన (స)కు మొదటి నుండే ఈ అసత్య దేవతల ఎడల కలిగిన అసహ్యం, వెగటు మరే విషయంలోనూ కలుగలేదు. చివరికి లాత్, ఉజ్జాల పేరున వేసుకునే ఒట్టు, ప్రమాణం గురించి పలికిన పలుకులు వినడం కూడా ఆయనకు గిట్టేది కాదు.[27]

26. ఇబ్నె హష్షామ్-1/192-197, ఫిక్కతుస్సీరత్-పుట.62, 63; సహీబుఖారి-అధ్యాయం, ఫజల్ మక్కా వ బున్యానహా (మక్కా, దాని దాడులు)-1/215; తారీఖె ఖిజ్రీ-1/64, 65.

27. ఇబ్నె హష్షామ్-1 /128 (బుహైరా సంఘటన).

విధాత సంరక్షణ ఆయన్ను ఎల్లవేళలా కాపాడుతూ వచ్చిందనడంలో సందేహం ఏ మాత్రం లేదు. ప్రాపంచిక వ్యసనాల్లో చిక్కుకోవడానికి మనస్సు ఆయన ప్రోత్సహించినప్పుడల్లా, లేదా కొన్ని దురాచారాల వైపునకు ఆయన మనస్సు లాగినప్పుడల్లా దైవకటాక్షం అడ్డొచ్చి ఆయన్ను అటు వైపునకు మరలకుండా చేసేది. ఇబ్నె అసీర్ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) గారి ప్రవచనం ఇలా ఉంది. అజ్ఞాన అరబ్బుల కార్యకలాపాల్లో రెండుసార్లు తప్ప నా మనస్సు అటు వాలలేదు. కాని అల్లాహ్ నన్ను, దైవదౌత్య గౌరవం లభించేటంత వరకు, ఆ రెండు సందర్భాలు తప్ప అలాంటి తలంపు కలగనీయలేదు. ఆ సంఘట నల వివరాలేమిటంటే, ఎగువ మక్కాలో నాతో కలసి మేకలు కాసే ఓ కుర్ర వానితో, నా మేకల్ని చూస్తూ ఉండు, నేను వెళ్ళి ఇతర యువకుల్లా అక్కడ రాత్రి జరిగే కథలు చెప్పే కార్యక్రమంలో పాల్గొంటాను అని చెప్పి బయలు దేరాను. కొంత దూరం వెళ్ళిన తరువాత మక్కాలోని మొదటి గృహం నుండే నాకు సంగీతం వినిపించింది. అదేమిటని కొందరిని అడగగా, ఫలానా వారి పెండ్లి జరుగుతోంది అని చెప్పారు. నేనక్కడనే సంగీతం వినడానికి కూర్చు న్నాను. అల్లాహ్ నా చెవులను మూసివేశాడు. నేను నిదుర ఒడిలో ఒరిగి పోయాను. పొద్దు ఎక్కగా ఎండ వేడిమికి నాకు మెలుకువ వచ్చింది. తిరిగి నేను నా మిత్రుని వద్దకు వెళ్ళిపోయాను. అతను వివరాలు అడగగా నేను విష యాన్నంతా చెప్పేశాను. ఆ తరువాత మరో రాత్రి ఈ మాటే చెప్పి నేను మరలా మక్కా వెళ్ళాను. ఆ రాత్రి కూడా అదే సంఘటన ఎదురయింది. ఆ తరువాత నాకు ఎన్నడూ తప్పుడు మార్గం వైపునకు వెళ్ళే తలంపు కలుగలేదు.[28]

సహీ బుఖారి గ్రంథంలో హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ ఉల్లేఖనం ప్రకారం, కాబా గృహం నిర్మించేటప్పుడు, దైవప్రవక్త (స) మరియు హజ్రత్ అబ్బాస్ రాళ్ళు మోస్తున్నారు. హజ్రత్ అబ్బాస్ దైవప్రవక్త(స)తో, మీ లుంగీ తీసి భుజం మీద పెట్టుకోండి. రాళ్ళు ఒత్తుకోకుండా ఉంటాయి అన్నారు. అయితే దైవప్రవక్త (స) భూమ్మీద పడిపోయారు. చూపులు ఆకాశం వైపునకు ఉన్నాయి. స్పృహ వచ్చిన వెంటనే నా లుంగీ, నా లుంగీ అని అరవనారంభించారు.

28. ఈ హదీసును హాకిమ్ జహబీ ప్రామాణికమైన హదీసుగా చెబుతారు. కాని ఇబ్నె కసీర్ అల్ బదాయా వన్నహాయా-2/287లో ఇది బలహీన హదీసు అని ఉంది.

ఆయన లుంగీ వెంటనే కట్టడం జరిగింది. మరో ఉల్లేఖనంలో, ఆ తరువాత ఆయన మర్మాంగం ఎన్నడూ అగుపడలేదు[29] అని ఉంది.

దైవప్రవక్త (స) ఆయన జాతిలోనే ఉత్తమ నడవడి, మహోన్నత నైతిక విలువలు, దాతృత్వ గుణాల రీత్యా అందరికంటే మిన్న. కాబట్టి ఆయన (స) అందరికంటే అధికంగా మానవత్వంలోను, సభ్యతాసంస్కారాల్లోను ముందుండేవారు. మంచి పొరుగువానిగా, దూరదృష్టి గలవానిగా, అందరికంటే మిన్నయిన సత్యసంధునిగా, పరిశుద్ధ మనస్కునిగా, దాతగా అలరారినవారు. జాతిలోకెల్లా సద్వర్తనుడూ, మాటను నిలుపుకునేవాడూ, అమానతులను అప్పగించేవాడూ ఆయన కంటే మరెవ్వరూ లేరు. జాతి ఆయన్ను 'అమీన్' (అమానతుదారు లేదా అప్పగింతల రక్షకుడు)గా పిలిచేది. హజ్రత్ ఆయిషా (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, ఆయన (స), వ్యాధిగ్రస్తులు, ఆపదల్లో చిక్కుకున్న వారికి బాసటగా నిలిచేవారు. నిరుపేదలకు సహాయం చేసేవారు. అతిథిని సత్కరించేవారు. సత్యమార్గంలో కష్టాలపాలైన వారికి సహాయమందించేవారు.[30]

29. సహీబుఖారి, అధ్యాయం: కాబా నిర్మాణం-1/540.
30. సహీ బుఖారి-1/30.

దైవదౌత్య శకం

(మక్కాలో గడిపిన పవిత్ర జీవిత కాలం)

దైవసందేశ ప్రచార ఘట్టాలు

దైవప్రవక్త (స) గారి దైవదౌత్య జీవితాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. ప్రతి భాగం, పరస్పరం ఒకదానికంటే మరొకటి ప్రస్ఫుటంగా, ఉన్నతంగా కనబడుతుంది. ఆ రెండు భాగాలు ఇవి.

1. మక్కా జీవితం - దాదాపు పదమూడు సంవత్సరాలు.
2. మదీనా జీవితం - పదేళ్ళు.

ఇందులో ప్రతి భాగం అనేక దశలు కలిగి ఉంది. ఈ దశలు వాటి ప్రత్యేకతల రీత్యా పరస్పరం ఒకదానికంటే మరొకటి వేరుగా, ఉన్నతంగా కనబడతాయి. ఈ విషయం ఆయన (స) గారి దైవదౌత్య జీవితానికి సంబంధించిన రెండు భాగాల్లో సంభవించే వివిధ సంఘటనలు, పరిస్థితులను లోతుగా అధ్యయనం చేస్తేగాని అర్థం కాదు.

మక్కా జీవితపు మూడు దశలు

1. మూడేళ్ళు కొనసాగిన రహస్య దైవసందేశ ప్రచార దశ.
2. మక్కావాసుల నడుమ బాహాటంగా చేసిన సందేశ ప్రచార దశ. ఇది దైవదౌత్యపు నాల్గవ సంవత్సరం ప్రారంభం మొదలు పదవ ఏట చివరి వరకు.
3. మక్కా నగరం వెలుపల ఇస్లామ్ ధర్మప్రచార సాఫల్యం, వికాసాల దశ- దైవదౌత్యపు పదవ ఏట చివరి కాలం నుండి మదీనాకు హిజ్రత్ వరకు.

మదీనా జీవితంలోని దశల వివరాలు ముందురాబోతున్నాయి.

దైవదౌత్యపు ఛత్రఛాయల్లో ముహమ్మద్ (స)

హిరా కొండ గుహలో: మహాప్రవక్త ముహమ్మద్ (స) వయస్సు దాదాపు నలభై ఏళ్ళు పూర్తి కావస్తోంది. ఈ నడుమ, అప్పటి వరకు తన జాతి నడవడిక ఆయన్ను జాతి నుండి చాలా దూరానికి తీసుకుపోయింది. ఆయన(స)కు ఏకాంతవాసమే ప్రియమనిపించడం వలన, నీరు, పేలపు పిండి వెంట తీసుకుని మక్కాకు రెండు మైళ్ళ దూరంలో ఉన్న హిరా కొండలోని ఓ గుహలోనికి వెళ్ళి ధ్యానముద్రలో లీనమైపోయేవారు.

ఇది ఓ చిన్న గుహ. దాని పొడవు నాల్గు గజాలు, వెడల్పు ఒకటి ముప్పాతిక గజాలు. క్రింది వైపునకు లోతుగా లేదు. ఇది ఓ ఇరుకైన బాటకు ప్రక్కన, పై బండరాళ్ళు రెండూ పరస్పరం కలుసుకోవడం మూలంగా ఏర్పడిన ఓ గుడిసెలా ఉంది.

దైవప్రవక్త (స) ఇక్కడికి వచ్చినప్పుడల్లా హజ్రత్ ఖదీజా (ర) కూడా ఆయన వెంట వెళ్ళి దగ్గరలోనే ఓ చోట ఉండేవారు. దైవప్రవక్త (స) రమజాన్ నెల పూర్తిగా ఈ గుహలోనే ఉండేవారు. అక్కడికి వచ్చిపొయ్యే నిరుపేదలకు భోజనం పెడుతూ మిగిలిన కాలం అల్లాహ్ ఆరాధనలో నిమగ్నమైపోయేవారు. విశ్వసృష్టి సూచనలను చూస్తూ వాటి వెనుక ఉన్న రహస్యాన్ని గూర్చి ఆలోచించే వారు. ఆయన (స)కు తన జాతి ఆచరించే బహుదైవారాధనా నమ్మకాలపై, అర్థంలేని విశ్వాసాలపై ఎలాంటి నమ్మకం ఏర్పడలేదు. అయితే ఆయన (స), పూర్తి నమ్మకంగా, నిస్సంకోచంగా అవలంబించడానికి ఆయన ముందు, ఖచ్చితమైన, నిర్ణీతమైన ఎలాంటి మార్గంకానీ, అతికి- మితానికి అతీతంగా ఉండే ఎలాంటి విధానంగానీ ఏదీ లేదు.[1]

---

1. *రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/47, ఇబ్నె హష్షామ్-1/235, 236; ఫీజిలాలుల్ ఖుర్ఆన్- కాండం: 29/166.*

ప్రవక్త (స)గారి ఈ ఏకాంత జీవితం, నిజానికి అల్లాహ్ ప్రణాళిక యొక్క ఓ భాగమే. ఇలా అల్లాహ్ ఆయన్ను రాబోయే మహోన్నత కార్యం కోసం సిద్ధం చేస్తున్నాడు. యదార్థం ఏమిటంటే, ఏ వ్యక్తి అయినా, మానవ జీవితపు యదార్థాలను ప్రభావితం చేసి, వాటిని ఓ రుజుమార్గం వైపునకు మళ్ళించవలసివస్తే, అతను లౌకిక ఆర్భాటాలు, జీవిత ఝుంజాటాలు, ప్రాపంచిక వ్యామోహాలకు కొంతకాలం దూరంగా ఉంటూ ఏకాంతంలో గడపవలసి ఉంటుంది.

అచ్చం ఈ సూత్రానికి అనుగుణంగా, అల్లాహ్, ముహమ్మద్ (స)కు మహోన్నత కార్యసాధనా బాధ్యతను అప్పగించి, తద్వారా ప్రపంచ సంస్కరణకు, చరిత్ర గతిని తిప్పడానికి ఎంచుకోదలిచాడు. దైవదౌత్య బాధ్యత ఆయనపై వేయడానికి మూడేళ్ళకు ముందే ఆ ఏకాంతవాసాన్ని ఆయనపై విధించడం జరిగింది. మహాప్రవక్త (స) ఈ ఏకాంతవాసంలో ఓ నెల్లాళ్ళు విశ్వ వ్యవస్థ గురించి ఆలోచిస్తూ, దాని వెనుక దాగివున్న రహస్యం గురించి ఆలోచించేవారు. దైవాదేశం వస్తే ఆ రహస్యాన్ని బయటపెట్టడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉండేవారు.[2]

జిబ్రీల్ (అ.స.) దివ్యావిష్కృతి(వహీ)ని గొనివచ్చిన వేళ

ముహమ్మద్ (స) గారి వయస్సు నలభై ఏళ్ళకు చేరుకుంది. ఈ వయస్సే పరిపుష్టమైన వయస్సు. ప్రవక్తలందరి ప్రాభవం ఈ వయస్సులోనే జరిగిందని చెప్పడం జరుగుతోంది. దైవదౌత్య సూచనలు ఒక్కొక్కటిగా వ్యక్తమవుతూ ప్రకాశించసాగాయి. ఈ సూచనలన్నీ స్వప్నాల రూపంలో కనబడేవి. చూసిన స్వప్నాలన్నీ సాకారం కావడం ఆయన గమనిస్తూ ఉండేవారు. ఈ పరిస్థితి ఆరు నెలల వరకు కొనసాగింది. ఇది ప్రవక్త పదవికి సంబంధించిన నలభై ఆరవ భాగం. పూర్తి దైవదౌత్యకాలం ఇరవై మూడు సంవత్సరాలు. ఆ తరువాత 'హిరా' కొండ గుహలో ఏకాంతవాసపు మూడవ సంవత్సరం ప్రవేశించినప్పుడు, అల్లాహ్ భూవాసులపై కారుణ్యం కురిపించి ఆయనను ప్రవక్తగా నియమించదలిచాడు. జిబ్రీల్ (అ.స.) దివ్య ఖుర్ఆన్ వాక్యాలను కొన్నింటిని ఆయన వద్దకు తెచ్చారు.[3]

---

2. *ఫీజిలాలుల్ ఖుర్ఆన్ - కాండం: 29/166,167.*
3. *బైహఖీ ఉల్లేఖనం ప్రకారం, ఈ స్వాప్నిక కాలం పూర్తి ఆరు నెలలని, స్వప్నాల రూపంలో ప్రవక్త పదవి నలభై ఏళ్ళ ప్రాయంలోనే ప్రారంభం అయిన తరువాత*

ఖుర్ఆన్ ఆధారాలపై దృష్టిని సారిస్తే, హజ్రత్ జిబ్రీల్ (అ.స.) రాక, ఆ సంఘటన తేదీని నిర్ణయించవచ్చు. మా పరిశోధన ప్రకారం, ఈ సంఘటన రమజాన్ నెల 21వ తేదీ, సోమవారం రాత్రి సంభవించింది. ఆ రోజు ఆగస్టు 10, క్రీ.శ. 610వ సంవత్సరం. చాంద్రమాన లెక్కల ప్రకారం దైవప్రవక్త (స) గారి వయస్సు ఆనాటికి నలభై సంవత్సరాల ఆరు నెలల పన్నెండు రోజులు. సూర్యమానం ప్రకారం 39 సంవత్సరాల 3 నెలల ఇరువై రెండు దినాలు.[4]

---

*రబీ ఉల్ అవ్వల్ మాసంలో- ఇది ఆయన (స) జన్మించిన మాసమే- జరిగిందని హాఫిజ్ ఇబ్నె హజర్ అంటారు. అయితే, మేల్కొన్న స్థితిలో దివ్యావిష్కృతి మాత్రం రమజాన్ నెలలోనే అవతరించింది. ఫత్హుల్ బారి-1/27.***దైవవాణి అవతరించిన నెల, రోజు మరియు తేది***

4. *దైవప్రవక్త(స)కు ఏ నెలలో దైవదౌత్యం, దివ్యావిష్కృతి గౌరవభాగ్యం లభించిందన్న విషయమై చరిత్రకారుల్లో పెద్ద అభిప్రాయభేదం ఉంది. మహాప్రవక్త (స) జీవితాన్ని అధ్యయనం చేసి రాసిన చరిత్రకారుల్లో అధికులు, ఇది రబీఉల్ అవ్వల్ మాసమని అంటారు. కాని ఓ వర్గం మాత్రం, ఇది రమజాన్ నెలని, మరి కొందరు రజబ్ నెల అని వాదిస్తారు (చూడండి, ముక్తతసర్ సీరత్ - షేక్ అబ్దుల్లా, పుట. 75). మా దృష్టిలో రెండవ వర్గానికి చెందినవారు చెప్పే నెలయే సరి యైనది. అది రమజాన్ నెల. ఎందుకంటే అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో చెప్పినట్లు,* شَهْرُ رَمَضَانَ الَّذِيٓ اُنْزِلَ فِيْهِ الْقُرْاٰنُ *"ఖుర్ఆన్ అవతరించబడిన పవిత్ర మాసమే రమజాన్ నెల" (2-185). అలాగే మరో సూరా ఖద్ర్‌లో ఇలా చెప్పడం జరిగింది.* اِنَّآ اَنْزَلْنٰهُ فِيْ لَيْلَةِ الْقَدْرِ *"మేము ఖుర్ఆన్‌ను ఖద్ర్ రాత్రిన అవతరింపజేశాము" (97-1). ఖద్ర్ రేయి రమజాన్ నెలలోనే వస్తుంది. మరో సూరాలో,* اِنَّآ اَنْزَلْنٰهُ فِيْ لَيْلَةٍ مُّبٰرَكَةٍ اِنَّا كُنَّا مُنْذِرِيْنَ ۝ *"మేము దివ్య ఖుర్ఆన్‌ను ఓ శుభమైన రాత్రిన అవతరింపజేశాము. మేము ప్రజలను శిక్ష ప్రమాదం నుండి హెచ్చరిస్తున్నాం." (44-3)*

రెండవ వర్గం వాదన సరిఅయింది అనడానికి ఓ కారణం, హిరా గుహలో దైవ ప్రవక్త (స) రమజాన్ మాసంలోనే ధ్యానముద్రలో ఉండేవారు. జిబ్రీల్ (అ.స.) హిరా కొండ గుహలోనే అరుదెంచారన్నది.

ఎవరైతే, రమజాన్ మాసంలోనే దైవవాణి అవతరణ జరిగిందని వాదిస్తారో వారిలోనూ, రమజాన్ మాసపు తేదీ గురించి అభిప్రాయ తేడాలున్నాయి. కొందరు అది ఏడవ తేదీ అంటే మరికొందరు పదిహేడు అని, మరికొందరు పద్దెనిమిదవ తేదీ అని అంటారు. (చూడండి, ముక్తసర్ సీరత్- పుట. 75; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/49). అల్లామా ఖిజ్రీ పదిహేడవ తేది అనే అంటారు. (చూడండి, తారీఖె ఖిజ్రీ-1/69 మరియు తారీఖుత్తష్రీఉల్ ఇస్లామీ- పుట. 5, 6, 7).

రండి! ఇప్పుడు మనం హజ్రత్ ఆయిషా (ర)గారి నోట ఈ సంఘటనా వివరాలను విందాం. హజ్రత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది:

"దైవప్రవక్త (స)పై దైవవాణి అవతరణ నిద్రలో శుభస్వప్నాల రూపంలో ప్రారంభం అయింది. ఆయన చూసిన ప్రతి స్వప్నం నిజమయ్యేది. ఆ తరువాత ఆయనకు ఏకాంతం రుచించింది. కాబట్టి ఆయన హిరా కొండ గుహలో ఏకాంతంగా, ఎన్నో రాత్రులు ఇంటికి రాకుండా ఆరాధనలో నిమగ్నులై ఉండేవారు. ఈ ఆరాధన కోసం ఆయన తన వెంట భోజనం కూడా తీసుకు వెళ్ళేవారు. (భోజనం) అయిపోగా, హజ్రత్ ఖదీజా (ర) ఆయన వద్దకు వెళ్ళి మిగతా అన్ని రోజుల కోసం భోజనం సమకూర్చి వచ్చేవారు. చివరికి ఆయన వద్దకు 'సత్యం' వచ్చేసింది. దైవప్రవక్త (స) హిరా కొండ గుహలో ఉన్నప్పుడు ఆయన వద్దకు ఓ దైవదూత వచ్చి 'చదువు' అని అన్నాడు. జవాబుగా 'నాకు చదువు రాదు' అని పలికారు ప్రవక్త (స). ఈ విషయమై దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఆ దైవదూత నన్ను పట్టి గట్టిగా అదిమాడు. నా శక్తి అంతా పిండేసి నట్లయింది. నన్ను వదిలేసి తిరిగి 'చదువు' అని అన్నాడు. నేను, 'నాకు చదువు

నేను ఇరవై ఒకటవ తారీఖు సరైనది అనడానికి ఆధారం ఏదీ లేకపోయినప్పటికీ, అనేక మంది సీరత్ రచయితలు మహాప్రవక్త (స) సోమవారం రోజే జన్మించారని చెప్పడమే. ఇది అబూ ఖతాదా (ర)గారి ఉల్లేఖనం ద్వారా దృఢపడిన విషయం. ఆయన ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స)ను సోమవారం నాటి రోజా విషయమై అడగగా ఆయన (స) ఇలా ప్రవచించారు: "ఈ రోజు నేను పుట్టిన రోజు, నన్ను ప్రవక్తగా చేయబడిన రోజు లేదా నాపై దైవవాణి అవతరించిన రోజు." (సహీ ముస్లిం-1/368; ముస్నదె అహ్మద్-5/297, 999; బైహఖి 4/286, 300; హాతిమ్-2/2, 6)- ఆ సంవత్సరం రమజాన్ నెలలో వచ్చిన సోమవారాలు 7,14,21 మరియు 28 తేదీల్లో. ఇటు ప్రామాణికమైన ఉల్లేఖనాల ద్వారా ఈ విషయం దృఢపడిన, నిర్ణయించబడిన విషయం ఏమిటంటే, లైలతుల్ ఖద్ర్ రమజాన్ పది రోజుల బేసి తేదీలలో సంభవిస్తుందన్నది.

ఇప్పుడు మనం, ఖుర్ఆన్ ఆధారంగా చూస్తే దివ్యఖుర్ఆన్ లైలతుల్ ఖద్ర్ రాత్రే అవతరించిందని, ఒక వంక అబూ ఖతాదా (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స) సోమవారం రోజున జన్మించారని, మరోవంక కాలండర్ ప్రకారం లెక్కకడితే ఆ సంవత్సరం రమజాన్ నెలలో సోమవారం ఏయే తేదీల్లో సంభవించిందన్న విషయాలన్నింటిని తరచి చూస్తే మహాప్రవక్త (స)కు దైవదౌత్యం లేదా ప్రవక్త పదవి రమజాన్ నెల ఇరవై ఒకటవ తేదీ రాత్రి లభించిందన్న విషయం తేలిపోతుంది. అందుకని ఈ 21వ తేదీ దైవవాణి అవతరించిన ప్రథమ తేది.

రాదని' చెప్పాను. అతను తిరిగి నన్ను పట్టి అదిమి వదిలిపెట్టాడు. ఆ తరువాత 'చదువు' అని అన్నాడు. 'నాకు చదువు రాదు' అని తిరిగి అన్నాను. మూడోసారి మళ్ళీ పట్టి అదిమి اِقْرَاْ بِاسْمِ رَبِّكَ الَّذِیْ خَلَقَ "ఇఖర్ బిస్మిరబ్బికల్లజీ ఖలఖ్. ఖలఖల్ ఇన్సాన మిన్ అలఖ్, ఇఖ్రా వరబ్బుకల్ అక్రమ్[5] (ఓ ప్రవక్తా! పఠించు సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృజించాడు. పఠించు; నీ ప్రభువు పరమదయాళువు.) అన్నాడు.

ఈ వాక్యాలతో దైవప్రవక్త (స) వెనక్కుమరిలారు. ఆయన గుండె దడదడ లాడుతోంది. ఆయన హజ్రత్ ఖదీజా (ర) బిన్తె ఖౌలీద్ వద్దకు వచ్చారు. "నాపై దుప్పటి కప్పు, నాపై దుప్పటి కప్పు" అని చెప్పారు. ఆమె అలా దుప్పటి కప్పగా కొంత సేపటికి భయం దూరమైపోయింది.

ఆ తరువాత దైవప్రవక్త (స) హజ్రత్ ఖదీజా (ర)కు ఈ సంఘటన గురించి చెబుతూ, "నాకేమైంది? నాకు నా ప్రాణం పోతుందన్న భయం పట్టుకుంది" అని అన్నారు. దానికి హజ్రత్ ఖదీజా(ర), "లేదు! మిమ్మల్ని అల్లాహ్ అగౌరవంపాలు చేయడు. మీరు బంధువుల ఎడల సత్ప్రవర్తన కలిగి ఉంటారు. కష్టాల్లో చిక్కుకున్న వారిని ఆదుకుంటారు. నిరుపేదలకు సహాయం చేస్తారు. అతిథిని సత్కరిస్తారు. సత్యమార్గంలో ఎదురయ్యే కష్టాలను తొలగిస్తారు" అని ధైర్యం చెప్పారు.

తదుపరి హజ్రత్ ఖదీజా (ర) ఆయన్ను తన పినతండ్రి కుమారుడైన 'వర్ఖా బిన్ నౌఫిల్ బిన్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా' వద్దకు తీసుకువెళ్ళారు. వర్ఖా అజ్ఞాన కాలంలో క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వ్యక్తి. హిబ్రూ భాషలో రచనలు చేసేవాడు. కాబట్టి చేతనయినంత వరకు హిబ్రూ (ఇబ్రానీ) భాషలో బైబిల్ రాసేవాడు. అప్పుడు ఆయన వృద్ధుడు, చూపులేనివాడూను. ఆయనతో హజ్రత్ ఖదీజా (ర), "అన్నయ్యా, మీరు మీ సోదర కుమారుని మాటలేమిటో కొంత వినండనిఅనగా, "ఏమిటి నీవు చూసిందేమిటో చెప్పమని" అడిగాడు. దైవప్రవక్త (స) చూసిందంతా చెప్పగా, వర్ఖా, "మూసా (అ.స.)కు దైవవాణి అందించడానికి అల్లాహ్ పంపిన జిబ్రీలే ఆయన. నిన్ను, నీ జాతి బహిష్కరించినప్పుడు నేను గనక జీవించి ఉంటే ఎంత బాగుండును" అని అన్నాడు. "ఏమిటీ

5. ఈ వాక్యాలు అల్లమల్ ఇన్సాన మాలమ్ యాలమ్ వరకు అవతరించాయి.

నన్ను నా జాతి బహిష్కరిస్తుందా?" అని అడగగా, "ఔను, ఇలాంటి సందేశం తెచ్చిన ప్రతి వ్యక్తిని తప్పకుండా బహిష్కరించటం జరిగింది. నేనే గనక ఆ కాలంలో ఉంటే నీకు గొప్ప సహాయం చేయగలను" అని అన్నాడు. ఆ సంఘటన తరువాత వర్ఖా త్వరగానే కాలధర్మం చెందాడు. దైవవాణి అవతరణ కూడా ఆగిపోయింది.[6]

తిబ్రీ మరియు హష్షామ్ కథనాల ప్రకారం తెలిసిన విషయం ఏమిటంటే, దైవవాణి అవతరించగానే హిరా గుహ నుండి బయటకు వచ్చారు దైవప్రవక్త (స). ఆ తరువాత లోనికి వెళ్ళి తన మిగతా గడువును పూర్తి చేసుకుని మక్కాకు వచ్చారు. తిబ్రీ ఉల్లేఖనంలో ఆయన బయటకు ఎందుకు వచ్చారో అన్నది కూడా తెలుస్తుంది. ఆ ఉల్లేఖనం ఇలా ఉంది:

దైవప్రవక్త (స) దైవవాణి అవతరించిన తీరు గురించి ప్రవచిస్తూ, అల్లాహ్ సృష్టితాల్లో కెల్లా కవి మరియు ఉన్మాది తప్ప మరెవ్వరూ నా దృష్టిలో అసహ్యం కలిగించే ప్రాణుల్లేరు. (నేను ఆ అసహ్యం పెరిగిపోవడం వల్ల) వారి వైపు చూసే ధైర్యం కూడా చేసేవాణ్ణి కాదు. (ఇప్పుడు అవతరించిన) దైవవాణి విషయంలో, ఇది పనికిమాలినది అని తలచాను- అంటే ఖుద్దు తననే ఉన్మాది లేక కవిగా తలచుకున్నారు- నా విషయంలో ఖురైష్ ఎప్పుడూ ఇలా అనుకోరు. నేను కొండ శిఖరంపైకి వెళ్ళి అక్కడి నుండి క్రిందికి దూకేస్తాను. మరణించి శాశ్వతంగా సుఖం పొందుతాను అని అనుకున్నారు. ఈ తలంపు రాగానే కొండ మధ్యకు వెళ్ళగా ఆకాశం నుండి ఓ వాణి వినిపించింది. 'ముహమ్మద్ (స)! నీవు దైవప్రవక్తవు. నేను జిబ్రీల్‌ను'. నేను ఆ వాణి విని ఆకాశం వైపునకు తలెత్తి చూశాను. చూడగా జిబ్రీల్ ఓ మనిషిలా దిగ్మండలంలో నిలబడి, 'ఓ ముహమ్మద్ (స) నీవు దైవప్రవక్తవు, నేను జిబ్రీల్‌ని' అని చెప్పడం వినబడింది. జిబ్రీల్‌ను చూస్తూ అక్కడనే నిలబడిపోయాను. ఇలా నేను నా ఆత్మహత్యా ప్రయత్నాన్ని మరిచేపోయాను. ఇప్పుడు నేను ముందుకుగాని వెనక్కుగాని కదలడం లేదు. అయితే నా ముఖాన్ని మట్టుకు దిగ్మండలంలో అటూఇటూ త్రిప్పుతూనే ఉన్నాను. నేనెటు తలత్రిప్పినా జిబ్రీల్ (అ.స.) అలా నిలబడి నట్లుగానే కనబడేవారు. నేనలాగే ఎటూ కదలకుండా ఉండిపోయాను. ఈ

6. *సహీ బుఖారి-1/2,3. ఇదే విషయం పదాల కొంత తేడాతో బుఖారిలోని కితాబు స్సీరత్ మరియు తాబీరుర్ రూయాలోనూ ఉల్లేఖించబడ్డాయి.*

నడుమ ఖదీజా (ర) నా అచూకీ కోసం మనుషుల్ని పంపించారు. వారు మక్కా వరకు వెళ్ళి వెనక్కు తిరిగివచ్చేశారు. జిబ్రీల్ వెళ్ళిపోయిన తరువాత నా ఇంటికి తిరిగివచ్చి తొడనానుకొని కూర్చున్నాను. ఆమె నన్ను చూసి, "అబుల్ ఖాసిం! మీరెక్కడున్నారు? దైవసాక్షి! నేను మీ కోసం మనుషుల్ని పంపించాను. వారు మక్కా వరకు వెళ్ళి తిరిగి వచ్చేశారు!" అని అడిగారు. (సమాధానంగా నేను) చూసిందంతా చెప్పేశాను. ఆమె నాతో, "ఓ పినతండ్రి కుమారా! సంతోషించండి, నిలకడగా ఉండండి, ఏ దైవం చేతిలోనైతే నా ప్రాణం ఉందో ఆ దైవం సాక్షి! మీరు ఈ జాతికి ప్రవక్త కాగలరు" అని ధైర్యం చెప్పారు. ఆ తరువాత ఆమె వర్ఖా బిన్ నౌఫిల్ వద్దకు వెళ్ళి విషయాన్ని విశదీకరించారు. ఆయన, "ఖుద్దూస్, ఖుద్దూస్" (అల్లాహ్ మహాపవిత్రుడు) అంటూ, "ఎవరి గుప్పిట్లోనైతే వర్ఖా ప్రాణాలున్నాయో, ఆయన సాక్షి! ఈయన వద్దకు వచ్చినవారూ, మూసా (అ.స.) వద్దకు వచ్చినవారూ ఆ జిబ్రీలే. ఈయన ఈ సమాజానికి ప్రవక్త. ఈయనతో చెప్పు నిలకడగా ఉండమని" అని అన్నారు. ఆ తరువాత ఆమె తిరిగి వచ్చి ప్రవక్త (స)కు వర్ఖా చెప్పిన విషయం చెప్పారు. ఆ తరువాత దైవప్రవక్త (స) హిరా కొండలో తన విడిదిని పూర్తి చేసు కొని (మక్కాకు) తిరిగివచ్చిన తరువాత వర్ఖాను కలిశారు. ప్రవక్త (స) నోట వివరాలు తెలుసుకున్న వర్ఖా, "ఏ దైవం అధీనంలోనైతే నా ప్రాణం ఉందో, ఆ దైవంసాక్షి! మీరు ఈ ఉమ్మత్‌కు (సమాజానికి) దైవ ప్రవక్త. మీ దగ్గరకు వచ్చిన వ్యక్తి మూసా (అ.స.) వద్దకు వచ్చిన జిబ్రీలే (అ.స.) అని చెప్పారు.[7]

దైవవాణి నిలిచిపోవడం

దైవవాణి అవతరణ ఎన్ని రోజుల వరకు ఆగిపోయింది అనే విషయంలో, ఇబ్నె సఅద్, ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనాన్ని ఉటంకించారు. దాని ప్రకారం, ఈ నిలిపివేత కొన్ని రోజుల మట్టుకే అని తెలుస్తోంది. అన్ని కోణాలను దృష్టిలో పెట్టుకొని పరిశీలించినప్పుడు ఈ విషయం సరయినది అని

7. *తిబ్రీ-2/207; ఇబ్నె హష్షామ్-1/237, 238. చివరి కొంత భాగాన్ని వివరించడం జరిగింది. ఈ ఉల్లేఖనం సరియైనదనడంలో మాకు కొంత సందేహం ఉంది. సహీ బుఖారి ఉల్లేఖనం సందర్భం గురించి, అనేక ఉల్లేఖనాలను సరిచూసిన పిదప మేము ఓ నిర్ణయానికి వచ్చాం. దాని ప్రకారం, మక్కా వైపునకు దైవప్రవక్త, దైవవాణి అవతరణ రోజే తిరిగివచ్చి వర్ఖాను కలిశారు, మిగిలిపోయిన కాలాన్ని హిరాకు వెళ్ళి పూర్తి చేశారన్నది.*

నమ్మకంగా చెప్పవచ్చు. దైవవాణి మూడు సంవత్సరాల వరకు ఆగిపోయింది అనేది పూర్తిగా నిరాధారమైన విషయం. అయితే ఇక్కడ ఆధారాలను చూపే సమయం లేదు.[8]

వహీ (దైవవాణి) నిలిచిపోయిన ఈ తరుణంలో దైవప్రవక్త (స) ఎంతో మానసిక వ్యధకు గురయ్యారు; అయోమయ స్థితికి లోనయ్యారు. 'సహీ బుఖారి కితాబుత్తాబీర్' ఉల్లేఖనం ఇలా ఉంది:

"వహీ ఆగిపోయినందువల్ల దైవప్రవక్తకు, కొండ శిఖరాలపై నుండి దూకేసేటంత వ్యధ కలిగింది. కాని కొండ శిఖరంపైకెక్కి క్రిందికి దుమికే లోపల జిబ్రీల్ (అ.స.) ప్రత్యక్షమై, 'ఓ ముహమ్మద్ (స), మీరు అల్లాహ్ ప్రవక్త' అని చెప్పేవారు. వ్యధ కొంత తగ్గి మనస్సుకు ఊరట కలిగేది. వెనక్కు మరలి ఇంటికి వచ్చేసేవారు. అలా తిరిగి దైవవాణి అవతరణలో జాప్యం జరిగిన కొలది తిరిగి కొండ శిఖరాన్నెక్కి క్రిందికి దూకే ప్రయత్నం చేసేవారు. జిబ్రీల్ (అ.స.) తిరిగి ప్రత్యక్షమై ఆ మాటలనే మళ్ళీ పలికేవారు. [9]

మలిసారి దివ్యావిష్కృతి (వహీ) అవతరణ

హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మాలై)గారి ప్రకారం, ఈ పరిస్థితికి (అంటే దైవ వాణి అవతరణ నిలిచిపోవడం) కారణం, ఆయనలో ఏర్పడిన ఈ భయ విహ్వలత దూరం అయిపోవాలనే. రెండవసారి దైవవాణి కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడాలన్నదే.[10]

ఈ అయోమయ పరిస్థితి దూరమై, యదార్థం పూర్తిగా బయటపడి ఆయనకు తాను దైవప్రవక్త అని పూర్తిగా నమ్మకం ఏర్పడి, తన వద్దకు వచ్చినవారు దైవవాణిని తెచ్చే దైవదూత జిబ్రీల్(అ.స.) అని తెలియగానే దానికి ఆయన పూర్తిగా సిద్ధమైపోయి ఆయన కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. అప్పుడుగాని జిబ్రీల్ (అ.స.) తిరిగి దైవవాణితో ఆయన వద్దకు రాలేదు. సహీ బుఖారి గ్రంథంలో హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ ఉల్లేఖనం ఇలా ఉంది: దైవప్రవక్త (స) నోట వహీ ఆగిపోయే సంఘటన గురించి అడగగా ఆయన(స), "నేను వెడుతూ ఉండగా అకస్మాత్తుగా ఆకాశం నుండి ఓ పిలుపు వినవచ్చింది. నేను ఆకాశం వైపు తలెత్తి చూడగా, హిరా గుహలో ప్రత్యక్షమైన

8. కొంత వివరణ అదఃసూచిక 11లో రాబోతోంది.
9. సహీ బుఖారి, కితాబుత్తాదీర్-2/1034.
10. ఫతహుల్‌బారి-1/27

దైవదూత ఆకాశం మరియు భూమికి నడుమ ఓ కుర్చీపై కూర్చుని ఉండడం కనబడింది. నేను భయకంపితుడనై భూమి వైపునకు వంగిపోయాను. ఇంటికి తిరిగివచ్చి నన్ను దుప్పటితో కప్పండి, దుప్పటితో కప్పండని చెప్పాను. అలా నాపై దుప్పటి వేసి కప్పివేయడం జరిగింది. ఆ తరువాత అల్లాహ్, 'యా అయ్యుహల్ ముద్దస్సిర్' మొదలు 'వర్రుజ్జ ఫహ్జుర్' వరకు దైవవాణిని అవతరింపజేశాడు. ఆ తరువాత దైవవాణి ఎలాంటి అడ్డంకుల్లేకుండా నాపై అవతరించసాగింది.[11]

కొన్ని ఉల్లేఖనాల ప్రారంభంలో ఈ పదాలు అదనంగా కానవస్తాయి. "నేను హిరాలో ఏతికాఫ్ చేశాను. నా ఏతికాఫ్ పూర్తి అయిన తరువాత కొండ దిగి వచ్చాను. కొండలోయగుండా వెళ్ళేటప్పుడు నన్ను ఎవరో పిలిచారు. నేను కుడి ఎడమలు, ముందు వెనుక చూస్తే నాకెవ్వరూ కనిపించలేదు. పైకి చూద్దును కదా, హిరా కొండ గుహలో ప్రత్యక్షమైన.........చివరి వరకు.

సీరత్ చరిత్రకారులు చెప్పిన విషయాలన్నింటిని జోడిస్తే, దైవప్రవక్త (స) రమజాన్ నెలలో మూడేళ్ళ వరకు ఏతికాఫ్‌లో ఉన్నారని, దైవవాణి అవతరణ జరిగిన రమజాన్ నెల మూడవది అంటే చివరి రమజాన్ నెలని తెలుస్తుంది. ఆయన (స) గారి అలవాటు ప్రకారం రమజాన్ నెల పూర్తిగా ఏతికాఫ్‌లో ఉండి షవ్వాల్ మాసం మొదటి తేదీనాడు ఉదయాన్నే మక్కా చేరుకునేవారు. పై ఉల్లేఖనంతో, యా అయ్యుహల్ ముద్దస్సిర్ వాక్యాన్ని జోడిస్తే, ఇది మొదటి వహీ (దైవవాణి) అవతరించిన పదవ రోజున అంటే మొదటి షవ్వాల్ నాడు అవతరించింది. వహీని ఆపివేసిన గడువు కేవలం పది రోజులు మాత్రమే. (వల్లాహుఆలమ్)

వహీ (దివ్యావిష్కృతి) రకాలు

ఇప్పుడు మేము ఈ చర్చనీయాంశాన్ని కొద్దిగా ప్రక్కనబెట్టి, దైవదౌత్యం, దైవప్రవక్త (స) గారి జీవిత చరిత్రకు సంబంధించిన వివరాలను ప్రారంభించే ముందు, 'వహీ' (దైవవాణి లేక దివ్యావిష్కృతి)కి సంబంధించిన రకాల గురించి కొంత వివరణ ఇవ్వాలనుకుంటున్నాం. దీనికి కారణం లేకపోలేదు. ఇది దైవ

11. సహీ బుఖారి, కితాబుత్తఫ్సీర్-అధ్యాయం: వర్రుజ్జ ఫహ్జుర్-2/733.

దౌత్యపు మూలాధారం మరియు దైవసందేశ ప్రచారానికి ప్రాణం లాంటిది కనుక. అల్లామా ఇబ్నె ఖైమ్ (రహ్మలై), వహీకి సంబంధించిన రకాలు కొన్నింటిని ఈ క్రింది విధంగా చూపడం జరిగింది.

1. **యదార్థ స్వప్నం:** ఈ యదార్థ స్వప్నం రూపంలోనే దైవప్రవక్త (స) వద్దకు మొట్టమొదట వహీ (దివ్యావిష్కృతి) రానారంభించింది.

2. దైవదూత కనబడకుండానే, ప్రవక్త (స)గారి మనస్సులో విషయాన్ని నాటడం. ఉదాహరణకు దైవప్రవక్త (స) గారి ప్రవచనం ఇలా ఉంది: "ఏ ప్రాణి అయినా, తన వంతు గ్రాసము పొందకుండా చనిపోడని, అల్లాహ్‌కు భయపడుతూ దాన్ని పొందడానికి సన్మార్గాన్నే అవలంబిం చాలని, ఆ రోజు వారి గ్రాసం లభ్యం కావడంలో కొంత ఆలస్యమైతే దాన్ని అపమార్గాల ద్వారా పొందకూడదని, అల్లాహ్ వద్ద ఉన్నది ఆయన ఆదేశాలను శిరసావహించకుండా పొందలేమన్న విషయాన్ని రూహుల్ ఖుదుస్ (జిబ్రీల్-అ.స.) నా మనస్సులో నాటుకునేటట్లు చేశారు."

3. దైవదూత ప్రవక్తశ్రీ (స)సమక్షాన మానవ రూపంలోనే వచ్చి ఆయన్ను సంబోధించేవాడు. అతడు చెప్పినదంతా గుర్తుంచుకునేవారు. దైవదూత మానవ రూపంలో వచ్చినప్పుడు సహాబా (ప్రవక్త అనుచరగణం) కూడా ఆయన్ను చూడడం అప్పుడప్పుడు తటస్థించేది.

4. ఆయన (స) వద్దకు వచ్చే వహీ గంట గణగణ మ్రోగినట్లు వినబడేది. ఇది అత్యంత కఠినమైన రూపం. ఇలాంటి పరిస్థితిలో దైవదూత ఆయన్ను కలిసేవాడు. ఇలా అవతరించిన వహీకి తీవ్రమైన చలికాలం లోను దైవప్రవక్త (స) నొసటి నుండి చెమటలు కారిపోయేవి. ఆయన ఒంటె ఎక్కి ఉంటే, అది భూమిపై కూర్చుండిపోయేది. ఓమారు ఇలానే వహీ అవతరించినప్పుడు దైవప్రవక్త (స) గారి తొడ హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (ర)గారి తొడపై ఉంది. ఆయన తొడపై పెద్ద భారం పడి అణిగి పోయినట్లుగా బాధ అనుభవించారు.

5. దైవప్రవక్త (స) దైవదూత జిబ్రీల్(అ.స.)ను ఆయన అసలు రూపంలో కూడా చూడడం జరిగింది. ఈ రూపంలోనే అతను అల్లాహ్ ఆదేశాన్ని (వహీని) ఆయన (స)పై అవతరింపజేసేవాడు. ఈ సంఘటన దైవ ప్రవక్త (స)కు రెండుసార్లు ఎదురైంది. ఈ విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలోని నజ్మ్ సూరాలో ప్రస్తావించాడు.

6. మేరాజ్ రేయి నమాజు విధి అయిన సందర్భంలో ఏ వహీనయితే అల్లాహ్ ఆయన (స)పై అవతరింపజేశాడో, అప్పుడు ఆయన ఆకాశాల పైనే ఉన్నారు.

7. దైవదూత లేకుండానే అల్లాహ్ దైవప్రవక్త (స)తో నేరుగా మూసా (అ.స.)తో ముచ్చటించినట్లుగా ముచ్చటించడం. వహీకి సంబంధిం చిన ఈ రకం గురించి మూసా (అ.స.) విషయమై దివ్యఖుర్ఆన్‌లో ఆధారం కూడా ఉంది. అయితే మహాప్రవక్త ముహమ్మద్ (స) గురించి దివ్యగ్రంథం ఆధారం కాకుండా కూడా మేరాజ్ హదీసులో ఉంది.

కొందరు వహీ రకాల్లో ఎనిమిదవ రకం గురించి కూడా చెబుతారు. అంటే అల్లాహ్ ఎదురెదురుగా ఎలాంటి అడ్డంకి లేకుండా దైవప్రవక్త (స)తో మాట్లాడటం. అయితే ఈ రకం వహీ గురించి మొదటి నుంచి అభిప్రాయ భేదం ఉంటూ వచ్చింది. [12]

---

12. జాదుల్ ముఆద్-1/81. మొదటి మరియు ఎనిమిదవ రకం వహీ విషయంలో అసలు వాక్యాలకు కొంత వివరణ ఇవ్వడం జరిగింది.

సందేశ ప్రచారాదేశం - దాని అంతరార్థం

'ముద్దస్సిర్' అధ్యాయపు మొదటి వాక్యాల్లో- 'యా అయ్యుహల్ ముద్దస్సిర్ నుండి వ లిరబ్బిక ఫస్బిర్' వరకు- దైవప్రవక్త ముహమ్మద్ (స)కు అనేక ఆదేశాలు ఇవ్వడం జరిగింది. చూడడానికి అవి ఎంతో సంక్షిప్తంగా, సాదాగా కనబడినప్పటికీ, యదార్థంగా ఎంతో సుదూర లక్ష్యాల కోసం ఇవ్వబడ్డ ఆదేశాలు. జీవన శైలిపై వాటి ప్రభావాలు ఎంతైనా పడగలవు.

1. 'ఇన్‌జార్' (హెచ్చరించడం) యొక్క ఉచ్ఛస్థితి ఏమిటంటే, ఈ విశ్వంలో అల్లాహ్ అభీష్టానికి విరుద్ధంగా ఏ కార్యకలాపాలైతే కొనసాగు తున్నాయో వాటి దుష్పరిణామాలను గురించి ప్రజల్ని హెచ్చరించడం. ఆ హెచ్చరిక కూడా దైవశిక్ష భయం వల్ల ఎదుటివాని మనోమస్తిష్కాల్లో ఓ తుఫాను చెలరేగేటట్లు ఉండాలి.

2. దేవుని ఔన్నత్యం, ఘనతలను చాటడం. దీని తుది ధ్యేయం, భూ మండలంపై మరెవ్వరి ఔన్నత్యాన్ని మిగిలి ఉంచడానికి వీల్లేకుండా చేయడం. సరికదా అలా తమ ఔన్నత్యాలను, ఘనకీర్తిని చాటుకునే వారి నడ్డిని విరిచి వారి ఘనతను భూస్థాపితం చేయడం. చివరికి ఒక్క అల్లాహ్ ఔన్నత్యమే మిగిలి ఉండేటట్లు పాటుబడడం.

3. వస్త్రాల పరిశుభ్రతను, పరిశుద్ధతను పాటించడం. అంటే బాహ్య మరియు అంతర్గత హృదయ పరిశుద్ధత, నైర్మల్యం అన్నమాట. అన్ని రకాల కల్మషాలు, కాపట్యాల నుండి హృదయాన్ని పరిశుద్ధపరచుకునే అత్యున్నత స్థాయికి చేరుకోవడం. ఇది అల్లాహ్ కారుణ్య ఛాయలోనే మరియు పరిరక్షణలోనే సాధ్యం అయ్యే పని. ఇలా తన శరీరాన్ని, హృదయాన్ని అశుద్ధత నుండి కాపాడుకుంటూ మానవ సమాజానికి ఓ

మార్గదర్శకునిగా అలరారడం. అప్పుడుగాని పరిశుద్ధ ఆత్మలు ఆయన వైపునకు మొగ్గు చూపలేవు. ఆయన (స)గారి ఔన్నత్యం, గాంభీర్యతను చూసి చెడు స్వభావులంతా భయంతో ప్రకంపించిపోవాలి. ఇలా ప్రపంచం అంతా కేవలం 'అనుకూలం' లేదా 'ప్రతికూలం' అనే రెండే రెండు విషయాల్లో ఆయన (స) గారిని చుట్టుముట్టవలసి ఉంటుంది.

4. మేలు (ఇహ్సాన్) చేసి దాన్ని మరచిపోవడం. అంటే తన కృషికి, ఘన కార్యాలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా ఉండడం. సరికదా, ఒక దాని తరువాత మరో సదాచరణ కోసం పాటుపడుతూ ఉండాలి. సతతం కష్టపడుతూ పెద్ద త్యాగాలు చేసినప్పటికీ, ఇది తాను చేసిన ఘనకార్యా లుగా ఉబ్బిపోకుండా, ఇదంతా దైవకటాక్షం వల్ల జరిగినదే తప్ప మరేదీ కాదు అని తలచడం. అంటే, దైవస్మరణ, ఆయన ఎదుట జవాబు చెప్పుకోవలసి ఉంది అనే భావన ఈ కృషిని, త్యాగాలను గుర్తురాకుండా చేసేటట్లు నడచుకోవడం అన్నమాట.

5. చివరి ఆయత్ (వాక్యం)లో, అల్లాహ్ తరపున సందేశ ప్రచార ఉద్యమం చేపట్టిన వెంటనే శత్రువుల నుండి వ్యతిరేకత, ఎగతాళి, నవ్వులాట, అపహాస్యం రూపంలో హింసించడం మొదలు, ఆయన (స)ను, ఆయన అనుచరగణాన్ని హతమార్చే మరియు ఆయన చుట్టూ చేరిన విశ్వాసులందరిని తుదముట్టించేటంతటి దుస్సాహసాలు కూడా జరుగు తాయి అని హెచ్చరించడం జరిగింది. అవన్నీ ముమ్ముందు మీకు (దైవప్రవక్త(స) కు) ఎదురవుతాయి అని చెప్పడం జరిగింది. ఇలాంటి సందర్భాల్లో దైవప్రవక్త (స) ఎంతో ధైర్యంగా, దృఢంగా వాటన్నింటిని ఎదుర్కోడానికి సహనం వహించవలసి ఉంటుందని ఉద్బోధించడం జరిగింది. ఈ సహనం, సంయమనాలకు ఫలితంగా ఆయన తన కోరికలు తీర్చుకోవడం కాకుండా కేవలం అల్లాహ్ సంతుష్టికోసం, ఆయన ధర్మోన్నతి కోసమే ఇదంతా చెయ్యాలని హెచ్చరించడం జరిగింది (వలిరబ్బిక ఫస్బిర్- నీ దైవం కోసం సహనం వహించు).

అల్లాహు అక్బర్! ఈ ఆదేశాలు చూడడానికి ఎంత సాదాసీదాగా ఉన్నాయి. ఈ వాక్యాల కూర్పు ఎంత శాంతంగా, మనసును అలరించేదిగా

ఉంది! అయితే ఆచరణ మరియు ధ్యేయసాధన రీత్యా ఈ ఆదేశాలు ఎంత భారమైనవి, మహోన్నతమైనవి, ఎంత కఠినతరమైనవో ఆలోచించండి! వీటి ఆచరణ ఫలితంగా ఎలాంటి తుఫాను చెలరేగుతుంది! అది ప్రపంచ మూల మూలన ఎంతటి సంచలనం సృష్టిస్తుంది!!

దివ్య ఖుర్ఆన్‌లోని పై ఆయత్‌లలో (వాక్యాలలో) సందేశ ప్రచారానికి సంబంధించిన సరంజామ అంతా ఉంది. మానవాళి ఆచరించే ఆచరణలు కొన్నింటి పరిణామాలు బహుచెడ్డవి. ప్రపంచంలో మనిషి చేసిన సత్కార్యాలకుగాని, దుష్కార్యాలకుగాని పూర్తి ప్రతిఫలం లభించజాలదు. అందుకని ఆయత్‌లో 'ఇన్జార్' అనే పదాన్ని తరచి చూడగా, ప్రపంచంలోని కాలపరిమితే కాకుండా, ప్రతి కర్మకు తగిన ప్రతిఫలం లభించే ఓ దినం ఎంతైనా అవసరం. ఈ దినమే ప్రళయ దినం. పూర్తి ప్రతిఫలాన్ని పొందే దినం. ఈ రోజు కర్మలకు ప్రతిఫలం లభించాలంటే, మనం ఈ ప్రపంచంలో గడిపే జీవితమే కాకుండా మరో జీవితం ఎంతైనా అవసరమన్న సంగతి ఇట్టే గ్రహించగలం.

తక్కిన వాక్యాల్లో దైవదాసులు స్వచ్ఛమైన ఏకేశ్వరోపాసనను అవలంబించాలని, తమ వ్యవహారాలన్నీ అల్లాహ్‌కే అప్పగించాలని, దైవ అభీష్టాన్ని పొందాలంటే మనిషి తన కోరికల్నీ, ప్రజల అభీష్టాలనూ విడనాడాలని ఆదేశించడం జరిగింది. ఇలా సందేశ ప్రచారమంతా ఈ క్రింది విషయాలపై ఆధారపడి ఉంది.

1. ఏకేశ్వరోపాసన.
2. ప్రళయ దినాన్ని విశ్వసించడం.
3. మనస్సును పరిశుద్ధపరచడం. అంటే దుష్పరిణామాల వరకు గొనిపోయే చెడు, అశ్లీల కార్యాలను విడనాడి, సత్కార్యాలు, మేలు, శాంతి మార్గాన్ని అవలంబించే ప్రయత్నం చేయడం.
4. మనిషి తన వ్యవహారాలన్నింటినీ అల్లాహ్‌కే అప్పజెప్పడం.
5. దైవప్రవక్త (స)గారి దైవదౌత్యాన్ని విశ్వసించి, ఆయన చూపిన మహోన్నత నాయకత్వంపై మార్గంపై ఆయన అడుగుజాడల్లోనే నడవడం.

ఇదే కాదు , ఈ వాక్యాలు దైవం తరపున అవతరించినవారికి, వీటిలో

దైవప్రవక్త(స)ను ఈ మహోన్నత కార్యం కోసం లేచినిలబడాలని, నిదుర మత్తును వదలి 'జిహాద్' (సతతం దైవమార్గంలో కృషి చేయడం) కోసం పురిగొల్పడం జరిగింది. "యా అయ్యుహల్ ముద్దస్సిరు ఖుమ్ ఫ అన్జిర్" (వస్త్రం కప్పుకొని పడుకున్న ఓ మనిషీ! లే; లేచి హెచ్చరించు) అని సంబోధించడం జరిగింది. అంటే, తన కోసమే బ్రతుకదలచిన వానికి కష్టాలతో పనిలేదు, హాయిగా బ్రతుకవచ్చు. అయితే ఓ ప్రవక్తా! నీవు ఏ పెద్ద భారాన్నయితే మోస్తున్నావో దానికీ, నిదురకు ఎలాంటి సంబంధం లేదు. నీకు సుఖంతో పనేమిటి. వెచ్చటి పడక అవసరం ఏమిటి? ప్రశాంత జీవనం, హాయినిగొలిపే వస్తుసామగ్రితో నిమిత్తమేమిటి?? లే; లేచి నీకై ఎదురుచూస్తున్న ఆ మహోన్నత కార్యంలో నిమగ్నమైపో. నీ కోసమే సమకూర్చబడిన ఆ భారాన్ని ఎత్తుకోవడానికి ప్రయత్నించు. లే, లేచి నిలబడు, ఆ అలుపెరుగని పరిశ్రమ కోసం. ఇది నిదురపోవడానికి, సేద తీర్చుకోవడానికి సమయం కాదు. ఆ కార్యం కోసం సంసిద్ధంగా ఉండు అంటూ హెచ్చరించడం జరుగుతోంది.

ఇది ఎంత భయంగొలిపే వాక్యం! ఎంత మహోన్నతమైన వచనం!! దైవప్రవక్త (స)ను శాంతమైన గృహవాతావరణం నుండి, వెచ్చటి ఒడి నుండి, సుతిమెత్తని పరుపు నుండి బయటకు లాగి పెనుతుఫాను, ఉప్పెనలతో అతలాకుతలమైవున్న సముద్ర లోతుల్లోనికి విసిరేసినట్లయింది.

తరువాత దైవప్రవక్త (స) లేచి నిలబడ్డారు. అలా ఇరవై సంవత్సరాల వరకు అవిశ్రాంతంగా దైవసందేశ ప్రచారం కోసం లేచి నిలబడే ఉన్నారు. సర్వసౌఖ్యాలను త్యజించారు. తన కోసంగాని, తన పరివారం కోసంగాని జీవించే ధ్యాసే లేకుండా పోయిందాయనకు. ఆయన పని కేవలం అల్లాహ్ మార్గం వైపునకు ప్రజల్ని ఆహ్వానించడం. నడ్డివిరిచే ఈ మహోన్నత భారాన్ని భుజస్కంధాలపై ఎలాంటి ఒత్తిడికి గురికాకుండానే ఎత్తుకున్నారు. ఆ భారం ఏమిటి? భూమండలంపై అమానతు (Trust) భారం. సర్వమానవ జాతి భారం. సంపూర్ణమైన విశ్వాస భారం. వివిధ రంగాల్లో జిహాద్, రక్షణల భారమది. ఇరవై ఏళ్ళ కంటే అధికంగానే ఈ సర్వతోముఖ పోరాటంలో జీవితం గడిచిపోయింది. ఈ జీవిత కాలమంతా అంటే, అ ఆకాశవాణి విన్నప్పటి నుంచి,

ఈ బాధ్యతా భారం నెత్తినపడ్డప్పటి నుంచి, సర్వసన్నద్ధంగా, జాగరూకతగా మెలిగారాయన. అల్లాహ్, ఆయన (స)కు మన తరపున, సర్వమానవాళి తరపున అత్యుత్తమమైన ప్రతిఫలం ఒసగుగాక.[13] (ఆమీన్)

రాబోయే పుటల్లో మహాప్రవక్త ముహమ్మద్ (స) గారి ఈ సుదీర్ఘమైన విశ్రాంతి రహిత జిహాద్ (పరిశ్రమ)కు సంబంధించిన సంక్షిప్త రూప చిత్రీకరణ గురించే చదువగలరు.

13. ఫీజిలాలుల్ ఖుర్‌ఆన్, ముజ్జమ్మిల్ మరియు ముద్దస్సిర్ అధ్యాయం-29/ 168-171, 182.

ప్రథమ దశ

దైవసందేశ ప్రచార యత్నం

రహస్య సందేశ ప్రచారానికి సంబంధించిన మూడు సంవత్సరాలు

మక్కా, అరబ్బుల ధార్మిక కేంద్రం అన్న విషయం మనకు తెలిసిందే. ఇది, కాబా సంరక్షకులకుతోడు, ఎంతో గౌరవభావంతో చూడబడే విగ్రహాల పరిరక్షకులు కూడా నివసించే నగరం. అందుకని సుదూర ప్రాంతాలకంటే మక్కాలో సంస్కరణలు చేపట్టడం కొంత కష్టంతో కూడుకున్న పని. కష్టాలను, కడగండ్లను ఎదుర్కొనే దృఢచిత్తులే ఈ కార్యాన్ని చేపట్టగలరు. ఈ పరిస్థితి దృష్ట్యా, మక్కాలో హఠాత్తుగా సంచలనం చెలరేగకుండా ఉండాలంటే దైవ సందేశ ప్రచార కార్యక్రమాన్ని రహస్యంగా ప్రారంభించాలన్నది దైవాభీష్టం.

ప్రప్రథమ ఇస్లామ్ ధర్మానుయాయులు

మహాప్రవక్త ముహమ్మద్ (స) ముందస్తుగా, తనతో లోతైన సంబంధ బాంధవ్యాలుగల దగ్గరి వ్యక్తులకు ఇస్లామ్ ధర్మాన్ని బోధించాలి అనేది ఎంతో సహజమైన విషయం. అంటే, తన కుటుంబ సభ్యులకు, మిత్రులకు ఇస్లామ్ ధర్మాన్ని బోధించడమన్నమాట. కనుక ఆయన (స) మొట్టమొదటగా వారినే ఎంచుకొని ఇస్లామ్ ధర్మం వైపునకు పిలవడం జరిగింది. ఇలా ప్రారంభంలో ప్రవక్తశ్రీ(స), సత్కార్యాల విషయంలో తనకు తోడునీడగా ఉంటూ, సత్యం, సదాచరణల వైపునకు మొగ్గుచూపుతూ, తన సత్యసంధతను శంకించకుండా సతతం తనకు తోడునీడగా ఉండే వారినే ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించారు. ఇదేకాదు, ఎవరినైతే ఇస్లాం ధర్మం వైపునకు ఆహ్వానించారో వారిలోనూ, మహాప్రవక్త (స) సత్యసంధత, ఔన్నత్యం, హృదయ నైర్మల్యం విషయంలో ఏమాత్రం అనుమానంలేని కొందరు వెంటనే ఆయన ఆహ్వానాన్ని అంగీకరించి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడం జరిగింది. వీరు ఇస్లామీయ చరిత్రలో 'సాబి

కూనల్ అవ్వలీన్' (ప్రప్రథమంగా అడుగు ముందుకు వేసిన ఘనులు)గా కీర్తించబడుతున్నారు.

వీరిలో ప్రముఖంగా ప్రవక్తశ్రీ(స) భార్య, ఉమ్ముల్ మోమినీన్ (ముస్లిముల మాతృమూర్తి) హజ్రత్ ఖదీజా (ర) బిన్తె ఖౌలీద్, ఆమె (ర)చే స్వాతంత్ర్యం పొందిన బానిస 'హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (ర) బిన్ షర్జీల్ కల్బీ'[1], ప్రవక్తశ్రీ(స) పినతండ్రి కుమారుడు హజ్రత్ అలి (ర) బిన్ అబూ తాలిబ్. ఈయన ప్రవక్త శ్రీ(స) సంరక్షణ, పోషణల్లో ఉండిన బాలుడు, ఆయన (స)గారి మిత్రుడు హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (ర)లు. వీరందరూ మొదటి రోజునే ఇస్లామ్‌ను స్వీకరించి ముస్లిములైనవారు.[2] ఆ తరువాత హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్ (ర) ఇస్లామ్ ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన స్వభావం హృదయా లను ఆకట్టుకునే స్వభావం. దానికితోడు ఆయన సున్నిత మనస్కుడు, సద్గుణ సంపన్నుడు, నైతికతకు మారుపేరు, విశాల హృదయుడూను.

ఆయన గారి ఈ సుగుణాలు, సాత్వికత, దూరదృష్టి, వ్యాపారం, సత్సాంగత్యాన్ని చూసి ప్రజలు ఆయన వద్దకు వచ్చిపోవడం కద్దు. కాబట్టి ఆయన తన వద్దకు వచ్చిపోయే వారిలోనూ, నమ్మకంగల మిత్రులకు ఇస్లామ్ ధర్మాన్ని బోధించనారంభించారు. ఆయన కృషి ఫలితంగా, హజ్రత్ ఉస్మాన్ (ర), హజ్రత్ జుబైర్ (ర), హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర), హజ్రత్ సఅద్ బిన్ అబీ వికాస్ (ర), హజ్రత్ తల్హా బిన్ ఉబైదుల్లా (ర)లు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. ఈ మహానుభావులు ఇస్లామ్‌కు ముందట నిలిచి పరిరక్షించే దళం (Vanguard) గా పని చేసినవారు.

---

1. ఈయన ఓ యుద్ధంలో బందీ అయి బానిసగా అమ్ముడుపోయినవారు. తరువాత హజ్రత్ ఖుదైజా (ర) ఆయనకు యజమానురాలయ్యారు. ఆమె ఆయన్ను ప్రవక్తశ్రీ(స)కి సమర్పించారు. ఆ తరువాత జైద్ (ర) గారి తండ్రి, పినతండ్రి ఆయన్ను ఇంటికి తీసుకువెళ్ళడానికి ప్రయత్నిస్తే, జైద్ (ర) తండ్రిని, పినతండ్రిని వదిలేసి దైవప్రవక్త (స) వద్దనే ఉండడానికి ఇష్టపడ్డారు. ఆ తరువాత అరబ్బు సంప్రదాయం ప్రకారం ఆయన్ను దత్తత తీసుకోవడం జరిగింది. అప్పటి నుండి జైద్‌ను 'జైద్ బిన్ ముహమ్మద్ (స)' అంటే ముహమ్మద్ (స)గారి కుమారునిగా పిలవడం జరిగింది. చివరికి ఇస్లామ్ ధర్మం ఈ సంప్రదాయాన్ని పరిసమాప్తం చేసివేసింది.

2. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/50.

ప్రారంభంలో ఇస్లామ్ స్వీకరించినవారిలో హజ్రత్ బిలాల్ హబషీ (ర) కూడా ఉన్నారు. తరువాత హజ్రత్ అబూ ఉబైదా (ర) ఆమిర్ బిన్ జర్రాహ్, అబూ సల్మా బిన్ అబ్దుల్ అసద్, అర్‌ఖమ్ బిన్ అబిల్ అర్‌ఖమ్, ఉస్మాన్ బిన్ మజ్‌ఊన్ మరియు ఆయన ఇద్దరు సోదరులు ఖుదామా మరియు అబ్దుల్లాహ్‌లు, ఉబైదా బిన్ హారిస్ బిన్ ముత్తలిబ్ బిన్ అబ్దె మునాఫ్, సయీద్ బిన్ జైద్, ఆయన భార్య అంటే హజ్రత్ ఉమర్ (ర)గారి సోదరి ఫాతిమా బిన్తె ఖత్తాబ్ మరియు ఖబ్బాబ్ బిన్ అరత్, అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర)లు ఇంకా ఎందరో వ్యక్తులు ముస్లిములయ్యారు. వీరంతా ఖురైష్ తెగల శాఖలన్నింటికీ చెందినవారే. ఇబ్నె హష్షామ్, వారి సంఖ్య నలభై కంటే అధికంగానే ఉందని రాశాడు (చూడండి, 1/245-262). కాని వారిలో కొందరిని ప్రప్రథ మంగా ఇస్లామ్ స్వీకరించిన వారిలో చేర్చడం సందేహాస్పదమైన విషయం.

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, ఆ తరువాత స్త్రీ పురుషులు గుంపులు గుంపులుగా ఇస్లామ్‌లో చేరిపోతున్న విషయం ఎట్టకేలకు మక్కాలో చర్చనీయాంశమైంది.[3]

వీరంతా రహస్యంగా ముస్లిములుగా మారినవారు. దైవప్రవక్త (స) కూడా వారికి ధార్మిక బోధన గరపుటకు, వారి మార్గదర్శకం కోసం రహస్యంగానే వారిని ఓ చోట చేర్చేవారు. ఎందుకంటే సందేశ ప్రచార కార్యం అప్పటి వరకు వ్యక్తిగతంగా తెరమరుగునే నడుస్తోంది గనుక. ఇటు ఖుర్‌ఆన్ ముద్దస్సిర్ సూరా (అధ్యాయం) ప్రారంభ ఆయత్‌లు అవతరించడంతోనే దైవవాణి క్రమబద్ధంగా ఊపందుకుంది. ఈ కాలంలో మొదట చిన్న చిన్న ఆయత్‌లు అవతరించ నారంభించాయి. ఇవి మనోహరమైన ఒకే తీరు ప్రాసాక్షరాలతో అంతం కావడం మూలంగా హృదయాలను ఇట్టే ఆకర్షించి మనస్సుకు ఓ రకమైన శాంతిని చేకూర్చేవి. ఇదే కాదు, ఈ ఆయత్‌లలో, మనస్సును పరిశుద్ధపరిచే సుగుణాలను, ప్రాపంచిక వ్యసనాల్లో, సుఖభోగాల్లో చిక్కుకోవడం వల్ల కలిగే దుష్పరిణా మాలను వివరించి చెప్పడం, స్వర్గనరక పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించడం జరిగింది. ఈ దివ్యవాణి వాక్యాలు విశ్వాసుల్ని, అప్పటి మానవ సమాజానికి అతీతంగా మరో ప్రపంచంలో ఉన్నట్లుగా అనుభూతిని కలుగజేసేవి.

---

3. సీరతె ఇబ్నె హష్షామ్-1/262.

నమాజ్

ప్రారంభంలో అవతరించిన దివ్యావిష్కృతిలో 'నమాజు' ఆదేశం కూడా ఉంది. 'మకాతిల్ బిన్ సులైమాన్' కథనం ప్రకారం, ఇస్లామ్ ప్రారంభ దశలో అల్లాహ్ రెండు రకాతులు ఉదయం, రెండు రకాతులు సాయం సమయ నమాజులు ఫర్జ్ చేశారని ఉంది. దీనికి కారణం దైవాదేశం ఇలా ఉందని చెబుతారాయన.

وَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ بِالْعَشِيِّ وَ الْإِبْكَارِ

'వ సబ్బిహ్ బిహందిరబ్బిక బిల్ అషీయ్యి వల్ అబ్‌కార్." (40-55)

(ఉదయం, సాయంత్రం నీ ప్రభువును స్తుతిస్తూ, ఆయన పరిశుద్ధతను కొనియాడు.)

ఇబ్నె హజర్ కథనం ప్రకారం, ప్రవక్తశ్రీ(స), ఆయన అనుచరగణం (సహాబా), మేరాజ్ సంఘటనకు పూర్వమే నమాజు చేసేవారు. అయితే, అయిదు పూటల నమాజు కంటే ముందు ఏ నమాజైనా విధిగా చేయబడిందా లేదా? అన్న విషయంలో ధర్మవేత్తల నడుమ అభిప్రాయభేదాలున్నాయి. కొందరు, సూర్యోదయానికి పూర్వం మరియు సూర్యాస్తమయం తరువాత ఒక్కో నమాజు విధిగా చేయబడిందని వాదిస్తారు.

హారిస్ బిన్ ఉసామా ఇబ్నె లహీయా మాధ్యమంగా, హజ్రత్ జైద్ బిన్ హారిస్ (ర), మహాప్రవక్త (స)గారు ప్రవచించారని ఉటంకిస్తూ, దైవప్రవక్త (స) వద్దకు ప్రారంభంలో దివ్యావిష్కృతి వచ్చినప్పుడు, హజ్రత్ జిబ్రీల్ (అ.స.) వచ్చి ఆయన (స)కు 'వుజూ' చేసే విధానాన్ని నేర్పారు. వుజూ అయిన పిదప చేతిలో కొంచెం నీరు తీసుకొని మర్మాంగంపై చల్లారు. ఇబ్నెమాజా ఇదే భావం వచ్చే మరో ప్రవచనాన్ని ఉల్లేఖించడం జరిగింది. బరా బిన్ ఆజిబ్, ఇబ్నె అబ్బాస్ (ర)లు కూడా ఇలాంటి హదీసులనే ఉల్లేఖించారు. ఇబ్నె అబ్బాస్ (ర) ఉల్లేఖించిన హదీసు (ప్రవచనం)లో ఈ నమాజు మొదట విధి అయిన నమాజులకు చెందిన నమాజే అని చెప్పడం జరిగింది.[4]

ఇబ్నె హష్షామ్ కథనం ప్రకారం, ప్రవక్తశ్రీ(స) మరియు సహాబా (అనుచరులు) నమాజు వేళల్లో కొండ సానువుల్లోనికి వెళ్ళి, వారి జాతి కంటబడ

4. ముక్తసరుస్సీరత్- షేక్ అబ్దుల్లాహ్, పుట.88.

కుండా నమాజు చేసేవారు. ఓసారి అబూ తాలిబ్, దైవప్రవక్త (స) మరియు హజ్రత్ అలి (ర) కలసి నమాజు చేస్తుండగా చూశారు. అడిగి తెలుసుకోగా యదార్థం ఏమిటో తెలిసిపోయింది. అప్పుడాయన (అబూ తాలిబ్) కుమారునితో దానిపైన్నే స్థిరంగా ఉండమని ఉద్బోధించారు.[5]

ఖురైష్‌కు చూచాయగా అందిన సమాచారం

ఈ ఘట్టంలో జరిగిన దైవసందేశ ప్రచారం, వ్యక్తిగతంగా, రహస్యంగా జరుగుతున్నప్పటికీ, ఖురైష్ దీన్ని చూచాయగా తెలుసుకోవడం జరిగిందన్న విషయం, వారు దీనికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదన్న విషయం వివిధ సంఘటనల ద్వారా తెలుస్తోంది.

ముహమ్మద్ గజాలి గ్రంథస్థం చేసిన విషయం ప్రకారం, ఈ వార్తలు ఖురైష్‌కు చేరిపోయాయి. అయితే ఖురైష్ దానికి ఎలాంటి ప్రాధాన్యతను ఇవ్వలేదు. బహుశా వారు, ముహమ్మద్ (స)ను కూడా, దైవత్వం, దైవత్వపు హక్కుల గూర్చి చర్చించే, ఉమ్మియా బిన్ అబీసలత్, ఖుస్ బిన్ సాయిదా, అమ్రూ బిన్ నుఫైల్ వగైరాల్లాంటి ఓ వ్యక్తిగానే ఉపేక్షించడం జరిగిందేమో. అయితే ఖురైష్ ఆయన (స)గారి ప్రాచుర్యం, ప్రభావ వ్యాప్తి గురించి శంకించడం మాత్రం జరిగింది. వారి దృష్టి ఇతర సంఘటనలు, వాటి పరిణామాలు ప్రవక్తశ్రీ(స) సందేశ ప్రచారంపై కూడా నిలిచిపోయింది.[6]

మూడేళ్ళ వరకు ఈ దైవసందేశ ప్రచార కార్యక్రమం రహస్యంగా, వ్యక్తిగతంగా సాగింది. ఈ నడుమ విశ్వాసుల ఓ జమాఅత్ (వర్గం) తయారైపోయింది. ఈ జమాఅత్ సోదరభావం, పరస్పరం సహాయ సహకారాలను అందించుకుంటూ అల్లాహ్ సందేశాన్ని ప్రజలకు అందిస్తూపోయింది. అదే కాదు, ఈ సందేశానికి ఓ స్థాయిని కూడా కల్పించాలనే దృఢసంకల్పంతో ఉంది. ఆ తరువాత అవతరించిన దైవవాణిలో దైవప్రవక్తను, బాహాటంగా తన జాతికి సత్యధర్మాన్ని బోధించమని, వారిని దైవమార్గం వైపునకు పిలువమని, అసత్యంతో ఢీకొనమని, విగ్రహాల యదార్థతను బట్టబయలు చేయమని ఆదేశించడం జరిగింది.

5. ఇబ్నె హష్షామ్-1/247.

6. ఫిక్హ్ హుస్సీరత్-పుట. 76.

రెండవ దశ

బహిరంగ దైవసందేశ ప్రచారం

దైవసందేశ ప్రకటనకు ప్రథమ ఆదేశం

ఈ విషయంలో ప్రప్రథమంగా وَأَنذِرْ عَشِيرَتَكَ الْأَقْرَبِينَ 'వ అన్జిర్ అషీరతకల్ అఖ్రబీన్' (ఓ ప్రవక్తా! నీ దగ్గరి బంధువుల్ని (దైవ శిక్ష నుండి) హెచ్చరించు) అనే దైవవాణి అవతరించింది. ఇది దివ్యఖుర్‌ఆన్‌లోని షూరా అధ్యాయంలోని ఆయత్. ఈ అధ్యాయంలో మొదటగా హజ్రత్ మూసా (అ.స.)కు ఎదురైన పరిస్థితులను గురించి చెప్పడం జరిగింది. అంటే మూసా (అ.స.)కు దైవదౌత్య పదవి లభిం చిన ప్రారంభ దశ వివరాలు, చివరన ఆయన (మూసా-అ.స.) బనీ ఇస్రా యీల్‌తో సహా హిజ్రత్ చేసి ఫిర్‌ఔన్, ఫిర్‌ఔన్ జాతి నుండి విముక్తులైన తీరు, ఫిర్‌ఔన్, ఫిర్‌ఔన్ సహచరులు నీట ముంచబడిన వైనం వివరించి చెప్పడం జరిగింది. మరో విధంగా చెప్పాలంటే, మూసా (అ.స.), ఫిర్‌ఔన్‌నూ మరియు ఫిర్‌ఔన్ జాతినీ అల్లాహ్ ధర్మం వైపునకు పిలవడానికి ఏయే పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చిందో వివరించడం జరిగిందన్న మాట.

దైవప్రవక్త (స)కు, తన జాతిలో బాహాటంగా ప్రచార కార్యక్రమం చేపట్టాలని ఆదేశం ఇవ్వబడ్డప్పుడు, మూసా (అ.స.)కు ఎదురైన పరిస్థితుల్ని ఏకరువుపెట్టడానికి గల కారణం, బాహాటంగా దైవమార్గం వైపునకు పిలవడం వలన సత్యనిరాకరణ, దౌర్జన్యాలు తప్పకుండా ఎదుర్కోవలసి వస్తుందని, మీరు (స), మీ అనుయాయులు దానికి సిద్ధమై ఉండాలని హెచ్చరిక చేయబడిందన్నది నా అభిప్రాయం.

మరో వంక, ఈ అధ్యాయంలో దైవప్రవక్తల్ని తిరస్కరించిన జాతులు, ఉదాహరణకు ఫిర్‌ఔన్ మరియు ఫిర్‌ఔన్ జాతే కాకుండా నూహ్ (అ.స.) జాతి, ఆద్, సమూద్ జాతులు; ఇబ్రాహీం (అస), లూత్ (అస) జాతులు,

అయికా ప్రజలు అనుభవించిన దుష్పరిణామాలేమిటో వివరించబడ్డాయి. దీని ఉద్దేశ్యం బహుశా, మహాప్రవక్త (స)గారి దైవదౌత్యాన్ని తిరస్కరించే వారికి, ఈ తిరస్కార వైఖరి నవలంబించడం వలన ఎలాంటి దుష్పరిణామాలను చవిచూడవలసి ఉంటుందో అని హెచ్చరిక, దైవధిక్కార నేరం క్రింద వారిని ఎలా శిక్షించటం జరుగుతుందో అన్న సత్యాన్ని విడమర్చి చెప్పడమే కాకుండా ప్రవక్త (స)ను విశ్వసించడం వల్ల ఎలాంటి బహుమానం లభిస్తుందో వివరించడమైనా అయి ఉండవచ్చు.

దగ్గరి బంధువుల్లో సందేశ ప్రచారం

మొత్తానికి ఈ ఆయత్ అవతరించిన వెంటనే దైవప్రవక్త (స) చేసిన మొట్టమొదటి పని, బనీ హాషిం తెగవారిని ఓ చోట సమావేశపరచడం. వారి వెంట బనీ ముత్తలిబ్ బిన్ అబ్దె మునాఫ్‌కు చెందిన ఓ వర్గం కూడా ఉంది. సమావేశమైనవారు మొత్తం నలభై అయిదు మంది. కాని అబూ లహబ్ అందుకొని, "ముహమ్మద్ (స), చూడు! వీరంతా నీ పినతండ్రులు, పినతండ్రి కుమారులు. వీరితో మాట్లాడు. కాని మూర్ఖత్వం వదిలెయ్యి. నీ కుటుంబం అరబ్బులందరిని ఎదుర్కోలేదు సుమా! నిన్ను వారించడానికి వీరందరికంటే నాకే హక్కు అధికం. కాబట్టి నీ తండ్రి కుటుంబమే నిన్ను అడ్డుకోవడానికి చాలు. నీవే గనక నీ మాట మీదనే నిలబడతానంటే మాత్రం ఖురైష్‌కు చెందిన తెగలన్నీ నీపైకి వచ్చిపడతాయి. మిగతా అరబ్బులు కూడా వారికి సహాయపడతారు. తండ్రి కుటుంబాన్ని వినాశనానికి గురి చేయడానికి కారణభూతుడవు నీవే అవుతావు జాగ్రత్త!"అని ముగించాడు. ప్రవక్త (స) మౌనాన్ని వహించారు. ఆ సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదు.

ఆ తరువాత ప్రవక్తశ్రీ(స) మరోమారు వారందరిని సమావేశపరచి ఇలా సెలవిచ్చారు: " స్తోత్రమంతా అల్లాహ్‌కే. నేను ఆయనను స్తుతిస్తున్నాను. ఆయన సహాయాన్ని కోరుకుంటున్నాను. ఆయనను విశ్వసిస్తున్నాను. ఆయననే నమ్ముకుంటున్నాను. అల్లాహ్ తప్ప ఆరాధనలకు అర్హుడెవడూ లేడని సాక్ష్యమిస్తున్నాను. ఆయన ఒక్కడే. ఆయనకు సాటి ఎవ్వరూ లేరు." తరువాత మాట్లాడుతూ, "మార్గం చూపేవాడు తన ఇంటి వారితో ఎన్నడూ అసత్యం పలుకలేదు. ఆరాధనలకు ఎవ్వరూ సాటిలేని ఆ దైవసాక్షిగా చెబుతున్నాను, ఈ మానవాళి

కోసం అల్లాహ్ తరపున పంపబడిన ప్రవక్తను నేను. దైవసాక్షి! మీరు పడుకొని నిద్రబోయినట్లే మరణాన్ని కూడా ఎదుర్కోవలసి ఉంది. ఎలా నిద్ర నుండి మేల్కొంటారో తిరిగి మళ్ళీ లేపబడతారు. తదుపరి మీరు చేసే ప్రతి కర్మకు లెక్క అడగబడుతుంది. ఆ తరువాత స్వర్గమో లేదా నరకమో శాశ్వ తంగా మీ కోసం ఎదురు చూస్తూ ఉంటాయి."

అది విన్న అబూ తాలిబ్ ఇలా పలికారు:"కుమారా! నీతో ఎంత మట్టుకు సహకరించగలమో, నీ నీతి బోధ ఎంత వరకు సమ్మతమైనదో, నీ మాట ఎంత వరకు సత్యమైందన్న విషయాన్ని అడగకు! చూడు! నీ తండ్రి కుటుంబ సభ్యులంతా ఇక్కడనే చేరి ఉన్నారు. నేను కూడా వారిలోని ఓ వ్యక్తినే. తేడా ఏమిటంటే, నీ ఇష్ట పరిపూర్తికి వారందరికంటే ముందున్న వాణ్ణి. కాబట్టి నీకు ఏ ఆదేశమైతే వచ్చిందో దాన్ని నిర్వర్తించు. దైవసాక్షి! నేను నిన్ను సతతం కాపాడుతూ సహాయపడతాను. అయితే, నా మనస్సు అబ్దుల్ ముత్తలిబ్ ధర్మాన్ని వీడడానికి ఒప్పుకోవడం లేదు."

అబూ లహబ్ అందుకొని, "దైవసాక్షి! ఇది బహు చెడ్డ విషయం. ఇతరులు అడ్డుకోక పూర్వమే నీవు అతణ్ణి అడ్డుకో" అని అన్నాడు, దానికి జవాబుగా అబూ తాలిబ్, "దైవసాక్షిగా చెబుతున్నాను, నా బొందిలో ప్రాణం ఉన్నంత వరకు నేను ఆయనను రక్షిస్తూనే ఉంటానని" చెప్పారు.[1]

సఫా కొండ మీద...

అల్లాహ్ ధర్మ ప్రచార సందర్భంలో, పినతండ్రి అయిన అబూ తాలిబ్ దైవప్రవక్త (స)కు చేదోడు వాదోడుగా ఉంటారన్న ధైర్యం కలగగా, ఓ రోజు ప్రవక్తశ్రీ(స) సఫా కొండపైకెక్కి 'యా సబాహా'[2] (అయ్యో! ఓ ఉదయమా!!) అని కేక వేశారు. ఈ కేక విని ఖురైష్‌కు చెందిన తెగలన్నీ ఆయన దగ్గరకు చేరగా, దైవప్రవక్త (స) వారికి దేవుని ఏకత్వం, తన దైవదౌత్యం మరియు అంతిమ దినాన్ని విశ్వసించమని పిలుపునిచ్చారు. ఈ సంఘటనకు సంబంధించిన కొంత విషయం సహీ బుఖారి గ్రంథంలో ఇబ్నె అబ్బాస్ (ర) ద్వారా ఇలా ఉల్లేఖించడం జరిగింది:

1. ఫిక్హుస్సీరహ్-పుట. 77,88. ఇబ్నుల్ అసీర్ నుండి.
2. అరబ్బుల ఆచారం ప్రకారం, శత్రుదాడి గురించి తెలపాలంటే ఓ ఎత్తయిన ప్రదేశంపైకి పోయి ఈ పదాలే పలుకుతూ కేక వేసేవారు.

ఎప్పుడైతే 'వ అన్జిర్ అషీరతకల్ అఖరబీన్' ఆయత్ అవతరించిందో దైవప్రవక్త (స) సఫా కొండ మీదకు ఎక్కి ఖురైష్ తెగలను ఉద్దేశించి, "ఓ బనీ ఫహర్! ఓ బనీ అద్దీ!" అంటూ ఒక్కొక్కరి పేరు పెట్టి పిలిచి ఓ చోట సమావేశపరచారు. అక్కడికి చేరలేని వాడు సైతం, విషయం ఏమిటో తెలుసుకురమ్మని తన మనిషిని అచ్చటికి పంపించాడు. మొత్తానికి ఖురైష్ అంతా వచ్చేశారు. అబూ లహబ్ కూడా అక్కడికి వచ్చాడు. ఆ తరువాత ప్రవక్తశ్రీ(స) వారినందరిని ఉద్దేశించి, "ఈ కొండకు ఈవల లోయలో మీపై దండెత్తడానికి ఓ సైనిక పటాలం పొంచి ఉంది అని నేను చెబితే మీరు దీన్ని విశ్వసిస్తారా?" అని అడిగారు. ప్రజలంతా, "ఔను! మీరెప్పుడూ సత్యాన్నే చెబుతారన్న అనుభవం మాకుంది" అని ఏకకంఠంతో బదులు పలికారు. అప్పుడు దైవప్రవక్త (స), "అయితే చూడండి! నేను ఓ భయంకరమైన శిక్ష, యాతనల గురించి హెచ్చరించడానికి పంపబడినవాణ్ణి" అని హెచ్చరించారు.

ఇది విన్న అబూ లహబ్, "నీవు నాశనంగాను! మమ్మల్ని ఈ మాట చెప్పడానికే ఓ చోట కూడగట్టావా?" అని చిర్రుబుర్రులాడాడు. ఈ సందర్భంలోనే దివ్యఖుర్‌ఆన్ అధ్యాయం 'తబ్బత్ యదా అబీ లహబ్' అవతరించింది. "అబూ లహబ్ రెండు చేతులు నాశనమైపోవుగాక. అతనూ సర్వనాశనమైపోవుగాక" అని దీని అర్థం.[3]

ఈ సంఘటనకు చెందిన మరో భాగాన్ని ఇమామె ముస్లిమ్ తన గ్రంథం సహీలో అబూ హురైరా (ర) ఉల్లేఖించినట్లు రాశారు. ఆయన కథనం ప్రకారం, "వఅన్జిర్ అషీరత కల్ అఖరబీన్" అనే దైవవాణి అవతరించినప్పుడు దైవప్రవక్త (స) ఓ పిలుపునిచ్చారు. ఈ పిలుపు అందరినీ పిలిచిన పిలుపు. ఆయన ఖురైష్ తెగతో, "ఓ ఖురైష్ ప్రజలారా! మిమ్మల్ని మీరు నరకం నుండి కాపాడుకోండి, ఓ బనీ కఅబ్! మిమ్మల్ని మీరు నరకం నుండి రక్షించుకోండి. ఓ ముహమ్మద్ కూతురు ఫాతిమా! నిన్ను నీవు నరకం నుండి రక్షించుకో. ఎందుకంటే మిమ్మల్ని అల్లాహ్ (పట్టు)నుండి రక్షించే శక్తి నాకు లేదు. అయితే మీతో నాకు వంశం, బంధుత్వం రీత్యా సంబంధం ఉంది. ఆ సంబంధం ప్రకారమే మిమ్మల్ని హెచ్చరించగలను."[4]

3. సహీ బుఖారి-2/702, 743; సహీ ముస్లిమ్-1/114.
4. సహీ ముస్లిమ్-1/114; సహీ బుఖారి-1/385.

ఈ పిలుపు కేవలం సందేశ ప్రచారార్థమే. దైవప్రవక్త (స), తన దగ్గరి బంధువులకు, తెగలకు, ఇక నుండి దైవదౌత్యాన్ని బలపరచడం మీదనే మన పరస్పర సంబంధాలు ఆధారపడి ఉంటాయని, ఏ జాతి, తెగల దురభిమానాల్లో అరబ్బులు చిక్కుకొని ఉన్నారో అవి దైవ హెచ్చరికతో అంతమైపోయాయని నిక్కచ్చిగా తెలియజేయడం జరిగింది.

బాహాట సత్య ప్రకటనకు బహుదైవారాధకుల ప్రతిచర్య

ఈ నినాద ప్రతిధ్వని ఇంకా మక్కా చుట్టుపట్ల వ్యాపించిందో లేదో, అల్లాహ్ మరో ఆదేశాన్ని అవతరింపజేశాడు.

فَاصْدَعْ بِمَا تُؤْمَرُ وَأَعْرِضْ عَنِ الْمُشْرِكِينَ ۝

"ఫస్‌దఅ బిమా తూమరు వ ఆరిజ్ అనిల్‌ముష్రికీన్." (15-94)

(కనుక ఓ ప్రవక్తా! నీకు ఆజ్ఞాపించబడుతూ ఉండిన విషయాన్ని బహిరంగంగా ఎలుగెత్తి చాటు. షిర్కు చేసే వారిని ఏ మాత్రం లెక్కచేయకు.)

ఆ తరువాత దైవప్రవక్త (స), షిర్క్ (అల్లాహ్‌కు సాటి కల్పించడం) అంటే బహుదైవారాధన దురాచారాలను, దాని అసత్య పోకడలను ఎండగట్టనారంభించారు. విగ్రహాల యదార్థతను, వాటి రుగ్మతల్ని విడమర్చి చెప్పనారంభించారు. ప్రవక్తశ్రీ(స) ఉదాహరణలిస్తూ, ఈ విగ్రహాలు ఎంత వివశమైనవో, ఎంత పనికిమాలినవో, వాటిని ఆరాధించేవారు దైవానికి, ఈ విగ్రహాలకు నడుమ ఎలా సంబంధం ఏర్పరచుకున్నారో, వారు అవలంబించే ఈ వైఖరి ఎంత మూర్ఖమైనదో హేతుబద్ధంగా తర్కించి మరీ వివరించేవారు.

ముష్రిక్కులను (బహుదైవారాధకులను), విగ్రహారాధకులను, మార్గభ్రష్టులుగా నిందించినందుకు మక్కా నగరం అంతా ఆగ్రహం పట్టలేక మూకుమ్మడిగా ఆయనకు ఎదురు తిరిగింది. ఆశ్చర్య తిరస్కారాలతో ఊగిపోయింది. అంటే, అది ప్రశాంత వాతావరణాన్ని భయభ్రాంతులకు గురిచేసిన ఓ ఫెళఫెళారావమన్న మాట. అందుకని ఖురైషులు హఠాత్తుగా సంభవించిన ఈ విప్లవాన్ని వ్రేళ్ళతో సహా పెకలించడానికి లేచి నిలబడ్డారు. కారణం, దాన్ని సమర్థిస్తే తాతముత్తాతల నాటి నుండి వచ్చే ఆచార సంప్రదాయాలు పూర్తిగా తుడుచుకుపోతాయి అని వారి భయం.

అల్లాహ్‌యేతర శక్తుల దైవత్వాన్ని నిరాకరించడం; దైవదౌత్యాన్ని, ప్రళయ

దినాన్ని విశ్వసించడమంటే, తమను తాము పూర్తిగా దైవదౌత్యానికి అంకితం చేయవలసి ఉంటుందన్నది, ఆ మార్గాన్ని తు.చ. తప్పకుండా అనుసరించాల్సి ఉంటుందన్న విషయం ఖురైషులకు బాగా తెలుసు. అంటే, ఇతర విషయాలను ప్రక్కనబెట్టి, స్వయంగా తమ సంపదపైగాని, తమ ప్రాణాల విషయంలోగాని వారికి ఎలాంటి అధికారం ఉండబోదు. మరో విధంగా చెప్పాలంటే, మక్కావాసులకు ధార్మికంగా ఇతర అరబ్బులపై ఉన్న ఆధిక్యత, నాయకత్వం పూర్తిగా అంతం అయిపోతాయి. అల్లాహ్ మరియు అల్లాహ్ ప్రవక్త ఇష్టానికి వ్యతిరేకంగా తమ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించడానికి వీలుండదు. అంటే, బడుగు వర్గాలపై వారు ఏయే అత్యాచారాలు జరుపుతున్నారో, పొద్దస్తమానం ఏయే పాపాల్లో లీనమైపోయి ఉన్నారో వాటన్నింటిని ఒక్కసారిగా వదలి వేయవలసి వస్తుందని వారి బాధ. ఖురైషులు దీన్ని బాగా ఎరుగుదురు. అందుకని ఈ అవమానాన్ని భరించడం కోసం వారు ఏ మాత్రం సిద్ధంగా లేరు. ఇదంతా చేస్తున్నది, ఏదో గౌరవం పొందాలనో లేదా ఏదో ప్రయోజనం సమకూర్చుకోవాలనో మాత్రం కాదు. అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో చెప్పినట్లుగా, بَلْ يُرِيدُ الْإِنسَانُ لِيَفْجُرَ أَمَامَهُ ۝ **"కాని మానవుడు ఇక ముందు కూడా దుష్కార్యాలు చేయగోరుతున్నాడు"** (75-5) అనేదాని కోసం.

ఖురైషులకు ఇదంతా తెలుసు. అయితే వచ్చిన చిక్కల్లా, వారి ముందు ఉన్న వ్యక్తి సత్యసంధుడు, అమానతుదారుడు, మానవ విలువలు, నైతికతల ప్రతిబింబం. ఓ సుదీర్ఘ కాలం వరకు వారు తమ తాతముత్తాతల చరిత్రలో అలాంటి సద్గుణశీలుణ్ణి కనీవినీ ఎరుగరు. ఒకవేళ అతణ్ణి అడ్డుకోదలిస్తే అడ్డుకునేదెలా? ఈ విషయంలో వారు సంభ్రమాశ్చర్యాలకు లోనైపోయారు.

బాగా ఆలోచించిన తరువాత వారికి ఓ మార్గం అగుపించింది. ప్రవక్తశ్రీ (స) పినతండ్రి అబూ తాలిబ్ వద్దకు వెళ్ళి, ఆయన్ను ఆ కార్యం నుండి వారించమని నచ్చజెబుదాం అని తీర్మానించుకున్నారు. ఈ ప్రణాళికను విజయవంతం చేయడానికి వారు ఓ హేతువును కూడా కనుగొన్నారు. దాని ప్రకారం, ముహమ్మద్ (స) వారి ఆరాధ్యుల్ని వదిలేయమని చెప్పడం, వాటికి ఎలాంటి లాభనష్టాలను చేకూర్చే శక్తి లేదని చెప్పడం వగైరాలు. ఆ ఆరాధ్యులను నిందించడం లాంటిదనీ, గొప్ప దూషణ అనీ, అదే కాకుండా అదే మార్గంపై

నడిచిన తమ తాతముత్తాతల్ని మూర్ఖులు, మార్గభ్రష్టుల క్రింద జమ చేసినట్లు అవుతుందని నమ్మబలకడమే ఆ హేతువు. ఖురైషుకు ఈ పన్నాగమే సహేతుకమనిపించింది. ఇక ఆలస్యం చేయకుండా దాన్నే అనుసరించారు.

అబూ తాలిబ్ వద్దకు వెళ్ళిన ఖురైష్ ప్రతినిధి బృందం

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, ఖురైష్‌కు చెందిన కొందరు పెద్ద మనుషులు అబూ తాలిబ్ ఇంటికి వెళ్ళి ఆయనతో మాట్లాడారు.

"ఓ అబూ తాలిబ్! నీ సోదర కుమారుడు మా దేవతల్ని నిందిస్తున్నాడు. మా మతాన్ని తప్పుపడుతున్నాడు. మేమంతా మందబుద్ధిగల వాళ్ళమట. మా తాత ముత్తాతలు మార్గభ్రష్టులట. నీవు ఆయన్ను అలా అనకుండా వారిస్తావా లేదా మా మధ్య నుండి తప్పుకుంటావా? నీవు కూడా మాలాగే అతను బోధించే ధర్మానికి వ్యతిరేకమైన ధర్మాన్నే అనుసరిస్తున్నావు కనుక, అతణ్ణి వారించడానికి మేము చాలు" అన్నారు. జవాబుగా అబూతాలిబ్ వారితో సద్వర్తనతో మెలుగుతూ ఏదో నచ్చజెప్పి వెనక్కు పంపించివేశారు. దైవప్రవక్త (స) మాత్రం తన మార్గాన్నే అనుసరిస్తూ అల్లాహ్ ధర్మాన్ని వ్యాపింపజేయడానికి సందేశాన్ని అందిస్తూనే ఉన్నారు.[5]

హజ్ యాత్రికులు ప్రవక్త (స) మాటలను వినకుండా చేసేందుకు సలహా సంఘం ఏర్పాటు

ఆ రోజుల్లోనే ఖురైష్‌కు మరో చిక్కు ఎదురైంది. అంటే, బాహాటంగా దైవసందేశ ప్రచారం ఆరంభమై కొన్ని నెలలు గడిచాయో లేదో హజ్ కాలం వచ్చేసింది. అరేబియా మూలమూలల నుండి గుంపులు గుంపులుగా హజ్ యాత్రికులు మక్కాకు వస్తారన్న విషయం ఖురైషులకు బాగా తెలుసు. అందుకని ఆ హజ్ యాత్రికులు ముహమ్మద్ (స)గారి మాటలకు ప్రభావితులు కాకుండా ఉండాలంటే, ఏదో ఒకటి వారి మనసుల్లో నాటాల్సి వస్తుంది. కావున వారందరు ఈ విషయాన్ని చర్చించేందుకు 'వలీద్ బిన్ ముగైరా' ఇంట సమావేశమయ్యారు. వలీద్ ఇలా అన్నాడు: "ఈ విషయమై మీరందరూ ఒకే ఒక మాట మీద నిలబడాలి. మీలో ఎలాంటి అభిప్రాయభేదం ఉండడానికి వీల్లేదు. మీలోనే ఒకడు చెప్పింది మరో వ్యక్తి ఖండించకూడదు. చాలా జాగ్రత్తగా

5. ఇబ్నె హిషామ్-1/265.

ఉండాల్సి ఉంటుంది" అని అన్నాడు. "కానీయండి! ఏం చెబుతారో మీరే చెప్పండి" అని వారు ముగైరానే అడగ్గా, "లేదు, మీరే చెప్పండి. నేను వింటాను" అన్నాడు వలీద్. దానికి కొందరు ఇలా అన్నారు. "అతను (ముహమ్మద్ -స) ఓ కాహిన్ (జ్యోతిష్యుడు)". "లేదు, దైవసాక్షి! అతను కాహిన్ కాడు. మనం చాలా మంది కాహిన్‌లను చూశాం. అతనిలో కాహిన్లలో ఉన్న గొణుగుడు లేదు. వారిలా మాట్లాడేవాడూ కాదు."

"అలా కాకపోతే అతణ్ణి ఓ ఉన్మాదిగా చిత్రిద్దాం."

"అబ్బే! అతను ఉన్మాది కూడా కాడు. మనం చాలా మంది పిచ్చి వాళ్ళను, ఉన్మాదుల్ని చూశాం. వారి పరిస్థితిని కూడా గమనించినవాళ్ళం. ఆ వ్యక్తిలో ఉన్మాదుల్లాంటి ఏ సూచనా మనకు కానరాదు. వారిలా పిచ్చిపిచ్చి ప్రేలాపనలు కూడా అతను చేయడం లేదు."

"మరైతే అతను ఓ కవి అని వారిని నమ్మబలుకుదాం" అని వారు ఓ సలహా ఇచ్చారు.

దానికి వలీద్,"అతను కవి కూడా కాడు. మనకు కవిత్వానికి సంబంధించిన ఛందస్సు సైతం బాగా తెలుసు. మొత్తానికి అతను కవి కూడా కాడు."

"అతను ఓ ఇంద్రజాలికుడు అని చెబుదాం" అన్నారు అక్కడున్న వారిలో కొందరు.

"అతను ఇంద్రజాలికుడు కూడా కాడు. మనం ఇంద్రజాలికుల్ని, వారి జాల విద్యను కూడా చూసే ఉన్నాం. ఇతను వారిలా మంత్రాలు చదివి, త్రాళ్ళను ముడులుగా వేయడం లాంటివి ఏమీ చేయడం లేదు" అన్నాడు వలీద్ బిన్ ముగైరా.

"ఇవేమీ కాకపోతే మరేమని ఆ యాత్రిక బృందాలను నమ్మబలకగలం?" అని ప్రశ్నించారు వారు.

దానికి వలీద్ కల్పించుకొని, "దైవసాక్షి! అతని మాటలు అతి మధురమైనవి. అతని వ్రేళ్ళు పటిష్టమైనవి. దాని శాఖలు ఫలవంతమైనవి. మీరు ఏ మాట చెప్పినా దాన్ని అసత్యంగా భావిస్తారు వారు. అయితే, ఈ విషయంలో సరియైన మాట ఒక్కటే. అతను ఇంద్రజాలికుడు. అతను బోధించే వాణి అంతా ఇంద్రజాలమే. దాని ద్వారా తండ్రీకుమారుల్లో, అన్నదమ్ముల్లో, భార్యాభర్తల్లో, కుటుంబానికి కుటుంబానికి నడుమ చీలికలు ఏర్పడుతున్నాయి."

చివరికి వారంతా ఈ సలహాను ఏకీభవిస్తూ అక్కడి నుండి వెళ్ళి పోయారు.[6]

కొన్ని ఉల్లేఖనాల్లో, వలీద్ ఖురైష్ ప్రజలు ఇచ్చిన సలహాలన్నింటినీ త్రోసిపుచ్చగా, వారంతా నీవే మచ్చలేని సలహా ఏదైనా ఇవ్వమని అడిగారు. దానికి అతను, "ఆగండి. నన్ను కొంత ఆలోచించుకోనివ్వండి" అని చెబుతూ దీర్ఘంగా ఆలోచించి పైన చెప్పిన సలహాను వారి ముందుంచాడు.[7]

ఈ వ్యవహారానికే సంబంధించి వలీద్ విషయంలో ముద్దస్సిర్ సూరాలో పదహారు ఆయత్‌లు (11 నుండి 26) వరకు అవతరించాయి. వీటి లోని కొన్ని ఆయత్‌లలో అతని ఆలోచనా తీరు ఎలాంటిదో కూడా చెప్పడం జరిగింది. దివ్యఖుర్‌ఆన్‌లోని ఆ ఆయత్‌ల అర్థం ఇది:

إِنَّهُ فَكَّرَ وَقَدَّرَ ۝ فَقُتِلَ كَيْفَ قَدَّرَ ۝ ثُمَّ قُتِلَ كَيْفَ قَدَّرَ ۝
ثُمَّ نَظَرَ ۝ ثُمَّ عَبَسَ وَبَسَرَ ۝ ثُمَّ أَدْبَرَ وَاسْتَكْبَرَ ۝ فَقَالَ
إِنْ هَٰذَا إِلَّا سِحْرٌ يُؤْثَرُ ۝ إِنْ هَٰذَا إِلَّا قَوْلُ الْبَشَرِ ۝

"అతడు ఆలోచించి, ఏదో ఎత్తు వేయడానికి ప్రయత్నించాడు. కనుక దేవుడు అతనిని నాశనం చేయుగాక! అతడెలాంటి ఎత్తుగడ వేయడానికి ప్రయత్నించాడు! తరువాత (ప్రజల వైపు) చూశాడు. ఆ తరువాత కను బొమ్మలు ముడిచాడు. ముఖం చిట్లించుకున్నాడు. ఆపై విర్రవీగుతూ తిరిగి పోయాడు. చివరకు, ఇది పూర్వం నుండి వస్తూ ఉన్న ఒక మంత్రజాలం తప్ప మరేమీ కాదు, ఇది ఒక మానవ వాక్కు మాత్రమే." (74: 18-25)

మొత్తానికి ఈ తీర్మానం జరిగాక దాన్ని అమలు చేసే పని మొదలైంది. కొందరు మక్కాకు చెందిన దైవతిరస్కారులు హజ్ యాత్రికులు వచ్చే వివిధ మార్గాల్లో కూర్చుని, ఆ మార్గాల ద్వారా ప్రయాణం చేసే హజ్ యాత్రికుల్ని ప్రవక్త (స) గారి నుండి వచ్చే ప్రమాదం గురించి హెచ్చరిస్తూ వివరాల నందించసాగారు.[8]

---

6. ఇబ్నె హష్షామ్-1/271.

7. ఫీ జిలాలుల్ ఖుర్‌ఆన్-ఖుర్‌ఆన్ అధ్యాయం-29/188.

8. ఇబ్నె హష్షామ్-1/271.

ఈ విషయంలో అబూ లహబ్ అందరికంటే చురుకుగా పాల్గొన్నాడు. అతను హజ్ కాలంలో యాత్రికుల విడుదులు మరియు ఉకాజ్, మజిన్నా, జుల్‌మజాజ్ సంతల్లో దైవప్రవక్త(స)ను వెన్నంటి ఉండేవాడు. ఆయన(స) దైవధర్మ ప్రచారం చేస్తుంటే దాన్నందుకుని అబూ లహబ్, ఈయన మాట వినకండి, ఇతను అసత్యవంతుడు, మార్గభ్రష్టుడైనవాడు అని ప్రవక్త(స) ప్రచారాన్ని ఖండించేవాడు.[9]

ఇలా ప్రజలు హజ్ యాత్ర పూర్తి చేసుకొని ఇళ్ళకు మళ్ళేనాటికి, ముహ మ్మద్ అనే ఓ వ్యక్తి తాను దైవసందేశహరునిగా చెప్పుకుంటున్నాడన్న సత్యం వారికి తెలిసిపోయింది. హజ్ యాత్రికుల ద్వారా ఈ వార్త పూర్తి అరేబియాలో వ్యాపించిపోయింది.

వ్యతిరేకతకు అవలంబించిన వివిధ ఎత్తుగడలు

ముహమ్మద్(స)ను దైవసందేశ ప్రచారం నుండి అడ్డుకోవడానికి ఈ విధానం పనిచేయడంలేదన్నది తెలిసిపోగానే, వారంతా తిరిగి ఆలోచనలో పడిపోయారు. దైవసందేశాన్ని వ్యాపించకుండాజేయడానికి అనేక విధానాల్ని అవలంబించనారంభించారు, వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

1. మొదటి రకం ఎత్తుగడ

ఎగతాళి, అవమానం, అపహాస్యం, నిరాకరణల ద్వారా బాధిస్తూ ముస్లిములను నిరుత్సాహపరచి వారి ధైర్యాన్ని నీరుకార్చడం. అందుకని బహు దైవారాధకులు దైవప్రవక్త(స)పై అపవాదులు వేస్తూ అసహ్యమైన పదజాలంతో ఆయన్ను దూషించేవారు. ఆయనను ఉన్మాదిగా చిత్రించేవారు. ఖుర్‌ఆన్ ఇలా అంటోంది:

وَقَالُوا يَا أَيُّهَا الَّذِي نُزِّلَ عَلَيْهِ الذِّكْرُ إِنَّكَ لَمَجْنُونٌ ۝

"దైవతిరస్కారులు ఇలా అంటారు: జిక్ర్ (దివ్యవాణి) అవతరించిన ఓ మనిషీ! నీవు నిజంగానే పిచ్చివాడవు." (15-6)

ఒక్కోసారి ఇంద్రజాలికునిగా, అసత్యం పలికే మనిషిగా నిందించేవారు,

---

9. తిర్మిజీ, ముస్నదె అహ్మద్-3/492, 4/341.

وَعَجِبُوا أَنْ جَاءَهُمْ مُنْذِرٌ مِنْهُمْ ۖ وَقَالَ الْكَافِرُونَ هَٰذَا سَاحِرٌ كَذَّابٌ ۝

"భయపెట్టేవాడొకడు స్వయంగా తమ నుండే వచ్చాడని వారు ఆశ్చర్య పడ్డారు. సత్యతిరస్కారులు ఇతను మంత్రవాది, అసత్యవాది అని అంటారు." (38-4)

ఈ దైవతిరస్కారులు ఆయన వెనుక పగతీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో క్రోధావేశులై ఉద్రేకభావంతో నడిచేవారు. దీన్ని దివ్యఖుర్‌ఆన్ ఇలా చిత్రీకరిస్తోంది.

وَإِنْ يَكَادُ الَّذِينَ كَفَرُوا لَيُزْلِقُونَكَ بِأَبْصَارِهِمْ لَمَّا سَمِعُوا
الذِّكْرَ وَيَقُولُونَ إِنَّهُ لَمَجْنُونٌ ۝

"ఈ అవిశ్వాసులు ప్రబోధవాణి (ఖుర్‌ఆన్)ని విన్నప్పుడు, వారు నీ కాళ్ళు ఊడగొడతారా అన్నట్లు నిన్ను కొరకొరా చూస్తారు. ఇతను తప్పకుండా పిచ్చివాడే అని అంటారు." (68 : 51)

ఏ చోటనైనా ప్రవక్త(స) కూర్చుని ఉంటే, ఆయన చుట్టూ పీడితులు, బలహీనులు అయిన సహాబా(ర) కూర్చుని ఉండేవారు. వారిని చూసి ఈ బహుదైవారాధకులు అపహాస్యం చేస్తూ ఇలా అనేవారు:

أَهَٰؤُلَاءِ مَنَّ اللَّهُ عَلَيْهِمْ مِنْ بَيْنِنَا

" ఓహో! మా నడుమ దయాదాక్షిణ్యాలు పొందిన వ్యక్తులు వీరేనా?" అని. (6-53)

సమాధానంగా అల్లాహ్ అంటాడు :

أَلَيْسَ اللَّهُ بِأَعْلَمَ بِالشَّاكِرِينَ ۝

"అవును! అల్లాహ్, కృతజ్ఞతలు చూపే తన భక్తులను, వీరికంటే బాగా ఎరుగడా?" (6 : 53)

సాధారణంగా బహుదైవారాధకుల పరిస్థితి అంతా ఈ క్రింద చెప్పబడిన దివ్యగ్రంథంలోని ఆయత్‌లలో చెప్పినట్లుగానే ఉండేది.

إِنَّ الَّذِينَ أَجْرَمُوا كَانُوا مِنَ الَّذِينَ آمَنُوا يَضْحَكُونَ ۝ وَإِذَا مَرُّوا بِهِمْ
يَتَغَامَزُونَ ۝ وَإِذَا انْقَلَبُوا إِلَىٰ أَهْلِهِمُ انْقَلَبُوا فَكِهِينَ ۝ وَإِذَا رَأَوْهُمْ

قَالُوا إِنَّ هَٰؤُلَاءِ لَضَالُّونَ ۝ وَمَا أُرْسِلُوا عَلَيْهِمْ حَافِظِينَ ۝

"ప్రపంచంలో విశ్వసించిన వారిని నేరస్తులు హేళన చేస్తుంటారు. వారి ముందు నుండి వెళ్ళేటప్పుడు మాటిమాటికి కళ్ళుగీటుతూ వారి వైపు సైగలు చేసేవారు. తమ కుటుంబసభ్యుల దగ్గరకు వెళ్ళేటప్పుడు సంబర పడుతూ వెళ్ళేవారు. వారిని చూసినప్పుడు "వీరు దారితప్పారు" అని అనేవారు. వాస్తవానికి వారు వారిపై కాపలాదారులుగా నియమించ బడలేదు." (83-29 నుండి 33)

2. రెండవ రకం ఎత్తుగడ

దైవప్రవక్త(స)గారి బోధనలను వక్రీకరించడం, అనుమానాలను రేకెత్తించడం, అసత్యపు ప్రచారం. బోధనలకుతోడు వ్యక్తిత్వాన్ని కూడా అర్థంపర్థంలేని ఆక్షేపణలకు గురి చేయడం. ఈ ఎత్తుగడలన్నింటిని, ప్రజలు ప్రవక్తశ్రీ(స) బోధనల గురించి ఆలోచించకుండా ఆయన పిలుపును పెడచెవినబెట్టేటట్లు చేయడానికి పన్నిన ఎత్తులు. కాబట్టి దివ్యఖుర్‌ఆన్ బహుదైవారాధకుల ఈ ఎత్తుగడలను ఇలా తేటతెల్లం చేస్తోంది. దైవప్రవక్త మాటను విశ్వసించడానికి నిరాకరించిన వారు ఇలా అంటారు:

أَسَاطِيرُ الْأَوَّلِينَ اكْتَتَبَهَا فَهِيَ تُمْلَىٰ عَلَيْهِ بُكْرَةً وَأَصِيلًا ۝

"ఈ గీటురాయి ఒక కల్పన, దానిని ఇతనే స్వయంగా కల్పించాడు. ఇతరులు కొందరు ఈ పనిలో అతనికి సాయపడ్డారు." (25 : 4)

ఇంకా ఇలా అంటారు,

إِنْ هَٰذَا إِلَّا إِفْكٌ افْتَرَاهُ وَأَعَانَهُ عَلَيْهِ قَوْمٌ آخَرُونَ ۚ

"ఇవి పూర్వకాలంనాటి వారు వ్రాసిన విషయాలు. వాటికి ఇతను నకలు వ్రాయిస్తున్నాడు." (25 : 5)

బహుదైవారాధకులు ఇలా అంటూ ఉండేవారు కూడా.

إِنَّمَا يُعَلِّمُهُ بَشَرٌ ۗ

"దీన్ని (ఖుర్‌ఆన్‌ను) ఆయనకు ఓ మానవుడు నేర్పుతున్నదే." (16 : 103)

దైవప్రవక్త(స)ను వారు ఇలా ఆక్షేపణలకు గురిచేసేవారు.

مَالِ هَٰذَا الرَّسُولِ يَأْكُلُ الطَّعَامَ وَيَمْشِي فِي الْأَسْوَاقِ

"ఇతనేమి ప్రవక్త! అన్నం తింటాడు, బజారులలో తిరుగుతూ ఉంటాడు?"

(25 : 7)

దివ్యఖుర్‌ఆన్ అనేక సందర్భాల్లో బహుదైవారాధకుల ఈ ఆక్షేపణల్ని వ్రేలెత్తిచూపుతూ మరికొన్ని సందర్భాల్లో పరోక్షంగానూ ఖండించింది.

3. మూడవ రకం ఎత్తుగడ

ఈ ఎత్తుగడ ప్రకారం పూర్వీకుల పౌరాణిక గాధల్ని దివ్య ఖుర్‌ఆన్‌కు పోటీగాపెట్టి వాటితోనే సతమతమయ్యేటట్లు ప్రజల్ని మభ్యపెట్టడం. నజ్ర్ బిన్ హారిస్ ఓసారి ఖురైషులతో ఈ విషయమై ప్రస్తావిస్తూ, "ఖురైష్ ప్రజలారా! దైవ సాక్షిగా మీపై ఓపెద్ద ఆపద వచ్చిపడింది. దానికి మీ వద్ద ఎలాంటి విరుగుడూ లేదు. ముహమ్మద్ యువకుడుగా మీ నడుమ ఉన్నప్పుడు మీకందరికి ఇష్ట మైన, నమ్మకమైన వ్యక్తిగా ఉంటూ ఉండేవాడు. అందరికంటే సత్యసంధుడు, గొప్ప అమానతుదారుడుగా మీరు ఆయనను కొనియాడేవారు. ఇప్పుడు ఆయన వెంట్రుకలు తెల్లబడిపోతూ (అంటే ప్రౌఢ వయస్సుకు చేరుకుంటున్నప్పుడు) కొన్ని హితోక్తులు మీ ముందు వల్లిస్తూ ఉంటే మీరు ఆయనను ఇంద్రజాలికు డంటున్నారు. కాదు! దైవసాక్షిగా చెబుతున్నాను, ఆయన ఇంద్రజాలికుడు కానేకాడు. ఇంద్రజాలికులను మనం చాలా మందిని చూశాం. వారు చేసే మంత్రతంత్రాలు, తాళ్ళను ముడివేసి వాటిపై ఊదడం కూడా మనం చూసిందే. మీరేమో ఆయన్ను కాహిన్ అంటున్నారు. కాదు, దైవసాక్షిగా! ఆయన కాహిన్ కూడా కాదు. కాహిన్‌లు చేసే తికమకలు, వారి ఉచ్ఛారణ కూడా మనకు తెలుసు. అలాగే మీరు ఆయన్ను కవి అని అంటున్నారు. కాదు, దైవసాక్షి! ఆయన కవి ఎంతమాత్రం కాదు. మనకు కవనం గురించి బాగా తెలుసు. పద్యానికి సంబంధించిన రకాలన్నీ మనం బాగా ఎరుగుదుము. మీరు ఆయనను ఉన్మాది అని అంటున్నారు. కానే కాదు. ఆయన ఉన్మాది కూడా కాదు. ఉన్మాదికి సంబంధించిన ప్రవర్తన కూడా మనం బాగా ఎరుగుదుము, ఉన్మాదిలో ఉండవలసిన లక్షణాలుగాని, పిచ్చిపిచ్చి మాటలుగాని, చేతలుగాని ఆయనలో కనబడవు. ఖురైష్ ప్రజలారా! ఆలోచించండి. దైవసాక్షి! మీపై పెద్ద ఆపదే వచ్చిపడింది సుమా!"

ఆ తరువాత నజ్ర్ బిన్ హారిస్ 'హీరా' నగరానికి వెళ్ళాడు. అక్కడ రాజుల కథలు, రుస్తుమ్, ఇస్ఫందార్ల వీరోచిత గాథలు చెప్పడం నేర్చుకున్నాడు. తిరిగివచ్చి, దైవప్రవక్త(స) ఎక్కడైనా కూర్చుని అల్లాహ్ ఔన్నత్యం గురించి బోధిస్తూ, ఆయన పట్టుకు భయపడవలసిందని హితోపదేశం చేస్తూ కనబడితే, నజ్ర్ బిన్ హారిస్ కూడా అక్కడికి చేరి,"దైవసాక్షి! ముహమ్మద్(స) మాటలు వినకండి. ఆయన చెప్పేవి నేను చెప్పేదానికంటే గొప్పవి ఏమీకావు" అంటూ పర్షియా రాజులు, రుస్తుమ్, ఇస్ఫందార్ల గాథలను వినిపించడం మొదలుపెట్టే వాడు. ఆ తరువాత, "ముహమ్మద్ చెప్పింది నేను చెప్పినదానికంటే మేలైనదని ఎలా అనుకుంటున్నారు?" అని ప్రశ్నించేవాడు.[10]

ఇబ్నె అబ్బాస్ (ర) గారి ఉల్లేఖనం ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, నజ్ర్ కొందరు పాటకత్తెలైన బానిసరాండ్రను కొని తన దగ్గర ఉంచుకున్నాడు. దైవప్రవక్త(స) వైపునకు మొగ్గు చూపుతున్నట్లు కనబడినవారి వద్దకు ఒక్కో పాటకత్తెను పంపించేవాడు. ఆమె ఆ వ్యక్తికి బాగా తినిపించి, త్రాగించి పాటలు వినిపించేది. చివరికి ఆ వ్యక్తిని ప్రవక్త(స) వైపునకు మొగ్గకుండా చూసేది. ఈ సందర్భంగానే దివ్యగ్రంథంలో ఈ ఆయత్ అవతరించింది.[11]

وَمِنَ النَّاسِ مَن يَشْتَرِي لَهْوَ الْحَدِيثِ لِيُضِلَّ عَن سَبِيلِ اللَّهِ

"అల్లాహ్ మార్గం నుండి తప్పించడానికి కొందరు ఆటపాటలను కొంటూ ఉంటారు." (లుఖ్మాన్-6)

4. నాలుగవ రకం ఎత్తుగడ

నచ్చజెప్పే మార్గం (సామోపాయం). బహుదైవారాధకులు, ఇస్లామ్ మరియు అజ్ఞానం రెండూ, మధ్యలో ఎక్కడో ఒకచోట పరస్పరం కలుసుకునే టట్లు పన్నాగం పన్నడం అన్నమాట. అంటే ఇచ్చిపుచ్చుకునే మార్గం అవలం బించడం వలన బహుదైవారాధకులు వారి నమ్మకాలను కొన్నింటిని వదలి వేయడం; దైవప్రవక్త(స) బహుదైవారాధకుల కొన్ని ఆచారాలను అవలం బించడం అన్నమాట. దివ్యగ్రంథం దీని గురించే ఇలా సెలవిస్తోంది.

---

10. ఇబ్నె హష్షామ్-1/299,300,358; ముఖ్తసురుసీరహ్, షేక్ అబ్దుల్లా -117, 118.

11. ఫత్‌హుల్ ఖదీర్ లిల్ షూకానీ-4/236; మరికొన్ని సీరత్ గ్రంథాలు.

وَدُّوْا لَوْ تُدْهِنُ فَيُدْهِنُوْنَ ⑨

"మీరు కొంత వంగిపోతే వారు కూడా కొంత వంగిపోవాలని చూస్తు న్నారు."
(68 : 9)

ఇబ్నె జరీర్ మరియు తిబ్రానీల ఓ ఉల్లేఖనం ప్రకారం, బహుదైవారాధకులు దైవప్రవక్త ముహమ్మద్(స) ఎదుట, ఓ సంవత్సరం ఆయన వారి ఆరాధ్య దైవాలను పూజించాలని, మరో సంవత్సరం బహుదైవారాధకులు ప్రవక్త(స) గారి దైవం అల్లాహ్‌ను పూజిస్తారని ప్రతిపాదనను ఉంచారు, అబ్ద్ బిన్ హుమైద్ ఉల్లేఖనం ఒకటి ఇలా ఉంది: "బహుదైవారాధకులు (దైవప్రవక్త(స)తో), మీరు మా ఆరాధ్య దైవాలను స్వీకరిస్తే మేము కూడా మీ దైవాన్ని ఆరాధిస్తాము" అని పలికేవారు.[12]

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, దైవప్రవక్త(స) కాబా గృహ ప్రదక్షిణ చేస్తున్నారు. ఆ సమయంలో అస్వద్ బిన్ ముత్తలిబ్ బిన్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా, వలీద్ బిన్ ముగీరా, ఉమయ్యా బిన్ ఖల్ఫ్ మరియు ఆస్ బిన్ వాయిల్ సహ్మీలు కలసి దైవప్రవక్త(స) కి ఎదురుగా వచ్చారు. వీరంతా వారి జాతికి పెద్ద మనుషులు దైవప్రవక్త(స) తో , "ఓ ముహమ్మద్(స)! రండి, మీరు ఆరాధించే దైవాన్ని మేమూ ఆరాధిస్తాము. మేము ఆరాధించే దైవాలను మీరు కూడా పూజించాలి. ఇలా ఈ కార్యంలో మీరు మేము ఏకం అవుదాం. ఇప్పుడు మీ ఆరాధ్యుడు మా ఆరాధ్యదైవాలకంటే మెరుగైన వాడు అయితే ఆయన్నుండి మేము మా వాటాను పొందుతాం. ఒకవేళ మా దైవాలు మీ దైవం కంటే మెరుగైతే మీరు కూడా మీ వాటాను పొందవచ్చు." అని అధిక ప్రేలాపనలు చేశారు. దీనికి అల్లాహ్ పూర్తి అధ్యాయం 'ఖుల్‌యా అయ్యుహల్ కాఫిరూన్'ను అవతరింపజేశాడు. ఇందులో, మీరు పూజించే వాటిని నేనెన్నటికీ పూజించలేను అని ప్రకటించడం జరిగింది.[13] ఈ నిర్ణయాత్మకమైన సమాధానంతో వారి ఈ ఎత్తుగడ పూర్తిగా భగ్నం అయిపోయింది. ఉల్లేఖనాల్లో గల భేదానికిగల కారణం, ఈ ప్రయత్నం మాటిమాటికి జరిగి ఉండడం వల్లనే.

హింసాదౌర్జన్యాలు

దైవదౌత్యపు నాలుగవ సంవత్సరం ఇస్లామీయ సందేశప్రచారం

12.ఫత్‌హుల్ ఖదీర్-5/508. 13. ఇబ్నె హిషామ్.

బహిర్గతమై నలువైపుల మారుమ్రోగుతున్న తరుణంలో, బహుదైవారాధకులు దాన్ని అణచివేయడానికి చేబట్టిన ఎత్తుగడలు, కుతంత్రాలను గురించి పైన చెప్పడం జరిగింది. ఇవన్నీ సమయానుసారం కొనసాగుతూపోయాయి. వారాలు, నెలలు గడచిపోయినా అంతకుతప్ప అడుగు ముందుకు వేయలేదు. ఇంకా దౌర్జన్యాన్ని, ఒత్తిడిని ప్రారంభించలేదు. అయితే వారి ఈ ఎత్తుగడలేవీ ఇస్లామీయ ధర్మప్రచారానికి అడ్డుకట్టవేయడంలో విఫలమౌతూ ఉన్న కారణంగా అందరూ తిరిగి ఓ చోట సమావేశమయ్యారు. ఇరవైఅయిదు మంది ఖురైషీ సర్దారుల ఓ కమిటీ ఎన్నుకోబడింది. దీనికి అధ్యక్షుడు దైవప్రవక్త(స) పినతండ్రి అబూ లహబ్ . ఈ కమిటీ పరస్పర అవగాహనతో బాగా ఆలోచించి దైవ ప్రవక్త(స) మరియు ఆయన సహాబా(అనుచరగణం)కు వ్యతిరేకంగా ఓ తిరుగులేని తీర్మానాన్ని మంజూరు చేసింది. ఈ తీర్మానం ప్రకారం, ఇస్లామ్ ధర్మాన్ని వ్యతిరేకించడానికి ప్రవక్త ముహమ్మద్(స)ను బాధించడం, ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తూ ఉన్నవారిని రకరకాలుగా హింసించి వారిపై దౌర్జన్యం చేయడంలో ఎలాంటి లోటునూ రానివ్వకుండా చూడడం.[14]

బహుదైవారాధకులు ఈ తీర్మానాన్ని ఆమోదించి దాన్ని అమలు చేయడానికి గట్టి నిర్ణయం చేసుకున్నారు. ముస్లిములు, ముఖ్యంగా బలహీన ముస్లిముల విషయంలో ఈ పని చాలా తేలికైనది. అయితే దైవప్రవక్త(స) విషయంలో మాత్రం పెద్ద చిక్కులు వచ్చిపడతాయి. దైవప్రవక్త(స) వ్యక్తిగతంగా గౌరవనీయులు, మూర్తిమత్వంగలవారు. మిత్రులు, శత్రువులు సైతం ఆయన్ను గౌరవించేవారు. అలాంటి వ్యక్తికి ఎవరు ఎదురుబడ్డప్పటికి అతడు ఆయన్ను గౌరవ దృష్టితోనే పలుకరించేవాడు. ఓ పిచ్చివాడే లేదా నీచుడే ఆయన ఎడల నీచంగా ప్రవర్తించగలడు. ఈ వ్యక్తిగత ఔన్నత్యమే కాకుండా ఆయనకు అబూతాలిబ్ అండదండలు కూడా ఉన్నాయి. అబూ తాలిబ్‌కు వ్యక్తిగత మరియు సమాజంలో వున్న పలుకుబడి కారణంగా, ఏ ఒక్కడూ ఆయన మాటకు ఎదురుచెప్పడం లేదా ఆయన కుటుంబ విషయాల్లో తలదూర్చే ధైర్యం చేయలేకపోయేవాడు. ఇలాంటి పరిస్థితి ఖురైష్‌ను పెద్ద చిక్కుల్లో పడవేసింది. అయితే ఏ సందేశమైతే వారి ధార్మిక పెత్తనాన్ని, ప్రాపంచిక నాయకత్వాన్ని కూకటి వ్రేళ్ళతో పెకలించబోతోందో, ఆ సందేశప్రచారం ఎడల

14. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/59,60.

ఎలా ఉపేక్ష చూపడం అన్నది కూడా ఓ గొప్ప ప్రశ్నే. ఎట్టకేలకు బహుదైవారాధకులు అబూ లహబ్ నాయకత్వంలో దైవప్రవక్త(స) మరియు ముస్లిములపై హింసా దౌర్జన్యాల పరంపరను ప్రారంభించారు. నిజానికి, ఖురైషులు ఈ విధానాన్ని ఆలోచించక పూర్వం నుండే అబూ లహబ్ వైఖరి మాత్రం దైవప్రవక్త(స) గారి ఎడల అంత కఠినంగానే ఉంటూ వచ్చింది. అతను బనీ హాషిమ్ సమావేశమైనప్పుడు చేసిన నిర్వాకం, ఆ తరువాత సఫా కొండపై ప్రవర్తించిన తీరు గురించి మనం వెనుకటి పుటల్లో చదువుకున్నదే. కొన్ని ఉల్లేఖనాల్లో సఫా కొండపై అతను దైవప్రవక్త(స)ను కొట్టడానికి ఓ రాయిని కూడా చేతిలోకి తీసుకున్నట్లు ఉంది.[15]

దైవదౌత్యానికి పూర్వం అబూ లహబ్ ఇద్దరు కుమారులు 'ఉత్బా' మరియు 'తైబా'ల వివాహం దైవప్రవక్త(స)గారి ఇద్దరు కుమార్తెలు 'రుకయ్యా' మరియు 'ఉమ్మె కుల్సూమ్' తో జరిగి ఉంది. అయితే దైవదౌత్య పదవి లభించాక అతను ఎంతో కఠినంగా ప్రవర్తిస్తూ వారిద్దరికి తలాక్(విడాకులు) ఇప్పించాడు.[16]

అలాగే, దైవప్రవక్త(స) రెండవ కుమారుడు అబ్దుల్లాహ్ చనిపోయినప్పుడు అబూ లహబ్ ఎంతో సంబరపడిపోతూ తన మిత్రుల దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళి, "ముహమ్మద్ 'అబ్తర్' (వంశహీనుడు) అయిపోయాడని" శుభవార్తనందించాడు.[17]

హజ్ కాలంలో అబూ లహబ్ దైవప్రవక్త(స) సందేశాన్ని ఖండించడానికి ఆయన వెనుకాల సంతల్లో జరిగే సమావేశాల్లోనికి వెళ్ళేవాడు అన్న విషయం మనకు తెలిసిందే. తారిక్ బిన్ అబ్దుల్లాహ్ ముహారబీ ఉల్లేఖనం ద్వారా తెలిసేదేమిటంటే, ఇతను కేవలం ఆయన్ను ఖండించడం మట్టుకే సరిపెట్టుకునేవాడుకాదు, రాళ్ళు కూడా విసిరేవాడు, ఆ రాళ్ళు విసరడం వల్ల ఆయన మడిమలు రక్తసిక్తమైపోయేవి.[18]

అబూ లహబ్ భార్య 'ఉమ్మె జమీల్' ఆమెను 'ఉర్వా'గా కూడా పిలుస్తారు. ఈమె హరబ్ బిన్ ఉమయ్యా కుమార్తె మరియు అబూ సుఫ్యాన్

15. తిర్మిజి.
16. ఫీ జిలాలిల్ ఖుర్ఆన్-30/282; తఫ్హీముల్ ఖుర్ఆన్-6/522.
17. తఫ్హీముల్ ఖుర్ఆన్-6/490, 18. జామె తిర్మిజీ.

సోదరి కూడా. ఆమె కూడా దైవప్రవక్త(స)ఎడలగల శతృత్వంలో తన భర్తకు ఏమీ తీసిపోలేదు. దైవప్రవక్త(స) నడిచే బాటలో, గుమ్మం ముందు రాత్రిపూట చీకటిలో ముళ్ళను పరిచేది. దుర్భాషలాడేది. తన నాలుకకు కళ్ళెం లేకుండా ప్రవక్త(స) గురించి దుష్ప్రచారం చేసేది. ఆయన(స)ను తిట్టి శాపనార్థాలు పెట్టడం నిందలు, అపవాదులు వేయడం, ఆయన(స)కు వ్యతిరేకంగా విషాన్ని వెదజల్లడం, భయంకర యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం ఆమె పనిగా పెట్టుకుంది. అందుకని దివ్యఖుర్ఆన్ ఆమెను 'హమ్మాలతల్ హతబ్'(కట్టెలు మోసేది) అనే ఖితాబునిచ్చింది (కట్టెలు మోయడం అంటే జగడాలు సృష్టిం చడం అనేది అరబిక్ సామెత).

దివ్య ఖుర్ఆన్‌లో తన భర్త అభిశంసన అవతరించిందన్న విషయం తెలుసుకోగానే దైవప్రవక్త(స)ను వెదుకుతూ బయలుదేరింది. మహాప్రవక్త(స) దైవగృహమైన కాబా దగ్గర మస్జిదె హరామ్‌లో కూర్చుని ఉన్నారు. ఆయన ప్రక్కన అబూ బక్ర్(ర) కూడా ఉన్నారు. కంకర రాళ్ళు ఆమె పిడికిట ఉన్నాయి. ముందుకు రాగానే దైవప్రవక్త(స) ఒక్కరే అగుపడకుండా అల్లాహ్ ఆమె దృష్టిని పోగొట్టాడు. కేవలం ఒక్క అబూబక్ర్(ర) నే చూడగలిగింది. ఆయన ముందుకు రాగానే, 'అబూ బక్ర్! నీ మిత్రుడెక్కడా? నన్ను తూలనాడుతున్నాడని నాకు తెలిసింది. అతనే గనక నాకు కనబడితే అతని ముఖంపై ఈ కంకరరాళ్ళు విసరికొడ్తా, నేను కూడా పద్యాలు చెప్పగలను" అని చెబుతూ ఇలా కవిత్వం చెప్పనారంభించింది."మేము 'ముజమ్మమ్'[19]ను ధిక్కరించాము, అతని ఆదేశాన్ని ఉల్లఘించాము, అతని ధర్మాన్ని అసహ్యదృష్టితో చూశాము, దాన్ని వదిలిపెట్టాము."

ఇలా చెప్పిన తరువాత వెనక్కు మరలి వెళ్ళిపోయింది. అబూ బక్ర్ (ర) దైవప్రవక్త(స)తో, "ప్రవక్తా! ఆమె మిమ్మల్ని చూడలేదా" అని అడిగారు. "లేదు, ఆమె నన్ను చూడలేదు. అల్లాహ్ ఆమెను గ్రుడ్డిదానిగా చేశాడు"[20] అని సమాధాన మిచ్చారు.

అబూబక్ర్ బజాజ్ కూడా ఈ సంఘటనను ఉల్లేఖించడం జరిగింది. ఆ ఉల్లేఖనంలో అదనంగా ఈ పదాలు కూడా ఉన్నాయి.

19. బహుదైవారాధకులు అక్కసుగా 'ముహమ్మద్' అనే పదాన్ని 'ముజమ్మమ్' అని పలికేవారు. ముహమ్మద్‌కు వ్యతిరేక పదం అది. ముహమ్మద్ అంటే శ్లాఘనీయుడు అని, ముజమ్మమ్ అంటే నిందింపదగినవాడు అని అర్థం.
20. ఇబ్నె హష్షామ్-1/335, 336.

"ఆమె అబూ బక్ర్(ర) దగ్గర నిలబడి, అబూ బక్ర్! నీ సహచరుడు మా 'హజ్వ్' చేస్తున్నాడు (అంటే మమ్మల్ని కవనంలో తిడుతున్నాడు అని అర్థం) అని చెప్పగా, ఆయన దాన్ని ఖండిస్తూ, కాదు! ఈ కట్టడం యజమాని అయిన అల్లాహ్ సాక్షిగా! ఆయన కవిత్వం చెప్పడంగాని, దాన్ని వల్లించడంగాని ఎన్నడూ చేయలేదు అని అన్నారు. ఆమె దానికి నీవు నిజమే చెబుతున్నావు అని చెప్పి వెళ్ళిపోయింది."

అబూ లహబ్, దైవప్రవక్త(స)కు పొరుగువానిగా ఉంటూనే ఇలా ప్రవర్తిస్తూ ఉండేవాడు. అతని ఇల్లు ప్రవక్త(స) గారి ఇంటిని ఆనుకునే ఉండేది. అలాగే ఇతర పొరుగువారు కూడా ఆయన్ను ఆయన ఇంటిలో ఉన్నప్పుడు బాధలకు గురిచేస్తూ ఉండేవారు.

ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, దైవప్రవక్త(స)ను ఆయన ఇంటిలో బాధించేవారు అబూ లహబ్, హకమ్ బిన్ అబిల్ ఆస్ బిన్ ఉమయ్యా, ఉక్బా బిన్ అబీ ముఅయిత్, అద్దీ బిన్ హమ్రా సకఫీ, ఇబ్నుల్ అస్దా హుజ్లీలు. వీరంతా ఆయనకు పొరుగున ఉంటున్నవారే. వీరిలో హకమ్ బిన్ అబిల్ ఆస్[21] తప్ప ఎవ్వడూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు. వారి హింసల తీరు ఎలా ఉండే దంటే, ఆయన(స) నమాజు చేస్తున్నప్పుడు వారిలో ఎవడో ఒకడు మేక గర్భాశయాన్ని ఆయనపై పడేటట్లు విసరేసేవాడు. పొయ్యిపై పాత్రను ఎక్కించి వారు మేక గర్భాశయాన్ని అందులో పడేటట్లు చేసేవారు. అది వారి వంటకపు ఆచారం. దైవప్రవక్త(స) ఇక చేసేదిలేక ఓ గూడు కట్టుకొని అందు నిలబడి నమాజు చేస్తూ తనను తాను రక్షించుకునేవారు.

మొత్తానికి ఈ అశుద్ధాన్ని ఆయనపై విసరినప్పుడల్లా ఆయన దాన్ని ఓ కర్రకు తగిలించుకొని బయటకు తెచ్చి గుమ్మంలో నిలబడి, "ఓ అబ్దె మునాఫ్! ఇదేనా పొరుగువారు చేసే పని" అని అడిగి దాన్ని పారవేసేవారు.[22]

ఉక్బా బిన్ ముఅయిత్ అయితే హింసాదౌర్జన్యంలో మరీ పెచ్చు పెరిగి పోయాడు. సహీ బుఖారీ గ్రంథంలో అబ్దుల్లా బిన్ మస్ఊద్ ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త(స) బైతుల్లాహ్(కాబా గృహం) వద్ద నమాజు చేస్తున్నారు. అబూ జహల్, అతని కొందరు మిత్రులు అక్కడనే కూర్చుని ఉన్నారు. అంతలో

---

21. ఈయన ఉమవీ ఖలీఫా మర్వాన్ బిన్ హకం తండ్రి.
22. ఇబ్నె హిషామ్-1/416.

కొందరు మరికొందరిని సంబోధిస్తూ, "ముహమ్మద్ సజ్దా (సాష్టాంగం) చేసి నప్పుడు, ఫలానా తెగకు చెందిన ఒంటె పొట్టపేగుల్ని ఆయన వీపుపై పెట్టడానికి ఎవరు సిద్ధపడతారు" అని సవాలు విసిరారు. దీనికి ఆ జాతికి చెందిన దురదృష్ట వంతుడు- ఉక్బా బిన్ ముఅయిత్[23] ఆ ఒంటె పొట్ట పేగుల్ని ఎత్తుకు వచ్చి ప్రవక్త(స) సాష్టాంగపడేంత వరకు ఎదురు చూస్తూ నిలుచున్నాడు. ఆయన(స) సాష్టాంగపడగానే ఆ పొట్టప్రేగుల్ని ఆయన రెండు గూడల నడుమ పడవేశాడు. ఈ దృశ్యాన్ని చూస్తూ ఉన్న అబ్దుల్లా బిన్ మస్ఊద్, "నేను ఇదంతా చూస్తూనే ఉన్నాను కాని ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నాను, ప్రవక్తను రక్షించే బలం నాకుంటే ఎంత బాగుండు!" అని వాపోయారు.

ఆయన కథనం ప్రకారం, ఆ ఒంటె పొట్టప్రేగుల్ని దైవప్రవక్త(స) పై పడవేసి వారు పట్టలేని ఆనందంతో ఒకరిపై ఒకరు పడి నవ్వుకుంటున్నారు. దైవప్రవక్త(స) అలా సజ్దాలోనే ఉండిపోయారు. తలపైకి ఎత్తలేకపోయారు. చివరికి హజ్రత్ ఫాతిమా(ర) వచ్చి ఆ అశుద్ధ పదార్థాన్ని ఆయన(స) వీపుపై నుండి తీసి క్రింద పడవేయడం జరిగింది. అప్పుడుగాని దైవప్రవక్త(స) తలపైకి ఎత్తలేకపోయారు. ఆ తరువాత ఆమె(ర), "ఓ అల్లాహ్! ఖురైషను పట్టుకో (శిక్షించు)" అని మూడుమార్లు శపించారు. ఈ శాపం ఖురైష్‌కు రుచించలేదు. ఎందుకంటే వారి నమ్మకం ప్రకారం, ఈ ప్రదేశం ప్రార్థనలు స్వీకరించబడే ప్రదేశం గనక. ఆ తరువాత దైవప్రవక్త(స) ఒక్కొక్కరి పేరు చెబుతూ ఇలా శపించారు: "ఓ అల్లాహ్! అబూ జహల్ ను శిక్షించు. ఉత్బా బిన్ రబీయాను, షైబా బిన్ రబీయాను, వలీద్ బిన్ ఉత్బాను, ఉమయ్యా బిన్ ఖల్ఫ్‌ను మరియు ఉత్బా బిన్ అబీ ముఅయిత్‌ను శిక్షించు."

ఆయన(స) ఏడవ వ్యక్తి పేరు కూడా ఉచ్చరించారుగాని ఉల్లేఖనకర్తకు ఆ పేరు జ్ఞాపకం లేదు- ఇబ్నె మస్ఊద్ (రజిఅన్) తన ఉల్లేఖనంలో ఇలా చెబుతారు. "నా ప్రాణం ఏ దైవం అధీనంలోనైతే ఉందో ఆ దైవం సాక్షి! మహా ప్రవక్త(స) ఎవరెవరి పేర్లనైతే ఆనాడు ఉచ్చరిస్తూ శపించారో వారంతా బద్ర్ యుద్ధంలో బావిలో మృతులుగా పడి ఉండడం కనబడింది.[24]

---

23. సహీ బుఖారీకే చెందిన మరో ఉల్లేఖనంలో ఇది వివరంగా చెప్పడం జరిగింది. చూడండి, 1/543.
24. సహీ బుఖారీ; కితాబుల్ వుజూ-1/37).

'ఉమయ్యా బిన్ ఖల్ఫ్' దైవప్రవక్త(స)ను చూడగానే దుర్భాషలాడడం పనిగా పెట్టుకున్న వ్యక్తి. అతని గురించే దివ్యగ్రంథంలో ఈ ఆయత్ అవతరించింది. 'వైలుల్లికుల్లి హుమజతిల్ లుమజా' (ప్రజలను దెప్పిపొడవడంలో, పరోక్షంగా వారి లోపాలను ఎంచడంలో ఆసక్తి కనబరిచేవాడు సర్వనాశనమవుతాడు). ఇబ్నె హష్షామ్ కథనం ప్రకారం, హుమజా అనేవాడు బాహాటంగా దెప్పిపొడిచేవాడు, కన్నుగీటేవాడు అని; లుమజా అంటే పరోక్షంగా లోపా లను ప్రజల ముందుంచి వారిని అగౌరవంపాలు చేస్తూ బాధించేవాడని అర్థం.[25]

ఉమయ్యా సోదరుడు ఉబై బిన్ ఖల్ఫ్, ఉక్బా బిన్ అబీ ముఅయిత్‌లు ప్రాణస్నేహితులు. ఓసారి ఉక్బా, దైవప్రవక్త(స) దగ్గర కూర్చుని ఆయన చెప్పిన మాటల్ని విన్నాడు. ఈ విషయం ఉబైకి తెలిసింది. అతను ఉక్బాను గట్టిగా మందలించాడు. అదే కాకుండా వెళ్ళి దైవప్రవక్త(స) ముఖంపై ఉమ్మేసి రమ్మని పురమాయించాడు. చివరికి ఉక్బా, ఉబై చెప్పినట్లుగానే చేసివచ్చాడు. స్వయంగా ఉబై బిన్ ఖల్ఫ్ ఓసారి చీకిపోయిన ఎముకను తెచ్చి నుజ్జునుజ్జుగా చేసి దైవప్రవక్త(స) వైపు గాలిలో ఊదేశాడు.[26]

అక్నస్ బిన్ షురైఖ్ సఖఫీ అనేవాడు కూడా దైవప్రవక్త(స)ను హింసించే వారిలో ఒకడు. దివ్యఖుర్‌ఆన్‌లో అతని తొమ్మిది అవలక్షణాలు వివరించడం జరిగింది. దాని ద్వారా అతని ప్రవర్తన ఎలాగుండేదో అర్థమవుతుంది.

وَلَا تُطِعْ كُلَّ حَلَّافٍ مَّهِينٍ ۝١٠ هَمَّازٍ مَّشَّآءٍ بِنَمِيمٍ ۝١١ مَّنَّاعٍ لِّلْخَيْرِ
مُعْتَدٍ أَثِيمٍ ۝١٢ عُتُلٍّ بَعْدَ ذَٰلِكَ زَنِيمٍ ۝١٣

"చీటికీమాటికీ ఒట్టువేసే నీచుడికి ఎంతమాత్రం లొంగకు. వాడు ఎత్తిపొడుస్తూ ఉంటాడు, చాడీలు చెబుతూ తిరుగుతూ ఉంటాడు. మంచిని నిరోధిస్తూ ఉంటాడు. దౌర్జన్యం చేయడంలోనూ, అత్యాచారం చేయడంలోనూ హద్దులు మీరుతూ ఉంటాడు. పరమ పాతకుడు, మిక్కిలి క్రూరుడు. ఈ లోపా లన్నిటితోపాటు వాడు హీనజన్ముడు కూడాను ." (68 : 10-13)

అబూ జహల్ అప్పుడప్పుడు దైవప్రవక్త(స) వద్దకు వచ్చి దివ్యఖుర్‌ఆన్ వింటూ ఉండేవాడు. అయితే అది కేవలం వినడం మట్టుకే. విశ్వసించడంగాని, దాన్ని గౌరవించి భయపడడంగాని చేసేవాడు కాదు. అతను దైవప్రవక్త(స)ను

25. ఇబ్నె హష్షామ్-1/356, 357

26. ఇబ్నె హష్షామ్-1/361, 362.

తన సూటిపోటి మాటలతో బాధించేవాడు. దైవమార్గావలంబనను అడ్డుకునేవాడు. పైగా తన నిర్వాకానికి గర్వపడుతూ అక్కడి నుండి వెళ్ళిపోతూ తానేదో ఘనకార్యం చేసినవాడిలా ఫీలయ్యేవాడు. దివ్య ఖుర్‌ఆన్‌లో ఇతని ఈ ప్రవర్తనను వివరిస్తూ ఈ క్రింది వాక్యాలు అవతరించాయి. "ఫలాసద్దఖవలాసల్లా" (చివరి వరకు).[27]

అర్థం:- "కాని అతను సత్యాన్ని నమ్మలేదు, నమాజునూ చేయలేదు, అంతేకాదు తిరస్కరించి ముఖం తిప్పుకున్నాడు. ఆ తరువాత నిక్కుతూ, నీల్గుతూ తన ఇంటి వారి దగ్గరకు వెళ్ళిపోయాడు. ఈ వైఖరి నీకు మాత్రమే చెల్లుతుంది! నీకు మాత్రమే శోభిస్తుంది." (75 : 31 -35)

మొదటి రోజున దైవప్రవక్త(స)ను నమాజు చేస్తూ చూసి ఆ రోజు నుండే ఆయన్ను నమాజు చేయకుండా అడ్డుకోనారంభించిన వ్యక్తి అతను. ఓసారి మహాప్రవక్త(స) ముకామె ఇబ్రాహీం (కాబాగృహానికి ఆనుకొని ఉన్న ఓ స్థలం) వద్ద నిలబడి నమాజు చేస్తున్నారు. అతనది చూసి, "ముహమ్మద్(స)! నిన్ను నమాజు చేయొద్దని నేను వారించలేదా?" అని అడుగుతూ బెదిరించాడు. దానికి దైవప్రవక్త(స) కూడా అంతే బెదరింపుతో సమాధానం ఇచ్చారు. ఇది చూసి అతను, "ఓ ముహమ్మద్(స)! నన్ను బెదిరిస్తున్నావా? చూడు, ఈ మక్కా నగరంలో నా అనుయాయులు పెద్ద సంఖ్యలో ఉన్నారు సుమా" అని బడాయి ప్రకటించగా, అల్లాహ్ దానికి సమాధానంగా ఈ ఖుర్‌ఆన్ వాక్యాన్ని అవతరింపజేశాడు. "ఫల్ యద్‌వునాదియహ్" (చివరి వరకు).[28]

అర్థం:- "అలానా! అయితే నీవు నీ అనుయాయి బృందాన్ని పిలుచుకురా (మేమూ శిక్షించే దైవదూతల్ని పిలుస్తాం)."

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: దైవప్రవక్త(స) అతని మెడ దగ్గర చొక్కాను పట్టుకొని ఊపుతూ, "అవ్‌లా లక ఫఅవ్‌లా! సుమ్మ అవ్‌లాలక ఫఅవ్‌లా" అని అన్నారు.

అర్థం:- ఈ వైఖరి నీకు మాత్రమే చెల్లుతుంది! నీకు మాత్రమే శోభిస్తుంది.

దానికి ఆ దైవవిరోధి, "ఓ ముహమ్మద్(స)! నన్ను బెదిరిస్తున్నావా! దైవ

27. ఫీ జిలాలుల్ ఖుర్‌ఆన్-29/212.

28. ఫీజిలాలులల్ ఖుర్‌ఆన్-30/208.

సాక్షి!! నీ దేవుడూ, నీవూ కలసి నన్నేమీ చేయలేరు. నేను ఈ మక్కా నగరానికి ఇరువైపులా ఉన్న రెండు కొండల నడుమ నడిచే వారిలో అందరికంటే గౌరవ నీయుణ్ణి సుమా" అని విర్రవీగాడు.[29]

మొత్తానికి దైవప్రవక్త(స) ఇంత గద్దించినా అబూ జహల్ మాత్రం తన వైఖరిని వీడలేదు. మరింత చెలరేగిపోయాడు. సహీ ముస్లిమ్‌లో అబూ హురైరా (ర) ఉల్లేఖనం ఇలా ఉంది.

"ఓ రోజు అబూ జహల్ (ఖురైష్ సర్దారులను సంబోధిస్తూ), "ముహమ్మద్(స) మీ ముందే తన ముఖానికి మట్టిని పులుముకుంటున్నాడు కదా (అంటే సజ్దా చేస్తున్నాడని అర్థం. ఇది కక్షతో పలికిన పలుకులు)" అని అనగా వారు 'అవును' అని సమాధానమిచ్చారు. దానికి అతను, "లాత్, ఉజ్జా దేవుళ్ళ సాక్షి! నేను అతణ్ణి (ఈ పరిస్థితిలో) గనక చూస్తే, అతని మెడను కాళ్ళ క్రింద వేసి త్రొక్కేస్తాను, అతని ముఖాన్ని మట్టి పట్టేటట్టు నలిపేస్తాను" అని ప్రతిజ్ఞ చేశాడు. ఆ తరువాత అతను దైవప్రవక్త(స)ను నమాజు చేస్తూ ఉండగా చూసి ఆయన మెడను త్రొక్కేద్దామనే ధీమాతో ఆయన వైపునకు కదిలాడు. అయితే, వెంటనే అతను తిరుగుముఖం పట్టి వచ్చేయడం, తన రెండు చేతులతో దేనినుండో రక్షణ పొందడానికి ఊపుతున్నట్లుగా అక్కడున్నవారంతా గమనించారు. వారంతా అతణ్ణి ఉద్దేశించి, "ఓ అబుల్ హకం! నీకేమైంది?" అని అడిగారు. దానికి అతను సమాధానంగా "నాకూ, ఆయనకూ నడుమ ఓ అగ్ని గుండం అడ్డంగా ఉంది. అబ్బో అది ఎంతో భయాన్ని గొలుపుతోంది" అని చెప్పాడు. తరువాత దైవప్రవక్త(స) ఈ సంఘటనను వివరిస్తూ, "అతనే గనక నా దగ్గరకు వచ్చి ఉంటే దైవదూతలు అతని అవయవాలను ఒక్కొక్కటిగా మాయం చేసేవారే"అని సెలవిచ్చారు.[30]

దైవప్రవక్త(స)గారి ఎడల ప్రజల్లో ఉన్న మర్యాద, గౌరవం, అందరిలోకెల్లా ఆయన ప్రత్యేక వ్యక్తిత్వం, ఔన్నత్యం విషయంలో ఎంతమాత్రం సందేహం లేదు. అయినప్పటికి ఆయనపై ఈ హింసాదౌర్జన్యాలు, ఆగడాలు జరుగుతూనే ఉన్నాయి. మక్కాలో ఆయన అందరికంటే గౌరవనీయుడు. దానికితోడు అబూ తాలిబ్ ఆయనను రక్షణ కవచంగా కాపాడుతూనే ఉన్నా అంత కఠినంగా హింసించడం జరుగుతూనే ఉంది. ఇక సాధారణ ముస్లిములపై జరుగుతున్న ఆగడాలు సరేసరి. ముఖ్యంగా వారిలోని బలహీన వర్గాలకు చెందినవారిపై జరుపుతున్న అత్యాచారాలకు ఇక అడ్డేముంటుంది. అవి మరింత దారుణంగా, భయంకరంగా ఉండేవి. ప్రతి తెగ, ముస్లిములుగా మారిన తనవారిని రకరకాలుగా శిక్షించేది. ఇక తెగ, వంశం ఏదీ లేని అనామకులపై అక్కడి అల్లరిమూకల్ని ఉసిగొల్పి ఖురైషు సర్దారులు ఆనందించేవారు, ఆ ఆగడాలను విని ఎంత కఠిన హృదయుడైనా చలించిపోతాడు.

29. ఫీ జిలాలుల్ ఖుర్ఆన్-29/312.

30. సహీ ముస్లిమ్.

అబూ జహల్, ఎవరైనా ఘరానా వ్యక్తి మరియు పలుకుబడిగలవాడు ముస్లిముగా మారాడు అన్న వార్త వినగానే అతణ్ణి తిట్టిపోసేవాడు, అగౌరవ పరిచేవాడు. ఆస్తిపాస్తులు, డబ్బు హోదాలను మంటకలుపుతానని బెదిరించేవాడు. ఇక బలహీనుడెవరైనా ఇస్లామ్ ధర్మం స్వీకరించాడని తెలిస్తే అతణ్ణి చితకబాదేవాడు. ఇతరుల్ని బాదమని, హింసించమని పురిగొలిపేవాడు.[31] హజ్రత్ ఉస్మాన్ బిన్ అప్ఫాన్(ర) గారి పినతండ్రి ఆయన్ను ఖర్జూరపు ఆకుల చాపలో చుట్టి, క్రింది నుండి పొగ వేసేవాడు.[32]

హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ ముస్లిమ్ అయ్యాడని తెలియగానే ఆయన తల్లి ఆయనకు అన్నపానీయాలు పెట్టకుండా ఇంటి నుండి వెళ్ళగొట్టింది. ఈయన ఎంతో సుకుమారంగా పెరిగిన వ్యక్తి. వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఆయన దేహంపై చర్మం అంతా ఊడిపోయి కుబుసం విడిచిన పాములా తయారయ్యారు.[33]

హజ్రత్ బిలాల్(ర), ఉమయ్యా బిన్ ఖల్ఫ్ హుమ్‌జయీకి బానిస. ఉమయ్యా ఆయన మెడలో త్రాడువేసి పోకిరి పిల్లల చేతికి ఇచ్చేవాడు. వారు ఆయన్ను మక్కా కొండల్లో త్రిప్పేవారు. అలా త్రిప్పడం వలన త్రాడు గుర్తులు ఆయన మెడపై పడేవి. స్వయంగా ఉమయ్యా ఆయన్ను కట్టేసి కర్రలతో చితకబాదేవాడు. మధ్యాహ్నం మండుటెండలో బలవంతంగా కూర్చుండబెట్టేవాడు. అన్నపానీయాలు ఇవ్వకుండా పస్తులుంచేవాడు. అంతకంటే మించిన దౌర్జన్యం ఏమిటంటే, మధ్యాహ్నం ఎండ బాగా తీవ్రమైనప్పుడు మక్కాలోని రాళ్ళుదేలిన ప్రదేశంలో పడుకోబెట్టి ఆయన ఛాతీపై బరువైన బండరాయి పెట్టించి ఇలా

31. ఇబ్నె హష్షామ్-1/320.

32. రహ్మతుల్ లిల్ ఆలమీన్.

33. రహ్మతుల్ లిల్ ఆలమీన్ 58; తల్ఖీహ్ ఫహుమ్ అహలుల్ అసర్-60.

చెప్పేవాడు; "దైవసాక్షి! నీవిలానే పడి ఉంటావు. చివరికి నీ ప్రాణం పోతుంది. ముహమ్మద్(స)ను తిరస్కరించు, బ్రతికిపోతావు" అని. హజ్రత్ బిలాల్ (ర) ఆ పరిస్థితిలోనే 'అహద్' 'అహద్' (ఒక్కడే, ఒక్కడే) అని పలికేవారు. ఓ రోజు ఇలాంటి సంఘటనే జరుగుతూ ఉండగా అటు నుంచి హజ్రత్ అబూ బక్ర్(ర) వెళుతూ చూశారు. ఆయన బిలాల్(ర)ను ఓ నల్లని నీగ్రో బానిసకు బదులుగా కొనేశారు. మరో ఉల్లేఖనం ప్రకారం, రెండొందల దిర్‌హమ్‌లకు (735 గ్రాముల వెండి)లేదా 280 దిర్‌హమ్‌లు(ఒక కిలోకు పెచ్చువెండి) ఇచ్చి కొన్నట్లు ఉంది.[34]

హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (ర) బనూ మగ్జూమ్ తెగవారికి బానిస. ఆయన, ఆయన తల్లిదండ్రులు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే వారిపై ప్రళయమే విరుచుకుపడింది. అబూ జహల్ వీరిని హింసించడంలో ముందడుగుగా ఉండేవాడు. తీవ్రమైన ఎండలో ఈ బహుదైవారాధకులు వారిని రాళ్ళుదేలిన నేలపై పడుకోబెట్టి శిక్షించేవారు. ఓసారి వారిని ఈ విధంగా శిక్షించేటప్పుడు, దైవప్రవక్త(స) ఆ బాటన వెళ్ళడం తటస్థించింది. అది చూసి ఆయన, "ఓ యాసిర్ కుటుంబమా! సహనం వహించండి. మీ నివాస స్థలం స్వర్గమే" అంటూ ధైర్యం చెప్పారు. చివరికి యాసిర్(ర) ఆ బాధల్ని భరించలేక మరణించారు. ఇక అమ్మార్(ర) గారి మాతృమూర్తి హజ్రత్ సుమయ్యా మర్మాంగంలో అబూ జహల్ బరిశె దిగగొట్టి చంపేశాడు. ఈమె ఇస్లామ్ యొక్క మొట్టమొదటి 'మహిళా షహీద్' (అమరత్వం పొందిన స్త్రీ), హజ్రత్ అమ్మార్(ర)పై హింసా దౌర్జన్యాలు అలానే కొనసాగుతూపోయాయి. ఆయన్ను ఒక్కోసారి ఎండలో బాధిస్తే మరోసారి ఆయన వక్షస్థలంపై ఎర్రగా కాలిన బండరాయిని ఉంచడం జరిగేది. ఇంకొకసారి ఆయన్ను నీళ్ళల్లో ముంచి తీసేవారు. ఇలా చేస్తూ ఆ బహుదైవారాధకులు, "నీవు ముహమ్మద్‌ను తిట్టనంతవరకు లేదా మా ఆరాధ్య దైవాలైన లాత్, ఉజ్జాలను శ్లాఘించనంతవరకు నిన్ను విడిచి పెట్టేదేలేదని" బలవంతపెట్టేవారు. హజ్రత్ అమ్మార్(ర) మరో మార్గంలేక వారి మాటల్ని ఒప్పుకోవలసి వచ్చింది. ఆ తరువాత దైవప్రవక్త(స) సన్నిధికి రోదిస్తూ వచ్చి నా వల్ల తప్పు జరిగిందని విన్నవించుకున్నారు. దీనికి అల్లాహ్ ఈ దైవవాణిని

34. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/57; తల్ఖీహ్ ఫహూమ్-పుట. 61.

అవతరింపజేశాడు:

مَنْ كَفَرَ بِاللّٰهِ مِنْ بَعْدِ اِيْمَانِهٖۤ اِلَّا مَنْ اُكْرِهَ وَقَلْبُهٗ مُطْمَئِنٌّۢ بِالْاِيْمَانِ

"ఎవరైనా విశ్వసించిన తరువాత బలవంతం చేయడం వలన అవిశ్వాసిగా మారిన పక్షంలో, అప్పుడు అతని హృదయం విశ్వాసం పట్ల తృప్తితో ఉంటే (అది వేరే విషయం). కాని ఎవరైనా హృదయపూర్వకంగా అవిశ్వాసానికి పాల్పడితే అతనిపై అల్లాహ్ ఆగ్రహం పడుతుంది."[35] (16 : 106)

హజ్రత్ ఫకాహా, అసలు పేరు అఫ్లహ్. ఈయన బనీ అబ్దుద్దార్ బానిస. ఆయన యజమానులు ఆయన్ను కాళ్ళకు తాళ్ళుగట్టి నేలపై ఈడ్చేవారు.[36]

హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ ఖుజాఅ తెగకు చెందిన ఓ స్త్రీ ఉమ్మె అన్మార్‌కు బానిస. బహుదైవారాధకులు ఆయన్ను రకరకాలుగా హింసించేవారు. ఆయన తలవెంట్రుకల్ని పీకేవారు. గట్టిగా పట్టి మెడను మెలివేసేవారు. ఆయన్ను కణకణలాడే నిప్పురవ్వలపై పడుకోబెట్టి పైకి లేవకుండా బండరాళ్ళను ఉంచేవారు.[37]

జిన్నీరా,[38] నహ్దియా, ఆమె కుమార్తె ఉమ్మె అబీస్, వీరంతా స్త్రీ బానిసలు. వీరు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. బహుదైవారాధకులుపెట్టే బాధల న్నింటిని భరించారు. ఆ బాధలు, హింసలు ఎలాగుండేవో ఇదివరకు చెప్పుకున్నాం. బనీ అద్దీ తెగకు చెందిన ఓ కుటుంబం 'బనీ మూమిల్' కు సంబంధించిన ఓ స్త్రీ బానిస ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే, హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్-అద్దీ తెగకు చెందినవారు. ఇంకా ముస్లిము కానప్పటి మాట- తాను అలసిపోయే అంతవరకు బాదేవారు. ఆ తరువాత, "నేను నిన్ను దయదలిచి వదిలిపెట్టలేదు, అలసిపోయి వదిలిపెట్టాను" అని చెప్పేవారు.[39]

35. ఇబ్నె హష్షామ్-1/319,320; ఫిక్హుస్సీరత్ - ముహమ్మద్ గజాలి, పుట. 82.
36. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/57; ఏజాజుత్తన్‌జీల్, పుట. 53 ఆధారంగా.
37. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/57; తల్ఖీహ్ ఫహూమ్, పుట. 60.
38. మిస్కినాగా కూడా పిలిచేవారు.
39. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/57; ఇబ్నె హష్షామ్-1/319.

చివరికి హజ్రత్ అబూ బక్ర్(ర), హజ్రత్ బిలాల్(ర) మరియు ఆమిర్ బిన్ ఫహీరాను కొని స్వతంత్రులుగా చేసినట్లే ఈ స్త్రీ బానిసల్ని కూడా కొని స్వతంత్రులుగా చేసేశారు.[40]

బహుదైవారాధకులు పెట్టే హింసల్లో ఓ హింస ఏమిటంటే, కొందరు సహాబాలను (ప్రవక్త(స)గారి అనుచరులను) అప్పుడే వలచిన ఒంటె లేదా ఆవు చర్మాల్లో చుట్టి ఎండలో పడవేసేవారు. కొందరిని ఇనుప కవచాలను తొడిగి కాలే బండరాయిపై పరుండబెట్టేవారు.[41] నిజానికి అల్లాహ్ మార్గంలో హింసలు, దౌర్జన్యాలకు గురి అయ్యేవారి జాబితా సుదీర్ఘమైనదీ, బాధాకరమైనదీను. పరిస్థితి ఎలాగుండేదంటే, ఎవరైనా ముస్లిముగా మారాడని తెలియగానే బహుదైవారాధకులు అతని పాలిట రాక్షసులుగా మారిపోయేవారు.

దారె అర్ఖమ్ (అర్ఖమ్(ర) గారి గృహం)

ఈ హింసాదౌర్జన్యాల నుండి రక్షింపబడాలంటే, దైవప్రవక్త(స) ముస్లిములను మాటలచేత, చేతల రూపంగా, ఇస్లామ్ ధర్మం స్వీకరించారనే విషయం ఖురైష్‌కు తెలియకుండా ఉండేందుకు వారిని రహస్యంగా ఓ చోట చేరాలని ఆదేశించాల్సి ఉంటుంది. కారణం ఏమిటంటే, వారు బాహాటంగా ఓ చోట చేరితే బహుదైవారాధకులు ఆయన బోధించే బోధనలను, ఆత్మ ప్రక్షాళనను అడ్డుకునే ప్రమాదం ఉంది. ఫలితంగా ఉభయ వర్గాల్లో ఘర్షణ తలెత్తవచ్చు. ఇలాంటి పరిస్థితి దైవదౌత్యం వచ్చిన నాలుగవ సంవత్సరం కూడా ఎదురైంది. దాని వివరణ ఏమిటంటే, సహాబా(ర) కొండ లోయల్లో కూడి నమాజు చేసేవారు. దైవతిరస్కారులు కొంతమంది దీన్ని చూసి దుర్భాషలకు, దౌర్జన్యాలకు దిగారు. జవాబుగా హజ్రత్ సఅద్ బిన్ అబీవికాస్(ర) ఒక్కడిని రక్తం ప్రవహించేటట్లు కొట్టడం కూడా జరిగింది. ఇది ఇస్లామ్ చేత ప్రప్రథమంగా ప్రవహించిన రక్తం.[42]

ఒకవేళ ఇదే పరిస్థితి మాటిమాటికి తలెత్తి కొనసాగితే, ముస్లిములు అంతం అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ సందేశ ప్రచారం రహస్యంగానే

40 ఇబ్నె హష్షామ్ -1/318, 319.

41. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/58.

42. ఇబ్నె హష్షామ్-1/263; ముక్తతుస్సీరత్ - ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, పుట. 60.

జరగాలన్నది వివేకంతో కూడుకున్న పని. అందుకని, సహాబా(ర)లందరూ తమ శ్రేయం కోసం, తమ ఆరాధనలు, సందేశ ప్రచారం మరియు సామూహిక సమావేశాల కోసం రహస్యంగానే కలువవలసి ఉంటుంది. అయితే మహాప్రవక్త(స) మాత్రం తమ సందేశ ప్రచారాన్ని, దానికి తోడు తమ ఆరాధనలను బహుదైవారాధకుల ఎదుట బాహాటంగా చేస్తూ ఉండేవారు. ఏ విషయం కూడా ఆయన్ను ఈ పని నుండి అడ్డుకోలేకపోయింది. అయినా ఆయన(స) కూడా ముస్లిములతో వారి సంరక్షణ దృష్ట్యా రహస్యంగానే సమావేశమయ్యేవారు. ఇటు అర్కమ్ అబిల్ అర్ఖమ్ మగ్జూమీ గృహం, సఫా కొండపై విద్రోహుల దృష్టి పడకుండా వారి సమావేశాలకు దూరంగా ఉండేది. అందుకని దైవప్రవక్త(స) దైవదౌత్యం లభించిన అయిదవ సంవత్సరం ఆ ఇంటినే తన సందేశ ప్రచారానికి, ముస్లిములతో సమావేశమవడానికి కేంద్రంగా చేసుకున్నారు.[43]

అబీసీనియా వైపు మొదటి హిజ్రత్ (వలస)

హింసాదౌర్జన్యాల ఈ పరంపర దైవదౌత్యపు నాలుగవ సంవత్సరం మధ్య బాగంలో లేదా చివరి భాగంలో ఆరంభమైంది. ప్రారంభంలో ఇది మామూలుగా సాగింది. కాలం గడిచిన కొలదీ ఉధృతం కాసాగింది. చివరికి దైవదౌత్యపు అయిదవ సంవత్సర మధ్యభాగానికి చేరుకోగానే తారాస్థాయినందుకుంది. ఇలా ముస్లిములు మక్కాలో నిలువలేకపోయారు. బహుదైవారాధకుల ఆగడాల నుండి విముక్తి పొందేందుకు ఏదో ఒక మార్గాన్ని ఆలోచించడానికి వివశులైపోయారు. ఇలాంటి కఠినమైన అంధకార బంధురమైన పరిస్థితులలోనే కహఫ్ సూరా (అధ్యాయం) అవతరించింది. ఇది అసలు బహుదైవారాధకులు వేసిన ప్రశ్నలకు సమాధానం. కాని ఈ సూరాలో మూడు సంఘటనలు వివరించబడ్డాయి. వీటిలో అల్లాహ్ తరపు నుండి తన దాసుల భవిష్యత్తు గురించి సాంత్వన వచనాలు ఉన్నాయి. కాబట్టి అస్‌హాబె కహఫ్ (గుహవారు) సంఘటనలో, ధర్మానికి, విశ్వాసానికి ప్రమాదం ఏర్పడినప్పుడు దైవధిక్కార, దౌర్జన్య కేంద్రాల నుండి హిజ్రత్ (వలస) చేసి అల్లాహ్‌పై భారం వేస్తూ బయటకు వెళ్ళిపోవాలనే సంకేతం కూడా ఉంది.

43. ముక్తసరుస్సీరత్- ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, పుట. 61

وَ اِذِ اعْتَزَلْتُمُوْهُمْ وَمَا يَعْبُدُوْنَ اِلَّا اللّٰهَ فَاْوٗۤا اِلَى الْكَهْفِ يَنْشُرْ لَكُمْ رَبُّكُمْ مِّنْ رَّحْمَتِهٖ وَيُهَيِّئْ لَكُمْ مِّنْ اَمْرِكُمْ مِّرْفَقًا

"ఇప్పుడు మీరు వారితోను, అల్లాహ్‌నుకాదని వారు ఆరాధించే దేవుళ్ళ తోను సంబంధాలు త్రెంచుకున్నారు. కనుక, ఇక పదండి. ఫలానా గుహలో ప్రవేశించి ఆశ్రయం పొందండి. మీ ప్రభువు మీపై తన కారుణ్యఛాయను విస్తరింపజేస్తాడు, మీ కార్యసిద్ధికై సకల సామగ్రిని సమకూరుస్తాడు." (18: 16)

హజ్రత్ మూసా మరియు ఖిజర్ (అలైహిముస్సలాం)ల గురించి వివరిస్తూ, ఫలితాలు ఎల్లప్పుడూ బాహ్యపరిస్థితులకు అనుకూలంగా ఉండవు అని, అప్పుడప్పుడూ బాహ్యపరిస్థితులకు భిన్నంగా ఉంటాయని చెప్పడం జరిగింది. కాబట్టి ఈ సంఘటనలో, ముస్లిములకు వ్యతిరేకంగా ఏ హింసా దౌర్జన్యాలు జరుగుతున్నాయో వాటి ఫలితాలు కూడా పూర్తిగా భిన్నంగానే బయటబడతాయని, ఈ విద్రోహులు, దైవధిక్కారులు ఇప్పుడు విశ్వసించకపోతే మునుముందు వారే దాసోహం అంటూ ముస్లిముల ఎదుట తల ఒగ్గి వారి అదృష్టం తీర్పుకు ప్రాధేయపడతారు అని భవిష్యవాణి చెప్పడం జరిగింది.

జుల్‌ఖర్‌నైన్ గురించి అవతరించిన వాక్యాల్లో కొన్ని ప్రత్యేక విషయాల వైపునకు దృష్టిని మరల్చడం జరిగింది.

1. ఈ భూమండలం అల్లాహ్‌దే. ఆయన తన దాసుల్లో తాను కోరిన వ్యక్తిని దాని వారసునిగా చేస్తాడు.
2. ఈ సాఫల్యం, విజయం విశ్వాసమార్గంపై నడవడం వల్లనే సిద్ధిస్తుంది. దైవధిక్కార ధోరణి వల్ల కాదు.
3. అల్లాహ్ అప్పుడప్పుడు ఆయా కాలాలకు చెందిన యాజూజ్ మాజూజ్‌ల నుండి రక్షించడానికి తన దాసుల నుండి కొందరిని ఎంపిక చేసి నిలబెడతాడు.
4. అల్లాహ్‌కు భయపడే సద్వర్తనులే భూమండల వారసత్వానికి ఎక్కువ హక్కుదారులు.

కహఫ్ సూరా తరువాత జుమర్ సూరా అవతరణ ఆరంభమైంది. అందు హిజ్రత్ (వలస) వైపునకు సంకేతం ఉంది. అందులో అల్లాహ్ సృష్టించిన ఈ

లోకం ఇరుకైనది ఎంతమాత్రం కాదని చెప్పడం జరిగింది.

لِلَّذِيْنَ اَحْسَنُوْا فِيْ هٰذِهِ الدُّنْيَا حَسَنَةٌ ۗ وَ اَرْضُ اللّٰهِ وَاسِعَةٌ ۗ اِنَّمَا يُوَفَّى الصّٰبِرُوْنَ اَجْرَهُمْ بِغَيْرِ حِسَابٍ ⑩

"(ఓ ప్రవక్తా!) ఇలా చెప్పు, విశ్వసించిన నా దాసులారా! మీ ప్రభువునకు భయపడండి. ఈ లోకంలో సద్వర్తనను అవలంబించే వారికి మేలు జరుగుతుంది. దేవుని భూమి విశాలమైనటువంటిది. ఓర్పు వహించే వారికి లెక్కలేనంత ప్రతిఫలం ఇవ్వబడుతుంది." (39 : 10)

'అస్మహ్' నజాషీ అబీసీనియాకు చెందిన న్యాయవంతుడైన పరిపాలకుడనే విషయం దైవప్రవక్త(స)కు తెలుసు. అక్కడ ఎవ్వరిపైనా దౌర్జన్యం జరగదు. అందుకని ఆయన(స), ఉపద్రవాల నుండి తమ ధర్మాన్ని రక్షించుకునేందుకు అబీసీనియాకు వలస పోవాలని ముస్లిములకు ఆదేశమిచ్చారు. ఆ తరువాత అనుకున్న విధంగా రజబ్ నెల, దైవదౌత్య శకం అయిదవ సంవత్సరం సహాబా(ర)కు చెందిన మొదటి జట్టు అబీసీనియా వైపునకు బయలుదేరింది. ఈ జట్టులో పన్నెండుగురు మగవారు, నలుగురు స్త్రీలు ఉన్నారు. హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (ర) దానికి నాయకులు. ఆయన వెంట దైవప్రవక్త(స)గారి కుమార్తె హజ్రత్ రుఖయ్యా(ర) కూడా ఉన్నారు. దైవప్రవక్త(స) ఆమె గురించి చెబుతూ, "హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) మరియు లూత్(అ.స.) తరువాత అల్లాహ్ మార్గంలో హిజ్రత్ చేసిన ప్రథమ కుటుంబం అది" అని సెలవిచ్చారు.[44]

ఈ జట్టు రాత్రి అంధకారంలో తమ క్రొత్త గమ్యానికి బయలుదేరింది. గోప్యంగా ఉండవలసిన విషయం గనక ప్రయాణం గురించి ఖురైష్‌కు తెలియకూడదనే జాగ్రత్త తీసుకోబడింది. ఎర్ర సముద్రం ఓడరేవు 'షుఅయిబా' వైపునకు పయనమైందీ జట్టు. అదృష్టవశాత్తు అక్కడ రెండు పడవలు ఉన్నాయి. అవి ఈ జట్టును ఎక్కించుకొని సముద్రానికి ఆవలి ఒడ్డున ఉన్న అబీసీనియా వైపునకు వెళ్ళిపోయాయి. ఖురైష్‌కు ఈ విషయం చూచాయగా తెలిసింది. వారు

44. ముఖ్తరుస్సీరత్- షేక్ అబ్దుల్లా, పుట. 92, 93; జాదుల్ ముఆద్-1/24, రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/61.

దాన్ని వెంటాడి తీరం వరకు వెళ్ళగలిగారు కాని అప్పటికి సహాబా వెళ్ళిపోవడం వలన వెనక్కు తిరిగివచ్చేశారు. అటు ముస్లిములు అబీసీనియా చేరి ఊపిరి పీల్చుకున్నారు.[45] కాని రమజాన్ నెలలో ఓ సంఘటన జరిగింది. దైవప్రవక్త(స) ఓసారి కాబా మసీదుకు వెళ్ళారు. అక్కడ ఖురైష్‌ల గుంపు ఒకటి సమావేశమై ఉంది. వారిలో పెద్ద పెద్ద సర్దారులు కూడా ఉన్నారు. దైవప్రవక్త(స) హఠాత్తుగా నిలబడి నజ్మ్ సూరా పఠనాన్ని ప్రారంభించారు. ఆ దైవధిక్కారులు ఇది వరకు ఖుర్‌ఆన్ పఠనం వినలేదు. వారి వైఖరే అది. దివ్యఖుర్‌ఆన్‌లో వారి ఈ వైఖరి గురించి ఇలా చెప్పడం జరిగింది. ఈ సత్యతిరస్కారులు ఇలా అంటారు;

لَا تَسْمَعُوْا لِهٰذَا الْقُرْاٰنِ وَالْغَوْا فِيْهِ لَعَلَّكُمْ تَغْلِبُوْنَ ﴿٢٦﴾

"ఈ ఖుర్‌ఆన్‌ను అసలు వినకండి. అది వినిపించబడేటప్పుడు వినకుండా విఘ్నం కలిగించండి. బహుశా ఇలాగైనా మీరు ప్రాబల్యం వహించవచ్చు."

అయితే దైవప్రవక్త(స) హఠాత్తుగా నజ్మ్ సూరా పఠనాన్ని ప్రారంభించినప్పుడు, వారి చెవుల్లో అమృతం గ్రోలినట్లు తోచింది. దాని ఔన్నత్యాన్ని అనుభవించినప్పుడూ ఎవ్వరికీ తమ ధ్యాసే లేదు. ఎవరి మనస్సులోను ఎటువంటి చెడు ఉద్దేశ్యం జనించలేదు. చివరికి దైవప్రవక్త(స) సూరా చివరన హృదయాలను ప్రకంపించే ఆయత్‌ను పఠిస్తూ, فَاسْجُدُوْا لِلّٰهِ وَاعْبُدُوْا ﴿٦٢﴾ **"అల్లాహ్ ముందు మోకరిల్లండి (సజ్దా చేయండి). ఆయనకు దాస్యం చేయండి"** అనే దైవాదేశాన్ని వినిపిస్తూ సజ్దా చేయగా ఏ ఒక్కడూ తన ఆధీనంలోలేక 'సజ్దా' చేశారు(సాష్టాంగబడ్డారు). నిజం చెప్పాలంటే, ఈ పరిస్థితి, గర్విష్టులైన ఖురైషుల మొండితనాన్ని పటా పంచలు చేసేసింది. వారు తమ ఆధీనంలో లేక అందరూ సజ్దాలో పడి పోయారు.[46]

కాని ఆ తరువాత దైవగ్రంథ పఠనం ఔన్నత్యం వారి గర్వం అణచివేసిందని, దేన్నయితే అంతమొందించడానికి వారు కంకణబద్ధులై ఉన్నారో దాని కోసం ఎలాంటి ప్రయత్నాలు చేశారో అదంతా బూడిదలో పోసిన పన్నీరు చందాన వృధా అయిందని తెలియగానే నాలుక కరుచుకున్నారు. ఈ సంఘ

45. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/61.

46. సహీ బుఖారీలో ఈ సజ్దా సంఘటనను ఇబ్నె మస్ఊద్, ఇబ్నె అబ్బాస్ (ర) ఉల్లేఖించారు.

టన జరిగాక అన్నివైపుల నుండి వారిపై నిందల పరంపర వచ్చిపడ నారంభించింది. దీని నుండి తప్పుకోవడానికి సాకులు వెదుకనారంభించారు. చేసేదిలేక దైవప్రవక్త(స)పై అపనింద మోపుతూ, ఆయన వారి విగ్రహాలను గౌరవిస్తూ, "వీరు మహోన్నతమైన దేవతలు, వీరు మనకు సిఫార్సు చేస్తారు"అని చెప్పారని బొంకారు.

ఇది పూర్తిగా అసత్య ప్రచారం. దీన్ని వారు అవలంబించింది, దైవప్రవక్త(స) సజ్దా చేసినప్పుడు తాము కూడా సజ్దా చేశామన్న నిజాన్ని కప్పిపుచ్చుకోవడానికే. దైవప్రవక్త(స) గురించి సతతం అసత్యప్రచారం చేసే వీరు, తమను రక్షించుకోవడానికి ఇలాంటి అసత్య మాటల్ని చెప్పడానికి వెనకాడగలరా?[47]

మొత్తానికి బహుదైవారాధకులు సజ్దా చేసిన ఈ సంఘటన వార్త అబీసీనియాకు కూడా చేరింది. వలస వెళ్ళిన ముహాజిర్లు కూడా ఇది విన్నారు. అయితే వీరు విన్నది అసలు యదార్థానికి భిన్నమైన విషయం. అంటే, ఖురైష్‌లంతా ముస్లిములైపోయారు అన్నదే ఆ విషయం. అందుకని వారు షవ్వాల్ నెలలో మక్కాకు బయలుదేరారు. మక్కా నగరం ఇక ఒక రోజు ప్రయాణ దూరంలో ఉందనగా అసలు విషయం వారికి తెలిసిపోయింది. ఆ తరువాత కొందరు అటునుంచే తిరిగి అబీసీనియాకు వెళ్ళిపోయారు. కొందరు రహస్యంగా లేదా ఖురైష్‌కు చెందిన ఎవరో ఒకరి రక్షణలో మక్కా నగరంలో ప్రవేశించారు.[48]

అబీసీనియాకు రెండో హిజ్రత్

ఆ తరువాత వలస నుండి తిరిగివచ్చిన ముహాజిర్లపై ప్రత్యేకంగాను, ఇతర ముస్లిములపై సాధారణంగాను హింసాదౌర్జన్యాలు బాగా పెరిగిపోయాయి. వారి కుటుంబ సభ్యులు వారిని మరీ ఆగడాలకు గురి చేశారు. 'నజాషీ' (అబీసీనియా చక్రవర్తి) వారి ఎడల అవలంబించిన ఉదార వైఖరి వారిని మరింత రెచ్చగొట్టింది. విధిలేక దైవప్రవక్త(స) తన అనుచరుల్ని (సహాబాలను) తిరిగి హిజ్రత్ చేయమని సలహా ఇచ్చారు. అయితే, రెండవసారి చేసిన హిజ్రత్, మొదటి హిజ్రత్ కంటే అనేక కష్టాలను కొనివచ్చింది. ఈసారి ఖురైష్ వారి ప్రయత్నాన్ని వమ్ముచేయడానికే సంసిద్ధులై ఉన్నారు గనుక ఎంతో

47. పరిశోధకులు ఈ ఉల్లేఖనాన్ని బాగా అధ్యయనం చేసి ఈ నిర్ణయానికే వచ్చారు.

48. జాదుల్ ముఆద్-1/24; 2/44; ఇబ్నె హష్షామ్-1/61.

జాగరూకతతో మెలగవలసిన పరిస్థితి ఏర్పడింది. కాని ముస్లిములు ఖురైష్ కంటే చురుకుగా ప్రవర్తించారు. అల్లాహ్ వారి ఈ ప్రయాణాన్ని సులభతరమూ చేశాడు. వారు ఖురైష్‌కు పట్టుబడకముందే అబీసీనియా రాజు వద్దకు చేరుకోగలిగారు.

ఈసారి వారి సంఖ్య మొత్తం 82 లేదా 83 మంది పురుషులు (అమ్మార్ గారి హిజ్రత్ దీనికి భిన్నమైనది), 18 లేక 19 మంది స్త్రీలు [49] అల్లామా మన్సూర్ పూరి అయితే స్త్రీలు ఖచ్చితంగా పద్దెనిమిది మందే అని అంటారు.[50]

అబీసీనియా ముహాజిర్లకు వ్యతిరేకంగా ఖురైష్ కుట్ర

ముస్లిములు తమ విశ్వాసాన్ని, ప్రాణాలను కాపాడుకుంటూ ఓ ప్రశాంత ప్రదేశానికి పారిపోయారన్న అక్కసు ఖురైష్‌ను వెంటాడుతూనే ఉంది. వారు, వారిలో గొప్ప తెలివిగల ఇద్దరు వ్యక్తులు, అమ్రూ బిన్ ఆస్ మరియు అబ్దుల్లా బిన్ రబీలను (అప్పటికి వారింకా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు) ఎంపిక చేసి, నజాషీ మరియు క్రైస్తవ పాదరీల నాయకులకు సమర్పించుకోవడానికిగాను కానుకలిచ్చి తమ దూతలుగా పంపించడం జరిగింది. వీరిద్దరూ అబీసీనియాకు వెళ్ళి మొదట క్రైస్తవ పాదరీల నాయకులకు కానుకలిచ్చి ముస్లిములను అబీసీనియా నుండి వెళ్ళగొట్టడానికి తగు కారణాలను చూపెడుతూ మచ్చిక చేసుకున్నారు. క్రైస్తవ పాదరీ నాయకులు, నజాషీకి నచ్చజెప్పి ముస్లిములను వెనక్కు పంపిస్తామనే మాట ఇచ్చిన తరువాత ఈ ఇద్దరు దౌత్యప్రతినిధులు నజాషీ దర్బారుకు హాజరయ్యారు. అతనికి కానుకలను సమర్పిస్తూ తమ మనోగతాన్ని ఇలా బయటబెట్టారు.

"ఓ రాజా! మీ దేశంలోనికి మాకు చెందిన కొందరు అవివేకులైన యువకులు పారిపోయివచ్చారు. వారు వారి జాతిధర్మాన్ని విడిచిపెట్టేశారు. అయితే ఇటు మీ ధర్మాన్నీ విశ్వసించలేదు, సరికదా. ఓ క్రొత్త ధర్మాన్ని సృష్టించారు. ఆ ధర్మాన్ని మీరుగాని, మేముగాని ఎరుగము. వారి తల్లిదండ్రులు, పినతండ్రులు, కుటుంబ సభ్యులు మమ్మల్ని మీ వద్దకు పంపించారు. ఎందుకంటే, వారి బాగోగుల గురించి వారే బాగా ఎరిగిన వారు గనుక. కాబట్టి ఈ యువకుల్ని మా వెంట మా దేశానికి పంపించమని మనవి చేస్తున్నాం" అని ప్రాధేయపడ్డారు.

49. *జాదుల్ ముఆద్-1/24; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/61.*
50. *జాదుల్ ముఆద్-1/24; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/61.*

వారిద్దరు కలసి వారి మనోగతాన్ని బయటబెట్టిన తరువాత క్రైస్తవ మత గురువులు అందుకొని, "మహారాజా! వీరిద్దరు చెప్పిందే సబబు. తమరు ఆ యువకుల్ని వారికి అప్పగించండి. వీరు వారిని వారి జాతికి అప్పజెబుతారు" అని వంతపాడారు.

అయితే నజాషీ, ఈ విషయాన్ని బాగా ఆకళింపుజేసుకోవడానికి, అసలు విషయాన్ని తెలుసుకోవడానికిగాను మరింత లోతులోనికి వెళ్ళడం అవసరం అనుకొని ఆ ముస్లిమ్ యువకుల్ని హాజరుకమ్మని ఆదేశించాడు. ముస్లిములు ఫలితం ఎలాగున్నా సరే, తాము పూర్తి యదార్థమైన విషయాన్నే తెలపాలన్న సంకల్పంతో రాజు సన్నిధికి హాజరయ్యారు. ముస్లిములు దర్బారులోనికి వచ్చి నిలబడిన తరువాత నజాషీ వారిని ఉద్దేశించి;

"మీరు మీ జాతి నుండి వేరుబడడానికి ఆధారభూతమైన ఆ క్రొత్త ధర్మం ఏమిటి? నేను విశ్వసించే ధర్మాన్ని కూడా మీరు అవలంబించలేదు. మరే మతాల్లో దేన్నయినా విశ్వసించడం లేదు. దానికి కారణం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

ముస్లిముల వైపు నుండి హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ ముందుకొచ్చి, "ఓ రాజా! అజ్ఞానంలో కొట్టుమిట్టాడే జాతి మాది. ఇదివరకు మేము విగ్రహాల్ని పూజించేవారం. చనిపోయిన జంతువుల మాంసాన్ని భుజించేవారము. వ్యభిచారానికి పాల్పడేవారం. బంధువులతో సంబంధాల్ని త్రెంచుకునేవారం. పొరుగువారి ఎడల దురుసుగా ప్రవర్తించేవారం. మాలోని శక్తివంతుడు బల హీనుణ్ణి అణచివేసేవాడు. మేము ఈ పరిస్థితిలో ఉండగా అల్లాహ్ మా జాతి నుండే ఓ ప్రవక్తను పంపాడు. ఆయన వంశం ఉన్నతమైనది. ఆయన సత్యసంధత, అమానతులను రక్షించడం, పవిత్రతను మేము మొదటి నుండే ఎరిగి ఉన్నవాళ్ళం. ఆయన మమ్మల్ని అల్లాహ్ మార్గం వైపునకు పిలిచాడు. మేము ఒకే దేవుణ్ణి విశ్వసించాలనీ, ఆయన్నే ఆరాధించాలనీ, ఆయన తప్ప ఏ రాయిరప్పలను విగ్రహాలను మేమూ, మా తాతముత్తాతలు పూజిస్తూ వచ్చామో వాటిని విసర్జించాలని బోధించారు. సతతం సత్యం పలకడం, అమానతులను (అప్పగింతలను) అప్పజెప్పడం, సంబంధాలను పెంపొందించుకోవడం, పొరుగువారితో సద్వర్తనగా మెలగడాన్ని ప్రేరేపిస్తూ, వ్యభిచారం, రక్తపాతాన్ని వదిలేయమని ఆదేశించారు. దుష్కార్యాల్లో చిక్కుకోవడం, అసత్యం పలకడం,

అనాథల ఆస్తుల్ని కాజేయడం మరియు శీలవతులైన మహిళలపై అపనిందలు వేయడం లాంటి కార్యాల నుండి మమ్మల్ని వారించారు. ఆయన మమ్మల్ని ఒకే అల్లాహ్‌ను ఆరాధించమనీ, ఆయనకు సాటి కల్పించవద్దనీ, ఆదేశించారు. నమాజు చేయమనీ, రోజా వ్రతాన్ని పాటించమనీ, జకాత్ చెల్లించమనీ ఆజ్ఞాపించారు."

హజ్రత్ జాఫర్ (ర) అలానే ఇస్లామ్ సుగుణాలను ఏకరువు పెడుతూ, "మేము ఆ ప్రవక్తను సత్యప్రవక్తగా నమ్మాము, ఆయన్ను విశ్వసించాము. ఆయన తెచ్చిన దైవధర్మం ప్రకారం నడుచుకుంటున్నాము. ఏయే విషయాలను ప్రవక్త(స) హరాం(నిషిద్ధం) చేశారో వాటిని హరాంగానూ, మరే వస్తువుల్ని హలాల్(ధర్మసమ్మతం) చేశారో వాటిని మేము ధర్మసమ్మతమైనవిగానూ తలచాము. దీనికి మా జాతి మా ఎడల ఉగ్రరూపం దాల్చింది. అది మాపై దౌర్జన్యాలు చేసి హింసించింది. మమ్మల్ని మా ధర్మం నుండి తప్పించడానికి పన్నాగాలు పన్నింది, మమ్మల్ని శిక్షించింది. మా జాతి మమ్మల్ని అల్లాహ్ ఆరాధన చేయకుండా తిరిగి విగ్రహారాధన వైపు మరిలేందుకు; ఏ అశుద్ధ పదార్థాలను వారు ధర్మసమ్మతం చేసుకున్నారో తిరిగి మేము వాటిని ధర్మసమ్మతమైనవిగా భావించాలని ఒత్తిడి తెచ్చింది. వీరిలా మాపై చేస్తున్న ఆగడాలను, హింసాదౌర్జన్యాలను అధికం చేసిన తరువాత, మాకు నిలువనీడ లేకుండా చేసినప్పుడు, మా నడుమ, మా ధర్మం నడుమ అడ్డంగా వచ్చి నిలబడినప్పుడు మేము తమ దేశానికి వలస రావలసివచ్చింది. ఇతరులకంటే మిమ్మల్నే నమ్మి మీ రక్షణలో ఉండడానికి సంసిద్ధులమై వచ్చాము. ఓ రాజా! మీ వద్ద ఉన్నంత వరకు మాపై ఎలాంటి జులుం జరగదని మేమాశిస్తున్నాం" అని విన్నవించుకున్నారు. దానికి నజాషి,"మీ ప్రవక్త తెచ్చిన ధర్మంలోనిది ఏదైనా మీ దగ్గర ఉందా?" అని ప్రశ్నించాడు. అప్పుడు హజ్రత్ జాఫర్(ర), "ఉంది!" అని బదులు పలికారు.

నజాషి, "అదేమిటో చదివి వినిపించు" అని ఆదేశించగా, హజ్రత్ జాఫర్(ర), మరియమ్ సూరాలోని మొదటి ఆయత్‌లను పఠించి వినిపించారు. ఈ పఠనాన్ని వినగానే నజాషీ, క్రైస్తవ మతగురువులు బాగా రోదించారు. కన్నీటితో వారి గెడ్డాలు తడిసిపోయాయి.

ఆ తరువాత నజాషీ, "ఈ గ్రంథం మరియు ఈసా(అ.స.) (ఏసుక్రీస్తు)

తెచ్చిన గ్రంథం ఒకే దివ్వె నుండి వెలిసిన వెలుగులు" అంటూ అమ్రూ బిన్ ఆస్ మరియు అబ్దుల్లా బిన్ రబీయాను ఉద్దేశించి,"మీరిద్దరు ఇక్కడి నుండి వెళ్ళిపోండి. నేను వీరిని మీకు అప్పగించేది లేదు. వీరికి వ్యతిరేకంగా ఏ ఎత్తుగడా ఇక్కడ పనికిరాదు" అని చెప్పాడు.

ఈ రాజాదేశం వెలువడ్డాక వారిరువురు దర్బారు నుండి బయటకు వచ్చారు. అయితే అమ్రూ బిన్ ఆస్, మాత్రం అబ్దుల్లా బిన్ రబీనుద్దేశించి, "దైవసాక్షి! రేపు చూద్దువుగాని. వారి గురించి నేనే ఎత్తుగడ పన్నుతానో! వారు కూకటివ్రేళ్ళతో పెకిలించబడతారు" అని అన్నాడు. దానికి అబ్దుల్లా బిన్ రబీయా, " పోనిద్దువూ! వారు మాకు వ్యతిరేకంగా చెప్పినప్పటికీ మన కుటుంబానికి, తెగకు చెందినవారే కదా" అని నచ్చజెప్ప ప్రయత్నం చేశాడు. కాని అమ్రూ బిన్ ఆస్ మాత్రం ఆయన మాటల్ని పట్టించుకోలేదు.

మరుసటి రోజు అమ్రూ బిన్ ఆస్, నజాషీ దర్బారుకు వెళ్ళి,"ఓ రాజా! వీరు మరియమ్ కుమారుడు హజ్రత్ ఈసా(అ.స.)(ఏసు) పై ఓ తీవ్రమైన నిందను వేస్తున్నారు" అని చెప్పాడు. దీనికి నజాషీ తిరిగి ముస్లిములను దర్బారుకు రప్పించాడు. ముస్లిములు హజ్రత్ ఈసా(అ.స.) గురించి చేస్తున్న ఆ తీవ్రమైన వ్యాఖ్యలు ఏమిటో తెలుసుకునే ఉద్దేశ్యంతో, ఈసారి ముస్లిములు కొంత తడబడ్డారు. అయితే వారు, ఏది చెప్పినా నిజాన్నే చెబుతామని, దాని పరిణామం ఏమైనాసరే అని నిర్ణయించుకొని దర్బారులో హాజరయ్యారు. నజాషీ వారినుద్దేశించి ఆ విషయాన్నే ప్రస్తావించాడు.

హజ్రత్ జాఫర్(ర), "మేము హజ్రత్ ఈసా (అ.స.) గురించి మా ప్రవక్తశ్రీ చెప్పిందే చెబుతున్నాం. అంటే ఆయన (ఈసా - అ.స.) అల్లాహ్ ప్రవక్త అని, ఆయన ఆత్మ అని, కన్య అయిన పవిత్ర మరియమ్ (అ.స.) గర్భాన జన్మించినవాడని" చెప్పారు.

దీనికి నజాషీ భూమ్మీద నుండి ఓ గడ్డిపోచ పైకెత్తి,"దైవసాక్షి! మీరు చెప్పింది యదార్థం. హజ్రత్ ఈసా(అ.స.) ఈ గడ్డిపోచకంటే మెరుగైన వాడు కారు" అని అనగా అక్కడున్న క్రైస్తవ మతగురువుల నోటి నుండి ఆశ్చర్యాన్ని వెలిబుచ్చినట్లుగా "ఆ, అదేమిటీ!" అనే పలుకులు వెలువడ్డాయి.

నజాషీ వారి ఈ హూంకరింపును విని,"మీరు హూంకరించినా సరే, (ఇది యదార్థం)" అని పలికాడు.

ఆ తరువాత నజాషీ, ముస్లిములను ఉద్దేశించి,"వెళ్ళండి, నా

రాజ్యంలో ప్రశాంతంగా బ్రతకండి. మీ ఎడల దుర్భాషలాడేవానికి జరిమానా విధించబడుతుంది. మిమ్మల్ని బాధించడం వల్ల నాకు బంగారు కొండ లభించినా సరే, దాన్ని నేను సహించేదిలేదు" అన్నాడు.

ఆ తరువాత తన దర్బారులోని వారినుద్దేశించి,"వీరిద్దరు తెచ్చిన కానుకలను వారి ముఖాన పడవేయండి. దైవసాక్షి! అల్లాహ్ నాకు నా రాజ్యాన్ని తిరిగి ప్రసాదించేటప్పుడు ఎలాంటి లంచం పుచ్చుకొలేదు, నేనెలా ఈ లంచాన్ని స్వీకరించగలను? దానికితోడు అల్లాహ్ నా విషయంలో ఎవరి మాటనూ వినలేదు. నెనెలా ఇతరుల మాటలను వినగలను?" అని చెప్పి సభను చాలించాడు.

ఈ సంఘటనను గురించి వివరించిన హజ్రత్ ఉమ్మె సల్మా (ర) ఇలా అంటారు.

"ఆ తరువాత వారిద్దరు తాము తెచ్చిన కానుకలను తమ చేతపట్టుకొని బిడియపడుతూ వెనక్కు తిరిగారు. మేము నజాషీ దగ్గర ఓ మంచి దేశంలో ఓ మంచి పొరుగువాని పంచన ఉండిపోయాము."[51]

ఇది ఇబ్నె ఇస్హాక్ (ర)గారి కథనం. ఇతర సీరత్ చరిత్రకారుల కథనం ప్రకారం, నజాషీ దర్బారులో హజ్రత్ అమ్రూ బిన్ ఆస్, బద్ర్ యుద్ధం తరువాత గాని వెళ్ళారు. కొందరి పరిశోధన ప్రకారం, హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర) నజాషీ దర్బారులో ముస్లిములను వెనక్కు తోడ్కొని రావడానికి రెండు మార్లు వెళ్ళారు. అయితే బద్ర్ యుద్ధం తరువాత హజ్రత్ జాఫర్ (ర) మరియు నజాషీల నడుమ జరిగిన ప్రశ్నోత్తరాల వివరాలేవైతే చెప్పబడ్డాయో అవి దాదాపు ఇబ్నె ఇస్హాక్ చెప్పిన అబీసీనియా వలస సందర్భంలో జరిగిన ప్రశ్నోత్తరాల వివరాల్లాంటివే.

అయితే, ఈ ప్రశ్నల సారాంశాన్ని బట్టి తెలిసిందేమిటంటే, ఈ వ్యాజ్యం నజాషీ దర్బారులో మొదటిసారే ప్రవేశపెట్టడం జరిగింది అన్నదే. అందుకని, ముస్లిములను వెనక్కు తీసుకురావడానికి జరిగిన ప్రయత్నం ఒక్కసారే జరిగిందని, అది కూడా అబీసీనియా వలస తరువాత జరిగిన ప్రయత్నం అని గట్టిగా చెప్పగలం.

ఏదిఏమైనా బహుదైవారాధకుల ఈ కుట్ర, కుతంత్రాలు విఫలం అయి

51. ఇబ్నె హష్షామ్-1/334-338.

పోయాయి. తమ విద్వేషవైషమ్యాలను బహిర్గతం చేసుకోడానికి, తమ అక్కసును కేవలం తమ అధికార పరిధిలోనే వెళ్ళగక్కడం తప్ప మరే గత్యంతరంలేదనే విషయం వారికి తెలిసిపోయింది. దీని కోసం వారు ఓ భయంకరమైన ప్రణాళిక గురించి ఆలోచించనారంభించారు. నిజానికి, ఈ ఉపద్రవాన్ని అడ్డుకోడానికి వారి ముందు రెండే రెండు మార్గాలున్నాయన్న విషయం బాగా అర్థమైపోయింది. ఒకటి, తమ శక్తినుపయోగించి దైవప్రవక్త (స)ను దైవసందేశ ప్రచారం చేయకుండా అడ్డుకోవడం. రెండు, ఆయన్ను తుదముట్టించడం. అయితే రెండో మార్గం అతి కష్టంతో కూడుకున్న మార్గం. ఎందుకంటే, అబూ తాలిబ్ దైవప్రవక్త (స) రక్షకులుగా ఉంటూ, బహుదైవారాధకుల ముందు పటిష్టమైన ఇనుప గోడలా నిలబడి ఉండడం. అందుకని అబూ తాలిబ్‌తో ముఖాముఖిగా వ్యవహారాన్ని తేల్చుకోవడమే మంచిదని గ్రహించారు వారు.

అబూ తాలిబ్‌కు ఖురైష్ బెదిరింపు

ఈ ప్రతిపాదన ప్రకారం, ఖురైష్ సర్దారులు అబూ తాలిబ్ వద్దకు వెళ్ళారు. అబూ తాలిబ్ నుద్దేశించి, "అబూ తాలిబ్! మీరు వయస్సు రీత్యా, గౌరవ మర్యాదల రీత్యా మాలో పెద్దవారు. మేము ఇదివరకే మీ సోదర కుమారుణ్ణి అడ్డుకోమని చెప్పాం. కాని మీరు అలా చేయలేదు. మా తాత ముత్తాతల్ని తూలనాడడం, మా బుద్ధివివేకాల్లో లోపాలు ఎంచడం, మా ఆరాధ్య దైవాలను కించపరచడం మేము ఇక భరించలేం. మీరే గనక ఆయన్ను అడ్డుకోకపోతే మీతో, ఆయనతో యుద్ధానికి దిగవలసివస్తుంది. అందు ఎవరో ఒకరు తుడుచుకుపోక తప్పదు" అని చెబుతూ బెదిరించారు.

అబూ తాలిబ్‌పై ఖురైష్‌ల ఈ బెదిరింపు బాగా ప్రభావం చూపింది.

ఆయన ప్రవక్తశ్రీని పిలిపించి, "సోదర కుమారా! నీ జాతి నాయకులు నా వద్దకు వచ్చి ఇలా ఇలా అన్నారు. ఇక నీవు నా గురించి, నీ గురించి ఆలోచించు. నేను మొయ్యలేని భారాన్ని నాపై మోపకు" అని నచ్చజెప్పారు.

ఇది విన్న దైవప్రవక్త (స), పినతండ్రి కూడా తమను వదిలేసేటట్లున్నాడు, ఆయన పట్టు బలహీనం అవుతున్నదని గ్రహించి ఇలా సెలవిచ్చారు:

"బాబాయి! దైవసాక్షి! వీరు నా కుడి చేతిలో సూర్యుణ్ణి, ఎడమ చేతిలో చంద్రుణ్ణి తెచ్చి ఉంచినా, నేనీ కార్యాన్ని దాని హద్దు వరకు తీసుకొని వెళ్ళకుండా

ఆగలేను. అల్లాహ్ తన శిక్షనైనా అవతరింపజెయ్యాలి లేదా ఈ మార్గంలో నేనైనా నామరూపాల్లేకుండా పోవాలి. అప్పటి వరకు ఈ సందేశ ప్రచారాన్ని ఆపేది లేదు" అని నిక్కచ్చిగా చెప్పారు.

ఆ తరువాత ప్రవక్తశ్రీ కళ్ళు కన్నీటిమయమయ్యాయి. రోదిస్తూ అక్కడి నుండి లేచి వెళ్ళిపోబోగా అబూ తాలిబ్ ఆయన్ను కేకవేసి పిలిచారు. ప్రవక్తశ్రీ ఎదురుకు రాగానే,

"కుమారా! నీకిష్టమైనట్లు ప్రచారం చెయ్యి. దైవసాక్షి! నేను నిన్ను ఎప్పుడూ ఏ కారణం చేత కూడా విడిచిపెట్టేది లేదు"[52] అంటూ ఈ క్రింది పద్యపంక్తుల్ని వల్లించారు.

అర్థం: "దైవసాక్షి! వారు తమ మందీమార్బలంతో నీ వద్దకు రానైనా రాలేరు. నేను చనిపోయి ఖననం అయిపోతే తప్ప. నీవు నీ మనోభీష్టాన్ని విడమర్చి చెప్పు. నీకెలాంటి ఆటంకమూ ఉండదు. సంబరపడు, నీ కళ్ళు చల్లపడతాయి."[53]

ఖురైష్ బృందం మరోసారి అబూ తాలిబ్ వద్దకు

గతంలో చేసిన బెదిరింపుకు ఎలాంటి సమాధానమూ లభించలేదు. పైగా ప్రవక్తశ్రీ తన పనిని చేసుకుంటూనేపోతున్నారు. అప్పుడు ఖురైష్‌కు అర్థమైపోయింది, అబూ తాలిబ్ ప్రవక్తశ్రీని వదలలేరన్న సంగతి. పైగా ఆయన ఖురైష్ నుండి వేరుబడి వారి శత్రుత్వాన్ని కూడా కొనితెచ్చుకోడానికైనా సిద్ధంగా ఉన్నారన్న విషయం తేలిపోయింది. కాబట్టి ఖురైష్ వలీద్ బిన్ ముగైరా కుమారుణ్ణి వెంటబెట్టుకొని అబూ తాలిబ్ దగ్గరకు వచ్చారు. ఆయననుద్దేశించి:

"ఓ అబూ తాలిబ్! ఇతను ఖురైష్‌కు చెందిన నవయవ్వనంలోవున్న అందమైన యువకుడు. ఇతని సహాయానికీ, ఇతని సంపాదనకూ మీరే హక్కుదారులు కాగలరు. ఇతన్ని మీరు మీ పుత్రునిగా స్వీకరించండి. ఇతను మీవాడే అయిపోతాడు. ఇతనికి బదులుగా మీరు మీ సోదరుని కుమారుణ్ణి మాకు అప్పగించండి. అతను మా తాతముత్తాతల ధర్మాన్ని వ్యతిరేకిస్తున్నాడు.

52. ఇబ్నె హష్షామ్-1/265, 266.

53. ముక్తరుస్సీరత్- షేఖ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, పుట.68.

మా జాతిని ఛిన్నాభిన్నం చేసేస్తున్నాడు. వారి తెలివితేటలకు సవాలు విసురుతున్నాడు. మేమతణ్ణి చంపేస్తాం. ఒక మనిషికి బదులుగా మరొక మనిషిని ఇస్తున్నాం, లెక్కసరిపోతుంది చాలదా?" అని అన్నారు. దానికి అబూ తాలిబ్, "దైవసాక్షి! మీరెంత నికృష్టమైన బేరానికి దిగారు నాతో. మీరేమో పెంచిపోషించి పెద్దజేయడానికి మీ పుత్రుణ్ణి నాకప్పగిస్తున్నారా? నా కుమారుణ్ణి చంపేయండని మీకు అప్పజెప్పాలా? దైవసాక్షి! ఇది అయ్యే పని కాదు" అని కరాఖండిగా చెప్పేశారు.

దీనికి నౌఫిల్ బిన్ అబ్దె మునాఫ్ మనవడు ముత్యిమ్ బిన్ అద్దీ అందు కొని, "దైవసాక్షి! ఓ అబూ తాలిబ్! నీ జాతి ప్రజలు చేప్పేవి న్యాయ సమ్మతమైన మాటలే. నీకు అయిష్టమైన దాన్నుండి నిన్ను ఆపే ప్రయత్నం చేస్తున్నారు. మీరేమో ఏ ఒక్కరి మాటా వినేటట్లు అగుపించడం లేదు" అన్నాడు.

"దేవుడే సాక్షి! మీరేమీ న్యాయసమ్మతమైన మాటలు మాట్లాడటం లేదు. నీవు కూడా నన్నొదిలి నాకు వ్యతిరేకులైన వారి కొమ్ముకాస్తే కాయి. పో! ఏది జరగనుందో అదే జరిగితీరుతుంది."[54] అన్నారు అబూ తాలిబ్.

సీరత్ ఆధారాల్లో పై సంభాషణ జరిగిన సంవత్సరం ఏదో ఇతమిత్థంగా నిర్ణయం కాలేదు. ఈ రెండు సంభాషణలు బహుశా దైవదౌత్య శకం ఆరవ సంవత్సరం మధ్యభాగంలో జరిగి ఉండవచ్చని కొన్ని ఆధారాలు చెబుతున్నాయి. రెంటి నడుమ చాలా తక్కువ కాలమే గడిచి ఉండవచ్చు.

ప్రవక్త (స) ను హత్య చేసే ఆలోచన

ఈ రెండుమార్లు అబూ తాలిబ్‌తో జరిగిన చర్చ ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వనందున ఖురైష్ హింసాదౌర్జన్యాలకు సంబంధించిన భావోద్రేకాలు మరీ పెచ్చు పెరిగిపోయాయి. బాధలకు గురిచేసే క్రమం మునుపటి కంటే వేగం పుంజుకుంది. ఆ రోజుల్లోనే దైవధిక్కారుల మెదళ్ళలో, దైవప్రవక్త (స)ను హత్య చేయాలనే ఆలోచన వచ్చింది. ప్రవక్త (స)పై జరుగుతున్న ఈ హింసా దౌర్జన్యాల జోరు, ప్రవక్తశ్రీని హత్య చేసే ఆలోచన మక్కా నగరానికే చెందిన ఇద్దరు మహాయోధులు హజ్రత్ హమ్‌జా (ర) బిన్ అబ్దుల్ ముత్తలిబ్ మరియు హజ్రత్

54. ఇబ్నె హష్షామ్-1/266,267.

ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)లను ఇస్లామ్ స్వీకరించేటట్లు ప్రేరేపించాయి. కాకపోతే అవి వారి ద్వారా ఇస్లామ్ ధర్మానికి బలం చేకూరడానికి దోహదపడ్డాయి.

హింసాకాండకు, ఆగడాలకు సంబంధించిన క్రమం అలా పెచ్చు పెరుగుతూనే పోయింది. రెండు ఉదాహరణలు ఇక్కడ వివరించదలిచాము.

ఓ రోజు అబూ లహబ్ కుమారుడు ఉతైబా ప్రవక్తశ్రీ వద్దకు వచ్చి, "వన్నజ్మిఇజాహవా" మరియు "సుమ్మదనా ఫతదల్లా"ను (అంటే ఖుర్ఆన్ ఆయత్‌లను) నేను తిరస్కరిస్తున్నాను అని చెప్పి కొట్టనారంభించాడు. ప్రవక్త (స) గారి చొక్కాను చింపేసి ముఖాన ఉమ్మివేశాడు. ఆ ఉమ్మి ఆయనపై పడలేదు. ఈ సందర్భంగా దైవప్రవక్త (స) అతణ్ణి, "ఓ అల్లాహ్! నీ కుక్కల్లోంచి దేన్నయినా ఇతనిపైకి ఉసిగొల్పు"అని శపించారు. దైవప్రవక్త పెట్టిన ఈ శాపాన్ని అల్లాహ్ మన్నించాడు. ఉతైబా ఓసారి ఖురైష్‌కు చెందిన కొందరు వ్యక్తుల వెంట ప్రయాణం చేయాల్సి వచ్చింది. సిరియా దేశంలో ఉన్న 'జర్కా' అనే ప్రదేశంలో విడిది చేశారు. రాత్రి పూట పులి ఆ బిడారం చుట్టూ తిరుగుతూ ఉండగా ఉతైబా చూశాడు. చూడగానే, "అయ్యో నా ఖర్మ! దైవసాక్షి! నన్ను చంపేయడానికే ఇది వచ్చింది. ప్రవక్త (స) ఆనాడు నన్ను శపించారు. చూడండి! నేను సిరియా దేశంలో ఉన్నాను. కాని ఆయన మక్కాలో ఉంటూ నన్ను చంపేస్తున్నాడు"అని అరిచాడు. అందరూ ఉతైబాను వారి పశువుల నడుమన ఉంచి చుట్టూ కాపలా కాశారు. కాని పులి వారందరిపై నుండి లంఘించి నేరుగా ఉతైబాను పట్టుకొని చీల్చిపారేసింది.[55]

ఓసారి ఉక్బా బిన్ ముఅయిత్, దైవప్రవక్త (స) సజ్దా చేస్తుండగా మెడను బలంగా త్రొక్కడం వల్ల ఆయన కళ్ళు బయటకు వచ్చినంత పనైంది.[56]

ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖించిన ఓ సుదీర్ఘ ఉల్లేఖనంలో కూడా హింసా దౌర్జన్యాలకు సంబంధించిన ఆగడాలను గురించి ప్రవక్త (స)ను హతమార్చే ప్రయత్నంపై వెలుగు పడుతోంది. ఈ ఉల్లేఖనంలో ఇలా చెప్పడం జరిగింది. ఓసారి అబూ జహల్ ఇలా అన్నాడు:

"ఖురైష్ సోదరులారా! ముహమ్మద్(స) మన ధర్మాన్ని ఎలా తూలనాడు

55. ముఖ్తసుర్సీరత్-షేఖ్ అబ్దుల్ వహ్హాబ్, పుట. 135; ఇస్తీయాబ్, అసాబా, దలాయ లెనుబువ్వత్, అర్రౌజుల్ అన్ఫ్.

56. ముఖ్తసుర్సీరత్-పుట.113.

తున్నాడో, మన తాత ముత్తాతలను ఎలా ఎత్తిపొడుస్తున్నాడో, మన బుద్ధి వివేచనల్ని ఎలా సవాలు చేస్తున్నాడో మీకు తెలుసు. మన ఆరాధ్య దైవాలను కించపరిచే విధం ఎలాగుందో మీరెరుగుదురు. అందుకని నేడు నేను అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను. ఓ భారమైన బండరాయిని తీసుకొని కూర్చుని ముహమ్మద్ సజ్దా చేసినప్పుడు దాంతో ఆయన తల నుజ్జునుజ్జు అయ్యేటట్లు తలపై ఎత్తి వేస్తాను. ఆ తరువాత మీరు నన్ను అసహాయునిగా వదిలేస్తారో, నాకు సహాయపడతారో అన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. అబ్దె మునాఫ్ కూడా వారి ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించినా సరే" అని ప్రతిజ్ఞ చేశాడు.

"లేదు, లేదు! దైవసాక్షి! మేము ఈ వ్యవహారంలో నిన్ను నిస్సహాయునిగా వదిలేసేవారం కాదు. నీవు చేసేది చేసి చూపించు" అని ఖురైష్ నాయకులంతా అతనికి ధైర్యం చెప్పారు.

తెల్లారగానే అబూ జహల్ బరువైన బండరాయినొకదాన్ని దగ్గర పెట్టుకొని ప్రవక్త (స) కోసం ఎదురు చూస్తున్నాడు. దైవప్రవక్త (స) మామూలుగా కాబా గృహం దగ్గరకొచ్చి నిలబడి నమాజులో నిమగ్నమయ్యారు. ఖురైష్ కూడా అక్కడ చేరి తమాషా చూస్తున్నారు. దైవప్రవక్త (స) 'సజ్దా' చేయగానే అబూ జహల్ బండరాయిని బలవంతంగా పైకి ఎత్తుకున్నాడు. మెల్లగా ఆయన వైపునకు కదిలాడు. దగ్గరకు రాగానే ఓడిపోయినవాడిలా వెనక్కు పారిపోయి వచ్చేస్తున్నాడు. అతని ముఖకవళికలు మారిపోయి ఉన్నాయి. ముఖాన రక్తం చుక్క లేదు. రెండు చేతుల్లో ఎత్తుకొని ఉన్న రాయి కూడా క్రిందపడనట్లు అతుక్కు పోయి ఉంది. ఎంతో కష్టం మీద దాన్ని క్రిందపడవేయగలిగాడు. అటు ఖురైష్‌కు చెందిన కొందరు లేచి అతని దగ్గరకు వచ్చి, "అబుల్ హకం! నీకేమైంది?" అని అడిగారు.

"నేను రాత్రి మీతో చెప్పినట్లుగానే చేయబోయాను, కాని ఆయన దగ్గరకు వెళ్ళగానే ఓ ఒంటె నాకు, ఆయనకు నడుమ వచ్చేసింది. దైవసాక్షి! నేనెప్పుడూ అలాంటి ఒంటెను చూడలేదు. భయంకరమైన దాని తలా, మెడ, పళ్ళు నేనిప్పటి వరకు ఎక్కడా చూడలేదు. అది నన్ను తినేయడానికి ముందుకు రాసాగింది" అని చెప్పాడు.

ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖనంలో, దైవప్రవక్త (స) ఆయనతో ఇలా అన్నారని

ఉంది."ఆయన జిబ్రీల్ (అ.స.). అబూ జహలే గనక నా దగ్గరకు వచ్చి ఉంటే, అతణ్ణి హతమార్చి పారేసేవారు."[57]

ఆ తరువాత అబూ జహల్ చేసిన మరో దుష్కృత్యం, హజ్రత్ ఉమర్ (ర)ను ఇస్లామ్ స్వీకరించేటట్లు చేసింది. వివరణ ముందు రాబోతోంది.

ఖురైష్‌కు చెందిన ఇతర దుర్మార్గుల విషయానికొస్తే, వారి మనస్సుల్లోనూ మహాప్రవక్త (స)ను అంతమొందించే ఆలోచన సతతం కెలకవేస్తూనే ఉంది. హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్రూ బిన్ ఆస్ (ర), ఇబ్నె ఇస్హాక్ (ర)తో ఇలా అన్నారని ఓ ఉల్లేఖనం ఉంది. దాని ప్రకారం,

"ఓసారి బహుదైవారాధకులు 'హతీమ్'లో సమావేశమై ఉన్నారు. అక్కడ నేనూ ఉన్నాను. బహుదైవారాధకులు ప్రవక్తశ్రీ (స)గారి ప్రస్తావన తెస్తూ, "అతని విషయంలో మేము వహించిన సహనానికి ఓ హద్దంటూ లేదు. నిజంగా మనం అతన్ని గురించి పెద్ద విషయంలో సహనం వహించాము" అని అంటూ ఉండగా ప్రవక్తశ్రీ అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఆయన కాబా గృహం దగ్గరకు వచ్చి ముందు హజ్రె అస్వద్‌ను ముద్దాడారు. ఆ తరువాత కాబా ప్రదక్షిణ చేస్తూ బహుదైవారాధకుల ప్రక్క నుండి వెళ్ళగా వారు ఆయన్ను తూలనాడారు. ఆ మాటల ప్రభావ ఛాయలు ఆయన ముఖారవిందంపై గోచరించాయి. ఆ తరువాత ప్రవక్తశ్రీ రెండోమారు ప్రదక్షిణలో మునుపటిలాగే బహుదైవారాధకుల ప్రక్క నుంచి వెళ్ళగా తిరిగి వారు ఆయన్ను దుర్భాషలాడారు. ఈసారి కూడా ఆయన ముఖంపై అసహనం కనిపించగా నేను చూశాను. ఆ తరువాత మూడోసారి వారి ప్రక్క నుండి వెళుతూ ఉండగా తిరిగి బహుదైవారాధకులు ఆయన్ను చూసి తిట్టారు. ఈసారి ఆయన ముందుకు కదలకుండా నిలబడి;

"ఖురైష్ ప్రజలారా! వింటున్నారా? ఏ దైవం చేతిలోనైతే నా ప్రాణం ఉందో, ఆ దైవం సాక్షి! నేను మీ వద్దకు బలిని గొనివచ్చాను" అని అన్నారు.

ఇంకేముంది! ఆయన ఈ వచనాలు ప్రజలను భయకంపితుల్ని చేశాయి. తమ తలలపై పక్షి కూర్చున్నట్లుగా నిశ్చేష్టులై అలానే ఉండిపోయారు. చివరికి ఆయనకు బద్ధశత్రువు అయిన వాడు కూడా, తాను బ్రతిమాలడానికి ఎంత మంచి పదాన్ని ఎంచుకొని బ్రతిమాలగలడో ఆ పదాలను పలికి క్షమాపణ కోరుకో నారంభించాడు. "అబుల్ ఖాసిం వెనక్కు వెళ్ళిపోండి. దైవసాక్షి మీరు ఎన్నడూ అమాయకులుగా ఉండలేదు" అని ప్రాధేయపడనారంభించారు.

57. ఇబ్నె హష్షామ్-1/298,299.

మరుసటి దినం ఖురైష్ తిరిగి అక్కడ చేరి దైవప్రవక్త (స) ప్రస్తావనను ఎత్తారు. ఆయన రాగానే అందరూ మూకుమ్మడిగా ఆయనపై విరుచుకు పడ్డారు. ఆయన్ను చుట్టుముట్టారు. నేను చూస్తూ ఉండగానే ఓ వ్యక్తి ఆయన మెడకు ఆయన అంగవస్త్రాన్ని చుట్టి దానిని మెలివేయనారంభించాడు. అబూ బక్ర్ (ర) వచ్చి ప్రవక్తశ్రీని రక్షించడంలో నిమగ్నులయ్యారు. ఆయన రోదిస్తూ, మీరు ఓ వ్యక్తిని కేవలం, ఆయన అల్లాహ్ తన పోషకుడు అని అంటున్నందుకు చంపేస్తున్నారా? అని పలుకనారంభించారు. ఆ తరువాత బహుదైవారాధకులు ఆయన్ను వదిలేసి వెళ్ళిపోయారు. అబ్దుల్లా బిన్ అమ్రూ బిన్ ఆస్(ర), "దైవప్రవక్త (స)పై జరిగిన ఆ దాడి, హింసించిన ఆ తీరు నేను ఎన్నడూ చూడలేదు" అని అంటారు.[58]

సహీ బుఖారిలో హజ్రత్ ఉర్వా బిన్ జుబైర్ (ర), "నేను అబ్దుల్లా బిన్ అమ్రూ బిన్ ఆస్ (ర)ను, బహుదైవారాధకులు ప్రవక్త (స) ఎడల ప్రవర్తించిన తీవ్రమైన తీరు ఎలాంటిదో వివరించండి" అని అడిగాను. దానికి ఆయన(ర) ఇలా చెప్పారు.

దైవప్రవక్త (స) కాబా గృహాన్ని ఆనుకొని ఉన్న హతీమ్ అనే స్థలంలో నమాజు చేస్తున్నారు. అంతలోనే ఉక్బా బిన్ ముఅయిత్ అక్కడకు వచ్చి తన అంగవస్త్రాన్ని ఆయన (స) మెడకు చుట్టి మెలిత్రిప్పి గొంతు నులిపే ప్రయత్నం చేస్తున్నాడు. అంతలో హజ్రత్ అబూ బక్ర్ (ర) అక్కడికి పరుగున వచ్చి అతని రెండు గూడలను పట్టుకొని దూరంగా త్రోస్తూ, "మీరు ఓ వ్యక్తిని, ఆయన అల్లాహ్‌యే తన పోషకుడు అని అంటున్నందుకు చంపేస్తున్నారా?" అని అడిగారు.[59]

హజ్రత్ అస్మా (ర)గారి ఉల్లేఖనంలో ఇంకొంత వివరణ ఉంది. అదేమిటంటే, "నేను హజ్రత్ అబూ బక్ర్ (ర) వద్దకు, 'నీ మిత్రుణ్ణి రక్షించు' అని అరుస్తూ వెళ్ళాను. ఆయన వెంటనే మా దగ్గర నుండి లేచి అక్కడికి పరుగు తీశారు. ఆయన అప్పుడు తన తలను నాల్గుపాయలుగా దువ్వుకొని ఉన్నారు. "మీరు ఓ వ్యక్తిని, అతను అల్లాహ్‌యే తన పోషకుడు అంటున్నందుకు హత్య చేస్తున్నారా?" అంటూ అరిచారు. తిరిగి వచ్చిన తరువాత ఆయన పరిస్థితి, తల

58. ఇబ్నె హష్షామ్-1/289, 290.
59. సహీ బుఖారి-1/544.

వెంట్రుకల్ని వ్రేళ్ళతో పట్టుకోగా అవి ఊడివచ్చేటంత గంభీరంగా మారి పోయింది."[60]

హజ్రత్ హమ్‌జా (ర)గారి ఇస్లామ్ స్వీకారం

మక్కా వాతావరణం హింసాదౌర్జన్యాల కారుమేఘాలతో గంభీరంగా ఉంది. అంతలోనే ఓ మెరుపు మెరిసింది. ఆ మెరుపుకు పీడితుల మార్గంలో వెలుగు విరజిమ్మినట్లయింది. అదే! ఆ మెరుపు హజ్రత్ హమ్‌జా (ర)గారి ఇస్లామ్ ధర్మ స్వీకారం. ఆయన ఇస్లామ్ స్వీకరించిన సంఘటన దైవదౌత్యపు ఆరవ శకపు చివరి సంఘటన. అంటే, ఆయన జిల్‌హజ్జా మాసంలో ఇస్లామ్ స్వీకరించారు.

ఆయన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడానికి పురిగొల్పిన పరిస్థితి ఏమిటంటే; ఓ రోజు అబూ జహల్ సఫా కొండ వద్ద దైవప్రవక్త (స) కూర్చుని ఉన్న చోటి నుండి వెడుతూ ఆయన్ను హింసించి, దుర్భాషలాడాడు. దైవప్రవక్త (స) ఏమీ అనకుండా కూర్చున్నారు. అయితే అతను ఆయన తలపై ఓ రాయిని విసరి వేశాడు. ఆ రాయి తగలడం వలన తల నుండి రక్తం స్రవించనారంభించింది. ఆ తరువాత అతను వెళ్ళి కాబా గృహం దగ్గర తన మిత్రబృందంలో చేరి కూర్చున్నాడు. అబ్దుల్లా బిన్ జుద్‌ఆన్ స్త్రీ బానిస అదంతా గమనిస్తూ ఉంది. ఆమె ఇల్లు సఫా కొండపైన్నే ఉంది. హజ్రత్ హమ్‌జా (ర) విల్లంబులు ధరించి వేట నుండి తిరిగి వస్తుండగా ఎదురుగా వెళ్ళి విషయమంతా చెప్పేసింది. హజ్రత్ హమ్‌జా (ర) కోపోద్రేకంతో ఊగిపోయారు. ఈయన ఖురైష్‌కు చెందిన అత్యంత శక్తిశాలి, దృఢకాయుడైన యువకుడు. దాసీ చెప్పిన విషయాలను విని ఒక్క క్షణం కూడా జాగు చేయకుండా, అబూ జహల్ కనబడగానే అతణ్ణి చితకబాదాలనే ఉద్దేశ్యంతో హుటాహుటిన అక్కడికి చేరారు. మస్జిదె హరాం లోనికి వెళ్ళి అతనికి ఎదురుగా నిలబడి, "ఒరేయ్ పిరికిపందా! నీవు నా సోదర కుమారుణ్ణి తిడతావా? నేను కూడా ఆయన ధర్మాన్నే స్వీకరించాను తెలుసా?" అంటూ విల్లుతో అబూ జహల్ తలపై ఒక్క దెబ్బ వేశారు. ఆ దెబ్బకు అతని తల బద్దలుగా పగిలిపోయింది. ఇది చూసిన బనూ మగ్జూమ్ తెగ, హమ్‌జా (ర) గారి తెగ బనూ హాషిమ్, ఒకరిపై ఒకరు తలపడ్డారు. కాని అబూ జహల్ వారిని

60. ముక్తరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లా, పుట-113.

వారిస్తూ, "పోనిద్దురూ! అబూ అమ్మారాను ఏమనకండి. నేను నిజంగానే ఆయన అబ్బాయిని బహుచెడ్డగా తిట్టాను" అని అన్నాడు.[61]

మొదట హజ్రత్ హమ్‌జా, తన బంధువును అగౌరవంపాల్జేసినందుకు రోషపడుతూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారుగాని, అల్లాహ్ ఆ తరువాత ఆయన హృదయాన్ని ఆ ధర్మం కోసం తెరిచాడు. ఆయన ఇస్లామ్ ధర్మాన్ని దృఢంగా పట్టుకోవడం జరిగింది.[62]

ముస్లిములకు ఆయన ద్వారా గొప్ప గౌరవం, శక్తి లభించాయి.

హజ్రత్ ఉమర్ (ర) గారి ఇస్లామ్ స్వీకారం

జులుం, హింసాదౌర్జన్యాల కారుమేఘాల ఈ భయానక వాతావరణంలో మరో మెరుపు మెరిసింది. దీని వెలుగు మునుపటి వెలుగుకన్నా కళ్ళు మిరుమిట్లుగొలిపేదిగా ఉంది. అంటే, హజ్రత్ ఉమర్ (ర) ఇస్లామ్‌ను స్వీకరించారన్న మాట. ఈయన ఇస్లామ్ స్వీకరించిన సంఘటన జరిగింది కూడా దైవదౌత్య శకపు ఆరవ సంవత్సరంలోనే,[63] ఈయన హజ్రత్ హమ్‌జా (ర) ఇస్లామ్ స్వీకరించిన మూడవ రోజునే ముస్లిమయ్యారు. దైవప్రవక్త(స) ఇస్లామ్‌ను స్వీకరించేలా చెయ్యమని దుఆ కూడా చేసి ఉన్నారు. ఇమామె తిర్మిజీ (రహ్మలై), ఇబ్నె ఉమర్ ఉల్లేఖనాన్ని ఉల్లేఖిస్తూ ఈ దుఆను ప్రామాణికమైందిగా ఖరారు చేశారు. అలాగే, తిబ్రానీ, హజ్రత్ ఇబ్నె మస్‌ఊద్ మరియు హజ్రత్ అనస్ (ర)ల ఉల్లేఖనాలను ఉల్లేఖిస్తూ దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారని అంటారు.

"అల్లాహుమ్మ అఇజ్జిల్ ఇస్లామ బిఅహబ్బి ర్రజులైని ఇలైక. బి ఉమరి బన్ ఖత్తాబ్ అవ్ బి అబీజహ్లి బిన్ హష్షామ్."

అర్థం : ఓ ప్రభూ! ఉమర్ బిన్ ఖత్తాబ్ లేదా అబూ జహ్లి బిన్ హష్షామ్ వీరిద్దరిలో నీకు ప్రియమైన వారి ద్వారా ఇస్లామ్‌ను శక్తివంతం చెయ్యి.

(అల్లాహ్ ఈ దుఆను స్వీకరించడం వల్ల హజ్రత్ ఉమర్ (ర) ముస్లిమై పోయారు) అల్లాహ్ దృష్టిలో ఈ ఇద్దరిలో ఒక్క హజ్రత్ ఉమర్ (ర) మాత్రమే

61. ముక్తసరుస్సీరత్, షేఖ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్లా పుట.66; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/68, ఇబ్నె హష్షామ్-1/291,292.

62. ముక్తసరుస్సీరత్- షేఖ్ అబ్దుల్లా, పుట.101.

63. తారీఖ్ ఉమర్‌బిన్ ఖత్తాబ్- అల్ ఇబ్నెజూజీ పుట.11.

ప్రియమైనవారు.[64]

హజ్రత్ ఉమర్ (ర) గారి ఇస్లామ్ స్వీకారానికి సంబంధించిన మొత్తం ఉల్లేఖనాలను అధ్యయనం చేసిన తరువాత, ఆయన మనస్సులో ఇస్లామ్ ధర్మ ఔన్నత్యం క్రమక్రమంగా వేళ్ళూనుకుందని తెలుస్తోంది. ఈ ఉల్లేఖనాలన్నిటిని వివరించేముందు హజ్రత్ ఉమర్ (ర) గారి భావోద్రేకాలు, ఆయన ప్రవృత్తి, ఆయన వ్యక్తిత్వాలను గురించి కూడా తెలుసుకోవటం అవసరం.

హజ్రత్ ఉమర్ (ర) తన దుడుకుతనంలో, కాఠిన్యంలో బాగా పేరు మోసినవారు. ముస్లిములు ఓ సుదీర్ఘ కాలం వరకు ఆయన పెట్టిన హింస లకు గురై ఉన్నారు. ఆయన వ్యక్తిత్వంలో రెండు విభిన్న రకాల భావోద్రేకాలు సంఘర్షించుకుంటున్నాయా అన్నట్లు అగుపడేది. ఆయన ఓ వైపు తాత ముత్తాతలు ప్రవేశపెట్టిన ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ ఉండడం, రక్తపాతం అంటే ఉత్సాహం చూపడానికి ఇష్టపడేవారు. కాని మరో ప్రక్క విశ్వాస మార్గంలో ముస్లిములపై జరుగుతున్న దమనకాండను వారు ఎంతో దృఢచిత్తంతో సహించడాన్ని కూడా ఆశ్చర్యచకితులై వారి ధైర్యానికి జోహార్లు అర్పించే దృష్టితో చూసేవారు. అదే కాకుండా, ఓ బుద్ధిమంతునికి ఉండవలసిన లక్షణాల్లో వలె ఆయన మనస్సులో ఆ విషయం గురించి అనుమానాలు కూడా పొడసూపుతూ ఉండేవి. ఇస్లామ్ దేని వైపునకయితే పిలుస్తోందో, బహుశా అదే సరి అయిన, మేలైన మార్గమేమోననే ఆలోచన కూడా అప్పుడప్పుడు ఆయన మెదడులో మెదలుతూ ఉండేది. కాబట్టి ఆయన పరిస్థితి ఒక్కసారే మండి చల్లారిపోయే అగ్నిలా ఉండేది.[65]

హజ్రత్ ఉమర్ (ర) గారి ఇస్లామ్ స్వీకార సంఘటనా వివరాలు, దాదాపు అన్ని ఉల్లేఖనాల ప్రకారం ఇలా ఉన్నాయి:

ఓసారి ఆయన ఇంటికి వెలుపల రాత్రి గడపవలసి వచ్చింది. ఆయన హరమ్ (కాబా మస్జిద్)కు వచ్చి కాబాలోని పరదాలోకి దూరిపోయారు. అప్పుడు మహాప్రవక్త (స) నమాజు చేస్తూ అల్ హాఖ్ఖా సూరా పఠిస్తూ ఉన్నారు. హజ్రత్ ఉమర్ (ర) ఆ పారాయణాన్ని వింటూ దాని శైలికి ఆశ్చర్యచకితులయ్యారు. ఆయన కథనం ప్రకారమే, "నేను నా మనస్సులో, దైవసాక్షి! ఖురైష్ ప్రజలు అనుకుంటున్నట్లుగానే ఆయన 'ఓ కవే' అని అనుకున్నాను" అంతలోనే దైవ

64. తిర్మిజీ, అబుహాబుల్ మనాఖిబ్, మనాఖిబ్ అబీహఫ్సీ ఉమర్‌బిన్ ఖత్తాబ్-2/209.
65. హజ్రత్ ఉమర్(ర) గారి ఈ పరిస్థితి షేఖ్ ముహమ్మద్ గజాలి వివరించినది.

ప్రవక్త(స) ఈ ఆయత్ పఠించారు. **వలా బిఖౌలి కాహినిన్ ఖలీలమ్ మా తజక్కరూన తన్‌జీలుమ్ మిర్ రబ్బిల్ ఆలమీన.** (69:42,43)

అర్థం : (కాదు) ఇది ఓ గౌరవనీయుడైన ఒక సందేశహరుని వాక్కు, ఏ కవికి చెందిన వాక్కు కాదు. కాని మీరు విశ్వసించడం అనేది చాలా తక్కువ.

నేను తిరిగి నా మనసులో ఓహో! అయితే ఈయన ఓ జ్యోతిష్యుడు అని అనుకున్నాను. అంతలోనే దైవప్రవక్త (స) ఈ ఖుర్‌ఆన్ వాక్యాన్ని పఠించారు.

ఇన్నహూ లఖవ్‌లు రసూలిన్ కరీమ్. వమాహువ బిఖవ్‌లి షాయిర్ ఖలీలమ్ మా తుఃమినూన్.

"ఇంకా ఇది ఏ జ్యోతిష్యుని వాక్కు కూడా కాదు. మీరు ఆలోచించడం అనేది చాలా తక్కువ. ఇదసలు సకల లోకాల ప్రభువు తరపు నుండి అవత రించింది." (69:40,41)

అప్పుడే నా హృదయంలో ఇస్లామ్ ధర్మ ఔన్నత్యం జాగృతమైంది[66] అని చెప్పారు.

హజ్రత్ ఉమర్ (ర) గారి హృదయఫలకంపై ఇస్లామ్ ముద్రింపబడిన ప్రప్రథమ సందర్భం అది. అయితే ఆయనలో, అజ్ఞానపు భావోద్రేకాలు, అంధానుకరణ, తాతముత్తాతల ఆచార సంప్రదాయాల గొప్పదనపు ఛాయలు మాత్రం తొలగిపోలేదు. హృదయాంతరంగంలో మెదిలే యదార్థం బయటకు రాలేకపోయింది. అందుకని ఆయన తనలో దాగివున్న అంతరాత్మ ఘోషను లెక్క చేయకుండా ఇస్లామ్ విద్వేషంలో నిమగ్నమయ్యే ఉన్నారు.

ఆయన ఈ సహజ కఠిన ధోరణిలో కొట్టుకుపోతూ, మహాప్రవక్త (స) ఎడల విద్వేషాన్ని ప్రకటిస్తూ ఓ రోజు స్వయంగా ఖడ్గధారుడై ప్రవక్తశ్రీని అంత మొందించటానికి బయలుదేరారు. కాని దారిలో నుయీమ్ బిన్ అబ్దుల్లా

ఫిక్హాహు సీరత్-పుట, *92,93.*

66. తారీఖ్ ఉమర్ బినుల్ ఖత్తాబ్ - అల్ ఇబ్నుల్ జౌజీ, పుట 6. ఇబ్నె ఇస్‌హాక్, అతా మరియు ముజాహిద్ ఉల్లేఖనాన్ని దాదాపు ఇలాగే నకలు చేశారు. అయితే ఈ ఉల్లేఖనంలోని చివరి ముక్క మరోలా ఉంది. చూడండి, సీరత్ ఇబ్నె హష్షామ్-1/ 346, 348. ఇంకా ఇబ్నె జౌజీ స్వయంగా హజ్రత్ జాబిర్(ర)గారి ఉల్లేఖనాన్ని దాదాపు ఇలానే నకలు చేశారు. అయితే దాని చివరి భాగంలో కూడా కొంత తేడా కనిపిస్తోంది. చూడండి, తారీఖ్ ఉమర్ ఇబ్నుల్ ఖతాబ్- పుట.9-10.

అల్ఖామ్ అద్వీని[67] లేదా బనీ జుహ్రా[68] లేదా బనీ మగ్జూమ్‌కు చెందిన ఓ వ్యక్తి[69]ని కలుసుకోవడం జరిగింది. అతను హజ్రత్ ఉమర్ వాలకం చూసి, "ఉమర్! ఎక్కడికి వెళుతున్నావు" అని అడిగాడు.

"ముహమ్మద్ (స)ను హతమార్చడానికి" అని నిర్లక్ష్యంగా జవాబిచ్చారు ఉమర్.

"ముహమ్మద్ (స)ను హతమార్చి బనూ హాషిమ్ మరియు బనూ జుహ్రా నుండి ఎలా తప్పించుకోగలవు?" అని ప్రశ్నించాడు.

"ఓహో! అయితే నీ వెనుకటి మతాన్ని వదిలేశావన్న మాట" అని ఎత్తిపొడిచారు ఉమర్.

"అయితే విను. నేనో ఆశ్చర్యకరమైన వార్త చెబుతున్నాను. నీ సోదరి మరియు ఆమె భర్త ఇద్దరూ నీ ధర్మాన్ని వదలి ధర్మభ్రష్టులయ్యారు. ఇది నీకు తెలుసా?" అని అడిగాడు ఆ వ్యక్తి.

ఇది విన్న ఉమర్ (ర) గారి ఉక్రోషానికి, రౌద్రానికి హద్దులేకుండా పోయింది. నేరుగా సోదరి, ఆమె భర్త ఉన్న చోటికి బయలుదేరారు. ఆ ఇంట వారికి హజ్రత్ ఖబ్బాబ్ (ర) బిన్ అరత్, 'తాహా' సూరా రాసి ఉన్న గ్రంథపత్రాన్ని పఠింపజేస్తున్నారు. ఖుర్ఆన్ బోధించడానికి హజ్రత్ ఖబ్బాబ్ (ర) రావడం మామూలే. హజ్రత్ ఖబ్బాబ్ (ర) ఉమర్ రాకను గమనించి ఇంటిలోనికి వెళ్ళి దాక్కున్నారు. ఇటు హజ్రత్ ఉమర్ సోదరి ఫాతిమా (ర) ఆ పత్రాన్ని దాచేశారు. అయితే హజ్రత్ ఉమర్ (ర) ఇంటి దాపుకు రాగానే అప్పటికే హజ్రత్ ఖబ్బాబ్(ర) గారి పారాయణ స్వరం ఆయన చెవుల్లోబడి ఉంది. లోనికి ప్రవేశిస్తూనే, "నేను ఇప్పుడే ఆ మందస్వరంలో విన్నది ఏమిటి?" అని అడిగారు. "అదేమిలేదే! మేము మాట్లాడుకుంటున్నాం అంతే! " అని బదులిచ్చారు వారు.

"మీరు బహుశా ధర్మభ్రష్టులైపోయారనుకుంటాను" అని అడగ్గా ఆయన బావగారు అందుకొని, "ఉమర్! సత్యం అనేది మీ ధర్మంలో కాకుండా మరే ధర్మంలోనైనా ఉండి ఉంటే? (అప్పుడు ఏం చేస్తారు?)" అని అడిగేశారు. హజ్రత్ ఉమర్ ఈ మాటల్ని వినగానే కోపావేశంతో బావను చితకబాదేశారు.

67. *ఇది ఇబ్నె ఇస్‌హాక్ కథనం, చూడండి. ఇబ్నె హిషామ్-1/344.*

68. *తారీఖ్ ఇబ్నె ఖత్తాబ్ అల్ ఇబ్నె జూజీ-పుట. 10; ముఖ్తసరుస్సీరత్-షేక్ అబ్దుల్లా, పుట. 103.*

69. *ఇబ్నె అబ్బాస్ (ర) వారి ఉల్లేఖనం చూడండి. ముఖ్త మెరస్సీరత్ డిటో-పుట. 102.*

ఆయన సోదరి, భర్తను రక్షించే ఉద్దేశ్యంతో ఆయన్ను ఉమర్ బారి నుండి ప్రక్కకు లాగారు. అంతే! పెళ్ళుమని గట్టిగా ఓ చెంపదెబ్బ వేశారు సోదరి చెక్కిలిపై. దానితో ఆమె ముఖం రక్తసిక్తమైపోయింది. ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖనం ప్రకారం, ఆమె తలకు కూడా దెబ్బ తగిలింది. సోదరికి కూడా కోపం వచ్చి, "ఉమర్! నీ ధర్మం కాకుండా మరే ధర్మమే సత్యం అయినట్లయితే నీవేమి చేస్తావు?" అని ప్రశ్నించారు. **అష్హదుఅల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్** (అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యం ఇస్తున్నాను) అని గట్టిగా పలికారు. ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర) నిశ్చేష్టులైపోయి ఎటూ తోచక నిలబడిపోయారు. ఆయన తన సోదరి ముఖంపై రక్తాన్ని చూసి సిగ్గుపడ్డారు.

"ఏదీ మీ వద్ద ఉన్న ఆ గ్రంథాన్ని నాకివ్వండి, నేనూ చదువుతాను" అని అడిగారు. "లేదు! నీవు అపవిత్రుడవు. ఈ గ్రంథాన్ని కేవలం పరిశుద్ధులైనవారే తాకగలరు. లే! లేచి స్నానం చేసిరా" అని తెలిపారు.

హజ్రత్ ఉమర్ వెళ్ళి స్నానం చేసివచ్చారు. ఆ గ్రంథాన్ని చేతబట్టుకొని చదవనారంభించారు. **"బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం"** (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను). నోట ఈ పలుకులు వెలువడగానే, "ఓహో! ఇది ఎంత పరిశుద్ధమైన నామం!" అంటూ తాహా సూరా ప్రారంభించి **"ఇన్ననీ అనల్లాహ్ లా ఇలాహ ఇల్లా అన ఫఅబుద్నీ వ అఖిమిస్సలాత లిజిక్రీ." (20:14)**

అర్థం:- "నేను అల్లాహ్‌ను. నేను తప్ప మరొకడు దేవుడు లేడు. కనుక నీవు నాకు దాస్యం చెయ్యి. నా జ్ఞాపకం కోసం నమాజును స్థాపించు" వరకు చదవి, "ఇది ఎంత మహత్తరమైన వాక్కు, ఎంత పరిశుద్ధమైన వచనం! ముహమ్మద్ ఎక్కడున్నారో తెలుపండి" అని అడిగారు.

ఈ మాటలు వింటున్న హజ్రత్ ఖబ్బాబ్ (ర) లోపలి నుండి బయటకు వచ్చి, "ఉమర్! సంబరపడు! దైవప్రవక్త (స) గురువారం రాత్రి నీ గురించి చేసిన దుఆ (ఓ అల్లాహ్! ఉమర్ బిన్ ఖత్తాబ్ లేదా అబూ జహల్ బిన్ హిషామ్ వీరిద్దరిలో నీకు ఎవరు ప్రియులో వారి ద్వారా ఇస్లామ్‌ను శక్తివంతం చెయ్యి) ప్రభావమే ఇది. ఇప్పుడాయన సఫా కొండపై ఉన్న గృహంలో ఉన్నారు" అని చెప్పారు.

ఇది విన్న హజ్రత్ ఉమర్ ఖడ్గాన్ని చేతబూనారు. సఫా కొండపై దైవ ప్రవక్త (స) ఉన్న ఇంటి గుమ్మం దగ్గరకు వచ్చి తలుపుతట్టారు. ఒకాయన లేచి తలుపు సందులో నుండి బయటకు తొంగిచూడగా అక్కడ హజ్రత్ ఉమర్ ఖడ్గాన్ని పట్టుకొని నిలబడి ఉన్నారు. వెంటనే వెనక్కు వెళ్ళి దైవప్రవక్త (స)తో తాను చూసింది చెప్పాడు. అందరూ ఒక చోట గుమిగూడారు. హజ్రత్ హమ్‌జా (ర) ఏమిటి అని అడగ్గా, బయట ఉమర్ (ర) నిలబడి ఉన్నాడు అని చెప్పారు. దానికి హజ్రత్ హమ్‌జా (ర), "చాలు! ఉమరా? తలుపు తెరువండి. ఒకవేళ ఆయన సదుద్దేశ్యంతో వచ్చి ఉంటే ఆయనకు మేలు జరుగుతుంది. చెడు ఉద్దేశ్యంతో వస్తే మాత్రం మేము ఆ ఖడ్గంతోనే అతణ్ణి అంతమొందిద్దాం" అని అన్నారు. ఇటు దైవప్రవక్త (స) లోన కూర్చుని ఉన్నారు. ఆ సమయంలో ఆయనపై దైవవాణి అవతరిస్తూ ఉంది. దివ్యవాణి అవతరణ ఆగిపోగానే ఆయన ఉమర్ (ర) దగ్గరకు వచ్చి తాను కూర్చున్న ప్రదేశానికి తీసుకుని వెళ్ళారు. ఆయన చొక్కా మరియు ఖడ్గం పిడిని ఒడిసిపట్టుకొని ఊపుతూ, "ఉమర్! అల్లాహ్ వలీద్ బిన్ ముగైరాపై అవతరింపజేసిన శిక్షలాంటిది నీపై అవతరింపజేయనంతమట్టుకు నీవు నీ వైఖరిని మార్చుకోవా? ఓ అల్లాహ్! ఇతను ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)! ఓ ప్రభూ! ఇస్లామ్ ధర్మాన్ని ఉమర్ బిన్ ఖత్తాబ్ ద్వారా శక్తివంతం చెయ్యి, గౌరవం ఒసగు" అని ప్రార్థించారు. దైవప్రవక్త (స) గారి ఈ మాటలకు హజ్రత్ ఉమర్ ఇస్లామ్ ఛత్రఛాయలోనికి ప్రవేశిస్తూ, **"అష్‌హదుఅల్లా ఇలాహ ఇల్లల్లాహ్ వ ఇన్నక రసూలుల్లాహ్"** (అల్లాహ్ తప్ప వేరే పూజ్యుడెవడూ లేడని, మీరు అల్లాహ్ ప్రవక్త అని నేను సాక్ష్యం ఇస్తున్నాను) అనే కలిమా చదివారు. అక్కడ గుమిగూడిన వారు ఈ వచనాలు విన్నంతనే 'అల్లాహు అక్బర్' అనే తక్బీర్‌ను, మస్జిదె హరాంలో కూర్చుని ఉన్న వారందరికి వినిపించేటంత బిగ్గరగా పలికారు.[70]

హజ్రత్ ఉమర్ (ర) గారి శక్తికి ఎదురు వచ్చే ధైర్యం ఎవ్వరూ చేయలేరన్న విషయం మనకు తెలిసిందే. ఆయన ముస్లిమ్ అయిపోయారన్న వార్త తెలియగానే బహుదైవారాధకుల్లో గుబులుపుట్టింది. తలవంపు అయినట్లు భావించారు. మరోప్రక్క ఆయన ఇస్లామ్ స్వీకారం వలన ముస్లిములకు గొప్ప

70. తారీఖ్ ఉమర్ బినుల్-ఖత్తాబ్ పుట.7,10,11- ముక్తరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లాహ్, పుట. 102,103; సీరత్ ఇబ్నె హష్షామ్-1/343-346.

గౌరవం, శక్తి లభించాయి. చెప్పలేని ఆనందం కలిగింది. ఇబ్నె ఇస్హాక్, హజ్రత్ ఉమర్ (ర) గారి ఉల్లేఖనాన్ని ఉల్లేఖిస్తూ ఇలా రాస్తున్నారు.

"నేను ముస్లిమ్‌కాగానే, మక్కాలో దైవప్రవక్త (స)ను విరోధించడంలో ఎవరు ముందడుగులో ఉన్నారు? అని ఆలోచించాను. అతను అబూ జహల్ ఒక్కడే అని తలచి అతని ఇంటి గుమ్మంలోనికి వెళ్ళి తలుపుతట్టాను. అతను బయటకు వచ్చి నన్ను చూసి స్వాగతం, సుస్వాగతం. ఏమిటి ఇలా వచ్చారు అని అడిగాడు. నేను అతనితో, నేను ఇస్లామ్ స్వీకరించాను. దాన్ని సత్యధర్మ మని ధృవీకరిస్తున్నాను అని చెప్పగానే, (అది విన్న అతడు) నేను అక్కడ నిలబడి ఉండగానే తలుపులు మూసేసుకుంటూ "అల్లాహ్ నిన్ను నాశనం చేయా! నీవు నా వద్దకు తెచ్చిన వార్త కూడా నాశనం కానూ!" అన్నాడు.[71]

ఇమామ్ ఇబ్నె జూజీ, హజ్రత్ ఉమర్ ఉల్లేఖనాన్ని ఇలా ఉల్లేఖిస్తున్నారు. "ఎవరైనా ముస్లిముగా మారిపోతే వీరు అతని వెంటపడి హింసించేవారు. నేనూ వారిని బాదేవాణ్ణి. నేను ముస్లిముగా మారిపోయిన తరువాత నా మేనమామ ఆసీ బిన్ హాషిమ్ ఇంటికి వెళ్ళి నేను ముస్లిముగా మారానని చెప్పాను. అతను కూడా ఇంటిలోనికి వెళ్ళి తలుపులు మూసుకున్నాడు. ఆ తరువాత ఖురైషుకు చెందిన పెద్ద మనిషి వద్దకు వెళ్ళాను (బహుశా ఇతను అబూ జహల్ కావచ్చు). అతనికి ఈ విషయం చెప్పగానే అతనూ ఇంటిలోనికి వెళ్ళిపోయాడు."[72]

ఇబ్నె హష్షామ్ మరియు ఇబ్నె జూజీల కథనం ప్రకారం, హజ్రత్ ఉమర్ (ర) ఇస్లామ్ స్వీకరించగానే జమీల్ బిన్ మోమర్ హమ్జీ ఇంటికి వెళ్ళారు. ఇతను వార్తల్ని ప్రజల్లో వ్యాపింపజేయడంలో ఖురైష్ మొత్తంలో అగ్రగణ్యుడు. హజ్రత్ ఉమర్ అతని వద్దకు వెళ్ళి తాను ముస్లిముగా మారిపోయాననే వార్తను వినిపించారు. ఇది విన్న అతను పెద్దపెట్టున అరుస్తూ ఖత్తాబ్ కుమారుడు మార్గభ్రష్టుడయ్యాడొహో! అని అరిచాడు. హజ్రత్ ఉమర్ ఆయన వెనుకాలే నిలబడి, "ఇతను అసత్యమాడుతున్నాడు, నేను ముస్లిమునైపోయాను" అని పలికారు. ప్రజలు ఆయనపై విరుచుకుబడ్డారు. దొమ్మి ప్రారంభం అయింది. ప్రజలు హజ్రత్ ఉమర్‌ను బాదుతూ ఉంటే ఆయన వారిని బాదుతున్నారు. ఈ క్రమం సూర్యుడు నెత్తిమీదికి వచ్చినంతసేపు సాగింది. హజ్రత్ ఉమర్ అలసి

71. ఇబ్నె హష్షామ్-1/349, 350.

72. తారీఖ్ ఉమర్ బినుల్ ఖత్తాబ్-పుట. 8

పోయి ఓ చోట కూర్చున్నారు. ఖురైష్ ప్రజలు ఆయన్ను కొడుతూనే ఉన్నారు. "మీకు చేతనైనది చేసుకోండి! దైవసాక్షి! మా సంఖ్య మూడొంద లుంటే, మక్కాలో మీరైనా ఉండేవారు లేదా మేమైనా ఉండేవారం" అని అన్నారు.[73]

ఆ తరువాత బహుదైవారాధకులు, ఉమర్(ర)ను చంపేసే ఉద్దేశ్యంతో ఆయన ఇంటిమీదికి వచ్చారు. సహీబుఖారీలో హజ్రత్ ఉమర్ (ర) గారి ఉల్లేఖనం ఇలా ఉంది; నేను భయం చేత నా ఇంటిలో కూర్చుని ఉండగా, అబూ అమ్రూ బిన్ ఆస్ బిన్ వాయిల్ అక్కడికి వచ్చాడు. అంచుగల యమనీ దుప్పటితో తయారు చేసిన అంగవస్త్రం, పట్టు అంచు కలిగిన చొక్కా తొడుక్కుని ఉన్నాడు. అతను 'సహమ్' తెగకు చెందినవాడు. ఈ తెగ అజ్ఞాన కాలంలో (అంటే నేను ఇస్లామ్ స్వీకరించకమునుపు) మాకు మిత్రపక్షంగా ఉండేది. అతను నన్ను చూసి, ఏమైందని అడిగాడు. దానికి సమాధానంగా, "నేను, ముస్లిమునైపోయాను ఆ కారణంచేత మీ జాతి నన్ను చంపేయాలని చూస్తోంది" అని అన్నాను.

"ఇది అసాధ్యం!" అని అతను నాకు భరోసా ఇచ్చాడు. ఆ భరోసాతో నాకు సాంత్వన చేకూరింది. ఆస్ అక్కడ నుండి బయటకు వచ్చాడు. అప్పుడు ఆ లోయంతా ప్రజలతో కిటకిటలాడుతోంది. ఆస్ వారినుద్దేశించి మీ ఉద్దేశ్యం ఏమిటి? అని అడగ్గా, వారు ఈ ఖత్తాబ్ కుమారుడే మాకు కావాలి. ఇతను ధర్మభ్రష్టుడైపోయాడు అని అన్నారు. "లేదు! మీరు ఆయన దగ్గరకు పోయే మార్గం లేదు" అని పలకగా ప్రజలంతా ఎవరి దారిన వారు వెళ్ళి పోయారు.[74] "దైవసాక్షి! అది ఓ వస్త్రం. దాన్ని పై నుండి దులిపి క్రిందికి పారవేసేటట్లుంది ఆ పరిస్థితి" అని ఉంది.[75]

హజ్రత్ ఉమర్ (ర) ఇస్లామ్ స్వీకరించినప్పుడు బహుదైవారాధకుల పరిస్థితి అది. ఇక మిగిలింది ముస్లిముల పరిస్థితి, ఇబ్నె అబ్బాస్ (ర) ముజాహిద్‌తో చెప్పిన మాటల ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనం ఇలా ఉంది.

"నేను ఉమర్ (ర) ను అడిగాను. మీకు ఫారూఖ్ అనే బిరుదు ఎలా

73. తారీఖ్ ఉమర్ బినుల్ ఖత్తాబ్-పుట. 8; ఇబ్నె హష్షామ్-1/348, 349.
74. సహీబుఖారి, ఇస్లామ్ అధ్యాయం, ఉమర్ బిన్ ఖత్తాబ్-1/545, ఇబ్నె ఇస్హాక్ గారి ఓ ఉల్లేఖనం ప్రకారం.
75. ఇబ్నె హష్షామ్-1/349.

వచ్చింది అని. ఆయన నాతో, నాకు మూడు రోజుల ముందే హజ్రత్ హమ్‌జా (ర) ముస్లిముగా మారిన సంగతి తెలిసింది. ఆ తరువాత ఆయన తన ఇస్లామ్ స్వీకార సంఘటన గురించి ఏకరువుపెడుతూ చివరన ఇలా అన్నారు. "నేను ముస్లిముగా మారిపోయిన తరువాత దైవప్రవక్త(స)ను అడిగాను, ఓ దైవప్రవక్తా! మనం చనిపోయినా, బ్రతికినా సత్యంపై లేమా?" అని. దానికి ప్రవక్తశ్రీ(స) "ఎందుకు లేము? ఎవరి పిడికిటనయితే నా ప్రాణాలున్నాయో ఆ అల్లాహ్ సాక్షి! మీరు మరణించి ఉన్నా, జీవించి ఉన్నా సత్యంపైనే ఉన్నారు" అని అన్నారు. "అయితే మనం ఇలా దాగి ఉండడం దేనికి? ఎవరయితే మిమ్ముల‌ను సత్యం ఇచ్చి పంపించాడో ఆ దైవం సాక్షి! మనం తప్పకుండా బయటకు వెడదాము" అన్నాను. ఆ తరువాత మేము రెండు వరసలుగా తీరి ఆయన (స)ను వెంట బెట్టుకొని బయటకు వచ్చాము. ఓ వరసలో హజ్రత్ హమ్జా (ర), మరో వరసలో నేను ఉన్నాము. మేము నడుస్తూ ఉండగా లేచిన తేలికపాటి దుమ్ము తిరుగలి తిరిగినప్పుడు లేచే పిండిలా ఉంది. అలాగే మేము మస్జిదె హరాంలో ప్రవేశించాం. ఖురైష్ నన్నూ, హమ్‌జా (ర)ను చూడగానే వారికి ఇప్పటి వరకు కలగనంత బాధ కలిగింది. ఆనాడే దైవప్రవక్త (స) నాకు ఫారూఖ్ అనే బిరుదును ఒసిగారు.[76]

హజ్రత్ ఇబ్నె మస్‌ఊద్ (ర) ఇలా అంటారు.

"మాకు, హజ్రత్ ఉమర్ (ర) ఇస్లామ్ స్వీకరించనంత వరకు కాబా గృహంలో నమాజు చేసే శక్తి లేకుండా ఉండింది."[77]

హజ్రత్ సుహైబ్ బిన్ సినాన్ రూమీ (ర) కథనం ప్రకారం, హజ్రత్ ఉమర్ (ర) ముస్లిము అయిన తరువాతే, ఇస్లామ్ తెరమరుగు నుండి బయటకు వచ్చింది. బాహాటంగా ప్రచారం మొదలయింది. మేము చిన్న చిన్న గుంపులుగా చేరి కాబా చుట్టూ కూర్చోగలిగాము. కాబా తవాఫ్ (ప్రదక్షిణ) చేశాము. మాపై దౌర్జన్యం చేసిన వారిపై పగతీర్చుకుంటూ కొన్ని హింసలకు సమాధానం కూడా చెప్పాము."[78]

హజ్రత్ ఇబ్నె మస్‌ఊద్ (ర) గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది.

76. తారీఖ్ ఉమర్ బిన్ ఖత్తాబ్-అల్ ఇబ్నెజూజీ పుట. 6,7.
77. ముక్తరుస్సీరత్, షేఖ్అబ్దుల్లాహ్ పుట.103
78. తారీఖ్ ఉమర్ బిన్ ఖత్తాబ్ - అల్ఇబ్నె జూజీ పుట. 13.

"హజ్రత్ ఉమర్ (ర) ఇస్లామ్ స్వీకరించినప్పటి నుండి మేము శక్తిని పుంజుకుంటూ గౌరవంగా తిరగగలిగాము."[79]

దైవప్రవక్త (స) సన్నిధికి ఖురైష్ దూత

ఆ రోజుల్లో, హజ్రత్ హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ మరియు ఖత్తాబ్ కుమారుడు హజ్రత్ ఉమర్ (ర) ఇద్దరూ ఇస్లామ్ స్వీకరించడం వల్ల ముస్లిములపై జరుగుతున్న ఆగడాలు కొంత తగ్గుముఖం పట్టాయి. ముస్లిములను హింసించే బహుదైవారాధకుల వైఖరి మారి, వివేకంతో కూడిన పంథాను అందుకుంది. కాబట్టి బహుదైవారాధకులు ఇక హింసాదౌర్జన్యాలతో ముస్లిములను సందేశ ప్రచారం చేయకుండా అడ్డుకోలేము అని గ్రహించి మహాప్రవక్త (స) గారితో ఆ ప్రచారాన్ని ఆపుజేయమని చెప్పడానికి బేరసారాలకు దిగవలసి వచ్చింది. అయితే ఈ అమాయకులకు, సందేశ ప్రచారానికి బదులుగా ఈ విశ్వాన్నంతటిని ఇచ్చినా అది ఆగేది కాదు అన్న విషయం ఏం తెలుసు? కాబట్టి వారు తమ ఈ ప్లానులో కూడా అపజయం పొందవలసివచ్చింది.

ఇబ్నె ఇస్హాక్, యజీద్ బిన్ జయ్యాద్ మాధ్యమంగా, ముహమ్మద్ బిన్ కఅబ్ ఉల్లేఖనాన్ని ఉటంకిస్తూ ఇలా చెప్పారు. ముహమ్మద్ బిన్ కఅబ్ ఉల్లేఖనం ఇలా ఉంది.

"జాతికి నాయకునిగా ఉన్న ఉత్బా బిన్ రబీయా, ఓ రోజు మస్జిదె హరామ్‌లో దైవప్రవక్త(స) ఓ చోట ఒంటరిగా కూర్చుని ఉండగా చూసి, ఖురైష్ నుద్దేశించి, "ఓ ఖురైష్ ప్రజలారా! ముహమ్మద్ (స) వద్దకు వెళ్ళి నేనెందుకు మాట్లాడకూడదు? ఆయన ముందు కొన్ని ప్రతిపాదనలను పెడతాను. బహుశా ఆయన వాటిని ఒప్పుకోవచ్చు. ఆయన ఒప్పుకున్న వాటిని మనం ఆయనకు ఇచ్చివేద్దాం. ఆయన్ను తన పని చేయకుండా అడ్డుకోవచ్చు ఏమంటారు?" అని అన్నాడు. అప్పటికి హజ్రత్ హమ్జా (ర) ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ఉన్నారు. ముస్లిముల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండడం వారు గమనిస్తూనే ఉన్నారు.

బహుదైవారాధకులు, "ఓ అబుల్ వలీద్! వెళ్ళండి, ఆయనతో మాట్లాడండి" అని అనుమతినివ్వగా, అతను మహాప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. (అదను చూసి) "సోదర కుమారా! మా జాతిలో నీకున్న హోదా, గౌరవం,

79. సహీబుఖారి, ఇస్లామ్ అధ్యాయం, ఉమర్ బిన్ ఖత్తాబ్-1/545.

నీ వంశోన్నత్యం ఏమిటో నీకు బాగా తెలుసు. ఇప్పుడు నీవు నీ జాతిలో ఓ పెద్ద సమస్యను తీసుకొచ్చిపెట్టావు. దాని ద్వారా నీవు వారిలో విభేదం సృష్టిస్తున్నావు. వారి బుద్ధివివేచనలను పనికిమాలినవిగా ఖరారు చేస్తున్నావు. వారి ఆరాధ్య దైవాలను కించపరుస్తున్నావు. గతించిపోయిన వారి తాతముత్తా తల్ని దైవతిరస్కారులని అంటున్నావు. అందుకని నా మాటలను శ్రద్ధగా విను. నీ ముందు నేను కొన్ని ప్రతిపాదనలను ఉంచుతున్నాను. వాటి గురించి బాగా ఆలోచించు. బహుశా ఏదో ఒకటి నీకు నచ్చకపోదు" అని అన్నాడు. ఇది విన్న మహాప్రవక్త (స) అతనితో, "అబుల్ వలీద్! చెప్పండి. నేను మీరు చెప్పింది శ్రద్ధగానే వింటాను" అని అన్నారు.

"సోదర కుమారా! నీవు తీసుకొచ్చిన వ్యవహారం ఏదయితే ఉందో ఆ విషయంలో నీవు నీకు ఏది కావాలో చెప్పు. డబ్బు కావాలనుకుంటే నీవు మాకందరికంటే గొప్ప ధనవంతుడవయ్యేటట్లు సంపదను కూడబెట్టి నీకిస్తాము. నీకే గనక నాయకత్వంగాని హోదాగాని కావాలని అనుకుంటే చెప్పు, నిన్ను మా సర్దారుగా, నాయకునిగా చేసుకుంటాము. నీవు లేకుండా ఏ తీర్పు కూడా వెలువడడానికి వీలుండదు. నీవే గనుక మాకు రాజువు కాదలుచుకుంటే, నిన్ను మా రాజుగా చేస్తాము. నీ వద్దకు వచ్చేవాడు (జిబ్రీల్) జిన్నో, భూతమో అయితే చెప్పు, దాన్ని మేము నీ దగ్గరకు రాకుండా భూతవైద్యం చేసి పారద్రోలగలం. దీనికోసం మేము ఎంత ఖర్చుబెట్టవలసి వచ్చినా ఖర్చుబెడతాము. నీకు స్వస్థత చేకూరితే అంతే చాలు. జిన్ను, దెయ్యం, భూతం పట్టిన వానికి చికిత్స తప్పనిసరిగా చేయవలసి ఉంది" అంటూ ఏదేదో చెబుతున్నాడు ఉత్బా. దైవప్రవక్త(స) ఇదంతా వింటూ కూర్చున్నారు. తాను చెప్పేదంతా చెప్పిన తరువాత ఆయన (స) ఉత్బాను సంబోధిస్తూ,

"అబుల్ వలీద్! నీవు చెప్పడం పూర్తి అయిందా?" అని అడిగారు.

"అవును. నేను చెప్పేది చెప్పేశాను" అని అనగానే దైవప్రవక్త(స) ఇలా అన్నారు.

"అయితే నేను చెప్పేది కూడా విను! అంటూ **బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం** అని పఠించి; దివ్య ఖుర్ఆన్‌లోని హామీమ్ సజ్దా సూరాను పఠించ నారంభించారు.

حٰمٓ ۚ﴿١﴾ تَنْزِيْلٌ مِّنَ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۚ﴿٢﴾ كِتٰبٌ فُصِّلَتْ اٰيٰتُهٗ
قُرْاٰنًا عَرَبِيًّا لِّقَوْمٍ يَّعْلَمُوْنَ ۙ﴿٣﴾ بَشِيْرًا وَّنَذِيْرًا ۚ فَاَعْرَضَ اَكْثَرُهُمْ
فَهُمْ لَا يَسْمَعُوْنَ ﴿٤﴾ وَقَالُوْا قُلُوْبُنَا فِيْٓ اَكِنَّةٍ مِّمَّا تَدْعُوْنَآ اِلَيْهِ

"హామీమ్! ఇది కరుణామయుడూ, కృపాశీలుడూ అయిన దేవుని సన్నిధి నుండి అవతరింపజేయబడిన; స్పష్టంగా వివరించబడిన వాక్యాలు గల గ్రంథం. అరబ్బీ భాషలో ఉన్న(ఈ) ఖుర్ఆన్, జ్ఞానుల కొరకు; ఇది శుభవార్తను ఇచ్చేది, భయపెట్టేదీను.

కాని వారిలో చాలా మంది దాని పట్ల విముఖులయ్యారు. కనుక వారు వినరు. **"నీవు దేని వైపునకు మమ్మల్ని పిలుస్తున్నావో, దానిని గురించి మా హృదయాలను తెరలు కప్పివేశాయి (చివరి వరకు)."**

దైవప్రవక్త(స) అలా పఠిస్తూనే ఉన్నారు. ఉత్బా తన రెండు చేతుల్ని తన వీపు వెనక భాగాన నేలకు ఆనించి నిశ్శబ్దంగా ఖుర్ఆన్ వాక్యాలను ఆలకిస్తూ ఉన్నాడు. దైవప్రవక్త(స) సజ్దా చేసే ఆయత్ పఠించి సజ్దా చేశారు. ఆ తరువాత ఉత్బాను ఉద్దేశించి,

"అబుల్ వలీద్! నీవు వినవలసినదంతా వినేశావు కదా! ఇక నీవు నీ ఇష్టప్రకారం కానీ" అని చెప్పేశారు.

ఉత్బా లేచి తన బృందం వైపునకు నడిచాడు. అతణ్ణి చూడగానే బహుదైవారాధకులు పరస్పరం ఒకరినుద్దేశించి మరొకరు, "దైవసాక్షి! అబుల్ వలీద్ ముఖం చూశారా! ఇక్కడ నుండి వెళ్ళేటప్పుడు ఉన్నట్లుగా లేడు!" అని గుసగుసలాడనారంభించారు. అబుల్ వలీద్ వచ్చి కూర్చోగానే వారు, అక్కడ ఏం జరిగింది? అని అడిగారు. అతను వారినుద్దేశించి, "దైవసాక్షిగా చెబుతున్నాను, నేను అక్కడ విన్నది నా జీవితంలో ఎప్పుడూ వినలేదు. దైవసాక్షి! అది కవిత్వంగాని, ఇంద్రజాలంగాని, జోతిష్యుల మంత్రాలుగాని కావు. ఖురైష్ ప్రజలారా! నా మాట వినండి. అతని విషయం నాకు వదిలేయండి. నా సలహా ప్రకారం అతణ్ణి అతని మానాన వదిలేసి వేరుగా కూర్చుని ఉండండి. దైవసాక్షి! నేను అతని నోట విన్న మాట ప్రకారం ఓ బ్రహ్మాండమయిన సంఘటన జరిగితీరుతుంది. ఒకవేళ అతణ్ణి మిగతా అరబ్బులు చంపేస్తే మీ పని ఇతరులు చేసిపెట్టినట్లవుతుంది. లేదా అతనే అరబ్బుల్ని జయిస్తే అతని

రాచరికం మీ రాచరికమే అవుతుంది. అతని గౌరవం మీ గౌరవమే. అతని అస్తిత్వం అందరికంటే మీ శ్రేయం కోసమే సుమా" అని చెప్పి ఊరకుండిపోయాడు.

దానికి, "అబుల్ వలీద్! దైవసాక్షి! అతని ఇంద్రజాలం నీపై కూడా ప్రసరించినట్లుందే!" అని వారంతా అన్నారు. అది విన్న ఉత్బా, "ఈయనగారి విషయంలో నా సలహా మాత్రం అదే. ఇక మీకు ఏది సరిగా తోస్తే అది చేయండి"[80] అని అన్నాడు.

మరో ఉల్లేఖనంలో, దైవప్రవక్త(స) గ్రంథ పఠనాన్ని ప్రారంభించాక ఉత్బా దాన్ని చాలా శ్రద్ధగా విన్నాడని, దైవప్రవక్త(స) ఈ వాక్యం (ఆయత్), **"ఇప్పుడు ఒకవేళ వారు విముఖులయితే, వారితో ఇలా అను. ఆద్, సమూద్ జాతులపై అవతరించినటువంటిదీ అకస్మాత్తుగా విరుచుకుపడేదీ అయిన ఒక శిక్షను గురించి నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను"** (41-13) పఠించగానే ఉత్బా గడగడలాడుతూ భయంతో నిలబడిపోయాడు. తన చేతిని దైవప్రవక్త (స) గారి నోటికి అడ్డం పెడుతూ, "అల్లాహ్ మరియు మన బంధుత్వాన్ని దృష్టిలో పెట్టుకొని అలా చెప్పకండి" అని వారించాడు. అతనికి, ఈ శిక్ష ఎక్కడ వచ్చి పడుతుందో అనే భయం పట్టుకుంది. ఆ తరువాత అతని బృందం వద్దకు వెళ్ళి పైన చెప్పిన మాటలే చెప్పాడు.[81]

అబూ తాలిబ్, బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్‌లను సమావేశ పర్చడం

పరిస్థితులు మారిపోతున్నాయి. చుట్టూ ఉన్న వాతావరణంలోను మార్పు వచ్చేసింది. అయినా, అబూ తాలిబ్ మనస్సు మాత్రం ప్రమాదాన్ని శంకిస్తూనే ఉంది. బహుదైవారాధకుల వైపు నుండి తన సోదర కుమారునికి ప్రమాదం ఏర్పడగలదనే భయం మాత్రం ఆయనను వెంటాడడం మానలేదు. గతంలో జరిగిన సంఘటనలు ఒక్కొక్కటిగా ఆయన కళ్ళెదుట ప్రత్యక్షమవుతున్నాయి. ఆయన కుమారుణ్ణి చంపడానికి ఆయనకు బదులుగా అమ్మారా బిన్ వలీద్‌ను ఇచ్చే బేరసారాలు చేశారు. అబూ జహల్ భారమైన బండరాయిని ఎత్తుకుని ఆయన సోదర కుమారుని తలపై వేయడానికి ప్రయత్నం చేశాడు.

80. ఇబ్నెహిషామ్-1/293,294. *81. తఫ్సీర్ ఇబ్నె కసీర్-6/159,160,161.*

ఉక్బా బిన్ అబీముఅయిత్ దుప్పటి మెడలో వేసి గొంతు నులిమి చంపడానికి ప్రయత్నించాడు. ఖత్తాబ్ కుమారుడు ఖడ్గం చేతబూని ముహమ్మద్ (స)ను హతమార్చడానికి బయలుదేరాడు. ఈ సంఘటలన్నింటిని మననం చేసుకుంటూ ఈ పరిస్థితిలో ఏ బహుదైవారాధకుడైనా ఆయన (స) పై విరుచు కుపడితే హజ్రత్ హమ్‌జా (ర) గాని, హజ్రత్ ఉమర్ (ర) గాని మరెవరుగాని ఎలా ఆదుకోగలరు?

అబూ తాలిబ్‌కు ఇది సాధ్యమే అనిపించింది. మొత్తానికి ఇది యదార్థం కూడాను. ఎందుకంటే, బహుదైవారాధకులు బాహాటంగా దైవప్రవక్త(స)ను హతమార్చేందుకే కంకణం కట్టుకుని ఉన్నారు. వారి ఈ నిర్ణయానికి సంబం ధించిన సంకేతం దైవవాణిలోనూ అవతరించి ఉంది.

أَمْ أَبْرَمُوٓا۟ أَمْرًا فَإِنَّا مُبْرِمُونَ

"వారు ఏదైనా చర్యను తీసుకోవడానికి నిర్ణయించుకున్నారా? అలా అయితే మేము కూడా ఒక నిర్ణయం తీసుకుంటాము." (43-79)

ఇప్పుడు అబూ తాలిబ్ ఏం చేస్తారు అన్నదే ప్రశ్న. ఖురైష్ తన సోదరుని కుమారుణ్ణి అన్ని వైపుల నుండి వ్యతిరేకించటం చూసి, తన ముత్తాత అబ్దె మునాఫ్ కుమారులు హాషిమ్ మరియు ముత్తలిబ్ ద్వారా ఉనికిలోనికి వచ్చిన వంశం వారందరిని ఓ చోట సమావేశపరిచారు. తాను ఇప్పటి వరకు ఒంట రిగా తన సోదరుని కుమారుణ్ణి కాపాడుతూ వచ్చానని, ఇక ముందు అందరు కలిసి ముహమ్మద్ (స)ను ఖురైష్ బారి నుండి కాపాడాలని పిలుపునిచ్చారు. అబూ తాలిబ్ చేసిన ఈ అభ్యర్థనను అరబ్బుల పౌరుషం దృష్ట్యా, ఆ రెండు కుటుంబాలకు చెందిన వారంతా స్వీకరించారు. అయితే అబూతాలిబ్ సోదరుడు అబూ లహబ్ ఒక్కడు మాత్రం దీన్ని ఒప్పుకోకుండా తన కుటుంబం నుండి వేరుపడి ఖురైష్ బహుదైవారాధకులతో కలసిపోయి వారికి అండగా నిలిచిపోయాడు.[82]

82. ఇబ్నె హిషామ్-2/269; ముక్తతరుస్సీరత్ షేఖ్ అబ్దుల్లా-పుట.106.

సంపూర్ణ సంఘ బహిష్కరణ

(TOTAL SOCIAL BOYCOTT)

కేవలం నాలుగు వారాలు లేదా అంతకు తక్కువ కాలంలోనే బహు దైవారాధకులకు నాలుగు పెద్ద విఘాతాలు కలిగాయి. అంటే, హజ్రత్ హమ్‌జా (ర) ఇస్లామ్ స్వీకారం, ఆ తరువాత హజ్రత్ ఉమర్ (ర) ముస్లిము అయిపోవడం. ఆపై ముహమ్మద్ (స) వారి బేరసారాలను తిరస్కరించడం. ఆ తరువాత బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్ కుటుంబాలకు చెందిన వారంతా ఒక్కటై దైవప్రవక్త(స)ను సంరక్షించే ప్రమాణం చేయడం. ఈ విఘాతాల వల్ల బహుదైవారాధకులు తెల్లబోయారు. తెల్లబోక మరేం చేస్తారు? దైవప్రవక్త(స)ను హతమార్చడానికి ప్రయత్నిస్తే, ఆయన సంరక్షణ కోసం మక్కా కొండలోయ అంతా బహుదైవారాధకుల రక్తంతో ఎరుపెక్కిపోతుంది మరి. అదే కాదు, బహుశా వారంతా తుడుచుకుపోయినా తుడుచుకుపోవచ్చు. అందు కని వారు ప్రవక్త (స) గారి హత్యా ప్రయత్నాన్ని మాని, దౌర్జన్యం చేసే మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఇది వారు ఇప్పటి వరకు అవలంబించిన మార్గాల్లోకెల్లా అతి భయంకరమైన మార్గం.

హింసాదౌర్జన్యాల కోసం చేసిన ప్రమాణం

ఈ ప్రతిపాదనకు అనుగుణంగా బహుదైవారాధకులు 'ముహస్సిబ్' అనే కొండలోయలోని, ఖైఫె బనీ కనానలో సమావేశమయ్యారు. బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్ కుటుంబాలకు వ్యతిరేకంగా ప్రమాణాలు చేశారు. ఆ ప్రమాణాల్లో దైవప్రవక్త(స)ను చంపడానికి అప్పజెప్పనంతమట్టుకు, ఇక నుండి ఆ రెండు కుటుంబాలతో వివాహాది సంబంధాలు పెట్టుకోము అని, వారితో ఎలాంటి వ్యాపారం (కొనడం, అమ్మడం) సాగించము అని, వారితో కలసి ఉండడంకాని చేయము అని, వారి ఇళ్ళకు వెళ్ళడంగాని, వారితో మాట్లా డడం వగైరాలు జరుపము అని ప్రమాణాలు చేశారు. బహుదైవారాధకులు ఈ బహిష్కరణకు (బైకాట్‌కు) దస్తావేజుగా ఓ పత్రం రాసుకున్నారు. ఆ ప్రమాణ

పత్రంలో, దైవప్రవక్త (స)ను చంపేయడానికి వారికి అప్పజెప్పనంతమట్టుకు బనీ హాషిమ్ వారితో, వారు ఎలాంటి సంధి సలహాలకు వచ్చినా సరే వినేదేలేదని ప్రమాణం చేస్తూ సంతకాలు పెట్టారు.

ఇబ్నె ఖైమ్ ప్రకారం, ఈ ప్రమాణ పత్రం మన్సూర్ బిన్ అక్రమా బిన్ ఆమిర్ బిన్ హాషిమ్ రాశాడు. మరికొందరి ప్రకారం, నజ్ర్ బిన్ హారిస్ రాశాడన్నట్లు ఉంది. అయితే ప్రామాణికమైన విషయం ఏమిటంటే, దాన్ని రాసినవాడు బగీయన్ బిన్ ఆమిర్ బిన్ హాషిమ్. దైవప్రవక్త (స) శపించినందుకు అతని చేయి పనిచేయకుండాపోయింది.[1]

మొత్తానికి ఆ ప్రమాణం జరిగి, ఆ పత్రాన్ని కాబా గృహంలో వ్రేళ్ళాడ దీయడం జరిగింది. దాని ఫలితంగా అబూ లహబ్ తప్ప బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్‌కు చెందిన వారంతా - వారు ముస్లిములైనా లేదా దైవతిరస్కారులైనా 'షిఅబె అబీతాలిబ్'లో బంధించబడ్డారు. ఈ సంఘటన దైవదౌత్యం లభించిన పదవ ఏట ముహర్రం నెలపొడుపు నాటి రాత్రి జరిగిన సంఘటన.

షిఅబె అబీతాలిబ్‌లో మూడేళ్ళు

ఈ బహిష్కరణ కారణంగా పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చాయి. ధాన్యం, తినుబండారాలు రావడం ఆగిపోయింది. మక్కాకు అమ్మకానికి వచ్చే ధాన్యాన్నిగానీ ఆహార పదార్థాలనుగానీ బహుదైవారాధకులు పరుగునవెళ్ళి కొనేసేవారు. ఇలా దిగ్బంధంలో ఉన్న ముస్లిముల పరిస్థితి మరింత దిగజారిపోనారంభించింది. వారు ఆకులు, తోళ్ళు తినడానికి కూడా వివశులైపోవలసి వచ్చింది. ఆకలి బాధతో పిల్లలు, స్త్రీలు పెట్టే ఆర్తనాదాలు ఆ లోయ బయట ఉన్న వారికి కూడా వినిపించేవి. వారి వద్దకు ఏదైనా పదార్థం చేరితే అతి కష్టంగా చేరగలిగేది. హుర్మత్ మాసాలు (నిషిద్ధ మాసాలు) తప్ప, ఇతర దినాల్లో బయటకు వచ్చేవారు కాదు. ఆ రోజుల్లోనూ మక్కాకు, ఇతర ప్రదేశాల నుండి వ్యాపారార్థం వచ్చే బిడారాల నుండి తమకు కావలసిన ఆహార పదార్థాలు వారు కొనగలరు కాని బహుదైవారాధకులు ఆ సరుకుకు ధర హెచ్చించి కొనడం వలన అంత ధరపెట్టి దిగ్బంధంలో ఉన్న ముస్లిములు కొనలేకపోయేవారు.

1. జాదుల్ ముఆద్-2/46.

హజ్రత్ ఖదీజా (ర) గారి అన్న కుమారుడైన హకీం బిన్ హిజామ్ అప్పుడప్పుడు ఎవరి కంటాబడకుండా గోధుమల్ని ఆమెకు పంపించేవాడు. ఓసారి అబూ జహల్ కంటబడగా అతను ఆ గోధుమల్ని అక్కడకు చేరకుండా అడ్డుకోవడం జరిగింది కూడా. పెద్ద రాద్ధాంతం చేయగా అబుల్ బక్తరీ అడ్డుపడి ఆ ధాన్యాన్ని తన మేనత్త వద్దకు పంపించడం జరిగింది.

ఇటు అబూ తాలిబ్‌కు, దైవప్రవక్త (స) గురించి ఆయనకు ఏ ప్రమాదం వచ్చిపడుతుందోనని బెంగగా ఉండేది. అందుకని ఆయన, అందరూ పడుకునే సమయంలో దైవప్రవక్త (స)ను పిలిచి, 'నీవు ఈ ప్రక్కపై పడుకో' అని అందరు వినేటట్లు చెప్పేవారు. ఎందుకంటే దైవప్రవక్త (స)ను ఎవరైనా చంపడానికి పొంచి ఉంటే ఆయన (స) ఎక్కడ నిద్రిస్తున్నారో తెలుస్తుంది. అందరు పడుకోగానే అబూ తాలిబ్ దైవప్రవక్త (స) గారి పడక స్థలాన్ని మార్చివేసేవారు. అంటే తన కుమారులు, సోదరులు లేదా సోదర కుమారుల్లో నుండి ఎవరో ఒకరిని దైవప్రవక్త (స) గారి ప్రక్కపై పరుండబెట్టి, దైవప్రవక్త (స)ను అతని ప్రక్క పైకి పంపి పడుకోబెట్టేవారు.

ఈ దిగ్బంధం ఇలా కొనసాగుతున్నా దైవప్రవక్త (స), ఇతర ముస్లిములు హజ్ రోజుల్లో బయటకు వచ్చి ఇస్లామ్ ధర్మ ప్రచారంలో నిమగ్నులై పోయేవారు. ఈ సందర్భంలో అబూ లహబ్ చేసే దుష్కృత్యాలను గురించి మనం వెనుకటి పుటల్లో చదువుకున్నాం.

ప్రమాణ పత్రం చించివేత

ఈ పరిస్థితులు పూర్తిగా మూడు సంవత్సరాలు కొనసాగాయి. ఆ తరువాత దైవదౌత్య శకం 10, ముహర్రం[2] మాసంలోనే ఆ ప్రమాణ పత్రం చించివేయడం, దౌర్జన్యకరమైన ఒడంబడిక అంతంకావడం జరిగింది. దీనికి కారణం, ఖురైష్‌కే చెందిన కొందరు ఈ ఒడంబడికకు అయిష్టంగా, మరి కొందరు ఒడంబడికకు అనుకూలంగా ప్రవర్తించడమే. దీనికి వ్యతిరేకంగా ఉన్నవారే దీన్ని చించివేయడానికి పూనుకున్నారు.

దీనికి అసలు కర్త బనూ ఆమిర్ బిన్ లవీ తెగకు చెందిన హష్షామ్ బిన్ అమ్రూ అనే వ్యక్తి. ఇతను రాత్రి చీకటిలో ఎవరి కంటాబడకుండా షిఅబె అబూ

2. అబూ తాలిబ్ ప్రమాణ పత్రం చించి వేయబడిన ఆరు నెలలకు చనిపోయారు. అది రజబ్ నెల. అందుకని ఆ నెల ముహర్రం నెలే అని రూఢీగా చెప్పవచ్చు.

తాలిబ్ లోయలో ధాన్యాన్ని పంపి బనూ హాషిమ్‌ను ఆదుకునేవాడు. ఇతను ఓ రోజు జుహైర్ బిన్ ఉమయ్యా మగ్జూమీ దగ్గరకు వెళ్ళాడు-జుహైర్ తల్లి ఆతికా, అబ్దుల్ ముత్తలిబ్ కుమార్తె. అంటే అబూ తాలిబ్ సోదరి-అతని దగ్గరకు పోయి, "జుహైర్! మీరంతా కడుపునిండా తినడం, త్రాగడం; మరి మీ మామగారు అలా పస్తులుండడం నీకు తెలిసిందే కదా?" అని అడిగాడు. దానికి జుహైర్, "అయ్యో! నేనేం చేయగలను చెప్పు. నాకు మరో మనిషి సహాయపడితే నేనా ప్రమాణ పత్రాన్ని చించిపారేయకపోదునా?" అని తన చేతకానితనాన్ని వెలిబుచ్చాడు.

"అయితే ఇంకో మనిషి కూడా ఉన్నాడు."

"ఎవరాయన?"

"నేనే" అని బదులిచ్చాడు అమ్రూ బిన్ హష్షామ్.

"సరే, మూడో వ్యక్తిని కూడా వెదుకు" అని చెప్పాడు జుహైర్.

హష్షామ్ నేరుగా ముత్‌యిమ్ బిన్ అద్దీ ఇంటికి వెళ్ళాడు. బనూ హాషిమ్ మరియు బనూ ముత్తలిబ్‌తో ముత్‌యిమ్‌కుగల సంబంధబాంధవ్యాల గురించి గుర్తుచేస్తూ, ఖురైష్‌తో కలసి వారికి అన్యాయం చేస్తూ పెట్టే బాధల గురించి ఎత్తిపొడిచాడు - ముత్‌యిమ్ కూడా అబ్దె మునాఫ్ వంశానికి చెందిన వాడే అనేది గమనార్హం- దానికి ముత్‌యిమ్, "అయ్యో! నేనొక్కణ్ణే ఏం చేయ గలను?" అని తన నిస్సహాయ స్థితిని తెలుపగా, హష్షామ్ అందుకొని, "మరొకరు కూడా ఉన్నార"న్నాడు. "అతనెవరు?" అని అడగ్గా 'నేనే' అని బదులిచ్చాడు హష్షామ్.

"అయితే మూడో మనిషిని కూడా తయారుచెయ్యి" అని అన్నాడు ముత్‌యిమ్.

"ఆ పని కూడా అయిపోయింది" హష్షామ్ సమాధానం.

"అతనెవరూ?"

"జుహైర్ బిన్ అబీ ఉమయ్యా."

"అయితే నాల్గో వ్యక్తి కూడా కావాలి" అని సలహా ఇచ్చాడు ముత్‌యిమ్.

హష్షామ్ బిన్ అమ్రూ హుటాహుటిన అబుల్ బఖ్తరీ బిన్ హష్షామ్ దగ్గరకు వెళ్ళాడు. ముత్‌యిమ్‌కు చెప్పినట్లుగానే చెప్పాడక్కడ.

"నీవు చెప్పేదాన్ని బలపరచేవారు ఇంకెవరైనా ఉన్నారా?" అని అడిగాడు అబుల్ బఖ్తరీ.

"ఉన్నారు" అన్నది హష్షామ్ సమాధానం.

"వారెవరూ" అని అడగగా,

"వారు జుహైర్ బిన్ అబీ ఉమయ్యా, ముత్‌యిమ్ బిన్ అద్దీ మరియు నేను" అని సమాధానమిచ్చాడు హష్షామ్.

దాని కోసమని హష్షామ్, జమ్‌అ బిన్ అస్వద్ బిన్ ముత్తలిబ్ బిన్ అసద్ అనే వ్యక్తి దగ్గరికి వెళ్ళాడు. అతనితో మాట్లాడుతూ, బనూ హాషిమ్‌తో అతనికిగల బంధుత్వాన్ని, వారి హక్కుల్ని గుర్తుచేస్తూ విషయం బయటపెట్టాడు. అతను ఇలా అన్నాడు.

"దీని కోసం నన్ను పిలుస్తున్నావా? ఇంకెవరైనా దానికి సిద్ధంగా ఉన్నారా?"

"ఔను" అని తలూపుతూ అందరి పేర్లు చెప్పాడు హష్షామ్.

ఆ తరువాత ఆ అయిదుగురు హజూన్ అనే చోట సమావేశమై, "మనం ఆ ప్రమాణ పత్రాన్ని చించిపారేద్దాం" అనే వాగ్దానాలు చేసుకున్నారు. దానికి ఓ ప్లాను పన్నుతూ జుహైర్ "మొదట నేనే ప్రారంభిస్తాను. అంటే మొదట దాని గురించి నేనే మాట్లాడుతాను" అనుకొని ఎవరిండ్లకు వారు వెళ్ళిపోయారు.

తెల్లవారగానే అందరూ మామూలుగా (కాబా వద్ద) వారి వారి స్థానాల్లో వచ్చి కూర్చున్నారు. జుహైర్ కూడా వస్త్రధారుడై అక్కడికి వచ్చాడు. కాబా గృహాన్ని ఏడుసార్లు ప్రదక్షిణ చేసి ప్రజలనుద్దేశించి ఇలా అనసాగాడు:

"ఓ మక్కా ప్రజలారా! మనం తినవచ్చు. వస్త్రాలను ధరించవచ్చు. అటు బనూ హాషిమ్ సర్వనాశనమైపోతున్నారు. వారికి ఏదీ అమ్మడంగాని, కొనడం గాని జరగడం లేదు. దైవసాక్షి! నేను చూస్తూ ఊరుకోలేను. బంధుత్వాన్ని త్రెంచేది, దౌర్జన్యాన్ని పురికొలిపేది అయిన ఆ దుష్ట ప్రమాణ పత్రాన్ని చించి వేయనంతవరకు నేనూరుకోను" అని బిగ్గరగా చాటిచెప్పాడు.

మస్జిదె హరాంలో ఓ మూలన కూర్చుని ఉన్న అబూ జహల్ లేచి, "నీవు చెప్పేదంతా బూటకం. దైవసాక్షి! దాన్ని చించేయడం కుదరదు" అని అడ్డు కున్నాడు. దానికి జమ్అ బిన్ అస్వద్ లేచి, "దైవసాక్షి! నీవే బొంకుతున్నావు. ఈ ప్రమాణ పత్రం మా ఇష్టానికి వ్యతిరేకంగా రాయబడింది. అందులో ఉన్న విషయాలను మేము ఒప్పుకోం" అన్నాడు. ఆ తరువాత ముత్యిమ్ బిన్ అద్దీ నిలబడి, "మీరిద్దరు చెప్పిందే సబబు. దీనికి వ్యతిరేకంగా చెప్పేవాడు చెప్పేదే తప్పు. మేము ఈ ప్రమాణ పత్రాన్ని చించి దైవం ఎదుట మా కర్తవ్యాన్ని నెరవేర్చుకుంటాం" అన్నాడు.

ఆ తరువాత హష్షామ్ బిన్ అమ్రూ కూడా అలానే అన్నాడు. ఇది గమనించిన అబూ జహల్, "ఓహో! ఇది రాత్రికిరాత్రే నిర్ణయించుకోబడిన విషయమా! ఇది ఇక్కడ కాకుండా మరెక్కడో జరిగిన కుట్రా?" అన్నాడు.

అబూ తాలిబ్ కూడా కాబా మస్జిద్ ఓ మూలలో కూర్చుని ఉన్నారు. ఆయన అక్కడకు రావడానికి కారణం, అల్లాహ్ తన ప్రవక్త (స)కు రాత్రే ఈ ప్రమాణ పత్రం గురించి తెలియజేయడం. ఆ పత్రంపై చెదలు పంపడం జరిగిందనీ, అవి ఆ దమన నీతి సూత్రాలను, బంధుత్వపు తెగతెంపుల వాక్యాలుగల ఆ ప్రమాణ పత్రాన్నీ తినివేశాయని, కేవలం అల్లాహ్ నామం మాత్రమే మిగిలి ఉండేటట్లు చేశాయని తెలియజేశాడు. దైవప్రవక్త (స) ఈ విషయం తమ బాబాయికి తెలియజేశారు. ఈ విషయమే ఖురైష్‌తో చెప్పమనగా ఆయన, "నా సోదర కుమారుడు ఈ విషయం మీతో చెప్పమని, అదే గనక అసత్యమైతే మేము ఆయనకు, మీకు మధ్యన అడ్డుగా నిలవం, మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి. అదే నిజమయితే మీరు మా బహిష్కరణను, మాపై చేసే దౌర్జన్యాన్ని మానుకోండి అని చెప్పడానికే అక్కడికి వచ్చానని" చెప్పారు. దీనికి ఖురైష్, "ఔను. మీరు న్యాయమైన విషయాన్నే చెబుతున్నారు" అని అన్నారు.

ఇటు అబూ జహల్ మరియు ఇతరుల మధ్యన జరుగుతున్న వాగ్వివాదం సద్దుమణిగింది. ముత్యిమ్ బిన్ అద్దీ ఆ పత్రాన్ని చించేయడానికి లేచాడు. ఇంకేముంది. దాన్ని చెదలు పట్టి పూర్తిగా తినివేసి ఉంది. కేవలం బిస్మికల్లాహుమ్మా (ఓ అల్లాహ్! నీ పేరుతో) అనే పదాలు మాత్రమే మిగిలి ఉన్నట్లు గమనించారు. ఎక్కడయితే అల్లాహ్ పేరు ఉందో చెదలు ఆ భాగాన్ని ముట్టుకోలేదు.

ఆ తరువాత ఆ పత్రం చించివేయబడింది. దైవప్రవక్త (స), ఇతరు లందరూ షిఅబె అబీ తాలిబ్ నుండి బయటకు వచ్చేశారు. బహుదైవా రాధకులు దైవదౌత్యపు ఓ గొప్ప సూచనను అక్కడ చూశారు, అయినా వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. దీని ప్రస్తావన ఈ క్రింది ఖుర్‌ఆన్ వాక్యంలో ఇలా ఉంది.

وَاِنْ يَّرَوْا اٰيَةً يُّعْرِضُوْا وَيَقُوْلُوْا سِحْرٌ مُّسْتَمِرٌّ ۝٢

"కాని, వారి పరిస్థితి ఎలా ఉందంటే, వారు ఏ సూచనను చూసినా తమ ముఖాలను త్రిప్పుకుంటున్నారు." (54 : 2)

కాబట్టి బహుదైవారాధకులు ఈ సూచనను చూసి కూడా ముఖాలు త్రిప్పుకున్నారు. తమ తిరస్కార మార్గంలో కొన్ని అడుగులు ఇంకా ముందుకు వేశారు.[3]

3. *బైకాట్‌కు సంబంధించిన ఈ వివరాలు ఈ దిగువ గ్రంథాల ఆధారంగా పొందు పర్చడం జరిగింది. సహీ బుఖారి, మక్కాలో ప్రవక్త(స)ను పై అవరణ అధ్యాయం. 1/216. బహుదైవారాధకులు ప్రవక్త(స)ను వేరుచేయడం అనే అధ్యాయం. 1/548. జాదుల్ ముఆద్-2/46, ఇబ్నె హష్షామ్-1/69,70; ముక్తరస్సీరత్ షేఖ్ అబ్దుల్లా, పుట.106-110 ముక్తరుస్సీరత్ షేఖ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, పుట. 68-73. ఈ ఆధారాల్లో కొంత అభిప్రాయభేదం ఉన్నా మేము ఖుర్‌ఆన్ వెలుగులో సరిఅయినవాటినే పొందుపరిచాం.*

అబూ తాలిబ్‌ను కలసిన ఖురైష్ చిట్టచివరి ప్రతినిధి బృందం

దైవప్రవక్త (స), షిఅబె అబీ తాలిబ్ నుండి బయటపడిన తరువాత మామూలుగా దైవసందేశ ప్రచారంలో నిమగ్నులైపోయారు. బహుదైవారాధకులు ఇప్పుడు బహిష్కరణను ఎత్తివేసినప్పటికీ మామూలుగానే ముస్లిములపై ఒత్తిడిని కొనసాగిస్తూ, దైవమార్గంపై నడవకుండా వారిని అడ్డుకోవడం మానుకోలేదు. అబూ తాలిబ్ విషయానికొస్తే ఆయన తన సంప్రదాయం ప్రకారం ప్రాణాలను కూడా లెక్కచేయకుండా తన సోదరుని కుమారుణ్ణి రక్షించడంలో, ఆయనకు మద్దతు ఇవ్వడంలో తన శక్తినంతటిని ఉపయోగిస్తున్నారు. కాని ఇప్పుడు ఆయన వయస్సు ఎనభై సంవత్సరాలకంటే మించిపోయింది. ఎన్నో ఏళ్ళ తరబడి వచ్చిపడే కడగండ్లు, ముఖ్యంగా దిగ్బంధం వల్ల వచ్చిపడిన కష్టాలు ఆయన వెన్నువిరిచేశాయి. ఆయన శక్తి ఉడిగిపోయింది. అందుకని షిఅబె అబీ తాలిబ్ కొండ లోయ నుండి బయటకు వచ్చిన కొన్ని నెలలకే ఆయన రోగగ్రస్తులైపోయారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బహుదైవారాధకులు, ఒకవేళ అబూ తాలిబ్ చనిపోయిన తరువాత గనకా వారు ఆయన సోదరుని కుమారునిపై ఏదైనా అఘాయిత్యం చేస్తే అది తమకే తలవంపులు తెస్తుంది అని గ్రహించారు. అందుకని అబూ తాలిబ్ దగ్గరకు ఇప్పుడే ఓ ప్రతినిధి బృందాన్ని పంపి ఆయన ఎదుటనే దైవప్రవక్త (స) గురించి ఏదైనా తేల్చుకోవాలి అని నిర్ణయించుకున్నారు. దీని కోసం ఇప్పటి వరకు ఒప్పుకోనటువంటి కొన్ని రాయితీలను సయితం ఆయనకు ఇవ్వదలుచుకున్నారు. కాబట్టి ఓ ప్రతినిధి బృందాన్ని ఆయన దగ్గరకు పంపించారు. ఇది వారి చిట్టచివరి ప్రతినిధి బృందం.

ఇబ్నె ఇస్‌హాక్ వగైరాల కథనం ప్రకారం, అబూ తాలిబ్ వ్యాధిగ్రస్తులైన విషయం ఖురైష్‌కు తెలిసింది. ఆయన ఇక ఎక్కువ కాలం జీవించలేరన్న సంగతి తెలిసింది. అందరూ కలసి, "చూడండి! హమ్‌జా (ర) మరియు ఉమర్

(ర)లు ముస్లిములైపోయారు. ముహమ్మద్ (స) ధర్మం అన్ని తెగల్లోనూ ప్రాకిపోయింది. పదండి, వెళ్ళి, ముహమ్మద్‌ను దేనికో ఓ దానికి ఒప్పుకునేటట్లు చేద్దాం. మనం కూడా ఏదో విషయంలో బద్ధులమైపోదాం. బహుశా వారు ఇక మన ఆధీనం నుండి బయటపడిపోయే భయం ఉంది" అని అనుకున్నారు.

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది.

"ఈ ముసలివాడు చనిపోయి ముహమ్మద్ విషయంలో ఏదో ఒక గడబిడ జరిగిపోతే ప్రజలు మమ్మల్ని తూలనాడగలరు. 'చూశారా, ఆయన బ్రతికి ఉండగా ముహమ్మద్‌ను ఏమీ చేయలేకపోయారు. ఆయన పినతండ్రి చనిపోగానే ముహమ్మద్(స)పై పులులైపోయారు' అని ప్రజలు అనుకుంటారు" అని ఖురైష్ చెప్పుకోవడం జరిగింది కూడా.

మొత్తానికి ఖురైష్ ప్రతినిధి బృందం ఒకటి అబూ తాలిబ్ దగ్గరకు వెళ్ళింది. ఆయనతో మాట్లాడింది. ప్రతినిధి బృందంలో ఖురైష్‌కు చెందిన గౌరవనీయులైన వారున్నారు. వారు ఉత్బా బిన్ రబీయా, షైబా బిన్ రబీయా, అబూ జహల్ బిన్ హష్షామ్, ఉమయ్యా బిన్ అబీకల్ఫ్, అబూ సుఫియాన్ బిన్ హరబ్ ఇంకా ఇతర ఖురైష్ పెద్దలు. వారి సంఖ్య మొత్తం పాతిక మంది.

వీరంతా అబూ తాలిబ్ వద్దకు వెళ్ళి,

"అబూ తాలిబ్! మా దృష్టిలో మీ హోదా ఎలాంటిదో మీకు తెలిసిందే. మీరు ఎదుర్కొంటున్న పరిస్థితులు కూడా మీకు తెలుసు. ఇవి మీ అంతిమ దినాలనే భయం మాకు పట్టుకుంది. ఇటు మాకూ, మీ సోదరుని కుమారుడు ముహమ్మద్(స)కు నడుమ నలుగుతున్న వ్యవహారం ఏమిటో మీరు బాగా ఎరుగుదురు. మేము కోరేదేమిటంటే, ముహమ్మద్ (స)ను పిలిపించి మా గురించి ఆయనతో కొన్ని వాగ్దానాలు తీసుకోండి. మేము ఇక్కడ సిద్ధంగానే ఉన్నాం. మేము కూడా కొన్ని వాగ్దానాలు చేస్తాం. మాతో బెట్టుకోవద్దని, మేము ఆయన జోలికిపోమని వాగ్దానాలు తీసుకోండి" అని అడిగారు.

అబూ తాలిబ్ దైవప్రవక్త (స)ను పిలిపించారు. ఆయన రాగానే ఆయన ఇలా అన్నారు.

"సోదర కుమారా! వీరంతా నీ జాతికి చెందిన పెద్ద మనుషులు, గౌరవనీయులు. నీ కోసమే వచ్చారు. వీరు కోరేదల్లా వీరంతా నీకు కొన్ని వాగ్దానాలు చేస్తారట. నీవు కూడా వారికి కొన్ని వాగ్దానాలు చెయ్యాలట." ఆ తరువాత అబూ తాలిబ్ వారు కోరిన కోరికను ముందుంచి ఇక నుండి ఎవరూ ఎవరి జోలికిపోకుండా వాగ్దానాలు చేయాలనేది ప్రవక్త(స)తో చెప్పారు. సమాధానంగా

దైవప్రవక్త (స) ప్రతినిధి బృందాన్ని సంబోధిస్తూ ఇలా సెలవిచ్చారు:

"నేను మీ ముందు, ఓ విషయాన్నుంచి దాన్ని గనక సమ్మతిస్తే మీరు మొత్తం అరేబియాకే రాజులైపోతారని, అరబ్బేతరులు మీకు దాసోహం అంటారు అని చెబితే మీరు దానికి సమ్మతించడానికి సిద్ధంగా ఉన్నారా?" అని అడిగారు.

కొన్ని ఉల్లేఖనాల్లో, దైవప్రవక్త (స) అబూ తాలిబ్‌ను సంబోధిస్తూ, "నేను వీరి ముందు ఓ మాటను ఉంచుతాను. వారే గనక దీనికి సమ్మతిస్తే అరేబియా మొత్తం వీరికి దాసోహం అంటుంది, అరబ్బేతరులంతా వీరికి జజియా కడతారు" అని ఉంది.

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది.

"బాబాయిగారు! మీరు వారిని వారికి శ్రేయం కలిగించే విషయం వైపునకు పిలువరు?" అని అనగా. అబూ తాలిబ్, "నీవు వారిని ఏ విషయం వైపునకు పిలుస్తున్నావు" అని అడిగారు. "నేను వారిని ఏ విషయం వైపునకయితే ఆహ్వానిస్తున్నానో దాన్ని గనక వారు స్వీకరిస్తే అరేబియా అంతా వారికి దాసోహం అంటుంది. అరబ్బేతరులపై వారి రాచరికం ఏర్పడుతుంది" అన్నారు. ఇబ్నె ఇస్‌హాక్ ఉల్లేఖనంలో, ఆయన (స) ఈ మాట కూడా చెప్పినట్లుంది.

"మీరు కేవలం ఒకే ఒక మాటను ఒప్పుకోండి! దాని కారణంగా మీరు అరేబియాకే రాజులైపోతారు. అరబ్బేతర రాజ్యాలు మీకు అధీనమైపోతాయి."

మొత్తానికి ఈ మాటలు వినగానే ఆ ప్రతినిధి బృందం సందిగ్ధంలో పడిపోయింది. ఒకే ఒక మాటా? అంత ప్రయోజనకరమైన ఆ మాట ఏమై ఉంటుంది? దాన్ని ఎలా నిరాకరించగలం?? అని తటపటాయించనారంభించారు.

చివరికి అబూ జహల్ అందుకొని, "చెప్పు ఆ మాట ఏమిటో? నీ తండ్రిపై ఒట్టు! అలాంటి ఒక మాట ఏమిటి, పది మాటలు ఒప్పుకోడానికైనా మేము సిద్ధమే" అన్నాడు.

"కేవలం మీరు, **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అనండి చాలు. అల్లాహ్ తప్ప మీరు ఎవరినైతే పూజిస్తున్నారో వాటన్నిటిని వదిలేయండి" అని పలికారు ప్రవక్త(స).

ఇది విన్న వారు చప్పట్లు చరిచి, "ముహమ్మద్! అనేక దేవుళ్ళ స్థానంలో ఒకే దేవుణ్ణి తెచ్చి నిలబెట్టాలా? నీ వ్యవహారమే అయోమయంగా ఉందే" అని పలికారు.

ఆ తరువాత పరస్పరం మాట్లాడుకుంటూ, "దైవసాక్షి! ఈ వ్యక్తి మన మాటల్ని వినేటట్లుగా లేదు. పదండి, మనం మన తాతముత్తాతల ధర్మంపైనే స్థిరపడిపోదాం. దేవుడే ఈ వ్యక్తికీ మనకూ నడుమ ఏదైనా తీర్పు చేస్తాడు" అనుకుంటూ వెనక్కు మరలి వెళ్ళిపోయారు. ఈ సంఘటన తరువాత వారి గురించే దివ్యఖుర్‌ఆన్‌లో ఈ ఆయత్‌లు (వాక్యాలు) అవతరించాయి.

صٓ وَالْقُرْاٰنِ ذِي الذِّكْرِ ۝ بَلِ الَّذِيْنَ كَفَرُوْا فِيْ عِزَّةٍ وَّشِقَاقٍ ۝

كَمْ اَهْلَكْنَا مِنْ قَبْلِهِمْ مِّنْ قَرْنٍ فَنَادَوْا وَّلَاتَ حِيْنَ مَنَاصٍ ۝

وَعَجِبُوْا اَنْ جَآءَهُمْ مُّنْذِرٌ مِّنْهُمْ ۡ وَقَالَ الْكٰفِرُوْنَ هٰذَا سٰحِرٌ كَذَّابٌ ۝

اَجَعَلَ الْاٰلِهَةَ اِلٰهًا وَّاحِدًا ۚ اِنَّ هٰذَا لَشَيْءٌ عُجَابٌ ۝ وَانْطَلَقَ الْمَلَاُ مِنْهُمْ

اَنِ امْشُوْا وَاصْبِرُوْا عَلٰٓى اٰلِهَتِكُمْ ۚ اِنَّ هٰذَا لَشَيْءٌ يُّرَادُ ۝

مَا سَمِعْنَا بِهٰذَا فِي الْمِلَّةِ الْاٰخِرَةِ ۚ اِنْ هٰذَآ اِلَّا اخْتِلَاقٌ ۝

"సాద్. హితబోధతో నిండి ఉన్న ఖుర్‌ఆన్ సాక్షిగా! అసలు విషయం ఏమిటంటే, విశ్వసించడానికి తిరస్కరించిన ఈ ప్రజలే దురహంకారులు, పరమ మూర్ఖులు, వారికి పూర్వం మేము ఇటువంటి ఎన్నో జాతుల్ని నాశనం చేశాము. (వారికి పోగాలము దాపురించగా) అప్పుడు వారు హాహాకారాలు చేశారు. కాని అది తప్పించుకునే సమయం కాదు కదా!

భయపెట్టేవాడొకడు స్వయంగా తమ నుండే వచ్చాడని వారు ఆశ్చర్యపడ్డారు. సత్యతిరస్కారులు ఇలా అనసాగారు: "ఇతడు మంత్రవాది, అసత్యవాది, సమస్త దైవాల స్థానంలో కేవలం ఒకే దైవాన్ని నిలబెట్టడం ఏమిటి? ఇది ఎంతో విచిత్రమైన విషయం." జాతి నాయకులు ఇలా అంటూ వెళ్ళిపోయారు. పదండి, మీ దైవాల ఆరాధన పట్ల స్థిరంగా ఉండండి. ఈ విషయం ఒక ప్రయోజనం కోరి చెప్పబడుతోంది. ఈ విషయాన్ని మేము ఇటీవలి కాలపు సమాజంలో ఎవరి నోటా వినలేదు. ఇది కల్పిత విషయం తప్ప మరేమీ కాదు." (38: 1 - 7)[1]

1. *ఇబ్నె హష్షామ్-1/417-419; ముఖ్తసరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లా. పుట. 91.*

శోక సంవత్సరం

అబూ తాలిబ్ మరణం

అబూ తాలిబ్ వ్యాధి ముదురుతూ చివరికి ఆయన మరణం సంభవించింది. ఆయన మరణం, షిఅబె అబీ తాలిబ్ దిగ్బంధం అంతమైన ఆరు నెలలకు రజబ్ మాసం దైవదౌత్యపు పదవ సంవత్సరాన సంభవించింది.[1]

సహీ బుఖారి గ్రంథంలో హజ్రత్ ముసయ్యిబ్ (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, అబూ తాలిబ్ మరణకాలం దాపురించగానే దైవప్రవక్త (స) ఆయన వద్దకు వెళ్ళారు. అక్కడ అబూ జహల్ కూడా ఉన్నాడు. పినతండ్రినుద్దేశించి దైవప్రవక్త (స), "బాబాయి! మీరు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనండి. కేవలం ఒకే వాక్యం. ఈ వాక్యం మాధ్యమంగా నేను అల్లాహ్‌కు సిఫార్సు చేయగలను" అని అన్నారు. అంతలోనే అబూ జహల్ మరియు అబ్దుల్లా బిన్ ఉమయ్యా అందుకొని, "అబూ తాలిబ్! అబ్దుల్ ముత్తలిబ్ ధర్మం నుండి ముఖం తిప్పు కుంటావా?" అంటూ ఆయన్ను ఎత్తిపొడిచారు. చివరికి అబూ తాలిబ్ ప్రజల నుద్దేశించి చెప్పిన చిట్టచివరి పలుకులు, "అబ్దుల్ ముత్తలిబ్ ధర్మంపైన్నే" అన్నది.

ఇది విన్న దైవప్రవక్త (స), "నన్ను దేవుడు ఆపనంత వరకు మీ మన్నింపు కోసం ప్రార్థిస్తూనే ఉంటాను" అని అన్నారు. అంతలోనే ఈ దివ్యవాణి అవతరించింది.

1. సీరత్ ఆధారాల్లో,అబూ తాలిబ్ ఏ నెలలో చనిపోయారన్న విషయంలో తేడాలు కనబడుతున్నాయి. మేము రజబ్ మాసాన్ని ఎందుకు ప్రాధాన్యత ఇచ్చామంటే అనేక ఆధారాలు, ఆయన షిఅబె అబీతాలిబ్ నుండి బయటకు వచ్చిన ఆరు నెలల తరువాత మరణించారని ధృవ పరుస్తున్నాడు. దిగ్బంధం దైవ దౌత్యశకం 7, ముహర్రం నెలలో ప్రారంభమైంది. ఆ లెక్కన ఆయన మరణించిన నెల రజబ్ నెలే అవుతుంది గనక.

مَا كَانَ لِلنَّبِيِّ وَالَّذِيْنَ اٰمَنُوْٓا اَنْ يَّسْتَغْفِرُوْا لِلْمُشْرِكِيْنَ وَلَوْ كَانُوْٓا
اُولِيْ قُرْبٰى مِنْ بَعْدِ مَا تَبَيَّنَ لَهُمْ اَنَّهُمْ اَصْحٰبُ الْجَحِيْمِ ﴿١١٣﴾

"బహుదైవారాధకులను క్షమించవలసిందిగా ప్రార్థన చెయ్యడం, ప్రవక్తకూ, విశ్వాసులకూ తగని పని. వారు వారికి బంధువులైనప్పటికీ, ఇంకా వారు నరకానికి అర్హులని వారికి స్పష్టమైనపుడు." (9 : 113)

ఆ తరువాత ఈ ఆయత్ కూడా అవతరించింది.

اِنَّكَ لَا تَهْدِيْ مَنْ اَحْبَبْتَ

"ఓ ప్రవక్తా! నీకు ఇష్టమైన వారికి నీవు మార్గదర్శకత్వాన్ని ప్రసాదించలేవు. కాని అల్లాహ్ తనకు ఇష్టమైన వారికి మార్గదర్శకత్వాన్ని ప్రసాదించగలడు, ఆయన తన మార్గదర్శకత్వాన్ని స్వీకరించే వారిని బాగా ఎరుగును."[2] (28 : 56)

అబూ తాలిబ్ దైవప్రవక్త (స)కు ఎలాంటి రక్షణను చేకూర్చారో, ఆయన్ను ఎలా ఆదుకున్నారో ఇక్కడ చెప్పనవసరం లేదు. నిజానికి మక్కాకు చెందిన ఇద్దరు ఉన్మాదుల దాడుల నుండి ఇస్లామీయ సందేశ ప్రచారాన్ని రక్షించడానికి ఓ కోటలా పనిజేసిన వారాయన. కాని స్వయంగా తన తాతముత్తాతల ధర్మంపైన్నే నిలకడగా ఉండిపోయారు. అందుకే ఆయన సంపూర్ణ సాఫల్యం పొందలేకపోయారు. సహీ బుఖారీలో హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (ర) ఉల్లేఖనం ఇలా ఉంది.

"నేను దైవప్రవక్త (స)తో, ఓ ప్రవక్తా! మీ పినతండ్రి మీ కోసం ఇంత కష్ట పడ్డారు కదా! ఆయన మిమ్మల్ని రక్షించడానికి ఇతరులను కోపగించుకునే వారు. వారితో జగడపడేవారు కూడాను. ఆయన కోసం తమరు ఏం చేయ గలిగారు?" అని. దానికి మహాప్రవక్త (స), "ఆయన నరకంలో ఓ తేలికపాటి శిక్ష కలిగే స్థలంలో ఉన్నారు. నేనే లేకపోతే ఆయన నరకంలోని లోతైన గోతిలో పడిపోయేవారు" అని సెలవిచ్చారు.[3]

అబూ సయీద్ ఖుద్రీ (ర) కథనం ప్రకారం, ఓమారు దైవప్రవక్త (స) దగ్గర ఆయన కూర్చుని ఉండగా అబూ తాలిబ్ గారి ప్రస్తావన వచ్చినప్పుడు

2. సహీ బుఖారి అబీ తాలిబ్ ఉదంత అధ్యాయం. 1/548.
3. సహీ బుఖారి అబీ తాలిబ్ ఉదంత అధ్యాయం. 1/548.

ఆయన ఇలా సెలవిచ్చారు:

"బహుశా ప్రళయ దినం నాడు ఆయనకు నా సిఫార్సు ప్రయోజనం చేకూర్చవచ్చు. ఆయన్ను నరకంలోని ఓ తేలికపాటి స్థలంలో ఉంచడం జరగవచ్చు. నరకశిక్ష ఆయన రెండు చీలమండల వరకే పరిమితంగావచ్చు."[4]

హజ్రత్ ఖదీజా (ర) కాలధర్మం

అబూ తాలిబ్ మరణించిన రెండు నెలల తరువాత లేదా మూడు రోజుల తరువాత-ఉల్లేఖనాల్లోని తేడా ప్రకారం - ముస్లిముల మాతృమూర్తి ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఖదీజతుల్ కుబ్రా (ర) పరమపదించారు. ఆమె మరణం దైవదౌత్య శకం పదవ సంవత్సరం రమజాన్ మాసంలో సంభవించింది. అప్పటికి ఆమె వయస్సు అరవై అయిదేండ్లు. మహాప్రవక్త (స) అప్పటికి యాభయ్యో పడిలో ఉన్నారు.[5]

హజ్రత్ ఖదీజతుల్ కుబ్రా (ర) దైవప్రవక్త (స) పాలిటి ఎనలేని వరం అని చెప్పాలి. దాదాపు పాతిక సంవత్సరాలు ఆయన (స) భార్యగా ఉండి, ఆయన పడే బాధల్లో భాగం పంచుకున్నారు. ఆయన కోసం పరితపించి పోయేవారు. తీవ్రమైన గడ్డు పరిస్థితుల్లో ఆయనకు చేదోడు వాదోడుగా నిలిచి శక్తినిచ్చేవారు. దైవసందేశ ప్రచారంలో, దైవదౌత్య బృహత్తర బాధ్యతల్లో ఆయనకు సహాయపడేవారు. తన ధన ప్రాణాలతో ఆయన కష్టాలను తీర్చే ప్రయత్నం చేసేవారు. మహాప్రవక్త (స) ప్రవచనం ఇలా ఉంది. "ప్రజలు నన్ను తిరస్కరించినప్పుడు ఆమె నన్ను విశ్వసించారు. ప్రజలు నా మాటలను నమ్మనప్పుడు ఆమె నా పలుకులను బలపరిచారు. ప్రజలు నాకు ఏదీ కాకుండా చేసినప్పుడు ఆమె తన ధనంలో నన్ను భాగస్వామిగా చేశారు. అల్లాహ్ నాకు ఆమె ద్వారానే సంతానం ఒసిగాడు. ఇతర భార్యల ద్వారా కాదు."[6]

సహీ బుఖారిలో అబూ హురైరా (ర) ఉల్లేఖనం ఇలా ఉంది.

"హజ్రత్ జిబ్రీల్ (అ.స.) దైవప్రవక్త (స) వద్దకు అరుదెంచి, ఓ దైవ ప్రవక్తా! అదిగో! హజ్రత్ ఖదీజా (ర) వస్తున్నారు. ఆమె చేతిలో ఓ పాత్ర ఉంది.

---

4. సహీ బుఖారి అబీ తాలిబ్ ఉదంత అధ్యాయం. 1/548.
5. రమజాన్ నెలలో మరణించినట్లు ఇబ్నె జూజీ తన తల్ఖీహుల్ ఫహూమ్ పుట. 7లోను, అల్లామా మన్సూర్‌పూరి తన గ్రంథం రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/146 లో రాశారు.
6. ముస్నదె అహ్మద్-6/118.

అందు కూర లేదా భోజనం లేదా త్రాగే పానీయం ఉంది. ఆమె మీ దగ్గరకు వచ్చిన తరువాత ఆమెకు అల్లాహ్ తరఫున సలాం అందించండి. స్వర్గంలో ముత్యాల ఓ మహలు గురించి శుభవార్త అందించండి. అందులో ఎలాంటి గోలగాని, దారిద్ర్యంగాని, అలుపుగాని ఉండవని చెప్పండి" అన్నారు.[7]

శోకంలో వచ్చిపడ్డ మరో శోకం

ఈ రెండు శోకతప్తమైన సంఘటనలు ఒకదాని తరువాత ఒకటి కొన్ని రోజుల తేడాల్లోనే వచ్చిపడ్డాయి. దీనివల్ల మహాప్రవక్త (స) గారి హృదయం శోక సంతప్తసాగరంలో మునిగిపోయింది. అదేకాదు, ఆ తరువాత తమ జాతి వారి తరఫు నుండి ఆయనపై అనేక కష్టాలు వచ్చిపడ్డాయి. ఎందుకంటే, అబూ తాలిబ్ మరణం తరువాత వారి ధైర్యం మరింత పెరిగిపోయింది. బాహాటంగా ఆయన్ను బాధించనారంభించారు. ఈ పరిస్థితి ఆయన హృదయ వేదనను మరింత పెంచేసింది. దీనికి విసిగివేసారి ఆయన (స) తాయెఫ్‌కు బయలుదేరి వెళ్ళారు. బహుశా అక్కడి వారైనా ఆయన పిలుపును ఆలకిస్తారని, తనకు సంరక్షణ కలుగజేస్తారనే ఆశతో. తన జాతికి వ్యతిరేకంగా తాయెఫ్ వారు ఆయనకు సహాయపడతారేమో అని. కాని, అక్కడ ఆయనకు శరణిచ్చేవాడు గాని, సహాయకుడుగాని లభించలేదు. పైపెచ్చు వారంతా కలసి ప్రవక్త (స)ను బాధించారు. తన జాతి కూడా బాధించని విధంగా బాధించారు. (వివరాలు ముందు రాబోతున్నాయి)

మక్కా ప్రజలు దైవప్రవక్త (స) విషయంలో ఎలా దౌర్జన్యాలకు హింసలకు పాల్పడ్డారో, ఆయన అనుచరగణాన్ని ఎలా సతాయించారో మనకు తెలిసిందే. ఈ జులుము ఇలానే కొనసాగుతుండగా దైవప్రవక్త (స) గారి ప్రియమిత్రుడు హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్ (ర) వాటిని భరించలేక మక్కాను వదలడానికి కూడా సిద్ధపడ్డారు. ఆయన అబీసీనియాకు వెళ్ళిపోవడానికి బయలుదేరగా, దారిలో 'బర్కొగమ్మాద్' అనే వ్యక్తి తారసపడి ఆయన్ను తన రక్షణలో తీసుకొని మక్కాకు తిరిగివచ్చాడు.[8]

---

7. సహీ బుఖారి- దైవప్రవక్త(స) భార్య ఖదీజా ఆమె గుణగణాల అధ్యాయం-1/539.)
8. ఈ సంఘటన ఆ సంవత్సరమే జరిగిందని అక్బర్ షానజీ బాబారి చెబుతారు. చూడండి తారీఖె ఇస్లామ్-1/120. అసలు సంఘటన వివరాలన్నీ ఇబ్నె హిషామ్ -1/327-374లో ఉన్నాయి.

ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, అబూ తాలిబ్ మరణించినప్పుడు ఖురైష్ ప్రజలు దైవప్రవక్త (స)కు పెట్టిన హింసలు అబూ తాలిబ్ బ్రతికుండగా పెట్టలేదు. వారు తమ మనోభీష్టాన్ని ఇష్టమొచ్చినట్లు తీర్చుకున్నారు. చివరికి ఖురైష్‌కు చెందిన ఓ ఉన్మాది ఆయన (స)కు ఎదురొచ్చి ఆయన తలపై మట్టిని కూడా గుమ్మరించాడు. దైవప్రవక్త (స) అదే స్థితిలో ఇంటికి వెళ్ళారు. ఆయన కుమార్తె లేచి ఆ మట్టినంతా కడుగుతూ రోదిస్తూ ఉంటే మహాప్రవక్త (స) ఆమెను ఓదారుస్తూ, "బిడ్డా! ఏడవకు, అల్లాహ్ నీ తండ్రిని తప్పకుండా రక్షిస్తాడు" అన్నారు. మట్టిని కడిగేటప్పుడు మహాప్రవక్త (స), "అబూ తాలిబ్ బాబాయి బ్రతికి ఉండగా ఖురైష్ నాకు ఇంత బాధ కలిగించేటంత దుస్సాహసానికి దిగలేదు" అని కూడా అన్నారు.[9]

ఇలా ఒకదానిపై మరొకటి వచ్చిపడే కష్టాల కారణంగా దైవప్రవక్త (స) ఆ సంవత్సరానికి 'ఆమ్ముల్ హుజ్న్' (శోక సంవత్సరం) అని పేరు పెట్టారు. ఆ తరువాత ఆ సంవత్సరం ఆ పేరున్నే ప్రఖ్యాతిగాంచింది.

హజ్రత్ సౌదాతో వివాహం

అదే సంవత్సరం షవ్వాల్ మాసం (దైవదౌత్య శకపు 10వ సంవత్సరం)లో దైవప్రవక్త (స) హజ్రత్ సౌదా బిన్తె జమ్అను వివాహమాడారు. ఈమె ప్రారంభంలోనే ముస్లిమైన మహిళ. రెండవ అబీసీనియా వలసప్పుడు వలస వెళ్ళిన వారు. ఆమె భర్త పేరు సక్రాన్ బిన్ అమ్రూ. ఆయన కూడా ప్రారంభ కాలం లోనే ఇస్లామ్‌ను స్వీకరించిన వ్యక్తి. హజ్రత్ సౌదాతో పాటు అబీసీనియాకు వెళ్ళిన వ్యక్తి- అబీసీనియాలోనో లేదా మక్కాకు వచ్చిన తరువాతనో చని పోయాడు. ఆయన మరణం తరువాత ఇద్దత్ కాలం పూర్తి అవగానే దైవప్రవక్త (స) ఆమె వద్దకు వివాహ సంబంధం పంపించారు. ఆ తరువాత పెళ్ళి జరిగి పోయింది. కొన్ని ఏండ్ల తరువాత తన వంతును హజ్రత్ ఆయిషా (ర) గారికి హిబా (సమర్పించారు) చేశారు.[10]

---

9. ఇబ్నె హిషామ్-1/416.

10. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/165; తల్ఖీహుల్ ఫహూమ్- పుట.6.

ప్రప్రథమంగా ఇస్లాం స్వీకరించిన వారి సహన సంయమనాలను పురికొల్పిన కారణాలు

లోతైన ఆలోచన, దృఢమైన బుద్ధి వివేచనలు గల వ్యక్తి ఎవరైనా, ప్రప్రథమంగా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన ఈ ముస్లిములు సహనాన్ని, సంయమనాన్ని, ధైర్యసాహసాలను ఎలా ప్రదర్శించగలిగారు? ఏ కారణాలు వారిని స్థిరంగా ఉంచడానికి దోహదపడ్డాయి? అనే విషయాన్ని ఆలోచించి నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు లోనుకాకమానడు. విన్నంతనే రోమాలు నిక్కబొడుచు కునేటటువంటి హింసాదౌర్జన్యాలను ఎలా సహించగలిగారు? అనే ఆలోచనలో పడిపోవడం సహజం. మాటిమాటికి ఉత్పన్నమయ్యే ఈ ప్రశ్నల నేపథ్యంలో ఆ కారణాలను, ఆ పరిస్థితులను గురించి టూకీగా చెప్పడం ఇక్కడ సమంజసంగా తోస్తుంది.

1. అల్లాహ్ ఎడల విశ్వాసం

వీటన్నిటిలో మొట్టమొదటి ముఖ్య కారణం, వారిలో ఏకేశ్వరు డయిన అల్లాహ్ ఎడల విశ్వాసం దృఢంగా నాటుకొనిపోవడం మరియు వారిలో దైవానికి సంబంధించిన పూర్తి అవగాహన కలగడం. ఎందుకంటే, మనిషి హృదయంలో దేవునిపై విశ్వాసం దృఢంగా నాటుకుపోతే అతను పర్వతాన్నయినా ఢీకొనడానికి సిద్ధపడతాడు. అందులో అతనే నెగ్గిరాగలడు. ఎవరయితే ఈ దృఢమైన విశ్వాసాన్ని, తిరుగులేని నమ్మకాన్ని పొందగలడో అతను ప్రాపంచిక వ్యథలను - అవి ఎంత అధికమైనవి అయినా, ఎంత కఠిన మైనవి అయినా, మరెంత ప్రమాదకరమైనవి అయినా - విశ్వాసం ముందు అల్పమైనవిగా తలుస్తాడు. అందుకని ఓ మోమిన్ (విశ్వాసి) తన విశ్వాస మాధుర్యం కంటే, నమ్మకపు బలం కంటే ఆ కష్టాలకు విలువే ఇవ్వడు.

فَاَمَّا الزَّبَدُ فَيَذْهَبُ جُفَآءً ۚ وَاَمَّا مَا يَنْفَعُ النَّاسَ فَيَمْكُثُ فِي الْاَرْضِ ۚ

"నురుగంతా ఎగిరిపోతుంది. మానవులకు లాభం కలిగించే వస్తువు భూమిలో ఉండిపోతుంది." (13 : 17)

ఈ కారణం చేతనే సహనానికీ, స్థయిర్యానికీ ఊతమిచ్చే పరిస్థితులు ఏర్పడతాయి.

2. మనస్సును అలరింపజేసే నాయకత్వం

దైవప్రవక్త (స) ఇస్లామీయ సమాజాన్నే కాకుండా మానవాళి అంతటినీ నడిపించే మహోన్నత నాయకత్వపు లక్షణాలుగల నాయకుడు అన్న విషయం మనకు తెలిసిందే. ఆయన, మనస్సును ఇట్టే ఆకర్షించగల శారీరక అందచందాలు, మనోనైర్మల్యం, కారుణ్యదాయకమైన నైతికత, మహోన్నత మైన నడవడిక మరియు గౌరవవంత మైన అలవాట్లు గల మహామనీషి. ఆయన్ను చూడగానే మనస్సు ఆయన వైపునకు అనుకోకుండానే మొగ్గిపోయేది. ప్రజలు మరే వ్యక్తి వైపు మొగ్గుజూప లేనంత సుగుణాల రాశి ఆయన. దైవప్రవక్త (స) గౌరవంలోను, నీతీ నిజాయితీలలోను అందరికంటే మిన్నగా ఉండేవారు. సౌశీల్యం, విశ్వస నీయత, సత్యసంధత లాంటి విషయాలన్నిటి లోను ఆయన (స)కు ఓ ప్రత్యేక స్థానం ఉండింది. ఈ కారణంచేత, మిత్రులకే కాకుండా శత్రువులకు సయితం ఆయన (స) గారి వ్యక్తిత్వంపై ఇసుమంత అనుమానం కూడా కలుగలేదు. ఆయన (స) నోట వెలువడ్డ ఏ మాట అయినా, అది సత్యమే అన్నది. ఆయన శత్రువులు కూడా ధృవపరిచే వారు,అది అయి తీరుతుంది అని నమ్మేవారు. సంఘటనలు దీన్ని ధృవపరుస్తు న్నాయి కూడా.

ఓ మారు ఖురైష్ తెగకు చెందిన ముగ్గురు వ్యక్తులు పరస్పరం ఒకరికి తెలియకుండా మరొకరు దాగి దివ్యఖుర్ఆన్ పారాయణాన్ని విన్నారు. ఆ తరు వాత ఆ రహస్యం కాస్తా బయటపడిపోయింది. ఆ ముగ్గురిలో అబూ జహల్ ఒకడు. ముగ్గురు కలసినప్పుడు ఒకడు అబూ జహల్, రాత్రి నీవు ముహమ్మద్ (స) నోట విన్న ఆ పలుకులను గురించి నీ అభిప్రాయం ఏమిటీ? అని అడిగాడు. అబూ జహల్ జవాబుగా, "నేనేం విన్నాను? విను! అసలు విషయం ఏమిటి అంటే, మనమూ, అబ్దె మునాఫ్ ఉభయ తెగలకు చెందినవారం గౌరవంలో ఒకరికి ఒకరం పోటీపడిన విషయం నీవెరిగినదే. వారు (నిరుపేద లకు) అన్నం పెడితే మనమూ పెట్టాము. వారు కానుకలుగా, బహుమతు లుగా వస్తువాహనాలను పంచిపెడితే మనమూ పంచిపెట్టాము. వారు ప్రజ

లకు దానమిస్తే మనమూ ఇచ్చినవాళ్ళమే. అలా వారు, మనం ఆ విషయంలో సమానమైపోయినవాళ్ళమే. వారి పరిస్థితి, మన పరిస్థితి రేసుగుర్రాల్లాగుండేది. ఇప్పుడేమో అబ్దె మునాఫ్ వారి తెగలో ఓ ప్రవక్త వచ్చాడని, ఆయన వద్దకు ఆకాశం నుండి వహీ (దివ్యావిష్కృతి) వస్తోందని అంటున్నారు. అయితే ఈ విషయంలో వారిని అందుకునేదెలా? దైవసాక్షి! మనం ఆ వ్యక్తి దైవదౌత్యాన్ని ఎన్నటికీ విశ్వసించేదిలేదు. మనం దాన్ని అసలు ధృవపరిచేదేలేదు."[1]అని అన్నాడు.

అదే దృష్టిలో పెట్టుకొని అబూ జహల్ తరచూ, "ఓ ముహమ్మద్ (స), నిన్ను మేము అసత్యవాది అని ఎప్పుడూ అనలేదు, అనం కూడా. అయితే నీవు తెచ్చిన దాన్ని మాత్రమే తిరస్కరిస్తున్నాం" అని అంటూ ఉండేవాడు. ఈ విషయం గురించే అల్లాహ్ దివ్యగ్రంథంలో ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు.

فَإِنَّهُمْ لَا يُكَذِّبُونَكَ وَلَٰكِنَّ الظَّالِمِينَ بِآيَاتِ اللَّهِ يَجْحَدُونَ ۝

"వీరు నిన్ను నిరాకరించడం లేదు. ఈ దుష్టులు అల్లాహ్ ఆయత్‌లను (సూచనలను) తిరస్కరిస్తున్నారు." [2]

మరో సంఘటన ఇదివరకే చెప్పుకున్నాం. దాని ప్రకారం, ఓ రోజు దైవ తిరస్కారులు మహాప్రవక్త (స)ను మూడుమార్లు తూలనాడగా ఆయన (స) మూడో మారు నిలబడి, "ఓ ఖురైష్ వర్గమా! నేను మీ వద్దకు బలి తీసుకొని వచ్చాన"ని చెప్పారు. ఆ మాటలు వినగానే శత్రుత్వం వహించడంలో ఎవరు ముందడుగులో ఉన్నారో వారు నిలబడి, ఏ ఉత్తమ పదాన్నుపయోగించి ప్రాధేయపడాలో దాన్ని ఉపయోగించి ప్రాధేయపడసాగారు. అలాంటి మరో సంఘటనా వివరాలు కూడా మనం ఎరిగినవే. అవేమిటంటే, మహాప్రవక్త ముహమ్మద్ (స) సజ్దాలో పడిపోయినప్పుడు ఆయనపై ఒంటె పొట్టపేగులు పడవేయడం జరిగింది. ఆయన (స) సజ్దా నుండి తలపైకెత్తి అలా చేసిన వారిని శపించగా వారి వికటాట్టహాసాలు ఒక్కసారే మటుమాయమైపోయాయి. వారి ముఖాలపై భయం తాండవించింది. ఇక ఆ శాపం నుండి తప్పించుకో లేమనే నమ్మకం వారి వాలకం ద్వారా వ్యక్తమైంది.

---

1. ఇబ్నె హిషామ్-1/316. *2. తిర్మిజీ, తఫ్సీర్, అన్ ఆమ్ సూరా-2/132.*

అదే కాదు, మరో సంఘటన కూడా మనకు గుర్తుంది. దైవప్రవక్త (స) అబూ లహబ్ కుమారుడు ఉత్తైబాను శపించారు. ఆ శాపం వల్ల అతనికి ఇక తాను బ్రతికిబట్టకట్టలేననే నమ్మకం ఏర్పడింది. అతను సిరియా దేశానికి వెళ్ళినప్పుడు పెద్ద పులిని చూడగానే, "దైవసాక్షి! ముహమ్మద్ (స) మక్కాలో ఉంటూనే నన్ను చంపేస్తున్నాడు" అని అరిచాడు.

'ఉబై బిన్ అబీ ఖల్ఫ్'కు సంభవించిన సంఘటన ఒకటుంది. అతను మాటిమాటికి మహాప్రవక్త (స)ను బెదిరించేవాడు. ఓమారు ఆయన (స) అతనితో, "(నీవు కాదు) దైవం తలిస్తే నేనే నిన్ను చంపేస్తాను" అని అన్నారు. ఆ తరువాత ఉహద్ యుద్ధం జరిగిన రోజు, ఆయన (స) ఉబై మెడపై బరిశెతో పొడిచారు. అది ఏమంత పెద్ద గాయం కాదు. కేవలం బరిశె మొన గుచ్చుకొని మెడపై గీటు మాత్రమే పడింది. అయితే ఉబై మాత్రం, "ముహమ్మద్ (స) నాతో మక్కాలో, 'నిన్ను నేను సంహరించగలను' అని అన్నాడనే పలుకులు వల్లిస్తూ, ఆయన నాపై ఉమ్మి వేసి ఉండినా నా ప్రాణం ఎగిరిపోయేది" అని అనసాగాడు.[3]

ఇలాగే ఓసారి సఅద్ బిన్ ముఆజ్ అనే వ్యక్తి మక్కాలో ఉమయ్యా బిన్ ఖల్ఫ్‌తో, "దైవప్రవక్త (స), ముస్లిములు నిన్ను హతమారుస్తారని అనగా విన్నాన"ని అన్నాడు. దానికి ఉమయ్యాను భయం అలుముకుంది. ఆ భయం వీడనందున అతడు మక్కా వదలి బయటకు వెళ్ళనని తీర్మానించుకున్నాడు. బద్ర్ యుద్ధం జరిగినప్పుడు అబూ జహల్ బలవంతపెట్టగా అతను మక్కాను వదలి వెళ్ళాల్సివచ్చింది. దాని కోసం అతను ప్రమాదాన్ని శంకించగానే పారిపోయి రావడానికిగాను వేగంగా పరిగెత్తే ఓ ఒంటెను కొన్నాడు. యుద్ధానికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్న ఉబైను చూసి అతని భార్య వారిస్తూ, "అబూ సఫ్వాన్, నీ యస్రబీ సోదరుడు చెప్పింది మరచిపోయావా?" అని అడిగింది. దానికి జవాబిస్తూ అబూ సఫ్వాన్ (ఉమయ్యా బిన్ ఖల్ఫ్), "లేదు! దైవసాక్షి, నేను కొంతదూరం వరకే వెళ్ళి తిరిగి వచ్చేస్తానుగా" అని అన్నాడు.[4]

ఇదీ ఆయన (స) గారి శత్రువుల పరిస్థితి. ఇకపోతే మహాప్రవక్త (స) మిత్రులు మరియు ఆయన అనుచరుల విషయానికొస్తే ఆయన వారి పాలిటి

3. ఇబ్నె హిష్షామ్-2/84. (వివరాలు ముందు పేజీలలో రాబోతున్నాయి)
4. సహీ బుఖారి-2/563.

పంచప్రాణాలు అనే చెప్పాలి. ఆయన కోసం వారి హృదయాంతరాళాల్లో నుండి పెల్లుబుకే భావోద్రేకాలు, పల్లం వైపునకు పారే నీటి చందంగా ఉండేవి. వారి హృదయాలు, వారి పంచప్రాణాలు ఆయన వైపునకు, ఇనుము సూదం టురాయి వైపునకు ఆకర్షింపబడినట్లుగా ఆకర్షించబడేవి.

ఆయన ఎడల సహాబా (ర)ల ఈ ప్రేమానురాగాలు, సమర్పణాభావం, ప్రాణాలనైనా అర్పించే త్యాగనిరతి ఫలితంగానే దైవప్రవక్త (స)కు కాలిలో ముల్లు గ్రుచ్చుకున్నా లేదా ఆయన కొనగోటికి దెబ్బతగిలినా వారు సహించే వారు కారు. అవసరమయితే తమ ప్రాణాలనయినా సమర్పించి ఆయన్ను రక్షించే ప్రయత్నం చేసేవారు.

ఓ రోజు అబూ బక్ర్ సిద్దీఖ్ (ర)ను చెప్పలేనంతగా చితకబాదడం జరిగింది. ఉత్‌బా బిన్ రబీయా ఆయన దగ్గరకు వచ్చి రెండు అతుకులు కలిగిన చెప్పులతో కొట్టనారంభించాడు. ప్రత్యేకంగా ముఖంపైనే కొడు తున్నాడు. వీపు పైకెక్కి కొట్టే దెబ్బలకు ముఖం ముక్కూ ఏదీ అగుపడడంలేదు. ఆ తరువాత ఆయన తెగ అయిన బనూ తైమ్ వారు ఆయన్ను గుడ్డలో చుట్టుకొని ఇంటికి గొనివచ్చారు. ఈ దెబ్బలకు బ్రతికి బట్టకడతాడనే ఆశ వారికి లేదు. అయితే ప్రొద్దుక్రుంకే సమయానికి ఆయన నోటి నుండి మాటలు వెలువడడం గమనించారు. నోటి నుండి మాట బయటకు రాగానే అబూ బక్ర్ (ర) చెప్పిన మాటలు, "దైవప్రవక్త (స) ఏమయ్యారు?" అన్నవే. ఆ మాటలకు బనీ తైమ్ తెగవారు ఆయన్ను తిట్టారు. తిడుతూ ఆయన తల్లి ఉమ్ముల్ ఖైర్‌నుద్దేశించి, ఈయనకు ఏదైనా తినిపించండి, త్రాగించండి అని చెప్పి వెళ్ళిపోయారు. వారు బయటకు వెళ్ళిన తరువాత ఉమ్ముల్ ఖైర్ ఒంటరిగా ఉండిపోయారు. ఏదైనా తినమని, త్రాగమని బలవంతపెట్టసాగారు. కాని అబూ బక్ర్ (ర) మాత్రం, "దైవప్రవక్త (స) ఏమైపోయారు" అనే అడుగుతున్నారు. చివరికి ఉమ్ముల్ ఖైర్ ఆయన్ను ఉద్దేశించి నీ మిత్రుని పరిస్థితి ఏమిటో నాకు తెలియదు అని అనగా నీవు వెళ్ళి ఉమ్మె జమీల్ బిన్తె ఖత్తాబ్‌ను అడిగిరా అని పంపించారు.

ఆమె వెళ్ళి,"అబూ బక్ర్, ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ గురించి అడుగుతున్నాడు (నీకేమైనా అతని విషయం తెలుసా?)" అని అడిగారు.

"నాకు ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (స) గురించిగాని, నీ కుమారుడు

అబూ బక్ర్ గురించి గాని ఏమీ తెలియదు. కావలసి వస్తే నేను నీ వెంట నీ కుమారుని దగ్గరకు రాగలను" అన్నారు ఉమ్మె జమీల్.

"సరే, పద పోదాం" అని ఉమ్ముల్ ఖైర్, ఉమ్మె జమీల్‌ను తోడ్కొని అబూ బక్ర్ (ర) దగ్గరికి వచ్చారు. అబూ బక్ర్ పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. దగ్గరకు వచ్చి, "ఏ జాతి అయితే నిన్ను ఇలా కొట్టిందో ఆ జాతి తప్పకుండా దుష్టజాతి, దైవతిరస్కార జాతి. అల్లాహ్ నీ పరిస్థితికి పగతీర్చుకోకమానడు" అని అరిచారు.

"దైవప్రవక్త (స) ఏమయ్యారు?" అని అడిగారు అబూ బక్ర్.

"ఇది మీ అమ్మగారు వింటోంది" అని సంశయంగా అన్నారు ఉమ్మె జమీల్.

"ఫరావా లేదు చెప్పండి" అని అడిగారు ఆయన.

"క్షేమంగా ఉన్నారు."

"ఎక్కడున్నారు?" ప్రశ్నించారు అబూ బక్ర్.

"ఇబ్నె అర్ఖమ్ ఇంట్లో."

"అయితే, దైవప్రవక్త (స) గారి సన్నిధికి వెళ్ళనంతమట్టుకు నేను ఏదీ తినేది లేదు, త్రాగేది లేదు. ఇది అల్లాహ్‌పై ఒట్టువేసి చెబుతున్నాను" అన్నారు అబూ బక్ర్ (ర).

ఉమ్ముల్ ఖైర్, ఉమ్మె జమీల్ అక్కడనే ఉండిపోయారు. రాకపోకలు సద్దుమణిగిపోయి బాగా చీకటి పడ్డ తరువాత వీరిద్దరు అబూ బక్ర్ (ర)ను తోడ్కొని బయలుదేరారు. అబూ బక్ర్ (ర)ను వారిద్దరు ఊతమిచ్చి మహాప్రవక్త (స) సన్నిధికి చేర్చగలిగారు.[5]

దైవప్రవక్త (స) గారి ఎడల సహాబా (ర)కున్న అనురాగం, ప్రాణత్యాగానికి సంబంధించిన అసాధారణ సంఘటనలు మేము ఈ గ్రంథంలో ముఖ్యంగా ఉహద్ యుద్ధంలో జరిగిన సంఘటనలు, హజ్రత్ ఖతీజా (ర) గారి విషయంలో చోటు చేసుకున్న విషయాలు సందర్భాన్నిబట్టి తెలియజేయగలం.

---

5. అల్ బదాయా వన్నహాయా-3/30.

3. బాధ్యతా భావన

మానవుడిగా చెప్పబడే ఈ పిడికెడు మట్టిముద్దపై ఎన్ని బృహత్తరమైన బాధ్యతలు ఉన్నాయో, ఆ బాధ్యతలను ఏ పరిస్థితుల్లోనూ విస్మరించడానికి వీలుండదో అనే యదార్థాన్ని మహాప్రవక్త (స) గారి అనుచరగణం బాగా ఎరిగిన వారు. ఎందుకంటే, బాధ్యతారాహిత్యం ఫలితంగా కలిగే దుష్పరిణామాలు ప్రస్తుత జులుం అత్యాచారాల కంటే భయంకరమైనవి, వినాశనకరమూ అయినవీను. ఆ బాధ్యతల్ని విస్మరించిన తరువాత ఖుద్దు వారికీ, సర్వమానవాళికీ సంభవించే నష్టం ఎంత తీవ్రంగా ఉంటుందో, ప్రస్తుతం ఈ బాధ్యతలను నెత్తికేసుకోవడం వల్ల ఎదురయ్యే కడగండ్లు, నష్టాలు అంత పెద్దవేమీ కావు అనే సత్యం వారెరుగుదురు.

4. పరలోకమందు విశ్వాసం

ఈ పరలోక భావన, పైన చెప్పిన బాధ్యతకు బలం చేకూర్చే భావన. సృష్టికర్త, పోషకుడూ అయిన అల్లాహ్ ఎదుట ఓ రోజున నిలబడవలసి ఉంటుందని, చిన్నా పెద్ద మరియు సాధారణమయిన అన్ని రకాల కర్మలకు లెక్కచూపవలసి ఉంటుందనీ ఆ తరువాత అన్ని వరాలతో నిండి ఉన్న శాశ్వత స్వర్గమో లేదా యాతనలతో అట్టుడికిపోయే నరకమో ప్రాప్తమవుతుందనే అచంచల విశ్వాసం సహాబా హృదయాంతరాళాల్లో స్థిరపడిపోయి ఉంది. ఈ విశ్వాసం, ఈ నమ్మకం కారణంగానే సహాబా (ర) తమ జీవితాన్ని ఆశనిరాశల స్థితిలో గడిపేవారు. అంటే వారి పోషకుడు అయిన అల్లాహ్ కారుణ్యం ఎడల ఆశతోను, ఆయన శిక్ష ఎడల భయంతోనూ జీవించేవారు. వారి పరిస్థితి ఈ ఖుర్‌ఆన్ ఆయత్‌లో వివరించినట్లుగా ఉండేది.

يُؤْتُونَ مَآ ءَاتَوا وَّقُلُوبُهُمْ وَجِلَةٌ أَنَّهُمْ إِلَىٰ رَبِّهِمْ رَٰجِعُونَ ۝٦٠

"వారు చేసే ప్రతి పనిని, హృదయాంతరాళంలో తమ పోషకుని వద్దకు తిరిగి పోవలసి ఉందనే భయంతో చేస్తారు." (23 : 60)

ఈ ఇహలోకంలోని అన్ని రకాల హంగులు ఆర్భాటాలు, వరాలు, కష్టాలు కడగండ్లు అన్నీనూ, పరలోకంతో పోల్చినప్పుడు ఓ దోమ రెక్కంత విలువ కూడా చేయలేవనే యదార్థాన్ని వారు గట్టిగా నమ్మారు. ఈ విశ్వాసం, ఈ నమ్మకం ఎంత దృఢమైనదంటే, వారి దృష్టిలో ఈ లోకపు కష్టాలు, కడగండ్లు,

బాధలు అన్నిటికి ఎలాంటి ప్రాధాన్యత ఉండకపోయేది. అందుకనే వారు తమపై జరిగే అత్యాచారాలకు, హింసలకు ఎలాంటి విలువా ఇవ్వలేదు.

5. దివ్యఖుర్ఆన్ ఆయత్‌లు, సూరాల అవతరణ

ఈ కష్టతరమైన, ప్రమాదకరమైన మరియు అంధకారబంధురమైన పరిస్థితుల్లోనే, గట్టి ఆధారాలను జూపుతూ దివ్యఖుర్ఆన్ ఆయత్‌లు, సూరాలు అవతరించనారంభించాయి. అవి మనస్సును ఆకర్షించేవిగా ఉండి ఇస్లామీయ మౌలిక సూత్రాలను నెలకొలిపాయి. ఆ పరిస్థితుల్లో దైవ సందేశప్రచారం ఈ సూత్రాల చుట్టే పరిభ్రమిస్తూ ఉండేది. ఈ ఆయత్‌లలో ముస్లిములకు, అల్లాహ్ మానవాళికి సంబంధించిన మహోన్నతమైన, బృహత్తరమైన సమాజం అంటే ఇస్లామీయ సమాజ నిర్మాణానికి సంబంధించిన సూత్రాలను అవతరింప జేయడం జరిగింది. అదే కాదు, ఈ ఆయత్‌లలో ముస్లిముల భావోద్రేకాలను తట్టి వారిని స్థిరంగా నిలబడేందుకు పురికొల్పడం జరిగింది. దాని కోసం ఉదాహరణలు కూడా ఇవ్వడం జరిగింది. అందు దాగివున్న మర్మమేదో తెలుపడం జరిగింది.

اَمْ حَسِبْتُمْ اَنْ تَدْخُلُوا الْجَنَّةَ وَلَمَّا يَاْتِكُمْ مَّثَلُ الَّذِيْنَ خَلَوْا مِنْ
قَبْلِكُمْ ؕ مَسَّتْهُمُ الْبَاْسَآءُ وَ الضَّرَّآءُ وَ زُلْزِلُوْا حَتّٰى يَقُوْلَ الرَّسُوْلُ
وَالَّذِيْنَ اٰمَنُوْا مَعَهٗ مَتٰى نَصْرُ اللّٰهِ ؕ اَلَاۤ اِنَّ نَصْرَ اللّٰهِ قَرِيْبٌ ۝

"స్వర్గప్రవేశం ఊరకే లభిస్తుందని మీరు అపోహపడుతున్నారా? మీకు పూర్వం విశ్వాసులకు సంభవించినవన్నీ ఇంకా మీకు సంభవించనేలేదే! వారిపై ఆపదలు, ఎనలేని వ్యధలు విరుచుకుపడ్డాయి. వారు కుదిపి వేయబడ్డారు. చివరకు అప్పటి ప్రవక్త, విశ్వాసులైన అతని అనుచరులు, "అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుందో" అని ఆక్రోశించారు. అప్పుడు, "అదిగో, అల్లాహ్ సహాయం సమీపం లోనే ఉంది" (అని వారిని ఓదార్చడం జరిగింది)" (2 : 214)

الٓمّٓ ۝ اَحَسِبَ النَّاسُ اَنْ يُّتْرَكُوْۤا اَنْ يَّقُوْلُوْۤا اٰمَنَّا
وَهُمْ لَا يُفْتَنُوْنَ ۝ وَلَقَدْ فَتَنَّا الَّذِيْنَ مِنْ

قَبْلِهِمْ فَلَيَعْلَمَنَّ اللّٰهُ الَّذِيْنَ صَدَقُوْا وَلَيَعْلَمَنَّ الْكٰذِبِيْنَ ۝

"అలిఫ్. లామ్. మీమ్. కేవలం, "మేము విశ్వసించాము" అని అన్నంత మాత్రాన్నే, వారిని వదలివేయడం జరుగుతుందనీ, వారిని పరీక్షించడం జరగదనీ ప్రజలు భావిస్తున్నారా? వాస్తవానికి మేము వారికి పూర్వం గతించిన వారందరినీ పరీక్షించాము. అల్లాహ్‌కు సత్యవాదులెవరో, అసత్యవాదులెవరో తప్పనిసరిగా చూడవలసి ఉంది." (29 : 1 - 3)

దైవతిరస్కారులకు, ఇస్లామ్ ధర్మం ఎడల విద్వేషాన్ని ప్రకటించే వారికి, వారి ఆగడాలను ఎత్తి చూపుతూ, సందర్భానుసారంగా ఇలాంటి ఆయత్‌లే అవతరింపనారంభించడంతో ఏమి చేయాలో తోచేది కాదు. ఈ ఆయత్‌లలో వీరే గనక ఆ మార్గభ్రష్టమైన విధానాన్ని మానుకోకపోతే దాని పరిణామం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించడమూ జరిగింది. ఇలా అవతరిస్తున్న దైవా విష్కృతిలో గతించిన జాతులకు సంబంధించిన సంఘటనలు, చారిత్రక సత్యాలు విడమర్చి చెప్పడం జరిగింది. అదేకాదు, తనను నమ్మిన వారి విషయంలో, తన ఎడల శత్రుత్వం వహించే వారి విషయంలోనూ అల్లాహ్, ఏ తీరుగా ప్రవర్తించాడో వివరించి చెప్పడం కూడా జరిగింది. దీనికి తోడు, నిజాన్ని గ్రహించి తమ ప్రవర్తనను మార్చుకుంటే వారికి ఒనగూడే శ్రేయో సౌఖ్యాలు ఎలాగుంటాయో అన్నది కూడా తెలియజేయడం జరిగింది ఈ ఆయత్‌లలో.

యదార్థానికి, ఈ దైవావిష్కృతి (వహీ) ద్వారా అల్లాహ్ ముస్లిములకు మరో ప్రపంచంలోనికి తొంగి చూసే భాగ్యాన్ని కలిగించాడు. వారికి విశ్వ రహస్యాలను గురించిన అవగాహన కలిగిస్తూ తన దైవత్వపు అందచందాల్ని, తన ఏకత్వ మహాత్మ్యాన్ని, తన కారుణ్య చతురతను, తన ప్రసన్నతకు సంబంధించిన సూచనలను చూపిస్తూపోతుంటే ఆ ఆకర్షణ ముందు మరే అడ్డంకి కూడా నిలువలేకపోయింది.

అదే కాదు, ఈ ఖుర్ఆన్ ఆయత్‌ల భావాల వెనుక, ముస్లిములకు దైవం తరపున కారుణ్యం, ప్రసన్నతలు, వరాలతో నిండిన స్వర్గధామాల శుభ వార్తలు దాగి ఉన్న సంబోధనలు కనిపిస్తే, మరో ప్రక్క దైవధిక్కారులు, తలబిరుసుదనంగల దుష్టులకు, ఓ రోజున తాము దైవసన్నిధిలో నిలబడవలసి

ఉంటుందని, వారు ఆచరించిన సత్కర్మలు, పుణ్యఫలాలు అన్నీ నిష్ప్రయోజనమై వారిని బోర్లాపడవేసి నరకకూపంలో, అక్కడి శిక్షను అనుభవించడానికి పడవేయవలసి ఉంటుందనే హెచ్చరిక కూడా చేయడం జరిగింది.

6. విజయం శుభవార్త

అదంతా ఒక ఎత్తు. పోతే, ఇస్లాం ధర్మ స్వీకారం అంటే శాశ్వత కష్టాలను కొనితెచ్చుకోవడం కానేకాదని, ఆ సందేశ ప్రచారం మొదలైన నాటి నుండే అజ్ఞానాన్ని, అజ్ఞానుల్ని, వారి దమనకాండను అంతమొందించడమని ఇది ప్రారంభ దినం నుండే - ఇంకా చెప్పాలంటే, అంతకు పూర్వం నుండే - జరిగే కృషి అని ముస్లిములకు బాగా తెలిసిన విషయం. ఈ సందేశ ప్రచారానికి సంబంధించిన మరో కోణం, మరో లక్ష్యం ఏమిటంటే, ఈ భూమండలంలో తమ ప్రభావాన్ని విస్తరింపజేస్తూ, మానవాళిని, ప్రపంచ జాతుల్ని దైవాభీష్టం వైపునకు నడిచేటట్లుగా మానవాళిని మానవమాత్రుల దాస్య శృంఖలాల నుండి బయటకు లాగి, కేవలం అల్లాహ్ దాస్యాన్నే అవలంబించేటట్లుగా ప్రపంచ రాజకీయ వ్యవస్థపై ప్రాబల్యం సంపాదించడం.

దివ్యఖుర్ఆన్‌లో ఈ శుభవార్తలు - అప్పుడప్పుడు సూచనప్రాయంగా, మరొకప్పుడు వివరంగా, అవతరించబడేవి. ఓ వైపు, ముస్లిములపై ప్రపంచం అంతా, ఇక వారి మనుగడ ఏ మాత్రం సాధ్యంకాదన్నట్లు, వారిని తుడిచిపారేసేటట్లు కుంచించుకొని వస్తున్నట్లుగా అగుపించేది. కాని మరో ప్రక్క ఈ నిరుత్సాహ పరిచే పరిస్థితుల్లోనే, గత ప్రవక్తల చరిత్రల్ని వివరిస్తూ వారి అనుయాయుల్ని ఎలా తిరస్కరించడం జరిగిందో తెలిపే ఆయత్‌లు కూడా అవతరించనారంభించాయి. ఆ ఆయత్‌లలో, ప్రస్తుతం మక్కా ముస్లిములు, దైవ తిరస్కారుల నడుమ జరిగే సంఘర్షణల్లాంటివే జరిగాయని, దైవ మార్గాన్ని అవలంబించిన సత్పురుషుల్నే అల్లాహ్ భూమండలానికి వారసులుగాజేశాడని, అల్లాహ్ మార్గాన్ని తిరస్కరించిన తిరస్కారులను ముష్కరులను అల్లాహ్ నామరూపాల్లేకుండా చేసిన తీరును తెలిపే సూచనలు కానవస్తాయి. వీరు ముస్లిముల ఎడల ఇలాగే ప్రవర్తిస్తూ ఉంటే మక్కావాసులు ఒకనాటికి నామరూపాల్లేకుండా పోతారని, ముస్లిములు, ముస్లిముల సందేశ ప్రచారం విజయం సాధిస్తుందనే శుభవార్త కూడా ఆ ఆయత్‌లలో ఉండేది. అదే కాదు,

ఈ పరిస్థితుల్లోనే, ముస్లిములు విజయం పొందుతారు అనే శుభవార్త వివరాలు గలిగిన ఖుర్ఆన్ ఆయత్‌లు అవతరించేవి. ఉదాహరణకు ఆ ఆయత్‌లు ఇలా ఉన్నాయి.

وَلَقَدْ سَبَقَتْ كَلِمَتُنَا لِعِبَادِنَا الْمُرْسَلِينَ ۝ إِنَّهُمْ لَهُمُ الْمَنصُورُونَ ۝ وَإِنَّ جُندَنَا لَهُمُ الْغَالِبُونَ ۝ فَتَوَلَّ عَنْهُمْ حَتَّىٰ حِينٍ ۝ وَأَبْصِرْهُمْ فَسَوْفَ يُبْصِرُونَ ۝ أَفَبِعَذَابِنَا يَسْتَعْجِلُونَ ۝ فَإِذَا نَزَلَ بِسَاحَتِهِمْ فَسَاءَ صَبَاحُ الْمُنذَرِينَ ۝

"మేము పంపిన మా దాసులకు మేము ఇదివరకే వాగ్దానం చేసి ఉన్నాము, తప్పకుండా వారికి సహాయం చేయబడుతుందనీ, మన సైన్యమే ప్రాబల్యం వహించి తీరుతుందనీ. కనుక ఓ ప్రవక్తా! కొంతకాలం వరకు, వారిని వారి స్థితిలో వదలిపెట్టి చూస్తూ ఉండు. త్వరలోనే స్వయంగా వారు కూడా చూస్తారు. వారు మా శిక్ష రాక కోసం తొందరపెడుతున్నారు. ఆ శిక్ష వారి ఇంటి ప్రాంగణంలో దిగే రోజున హెచ్చరించబడిన వారికి అత్యంత కఠినంగా ఉంటుంది." (37:171 -177)

మరో చోట-

سَيُهْزَمُ الْجَمْعُ وَيُوَلُّونَ الدُّبُرَ ۝

"త్వరలోనే ఈ వర్గం పరాజయంపాలవుతుంది. వారంతా వెన్నుజూపి పారిపోతూ కనిపిస్తారు." (54 : 45)

جُندٌ مَّا هُنَالِكَ مَهْزُومٌ مِّنَ الْأَحْزَابِ ۝

"ఇది బృందాలలోని ఒక చిన్న బృందం మాత్రమే. ఇదే స్థలంలో అది పరాజయంపాలు కానుంది." (38 : 11)

అబీసీనియాకు వలస వెళ్ళిన వారి గురించి ఇలా సెలవియ్యబడింది.

وَالَّذِينَ هَاجَرُوا فِي اللَّهِ مِن بَعْدِ مَا ظُلِمُوا لَنُبَوِّئَنَّهُمْ
فِي الدُّنْيَا حَسَنَةً ۖ وَلَأَجْرُ الْآخِرَةِ أَكْبَرُ ۚ لَوْ كَانُوا يَعْلَمُونَ ۝

"దౌర్జన్యాన్ని అనుభవించిన తరువాత అల్లాహ్ కోసం వలసపోయిన వారికి మేము ప్రపంచంలో తప్పకుండా మంచి నివాసాన్ని ఇస్తాము. పరలోక ప్రతిఫలమయితే ఇంతకంటే గొప్పగానే ఉంటుంది." (16 : 41)

ఇలాగే దైవ తిరస్కారులు దైవప్రవక్త (స)ను హజ్రత్ యూసుఫ్ (అ.స.) గారి గాథ ఏమిటో చెప్పమని అడగగా, సమాధానంగా ఈ ఆయత్ అవతరించింది.

لَقَدْ كَانَ فِي يُوسُفَ وَإِخْوَتِهِ آيَاتٌ لِّلسَّائِلِينَ ۝

"యదార్థానికి యూసుఫ్, అతని సోదరుల గాథలో ఈ అడిగే వారికి గొప్ప సూచనలు ఉన్నాయి." (12 : 7)

నేడు యూసుఫ్ (అ.స.) గాథను గురించి అడిగే ఈ మక్కావాసులు, యూసుఫ్ (అ.స.) సోదరులు అపజయం పాలైనట్లుగానే అపజయానికి గురికాగలరని, వీరి ఎత్తుగడలు కూడా యూసుఫ్ (అ.స.) గారి సోదరుల ఎత్తుగడలు విఫలమయినట్లే విఫలం కాగలవు అనీ, వీరు యూసుఫ్ (అ.స.) మరియు ఆయన సోదరుల గాథ ద్వారా గుణపాఠం నేర్చుకోవలసి ఉంది అనీ వివరిస్తూ, జులుము చేసేవారికి పట్టే గతి ఎలాగుంటుందో ఆ గాథలో విడమర్చి చెప్పడం జరిగింది. ఓ చోట ప్రవక్తల ప్రస్తావన తెస్తూ దివ్యగ్రంథం ఇలా సెలవిస్తోంది.

وَقَالَ الَّذِينَ كَفَرُوا لِرُسُلِهِمْ لَنُخْرِجَنَّكُم مِّنْ أَرْضِنَا أَوْ لَتَعُودُنَّ فِي مِلَّتِنَا ۖ فَأَوْحَىٰ إِلَيْهِمْ رَبُّهُمْ لَنُهْلِكَنَّ الظَّالِمِينَ ۝ وَلَنُسْكِنَنَّكُمُ الْأَرْضَ مِن بَعْدِهِمْ ۚ ذَٰلِكَ لِمَنْ خَافَ مَقَامِي وَخَافَ وَعِيدِ ۝

"చివరకు తిరస్కారులు తమ ప్రవక్తలతో ఇలా అన్నారు. 'మీరు మా మతంలోకి దిగిరావాలి. లేకపోతే మేము మిమ్మల్ని దేశం నుండి బహిష్కరిస్తాము.' అప్పుడు వారి ప్రభువు వారికి ఇలా 'వహీ'ని పంపాడు. 'మేము ఈ దుర్మార్గులను నాశనం చేస్తాము. వారి తరువాత మిమ్మల్ని భూమిపై వసింపజేస్తాము. నా సాన్నిధ్యంలో సమాధానం చెప్పుకోవలసి ఉందని భయపడుతూ నా శిక్షకు భయపడే వ్యక్తికే ఈ బహుమానం." (14 : 13,14)

ఇలాగే, పర్షియాలో యుద్ధజ్వాలలు చెలరేగే సమయంలో, దైవతిరస్కారులు పర్షియనులు నెగ్గాలని కోరుకునేవారు. ఎందుకంటే, పర్షియనులు బహుదైవారాధకులు. ముస్లిములేమో రోమనులు గెలువాలని కోరుకునేవారు. కారణం, రోమనులు ఓ విధంగా దైవప్రవక్తల్ని, దివ్యావిష్కృతిని, ఆకాశ

గ్రంథాలను, పరలోకాన్ని విశ్వసించేవారమని వాదించేవారు గనుక. కాని పర్షియనులే నెగ్గుకు వస్తూ విజయపరంపరలు సాధిస్తూ ఉన్న తరుణంలోనే అల్లాహ్ ముస్లిములకు, రోమనులే కొన్ని ఏండ్ల తరువాత విజయం సాధిస్తారు అని దివ్యఖుర్ఆన్‌లో శుభవార్త అవతరింపజేశాడు. కేవలం ఈ శుభవార్త అందించడం మట్టుకే సరిపెట్టలేదు. ఈ విషయంలో, రోమనులు విజయం పొందినప్పుడు ముస్లిములకు కూడా ప్రత్యేక సహాయం అందించి ఆదుకుంటాను. వారు సంబరపడాలి అనే శుభవార్త కూడా ఇవ్వడం జరిగింది. ఈ శుభవార్త ఇలా ఉంది:

وَيَوْمَئِذٍ يَفْرَحُ الْمُؤْمِنُونَ ۝ بِنَصْرِ اللَّهِ

"ఆ రోజున అల్లాహ్ ప్రసాదించిన విజయానికి విశ్వాసులు వేడుకలు జరుపుకుంటారు." (30 : 4,5)

(భవిష్యత్తులో అల్లాహ్ అందించిన ఈ సహాయం బద్ర్ యుద్ధంలో లభించిన మహోన్నత విజయం రూపంలో అవతరించిన సహాయం.)

దివ్యఖుర్ఆన్ మట్టుకే కాదు, మహాప్రవక్త (స) స్వయంగా ముస్లిములకు సందర్భానుసారంగా ఇలాంటి శుభవార్తలనే వినిపించేవారు.

హజ్ కాలంలో ఉక్కాజ్, మజిన్నా, జుల్‌మజాజ్ సంతల్లో ప్రజలకు దైవ దౌత్యం గురించి బోధించడానికి వెళ్ళినప్పుడు, స్వర్గం లభిస్తుందనే శుభవార్తను మాత్రమే అందించడం కాకుండా నిక్కచ్చిగా ఇలా ప్రకటించేవారు:

"ప్రజలారా! లా ఇలాహ ఇల్లల్లాహ్ అనండి. సాఫల్యం పొందగలరు. ఫలితంగా మీరు అరేబియాకే రాజులైపోతారు. అరబ్బేతర రాజ్యాలు మీకు ఆధీనమైపోతాయి. (అదే కాదు!) మీరు మరణించిన తరువాత స్వర్గంలో మహారాజుల్లా నివసిస్తారు." [6]

ఉత్బా బిన్ రబీయా దైవప్రవక్త (స)ను లోబరుచుకోవడానికి ధన సంపదలను ఎరగా చూపి బేరసారాలు చేసినప్పుడు కూడా ఆయన (స) హామీమ్ అస్సజ్దా సూరాలోని ఆయత్‌లను పఠించి వినిపించినప్పుడు ఉత్బాకు, చిట్ట చివరకు ఆయనే విజయం సాధిస్తారనే నమ్మకం కుదిరిన విషయం ఇది వరకే చదువుకున్నాం.

6. తిర్మిజీ.

అలాగే అబూ తాలిబ్ వద్దకు వచ్చిన ఖురైష్ చివరి ప్రతినిధి బృందంతో దైవప్రవక్త (స) మాట్లాడిన మాటలు కూడా మనకు తెలిసినవే. ఈ సందర్భంలో ఆయన ఎంతో వివరంగా, ఒకే ఒక మాటను ఒప్పుకొమ్మని, దాన్ని ఒప్పుకుంటే అరేబియాకే చక్రవర్తులైపోతారని, అరబ్బేతర రాజ్యాలు వారికి ఆధీనం అయిపోతాయని చెప్పినట్లు మనకు గుర్తుంది.

హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, "ఓసారి నేను దైవప్రవక్త (స) గారి సన్నిధికి చేరాను. ఆయన అప్పుడు కాబా గోడకు ఆనుకొని కూర్చుని ఉన్నారు. ఆ కాలంలోనే బహుదైవారాధకులు పెట్టే హింసలను భరించలేకపోతున్నాం మేము. నేను ప్రవక్త (స) ను, ప్రవక్తా! మనమెందుకు అల్లాహ్‌ను ప్రార్థించకూడదూ? అని అన్నాను. ఇది విన్నంతనే మహాప్రవక్త (స) దిగ్గున లేచి కూర్చున్నారు. ఆయన ముఖం (కోపంతో) ఎరుపెక్కింది. నన్ను చూసి, "నీకంటే ముందు గతించిన వారి ఎముకల నుండి మాంసం వేరుచేయడానికి ఇనుప దువ్వెనలను పెట్టి దువ్వడం జరిగింది. ఈ హింస కూడా వారి ధర్మాన్ని వదిలేటట్లు చేయలేదు. అల్లాహ్ ఈ ధర్మాన్ని పరిపూర్ణం చేస్తాడు. చివరికి ఓ ప్రయాణీకుడు ఒంటరిగా సన్ఆ నుండి హజర్‌మౌత్ వరకు వెళ్ళగలడు. అతనికి అల్లాహ్ భయం తప్ప మరెవ్వరి భయమూ ఉండదు. అయితే మేకకు మాత్రం తోడేలు భయం ఒకటే ఉంటుంది."[7]

మరో ఉల్లేఖనంలో, "అయితే మీరు తొందరపడుతున్నారు" అనే పదాలు కూడా ఉన్నాయి.[8] ఇవి అందరికీ తెలియని ఏవో శుభవార్తలు కావు. అందరికీ తెలిసిన, ప్రాచుర్యం పొందిన శుభవార్తలే. ముస్లిములకు మల్లే దైవతిరస్కారులు కూడా ఈ శుభవార్తలను గూర్చి బాగా ఎరుగుదురు. కాబట్టి అస్వద్ బిన్ ముత్తలిబ్, అతని మిత్రబృందం సహాబా (ర)ను చూడగానే ఎగతాళి చేస్తూ తమలో తాము, "చూశారా! మన దగ్గరికి భూలోక చక్రవర్తులు వస్తున్నారు, వీరు త్వరలోనే పర్షియా, రోమను సామ్రాజ్యాలను జయిస్తారట" అని గేలిచేస్తూ చప్పట్లు చరిచేవారు, ఈలలు వేసేవారు.[9]

---

7. సహీ బుఖారి-1/543. 8. సహీ బుఖారి-1/510.
9. ఫికహుస్సీరత్-పుట. 84.

ఏదిఏమైనా, సహాబా (ర)లపై విరుచుకుపడే హింసాదౌర్జన్యాల ఈ తుఫాను, స్వర్గాన్ని పొందేవారి దృఢవిశ్వాసం, ఉజ్వల భవిష్యత్తు గురించిన శుభవార్తల ముందు పిల్లగాలికి తేలిపోయే ఓ పీచు మబ్బులాంటిదే.

ఇదే కాకుండా, మహాప్రవక్త (స), విశ్వసించిన వారి విశ్వాసానికి విశ్వాస మాధుర్యం ద్వారా సతతం ఆధ్యాత్మిక బలాన్ని చేకూర్చేవారు. గ్రంథ బోధనల ద్వారా వారి ఆత్మప్రక్షాళన జరుపడం జరిగేది. ఎంతో లోతయిన పటిష్ఠమైన శిక్షణ కూడా ఇచ్చేవారు. ఆత్మౌన్నత్యం, హృదయ ప్రక్షాళన, నైతికతా నైర్మల్యం పొందడానికీ; భౌతిక పాశాల్లో చిక్కుకోకుండా, కామవాంఛలకు బలికాకుండా వారిని కాపాడుతూ, భూమ్యాకాశాల ప్రభువు వైపు మొగ్గుజూపేందుకు సతతం కృషి చేసేవారు. ఆయన (స) వారి హృదయాల్లో ఆరిపోబోతున్న అగ్ని రవ్వను, ప్రజ్వలించే అగ్ని కీలగా మార్చివేసేవారు. వారిని అంధకారం నుండి బయటకు తీసి సన్మార్గ వెలుగులో పయనింపజేశారు. హింసలను భరించమని ఉద్బోధ చేసేవారు. దానికి బదులు మన్నింపు ధోరణిని, సంయమనాన్ని పాటించమని హితబోధ చేసేవారు. దీని ఫలితంగానే వారి ధార్మిక దృఢత్వం రోజురోజుకు బలపడిపోసాగింది. కామవాంఛలకు దూరంగా ఉండే నిర్ణయం, దైవ ప్రసన్నతను పొందే కోరిక, స్వర్గాన్ని పొందే ఆకాంక్ష, జ్ఞాన సముపార్జనావేశము, ధర్మావగాహన, జవాబుదారీ తనం; ఉద్రేకాలను అణచివేసే ఆలోచనల్ని, సన్మార్గం వైపునకు మరల్చే శక్తి, మనస్సులో పెల్లుబుకుతున్న శంకల తరంగాలను నియంత్రించే సామర్థ్యం, శాంత స్వభావం మరియు గౌరవోన్నతుల్లాంటి సద్గుణ సంపదల్ని పొంది మానవీయ విలువల సాటిలేని మేటి సమాజంగా రూపొందారు ఆయన అనుచరగణం (రజిఅల్లాహు అన్హు).

తృతీయ దశ

మక్కాకు వెలుపల ఇస్లామ్ సందేశ ప్రచారం

తాయెఫ్‌కు దైవప్రవక్త (స) గారి ప్రయాణం

దైవదౌత్య శకం 10, షవ్వాల్ నెలలో [1] (క్రీ.శ.619 మే చివరి రోజులు లేదా జూన్ ప్రారంభ దినాలు) దైవప్రవక్త (స) తాయెఫ్‌కు ప్రయాణమై వెళ్ళారు. తాయెఫ్ మక్కాకు అరవై మైళ్ళ దూరంలో ఉన్న పట్టణం. మహాప్రవక్త (స) అక్కడికి కాలినడకనే వెళ్ళి వచ్చారు. ఆయన (స) వెంట, ఆయనచే స్వాతంత్ర్యం పొందిన బానిస హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర) కూడా ఉన్నారు. మార్గమధ్యంలో ఏ తెగ వారు కలసినా వారికి ఇస్లామ్ ధర్మం వైపునకు రమ్మని ఆహ్వానిస్తూ వెళ్ళారు. అయితే, ఏ ఒక్కరూ ఆయన (స) పిలుపును ఆలకించలేదు. తాయెఫ్‌కు చేరిన తరువాత 'సఖీఫ్' తెగకు చెందిన ముగ్గురు సర్దారుల వద్దకు వెళ్ళారు. వీరు ముగ్గురూ పరస్పరం అన్నదమ్ములే. వారి పేర్లు అబ్దెయాలైల్, మస్ఊద్ మరియు హబీబ్‌లు. వారి తండ్రి పేరు అమ్రూ బిన్ ఉమైర్ సఖఫీ. మహాప్రవక్త (స) వారి వద్దకు వెళ్ళి కూర్చుని అల్లాహ్‌కు విధేయులైపొమ్మని, ఇస్లామ్ ధర్మాన్ని ఆదుకొమ్మని వారికి పిలుపునిచ్చారు. వారిలో ఒకడు, "అల్లాహ్ నిన్ను దైవప్రవక్తగా చేస్తే కాబా గృహం పరదాను చించెయ్యనా?" అన్నాడు.[2] మరొకడు అందుకొని, "అల్లాహ్‌కు నీవు తప్ప మరెవ్వడూ దొరకలేదా?" అని అన్నాడు. మూడోవాడు, "నీతో నేను అసలే మాట్లాడను. నీవే నిజంగా అల్లాహ్ ప్రవక్తవయితే నీ మాటను రద్దు చేయడం

1. *మౌలానా నజీబాబాదీ తన తారీఖె ఇస్లామ్ అనే గ్రంథం 1/122 లో ఈ తేదీలను రాశారు. నా దృష్టిలో అవి సరైనవిగా తోచాయి.*
2. *ఇది అరబీ భాషలోని సామెత. అంటే నిన్ను అల్లాహ్ ప్రవక్తగా చేస్తే నేను నాశనమైపోయానా? అని. ఇది, నీవు ప్రవక్తవు కావడం అసంభవం. ఎలాగైతే కాబా గృహ పరదాను చించివేయడం ఎంత అసంభవమో ఇదీ అంతే అసంభవం అని నమ్మకంగా చెప్పడం అన్నమాట.*

నాకు బహుప్రమాదకరమైన విషయమవుతుంది. నీవే అల్లాహ్‌పై అపవాదు వేస్తున్నట్లయితే నీతో మాట్లాడే అవసరం ఏమిటీ?" అని పలికాడు. ఈ సమాధానాలు విన్న మహాప్రవక్త (స), అక్కడ నుండి లేచి వెళ్ళిపోతూ, "మీరు అవలంబించిన ఈ తీరును బయటకుపొక్కనివ్వకండి" అని చెప్పి వెళ్ళి పోయారు.

మహాప్రవక్త (స) తాయెఫ్‌లో పది రోజులు గడిపారు. ఈ పది రోజులూ, పట్టణానికి చెందిన ఒక్కొక్క సర్దారు వద్దకు వెళ్ళి మాట్లాడారు. అందరి నోట వెలువడ్డ సమాధానం ఒక్కటే. "నీవు ఈ నగరం నుండి వెళ్ళిపో" అన్నదే ఆ సమాధానం. అదే కాదు, ఆయనపై రౌడీ మూకల్ని కూడా ఉసిగొలిపారు. ఆయన నగరం నుండి బయలుదేరినతోడనే ఈ ముష్కరులు, ఆయన (స)ను దుర్భాషలాడుతూ, చప్పట్లు చరుస్తూ, గోల చేస్తూ ఆయన వెంటపడ్డారు. క్షణాల్లో ఓ పెద్ద గుంపు తయారయింది. ఈ గుంపు ఆయన వెళ్ళే మార్గానికి ఇరువైపులా వరుసగట్టి నిలబడింది. తిట్లు, దుర్భాషలకు తోడు ఆయనపై రాళ్ళు కూడా విసరనారంభించింది. రాళ్ళు విసరడం వల్ల అయిన గాయాల కారణంగా కారే రక్తం ఆయన పాదరక్షల్లోనికి చేరి గడ్డకట్టనారంభించింది. ఇటు ఆయన వెంట ఉన్న జైద్ బిన్ హారిసా ఢాలుగా నిలబడి ఆ రాళ్ళు తగలకుండా ఆపే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రాళ్ళ దెబ్బలకు ఆయన తలపై గాయాలు అయ్యాయి. రౌడీ మూక ఇలా ప్రవక్త (స)ను హింసిస్తూనే ఉన్నారు. చివరికి ఆయన, రబీయా కుమారులైన ఉత్బా మరియు షైబా తోటలోనికి వెళ్ళి తలదాచుకోవలసి వచ్చింది. ఇది తాయెఫ్‌కు మూడు మైళ్ళ దూరాన ఉన్న తోట. మహాప్రవక్త (స) అక్కడ తలదాచుకోవడం గమనించిన రౌడీ మూక వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది. ఆయన (స) ఓ గోడకు అనుకొని ఓ ద్రాక్ష తీగ నీడలో కూర్చుండి సేదతీర్చుకుంటున్నారు. కొంత స్థిమితపడ్డాక దైవాన్ని ప్రార్థించారు. ఆ దుఆ "దుఆయె ముస్తజ్ ఇఫీన్" పేరున ప్రాచుర్యం పొందింది. ఆ దుఆలోని ఒక్కో పదాన్ని తరచి చూస్తే, తాయెఫ్‌లో ఆయనపై జరిగిన దౌర్జన్యం, ఏ ఒక్కడూ విశ్వసించకపోవడం వల్ల ఆయనకు కలిగిన మనస్తాపం, ఆయన అనుభవించిన బాధ ఎలాంటిదో అర్థమవుతుంది. ఆ దుఆ ఇది:

"ఓ ప్రభూ! నేను నీ ముందు నా చేతకానితనాన్నీ, నా బలహీనతను, ప్రజలు నా ఎడల ప్రవర్తించిన అగౌరవాన్ని గురించి విన్నవించుకుంటున్నాను. ఓ కరుణామయా! నీవు బలహీనుల పోషకుడవు. నా పోషకుడవూ నీవే. నీవు నన్ను ఎవరికి అప్పజెబుతున్నావు? నా ఎడల దురుసుగా ప్రవర్తించేవారికా? నా వ్యవహారాన్ని తన చేతిలో తీసుకొని నాపై అధికారాన్ని చెలాయించే నా శత్రువుకా? ఒకవేళ నాపై నీకు కోపం లేకపోతే, అంతే చాలు. కాని నీ శాంతం మాత్రం నా కోసం ఎంతో విశాలమైనది. నీవు నాపై నీ శిక్షను, నీ క్రోధాన్ని అవతరింపజేయడానికి ముందే, ఇహపరలోకాల సాఫల్యం లభించే, చీకట్లను వెలుగుగా విరజిమ్మే నీ ముఖజ్యోతిని శరణు వేడుకుంటున్నాను. నీవు ప్రసన్నుడివి అయినంత వరకు నీ సంతుష్టినే కోరుకుంటున్నాను. నీవు తప్ప మరే శక్తిగాని, బలంగాని ఎవరికీ లేదు."

ఇటు రబీయా కుమారులకు దైవప్రవక్త (స)ను ఆ పరిస్థితిలో చూడగానే జాలి కలిగింది. తమ క్రైస్తవ బానిస 'అద్దాస్'ను పిలిచి, ఓ ద్రాక్ష గుత్తిని తీసుకొని వెళ్ళి ఆ వ్యక్తికి ఇచ్చిరమ్మని పంపించారు. ద్రాక్ష గుత్తి ఆయన ముందుకు రాగానే దాన్ని తీసుకోవడానికి మహాప్రవక్త (స) బిస్మిల్లా అంటూ చేయిని ముందుకు చాచి అందుకుని నోటబెట్టుకున్నారు. ఇది గమనించిన అద్దాస్,

"ఈ ప్రాంతం వారు ఈ వాక్యాన్ని పలకరే!" అన్నాడు.

"నీవెక్కడివాడివి? నీ ధర్మం ఏది?" అని ప్రశ్నించారు దైవప్రవక్త (స).

"నేను క్రైస్తవమతావలంబికుణ్ణి, 'నైనవా' నివాసిని."

"ఓహో! నీవు సత్పురుషుడు అయిన యూనుస్ బిన్ మత్తీకి చెందిన బస్తీ వాడివా?" అని అడిగారు మహాప్రవక్త (స).

"అవును! యూనుస్ బిన్ మత్తీ మీకెలా తెలుసు?" అని అడిగాడు అద్దాస్.

"ఆయన నా సోదరుడు. ఆయన దైవప్రవక్త. నేనూ దైవప్రవక్తనే" బదులిచ్చారాయన(స).

ఇది విన్న అద్దాస్ ఆయనపై వంగిపోయాడు. ఆయన తలను, కాళ్ళు చేతుల్ని ముద్దాడనారంభించాడు.

ఇది గమనిస్తున్న రబీయా కుమారులు ఇద్దరూ, "ఓహో! ఇప్పుడు ఈ వ్యక్తి మన బానిసను సయితం చెడగొట్టేశాడు" అని అనుకోసాగారు. అద్దాస్ వారి వద్దకు తిరిగి రాగానే, "ఏమిటయ్యా నీవు అక్కడ ప్రవర్తించిన తీరు" అని అడిగారు.

"నా యజమానులారా! ఈ భూమండలంపై ఆయనకంటే మేలైన మనిషి మరొకరుండబోడు. ఆయన నాతో చెప్పిన మాటలు ఒక్క ప్రవక్తకు తప్ప మరెవ్వరికీ తెలియనివి" అని అన్నాడు.

"చూడు అద్దాస్! ఈ వ్యక్తి నీ ధర్మం నుండి నిన్ను మార్చేయగలడు సుమా! నీ మతం ఆయన మతంకంటే మేలైనది" అని అన్నారు.

కొంతసేపు సేదతీర్చుకున్న తరువాత మహాప్రవక్త (స) మక్కాకు బయలుదేరారు. మనస్తాపం, బాధ అధికం అయినందు వల్ల ఆయన హృదయం తల్లడిల్లసాగింది. శరీరంలో శక్తి ఉడిగిపోయింది. 'ఖర్నెమనాజిల్' అనే ప్రదేశానికి రాగానే అల్లాహ్ ఆదేశం మేరకు హజ్రత్ జిబ్రీల్ (అ.స.) ఆయన వద్దకు అరుదెంచారు. ఆయన వెంట పర్వతాల దైవదూత కూడా ఉన్నాడు. అతను వచ్చింది, దైవప్రవక్త (స) సెలవిస్తే మక్కా ప్రజల్ని రెండు కొండల నడుమ నుంచి పిండి చేయగలను అని విన్నవించుకోవడానికే.

ఈ సంఘటనా వివరాలు సహీ బుఖారిలో హజ్రత్ ఆయిషా (ర) ఇలా ఉల్లేఖిస్తున్నారు.

"ఆమె ఓ రోజు దైవప్రవక్త (స)తో, ఉహద్ యుద్ధం జరిగిన రోజు కంటే కఠినమైన రోజు ఏదైనా మీరు చూశారా అని అడగగా, మహాప్రవక్త (స), అవును! నీ జాతి కారణంగా నేను అనుభవించిన కష్టాల్లోకెల్లా అతి కష్టమైన పరిస్థితి ఒకటుంది. అది నేను అబ్దె యాలైల్ బిన్ అబ్దె కలాల్ కుమారుని వద్దకు వెళ్ళి దైవసందేశాన్ని ఇచ్చాను. కాని అతను నా మాటను విననప్పుడు మనస్తాపంతో బయలుదేరాను. ఖర్నె సఆలిబ్‌కు చేరిన తరువాతే నాకు కొంత ఊరట కలిగింది. అక్కడ నేను తలపైకెత్తి చూద్దును కదా నల్లటి మబ్బు తునక ఒకటి నాకు నీడనిస్తోంది. నేను నిశితంగా చూస్తే అందు జిబ్రీల్ (అ.స.) ఉన్నారు. ఆయన నన్ను పిలిచి, మీ జాతి మీకు ఇచ్చిన సమాధానాన్ని దైవం విన్నాడు. ఆయన ఇప్పుడు మీ వద్దకు పర్వతాల దూతను పంపించాడు. మీరు ఏ

ఆదేశమిస్తే దాన్ని అతను పాలిస్తాడు అన్నారు. ఆ తరువాత పర్వతాల దూత నన్ను పిలిచి సలామ్ చేసిన తరువాత, "ఓ ముహమ్మద్ (స)! విషయం అదే. ఇప్పుడు ఏది కోరినా సరే... వీరిని ఈ రెండు కొండల నడుమ[3] వేసి నుజ్జునుజ్జు చేయమంటే అలాగే చేస్తాను" అని అన్నాడు. దానికి నేను, "లేదు, ఈ జాతి నుండి కేవలం అల్లాహ్‌నే ఆరాధించే సంతతి ఉనికిలోనికి వస్తుంది. అది మరెవ్వరిని అల్లాహ్‌కు సాటిగా నిలబెట్టదు"[4] అన్నారు.

దైవప్రవక్త (స) ఇచ్చిన ఈ సమాధానంలో లోతైన నైతిక విలువలను గమనించవచ్చు. మొత్తానికి ఇప్పుడు ఆయనకు సప్తాకాశాల పైనుండి వచ్చే దైవిక సహాయం కారణంగా స్థిమితం చేకూరినట్లయింది. బాధాపరితప్త హృదయానికి సాంత్వన చేకూరినట్లయింది. ఆపై ఆయన మక్కా వైపునకు ముందుకు నడువనారంభించారు. 'వాదియే నఖ్లా' (నక్లా అనే కొండలోయ) లోనికి వచ్చి ఆగారు. ఇక్కడ రెండు ప్రదేశాలు ఉండడానికి వీలుగా ఉన్నాయి. ఒకటి 'అస్సైలుల్ కబీర్', రెండవది, 'జైమా'. ఎందుకంటే, ఇక్కడ త్రాగడానికి నీరు, పచ్చదనం కనిపిస్తాయి. అయితే ఈ రెండు ప్రదేశాల్లో ఆయన (స) ఎక్కడ ఆగారన్నది ఆధారాల ద్వారా తెలియడం లేదు.

నక్లా లోయలో కొన్ని రోజులు బస చేసినప్పుడు అల్లాహ్ ఆయన వద్దకు జిన్నుల ఓ వర్గాన్ని పంపించడం జరిగింది. ఈ ప్రస్తావన దివ్యఖుర్‌ఆన్‌లో రెండు చోట్ల వచ్చింది. ఒకటి 'జిన్' సూరాలో, మరొకటి 'అహ్కాఫ్' సూరాలో. ఆ వాక్యాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

وَإِذْ صَرَفْنَا إِلَيْكَ نَفَرًا مِّنَ الْجِنِّ يَسْتَمِعُونَ الْقُرْآنَ فَلَمَّا حَضَرُوهُ
قَالُوا أَنصِتُوا ۖ فَلَمَّا قُضِيَ وَلَّوْا إِلَىٰ قَوْمِهِم مُّنذِرِينَ ﴿٢٩﴾
قَالُوا يَا قَوْمَنَا إِنَّا سَمِعْنَا كِتَابًا أُنزِلَ مِن بَعْدِ مُوسَىٰ مُصَدِّقًا لِّمَا بَيْنَ

---

3. సహీ బుఖారి గ్రంథంలో ఖష్బీన్ అనే పదం ఉపయోగించబడింది. ఇది మక్కాకు చెందిన రెండు ప్రఖ్యాత కొండలు అబూ ఖైస్ మరియు ఖయీఖాన్ కోసం వాడబడే పదం. ఈ రెండు కొండలు హరమ్ (కాబా)కు దక్షిణం మరియు ఉత్తరంలో ఎదురెదురుగా ఉన్నాయి. ఆ కాలంలో మక్కా ప్రజలం దరూ ఆ రెండు కొండల నడుమనే నివసిస్తూ ఉండేవారు.
4. సహీ బుఖారి-కితాబు బద్‌ఉల్‌ఖల్ఖ్-1/458; ముస్లిమ్-2/109.

يَدَيْهِ يَهْدِي إِلَى الْحَقِّ وَإِلَىٰ طَرِيقٍ مُّسْتَقِيمٍ ﴿٣٠﴾ يَا قَوْمَنَا أَجِيبُوا دَاعِيَ اللَّهِ
وَآمِنُوا بِهِ يَغْفِرْ لَكُم مِّن ذُنُوبِكُمْ وَيُجِرْكُم مِّنْ عَذَابٍ أَلِيمٍ ﴿٣١﴾

"(ఆ సంఘటన కూడా ప్రస్తావించదగినదే) అప్పుడు మేము జిన్నుల ఒక వర్గాన్ని ఖుర్‌ఆన్ వినేందుకు నీ వద్దకు తీసుకొని వచ్చాము. నీవు ఖుర్‌ఆన్ పఠిస్తూ ఉండిన స్థలానికి చేరిన తరువాత, వారు పరస్పరం, "నిశ్శబ్దంగా ఉండండి" అని చెప్పుకున్నారు. అది చదవడం ముగిసిన పిదప, వారు హెచ్చరిక చేసేవారుగా తమ జాతి వైపునకు తిరిగి వెళ్ళిపోయారు. వారు అక్కడికి వెళ్ళి ఇలా అన్నారు. "ఓ మా జాతి ప్రజలారా! మేము ఒక గ్రంథాన్ని విన్నాము. అది మూసా ప్రవక్త తరువాత అవతరించింది; తనకు పూర్వం అవతరించిన గ్రంథాలను ధ్రువీకరిస్తోంది, సత్యం వైపునకు, రుజుమార్గం వైపునకూ దారి చూపుతుంది. ఓ మా జాతి ప్రజలారా! అల్లాహ్ వైపునకు పిలిచేవాని సందేశాన్ని స్వీకరించండి. అతనిని విశ్వసించండి. అప్పుడు అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు. మిమ్మల్ని భయంకరమైన శిక్ష నుండి రక్షిస్తాడు." (46: 29-31)

జిన్ను సూరా ఆయత్‌లు ఇలా ఉన్నాయి.

قُلْ أُوحِيَ إِلَيَّ أَنَّهُ اسْتَمَعَ نَفَرٌ مِّنَ الْجِنِّ فَقَالُوا إِنَّا سَمِعْنَا قُرْآنًا عَجَبًا ﴿١﴾
يَهْدِي إِلَى الرُّشْدِ فَآمَنَّا بِهِ ۖ وَلَن نُّشْرِكَ بِرَبِّنَا أَحَدًا ﴿٢﴾

"ఓ ప్రవక్తా! జిన్నుల సమూహం ఒకటి శ్రద్ధగా విని, ఆ తరువాత (తన జాతి ప్రజల వద్దకు పోయి) ఇలా అన్నట్లు నాకు వహీ ద్వారా తెలియజేయ బడినదని చెప్పు. "మేము ఒక అద్భుతమైన ఖుర్‌ఆన్ విన్నాము, అది సన్మార్గం వైపునకు దారి చూపుతుంది, కనుక మేము దానిని విశ్వసించాము. ఇక ఎప్పుడూ మేము మా ప్రభువుకు భాగస్వాములుగా మరెవ్వరినీ చేయము." ఇంకా ఇలా అన్నారు. మా ప్రభువు వైభవం చాలా గొప్పది, ఘనమైనది. ఆయన ఎవరినీ భార్యగా గాని, కుమారునిగా గాని చేసుకోలేదు." (పదిహేనవ ఆయత్ వరకు).

ఈ ఆయత్‌లు అవతరించిన సందర్భాన్నిబట్టిజూస్తే, మొదట జిన్నుల బృందం ఖుర్‌ఆన్ గురించి దైవప్రవక్త (స)కు తెలియదు అనేది. ఆ తరువాత ఈ ఆయత్‌ల ద్వారా అల్లాహ్ ఆయనకు తెలియజేస్తే తప్ప తెలియలేదు. అదే

కాదు, మరో విషయం ఏమిటంటే, ఈ ఖుర్‌ఆన్ మొదటినుంచే అన్నది. హదీసుల ద్వారా ఈ జిన్నుల రాకపోకలు ఆ తరువాత కొనసాగాయని తెలుస్తుంది.

జిన్నుల రాక, వారి ఇస్లామ్ స్వీకార సంఘటన నిజానికి అల్లాహ్ తరఫున మరో సహాయమే అనాలి. అది ఆయన పరోక్షంగా చేసిన సహాయం. ఇది అల్లాహ్‌కు తప్ప ఎవరికీ తెలియదు. అదే కాకుండా, ఆ సంఘటనకు సంబంధించి అవతరించిన ఆయత్‌లలో దైవప్రవక్త (స)కు శుభవార్తలు కూడా ఉన్నాయి. ఆ శుభవార్తలు ఏమిటంటే, విశ్వంలోని ఏ శక్తి కూడా సందేశ ప్రచార విషయంలో అడ్డంకి కాజాలదన్నది. కాబట్టి దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయడం జరిగింది.

وَمَن لَّا يُجِبْ دَاعِيَ اللَّهِ فَلَيْسَ بِمُعْجِزٍ فِي الْأَرْضِ وَ
لَيْسَ لَهُ مِن دُونِهِ أَوْلِيَاءُ ۚ أُولَٰئِكَ فِي ضَلَالٍ مُّبِينٍ ﴿٣٢﴾

"అల్లాహ్ వైపునకు పిలిచేవాని మాటను విననివాడు భూమిలో అల్లాహ్‌ను అశక్తుడుగా చేసే శక్తిని కలిగిలేడు. అతనిని అల్లాహ్ నుండి రక్షించేందుకు ఎలాంటి మద్దతుదారులుగాని, సంరక్షకులుగాని ఎవరూ ఉండరు. అటువంటి వారు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు." (46 : 32)

وَأَنَّا ظَنَنَّا أَن لَّن نُّعْجِزَ اللَّهَ فِي الْأَرْضِ وَلَن نُّعْجِزَهُ هَرَبًا ﴿١٢﴾

"ఇంకా ఇలా అన్నారు, "అల్లాహ్‌ను మనం భూమిపై కూడా అశక్తునిగా చేయలేము. తప్పించుకొని పారిపోయి ఆయన్ను ఓడించనూ లేము" అని మేము భావించేవారము." (72 : 12)

ఈ దైవసహాయం, ఈ శుభవార్తలు అందడం మూలంగా, తాయెఫ్ నుండి బయలు వెడలేటప్పుడు దైవప్రవక్త (స)ను పరివేష్టించి ఉన్న ఆ నిరాశానిస్పృహ కారుమేఘాలన్నీ తొలగిపోయాయి. ఆయన అనుభవించిన బాధలు, తిన్న తిట్లూ, ఆయనకు కలిగిన మనస్తాపం అంతా మటుమాయమై పోయాయి. ఇక ఆయన (స) మక్కాకే తిరిగి వెళ్ళాలని, తిరిగి దైవసందేశ

ప్రచారంలో, దైవదౌత్య కార్యకలాపాల్లో నిమగ్నమైపోవాలని ఓ దృఢ నిశ్చయానికి వచ్చారు. ఈ సందర్భంలోనే హజ్రత్ జైద్ బిన్ హారిసా ప్రవక్త (స)ను ఉద్దేశించి, "ఓ ప్రవక్తా! మక్కావాసులు (అంటే ఖురైష్) తమరిని అక్కడ నుండి వెళ్ళగొట్టారు కదా! తిరిగి మనం అక్కడికి ఎలా వెళ్ళగలం?" అని ప్రశ్నించడం జరిగింది. సమాధానంగా మహాప్రవక్త (స) ఆయనతో, "ఓ జైద్! పరిస్థితి నీకు తెలిసిందే కదా! అల్లాహ్ ముక్తి మార్గాన్ని మనకు ఏదో ఒక విధంగా చూపించక పోడు. తప్పకుండా అల్లాహ్ తన ధర్మాన్ని రక్షిస్తాడు. తన ప్రవక్తకు విజయం చేకూరుస్తాడు" అని సెలవిచ్చారు.

చివరికి మహాప్రవక్త (స) అక్కడ నుండి బయలుదేరి మక్కా దాపున ఉన్న హిరా కొండ సానువుల్లోనికి వచ్చి ఆగారు. 'ఖుజాఅ' తెగకు చెందిన ఓ వ్యక్తి ద్వారా అఖ్నస్ బిన్ షురైఖ్‌కు, తనకు సంరక్షణ కలుగజేయమని కబురు పంపారు. కాని అఖ్నస్, "నేను ఖురైష్ మిత్రపక్షంలో ఉండినవాణ్ణి. సంరక్షణ ఇచ్చే అధికారం నాకు లేదు" అని చెప్పి పంపించాడు. ఆ తరువాత సుహైల్ బిన్ అమ్రూ దగ్గరకి ఆ సందేశంతోనే పంపారు ఆ వ్యక్తిని. అతను కూడా, "బనీ ఆమిర్ (ఆమిర్ తెగ) ఇచ్చిన సంరక్షణ బనూ కఅబ్‌పై చెల్లదు" అని చెప్పి వెనక్కి పంపించాడు. ఆ తరువాత దైవప్రవక్త (స) అదే వ్యక్తి ద్వారా ముత్‌యిమ్ బిన్ అద్దీ దగ్గరకు సందేశం పంపగా అతను, సరేనని ఒప్పుకున్నాడు. ముత్‌యిమ్ బిన్ అద్దీ ఆయుధధారుడై తన కుమారుల్ని, తన తెగ వారిని పిలిపించాడు. "మీరందరు ఆయుధాలు ధరించి కాబా గృహం నాలుగు మూలలా నిలబడి ఉండండి. నేను ముహమ్మద్‌కు శరణిచ్చాను" అని చెప్పి, దైవప్రవక్త (స) వద్దకు, "మక్కాకు వచ్చేయండి" అని కబురు పంపాడు. ఈ వార్త అందగానే జైద్ బిన్ హారిసాను వెంటబెట్టుకొని దైవ ప్రవక్త(స) మక్కాలో అడుగిడి మొదట మస్జిదె హరామ్‌లో ప్రవేశించారు. ముత్‌యిమ్ బిన్ అద్దీ తన వాహనంపై నిలబడి, "ఖురైష్ ప్రజలారా! నేను ముహమ్మద్ (స)కు శరణు ఇచ్చాను. ఇప్పుడు ఆయన్ను ఎవరూ ఏమీ అనడానికి వీల్లేదు" అని ప్రకటించాడు. ఇటు మహాప్రవక్త (స) నేరుగా హజ్రె అస్వద్ వద్దకు వెళ్ళి దాన్ని ముద్దుపెట్టుకున్నారు. ఆ తరువాత రెండు రకాతుల నమాజు చేసి ఇంటికి

తిరిగి వచ్చేశారు. ఆ సమయంలో ముత్‌యిమ్ బిన్ అద్దీ, ఆయన కుమారులు ఆయుధధారులై మహాప్రవక్త (స) చుట్టూ నడుస్తున్నారు.

ఈ సందర్భంగా అబూ జహల్, ముత్‌యిమ్‌తో, "నీవు ఆయనకు రక్షణ కల్పించడం మట్టుకేనా! లేదా ఆయనకు అనుచరుడివి- అంటే ముస్లిమువి కూడా- అయ్యావా?" అని అడిగాడు. సమాధానంగా ముత్‌యిమ్, లేదు అని అనగా, "నీవు రక్షణ ఇచ్చిన వానికి మేమూ రక్షణ ఇస్తాము" అని అన్నట్లు చెప్పడం జరుగుతోంది.[5]

మహాప్రవక్త (స) ముత్‌యిమ్ బిన్ అద్దీ చేసిన సహాయాన్ని ఎన్నడూ మరువలేదు. బద్ర్ యుద్ధంలో మక్కా దైవతిరస్కారులు పెద్ద సంఖ్యలో ఖైదీలుగా పట్టుబడినప్పుడు కొందరు ఖైదీలను విడిపించడానికి ముత్‌యిమ్ కుమారుడు జుబైర్, ప్రవక్త (స) సన్నిధిలో హాజరు అయ్యాడు. అప్పుడాయన అతనిని ఉద్దేశించి :

"ముత్‌యిమ్ జీవించి ఉండి, బద్ర్‌లో పట్టుబడ్డ ఈ తుచ్చులను విడిచి పెట్టమని అడిగి ఉంటే అతని కోసం నేనందరినీ విడిచిపెట్టేవాణ్ణి" అని అన్నారు.

5. తాయెఫ్ ప్రయాణ వివరాలు ఇబ్నె హిషామ్-1/419-422; జాదుల్ ముఆద్-2/46,47; ముక్త సరుస్సీరత్ షేఖ్ అబ్దుల్లా-పుట.141-143; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/71-74; తారీఖె ఇస్లామ్ నజీబాబాదీ-1/123,124. ఇంకా ప్రఖ్యాత గ్రంథాల నుండి సేకరించబడ్డాయి.

ప్రముఖ వ్యక్తులు, వివిధ తెగల్లో ఇస్లామ్ ధర్మ ప్రచారం

దైవదౌత్య శకం 10, జీఖాదా మాసం (క్రీ.శ.619 జూన్ చివరి భాగం లేదా జులై నెల ప్రారంభ కాలం)లో మహాప్రవక్త (స) తాయెఫ్‌కు వెళ్ళడం, అక్కడి పేరుమోసిన వారికి, తెగలకు ఇస్లామ్ సందేశాన్ని ఇవ్వడం ప్రారంభించారు. హజ్ కాలం దగ్గరపడడం వలన హజ్ చేయడానికి సుదూర ప్రాంతాల నుండి, చుట్టుపట్ల నుండి ప్రజలు వాహనాలపై, కాలనడకన మక్కాకు రావడం ప్రారంభమయింది. మహాప్రవక్త (స) ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి తెగలోనికి వెళ్ళి వారికి ఇస్లామ్ ధర్మం గురించి బోధ చేయడం ఆరంభించారు. దైవదౌత్యపు నాల్గవ సంవత్సరం నుండే, హజ్ కాలంలో బయటకు వెళ్ళి హజ్ యాత్రికులకు ఇస్లామ్‌ను గురించి పరిచయం చేయడం ఆయనకు పరిపాటే.

ఇస్లామ్ ధర్మం బోధించబడిన తెగలు

ఇమామె జహ్రీ (ర) కథనం ప్రకారం, ఏయే తెగల్లోనయితే ఆయన (స) వెళ్ళి ఇస్లామ్ ధర్మ ప్రచారం చేశారో, ఆ తెగల పేర్లు ఈ విధంగా ఉన్నాయి.

బనూ ఆమిర్ బిన్ సఅసఅ, ముహారిబ్ బిన్ హస్ఫా, ఫజారా, గస్సాన్, ముర్రా, హనీఫా, సలీమ్, అబస్, బనూ నస్ర్, బనుల్‌బకా, కల్బ్, హారిస్ బిన్ కఅబ్, అజ్రా, హజారిమా తెగలు. అయితే వాటిలో ఏ ఒక్క తెగ కూడా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు.[1]

ఇమామె జహ్రీ లెక్కించిన ఈ తెగల్లో ఒకే సంవత్సరంగాని, ఒకే కాలంలో గాని ఇస్లామ్ ధర్మ పరిచయం జరగలేదనేది గుర్తించాలి. దైవదౌత్యపు నాల్గవ సంవత్సరం మొదలు, హిజ్రత్‌కంటే ముందు చివరి హజ్ వరకు గడిచిన పదేండ్ల కాలంలో జరిగిందీ ప్రయత్నం.[2]

1. తిర్మిజీ; ముక్తరుస్సీరత్ - షేఖ్ అబ్దుల్లా, పుట.149.
2. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/74.

ఇబ్నె ఇస్‌హాక్, కొన్ని తెగల్లో ఇస్లామ్ సందేశ ప్రచారానికి జరిగిన ప్రతిక్రియ ఎలాగుందో కూడా వివరించారు. కొన్ని తెగల ప్రతిక్రియ ఎలాగుండిందో ఇక్కడ సంగ్రహంగా వివరించే ప్రయత్నం చేస్తున్నాము.

1. బనూ కల్బ్: మహాప్రవక్త (స) ఈ తెగకు చెందిన ఓ శాఖ అయిన బనూ అబ్దుల్లా వద్దకు వెళ్ళి వారిని అల్లాహ్ మార్గం వైపునకు పిలుపునిచ్చారు. మాటల సందర్భంలో, "ఓ బనూ అబ్దుల్లాహ్! అల్లాహ్ మీ ముత్తాత పేరు ఎంతో మేలైనదిగా పెట్టాడు" అని అన్నారు. కాని ఆ తెగ వారు ఆయన మాటలను లెక్క చేయలేదు. ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు.

2. బనూ హనీఫా: వారి గుడారాల వద్దకు వెళ్ళి, అల్లాహ్ ధర్మం వైపునకు పిలవడం జరిగింది. తాను దైవప్రవక్తనని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు దైవప్రవక్త (స). అయితే అరబ్బులు ఇదివరకు ఇవ్వనంత దురుసు సమాధానం ఇచ్చారు ఆ తెగవారు.

3. ఆమిర్ బిన్ సఅసఅ: వారిని కూడా మహాప్రవక్త (స) అల్లాహ్ ధర్మమైన ఇస్లామ్ వైపునకు పిలుపునిచ్చారు. తాను దైవప్రవక్తనని చెప్పారు. దానికి సమాధానంగా బుహీరా బిన్ ఫరాస్ అనేవాడు, "దైవసాక్షి! నేను ఖురైష్‌కు చెందిన ఈ యువకుణ్ణి అందుకుంటే పూర్తి అరేబియానే మ్రింగేయగలను" అని చెబుతూ, "చెప్పండి! ఒకవేళ మేము మీ ఈ ధర్మాన్ని స్వీకరిస్తే, ఆపై అల్లాహ్ మీకు మీ వ్యతిరేకులపై ఆధిపత్యం ఇస్తే, మీ తరువాత అధికారం మా చేతికి వస్తుందా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు.

"అధికారం మొత్తం అల్లాహ్‌దే. ఆయన ఎవరిని ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచుతాడు."

"ఓహో అలాగా! మీ సంరక్షణలో మా వక్షస్థలం అరబ్బు జాతికి ఎదురుగా పెట్టాలా? అల్లాహ్ మీకు విజయం చేకూరిస్తే అధికారం మరొకరి చేతిలో ఉంటుందా? మాకు మీ ధర్మం అవసరం ఎంత మాత్రం లేదు పొండి" అని తిరస్కార వైఖరిని అవలంబించాడు.

ఆ తరువాత అబూ ఆమిర్ తెగ తన ప్రాంతానికి తిరిగి వెళ్ళిపోయిన తరువాత, వృద్ధాప్యం కారణంగా హజ్‌కు వెళ్ళలేక, అక్కడే ఉండిపోయిన ఓ

వృద్ధుణ్ణి కలసి విషయమంతా చెబుతూ, మా వద్దకు ఖురైష్ వంశానికి చెందిన బనూ అబ్దుల్ ముత్తలిబ్ యువకుడొకడు వచ్చాడని, అతను తనను తాను ప్రవక్తగా ప్రకటించి తనను సంరక్షించమని అడిగాడని, అతనికి సహాయపడమని, వెంట తీసుకొని మన ప్రాంతానికి తోడ్కొని పొమ్మని చెప్పాడని వివరించారు. ఇది విన్న ఆ వృద్ధుడు తన తలను రెండు చేతులతో పట్టుకొని బాధపడుతూ -

"అయ్యో బనీ ఆమిర్! దీనికి పరిహారం మరేది? జరిగిపోయినదానికి దిద్దుబాటు ఎక్కడిది? ఆ దైవం సాక్షి! ఎవరి చేతిలోనయితే ఫలానా వ్యక్తి ప్రాణాలున్నాయో! ఏ ఇస్మాయీల్ సంతతి వాడూ ఇప్పటి వరకు బూటకపు ప్రవక్త అని సవాలు విసరలేదు. ఆయన తప్పక ప్రవక్తే! మీ బుద్ధివివేచనలు ఎక్కడ అడుగంటిపోయాయి?" [3] అని తల బాదుకున్నాడు.

మక్కాకు వెలుపల విస్తరించిన విశ్వాస కిరణాలు

తెగలకు, వర్గాలకు ఇస్లామ్ గురించి ప్రబోధించినట్లే మహాప్రవక్త (స) వేరు వేరు ప్రముఖ వ్యక్తుల్ని కలసి ఇస్లామ్ సందేశాన్నిచ్చారు. వారిలో కొందరు సకారాత్మకంగా స్పందించారు. హజ్ కాలం గడిచిన తరువాత కొందరు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు కూడా. క్రింద, వారి వివరాలు సంగ్రహంగా వివరించడం జరుగుతోంది.

1. సువైద్ బిన్ సామత్ : ఈయన ఓ కవి. లోతుగా ఆలోచించే మనస్తత్వం గలవారు. యస్రిబ్ (మదీనా) నివాసి. ఆయన దృఢసంకల్పం, కవన వ్యాసంగం మరియు గౌరవోన్నతుల రీత్యా ఆయన జాతి ఆయనకు కామిల్ (సంపూర్ణుడు) అనే బిరుదు కూడా ఇచ్చింది. ఈయన హజ్ లేదా ఉమ్రా చేయడానికి మక్కా వచ్చినప్పుడు మహాప్రవక్త (స) ఆయన్ను కలసి ఇస్లామ్ ధర్మం వైపునకు రమ్మని ఆహ్వానించారు. ఆయనతో మాట్లాడేటప్పుడు దైవప్రవక్త (స), 'నీ దగ్గర ఉన్నదేమిటీ?' అని అడగగా సువైద్,

"నా దగ్గర లుక్మాన్ జ్ఞానముంది" అని బదులిచ్చారు.

"అయితే విను, నా దగ్గర ఉన్నది దాని కంటే మేలైన జ్ఞానం. అది ఖుర్‌ఆన్. దాన్ని అల్లాహ్ నాపై అవతరింపజేశాడు. అది మార్గదర్శకమైన

3. ఇబ్నె హష్షామ్-1/424,425.

జ్యోతి" అంటూ మహాప్రవక్త (స) దివ్యఖుర్ఆన్ ఆయత్‌లను పారాయణం చేసి వినిపించారు. ఇస్లామ్ వైపునకు ఆహ్వానించారు. వెంటనే ఆయన ఇస్లామ్‌ను స్వీకరిస్తూ, "ఇది ఎంతో మేలైనది" అన్నారు. ఆ తరువాత ఆయన మదీనా తిరిగి వచ్చినప్పుడు బుఆస్ యుద్ధం ప్రారంభమైంది. ఆ యుద్ధంలోనే ఆయన చంపి వేయబడ్డారు.[4] ఆయన దైవదౌత్యశకం 11 ప్రారంభదశలో ఇస్లామ్ స్వీకరించినట్లు ఆధారాలున్నాయి.[5]

2. అయాజ్ బిన్ ముఆజ్ : ఈయన కూడా యస్రిబ్ (మదీనా) నివాసియే. నవయువకుడూను. దైవదౌత్య శకం పదకొండవ సంవత్సరంలో, 'బుఆస్'యుద్ధానికి కొన్ని రోజులకు ముందు, ఓ అవస్ ప్రతినిధి వర్గం, ఖజ్రజ్ తెగకు విరుద్ధంగా ఖురైష్ సహాయాన్ని అర్థించడానికి మక్కా వచ్చింది. ఆ ప్రతినిధి వర్గం వెంట వచ్చారాయన. అవస్ మరియు ఖజ్రజ్ అనే రెండు తెగల నడుమ విద్వేషం పతాకస్థాయికి చేరిన రోజులవి. అవస్ ప్రజల సంఖ్య ఖజ్రజ్ ప్రజల సంఖ్య కంటే తక్కువ. దైవప్రవక్త (స)కు ఈ ప్రతినిధి వర్గం వచ్చిన విషయం తెలియగానే ఆయన (స) వారి దగ్గరకు వెళ్ళారు. వారి నడుమ కూర్చుని ఇలా సంబోధించారు.

"మీరు ఏ ధ్యేయాన్ని దృష్టిలో ఉంచుకొని ఇక్కడికి వచ్చారో ఆ ధ్యేయం కంటే మేలైన విషయాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా?" అన్నారు.

"అంతకు మించి మేలైన విషయం మరేముంటుంది?" అని ప్రశ్నించారు వారు.

"నేను అల్లాహ్ ప్రవక్తను. అల్లాహ్ నన్ను తన దాసుల వద్దకు, వారు అల్లాహ్‌నే ఆరాధించాలనీ, ఆయనకు సహవర్తులుగా మరెవ్వరినీ నిలబెట్ట వద్దనీ పిలుపునివ్వడానికి పంపించాడు. ఆయన నాపై గ్రంథాన్ని కూడా అవతరింపజేశాడు" అంటూ ఇస్లామ్ ధర్మం గురించి విడమర్చి చెబుతూ, దివ్య ఖుర్ఆన్‌ను కూడా పఠించి వినిపించారు. అది విన్న అయాస్ బిన్ ముఆజ్,

"ఓ నా జాతి ప్రజలారా! దైవసాక్షి! మీరు ఇక్కడికి దేనికోసమయితే వచ్చారో, దానికంటే ఇది మేలైన విషయం" అని అన్నారు. కాని ఆ ప్రతినిధి వర్గంలోని ఓ వ్యక్తి అబుల్ హైసర్ అనస్ బిన్ రాఫే ఓ పిడికెడు కంకరరాళ్ళను ఎత్తి అయాస్ ముఖంపై విసిరి కొడుతూ, "దీన్ని వదిలేయండి! నా వయస్సు సాక్షిగా చెబుతున్నాను! మనం మరో పనిని దృష్టిలో పెట్టుకొని ఇక్కడకు వచ్చినవాళ్ళం" అని అయాస్ మాటను ఖండించాడు. అయాస్ అప్పుడు మాట్లాడకుండా ఊరకుండిపోయారు. మహాప్రవక్త (స) కూడా లేచి నిలబడ్డారు. వచ్చిన ప్రతినిధి వర్గం ఖురైష్‌తో ఒడంబడిక చేసుకోవడంలో, వారి సహాయం పొందడంలో విజయం సాధించలేకపోయింది. వచ్చిన కార్యంలో విఫలమై మదీనాకు తిరిగి వెళ్ళిపోయింది.

4. ఇబ్నె హష్షామ్-1/425-427; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/74.
5. తారీఖె ఇస్లామ్-అక్బర్ షానజీబాబాదీ-1/125.

మదీనా వెళ్ళిన కొన్ని రోజుల తరువాత అయాస్ పరమపదించారు. మరణించేటప్పుడు ఆయన నోట దైవస్తోత్రం వెలువడినట్లు ప్రజలు చూశారు. అందుకని ఆయన ఇస్లామ్ ధర్మం పైనే తన ప్రాణాలు వదిలారన్నది ప్రజలకు నమ్మకమున్నట్లు ఆధారాలున్నాయి.[6]

3. అబూజర్ గఫ్ఫారి : ఈయన యస్రిబ్ దాపులోనే ఉండే ఓ ప్రదేశంలో నివసించే వ్యక్తి. సువైద్ బిన్ సామత్ మరియు అయాస్ బిన్ ముఆజ్‌ల ద్వారా దైవప్రవక్త (స) గారి దైవదౌత్యం గురించిన వార్త యస్రిబ్‌కు చేరగా అది కాస్తా ఆయన చెవిన కూడా పడింది. ఈ వార్తే ఆయన ఇస్లామ్ స్వీకారానికి దోహదపడింది.[7]

ఆయన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన వివరాలు సహీ బుఖారీలో ఉన్నాయి.

అబూజర్ (ర) ఇలా చెప్పారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్(ర) ఉల్లేఖిస్తున్నారు.

నేను గిఫ్ఫార్ తెగకు చెందినవాణ్ణి. మక్కాలో ఓ వ్యక్తి తనను దైవ ప్రవక్తగా ప్రకటించుకున్నాడని నాకు తెలిసింది. నేను నా సోదరునితో, నీవు మక్కాకు వెళ్ళి ఆయనతో మాట్లాడి వచ్చి విషయం ఏమిటో నాతో చెప్పమని చెప్పాను. ఆయన వెళ్ళి ఆయన్ను కలసి మాట్లాడాడు, తిరిగి వచ్చిన తరువాత ఏం వార్త తెచ్చావు అని అడిగాను.

6. ఇబ్నె హష్షామ్-1/427,428.
7. ఇది అక్బర్‌షానజీ బాబాదీ తన గ్రంథంలో పొందుపరచిన విషయం. చూడండి, ఆయన రచించిన గ్రంథం, తారీఖె ఇస్లాం-1/128.

"దైవసాక్షి! నేనిప్పటి వరకు అలాంటి వ్యక్తిని చూడలేదు. మేలు చేయమని ఆదేశిస్తూ, దుర్మార్గాల నుండి ప్రజల్ని వారిస్తున్నాడు" అని చెప్పాడు. అతను తెచ్చిన వార్త నాకు తృప్తినివ్వలేదు. నేనే స్వయంగా అక్కడికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. చద్దిమూటను కట్టుకొని, చేతికర్ర తీసుకుని బయలుదేరి మక్కా చేరుకున్నాను. నేను దైవప్రవక్త (స)ను గుర్తు పట్టేదెలా? ఇతరుల్ని అడిగి తెలుసుకోవడం కూడా నాకు ఇష్టంలేదు. కాబట్టి నేను జమ్‌జమ్ నీరు త్రాగుతూ మస్జిదె హరాంలో పడి ఉన్నాను. చివరికి నన్ను హజ్రత్ అలి చూసి, ఈ వ్యక్తి కొత్తవానిలా అగుపడుతున్నాడే అని అన్నారు. నేను సమాధానంగా "అవును" అని అన్నాను. అయితే ఇంటికి వెడదాం పద అని ఆయన నన్ను ఆయన ఇంటికి తోడ్కొని వెళ్ళారు. వెడుతూ ఆయన నన్ను ఏదైనా విషయం అడగడంగాని, నేనాయనకు బదులు ఇవ్వడం గాని ఏదీ జరగలేదు.

తెల్లవారగానే ఎవరినైనా అడిగి తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనే మస్జిదె హరామ్‌కు వెళ్ళాను. కాని ప్రవక్త (స) గురించి తెలపడానికి ఏ ఒక్కడూ నాకు దొరకలేదు. చివరికి హజ్రత్ అలి (ర) యే తిరిగి నా దగ్గరకు వచ్చారు.

"నీకు ఇంకా నీ గమ్యం ఏదో లభించలేనట్లుందే" అని అన్నారు.

"అవును" అని అన్నాన్నేను. "అయితే నా వెంటరా, అసలు నీ వ్యవహారం ఏమిటో బోధపడడం లేదు. నీవీ నగరానికి ఎందుకు వచ్చినట్లు?" అని అడిగారు.

"మీరు రహస్యంగా ఉంచుతానంటే చెబుతాను" అన్నాన్నేను.

"సరే! అలాగే" అని హామీనిచ్చారాయన.

"ఇక్కడ ఒకాయన తాను ప్రవక్తనంటూ చెప్పుకుంటున్నాడట. నేను నా సోదరుణ్ణి అతనితో మాట్లాడి రమ్మని పంపించాను. అతను తిరిగి వచ్చి చెప్పిన మాటలు నాకు తృప్తినివ్వలేదు. నేనే స్వయంగా వెళ్ళి ఆయన్ను కలుద్దామనే తలంపుతో ఇక్కడికి వచ్చాను."

"సోదరా! నీవు సరైన చోటికే వచ్చావు. చూడు! నేనాయన వద్దకే వెడుతున్నాను. నేను ఏ ఇంట జొరబడితే నీవు కూడా నా వెంట ఆ ఇంట్లో ప్రవేశించు. నేను అక్కడికి వెళ్ళినప్పుడు నీకు ఏదైనా ప్రమాదం కలిగించే వ్యక్తిని చూడగానే గోడవైపు తిరిగి నా చెప్పుల్ని సరిచేస్తూ నిలబడతాను. నీవు నా వెంటే

దారిని నడుస్తూ ఉండు" అంటూ హజ్రత్ అలి నడకనారంభించారు. నేనూ ఆయన్ను అనుసరిస్తూ పోతున్నాను. చివరికి ఆయన ఓ గుమ్మంలో ప్రవేశించారు. నేనూ ఆయన వెంట దైవప్రవక్త (స) గారి సన్నిధికి చేరుకున్నాను. నేను ప్రవక్త (స) నుద్దేశించి-

"మీరు నాకు ఇస్లామ్ ధర్మం ఏమిటో బోధిస్తారా?" అని అడిగాను.

ఆయన నాకు ఇస్లామ్ ధర్మం గురించి విడమర్చి చెప్పారు. నేను వెంటనే ఆ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమునైపోయాను. ఆ తరువాత మహాప్రవక్త (స) నన్ను ఉద్దేశించి, "అబూజర్! ఈ వ్యవహారాన్ని గోప్యంగానే ఉంచండి. మీ ప్రాంతానికి వెళ్ళిపొండి. మేము బయటకు వచ్చి బాహాటంగా ప్రచారం చేస్తున్నట్లు వార్త అందగానే ఇక్కడికి వచ్చేయండి" అని అన్నారు.

"ఏ దైవమయితే మీకు సత్యమిచ్చి పంపించాడో, ఆ దైవం సాక్షి! నేను వారి మధ్యకు వెళ్ళి బహిరంగంగా ప్రకటిస్తాను అని చెప్పి మస్జిదె హరామ్‌కు వచ్చాను. అక్కడ ఖురైష్ కూర్చునే ఉన్నారు. వారినుద్దేశించి, ఓ ఖురైష్ ప్రజలారా! ఇది వినండి అంటూ,

"అష్‌హదుఅల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ."

(అల్లాహ్ తప్ప వేరే పూజ్యుడులేడని, ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్త మరియు ఆయన దాసుడని నేను సాక్ష్యమిస్తున్నాను) అని ప్రకటించాను.

అక్కడ కూర్చొని ఉన్నవారు, "చూస్తారేం, లేవండి! లేచి, ఆ ధర్మభ్రష్టుడి పని పట్టండి" అని అరిచారు. వారంతా లేచి నాపైబడ్డారు. ప్రాణం పోయేంత వరకు నన్ను బాదనారంభించారు. కాని ఇబ్నె అబ్బాస్ (ర) వచ్చి నన్ను రక్షిస్తూ, వంగి నా ముఖాన్ని చూశారు. ఆ తరువాత ఖురైష్ వైపు తిరిగి, "మీరు నాశనం గాను! మీరు గిఫ్ఫార్ తెగకు చెందిన ఈ వ్యక్తిని చంపేస్తున్నారా? వ్యాపారార్థం ఈ గిఫ్ఫార్ తెగ ఉండే ప్రదేశం నుండే కదా మీరు వెళ్ళేది!" అని అన్నారు. అది విన్న వారందరూ నన్ను వదిలేసి ప్రక్కకు తప్పుకున్నారు. మరుసటి రోజు ఉదయమే నేను తిరిగి అక్కడికి వెళ్ళాను. ఈ రోజు చెప్పినట్లే తిరిగి ఎలుగెత్తి చెప్పాను. తిరిగి వారు ఈ ధర్మభ్రష్టుని పని పట్టండి అని నాపై విరుచుకు

పడ్డారు. నిన్న జరిగినట్లే ఈ రోజు కూడా జరిగింది. హజ్రత్ అబ్బాస్ (ర) వచ్చి నన్ను రక్షించారు. నాపై వంగి నిన్న చెప్పినట్లుగానే చెప్పారు." [8]

4. తుఫైల్ బిన్ ఉమర్ దౌసీ : ఈ బుద్ధిమంతుడు కవి, ఆలోచనాపరుడు. దౌస్ తెగకు సర్దారు. ఈయన తెగకు యమన్ చుట్టుప్రక్కల ఓ ప్రదేశంలో ప్రాబల్యం ఉండేది. దైవదౌత్యపు పదకొండవ సంవత్సరంలో మక్కాకు వచ్చారు. ఇంకా మక్కాను చేరారో లేదో మక్కావాసులు ఆయన్ను ఘనంగా ఆహ్వానించారు. ఎంతో గౌరవమర్యాదలు చూపారు. ఆ తరువాత ఆయనతో, "తుఫైల్! మీరు మా నగరానికి వచ్చారు. మాకు సంబంధించిన ఈ వ్యక్తి ఉన్నాడు చూశారు, మమ్మల్ని ఎంతో ఇరుకున పడేశాడు. మమ్మల్ని ఒక త్రాటిపై నిలువకుండా చెల్లాచెదరు చేస్తున్నాడు. ఇతను మాట్లాడే మాట ఇంద్ర జాలంలా పని చేస్తోంది. తండ్రీ కొడుకుల మధ్య, సోదరుడూ సోదరునీ నడుమ, భార్యాభర్తల నడుమ చిచ్చుపెట్టి వేరుచేస్తోంది. మేము చిక్కుకున్న బాధల్లో మీరూ, మీ జాతి చిక్కుకోకుండా ఉండాలని మేము కోరుకుంటున్నాం. కాబట్టి మీరు ఆ వ్యక్తితో మాట్లాడవద్దు. అతను చెప్పేది ఏదీ వినకూడదు" అని అన్నారు.

హజ్రత్ తుఫైల్ (ర) గారే స్వయంగా ఆ సంఘటన గురించి ఇలా వివరించారు.

"వీరు అలా బలవంతపెడుతుంటే, నేను దైవప్రవక్త (స) చెప్పింది ఏదీ వినేదే లేదు అని నిశ్చయించుకున్నాను. ఆయనతో మాట్లాడకూడదు అని నిర్ణయించుకున్నాను. ఆ సంకల్పంతోనే నేను మస్జిదె హరామ్‌లోనికి ప్రవేశించి నప్పుడు ఆయన పలుకులేవీ నా చెవుల్లో పడకూడదు అనే ఉద్దేశ్యంతోనే చెవుల్లో దూదిపెట్టి దోపుకు వచ్చాను. అయితే అల్లాహ్, ఆయన మాటలను కొన్ని వినాలని రాసి పెట్టాడేమో, ఆయన నోట బహు చక్కటి వాక్కులు విన్నాను. ఆ తరువాత నా మనస్సులో ఇలా తలపోశాను: నా తల్లి నా గురించి రోదించుగాక (నేను నాశనమైపోను అని అర్థం)! నేను ఓ ఆలోచనాపరుడనైన కవిని కదా! చెడ్డది ఏదో నాకు తెలియకుండా ఉంటుందా? మరి నేను ఈ వ్యక్తి మాటలను ఎందుకు వినకూడదు? మంచి మాటలయితే స్వీకరిస్తాను. చెడ్డవి అయితే విసర్జిస్తాను అని అనుకొని ఆగిపోయాను. మహాప్రవక్త (స) ఇంటికి మరలి వెళ్ళిపోయేటప్పుడు నేను ఆయన్ను అనుసరించాను. ఆయన ఇంట

8. సహీ బుఖారి- జమ్ జమ్ గాథకు సంబంధించిన అధ్యాయం, 1/ 499,500.

ప్రవేశించగానే నేను లోనికి వెళ్ళిపోయాను. ఆ తరువాత నేను వచ్చిన కారణం, ప్రజలు నన్ను భయపెట్టిన వైనం, ఆ తరువాత చెవుల్లో దూది కుక్కుకున్నది, అయినప్పటికీ కొన్ని మాటలు చెవుల్లోబడిన తీరు వగైరాలు వివరంగా ఆయనకు చెప్పి అసలు విషయం ఏమిటో సెలవియ్యమని మనవి చేశాను. మహాప్రవక్త (స) నాకు ఇస్లామ్ ధర్మాన్ని బోధించారు. దివ్యఖుర్‌ఆన్‌ను పఠించి వినిపించారు. దైవాన్ని సాక్షిగా పెట్టి చెబుతున్నాను! అంతకంటే మేలైనది, న్యాయవంతమైన వాక్కు నేను అది వరకు ఎప్పుడూ విని ఉండలేదు. కాబట్టి వెంటనే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి సత్యానికి సాక్ష్యంగా నిలిచాను. ఆ తరు వాత, ప్రవక్తా! నా జాతి నా మాట వింటుంది. వారి వద్దకు వెళ్ళి వారిని ఇస్లామ్ వైపునకు ఆహ్వానిస్తాను. కాబట్టి అల్లాహ్ నాకు ఏదో ఒక సూచనను ప్రసాదించ మని అల్లాహ్‌ను ప్రార్థించండి అని విన్నవించుకోగా, ఆయన నా గురించి ప్రార్థించడం జరిగింది."

హజ్రత్ తుఫైల్‌కు అల్లాహ్ ఒసగిన సూచన ఏమిటీ అంటే, ఆయన తన జాతి వద్దకు వెళ్ళినప్పుడు అల్లాహ్ ఆయన ముఖంపై జ్యోతిలాంటి ఓ కాంతిని పులమడం. అది చూసిన ఆయన, ఓ అల్లాహ్ ఈ వెలుగును నా ముఖానికి కాకుండా మరెక్కడైనా ఉండేటట్లు చెయ్యి. ప్రజలు నా ముఖాన్ని చూసి దాన్ని చెరిపేయగలరు అని ప్రార్థించగా ఆ వెలుగు ఆయన లాఠీలోనికి వచ్చి చేరింది. ఆ తరువాత ఆయన తన తండ్రి మరియు భార్య వద్దకు వెళ్ళి ఇస్లామ్‌ను బోధించారు. వారిద్దరూ ఇస్లామ్ స్వీకరించడం జరిగింది. కాని ఆయన జాతి మాత్రం ఇస్లాం ధర్మాన్ని స్వీకరించటంలో జాప్యం చేసింది. అయినా హజ్రత్ తుఫైల్ ప్రయత్నిస్తూనే ఉన్నారు. చివరికి 'ఎహ్‌జాబ్' పోరాటం[9] తరువాత ఆయన హిజ్రత్ చేసినప్పుడు ఆయన వెంట డెబ్భై లేదా ఎనభై కుటుంబాలు ఉన్నాయి. హజ్రత్ తుఫైల్ (ర) ఇస్లామ్ కోసం గొప్పగా పాటుబడ్డారు. 'యమామా' పోరాటంలో అమరగతి పొందారు.[10]

5. జిమాద్ అజ్‌దీ : ఈయన యమన్‌కు చెందిన వారు. అజ్‌ద్ షన్వా తెగకు చెందిన వ్యక్తి. భూత వైద్యం, దెయ్యాలను పారద్రోలడం ఆయన వృత్తి.

9. హుదైబియా ఒప్పందం తరువాత ఆయన మదీనాకు వచ్చినప్పుడు దైవప్రవక్త(స) ఖైబర్‌లో ఉన్నారు. చూడండి. ఇబ్నె హష్షామ్-1/385.

10. ఇబ్నె హష్షామ్-1/182, 185; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/81,82; ముక్తసరుస్సీరత్ షేఖ్ అబ్దుల్లాహ్, పుట. 144.

మక్కా నగరానికి వచ్చినప్పుడు అక్కడి బుద్ధిహీనులు, దైవప్రవక్త (స) ఉన్మాది అని ఆయనకు నూరిపోశారు. ఇది విన్న జిమాద్, నేనెందుకు ముహమ్మద్‌ను కలువకూడదు. బహుశా అల్లాహ్ నా చేతిలోనే ఆయనకు స్వస్థత ఉంచాడేమో, భూతవైద్యం చేసి ఆయనపై ఉన్న దెయ్యాల్ని ఎందుకు పారద్రోలకూడదు? అనే తలంపుతో దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చారు. ఆయన్ను (స) కలసి ఓ ముహమ్మద్ (స)! నేను దెయ్యాలను వదలగొట్టడానికి భూత వైద్యం చేసేవాణ్ణి. నీకు కూడా దాని అవసరం ఉందేమో చెప్పు అని అడిగారు. జవాబుగా మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

"యదార్థంగా స్తోత్రాలన్నీ అల్లాహ్‌కే. మేము ఆయన్నే స్తుతిస్తున్నాము. ఆయన సహాయాన్నే అర్థిస్తున్నాం. అల్లాహ్ ఎవరికయితే మార్గం చూపుతాడో అతణ్ణి మరెవ్వరూ మార్గభ్రష్టునిగా చేయలేరు. అల్లాహ్ ఎవరిని దారి తప్పిస్తాడో అతనికి మరెవ్వరూ మార్గం చూపలేరు. అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హుడు కాడనీ, అతను ఒక్కడేననీ, ఆయనకు మరెవ్వరూ సహవర్తులు లేరనీ నేను సాక్ష్యం ఇస్తున్నాను. ఇంకా, ముహమ్మద్ (స) ఆయన దాసుడు మరియు ప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను." (ఆ తరువాత)...

ఇది ఆలకిస్తున్న జిమాద్, ఏమిటీ ఈ వాక్కుల్ని మరోసారి వల్లించండి అని అడిగాడు. అలా పై వాక్యాలను మూడుమార్లు విన్న తరువాత జిమాద్, "నేను కాహిన్‌లు, ఇంద్రజాలికులు, కవుల మాటల్ని విని ఉన్నవాణ్ణి. కాని మీరు పలికిన ఈ మాటల్ని నేనెక్కడా వినలేదు. ఇవి సముద్రపు లోతుల్లో నుండి వచ్చిన పలుకుల్లా ఉన్నాయి. ఏదీ మీ చెయ్యి చూపండి. మీ చేతి మీద చేయి వేసి బైత్ (ప్రమాణం) చేస్తాను" అని అనగా మహాప్రవక్త (స) తన చేతిని ముందుకు చాచారు. ఆ చేతిపై చేయివేసి ఆయన ఇస్లామ్ ధర్మస్వీకార ప్రమాణం చేశారు.[11]

యస్రిబ్‌కు చెందిన ఆరుగురు అదృష్టవంతులు

దైవదౌత్య శకం పదకొండవ సంవత్సరం హజ్ కాలం (క్రీ.శ.620, జులై మాసం)లో ఇస్లామ్ సందేశ ప్రచారానికి కొందరు చేయూతనిచ్చిన అదృష్ట వంతులు లభించారు. వారి చేయూత వలన ముస్లిములు వారి అండన చేరి, సంవత్సరాల తరబడి అనుభవిస్తున్న బాధల నుండి విముక్తులయ్యారు.

11. సహీ ముస్లిమ్-మిష్కాతుల్ మసాబీహ్, దైవదౌత్య సూచనల అధ్యాయం,2/525.

మక్కావాసులు దైవప్రవక్త (స)ను తిరస్కరించడంలో, ప్రజల్ని దైవ మార్గం నుండి అడ్డుకోవడంలో చేస్తున్న కృషి అలా సాగుతూనే ఉంది. మహా ప్రవక్త (స) రాత్రి చీకట్లలో ముష్రిక్‌లు అడ్డుతగలకుండా ఉండేందుకు వివిధ తెగల వద్దకు వెళ్ళి దైవధర్మాన్ని బోధించడమూ జరిగేది.

ఈ యుక్తిని అవలంబిస్తూ మహాప్రవక్త (స) ఓ రాత్రి హజ్రత్ అబూ బక్ర్ (ర)ను, హజ్రత్ అలీ (ర)ను వెంటబెట్టుకొని బయలుదేరారు. బనూ జుహల్ మరియు బనూ షైబాన్ బిన్ సాలిబా విడిది చేసి ఉన్న గుడారాలకు వెళ్ళి వారితో ఇస్లామ్ ధర్మం గురించి చర్చించడం జరిగింది. వారు ఇచ్చిన సమాధానమయితే తృప్తికరమైందే కాని ఇస్లామ్ ధర్మస్వీకారం విషయంలో ఖచ్చితంగా ఏ నిర్ణ యమూ గైకొనలేదు. ఈ సందర్భంలో హజ్రత్ అబూ బక్ర్ (ర) మరియు బనూ జుహల్‌కు చెందిన ఓ వ్యక్తి నడుమ వంశావళి గురించి ఉత్సాహభరితమైన చర్చ కూడా జరిగింది. ఆ ఇద్దరు వంశావళి చెప్పడంలో మంచి నిపుణులు.[12]

ఆ తరువాత మహాప్రవక్త (స) మినా కొండ లోయ నుండి వెడుతూ, కొందరు వ్యక్తులు పరస్పరం మాట్లాడుకోగా విన్నారు.[13] నేరుగా వారి వద్దకు వెళ్ళారు దైవప్రవక్త (స). వీరు మొత్తం ఆరుగురు యువకులు. వీరంతా యస్రిబ్‌కు చెందిన తెగ బనూ ఖజ్రజ్‌కు సంబంధించినవారే. వారి పేర్లు ఇవి:

1. అస్అద్ బిన్ జురారాహ్ (బనీ నజ్జార్ కుటుంబం)
2. ఔన్ బిన్ హారిస్ బిన్ రిఫాఅ (ఇబ్నె అఫ్రా) (బనీ నజ్జార్ కుటుంబం)
3. రాఫె బిన్ మాలిక్ బిన్ అజ్లాన్ (బనీ జురైఖ్ కుటుంబం)
4. ఖుత్బా బిన్ ఆమిర్ బిన్ నాబీ (బనీ హిరామ్ బిన్ కఅబ్)
5. ఖుత్బా బిన్ ఆమిర్ బిన్ హదీదా (బనీ సల్మా)
6. హారిస్ బిన్ అబ్దుల్లా బిన్ రిమాబ్ (బనీ ఉబైద్ బిన్ గనమ్)

యస్రిబ్ (మదీనా)వారి అదృష్టం ఏమిటంటే, వారు మదీనాకు చెందిన తమ మిత్రపక్షమైన యూదుల నోట, "ఈ కాలంలోనే ఓ ప్రవక్త ప్రభవించ బోతున్నాడని, అతను త్వరలోనే ప్రత్యక్షం కాబోతున్నాడని, మేము ఆయనకు విధేయులమై, ఆయన నాయకత్వంలో మిమ్మల్ని సంహరిస్తాము" అనే విషయాన్ని విని ఉండడం.[14]

12. ముక్తరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లా, పుట.150-152.
13. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/84.
14. జాదుల్ ముఆద్-2/50; ఇబ్నె హష్షామ్-1/429, 541.

మహాప్రవక్త (స) వారి వద్దకు వెళ్ళి, "మీరెవరూ?" అని అడిగారు.

"మేము బనూ ఖజ్రజ్ తెగకు చెందినవారం" అని బదులిచ్చారు వారు.

"అంటే యూదుల మిత్రపక్షమా?" అని ప్రశ్నించారు.

"అవును" అని వారు చెప్పగా, "మనమెందుకు కూర్చొని మాట్లాడుకో కూడదు?" అని అడిగారు దైవప్రవక్త (స).

వారు కూర్చోగా, వారి ముందు మహాప్రవక్త (స) ఇస్లామ్ ధర్మం యదార్థ తను గురించి వివరిస్తూ అల్లాహ్ మార్గం వైపునకు వారిని ఆహ్వానించారు. దివ్యఖుర్ఆన్ పారాయణం చేసి వినిపించారు. వారు పరస్పరం మాట్లాడు కుంటూ -

"చూశారా! ఏ ప్రవక్త గురించి అయితే చెబుతూ యూదులు మనల్ని బెదిరిస్తున్నారో ఈయన ఆ ప్రవక్తే అయి ఉండవచ్చు. కాబట్టి యూదులు మమ్మల్ని మించిపోకుండా చూద్దాం" అంటూ లేచి వెంటనే ఆయన పిలుపును అందుకొని ఇస్లామ్ స్వీకరించారు ఆ ఆరుగురు యువకులు.

వీరు యస్రిబ్‌కు చెందిన బుద్ధివివేచనలుగల యువకులు. ఇటీవలే జరిగిన యుద్ధం వారిని బాగా కృంగదీసి ఉంది. వాతావరణాన్ని ఇంకా చీకటి మయంగానే ఉంచింది. అందుకని వారు, ప్రవక్త (స) గారి పిలుపు ఆ యుద్ధాన్ని రూపుమాపడానికి దోహదపడగలదని తలిచారు. కాబట్టి వారు పరస్పరం ఇలా అనుకోనారంభించారు.

"మనం మన జాతి వద్దకు వెళ్ళి దాన్ని ఈ ధర్మం వైపునకు పిలుద్దాం. మన జాతిలో ఉన్న పరస్పర వైరం లాంటిది మరే జాతిలోనూ కానరాదు. బహుశా అల్లాహ్ ప్రవక్త (స) ద్వారా వారందరినీ సంఘటితం చెయ్యవచ్చు. మనం అక్కడికి వెళ్ళి ఆయన (స) కార్యం వైపునకు వారిని ఆహ్వానిద్దాం. మనం ఈ రోజు స్వీకరించిన ధర్మాన్ని వారి ముందుంచుదాం. అల్లాహ్ తలిస్తే ఈయన (స) మనందరిని ఒకే చోట కూడేటట్లు చేయగలడు. ఆ తరువాత మనకు ఈయన (స) కంటే గౌరవనీయుడైన వ్యక్తి ఇంకొకడు లభించడు."

ఆ తరువాత వీరు తమ వెంట ఇస్లామ్ సందేశాన్ని మదీనాకు తీసుకు వెళ్ళారు. అక్కడ ఇంటింటా మహాప్రవక్త (స)గారి చర్చే చోటుచేసుకుంది.[15]

---

15. ఇబ్నె హిషామ్-1/428, 430.

హజ్రత్ ఆయిషా (ర)తో నికాహ్ (వివాహం)

అదే సంవత్సరం షవ్వాల్ నెల (దైవదౌత్యశకం 11)లో దైవప్రవక్త (స) హజ్రత్ ఆయిషాను వివాహమాడారు. అప్పుడు ఆమె వయస్సు ఆరు సంవత్స రాలు. ఆ తరువాత హిజ్రత్ అయిన మొదటి సంవత్సరం షవ్వాల్ నెలలోనే ఆమె మదీనాలో ప్రవక్త (స) ఇంటికి వచ్చేశారు. అప్పుడు ఆమె వయస్సు తొమ్మిదేండ్లు.[16]

---

16. తల్ఖీహుల్ ఫహూమ్-పుట.10; సహీ బుఖారి-1/550.

ఇస్రా మరియు మేరాజ్

దైవప్రవక్త (స) గారి సందేశ ప్రచారం ఇటు విజయం అటు ముస్లిము లపై జరుగుతున్న హింసాదౌర్జన్యాల నడుమ నలుగుతూనే ఉంది. సుదూర తీరాల్లో దిగ్మండలంపై ఆశాకిరణాల మసక వెలుగు కానరావడం మొదలైంది. ఆ సమయంలోనే ఇస్రా మరియు మేరాజ్ సంఘటన సంభవించింది. ఈ మేరాజ్ సంఘటన ఎప్పుడు జరిగింది? అనే విషయంలో సీరత్ చరిత్రకారుల కథనాలు కొంత భిన్నంగా ఉన్నాయి.

1. దైవప్రవక్త (స)కు దైవదౌత్యం ఒసగబడిన సంవత్సరమే ఈ మేరాజ్ సంభవించింది. (ఇది తిబ్రి కథనం)
2. దైవదౌత్యపు అయిదు సంవత్సరాల తరువాత మేరాజ్ సంభవించింది. (ఈ కథనాన్ని ఇమామె నూవీ, ఇమామె ఖుర్తిబీ ఇద్దరు కలసి సరైనదిగా నిర్ణయించారు)
3. దైవదౌత్యం లభించిన పదవ సంవత్సరం రజబ్ 27న సంభవిం చింది. (ఇది అల్లామా మన్సూర్ పూరి అభిప్రాయం)
4. హిజ్రత్ కంటే పదహారు మాసాల ముందు అంటే దైవదౌత్యపు పన్నెండో సంవత్సరం రమజాన్ నెలలో.
5. హిజ్రత్‌కు పదునాలుగు నెలలకు ముందు అంటే దైవదౌత్యం లభించిన పదమూడో సంవత్సరం ముహర్రం నెలలో.
6. హిజ్రత్‌కు ఒక సంవత్సరం ముందు. అంటే దైవదౌత్యపు పదమూడవ సంవత్సరం రబీ ఉల్ అవ్వల్ మాసంలో.

వీటిలో మొదటి మూడు కథనాలు సరి అయినవి కావు అనేదానికి ఆధారాలున్నాయి. వాటి ప్రకారం, హజ్రత్ ఖదీజా (ర) గారి మరణం అయిదు పూటల నమాజు విధి కావడానికి ముందు సంభవించింది. ఈ అయిదు పూటల నమాజు విధి అయినది మేరాజ్ రాత్రి జరిగిన సంఘటన తరువాతే.

అంటే, హజ్రత్ ఖదీజా (ర) మేరాజ్ కంటే ముందే పరమపదించారు. దైవ దౌత్య శకం పదవ సంవత్సరం రమజాన్ నెలలో. కాబట్టి మేరాజ్ సంభవించి నది ఆమె మరణించిన తరువాతే, ముందు కాదు. ఇక మిగిలిన మూడు కథనాలు. వాటిని ఏది సరిఅయినదో , ఏది కాదో చెప్పడానికి ఆధారాలు లేవు. అయితే అస్రా సూరా (బనీ ఇస్రాయీల్ అధ్యాయం)లో చెప్పబడిన సందర్భా లను బట్టి చూస్తే, ఈ సంఘటన మక్కా జీవితపు చివరి కాలానికి సంబంధిం చినదని చెప్పవచ్చు.[1]

హదీసు పండితులు వివరించిన ఈ సంఘటన వివరాలు మేము ఈ క్రింది పంక్తుల్లో పొందుపరుస్తున్నాం.

ఇబ్నె ఖైమ్ గ్రంథస్థం చేసిన ప్రామాణికమైన కథనం ప్రకారం, మహా ప్రవక్త (స)ను ఆయన భౌతిక శరీరంతో సహా 'బుర్రాక్'పై ఎక్కించుకొని హజ్రత్ జిబ్రీల్ (అ.స.) మస్జిదె హరాం (కాబా గృహం) నుండి బైతుల్ మఖ్దిస్ (నేటి పాలస్తీనా) వరకు తీసుకువెళ్ళారు. అక్కడకు చేరిన తరువాత మహాప్రవక్త (స) దైవప్రవక్తలందరికి నాయకత్వం వహిస్తూ నమాజు చేయించారు. బుర్రాక్‌ను ఆ మస్జిద్ ద్వారానికి ఉన్న కడియానికి కట్టేశారు.

ఆ తరువాత అదే రాత్రి ఆయన్ను (స) బైతుల్ మఖ్దిస్ నుండి మొదటి ఆకాశం వరకు తీసుకొని వెళ్ళడం జరిగింది. జిబ్రీల్ (అ.స.) ఆకాశ ద్వారాన్ని తెరిపింపగా ఆ ద్వారం తెరుచుకోవడం జరిగింది. అక్కడ దైవప్రవక్త (స), మానవాళికి తండ్రి అయిన హజ్రత్ ఆదం (అ.స.) ను చూశారు. ఆయనకు సలాం చేయగా, ఆయన మర్‌హబా అంటూ సలాముకు ప్రతిసలాము చేశారు. ఆయన (స) గారి దైవదౌత్యాన్ని ధృవీకరించారు. ఆదమ్ (అ.స.)కు కుడి ప్రక్కన అదృష్టవంతుల ఆత్మలూ, ఎడమ ప్రక్కన దురదృష్టవంతుల ఆత్మలు ఉన్నట్లు అల్లాహ్, ప్రవక్త (స)కు చూయించాడు.

ఆ తరువాత మహాప్రవక్త (స)ను రెండో ఆకాశం పైకి తీసుకొనిపోవడం జరిగింది. అక్కడ ఆకాశ ద్వారాన్ని తెరిపించడం జరిగింది. రెండవ ఆకాశంపై ఆయన (స), హజ్రత్ యహ్యా బిన్ జకరియ్యా (అ.స.) ను, హజ్రత్ ఈసా బిన్ మరియమ్ (అ.స.) ను చూశారు. వారిద్దరిని కలసి వారికి సలామ్ అందించగా

1. *ఈ కథనాల వివరాల కోసం చూడండి. జాదుల్ ముఆద్-2/49, ముఖ్తసరుస్సీరత్. షేఖ్ అబ్దులాహ్, పుట.148, 149; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/67.*

ఇద్దరూ ప్రతిసలాము చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు, ఆయన దైవ దౌత్యాన్ని ధృవీకరించారు.

ఆ పిదప మూడో ఆకాశం పైకి తీసుకువెళ్ళడం జరిగింది. అక్కడ ఆయన (స) హజ్రత్ యూసుఫ్ (అ.స.)ను చూసి సలామ్ చేశారు. ఆయనకు జవాబుగా ప్రతిసలాము చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపి ఆయన (స) గారి దైవదౌత్యాన్ని ధృవీకరించారు.

ఆ తరువాత ఆయన్ను (స) నాల్గో ఆకాశం పైకి తీసుకొని వెళ్ళడం జరిగింది. అక్కడ దైవప్రవక్త (స) ఇద్రీస్ (అ.స.) ను చూసి సలామ్ పలికారు. జవాబుగా ఇద్రీస్ (అ.స.) ప్రతిసలాము చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన (స) దైవదౌత్యాన్ని ధృవీకరించారు.

ఆపై అయిదో ఆకాశానికి వెళ్ళగా, అక్కడ ఆయన (స) హజ్రత్ హారూన్ బిన్ ఇమ్రాన్ (అ.స.)ను చూశారు. ఆయనకు సలామ్ అందించారు. జవాబుగా హారూన్ (అ.స.) ప్రతి సలాము చేస్తూ శుభాకాంక్షల్ని అందజేస్తూ ఆయన (స) దైవదౌత్యాన్ని ధృవపరిచారు.

దైవప్రవక్త (స)ను ఆరవ ఆకాశం పైకి గొనిపోగా, అక్కడ ఆయన (స) హజ్రత్ మూసా బిన్ ఇమ్రాన్ (అ.స.)ను చూడడం జరిగింది. ఆయనకు సలాము అందించగా ప్రతిసలాము చేస్తూ మర్హబా అని శుభాకాంక్షల్ని అందించారు. మహాప్రవక్త (స) గారి దైవదౌత్యాన్ని ధృవపర్చడం జరిగింది. అయితే, ఆయన ముందుకు నడువగా మూసా (అ.స.) ఏడ్వనారంభించారు. మీరెందుకు ఏడుస్తున్నారని ప్రవక్త (స) అడగగా, ఆయన, "నా తరువాత ఓ యువకుడు ప్రభవింపజేయబడ్డాడు. అతని సమాజం, నా సమాజం కంటే సంఖ్యలో అధికంగా ఉండి స్వర్గప్రవేశం చేస్తుంది. ఆ కారణంగా నాకు ఏడుపు ఆగలేదు" అని అన్నారు.

ఆ తరువాత ఏడవ ఆకాశం పైకి ఆయన్ను చేర్చడం జరిగింది. మహాప్రవక్త (స), అల్లాహ్‌కు రెండు ధనువులు లేదా అంతకంటే తక్కువే దూరంలో ఉన్నారని గమనించారు. ఆ తరువాత అల్లాహ్ తన దాసునిపై దివ్యావిష్కృతిని అవతరింపజేశాడు. ఆ దివ్యావిష్కృతిలో రోజుకు యాభై పూటల నమాజును విధిగా చేయడం జరిగింది. ఆ తరువాత ఆయన వెనక్కు మరలి హజ్రత్

మూసా (అ.స.) దగ్గరకు వచ్చారు. మూసా (అ.స.), "అల్లాహ్ మీకు ఇచ్చిన ఆదేశం ఏమిటి?" అని అడిగారు. "యాభై పూటల నమాజు" అని బదులిచ్చారు దైవప్రవక్త (స). "మీ సమాజానికి అంతశక్తి లేదు. మీ దైవం వద్దకు తిరిగి వెళ్ళి మీ సమాజం కోసం ఇంకొన్ని నమాజుల్ని తగ్గించమని ప్రార్థించండి" అని చెప్పారు. మహాప్రవక్త (స) జిబ్రీల్ వైపు ఆయన సలహా పొందే దృష్టితో చూశారు. ఆ తరువాత జిబ్రీల్ (అ.స) ఆయన్ను అల్లాహ్ సన్నిధికి గొనిపోయారు. అల్లాహ్ తన స్థానంలోనే ఉన్నాడు- కొన్ని ఉల్లేఖనాల్లో సహీ బుఖారి పదం ఇలాగే ఉంది - అల్లాహ్ నమాజుల్ని తగ్గించాడు. తరువాత దైవప్రవక్త (స) క్రిందికి తీసుకొని రాబడ్డారు. మూసా (అ.స.)ను సమీపించినప్పుడు వెళ్ళి మరికొన్ని నమాజులు తగ్గించమని దైవాన్ని వేడుకొండని చెప్పారు. ఇలా మూసా (అ.స.) మరియు అల్లాహ్ నడుమ దైవప్రవక్త (స) గారి రాకపోకలు కొనసాగాయి. చివరకు అయిదు పూటల నమాజులే విధిగా మిగిలిపోయాయి. మూసా (అ.స.) అవి కూడా ఎక్కువే ఇంకా తగ్గించుకురండని సలహా ఇచ్చారు. కాని మహాప్రవక్త (స), "నాకు ఇక అక్కడికి వెళ్ళి తగ్గించమని అడగడానికి సిగ్గేస్తోంది. నేను ఈ అయిదు పూటల నమాజులకు సంతుష్టుణ్ణే. ఆయన ఆదేశాలను శిరసావహిస్తు న్నాను" అని ముందుకు కదిలారు. కొంతదూరం వెళ్ళగా, "నేను ఈ విధిని (నా దాసులపై) విధిగా చేశాను. నా దాసులకు వెసులుబాటును కలిగించాను" అనే ఆకాశవాణి వినబడింది.[2]

దైవప్రవక్త (స) తన దైవాన్ని చూశారా లేదా? అనే విషయంలో ఇబ్నె ఖైమ్, భిన్నాభిప్రాయాలున్నట్లు రాశారు. ఇమామె తైమియా ఓ పరిశోధన గురించి రాశారు. ఇందు కళ్ళారా చూడడం గురించి ఎలాంటి ఆధారాలుగానీ, ఏ సహాబీ (అనుచరుడు) ఆ విషయాన్ని ధృవీకరించడంగానీ జరగలేదు అనేది దాని సారాంశం. ఇక ఇబ్నె అబ్బాస్ (ర) గారి ఉల్లేఖనంలో కంటితో చూడడం మరియు ఊహించడం గురించిన విషయాలు రెండూ ఉన్నాయి. వాటిలో మొదటిది రెండో దానికి విరుద్ధంగా లేదు. కాబట్టి ఇబ్నె ఖైమ్ ఇలా రాస్తున్నారు.

ثُمَّ دَنَا فَتَدَلَّى "ఆయన అతని ముందుకు వచ్చి నిలబడ్డాడు, ఆ తరువాత మరింత దగ్గరకు వచ్చి పైన ఆగిపోయాడు" (53-8). ఇది నజ్మ్ సూరాలోని ఓ ఆయత్.

---

2. జాదుల్ ముఆద్-2/47,48.

ఇది మేరాజ్ సంఘటన జరిగినప్పుడు లభించిన సామీప్యం గురించినది కాదు. ఆ సామీప్యత వేరు. నజ్మ్ సూరాలో చెప్పబడిన ఈ సామీప్యత హజ్రత్ జిబ్రీల్ (అ.స.)కు సంబంధించిన సామీప్యత. హజ్రత్ ఆయిషా (ర) మరియు హజ్రత్ మస్ఊద్ (ర)లు సెలవిచ్చినట్లు, దీని సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే ఇదే సరైనది. దీనికి భిన్నంగా మేరాజ్ సంఘటనకు సంబంధించిన హదీసులో ఏ సామీప్యత గురించి అయితే చెప్పడం జరిగిందో, అది అల్లాహుతఆలా సామీప్యం గురించి చెప్పిన విషయం. నజ్మ్ సూరాలో ఈ విషయాన్ని అసలే లేవనెత్తడం జరగలేదు. కాగా, నజ్మ్ సూరాలో దైవప్రవక్త (స) ఆయన్ను సిద్రతుల్ ముంతహా వద్ద రెండు మార్లు చూడడం జరిగింది అని ఉంది. ఆయన జిబ్రీల్ (అ.స.) మాత్రమే. ఆయన్ను హజ్రత్ ముహమ్మద్ (స) ఆయన అసలు రూపంలో రెండు మార్లు చూశారు అని. ఒకటి భూమిపై, మరొకటి సిద్రతుల్ ముంతహా వద్ద.[3]

ఈసారి కూడా మహాప్రవక్త (స) వక్షస్థలాన్ని చీల్చే (షక్కెకద్ర్) సంఘటన జరిగింది. ఆ ప్రయాణ సందర్భంలో అనేక విషయాలను చూపడమూ జరిగింది.

మహాప్రవక్త (స) ఎదుట పాలు, సారాయి రెండూ ఉంచబడ్డాయి. ఆయన పాలను మాత్రమే తీసుకున్నారు. అప్పుడు, "మీకు ప్రకృతికి అనుగుణమైన (సహజమైన) మార్గం చూపబడింది లేక మీరు సహజ ధోరణినే అవలంబించారు, ఒకవేళ మీరు సారాయిని పట్టుకుని ఉంటే మీ సమాజం మార్గభ్రష్టమైపోయి ఉండేది" అని చెప్పడం జరిగింది.

దైవప్రవక్త (స) స్వర్గంలో నాలుగు సెలయేళ్ళను చూశారు. రెండు అగుపడేవి, మరి రెండు అగుపడనివి. కనబడే సెలయేళ్ళు నైలు, ఫరాత్ నదులు. (బహుశా దీని అర్థం, మీ దైవదౌత్యం నైలు, ఫరాత్‌లోని సస్యశ్యామల మైదానాల వరకు వ్యాపిస్తుంది. అంటే అక్కడి ప్రజలు వంశానుక్రమణంగా ముస్లిములై పోతారని, ఈ రెండు నదుల జన్మస్థలం స్వర్గం అని చెప్పడమేమో! వల్లాహు ఆలమ్)

మహాప్రవక్త (స), నరకం'దారూగా' (కాపలాదారు) అయినటువంటి

3. జాదుల్ ముఆద్-2/47,48; సహీ బుఖారి 1/50, 455, 456, 470,471, 481, 508, 549, 550, 2/684. సహీ ముస్లిమ్ 1/91-96. వల్లాహు ఆలం- దైవానికే బాగా తెలుసు).

మాలిక్‌ను సయితం చూశారు. అతను నవ్వడంగాని, నవ్వినప్పుడు ఆయన ముఖం వికసించడంగాని చూడలేదాయన. ఆయన నరకాన్నీ స్వర్గాన్నీ రెండింటిని కూడా వీక్షించారు.

అక్కడ దైవప్రవక్త (స), అనాథల సొమ్మును బలవంతంగా కాజేసే వారిని సయితం చూశారు. వారి పెదాలు ఒంటె పెదాల్లా ఉన్నాయి. నోట్లో నిప్పు కణికలు పెట్టి కుక్కుకుంటున్నారు. ఆ నిప్పు కణికలు రెండో వైపు నుండి మల ద్వారం ద్వారా బయటకు వస్తున్నాయి.

మహాప్రవక్త (స) వడ్డీ వ్యాపారుల్ని కూడా చూడడం జరిగింది. వారి పరిస్థితి ఎలాగుందంటే పెద్ద పెద్ద పొట్టలు కలిగి, వారు కదలలేని స్థితిలో ఉన్నారు. ఫిర్ఔన్ జాతివారిని అగ్ని చూయించడానికి తీసుకొని వెడుతూ ఈ వడ్డీ వ్యాపారుల్ని త్రొక్కుకుంటూ వెళ్ళడం చూశారు.

వ్యభిచారుల్నీ చూశారక్కడ ఆయన (స). వారి ముందు శుభ్రమైన తాజా బలసిన మాంసాన్ని, దానికి తోడు బాగా చీకిపోయి కంపుకొడుతున్న మాంసాన్ని కూడా ఉంచడం జరిగింది. వారు ఈ తాజా మాంసాన్ని వదలి మురిగి కంపుకొడుతున్న మాంసాన్నే భుజిస్తున్నారు.

భర్తలకు ఇతరుల సంతానాన్ని అంటగట్టే స్త్రీలను కూడా చూశారాయన (అంటే వ్యభిచారం చేసి గర్భవతులై పిల్లలుగన్న స్త్రీలు. తెలియని వారికి ఆ పిల్లవాడు ఆమె భర్తకే పుట్టాడని అనుకుంటారు). వారి స్తనాలలో పెద్ద పెద్ద వంకర తిరిగిన గాలాలు గ్రుచ్చి వారిని భూమ్యాకాశాలకు నడుమ వ్రేళ్ళాడదీయడం చూశారు.

దైవప్రవక్త (స) మేరాజ్ ప్రయాణంలో వచ్చిపోతూ మక్కా ప్రజలకు చెందిన ఓ బిడారాన్ని కూడా చూడడం జరిగింది. వారి బిడారం నుండి బెదిరి పారిపోయివస్తున్న ఒక ఒంటెను కూడా చూశారు. వారు మూతలు పెట్టి ఉంచిన నీటి పాత్రలో నుండి కొంత నీరు కూడా త్రాగారు. ఆ సమయంలో ఆ బిడారం వారు ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నారు. ఆ పాత్రను తిరిగి మూతపెట్టి వదిలిపెట్టారు. ఈ విషయం మేరాజ్ అయిన మరుసటి రోజు ఉదయం ఆయన చెప్పిన సత్యానికి ఆధారంగా నిలిచింది.[4]

అల్లామా ఖైమ్ కథనం ఇలా ఉంది : మహాప్రవక్త (స) ఉదయమే లేచి ఆయన తన జాతికి, అల్లాహ్ తనకు చూపించిన ఆ మహత్తర సూచనలను

4. ఇబ్నె హష్షామ్-1/397, 402-406.

తెలియజేశారు. ఆయన జాతి ప్రజలు ఇది విన్నంతనే ఆయన్ను మరింతగా తిరస్కరిస్తూ, హేళన చేస్తూ హింసలకు పాల్పడ్డారు. మక్కా వారు బైతుల్ మఖ్దిస్ రూపురేఖలు ఎలాగున్నాయో చెప్పమని అడగ్గా, అల్లాహ్ బైతుల్ మఖ్దిస్‌నే ఆయన కళ్ళ ముందుకు తెచ్చి ఉంచాడు. దాని రూపురేఖల్ని ఒక్కొక్క టిగా వర్ణిస్తూ ఉంటే దైవతిరస్కారుల నోట మాటే పెగల్లేదు. మహాప్రవక్త (స) వచ్చి పోతూ మార్గమధ్యంలో చూసిన వారి వ్యాపార బిడారాలను గురించి కూడా తెలుపుతూ అది ఇంకొన్ని రోజుల్లోనే మక్కా చేరుతుందని, దానికి సంబం ధించిన ఓ ఒంటె బెదిరి ఆ బిడారానికి ముందుగా పారిపోయి వస్తోందని చెప్పారు. ఆయన చెప్పిన విధంగానే జరిగింది. అయినా ఆ జాతి వారికి ఆయన ఎడల గల ద్వేషం మరింత పెరిగింది. ఆ నిజాన్ని కూడా తిరస్కరిస్తూ ఏదీ ఒప్పుకోడానికి వారు సిద్ధపడలేదు.[5]

హజ్రత్ అబూ బక్ర్ (ర)కు ఆ సందర్భంలోనే సిద్దీఖ్ బిరుదు లభించిం దని చెప్పబడుతోంది. ఎందుకంటే, ప్రజలు ప్రవక్త మాటల్ని తిరస్కరిస్తే ఆయన వాటిని ధృవీకరించారు కనుక.[6]

మేరాజ్ ప్రయోజనాన్ని గూర్చి తెలుపుతూ టూకీగానే అయినా మహోన్నతమైన పదాలు అవతరింపజేయబడ్డాయి.

لِنُرِيَهُ مِنْ آيَاتِنَا

"మేము ఆయన (స)కు కొన్ని నిదర్శనాలను చూపడానికే" అన్నవే ఆ పదాలు. (17 : 1)

దైవప్రవక్తల విషయంలోనూ ఇలాగే అల్లాహ్ సూచనలు చూపడం జరిగింది. ఖుర్‌ఆన్ వాక్యాలు ఇలా ఉన్నాయి.

وَكَذَٰلِكَ نُرِيَ إِبْرَاهِيمَ مَلَكُوتَ السَّمَاوَاتِ
وَالْأَرْضِ وَلِيَكُونَ مِنَ الْمُوقِنِينَ ۝

"ఇదే విధంగా మేము ఇబ్రాహీముకు భూమ్యాకాశాల పాలనా వ్యవస్థను చూపించేవారము. ఎందుకు చూపేవారమంటే, అతను దృఢంగా విశ్వ సించే వారిలో ఒకడు కావాలనే." (6 : 75)

5. జాదుల్ ముఅద్-1/48; ఇంకా చూడండి. సహీ బుఖారి-2/684.
6. ఇబ్నె హష్షామ్-1/399.; సహీ ముస్లిం-1/96. ఇబ్నె హష్షామ్-1/402, 403.

لِنُرِيَكَ مِنْ آيَاتِنَا الْكُبْرَىٰ ۝

మూసా (అ.స.)తో, "మేము నీకు మా పెద్ద సూచనలను చూపబో తున్నాం" అని సెలవిచ్చాడు. (20 : 23)

ఈ సూచనలను ప్రవక్తలకు చూపడానికి గల కారణాలను వివరిస్తూ అల్లాహ్, "వారు విశ్వసించే వారిలో చేరిపోవాలనే" అనే విషయాన్ని తెలియ జేస్తున్నాడు.

కాబట్టి దైవప్రవక్తల జ్ఞానానికి ఇలాంటి సూచనలు కనబడితే ఆ జ్ఞానం మరింత బలపడి, పదాల్లో వ్యక్తపర్చడం అలవికానటువంటి దృశ్యజ్ఞానం వారికి లభిస్తుంది. ఈ కారణంగానే దైవప్రవక్తలు (అ.స.) అల్లాహ్ మార్గంలో మరెవ్వరూ భరింపజాలని కష్టాలను సయితం భరించగలిగారు. యదార్థానికి ఈ ఇహ లోకం వారి దృష్టిలో దోమ రెక్కంత కూడా విలువ చేసేది కాదు. అందుకనే వారు తమపై విరుచుకుపడే దుష్టశక్తులను, వారు పెట్టే హింసలను లెక్కచేయ కుండా అల్లాహ్ మార్గంపై నడువగలిగారు.

ఈ మేరాజ్ సంఘటన వెనుక దాగి ఉన్న రహస్యాలను గురించి షరీఅత్ గ్రంథాలే విపులంగా చర్చించగలవు. కాని ఈ ప్రయాణం ద్వారా ఒనగూడిన ప్రయోజనాలను ఇక్కడ కొన్నింటిని తెలియజేయడం జరుగుతోంది.

సూరయె అస్రా లేదా బనీ ఇస్రాయీల్‌లో అల్లాహ్ ఈ సంఘటన కేవలం ఒక్క ఆయత్‌లోనే ఉటంకించినప్పటికీ, అందులో యూదుల దురాగతాలను, నేరాలను ఒక్కొక్కటిగా లెక్కించడం జరిగింది. ఆ తరువాత, ఈ ఖుర్‌ఆన్ అన్నిటికంటే రుజుమార్గం వైపునకు వారిని ఆహ్వానిస్తోందని హెచ్చరించాడు. దివ్య ఖుర్‌ఆన్‌కు చెందిన ఈ అధ్యాయాన్ని (సూరాను) పఠించే వారికి ఈ విషయం పొంతన లేనట్లుగా కనిపిస్తుంది. కాని నిజం మాత్రం అది కాదు. అల్లాహ్ ఈ శైలి ద్వారా, ఇక యూదులు మానవాళి నాయ కత్వానికి అర్హులు కారని, వారు ఆ హోదాకు తగినట్లుగా ప్రవర్తించడం లేదని, ఆ నాయకత్వం వారి వద్ద ఇక ఏ మాత్రం ఉండడానికి వీల్లేదని తెలియ జేయడం జరిగింది. కాబట్టి ఈ అమానతును, ఈ బాధ్యతను అల్లాహ్ తన ప్రవక్త అయిన ముహమ్మద్ (స)కే అప్పగిస్తాడనే సూచన ఉంది. ఇబ్రాహీమ్ (అ.స.) ధర్మ ప్రచారానికి కేంద్రాలుగా ఉన్న రెండు ప్రదేశాలు ఇక ఆయనకే

అప్పజెప్పడం జరుగుతుందని చెప్పడం జరిగింది. మరో విధంగా చెప్పాలంటే, సమాజ ఆధ్యాత్మిక నాయకత్వ బాధ్యతను ఒక ఉమ్మత్ (సమాజం) నుండి లాగి మరో ఉమ్మత్‌కు అప్పగించే తరుణం ఆసన్నమైంది అన్నదే. అంటే, జులుము, అత్యాచారాలు, వ్యభిచారం, మార్పులు చేర్పుల చరిత్రగల ఓ చెడ్డ సమాజం నుండి ఆ బాధ్యతను లాగి, ఖుర్‌ఆన్ అనే దైవవాణితో అలరారే, సరైన మార్గం చూపే ఓ ప్రవక్తను అనుసరిస్తూ, సత్కార్యాలు సదాచారాలు ఆచరించే మరో సమాజానికి అది అప్పజెప్పడం జరుగుతుందన్నమాట.

అయితే ఈ నాయకత్వం ఎలా మార్చడం జరుగుతుంది? మరి ఈ ఉమ్మత్‌కు చెందిన ప్రవక్త నిస్సహాయస్థితిలో మక్కా కొండల్లో ప్రజల నడుమ హింసా దౌర్జన్యాలను భరిస్తూ తిరగుతున్నాడాయె! అప్పుడు అవతరించిన ఈ బనీ ఇస్రాయీల్ సూరా వాక్యాలు ఈ ప్రశ్నకే జవాబు ఇస్తున్నాయి. ఇవి మరో యదార్థాన్ని కూడా తేటతెల్లం చేస్తూ, ఇస్లామీయ సందేశ ప్రచారం తన చివరి ఘట్టంలో, సంపూర్ణతను పొందే స్థితికి చేరిందనీ, ఇక మరో శకం ఆరంభం కాబోతోందనీ దాని చరిత్ర మరోలాగుంటుందనీ విడమర్చి చెబుతున్నాయి. ఆ ఆయత్‌లలో బహుదైవారాధకులకు గట్టి హెచ్చరిక కూడా చేయడం జరిగింది.

وَإِذَآ أَرَدۡنَآ أَن نُّهۡلِكَ قَرۡيَةً أَمَرۡنَا مُتۡرَفِيهَا فَفَسَقُواْ فِيهَا

فَحَقَّ عَلَيۡهَا ٱلۡقَوۡلُ فَدَمَّرۡنَٰهَا تَدۡمِيرٗا ۝١٦

"మేము ఒక పట్టణాన్ని నాశనం చెయ్యదలచుకున్నప్పుడు, అందలి స్థితిమంతులకు మొదట ఓ ఆజ్ఞను పంపుతాము. వారు ఆ ఆజ్ఞ విషయంలో అవిధేయతకు పాల్పడతారు. అప్పుడు శిక్షా నిర్ణయానికి ఆ పట్టణం అర్హమవు తుంది. మేము దాన్ని సర్వనాశనం చేస్తాము." (17 : 16)

وَكَمۡ أَهۡلَكۡنَا مِنَ ٱلۡقُرُونِ مِنۢ بَعۡدِ نُوحٖۗ

وَكَفَىٰ بِرَبِّكَ بِذُنُوبِ عِبَادِهِۦ خَبِيرَۢا بَصِيرٗا ۝١٧

"చూడూ! నూహ్ తరువాత మా ఆజ్ఞ ప్రకారం నాశనమైన జాతులు ఎన్ని ఉన్నాయో. నీ ప్రభువుకు తన దాసుల పాపాలను గురించి పూర్తిగా తెలుసు. ఆయన సర్వాన్నీ చూస్తూ ఉన్నాడు." (17 : 17)

అదే కాదు, ఈ ఆయత్‌లకు తోడు వేరే ఆయత్‌లలో, ముస్లిములు భవిష్యత్తులో ఇస్లామీయ సమాజ స్థాపన ఎలా చేయాలో చెబుతూ, దానికి సంబంధించిన సామాజిక చట్టాల్ని, సూత్రాలను కూడా తెలుపడం జరిగింది. అంటే, వీరు, అన్ని కోణాల నుంచి వ్యవహారమంతా తమ చేతిలోనే ఉంచుకొని పకడ్బందీగా దాన్ని నడపడానికి ఓ ప్రదేశాన్ని కూడా పొందారని చెప్పడం అన్న మాట. కాబట్టి ఈ ఆదేశాల్లో, దైవప్రవక్త (స) త్వరలోనే ఒక శాంతి నిలయాన్ని, రక్షణ పొందే స్థలాన్ని తన ధర్మరక్షణకు ఓ దుర్గాన్ని పొందగలరని అర్థమవు తోంది.

ఈ అస్రా మరియు మేరాజ్ శుభ సంఘటన అడగుల్లో దాగి ఉన్న ఔచిత్యాలు మరియు రహస్యాలల్లో ఓ రహస్యం, ఓ వివేచన కూడా ఉంది. అది మన ఈ చర్చకు ఎంతో అవసరమైనది గనుక దాన్ని విడమర్చి చెప్పడం కూడా అవసరమనిపిస్తోంది. ప్రథమ బైతె అఖబా (అఖబా ప్రమాణం) మరియు ద్వితీయ బైతె అఖబాలను దృష్టిలో ఉంచుకొని చూస్తే, ఈ సంఘటన జరగడానికి గల ఔచిత్యాన్ని కూడా అర్థం చేసుకోవచ్చు. అస్రా మరియు మేరాజ్ సంఘటన ప్రథమ బైతె అఖబా జరగడానికి కొంత ముందు కాలానికో లేదా ప్రథమ బైతె అఖబా మరియు ద్వితీయ బైతె అఖబాల మధ్యకాలానికో సంబంధించినదై ఉండవచ్చు. (వల్లాహు ఆలమ్)

ప్రథమ బైతె అఖబా[1]

దైవదౌత్య శకం పదకొండో సంవత్సరం హజ్ కాలంలో యస్రిబ్‌కు చెందిన ఆరుగురు ఇస్లామ్ స్వీకరించిన విషయం మనం ఇదివరకే చదివాము. అదేకాక, వీరు దైవప్రవక్త (స)తో, తమ జాతిలోనికి వెళ్ళి ఆయన (స) గారి దైవదౌత్యం గురించి ప్రచారం చేస్తామని మాట ఇచ్చారన్న విషయం మనకు తెలిసిందే.

ఫలితంగా మరుసటి సంవత్సరం హజ్ కాలంలో (అంటే జిల్‌హజ్జా దైవ దౌత్య శకం పన్నెండో సంవత్సరం, క్రీ.శ. జులై నెల 621వ సంవత్సరం) పన్నెండు గురు వచ్చి మహాప్రవక్త (స)ను కలిశారు. వారిలో హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా బిన్ రిమాబ్ తప్ప తక్కిన అయిదుగురు గత సంవత్సరం వచ్చినవారే. వారు కాకుండా మిగతా ఏడుగురు క్రొత్తవారు. వారి పేర్లు ఇవి:

1. ముఆజ్ బిన్ హారిస్ ఇబ్నె అఫ్రా - బనూ నజ్జార్ కుటుంబం - ఖజ్రజ్ తెగ

1. *అఖబా అంటే రెండు కొండల నడుమ ఉండే ఇరుకైన లోయ అని అర్థం. మక్కా నుండి మినాకు వెళ్ళే మార్గంలో పశ్చిమం వైపు ఓ ఇరుకైన లోయ నుండి వెళ్ళవలసి ఉంటుంది. ఈ మార్గమే అఖబా పేరున ప్రఖ్యాతిగాంచింది. జిల్ హజ్జా నెల పదవ తారీఖున ఏ జమ్రాపై కంకర రాళ్ళు విసరడం జరుగుతుందో ఆ జమ్రా దీని చివరన ఉంది. అందుకే దీన్ని జమ్రయె అఖబా అని కూడా పిలుస్తారు. ఈ జమ్రాకు మరో పేరు జమ్రయె కుబ్రా కూడాను. తక్కిన రెండు జమ్రాలు దీనికి తూర్పున కొంత దూరంలో ఉన్నాయి. మినా పూర్తి మైదానం హజ్ యాత్రికులు బస చేయడం వలన నిండిపోయి ఉంటారు కనుక ఈ మూడు జమ్రా లకు మినా ప్రాంతం దక్షిణాన ఉంటుంది. రాకపోకలంతా అటు వైపే ఉంటాయి. కంకరరాళ్ళు విసిరిన తరువాత హజ్ యాత్రికుల రాకపోకలు అక్కడ ఉండవు. అందుకోసమే మహాప్రవక్త(స) బైత్ (ప్రమాణం) తీసుకోవ డానికి ఈ లోయను ఎంచుకోవడం జరిగింది. దీని వల్లనే ఈ బైత్‌ను 'బైతె అఖబా' అని పిలుస్తారు. ఇప్పుడు కొండల్ని తొలిచి ఇక్కడ విశాలమైన రోడ్లు వేయడం జరిగింది.*

2. జక్వాన్ బిన్ అబ్దుల్ ఖైస్ - బనీ జురైఖ్ కుటుంబం - ఖజ్రజ్ తెగ
3. ఉబాదా బిన్ సామత్- బనీ గనమ్ కుటుంబం - ఖజ్రజ్ తెగ
4. యజీద్ బిన్ సాలిబా- బనీ గనమ్ మిత్రపక్షం - ఖజ్రజ్ తెగ
5. అబ్బాస్ బిన్ ఉబాదా బిన్ నజ్లా- బనీ సాలిమ్ కుటుంబం - ఖజ్రజ్ తెగ
6. అబుల్ హైసిమ్ బిన్ తయ్యహాన్ - బనీ అబ్దుల్ అష్హల్ కుటుంబం - అవస్ తెగ
7. అవీమ్ బిన్ సాయిదా - బనీ అమ్రూ బిన్ ఔఫ్ కుటుంబం - అవస్ తెగ.

వీరిలో చివరి ఇద్దరు 'అవస్' తెగకు చెందిన వారు. తక్కిన వారంతా ఖజ్రజ్ తెగవారే.[2] వీరంతా కలసి దైవప్రవక్త (స) ను మినాలో ఉన్న అఖబా వద్ద కలిశారు. ఆయన చేతిపై కొన్ని విషయాలను గురించి ప్రమాణం చేశారు. హుదైబియా ఒప్పందం తరువాత మక్కా విజయం సందర్భంగా మహిళలతో ప్రమాణం చేసిన విషయాలే అవి.

అఖబా ప్రమాణానికి సంబంధించిన వివరాలు సహీ బుఖారీ గ్రంథంలో హజ్రత్ ఉబాదా బిన్ సామత్ (ర) ఈ క్రింద ఉల్లేఖించినట్లుగా ఉన్నాయి. ఆయన ఉల్లేఖనం: "రండి, ఈ మాటలపై నాతో ప్రమాణం చెయ్యండి! అల్లాహ్‌తోపాటు మరెవ్వరినీ సహవర్తులుగా నిలబెట్టము అనీ, దొంగతనం జోలికి పోము అనీ, వ్యభిచారం చెయ్యము అనీ, మీ సంతానాన్ని హత్య చెయ్యము, అపవాదులు వేయమూ అనీ, సదాచార సంబంధమైన నా ఏ ఆదేశాన్నీ ధిక్కరించబోమని ప్రతిజ్ఞ చెయ్యండి. ఎవరయితే ఈ మాటలను శిరసావహిస్తాడో అల్లాహ్ అతనికి మంచి ప్రతిఫలాన్ని ఇస్తాడు. మరెవరయితే ఇందులో దేనికి పాల్పడినా అతనికి అల్లాహ్ ఈ ప్రపంచంలో శిక్షిస్తే అది అతనికి పరిహారమవుతుంది. అల్లాహ్ అతను చేసిన దుష్కర్మను బహిర్గతం చేయకపోతే అది ఆయన ఇష్టం. అతణ్ణి ఆయన అనుకుంటే క్షమించగలడు లేకపోతే శిక్షించనూగలడు అని అనగా, మేమంతా ఆయన చేతిపై ప్రమాణం చేశాము."[3]

2. *రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/85; ఇబ్నె హిషామ్ 1/431-433.*
3. *సహీ బుఖారి - బాబుహిలాలతుల్ ఈమాన్-1/7; బాబ్ వ జాదుల్ అన్సార్-1/550, 551; బాబుల్ హుదూదు కఫ్ఫార-2/1003.*

మదీనాకు ఇస్లామ్ దౌత్యప్రతినిధి

బైత్ పూర్తి అయింది. హజ్ ఆరాధన కూడా పరిసమాప్తమైంది. మహా ప్రవక్త (స) వారి వెంట యస్రిబ్ (మదీనా)కు, అక్కడి ముస్లిములకు ఇస్లామీయ బోధనలు గరపడానికి, ధర్మాన్నత్యాన్ని చాటి చెప్పడానికి మరియు అప్పటి వరకు బహుదైవారాధనలోనే కొట్టుమిట్టాడుతున్న వారిలో ఇస్లామ్ ప్రచారం చేయడానికిగాను ఒక దౌత్యప్రతినిధిని పంపించారు. ఆ దౌత్యం కోసం ప్రప్రథమంగా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన వ్యక్తుల్లో ఓ యువకుడు ముస్అబ్ బిన్ ఉమైర్ అబ్దరీ (ర)ను ఎన్నుకోవడం జరిగింది.

కార్యంలో ఘన విజయం

హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (ర) మదీనా చేరి హజ్రత్ అస్అద్ బిన్ జురారా ఇంట్లో బస చేశారు. వారిద్దరు కలసి యస్రిబ్ ప్రజల్లో ఉత్సాహంగా ఇస్లామ్ ధర్మాన్ని ప్రచారం చేశారు. ఆయనకు 'ముక్రీ' అనే బిరుదునిచ్చారు మదీనా ప్రజలు (ముక్రీ అంటే చదువు చెప్పేవాడని అర్థం. ఆ కాలంలో ఉపాధ్యాయుణ్ణి 'ముక్రీ' అని పిలిచేవారు).

ధర్మప్రచార విజయానికి సంబంధించిన ఓ సంఘటనను ఇక్కడ చెప్పాలనుకుంటున్నాం. ఓ రోజు హజ్రత్ అసద్ బిన్ జురారాహ్ (ర)ను వెంటబెట్టుకొని ఆయన బనీ అష్హల్ మరియు బనీ జఫర్ ఉండే వాడకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ ఓ తోటలో 'మర్క్' అనే పేరుగల బావి వద్ద ఇద్దరూ కలసి కూర్చున్నారు. వారి చుట్టూ కొందరు ముస్లిములు కూడా కూర్చుని ఉన్నారు. అప్పుడు బనీ అష్హల్‌కు చెందిన సఅద్ బిన్ ముఆజ్(ర), హజ్రత్ ఉసైద్ (ర) బిన్ హుజైర్ (ఇంకా ఇస్లామ్ స్వీకరించకుండా బహుదైవారాధకులుగానే ఉన్నారు) అనే ఇద్దరు సర్దారులకు ఈ విషయం తెలిసింది. సఅద్, ఉసైద్‌తో, "మన బలహీనులైన వాళ్ళను మాటలతో మోసం చేస్తున్న ఆ ఇద్దరి వద్దకు వెళ్ళి గద్దించు, మన వాడకు రావద్దని వారించు, అసద్! నీవు నా పిన్నమ్మ కుమారుడనే నమ్మకంతో అక్కడికి పంపిస్తున్నాను సుమా! లేకపోతే నేను వెళ్ళి వారిని గద్దించి తరిమేసేవాణ్ణి" అని చెప్పి పంపించాడు.

ఉసైద్ తన బరిశెను చేతపట్టుకొని ఆ ఇద్దరి వద్దకు వెళ్ళారు. హజ్రత్ అస్అద్ దూరం నుండే ఆయన్ను చూసి, "ముస్అబ్! మీ వద్దకు అతని జాతికే

సర్దారు అయిన ఒక వ్యక్తి వస్తున్నాడు. అతని ముందు అల్లాహ్ సందేశాన్ని దాచకుండా ఉంచెయ్యండి" అని అనగా, ముస్అబ్, "అతను వచ్చి కూర్చోనీయండి! మాట్లాడతాను" అన్నారు. ఉసైద్ అక్కడికి వచ్చి వారిద్దరి ముందు నిలబడి దురుసుగా మాట్లాడనారంభించారు. "మీరు మా వాడకు ఎందుకు వచ్చినట్లు? మా బలహీనులను మోసపుచ్చడానికా? గుర్తుంచుకోండి! మీ ప్రాణాలు మీకు తీపి అయితే వీరికి దూరంగా ఉండండి" అని గద్దించారు.

"మీరు కాసేపు ఎందుకు కూర్చోరు? మేము చెప్పేదేమిటో వినరా? మీకు నచ్చితేనే మా మాటను స్వీకరించండి. నచ్చదా! వదిలేద్దురుగాని."

"మాటలు మాత్రం న్యాయంగానే చెబుతున్నారు" అంటూ తన బరిశెను భూమిలో దిగగొట్టి కూర్చుండిపోయారు.

ఇప్పుడు ముస్అబ్ ఇస్లామ్ ధర్మం గురించి ప్రారంభిస్తూ మొదట ఖుర్‌ఆన్ పారాయణం చేశారు. ఖుర్‌ఆన్ పారాయణం వింటున్న ఉసైద్ ముఖ కవళికలు మారిపోతున్నాయి. ఆయన ముఖంపై వారిద్దరు ఇస్లామ్ ఛాయలను కనుగొన్నారు. ఉసైద్ (ర) నోరు తెరుస్తూ, "ఇవి ఎంతో మహత్తరమైన వచనాలు. మీరు ఎవరినైనా ఈ ధర్మంలోనికి చేర్చే ముందు ఏం చేస్తారు?" అని అడిగారు.

"మీరు లేచి స్నానం చెయ్యండి. మీ వస్త్రాలను శుభ్రపర్చుకోండి. ఆ తరువాత సత్యాన్ని ప్రకటించే వాక్కులు పలికి రెండు రకాతుల నమాజు చేయండి చాలు" అనగా ఉసైద్ (ర) లేచి స్నానం చేశారు. వస్త్రాలను శుభ్రపరచుకున్నారు. ఆ తరువాత షహాదత్ కలిమాను పఠించి రెండు రకాతుల నమాజు చేశారు. ఆ తరువాత,

"నా వెనుక మరో వ్యక్తి ఉన్నాడు. అతను గనక మీ మార్గాన్ని అనుసరిస్తే అతని జాతిలోని ఏ వ్యక్తీ కాదనడు. నేను ఆయన్ను మీ దగ్గరకు పంపిస్తాను" అని చెప్పి వెళ్ళిపోయారు (ఆ వ్యక్తి హజ్రత్ సఅద్ (ర) బిన్ ముఆజ్).

హజ్రత్ ఉసైద్ తన బరిశెను చేతపట్టుకొని హజ్రత్ సఅద్ (ర) వద్దకు వెళ్ళారు. ఆయన తన జాతి ప్రజలతో సమావేశమై ఉన్నారక్కడ. (హజ్రత్ ఉసైద్‌ను చూసి) దైవసాక్షి! ఇతని ముఖం, మీ దగ్గర నుండి వెళ్ళేటప్పుడు ఉన్న ముఖంలా లేదు. హజ్రత్ ఉసైద్ ఆ సమావేశం ఎదురుగా వచ్చి నిలబడినప్పుడు, నీవు ఏమి చేసి వచ్చావు? అని అడిగారు సఅద్ (ర).

"వారిద్దరితో మాట్లాడినప్పుడు ఆక్షేపించదగిన పలుకులేవీ నేను వినలేదు. నేనైతే వారిని అలా చెయ్యొద్దని మందలించి వచ్చాను. వారు మాత్రం నా మాటను ఖాతరు చేస్తూ, నేను చెప్పిందే చేస్తామని ఒప్పుకున్నారు.

ఆ! ఇంకొక విషయం, బనీ హారిసా వారు అస్అద్ బిన్ జురారాను హతమార్చడానికి బయలుదేరారని విన్నాను. అతను మీ పిన్నమ్మ కుమారుడు అన్న విషయమూ వారికి తెలుసు. కాబట్టి మీతో చేసిన ఒప్పందాన్ని త్రుంచి వేయాలని వారనుకుంటున్నారు" అని అన్నారు ఉసైద్ (ర).

ఇది విన్నంతనే సఅద్ క్రోధం తార స్థాయికి చేరింది. తన బరిశెను చేతపట్టుకొని ఆ ఇద్దరి దగ్గరకు పరుగున వెళ్ళారు. ఆ ఇద్దరు తీరిగ్గా అక్కడే కూర్చుని ఇదంతా గమనిస్తున్నారు. తమ మాటల్ని వినేందుకుగాను ఉసైద్, సఅద్‌ను పంపిస్తున్నాడన్నది కూడా వారికి అర్థం అయిపోయింది. సఅద్ ఆ ఇద్దరి దగ్గరకు వెళ్ళి నిలబడి నోటికి వచ్చినట్లు తిట్టారు. ఆ తరువాత అస్అద్ బిన్ జురారాను ఉద్దేశించి, "దైవసాక్షి! ఓ అబూ ఉమామా! నాకు నీకు నడుమ బంధుత్వ సంబంధమే లేకపోతే, నీవు మా వాడలోనికి వచ్చి ఇలా ప్రవర్తించే అనుమతే ఉండకపోయేది" అని గద్దించారు.

ఇటు అస్అద్ (ర), ముస్అబ్‌తో ముందే చెప్పి ఉన్నారు, మీ దగ్గరికి ఓ సర్దారు వస్తున్నాడని, అతని వెనుకాల పూర్తి జాతే ఉంది. ఇతను గనక మీ మాటను స్వీకరిస్తే వారిలో ఒక్కడు కూడా బయటకు వెళ్ళేవాడు లేడు అన్నదే ఆ విషయం.

హజ్రత్ ముస్అబ్, సఅద్‌తో, "మీరెందుకు కాసేపు కూర్చోరు. మేము చెప్పే మాటల్లో ఏదైనా మీకు నచ్చితే స్వీకరించండి. నచ్చకపోతే మానుకోవచ్చు కదా? మీకు నచ్చకపోతే మేము ఆ మాటనే ఎత్తము."

"ఔను, మీరు చెప్పేది కూడా న్యాయమైన మాటే, కానీయండి" అంటూ తన బరిశెను భూమిలో గ్రుచ్చి కూర్చుండిపోయారు వారికి ఎదురుగా.

హజ్రత్ ముస్అబ్ ముందు ఇస్లామ్ బోధనల్ని ఉంచి, దివ్యఖుర్ఆన్ పారాయణాన్ని ప్రారంభించారు. సఅద్ నోరు తెరువక పూర్వమే ఆయన ముఖ కవళికలు మారిపోతున్నాయి. ఆయన ముఖం విచ్చుకొనే తీరు చూస్తూనే ఆయన ఇస్లామ్ ఒడిలో ఒరిగిపోయారనే విషయం వారిద్దరు అప్పటికే గమనిం

చారు. ఆ తరువాత ఆయన నోరు తెరిచి, "మీరు ఇస్లామ్ ధర్మం స్వీకరించేటప్పుడు ఏంజేస్తారు?" అని అడిగారు.

"మీరు ముందు స్నానం చెయ్యండి. మీ వస్త్రాలు పరిశుభ్రంగా ఉన్నాయో లేదో చూసుకోండి. ఆ తరువాత షహాదత్ కలిమాను పఠించి రెండు రకాతుల నమాజు చేయండి చాలు" అన్నారు.

హజ్రత్ సఅద్ (ర) అలానే చేశారు.

తన బరిశెను చేతబట్టుకొని తన జాతి కూర్చుని ఉన్న స్థానానికి వచ్చారు. చూడగానే అక్కడి వారు, "దైవసాక్షి! వెళ్ళేటప్పుడు ఉన్న ముఖంలా లేదే ఈయన ముఖం!" అని అనుకోసాగారు. హజ్రత్ సఅద్ (ర) వారి వద్దకు వచ్చి నిలబడి-

'ఓ బనూ అష్హల్! మీ నడుమ నా హోదా ఏమిటో మీకు తెలుసా?" అని ప్రశ్నించారు.

"తెలియకేమి? మీరు మా సర్దారు."

"అయితే వినండి! మీ పురుషులు, మీ స్త్రీలు అల్లాహ్‌ను, అల్లాహ్ ప్రవక్తను విశ్వసించనంతమట్టుకు మీతో మాట్లాడ్డం నాకు హరాం (నిషిద్ధం)" అన్నారు.

ఆయన పలికిన ఈ మాటల ప్రభావం అందరిపైనా పడింది. సాయంత్రం అయ్యేకల్లా ఉసైరమ్ అనే ఒకే ఒక వ్యక్తి తప్ప ఆ తెగలోని స్త్రీ పురుషులంతా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. ఉసైరమ్ ఇస్లామ్ ధర్మ స్వీకారం ఉహద్ యుద్ధం వరకు జరగలేదు. ఉహద్ యుద్ధం రోజున్నే ఆయన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి యుద్ధంలో పోరాడుతూ అమరగతినొందారు. ఆయన ఇంకా అల్లాహ్ సమక్షంలో ఒక్క సజ్దా కూడా చేయలేదు అప్పటికి. దైవప్రవక్త (స), ఈయన విషయంలో సెలవిచ్చిన మాటలు ఇవి:

"ఈయన ఆచరణ ఎంతో తక్కువే అయినా పొందిన ప్రతిఫలం మాత్రం అధికం."

హజ్రత్ ముస్అబ్ (ర), హజ్రత్ అస్అద్ (ర) బిన్ జురారహ్ ఇంట ఉంటూనే ఇస్లామ్ ధర్మప్రచారం చేస్తున్నారు. చివరకు, స్త్రీ పురుషులు కొందరైనా ముస్లిములుగా మారకుండా ఉన్న ఏ ఇల్లూ మిగల్లేదు. కేవలం మిగిలిపోయింది ఉమయ్యా బిన్ జైద్ మరియు ఖత్మా బిన్ వాయిల్ ఇళ్ళు

మాత్రమే. ప్రఖ్యాత కవి ఖైస్ బిన్ అస్లత్ వారికి చెందిన వ్యక్తే. వీరు ఆయన మాటలనే నమ్మేవారు. వీరిని ఈ కవి అహ్జాబ్ యుద్ధం (కందకం యుద్ధం, హిజ్రీ శకం 5) వరకు ఇస్లామ్ ధర్మం స్వీకరించకుండా ఆపాడు.

మొత్తానికి వచ్చే సంవత్సరం హజ్ కాలం, (దైవదౌత్యపు పదమూడో సంవత్సరం) రాకముందే హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ విజయ శుభవార్తలతో దైవప్రవక్త (స) సన్నిధికి మక్కాకు వచ్చారు. యస్రిబ్ తెగల పరిస్థితులు, వారి యుద్ధ కౌశలం, రక్షణ పాటవం మరియు వారిలోని సదాచార సంపన్నతకు సంబంధించిన వివరాలు విడమర్చి చెప్పారు.[4]

4. ఇబ్నె హిషామ్-1/435-438, 2/90; జాదుల్ ముఆద్-2/51.

ద్వితీయ బైతె అఖబా

దైవదౌత్యపు పదమూడో సంవత్సర హజ్ కాలమది (జూన్, క్రీ.శ. 622వ సంవత్సరం) యస్రిబ్‌కు చెందిన డెబ్భై మందికి పైచిలుకు ముస్లిములు హజ్ ఆరాధనలో పాల్గొనడానికి మక్కాకు విచ్చేశారు. వీరంతా వారి జాతికి చెందిన హాజీలతో కలసి మక్కాకు వచ్చినవారే. ఇంకా వారు యస్రిబ్‌లోనో లేదా మార్గమధ్యంలోనో ఉన్నప్పుడే పరస్పరం ఒకరితో ఒకరు ముచ్చటించుకుంటూ, "ముహమ్మద్ (స)ను, మక్కా కొండల్లో నిస్సహాయంగా తిరగడానికీ, బాధలు భరించడానికీ, భయంతో తల్లడిల్లిపోవడానికిగాను వదలిపెట్టి ఎలా ఉంచ గలం?" అని అనుకోజొచ్చారు.

ఈ ముస్లిములు మక్కాకు చేరిన తరువాత రహస్యంగా ముహమ్మద్ (స)తో చర్చలు ప్రారంభించారు. చివరకు, తష్రీక్ కాలం [1] - 12 జిల్‌హజ్జ రోజున - మినా ప్రాంతంలో జమ్రయె ఊలా, అంటే 'జమ్రయె అఖబా' దగ్గర ఉన్న కొండ లోయలో రహస్యంగా కలుద్దామని నిర్ణయించుకున్నారు.

రండి! ఇప్పుడు మనం ఈ చారిత్రాత్మక సమావేశ వివరాలను అన్సార్ నాయకుడు హజ్రత్ కఅబ్ బిన్ మాలిక్ (ర) నోటే విందాము. ఈ సమావేశం ఇస్లామ్ మరియు విగ్రహారాధన పోరాటాన్ని ఓ కొత్త మలుపు మలిపింది.

హజ్రత్ కఅబ్ బిన్ మాలిక్(ర) కథనం :

"మేము హజ్ చేయడానికి బయలుదేరాం. దైవప్రవక్త (స) తష్రీక్ రోజుల్లోని మధ్యరోజు (12వ జిల్‌హజ్జ) అఖబాలో కలుద్దాం అని నిర్ణయించు కున్నాం. ఎట్టకేలకు ఆ రాత్రి రానేవచ్చింది. మాతో మా జాతికే చెందిన ఓ గౌరవనీయుడైన సర్దారు అబ్దుల్లా బిన్ హిరామ్ (అప్పటికి ఆయన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు) కూడా ఉన్నారు- మా జట్టులో ఇంకా ఇతర బహుదైవా

1. జిల్ హజ్జా మాసం పదకొండు, పన్నెండు మరియు పదమూడు తేదీలను అయ్యామెతష్రీక్ (తష్రీక్ కాలం) అంటారు.

రాధకులు కూడా ఉన్నారు కాని మేము ఈ వ్యవహారాన్ని వారికి తెలియకుండానే ఉంచాం- అయితే మేము ఒక అబ్దుల్లా బిన్ హిరామ్‌నే ఒప్పిస్తూ, "ఓ అబూ జాబిర్! మీరు మా దృష్టిలో ఓ గౌరవనీయులైన సర్దారు. రేపు నరకపు ఇంధ నంగా మారకుండా మిమ్మల్ని ప్రస్తుత పరిస్థితి నుండి బయటకు తీయాలని అనుకుంటున్నాం" అని నచ్చజెప్పాము. ఆ తరువాత ఇస్లామ్ సందేశాన్ని వివరిస్తూ, ఈ రోజు మేము అఖబాలో దైవప్రవక్త (స)ను కలవడానికి నిర్ణయిం చుకున్నాము అని చెప్పగా ఆయన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిముగా మారిపోయారు. మా వెంట అఖబాకు వచ్చి మాకు సహాయకులుగా నిలబడ్డారు."

మేము అనుకున్న విధంగా ఆ రాత్రి ఎవరికీ తెలియకుండా మా గుడారాల్లో అందరితోపాటు నిద్రించాము. మూడు ఝాముల్లో ఒక ఝాము రాత్రి గడిచిపోగానే మా గుడారాల నుండి రహస్యంగా బయలుదేరి దైవప్రవక్త (స)ను కలువవలసిన చోటికి నక్కుతూ చేరుకోగలిగాము. మేమందరం అప్పుడు డెబ్భై అయిదుగురం. డెబ్భై ముగ్గురు పురుషులు, ఇద్దరు స్త్రీలు. వారి పేర్లు ఉమ్మె అమ్మారా నసీబా బిన్తె కఅబ్. ఈమె బనూ మాజిన్ బిన్ నజ్జార్ తెగకు చెందిన వారు. మరొక మహిళ ఉమ్మె మనీఅ అస్మా బిన్తె అమ్రూ. ఈమె బనూ సలీమ్‌కు చెందిన మహిళ.

మేమంతా కొండలోయలో కలసి దైవప్రవక్త (స) కోసం ఎదురుచూడ నారంభించాము. ఆయన అక్కడికి చేరారు. ఆయన వెంట ఆయన (స) గారి పినతండ్రి హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ కూడా ఉన్నారు. అప్పటి వరకు ఆయన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించక తన తాతముత్తాతల ధర్మంపైన్నే నిలకడగా ఉన్నారు. కాని తన సోదర కుమారుని వెంట రక్షణగా వచ్చినవారు. అందరికంటే ఆయనే ముందు చర్చను ప్రారంభించారు.[2]

వ్యవహార సాక్ష్యమాన్ని వివరించి చెప్పిన హజ్రత్ అబ్బాస్ (ర)

సమావేశం పూర్తి అయింది. ధార్మిక, సైనిక ప్రమాణాల విషయంలో చర్చ ఆరంభం అయింది. ఈ విషయంలో మొట్టమొదట నోరు విప్పిన వారు దైవప్రవక్త (స) గారికి పినతండ్రి అయిన హజ్రత్ అబ్బాస్ (ర)గారే. ఈ

2. ఇబ్నె హిషామ్-1/440, 441.

ప్రమాణం వలన వారి నెత్తిన పడబోతున్న బాధ్యత మార్దవం, సున్నితత్వం ఎలాంటిదో వారికి తెలియజేయాలన్నదే ఆయన ఉద్దేశ్యం. ఆయన వారిని సంబోధిస్తూ,

"ఓ ఖజ్రజ్ ప్రజలారా! - అన్సార్‌కు చెందిన రెండు తెగలు అవస్, ఖజ్రజ్‌లను అరబ్బులు ఖజ్రజ్‌గానే పిలుస్తారు - మా నడుమ ముహమ్మద్ (స) హోదా ఎలాంటిదో మీరందరికి తెలిసినదే. ధార్మిక విషయంలో మా అభిప్రాయాన్ని బలపరచే వారంతా ఆయన్ను రక్షిస్తూ వస్తున్నాం. ఆయన తన జాతిలో, తన నగరంలో మా శక్తి, మా గౌరవం మరియు మా బలం అండలో సురక్షితంగా ఉన్నవారు. కాని ఇప్పుడు ఆయన మీ దగ్గరకు రావాలని, మీతో కలసిపోవాలని కోరుకుంటున్నారు. మీరు ఆయన్ను ఎటు వైపునకు అయితే పిలుస్తున్నారో ఆ మాటను నిలబెట్టుకోగలరా? ఆయన్ను ఆయన శత్రువుల నుండి కాపాడగలరా? అలాగయితే మంచిదే. మీరు తీసుకోబోయే బాధ్యత ఏమిటో బాగా గుర్తుంచుకోండి. కాని, మీరు ఆయన్ను మీ వెంట తీసుకువెళ్ళిన తరువాత ఆయన్ను ఏకాకిగా చేసి వదలివేయదలచుకుంటే ఇప్పుడే ఆయన్ను వదలిపెట్టండి. ఎందుకంటే మా జాతి, మా నగరంలో ఆయనకు గౌరవం, రక్షణ లభించే ఉన్నాయి సుమా!" అని చెప్పారు.

"మేము (హజ్రత్ కఅబ్-ర) మీ మాటను ఆలకించాము. ఓ మహా ప్రవక్తా! ఇక తమరు ఏదైనా సెలవియ్యండి, మీ కోసం, మీ ప్రభువు కోసం, ఏ ప్రమాణం తీసుకుంటారో తీసుకోండి" అని అడిగాము.[3]

యస్రిబ్ వారు ఇచ్చిన ఈ సమాధానం ద్వారా, ఈ బృహత్తరమైన బాధ్యతను నెత్తిన వేసుకోవడం, ప్రమాదాన్ని కొనితెచ్చుకునే విషయంలో వారి దృఢనిర్ణయం, శౌర్యం, విశ్వాసం, ఉత్సాహం మరియు చిత్తశుద్ధి ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. ఆ తరువాత దైవప్రవక్త (స) వారితో మాట్లా డుతూ మొదట దివ్యఖుర్ఆన్ పారాయణం చేశారు. దైవం వైపునకు వారిని ఆహ్వానిస్తూ, ఇస్లామ్ ధర్మం వైపునకు వారిని ప్రోత్సహించారు. ఆ తరువాత ప్రమాణ స్వీకారం జరిగిపోయింది.

3. ఇబ్నె హిషామ్-1/441,442.

ప్రమాణం (బైత్)లోని అంశాలు

బైత్ జరిగిన ఈ సంఘటనను ఇమామె అహ్మద్, జాబిర్ (ర) గారి ఉల్లేఖనం ప్రకారం వివరంగా పొందుపరిచారు.

హజ్రత్ జాబిర్ (ర)గారి ఉల్లేఖనం :

మేము, ఓ దైవప్రవక్తా! మేము ఏ అంశాలపై మీ చేతి మీద ప్రమాణం చేయాల్సి ఉంది? అని అడిగాము.

ఆయన (స) ఇలా సెలవిచ్చారు.

1. ఉత్సాహ, నిరుత్సాహ సందర్భాలన్నింటిలోను నా మాటను వింటారని, దాన్ని ఆచరిస్తారని.
2. కలిమి, లేమి రెండు పరిస్థితుల్లోనూ మీ ధనాన్ని వెచ్చించగలరని.
3. మంచిని బోధిస్తారని, చెడు నుండి వారిస్తారని.
4. అల్లాహ్ మార్గంలో ఎల్లప్పుడు సంసిద్ధంగా ఉంటారని. అల్లాహ్ విషయంలో ఎవరైనా మిమ్మల్ని తూలనాడితే దాన్ని పట్టించుకోరని.
5. మీ దగ్గరకు నేను వచ్చినప్పుడు నాకు సహాయపడతారని, మీ ప్రాణాలను, మీ భార్యా పిల్లల ప్రాణాలను కాపాడినట్లే నన్ను కూడా రక్షిస్తారని. (ఇలా చేస్తే) మీ కోసం స్వర్గం ఉంది.[4]

ఇబ్నె ఇస్హాఖ్ తెలిపిన హజ్రత్ కఅబ్ (ర) గారి ఉల్లేఖనంలో కేవలం చిట్టచివరి అయిదవ (5) అంశం గురించే ఉంది. అందులో చెప్పబడిన వివరాల ప్రకారం, దైవప్రవక్త (స) ఖుర్ఆన్ పారాయణం చేసి ఇస్లామ్ వైపునకు ఆహ్వానించారు. ఇస్లామ్ ధర్మం వైపునకు ప్రోత్సహిస్తూ, "మీరు మీ భార్యాపిల్లల్ని దేన్నుండి రక్షిస్తారో నన్ను కూడా రక్షించవలసి ఉంటుంది" అన్నదే. దానికి, హజ్రత్ బరాఅ (ర) బిన్ మారూర్, దైవప్రవక్త (స) చేయి పట్టుకొని, ఎవరైతే తమరిని సత్యప్రవక్తగా చేసి పంపాడో ఆ దైవం సాక్షి! మేము తప్పకుండా మా భార్యాపిల్లల్ని దేన్నుండైతే మేము కాపాడుతున్నామో దాన్నుండి మిమ్మల్ని కూడా కాపాడుతాం- కాబట్టి ఓ దైవప్రవక్తా! మీరు మాచే ప్రమాణం తీసుకోండి.

4. *దీన్ని ఇమామె అహ్మద్ బిన్ హంబల్ గట్టి ఆధారంతో ఉల్లేఖించారు. దీన్ని ఇమామె హాకిమ్ మరియు ఇబ్నె హబ్బాన్లు ప్రామాణికమైందిగా ధృవీకరించారు. చూడండి,ముఖ్తసరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లా నజదీ, పుట. 155.*

దైవసాక్షి! మేము యుద్ధాల్లో పుట్టిపెరిగినవాళ్ళం. ఆయుధాలు మా ఆట వస్తువులు. మా తాత తండ్రుల నుండి వస్తున్న సంప్రదాయమే అది" అన్నారు.

హజ్రత్ కఅబ్ (ర) కథనం ప్రకారం, హజ్రత్ బర్అ (ర) ఈ మాటలు అనగానే, అబుల్ హైసమ్ బిన్ తైహాన్ ఆయన మాటలకు అడ్డుపడుతూ, "ఓ అల్లాహ్ ప్రవక్తా! మాకూ, మాకు చెందిన కొందరి-అంటే యూదుల - నడుమ ఒప్పందాల పగ్గాలు కొన్ని ఉన్నాయి. మేము ఆ పగ్గాలను తెగవేయడానికి సిద్ధంగా ఉన్నాం. అయితే అల్లాహ్ మీకు విజయం చేకూరిస్తే మమ్మల్ని వదిలేసి మీ జాతి వైపునకు మరలిపోరుగదా?" అని అడిగారు.

ఇది విన్న మహాప్రవక్త (స) చిరునవ్వు నవ్వుతూ, "(లేదు) మీ రక్తం నా రక్తం. మీరు నాశనం అవడం నేను నాశనమైనట్లే. నేను మీలోవాణ్ణి. మీరు నా వారు. మీరు ఎవరితో యుద్ధం చేస్తే నేనూ వారితో యుద్ధం చేస్తాను. మీరు ఎవరితో సంధి చేసుకుంటే నేనూ వారితో సంధి కుదుర్చుకుంటాను" అని సమాధానమిచ్చారు.[5]

ప్రమాదాలతో కూడిన బైత్‌ను తిరిగి మననం చేసుకోవడం

బైత్ షరతుల గురించిన చర్చ పూర్తి అయింది. బైత్ కోసం సిద్ధం అవుతున్న తరుణంలో గత సంవత్సరం, ఆ క్రిందటి సంవత్సరం కూడా హజ్ చేయడానికి వచ్చి ముస్లిములైన ఇద్దరు ప్రముఖులు, ఆ బైత్ వల్ల వారిపై పడబోయే బాధ్యతల్ని దాని సున్నితత్వాన్ని తెలుసుకునేందుకు, దాని వల్ల వచ్చే ప్రమాదాలను ఎదుర్కోవడానికి వారి జాతి త్యాగాలకు ఎంత వరకు సిద్ధంగా ఉన్నారో తెలుసుకునే ఉద్దేశ్యంతో లేచి నిలబడ్డారు. అంటే ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే బైత్ చేయండి అని హెచ్చరించి వారి నిశ్చితాభిప్రాయాన్ని తెలుసుకునే ఉద్దేశ్యంతో అన్నమాట.

ఇబ్నె ఇస్హాక్ కథనం ఇలా ఉంది:

ప్రజలు బైత్ కోసం ఓ చోట చేరినప్పుడు హజ్రత్ అబ్బాస్ (ర) బిన్ ఉబాదా బిన్ నజ్లా కల్పించుకొని, "మీకు తెలుసా! ఈయన (దైవప్రవక్త - స) మిమ్మల్ని ఏ మాటపై ప్రమాణం చేయిస్తున్నారో?" అని అడిగారు.

"ఔను, మాకు బాగా తెలుసు" అన్నారు వారు.

5. ఇబ్నె హష్షామ్-1/442.

"అయితే మీరు ఆయన ఎదుట ప్రమాణం చేసేది దుర్మార్గులతో యుద్ధం చేస్తామన్న విషయంపై. ఈ యుద్ధంలో మీ ఆస్తిపాస్తులు సర్వనాశన మయిపోతాయి, మీకు ప్రియమైన వారు మరణిస్తారు. ఇలా జరిగితే మీరా యన్ను వదిలేద్దాం అని అనుకుంటే మాత్రం ఇప్పుడే వదిలేసి వెళ్ళిపోండి. ఎందుకంటే ఆ తరువాత గనక మీరు అలా ప్రవర్తించారో ఇహపరలోకాలు రెంటిలోను చెడిపోగలరు జాగ్రత్త! దీనికి భిన్నంగా ఆ యుద్ధంలో మీ ఆస్తిపాస్తులు నాశనమైనా, మీ వారు హతులైనా సరే ఈయనతో ఈ రోజు చేస్తున్న ప్రమాణాన్నే నిలబెట్టుకుంటాం అనే దృఢసంకల్పంతో ఉంటే మాత్రం ఆయన్ను మీ వెంట తీసుకొని వెళ్ళండి. దైవసాక్షి! ఇది ఇహపరలోకాల సాఫల్యమే అవుతుంది."

"మేము మా ఆస్తిపాస్తుల వినాశనాన్ని, మా గౌరవనీయుల మరణాన్ని సయితం లెక్కజేయం. ఓ ప్రవక్తా! మా ఈ ప్రమాణానికి మేము కట్టుబడి ఉంటే దానికి బదులుగా మాకు లభించేది ఏది?" అని అడిగారు ఏక కంఠంతో.

'మీకు దీనికి ప్రతిగా స్వర్గం లభిస్తుంది" అన్నారు దైవప్రవక్త (స).

"అయితే చేయి చాచండి" అనగా మహాప్రవక్త (స) తన చేతిని ముందుకు చాచారు. వారంతా ఆ చేతిపై చేయివేసి ప్రమాణం చేశారు.[6]

హజ్రత్ జాబిర్ (ర) గారి ఉల్లేఖనం ప్రకారం :

"మేము బైత్ చేయడానికి లేవబోగా, ఈ డెబ్భై మందిలో పిన్న వయస్కుడు అయిన హజ్రత్ అస్అద్ బిన్ జురారా లేచి దైవప్రవక్త (స) గారి చేయి పట్టుకొని, ఓ యస్రిబ్ వాసులారా! కొంచెం ఆగండి. మేము ఈయన సన్నిధికి ఎంతో దూరం నుంచి ఈయన దైవప్రవక్త (స) అనే విశ్వాసంతో వచ్చాము. ఈ రోజు ఈయన్ను ఇక్కడ నుంచి తీసుకువెళ్ళడమంటే మొత్తం అరేబియా దేశంతో శత్రుత్వం కొనితెచ్చుకోవడం. మీ సర్దారుల మరణాన్ని ఖడ్గాల వ్రేటులను భరించడమే అవుతుంది. కాబట్టి ఇదంతా మీరు భరించగలిగితేనే ఈయన్ను వెంటబెట్టుకొని తీసుకుని వెళ్ళండి. మీ ప్రతిఫలం అల్లాహ్ దగ్గర పదిలంగా ఉంది. మీకే గనక మీ ప్రాణాలు తీపి అయితే ఈయన్ను ఇక్కడే వదలి పెట్టండి. అల్లాహ్ సమక్షంలో ఇదే సాకు పని చేయగలదు." [7]

---

6. ఇబ్నె హష్షామ్-1/446. *7. ముస్నదె అహ్మద్.*

ప్రమాణం పూర్తి అయింది

బైత్ (ప్రమాణం)కు సంబంధించిన షరతులన్నీ ఇదివరకే నిర్ణయించు కోవడం జరిగింది. ఆ ప్రమాణానికి సంబంధించిన సూక్ష్మతను కూడా గ్రహిం చడం జరిగింది. ఇప్పుడు దానికి మరింత బలం చేకూరిన తరువాత అందరూ కలసి అస్అద్ బిన్ జురారాతో, "ఇక మీ చేతిని ప్రక్కకు తీయండి, దైవసాక్షి! మేము ఈ బైత్‌ను ఏమాత్రం వదలలేము, దాన్ని త్రెంచనూ లేము"[8] అని అన్నారు.

వీరు ఇచ్చిన సమాధానం, హజ్రత్ అస్అద్ బిన్ జురారా (ర)ను తృప్తి పరచింది. తన జాతి ఈ మార్గంలో ప్రాణాలను అర్పించడానికి ఎంతవరకు సిద్ధంగా ఉంది అనే విషయం ఆయనకు తెలిసిపోయింది- నిజం చెప్పాలంటే, హజ్రత్ అస్అద్ బిన్ జురారా, హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్‌తో కలసి మదీనాలో ఇస్లామ్ ధర్మవ్యాప్తికి సాధ్యమైనంత కృషి చేసినవారు. ఈ బైత్‌ను చేసేవారికి ఆయన ఓ విధంగా ధార్మిక నాయకుడు కూడాను- అందుకనే అందరికంటే ముందు ఆయనే దైవప్రవక్త (స) చేయి మీద చేయివేసి ప్రమాణం చేశారు. ఇబ్నె ఇస్హాక్, బనూ నజ్జార్ కథనాన్ని ఉటంకిస్తూ, "దైవప్రవక్తతో చేయి కలిపిన మొట్టమొదటి వ్యక్తి హజ్రత్ అబూ అమామా అస్అద్ బిన్ జురారా (ర)యే.[9] ఆ తరువాత ఒక్కొక్కరుగా బైత్ చేశారు" అని అంటారు. హజ్రత్ జాబిర్ (ర)గారి ఉల్లేఖనంలో, "మేము ఒకరి తరువాత ఒకరం లేచి మహాప్రవక్త (స)తో ప్రమాణం చేశాము. దానికి బదులుగా ఆయన (స) మాకు స్వర్గం శుభవార్తను అందించారు."[10]

ఇక మిగిలిపోయినవారు ఇద్దరు మహిళలు. వారితో మహాప్రవక్త (స) కేవలం నోటి పలుకుల ద్వారానే బైత్ చేశారు. ఆయన (స) ఎప్పుడూ ఏ స్త్రీ చేయి తాకలేదు. [11]

పన్నెండు మంది సందేశ ప్రచారకుల ఎన్నిక

బైత్ పూర్తి అయింది. ఆ తరువాత వారి ముందు దైవప్రవక్త (స) ఓ ప్రతిపాదనను ఉంచారు. దాని ప్రకారం వారందరూ కలసి ఓ పన్నెండు మంది

---

8. ముస్నదె అహ్మద్.
9. ఇబ్నె హష్షామ్-1/447. *10. ముస్నదె అహ్మద్.*
11. సహీ ముస్లిమ్- స్త్రీలతో బైత్ చేసే విధానం అనే అధ్యాయం, 2/131.

బాధ్యుల్ని ఎన్నుకోవాలని, వారు ఇక నుండి తమ జాతి తరఫున పూర్తి బాధ్య తను వహిస్తూ బైత్ షరతుల్ని అమలుచేయాలని సెలవిచ్చారు. మహా ప్రవక్త (స) చేసిన ఈ ప్రతిపాదనకు వారు ఆ పన్నెండుగురిని వెంటనే ఎన్నుకున్నారు. వారిలో తొమ్మిది మంది ఖజ్రజ్ తెగకు చెందినవారుకాగా ముగ్గురు అవస్ తెగకు చెందినవారు.

ఖజ్రజ్ తెగ బాధ్యులు

1. అస్అద్ బిన్ జురారా బిన్ అదస్
2. సఅద్ బిన్ రబీ బిన్ అమ్రూ
3. అబ్దుల్లా బిన్ రవాహా బిన్ సఅలబా
4. రాఫె బిన్ మాలిక్ బిన్ అజ్లాన్
5. బరాఅ బిన్ మారూర్ బిన్ సఖర్
6. అబ్దుల్లా బిన్ అమ్రూ బిన్ హిరామ్
7. ఉబాదా బిన్ సామిత్ బిన్ ఖైస్
8. సఅద్ బిన్ ఉబాదా బిన్ దలీమ్
9. మున్జిర్ బిన్ అమ్రూ బిన్ ఖైస్

అవస్ తెగ బాధ్యులు

1. ఉసైద్ బిన్ హుజైర్ బిన్ సమాక్
2. సఅద్ బిన్ ఖైసమా బిన్ హారిస్
3. రిఫాఅ బిన్ అబ్దుల్ మున్జిర్ బిన్ జుబైర్.[12]

ఈ పన్నెండుగురు బాధ్యులను ఎన్నుకున్న తరువాత, మహాప్రవక్త (స) ఆ నాయకులు మరియు బాధ్యులకు తానే నాయకుడైనందున, వారితో మరో ప్రమాణాన్ని తీసుకోవడం జరిగింది. దాని ప్రకారం వారినుద్దేశించి ఆయన, "మీరు మీ జాతి మొత్తానికి చెందిన వ్యవహారాలను నడుపవలసి ఉంది. హజ్రత్ ఈసా (అ.స.) హవారీలు ఆయన తరఫున బాధ్యులుగా ఉన్నారు. నేనూ నా జాతి ముస్లిముల తరఫున బాధ్యుణ్ణి" అని అన్నారు. దానికి వారంతా 'ఔను' అని సమాధానమిచ్చారు.[13]

12. కొందరు జుబైర్‌ను జునైర్ అని రాశారు. సీరత్ చరిత్రకారులు 'రిఫాఅ'కు బదులు 'అబుల్ హైసమ్ బిన్ తైహాన్' పేరును రాశారు.
13. ఇబ్నె హిషామ్-1/443, 444, 445.

షైతాన్ ఈ ఒప్పందాన్ని బహిర్గతం చేయడం

ఒప్పందం జరిగి అందరూ ఇక వెళ్ళడానికి సిద్ధపడుతూ ఉండగానే ఓ షైతాన్‌కు ఈ విషయం తెలిసిపోయింది. ఇది ఒప్పందం జరిగిన తరువాత చివరి ఘడియల్లో తెలిసిన విషయం. కాబట్టి షైతాన్‌కు ఈ వార్త ఖురైష్‌కు అందించడానికి, వారంతా మూకమ్మడిగా ముస్లిములపై విరుచుకుపడడానికి వీలుచిక్కలేదు. అందుకని ఆ షైతాన్, ఆ కొండ లోయలోని ఓ ఎత్తయిన ప్రదేశాన నిలబడి పెద్ద పెట్టుగా అరిచాడు. ఆ అరుపును బహుశా ఇప్పటి వరకు ఎవరూ వినలేదేమో. అతను పెద్దగా అరుస్తూ, "ఓ గుడారవాసుల్లారా చూడండి! ఈ సమయంలో ధర్మభ్రష్టులంతా ముహమ్మద్ (స)తో సమావేశమై ఉన్నారు. మీతో యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నారహో!" అని అందరిని సావధానపరిచాడు.

ఇది విన్న మహాప్రవక్త (స), "ఇతను ఈ కొండ లోయకు చెందిన షైతాను. ఓ దైవ శత్రువా! విను, ఇక నేను నీ పని పట్టడానికి త్వరలోనే సిద్ధపడ బోతున్నాను" అంటూ ముస్లిములకు వారి వారి గుడారాల్లోనికి వెళ్ళిపొమ్మని సలహా ఇచ్చారు.[14]

ఖురైష్‌పై దాడికి అన్సారుల సంసిద్ధత

ఈ షైతాన్ అరపుల్ని విన్న హజ్రత్ అబ్బాస్ (ర) బిన్ ఉబాదా బిన్ నజ్లా, "దైవప్రవక్తా! తమరిని సత్యమిచ్చి ప్రభవింపజేసిన ఆ దైవం సాక్షి! తమరు తలిస్తే రేపే మినా వాసులపై మా ఖడ్గాలను ఝుళిపించగలం" అని అన్నారు.

"లేదు! మనకు ఇంకా ఆ ఆదేశం లభించలేదు. మీరు మీ గుడారాలకు వెంటనే వెళ్ళిపొండి" అని సెలవిచ్చారు.

ఆ తరువాత అందరూ ఎవరికీ తెలియకుండా వెళ్ళి గుడారాల్లో నిద్ర పోయారు. చివరికి తెల్లారిపోయింది.[15]

యస్రిబ్ స్థితిమంతుల ఎదుట ఖురైష్ నిరసన

ఈ వార్త ఖురైష్ చెవుల్లో పడిపోయింది. వారు మనస్తాపానికి గురిఅయి తల్లడిల్లనారంభించారు. ఇలాంటి బైత్ వల్ల బయల్పడే పరిణామాలు వారి ధన ప్రాణాలను సైతం హరించగలవు అని వారికి బాగా తెలియడమే దానికి

14. జాదుల్ ముఆద్-2/51.
15. ఇబ్నె హిషామ్-1/448.

కారణం. తెల్లవారగానే వారి నాయకులు, పెద్దలు అందరూ కలసి ఓ పెద్ద బృందంగా ఏర్పడి ఈ బైత్‌కు వ్యతిరేకంగా నిరసన తెలపడానికిగాను యస్రిబ్ గుడారాల వైపునకు బయలుదేరారు. అక్కడకు వెళ్ళి వారు ఇలా నిరసన మొదలెట్టారు.

"ఖ్రజజ్ ప్రజలారా! మీరు మా ఈ మనిషి ముహమ్మద్ (స)ను మా నడుమ నుంచి తప్పించి వెంట తీసుకువెళ్ళడానికి వచ్చారన్న విషయం మాకు తెలిసింది. మాతో యుద్ధం చేయడానికి ఇతని చేతి మీదుగా ప్రమాణం కూడా చేశారు. అరబ్బులలోని ఏ తెగతోనైనా మేము యుద్ధం చేయడానికి వెనుకాడం. కాని మీతో యుద్ధం చేయడం అంటే మాకు అంత ఇష్టంగా లేదు"[16] అని అన్నారు.

ఖ్రజజ్‌కు చెందిన బహుదైవారాధకులకు ఈ బైత్ విషయం బొత్తిగా తెలియదు. ఎందుకంటే ఈ బైత్ రహస్యంగా, రాత్రికిరాత్రే చీకటిలో జరిగిన బైత్ కాబట్టి ఈ బహుదైవారాధకులు అల్లాహ్‌పై ఒట్టువేసుకుంటూ అలాంటిది ఏదీ జరగలేదని, వారికి ఈ విషయం బొత్తిగా తెలియదని నమ్మబలికారు. చివరికి ఈ ఖురైష్ ప్రతినిధి బృందం అబ్దుల్లా బిన్ ఉబై ఇబ్నె సలూల్ దగ్గరికి వెళ్ళింది. అతనూ, "ఇది పూర్తిగా అబద్ధం. అలా జరగనేలేదు. అసలు జరగడానికి కూడా వీల్లేదు. నా జాతి నన్ను కాదని అలా చేయనేచేయదు. నేను యస్రిబ్‌లో ఉన్నా, నన్ను సంప్రదించకుండా నా జాతి అలా చేయజాలదు" అని చెప్పాడు.

ఇక ముస్లిముల విషయానికొస్తే, వారు ఒకరిని ఒకరు దొంగచూపులతో చూసుకుంటూ ఏమీ తెలియనట్లు మిన్నకుండిపోయారు. వారిలో ఏ ఒక్కడు కూడా అవును అని అనలేదు. చివరికి ఖురైష్ నాయకులు, ఈ యస్రిబ్ బహుదైవారాధకులు చెప్పేదే సరైనది అని నమ్మి తిరిగి వెళ్ళిపోయారు.

నిజం తెలిసిన తరువాత బైత్ చేసిన వారిని వెన్నాడడం

ఈ వార్త అసత్యం అనే ధోరణితోనే మక్కాకు చెందిన వారు వెనక్కు మళ్ళిపోయారు. కాని ఈ విషయంలో వారు నిజాన్ని తెలుసుకొనే ప్రయత్నం మానలేదు. చివరికి ఈ వార్త నిజమే అన్న విషయం వారికి తెలిసిపోయింది. బైత్ జరిగిందని వారికి నమ్మకంగా తెలిసి పోయింది. అయితే ఈ వార్త తెలిసిందెప్పుడు? హజ్ యాత్రికులు తమ స్వస్థలాలకు తిరిగి వెళ్ళిపోయిన

16. ఇబ్నె హష్షామ్-1/448.

తరువాత. అందుకని వారు గుర్రపు రౌతుల్ని వేగంగా యస్రిబ్ వారిని పట్టుకోవడానికి పరుగెత్తించారు. అప్పటికే ఆ అవకాశం చేజారిపోయింది. అయితే వారు సఅద్ బిన్ ఉబాదా మరియు మున్జిర్ బిన్ అమ్రూలిద్దరిని కనుగొనగలిగారు. వారిని పట్టుకోడానికి ప్రయత్నించారు. కాని మున్జిర్, వారి బారినపడకుండా వేగంగా పారిపోయి తప్పించుకున్నారు. సఅద్ బిన్ ఉబాదా మాత్రం పట్టుబడ్డారు. ఆయన చేతుల్ని వెనక్కు విరిచి ఒంటె అంబారీకి వేసికట్టి చితక బాదుతూ, తల వెంట్రుకల్ని పీకుతూ మక్కాకు తీసుకువచ్చారు. కాని అక్కడ ముత్‌యిమ్ బిన్ అద్దీ, హారిస్ బిన్ హరబ్ బిన్ ఉమయ్యాలు కలసి వారిని విడిపించారు. ఎందుకంటే వారిరువురి వ్యాపార బిడారాలు సఅద్ (ర)గారి సంరక్షణలో మదీనా నుండి బయటకు వెళ్ళేవి. ఇటు అన్సార్ (ముస్లిములు), మక్కాపై దాడిచేసి వారిని రక్షించుకురావాలనే మంతనాలు చేస్తుండగా వారిద్దరు అగుపడగా ఆ ప్రయత్నాన్ని మానుకోవడం జరిగింది. అందరూ కలసి క్షేమంగా మదీనా చేరారు.[17]

ఇది అఖబాకు చెందిన రెండవ బైత్. దీన్ని 'బైతె అఖబయె కుబ్రా' అని కూడా పిలుస్తారు. పరస్పర అవగాహన, పరస్పర ప్రేమ, చెల్లాచెదురైవున్న ముస్లిముల నడుమ పరస్పర సహాయ సహకారాలు, పరస్పర నమ్మకం, ప్రాణాలొడ్డి ఒకరినొకరు కాపాడుకునే భావన మరియు శౌర్యప్రతాపాల వాతావరణంలో జరిగిన బైత్ (ప్రమాణం) ఇది. కాబట్టి యస్రిబ్ ముస్లిముల హృదయాల్లో మక్కాలో కష్టాలు అనుభవిస్తున్న తమ బలహీన ముస్లిముల ఎడల ప్రేమ జనించడం సహజం. వారి సోదరులను ఆదుకోవాలనే తపన, వారిపై అత్యాచారాలు సాగించే ముష్కరుల ఎడల విద్వేషం పెల్లుబుకుతున్నాయి వారిలో. వారి హృదయాలు తాము ఇదివరకు చూడనటువంటి ధార్మిక సోదరుల ఎడల ప్రేమతో నిండిపోయాయి.

ఈ భావోద్రేకాలు తాత్కాలికమైన భావోద్రేకాలు కావు, కాలక్రమేణ మటుమాయమైపోవడానికి. వీటికి మూలం అల్లాహ్‌పై వారి నమ్మకం, ప్రవక్త ఎడల వారి గౌరవం మరియు దైవగ్రంథం ఎడల వారి అచంచల విశ్వాసాలు. అంటే జులుము, హింస, అత్యాచారాలు జరిపే అతి పెద్ద శక్తి ముందు కూడా తలవంచడానికి సిద్ధంగా లేని విశ్వాసమది.

17. జాదుల్ ముఆద్-2/51,52; ఇబ్నె హష్షామ్-1/448, 450.

హిజ్రత్‌కు ఉపక్రమించిన ప్రథమ బృందాలు

రెండవ 'బైతె అఖబా' సంపూర్ణమైంది. ఇస్లామ్, దైవతిరస్కారం మరియు అజ్ఞానంతో నిండిన అనంత ఎడారిలో తనకంటూ ఓ స్థలాన్ని పొందడంలో కృతకృత్యమైంది- ప్రచారం ఆరంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఇస్లాం సాధించిన విజయాల్లో ఇది ప్రధానమైన విజయం - మహాప్రవక్త (స) ముస్లిము లకు, ఇక తమ క్రొత్త కేంద్రం వైపునకు హిజ్రత్ చేసి వెళ్ళడానికి అనుమతి నొసగారు.

హిజ్రత్ చేయడం అంటే, కేవలం తమ ప్రాణాలకు ముప్పు వాటిల్ల బోతుందని తలచి తమ ప్రయోజనాలను, ధనాన్ని, ఇండ్లు వాకిళ్ళను వదిలేసి మరో చోటికి తరలిపోవడం అన్నమాట. ప్రయాణ ఆరంభం నుండి గమ్యం చేరే వరకు ఎక్కడైనా వారు హతమార్చబడగలరనే భయంతో బయలుదేరవలసి ఉంటుంది. అదీకాక ఈ ప్రయాణం కూడా పూర్తి నమ్మకంగా చేస్తున్న ప్రయాణం కాదు. మునుముందు మరెన్ని కష్టాలు, కడగండ్లు పొంచి ఉన్నాయో వారికి తెలియదు.

ముస్లిములందరికీ ఈ విషయం బాగా తెలుసు. అయినా వారు హిజ్రత్‌ను ప్రారంభించారు. అటు బహుదైవారాధకులు కూడా వారి ప్రయాణంలో అడ్డంకులు పెట్టనారంభించారు. ఇలా ముస్లిములేగనక తమ స్వస్థలాన్ని వదిలి వెళ్ళిపోతే వారికి కూడా ప్రమాదాలు ఏర్పడతాయని వారి బాధ. మచ్చుకు ఈ హిజ్రత్‌కు సంబంధించిన కొన్ని సంఘటనలను ఇక్కడ చెప్పాలనుకుంటున్నాము.

1. మొట్టమొదటి ముహాజిర్ (హిజ్రత్ చేసిన వ్యక్తి) హజ్రత్ అబూ సల్మా (ర). ఆయన బైతె అఖబయె కుబ్రాకు ఒక సంవత్సరం ముందే మక్కాను వదిలి వెళ్ళిపోయిన వ్యక్తి. ఆయన వెంట ఆయన భార్యాపిల్లలూ ఉన్నారు. బయలు దేరేముందు ఆయన అత్తగారి వైపు వారు, "ఇదిగో నీ ప్రాణం మాత్రమే నీది.

దాన్ని గురించి మేమేమీ మాట్లాడం. కాని మా ఇంటి ఆడపడుచును నీ వెంట పంపడానికి ఎలా సిద్ధపడతాం. ఆమెను ఊరు ఊరు, నగరం నగరం తిప్పుకుంటూ తిరుగుతావా?" అంటూ భార్యను ఆయన వెంట పోకుండా ఆపేసుకున్నారు. ఇది చూసిన అబూ సల్మా ఇంటి వారికి కూడా కోపం వచ్చింది. "ఓహో! మీరు మీ కుమార్తెను మా అబ్బాయి నుండి లాక్కొంటే మేము చూస్తూ ఊరుకునేరకం కాదు. మేము కూడా ఆమె కుమారుణ్ణి ఆమె నుండి లాక్కోగలం" అంటూ ఉభయ కుటుంబాలవారు ఆ పిల్లవాణ్ణి తమ వైపునకు లాక్కోవడం వల్ల పాపం పసివాని చేయి కాస్తా ఊడివచ్చేసింది. అబూ సల్మా కుటుంబీకులు అతణ్ణి తమ వెంట తీసుకువెళ్ళిపోయారు. చెప్పొచ్చిందేమి టంటే, అబూ సల్మా ఒక్కరే మదీనా వైపునకు బయలుదేరి వెళ్ళిపోయారు. ఆ తరువాత ఉమ్మె సల్మా, అంటే అబూ సల్మా భార్య పరిస్థితి వర్ణనాతీతం. ఆమె అటు భర్త వియోగం ఇటు కన్నకొడుకు తనకు దూరం అయిపోవడం వలన ఆ సంఘటన జరిగిన 'అబ్తఖ్' అనే ప్రదేశానికి వెళ్ళి ప్రొద్దుక్రుంకే వరకు ఏడుస్తూ కూర్చునేవారు. అలా ఒక సంవత్సరం గడిచిపోయింది. చివరికి ఆమె కుటుంబానికే చెందిన వ్యక్తి ఎవరికో జాలి కలిగింది.

"పాపం ఈ అభాగ్యురాలిని ఎందుకు పొనివ్వరూ? అనవసరంగా మీరు ఆమెకు కొడుకు దక్కకుండా చేశారు" అని చెప్పి ఒప్పించాడు ఆమె తల్లిదండ్రుల్ని. ఆ తరువాత ఆమెను భర్త వద్దకు మదీనాకు వెళ్ళిపొమ్మని చెప్పారు. ఉమ్మె సల్మా తన కుమారుణ్ణి అత్తగారింటి నుండి తీసుకొని మదీనా దారి పట్టారు. అల్లాహు అక్బర్! దాదాపు అయిదు వందల కిలోమీటర్ల ప్రయాణం. తోడు ఎవ్వరూ లేరు. 'తన్ఈమ్' అనే ప్రదేశానికి చేరిన తరువాత అక్కడ ఆమెకు ఉస్మాన్ బిన్ అబీతల్హా కనబడ్డాడు. వృత్తాంతం విన్న ఉస్మాన్ ఆమెను మదీనాకు చేరుద్దామని వెంటబెట్టుకుని బయలుదేరాడు. 'ఖుబా' గ్రామం కనబడగానే, నీ భర్త ఈ బస్తీలోనే ఉన్నాడు. వెళ్ళు, అల్లాహ్ నీకు శుభం కలిగిస్తాడు అని చెప్పి మక్కాకు తిరిగివచ్చాడు.[1]

2. హజ్రత్ సుహైబ్ (ర) హిజ్రత్ చేసి వెళ్ళిపోదామనుకుంటే, ఖురైష్ ప్రజలు ఆయనతో, "నీవు మా దగ్గరకు వచ్చినప్పుడు ఒక బికారివి మాత్రమే. ఇక్కడికి వచ్చిన తరువాతే నీవు ధనవంతుడు అయిపోయావు. ఇక నీవు నీ

1. ఇబ్నె హిషామ్-1/468,469,470.

ప్రాణాలు, నీ ధనం రెండు తీసుకొని వెళ్ళాలనుకుంటే మాత్రం అది జరిగే పని గాదు" అన్నారు. దానికి సుహైబ్, "సరే! నేను నా సొమ్మునంతా వదిలేసి వెళ్ళాలనుకుంటే నన్ను వదిలేస్తారా?" అని అడిగారు. "అవును, వదిలేస్తాం" అని అనగా, హజ్రత్ సుహైబ్(ర), "సరే నా సొమ్ము డబ్బు అంతా మీదే" అని వెళ్ళిపోయారు. ఈ విషయం దైవప్రవక్త (స)కు తెలిసింది. దానికి ఆయన్ను మెచ్చుకుంటూ సుహైబ్ పెద్ద లాభాన్నే ఆర్జించాడు, సుహైబ్ (ర) పెద్ద లాభాన్నే మూటకట్టుకున్నాడు అని సెలవిచ్చారు.[2]

3. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర), అయ్యాష్ బిన్ అబీ రబీయా, హష్షామ్ బిన్ ఆస్ బిన్ వాయిల్ ఈ ముగ్గురూ కలసి, ఫలానా చోట కూడుదామని, అటు నుండే మదీనాకు హిజ్రత్ చేసి వెళ్ళిపోదామని అనుకున్నారు. హజ్రత్ ఉమర్ (ర) మరియు హజ్రత్ అయ్యాష్ (ర) అనుకున్న తీరుగా అక్కడికి వచ్చి చేరగలిగారు. కాని హష్షామ్ మాత్రం పట్టుబడిపోయారు.

ఆ ఇద్దరు కలసి మదీనాకు చేరి 'ఖుబా' అనే ప్రదేశంలో విడిది చేశారు. అబూ జహల్, అతని సోదరుడు హారిస్ ఇద్దరు కలసి అయ్యాష్ వద్దకు వచ్చారు. ఈ ముగ్గురినీ కన్నతల్లి ఒక్కరే. ఈ ఇద్దరు అయ్యాష్‌తో, "నీ తల్లి, నిన్ను చూడనంత మట్టుకు తల దువ్వనని, ఎండలో నుండి నీడలోనికి పోనని శపథం చేసింది" అని అన్నారు. అయ్యాష్ (ర)కు తన తల్లిపై జాలి కలిగింది. హజ్రత్ ఉమర్ (ర) ఈ వాలకం చూసి అయ్యాష్ (ర)తో, "దైవసాక్షి! చూడు అయ్యాష్! వీళ్ళు నిన్ను మోసగించి వెనక్కు తీసుకొనిపోవడానికే వచ్చారు. నీ ధర్మాన్ని నీకు దక్కకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు జాగ్రత్త! దైవసాక్షి! నీ తల్లి తలలో పేలుపడి ఆమెను బాధిస్తూ ఉంటే తల దువ్వకోక ఏం చేస్తుంది? మక్కా ఎండ ఏ కాస్త తగిలినా ఆమె నీడలోనికి వెళ్ళిపోవడం ఖాయం" అని ఆయన్ను పోకుండా నిలువరించడానికి ప్రయత్నించారు. కాని అయ్యాష్‌కు హజ్రత్ ఉమర్(ర) గారి హితోక్తులు చెవికెక్కలేదు. ఆయన తన తల్లి చేసిన శపథాన్ని మాన్పించాలనే ఉద్దేశ్యంతో, వారి వెంట వెళ్ళిపోడానికే సిద్ధపడ్డారు. "అయితే, నీవు నీ మాటనే నెగ్గించుకోదలిస్తే, ఇదిగో నా పెంటి ఒంటె. ఇది ఎంతో మేలైనది, వేగంగా నడిచేదీను. దీని వీపును అంటిపెట్టుకొని ఉండు. ఏ మాత్రం అనుమానం కలిగినా పారిపోయి వచ్చేయి" అంటూ తన ఒంటెను అయ్యాష్‌కు ఇచ్చారు హజ్రత్ ఉమర్ (ర).

2. ఇబ్నె హష్షామ్-1/477.

అయ్యాష్ ఒంటెపైకెక్కి వారిద్దరి వెంట బయలుదేరారు. దారిలో అబూ జహల్, "చూడు సోదరా! నా ఒంటె మొండిదైపోయింది. నన్ను నీ ఒంటెపై ఎక్కించుకోవా?" అని అడిగాడు. సరే అంటూ అయ్యాష్ తన ఒంటెను కూర్చోబెట్టారు. తరువాత ఆ ఇద్దరు అన్నదమ్ములు కూడా వారి ఒంటెల్ని కూర్చోబెట్టి క్రిందికి దిగారు. ఆ ఇద్దరు ఒక్కసారే అయ్యాష్‌పై విరుచుకుపడి ఆయన్ను త్రాళ్ళతో బంధించేశారు. ఆ స్థితిలోనే ఆయన్ను మక్కాకు తెచ్చి, "ఓ మక్కా వాసులారా! మేము ఇతని ఎడల ప్రవర్తించినట్లే మీరు కూడా తక్కిన ముస్లిముల ఎడల ప్రవర్తించండి" అంటూ ప్రకటించారు.[3]

హిజ్రత్ చేయడానికి సమాయత్తమవుతున్న ముస్లిముల గురించి తెలియగానే, మక్కా ముష్రిక్‌లు వారి ఎడల ప్రవర్తించే తీరుకు సంబంధించిన మూడు ఉదాహరణలు ఇవి. అయినప్పటికి ముస్లిములు ఒకరి తరువాత ఒకరు హిజ్రత్ చేయడం ఆపలేదు. బైతె అఖబయె కుబ్రా జరిగిన రెండు నెలల కొన్ని రోజుల తరువాత మక్కాలో దైవప్రవక్త (స), హజ్రత్ అబూ బక్ర్ (ర) మరియు హజ్రత్ అలీ (ర) తప్ప మరెవ్వరూ మిగిలి ఉండలేదు. కాని ముష్రిక్‌లు బలవంతంగా ఆపి ఉంచిన ముస్లిములు మాత్రమే అక్కడ ఉండిపోవలసి వచ్చింది. హజ్రత్ అబూ బక్ర్ (ర) మరియు హజ్రత్ అలీ (ర)లు మాత్రం మహాప్రవక్త (స) గారి ఆదేశం మేరకే అక్కడ ఉండిపోవడం జరిగింది. మహాప్రవక్త (స) కూడా తన ప్రయాణం కోసం సిద్ధమై దైవాదేశం కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇదివరకే సంసిద్ధులై కూర్చున్నారు.[4]

3. హష్షామ్ మరియు అయ్యాష్‌లు దైవతిరస్కారుల చెరలో అలాగే పడి ఉండవలసి వచ్చింది. దైవప్రవక్త (స) హిజ్రత్ చేసి మదీనాకు వెళ్ళిన తరువాత ఆయన ఓ రోజు, నా కోసం హష్షామ్ మరియు అయ్యాష్‌ను ఎవరు విడిపించుకొని వస్తారు? అని అడిగారు. వలీద్ బిన్ వలీద్ ముందుకొచ్చి నేను వారిని విడిపించుకొని రాగలను దైవప్రవక్తా! అని అన్నారు. ఆయన మక్కాకు రహస్యంగా వెళ్ళి ఓ స్త్రీ వారిద్దరికి భోజనం తీసుకొని వెడుతుండగా చూసి ఆమెకు తెలియకుండా అక్కడికి చేరుకున్నారు. వారిద్దరు కప్పులేని ఓ ఇంట బంధించబడి ఉన్నారప్పుడు. చీకటి పడగానే హజ్రత్ వలీద్ గోడ దూకి వారిద్దరి వద్దకు వెళ్ళారు. వారి కాళ్ళల్లో వేసిన బేడీలు కోసి గోడ దూకి మదీనాకు పారిపోయి వచ్చారు. ఇబ్నె హష్షామ్-1/474, 476. హజ్రత్ ఉమర్ ఇరవై మంది సహాబాలతో కలసి హిజ్రత్ చేసినట్లు సహీ బుఖారి ఉల్లేఖనంలో ఉంది. సహీ బుఖారి-1/558.

4. జాదుల్ ముఆద్-3/52.

సహీ బుఖారీలో హజ్రత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, మహాప్రవక్త (స) ముస్లిములనుద్దేశించి, "మీరు హిజ్రత్ చేసి వెళ్ళవలసిన ప్రదేశం నాకు చూపించబడింది. ఇది లావా పర్వతాల నడుమన ఉన్న ప్రదేశం. అది ఒయాసిస్సులతో నిండివున్న ప్రాంతం" అని అన్నారు. ఆ తరువాతే ముస్లిములు మదీనా వైపునకు హిజ్రత్ చేసి వెళ్ళనారంభించారు. అబీసీనియాకు వలస వెళ్ళిన వారు కూడా మదీనాకే తిరిగి వచ్చేశారు. హజ్రత్ అబూ బక్ర్ (ర) కూడా ప్రయాణ సన్నాహంతో సిద్ధంగా ఉన్నప్పటికీ, దైవప్రవక్త (స) ఆయన్ను తనకు కూడా హిజ్రత్ చేసే అనుమతి లభించే వరకు వేచి ఉండమని చెప్పడం జరిగింది. దానికి అబూ బక్ర్ (ర), "దైవప్రవక్తా! అలా జరుగుతుందనే ఆశ మీకుందా?" అని అడిగితే, "అవును" అని సమాధాన మిచ్చా రాయన (స). ఆ తరువాత హజ్రత్ అబూ బక్ర్(ర) దైవప్రవక్త (స) వెంట హిజ్రత్ చేసి వెళ్ళడానికి ఆగిపోయారు. ఆయన దగ్గర రెండు ఒంటెలు కూడా ఉన్నాయి. నాల్గు నెలల వరకు వాటికి తుమ్మ ఆకుల్ని మేపి బలిష్టమైనవిగా చేశారాయన.[5]

5. సహీ బుఖారి, ప్రవక్త (స) హిజ్రత్ అధ్యాయం-1/553.

దారున్నద్వాలో ఖురైషుల సమావేశం

సహాబా (ర) (దైవప్రవక్త (స)గారి అనుచరగణం) హిజ్రత్ చేసి వెళ్ళిపోవడం, భార్యాపిల్లలను, ఆస్తిపాస్తులను సైతం విడిచిపెట్టి, అవస్, ఖజ్రజ్ తెగలు ఉంటున్న ప్రాంతానికి చేరడం, మక్కాలోని బహుదైవారాధకుల్లో సంచలనాన్ని రేకెత్తించింది. ప్రతివాడూ ఈ విషయం గురించే ఆలోచిస్తున్నాడు. ఇప్పటివరకు కలగనంత బాధ వారికి కలిగింది. ఇక వారి ముందు ఓ గొప్ప ప్రమాదం ముంచుకు రాబోతోందని వారి ఈ బహుదైవారాధన, దాని వల్ల వారికి కలిగే ఆర్థిక ప్రయోజనాలు, వారి సంఘటితత్వానికి పెద్ద సవాలుగా మారిపోయిందని తలపోయనారంభించారు.

దైవప్రవక్త ముహమ్మద్ (స)కు మహోన్నతమైన నాయకత్వపు శక్తి సామర్థ్యాలు ఉన్న యదార్థం మక్కా బహుదైవారాధకులకు బాగా తెలుసు. అదేకాదు, ఆయన అనుచరగణానికి, ధైర్యస్థయిర్యాలు, దైవప్రవక్త(స) కోసమని తమ ప్రాణాలనైనా అర్పించే భావన ఎంత తీవ్రమైందో అన్న విషయం కూడా వారికి తెలిసినదే. ఆపై, అవస్ మరియు ఖజ్రజ్ తెగల్లోని తెగువ, యుద్ధ కౌశల్యం, ఈ ఉభయ తెగలకు చెందిన మేధావుల్లో ఏర్పడిన సామరస్య ధోరణి, అనేక ఏండ్లుగా ఆ తెగల్లో రాజుకుంటున్న విద్వేష వైషమ్యాల అగ్నిజ్వాలలు చల్లారిపోతున్న తీరు, మక్కా బహుదైవారాధకుల గుండెల్ని గడగడలాడించ నారంభించాయి.

యమన్ దేశం నుండి సిరియాకు, ఎర్ర సముద్రతీరం గుండా వెళ్ళేవారి వర్తక రహదారి ప్రక్కనే గల మదీనా నగరం, సైనికపరంగా ఎలాంటి కీలకమైన ప్రదేశంలో ఉందో వారికి బాగా తెలుసు. ఇదే కాకుండా, సిరియా దేశంతో మక్కావాసులు ప్రతి ఏటా చేసే వ్యాపారం రెండున్నర లక్షల బంగారు దీనారులకు సమానం. తాయెఫ్ వారు చేసే వ్యాపారం దానికి అదనం. ఈ వ్యాపారం అంతా ఆ మార్గం ప్రశాంత వాతావరణంపైన్నే ఆధారపడి ఉంది. మక్కావాసులు

ఆ మార్గం ఎలాంటి అడ్డంకులకు ఆలవాలం కాకుండా ఉండాలనే కోరుకునేవారు.

ఈ విషయాలన్నింటిని దృష్టిలో పెట్టుకొని చూస్తే, యస్రిబ్ (మదీనా)లో ఇస్లామీయ సందేశ ప్రచారం వ్రేళ్ళూనుకోవడం, మక్కావాసులకు యస్రిబ్ ప్రజలకు వ్యతిరేకంగా కాలుదువ్వడం వలన వచ్చిపడే ప్రమాదాలు ఎలా ఉండగలవో అర్థం చేసుకోవచ్చు. మక్కాలోని బహుదైవారాధకులకు ఇది బాగా తెలుసు. ఇది వారి మనుగడకే ఓ సవాలు. అందుకని వారు ఈ ప్రమాదాన్ని తప్పించుకోవడానికి సరియైన సమాధానాన్ని వెదుకనారంభించారు. ఈ ప్రమాదానికి అసలు కారకులు, ఇస్లామ్ సందేశ ప్రచార ధ్వజవాహకులైన ముహమ్మద్ (స) ఒక్కరే అన్న విషయం కూడా వారికి తెలుసు.

దీని కోసం బహుదైవారాధకులు, 'బైతె అఖబయె కుబ్రా' జరిగిన రెండున్నర నెలల తరువాత సఫర్ నెల 26వ తేదీ (దైవదౌత్య శకం 14, క్రీ.శ. సెప్టెంబర్ 12, 622) గురువారం[1] నాటి ఉదయమే [2] మక్కా పార్లమెంటు అయిన దారున్నద్వాలో చరిత్రలోనే ప్రమాదకరమైన సమావేశాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఈ సమావేశానికి సమస్త ఖురైష్ తెగలకు చెందిన నాయకులూ హాజరయ్యారు. సమావేశ చర్చనీయాంశం ఏమిటంటే, ఇస్లామియ ధ్వజ వాహకులైన హజ్రత్ ముహమ్మద్(స)ను హతమార్చి ఆ సందేశ ప్రచార జ్యోతిని ఒక్కసారే ఆర్పివేసే అంతిమ నిర్ణయాన్ని గైకొనడం.

ఈ ప్రమాదకరమైన సమావేశంలో హాజరైన ఆ తెగ సర్దారుల పేర్లు ఇవి:

1.	అబూ జహల్ బిన్ హష్షామ్	- బనీ మఖ్జూమ్ తెగ
2.	జుబైర్ బిన్ ముత్‌యిమ్, తైమా బిన్ అద్దీ హారిస్ బిన్ ఆమిర్	- బనీ నౌఫిల్ బిన్ అబ్దె మునాఫ్ తెగ

1. ఈ తేది, అల్లామా మన్సూర్‌పూరి రాసిన చరిత్రలో ఇచ్చిన పరిశోధన ఆధారంగా నిర్ణయించబడిన తేది. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/95, 97, 101; 2/471.
2. ఉదయాన్నే ఈ సమావేశం జరిగిందన్న విషయం, ఇబ్నె ఇస్‌హాక్ ఉటంకించిన ఉల్లేఖనం ఆధారంగానే. అందు, హజ్రత్ జిబ్రీల్ (అ.స.) దైవప్రవక్త (స) సన్నిధికి ఏతెంచి ఆ సమావేశం గురించి తెలియజేశారు. దానికితోడు హిజ్రత్ చేసి వెళ్ళే అనుమతి కూడా ఇచ్చారు, దీనికితోడు హజ్రత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనాన్ని కలుపుకుంటే మహాప్రవక్త (స) ఆ మధ్యాహ్నమే అబూ బక్ర్ (ర)గారి దగ్గరకు పోయి, నాకు వెళ్ళే అనుమతి లభించిందన్న విషయం అర్థం అవుతుంది - ఉల్లేఖనం వివరాలు ముందు రాబోతున్నాయి.

3.	షైబా బిన్ రబీయా, ఉత్బా బిన్ రబీయా, అబూ సుఫ్‌యాన్ బిన్ హరబ్	- బనీ అబ్దుష్షమ్స్ బిన్ అబ్దె మునాఫ్ తెగ
4.	నజ్రో బిన్ హారిస్	- బనీ అబ్దుద్దార్ తెగ
5.	అబుల్ బక్తరీ బిన్ హష్షామ్, జమ్‌ఆ బిన్ అస్‌వద్, హకీం బిన్ హిజామ్	- బనీ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా తెగ
6.	నబియా బిన్ హుజ్జాజ్, మంబా బిన్ హుజ్జాజ్	- బనీ సహెమ్ తెగ
7.	ఉమయ్యా బిన్ ఖల్ఫ్	- బనీ జమ్‌హా తెగ

అనుకున్న సమయానికి ఈ ప్రతినిధులు దారున్నద్వా చేరుకోగా, ఇబ్లీస్ (షైతాన్) ఓ సాధువు వేషంలో పైనుండి అంగవస్త్రం కప్పుకొని దారికి అడ్డంగా వచ్చి నిలబడ్డాడు. వాళ్ళంతా ఈ సాధుపుంగలెవరూ అని అనుకుంటూ ఉండగా, ఇబ్లీస్, "నేను 'నజద్' కు చెందిన ఓ షేఖ్‌ను, మీ పోగ్రామ్ గురించి విని ఇక్కడకు వచ్చాను. మీరు ఏమి మాట్లాడుకుంటారో విందామనుకుంటున్నాను. మీకు మంచి సలహాలను కూడా ఇవ్వగలను" అని అనగా, "సరే" అంటూ వారంతా అతణ్ణి లోనికి అనుమతించారు. ఇలా ఇబ్లీస్ ఆ సమావేశంలోకి వచ్చి కూర్చున్నాడు.

పార్లమెంటు చర్చ - దైవప్రవక్త (స)ను హతమార్చే తీర్మానం

అందరూ కూర్చున్న తరువాత ప్రతిపాదనలు, సలహాలు ఒక్కొక్కటిగా ముందుకు రానారంభించాయి. మొదట అబుల్ అస్వద్ ఓ ప్రతిపాదనను ప్రతిపాదిస్తూ, "ఈ వ్యక్తిని మనలో నుంచి వెళ్ళగొడదాం. మన నగరం నుంచి బహిష్కరిద్దాం. ఆ తరువాత అతనికీ, మనకూ ఎలాంటి సంబంధం ఉండదు. అతను ఎక్కడికి వెళ్ళిపోయినా వెళ్ళిపోవచ్చు. మనం మటుకు ఈ పీడను విరగడ చేసినవారమవుతాము. మనమంతా మునుపటిలా ఒక్కటై ఉండవచ్చు" అన్నాడు.

కాని నజదీ షేఖ్‌గా నటిస్తున్న ఇబ్లీస్ కల్పించుకొని, "లేదు, ఈ సలహా సరైన సలహా కాదు. ఇతని మాటలు ఎంత గొప్పవో, ఇతని పలుకులు ఎంత

మధురమైనవో, అతను ఎలా ప్రజల హృదయాలను ఆకట్టుకుంటున్నాడో మీకు తెలియనిదా? దైవసాక్షి! మీరే గనక అలా చేస్తే అతను అరేబియాకు చెందిన ఏ తెగలోనికైనా వెళ్ళి ఆ తెగవారిని తనకు విధేయులుగా చేసుకొని ఆ తరువాత మీపై దాడి చేయడనే నమ్మకం ఏమిటి? మిమ్మల్ని మీ నగరంలోనే త్రొక్కేసి తనకు ఇష్టమైన తరహాలో ప్రవర్తించడనే భరోసా ఏమిటి? ఇదికాక మరేదైనా సలహాను గురించి ఆలోచించండి" అన్నాడు.

అబుల్ బక్తరీ లేచి, "ఇతణ్ణి ఇనుప సంకెళ్ళతో కట్టి బంధించి బయట నుంచి తలుపులు మూసేద్దాం. ఆ తరువాత అతని మరణం కోసం నిరీక్షిద్దాం. ఇంతకు పూర్వం మనం కవులైన జుహైర్ మరియు నాబిగాను అలా చేయ లేదా?" అని సలహా ఇచ్చాడు.

తిరిగి ఆ నజదీ షేఖ్ కల్పించుకొని, "లేదు! దైవసాక్షి! ఇది కూడా సరి యైన సలహా కాదు. మీరే గనక అలా చేశారో, ఆ వార్త అతని అనుయాయు లకు తప్పక చేరుతుంది. మీపై దాడి చేసి వారు అతణ్ణి విడిపించుకువెళ్ళినా వెళ్ళగలరు. ఆ తరువాత తన సంఖ్యను పెంచి మీపై ప్రాబల్యాన్ని కూడా సంపాదించుకోగలడు- కాబట్టి ఈ సలహా కూడా సరైన సలహా కాదు. మరి దేన్నయినా ఆలోచించండి" అని పలికాడు.

ఈ రెండు ప్రతిపాదనలు పార్లమెంటులో వీగిపోయినందున మరో తీవ్రమైన ప్రతిపాదన ప్రవేశపెట్టబడింది. దీన్ని ఆ పార్లమెంటు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రతిపాదనను ప్రవేశపెట్టిన వాడు పెద్ద నేరస్తుడైన అబూ జహలే.

అతను తన ప్రతిపాదనను ప్రవేశపెడుతూ, "అతని విషయంలో నా సలహా ఒక్కటే, ఇది ఇప్పటిదాకా ఎవరికీ తట్టలేదు" అన్నాడు.

"అదేమిటీ అబుల్ హకమ్!" అడిగారు ఏకకంఠంతో.

"నా సలహా ప్రకారం, మనం మన తెగల్లో నుంచి, వంశంలో గొప్పవాడైన ఒక్కో యువకుణ్ణి ఎన్నుకుందాం. ప్రతి ఒకడి చేతికి పదునైన కరవాలాన్నిద్దాం. వారందరూ కలసి అతని వద్దకు వెళ్ళి మూకుమ్మడిగా, ఒకే వ్యక్తి ప్రహారం చేసి నట్లుగా అతనిపై వ్రేటువేయాలి. ఇలా మనకు అతడి నుండి శాంతి లభించ గలదు. ఫలితంగా ఆ హత్యకు సంబంధించిన రక్తపరిహారం కూడా అన్ని

తెగలపై పడుతుంది. బనూ అబ్దె మునాఫ్ మన తెగలన్నిటితో పోరాడలేరు. కాబట్టి రక్తపరిహారం వరకే ఆగిపోతారు. అలా మనం ముహమ్మద్ హత్యకు రక్తపరిహారం చెల్లిద్దాం.[3] ఏమంటారు?" అని అడిగాడు.

నజదీ షేఖ్, "అవును. ఈ యువకుడు ఇచ్చిందే సరైన సలహా. మరేదైన ప్రతిపాదన ఉంటే అది ఇదే సుమా. తక్కిన ప్రతిపాదనలకు విలువే లేదు" అన్నాడు.

ఆ తరువాత మక్కా పార్లమెంటు ఈ ఘోర తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. దీన్ని వెంటనే అమలుపర్చాలి అనే కృతనిశ్చయంతో సభ్యు లంతా ఇంటిదారి పట్టారు.

---

3. ఇబ్నె హిషామ్-1/480, 482.

హిజ్రత్ చేసి మక్కాను వీడిన దైవప్రవక్త (స)

మహాప్రవక్త ముహమ్మద్ (స) హత్యకు తీర్మానం ఆమోదించబడినప్పుడు హజ్రత్ జిబ్రీల్(అ.స.), దైవవాణితో ఆయన (స) సన్నిధికి వచ్చారు. ఖురైష్ పన్నిన కుట్రను గురించి ఆయనకు తెలుపుతూ, అల్లాహ్ మిమ్మల్ని ఇక్కడి నుండి బయలుదేరి వెళ్ళడానికి అనుమతించాడని సూచిస్తూ, హిజ్రత్ చేసి వెళ్ళవలసిన ఆ తేదీని కూడా నిర్ణయించి చెప్పారు. ఆ రాత్రి ఆయన (స) రోజూ పడుకొనే చోట పడుకోవద్దని కూడా చెప్పడం జరిగింది.[1]

ఈ సూచన అందగానే మహాప్రవక్త (స), ఆ రోజే మిట్టమధ్యాహ్న సమయంలో అబూ బక్ర్ (ర) ఇంటికి వెళ్ళి, హిజ్రత్ చేయడానికి సంబంధించిన ప్రోగ్రామ్‌నంతా సిద్ధం చేసి ఉంచమని వివరించారు. మహాప్రవక్త (స) హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇంటికి వచ్చిన విషయాన్ని హజ్రత్ ఆయిషా (ర) ఇలా ఉల్లేఖిస్తున్నారు:

"ఆ రోజు మధ్యాహ్నం మేము అబూ బక్ర్ (ర)గారి ఇంట్లో కూర్చొని ఉన్నాం. ఎవరో వచ్చి అబూ బక్ర్ (ర) నుద్దేశించి, మహాప్రవక్త (స)గారు తలపై గుడ్డ కప్పుకొని వస్తున్నారని చెప్పారు. మిట్టమధ్యాహ్న సమయంలో ఆయన ఎప్పుడూ రాలేదు. అబూ బక్ర్ (ర) లేచి, బయటకు వెళ్ళారు. మహాప్రవక్తా! తమరెప్పుడూ ఈ సమయంలో రాలేదే అని అడిగారు.

మహాప్రవక్త (స) లోనికి రావటానికి అనుమతి కోరారు. అనుమతి లభించగానే ఆయన ఇంట్లోకి ప్రవేశించి, "అబూ బక్ర్! ఇక్కడ ఉన్నవారిని ప్రక్కకు పొమ్మని చెప్పండి" అని అన్నారు. దానికి అబూ బక్ర్(ర) "దైవప్రవక్తా! ఇంకెవరూ లేరు, మీ సతీమణి తప్ప, చెప్పండి" అని బదులు పలికారు.

"నాకు హిజ్రత్ చేసి వెళ్ళే అనుమతి లభించింది" అన్నారు మహాప్రవక్త (సఅసం).

1. ఇబ్నె హష్షామ్-1/482; జాదుల్ ముఆద్-2/52.

"మరి తమరి వెంట...(నేనుంటానా?)" అని అడిగారు.

ఔను అన్నారు దైవప్రవక్త (స).[2]

ఆ తరువాత హిజ్రత్ ప్రోగ్రామ్ నిర్ణయించి తన ఇంటికి వెళ్ళిపోయారాయన (స). ఆ రాత్రి ఎప్పుడొస్తుందా అని నిరీక్షించసాగారు.

దైవప్రవక్త (స) ఇంటిని చుట్టుముట్టిన ముష్కర మూక

ఇటు మక్కా ముష్రిక్ నాయకులు, పార్లమెంటు దారున్నద్వాలో ఉదయం ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని అమలుచేయడానికి రోజంతా కసరత్తు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. దీని కోసం వారు పదకొండు మంది సర్దారుల్ని ఎన్నుకోవడం జరిగింది. వారి పేర్లు ఇవి:

1. అబూ జహల్ బిన్ హష్షామ్
2. హకమ్ బిన్ ఆస్
3. ఉక్బా బిన్ అబీ ముయీత్
4. నజ్ర్ బిన్ హారిస్
5. ఉమయ్యా బిన్ ఖల్ఫ్
6. జమ్అ బినుల్ అస్వద్
7. తుఅయిమా బిన్ అద్దీ
8. అబూ లహబ్
9. ఉబై బిన్ ఖల్ఫ్
10. నుబయా బినుల్ హుజ్జాజ్
11. అతని సోదరుడు మునబ్బా బినుల్ హుజ్జాజ్.[3]

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, రాత్రి బాగా ప్రొద్దుపోయిన తరువాత వీరు దైవప్రవక్త (స) గారి గుమ్మం దగ్గర పొంచి కూర్చున్నారు. ఆయన (స) నిద్రపోగానే ఆయనపై విరుచుకుపడే ఉద్దేశంతో.[4] వారికి, తమ కుట్ర ఫలిస్తుందని పూర్తి నమ్మకంగా ఉంది. ఈ విశ్వాసంతో అబూ జహల్ ఎంతో గర్వపడుతూ, ఎగతాళిగా తన చుట్టూ ఉన్నవారిని ఉద్దేశించి ఇలా చెప్పనారంభించాడు.

2. సహీ బుఖారి, ప్రవక్త (స) హిజ్రత్ అధ్యాయం-1/553
3. జాదుల్ ముఆద్-2/52.
4. ఇబ్నె హష్షామ్-1/482.

"మీరంతా అతని ధర్మంలో చేరి అతనికి విధేయత చూపితే అరేబియా మరియు అరబ్బేతర రాజ్యాలకు రాజులైపోతారంటున్నాడు ముహమ్మద్ (స). చనిపోయిన తరువాత తిరిగి లేపబడినప్పుడు జోర్డాన్ ఉద్యాన వనాల్లాంటి ఉద్యానవనాలు లభిస్తాయట మీకు. మీరే అలా చేయకపోతే ఆయన తరఫు నుండి జరిగే యుద్ధంలో మీరంతా హతులైపోతారట. మరణించిన తరువాత తిరిగి లేపబడతారట. మీ కోసం కాల్చిపారేసే నరకాగ్ని శిక్ష కూడా ఉందట."[5]

మొత్తానికి కుట్ర అమలుకు నడిరేయి తరువాతి ఝాము ఖరారు అయింది. వీరంతా మేల్కొని ఆ సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. కాని అల్లాహ్ తన కార్యాన్ని నెరవేర్చే శక్తిగలవాడు. భూమ్యాకాశాల పాలన ఆయన చేతుల్లోనే ఉంది. ఆయన తలచిందే చేస్తాడు. ఆయన రక్షించదలచు కున్నవాడికి వీసమెత్తు నష్టం కూడా జరగదు. ఆయన పట్టు నుండి ఇంకెవ్వడు తప్పించుకోనూ లేడు. కాబట్టి అల్లాహ్ ఈ సందర్భంలో తాను వేసిన ఎత్తును గురించి దైవప్రవక్త(స)ను సంబోధిస్తూ ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు:

وَاِذْ يَمْكُرُ بِكَ الَّذِيْنَ كَفَرُوْا لِيُثْبِتُوْكَ اَوْ يَقْتُلُوْكَ اَوْ
يُخْرِجُوْكَ ؕ وَيَمْكُرُوْنَ وَيَمْكُرُ اللّٰهُ ؕ وَاللّٰهُ خَيْرُ الْمٰكِرِيْنَ ۝

"ఆ సమయం కూడా జ్ఞాపకం తెచ్చుకోదగ్గదే; అప్పుడు సత్యతిరస్కారులు నీకు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతూ ఉన్నారు, నిన్ను నిర్బంధించాలని లేదా నిన్ను హత్య చేయాలని లేదా నిన్ను దేశం నుండి బహిష్కరించాలని. వారు తమ ఎత్తులు తాము వేస్తూ ఉన్నారు. అల్లాహ్ తన ఎత్తు తాను వేస్తూ ఉన్నాడు. అల్లాహ్ అందరికంటే బాగా ఎత్తులు వేస్తాడు." (8 : 30)

మహాప్రవక్త (స) తమ ఇంటిని వదిలేయడం

ఎట్టకేలకు ఖురైషులు తమ ప్లానును అమలుచేసేందుకు చేసిన ప్రయత్నం అంతా బూడిదలో బోసిన పన్నీరు చందంగా తయారైంది. వారు తమ

5. *ఇబ్నె హష్షామ్-1/483*
6. *హజర్ మౌత్ (దక్షిణ యమన్)లో తయారైన దుప్పటిని హ్రజమీ దుప్పటి అంటారు.*

కార్యంలో అపజయాన్నే ఎదుర్కోవలసివచ్చింది. ఈ సున్నితమైన ఘడియలో దైవప్రవక్త (స) హజ్రత్ అలి (ర)ను లేపి, "నీవు నా ప్రక్కపై పడుకో. నా ఈ ఆకు పచ్చటి హ్రజమీ[6] దుప్పటిని కప్పుకొని నిద్రపో. నీకు వారి వల్ల ఎలాంటి ప్రమాదం వాటిల్లబోదు" అని అన్నారు. మహాప్రవక్త (స) ఎప్పుడూ ఈ దుప్పటినే కప్పుకొని పడుకోవడం పరిపాటి.[7]

ఆ తరువాత మహాప్రవక్త (స) బయటకు వచ్చారు. బహుదైవారాధకుల మధ్య నుండి వెడుతూ ఓ పిడికెడు సన్నటి రాళ్ళు గల మట్టిని వారి తలలపై చల్లారు. అల్లాహ్ వారి చూపుల్ని ఆయన్ను (స) చూడకుండా చేశాడు. ఆ సమయంలో మహాప్రవక్త (స) ఈ ఖుర్‌ఆన్ ఆయత్‌ను పఠిస్తూ బయటకు వచ్చేశారు.

وَجَعَلْنَا مِنْۢ بَيْنِ اَيْدِيْهِمْ سَدًّا وَّمِنْ خَلْفِهِمْ
سَدًّا فَاَغْشَيْنٰهُمْ فَهُمْ لَا يُبْصِرُوْنَ ۝

"వజఅల్‌నా మిమ్ బైని అయిదీహిం సద్దవ్‌ వమిన్ ఖల్ఫిహిమ్ సద్దన్ ఫ అగ్‌షైనా హు ఫహుం లాయుబ్సిరూన్." (36 : 9)

(అర్థం: మేము వారి ముందు ఒక గోడనూ, వారి వెనుక మరొక గోడనూ నిలబెట్టాము. మేము వారిని (ఈ విధంగా) కప్పి వేశాము, ఇక వారికి ఏమీ కనిపించదు.)

ఆ సమయంలో ఆ ముష్రిక్కుల తలపై ఆ మట్టి పడకుండా ఎవ్వడూ మిగలలేదు. ఆ తరువాత ప్రవక్తశ్రీ(స), హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇంటికి వెళ్ళి పోయారు.

ఆ తరువాత ఆయన ఇంటి కిటికీలో నుండి బయటపడి ఆ ఇద్దరు యమన్ వైపు బయలుదేరారు. ఆ రాత్రికి రాత్రే మక్కాకు కొన్ని మైళ్ళ దూరాన ఉన్న 'సౌర్' అనే కొండ గుహ ఒకదానిలోనికి వచ్చి చేరారు.[8]

ఇటు ఇంటిని చుట్టుముట్టిన ముష్కర మూక ఆ సమయం కోసం ఎదురు చూస్తూనే ఉంది. అంతలోనే ఓ వ్యక్తి ఎవరో వచ్చి మీరందరు ఎవరి కోసం ఎదురు చూస్తున్నారిక్కడ? అని అడగ్గా, ముహమ్మద్ కోసం కాచుకొని కూర్చున్నామని బదులిచ్చారు వారు. అది విన్న అతడు, "మీరు మీ ప్రయ

7. *ఇబ్నె హష్షామ్-1/482, 483.*
8. *ఇబ్నె హష్షామ్-1/483; జాదుల్ ముఆద్-2/52.*

త్నంలో విఫలమైపోయారు. దైవసాక్షి! ముహమ్మద్ ఇందాకనే కదా మీ ముందు నుండే మీ తలలపై మట్టి పోస్తూ వెళ్ళిపోయింది" అని అన్నాడు.

"మేమాయన్ను చూడలేదే!" అని అంటూ తమ తలలపై పడివున్న మట్టిని దులుపుకున్నారు.

అయినా తలుపు సందులో నుండి తొంగి చూడగా అక్కడ హజ్రత్ అలి(ర) నిద్రపోతూ కనిపించారు. ఆయన్ను చూడగానే అడిగో ముహమ్మద్! నిద్రపోతున్నాడు అని అనుకోనారంభించారు. హజ్రత్ అలి(ర) ఒంటిపై ప్రవక్త (స) దుప్పటి వారికి కనబడింది. అందుకని వారు తెల్లవారిందాకా అక్కడనే తిష్ఠవేసుకొని కూర్చున్నారు. పూర్తిగా తెల్లవారిపోయింది. హజ్రత్ అలి(ర) ప్రక్క మీది నుండి లేవగానే ముష్రిక్‌లకు ఏం చేయాలో తోచలేదు. వారు ఆయన్ను నిలదీసి, "ముహమ్మద్ (స) ఎక్కడ?" అని అడిగారు. సమాధానంగా, "నాకేమీ తెలియదు" అని అన్నారు హజ్రత్ అలి (ర).[9]

ఇంటి నుండి గుహ వరకు

మహాప్రవక్త (స) దైవదౌత్య శకం 14, సఫర్ మాసం 27వ తేది (క్రీ.శ. 12 మరియు 13 సెప్టెంబర్ 622)[10] మధ్యరాత్రి తన ఇంటి నుండి బయలు దేరుతూ తన ధన ప్రాణాల విషయంలో అందరికంటే నమ్మకస్తుడైన మిత్రుడు హజ్రత్ అబూ బక్ర్ (ర) గారి ఇంటికి వచ్చారు. అక్కడ నుండి ఇంటి వెనుక భాగంలో ఉన్న ఓ కిటికీ నుండి బయటపడి, తెల్లారకమునుపే మక్కా దరి దాపుల్లో నుండి బయటపడేందుకు బయలుదేరారు.

ఖురైషులు తమ పూర్తి శక్తియుక్తులనుపయోగించి ఆయన్ను వెదక డానికి ప్రయత్నిస్తారన్న సంగతి మహాప్రవక్త (స)కు బాగా తెలుసు. వారు ఏ

9. ఇబ్నె హష్షామ్-1/483; జాదుల్ ముఆద్-2/52.

10. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/95. సఫర్, ఈ మాసం 14వ దైవదౌత్య శకం ముహర్రం నెల ప్రారంభం నుండి లెక్కకట్టినప్పుడు వస్తుంది. శక ప్రారంభం దైవ దౌత్యం నుండి లెక్కకడితే ఈ సఫర్ నెల 13వ దైవదౌత్య శకానికి చెందినదవు తుంది. సాధారణ సీరత్ చరిత్రకారులు మొదటి లెక్కనే అవలంబిస్తారు. కొందరు రెండవ లెక్కను పరిగణనలోనికి తీసుకుంటారు. ఈ కారణంగా ఈ సంఘటన తేదీని నిర్ణయించడంలో పొరపాటు జరుగుతోంది. మేము మాత్రం శకారంభాన్ని ముహర్రం నెల నుండే ప్రారంభించాం.

మార్గంపైనైతే బయలుదేరబోతారో అది మదీనా మార్గమై అయి ఉంటుంది. అది మక్కాకు ఉత్తరం వైపునకు పోయే మార్గం. ఇది తెలిసిన మహాప్రవక్త (స) దానికి పూర్తిగా భిన్నమైన దిశ అంటే యమన్‌కు పోయే దక్షిణ దిశను ఎన్నుకొని దాదాపు అయిదు మైళ్ళు ప్రయాణించి 'సౌర్' అనే పర్వత సానువుల్లోకి చేరు కున్నారు. ఇది చాలా ఎత్తయిన కొండ. ఎక్కడం కూడా చాలా కష్టంతో కూడు కున్నది. మార్గంలో రాళ్ళు కూడా అధికంగా ఉండడం వలన దైవప్రవక్త (స) కాళ్ళకు గాయాలు కూడా అయ్యాయి. కాలి గుర్తులు పడకుండా ముని వ్రేళ్ళపై నడిచారని కూడా చెప్పుకోవడం జరుగుతోంది. అందుకనే ఆయన కాళ్ళకు గాయాలై ఉండవచ్చు. మొత్తానికి, ఏది ఏమైనా, హజ్రత్ అబూ బక్ర్ (ర) గారి వెంట ఆ కొండ దాపుకు చేరుకున్నారు. హజ్రత్ అబూ బక్ర్ (ర) ఆయన్ను ఎత్తుకొని పరుగిడి కొండ శిఖరంపై ఉన్న ఓ గుహ దగ్గరకు చేరు కున్నారు. చరిత్రలో ఈ గుహ 'గారె సౌర్' (సౌర్ గుహ) గా పిలువబడుతోంది.[11]

గుహ లోపల

గుహ దగ్గరకు వెళ్ళిన తరువాత హజ్రత్ అబూ బక్ర్ (ర), దైవప్రవక్త (స)తో, "తమరు ఇప్పుడే ఈ గుహలోనికి ప్రవేశించకండి. ముందు నేను వెళ్ళి చూసివస్తాను. ప్రమాదకరమైన విషయం ఏదైనా ఉంటే ముందు దాన్ని నేనే భరిస్తాను" అంటూ గుహలోనికి ప్రవేశించారు. ఆ గుహను శుభ్రపరిచారు. ఓ ప్రక్క రెండు కన్నాలు కనబడ్డాయి. వాటిని తన లుంగీ చించి మూసివేశారు. అయినా మరో రెండు కన్నాలు మిగిలే ఉన్నాయి. హజ్రత్ అబూ బక్ర్ (ర) ఆ రెండు కన్నాలను తన కాలి బొటన వ్రేళ్ళతో మూసేసి మహాప్రవక్త (స)ను లోనికి పిలిచారు. లోనికి వెళ్ళిన ప్రవక్తశ్రీ (స) అబూ బక్ర్ (ర)గారి ఒడిలో తన శిరస్సును పెట్టి పడుకున్నారు. ఇటు అబూ బక్ర్ (ర) కాలిని ఏదో విష జంతువు కరిచింది. దైవప్రవక్త(స) ఎక్కడ మేల్కొంటారో అనే భయంతో ఆయన కదల నైనా కదలలేదు. అయితే బాధ వల్ల ఆయన కళ్ళవెంట అశ్రువులు టపటప మంటూ మహాప్రవక్త (స) చెక్కిళ్ళపై రాలాయి. (ఇలా ఆయన (స) మేల్కొ న్నారు) "నీకేమైంది అబూ బక్ర్?" అని అడిగారు మహాప్రవక్త (స). "నా తల్లి దండ్రులు మీ కోసం అర్పితం! ఏదో నన్ను కాటేసింది" అని అనగా,

11. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/95; ముక్తరుస్సీరత్ -షేక్ అబ్దుల్లా, పుట.167

దైవప్రవక్త(స) తన ఉమ్మిని కుట్టిన చోట పెట్టారు. వెంటనే బాధ మటు మాయమై పోయింది.[12]

ఈ గుహలో వీరిద్దరు కలసి మూడు రాత్రులు దాగి గడిపారు.[13] అంటే శుక్రవారం, శనివారం మరియు ఆదివారం రాత్రులు అన్నమాట. ఈ మధ్య కాలంలో అబూ బక్ర్ (ర)గారి తనయుడు అబ్దుల్లా కూడా వచ్చి వీరితోపాటే రేయి గడిపేవారు. హజ్రత్ ఆయిషా (ర)గారి కథనం ప్రకారం, అబ్దుల్లా మంచి తెలివి గలవాడు, విషయాన్ని అర్థం చేసుకొనే సామర్థ్యం కలవాడు. తెల్లారక ముందే చీకట్లో వారిద్దరిని అక్కడ విడిచి ఉదయం తాను మక్కా ప్రజలతో కలసిపోయేవారు. అంటే ఆయన రాత్రి మక్కాలో ఉన్నట్లుగానే వారికి నమ్మకం గలిగేటట్లు మెలిగేవారు. మహాప్రవక్త (స) మరియు అబూ బక్ర్ (ర) గురించి మక్కావాసులు చేసే కుతంత్రాలకు సంబంధించిన ఏదైనా మాట వింటే దాన్ని గుర్తుపెట్టుకొని బాగా చీకటి పడగానే గుహ దగ్గరకు వెళ్ళిపోయేవాడు.

ఇటు అబూ బక్ర్ (ర) గారి బానిస ఫహీరా మేకలు కాస్తూ రాత్రి ఓ ఝాము పొద్దుపోయిన తరువాత ఆ మేకలతో గుహ దగ్గరికి వెళ్ళేవారు. ఇలా వీరిద్దరూ బాగా కడుపునిండా పాలు త్రాగేవారు. ఉదయం కాగానే ఫహీరా మేకలు తోలుకొని అక్కడి నుండి దూరంగా వెళ్ళిపోయేవారు. మూడు రాత్రులు కూడా ఆయన ఇలాగే చేశారు[14] (అదేకాదు) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ బక్ర్ (ర) మక్కాకు వెళ్ళిపోయిన తరువాత ఆయన అడుగుజాడలు కనబడకుండా వాటిపై నుండి తన మేకలను తోలుకొని వెళ్ళడం కూడా జరిగేది.[15]

ఖురైష్ విఫలయత్నం

హత్య చేయడానికి ఖురైషులు ఎన్నుకున్న ఆ రాత్రి గడిచిపోయింది. తెల్లవారిన తరువాత దైవప్రవక్త (స) చేయిదాటిపోయారన్న విషయం వారికి పూర్తిగా నమ్మకంగా అర్థమైంది. ఇక వారి క్రోధానికి అంతేలేదు. ముందు

12. ఇది జరీన్, హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ ద్వారా ఉల్లేఖించిన కథనం ప్రకారం, ఈ విషయం ఆ తరువాత బయటపడింది (అంటే మరణమప్పుడు ప్రభావం చూపింది అని అర్థం). ఇదే ఆయన మరణానికి కూడా కారణభూతమైంది. చూడండి, మిష్కాత్-2/556, అబూ బక్ర్ (ర) అధ్యాయం.

13. ఫత్హుల్ బారి-7/336

14. సహీ బుఖారి-1/553, 554

15. ఇబ్నె హష్షామ్-1/486

హజ్రత్ అలి(ర)పై ఆ కోపాన్ని తీర్చుకున్నారు. ఆయన్ను ఈడ్చుకుంటూ కాబా గృహం వద్దకు తీసుకువచ్చారు. బహుశా ఆ ఇద్దరి జాడ ఏమైనా తెలుస్తుందేమో అన్న ఉద్దేశ్యంతో ఆయన్ను కొంతకాలం వరకు నిర్బంధంలో ఉంచారు.[16] కాని హజ్రత్ అలి (ర)ద్వారా ఏ విషయం బయటపడకపోవడంతో నేరుగా అబూ బక్ర్ (ర)గారి ఇంటికి వెళ్ళి తలుపు తట్టారు. హజ్రత్ అస్మా (ర) బిన్తె అబూ బక్ర్ (ర) (అబూ బక్ర్ (ర) గారి కుమార్తె) బయటకు వచ్చారు. "మీ నాన్న ఎక్కడ?" అని అడిగారు వారు. "ఏమో! నాకేం తెలుసు మా నాన్నగారెక్కడున్నారో?" అని బదులిచ్చారామె. ఇది విన్న అబూ జహల్ కోపం పట్టలేక ఆమె చెంపపై పెద్దగా చరిచాడు. ఆ దెబ్బకు ఆమె చెవి పోగు ఎగిరి క్రిందపడిపోయింది.[17]

ఖురైషులు ఓ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేసి, ఆ ఇద్దరిని పట్టుకోడానికి సాధ్యమైనన్ని శక్తియుక్తుల్ని, వనరుల్ని ప్రయోగించాలని తీర్మానించుకున్నారు. మక్కా నుండి బయటకు పోయే మార్గాలన్నిటిపై - ఆ మార్గాలు ఎటు పోయేవి అయినా సరే- గట్టి నిఘా ఉంచడం జరిగింది. అలాగే ఓ ప్రకటన చేస్తూ ఎవరైనా సరే, ముహమ్మద్ (స) మరియు అబూ బక్ర్ (ర)ను సజీవంగా లేదా నిర్జీవంగా బంధించి తెస్తే ఆ ఇద్దరిలో ఒక్కొక్కరికి వంద ఒంటెలను బహూకరిస్తాం అని చాటింపు వేయించారు.[18] ఈ ప్రకటన ఫలితంగా వాహనాలపై, కాలినడకనా పోయి వెదికేవారు, అడుగుజాడలు చూసి జాడ తెలుసుకునే అడుగుజాడల నిపుణులు వెదుకులాటనారంభించారు. కొండల్లో, లోయల్లో, పల్లపు ప్రదేశాల్లో, మెట్ట ప్రాంతాలన్నింటిలోనూ చెల్లాచెదరై ప్రవక్త (స)ను వెదకనారంభించారు. కాని ఫలితం దక్కలేదు.

వెదుకుతూ వెళ్ళేవారు 'సౌర్ గుహ' ముఖద్వారం వద్దకు కూడా చేరుకున్నారు. కాని అల్లాహ్ అభీష్టం మరో విధంగా ఉంది. సహీ బుఖారి గ్రంథంలో హజ్రత్ అబూ బక్ర్ (ర) చెప్పినట్లుగా ఓ ఉల్లేఖనం ఉంది. దీన్ని హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖించారు. ఆ ఉల్లేఖనంలో హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇలా చెప్పారు:

"నేను దైవప్రవక్త (స) గారి వెంట గుహలో ఉన్నాను, తల పైకెత్తి చూద్దును గదా అక్కడ వెదుకులాడే మనుషుల పాదాలు నాకు కనిపిస్తున్నాయి. నేను ప్రవక్త (స)తో, 'దైవప్రవక్తా! ఒకవేళ వీరు ఏ ఒక్కరైనా తమ చూపుల్ని క్రిందికి వాల్చి చూస్తే? ఇంకేముంది! మనం కనబడతాం' అన్నాను. దానికి

16. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/96

17. ఇబ్నె హష్షామ్-1/487

18. సహీ బుఖారి-1/554

ఆయన(స), అబూ బక్ర్ మాట్లాడకు. (మనం) ఇద్దరం, మా ఇద్దరికి తోడు మూడోవాడు అల్లాహ్ అన్నారు." మరో ఉల్లేఖనంలోని పదాలు ఇలా ఉన్నాయి.

"అబూ బక్ర్(ర) ! అల్లాహ్ మూడవవానిగా తోడుండే ఆ ఇద్దరి గురించి నీ అభిప్రాయం ఏమిటీ?"[19]

యదార్థం ఏమిటంటే, ఇది ఓ మహత్యం. అల్లాహ్ తన ప్రవక్త (స)కు చేసిన సహాయమది. కాబట్టి వెదికేవారికి, దైవప్రవక్త (స)కు మధ్య కొన్ని అడుగులకంటే ఎక్కువ దూరం లేరు. వారు అక్కడి నుండే వెనక్కి మరలి పోయారు.

మదీనా బాటలో

దైవప్రవక్త (స)ను పట్టుకోవాలనే దుగ్ధాగ్ని చల్లారిపోయింది. వెదుకులాట ఆగిపోయింది. మూడు రోజుల విఫల యత్నం నీరుకారిపోయిన తరువాత ఖురైషుల భావోద్రేకాలు చల్లబడిపోయాయి. అప్పుడుగాని మహాప్రవక్త (స) హజ్రత్ అబూ బక్ర్ (ర)గారి వెంట మదీనాకు బయలుదేరలేదు. అబ్దుల్లా బిన్ అరీఖత్ లైసీ అనేవాడు ఎడారి బాటల గురించి బాగా తెలిసిన వ్యక్తి. ముందే ప్రతిఫలం ముట్టజెబుతామనే షరతుపై మదీనాకు చేరవేసే ఒప్పందం కుదుర్చుకొని ఉన్నారు దైవప్రవక్త (స) మరియు అబూ బక్ర్ (ర)లు. ఇతను ఇంకా ఖురైష్ ధర్మంలో ఉన్నవాడే. అయితే చాలా నమ్మకస్తుడు. కాబట్టి అతనికి మదీనాకు ప్రయాణం సాగించేందుకు వాహనాలను కూడా ఇచ్చి ఉంచడం జరిగింది. మూడు రాత్రులు గడిచిపోయిన తరువాత అతను రెండు వాహనాలను తీసుకొని 'సౌర్' గుహ దగ్గరికి రావాలని చెప్పి ఉంచారు. అతను సోమవారం రాత్రి- అది రబీఉల్ అవ్వల్ మాసం, హిజ్రీ శకం 1, నెల పొడుపు రాత్రి

19. సహీ బుఖారి-1/516, 558. ఇక్కడ ఓ విషయం గమనార్హం. అబూ బక్ర్ (ర) గారి భయం తన ప్రాణం గురించి కాదు. ఈ ఉల్లేఖనంలో చెప్పిన విషయం గురించే ఆయన భయం అంతాను. అంటే అబూ బక్ర్ (ర) వెదికేవారిని చూసి దైవప్రవక్త (స)కు ఏ ప్రమాదం వచ్చిపడుతుందోననే భయం పట్టుకుంది. ఈ సందర్భంలో ఆయన ఇలా చెప్పారు. 'నేనొక్కడినే, చనిపోతే ఒక్కణ్ణే చస్తాను. ఒకవేళ తమరు చంపబడితే ఈ పూర్తి సమాజం సర్వనాశనం అవుతుంది.' ఈ సందర్భంలో మహాప్రవక్త (స), "బాధపడకు. అల్లాహ్ తప్పకుండా మన వెంట ఉన్నాడు" అన్నారు. చూడండి, ముక్తసరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లా, పుట.168

(సెప్టెంబర్ 16, 622) - ఆ ఒంటెల్ని తీసుకొని గుహ దగ్గరికి వచ్చేశాడు. ఆ సందర్భంలోనే అబూ బక్ర్ (ర), దైవప్రవక్త (స)కు మేలైన ఓ పెంటి ఒంటెను ప్రయాణార్థం అందిస్తూ ఈ రెండు ఒంటెల్లో ఆయనకు నచ్చినదాన్ని స్వీకరించమని అర్థించారు. మహాప్రవక్త (స) ఆ ఒంటెను ఉచితంగా తీసుకోకుండా దాని ధరను అబూ బక్ర్ (ర)కు చెల్లించడం జరిగింది.

ఇటు అస్మా (ర) (అబూ బక్ర్(ర)గారి కుమార్తె) ప్రయాణానికి కావలసిన భోజన సామగ్రిని అక్కడికి తీసుకొని వచ్చారు. అయితే వాటిని ఒంటెపై వేసి కట్టడానికి త్రాడును మరచి వచ్చారు. బయలుదేరే సమయం రాగానే చద్దిమూటను ఒంటెపై వేసి వ్రేలాడదీయడానికి ఉపక్రమించినప్పుడు తాను త్రాడు మరచి వచ్చాననే విషయాన్ని గుర్తించారు. వెంటనే నడుముకు చుట్టుకునే పట్కావస్త్రం విప్పి దాన్ని రెండుగా చించి ఓ ముక్కతో చద్దిమూటను ఒంటెపై వేసి వ్రేళ్ళాడదీశారు. రెండో ముక్కను తిరిగి తన నడుముకు చుట్టుకున్నారు. ఆ కారణంగానే ఆమెకు 'జాతున్నితా ఖైన్' అనే బిరుదు లభించింది.[20]

ఆ తరువాత మహాప్రవక్త (స), అబూ బక్ర్ (ర)లు కలసి అక్కడ నుండి బయలుదేరారు. ఆమిర్ బిన్ ఫహీరా (ర) కూడా వెంటే ఉన్నారు. అబ్దుల్లా బిన్ అరీఖత్ వారిని వెంటబెట్టుకొని ఆ రాత్రే సముద్ర తీరం వెంట వెళ్ళే మార్గాన్ని అనుసరించాడు.

గుహ నుండి బయలుదేరగానే ముందు అతను యమన్ వైపునకు వెళ్ళే దారిని అనుసరించాడు. దక్షిణం వైపు చాలా దూరం వెళ్ళిన తరువాత పశ్చిమం వైపునకు తిరిగి సముద్ర తీర మార్గాన్ని పట్టాడు. ఆ తరువాత సాధారణంగా మనుషులు సంచరించనటువంటి మరో మార్గం వైపు మళ్ళాడు. ఈ మార్గం గురించి చాలా మందికి అవగాహన ఉండేది కాదు. ఈ దారి ఎర్ర సముద్ర తీరానికి అతి చేరువ నుండి పోయే మార్గం. ఒకరిద్దరు తప్ప ఆ మార్గంపై నడిచేవారెవరూ ఉండరు.

మహాప్రవక్త (స) ఈ మార్గంపై వెడుతూ ఏయే ప్రదేశాలగుండా అయితే వెళ్ళారో, ఆ ప్రదేశాల గురించి ఇబ్నె ఇస్హాక్ తన గ్రంథంలో పేర్కొనడం జరిగింది. ఆయన కథనం ప్రకారం, ఆ మార్గదర్శకుడు ఆయన్ను తీసుకొని బయలుదేరి తీరం వెంబడి వెడుతూ 'జీరీనె అస్ఫాన్'కు వెళ్ళి దారి మార్చాడు.

20. సహీ ఉల్ బుఖారి-1/553, 555; ఇబ్నె హష్షామ్-1/482

ఆ తరువాత 'జీరీనె అమజ్' గుండా వెడుతూ ముందుకు వెళ్ళి 'ఖదీద్' అనే చోటును దాటేశాడు. ఆ తరువాత తిరిగి మార్గాన్ని మార్చి ముందుకుపోయి 'ఖరారా' చేరాడు. ఆ తరువాత 'సనీయతుల్ మర్రా', 'లఖఫ్' ఎడారి గుండా వెడుతూ 'హిజాజ్' ఎడారి ప్రదేశానికి చేరుకున్నాడు. అక్కడ నుండి మజాహ్ మూలమలుపు తిరిగి జుల్ ఫుజ్వీన్ మలుపున ఉన్నటువంటి పల్లపు ప్రదేశంలోనికి వెళ్ళిపోయాడు. ఆపై జీకష్ కొండ లోయ నుండి ప్రయాణించి 'అబాబీద్', దాని తరువాత 'ఫాజా' వైపునకు వెళ్ళాడు. ఆ మీదట 'అర్జ్'లో విడిది చేశాడు. అక్కడ నుండి బయలుదేరి 'రకూబా'కు కుడి వైపున ఉన్న 'సనియ తుల్ అయిర్' లోనికి వెళ్ళిపోయాడు. చివరికి 'రయిమ్' లోయలోనికి వెళ్ళి విడిది చేశాడు. ఆ తరువాత 'ఖుబా'కు వచ్చిచేరాడు.[21]

రండి! ఇక మనం మార్గంలో జరిగిన సంఘటనల గురించి కూడా తెలుసుకుందాం.

1. సహీ బుఖారీ గ్రంథంలోని హజ్రత్ అబూ బక్ర్ (ర)గారి ఉల్లేఖన సారాంశం.

"మేము (గుహ నుండి బయలుదేరి) రాత్రి, పగలు రెండు ఝాముల వరకు ప్రయాణిస్తూనే ఉన్నాం. మిట్ట మధ్యాహ్నం అయ్యేటప్పటికీ ఆ బాటన ఎవరూ నడిచినట్లు ఆనవాళ్ళు లేవు. ఆ సమయంలోనే మాకు ఓ పొడుగాటి ఎత్తయిన బండరాయి కనబడింది. దాని క్రింద నీడగా ఉండడం వలన మేము అక్కడనే విడిది చేశాము. నేను నా చేతులతో ఆ ప్రదేశాన్ని శుభ్రపరచి నా అంగ వస్త్రాన్ని అక్కడ పరచి దైవప్రవక్త (స)తో అక్కడ కాసేపు పడుకొమ్మని, చుట్టూ పరికిస్తూ ఉంటానని అభ్యర్థించాను. ఆయన పడుకోగానే జాగ్రత్త కోసం చుట్టూ తిరిగి అటూ ఇటూ చూడ్డానికి బయటకు వచ్చాను. చూద్దునుగదా ఓ కాపరి తన మేకలను తోలుకొని ఆ బండ వైపే వస్తున్నాడు. అతను ఆ బండ నీడన కూర్చుం దామనే వస్తున్నాడు కాబోలు. నేనతనితో,"ఓ యువకుడా! నీవు ఎవరి తాలూకు మనిషివి?" అని అడిగాను. అతను మక్కా లేదా మదీనాకు చెందిన ఓ వ్యక్తి పేరు చెప్పాడు.

"నీ మేకలు ఏమైనా పాలు ఇస్తాయా?" అని అడిగాను.

"ఔను" అని సమాధానమిచ్చాడతను.

21. ఇబ్నె హష్షామ్-1/491, 492

"మరి నేను వాటి పాలను పితుక్కోవచ్చునా?"

"తప్పకుండా" అంటూ ఓ మేకను పట్టుకొని నా దగ్గరకు తీసుకొచ్చి, "ఆగండి, దీని పొదుగు నుండి మట్టి, వెంట్రుకలను శుభ్రం చేయండి ముందు" అన్నాడు.

ఆ తరువాత అతను ఓ చిన్న పాత్రలో కొన్ని పాలను పితికాడు. నా దగ్గర ఓ తోలు పాత్ర ఉంది. దాన్ని మహాప్రవక్త (స) నీరు త్రాగడానికి, వుజూ చేయ డానికి దగ్గర ఉంచుకుని ఉన్నాను (పాలు అందులో పోశాను). దైవప్రవక్త (స) గారి వద్దకు వచ్చానుకాని ఆయన్ను మేల్కొల్పాలంటే మనస్సు ఒప్పుకోవడం లేదు. ఆయన (స) స్వయంగానే మేల్కొన్న తరువాత ఆయన దగ్గరకు వచ్చి ఆ పాలలో కొన్ని నీళ్ళు పోశాను. పాలు కొంత చల్లబడ్డాయి. దైవప్రవక్త (స)కు త్రాగమని ఆ పాలనిచ్చాను. ఆయన తాగిన తరువాత నాకు తృప్తి కలిగింది. "ఇంకా బయలుదేరే సమయం రాలేదా?" అని అడిగారు. ఆ తరువాత మేము అక్కడి నుండి బయలుదేరాము.[22]

2. ఈ ప్రయాణంలో హజ్రత్ అబూ బక్ర్ (ర) దైవప్రవక్త (స)కు వెనుకనే ఉండేవారు. అంటే స్వారీపై కూర్చున్నప్పుడు దైవప్రవక్త (స) వెనుకన కూర్చుని ఉండేవారు. వృద్ధాప్య లక్షణాలు అగపడుతూ ఉండడం వలన అందరూ ఆయన్నే చూసేవారు. మహాప్రవక్త (స) ఇంకా యువకునిగానే అగుపడు తున్నారు. గనుక చూసేవారు ఆయన వైపు అంత నిశితంగా చూసేవారు కాదు. ఫలితంగా ఎవరైనా మార్గమధ్యంలో కలసి మాట్లాడితే ముందు అబూ బక్ర్ (ర)నే పలుకరించేవారు. మీ ముందున్న వ్యక్తి ఎవరూ అని అడిగితే ఆయన, ఈయన నాకు దారిచూపే వాడు అని చెప్పేవారు. అర్థం చేసుకునేవాడు, ఈ ప్రయాణంలో మార్గాన్ని చూపేవాడు! అనుకునేవాడు. కాని అబూ బక్ర్ (ర) దృష్టిలో మాత్రం మార్గం అంటే మేలు వైపునకు మార్గం చూపేవాడు అని భావం.[23]

3. ఈ ప్రయాణంలోనే మహాప్రవక్త (స), ఉమ్మె మఅబద్ ఖుజాయియా గుడారం ఉన్న చోట నుండి వెళ్ళడం జరిగింది. ఈమె ఆరోగ్యవంతురాలైన మహిళ. మోకాళ్ళు పట్టుకొని తన గుడారం వెలుపల కూర్చుని ఉండడం

22. సహీ బుఖారి-1/510
23. సహీఉల్ బుఖారి, అనస్(ర)గారి ఉల్లేఖనం-1/556

ఆమెకు అలవాటు. వచ్చిపోయే వారికి తన దగ్గర ఉన్న భోజన సామగ్రి నుండే తినిపించేవారు, దాహం తీర్చేవారు. మహాప్రవక్త (స) ఆమె వద్దకు వెళ్ళి, "తిన డానికి ఏదైనా ఉందా" అని అడిగారు. ఆమె, "దైవసాక్షి! నా దగ్గర ఏదైనా ఉంటే తప్పకుండా మీ అతిథి సత్కారాలు చేసేదాన్ని. ప్రస్తుతం ఇంట ఏదీ లేదు. మేకలు కూడా దగ్గరలో మేయడం లేదు" అని తన నిస్సహాయతను ప్రకటిం చారు. అది కరువుకాలం.

మహాప్రవక్త (స) దృష్టి ఓ మూలన కట్టి ఉన్న మేకపై పడింది.

"ఉమ్మె మఅబద్, ఈ మేక ఏమిటీ ఇక్కడుంది?" అని ప్రశ్నించారు.

"బలహీనత వల్ల అది మందతో పోలేకపోయింది" అన్నారామె.

"పాలు ఏమైనా ఇస్తుందా ఇది?" అని అడిగారు.

"పాలా? అది చాలా బలహీనంగా ఉంది. పాలెలాగుంటాయి?" అని అన్నారు.

"అనుమతిస్తే పాలు పితుకుతాను" అన్నారు మహాప్రవక్త (స).

"నా తల్లిదండ్రులు తమకు అర్పితం! మీకే ఈ మేకలో పాలు కనబడు తున్నట్లయితే తప్పకుండా పితుక్కోండి" అన్నారామె.

ఆ తరువాత మహాప్రవక్త (స) ఆ మేక పొదుగును తన చేతితో నిమిరారు. అల్లాహ్ నామం పలికి ప్రార్థించారు, మేక వెంటనే తన కాళ్ళను పాలు పితుక్కోమన్నట్లు ప్రక్కలకు చాచింది. పొదుగు పాలతో నిండిపోయింది. దైవ ప్రవక్త (స) ఉమ్మె మఅబద్ దగ్గర ఉన్న ఓ పెద్ద పాత్ర తీసుకొన్నారు. ఈ పాత్ర లోని పాలు ఓ సమూహానికే సరిపోయేటంత పెద్ద పాత్ర అది. నురగలు పైకి వచ్చిందాకా ఆ పాత్రలో పాలు పితికారు. ఆ పాలను ఉమ్మె మఅబద్‌కు త్రాగించారు. కడుపార పాలు త్రాగారామె. తమ వెంటనున్న వారందరికీ త్రాపిం చారు. వారు కడుపు నిండా పాలు త్రాగారు. ఆ తరువాత దైవప్రవక్త (స) కూడా పాలు త్రాగారు. ఆ తరువాత చూస్తే తిరిగి అంతే నిండుగా పాలున్నాయి ఆ పాత్రలో. వాటిని ఉమ్మె మఅబద్ దగ్గరే ఉంచేసి ముందుకు కదలిపోయారు దైవప్రవక్త (స).

దైవప్రవక్త (స) వెళ్ళిన కొంత సేపటికే ఆమె భర్త అబూ మఅబద్ తన నడవడానికే శక్తిలేని బలహీనమైన మేకల్ని తోలుకొని ఇంటికి చేరారు. పాలను

చూసి ఆశ్చర్యం వెలిబుచ్చుతూ, "ఈ పాలు నీ వద్దకెలా వచ్చాయి. నా మేకలు చాలా దూరం వరకు వెళ్ళి మేసొచ్చాయే? ఇంట పాలిచ్చే మేక ఒక్కటి కూడా లేదే?" అని అడిగారు.

" మనింటికి ఓ శుభప్రదుడైన వ్యక్తి వచ్చారు. ఆయన ఇలా ఇలా అని చెప్పారు. ఆయన పరిస్థితి ఇలాగుంది" అని విషయం అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పారామె.

"అయితే ఆయన ఖురైషులు వెదుకుతున్న మనిషే అన్నమాట. ఆయన గురించి ఇంకాస్త విపులంగా చెప్పు" అని అడిగారు అబూ మఅబద్.

ఉమ్మె మఅబద్ ఆయన ముఖకవళికల్ని, రూపురేఖల్ని, ఆయన గుణగణాలను, వినేవాడు ఆయన్ను ఎదురుగా చూస్తున్నట్లే వర్ణించారు - ఈ గ్రంథం చివరన ఈయన(స)గారి సుగుణాలను చెప్పడం జరుగుతుంది - ఈ గుణగణాలను విన్నంతనే అబూ మఅబద్, "దైవసాక్షి! ఎవరి గురించి అయితే ప్రజలు రకరకాలుగా చెప్పుకుంటున్నారో ఆ ఖురైష్‌కు చెందిన వ్యక్తే ఈయన. ఆయన(స)గారి అనుచరుణ్ణి కావాలని అనుకుంటున్నాను. మార్గం ఏదైనా కనబడితే తప్పకుండా ఆయనకు అనుచరుణ్ణయిపోతాను" అన్నారు.

ఇటు మక్కాలో, అందరూ వినేటట్లు ఓ వాణి వినవచ్చింది. చెప్పేవాడు ఎవడూ కనబడడం లేదు. ఆ వాణి ఇది:

"అల్లాహ్, ఉమ్మె మఅబద్ గుడారంలో వెలిసిన ఆ ఇద్దరి మిత్రులకు శుభం కలిగించుగాక! వారిద్దరు శుభంగా అక్కడికి వెళ్ళారు. క్షేమంగానే అక్కడి నుండి బయలుదేరారు. ముహమ్మద్ (స)కు మిత్రుడైనవాడు సాఫల్యం పొందినట్లే. అయ్యో ఖుస్సై! అల్లాహ్ అతని నుండి సాటిలేని మేటి ఘనకార్యా లను, నాయకత్వాలను లాక్కున్నాడు! బనూ కఅబ్‌కు చెందిన ఆ మహిళ ఇల్లు, విశ్వాసుల సంరక్షణకు విడిది శుభప్రదమైనదైపోవుగాక. మీరు వెళ్ళి ఆ మహిళతో ఆమె మేక గురించి జరిగిన వృత్తాంతం అడగండి. మీరే గనక ఆ విషయం ఆ మేకను అడిగినా అది సాక్ష్యం ఇస్తుంది."

హజ్రత్ అస్మా (ర) ఇలా అంటారు:

"దైవప్రవక్త(స) ఎటు వెళ్ళారో తెలుపడానికి ఓ జిన్ను దిగువ మక్కా నుండి ఈ వచనాలు చెప్పుకుంటూ వచ్చాడు. ప్రజలు అతని వెంటే వస్తున్నారు.

అతని మాటలు వింటున్నారు కాని అతణ్ణి మటుకు చూడలేకపోయారు. చివరికి అతను ఎగువ మక్కా నుండి వెళ్ళిపోయాడు. మేము అతని మాటలు విన్నంతనే మహాప్రవక్త (స) ఎటు వైపునకు వెళ్ళారో తెలిసిపోయింది. అంటే మహాప్రవక్త (స) మదీనా వైపే వెళ్ళారని నిర్ధారణ అయింది."[24]

4. దారిలో సురాకా బిన్ మాలిక్ అనేవాడు వారిని వెంటాడాడు. ఆ వెంటాడిన తీరును ఖుద్దు సురాకా నోటనే విందాం:

"నేను, నా జాతి బనీ ముద్లిజ్ సమావేశంలో కూర్చొని ఉన్నాను. అంతలోనే ఓ వ్యక్తి వచ్చి మా దగ్గర నిలబడ్డాడు. అతను నన్ను ఉద్దేశించి, "ఓ సురాకా! నేను ఇప్పుడే తీరం వెంబడి కొందరు పోతూ ఉండగా చూశాను. బహుశా వారు ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులై ఉండవచ్చు" అన్నాడు. నేను అప్పుడే గ్రహించాను, వారు ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులని. కాని నేను అతని మాటల్ని ఖండిస్తూ, "కాదు, నీవు చూసింది ఫలానా ఫలానా వ్యక్తుల్ని, వారు మా కళ్ళ ముందు నుండే అటుగా వెళ్ళిపోయారు" అని చెప్పాను. ఆ తరువాత కాసేపు ఆ సమావేశంలోనే కూర్చొని లేచి ఇంటికి వెళ్ళాను. నా దాసీని నా గుర్రం తీసుకొని వెళ్ళి ఎత్తయిన తిన్నె వెనుక నిలబెట్టి నా కోసం నిరీక్షిస్తూ ఉండమని ఆదేశించాను. నేను నా బరిశెను తీసుకొని ఇంటి పెరటి దారిన బయటకు వచ్చాను. నా లాఠీ మొన భూమిపై రాసుకుంటూ పోతుంది. ఇలా నేను నా గుర్రం వద్దకు చేరుకున్నాను. దాన్నెక్కి దౌడు తీయించాను, అది ఎప్పటిలాగే దౌడు తీస్తోంది. అలా వెంటాడుతూ నేను వారి దాపుకు వచ్చేయగా నేను నా గుర్రంతో సహా క్రిందపడిపోయాను. నేను లేచి అంబుల పొది నుండి బాణాలను బయటకు లాగి, నేను వారికి నష్టం కలిగించగలనా లేదా? అనే శకునాన్ని చూశాను. శకునంలో వచ్చిన బాణం ప్రకారం నేను వారికి ఎలాంటి ప్రమాదాన్ని కలిగించలేను అని తేలింది. ఇది నాకు ఇష్టమైన శకునం కాదు. దీన్ని లెక్కచేయకుండా తిరిగి గుర్రమెక్కి దౌడు తీయించాను. మహాప్రవక్త (స) ఖుర్ఆన్ పారాయణం చేస్తున్న శబ్దం నా చెవుల్లో పడే అంత దాపుకు వచ్చేశాను. ఆయన నా వైపు చూడడం లేదు కాని

24. *జాదుల్ ముఆద్-2/53,54; బనూ ఖుజాఅ నివసించే ప్రదేశాన్ని దృష్టిలో పెట్టు కొని చూస్తే ఈ సంఘటన గుహ నుండి బయటపడిన రెండో రోజు సంభవిం చిందని చెప్పవచ్చు.*

అబూ బక్ర్ (ర) మాత్రం మాటిమాటికి వెనక్కు తిరిగి చూస్తూనే ఉన్నారు. అదే సమయంలో నా గుర్రం ముందు కాళ్ళు రెండూ భూమిలో పాతుకొని పోయాయి. నేను గుర్రం మీది నుండి క్రిందపడిపోయాను. గుర్రాన్ని అదిలించి నప్పుడు అది లేచి నిలబడడానికి ప్రయత్నించింది. కాని తన కాళ్ళను ఎంతో కష్టం మీద భూమి నుండి లాగగలిగింది. అది సరిగా లేచి నిలబడగానే దాని గిట్టెల గురుతుల్లో నుండి పొగలాంటి ధూళి ఆకాశం వైపునకు పోతున్నట్లు కనిపించింది. తిరిగి నేను బాణాలతో శకునాన్ని చూశాను. అప్పుడు కూడా నాకు ఇష్టంకాని బాణమే బయటకు వచ్చింది. ఆ తరువాత నేను రక్షించమని వారినుద్దేశించి అరిచాను. వారు నిలబడిపోయారు, నేను నా గుర్రం ఎక్కి వారి దగ్గరకు చేరుకున్నాను. వారిని ఆపినప్పుడే, నా మనస్సులో, మహాప్రవక్త (స)గారి వ్యవహారమే ఆధిక్యత వహించగలదనే నమ్మకం నాటుకుపోయింది.

నేను, మహాప్రవక్త (స)తో, మీ జాతి మిమ్మల్ని పట్టి ఇచ్చినందుకు బహు మతిని ప్రకటించింది. నేను వారి ఎత్తుగడలను గురించి తమరికి తెలియజేయ డానికి వచ్చాను అని అంటూ నా చద్దిమూటను, నా దగ్గరున్న ఆయుధ సామగ్రిని వారికి అందించబోయాను. వారు నా వద్ద నుండి ఎలాంటి వస్తువును తీసుకోలేదు. నన్ను మరే ప్రశ్నా అడగలేదు. కేవలం, మా గురించి ఈ విషయం రహస్యంగా ఉంచమని చెప్పారు. ఆ తరువాత నేను, నాకు శాంతి పత్రాన్ని రాసివ్వమని అభ్యర్థించాను. మహాప్రవక్త (స) ఆమిర్ బిన్ ఫహీరాకు రాసి ఇవ్వమని ఆదేశించగా ఆయన ఓ తోలుపై శాంతి పత్రాన్ని రాసి నాకిచ్చారు. ఆ పిదప మహాప్రవక్త (స) ముందుకు సాగిపోయారు."[25]

ఈ సంఘటన గురించే హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇలా ఉల్లేఖించారు:

"మేము బయలుదేరినప్పుడు జాతి యావత్తూ మమ్మల్ని వెదకడంలోనే నిమగ్నమై ఉంది. అందులో కేవలం ఒక్క సురాకా బిన్ మాలిక్ బిన్ జాషమ్ తప్ప ఇంకెవ్వరూ మమ్మల్ని కనుగొనలేకపోయారు. అతను గుర్రమెక్కి వచ్చాడు. నేను అతణ్ణి చూసి, "దైవప్రవక్తా! అడిగో ఇతను మనల్ని వెంటాడి పట్టుకోడానికి వస్తున్నాడు" అని అన్నాను.

25. *సహీ బుఖారీ-1/554. బనీ ముద్లిజ్ నివాస స్థలం రాబిగ్‌కు దాపున ఉండేది. సురాఖా వారిని వెంటాడినప్పుడు మహాప్రవక్త (స) ఖదియాను దాటి వెళ్ళి పోయారు. (జాదుల్ ముఆద్-2/53) బహుశా గుహ నుండి బయటకు వెళ్ళిన మూడో రోజున ఈ వెంటాడే సంఘటన జరిగిందనడానికి ఇది గట్టి ఆధారం.*

"భయపడకండి, అల్లాహ్ మన వెంటే ఉన్నాడు" అని ధైర్యం చెప్పా రాయన.[26]

ఏది ఏమైనా, సురాకా మాత్రం వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు. ప్రజలు మహాప్రవక్త (స)ను పట్టుకోడానికి ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అతనికి కనబడిన ప్రతి చోటల్లా వారిని నిలువరించి, మీరు చేసే పనిని నేను ఇదివరకే చేసివేశాను. ఇక మీ పని పూర్తి అయిపోయింది వెనక్కు మళ్ళిపొండని వారందరిని ముందుకు పోకుండా అడ్డుకోనారంభించాడు. అంటే ఉదయం మహాప్రవక్త (స)ను పట్టుకోవాలని ప్రయత్నించినవాడు చివరికి ఆయనకు రక్షణగా నిలిచి కాపాడ ప్రయత్నం చేశాడన్నమాట.[27]

5. ప్రయాణం చేస్తున్నప్పుడు దారిలో బురైదా అస్లమీ అనే ఆయన దైవప్రవక్త(స)ను కలువడం జరిగింది. ఈయన తన జాతికి సర్దారు. ఖురైషులు ప్రకటించిన గొప్ప బహుమతిని పొందాలనే ఆశతో దైవప్రవక్త (స)ను పట్టుకో డానికి బయలుదేరినవాడు. కాని మహాప్రవక్త (స) ఎదురుబడగానే ఆయనతో మాట్లాడడం జరిగింది. వెంటనే ఆయన వైపునకు మొగ్గిపోయారు. తన జాతికి చెందిన డెబ్భయి మందితో సహా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిములై పోయారు. ఆ తరువాత తన తలపాగాను బరిశెకు కట్టి ఎగరవేశారు. ఆ తెల్లని వస్త్రం గాలిలో రెపరెపలాడుతూ, శాంతి దూత, సంధి ప్రదాత, ప్రపం చంలో న్యాయాన్ని ధర్మాన్ని వ్యాపింపజేసే న్యాయనిర్ణేత బయలుదేరి వస్తున్నా డనే శుభసందేశాన్ని అందించనారంభించింది.[28]

6. దారిలో దైవప్రవక్త(స)ను హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ (ర) కూడా కలిశారు. ఈయన ముస్లిముల ఓ వ్యాపార వర్గానికి చెందినవారు. సిరియా దేశం నుండి తిరిగి వస్తున్నారు. హజ్రత్ జుబైర్ (ర), దైవప్రవక్త (స) మరియు అబూ బక్ర్ (ర) ఇద్దరికీ తెల్లని వస్త్రాలు బహూకరించారు.[29]

ఖుబాకు అరుదెంచిన దైవప్రవక్త (స)

సోమవారం, రబీఉల్ అవ్వల్ 8వ తేదీ దైవదౌత్యశకం 14- అంటే హిజ్రీ

26. సహీ బుఖారి - 1/516
27. జాదుల్ మఆద్-2/53
28. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/101
29. సహీ బుఖారి-1/554

శకం ఒకటి- క్రీ.శ. 622 సెప్టెంబర్ 23వ తేదీ నాడు మహాప్రవక్త (స) ఖుబా అనే గ్రామానికి చేరుకున్నారు.[30]

హజ్రత్ ఉర్వా బిన్ జుబైర్ (ర)గారి కథనం ప్రకారం, మక్కా ముస్లిము లంతా మహాప్రవక్త (స) మదీనాకు బయలుదేరారనే వార్తను అప్పటికే విని ఉండడం వలన ప్రతి రోజు ఉదయాన్నే లేచి 'హర్రా' అనే ప్రదేశానికి వచ్చి ఆయన రాక కోసం ఎదురు చూసేవారు. బాగా ఎండ ముదిరే వరకు అక్కడే నిరీక్షించి ఇండ్లకు తిరిగి వెళ్ళిపోయేవారు. ఓ రోజు బాగా ఎదురు చూసిన తరువాత తమ ఇండ్లకు మళ్ళిపోయారు. అప్పుడే ఓ యూదుడు ఓ ఎత్తయిన తిన్నె పైకి ఎక్కి ఎదురుచూడనారంభించాడు. అంతలోనే దైవప్రవక్త (స), ఆయన సహచరులు తెల్లటి వస్త్రాలు ధరించి- ఆ వస్త్రాల నుండి వెన్నెల్లాంటి కాంతి బయటకు వస్తోంది- రావడం గమనించాడు. అతను సంతోషం పట్టలేక పెద్దపెట్టున, "ఓ అరబ్బుల్లారా! ఏ అదృష్టజాతకుని కోసం మీరు నిరీక్షిస్తున్నారో ఆ అదృష్ట జాతకుడు రానే వచ్చాడు" అని అరిచాడు. ఈ వార్త విన్నంతనే ముస్లిములంతా ఆయుధధారులై ఆయనను ఆహ్వానించడానికి పరుగు పరుగున వచ్చేశారు.[31]

ఇబ్నె ఖైమ్ కథనం ప్రకారం, ఈ వార్త విన్నంతనే బనీ అమ్రూ బిన్ ఔఫ్‌లో (ఖుబా ప్రజల్లో) నినదించారు. ముస్లిములు దైవప్రవక్త (స)గారి రాక గురించి కలిగిన ఆనందావేశయంలో నారయె తక్బీర్ చెబుతూ ఆహ్వానార్థం ముందుకు ఉరికారు. ఆయన్ను కలుసుకొని శుభాకాంక్షలు అందచేసి చుట్టూ మూగిపోయారు. ఆ సమయంలోనే ఆయన ప్రశాంతంగా ఉండిపోయారు. దైవవాణి అవతరించే సమయంలో అలా ప్రశాంతంగా ఉండిపోవడం మహా ప్రవక్త (స)కు పరిపాటి. అప్పుడే ఈ దివ్యావిష్కృతి అవతరించింది.

فَإِنَّ اللَّهَ هُوَ مَوْلَاهُ وَجِبْرِيلُ وَصَالِحُ الْمُؤْمِنِينَ ۖ
وَالْمَلَائِكَةُ بَعْدَ ذَٰلِكَ ظَهِيرٌ ۝

"ఒకవేళ ప్రవక్తకు వ్యతిరేకంగా మీరు ముఠా కట్టితే తెలుసుకోండి, అల్లాహ్ ఆయన యజమాని, ఇంకా జిబ్రీలు, సజ్జనులైన విశ్వాసులందరూ, దైవ దూతలందరూ ఆయన సహచరులు, సహాయకులూను."[32] (66 : 4)

31. సహీ బుఖారి-1/555
32. జాదుల్ మఆద్-2/54

ఉర్వా బిన్ జుబైర్ (ర) ఇంకా ఇలా అంటారు:

"అందరిని కలసిన తరువాత ఆయన (స), వారికి కుడి వైపునకు మళ్ళి బనీ అమ్రూ బిన్ ఔఫ్ తెగ వారు ఉంటున్న చోటికి చేరారు. అది సోమవారం రోజు. రబీఉల్ అవ్వల్ నెల. అబూ బక్ర్ (ర) వచ్చేవారిని ఆహ్వానించడానికి లేచి నిలబడ్డారు. మహాప్రవక్త (స) మాత్రం మాట్లాడకుండా కూర్చుని ఉన్నారు, అన్సారులు వచ్చీ రావడంతోనే దైవప్రవక్త(స)ను ఇదివరకు చూసి ఉండలేదు గనుక హజ్రత్ అబూ బక్ర్ (ర)కు సలాము చేస్తున్నారు. ఇలా మహాప్రవక్త (స)పై ఎండ వచ్చే వరకు అలానే జరుగుతూ ఉంది. ఇది చూసిన అబూ బక్ర్(ర) దైవప్రవక్త (స)పై ఎండ పడకుండా తన దుప్పటితో ఆచ్ఛాదన పట్టారు. అప్పుడు గాని వచ్చేవారికి వీరే దైవప్రవక్త (స) అని తెలియలేదు."[33]

మహాప్రవక్త (స) దర్శనార్థం, మదీనా మొత్తమే తరలి రానారంభించింది. ఇది ఓ చారిత్రాత్మకమైన దినం. ఇలాంటి సంఘటనను మదీనావాసులు ఇది వరకెన్నడూ చూసి ఉండలేదు. ఈ రోజు యూదులు కూడా దైవప్రవక్త (స) రాకకు సంబంధించిన భవిష్యవాణిని తమ కళ్ళారా చూడడం జరిగింది. వారి గ్రంథం 'జుకూక్'లో ఉన్న భవిష్యవాణి ప్రకారం, "అల్లాహ్ దక్షిణం నుండి మరియు ఆయన మహిమ ఫారాన్ కొండల్లో నుండి వచ్చింది" అని ఉంది.[34]

మహాప్రవక్త (స) 'ఖుబా'లో 'కుల్సూమ్ బిన్ బదమ్' - మరో ఉల్లే ఖనంలో 'సఅద్ బిన్ ఖైస్మా' - ఇంట విడిది చేశారు- మొదటి ఉల్లేఖనమే సరి అయిందని ఆధారాలున్నాయి.

ఇటు హజ్రత్ అలి (ర) బిన్ అబీ తాలిబ్ మక్కాలో మూడు రోజులు ఉండి, మక్కావాసులకు సంబంధించిన ఏ అమానతులైతే దైవప్రవక్త (స) ఆయనకు అప్పగించివచ్చారో వాటన్నిటినీ వాటి యజమానులకు అప్పజెప్పి మదీనా దారిబట్టారు. ఆ తరువాత 'ఖుబా'లోనే ఆయన్ను (స) కలుసుకొని కుల్సూమ్ బిన్ బదమ్ ఇంట్లో విశ్రాంతి తీసుకున్నారు.[35]

దైవప్రవక్త (స) ఖుబాలో మొత్తం నాల్గు రోజులు[36] (అంటే సోమవారం, మంగళవారం, బుధవారం మరియు గురు వారం)లేదా పదికంటే ఎక్కువ

33. సహీ బుఖారి-1/555

34. బైబిల్-జుఖూఖ్ గ్రంథం-3,3

35. జాదుల్ ముఆద్-2/54; ఇబ్నె హష్షామ్-1/493; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/102

36. ఇది ఇబ్నె ఇస్హాక్ కథనం. చూడండి, ఇబ్నె హష్షామ్-1/494. దీన్నే అల్లామా

రోజులు లేదా అక్కడకు చేరి బయలుదేరిన వరకు 24 రోజులు బస చేశారు. ఈ కాలంలోనే ఖుబా మస్జిద్ పునాదులు వేసి అందులో నమాజు చేశారు. ఇది దైవదౌత్యానికి సంబంధించిన ప్రప్రథమ మసీదు. దీని పునాదులు 'తక్వా' (దైవభీతి) పై పెట్టబడ్డాయి. అయిదవ రోజు (లేదా పన్నెండవ రోజు లేదా 26వ రోజు) శుక్రవారంనాడు- ఆయన(స) దైవాదేశం మేరకు వాహనమెక్కారు. అబూ బక్ర్ (ర) ఆయన వెనుక ఉన్నారు. ఆయన బనూ నజ్జార్‌కు- ఇది ఆయన (స) గారి మేనమామకు చెందిన తెగ - కబురు పంపించడం వలన వారంతా ఖడ్గధారులై అక్కడికి వచ్చి ఉన్నారు. ఆయన (వారి సంరక్షణలో) మదీనాకు బయలుదేరారు. బనూ సాలిమ్ బిన్ ఔఫ్ ఉండే ప్రదేశానికి చేరినప్పటికి జుమా నమాజు వేళ అయింది. మహాప్రవక్త (స) ఆ లోయ నడుమ, నేడు మస్జిద్ ఉన్న స్థలంలో నమాజు చేశారు. ఆయన వెనుక మొత్తం వంద మంది దాకా అప్పుడు ఉన్నారు.[37]

మదీనాలో ప్రవేశం

జుమా నమాజు చేసిన తరువాత మహాప్రవక్త (స) మదీనా చేరారు. అదే రోజున ఆ నగరం పేరు 'యస్రిబ్'కు బదులు 'మదీనతుర్రసూల్'గా పడి పోయింది (అంటే ప్రవక్తగారి నగరం అని అర్థం). దీన్నే ఇప్పుడు కేవలం మదీనాగా మాత్రమే పిలువడం జరుగుతోంది. ఇది ఉజ్వలమైన చారిత్రాత్మక

మన్సూర్‌పూరి కూడా అవలంబించారు. చూడండి, రహ్మతుల్ లిల్ ఆలమీన్-*1/102*. కాని సహీ బుఖారిలోని ఓ ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స) ఖుబాలో *24* రాత్రులు గడిపారని ఉంది *(1/61)*. కాని మరో ఉల్లేఖనంలో పది రాత్రుల కంటే కొన్ని రోజులు అధికంగానే *(1/555)* మరియు మూడవ ఉల్లేఖనంలో పదునాల్గు రాత్రులు *(1/560)* గడిపారని ఉంది. ఇబ్నె ఖైమ్ ఈ చివరి ఉల్లేఖ నాన్నే అనుస రించారు. అయితే ఇబ్నె ఖైమ్ దీన్ని వివరిస్తూ, మహాప్రవక్త (స) సోమవారం నాడు ఖుబాకు చేరారని, అక్కడి నుండి శుక్రవారం నాడు బయలుదేరారని చెప్పారు (జాదుల్ ముఆద్-*2/54,55*). సోమవారం మరియు శుక్రవారాలను రెండు వేరు వేరు వారాలకు సంబంధించినవిగా తీసుకుంటే చేరిన తేది మరియు బయలుదేరిన రోజును వదిలేస్తే మొత్తం రోజుల సంఖ్య పది అవుతుంది. ఆ రెండు రోజులను కూడా కలుపుకుంటే ఆ సంఖ్య పన్నెండు రోజులు అవుతుంది. ఇలా మొత్తం రోజులు 14 ఎలా అవుతాయి?

37. సహీ బుఖారి-1/555,560; జాదుల్ ముఆద్-2/55; ఇబ్నె హష్షామ్-1/494; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/102

మైన రోజు. నగరం వాడవాడల్లో, వీధుల్లో దైవ స్తోత్రాలు మిన్నుముడుతున్నాయి. అన్సార్‌కు చెందిన బాలికలు సంతోషాతిరేకంతో పాటలు పాడుతున్నారు. ఆ పాటల్లోని కొన్ని పంక్తులు ఇలా ఉన్నాయి:

"దక్షిణ దిశ కొండల్లో నుండి పున్నమి చంద్రుడు మాపై ఉదయించాడు.

ఆయన తెచ్చిన ధర్మం సత్యసందేశం ఎంత మేలైందో! దీనికి మనం అల్లాహ్‌కు కృతజ్ఞతలు చూపాలి.

నీకు విధేయత చూపటం మా విధి. నిన్ను నీ ప్రభువు మా కోసం పంపించాడు."[38]

అన్సార్‌లు (మదీనావారు) ఏమంత గొప్ప ధనికులు కూడా కాదు. అయినా దైవప్రవక్త (స) తమ వద్దనే ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకోనారంభించారు. మహాప్రవక్త (స) అన్సార్‌లకు చెందిన ఏ ఇంటి ముందునుంచైనా, ఏ వాడలో నుండి అయినా వెడుతూ ఉంటే ప్రజలు వచ్చి ఆయన స్వారీ చేస్తున్న ఒంటె ముక్కు త్రాటిని పట్టుకొని ఆపడానికి ప్రయత్నం చేస్తున్నారు. దైవప్రవక్త (స)ను తమ ఇంటికి వచ్చి దిగమని వేడుకుంటున్నారు. కాని మహాప్రవక్త (స) మాత్రం, "ఒంటె ముక్కు త్రాటిని వదిలేయండి. ఇది అల్లాహ్ ఆదేశాన్ని అనుసరించి నడుస్తోంది" అని చెప్పేవారు. ఇలా ఒంటె నడుస్తూనే ఉంది. ఈనాడు మస్జిదె నబవీ ఉన్న చోటికి వచ్చి కూర్చుండి పోయింది. అయినా మహాప్రవక్త (స) క్రిందికి దిగలేదు. ఆ ఒంటె తిరిగి లేచింది. కొంత దూరం వెళ్ళి తిరిగొచ్చి అదే స్థలంలో కూర్చుండిపోయింది. అప్పుడుగాని దైవప్రవక్త (స) క్రిందికి దిగలేదు. ఇది ప్రవక్త (స) అమ్మమ్మగారి తెగ బనూ నజ్జార్‌కు చెందిన వాడ. ఆయన మనోగతం కూడా అక్కడనే ఆగాలని ఉంది.

38. ఈ పద్యపాదాలను అల్లామా మన్సూర్‌పూరి అనువదించారు. అల్లామా ఖైమ్ తన గ్రంథంలో ఈ పద్యపాదాలు తబూక్ యుద్ధానంతరం దైవప్రవక్త (స) మదీనాకు తిరిగివచ్చినప్పుడు చదువుబడిన పద్య పంక్తులు అని, మదీనా ప్రవేశమప్పుడు చదివినట్లుగా ఉల్లేఖించిన వ్యక్తి పొరబడ్డారని రాశారు (జాదుల్ ముఆద్-3/10). కాని అల్లామా ఖైమ్ మాత్రం పొరబడడానికి కావలసిన ఆధారాలు చూపెట్టలేకపోయారు. దీనికి భిన్నంగా అల్లామా మన్సూర్‌పూరి మాత్రం ఈ పద్యపాదాలు దైవప్రవక్త (స) మదీనాలో ప్రవేశించినప్పుడే చదవబడ్డాయని అంటారు. ఆయన కొట్టిపారవేయలేని ఆధారాలను కూడా చూయించారు. చూడండి, రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/106

దానికి అల్లాహ్, ఆ ఒంటెను అక్కడే ఆగమని ఆదేశించాడు. బనూ నజ్జార్ తెగవారు ఆయన్ను (స) తమ తమ ఇండ్లకు గొనిపోవడానికి విన్నపాలు చేయనారంభించారు. కాని హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (ర) మాత్రం అంబారీతో సహా ఆయన్ను ఎత్తుకొని తన ఇంటిదారి పట్టారు. ఇటు హజ్రత్ అసఅద్ బిన్ జురారా (ర) వచ్చి దైవప్రవక్త (స) గారి ఒంటె ముక్కుతాడు పట్టుకొని తన ఇంటికి గొనిపోయారు. ఆ ఒంటె ఆయన దగ్గరనే ఉండిపోయింది.[39]

సహీ బుఖారిలో హజ్రత్ అనస్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది.

దైవప్రవక్త (స), "ఇక్కడకు ఎవరి ఇల్లు దగ్గర్లో ఉంది?" అని అడగగా హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (ర), "నా ఇల్లు! దైవప్రవక్త (స)! అదిగో నా ఇల్లు. ఇదే దాని గుమ్మం" అని అన్నారు. మహాప్రవక్త (స) ఆయనతో, "వెళ్ళండి, వెళ్ళి సేద తీర్చుకోడానికి నా కోసం చోటును చూడండి" అని అన్నారు. హజ్రత్ అబూ అయ్యూబ్ (ర), "పదండి, మీరిద్దరూ పదండి. అల్లాహ్ శుభాలు చేకూరుస్తాడు" అని అన్నారు.[40]

కొన్ని రోజులు గడిచిన తరువాత ఆయన (స) సతీమణి ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ సౌదా (ర), ఆయన ఇద్దరు కుమార్తెలు హజ్రత్ ఫాతిమా (ర) మరియు ఉమ్మె కుల్సూమ్ (ర), హజ్రత్ ఉసామా బిన్ జైద్ (ర) మరియు ఉమ్మె అయిమన్ (ర)లు కూడా మదీనాకు విచ్చేశారు. వారందరిని హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీ బక్ర్ (ర), అబూ బక్ర్ (ర) కుటుంబంతో సహా తోడ్కొని వచ్చారు. ఈ కుటుంబంలో హజ్రత్ ఆయిషా (ర) కూడా ఉన్నారు. అయితే మహా ప్రవక్త(స)గారి మరో పుత్రిక హజ్రత్ జైనబ్ (ర), హజ్రత్ అబుల్ ఆస్ (ర) గారి ఇంట్లోనే ఉండిపోయారు. ఆయన ఆమెను మదీనాకు రానివ్వకుండా నిలువరించి ఉంచారు. ఆమె బద్ర్ యుద్ధం తరువాతగాని మదీనా చేరలేకపోయారు.[41]

హజ్రత్ బిలాల్ (ర) గారికి కొంత స్వస్థత చేకూరినప్పుడు గొంతువిప్పి బాధాకరంగా కలువరిస్తూ, "మక్కా లోయలో నేను ఏ రాత్రి అయినా గడపగలనా? నా చుట్టూ ఇజ్ఖుర్ మరియు జలీల్ (గడ్డి) ఉంటాయా? ఏ రోజైనా

39. జాదుల్ ముఆద్-2/55; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/106

40. సహీ బుఖారి-1/556

41. జాదుల్ ముఆద్-2/55

నేను మజిన్నా చెలమ దగ్గరకు పోగలనా? నాకు షామా మరియు తుఫైల్ (కొండలు) కనిపిస్తాయా?" అంటూ తన బాధను వ్యక్తపరిచేవారు.

హజ్రత్ ఆయిషా (ర) మహాప్రవక్త (స) గారి సన్నిధికి వెళ్ళి బిలాల్ (ర) గారి ఈ పరిస్థితినే తెలుపగా ఆయన (స), "ఓ అల్లాహ్! మా దృష్టిలో ఈ మదీనాను మక్కా వలెనే ప్రియమైనదిగా చెయ్యి. దానికంటే మరింత ప్రియమైనదిగా చెయ్యి. ఈ మదీనా వాతావరణాన్ని మా కోసం ఆరోగ్యవంతమైనదిగా మలుచు. దీని 'సాఅ' మరియు 'ముద్' (ధాన్యం కొల పాత్రలను) లకు శుభాన్ని చేకూర్చు. ఇక్కడి ఉష్ణోగ్రతను తగ్గించి దాన్ని హుజ్ఫాకు తరలించు"[42] అని ప్రార్థించారు. అల్లాహ్ దైవప్రవక్త (స) గారి ప్రార్థనను మన్నించాడు. పరిస్థితులు మారిపోయాయి.

ఇక్కడి వరకు పవిత్ర జీవిత చరిత్రకు సంబంధించిన ఓ దశ మరియు ఇస్లామీయ సందేశ ప్రచారానికి సంబంధించిన ఓ శకం (అంటే మక్కా జీవిత కాల శకం) పూర్తి అయింది.

42. సహీ బుఖారి-1/588,589





మదీనాలో గడిపిన పవిత్ర జీవితం

మదీనాలో గడిపిన పవిత్ర జీవితం

మదీనా జీవితం

మదీనా శకాన్ని కూడా మూడు దశలుగా విభజించవచ్చు.

1. మొదటి దశ: ఈ దశలో ఉపద్రవాలు, ప్రతిబంధకాలు సృష్టించ బడ్డాయి. అంతర్గతంగా ఎన్నో అవరోధాలు నిలబెట్టబడ్డాయి. బయట నుండి శత్రువులు మదీనాను తుడిచిపెట్టడానికి దాడులు చేశారు. ఈ దశ హుదైబియా ఒప్పందం హిజ్రీ శకం ఆరు, జీఖాదా మాసంతో అంతమైపోయింది.
2. రెండో దశ: ఈ దశలో బహుదైవారాధకులు, విగ్రహారాధకుల నాయకులతో సంధి కుదిరింది. ఇది మక్కా విజయం రమజాన్ నెల హిజ్రీ శకం ఎనిమిదితో అంతమైంది. ఈ దశలోనే ప్రపంచ దేశాల రాజులకు దైవ సందేశాన్ని అందించడం జరిగింది.
3. మూడవ దశ: ఈ దశలో ప్రజలు గుంపులు గుంపులుగా దైవధర్మం అయిన ఇస్లామ్ ఛత్రఛాయలోనికి వచ్చి చేరారు. ఈ దశలోనే మదీనాలో జాతులు, తెగలకు సంబంధించిన ప్రతినిధి బృందాల రాక ప్రారంభమైంది. ఈ దశ మహాప్రవక్త (స)గారి జీవితపు తుది ఘడియ వరకు అంటే, పదకొండు రబీఉల్ అవ్వల్, హిజ్రీ శకం పదకొండు వరకు వచ్చి ఆగుతుంది.

హిజ్రత్ నాటి మదీనా పరిస్థితులు

'హిజ్రత్' అంటే కేవలం ఉపద్రవాలకు, అపహాస్యాలకు బలికాకుండా మరో చోట రక్షణ పొందడం అనేది ఒక్కటే కాదు, ఓ ప్రశాంత ప్రదేశంలో స్థిరపడి ఓ నవ సమాజ నిర్మాణంలో సహకారం అందించడం అనే భావన కూడా ఇందులో ఇమిడి ఉంది. అందుకనే ప్రతి స్థితిమంతుడైన ముస్లిమ్ తన క్రొత్త ఆశ్రయ నిర్మాణంలో పాల్గొనవలసి ఉంటుందనే ఆదేశం ఉంది. అది అతనిపైగల విధి. ఇందుకోసం అతడు దాని పటిష్టతకు, రక్షణకు మరియు దాని ప్రతిష్ఠకు కృషి చేయవలసి ఉంటుంది.

ఈ నవ సమాజ నిర్మాణ కార్యక్రమాన్ని చేబట్టిన వ్యక్తి హజ్రత్ ముహమ్మద్(స) ఒక్కరే అన్నది నిర్వివాదాంశం. దానికి నాయకత్వం కూడా ఆయనే (స) వహించాలి. అందుకని ఎలాంటి అభిప్రాయభేదం లేకుండా వ్యవహారాలన్నీ ఆయనే(స) నిర్వహిస్తూ ఉండేవారు.

మదీనాలో ప్రవక్తశ్రీ(స)కి మూడు రకాల వర్గాలతో సంబంధాలు ఏర్పర్చుకోవలసివచ్చింది. ఈ మూడు రకాల వర్గాల పోకడలు భిన్నమైన పోకడలు. ప్రతి వర్గానికి కొన్ని ప్రత్యేక సమస్యలున్నాయి. ఈ సమస్యలు ఇతరులకంటే భిన్నమైనవి. ఈ మూడు వర్గాలు ఇవి:

మొదటి వర్గం: ప్రవక్తశ్రీ (స)ని అనుసరించే అనుచరగణాలకు చెందిన ప్రత్యేక వర్గం.

రెండవ వర్గం: మదీనాకు చెందిన పురాతన తెగలకు సంబంధించిన బహుదైవారాధ కుల వర్గం. ఇది రెండో వర్గం. ఇది ఇంకా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించ లేదు.

మూడవ వర్గం: యూదుల వర్గం.

(అ) **మొదటి వర్గం:** దైవప్రవక్త (స)కు ఏ పరిస్థితులైతే ఇక్కడ ఎదురయ్యాయో, ఆ పరిస్థితులు మక్కా పరిస్థితుల కంటే పూర్తిగా భిన్నమైనవి.

మక్కాలో వారంతా ఒకే కలిమా (సద్వచనం)పై అమలుచేసినవారు. వారి ధ్యేయం కూడా ఒక్కటి గానే ఉండేది. కాని వీరు అక్కడ వివిధ వంశాల్లో, కుటుంబాల్లో విస్తరించి, మక్కావాసుల ఆగడాలకు బలి అవుతూ నిస్సహాయ జీవితాన్ని గడిపిన వారు. వీరి దగ్గర ఎలాంటి అధికారమూ లేదు. అధికారాలన్నీ ధర్మవిరోధుల చేతుల్లోనే ఉండేవి. ప్రపంచ మానవ సమాజం ఏయే ఘట్టాల ద్వారా ఉనికిలోనికి వస్తుందో ఆ ఘట్టాలుగాని, శక్తిసామర్థ్యాలుగాని అప్పటి ముస్లిమ్ సమాజానికి లేకుండాపోయాయి. ఇస్లామియ సమాజ నిర్మాణాన్ని చేబట్టే అవకాశమే వారికి లభించలేదు. మక్కాలో అవతరించిన దివ్యఖుర్ఆన్ మక్కీ సూరాల్లో (అధ్యాయాల్లో) కేవలం ఇస్లామియ మౌలిక సిద్ధాంతాలనే వివరంగా చెప్పడం జరిగింది. వ్యక్తిగతంగా అవలంబించగల ఆదేశాలే అవతరించాయి అక్కడ. అదేకాకుండా సదాచారులై ఉండాలంటూ, నైతికత విలువలను కాపాడుకోవా లంటూ ప్రోత్సహించడం, తుచ్ఛమైన, నీచమైన పనుల జోలికి పోకుండా ఉండాలనే ఆదేశాలు మాత్రమే ఇవ్వడం జరిగింది ఆ ఆయత్‌లలో.

దీనికి భిన్నంగా మదీనా ముస్లిముల నాయకత్వ పగ్గాలు ప్రారంభ రోజు నుండే ముస్లిముల చేతిలోనికి వచ్చాయి. వాటిపై ఇతరుల పెత్తనం ఏమాత్రం లేదు. కాబట్టి ముస్లిములకు సభ్యతాసంస్కారాలు, ఆర్థిక ఉపాధి సదుపాయాలు, రాజకీయం మరియు అధికారం, యుద్ధం మరియు సంధిలాంటి సమస్యలను ఎదుర్కొనే సమయం ఆసన్నమైంది. కాని హలాల్ మరియు హరాం (ధర్మసమ్మతమైన మరియు నిషిద్ధమైన వస్తువులు), ఆరాధనలు, నైతికతల్లాంటి సమస్యలను తరచిచూడవలసిన అవసరం ఏర్పడింది.

ముస్లిములు జీవితంలోని అన్ని ఘట్టాల్లో, ప్రపంచ మానవాళిలో చెలామణి అవుతున్న అప్పటి అజ్ఞాన సమాజానికి భిన్నమైన ఓ ప్రత్యేక నవ సమాజ నిర్మాణం చేబట్టవలసిన ఆవశ్యకత ఏర్పడింది. గత పదేళ్ళ వరకు ఏ కష్టాలను, దౌర్జన్యాలను సహిస్తూ వచ్చారో ఆ నవ సమాజాన్ని స్థాపించి దానిపై నడిచి ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచే తరుణం కూడా ఆసన్నమైంది.

ఈ నవ సమాజ నిర్మాణం ఒక్క రోజులోనో లేదా ఒక నెలలోనో సాధ్యం అయ్యే పని కాదు. దీని కోసం ఓ సుదీర్ఘ సమయం కావాలి. దాని కోసం, ఈ కాలంలో క్రమక్రమంగా, దశలవారీగా ఆదేశాలు రావలసి ఉంది. అలాగే, చట్ట

నిర్మాణం, దాని కోసం శిక్షణ ఆ తరువాత దాన్ని ప్రవేశపెట్టడంతో ఆ పని పూర్తి కావలసి ఉంది. ఆదేశాలు, చట్టాల విషయానికొస్తే వాటిని సమకూర్చే వ్యవహారం మాత్రం సృష్టికర్త అయిన అల్లాహ్‌దే. ముస్లిములను ఆ ఆదేశాల వైపునకు, చట్టాల వైపునకు నడిపించే బాధ్యత మహాప్రవక్త (స) గారి పవిత్ర భుజస్కంధాలపై ఉంది. ఈ విషయం గురించి దైవగ్రంథం ఇలా సెలవిస్తోంది:

هُوَ الَّذِىْ بَعَثَ فِى الْاُمِّيّٖنَ رَسُوْلًا مِّنْهُمْ يَتْلُوْا عَلَيْهِمْ اٰيٰتِهٖ وَ يُزَكِّيْهِمْ
وَيُعَلِّمُهُمُ الْكِتٰبَ وَالْحِكْمَةَ ۗ وَاِنْ كَانُوْا مِنْ قَبْلُ لَفِىْ ضَلٰلٍ مُّبِيْنٍ ۙ

"ఆయనే నిరక్షరాస్యులలో (ఉమ్మీలలో) ఒక ప్రవక్తను స్వయంగా వారి నుండే లేపాడు. ఆ ప్రవక్త వారికి ఆయన వాక్యాలను వినిపిస్తున్నాడు, వారి జీవితాలను తీర్చిదిద్దుతున్నాడు, వారికి గ్రంథాన్నీ వివేకాన్నీ బోధిస్తున్నాడు. వాస్తవానికి దీనికి పూర్వం వారు పూర్తిగా మార్గం తప్పి ఉన్నారు." (62 : 2)

ఇటు సహాబా(ర) (మహాప్రవక్త (స) గారి అనుచరగణం) పరిస్థితి, దైవప్రవక్త (స) నోట ఏ ఆదేశం వస్తుందా అని నిరీక్షిస్తూ ఉండే పరిస్థితి. ఈ పరిస్థితిని గూర్చి కూడా దైవగ్రంథం ఇలా వివరిస్తోంది:

وَاِذَا تُلِيَتْ عَلَيْهِمْ اٰيٰتُهٗ زَادَتْهُمْ اِيْمَانًا

"నిజమైన విశ్వాసుల హృదయాలు అల్లాహ్ ప్రస్తావన విన్నంతనే భయంతో కంపిస్తాయి. వారి సమక్షంలో అల్లాహ్ వాక్యాలు పారాయణం చేయబడినప్పుడు వారి విశ్వాసం ద్విగుణీకృతమవుతుంది." (8 : 2)

ఈ వివరాలన్నిటినీ క్రోడీకరించడం మన విషయానికి సంబంధించిన విషయం కాదు కాబట్టి అవసరం వచ్చినప్పుడే చర్చించుకుందాం.

మొత్తానికి, ముస్లిముల వర్గంలో రెండు రకాల వ్యక్తులు ఉన్నారు. ఒక రకం ముస్లిములు స్వయంగా తమ పొలాల్లో, తమ ఇండ్లలో, తమ సిరిసంపదల్లో సంతోషంగా కాలం గడిపే ముస్లిములు. అంటే, ఇతరులు కష్టపడి ఉపాధిని సంపాదించేటట్లు వారు కష్టపడే అవసరంలేని స్థితిమంతులు. ఈ వర్గం అన్సార్‌కు చెందిన వర్గం. వారి నడును తాతముత్తాతల నుండి దృఢమైన శత్రుత్వం, విద్వేషం ఉంటూ వచ్చేవి. వారికి తోడు రెండో వర్గం ముహాజిర్ల వర్గం. వీరికి ఈ రాయితీలుగాని, డబ్బుగాని లేదు. వీరు కొల్లగొట్టబడి ఉత్త

చేతులతో మదీనా చేరినవారు. వీరికి తలదాచుకోడానికి ఇల్లుగాని, పొట్టపోసుకోడానికి ఉపాధిగాని లేదు. వీరి ఉపాధికి ఏ ఒక్కరూ పని కూడా ఇవ్వని పరిస్థితి. అంతేకాదు, ఈ ముహాజిర్ల సంఖ్య కూడా తక్కువ ఏమీ కాదు. రోజురోజుకు పెరిగిపోతూనే ఉన్నారు వీరు. దీనికి కారణం, దైవప్రవక్త (స)ను విశ్వసించిన వారంతా హిజ్రత్ చేసి మదీనాకు వచ్చేయాలనే ప్రకటన వెలువడడం. మదీనాలో కావలసినంత ధనంగాని, ఆదాయ వనరులుగాని అంతగా లేని విషయం తెలిసిందే. కాబట్టి మదీనా ఆర్థిక సంతులనం చెడిపోయింది. ఈ గడ్డు పరిస్థితిలోనే ఇస్లామ్ విరోధ శక్తులు కూడా మదీనాతో ఆర్థిక తెగతెంపులు చేసి బాయికాట్‌ను ప్రకటించాయి. దానివల్ల మదీనాకు దిగుమతులు ఆగిపోయాయి. పరిస్థితులు మరింత క్షీణించిపోయాయి.

(ఆ) రెండో వర్గం: అంటే మదీనాకు చెందిన బహుదైవారాధక ప్రజలు. వీరికి ముస్లిములపై ఎలాంటి పెత్తనం లేదు. కొందరు బహుదైవారాధకులు తమ తాతతండ్రుల నుండి వచ్చే ధర్మాన్ని విడనాడడానికి సందిగ్ధంలో పడిపోయి ఎటూ తేల్చుకోలేకుండా ఉన్నారు. అయితే వారి మనస్సుల్లో మాత్రం ముస్లిముల ఎడల ఎలాంటి శత్రుత్వంగాని, విద్వేషంగాని లేవు. ఇలాంటి కొందరు కొంతకాలం గడిచిన తరువాత ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిములైపోయారు. ఆ తరువాత వారు ఇస్లామ్ కోసం తమ ప్రాణాలనైనా పణంగా పెట్టడానికి సిద్ధపడ్డారు.

దీనికి భిన్నంగా కొందరు బహుదైవారాధకులైతే దైవప్రవక్త (స) మరియు ముస్లిముల ఎడల తమ మనస్సుల్లో విద్వేషాన్ని ఉంచుకొని దాన్ని బయట పడకుండా జాగ్రత్తపడేవారు. పైగా, పరిస్థితులకు ప్రభావితులై దైవప్రవక్త (స) ముందు దొంగ ప్రేమను, బూటకపు నాటకం ఆడడానికి కూడా వెనుకాడేవారు కారు. వీరిలో 'అబ్దుల్లా బిన్ ఉబై బిన్ సలూల్' ప్రముఖుడు. ఇదివరకు జరిగిన బుఆస్ యుద్ధంలో అతణ్ణి నాయకునిగా చేసుకుందాం అని అవస్ మరియు ఖజ్రజ్ తెగలు నిర్ణయం తీసుకుని ఉన్నాయి. అయితే అంతకు ముందు ఈ రెండు తెగలు ఎవరినీ ఏకగ్రీవంగా నాయకునిగా ఎన్నుకున్న సందర్భాలు లేవు. అయితే బుఆస్ యుద్ధం తరువాత అతని తలపై కిరీటాన్ని అలంకరించి అతణ్ణి తమ రాజుగా చేసుకోడానికి ఈ రెండు తెగలు ప్రకటించి ఉన్నాయి కూడా. అంటే

ఇతను మదీనాకు రాజు అయ్యే లోపలే హఠాత్తుగా దైవప్రవక్త (స) మదీనాకు అరుదెంచడం జరిగింది. అతని వైపు ప్రజల ధ్యాసే లేకుండా పోయింది. మదీనా వాసులంతా మహాప్రవక్త (స) వైపునకే మ్రొగ్గి అతణ్ణి ఉపేక్షించడం జరిగింది. కాబట్టి అతను దైవప్రవక్త (స) తన రాచరికాన్నే లాక్కున్నాడని అనుకొని, తన మనస్సులో దైవప్రవక్త(స) మీద కక్ష కట్టాడు. బద్ర్ యుద్ధం జరిగాక పరిస్థితులు అతనికి అనుకూలంగా లేకపోవడం వలన షిర్క్ (బహుదైవారాధన)పై స్థిరంగా ఉంటే తనకు ప్రాపంచిక ప్రయోజనం ఏదీ లభించదనే ఉద్దేశ్యంతో ప్రజలను నమ్మించడానికి ఇస్లామ్ స్వీకారం చేస్తున్నట్లు ప్రకటించాడు. అప్పటికి అతను దైవ తిరస్కారియే. కాబట్టి మహాప్రవక్త (స) మరియు ముస్లిములకు కీడు చేసే అవకాశం ఏమాత్రం లభించినా వదలి పెట్టేవాడు కాదు. అతనికి రాచరికం లభిస్తే, గొప్ప గొప్ప పదవులను దండు కుందాం అని ఎదురుచూసిన ధనవంతులు కూడా అతని ఈ వైఖరికి వంత పాడేవారు, అతనికి సహాయపడేవారు ఈ విషయంలో. ఇదేకాదు ఒక్కొక్క ప్పుడు యువకులు, అమాయకులైన ముస్లిములను సైతం చాకచక్యంగా లోబరుచుకునేవారు.

(ఇ) మూడవ వర్గం యూదుల వర్గం: వీరు అష్వరీల మరియు రోమనుల దౌర్జన్యాలను సహించలేక పారిపోయి వచ్చి మదీనాలో స్థిరపడిన విషయం ఇదివరకే చెప్పుకున్నాం. వాస్తవంగా వీరు హిబ్రూ జాతివారు. కాని హిజాజ్ (అరేబియా)లో స్థిరపడిన తరువాత వారి వేషధారణ, భాష, సభ్యతాసంస్కా రాలన్నీ అరబ్బుల రంగును పులుముకున్నాయి. చివరికి వారి వంశాలు, తెగల పేర్లు కూడా అరబ్బు వంశాలు, తెగల పేర్లుగా మారిపోయాయి. వీరు అరబ్బులతో వివాహ సంబంధాలు కూడా ఏర్పర్చుకోవడం జరిగింది. అయితే ఇంత జరిగినా జాతి దురభిమానం మాత్రం వారిని వదిలిపెట్టలేదు. వారు అరబ్బుల్లో చేరకుండా, బనీ ఇస్రాయీల్, యూద జాతిగా గర్వపడేవారు. అలా అరబ్బుల్ని నీచంగా చూస్తూ వారిని 'ఉమ్మీ'లుగా పిలిచేవారు. ఉమ్మీ అంటే నిరక్షరాస్యుడు, తెలివిలేనివాడు, అనాగరికుడు, నీచుడు మరియు దళితుడు, అస్పృశ్యుడని అర్థం. వీరి నమ్మకం ప్రకారం, అరబ్బుల సంపద వారికి ధర్మసమ్మతమైనది, దాన్ని తమ ఇష్టమొచ్చినట్లు వ్యయపరచవచ్చు. వీరి ఈ వైఖరిని దైవగ్రంథం ఇలా వివరిస్తోంది.

"గ్రంథ ప్రజలలో ఒకడు ఎలాంటి వాడంటే, అతడిపై నమ్మకంతో మీరు ధన, కనక రాశిని అప్పగించినా, దానిని అతడు మీకు తిరిగి ఇస్తాడు. మరొకడు, కేవలం ఒక దీనార్ విషయంలో కూడా మీరు అతణ్ణి నమ్మితే, అతడు దానికి, మీరు అతడి నెత్తిపై నిలుచుంటే తప్ప తిరిగి ఇవ్వడు. వారి ఈ నైతిక స్థితికి కారణం, వారు ఈ విధంగా అనుకోవడమే.

قَالُوا لَيْسَ عَلَيْنَا فِي الْأُمِّيِّينَ سَبِيلٌ

"ఉమ్మీల (యూదేతరులు) వ్యవహారంలో మమ్మల్ని పట్టుకోవడం జరగదు." (3 : 75)

అంటే, ఉమ్మీల సొమ్మును కాజేసినా మమ్మల్ని ప్రశ్నించడం జరగదు అని అర్థం. ఈ యూదుల్లో తమ ధర్మ ప్రచారం ఎడల ఎలాంటి ఆసక్తి ఉండేది కాదు. వారి వద్ద మిగిలిపోయిన వారి ధర్మమల్లా, జ్యోతిష్యం, ఇంద్రజాలం, భూతవైద్యం, మంత్రతంత్రాలే. ఇవే వారికి సర్వస్వం. వీటిని చూసుకొని వారు మా అంతటి జ్ఞానులు, ధార్మిక నాయకులు ఇంకెవ్వరూ లేరని విర్రవీగేవారు.

యూదులకు ధనార్జన కళల్లో మంచి ప్రావీణ్యం ఉండేది. ధాన్యం, ఖర్జూరం, సారాయి మరియు వస్త్ర వ్యాపారం అంతా వారి చేతుల్లోనే ఉండేది. వీరు ధాన్యాన్ని, సారాయిని దిగుమతి చేసుకుంటూ ఖర్జూరాన్ని ఎగుమతి చేసే వారు. ఇదే కాకుండా వీరికి మరిన్ని వ్యాపకాలు కూడా ఉండేవి. తమ వ్యాపార సామగ్రిని రెండింతలు, మూడంతల లాభాలతో అరబ్బులకు విక్రయించే వారు. అంతటితో సరిపుచ్చుకోకుండా వడ్డీ వ్యాపారం కూడా చేసే వారు. అరబ్బు షేకులకు పెద్ద మొత్తంలో డబ్బును వడ్డీకిచ్చేవారు. ఈ డబ్బును ఆ సర్దారులు తమ బడాయి కోసం ఖర్చుపెడుతూ తమను పొగిడే కవులకు, భట్రాజులకు కానుకలుగా సమర్పించి గర్వపడేవారు. ఇటు ఈ యూదులు ఈ రుణం క్రింద వారి ఆస్తుల్ని, భూమిని, పొలాలను, తోటలను కుదవపెట్టుకునే వారు. అలా కొన్నేళ్ళ తరువాత వాటికి యజమానులైపోయేవారు.

ఈ యూదులు కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ యుద్ధజ్వాలల్ని రేకెత్తిం చడంలో మహా మేధావులు. ఎంతో విజ్ఞతతో తమ చుట్టూ నివసిస్తున్న తెగల్లో వైషమ్యాలను రేకెత్తించి, ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని ఉసిగొల్పి తమాషా చూసేవారు. ఆ తెగలకు వీరి కుతంత్రాలను గురించి ఏ మాత్రం తెలియకుండా

జాగ్రత్తపడేవారు. ఈ కారణంగా ఆ తెగల్లో, ప్రజ్వరిల్లే క్రోధాగ్ని, యుద్ధ జ్వాల లుగా రగిలి ఆరని చిచ్చులా తయారయ్యేది. ఒకవేళ ఈ యుద్ధ జ్వాలలు చల్లారుతున్నట్లు కనబడితే యూదుల చేతులు దానికి ఆజ్యం పోసి మరింత రగిల్చేవి. ఈ తెగల్లో యుద్ధాలను రేకెత్తించి తమకు తెలియనట్లు ఓ మూలన కూర్చుని తమాషా చూస్తూ ఉండేవారు. అయితే ఆ యుద్ధాలు ఆగిపోకుండా పెద్ద మొత్తంలో డబ్బును వడ్డీలకిచ్చి జాగ్రత్తపడేవారు. ఇలా వారు, తమ యూద సమాజాన్ని సంరక్షించుకుంటూ, మరో వైపు తమ వడ్డీ వ్యాపారం చల్లబడకుండా చూస్తూ చక్రవడ్డీ ద్వారా తమ సంపదను పెంచుకుంటూ ఉండేవారు.

యస్రిబ్‌లో నివసిస్తున్న ఆ మూడు ప్రముఖ యూద తెగలు ఇవి:

1. బనూ ఖైనుఖా. ఇది ఖజ్రజ్ తెగకు అండదండలుగా ఉండే తెగ. వీరి నివాసం మదీనా.
2. బనూ నజీర్.
3. బనూ ఖురైజా. ఈ రెండు తెగలు అవస్ తెగకు మిత్రపక్షాలు. వీరు మదీనా చుట్టుపట్ల నివసించే యూద తెగలు.

ఎప్పటి నుండో ఈ తెగలే అవస్ మరియు ఖజ్రజ్ తెగల నడుమ యుద్ధ జ్వాలల్ని రేకెత్తిస్తున్న తెగలు. బుఆస్ యుద్ధంలో తమ తమ మిత్రపక్షాలకు తోడు నిలిచాయి కూడా.

ఇస్లామ్ పట్ల శత్రుత్వం వహించడంలో ఈ యూద తెగలు ముస్ముందు ఉండేవి. వారి నైజమే అది. ఎందుకంటే, వారి ప్రవృత్తిని, వారి నైజాన్ని స్థిమితంగా ఉంచడానికి ప్రవక్త రావాలి. అయితే ఇప్పుడు వచ్చిన దైవప్రవక్త మాత్రం వారి జాతికి చెందినవాడు కాదు. అదేకాకుండా ఇస్లామ్ సందేశం భగ్న హృదయాలకు సాంత్వన చేకూర్చి వైషమ్యాలను రూపుమాపే సందేశం. అన్ని వ్యవహారాల్లో నీతీ నిజాయితీలను నెలకొల్పి పవిత్రమైన, ధర్మసమ్మతమైన విషయాల వైపునకు ఆహ్వానించే ధర్మం. అంటే యస్రిబ్‌కు చెందిన తెగలన్నీ పరస్పరం ఒకటైపోవా లన్నది దీని అర్థం. ఇలాంటి పరిస్థితుల్లో అవి తప్పకుండా యూదుల కబంధ హస్తాల నుండి బయటపడిపోకతప్పదు. ఫలితంగా యూదుల వ్యాపార కార్య కలాపాలన్నీ నిరుగారిపోగలవు. వారి వడ్డీ వ్యాపారం కాస్తా దివాలా తీస్తుంది. ఇదేకాదు, ఈ తెగలు మేల్కొని, వారు హస్తగతం చేసుకున్న ఆస్తుల్ని, వడ్డీ క్రింద

జమ కట్టుకున్న పొలాలను, తోటల్ని ఎక్కడ లాక్కుంటారో అనే భయం కూడా వారికి పట్టుకుంది.

ఇస్లామీయ సందేశం, మదీనాలో తన నివాసాన్ని ఏర్పర్చుకోదలుచు కుంటున్న విషయాన్ని గమనించిన యూదులు, ఆనాటి నుండే రాబోయే పరిణామాలను గురించి అంచనా వేయనారంభించారు. అందుకనే దైవప్రవక్త (స) మదీనాలో అవతరించినప్పటి నుండే ఇస్లామ్ మరియు ముస్లిముల పట్ల వారి శత్రుత్వం పెరగనారంభించింది. ఈ విషయాన్ని చాలాకాలం గడిచిన తరువాతగాని వారు బయటపెట్టలేదు. దీనికి సంబంధించిన వివరాలు ఇబ్నె ఇస్‌హాక్ ఉల్లేఖించిన సంఘటన ద్వారా తెలుసుకోవచ్చు.

ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ సఫియా బిన్తె హుయ్ బిన్ అఖ్తబ్ (ర) ఇలా ఉల్లేఖించారని ఆయన అంటారు. ఆమె ఇలా సెలవిచ్చారు:

"నేను, నా తండ్రి మరియు నా పినతండ్రి అబూ యాసిర్ దృష్టిలో అత్యంత ప్రియమైనదాన్ని. నేను వారి పిల్లలతో కలసి వారి వద్దకు వెళ్ళినప్పుడు నన్నే ముందు ఎత్తుకొనేవారు. దైవప్రవక్త (స) అరుదెంచి, ఖుబాలో బనూ అమ్రూ బిన్ ఔఫ్‌కు అతిధులైనప్పుడు నా తండ్రి 'హుయ్ బిన్ అఖ్తబ్' మరియు నా పినతండ్రి 'అబూ యాసిర్' కలసి ఉదయాన్నే దైవప్రవక్త (స) గారి సన్నిధిలో హాజరయ్యారు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. వచ్చేటప్పుడు వారి వాలకం బాగా అలసిసొలసిపోయి నడిచేవారిలా ఉంది. నేను ఎప్పటిలాగానే వారి వద్దకు పరుగెత్తుకుంటూ వెళ్ళాను. వారిద్దరిలో ఏ ఒక్కరూ నా వైపు దృష్టి సారించలేని బాధలో ఉన్నారప్పుడు. అప్పుడే నేను నా పినతండ్రి, నా తండ్రి గారైన హుయ్ బిన్ అఖ్తబ్‌తో మాట్లాడగా విన్నాను.

"అతను ఆయనేనా?" నా పినతండ్రి ప్రశ్న.

"దైవసాక్షి! ఆ వ్యక్తి ఆయనే" తండ్రిగారి సమాధానం.

"ఆయన్ను మీరు ఖచ్చితంగా గుర్తుపట్టగలిగారా?"

"అవును, బాగానే గుర్తుపట్టగలిగాను" మా తండ్రిగారి జవాబు.

"అయితే ఇప్పుడు ఆయన విషయంలో మీరేం చేయదలిచారు?"

"శత్రుత్వం-దైవసాక్షి! నేను బ్రతికి ఉన్నంతకాలం[1] (శత్రుత్వాన్నే వహిస్తాను)."

1. ఇబ్నె హష్షామ్-1/518, 519

ఈ ఉల్లేఖనాన్ని బలపరుస్తున్న మరో ఉల్లేఖనం సహీ బుఖారి గ్రంథం నుండి లభిస్తోంది. ఇందు హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ (ర)గారి ఇస్లామ్ స్వీకార ఉదంతం ఉల్లేఖించబడింది. ఈయన ఓ గొప్ప యూద పండితుడు. ఈయనకు దైవప్రవక్త (స) బనూ నజ్జార్ తెగలోనికి వచ్చిన విషయం తెలిసి ఆయన సన్నిధికి హాజరయ్యారు. కొన్ని ప్రశ్నలను అడిగిన పిదప మహాప్రవక్త (స) వాటికి సరైన సమాధానాలిచ్చారు. ఆ ప్రశ్నలకు జవాబు కేవలం ఒక దైవప్రవక్త మాత్రమే ఇవ్వగలరు. దైవప్రవక్త (స) నోట ఆ ప్రశ్నలకు జవాబులు విన్న హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ అప్పుడే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిములైపోయారు. ఆ తరువాత దైవప్రవక్త (స)తో, "ఓ దైవప్రవక్తా! యూద జాతి అపనిందలు వేసే జాతి. నేను ఇస్లామ్ స్వీకరించిన విషయం చెప్పి నా గురించి ఏమైనా అడిగితే వారు నాపై అపనిందలు మోపగలరు" అని అన్నారు. కాబట్టి మహాప్రవక్త (స) యూదుల్ని పిలిపించారు. వారు ప్రవక్త (స) దగ్గరకు వచ్చినప్పుడు - అబ్దుల్లా బిన్ సలామ్ వారికి అగుపడకుండా ఇంటిలోనికి వెళ్ళి దాక్కున్నారు.- మహాప్రవక్త (స) వారినుద్దేశించి, "అబ్దుల్లా బిన్ సలామ్ ఎలాంటి మనిషి?" అని అడిగారు.

"ఆయన గొప్ప పండితుడు, గొప్ప పండితుని కుమారుడు. ఉత్తముడైన వ్యక్తి, ఉత్తమ వ్యక్తి సంతానం." మరో ఉల్లేఖనంలో ఈ పదాలు కూడా ఉన్నాయి.

"ఆయన మా సర్దారు, మా సర్దారు కుమారుడు." మరో ఉల్లేఖనంలో, "మాలోకెల్లా ఉత్తముడైన వ్యక్తి, ఉత్తముడైన వ్యక్తి సంతానం" అని అన్నారు.

"సరే, ఒకవేళ అబ్దుల్లా ముస్లిము అయిపోతేనో!" అడిగారు దైవప్రవక్త(స).

యూదులు మూడు సార్లు ఇలా అన్నారు, "అల్లాహ్ ఆయన్ను దాన్నుండి రక్షించుగాక" అని. ఆ తరువాత అబ్దుల్లా బిన్ సలామ్ లోపలి నుండి బయటకు వచ్చి; **అష్హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదుఅన్న ముహమ్మదర్రసూలుల్లాహ్** (అల్లాహ్ తప్ప మరే పూజ్యుడూ లేడని, ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యం ఇస్తున్నాను) అని పలికారు. ఇది విన్నంతనే

2. *సహీ బుఖారి-1/459, 556, 561*

యూదులు ఏక కంఠంతో, "ఇతను అతి చెడ్డవాడు. అతి దుర్మార్గుడైన వ్యక్తి కుమారుడు" అన్నారు. (వెంటనే) ఆయన చెడుగులన్నిటిని ఏకరువుపెట్టనారంభించారు. ఓ ఉల్లేఖనంలో, ఈ మాటలు విన్న అబ్దుల్లా బిన్ సలామ్ వారినుద్దేశించి, "ఓ యూదులారా! దైవానికి భయపడండి. ఆయన తప్ప మరే ఆరాధ్య దైవంలేని ఆ అల్లాహ్ సాక్షి! ఈయన (స) అల్లాహ్ ప్రవక్త అన్న విషయం, సత్యం కోసం ప్రభవింపజేయబడిన విషయం మీకు బాగా తెలుసు" అన్నారు. కాని యూదులు మాత్రం, నీవు అసత్య విషయాన్ని పలుకుతున్నావు అని బయటకు వెళ్ళిపోయారు" అని ఉంది.[2]

యూదుల విషయంలో, దైవప్రవక్త (స)కు కలిగిన ప్రప్రథమ అనుభవం ఇది. ఇది మదీనా నగరంలో ప్రవేశించిన మొదటి రోజే జరిగిన సంఘటన.

★★★

ఇదంతా మదీనా అంతర్గత పరిస్థితి. మదీనా వెలుపల ముస్లిములకు బద్ధ శత్రువులు ఖురైష్ వారు. ముస్లిములు వారి ఆధీనంలో ఉన్నప్పుడు వారిని భయకంపితులుగా చేయడానికి, వారిని పీడించడానికి ఉపయోగించిన పద్ధతులు అనేకం. రకరకాల దౌర్జన్యాలకు, అగడాలకు వారిని బలిచేశారు. పకడ్బందీగా పెద్ద ఎత్తున దుష్ప్రచారాన్ని చేపట్టారు. సహనం కోల్పోయే మానసిక వ్యధలకు గురిచేశారు. ఆ తరువాత ముస్లిములు హిజ్రత్ చేసి మదీనాకు వచ్చేసిన తరువాత, వారి ఆస్తిపాస్తుల్ని, ఇండ్లను, భూముల్ని, ధనసంపదను పూర్తిగా ఖబ్జా చేసుకున్నారు. ముస్లిముల కుటుంబ సభ్యులు, భార్యాపిల్లల నడుమ అడ్డుగోడగా నిలవడమే కాకుండా దొరికినవారినల్లా బంధించి నానా హింసలకు గురిచేశారు. అంతటితో ఆగిపోయినా బాగుండేది. ఆపై దైవసందేశ ప్రచార నాయకుడైన దైవప్రవక్త ముహమ్మద్ (స)ను సైతం హత్య చేసి ఆయన పిలుపును నామరూపాల్లేకుండా చేయడానికి కుట్రలు కూడా పన్నారు. ఆ కుట్రలను, ఆ దుష్టపన్నాగాలను అమలుపరిచేందుకు తమ శక్తిసామర్థ్యాలన్నిటిని కూడగట్టుకున్నారు. దీనికితోడు ముస్లిములు ఏదో విధంగా మక్కాకు అయిదు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న మదీనాకు వలస వెళ్ళిపోతే, ఖురైషులు తమ శక్తియుక్తుల్ని ఉపయోగించి హేయమైన రాజకీయ నాటకం కూడా ఆడారు. అంటే, ఖురైషులు మక్కా పౌరులైనందున, బైతుల్లా (కాబా గృహం) దాపున ఉండేవారు గనుక అరబ్బుల్లో వారికి మంచి

పలుకుబడి, అధికారం, రాచరిక హోదాలు ఉండేవి. దాన్ని ఆసరాగా చేసుకొని అరేబియా ద్వీపకల్పంలో నివసించే ఇతర బహుదైవారాధకులను ఉసిగొల్పి మదీనాను బాయ్‌కాట్ చేస్తూ ఏకాకిగా చేశారన్నమాట. ఆ కారణంగా మదీనాకు దిగుమతులు దాదాపుగా ఆగిపోయాయి. దీనికి తోడు మదీనాకు హిజ్రత్ చేసి వచ్చేవారి సంఖ్య అధికం కాసాగింది. వాస్తవానికి, మక్కాకు చెందిన బహుదైవారాధకులకూ మరియు ముస్లిముల క్రొత్త స్థావరం అయిన మదీనాకూ మధ్య యుద్ధ పరిస్థితులు నెలకొన్నట్లయింది. దీనికి ముస్లిములనే బాధ్యులుగా నిలబెట్టడం జరిగింది. ఇది పూర్తిగా వాస్తవ విరుద్ధమైన విషయం.

ముస్లిముల ఆస్తిపాస్తులను కొల్లగొట్టినందుకు, వారిపై దౌర్జన్యాల పరంపరలు సాగించినందుకు, వారి జీవితాలతో చెలగాటమాడినందుకు, ముస్లిములు కూడా వారి ఎడల అదే విధంగా ప్రవర్తిస్తూ, వారి ఆస్తిపాస్తులను హస్తగతం చేసుకునే హక్కు, దౌర్జన్యాలకు ప్రతిగా వారిపై దౌర్జన్యం చేసే హక్కు, వారి జీవితాలతో చెలగాటమాడే హక్కు ముస్లిములకు దక్కింది. ఇకపై ముస్లిములను నాశనం చేస్తూ, వారిని నామరూపాలు లేకుండా చేసే మార్గం లేకుండా జాగ్రత్త పడవలసిన తరుణం ఆసన్నమైంది.

ఇవీ, మదీనాకు అరుదెంచిన తరువాత మహాప్రవక్త (స) గారి ముందు ఉన్న సమస్యలు.

మహాప్రవక్త (స) ఈ సమస్యలకు సంబంధించి మదీనాలో, దైవదౌత్య పాత్రను, నాయకత్వాన్ని నిర్వహించడం జరిగింది. ఏ జాతి అయితే, మన్నింపుకు, కారుణ్యానికి తగినదో లేదా కాఠిన్యానికి పాత్రమైనదో ఆ జాతి ఎడల ఆయన అలానే ప్రవర్తించవలసి వచ్చింది. కాఠిన్యం కన్నా కారుణ్యమే అధికంగా ఉందనడంలో సందేహం లేదు. ఇలా కొన్ని సంవత్సరాల్లోనే అధికార పగ్గాలు ఇస్లామ్ మరియు ముస్లిముల చేతిలోనికి వచ్చేశాయి. మీరు చదువబోయే పుటల్లో ఈ విషయాలకు సంబంధించిన వివరాలే చెప్పడం జరిగింది.

మొదటి దశ

నవ సమాజ నిర్మాణం

మహాప్రవక్త (స), మదీనాలో బనూ నజ్జార్ తెగకు చెందిన హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారి (ర)గారి ఇంటి ముందు, శుక్రవారం, రబీఉల్ అవ్వల్ 12 హిజ్రీ శకం ఒకటి (27 సెప్టెంబర్, 622) రోజున వచ్చి ఆగారనీ, అప్పుడే అది ఆయన(స) విడిది అయిందీ అన్న విషయం మనకు తెలిసిందే. ఆ తరువాత ఆయన (స) అబూ అయ్యూబ్ అన్సారి (ర)గారి ఇంట ప్రవేశించారు.

మస్జిదె నబవీ నిర్మాణం

ఆ తరువాత మహాప్రవక్త (స) మొట్టమొదటగా మస్జిదె నబవీ నిర్మాణాన్ని చేబట్టారు. ఆయన (స)గారి ఒంటె ఎక్కడైతే కూర్చున్నదో ఆ ప్రదేశమే మస్జిదె నబవీ కోసం ఎన్నుకోబడింది. ఈ స్థలం ఇద్దరు అనాథ బాలురకు చెందిన స్థలం. మహాప్రవక్త (స) దాన్ని ఆ ఇద్దరికి డబ్బిచ్చి కొన్నారు. స్వయంగా మస్జిద్ నిర్మాణంలో పాల్గొంటూ, ఇటుక రాళ్ళు మోయనారంభించారు. అలా మోస్తూనే ఇలా ప్రార్థించనారంభించారు.

"ఓ అల్లాహ్! జీవితం కేవలం పరలోక జీవితమే, ఓ ప్రభూ! అన్సారులను, ముహాజిర్లను మన్నించు." ఇంకా ఇలా పలికేవారు కూడా.

"ఈ బరువు ఖైబర్ బరువు కాదు. మా ప్రభువు సాక్షి! ఇది ఎంతో పుణ్య కార్యం, మరెంతో పవిత్ర కార్యం కూడాను."

మహాప్రవక్త (స)గారి ఈ పని చేసే తీరును చూసి సహాబాల్లో ఉత్సాహం మరింత పెరిగిపోయేది. సహాబా (ర) ఇలా చెప్పుకునేవారు.

"దైవప్రవక్త (స) పని చేస్తూ ఉండగా మనం చూస్తూ కూర్చుంటే ఇది మనల్ని మార్గభ్రష్టుల్ని చేసెయ్యగలదు."

ఈ స్థలంలో బహుదైవారాధకుల సమాధులు కొన్ని ఉన్నాయి. కొంత ఖాళీ ప్రదేశం కూడా ఉంది. ఖర్జూరం మరియు గర్‌ఖద్ చెట్లు కూడా కొన్ని

ఉన్నాయి. మహాప్రవక్త (స), బహుదైవారాధకుల సమాధుల్ని పెకిలించివేయించారు. ఖాళీ ప్రదేశాన్ని చదును చేయించారు. ఖర్జూరపు చెట్లను పెకిలించి ఖిబ్లా వైపు నాటించారు - అప్పుడు బైతుల్ మగ్దిస్ ఖిబ్లాగా ఉండేది - గుమ్మం రెండు ప్రక్కల పునాదులు రాతితో కట్టారు. గోడలు పచ్చి ఇటుకలు, మట్టితో నిర్మించబడ్డాయి. పైకప్పుగా ఖర్జూరపు ఆకుల్ని, మట్టల్ని వేసి కప్పారు. స్తంభాలు ఖర్జూరపు కాండాలు, నేలపై ఇసుక మరియు సన్నటి కంకర రాళ్ళు పరచబడ్డాయి. ద్వారాలు మొత్తం మూడు. ఖిబ్లా వైపు గోడ నుండి వెనుక వైపు ఉన్న గోడ మధ్య దూరం వంద మూరలు. వెడల్పు కూడా దాదాపు అంతే లేదా కొంచెం తక్కువ. పునాది దాదాపు మూడు మూరల లోతు ఉంది.

దైవప్రవక్త (స) మస్జిద్ ప్రక్కగా కొన్ని ఇండ్లను కూడా నిర్మించారు. వాటి గోడలు కూడా పచ్చి ఇటుకలే. పైకప్పు కూడా ఖర్జూరపు బోదెల కమ్మీలు మరియు ఖర్జూరపు ఆకులతో నిర్మించడం జరిగింది. ఇవే మహాప్రవక్త (స) గారి సతీమణుల హుజ్రాలు (గదులు). ఈ హుజ్రాల నిర్మాణం పూర్తి అయిన తరువాత దైవప్రవక్త (స) అబూ అయ్యూబ్ అన్సారి (ర)గారి ఇంటి నుంచి వీటిలోనికి మారారు.[1]

మస్జిద్ కేవలం నమాజు చేసుకోవడానికే కాదు. అదో యూనివర్సిటి కూడాను. ఇందు ముస్లిములు ఇస్లామీయ బోధనలను అధ్యయనం చేసేవారు. ఇదో సమావేశ కేంద్రం కూడా. ఇందు సంవత్సరాల తరబడి అజ్ఞాన కాలంనాటి మారణకాండ, వైషమ్యం, పరస్పర యుద్ధాల్లో నిమగ్నమై ఉండిన తెగలకు చెందిన వ్యక్తులు వాటిన్నిటిని మరచిపోయి పరస్పరం ప్రేమానురాగాలతో కలసిమెలసి ఉండేవారు. ఇదే కాదు, అది ఈ చిన్న రాజ్యాన్ని నడిపే వ్యవస్థకు కేంద్రం కూడాను. అక్కడి నుండే రకరకాల ముఖ్యకార్యాలను నిర్వహించడానికి ప్రతినిధి బృందాలను పంపించడం జరిగేది. అదేకాకుండా ఈ మస్జిద్ స్థాయి ఓ పార్లమెంటు లాంటిది. ఇక్కడ సలహా సంఘం మరియు వ్యవస్థాగతమైన సమావేశాలు కూడా జరిగేవి.

వీటన్నిటికితోడు ఈ మస్జిద్, నిలువనీడలేని, భార్యాపిల్లల్ని పోగొట్టుకున్న నిరుపేద నిర్భాగ్యులు తలదాచుకునే స్థలం. వారంతా ముహాజిర్లే. మక్కా నుండి హిజ్రత్ చేసి వచ్చినవారే.

---

1. సహీ బుఖారి-1/71,555,560 - జాదుల్ ముఆద్-2/56

హిజ్రత్ చేసి వచ్చిన తొలి రోజుల్లో అజాన్ పిలుపు కూడా ఆరంభమైంది. ఇది అయిదు పూటలు మదీనాలో మారుమ్రోగేది. ఈ అజాన్ పిలుపు విన్నంతనే మదీనా జీవితం ఒక్కసారే స్థాణువై వినేది. ఈ అజాన్ విషయంలో హజ్రత్ అబ్దుల్లా బిన్ జైద్ బిన్ అబ్దర్‌బా (ర)గారి స్వప్న వృత్తాంతం చెప్పుకోదగింది. (వివరాలు జామె తిర్మిజీ, సునన్ అబూ దావూద్, ముస్నదె అహ్మద్ మరియు సహీహ్ ఇబ్నె ఖజామాల్లో చూడవచ్చు.)

ముస్లిముల సౌభ్రాతృత్వం

మస్జిదె నబవీని నిర్మించి దైవప్రవక్త (స), ముస్లిముల్లో కలుపుగోలుతనాన్ని, ప్రేమైక వాతావరణాన్ని సృష్టించే ఓ కేంద్రాన్ని నెలకొలిపినట్లే, ముహాజిర్లు మరియు అన్సారుల నడుమ సోదరభావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందించే మరో కార్యాన్ని కూడా చేబట్టారు. మానవ చరిత్రలోనే ఇది ఉజ్వలమైన ఘన కార్యమని చెప్పుకోవడం జరుగుతోంది. ఇబ్నె ఖైమ్ తన గ్రంథంలో ఇలా చెబుతారు.

"తరువాత మహాప్రవక్త (స), హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర)గారి ఇంటిలో ముహాజిర్లు మరియు అన్సారుల నడుమ సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పారు. వారు మొత్తం తొంభై మంది. సగం మంది ముహాజిర్లు మరి సగం మంది అన్సారులు. ఆ సౌభ్రాతృత్వం ప్రకారం, వారు పరస్పరం ఒకరి కష్ట సుఖాల్లో మరొకరు పంచుకోవాలి. మరణం తరువాత రక్తసంబంధీకులైన బంధువులకు బదులు ఒకరికొకరు వారసులైపోవాలి. ఇది ఆ సౌభ్రాతృత్వానికి సంబంధించిన మౌలిక అంశం. అయితే వారసత్వానికి సంబంధించిన ఈ ఆదేశం బద్ర్ యుద్ధం తరువాత ఈ దివ్యవాణి (వహీ) అవతరించనంత వరకు కొనసాగుతూనే ఉంది.

وَاُولُوا الْاَرْحَامِ بَعْضُهُمْ اَوْلٰى بِبَعْضٍ

"కాని, అల్లాహ్ గ్రంథం ప్రకారం, సాధారణ విశ్వాసులు మరియు వలస వచ్చిన వారికంటే రక్తసంబంధీకులు ఒకరిపై ఒకరు ఎక్కువ హక్కును కలిగి ఉంటారు." (33 : 6)

అప్పుడుగాని అన్సార్ మరియు ముహాజిర్లలో వస్తున్న వారసత్వ సంబంధమైన ఆదేశం రద్దు అయిపోయింది. కాని సౌభ్రాతృత్వం గురించి వారు

చేసిన ప్రమాణం మాత్రం మిగిలే ఉంది. మహాప్రవక్త (స) మరో సుహృద్భావ ఒప్పందం కూడా చేయించారు అని చెప్పుకోవడం జరుగుతోంది. ఆ ఒప్పందం ముహాజిర్లకూ ముహాజిర్లకూ మధ్య చేయించిన ఒప్పందం. అయితే ఈ విషయంలో ముహాజిర్లకు ముహాజిర్లకు నడుమ కావలసిన ఇస్లామియ సౌభ్రాతృత్వం, ఐకమత్యం విషయంలో అలాంటి ఒప్పందం అవసరం కూడా లేదు. కాని ముహాజిర్ల వ్యవహారం వేరు, అన్సారుల వ్యవహారం వేరు.[2]

ఈ సౌభ్రాతృత్వ ధ్యేయం- ముహమ్మద్ గజాలి రాసినట్లు - అజ్ఞాన దురభిమానాలు పటాపంచలైపోవాలని, ఆత్మాభిమానంగాని, గౌరవభావంగాని పూర్తిగా ఇస్లామ్‌కే చెందాలని, జాతి, వంశం, రంగు, దేశానికి సంబంధించిన తారతమ్యాలన్నీ సమసిపోవాలన్నదే. ప్రజల్లో పాతుకుపోయిన ఔన్నత్యం మరియు నీచత్వపు భావనలను కొలిచే కొలమానం కేవలం మానవత్వం మరియు దైవభీతే కావాలన్నది.

దైవప్రవక్త (స) ఈ సౌభ్రాతృత్వాన్ని కేవలం మాటల మటుకే సరిపెట్ట లేదు. దాన్ని రక్తం మరియు ధనంతో సంబంధం గల ఓ ఆచరణాత్మకమైన ప్రమాణంగా ఖరారు చేశారు కూడా. శ్లాఘించడానికి ఇది ఉత్త ఇస్లామీయ శుభా కాంక్షలు కావు. ఈ ఐకమత్యంలో త్యాగం, ప్రేమభావాలు కూడా మిళితమై ఉన్నాయి. కాబట్టే ఆ సౌభ్రాతృత్వపు ప్రమాణం, ఈ నవ సమాజాన్ని ఉజ్వలమైన ఘనకార్యాలతో నింపేసింది.[3]

సహీ బుఖారీ గ్రంథంలో ఇలా ఉంది:

"మహాప్రవక్త (స) మదీనాకు అరుదెంచిన తరువాత హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) గారికీ మరియు హజ్రత్ సఅద్ (ర) బిన్ రబీయా గారికి నడుమ సౌభ్రాతృత్వాన్ని నెలకొలిపారు. ఆ తరువాత హజ్రత్ సఅద్(ర), అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)గారితో, అన్సారుల్లోకెల్లా ధనవంతుణ్ణి నేనే. మీరు నా సొత్తును రెండు భాగాలుగా చేసి (సగం) తీసుకోండి. నాకు ఇద్దరు భార్యలు. మీరు వారిని చూసుకోండి. వారిలో మీకు ఎవరు నచ్చారో చెప్పండి. ఆమెకు తలాక్ ఇచ్చి ఇద్దత్ కాలం గడిచిన తరువాత మీకిచ్చి వివాహం చేసేస్తాను" అని అన్నారు. దానికి అబ్దుర్రహ్మాన్ (ర), "అల్లాహ్ మీ సంతానాన్ని, మీ ధనాన్ని వృద్ధిపరచుగాక. మీ సంత ఎక్కడుంది?" అని అడిగారు. ఆయనకు 'బనీ

2. జాదుల్ ముఆద్-2/56

3. ఫిక్హతుసీరత్- పుట.140,141

ఖునైకా' సంతను చూపెట్టడం జరిగింది. అక్కడికి వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు ఆయన చేతిలో జున్ను మరియు నెయ్యి పాత్ర ఉన్నాయి. అలా ఆయన రోజూ సంతకు వెళ్ళి వచ్చేవారు. ఓ రోజు ఆయన ప్రవక్త (స) సన్నిధికి వచ్చి నప్పుడు ఆయన వస్త్రాలపై పసుపు రంగు ఛాయలు కనబడుతున్నాయి. "అదేమిటీ?" అని దైవప్రవక్త (స) ఆయన్ను ప్రశ్నించగా, "నేను వివాహం చేసుకున్నాను" అని బదులిచ్చారు.

"మహర్ ఎంత కట్టారూ?" అని అడిగారు మహాప్రవక్త (స).

"ఓ నవాహ్ (ఖర్జూరపు గింజ) బరువు బంగారం (అంటే ఒకటింబావు తులం)" అని బదులిచ్చారు.[4]

ఇలాగే హజ్రత్ అబూ హురైరా (ర)గారి ఉల్లేఖనం ఒకటుంది. దాని ప్రకారం, అన్సార్‌లు దైవప్రవక్త (స) గారి వద్దకు వచ్చి, "తమరు మాకు, మా ఈ (ముహాజిర్) సోదరులకు మధ్య మా ఖర్జూరపు తోటల్ని పంచెయ్యండి" అని అడిగారు. దానికి మహాప్రవక్త (స) "అలా జరుగదు" అని అనగా, "సరే" మా పనులను చేయమనండి, వారిని మా పంటలో భాగస్వాములుగా చేస్తాం" అని అన్నారు. దానికి "సరే" అని ఒప్పుకోవడం జరిగింది.[5]

అన్సార్‌లు తమ ముహాజిర్ సోదరులను ఎలా గౌరవించారో, వారి ఎడల ప్రేమ, వాత్సల్యం మరియు త్యాగాలను ఎలా ప్రదర్శించారో ఈ రెండు సంఘటనల ద్వారా అర్థం చేసుకోవచ్చు. అలాగే ముహాజిర్లు కూడా వీరి ఈ తెగువకు, త్యాగానికి ఎంత విలువనిచ్చి గౌరవించారో తెలుస్తోంది. అన్సార్‌లు చేసిన ఈ త్యాగాన్ని ఆసరాగా చేసుకొని ఇష్టమొచ్చినట్లు ప్రయోజనం పొందే ప్రయత్నం చేయలేదు వారు. కేవలం దిగజారిన తమ ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టుకోడానికిగాను దానికి తగ్గట్లుగానే అన్సార్‌ల నుండి ప్రయోజనం పొందారు.

ఈ సౌభ్రాతృత్వపు ప్రమాణం, ఓ అమూల్యమైన వివేచనా కార్యం, దూరదృష్టితో కూడిన రాజకీయ చతురత మరియు ముస్లిములు ఎదుర్కొం టున్న అనేక క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం కూడా అని చెప్పవచ్చు.

4. సహీ బుఖారి-ముహాజిర్లు మరియు అన్సారుల నడుమ ఐకమత్యం అనే అధ్యాయం-1/302

5. సహీ బుఖారి-1/312

ఇస్లామ్ మార్గంలో పరస్పరం సహాయ సహకారాలు అందించుకునే ప్రమాణం

పైన జరిగిన సౌభ్రాతృత్వంలాగే మహాప్రవక్త (స), ముస్లిములందరి చేత మరో ప్రమాణం కూడా చేయించారు. ఈ ప్రమాణం ద్వారా ఇప్పటి వరకు వారిలో వ్రేళ్ళూనుకుని ఉన్న అజ్ఞాన కాలపు రక్తపాతం అంతమైపోయింది. తెగల నడుమగల సంఘర్షణ పునాదులు పూర్తిగా పెకలించబడ్డాయి. ఇక అజ్ఞాన కాలంనాటి ఆచార సంప్రదాయాలకు ఏమాత్రం చోటు లేకుండా పోయింది. దిగువన ఆ ప్రమాణంలోని ముఖ్యాంశాలను టూకీగా వివరించ డానికి ప్రయత్నం చేస్తున్నాం.

ఆ ప్రమాణ పత్రంలో ఇలా రాయబడి ఉంది:

"ఖురైషుకు చెందిన ముస్లిములు, యస్రిబ్ ముస్లిములు కలసి దైవప్రవక్త (స)ను విధేయించడానికి, ఆయనతో కలసి జిహాద్ చేయడానికిగాను వారికి, అల్లాహ్ ప్రవక్త (స)కు నడుమ జరిగిన ప్రమాణమేమనగా!

1. వీరందరూ తక్కిన వారికి భిన్నమైన ఓ ప్రత్యేక సమాజం.
2. హిజ్రత్ చేసివచ్చిన ఖురైషీలు తమ గత పరిస్థితికి అనుగుణంగా 'దైత్' (రక్తపరిహారం) చెల్లిస్తారు. మోమిన్ల (విశ్వాసుల) నడుమ ప్రసిద్ధమైన రీతిలో, న్యాయబద్ధంగా తమ ఖైదీల పరిహారం చెల్లిస్తారు. అలాగే అన్సార్‌కు చెందిన తెగలన్నీ తమ గత స్తోమతనుబట్టి పరస్పరం 'దీత్' చెల్లిస్తారు. వారిలోని ప్రతి వర్గం ప్రసిద్ధమైన రీతిలో, విశ్వాసుల నడుమ న్యాయబద్ధంగా తమ ఖైదీలను ఫిదియా ఇచ్చి విడిపించుకుంటారు.
3. విశ్వాసులు తమ సమాజంలో, ఏ దీనుణ్ణయినా, ఫిదియా లేదా దీత్ విష యంలో ప్రసిద్ధమైన రీతిలో సహాయాన్ని అందించకుండా ఉండడానికి వీల్లేదు.
4. సదాచార సంపన్నులైన ముస్లిములంతా కలసి, వారిపై దౌర్జన్యం చేసే వానికి లేదా ముస్లిమ్ సమాజంలో జులుము, దుర్మార్గాలను, కల్లోలా లను రేకెత్తించేవానికి వ్యతిరేకంగా పోరాడాలి.
5. ఈ విషయంలో ఆ దుర్మార్గానికి పాల్పడిన వాడు వారి కుమారుడైనా సరే అందరూ అతనికి వ్యతిరేకంగా చర్య తీసుకోవలసి ఉంటుంది.

6. ఓ విశ్వాసి మరో విశ్వాసిని కాఫిర్‌కు (దైవ తిరస్కారికి) బదులుగా సంహ రించడానికి వీల్లేదు.
7. ఓ విశ్వాసికి వ్యతిరేకంగా ఏ కాఫిర్‌కైనా సహాయం చేయడానికి వీల్లేదు.
8. అల్లాహ్‌తో చేసిన ప్రమాణం అందరికీ వర్తిస్తుంది. ఓ మామూలు మనిషి ఇచ్చిన మాటకు ముస్లిములందరూ కట్టుబడి ఉంటారు.
9. ఏ యూదులైతే మనకు విధేయత చూపుతున్నారో వారికి సహాయం అందించడం జరుగుతుంది. వారిని కూడా ఇతర ముస్లిముల్లాంటి వారు గానే భావించడం జరుగుతుంది. వారిపై ఎలాంటి జులుముగానీ, వారికి వ్యతిరేకంగా మరెవ్వరికి సహాయం చేయడంగానీ జరగదు.
10. ముస్లిముల సంధి ఒప్పందం అందరికీ వర్తిస్తుంది. ఏ ముస్లిమైనా మరొక ముస్లిమును కాదని దైవమార్గంలో జిహాద్ చేసే విషయంలో సంధి కుదుర్చుకోడానికి వీల్లేదు. సరికదా, అందరు కలిసే సమానత్వం మరియు న్యాయసూత్రాల ప్రాతిపదికపైన్నే ఒప్పందం చేసుకోవలసి ఉంటుంది.
11. దైవమార్గంలో చిందించిన రక్తం విషయంలో ముస్లిములంతా సమాన భాగస్వాములుగానే ఉంటారు.
12. ఏ ముస్లిమైనా, బహుదైవారాధకుడైన ఖురైష్ ధనప్రాణాలను రక్షించే ప్రయత్నం చేయడంగాని, అతణ్ణి రక్షించడానికి మరో ముస్లిమ్‌కు అడ్డుగా నిలవడానికిగానీ వీల్లేదు.
13. ఎవరైనా ఓ ముస్లిమును హత్య చేసినప్పుడు, దానికి సరైన ఆధారం లభిస్తే అతని నుండి ఖిసాస్ తీసుకోవడం జరుగుతుంది. హతుని సంరక్ష కుడు దాన్ని మాఫీ చేస్తే తప్ప.
14. అలా చేసిన వానికి వ్యతిరేకంగా ముస్లిములంతా నిలబడవలసి ఉంటుంది. అతణ్ణి వ్యతిరేకించడం తప్ప మరే విషయమూ వారికి ధర్మ సమ్మతం కాజాలదు.
15. ఏ విశ్వాసికైనా, ఉపద్రవాన్ని లేవనెత్తేవానికి (బిద్అతీకి) సహాయపడటం అనేది ధర్మసమ్మతం కాజాలదు. ఎవరైనా అలాంటి వ్యక్తికి సహాయ పడడంగానీ, అతణ్ణి తన రక్షణలోకి తీసుకోవడంగానీ జరిగితే ప్రళయం

రోజు అతనిపై అల్లాహ్ ఆగ్రహశాపాలు విరుచుకుపడతాయి. అతని ఫర్జులు, నఫిల్ ఆరాధనలేవీ స్వీకరించబడవు.

16. మీ నడుమ ఏవైనా అభిప్రాయభేదాలు పొడసూపితే వాటిని అల్లాహ్ మరియు ముహమ్మద్ (స) వైపునకు మళ్ళించి వారి తీర్పును శిరసా వహించవలసి ఉంటుంది.[6]

సమాజంపై పడిన ఆధ్యాత్మిక ప్రభావం

ఈ దూరదృష్టి, వివేచనల పైన్నే దైవప్రవక్త (స) ఓ నవ సమాజ నిర్మాణ పునాదులు వేయడం జరిగింది. అయితే, దైవప్రవక్త (స) గారి సహచర్యంలో ఈ మహామహులు పొందిన తర్ఫీదు, శిక్షణలు ఈ సమాజపు బాహ్య కోణాలకు ప్రతిబింబాలుగా నిలిచాయి. వారి ఆత్మప్రక్షాళన కోసం, వారి శిక్షణ కోసం, వారి నైతికతా విలువలను పెంపొందించడం కోసం మహాప్రవక్త (స) ఎల్లవేళలా సంసిద్ధులై ఉంటూ ఉండేవారు. వారికి ప్రేమా సౌభ్రాతృత్వం, ఐకమత్యం, గౌరవం మరియు ఆరాధనా విధేయతల సూత్రాలను నేర్పేవారు.

ఓ సహాబీ (ర) (అనుచరుడు), ఏ ఇస్లామ్ ఉత్తమమైనది? (అంటే ఇస్లామ్‌లో నడవడికలో ఏది మిన్న అయినది?) అని అడిగినప్పుడు ఆయన (స), "నీవు అన్నదానం చెయ్యి, ఎరిగినవారికీ, ఎరుగనివారికీ కూడా సలామ్ చేస్తూ ఉండు"[7] అని ఉద్బోధించారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ (ర)గారి ఒక ఉల్లేఖనం ఇలా ఉంది.

"మహాప్రవక్త (స) మదీనాకు అరుదెంచినప్పుడు నేను ఆయన సన్నిధికి హాజరయ్యాను. ఆయన (స) ముఖారవిందాన్ని చూడగానే, ఇది ఓ అసత్యవాది ముఖం కాజాలదు అనే నిర్ణయానికి వచ్చాను. ఆ తరువాత నేను ఆయన నోట విన్న ప్రప్రథమ సూక్తి ఏదంటే;

"ప్రజలారా! సలామును వ్యాపింపజేయండి. భోజనాలు పెడుతూ ఉండండి. బంధువుల పట్ల సద్వర్తనతో మెలగండి. రాత్రి ప్రజలు నిద్రిస్తున్నప్పుడు నమాజు చేయండి. అప్పుడు మీరు స్వర్గంలో ప్రశాంతంగా ప్రవేశించగలరు."[8]

---

6. ఇబ్నె హష్షామ్-1/502, 503   7. సహీ బుఖారి-1/6,9
8. తిర్మిజి, ఇబ్నె మాజ, దారమి, మిష్కాత్-1/168

మచ్చుకు అలాంటి బోధనలే కొన్నిటిని ఇక్కడ పొందుపరుస్తున్నాం.

"ఎవరి దురాగతాల నుండి, ఆగడాల నుండి అతని పొరుగువాడు సంరక్షింపబడలేడో ఆ వ్యక్తి స్వర్గంలో ప్రవేశింపజాలడు."[9]

"ఎవరి నోటి ద్వారా, చేతి ద్వారా ముస్లిములకు రక్షణ లభిస్తుందో అతనే ముస్లిమ్."[10]

"విశ్వాసులంతా ఒకే శరీరంలాంటివారు. కంటిలో బాధగా ఉంటే శరీరం మొత్తానికి బాధ కలుగుతుంది. తలలో బాధగా ఉంటే శరీరాన్నంతటికి బాధ కలుగుతుంది."[11]

"తనకు నచ్చిన వస్తువునే తన సోదరుని కోసం ఎంచుకోనంత వరకు ఏ వ్యక్తి అయినా ముస్లిముగా ఉండలేడు."[12]

"ఓ విశ్వాసి మరో విశ్వాసి విషయంలో ఓ కట్టడంలాంటివాడు. ఈ కట్టడంలోని ప్రతి భాగం మరో భాగానికి బలం చేకూరుస్తుంది."[13]

"ఒకరికి మరొకరి ఎడల పరస్పరం వైషమ్యం ఉండకూడదు. పరస్పరం ఈర్ష్య పడకండి. ఒకరిని చూసి మరొకరు ముఖం త్రిప్పుకోకండి. అల్లాహ్‌కు దాసులై పరస్పరం సోదరులుగా మెలగండి. ఏ ముస్లిమైనా మూడు రోజుల కంటే ఎక్కువగా తన సోదరునితో మాట్లాడకుండా ఉండడానికి వీల్లేదు."[14]

"ఓ ముస్లిమ్ మరో ముస్లిమ్‌కు సోదరుడు. అతడు అతనిపై జులుము చేయడంగానీ, అతణ్ణి అతని శత్రువుకు అప్పజెప్పడంగానీ జరగకూడదు. ఏ వ్యక్తి అయితే తన సోదరుని అవసరం తీర్చడానికి తాపత్రయపడతాడో అల్లాహ్ అతని అవసరాన్ని తీరుస్తాడు. మరే ముస్లిమైతే మరో ముస్లిమ్ యొక్క దుఃఖాన్ని పారద్రోలగలడో, అల్లాహ్ ప్రళయదినం నాడు కలిగే దు:ఖాల్లో ఏదో ఒక దుఃఖాన్ని దూరం చేయగలడు. ఏ ముస్లిమైతే మరో ముస్లిమ్ యొక్క లోపాలను దాస్తాడో, అల్లాహ్ ప్రళయ దినాన అతని లోపాలను దాస్తాడు."[15]

"భూవాసులపైన కరుణించండి. మిమ్మల్ని ఆకాశవాసి కరుణిస్తాడు."[16]

---

9. సహీ ముస్లిమ్, మిష్కాత్-2/422   10. సహీ బుఖారి-1/6
11. ముస్లిమ్, మిష్కాత్-2/422   12. సహీ బుఖారి-1/6
13. ముత్తఫిఖున్ అలైహి-మిష్కాత్-2/422; సహీ బుఖారి-2/890
14. సహీ బుఖారి-2/896   15. ముత్తఫిఖున్ అలైహి, మిష్కాత్-2/422
16. సునన్ అబూ దావూద్-2/335; జామె తిర్మిజీ-2/14

"తన పొరుగువాడు పస్తు ఉండగా, తాను కడుపార భుజించువాడు విశ్వాసి కాజాలడు."[17]

"ముస్లిమును తిట్టడం, దుర్భాషలాడడం 'ఫిస్క్' (మహాపాపం), అతనితో తలపడడం, దెబ్బలాడడం 'కుఫ్' (అవిశ్వాసం)."[18]

ఇలాగే ఆయన (స), "మార్గంలో పడి ఉన్న ప్రజలను కష్టపెట్టే వస్తువు ను తొలగించడాన్ని దానంగా, విశ్వాసంలోని ఓ భాగంగాను ఎంచేవారు."[19]

అదే విధంగా మహాప్రవక్త (స), దానధర్మాలను చేయడానికి ప్రోత్సహించే వారు. దానికోసం లభించే పుణ్యఫలాలను ఏకరువు పెట్టడం వలన ప్రజల హృదయాలు ఆయన వైపునకు మొగ్గుజూపేవి. ఈ విషయంలో ఆయన ప్రవచనం ఇలా ఉంది: "నీరు అగ్నిని చల్లార్చినట్లు, దానం పాపాలను భస్మం చేస్తుంది." [20]

"ఏ ముస్లిమైతే నగ్న ముస్లిములకు వస్త్రాలు తొడుగుతాడో, అల్లాహ్ అతనికి స్వర్గంలో ఆకుపచ్చ రంగు గల వస్త్రాలను తొడుగుతాడు. మరే ముస్లి మైతే ఆకలితో బాధపడే ముస్లిమ్‌కు అన్నం పెడతాడో, అల్లాహ్ అతనికి స్వర్గ ఫలాలను తినిపిస్తాడు. ఇంకా ఏ ముస్లిమైతే దాహార్తి అయిన ఒక ముస్లిమ్ దాహాన్ని తీరుస్తాడో అల్లాహ్ అతనికి స్వర్గంలో సీలు వేయబడిన పరిశుద్ధ మధువును త్రాగిస్తాడు."[21]

"నరకాగ్ని నుండి తప్పుకోండి. ఓ ఖర్జూరపు ముక్కను దానం చేసి అయినా సరే. అది కూడా లేకపోతే ఓ పరిశుద్ధమైన మాట పలికి అయినా సరే."[22]

దీనికి తోడు దైవప్రవక్త (స) యాచన చేయకుండా జాగ్రత్తపడండని బోధించారు. సహనానికీ, పొదుపుకూ లభించే పుణ్యఫలం గురించి వివరించే వారు. ఇతరుల ముందు చేయిజాపి యాచించడాన్ని అతని ముఖంపై పడే గాట్లుగా అభివర్ణించేవారు.[23] అయితే నిజంగానే వివశుడైపోయి యాచించే వ్యక్తి ఆ కోవకు చెందడని చెప్పేవారు.

ఆరాధనలకు లభించే పుణ్యఫలాలు, దైవం దృష్టిలో వాటికి ఉన్న

17. షోఅబుల్ ఈమాన్ లిల్ బైహీకీ 18. సహీ బుఖారి-2/893
19. మిష్కాత్-1/12, 167 20. అహ్మద్, తిర్మిజీ, ఇబ్నెమాజా, మిష్కాత్-1/14
21. సునన్ అబూదావూద్, జామె తిర్మిజి, మిష్కాత్-1/169
22. సహీ బుఖారి-1/190, 2/890
23. అబూ దావూద్, తిర్మిజీ, నిసాయి, ఇబ్నె మాజా, దారిమీ, మిష్కాత్-1/163

విలువ, లభించే ప్రతిఫలం గురించి కూడా విడమర్చి చెప్పేవారు, ఆకాశం నుండి అవతరించే దైవవాణితో ముస్లిములు దృఢమైన సంబంధం ఏర్పర్చుకునేటట్లు చేసేవారు. ఆయన (స) ఆ దైవవాణిని చదివి వినిపించే వారు. ముస్లిములు కూడా దాన్ని దైవప్రవక్త (స) ఎదుట చదివి వినిపించేవారు. దీని ద్వారా వారిలో ఆలోచన, అవగాహనే కాకుండా సత్యధర్మ ప్రచార బాధ్య తలు మరియు దైవదౌత్య బాధ్యతలు ఏవో బాగా నాటుకుపోయేవి.

అలాగే దైవప్రవక్త (స) ముస్లిముల ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించి, వారి దైవదత్తమైన సామర్థ్యాలను బయటకు తీసి వారిలో ఓ ఉన్నత అధికార పాటవాన్ని ఏర్పర్చగలిగారు. చివరికి వీరు మానవ చరిత్రలోనే దైవప్రవక్తల తరువాత ఉన్నత స్థానాన్ని ఆక్రమించగలిగారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (ర) ఇలా చెబుతూ ఉండేవారు

"ఏ వ్యక్తి అయినా ఓ మార్గాన్ని అవలంబించవలసివస్తే వారు గతించిన వీరి మార్గాన్నే అనుసరించాలి. ఎందుకంటే, సజీవంగా ఉన్న వారి వల్ల తప్పులుదొరలే భయం ఉంది గనుక.

వీరంతా దైవప్రవక్త (స)కు తోడుగా ఉన్నవారు. ఆయన అనుచరగణం. ఈ సమాజంలో అత్యుత్తములైన వ్యక్తులు, అందరికంటే మిన్న అయిన సదాచార సంపన్నులు. అందరికంటే ఉత్తమ విజ్ఞాన ధనులు. కలుపుగోలు తనంగల మనుషులు. అల్లాహ్ వారిని తన ధర్మస్థాపనం కోసం, దైవప్రవక్త(స) సహచర్యం కోసం ఎంచుకున్నాడు. అందుకని వారి ఔన్నత్యాన్ని గుర్తించండి. వారి అడుగుజాడల్లో నడవండి. సాధ్యమైనంత వరకు వారి నైతిక విలువలను, వారి సచ్చరితాన్ని అవలంబించండి. ఎందుకంటే వారు రుజుమార్గంపై నడిచి మార్గదర్శకులయ్యారు గనుక."[24]

అదే కాదు, మన ప్రవక్తశ్రీ(స), మహా నాయకుడు(స) స్వయంగా ఈ ఆధ్యాత్మిక చింతనలు, అందరికీ అగుపడే సుగుణాలు, దైవదత్త సామర్థ్యాలు, గుణగణాలు, నైతిక విలువలు, సదాచార సంపన్నతలు కలిగి ఉన్నవారు. ఆయన ఈ మూర్తిమత్వం కారణంగా హృదయాలు ఇట్టే ఆయన వైపునకు అనుకోకుండానే మొగ్గిపోయేవి. ఆయన కోసం ప్రాణాలను సైతం త్యాగం

24. జరీన్, మిష్కాత్-1/32

చేయడానికి సిద్ధపడేవారు ముస్లిములు. కాబట్టి ఆయన నోట ఏదైనా ఆదేశం వెలువడగానే సహాబా (ర) ఆ ఆదేశ పాలన కోసం పరుగుదీసేవారు. మార్గదర్శ కానికి, ప్రబోధించడానికి ఏవైనా పలుకులు పలికితే వారు దాన్ని స్వీకరించ డానికి, ఆచరించడానికి ఒకరికంటే ఒకరు ముందుకు వచ్చేవారు.

ఇలాంటి ప్రయత్నాల ఫలితంగానే మహాప్రవక్త (స) మదీనాలో, చరిత్రలోనే అత్యుత్తమమైన, గౌరవప్రదమైన ఓ సమాజాన్ని నెలకొల్పడంలో కృతకృత్యులయ్యారు. ఓ సుదీర్ఘ కాలం వరకు కాలచక్రం క్రింద నలిగిపోయి దారి కానరాకుండా అంధకార సాగరంలో మునిగిపోయిన మానవాళికి ఈ సమాజం కారణంగా తమ సమస్యలను పరిష్కరించుకునే ఓ అమూల్య అవకాశం లభించింది. ఈ సమాజం ఏర్పడిన తరువాత మానవతకు సాంత్వన చేకూరినట్లయింది.

ఈ సమాజానికి చెందిన ఈ సహాబా (ర) మహోన్నత బోధనల ద్వారా సంపూర్ణ శక్తిగా రూపొంది తమ ధైర్యస్థైర్యాలతో ప్రపంచాన్నే ఎదుర్కొని చరిత్ర గమనాన్నే పూర్తిగా మార్చివేయడం జరిగింది.

యూదులతో జరిగిన ఒప్పందం

మహాప్రవక్త (స) హిజ్రత్ తరువాత ముస్లిముల మధ్య విశ్వాసం, రాజకీయం, సమైక్యతల ద్వారా ఇస్లామీయ సమాజ పునాదుల్ని పటిష్ఠపరచిన తరువాత ముస్లిమేతరులతో తమ సంబంధాలను దృఢపర్చుకోవడం వైపునకు దృష్టిని మళ్ళించారు. ఈ విషయంలో ఆయన ధ్యేయం, మానవాళి అంతా శుభశాంతుల్ని ఆస్వాదించాలన్నదే. దానికితోడు, మదీనా, దాని పరిసర ప్రాంతాలన్నీ ఒక సమాఖ్యగా ఏర్పడాలన్నదే. కాబట్టి, ఆయన(స) విశాల హృదయంతో, అనాగరిక, విద్వేషపూరిత, వైషమ్యభరిత ప్రపంచం, ఇప్పటివరకు ఊహించలేనటువంటి చట్టాలతో ఓ క్రొత్త సంవిధానాన్ని ప్రవేశపెట్టారు.

మదీనాపురానికి పొరుగున ఉన్నవారు యూదులు అన్న విషయం మనం ఇదివరకే తెలుసుకున్నాం. వీరు రహస్యంగా ముస్లిముల ఎడల శత్రుత్వభావం కలిగి ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి ఘర్షణకుగాని, కుతంత్రాలకుగాని పాల్పడలేదు. అందుకని మహాప్రవక్త (స) వారితో ఓ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం జరిగింది. ఈ ఒప్పందంలో వారికి, వారి మతం, ధనప్రాణాలకు పూర్తి స్వాతంత్ర్యం ఇవ్వడం జరిగిందే తప్ప, వారి ఎడల శత్రుత్వం వహిస్తూ వారిని దేశ బహిష్కరణకు గురిచేయడంగానీ, వారి ఆస్తిపాస్తులను జప్తు చేసుకోవడంగానీ, విద్వేషభరితమైన రాజకీయం నడపడంగానీ చెయ్యలేదు.

ముస్లిములకు, ముస్లిములకు నడుమ జరిగిన ఒప్పందం లాంటిదే ఆ ఒప్పందం కూడా. ఇప్పుడు ఆ ఒప్పందంలోని ప్రధాన షరతులు ఏవో చర్చిం చుకుందాం.

ఒప్పందంలోని ముఖ్యాంశాలు

1. బనూ ఔఫ్‌కు సంబంధించిన యూదులు ముస్లిములతో కలసిపోయి ఒకే సమాజంగా ఉంటారు. యూదులు తమ ధర్మంపైనా, ముస్లి ములు ఇస్లామ్ ధర్మంపైనా స్వతంత్రంగా నడుచుకోవచ్చు. అది యూదులు, ముస్లిములు మరియు వారి బానిసలు మరియు సంబం ధీకుల హక్కు. బనూ ఔఫ్ తెగే కాకుండా మిగతా యూదుల హక్కులు కూడా ఇలాగే ఉంటాయి.
2. యూదులు, ముస్లిములు వారి వారి ధనాన్ని వారి ఇష్టప్రకారం ఖర్చు పెట్టుకునేందుకు బాధ్యులు.

3. ఏ శక్తి అయినా ఈ ఒప్పందంలోని ఓ వర్గంతో యుద్ధానికి పాల్పడితే దానికి వ్యతిరేకంగా వీరు ఉభయులు కలసి యుద్ధం చేయాల్సి ఉంటుంది.
4. ఈ ఒప్పందానికి సంబంధించిన ఉభయ వర్గాలు, తమ పరస్పర సంబంధాలను సదాచారం, సుహృద్భావం మరియు ప్రయోజనాల ప్రాతిపదికపై ఏర్పర్చుకోవలసి ఉంటుందే తప్ప దుర్మార్గం మరియు పాపాల ప్రాతిపదికపై కాదు.
5. ఏ వ్యక్తినీ మిత్రపక్షం కారణంగా నేరస్తునిగా నిలబెట్టడానికి వీల్లేదు.
6. పీడితునికి సహాయం అందించడం జరుగుతుంది.
7. యుద్ధం కొనసాగే వరకు యూదులు కూడా ముస్లిములకు తోడు ఆ యుద్ధానికి అయ్యే ఖర్చును భరించాల్సి ఉంటుంది.
8. ఈ ఒప్పందంలోని ప్రతి వర్గానికి సంబంధించినవారు, మదీనాలో కలహాలను రేపడం, రక్తపాతాన్ని సృష్టించడం హరాం (నిషిద్ధం).
9. ఈ ఉభయ వర్గాల నడుమ కలహాలను సృష్టించే మనస్పర్థలు ఏవైనా, ప్రస్తుతం లేనటువంటి క్రొత్త పరిస్థితి ఏదైనా ఉత్పన్నమైతే దాని తీర్పు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(స) మాత్రమే ఇవ్వగలరు.
10. ఖురైషులకు, వారి సహాయకులకూ ఎలాంటి రక్షణ కల్పించడం జరుగదు.
11. ఎవరైనా యస్రిబ్‌పైకి దండెత్తి వస్తే, వారిని అందరూ కలసి ఎదుర్కొం టారు. ప్రతి ఒక పక్షమూ తన తన పరిసరాలను సంరక్షించుకునే బాధ్యతను కలిగి ఉంటుంది.
12. ఈ ఒప్పందం ఏ నేరస్తుడూ మరే దౌర్జన్యపరుడూ విషయంలో అడ్డుగా నిలవదు.[1]

ఈ ఒప్పందం జరిగిన తరువాత మదీనా మరియు దాని పరిసర ప్రాంతాలు సురక్షితమైన పాలన క్రిందికి వచ్చేశాయి. ఈ ప్రభుత్వ రాజధాని మదీనాగా, దైవప్రవక్త (స), ఆ ప్రభుత్వానికి పాలకులుగా నియమితులయ్యారు. ఈ ప్రభుత్వ ఆదేశాలు, అధికారం పూర్తిగా ముస్లిములదే. ఇలా మదీనా నగరం ఇస్లామ్‌కు రాజధానిగా మారిపోయింది.

శాంతిసౌభాగ్యాల పరిధిని మరింత విస్తరింపజేసేందుకు దైవప్రవక్త(స) ఆపై ఇతర తెగలతో, పరిస్థితులకు అనుగుణంగా ఇలాంటి ఒప్పందాలనే చేసుకోవడం జరిగింది. వీటిలో కొన్నింటి ప్రస్తావన మునుముందు చెప్పుకోవడం జరుగుతుంది.

1. ఇబ్నె హిషామ్-1/ 503,504

సాయుధ పోరాటాలు

హిజ్రత్ అనంతరం ఖురైషులు పన్నిన కుట్రలు, కుతంత్రాలు- అబ్దుల్లా బిన్ ఉబైతో జరిగిన సంప్రతింపులు

మక్కా దైవతిరస్కారులు ముస్లిములపై జరిపిన హింసా దౌర్జన్యా లెలాంటివో, ముస్లిములు హిజ్రత్ చేసి మదీనాకు తరలి వచ్చేటప్పుడు వారికి వ్యతిరేకంగా జరిపిన అక్రమాలు, హిజ్రత్ చేసినందుకుగాను ముస్లిముల ఆస్తిపాస్తులు హస్తగతం చేసుకున్న తీరు వగైరాల గురించి మనం ఇదివరకే చదువుకొని ఉన్నాం. కాని ఇప్పుడు వారి ఆగడాలు ఇంకా సమసిపోలేదు. వారు తమ రాక్షస ప్రవృత్తిని ఇంకా వదలలేకపోయారు. పైగా, ముస్లిములు వారి పట్టు నుండి జారిపోయినందున వారి ఆగ్రహం మరింత పెచ్చుపెరిగి పోయింది. ముస్లిములకు మదీనాలో ఓ ప్రశాంతమైన నెలవు లభ్యం అయిందని తెలిసి అగ్గి మీద గుగ్గిలమైపోయారు. అందుకని వారు అబ్దుల్లా బిన్ ఉబైను - అతను ఇంకా బాహాటంగా బహుదైవారాధకుడుగానే ఉన్నాడు - అన్సార్ నాయకత్వం కోసం ఎన్నుకోబడిన వ్యక్తిగా, దైవప్రవక్త(స) మదీనాకు రాకపోయినట్లయితే అన్సారులు అతనినే తమ రాజుగా నియమించుకోడానికి సన్నాహాలు చేసుకున్నారన్న విషయం ఖురైషులకు బాగా తెలుసు. గనుక అతని పలుకుబడినీ, స్థాయినీ దృష్టిలో పెట్టుకొని అతనికి ఓ బెదిరింపు లేఖను పంపించారు. ఆ లేఖలో అబ్దుల్లా బిన్ ఉబైను, అతని బహుదైవారాధక అనుయాయులను సంబోధిస్తూ: "మీరు మా మనిషికి శరణమిచ్చి ఉన్నారు. అందుకని మేము అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాం. మీరు అతనితో యుద్ధం అన్నా చేయండి లేదా అతణ్ణి మదీనా నుండి వెళ్ళగొట్టన్నా వెళ్ళ గొట్టండి. అలాకాని పక్షంలో మేము మా పూర్తి బలంతో మీపై దాడిచేసి మీ యోధులనందరిని సంహరించేస్తాం. మీ స్త్రీల మానాన్ని, శీలాన్ని కూడా కొల్లగొడ్తాం జాగ్రత్త" అని ఖరా ఖండిగా తేల్చి చెప్పారు.[1]

1. అబూ దావూద్

ఈ లేఖ అందీఅందగానే అబ్దుల్లా బిన్ ఉబై తన బహుదైవారాధక మిత్రులందరినీ, ఖురైషుల ఆదేశాలను పాలించడానికి సమావేశపరిచాడు. ఈ విషయంలో అతను తొందరపడడానికి కారణం లేకపోలేదు. అదేమిటంటే, దైవప్రవక్త (స) అతని నుండి అధికారాన్ని, రాచరికాన్ని లాక్కున్నందున, అతని మనస్సులో ఆయన (స) ఎడల విద్వేషం బాగా పెరిగిపోయి ఉంది. అతనికి ఈ లేఖ అందడంతోనే అతనూ, అతని అనుయాయులు దైవప్రవక్త (స)తో యుద్ధం చేయడానికి సమాయత్తమయ్యారు. ఈ విషయం దైవప్రవక్త (స)కు తెలియగానే ఆయన (స) వారి దగ్గరకు వచ్చి, "ఖురైషులు చేసిన బెదిరింపుకు మీరు అతిగా ప్రభావితులై ఉన్నారట్లుంది. మీరు మిమ్మల్ని నష్టపెట్ట దలుచుకుంటే చెప్పండి, ఖురైష్ మాత్రం మీకు అంత నష్టం కలిగించలేరు. మీరు మీ కుమారులతో, సోదరులతో పోరాడదలుచుకున్నారా?" అని చెప్పారు. మహాప్రవక్త (స) గారి ఈ మాటలు విని బహుదైవారాధకులంతా తిరిగి వెళ్ళిపోయారు.[2]

అబ్దుల్లా బిన్ ఉబై అప్పుడైతే యుద్ధానికి సంబంధించిన ఆలోచనను మానుకున్నాడు. అతని అనుయాయులు బెదిరిపోయారు, విషయం వారికి అర్థమైంది కనుక అతను మిన్నకుండిపోయాడు. అయితే ఖురైషులతో అతని రహస్య మంతనాలు మాత్రం సాగుతూనే ఉన్నాయి. అతను ముస్లిములు మరియు బహుదైవారాధకుల నడుమ చిచ్చుపెట్టే ఏ అవకాశాన్నీ చేజారకుండా జాగ్రత్తపడనారంభించాడు. దీనికిగాను, అతను యూదులతో కూడా ఈ విషయంలో సహాయం పొందడానికి మంతనాలను సాగిస్తూనే ఉన్నాడు. మహాప్రవక్త (స)గారి వివేచన, ఉన్నట్లుండి రగిలే చిచ్చును ఆర్పివేస్తూ ఉండేది.[3]

ముస్లిములను మస్జిదె హరాంలో ప్రవేశించకుండా అడ్డుకోవడం

ఆ కాలంలోనే హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) ఉమ్రా చేయడానికి మక్కాకు వెళ్ళారు. ఆయన ఉమయ్యా బిన్ ఖల్ఫ్‌కు అతిథిగా ఉండి, అతనితో, "నేను కాబా గృహ ప్రదక్షిణ చేసుకోడానికి ఖాళీగా ఉన్న సమయం ఏదో చెప్పమని" అడిగారు. ఉమయ్యా ఆయన్ను మధ్యాహ్న సమయంలో వెంటబెట్టుకొని బయలుదేరగా మార్గంలో అబూజహల్ కలిశాడు. అతను (ఉమ

2. అబూ దావూద్

3. సహీ బుఖారి-2/655,656, 916,924

య్యాను సంబోధిస్తూ), "అబూ సుఫ్‌వాన్! నీ వెంట ఉన్న ఈ వ్యక్తి ఎవరూ" అని అడిగాడు. జవాబుగా ఉమయ్యా, "ఈయన సఅద్" అని పరిచయం చేశాడు. అప్పుడు అతను సఅద్‌ను ఉద్దేశించి, "ఓహో! నీవు ఎంత తీరిగ్గా కాబా గృహం తవాఫ్ చేస్తున్నావే! మిమ్మల్ని ధర్మభ్రష్టులు వారి రక్షణలో తీసుకున్నారు కదా! మీరు వారికి సహాయపడతామని బీరాలు కూడా పలుకుతున్నారట. విను! దైవసాక్షి! నీవేగనక అబూ సుఫ్‌వాన్ వెంట ఉండి ఉండకపోతే నీ ఇంటికి క్షేమంగా తిరిగి వెళ్ళేవాడవు కావు!" అన్నాడు. ఇది విన్న హజ్రత్ సఅద్(ర)కు కోపం వచ్చి, "నీవు కూడా బాగా విను, దైవసాక్షి! నీవే గనక నన్ను ఈ తవాఫ్ చేయకుండా అడ్డుకున్నావో, నేను కూడా నీ దృష్టిలో అంతకంటే విలువైన దాన్నుండి అడ్డుకోగలను" (అంటే మదీనావాసుల దాపు నుండి వెళ్ళే నీ (వర్తక బిడారాన్ని) మార్గం నుండి అన్నమాట)[4]అని బదులిచ్చారు.

ముహాజిర్లకు ఖురైషుల బెదిరింపు

ఆ పిదప ఖురైష్, ముస్లిముల వద్దకు, "మీరు మక్కా నుండి తప్పించుకొని బయటబడ్డారని గర్వపడకండి, మేము యస్రిబ్‌కు చేరి మిమ్మల్ని సర్వనాశనం చేస్తాం" అనే బెదిరింపును పంపించారు.[5]

ఇది కేవలం ఒక బెదిరింపే కాదు, దైవప్రవక్త (స)కు ఖురైష్ ఎత్తుగడలు, దురాలోచనల గురించి పూర్తిగా తెలిసిన పిమ్మట ఆయన (స) రాత్రి పూట నిద్రించేవారుకారు. సహాబా(ర)గారి పహరాలో ఉండేవారు(సహీ బుఖారి). మరియు సహీ ముస్లిమ్ గ్రంథంలోని హజ్రత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, మహాప్రవక్త (స) మదీనాకు అరుదెంచిన తరువాత ఓ రోజు నిద్రపోకుండా మేల్కొని ఉన్నారు. "నా సహాబాల్లో ఎవరైనా ఈ రాత్రి నా వద్ద పహరా కాస్తే ఎంత బాగుండును" అని కూడా అన్నారు. అంతలోనే ఆయుధాల చప్పుళ్ళు వినరాగా, "ఎవరూ?" అని అడిగారు. "నేను 'సఅద్ బిన్ అబీ విఖాస్'ను దైవప్రవక్తా!" అని సమాధానం వచ్చింది. "ఎందుకొచ్చినట్లు" అని అడిగారాయన (స). "నా మనస్సులో మీ గురించి ప్రమాద శంక ఉత్పన్నమైంది. అందుకని నేను పహరా కాయడానికి వచ్చాను" అని బదులిచ్చారాయన. ఇది విన్న దైవప్రవక్త (స) ఆయన్ను దీవించి నిశ్చింతగా నిద్రపోయారు.[6]

4. బుఖారి, కితాబుల్ ముగాజీ-2/563

5. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/116

ఈ పహారాలు కొన్ని రాత్రుల వరకే పరిమితం కాలేదన్న విషయం గమనార్హం. ఈ పహారాలు శాశ్వతంగా ఉండేవి. ఓ రాత్రి దైవప్రవక్త (స) గారు ఉన్నచోట పహారా కాయడం జరుగుతోంది. అప్పుడు, "అల్లాహ్ మిమ్మల్ని సురక్షితంగా ఉంచుతాడు" అనే దివ్యవాణి అవతరించింది. అప్పుడు మహాప్రవక్త (స) తల బయటకు తీసి, "ప్రజలారా! వెనక్కు వెళ్ళిపోండి, అల్లాహ్ నన్ను రక్షించే బాధ్యత తీసుకున్నాడు" అన్నారు.

ఈ ప్రమాదం కేవలం మహాప్రవక్త (స) గారొక్కరి మట్టుకే పరిమితంగా లేదు. ముస్లిములందరికీ ప్రమాద శంక ఉండింది. హజ్రత్ ఉబై బిన్ కఅబ్ (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స), ఆయన అనుచరులు మదీనాకు అరుదెంచిన తరువాత, అన్సారులు వారికి తమ వద్ద రక్షణ కల్పించినప్పటి నుంచి పూర్తి అరేబియా ద్వీపకల్పమే సంఘటితంగా ఆయన(స)కు ఎదురు నిలిచింది. అందుకని వారు ఆయుధాలు లేకుండా రాత్రి గడపడంగానీ, నిరాయుధులుగా తిరగడంగానీ చేయలేదు.[7]

యుద్ధం అనుమతి

మదీనాలో ముస్లిముల మనుగడకే సవాలుగా నిలుచున్న ఆ విషమ ఘడియల్లోనే అల్లాహ్ ముస్లిములకు యుద్ధం చేసే అనుమతిని ఇచ్చాడు. కాని ఆ యుద్ధం వారిపై విధిగా చేయడం జరుగలేదు. ఈ సందర్భంలో అల్లాహ్ ఆదేశాలు ఏవైతే అవతరించాయో అవి ఇలాగున్నాయి:

أُذِنَ لِلَّذِيْنَ يُقٰتَلُوْنَ بِاَنَّهُمْ ظُلِمُوْا ؕ
وَاِنَّ اللّٰهَ عَلٰى نَصْرِهِمْ لَقَدِيْرُ ۟

"ఎవరితోనైతే యుద్ధం కొనసాగుతోందో వారికి కూడా యుద్ధం చేసే అనుమతి ఇవ్వబడింది. ఎందుకంటే వారు పీడితులు. నిశ్చయంగా అల్లాహ్ వారిని ఆదుకోవడానికి సమర్థుడు." (22:39)

ఆ తరువాత ఈ ఆయత్‌లకు సంబంధించినవే మరికొన్ని ఆయత్‌లు అవతరించాయి. వాటిలో, ఈ అనుమతి కేవలం యుద్ధానికి బదులు యుద్ధమే కాకుండా అసత్యాన్ని తుదముట్టించి అల్లాహ్ చిహ్నాలను నెలకొల్పడం అని చెప్పడం జరిగింది.

---

6. ముస్లిమ్-2/280; సహీ బుఖారి-1/404
7. జామియా తిర్మిజి - హజ్రత్ ఆయిషా(ర)-2/130

اَلَّذِيْنَ اِنْ مَّكَّنّٰهُمْ فِى الْاَرْضِ اَقَامُوا الصَّلٰوةَ وَاٰتَوُا الزَّكٰوةَ
وَ اَمَرُوْا بِالْمَعْرُوْفِ وَنَهَوْا عَنِ الْمُنْكَرِ ؕ

"మేము గనక వారికి భూమిపై అధికారాన్ని ప్రసాదిస్తే, వారు నమాజు స్థాపిస్తారు, జకాత్ ఇస్తారు, మంచిని చేయమని ఆజ్ఞాపిస్తారు, చెడు నుండి నిరోధిస్తారు. సకల వ్యవహారాల అంతిమ నిర్ణయం అల్లాహ్ చేతులలో ఉంది." (22 : 41)

ఈ అనుమతి హిజ్రత్ తరువాత మదీనాలో అవతరించిన అనుమతి. మక్కాలో కాదు అన్న విషయం ఇట్టే అర్థం అవుతోంది. అయితే దాని అవతరణ కాలం ఖచ్చితంగా చెప్పలేకుండా ఉన్నాం.

యుద్ధం చేసే అనుమతి అయితే అవతరించింది. కాని ఏ పరిస్థితుల్లో ఈ అనుమతి అవతరించిందో, ఆ పరిస్థితి ఖురైష్ యొక్క హద్దులు మీరి ప్రవర్తించే ప్రవర్తన వల్ల ఉత్పన్నమైందే. అందుకని, ముస్లిములు తమ అధికార పరిధిని ఖురైషులు ప్రయాణించే వ్యాపార మార్గం వరకు విస్తరింపజేయాలన్నది వివేచనతో కూడిన విషయం. ఈ మార్గం మక్కా నుంచి సిరియాకు వెళ్ళే మార్గం. కాబట్టి దైవప్రవక్త (స) ఈ అధికార విస్తరణ కోసం రెండు ప్రణాళికల్ని సిద్ధం చేశారు.

1. ఏ తెగలైతే ఈ వ్యాపార రహదారికి ఇరుప్రక్కలు లేదా ఈ మార్గం నుండి మదీనా వరకు వ్యాపించి ఉన్న భూభాగంలో నివసిస్తున్న తెగలతో మిత్రత్వం, సహాయసహకారాలు మరియు నిర్యుద్ధ ఒడంబడిక చేసుకోవడం.

2. రెండో ప్రణాళిక ఈ రహదారిపైకి గస్తీ పటాలాలను పంపించడం.

మొదటి ప్రణాళికా విషయంలో, గతంలో యూదులతో చేసుకున్న ఒడంబడికలాంటి ఒడంబడికనే వీరితో చేసుకోవడం. మహాప్రవక్త (స) సైనిక కవాతులు, గస్తీలు ప్రారంభించడానికి ముందు జుహ్నియా తెగతో అలాంటి ఒడంబడిక (అంటే మిత్రత్వం, సహాయసహకారాలు అందించుకోవడం మరియు నిర్యుద్ధ ఒడంబడిక అన్నమాట) కుదుర్చుకోవడం జరిగింది. వీరి ఆవాసం మూడు మజిలీల్లో- అంటే ఒక్కొక్క మజిలీ 45 నుండి 50 మైళ్ళ దూరంలో- ఉంది. ఇదే కాకుండా గస్తీ సమయంలో మరికొన్ని తెగలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది. ఆ వివరాలు ముందు రాబోతున్నాయి.

సరాయా మరియు గజ్వాలు [8]

యుద్ధం చేసే అనుమతి లభించగానే ఈ రెండు ప్రణాళికలను అమలు చేయడానికిగాను ముస్లిములు సైనిక గస్తీలను నిర్వహించనారంభించారు. మదీనా పరిసర ప్రాంతాల్లోని మార్గాల్లో, ముఖ్యంగా మక్కా నుండి మదీనాకు వచ్చే ప్రధాన రహదారిపై దృష్టిని ఉంచవలసి ఉంది. ఈ మార్గాలపై నివసించే తెగలతో సంధి కూడా కుదుర్చుకోవలసి ఉంది. ఈ సైనిక గస్తీల ముఖ్యోద్దేశ్యం, మదీనా పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న బద్దూలకు, ఆటవిక జాతులకు మరియు వివిధ తెగలకు, ముస్లిములు ఇదివరకటిలా బలహీనులు కారు, శక్తిని బాగా పుంజుకున్న వర్గమన్న విషయం తెలిసిరావడం. అదే కాకుండా ఖురైషులు అవలంబిస్తున్న తీవ్రమైన వైఖరికి వారు మునుముందు తీవ్రమైన దుష్పరిణామాన్ని ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించడం. ఇప్పటికైనా మక్కా ఖురైషులు తమ వైఖరిని సరిదిద్దుకుని, దైవమార్గంలో ముస్లిములకు అడ్డుగా నిలువకుండా దైవప్రచార సందేశాన్ని స్వతంత్రంగా అరేబియాలో విస్తరింపజేసే వీలును కలిపిస్తే, వారి ఆర్థిక, ఔపాధిక వనరుల్ని రక్షించుకో గలరని, దానికి వారు ముస్లిములతో సంధికి దిగిరావాలని చెప్పడం. ఈ ప్రధాన ఉద్దేశ్యాలను దృష్టిలో పెట్టుకునే ముస్లిములు తమ సైనిక గస్తీలను అధికం చేయనారంభించారు.

ఈ సరాయా మరియు గజ్వాలకు సంబంధించిన వివరాలు టూకీగా ఇవి:

1. సరియా సీఫల్ బహ్ర్[9] (రమజాన్ నెల హిజ్రీ శకం.1 - మార్చి క్రీ.శ.623)

అల్లాహ్ ప్రవక్త (స), హజ్రత్ హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్(ర)ను ఈ సరియాకు నాయకునిగా చేసి ముప్పై మంది ముహాజిర్లతో సిరియా నుండి వచ్చే ఓ ఖురైషుల వర్తక బిడారాన్ని కనుగొనేందుకు పంపించడం జరిగింది. ఆ బిడారంలో మూడు వందల మంది వరకు ఉన్నారు. వీరిలో అబూ జహల్

8. గజ్వా అంటే మహాప్రవక్త(స) స్వయంగా పాల్గొన్న సైనిక యాత్ర. ఆ యాత్రలో యుద్ధం జరిగినా జరగకపోయినా అది గజ్వాగానే పిలువబడుతుంది. అలాగే 'సరియా' అంటే దైవప్రవక్త(స) పాల్గొనని సైనిక యాత్ర. 'సరియా'కు బహువచనమే సరాయా.

9. సీఫుల్ బహ్ర్ అంటే సముద్ర తీరం అని అర్థం.

కూడా ఉన్నాడు. ముస్లిములు 'గీజ్'[10] అనే పరిసర ప్రాంతంలో సముద్ర తీరానికి వెళ్ళినప్పుడు ఆ బిడారం వారికి ఎదురైంది. ఇరుపక్షాలు యుద్ధం కోసం బారులు తీరారు. కాని జుహైనా తెగకు చెందిన ఓ సర్దారు మజ్దీ బిన్ అమ్రూ ఇరుపక్షాలకు మిత్రుడైనందున అతను ప్రయత్నం చేసి ఆ యుద్ధం జరగకుండా ఆపేశాడు.

హజ్రత్ హమ్జా చేతిలో ఉన్న యుద్ధ పతాకం, దైవప్రవక్త(స) తమ చేతుల మీదుగా ఆయనకు ఇచ్చిన మొదటి పతాకం. దాని రంగు తెలుపు. దాన్ని హజ్రత్ అబూ మర్సద్ కనాజ్ బిన్ హసీన్ గన్వీ(ర) ఎత్తుకొని ఉన్నారు.

2. సరియ్యా రాబిగ్ (షవ్వాల్ మాసం, ఒకటవ హిజ్రీ శకం - క్రీ.శ. ఏప్రిల్ 623)

మహాప్రవక్త (స), హజ్రత్ అబూ ఉబైదా బిన్ హారిస్ బినుల్ ముత్తలిబ్ (ర) గారికి అరవై మంది ముహాజిర్ల ఉష్ట్రారోతుల్నిచ్చి పంపించిన సరియ్యా అది. 'రాబిగ్' లోయలో అబూ సుఫ్యాన్ ఎదురుపడ్డాడు. అతని వెంట రెండొందల మంది ఉన్నారప్పుడు. ఇరుపక్షాలు బాణాలు సంధించుకున్నాయి. అంతేతప్ప ఎలాంటి యుద్ధం జరగలేదు.

ఈ సరియ్యాలో మక్కాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ముస్లిములతో వచ్చి కలిసిపోయారు. వారిలో ఒకాయన హజ్రత్ మిగ్దాద్ బిన్ అమ్రూ అల్ బహ్రానీ (ర), ఇంకొకరు ఉత్బా బిన్ గుజ్వాన్(ర). వీరిరువురు ఇదివరకే ఇస్లామ్ స్వీకరించారు. ఎలాగో ఓలాగు ముస్లిములతో చేరిపోదామనే ఉద్దేశ్యంతోనే ఈ బిడారం వెంట వచ్చినవారు.

హజ్రత్ అబూ ఉబైదా జెండా రంగు కూడా తెలుపే. ఇది హజ్రత్ మిస్తహ్ బిన్ అసాసా బిన్ ముత్తలిబ్ బిన్ అబ్దె మునాఫ్ (ర)గారి చేతిలో ఉంది.

3. సరియ్యా ఖర్రార్[11] (జీఖాదా, హిజ్రీ శకం 1 - క్రీ.శ. మే 623)

ఈ సరియ్యా అమీర్‌గా దైవప్రవక్త(స), హజ్రత్ సఅద్ బిన్ అబీ విఖాస్ (ర) ను నియమించారు. వారి వెంట ఇరవై మంది సైనికులున్నారు. వీరిని కూడా ఖురైషుల వర్తక బిడారం ఆచూకీ కోసమే పంపించడం జరిగింది.

10. గీజ్, ఎర్రసముద్రం దాపున 'యంబూ' మరియు 'మర్వా' నడుమగల ఓ ప్రదేశం.

11. హుజ్ఫాకు దాపున ఉన్న ఓ ప్రదేశం.

వెళ్ళేటప్పుడు ఖర్రార్ దాటి వెళ్ళవద్దని తాకీదు కూడా చేసి పంపించడం జరిగింది. వీరు కాలినడకనే బయలుదేరారు. రాత్రి పూట ప్రయాణిస్తూ పగటి పూట ఎవరి కంటబడకుండా దాగి ఉండేవారు. అయిదో రోజు ఉదయాన ఖర్రార్‌కు చేరినప్పుడు, బిడారం ఒక రోజు ముందే వెళ్ళిపోయిందని తెలిసింది.

ఈ సరియ్యా పతాకం కూడా తెలుపు రంగుదే. దీన్ని హజ్రత్ మిగ్దాద్ బిన్ అమ్రూ (ర)ఎత్తుకొని ఉన్నారు.

4. గజ్వయె అబ్వా లేదా వద్దాన్[12] (సఫర్, హి.శ. 2 - క్రీ.శ. ఆగస్టు 623)

ఈ సైనిక కార్యంలో డెబ్బై మంది ముహాజిర్ల వెంట దైవప్రవక్త(స) కూడా ఉన్నారు. మదీనా బాధ్యతనంతా ఆయన(స), హజ్రత్ సఅద్(ర) బిన్ ఉబాదాకు అప్పగించి వెళ్ళారు. ఈ ఆపరేషన్ ధ్యేయం మార్గమధ్యంలోనే ఓ వర్తక బిడారాన్ని అడ్డుకోవడం. మహాప్రవక్త(స) వద్దాన్ వరకు వెళ్ళినా అది తారసపడలేదు.

ఈ గజ్వాలోనే దైవప్రవక్త(స) బనూ జమ్రా తెగ సర్దారు, 'అమ్రూ బిన్ మఖ్షి జ్జమరీ'తో స్నేహ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఒప్పందం ఇలా రాయ బడింది:

"ఇది జమ్రా కోసం అల్లాహ్ ప్రవక్త(స) తరపున రాసి ఇచ్చిన పత్రం. వీరు తమ ధన ప్రాణాల విషయంలో నిశ్చింతగా ఉండాలి. వీరిపై ఎవరైనా దాడి చేస్తే వారికి వ్యతిరేకంగా సహాయం చేయడం జరుగుతుంది. అయితే వీరు దైవధర్మానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తే తప్ప. ఈ ఒప్పందం శాశ్వతమైన ఒప్పందం. మా సహాయం కోసం వారిని పిలిచినప్పుడు వారు రావలసి ఉంటుంది."[13]

మహాప్రవక్త(స) స్వయంగా బయలుదేరిన సైనిక ఆపరేషన్ ఇది. పదిహేను రోజుల వరకు మదీనాను వదిలి బయట గడిపి తిరిగి వచ్చారాయన. ఈ సైనిక పటాలం జెండా రంగు తెలుపు. హజ్రత్ హమ్జా(ర) దాన్ని ఎత్తుకున్నారు.

---

12. మక్కా మరియు మదీనా నడుమన ఉన్న ప్రదేశం. ఇది రాబిగ్ నుండి మదీనాకు వెళ్ళే మార్గంపై 29 మైళ్ళ దూరాన ఉంది. అబూ వద్దాన్ అనేది దాని దాపులోనే ఉన్న మరో ప్రదేశం పేరు.

13. అల్ మవాహిబ్ అల్‌లదునియహ్-1/75

5. గజ్వయె బువాత్ (రబీఉల్ అవ్వల్, హి.శ. 2 - క్రీ.శ. సెప్టెంబర్ 623)

ఈ పోరాటం కోసం దైవప్రవక్త(స) రెండొందల మంది సహాబా(ర)లను తోడ్కొని బయలుదేరారు. దీని లక్ష్యం కూడా ఖురైష్ వర్తక బిడారాన్ని అడ్డుకోవడం. ఈ బిడారంలో ఉమయ్యా బిన్ ఖల్ఫ్ వెంట ఖురైషులకు చెందిన వంద మంది మరియు రెండొందల ఒంటెలున్నాయి. మహాప్రవక్త(స) 'రిజ్వా' దాపులోని 'బువాత్'[14] వరకు వెళ్ళారు. కాని అది వారికి తారసపడలేదు. ఈ గజ్వా సందర్భంలో దైవప్రవక్త (స) మదీనాకు హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్(ర)ను అమీరుగా చేసి వెళ్ళడం జరిగింది. దీని పతాకవర్ణం కూడా తెలుపే. ఇది హజ్రత్ సఅద్ బిన్ అబీ వికాస్ (ర)గారి చేతిలో ఉంది.

6. గజ్వయె సుఫ్వాన్ (రబీఉల్ అవ్వల్, హి.శ.2 - క్రీ.శ. సెప్టెంబర్ 623)

ఈ పోరాటానికి వెళ్ళడానికి కారణం, 'జబిన్ జాబిర్ ఫహరీ' అనే బహుదైవారాధకుడు ఓ చిన్న సైనిక పటాలంతో వచ్చి మదీనా పరిసర పచ్చిక మైదానాల్లో మేస్తున్న కొన్ని పశువుల్ని తోలుకొని వెళ్ళడం. దైవప్రవక్త(స) డెబ్బై మంది సహాబా (ర)లతో అతణ్ణి వెంటాడారు. బద్ర్ దరిదాపులో ఉన్న సఫ్వాన్ లోయ వరకు వెళ్ళినా అతడు వారికి దొరకలేదు. ఎలాంటి పోరాటం జరగ కుండానే తిరిగి వచ్చారు. ఈ గజ్వాను కొందరు గజ్వయె బద్రె ఊలా (మొదటి బద్ర్ పోరాటం)గా అభివర్ణిస్తారు.

ఈ గజ్వాకు వెళ్ళేటప్పుడు దైవప్రవక్త(స) మదీనా పాలనా పగ్గాలను జైద్ బిన్ సాబిత్(ర)కు అప్పగించి వెళ్ళడం జరిగింది. ఈ గజ్వా పతాకం రంగు తెలుపు. దీన్ని హజ్రత్ అలి(ర) ఎత్తుకొని ఉన్నారు.

7. గజ్వయె జిల్ ఉషైరా (జమాదిల్‌ఊలా మరియు జమాదిల్ ఉఖ్రా మాసాలు, హి.శ. 2 - క్రీ.శ. నవంబరు, డిసెంబరు 623)

ఈ సైనిక కార్యంలో నూటా యాభై లేదా రెండొందల మంది ముహా జిర్లు పాల్గొన్నారు. అయితే ఈ దండు వెంట వెళ్ళమని మహాప్రవక్త(స) ఎవ్వరినీ బలవంత పెట్టలేదు. స్వారీ కోసం కేవలం ముప్పై ఒంటెలే ఉన్నాయి. ఈ

---

14. బువాత్ మరియు రిజ్వా అనేవి 'జుహైనా' కొండ వరసల్లోని రెండు కొండలు. అసలు అవి రెండూ ఒకే పర్వతానికి చెందిన రెండు శాఖలు. ఇవి సిరియా వెళ్ళే రహదారి ప్రక్కన మదీనాకు 48 మైళ్ళ దూరంలో ఉన్న పర్వతాలు.

సైనికులు వంతులవారీగా వాటిపై స్వారీ చేశారు. ఈ సరియ్యా లక్ష్యం, సిరియాకు వెళ్ళే ఓ వ్యాపార బిడారం. ఇది మక్కా నుండి బయలుదేరినట్లు దాని వెంట ఖురైషులకు చెందిన బోలెడు వర్తక సామగ్రి ఉన్నట్లు తెలిసింది. దైవప్రవక్త(స) దాన్ని పట్టుకోడానికి 'జుల్అషైరా'[15] వరకు వెళ్ళారు. అప్పటికే బిడారం చేయి దాటిపోయింది. సిరియా నుండి తిరిగి వచ్చేటప్పుడు దాన్ని పట్టుకోడానికి ప్రయత్నించిన బిడారమే అది. అయితే దానికి బదులుగా బద్ర్ యుద్ధం సంభవించింది.

ఈ సైనిక కార్యం కోసం దైవప్రవక్త (స) జమాదిల్ ఊలా నెల చివరి రోజుల్లో బయలుదేరినట్లు ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖనం ఉంది. తిరిగి జమాదిల్ ఉఖ్రాలో తిరిగివచ్చారు. ఈ కారణంగానే మాసానికి సంబంధించిన ఖచ్చితమైన సమాచారం విషయంలో చరిత్రకారుల నడుమ అభిప్రాయ భేదం ఉంది.

ఈ గజ్వాలో దైవప్రవక్త(స), బనూ ముద్లిజ్, వారి మిత్రపక్షాలైన బనూ జమ్రా తెగలతో నిర్యుద్ధ ఒడంబడికను చేసుకోవడం జరిగింది.

ప్రయాణంలో మదీనా బాగోగులను చూడడానికి మహాప్రవక్త(స), హజ్రత్ అబూ సల్మా బిన్ అబ్దుల్ అసద్ మగ్జూమీ(ర)కి బాధ్యతను అప్ప జెప్పారు. ఇప్పుడు కూడా ఈ గజ్వా ధ్వజం తెలుపు రంగుదే. ఈ పతాకం హజ్రత్ హమ్జా(ర) గారి చేతిలో ఉంది.

8. సరియ్యయె నఖ్లా (రజబ్ మాసం, హి.శ.2 - క్రీ.శ. జనవరి 624)

ఈ సైనిక కార్యానికి మహాప్రవక్త (స), హజ్రత్ అబ్దుల్లా బిన్ హజష్ (ర)గారిని నాయకునిగా నియమించి పంపించారు. ఇందు పన్నెండు మంది ముహాజిర్లే ఉన్నారు. ఇద్దరేసి వ్యక్తులకు ఒక ఒంటె చొప్పున ఉంది. వీరు వాటిపై వంతులవారీగా ఎక్కి వెళ్ళారు. ఈ పటాలం అమీరు (నాయకుడు)కు మహాప్రవక్త(స) ఓ లేఖ అందిస్తూ, రెండు రోజుల ప్రయాణం చేసిన తరువాత గాని దీన్ని చదవాలని తాకీదు చేశారు. కనుక రెండు రోజుల వరకు ప్రయాణిం చిన తరువాత ఆయన ఈ ఉత్తరాన్ని చదివారు. అందు ఇలా రాసి ఉంది:

"మీరు నా ఈ లేఖను చదివినప్పుడు ముందుకు సాగి మక్కా మరియు తాయెఫ్ నడుమగల నఖ్లా వరకు వెళ్ళి ఆగండి. అక్కడ ఖురైషులకు చెందిన ఓ బిడారం కోసం కాచుకొని ఉండండి. మాకు సమాచారం పంపించండి."

15. ఉషైరా. ఉసైరా అని కూడా అనటం జరిగింది. యన్బూ చుట్టుప్రక్కల్లో ఉన్నటువంటి ఒక ప్రాంతం పేరు.

దళం నాయకుడు అది చదివి ప్రవక్త (స)ను విధేయిస్తూ తన అనుచరు లకు విషయాన్నంతా చెప్పి, "నేను మిమ్మల్నెవరినీ బలవంతం పెట్టడంలేదు. ఎవరు దైవమార్గంలో అమరగతి నొందదలిచాడో నా వెంట రండి, మరెవరికైతే తమ ప్రాణాలు కాపాడుకోవాలని ఉందో ఇక్కడి నుండి వెనక్కి తిరిగి వెళ్ళవచ్చు. ఇక నా విషయానికివస్తే నేను ముందుకే వెడతాను." ఈ మాటలు విన్న సహచరులంతా ఆయన వెంట సిద్ధపడి గమ్యం వైపునకు బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో సఅద్ బిన్ అబీ విఖాస్(ర) మరియు ఉత్బా బిన్ గుజ్వాన్(ర)లు స్వారీచేసే ఒంటె మాయమైంది. ఈ కారణంగా వీరు వెనుకబడి పోయారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ హజష్(ర) సుదూర ప్రయాణం సాగించి నఖ్లా చేరుకున్నారు. అక్కడి నుండి ఖురైష్‌కు చెందిన ఓ వర్తక బిడారం ముందుకు కదిలిపోతోంది. ఈ బిడారం వెంట ఎండుద్రాక్ష, తోలు సామాను ఉంది. బిడారం వెంట అబ్దుల్లా బిన్ ముగైరా ఇద్దరు కుమారులు ఉస్మాన్ మరియు నౌఫిల్‌లు ఉన్నారు. వీరిద్దరు కాకుండా అమ్రూ బిన్ హజ్రమీ మరియు హకీమ్ బిన్ కైసాన్ మౌలా ముగైరాలు కూడా ప్రయాణిస్తున్నారు. ముస్లిములు కలిసి పరస్పరం చేయవలసిన కార్యక్రమం గురించి చర్చించుకోనారంభించారు. ఆ రోజు నిషిద్ధ మాసమైన రజబ్ చివరి దినం. మనం గనక పోరాటంలో పాల్గొంటే నిషిద్ధ మాస పవిత్రతను ఉల్లంఘించినట్లవుతుంది. రాత్రి గడిచే వరకు వేచి చూస్తే వీరు 'హరం' (మక్కా) హద్దుల్లోనికి వెళ్ళిపోతారు అని పరిపరి విధాల ఆలోచనలో పడిపోయారు. ఎట్టకేలకు అందరూ కలసి బిడారంపై దాడి చేయాలన్న నిర్ణయానికి వచ్చేశారు. అందులోని ఓ వ్యక్తి, అమ్రూ బిన్ హజ్రమీపై బాణాన్ని వదిలి చంపివేశాడు. మిగతా వారు ఉస్మాన్ మరియు హకీమ్‌లను బంధించారు. అయితే నౌఫిల్ మాత్రం పారిపోవడంలో కృతకృత్యుడయ్యాడు. ఆ తరువాత వీరు ఇద్దరు ఖైదీలు మరియు బిడారంలోని వర్తక సామగ్రినంతా వెంటబెట్టుకొని మదీనాకు చేరారు. యుద్ధ ధనం నుండి ఖుమ్స్ (అయిదో వంతు) తీసి పంచుకున్నారు కూడా.[16] ఇవి ఇస్లామీయ చరిత్ర లోని మొదటి ఖుమ్స్, మొదటి హత్య మరియు మొదటి బందీలు.

16. చరిత్రకారుల కథనం మాత్రం ఇదే. అయితే ఖుమ్స్ (అయిదో వంతు) ధనం తీసి పంచుకునే ఆదేశం బద్ర్ యుద్ధం జరిగినప్పుడు అవతరించిన ఆదేశం. ఈ కారణంగా ఖుమ్స్ పంపకం గురించి వచ్చిన వివరాలన్నీ బద్ర్ యుద్ధం తరువాతివే. అంతకు పూర్వం ఖుమ్స్ పంపకం గురించి ముస్లిములకు తెలియదు.

దైవప్రవక్త(స), వారి ఈ ప్రవర్తనను నిరసిస్తూ," నేను మిమ్మల్ని హరాం (నిషిద్ధ) నెలలో యుద్ధం చేసే ఆదేశం ఇవ్వలేదు, ఖైదీలు మరియు ధన పంపకం గురించి కూడా ఎలాంటి సూచనలు ఇవ్వలేదు" అని అన్నారు.

ఈ సంఘటన జరిగిన తరువాత ముష్రిక్కులకు, ముస్లిములు అల్లాహ్ నిషిద్ధం చేసిన మాసాలను ధర్మసమ్మతం చేసుకున్నారు" అని ప్రచారం చేసే అవకాశం లభించింది. ఈ విషయంలో పెద్ద రాద్ధాంతాన్ని లేవనెత్తారు. చివరికి అల్లాహ్ దైవవాణి ద్వారా ఈ ప్రచారాన్ని ఖండిస్తూ, ముష్రిక్కులు ఏ వైఖరినైతే అవలంబిస్తున్నారో అది ముస్లిములు చేసిన అపచారంకంటే ఎంతో పెద్ద నేరం అని తెలియజేయడం జరిగింది. దివ్యవాణి ఇలా ఉంది:

يَسْـَٔلُوْنَكَ عَنِ الشَّهْرِ الْحَرَامِ قِتَالٍ فِيْهِ ؕ قُلْ قِتَالٌ فِيْهِ كَبِيْرٌ ؕ
وَصَدٌّ عَنْ سَبِيْلِ اللّٰهِ وَكُفْرٌۢ بِهٖ وَالْمَسْجِدِ الْحَرَامِ ۚ وَاِخْرَاجُ
اَهْلِهٖ مِنْهُ اَكْبَرُ عِنْدَ اللّٰهِ ۚ وَالْفِتْنَةُ اَكْبَرُ مِنَ الْقَتْلِ ؕ

"నిషిద్ధ మాసంలో యుద్ధం చెయ్యటాన్ని గురించి ప్రజలు నిన్ను అడుగుతారు. వారికి ఇలా సమాధానం చెప్పు: "ఆ మాసంలో యుద్ధం చెయ్యడం మహా నేరమే. కాని అల్లాహ్ మార్గంలో అవరోధాలు కల్పించడం, అల్లాహ్‌ను తిరస్కరించడం, అల్లాహ్ ఆరాధకులను 'మస్జిదె హరామ్'ను దర్శించకుండా ఆటంకపర్చడం, అందులో ఉండేవారిని బయటకు గెంటి వేయటం అల్లాహ్ దృష్టిలో అంతకంటే గొప్ప నేరం. ఇంకా హింస ద్వారా పరధర్మాన్ని అణచడం రక్తపాతం కంటే తీవ్రమైనది." (2-217)

హంతకులుగా ప్రచారం చేయబడుతున్న ముస్లిముల సదాచరణ విషయమై బహుదైవారాధకులు చేస్తున్న రాద్ధాంతానికి అసలు తావే లేదని ఈ ఖుర్‌ఆన్ వాక్యం తేటతెల్లం చేసింది. ఎందుకంటే, ఖురైషులు ఇస్లామ్‌కు వ్యతిరేకంగా అవలంబిస్తున్న వైఖరిలో మరియు వారిపై జరిపే దౌర్జన్య కాండలో ఈ విలువలను ఎప్పుడో తుంగలో త్రొక్కడం జరిగింది. హిజ్రత్ చేసి మదీనాకు వెళ్ళిన ముస్లిముల ఆస్తిపాస్తులను జప్తు చేసుకోవడం, ఇస్లామ్ ప్రవక్త(స)ను హతమార్చే ప్రయత్నం చేయటం లాంటి వికృత చేష్టలు మక్కాకు

17. *ఈ సరాయా మరియు గజ్వాల వివరాలను ఈ దిగువ గ్రంథాల నుండి సేకరించడం జరిగింది. జాదుల్ ముఆద్-2/83-85; ఇబ్నె హష్షామ్-1/591-605;*

బయట జరిగినవా? ప్రస్తుతం ఈ 'పరిశుద్ధత' అనే ఊహ వారిలో ఇప్పుడు ఎందుకు పుట్టుకొచ్చినట్లు? ముష్రిక్కులు ఏ దుష్ప్రచార తుఫానును లేవనెత్తుతున్నారో అది వారికి సిగ్గుచేటైన విషయం.

ఆ తరువాత మహాప్రవక్త(స) ఆ ఇద్దరు ఖైదీలను విడిచిపెట్టేశారు. చనిపోయిన వ్యక్తి తాలూకు రక్తపరిహారాన్ని వారి సంరక్షకులకు అందజేశారు.[17]

ఇవీ బద్ర్ యుద్ధానికి పూర్వం జరిగిన సరియ్యాలు, గజ్వాలు. వీటిలో ఏ ఒక్క పోరాటంలోనూ వినాశనంగాని, హత్యలుగాని, దోపిడీగాని జరగలేదు. కర్జ్ బిన్ జాబిర్ ఫహరీ నాయకత్వంలో ముష్రిక్కులే దీనికి పాల్పడ్డారు. కాబట్టి దోపిడీకి ఆరంభం ముష్రిక్కుల వైపు నుండే జరిగింది. ఇంతకు పూర్వం వారు అనేక దౌర్జన్యాలకు పాల్పడి ఉన్న విషయం కూడా మనకు తెలుసు.

ఇటు సరియ్యా అబ్దుల్లా బిన్ హజష్ సంఘటన జరిగిన తరువాత మక్కా బహుదైవారాధకుల భయం వికృతరూపంలో ముందుకొచ్చి నిలుచుంది. వారికి ఇది ప్రమాదంగా పరిణమించింది. వారు ఏ చిక్కుల్లోనైతే పడతామని తలిచారో, ఇప్పుడు నిజంగానే ఆ చిక్కుల్లో వచ్చిపడ్డారు. మదీనా నాయకత్వం ఎంతో వివేచనతో కూడిన నాయకత్వం అని ఇప్పుడు వారికి తెలిసిపోయింది. వారి ప్రతి కదలికపై, ప్రతి వర్తక బిడారంపై దృష్టిని కేంద్రీకరించి ఉన్న యదార్థం బట్టబయలైంది. ముస్లిములు అనుకుంటే మూడు వందల మైళ్ళ (దాదాపు అయిదు వందల పైచిలుకు కిలోమీటర్లు) దూరం వరకు ప్రయాణించి వచ్చి వారి ప్రాంతాల్లో చొరబడి తలపడగలరు, చంపగలరు, ఖైదీలుగా పట్టుకొనిపోగలరు, వారి సొత్తును దోచుకొని క్షేమంగా తిరిగి వెళ్ళిపోగలరు అనే భయం పట్టుకుంది. ఇక సిరియాలో వ్యాపారం చేయడం శాశ్వతంగా ప్రమాదంతో కూడుకున్న విషయమని ముష్రిక్కులు గ్రహించారు. అయినప్పటికీ, ఇంకనూ వారు తమ తలబిరుసుతనాన్ని వదల్లేదు. జుహైనా మరియు బనూ జమ్రా తెగలతో జరిగిన సంధికి దిగిరావడానికి బదులు వారు తమ పౌరుషం, రౌద్రం మరియు వైషమ్యాల్లో మరికొంత ముందుకే అడుగు

రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/115, 116; 2/215, 216, 468-470. ఈ ఆధారాల్లో సరాయా మరియు గజ్వాల క్రమం మరియు అందు పాల్గొన్న వారి సంఖ్య గురించి అభిప్రాయభేదం ఉంది. మేము అల్లామా ఇబ్నె ఖైమ్ మరియు అల్లామా మన్సూర్‌పూరి పరిశోధనలను సరియైనవిగా తలిచాము.

వేశారు. వారి సర్దారులు, మేధావులు, ముస్లిముల ఇండ్లల్లో దూరి వారిని తుదముట్టిస్తామన్న బెదిరింపును అమలు చేయడానికే నిర్ణయించుకున్నారు. ఈ ఉద్వేగమే వారిని బద్ర్ యుద్ధ మైదానానికి చేర్చింది.

ఇక ముస్లిముల విషయానికి వస్తే, హజ్రత్ అబ్దుల్లా బిన్ హజష్ (ర)గారి సరియ్యా తరువాత అల్లాహ్, షాబాన్ నెల హి.శ. 2లో యుద్ధం ఫర్జ్ (విధిగా) చేశాడు. ఈ సందర్భంగా అనేక ఖుర్‌ఆన్ ఆయత్‌లు అవతరించ నారంభించాయి. ఆ ఖుర్‌ఆన్ వాక్యాలు ఇవి:

وَقَاتِلُوا فِي سَبِيلِ اللَّهِ الَّذِينَ يُقَاتِلُونَكُمْ وَلَا تَعْتَدُوا إِنَّ اللَّهَ لَا يُحِبُّ
الْمُعْتَدِينَ ﴿١٩٠﴾ وَاقْتُلُوهُمْ حَيْثُ ثَقِفْتُمُوهُمْ وَأَخْرِجُوهُمْ مِنْ حَيْثُ أَخْرَجُوكُمْ
وَالْفِتْنَةُ أَشَدُّ مِنَ الْقَتْلِ وَلَا تُقَاتِلُوهُمْ عِنْدَ الْمَسْجِدِ الْحَرَامِ حَتَّى
يُقَاتِلُوكُمْ فِيهِ فَإِنْ قَاتَلُوكُمْ فَاقْتُلُوهُمْ كَذَٰلِكَ جَزَاءُ الْكَافِرِينَ ﴿١٩١﴾ فَإِنِ انْتَهَوْا
فَإِنَّ اللَّهَ غَفُورٌ رَحِيمٌ ﴿١٩٢﴾ وَقَاتِلُوهُمْ حَتَّى لَا تَكُونَ فِتْنَةٌ وَيَكُونَ الدِّينُ لِلَّهِ
فَإِنِ انْتَهَوْا فَلَا عُدْوَانَ إِلَّا عَلَى الظَّالِمِينَ ﴿١٩٣﴾

"మీతో పోరాడే వారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించకండి. హద్దులను అతిక్రమించేవారిని అల్లాహ్ ప్రేమించడు. మీకు వారు ఎక్కడ ఎదురైనా, మీరు వారితో పోరాడండి. మిమ్మల్ని వారు ఎక్కడ నుండి పారద్రోలారో, అక్కడ నుండి మీరూ వారిని పార ద్రోలండి. చంపడం చెడ్డదే. కాని ఫిత్నా (పీడన) అంతకంటే చెడ్డది. 'మస్జిదె హరామ్' వద్ద వారు మీతో యుద్ధం చేయనంత వరకు, మీరూ వారితో యుద్ధం చేయకండి. కాని వారే అక్కడ కయ్యానికి కాలుదువ్వితే, మీరూ వారిని చంపడానికి వెనుదీయకండి. అవిశ్వాసులకు ఇదే తగిన శిక్ష. వారు యుద్ధం చేయడం మానుకుంటే (మీరూ మానండి), అల్లాహ్ క్షమించే వాడూ, కరుణించేవాడూ అనే విషయం తెలుసుకోండి.

పీడన (ఫిత్నా) అంతమయ్యే వరకు, దైవధర్మం స్థాపించబడే వరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తరువాత వారు దానిని మాను కుంటే, దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు." (2:190-193)

ఆ తరువాత వెనువెంటనే మరో రకమైన ఆయత్‌లు అవతరించ బడ్డాయి. ఈ ఆయత్‌లలో యుద్ధం ఎలా చేయాలో తెలుపుతూ దాని కోసం ప్రోత్సహించడం జరిగింది. అదేకాకుండా కొన్ని ఆదేశాలు కూడా ఉన్నాయి వాటిలో.

فَإِذَا لَقِيتُمُ الَّذِينَ كَفَرُوا فَضَرْبَ الرِّقَابِ حَتَّى إِذَا أَثْخَنْتُمُوهُمْ فَشُدُّوا الْوَثَاقَ
فَإِمَّا مَنًّا بَعْدُ وَإِمَّا فِدَاءً حَتَّى تَضَعَ الْحَرْبُ أَوْزَارَهَا ذَٰلِكَ وَلَوْ يَشَاءُ اللَّهُ
لَانْتَصَرَ مِنْهُمْ وَلَٰكِنْ لِيَبْلُوَ بَعْضَكُمْ بِبَعْضٍ وَالَّذِينَ قُتِلُوا فِي سَبِيلِ اللَّهِ
فَلَنْ يُضِلَّ أَعْمَالَهُمْ ﴿٤﴾ سَيَهْدِيهِمْ وَيُصْلِحُ بَالَهُمْ ﴿٥﴾ وَيُدْخِلُهُمُ الْجَنَّةَ عَرَّفَهَا لَهُمْ ﴿٦﴾
يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِنْ تَنْصُرُوا اللَّهَ يَنْصُرْكُمْ وَيُثَبِّتْ أَقْدَامَكُمْ ﴿٧﴾

"కనుక మీరు ఈ అవిశ్వాసులతో తలపడినప్పుడు, వారి మెడలను ఖండించడమే మీరు చేయవలసిన మొదటి పని. చివరకు మీరు వారిని పూర్తిగా అణచివేసిన తరువాత ఖైదీలను గట్టిగా బంధించండి. ఆ తరువాత (మీకు ఇలా చేసే అధికారం ఉంది) వారికి మేలైనా చేయండి. లేదా వారి నుండి పరిహారం (సొమ్ము) తీసుకొని వదలివేయండి. యుద్ధంలో తమ ఆయుధాలు క్రింద పడవేసే వరకు (ఇలా జరగాలి). ఇది మీరు చేయవలసిన పని. అల్లాహ్ తలచుకుంటే స్వయంగా ఆయనే వారిని ఎదుర్కొనేవాడు. అయితే మిమ్మల్ని ఒకరి ద్వారా మరొకరిని పరీక్షించడానికి (ఆయన ఈ విధానాన్ని అవలంబించాడు). అల్లాహ్ తన మార్గంలో చంపబడిన వారి కర్మలను ఎంత మాత్రం వ్యర్థం చేయడు. ఆయన వారికి మార్గం చూపుతాడు, వారి స్థితిని చక్కబరుస్తాడు, తాను వారికి తెలియజేసిన స్వర్గంలో వారిని ప్రవేశింపజేస్తాడు.

విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు సహాయం చేస్తే ఆయన మీకు సహాయం చేస్తాడు. మీ పాదాలను స్థిరంగా ఉంచుతాడు." (47: 4-7)

ఆ తరువాత అల్లాహ్, యుద్ధం ఆదేశం విన్నంతనే బెదిరిపోయి భయ కంపితులైన వారిని విమర్శిస్తూ ఇలా సెలవిస్తున్నాడు:

فَإِذَآ أُنزِلَتْ سُورَةٌ مُّحْكَمَةٌ وَذُكِرَ فِيهَا ٱلْقِتَالُ ۙ رَأَيْتَ ٱلَّذِينَ فِى
قُلُوبِهِم مَّرَضٌ يَنظُرُونَ إِلَيْكَ نَظَرَ ٱلْمَغْشِىِّ عَلَيْهِ مِنَ ٱلْمَوْتِ ۖ فَأَوْلَىٰ لَهُمْ ﴿٢٠﴾

విశ్వాసులు "(యుద్ధానికి సంబంధించిన ఆదేశంగల) సూరా ఏదైనా ఎందుకు అవతరించదు" అని అంటూ ఉండేవారు. కాని యుద్ధ ప్రస్తావన గల నిర్దిష్టమైన సూరా అవతరింపజేయబడినప్పుడు తమ హృదయాలలో వ్యాధిగల వారు (కాపట్యంగలవారు), మరణం ఆవహించిన వారి మాదిరిగా నీ వైపు చూడటాన్ని నీవు గమనిస్తావు. వారి వైఖరి ఎంతో శోచనీయమైనది."
(47 : 20)

యదార్థం ఏమిటంటే, యుద్ధాన్ని విధిగా చేయడం, దాన్ని ప్రోత్సహించడం, మరి యుద్ధం కోసం సమాయత్తమవడం అప్పటి పరిస్థితులకు పూర్తిగా అనుగుణమైన చర్య. పరిస్థితులను నిశితంగా బేరీజువేసే ఏ సైనిక కమాండరు అయినా ఆ పరిస్థితుల్లో తన సైన్యాన్ని సమాయత్తపరచి శత్రువును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండమని ఆదేశాలిస్తాడు. ప్రత్యక్ష మరియు పరోక్ష విషయాలను తెలిసిన అల్లాహ్ అలాంటి ఆదేశాలెందుకు ఇవ్వడు మరి? నిజం చెప్పాలంటే, పరిస్థితులు, సత్యం మరియు అసత్యం నడుమ ఓ రక్తపాతంతో కూడిన యుద్ధం జరుగబోతోందని తెలియజేస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా, సరియ్యా అబ్దుల్లా బిన్ హజష్ తరువాత బహుదైవారాధకుల పౌరుషం మరియు ఆత్మాభిమానానికి పెద్ద దెబ్బ తగిలింది. ఈ సంఘటన వారికి భరింపశక్యంకానిదైపోయింది.

యుద్ధ ఆదేశాలు గల ఈ దైవవాణి అవతరణ సందర్భాన్ని బట్టి చూస్తే, త్వరలోనే ఓ భీకర యుద్ధం జరగబోతోందని, ఆ యుద్ధంలో ముస్లిములకే విజయం చేకూరబోతోందనే సూచనలు కానవస్తాయి. "వారు మిమ్మల్ని ఎక్కడ నుండి పారద్రోలారో, అక్కడ నుండి మీరూ వారిని పారద్రోలండి" అనే అల్లాహ్ ఆదేశం మరియు ఖైదీలను గట్టిగా బంధించడం మరియు మీ విరోధుల్ని అణచివేయండి అనే సూచన మరియు ఈ యుద్ధాన్ని కొనసాగించండి అనే ఆదేశాన్ని బట్టి చూస్తే, అంతిమ ప్రాబల్యం ముస్లిములకే దక్కనుందనే విషయం విశదమవుతోంది. అయితే ఈ ఆదేశం సంకేతాలు సంజ్ఞల రూపంలో ఇవ్వబడిన ఆదేశం. ఎవరైతే దైవమార్గంలో యుద్ధం చేయడానికి ఎంత

ఉత్సాహంగా, ఆసక్తిగా పాల్గొన నిశ్చయించుకున్నాడో అతడు దాన్ని అమలు చేసి చూపించవలసి ఉంటుంది అన్నదే ఈ ఆదేశం ముఖ్యోద్దేశ్యం.

అదే కాదు, ఆ రోజుల్లోనే, అంటే షాబాన్ నెల, హి.శ. 2 (క్రీ.శ. ఫిబ్రవరి 624)లో, దైవం, బైతుల్ మగ్దిస్‌కు బదులు కాబాను ఖిబ్లాగా చేసుకోవాలని ఆదేశించాడు. అంటే, నమాజు చేసేటప్పుడు ఇక బైతుల్ మగ్దిస్ అభిముఖంగా కాక కాబా గృహానికి అభిముఖంగా నిలబడి నమాజు చేయాలి. ఈ ఆదేశం వల్ల ఒనగూడిన మరో ప్రయోజనం ఏమిటంటే, అప్పటివరకు, కేవలం ముస్లిములలో చీలిక తేవడానికి కపట నాటకమాడుతూ ముస్లిములుగా ప్రకటించుకుంటూ ఉన్న బలహీనులైన కపట యూదులు కాబా గృహాన్ని ఖిబ్లాగా చేసిన తరువాత తమ కాపట్యాన్ని దాచుకోలేక బయటపడిపోయారు. ముస్లిములను వీడి తమ అసలు వర్గాల్లోనికి పోయి చేరారు. ఇలా ముస్లిముల నుండి అనేక మంది విద్రోహులు బయటకు వెళ్ళిపోవడం జరిగింది.

ఖిబ్లా మార్పు సంఘటనలోని మరో సున్నితమైన విషయం ఏమిటంటే, ఇక ఓ క్రొత్త శకం ఆరంభం కానుంది, ఆ శకం ఈ ఖిబ్లాను హస్తగతం చేసుకోనంతవరకు ప్రారంభం కాజాలదు. ఎందుకంటే, ఓ జాతికి ఓ ఖిబ్లా నిర్ణయించబడి అది శత్రువుల చేతిలో ఉంటే ఎలా? అందుకని దాన్ని శత్రువుల చేతి నుండి ఏదో విధంగా హస్తగతం చేసుకోవడం అవసరం అన్నదే సున్నిత విషయం.

ఈ ఆదేశాలు, ఈ సూచనలు అవతరించిన తరువాత ముస్లిముల ఆనందం అతిశయించింది. వారిలో దైవమార్గంలో జిహాద్ చేసే ఉత్సాహం, శత్రువును మార్కొనే కోరిక మరింత పెల్లుబుకింది.

ఇస్లామీయ ప్రథమ నిర్ణయాత్మక సంగ్రామం

బద్ర్ సంగ్రామం (గజ్వయె బద్రె కుబ్రా)

గజ్వాకు పురికొల్పిన కారణాలు

'గజ్వయె ఉషైరా'లో, ఖురైష్‌కు చెందిన ఓ వర్తక బిడారం మక్కా నుండి సిరియా వెడుతూ మహాప్రవక్త (స)గారి చేతిలో పడకుండా తప్పించుకొనిపోయిందన్న విషయం మనం ఇదివరకే చదువుకున్నాం. ఈ బిడారమే సిరియా నుండి తిరిగివస్తుందని తెలిసి దైవప్రవక్త(స), తల్హా బిన్ ఉబైదుల్లాహ్(ర) మరియు సయీద్ బిన్ జైద్ (ర)లకు పరిస్థితులేమిటో తెలుసుకురమ్మని ఉత్తర దిశగా పంపించారు. ఈ ఇద్దరు సహాబీలు 'హవార్' అనే ప్రదేశం వరకు వెళ్ళి అక్కడనే ఆగిపోయారు. అబూ సుఫ్‌యాన్ ఆ బిడారాన్ని తీసుకొని ఆ మార్గాన వెళ్ళగా వీరు పరుగున మదీనాకు వచ్చి విషయం మహాప్రవక్త(స)కు చెప్పారు.

ఈ బిడారంలో మక్కావాసులకు చెందిన బోలెడు ధనం ఉంది. అంటే, ఒక వేయి ఒంటెలు, ఆ ఒంటెలపై యాభై వేల దీనార్ల (రెండు వందల అర్వై రెండున్నర కిలోల బరువు బంగారం) విలువ గల వర్తక సామగ్రి ఉంది. దాన్ని రక్షించడానికి కేవలం నలభై మందే ఉన్నారు.

మదీనావాసులకు ఇది స్వర్ణావకాశం. అప్పటి పరిస్థితులు ధనలేమికి గురి అయి ఉన్నాయి. ఈ పరిస్థితి మదీనావాసులకు సైనికపరంగా, రాజకీయంగా, ఆర్థికంగా కృంగదీస్తున్న పరిస్థితి. అందువలన ప్రవక్తశ్రీ(స), "ఈ ఖురైష్ కాన్వాయ్ ధనంతో వస్తోంది కాబట్టి దాన్ని పట్టుకోడానికి వెళ్ళండని, బహుశా అల్లాహ్ మీ కోసం యుద్ధధనాన్ని పంపించి ఉంటాడని" ప్రకటించారు.

అయితే ప్రవక్త శ్రీ(స) ఎవ్వరినీ వెళ్ళడానికి మాత్రం బలవంతపెట్టలేదు.

దీన్ని కేవలం ప్రజల ఇష్టంపై వదిలేశారు. ఈ ప్రకటన చేసినప్పుడు వర్తక బిడారానికి బదులు ఖురైషుల సైన్యంతో బద్ర్ మైదానంలో భీకర యుద్ధం జరగబోతుందన్న విషయం తెలియదు. అందుకనే చాలా మంది సహాబా(ర) మదీనాలోనే ఉండిపోయారు. వారు అనుకున్నదాని ప్రకారం, మహాప్రవక్త(స) గారి ఈ ప్రయాణం గతంలోని సైనిక ఆపరేషనుల్లాంటిదే అని తలచడం. అందుకని వారు ఈ గజ్వాలో చేరకపోయినా మందలించడం జరగలేదు.

ఇస్లామీయ సైనికశక్తి మరియు నాయకత్వ విభజన

మహాప్రవక్త (స) బయలుదేరేటప్పుడు ఆయన(స) వెంట మూడొందల మంది కంటే కొంత ఎక్కువ మంది ఉన్నారు (అంటే 313 లేదా 314 లేదా 317 మంది). వీరిలో 82 లేదా 83 లేదా 86 మంది ముహాజిర్లు, మిగతావారు అన్సారులు. అన్సారుల్లోను 61 మంది అవస్ తెగకు చెందినవారు. 170 మంది ఖజ్రజ్ తెగవారు. ఈ గజ్వాకు వెళ్ళే సైనికులు ఎలాంటి యుద్ధ సన్నాహం లేకుండా బయలుదేరినవారు. పటాలం మొత్తంలో కేవలం రెండు గుర్రాలున్నాయి (ఒకటి హజ్రత్ జుబైర్(ర) బిన్ అవామ్‌గారి గుర్రం, మరొకటి హజ్రత్ మిగ్దాద్(ర) బిన్ అస్వద్ కందీగారి గుర్రం). దీనికితోడు డెబ్భై ఒంటెలు, ఒక్కొక్క ఒంటెపై ముగ్గురేసి వ్యక్తులు వంతులవారీగా స్వారీ చేస్తున్నారు. ఓ ఒంటె దైవప్రవక్త (స), హజ్రత్ అలి(ర) మరియు హజ్రత్ ముర్సిద్(ర) బిన్ అబీ ముర్సిద్ భాగంలో ఉంది. దీనిపై ఈ ముగ్గురు వంతులవారీగా స్వారీ చేస్తూ వెళ్ళారు.

మదీనా నాయకత్వాన్నీ మరియు నమాజు చేయించే బాధ్యతను మొదట హజ్రత్ ఇబ్నె మక్తూమ్(ర)గారికి అప్పగించడం జరిగింది. కాని మహాప్రవక్త (స) 'రౌహా' అనే ప్రదేశానికి చేరిన తరువాత ఆయన అబూ లుబాబా బిన్ అబ్దుల్ ముంజిర్ (ర) గారికి మదీనా నాయకత్వాన్ని అప్పగించి పంపించారు. సైన్యాన్ని రెండు దళాలుగా విభజించడం జరిగింది. ఒక దళం ముహాజిర్ల దళం, మరొకటి అన్సారుల దళం. ముహాజిర్ల పతాకం హజ్రత్ అలి(ర)కు, అన్సారుల పతాకాన్ని హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర)కు, అన్ని దళాల పతాకం హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ అబ్దరీ (ర)కు ఇవ్వడం జరిగింది. ఇది శ్వేత వర్ణ పతాకం. 'మైమనా' (కుడి పార్శ్వం) కమాండరుగా

హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ (ర) మరియు 'మైసరా' (ఎడమ పార్శ్వం) కమాండరుగా హజ్రత్ మిగ్దాద్ బిన్ అమ్రూ (ర) లను నియమించడం జరిగింది- మనం ఇదివరకే చెప్పుకున్నట్లు పూర్తి సైనిక దళంలో కేవలం ఇద్దరే గుర్రపు రౌతులున్నారు - 'సాకా' (మధ్య భాగం) కమాండరుగా హజ్రత్ ఖైస్ బిన్ అబీ సఅసాకు అప్పగించడం జరిగింది. ఇక ఈ దళానికి సర్వసైన్యాధ్యక్షులుగా స్వయంగా మహాప్రవక్త(స)గారే వ్యవహరించారు.

బద్ర్ వైపునకు ప్రయాణమైన ఇస్లామీయ సైనిక దళం

మహాప్రవక్త (స) ఈ అసంపూర్ణమైన సైన్యాన్ని వెంటగొని మదీనా ముఖ ద్వారం నుండి మక్కాకు వెళ్ళే రహదారిపై ప్రయాణిస్తూ 'బిఇరె రౌహా' వరకు వెళ్ళారు. అక్కడి నుండి ముందుకు కదిలి మక్కా మార్గాన్ని ఎడమ వైపునకు వదిలేసి కుడి ప్రక్కకు మళ్ళి 'నాజియా'చేరారు (ఆయన గమ్యస్థానం బద్ర్). నాజియా ఓ మూల మలుపు తిరిగి 'రహ్ఖాన్'లోయను దాటారు. ఇది 'నాజియా' మరియు 'సఫ్రా'కనుమ నడుమన గల లోయ. ఇది దాటి సఫ్రా కనుమ, ఆ కనుమ దాటి సఫ్రా లోయ దాపుకు వెళ్ళిపోయారు. అక్కడి నుండే ఆయన (స), జుహైనా తెగకు చెందిన ఇద్దరు మనుషుల్ని బద్ర్ పరిస్థితులేమిటో తెలుసుకురండని పంపించడం జరిగింది. ఈ ఇద్దరు వ్యక్తులు బసీస్ బిన్ ఉమర్ మరియు అద్దీ బిన్ అబిజ్జగ్బాలు. వీరు ఆ వర్తక బిడారం ఆచూకీ తెలుసుకొని రావడానికి బయలుదేరినవారు.

మక్కాలో ప్రమాద ఘంటికలు

మరో ప్రక్క, వర్తక బిడారాన్ని రక్షించుకుంటూ వస్తున్న అబూ సుఫ్యాన్ ఎంతో జాగరూకతను అవలంబిస్తూ కదుల్తున్నాడు. మక్కా మార్గం ప్రమాద భూయిష్టమైనదనే విషయం అతనికి బాగా తెలుసు. అందుకని అతను పరిస్థితులను బేరీజు వేసుకోవడానికి వేగులను పంపిస్తున్నాడు. అతనికి తారసపడుతున్న ఒంటెల బిడారాలను ఆపి పరిస్థితిని ఆకళింపు చేసుకుంటున్నాడు. ఇలా అతనికి, దైవప్రవక్త(స) మరియు ఆయన అనుచరగణం తన బిడారంపై దాడి చేయడానికి సమాయత్తమవుతున్న విషయం తెలిసిపోయింది. ఇది తెలుసుకున్న వెంటనే అతను జమ్‌జమ్ బిన్ అమ్రూ గిఫారీ

అనే వ్యక్తికి ప్రతిఫలం ముట్టజెప్పి బిడారాన్ని రక్షించమని ఖురైషులకు కబురు పంపించాడు. జమ్‌జమ్ ఎంతో వేగంగా మక్కాకు వచ్చి, అరబ్బు సంప్రదాయం ప్రకారం తన ఒంటె ముక్కును కోశాడు, ఒంటె అంబారీని బోర్లించాడు, తన చొక్కా చించుకుని మక్కా లోయలో ఆ ఒంటెపై నిలబడి, "ఓ ఖురైష్ వర్గమా! మీ వర్తక బిడారం.....మీ వర్తక బిడారం.....అబూ సుఫ్యాన్ వెంట తెస్తున్న మీ వర్తక బిడారంపై ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులు దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. దాన్ని మీరు పొందగలరన్న నమ్మకం నాకు లేదు. రక్షించుకోండి...రక్షించుకోండని" పెద్దపెట్టున అరవనారంభించాడు.

మక్కావాసుల యుద్ధ సన్నాహాలు

జమ్‌జమ్ అరుపులు విన్న మక్కా ప్రజలు పరుగున అక్కడికి చేరారు. వారు పరస్పరం, "ముహమ్మద్(స) మరియు ఆయన అనుచరులు ఈ బిడారం కూడా ఇబ్నె హజ్రమీ బిడారంలాంటిదే అనుకొని ఉన్నారేమో? కాదు! ఎన్నటికీ కాదు! దైవసాక్షి! వారికి తెలిసిపోతుంది మా విషయం వేరు అన్నది" అని అనుకోనారంభించారు. ఇప్పుడు మక్కాలో మిగిలింది రెండే రెండు వర్గాలకు చెందినవారు. ఒక వర్గం యుద్ధం కోసం బయలుదేరే వర్గం. మరొక వర్గం తాను యుద్ధానికి బయలుదేరలేకపోయినప్పటికీ తన వంతుగా ఎవరినో ఒకరిని యుద్ధానికి పంపే ప్రయత్నంచేసే వర్గం. ఇలా దాదాపు అందరూ యుద్ధం కోసం బయలుదేరిన వాళ్ళే. ముఖ్యంగా మక్కా గౌరవనీయుల్లో ఏ ఒక్కడూ వెనుకన ఉండిపోలేదు. కేవలం ఒకే ఒక వ్యక్తి, అబూ లహబ్, అతను తనకు బదులుగా తన రుణగ్రస్తుణ్ణొకణ్ణి యుద్ధానికి పంపించిన వ్యక్తి. చుట్టుపట్ల నివసించే అరబ్బు తెగలను కూడా సైన్యంలో భర్తీ చేసుకున్నారు. స్వయంగా ఖురైష్ తెగల్లో కేవలం ఒక్క తెగ బనూ అద్దీ తప్ప అందరూ యుద్ధంలో పాల్గొన్నవారే. బనూ అద్దీకి చెందిన ఏ ఒక్కడు కూడా ఆ యుద్ధంలో పాల్గొనలేదు.

మక్కా సైన్యబలం

ప్రారంభంలో వారి సంఖ్య పదమూడొందలు. వారి వెంట వంద గుర్రాలు, ఆరు వందల కవచాలు, లెక్కలేనన్ని ఒంటెలు ఉన్నాయి. సైన్యాధ్య

క్షుడు అబూ జహల్ బిన్ హష్షామ్. ఖురైష్‌కు చెందిన తొమ్మండుగురు గౌరవనీయులు సైన్యానికి ఆహార సరఫరా బాధ్యతను తీసుకోవడం జరిగింది. ప్రతి రోజు తొమ్మిది లేక పది ఒంటెలు తెగేవి.

బనూ బక్ర్ తెగల సమస్య

మక్కా సైన్యం బయలుదేరడానికి సిద్ధమైనప్పుడు వారికి, బనూ బక్ర్ తెగలతో వైషమ్యాలు ఉన్న విషయం గుర్తుకు వచ్చింది. అందుకని వెనుక నుండి ఈ తెగలు వారిపై దాడి చేస్తాయేమోనన్న భయం పట్టుకుంది. ఇలా వారు రెండు అగ్నిగుండాల నడుమ మాడిపోతామేమో అని బెంగపడనారంభించారు. సరిగ్గా అదే సమయంలో ఇబ్లీస్ (షైతాను), బనూ కనానా సర్దారు సురాకా బిన్ మాలిక్ బిన్ జఅషమ్ ముద్‌లజీ రూపంలో ప్రత్యక్షమై, "నేను మీకు మిత్రుణ్ణి, బనూ కనానా తెగ మీకు ఏ స్థితిలోనూ ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడరని జామీను ఇస్తున్నాను" అని అన్నాడు.

యుద్ధానికి బయలుదేరిన మక్కా సైన్యం

సురాకా బిన్ మాలిక్ రూపంలో ఉన్న ఇబ్లీస్ ఇచ్చిన ఈ హామీతో మక్కావాసులు బయలుదేరారు. విర్రవీగుతూ, ప్రజల ముందు తమ గొప్పతనాన్ని చాటుకుంటూ, దైవమార్గానికి అడ్డుపడుతూ, పదునైన ఆయుధాలతో, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) అంటే మిడిసిపడుతూ, పగ తీర్చుకునే ఉద్దేశ్యంతో, పౌరుషం, ఆత్మాభిమానం ఉట్టిపడేటట్లు మదీనా వైపునకు బయలుదేరారు. వారి మదిలో ఉన్నదల్లా ఒక్కటే. దైవప్రవక్త ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరగణం మక్కా వర్తక బిడారాల వైపు కన్ను వేయడానికి ఎలా సాహసించారు? అన్నదే. ఎట్టకేలకు వీరు అతివేగంగా ఉత్తర దిశగా బద్ర్ వైపునకు వెడుతున్నారు. ఉస్ఫాన్ మరియు ఖుదైద్ లోయలను దాటి 'హుజ్ఫా' చేరుకున్న తరువాత అబూ సుఫ్యాన్ పంపిన వార్త అందింది వారికి. ఏ బిడారాన్నయితే, ఏ ధనాన్నయితే మీ మందీమార్బలంతో రక్షించడానికి బయలుదేరారో అల్లాహ్ దాన్ని రక్షించాడని, కాబట్టి వెనక్కు తిరిగి వచ్చేయమన్నదే ఆ వార్త సారాంశం.

ప్రమాదాన్నుండి బయటపడిన వర్తక బిడారం

అబూ సుఫ్యాన్ ప్రమాదం నుండి ఎలా బయటపడ్డాడో ఆ వివరాలు ఇలా ఉన్నాయి: సిరియా నుండి బయలుదేరి అతను రహదారిపై ప్రయాణం సాగిస్తున్నాడే గాని ఎంతో మెలుకువతో వ్యవహరిస్తున్నాడు. సమాచారం రాబట్టే ప్రయత్నం చేస్తున్నాడు. బద్ర్ సమీపానికి వచ్చిన తరువాత తన బిడారాన్ని ఆపి ముందుకు వెళ్ళి మజ్దీ బిన్ అమ్రూను కలసి మదీనా సైనికదళం గురించి ఆరా తీశాడు. మజ్దీ మాత్రం తాను అసాధారణమైన విషయం ఏదీ కనుగొనలేదని చెబుతూ, ఇద్దరు ఉష్ట్రారోహుల్ని మాత్రం చూడడం తటస్థించిందని, ఫలానా మట్టి దిబ్బ దగ్గర ఆగారని, తమ తోలు సంచుల్లో నీరు నింపుకొని వెళ్ళారని చెప్పాడు. ఇది విన్న అబూ సుఫ్యాన్ పరుగున అక్కడికి వెళ్ళాడు. వారి ఒంటెల పెంటికల్ని తీసి త్రుంచిచూశాడు. అందు అతనికి ఖర్జూరపు గింజ ఒకటి అగుపడింది. ఇంకేముంది? అతను బెదిరిపోతూ, దైవసాక్షి! ఇది యస్రిబ్‌కు సంబంధించిన మేత అంటూ అతి శీఘ్రంగా బిడారం వైపునకు పరుగుదీశాడు. దాన్ని పశ్చిమ దిశ వైపునకు మళ్ళించి సముద్ర తీరం వైపునకు నడిపించాడు. బద్ర్ నుండి వెళ్ళే బిడార మార్గాన్ని ఎడమ వైపున వదిలి ముందుకుసాగాడు. ఇలా తన బిడారాన్ని మదీనా సైన్యం చేతిలో పడకుండా కాపాడుకోగలిగాడు. వెంటనే తాను క్షేమంగా తప్పించుకున్న వార్తను మక్కా సైన్యానికి పంపడం జరిగింది. ఆ వార్త హుజ్ఫాలో ఉన్న ఆ సైన్యానికి అందింది.

మక్కా సైన్యంలో ఏర్పడిన చీలిక - వెనక్కు మరిలే యత్నం

ఈ వార్త విన్న మక్కా సైన్యం వెనక్కు మరలడానికి సిద్ధపడింది. కాని ఖురైష్‌కు చెందిన ముష్కర నాయకుడు అబూ జహల్ లేచి, "దైవసాక్షి! మనం వెనక్కు మరలడానికి వీల్లేదు. బద్ర్ మైదానానికి వెళ్ళి అక్కడ మూడు రోజుల వరకు వేచి చూస్తూ ఒంటెలను జిబహ్ చేసి విందు ఆరగిద్దాం. సారాయి త్రాగుతూ నాట్యకత్తెల నాట్యాన్ని తిలకిద్దాం. అరేబియా మొత్తం మన ఈ ప్రయాణం గురించి వేనోళ్ళ పొగడాలి. ఇలా వారిపై మన ప్రభావం పడాలి" అని బీరాలు పలికాడు.

అయితే అబూ జహల్ చేసిన ప్రసంగానికి భిన్నంగా అఖ్నస్ బిన్ షురైఖ్ అనేవాడు, "లేదు! మనం వెనక్కు మళ్ళడంలోనే శ్రేయం ఉందని" సలహానిచ్చాడు. అయినా అతని మాటలు వారి చెవులకెక్కలేదు. అందుకని అతడు బనూ జహ్రా తెగను వెంటబెట్టుకొని వెనక్కి వెళ్ళిపోయాడు. అతను బనూ జహ్రా తెగకు మిత్రపక్షం వాడు. అంతేకాదు, బనూ జహ్రా సైన్యానికి సర్దారు కూడా. ఈ బనూ జహ్రా సైన్యం మొత్తం దాదాపు మూడొందల మంది. వీరిలో ఏ ఒక్కడూ బద్ర్ యుద్ధంలో పాల్గొనలేదు. ఆ తరువాత బనూ జహ్రా తెగవారు అఖ్నస్ బిన్ షురైఖ్ తీసుకున్న నిర్ణయానికి సంబరపడిపోయి అతణ్ణి ఎంతో గౌరవిస్తూ అతణ్ణి విధేయించనారంభించారు.

బనూ జహ్రాయే కాకుండా, బనూ హాషిమ్ తెగవారు కూడా వెనక్కు మళ్ళుదామని నిర్ణయించుకున్నారుగాని, అబూ జహల్ ఎంతో కఠినంగా ప్రవర్తిస్తూ, మేము వెనక్కు మళ్ళేంత వరకు ఈ వర్గం మమ్మల్ని వీడిపోడానికి వీల్లేదని పట్టుబట్టాడు.

మొత్తానికి మక్కా సైన్యం తన ప్రయాణాన్ని కొనసాగించింది. బనూ జహ్రా యోధులు తిరిగి వెళ్ళిపోయిన తరువాత ఇప్పుడు వారి సైనికుల సంఖ్య ఒక్క వెయ్యిగానే ఉండిపోయింది. వీరు బద్ర్ వైపునకు చొచ్చుకొని పోతున్నారు. బద్ర్ దాపుకు చేరి వారు ఓ చిన్న మట్టి దిబ్బ వెనుక ఆగిపోయారు. ఈ మట్టి తిన్నె బద్ర్ లోయ ప్రక్కన దాని దక్షిణ ముఖద్వారం వద్ద ఉంది.

ఇస్లామీయ సైన్యానికి ఎదురైన సంక్లిష్ట పరిస్థితి

మహాప్రవక్త(స) అలా ప్రయాణిస్తూ మార్గం మధ్యలో ఉన్న జఫ్రాన్ లోయగుండా వెడుతున్నారోలేదో, మదీనా నుండి వర్తక బిడారం మరియు అటు మక్కా నుండి వస్తున్న సైన్యం గురించి వర్తమానం అందింది. ఈ వర్తమానాన్ని లోతుగా అధ్యయనం చేసిన తరువాత ఇక ఓ భీకర పోరాటం తప్పదనే నిర్ణయానికి వచ్చారాయన. ఇప్పుడు ధైర్యసాహసాలు, తెగింపును ప్రదర్శించవలసిన సమయం ఆసన్నమైందని తలిచారు. ఒకవేళ మక్కా సైన్యాన్ని తమ ప్రాంతంలో ఇష్టమొచ్చినట్లు సంచరించడానికి వీలు కల్పిస్తే ఖురైషుల ఆత్మబలం మరింత పెరిగిపోవచ్చు. వారి రాజకీయ పెత్తనం పరిధి మరింత విస్తరించవచ్చు. ముస్లిముల సందేశ ప్రచార పిలుపు మందగించి

బలహీనపడవచ్చు. ఆ తరువాత ఇస్లామీయ సందేశాన్ని ఎవరూ పట్టించుకోకుండా, ఇస్లామ్ అంటే గిట్టని ప్రతివాడూ ముస్లిములపై పెత్తనం చెలాయించే ప్రయత్నమూ చేయవచ్చు.

ఇదంతా ఒక ఎత్తయితే, మక్కా సైన్యం మదీనా వైపునకు పురోగమించదు అనే గ్యారంటీ ఏమిటి? ఈ సైనిక చర్యను మదీనా వరకు పొడిగించి, ముస్లిములను వారి ఇండ్లల్లో చొరబడి హతమార్చే ప్రయత్నం చేయదనే పూచీ ఏమిటి? అవును! ఒకవేళ మదీనా సైన్యం తరపున ఏ ఒక్క పొరపాటు జరిగినా ఇదంతా సాధ్యమే. అలా జరగకపోయినా సరే, ఇప్పటి వరకు మదీనా ముస్లిముల పేరు చెప్పగానే దిగులుపడిపోయే పరిస్థితికి, వారి ఖ్యాతికి దెబ్బతగలవచ్చును కూడా.

సలహా సంఘ సమావేశం

పరిస్థితులు ఇలా హఠాత్తుగా మారిపోయినందున మహాప్రవక్త (స) ఓ ఉన్నత సైనిక సలహా సంఘాన్ని సమావేశపరిచారు.ఈ సమావేశంలో ఎదురైన పరిస్థితిని గురించి వివరించి వారి సలహాలను అడిగారు. ఈ సందర్భంలో ముస్లిముల్లోని ఓ వర్గం భీకర యుద్ధం మాట వినగానే కంపించిపోయింది. వారి గుండెలు గడగడలాడాయి. వారి ఈ పరిస్థితినే వివరిస్తూ దివ్యగ్రంథం ఇలా అంటోంది:

كَمَآ اَخْرَجَكَ رَبُّكَ مِنْۢ بَيْتِكَ بِالْحَقِّ ۪ وَاِنَّ فَرِيْقًا مِّنَ الْمُؤْمِنِيْنَ لَكٰرِهُوْنَ ۙ يُجَادِلُوْنَكَ فِى الْحَقِّ بَعْدَمَا تَبَيَّنَ كَاَنَّمَا يُسَاقُوْنَ اِلَى الْمَوْتِ وَهُمْ يَنْظُرُوْنَ ۞

"నీ ప్రభువు నిన్ను సత్యంతో నీ గృహం నుండి బయటకు తీసుకు వచ్చాడు. విశ్వసించిన వారిలో ఒక వర్గం వారికి ఇది ఇష్టంగా లేదు. వారు ఈ సత్యం విషయంలో నీతో ఘర్షణ పడ్డారు. అది వాస్తవానికి, సత్యం పూర్తిగా రుజువైపోయింది. వారి పరిస్థితి తమ కళ్ళ ముందే తాము మృత్యువు వైపునకు తరుమబడే వారి మాదిరిగా ఉంది." (8 : 5-6)

కాని సైన్యాధ్యక్షుల విషయానికి వస్తే, వీరిలో హజ్రత్ అబూ బక్ర్ (ర)

లేచి నిలబడి ఎంతో సమంజసమైన మాటలు పలికారు. ఆ తరువాత హజ్రత్ ఉమర్ (ర) లేచారు, ఆయన కూడా మేలైన పలుకులే పలికారు. ఆ తరువాత హజ్రత్ మిగ్దాద్ బిన్ అమ్రూ (ర) లేచి, "ఓ దైవప్రవక్తా (స)! అల్లాహ్ తమకు ఏ మార్గమైతే చూపించాడో, ఆ మార్గం పైన్నే మీరు నడవాలి. మేము మీ వెంటే ఉంటాము. దైవసాక్షి! మేము, హజ్రత్ మూసా ప్రవక్త (అ.స.)తో బనీ ఇస్రాయీల్ ప్రజలు, "ఓ మూసా! నీవూ, నీ ప్రభువు ఉభయులూ పోయి పోరాడండి. మేము ఇక్కడే కూర్చొని ఉంటాము" అని పలికినట్లు పలకము. మేము చెప్పేదల్లా, మీరూ, మీ ప్రభున్నూ ఉభయులూ వెళ్ళి పోరాడండి. మేము కూడా మీ వెంటే ఉండి పోరాడుతాం. తమరిని(స) సత్యంతో ప్రభవింపజేసిన ఆ అల్లాహ్ సాక్షి! ఒకవేళ మీరు మమ్మల్ని 'బర్కె గిమాద్' వరకు తీసుకువెళ్ళినా, మేము దారంతా పోరాడుతూనే మీ వెంట అక్కడికి వెళ్ళడానికి కూడా సిద్ధమే."

వారి మాటలను విన్న దైవప్రవక్త(స) వారిని దీవించడం, వారి కొరకు దుఆ చేయడం జరిగింది.

ఈ ముగ్గురు కమాండర్లూ ముహాజిర్లే. వీరి సంఖ్య ఆ సైన్యంలో తక్కువ. దైవప్రవక్త (స), అన్సార్‌ల సలహా కూడా తెలుసుకోదలిచారు. ఎందుకంటే వారి సంఖ్య అధికం. యుద్ధం అసలు భారం వారి భుజస్కంధాలపైన్నే పడనుంది. 'బైతె అక్బా' ప్రకారం వారు మదీనా నుండి బయటకు వచ్చి యుద్ధం చేయాలని లేదు. అందుకని ఆయన ఆ ముగ్గురు సర్దారుల మాటలు విన్న తరువాత, "ప్రజలారా! మీరు కూడా నాకు సలహా ఎందుకివ్వరూ?" అని అడిగారు. అంటే, అన్సారుల నోట కూడా ఏదైనా వినదలచుకున్నారాయన. ఈ విషయాన్ని అన్సారులకు చెందిన కమాండరు, ధ్వజవాహకుడు అయిన హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ గుర్తించి దైవప్రవక్త (స)తో, "దైవసాక్షి! ఓ దైవప్రవక్తా! బహుశా తమరు మా సలహా ఏమిటో తెలుసుకోదలచుకుంటున్నారా?" అని అడగగా, "అవును" అని బదులిచ్చారాయన.

"అయితే వినండి! మేమైతే మిమ్మల్ని విశ్వసించాము. మిమ్మల్ని ధృవపరిచాము. మీరు తెచ్చినదంతా సత్యమని సాక్ష్యం ఇచ్చాము. దానిపై మిమ్మల్ని విధేయిస్తామని, మీ మాటలను జవదాటమని ప్రమాణం కూడా చేశాము. కాబట్టి ఓ మహాప్రవక్త(స)! మీరు అనుకున్న దాని ప్రకారమే

కానివ్వండి, మిమ్మల్ని సత్యంతో ప్రభవింపజేసిన ఆ అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను! మీరే గనక మమ్మల్ని తీసుకుని సముద్రంలో దూకదలచు కుంటే దూకేయండి. మాకు చెందిన ఒక్క మనిషి కూడా వెనక్కు అడుగు వేయడు. రేపు మా శత్రువులతో ఢీకొనదలిస్తే దానికి మేము వెనకంజవేసే వారము గాము. మేము యుద్ధవీరులం, రణశూరులం. బహుశా అల్లాహ్ మీకు మా యుద్ధకౌశలం ఏమిటో చూపించదలిచాడేమో. అప్పుడు చూద్దురు గాని మా ప్రతాపం. మీ కళ్ళు చల్లబడగలవు. అల్లాహ్ శుభం కలిగించుగాక" అని తమ నిర్ణయాన్ని దైవప్రవక్త(స)కు ఎరుకపరిచారు.

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది:

హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర), దైవప్రవక్త (స)తో ఇలా విన్నవించుకున్నారు: "బహుశా మీకు, అన్సారులు మదీనాలో మాత్రమే సహాయపడతారేమోననే శంక ఉండి ఉంటుంది. అందుకని నేను అన్సారుల తరపున చెబుతున్నాను. తమరు మమ్మల్ని ఎక్కడికి తీసుకువెళ్ళినా, మరెవ్వరితో సంబంధాలు పెట్టుకున్నా, మేము మాత్రం మీతోనే ఉంటాం. మా ధన సంపద నుండి తమరు ఏది తీసుకున్నా, ఇంకొకరికి ఏది ఇచ్చినా అది మాకు ఇష్టమైన కార్యమే అవుతుంది. ఈ వ్యవహారంలో మీ తీర్పే మాకు శిరోధార్యం. మేము దాన్ని విధేయిస్తాము. దైవసాక్షి! మీరు ముందుకు అడుగేస్తూ 'బర్కె గిమాద్' వరకు వెళ్ళినా మేము మీ వెంటే ఉంటాం. ఒకవేళ మీరు మమ్మల్ని తీసుకొని సముద్రంలో దూకదలచుకున్నా మీ వెంట సముద్రంలో దూకడానికి సిద్ధంగా ఉన్నాం."

హజ్రత్ సఅద్ (ర) గారి ఈ మాటలు విన్న దైవప్రవక్త (స) గారి ముఖారవిందం ఆనందంతో వికసించింది.

"ఇక పదండి. సంతోషంగా ముందుకు అడుగేయండి. అల్లాహ్ నాకు రెండు వర్గాల్లో నుండి ఒక వర్గం గురించి వాగ్దానం చేశాడు. అల్లాహ్ సాక్షి! ఇప్పుడు నాకు జాతి వధ్యస్థలాలు అగుపడుతున్నాయి" అని సెలవిచ్చారు మహాప్రవక్త (స).

ఇస్లామీయ సైనికదళం సాగించిన మిగతా ప్రయాణం

ఆ తరువాత దైవప్రవక్త(స) 'జఫ్రాన్' దాటి అసాఫరుగా ప్రఖ్యాతిగాంచిన కొన్ని కొండ మలుపులు తిరిగి 'వీత్' పేరుగల గ్రామ ప్రాంతానికి చేరారు.

అక్కడి నుండి 'హన్నాన్' పేరుగల ఎత్తయిన దిబ్బను కుడి ప్రక్కగా వదులుతూ 'బద్ర్' చేరారు.

శత్రువు ఆచూకీ తెలుసుకునే ప్రథమ ప్రయత్నం

ఈ ప్రదేశానికి చేరిన మహాప్రవక్త(స), సౌర్ గుహ సహచరి అయిన తన మిత్రుడు అబూ బక్ర్ (ర)ను వెంట తీసుకొని శత్రువు ఆచూకీ తెలుసుకోడానికి స్వయంగా బయలుదేరారు. దూరంగా ఉండి మక్కా సైనిక దళ క్యాంపును పరిశీలించేటప్పుడు ఓ ముసలి అరబ్బు వారికి తారసపడ్డాడు. దైవప్రవక్త (స) అతన్ని ఖురైష్ మరియు ముహమ్మద్ మరియు ఆయన(స) అనుచరుల వివరాలేమిటో చెప్పమని అడిగారు - రెండు దళాలను గురించి అడగడంలోని ఔచిత్యం ఏమిటంటే, దైవప్రవక్త (స) వ్యక్తిత్వం ఆ ముసలి అరబ్బుకు తెలియకుండా ఉండాలన్నదే - కాని ఆ ముసలివాడు, "మీరు ఏ జాతికి చెందిన వారో తెలిపితేనే చెబుతానన్నాడు." "అలా కాదు నీవేముందు ఎవరివో చెబితే నేను చెబుతాను" అన్నారు దైవప్రవక్త(స).

"ఓహో! ఇది బదులుకు బదులా!" అన్నాడు ముసలివాడు.

"ఔను."

"నాకు తెలిసినంత మట్టుకు ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులు ఫలానా రోజున బయలుదేరారు. చెప్పేవాడు గనక ఆ విషయం సరిగ్గా చెప్పి ఉంటే ఇప్పుడు ముహమ్మద్ (స) ఫలానా చోట ఉండి ఉంటారు"- అని ప్రస్తుతం మదీనా సైన్యం ఉన్నచోటు గురించి చెప్పాడు - అలాగే ఖురైషులు కూడా ఫలానా రోజున బయలుదేరారు. అదే ఖచ్చితమైన సమాచారం అయితే వారు ఫలానా చోట విడిది చేసి ఉంటారు"- అని ప్రస్తుతం మక్కా సైన్యం ఉన్న చోటునే చూయించాడతడు.

ముసలివాడు తన మాటను పూర్తిచేసి, "మీరెవరో చెప్పారు కాదు?"అని అడిగాడు.

దానికి దైవప్రవక్త (స), "మేము ఒకే నీటికి సంబంధించిన వారమని" వెనక్కు మళ్ళిపోయారు.

"ఒకే నీళ్ళా? అంటే ఇరాక్ నీళ్ళా?"అని గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు ఆ వృద్ధుడు.

మక్కా సైన్యం గురించి అందిన ముఖ్యవార్తలు

ఆ రోజు సాయంత్రమే ప్రవక్తశ్రీ(స), శత్రుజాడను తెలుసుకోడానికి ఓ క్రొత్త వేగుల బృందాన్ని పంపించడం జరిగింది. ఈ కార్యం నెరవేర్చుకు రావడానికి ఈ బృంద సభ్యులుగా ముహాజిర్లయిన హజ్రత్ అలి(ర), జుబైర్ బిన్ అవామ్ (ర) మరియు సఅద్ బిన్ అబీ విఖాస్(ర)లు వెళ్ళారు. వీరు నేరుగా బద్ర్ నీటి చెలమ వద్దకు వెళ్ళగా అక్కడ ఇద్దరు బానిసలు మక్కా సైన్యం కోసం నీరు నింపడం చూశారు. వెంటనే వారిద్దరిని బంధించి దైవ ప్రవక్త(స) సన్నిధికి తీసుకువచ్చారు. అప్పుడు ప్రవక్తశ్రీ(స) నమాజు చేస్తున్నారు. సహాబా(ర) ఆ ఇద్దరు బానిసలను ప్రశ్నించనారంభించారు. వారు, తాము ఖురైషులకు నీరు త్రాగించే బానిసలమని, మమ్మల్ని నీళ్ళ కోసం వారు పంపించారనీ చెప్పారు. ఈ సమాధానం వీరికి రుచించనందున చితకబాదారు. వీరిద్దరు అబూ సుఫ్యాన్ మనుషులనుకుంటున్నారు వీరు - ఎందుకంటే, ఇంకా ఆ వర్తక బిడారాన్ని సొంతం చేసుకోవాలనే ఆశ వారిలో ఉంది కాబట్టి- సహాబా (ర) వారిని కొట్టి విషయం రాబట్టుకోవాలని చూస్తున్నారు. ఆ దెబ్బలకు తాళలేక మేము అబూ సుఫ్యాన్ మనుషులమే అని అనగానే కొట్టడం ఆపేసేవారు.

దైవప్రవక్త (స) నమాజు పూర్తి చేసుకొని కొంత కోపంగా, "వీరిద్దరు నిజం పలుకుతూ ఉంటే మీరు వారిని బాదుతున్నారు, అబద్ధమాడితే వదిలేశారు. దైవసాక్షి! వీరిద్దరు చెప్పేదే సరైనది. వీరు ఖురైష్ల మనుషులు" అన్నారు.

ఆ తరువాత ఆయన (స) ఆ ఇద్దరు బానిసలతో, "సరే, మీరిప్పుడు ఖురైషులను గురించి చెప్పండి" అని అడిగారు.

"ఈ లోయ ముఖ ద్వారం చివర ఉన్న ఆ మట్టి దిబ్బ వెనుకే ఖురైషు సైన్యం విడిది చేసి ఉంది."

"ఎంత మంది వరకు ఉంటారా సైన్యంలో?" ప్రశ్న.

"ఓ! చాలా మంది ఉన్నారు."

"వారి సంఖ్య ఎంతై ఉంటుంది?"

"మాకు తెలియదు."

"సరే, రోజు ఎన్ని ఒంటెలు తెగుతున్నాయి?"

"ఓ రోజు తొమ్మిది, మరో రోజు పది వరకు తెగుతున్నాయి."

"ఓహో, అయితే వారి సంఖ్య తొమ్మిది మరియు పది వందలకు మధ్యన ఉంటుంది."

"వారిలో ఖురైషులకు చెందిన సర్దారులు, ధనవంతులెవరెవరున్నారు?" అని అడిగారు దైవప్రవక్త(స).

"రబీయా ఇద్దరు కుమారులు ఉత్బా మరియు షైబా, అబుల్ బక్తరీ బిన్ హష్షామ్, హకీమ్ బిన్ హిజామ్, నౌఫిల్ బిన్ ఖువైలిద్, హారిస్ బిన్ ఆమిర్, తఅయిమా బిన్ అద్దీ, నజ్ర్ బిన్ హారిస్, జమ్అ బిన్ అస్వద్, అబూ జహల్ బిన్ హష్షామ్, ఉమయ్యా బిన్ ఖల్ఫ్" అంటూ మరికొందరి పేర్లు చెప్పారు ఆ బానిసలు.

మహాప్రవక్త(స) సహాబా(ర) వైపు తిరిగి, "చూశారా! మక్కా తన హృదయ శకలాలను (గౌరవనీయులైన సర్దారులను) మీ ముందుకు తెచ్చి పడేసింది" అని అన్నారు.

దైవకారుణ్యం కురిసిన వేళ

అల్లాహ్ ఆ రాత్రే వర్షాన్ని కురిపించాడు. ఆ వర్షం ముష్రిక్కుల వైపు కుంభవృష్టిగాను, ముస్లిములు ఉన్న వైపు పూలజల్లుగాను కురిసింది. దీని కారణంగా శత్రువులు బురద కారణంగా ముందుకు రాలేకపోయారు. కాని ముస్లిములపై కురిసిన జల్లు వారిని పునీతులుగా చేసింది. షైతాన్ ఎత్తుగడలు మట్టిలో కలసిపోయాయి. నేల చదునై ఇసుక గట్టి పడింది. అడుగులు ఇసుకలో దిగబడకుండా నడవడానికి సులువుగా మారింది నేలంతా. అలా ముస్లిముల స్థితి మెరుగై వారికి మనోబలం చేకూరింది.

ఖురైషు సైనిక కేంద్రాల వైపునకు కదిలిన ముస్లిములు

ముష్రిక్కులకంటే ముందే బద్ర్ నీటి చెలమ వద్దకు చేరాలని, వారు దాన్ని హస్తగతం చేసుకోకుండా చేయడానికి మహాప్రవక్త (స) తమ సేనలను ముందుకు కదిలించారు. అలా ఆయన 'ఇషా' సమయం అయ్యేటప్పటికల్లా చెలమల్లోని ఓ సమీప చెలమకు చేరిపోయారు. ఈ సందర్భంగా హజ్రత్

'హబ్బాబ్ (ర) బిన్ మున్జిర్' ఓ అనుభవజ్ఞుడైన సైన్యాధ్యక్షునిగా దైవప్రవక్త (స)నుద్దేశించి, "దైవప్రవక్తా(స)! తమరు ఈ ప్రదేశం వద్దకు అల్లాహ్ ఆదేశం మేరకు వచ్చారా? లేదా యుద్ధనీతి ప్రకారమా? ఇక్కడి నుండి మనం వెనక్కు గానీ ముందుకుగానీ వెళ్ళే అవకాశం ఉండదు మరి" అని అడిగారు. దానికి ప్రవక్తశ్రీ,"లేదు, మనం ఇక్కడకు వచ్చింది యుద్ధనీతిని అనుస రించే"అని అన్నారు.

"ఇది సరియైన స్థలం కాదు. తమరు ఇంకా ముందుకు వెళ్ళాలి. ఖురైషులకు దాపులో ఉన్న చెలమ దగ్గరకు వెళ్ళి ఆగాలి, ఆ తరువాత మనం తక్కిన చెలమలన్నింటిని పూడ్చేద్దాం. మన చెలమ దగ్గర ఓ తొట్టి కట్టి అందులో నీరు నిలువ ఉంచుకోవాలి. ఆ తరువాత మనం ఖురైషులతో యుద్ధం ప్రారంభించినప్పుడు మనకు త్రాగడానికి నీరు లభిస్తుంది. వారికి మాత్రం నీరు కరువైపోతుంది" అని సలహానిచ్చారు హజ్రత్ హబ్బాబ్(ర).

"నీవు సరైన సలహానే ఇచ్చావు" అని తమ సైన్యాన్ని వెంటబెట్టుకొని రాత్రి నడిఝాముకు శత్రు శిబిరం దాపులోని ఓ చెలమ దగ్గరకు చేరిపోయారు. అక్కడ సహాబా(ర) ఓ హౌజు కట్టి తక్కిన చెలమలన్నింటినీ పూడ్చేశారు.

యుద్ధ పర్యవేక్షణా కేంద్రం

సహాబా(ర) చెలమ దగ్గర విడిది చేయగానే, హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) మదిలో మరో ఆలోచన వచ్చింది. యుద్ధాన్ని పర్యవేక్షిస్తూ, సైన్యానికి ఆదేశాలు జారీ చేయడానికిగాను మహాప్రవక్త (స) కోసం ఓ ప్రత్యేక స్థలాన్ని ఎందుకు ఎంచుకోకూడదు? ఒకవేళ విజయానికి బదులు అపజయం ఎదురైన పక్షంలో, ఆ అనివార్య పరిస్థితిని ఎదుర్కోవడానికి మనం ఎందుకు సంసిద్ధులై ఉండకూడదు? అనేదే ఆ ఆలోచన. దీన్ని అమలు చేయడానికిగాను ఆయన మహాప్రవక్త (స) వద్దకు వచ్చి;

"ఓ దైవప్రవక్తా (స)! మేము తమ కోసం ఓ పందిరిని ఎందుకు వేయకూడదు? అందులో విశ్రాంతి తీసుకుంటూ యుద్ధాన్ని పర్యవేక్షించవచ్చు కదా? తమ దగ్గర వాహనాలను సైతం ఉంచుతాం. ఆ తరువాత మేము మా శత్రువుతో ఢీ కొంటాం. అల్లాహ్ మనకే గౌరవం ప్రాప్తం చేసి శత్రువుపై ఆధిక్యతను కలిగిస్తే సరేసరి. కాని దానికి భిన్నమైన పరిస్థితి ఎదురైతే తమరు



ఆ వాహనానెక్కి మదీనా వెళ్ళిపోవచ్చు. మాతో ఇక్కడికి రాలేకపోయిన వారు మదీనాలో ఉన్నారు. దైవప్రవక్తా (స)! నిజంగా వారు మిమ్మల్ని ప్రేమించే విషయంలో మాకంటే మేలైనవారు. యుద్ధం అనివార్యమైపోయిందని వారికి తెలిసి ఉంటే మాత్రం వారు ఎన్నటికీ అక్కడ ఆగిపోయి ఉండేవారు కాదు. అల్లాహ్ మిమ్మల్ని వారి ద్వారా రక్షించగలడు. వారు మీ మేలు కోరేవారు. మీ వెంట జిహాద్‌లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉంటారు" అని అన్నారు.

ఇది విన్న మహాప్రవక్త(స) ఆయన్ను మెచ్చుకొని దీవించారు. ముస్లిములు యుద్ధమైదానం ఈశాన్య దిశగా ఓ ఎత్తయిన మట్టి తిన్నెపై ఆయన కోసం ఓ పందిరి వేశారు. అక్కడి నుండి యుద్ధ మైదానం పూర్తిగా అగుపడుతుంది. ఆ తరువాత దైవప్రవక్త(స), హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్(ర) గారి నేతృత్వంలో అన్సారులకు సంబంధించిన ఓ సైనిక పటాలాన్ని ఎంపిక చేశారు.

సైన్యాన్ని క్రమబద్ధం చేసి రేయి గడపడం

తదుపరి దైవప్రవక్త (స) సైన్యాన్ని క్రమబద్ధీకరించారు[1]. యుద్ధమైదానానికి అరుదెంచి, తన చేతితో చూయిస్తూ, రేపు ఫలానా వ్యక్తి ఇక్కడ మరియు ఫలానా వ్యక్తి అక్కడ హతుడవుతాడు ఇన్షా అల్లాహ్, ఇది ఫలానా వ్యక్తి వధ్యస్థలం, అది ఫలానా వ్యక్తి వధ్యస్థలం ఇన్షా అల్లాహ్[2] అని చెబుతూ పోయారు.

అక్కడే ఓ చెట్టు బోదె దగ్గర కూర్చుని రాత్రి గడిపారు. ముస్లిముల హృదయాలు విశ్వాసంతో నిండిపోయి ఉన్నాయి. వారంతా ఉజ్వలమైన ఉదయం కోసం ఎదురు చూస్తూ గడిపారు. వారికి తెల్లారగానే తమ కళ్ళతో దైవం అవతరింపజేయబోయే శుభాలను చూస్తామనే నమ్మకం ఏర్పడింది. ఈ పరిస్థితిని దివ్యగ్రంథం ఖుర్ఆన్ ఇలా వివరిస్తోంది:

إِذْ يُغَشِّيكُمُ النُّعَاسَ أَمَنَةً مِّنْهُ وَيُنَزِّلُ عَلَيْكُم مِّنَ
السَّمَاءِ مَاءً لِّيُطَهِّرَكُم بِهِ وَيُذْهِبَ عَنكُمْ رِجْزَ الشَّيْطَانِ
وَلِيَرْبِطَ عَلَىٰ قُلُوبِكُمْ وَيُثَبِّتَ بِهِ الْأَقْدَامَ ۝

1. చూడండి, జామియ తిర్మిజీ, జిహాద్ అధ్యాయం-1/201.
2. ముస్లిమ్, హజ్రత్ అనస్(ర) గారి ఉల్లేఖనం, మిష్కాత్-2/543.

"ఇంకా, ఆ సమయాన్ని (కూడా జ్ఞాపకం ఉంచుకోండి) అప్పుడు అల్లాహ్ తన తరపు నుండి నిద్రమత్తు రూపంలో నిశ్చింతనూ, నిర్భయ స్థితినీ మీపై ఆవహింపజేస్తూ ఉన్నాడు. ఆయన ఆకాశం నుండి వర్షాన్ని మీపై వర్షింపజేస్తూ ఉన్నాడు. మిమ్మల్ని పరిశుద్ధపరచాలని, మీకు షైతాను వల్ల కలిగిన మాలిన్యాన్ని మీ నుండి దూరం చేయాలని, మీకు ధైర్యం కలిగించా లని, తద్వారా మీ పాదాలను సుస్థిరం చేయాలని." (8 : 11)

ఈ రాత్రి శుక్రవారం, హిజ్రీ శకం 2 రమజాన్ నెలకు చెందిన రాత్రి. దైవప్రవక్త (స) ఈ నెల 8 లేదా 12వ తారీఖున మదీనా నుండి బయలుదేరారు.

యుద్ధరంగానికి మక్కా సైన్యం రాక - వారిలో పొడసూపిన పరస్పర మనస్పర్ధలు

మరో వంక ఖురైషులు, లోయ ముఖద్వారం బయట తమ శిబిరంలో రేయి గడిపారు. ఉదయాన్నే తమ సైనిక పటాలాలతో మట్టి దిబ్బను దిగి బద్ర్ వైపునకు బయలుదేరారు. ఓ వర్గం దైవప్రవక్త (స) గారు నిర్మించిన నీటి హౌజు వైపునకు కదిలింది. వారిని వదిలేయండని మహాప్రవక్త (స) ఆదేశించారు. కాని ఆ హౌజు నుండి నీరు త్రాగిన ప్రతివాడూ ఈ యుద్ధంలో చంపబడ్డాడు ఒక్క హకీమ్ బిన్ హిజామ్ తప్ప. అతను ఆ తరువాత ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ఓ ఉత్తముడైన ముస్లిమ్‌గా మారిపోయాడు. అతను ఎప్పుడైనా ఒట్టు వేసుకుంటే ఆ సంఘటనను గుర్తు చేసుకొని, "నన్ను బద్ర్ యుద్ధం నుండి విముక్తునిగా చేసిన ఆ దైవం సాక్షి!" అని ఒట్టు వేసుకునేవాడు.

మొత్తానికి ఖురైషులు అంతా స్థిమితపడ్డాక, మదీనా సైన్యం ఎంత ఉందో తెలుసుకోవడానికి 'ఉమైర్ బిన్ వహబ్ జమ్‌హీ'ని పంపించారు, ఉమైర్ గుర్రమెక్కి మదీనా సైన్యం చుట్టూ తిరిగి వచ్చాడు. తిరిగి వచ్చి, "ఇంచుమించు మూడొందల మందిదాకా ఉంటారు. కాని కొంచెం ఆగండి! వారికి ఎలాంటి సహాయం అయినా అందుతోందా లేదా, మరెక్కడైనా దాక్కొని ఉన్నారా చూసి వస్తాను" అని చెప్పి తిరిగి తన గుర్రాన్ని దౌడు తీయించాడు, చాలా దూరం వరకు వెళ్ళినా అతనికి ఏదీ కనిపించలేదు. తిరిగి వచ్చి ఖురైషులతో, "నాకు ఏమీ కనిపించలేదు. అయితే ఓ ఖురైష్ ప్రజలారా! నేను చావును మోసుకొని వచ్చిన పరిస్థితులను చూశాను. యస్రిబ్ ఒంటెలు వాటిపై స్వచ్ఛమైన

మరణాలను మోసుకువచ్చాయి. వచ్చినవారి రక్షణ, మనుగడ స్వయంగా వారి కరవాలాలే తప్ప మరేవీ కావు. దైవసాక్షి! నేను తలుస్తున్నట్లు వారి ఏ మనిషి అయినా మీ మనిషిని చంపనిదే చావడు. వారు మీ ప్రముఖులను ఏరికోరి చంపేస్తే, వారు మరణించాక జీవించి ఉండడం దండగ. అందుకని కాస్త నింపాదిగా ఆలోచించుకోండి" అని అన్నాడు.

ఈ సమయంలో అబూ జహల్‌కు వ్యతిరేకంగా - కక్ష కట్టినవారు- ఓ క్రొత్త జగడాన్ని లేవదీశారు. ఈ వర్గం లేవనెత్తిన డిమాండు ప్రకారం, యుద్ధం చేయకుండానే మక్కాకు తిరిగిపోవాలి, అందుకని హకీమ్ బిన్ హిజామ్‌కు మంచి అవకాశం లభించింది. అతను ఉత్బా బిన్ రబియా దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు:

"అబుల్ వలీద్! మీరు ఖురైషులకు చెందిన గౌరవనీయులైన పెద్ద మనిషి. ఆదేశ పాలనకు మీరు అర్హులైన సర్దారు కూడా. భవిష్యత్తులో మీరు ఓ సత్కార్యం చేసిన వ్యక్తిగా ఎందుకు గుర్తించబడకూడదు?"

"ఉత్బా! ఆ పని ఎలాంటిది? నన్నేం చేయమంటారు?"

"మీరు మీ వారిని వెనక్కు తీసుకొని వెళ్ళండి. మీ మిత్రపక్షానికి చెందిన అమ్రూ బిన్ హజ్రమీ వ్యవహారం -(నఖ్లా సరియ్యాలో చంపబడిన వాడు) మీ నెత్తిన వేసుకోండి."

"సరే, అది నాకు సమ్మతమే. నా వైపు నుండి పూచీ తీసుకోండి. అతను నా మిత్రపక్షంలోని వాడు. అతని రక్తపరిహారం కూడా నేనే భరిస్తాను. ఆ సరియ్యాలో వారు పోగొట్టుకున్న ధనానికి బాధ్యత కూడా నాదే" అని చెబుతూ ఉత్బా, "మీరు హన్జలియా కుమారుని దగ్గరకు వెళ్ళండి (హన్జలియా అబూ జహల్ తల్లి గనుక అతణ్ణి ఈ విధంగా సంబోధించడం జరిగింది). అతను వ్యవహారాలను చెడగొట్టడంలో, ప్రజలను ఉసిగొల్పడంలో మహా దిట్ట. అందుకని అతని నుండే నాకు శంక ఉంది" అని అన్నాడు.

ఆ తరువాత ఉత్బా బిన్ రబియా నిలబడి ఉపన్యసిస్తూ, "ఖురైష్ ప్రజలారా! మీరు ముహమ్మద్(స) మరియు ఆయన(స) సహచరులతో యుద్ధం చేసి ఎలాంటి ఘనకార్యాన్నీ నిర్వహించలేరు. దైవసాక్షి! మీరే గనక వారిని చంపేస్తే మీకు ఎదురుపడే ముఖాలను మీరు చూడడానికైనా సిద్ధ పడరు. ఎందుకంటే, మనిషి తన పినతండ్రి కుమారులనుగాని, పిన్నమ్మ

కుమారులనుగాని, తమకే చెందిన కుటుంబ సభ్యునిగాని చంపితే అది గొప్పతనమవుతుందా? అందుకని వెనక్కు వెడదాం పదండి. ముహమ్మద్(స) మరియు అరేబియా జోలికే పోకండి. అరబ్బులే గనుక వారిని చంపితే మీరు అనుకున్నది నెరవేరినట్లే. అలా జరగకపోతే ముహమ్మద్(స)తో ప్రవర్తించ వలసిన తీరుగా ప్రవర్తించనందుకు దోషులైపోగలరు."

ఇటు హకీమ్ బిన్ హిజామ్, అబూ జహల్ దగ్గరకు వెళ్ళినప్పుడు అతను తన కవచాన్ని సరిచేసుకుంటున్నాడు. అతణ్ణి చూసి హకీమ్ ఇలా అన్నాడు:

"ఓ అబుల్ హకమ్! ఉత్బా నన్ను మీ దగ్గరికి ఈ సందేశాన్నిచ్చి పంపిం చాడని" విషయం అంతా విశదీకరించాడు. అది విన్న అబూ జహల్ అరికాలి మంట నెత్తికెక్కింది.

"దైవసాక్షి! ముహమ్మద్ మరియు అతని సహచరుల్ని చూసి ఉత్బా గుండెలు అవిశిపోయాయి. లేదు, అలా జరగడానికి వీల్లేదు. దైవసాక్షి! మేము వెనక్కు మళ్ళేదే లేదు. అల్లాహ్ మనకూ ముహమ్మద్ (స)కూ నడుమ ఏదైనా తీర్పునిస్తే తప్ప. ఉత్బా అలా ప్రేలడానికి గల కారణం అతను ముహమ్మద్‌ను, అతని సహచరుల్ని ఒంటె భక్షకులుగా తలచడమే. ఉత్బా కుమారుడు కూడా ముహమ్మద్ సైన్యంలో ఉన్నందుకే అతను మిమ్మల్ని బెదరగొడుతు న్నాడు(ఉత్బా కుమారుడు అబూ హజీఫా ప్రప్రథమంగా ఇస్లామ్‌ను స్వీకరించినవారిలో ఉన్నారు. మదీనాకు హిజ్రత్ చేసి వచ్చినవారు).

ఉత్బాకు అబూ జహల్ చెప్పిన మాటల్లో, "దైవసాక్షి! ఉత్బా గుండెలు అదిరిపోయాయి" వినగానే అతను, "ఓహో ఆ పిరుదల నుండి పొదాలు తీసిన వానికి (లేదా పిరుదలపై అత్తరు పూసుకున్నవానికి)- ఇది అరబిక్ సామెత అంటే అమాయకుడు, పిచ్చివాడు అని అర్థం - త్వరలోనే తెలుస్తుంది. ఎవరి గుండెలు అవిశిపోతున్నాయో?" అని చిందులేశాడు.

అబూ జహల్‌కు, ఈ సంక్షోభం ముదిరిపోతుందనే భయం పట్టుకుంది. వెంటనే ఆమిర్ బిన్ హజ్రమిని - ఇతను సరియ్యా బిన్ హజష్‌లో మరణించిన అమ్రూ బిన్ హజ్రమీ సోదరుడు - పిలిపించి, "మీ మిత్రపక్షం అయిన ఉత్బా మిమ్మల్ని వెనక్కు తీసుకొనిపోడానికి చూస్తున్నాడు. మేము మీ ప్రతీకారాన్ని ఎలా తీర్చుకోజూస్తున్నామో మీకు తెలుసు. కాబట్టి లేచి

నిలబడండి. మీ సోదరుని మరణాన్ని గుర్తు చేసుకోండి" అని అన్నాడు. ఇది విన్న ఆమిర్‌కు పౌరుషం ముంచుకొచ్చింది. కట్టుకున్న వస్త్రాన్ని విప్పేసి నగ్నంగా నిలబడి, "అయ్యో అమ్రూ! అయ్యో అమ్రూ!" అంటూ అరిచాడు. దీనికి అతని తెగ వారు మరింత రెచ్చిపోయారు. వారి వైఖరి మరింత కఠినంగా మారిపోయింది. యుద్ధం చేసే కోరిక మరింత హెచ్చింది. ఉత్బా చేసిన ప్రయత్నం అంతా బూడిదలో బోసిన పన్నీరు చందంగా మారిపోయింది. ఈ ప్రయత్నం విఫలం అయిపోయింది.

ఎదురెదురుగా నిలబడిన రెండు సైనిక దళాలు

ఎట్టకేలకు ముష్రిక్కుల సైన్యం బయటకు వచ్చింది. ఇరు సేనలు ఒకదానికొకటి అగుపిస్తున్నాయి. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా దుఆ చేశారు;

"ఓ ప్రభూ! వీరు ఖురైషులు. గర్వపడుతూ, విర్రవీగుతూ నీకు వ్యతిరేకంగా సన్నద్ధులై వస్తున్నవారు. నీ ప్రవక్తను (స) తిరస్కరించేవారు. ఓ అల్లాహ్ నీ సహాయం... ఏ సహాయం అయితే నీవు చేస్తానని వాగ్దానం చేశావో ఆ సహాయం అందించు. ఓ అల్లాహ్! ఈ రోజు వారిని హతమార్చు."

అదేకాదు, దైవప్రవక్త (స), ఉత్బా బిన్ రబీయాను, అతని ఎరుపు రంగు ఒంటెపై ఎక్కి ఉండడం చూసి, "ఒకవేళ ఆ జాతిలో ఎవరి వద్దయినా కొంత మేలు ఉంటే ఆ ఎరుపు రంగు ఒంటెగల వాడి వద్దనే ఉంది, అతని మాట వింటే ఆ జాతి రుజుమార్గం పొంది ఉండేది" అన్నారు.

ఈ సందర్భంగా మహాప్రవక్త (స) ముస్లిముల వరుసలను తీర్చిదిద్దారు. వరుసలను తీరుస్తున్నప్పుడు ఓ అసాధారణ సంఘటన జరిగింది. ఆయన(స) చేతిలో ఓ బాణం ఉంది. దానితో ఆయన వరుసలను సరిచేస్తున్నారు. వరుసలో కొంత ముందుకు వచ్చి నిలుచున్న హజ్రత్ సౌదా బిన్ గజియా పొట్టపై ఆ బాణంతో నొక్కి వెనక్కు వెళ్ళి సరిగా నిలుచుండమని చెప్పారు. సౌదా(ర) దానికి,"ఓ మహాప్రవక్త (స), మీరు నన్ను బాధించారు. నాకు ప్రతిఫలం కావాలి" అని అడిగారు. దైవప్రవక్త (స) తన పొట్టపై నుండి వస్త్రాన్ని తీసి, "ఇదిగో నన్ను కూడా బాధించి మీ బాధను ఉపశమించుకోండని" ఆయన ఎదురుగా నిలబడ్డారు. సౌదా(ర) ఆయన్ను వాటేసుకొని ఆయన పొట్టను ముద్దెట్టుకోనారంభించారు.

"సౌదా మీరిలా ప్రవర్తించడానికి గల కారణం ఏమిటి?" అని అడిగారు ప్రవక్తశ్రీ (స).

"దైవప్రవక్తా (స), జరిగేదంతా మీకు తెలుసు. నేను ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని చివరి సమయంలో నా శరీరం మీ శరీరంతో స్పృశించాలని అలా చేశాను అంతే" అన్నారు సౌదా.

మహాప్రవక్త (స) ఆయన ప్రేమానురాగాలకు అచ్చెరువొంది ఆయన్ను దీవించడం జరిగింది.

వరుసలు సరియైన తరువాత, "నా చివరి ఆదేశం వెలవడనంతవరకు ఏ ఒక్కరూ యుద్ధం ప్రారంభించకూడదు" అని ఆజ్ఞాపించారు ప్రవక్తశ్రీ (స). ఆ తరువాత యుద్ధం చేసే ప్రత్యేక విధానాన్ని చెబుతూ, "బహుదైవారాధకులు మూకుమ్మడిగా మీపై విరుచుకుపడేటప్పుడు మీరు బాణాలు వదలాలి. వారి బాణాల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవాలి[3] (అంటే ప్రారంభం నుండే బాణాలు వదిలి వాటిని వ్యయపర్చకూడదు అని అర్థం). వారు మీపై వచ్చిపడే వరకు మీ ఖడ్గాలను ఒరల్లో నుండి బయటకు తీయవద్దు."[4] ఆ తరువాత హజ్రత్ అబూ బక్ర్(ర)ను వెంటబెట్టుకొని పందిరి వద్దకు తిరిగి వెళ్ళిపోయారు. హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) తన సైనిక దళంతో పందిరి ముందు పహరా కాస్తున్నారు.

మరో వైపు బహుదైవారాధకుల పరిస్థితి ఇలా ఉంది. అబూ జహల్ తీర్పు కోసం అల్లాహ్‌ను వేడుకుంటున్నాడు. "ఓ అల్లాహ్! మాలో ఏ వర్గం అయితే బంధుత్వాన్ని త్రెంచడానికి, దుష్ప్రవర్తన చేయడంలో మితిమీరి పోయిందో దాన్ని ఈ రోజు విరిచిపారెయ్యి. ఓ ప్రభూ! మాలోని ఏ వర్గం అయితే నీకు అధిక ప్రియమైనదో, అతి సామీప్యంగలదో దానికి నీ సహాయాన్ని అందించు" అంటూ ప్రార్థిస్తున్నాడు. ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ దైవం ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు.

اِنْ تَسْتَفْتِحُوْا فَقَدْ جَآءَكُمُ الْفَتْحُ ۚ وَاِنْ تَنْتَهُوْا فَهُوَ خَيْرٌ لَّكُمْ ۚ وَاِنْ
تَعُوْدُوْا نَعُدْ ۚ وَلَنْ تُغْنِيَ عَنْكُمْ فِئَتُكُمْ شَيْـًٔا وَّ لَوْ كَثُرَتْ ۙ
وَ اَنَّ اللّٰهَ مَعَ الْمُؤْمِنِيْنَ ﴿۱۹﴾

3. సహీ బుఖారి-2/568
4. సునన్ అబూ దావూద్-2/13

"మీరు గనక తీర్పును కోరితే, ఇదిగో, తీర్పు మీ ముందుకు వచ్చేసింది. కాబట్టి ఇక మానండి, అది మీకే మేలు. ఒకవేళ మీరు ఈ బుద్ధితక్కువ పనిని మళ్ళీ చేసినట్లయితే మేము కూడా మళ్ళీ అదే శిక్షను విధిస్తాము. మీ సైనిక దళం, అది ఎంత అధికంగా ఉన్నప్పటికీ, మీకు ఏ మాత్రం పనికిరాదు. అల్లాహ్ విశ్వాసులతో ఉన్నాడు." (8 : 19)

యుద్ధారంభం - మొదటి హతుడు

ఈ యుద్ధాగ్నికి మొదటి సమిధ అస్వద్ బిన్ అబ్దుల్ అసద్ మఖ్జూమి. ఇతను తలబిరుసుగల దుష్టుడు. అతను బయలుదేరడమే ఓ ప్రమాణం చేసి బయలుదేరాడు. అతను చేసిన ప్రమాణం, "అల్లాహ్‌పై ఒట్టేసుకొని వెడుతున్నాను. ముస్లిములు కట్టిన నీటి తొట్టె నీళ్ళు త్రాగుతాను లేదా దాన్ని కూల్చేస్తాను, అదీ కాని పక్షంలో నా ప్రాణాలనైనా అర్పిస్తాను" అని. అతను అటు నుండి ముందుకు వచ్చాడో లేదో ఇటు ముస్లిమ్ సైన్యం నుండి హజ్రత్ హమ్‌జా(ర) బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బయటకు వచ్చారు. ఇద్దరు నీటి తొట్టెకు ఈవలనే ఎదురుపడ్డారు. హజ్రత్ హమ్‌జా (ర) వేసిన ఖడ్గం వ్రేటుకు అస్వద్ కాలు పిక్క మధ్య నుండి తెగి వేరైపోయింది. అతను వెల్లకిలాపడిపోయాడు. అతని కాలి నుండి రక్తం ధారగా చిందనారంభించింది. అయినా అతను మోకాళ్ళపై ప్రాకుతూ నీటి తొట్టె వైపునకు వెడుతున్నాడు. తొట్టెలోనికి పడిపోయి తన ప్రమాణాన్ని నిలబెట్టుకునే లోపునే హజ్రత్ హమ్‌జా(ర) మరో వ్రేటు వేశాడు. అతను అక్కడే ప్రాణాలు వదిలేశాడు.

తొడ చరిచి పోరుకు పిలిచినవారు

ఈ యుద్ధంలో ప్రథమంగా హతుడైన అస్వద్‌ను చూసి యుద్ధజ్వాలలు మరింత ప్రజ్వరిల్లాయి. ఆ తరువాత ఖురైష్‌కు చెందిన ముగ్గురు గుర్రపు రౌతులు ముందుకు వచ్చారు. వీరు ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందిన వారు. ఒకడు ఉత్బా, రెండవ వాడు అతని సోదరుడు షైబా. వీరిద్దరు రబీయా కుమారులే. మూడవవాడు 'వలీద్.' ఇతను ఉత్బా కుమారుడు. వీరు వారి వరుసలో నుండి ముందుకువచ్చి వ్యక్తిగతంగా యుద్ధం చేయమని తొడ చరిచి పిలిచారు. వారిని ఎదుర్కోడానికి అన్సార్‌కు చెందిన ముగ్గురు యువ

కులు ముందుకొచ్చారు. ఒకరి పేరు ఔఫ్, రెండో ఆయన పేరు ముఅవ్విజ్ వీరిద్దరు హారిస్ కుమారులు. వీరి తల్లి పేరు 'అఫ్రా'. మూడో యువకుడు అబ్దుల్లా బిన్ రవాహా - వీరిని చూసి ఖురైష్, మీరెవరూ అని అడగ్గా, వారు మేము అన్సారులం అని జవాబిచ్చారు.

"మీరు గౌరవనీయులైన ప్రత్యర్థులు, మీతో మాకు పని లేదు. మాకు కావలసినవారల్లా మా దాయాదులు, మా సోదరులు" అన్నారు ఖురైషులు. అంతలోనే వారిలోని ఒకడు ఇలా ప్రకటించాడు.

"ఓ ముహమ్మద్(స), మా వద్దకు మా జాతికే చెందిన వారిని పంపించు." ఈ ప్రకటన విన్న దైవప్రవక్త(స), ముహాజిర్లలోని కొందరి పేర్లను పిలుస్తూ;

"ఉబైదా బిన్ హారిస్, లేచి నిలబడు! హమ్జా (ర) లేవండి! అలీ (ర) నీవు కూడా లేచి నిలబడు" అన్నారు. వీరు లేచి ఆ ముగ్గురిని మార్కొనడానికి ఖురైషుల వైపు బయలుదేరారు. ఇది చూసిన ఖురైష్, ఆగండి, మీరు ఎవరో చెప్పండి అని అడగగా, తామెవరో చెప్పారు వారు. "ఇప్పుడు మాకు సరైన జోడు" అన్నారు ఖురైషులు.

ఆ తరువాత వీరి నడుమ పోరు ప్రారంభం అయింది. అందరికంటే వయస్సులో పెద్దవారైన హజ్రత్ ఉబైదా (ర) ఉత్బా బిన్ రబీయాను, హజ్రత్ హమ్జా (ర) షైబాను, హజ్రత్ అలి(ర) వలీద్‌ను ఎదుర్కొన్నారు.[5] హజ్రత్ హమ్జా(ర) మరియు హజ్రత్ అలి(ర)లు అయితే తమ ప్రత్యర్థులను సునాయాసంగా చంపేశారు. కాని ఉబైదా(ర) మరియు ఆయన ప్రత్యర్థి నడుమ ఖడ్గయుద్ధం సాగుతూనే ఉంది. ఇద్దరిలోను ప్రతివాడూ గాయపడ్డాడు. ఇంతలోనే తమ ప్రత్యర్థుల పీచమణచిన హజ్రత్ హమ్జా(ర) మరియు హజ్రత్ అలి(ర)లు ఉత్బాపై విరుచుకుపడి అతణ్ణి మట్టుబెట్టారు. హజ్రత్ ఉబైదా(ర)ను ఎత్తుకొని తమ వారి దగ్గరకు వచ్చారు. హజ్రత్ ఉబైదా(ర)గారి కాలు తెగిపోయి ఉంది. నోట మాట కూడా లేదు. అలా ఆయన అపస్మారక స్థితిలోనే, యుద్ధం అయిపోయిన నాల్గు అయిదు రోజులు, ముస్లిములు

5. ఇబ్నె హిషామ్, ముస్నదె అహ్మద్ మరియు అబూదావూద్ ఉల్లేఖనాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. మిష్కాత్-2/343

మదీనాకు తిరిగి వెళ్ళే వరకు ఉండిపోయారు. సఫ్రా లోయగుండా ప్రయాణించేటప్పుడు పరమపదించారు.

మూకుమ్మడిగా విరుచుకుపడిన శత్రువు

వ్యక్తిగతంగా జరిగిన ఈ యుద్ధ పరిణామం చెడుగా బయల్పడ్డంతో ఖురైష్ అగ్గిమీద గుగ్గిలం అయిపోయారు. ఒకేసారి ముగ్గురు మహావీరులైన సర్దారులను పోగొట్టుకోవడం వలన వారి ఆగ్రహానికి హద్దులేకుండా పోయింది. ఒకేసారి అకస్మాత్తుగా ముస్లిములపై విరుచుకుపడ్డారు.

మరో వైపు ముస్లిములు తమ ప్రభువును సహాయపడమని వేడుకుంటూ ఆయన మార్గంలో యుద్ధం చేయడానికి తమ తమ స్థానాల్లో నిలకడగా నిలబడి శత్రువు ఎదురు దాడిని ఎదుర్కోనారంభించారు. ఇలా ఒకేచోట నిలబడి వచ్చిపడే శత్రువును చెండాడనారంభించారు. అప్పుడు వారి నోట అహద్, అహద్ అనే పదమొక్కటే వెలువడుతోంది.

మహాప్రవక్త (స) గారి వేడుకోలు (దుఆ)

ఇటు దైవప్రవక్త (స) వరుసలను క్రమంగా తీర్చిదిద్ది పందిరి క్రిందికి చేరారు. దేవుని ముందు మోకరిల్లి తన వర్గానికి సహాయపడమని, చేసిన వాగ్దానాన్ని నెరవేర్చమని దుఆ చేయనారంభించారు. ఆ దుఆ ఇది:

"ఓ అల్లాహ్! నీవు నాతో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చు. ఓ ప్రభూ! నేను ఇప్పుడు నీ వాగ్దానం, నీ ప్రమాణం గురించి అడుగుతున్నాను."

భీకర యుద్ధం ప్రారంభమై, పోరు ఉధృతమైపోగా ఇలా దుఆ చేశారు:

"ఓ అల్లాహ్! ఈ రోజు ఈ వర్గం తుడుచుకుపోతే ఇక ముందు నీ ఆరాధన చేసేవాడే ఉండడు. ఓ ప్రభూ! ఈ రోజు తరువాత నీ ఆరాధన ఇక జరగకూడదని తలుస్తున్నావా?"

మహాప్రవక్త (స) ఎంతో వినమ్రులై ఈ దుఆను చేసేటప్పుడు ఆయన భుజం మీద ఉన్న దుప్పటి క్రిందపడిపోయింది. హజ్రత్ అబూ బక్ర్(ర) ఆ దుప్పటిని ఆయన భుజాలపై కప్పుతూ, "ఓ మహాప్రవక్తా! తమరు తమ దైవంతో వినయంగా వేడుకున్నారు కదా!" అన్నారు. ఇటు అల్లాహ్ దైవదూతలకు ఇలా సంజ్ఞ చేశాడు: ఆ సంజ్ఞ దివ్యఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

اَنِّيْ مَعَكُمْ فَثَبِّتُوا الَّذِيْنَ اٰمَنُوْا ۚ سَاُلْقِيْ فِيْ قُلُوْبِ الَّذِيْنَ كَفَرُوا الرُّعْبَ

"నేను మీకు తోడుగా ఉన్నాను. మీరు విశ్వాసులకు ధైర్యస్థైర్యాలను నూరిపోయ్యండి. నేను ఇప్పుడే ఈ అవిశ్వాసుల హృదయాలలో భయాన్ని సృష్టిస్తాను. కనుక మీరు వారి మెడలపై కొట్టండి. వారి కీలు కీలుపై కొట్టండి." (8 : 12)

వెంటనే మహాప్రవక్త (స) వద్దకు దివ్యావిష్కృతిని పంపుతూ;

اَنِّيْ مُمِدُّكُمْ بِاَلْفٍ مِّنَ الْمَلٰٓئِكَةِ مُرْدِفِيْنَ ۝

"నేను మీ సహాయం కోసం వేయి మంది దైవదూతలను ఒకరి తరువాత ఒకరిని ఎడతెగకుండా పంపుతున్నాను." (8 : 9)

దైవదూతల అవతరణ

తరువాత మహాప్రవక్త (స)కు ఓ కునుకుపట్టింది. ఆ తరువాత ఆయన తలపైకెత్తి, "అబూ బక్ర్ సంబరపడండి! ఈయన జిబ్రీల్ (అ.స.), దుమ్ముధూళి మయమై వస్తున్నారు" అని చెప్పారు. ఇబ్నె ఇస్‌హాక్ ఉల్లేఖనం ఇలా ఉంది. "అబూ బక్ర్ సంబరపడండి! మీ వద్దకు అల్లాహ్ సహాయం వచ్చేసింది. ఈయన జిబ్రీల్ (అ.స.). తన గుర్రం కళ్ళెం పట్టుకొని వస్తున్నారు. శరీరం అంతా దుమ్ముధూళితో నిండి ఉంది."

అనంతరం మహాప్రవక్త (స) పందిరి నుండి బయటకు వచ్చారు. అప్పుడాయన కవచాన్ని ధరించి ఉన్నారు. ఉద్వేగంగా గుమ్మం వైపునకు నడుస్తూ ఇలా సెలవిస్తున్నారు:

سَيُهْزَمُ الْجَمْعُ وَيُوَلُّوْنَ الدُّبُرَ ۝

"త్వరలోనే ఈ వర్గం పరాజయం పాలవుతుంది. వారు వెన్నుజూపి పారిపోతూ కనిపిస్తారు." (54 : 45)

ఆ తరువాత ఆయన పిడికెడు గులక రాళ్ళుగల మట్టిని తీసుకొని ఖురైషుల వైపునకు మళ్ళారు. "షాహతిల్ వుజూహ్, షాహతిల్ వుజూహ్" (ముఖాలు వికృతంగా మారిపోవుగాక, ముఖాలు వికృతమై పోవుగాక) అని చెబుతూ ఆ మట్టిని వారి ముఖాలపై విసరికొట్టారు. బహుదైవారాధకులు

ఎవ్వరూ తమ కళ్ళల్లో, ముక్కుల్లో, నోటిలో ఆ మట్టి పడకుండా మిగల్లేదు. ఈ దృశ్యాన్నే వివరిస్తూ దివ్యఖుర్‌ఆన్ ఇలా సెలవిస్తోంది.

وَمَا رَمَيْتَ اِذْ رَمَيْتَ وَلٰكِنَّ اللّٰهَ رَمٰى ۚ

"కనుక యదార్థం ఏమిటంటే, వారిపై ఆ మట్టిని విసరి మీరు చంప లేదు, అల్లాహ్‌యే ఆ మట్టిని విసరి చంపాడు." (8 : 17)

ఎదురు దాడి

ఇది జరిగిన వెంటనే మహాప్రవక్త(స) ఎదురు దాడి చేయమని ఆదేశిస్తూ, ముస్లిములను ఉత్సాహపరచడానికి. "షద్దూ (వారిలోకి చొరబడండి), ఎవరి చేతిలోనైతే ముహమ్మద్ (స) ప్రాణాలున్నాయో ఆయన సాక్షిగా చెబుతున్నాను! ఏ వ్యక్తి అయినా సరే స్థిరంగా నిలబడి, పుణ్యకార్యంగా భావించి ముందు కురికి, వెనక్కు మరలకుండా పోరాడి ప్రాణాలొదుల్తాడో, అతణ్ణి అల్లాహ్ తప్పకుండా స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు" అని పలికారు.

ఆయన యుద్ధం చేయడానికి పురికొలుపుతూ ఇంకా ఇలా కూడా అన్నారు: "ఆ స్వర్గం వైపునకు కదలడానికి లేచి నిలబడండి, ఏ స్వర్గం వైశాల్యమైతే ఈ భూమ్యాకాశాలకు సమానమైందో (దాన్ని పొందడానికి పరుగిడండి)." దైవప్రవక్త (స) గారి ఈ మాటలు విన్న ఉమైర్ బిన్ హమ్మామ్, "ఓహో! ఓహో!" అనటం ఆరంభించారు. "నీవెందుకలా అంటున్నావు?" అని అడగగా, "కాదు! దైవసాక్షి! ఓ అల్లాహ్ ప్రవక్తా! ఏమీ లేదు, నాకు కూడా ఆ స్వర్గంలో ప్రవేశించాలనే కాంక్ష తప్ప మరే కోరికా లేదు" అన్నారాయన.

"ఔను. నీవు కూడా ఆ స్వర్గవాసుల్లోని వారిలో ఒకడివే"అన్నారు దైవప్రవక్త (స).

తన చద్ది మూట నుండి ఖర్జూరాలు తీసి తినటం ఆరంభించారు ఉమైర్ (ర). ఆ తరువాత ఆయనకు ఏదో గుర్తుకువచ్చి, నేను ఈ ఖర్జూరాలు తిన్నంతవరకు బ్రతికి ఉండాలంటే అది ఓ సుదీర్ఘకాలమే అవుతుంది అనుకొని వాటిని నేల మీద విసిరికొట్టి బహుదైవారాధకులతో పోరాడుతూ అమరగతిని పొందారు.[6]

6. ముస్లిమ్-2/139; మిష్కాత్-2/331

అలాగే పేరుమోసిన ఓ మహిళ 'అఫ్రా' కుమారుడు నాఫ్ బిన్ హారిస్ కూడా మహాప్రవక్త (స) దగ్గరికొచ్చి, "దైవప్రవక్తా! అల్లాహ్ తన దాసుని ఏ సత్కార్యాన్ని చూసి (ఆనందంతో) దరహాసం చేస్తాడు?" అని అడగగా, మహాప్రవక్త (స), "తన దాసుడు తన శరీరంపై ఎలాంటి రక్షక సాధనం లేకుండా యుద్ధరంగంలోకి దుమికి శత్రువుతో తలపడతాడో, అల్లాహ్ అతణ్ణి చూసి ఆనందంతో చిరునవ్వు నవ్వుతాడు" అని చెప్పారు. ఆ మాటలు విన్న హజ్రత్ ఔఫ్ తన శరీరంపై ఉన్న కవచాన్ని తీసి పారవేసి కేవలం ఒక ఖడ్గాన్నే చేతబట్టి శత్రుమూకపై విరుచుకుపడ్డారు. అలా యుద్ధం చేస్తూనే ప్రాణాలను ధారపోసి అమరులైపోయారు.

మహాప్రవక్త (స) ఎదురు దాడికి ఆదేశం ఇచ్చినప్పుడు, శత్రువు చేసే దాడుల్లో తీవ్రత తగ్గిపోయి ఉంది. వారి ధైర్యాలు సన్నగిల్లుతున్నాయి. అందుకనే వివేచనతో కూడిన యుద్ధ కౌశల్యాన్నుపయోగించి తీసుకున్న నిర్ణయం, ముస్లిముల పరిస్థితికి మరింతగా బలం చేకూర్చింది. కారణం ఏమిటంటే, సహాబా (ర)కు ఎదురు దాడి చేయమనే ఆదేశం అందినప్పుడు వారి జిహాద్ చేసే ఉద్రేకం, ఉద్వేగం, ఉత్సాహం ఉచ్ఛస్థాయిలోనే ఉన్నాయి. అందుకనే ఓ నిర్ణయాత్మకమైన, శత్రువును తుడిచిపారవేసే దాడి చేయగలిగారు. వారు శత్రు వరుసల్లో చొరబడి వాటిని ఛిన్నాభిన్నం చేస్తూ వారి మెడలను నరుకుతూ ముందుకు వెళుతున్నారు. అదేకాకుండా మహాప్రవక్త (స) స్వయంగా కవచాన్ని ధరించి ఉత్సాహంగా వారి వైపునకు రావడం, పూర్తి నమ్మకంతో, "త్వరలోనే ఈ వర్గం పరాజయం పాలవుతుంది, వారు వెన్నుజూపి పారిపోతూ కనిపిస్తారు" అనే మాటలను అనడం విన్నారు. అందుకని ముస్లిములలో నూతన శక్తి వచ్చినట్లయింది. వారు పూర్తి బలంతో దాడి చేశారు. వారి వెంట దైవదూతలు కూడా ఉండి వారికి సహాయపడ్డారు.

ఇబ్నె సఅద్ ఉల్లేఖనంలో ఇలా ఉంది:"ఆ రోజు మనిషి తల తెగి క్రిందపడిపోయేది. ఇతణ్ణి ఎవరు చంపారో తెలిసేదికాదు. అలాగే మనిషి చేయి తెగి క్రింద పడిపోయింది. ఆ చేతిని నరికిందెవరో అగుపడేవారు కారు."

ఇబ్నె అబ్బాస్ ఇలా అంటారు: "ఓ ముస్లిమ్, ఓ బహుదైవారాధకుణ్ణి చంపడానికి అతని వెంటబడ్డాడు. హఠాత్తుగా ఆ బహుదైవారాధకునిపై కొరడా దెబ్బపడిన శబ్దం వినవచ్చింది. ఓ గుర్రపు రౌతు, "హీజూమ్ ముందుకు నడు" అని అనడమూ వినవచ్చింది. ఆ ముస్లిమ్, ఆ ముష్రిక్ దగ్గరికిపోగా అతను

వెల్లకిలా పడివున్నాడు. అతని ముక్కు ముఖం పచ్చడి అయిపోయాయి. కొరడాతో కొట్టినట్లు అతని శరీరం అంతా ఆకుపచ్చగా మారిపోయింది. ఆ అన్సారీ ముస్లిమ్ దైవప్రవక్తతో ఈ విషయమే చెప్పగా, 'నీవు చెప్పేది నిజం. అది మూడో ఆకాశం నుండి అందిన సహాయం అని అన్నారు." [7]

అబూ దావూద్ మాజినీ ఇలా అంటారు:

నేను ఓ ముష్రిక్‌ను చంపడానికి అతని వెంటబడ్డాను. హఠాత్తుగా అతని తల నా కరవాలం క్రిందికి రాక పూర్వమే తెగిపడిపోయింది. ఇతణ్ణి మరెవరో సంహరించారన్న విషయం అప్పుడుగాని అర్థం కాలేదు.

ఓ అన్సారి, అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (ర)ను బందీగా పట్టుకొని రాగా, అబ్బాస్ బిన్ ముత్తలిబ్ ఇలా అనసాగారు. "దైవసాక్షి! ఇతను నన్ను బంధించలేదు. నన్ను బంధించినది ఓ బట్టతల మనిషి. అతను ఎంతో అందంగా ఉండి ఓ విచిత్రమైన మచ్చలుగల గుర్రంపై ఆశీనుడై ఉన్నాడు" అని చెప్పగా, కాదు దైవప్రవక్తా! ఈయన్ను నేనే పట్టుకొని బంధించానన్నారు. అప్పుడు మహాప్రవక్త (స), "ఊరుకో! అల్లాహ్ ఓ దైవదూత ద్వారా నీకు సహాయపడ్డాడు" అన్నారు.

యుద్ధరంగం నుండి ఇబ్లీస్ పలాయనం

ఇబ్లీస్ సురాఖా బిన్ మాలిక్ బిన్ జీషమ్ ముద్‌లజీ రూపంలో వచ్చి నట్లు, అతను ఇంకా వారి వెంటే ఉన్నట్లు మనం ఇదివరకే చెప్పుకున్నాం. కాని ముష్రిక్‌లకు వ్యతిరేకంగా దైవదూతలు రంగంలోనికి దిగగానే వెన్నుజూపి పారిపోనారంభించాడు. అయితే హారిస్ బిన్ హష్షామ్ అతణ్ణి పట్టుకున్నాడు. ఇంకా అతను సూరాకా బిన్ మాలికే అని అనుకుంటున్నాడతడు. ఇబ్లీస్, హారిస్ బిన్ హష్షామ్ వక్షస్థలంపై గుద్దిన గుద్దుకు అతను వెల్లకిలా పడిపోయాడు. అతను పారిపోతూవుంటే బహుదైవారాధకులు, "సురాకా! ఎక్కడికి వెడుతున్నావు? నీవు మాకు సహాయం చేస్తానని, మమ్మల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళనని మాట ఇవ్వలేదా?" అని అడిగారు. జవాబుగా ఇబ్లీస్, "నేను ఇక్కడ చూస్తున్నది మీరు చూడలేరు. అల్లాహ్ అంటే నాకు భయంగా ఉంది. ఆయన శిక్ష ఎంతో కఠినమైన శిక్ష" అంటూ పరుగెడుతూ సముద్రంలోకి దూరిపోయాడు.

7. ముస్లిమ్-2/93

ఘోర పరాజయం

కొద్ది సేపట్లోనే బహుదైవారాధకుల సైన్యంలో అపజయ సూచనలు, అస్తవ్యస్త సూచనలు ప్రారంభం అయ్యాయి. వారి వరుసలు ముస్లిముల ఎడతెగని దాడులతో ఛిన్నాభిన్నమవుతున్నాయి. యుద్ధం దాని చరమ దశకు చేరుకుంది. ముష్రిక్కుల సైనిక గుంపులు అస్తవ్యస్త పరిస్థితిలో వెన్నుజూపి పారిపోనారంభించాయి. త్రొక్కిసలాట ప్రారంభమైంది. ముస్లిములు వారిని గాయపరుస్తూ, చంపుతూ, బందీలుగా పట్టుకుంటూ వారి వెంటబడ్డారు. ఇలా పూర్తిగా అపజయం పాలైపోయింది ఖురైష్ సైన్యం.

గర్వంతో నీల్గిన అబూ జహల్

అయితే, అబూ జహల్ తన సైన్యంలో పుట్టుకొస్తున్న భయ చిహ్నాలను గమనించి ముస్లిమ్ సైన్యాన్ని అడ్డుకోవడానికిగాను, గర్వంతో నీల్గుతూ వారి భయాన్ని పోగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు. “సైనికులారా! సురాకా వెళ్ళిపోవడం వల్ల మీరు ధైర్యాన్ని వీడకూడదు. ముహమ్మద్ మరియు ఆయన సహచరులు ముందే అతనితో కుట్ర పన్ని అతణ్ణి అలా చేయడానికి పురికొలి పారు. మీరు ఉత్బా, షైబా మరియు వలీద్ మరణం వల్ల ధైర్యం కోల్పో కూడదు. వాళ్ళు ముగ్గురు తొందరపడి తమ మరణాన్ని ఆహ్వానించారు. లాత్ మరియు ఉజ్జా దేవుళ్ళ సాక్షి! మనం వారిందరినీ త్రాళ్ళతో బంధించి వెనక్కు తీసుకుపోనంత వరకు విశ్రమించకూడదు. చూడండి! మీలో ఏ ఒక్కరూ వారి మనుషుల్ని సంహరించకూడదు. వారిని ప్రాణాలతో పట్టుకెళ్ళి వారికి తగిన శిక్షను విధిద్దాం” అంటూ ప్రగల్భాలు పలుకుతున్నాడు.

అయితే ఇతని ఈ గర్వం కొంతసేపట్లోనే అణగారిపోయింది. ఎందుకంటే ఇతను ప్రగల్భాలు పలికిన కొంత సమయానికే ముస్లిములు ఎదురు దాడి చేయడం, ఆ ఎదురు దాడి ధాటికి ముష్రిక్కుల వరుసలు కూలిపోవడం, చిందరవందర అయిపోవడం గమనించాడతడు. అప్పటికే అతను తన చుట్టూ ముష్రిక్కుల గుంపును చేర్చుకొని- ఒకే చోట నిలబడి ఉన్నాడు. ముష్రిక్కు సైనికులు చుట్టూ మూగి అతణ్ణి కరవాలాల ప్రహారాల నుండి, బరిశెల వ్రేటుల నుండి కాపాడుతూనే ఉన్నారు. కాని ముస్లిముల సైనికులు తుఫానులా వచ్చి ఆ గుంపును కూడా చెదరగొట్టేశారు. ఆ తరువాత వారికి ఈ మహా దుష్టుడు

అగుపడ్డాడు. అతను ఓ గుర్రమెక్కి చక్కర్లు కొడుతున్నాడు. ఇటు ఇద్దరు అన్సారు యువకులు అతణ్ణి అంతమొందించడానికి కాచుకొని ఉన్నారు.

అబూ జహల్ సంహారం

ఈ విషయంలో హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది: “నేను బద్ర్ యుద్ధం రోజున యుద్ధం చేస్తూ శత్రు సైన్యంలో చొరబడ్డాను. హఠాత్తుగా వెనక్కు తిరిగి చూద్దును కదా, నా ఇరుప్రక్కల ఇద్దరు యువకులున్నట్లు గమనించాను. అంటే నేను ఊహించని విషయమది. అంతలోనే ఓ యువకుడు నా దగ్గరకు వచ్చి రహస్యంగా, “బాబాయి! నాకు అబూ జహల్ ఎవరో చూపించరూ?” అని అడిగాడు. “అబ్బాయీ! అబూ జహల్‌ను చూపిస్తే అతణ్ణి ఏం చేయదలుచుకున్నావు?” అని అడిగాను. “అతనా! దైవప్రవక్త (స)ను తిడుతున్నాడు. ఎవరి చేతిలోనైతే నా ప్రాణాలున్నాయో ఆ అల్లాహ్ సాక్షి! నేనేగనక అతణ్ణి చూస్తే అతణ్ణి వెంటాడుతాను. చివరికి అతనో నేనో చనిపోవలసిందే” అన్నాడు. దానికి నాకు ఆశ్చర్యం వేసింది. ఇంతలోనే మరో యువకుడు వచ్చి నన్ను సైగలతో అబూ జహల్ గురించి అడిగాడు. అంతలోనే నాకు అబూ జహల్ తన సైన్యంలో తిరుగుతూ కనబడ్డాడు. అతణ్ణి చూసి, అడుగో! వాడే మీ ఇద్దరికి కావలసిన వ్యక్తి అన్నాను. నా మాటలు విన్నంతనే ఆ ఇద్దరు కరవాలాలు దూసి అతనిపైబడ్డారు. అతణ్ణి కొట్టి చంపేశారు. ఆ తరువాత వారిద్దరు మహాప్రవక్త (స) గారి దగ్గరకు వచ్చి ఈ విషయం చెప్పగా, “మీలో ఎవరు అతణ్ణి చంపారు?” అని అడిగారు ప్రవక్తశ్రీ (స). ఆ ఇద్దరూ, నేనంటే నేను అని చెప్పారు. “మీ కరవాలాలను శుభ్రం చేశారా?” అని అడిగారు దైవప్రవక్త (స).

“లేదు. ఇంకా శుభ్రపరచలేదు” ఆ ఇద్దరి సమాధానం.

మహాప్రవక్త (స) ఆ ఇద్దరి కరవాలాలను చూసి,“మీరిద్దరూ కలసి అతణ్ణి సంహరించారు” అన్నారు. అయితే అబూ జహల్‌కు చెందిన సొత్తు అంతా ముఆజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్‌కు ఇచ్చారాయన. దాడి చేసిన ఇద్దరు యువకుల పేర్లు ముఆజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్ మరియు ముఆజ్ బిన్ అఫ్రా.[8]

---

8. సహీ బుఖారి-1/444, 2/568; మిష్కాత్-2/352. కొన్ని ఇతర ఉల్లేఖనాల్లో ఇంకో పేరు మఊజ్ బిన్ అఫ్రా అని ఉంది (ఇబ్నె హిషామ్-1/635). అబూ జహల్

ముఅజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్ ఇలా చెప్పినట్లు ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖించారు.

అబూ జహల్ దట్టమైన చెట్టు నీడలాంటి-బరిశెలు, కరవాలాల నీడలో ఉన్నట్లు ముష్రిక్కుల నోట విన్నాను. అబుల్ హకం వద్దకు ఎవ్వరూ వెళ్ళలేరని కూడా వారనుకుంటున్నారు. నేను ఈ మాటలు విన్నంతనే అతణ్ణి గురిగా చేసుకొని అతని వైపే వెడుతున్నాను. అవకాశం దొరకగానే నేను అతనిపై దాడి చేశాను. నేను కొట్టిన దెబ్బకు అతని కాలు పిక్కతో సహా తెగి ఎగిరి పోయింది. రోకలి దెబ్బ తగిలి ఎగిరిపోయిన ఖర్జూరపు గింజలా ఎగిరిపోయింది ఆ కాలు. ఇటు నేను అబూ జహల్పై వ్రేటు వేయగానే అతని కుమారుడు అక్రమా నా భుజంపై తన ఖడ్గంతో వ్రేటు వేశాడు. దీనివల్ల నా గూడ వద్ద నుండి నా చేయి తెగి వ్రేళ్ళాడసాగింది. దాన్ని వెనక వేసుకొని యుద్ధం సాగిస్తూనే ఉన్నాను. మాటిమాటికి నా చేయి నాకు అడ్డం వస్తూ నన్ను బాధిస్తున్న మూలంగా దానిపై నా కాలు వేసి గట్టిగా లాగి వేరుచేసేశాను.[9] ఆ తరువాత అబూ జహల్ దగ్గరకు ముఅవ్విజ్ బిన్ అఫ్రా వచ్చారు. అతను గాయపడి ఉన్నాడు. తన ఖడ్గంతో వేసిన వ్రేటుకు అక్కడనే కుప్పకూలి పోయాడు. కేవలం అతని శ్వాస ఒక్కటే ఆడుతోంది. ఆ తరువాత ముఅవ్విజ్ (ముఅజ్) బిన్ అఫ్రా ఆ యుద్ధంలోనే అమరగతినొందారు.

యుద్ధం ముగిసిపోయింది. అబూ జహల్ గతి ఏమైందో ఎవరు తెలుసుకొస్తారు? అని మహాప్రవక్త(స) అడిగారు. సహాబా (ర) యుద్ధరంగంలో నలువైపుల తిరిగి అతని కోసం వెదుకనారంభించారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర)కు అతను చివరి శ్వాస తీసుకుంటూ ఉండగా అగుపడ్డాడు. ఆయన అతని మెడపై కాలుపెట్టి తలను మొండెం నుండి వేరు చేద్దామని అతని గెడ్డం పట్టుకుంటూ, "ఓ అల్లాహ్ విరోధీ! చివరికి అల్లాహ్ నిన్ను అగౌరవంపాలు చేశాడు కదా?"అని అన్నారు. అతను ఆ మాటలు విని,

సామాను కేవలం ఒకే వ్యక్తికి ఇవ్వడానికి కారణం, ఆ తరువాత ముఅజ్ (మఊజ్) బిన్ అఫ్రా ఆ యుద్ధంలోనే చనిపోవడం. అబూ జహల్ కరవాలాన్ని హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర)కు ఇవ్వడం జరిగింది. ఎందుకంటే, అబూ జహల్ తల మొండెం నుండి వేరు చేసింది ఆయనే.

9. *హజ్రత్ ముఅజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్, హజ్రత్ ఉస్మాన్ (ర)గారి ఖిలాఫత్ వరకు జీవించే ఉన్నారు.*

"నన్నెందుకు అగౌరవంపాలు చేశాడు? మీరు చంపుతున్న వ్యక్తికంటే మిన్న అయినవాడు మరెవ్వడూ లేడు. అయ్యో! నన్ను పొలం దున్ని బ్రతికే కర్షకునికి బదులు మరెవరైనా హతమారిస్తే బాగుండు, ఈ రోజు విజయం ఎవరిని వరించిందో చెప్పు" అని అడిగాడు. జవాబుగా హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్, "ఇంకెవరిది, దైవప్రవక్త (స)గారిదే విజయం" అన్నారు. అది విన్న ఆ దైవ విరోధి, తన మెడపై కాలుపెట్టి ఉండడం చూసి, "ఓ మేకలు కాసేవాడా! నీవు నీ కాలును ఓ ఉన్నతమైన, క్లిష్టమైన చోట పెట్టావు" అన్నాడు. (అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర) మక్కాలో మేకలు కాస్తూ ఉండేవారన్న విషయం గమనార్హం.)

ఈ సంభాషణ అనంతరం హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర) అతని మెడను మొండెం నుండి వేరు చేశారు. దాన్ని మహాప్రవక్త(స)గారి సన్నిధికి గొనివచ్చి, "దైవప్రవక్తా! ఇదిగో! అల్లాహ్ విరోధి అబూ జహల్ శిరస్సు" అని ఆయన(స) ముందు పడవేశారు. మహాప్రవక్త (స) దాన్ని చూసి మూడుసార్లు ఇలా పలికారు. ఆయన తప్ప వేరే పూజ్యుడు లేని ఆ అల్లాహ్ సాక్షి! అల్లాహు అక్బర్. సర్వస్తోత్రాలు అల్లాహ్కే. ఆయన తన వాగ్దానాన్ని సత్యం చేసి చూపించాడు. తన దాసునికి సహాయం అందించి ఒక్కడే అన్ని వర్గాలను ఓడించాడు."

ఆ తరువాత అబ్దుల్లా బిన్ మస్ఊద్ను ఉద్దేశించి, "పదండి, అతని శవం ఎక్కడుందో చూయిద్దురుగాని, అని అడగ్గా, మేము అతని శవాన్ని ఆయన(స)కు చూపెట్టాము. ఆ శవాన్ని చూసి, "ఇతను ఈ సమాజానికి చెందిన ఫిర్ఔన్" అన్నారు దైవప్రవక్త(స).

విశ్వాసాన్ని ఇనుమడింపజేసే సంఘటనలు

హజ్రత్ ఉమైర్ బిన్ హమామ్ మరియు హజ్రత్ ఔఫ్ బిన్ హారిస్ బిన్ అఫ్రాల ఉజ్వలమైన విశ్వాస ఘనకార్యాలను గురించి మనకు తెలిసిందే. యదార్థం ఏమిటంటే, ఈ యుద్ధంలో అడుగడుగునా, విశ్వాస పటిమ, సిద్ధాంత దృఢత్వానికి సంబంధించిన అనేక సంఘటనలు జరిగాయి. ఈ యుద్ధంలో తండ్రి తన కుమారునికి విరుద్ధంగా, సోదరుడు తన సోదరునికి వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొనడం జరిగింది. సైద్ధాంతిక విభేదం వల్ల వారు ఒకరిపై మరొకరు తమ కరవాలాలను దూసి నిలబడ్డారు. పీడితులు, దౌర్జన్యానికి

బలి అయిన వారు ఆ రోజు తమపై జులుమ్ చేసిన వారితో, తమను దౌర్జన్యానికి గురిచేసిన వారితో తలపడి తమ ఆగ్రహాగ్నిని చల్లార్చుకున్నారు.

1. ఇబ్నె అబ్బాస్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది:

మహాప్రవక్త (స) తమ అనుచరగణంతో ఇలా అన్నారు: "బనూ హాషిమ్‌కు చెందిన కొందరిని ఖురైషులు బలవంతంగా యుద్ధరంగానికి ఈడ్చుకొని వచ్చిన విషయం నాకు తెలుసు. వారికి మా ఈ యుద్ధంతో ఎలాంటి సంబంధం లేదు. కాబట్టి బనూ హాషిమ్‌కు చెందిన వ్యక్తి ఎవరైనా మీకు తారసపడితే అతణ్ణి చంపొద్దు. అలాగే అబుల్ బఖ్తరీ బిన్ హష్షామ్ ఎవరికైనా ఎదురుపడితే అతణ్ణి సంహరించవద్దు. అలాగే, అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ కూడా ఎదురుపడితే ఆయన్నూ చంపవద్దు. ఎందుకంటే వారంతా బలవంతంగా యుద్ధానికి తీసుకొని రాబడినవారు."

ఈ మాటలు విన్న ఉత్బా కుమారుడు హజ్రత్ అబూ హుజైఫా (ర), "ఏమిటీ! మేమైతే మా తండ్రుల్ని, సోదరుల్ని, కుమారుల్ని మరియు మా కుటుంబాలకు చెందిన వారిని సంహరించాలి. అబ్బాస్‌ను మాత్రం వదిలి వేయాలి. దైవసాక్షి! ఇది జరిగే పని కాదు, ఒకవేళ అతను గనక నాకు ఎదురైతే అతనికి నా కరవాలం రుచి చూయిస్తాను" అన్నారు.

ఈ వార్త దైవప్రవక్త (స) గారికి చేరింది. అప్పుడు అక్కడున్న హజ్రత్ ఉమర్ (ర)తో దైవప్రవక్త (స), "ఏమిటీ! దైవప్రవక్త (స) పినతండ్రి ముఖంపై కత్తితో కొడతాడా?" అని అన్నారు. ఇది విన్న హజ్రత్ ఉమర్(ర), "ఓ మహాప్రవక్తా! నన్నొదలండి. నేనా వ్యక్తి తలను నా కరవాలంతో ఎగురవేస్తాను. దైవసాక్షి! అతను మునాఫిక్ (వంచకుడు) అయిపోయినట్లుంది" అన్నారు.

ఆ రోజు తరువాత హజ్రత్ హుజైఫా (ర) తరచూ ఇలా అంటూ ఉండే వారు. "ఆ రోజు నేను అన్న మాటలకు మనస్తాపపడుతూనే ఉన్నాను. సతతం నన్ను భయం వెంటాడుతూనే ఉంది. దీనికి పరిహారం కేవలం నేను దైవ మార్గంలో ప్రాణాలిచ్చి అమరగతి పొందడం ఒక్కటే." చివరికి ఆయన యమామా యుద్ధంలో పోరాడుతూ షహీద్ (అమరులు) అయ్యారు.

2. అబుల్ బఖ్తరీని చంపొద్దని ఎందుకు చెప్పడం జరిగిందంటే, మక్కాలో ఈ ఒక్క వ్యక్తే దైవప్రవక్త (స)ను బాధించకుండా ఉన్న వ్యక్తి. దైవ

ప్రవక్తకు ఎలాంటి బాధను కలిగించడంగాని, ఆయనకు వ్యతిరేకంగా ఎలాంటి దుర్భాషలాడడంగాని అతను చేయలేదు. బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్ తెగలను బాయ్‌కాట్ చేసినప్పుడు, కాబా గృహంలో వ్రేలాడదీసిన ఒప్పంద పత్రాన్ని చించిపారేసిన వ్యక్తి కూడా ఇతనే గనక.

కాని ఇంత జరిగినా అతను చంపబడ్డాడు. జరిగిందేమిటంటే, హజ్రత్ ముజ్‌జిర్ బిన్ జయ్యాద్ బలవీ (ర)కి అతను యుద్ధరంగంలో ఎదురుపడ్డాడు. అతని వెంట అతని సహచరుడు కూడా ఉన్నాడు. ఇద్దరు కలిసే యుద్ధం చేస్తున్నారు. హజ్రత్ ముజ్‌జిర్ (ర) అతన్ని చూడగానే, "ఓ అబుల్ బఖ్తరీ! దైవప్రవక్త (స) నిన్ను చంపొద్దని ఆదేశించారు" అనగా అతను, "నా వెంట నా సహచరుడు కూడా ఉన్నాడు మరి" అన్నాడు. "లేదు. దైవసాక్షి! మేము నీ సహచరుణ్ణి మాత్రం వదిలేసేవారం కాదు" అన్నారు ముజ్‌జిర్(ర).

"దైవసాక్షి! మేమిద్దరం కలిసే చనిపోతాం" అన్నాడు అబుల్ బఖ్తరీ. ఇద్దరు కలసి ఆయనపై విరుచుకుపడ్డారు. విధి లేక ముజ్జిర్ (ర) అతణ్ణి చంపవలసివచ్చింది.

3. ఇస్లామ్ స్వీకరించక ముందు మక్కాలో, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ మరియు ఉమయ్యా బిన్ ఖల్ఫ్ మధ్య స్నేహ సంబంధాలుండేవి. బద్ర్ యుద్ధం రోజున ఉమయ్యా తన కుమారుడు అలీ చేయి పట్టుకొని నిలబడి ఉన్నాడు. అటు నుండే అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) వెళ్ళడం తటస్థించింది. ఆయన శత్రువుల నుండి కొన్ని కవచాలు హస్తగతం చేసుకొని మోసుకు వెళుతున్నారు. ఆయన్ను చూసి ఉమయ్యా, "బహుశా నీకు నా అవసరం ఉందనుకుంటాను? నేను నీ ఈ కవచాలకంటే మేలైనవాణ్ణి. ఈ రోజు కనిపించిన దృశ్యంలాంటిది నేనిది వరకు ఎన్నడూ చూడలేదు. నీకు పాల అవసరం లేదా?" (అంటే నన్ను ఖైదు చేసిన వానికి పరిహారంగా బాగా పాలనిచ్చే ఒంటెల్ని ఇస్తాను అని అర్థం) అని అన్నాడు. ఈ మాటలు విన్న హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ కవచాలన్నిటిని క్రిందపడవేసి ఆ ఇద్దరిని బందీలుగా పట్టుకొని ముందుకు సాగారు.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)గారి కథనం ప్రకారం, "నేను ఆ ఇద్దరిని బందీలుగా పట్టుకొని వారి మధ్య నడుస్తున్నాను. అప్పుడు ఉమయ్యా నన్ను

అడిగాడు, "తన వక్షస్థలంపై ఉష్ట్రపక్షి ఈకలను అలంకరించుకొని యుద్ధం చేసిన ఆ వ్యక్తి ఎవరయ్యా" అని.

"ఆయన హజ్రత్ హమ్‌జా(ర)"అని బదులిచ్చాన్నేను.

"ఆయనేనయ్యా మా నడుమ భయం సృష్టించి యుద్ధం చేసింది" అన్నాడు ఉమయ్యా.

వారిద్దరిని పట్టుకొని నేను వెడుతూ ఉండగా హఠాత్తుగా హజ్రత్ బిలాల్ (ర) నా వెంట ఉన్న ఉమయ్యా బిన్ ఖల్ఫ్‌ను చూశారు - ఉమయ్యా బిన్ ఖల్ఫ్ మక్కాలో హజ్రత్ బిలాల్‌ను హింసించిన వాడన్న విషయం ఇక్కడ గమనార్హం- అతణ్ణి చూడగానే హజ్రత్ బిలాల్ (ర), "ఓహో! దైవధిక్కార నాయకుడవా? ఓ ఉమయ్యా బిన్ ఖల్ఫ్! ఇక నేనైనా బ్రతికుంటాను లేదా నీవైనా బ్రతికి ఉంటావు కాచుకో" అని అరిచారు. నేను, "ఓ బిలాల్! ఇప్పుడితను నా ఖైదీ" అని గుర్తు చేశాను. ఆయన వినిపించుకోకుండా, "ఇప్పుడు నేనైనా మిగిలి ఉంటాను లేదా ఇతనైనా బ్రతికి ఉంటాడు" అని బిగ్గరగా అరుస్తూ, "ఓ అన్సారుల్లారా! ఇడిగో దైవధిక్కారుల నాయకుడు ఉమయ్యా బిన్ ఖల్ఫ్! చూడండి, నేనైనా ఉండాలీ లేదా ఇతనైనా ఉండాలి" అన్నారు. ఇంతలోనే ముస్లిములు మమ్మల్ని చుట్టుముట్టి వలయాకారంగా నిలబడ్డారు. నేను ఉమయ్యాను రక్షించనారంభించాను. కాని అందులో ఒకడు కరవాలం లాగి అతని కుమారుని కాళ్ళపై వేసి కొట్టాడు. అతను నిలువునా క్రిందపడిపోయాడు. ఇటు ఉమయ్యా అరచిన అరుపును నేనెప్పుడూ వినలేదు. నేను అతనితో, పారిపో అని చెప్పాను. కాని ఈ రోజు పారిపోవడానికి కూడా అవకాశం లేదు. "దైవసాక్షి! నేను నీకు ఎలాంటి సహాయం చేయలేకపోతున్నాను" అన్నాను. ఆ తరువాత వారు ఆ ఇద్దరిని తమ ఖడ్గాలతో నరికిపారేశారు. అల్లాహ్ బిలాల్ (ర)ను కరుణించుగాక. నా కవచాలూ పోయాయి. నా ఖైదీనీ ఆయన బాధించారు.

జాదుల్ ముఆద్‌లో ఇబ్నె ఖైమ్ ఇలా రాస్తున్నారు:

"హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, ఉమయ్యా బిన్ ఖల్ఫ్‌తో, నీవు మోకాళ్ళ మీద కూర్చో అనగా, అతను అలా కూర్చుండిపోయాడు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ ఢాలులా అతనిపై వంగిపోయారు రక్షించడానికి. కాని ప్రజలు క్రింది వైపు నుండి ఖడ్గ ప్రహారాలు చేసి అతణ్ణి చంపివేశారు. కొన్ని దెబ్బలు

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (ర) గారికీ తగిలాయి. ఆయన కాలుకు గాయం అయింది.[10]

4. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) తన మేనమామ ఆస్ బిన్ హష్షామ్ బిన్ ముగైరాను హతమార్చారు.

5. హజ్రత్ అబూ బక్ర్(ర) తన సొంత కుమారుడు అబ్దుర్రహ్మాన్‌ను చంపారు. అప్పుడు ఈయన బహుదైవారాధకులతో ఉన్నాడు. అతనితో పోరాడుతూ అబూ బక్ర్ (ర), "ఓరీ దుష్టుడా! నా సంపద ఏదీ?" అని అడగగా, అబ్దుర్రహ్మాన్, "ఆయుధాలు, బాగా పరుగెత్తే గుర్రాలు మరియు ఈ కరవాలం తప్ప మరేదీ లేదు. ఇది వృద్ధాప్యాన్ని అంతమొందిస్తుంది" అన్నాడు.

6. ముస్లిములు ముష్రిక్కులను బంధించేటప్పుడు మహాప్రవక్త (స) పందిరిలో ఉన్నారు. హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ కరవాలం చేతబట్టుకొని పహరా కాస్తున్నారు. ప్రజల ఈ ప్రవర్తనను చూసినప్పుడు సఅద్ (ర)గారి ముఖంపై అసహనం గోచరించింది. దీన్ని చూసిన మహాప్రవక్త (స), "సఅద్! దైవసాక్షి! ముస్లిముల ఈ ఉదార ప్రవర్తన మీకు నచ్చడం లేదట్లుందే?" అని అడిగారు. "అవును దైవప్రవక్తా! దైవసాక్షిగా! ఇది బహుదైవారాధకులతో జరిగిన మొదటి యుద్ధం. ఈ అవకాశాన్ని అల్లాహ్ మనకు కల్పించాడు. అందుకని, ఈ ముష్రిక్కులను మిగిలి ఉండకుండా, మూకుమ్మడిగా సంహరిం చడమే నాకు నచ్చిన పని. వారిని పూర్తిగా అణగద్రొక్కాలి" అన్నారు.

7. ఈ యుద్ధంలో హజ్రత్ అక్కాషా బిన్ ముహ్‌సిన్ అసదీ (ర) కర వాలం విరిగిపోయింది. ఆయన దైవప్రవక్త (స) గారి దగ్గరకు వచ్చి ఆ విషయాన్ని చెప్పారు. దైవప్రవక్త (స) ఆయన చేతికి ఓ కర్రబద్దను అందిస్తూ, "అక్కాషా! దీన్తోనే యుద్ధం చేయండి" అన్నారు. ఆ కర్రబద్దను దైవప్రవక్త (స)గారి చేతి నుండి తీసుకొని ఊపగానే అది ఓ పొడపాటి దృఢమైన తళతళ లాడే తెల్ల కరవాలంగా మారిపోయింది. దాన్ని తీసుకొని వెళ్ళి యుద్ధరంగంలో చొరబడ్డారు. అల్లాహ్ ముస్లిములకు విజయాన్ని చేకూర్చేంత వరకు దానితోనే యుద్ధం చేశారు. ఆ కరవాలం పేరు ఔన్- అంటే సహాయం- అని పెట్టడం జరిగింది. ఈ కరవాలం శాశ్వతంగా అక్కాషా (ర) దగ్గరే ఉండిపోయింది.

---

10. జాదుల్ ముఆద్-2/89; సహీ బుఖారి-కితాబుల్ వకాలా -1/308లో ఈ సంఘటన కొంత వివరంగా ఉంది.

దాన్ని ఆయన పోరాటాల్లో ఉపయోగించేవారు. చివరికి సిద్దీఖీ శకంలో ముర్తద్‌ల (ధర్మభ్రష్టులు)కు వ్యతిరేకంగా యుద్ధం చేస్తూ అమరగతిని పొందారు. అప్పుడూ ఆ కరవాలం ఆయన దగ్గరే ఉంది.

8. యుద్ధం ముగిసిన తరువాత ముస్అబ్ బిన్ ఉమైర్ అబ్‌దరీ (ర) తన సోదరుడైన అబూ అజీజ్ బిన్ ఉమైర్ అబ్దరీ ముందు నుండి వెళ్ళడం జరిగింది. అబూ అజీజ్ ముస్లిములకు వ్యతిరేకంగా ఆ యుద్ధంలో పాల్గొన్నవాడు. అలా వెడుతూ ఉండగా ఓ అన్సారీ అతని చేతుల్ని త్రాళ్ళతో కడుతున్నారు. ఇది చూసిన ముస్అబ్ బిన్ ఉమైర్ (ర) ఆ అన్సారీ సహాబీతో, "ఈ వ్యక్తి ద్వారా నీవు నీ చేతుల్ని పటిష్టపర్చుకో (అంటే ప్రయోజనం పొందు), ఇతని తల్లి గొప్ప ధనవంతురాలు. బహుశా ఆమె ఇతణ్ణి విడిపించుకోడానికి గొప్ప పరిహారమే చెల్లించుకోగలదు" అని అన్నారు. ఇది విన్న ఆయన సోదరుడు అబూ అజీజ్, హజ్రత్ ముస్అబ్‌నుద్దేశించి, "ఏమిటీ నా విషయంలో నీవు ఈయనకు చెప్పే విషయం ఇదా?" అని అడిగాడు.

"(ఔను) నీకు బదులు - ఈ అన్సారీయే - నాకు సోదరుడు" అని బదులిచ్చారు ఆయన.

9. బహుదైవారాధకుల శవాలను బావిలో పడవేసే ఆదేశం ఇవ్వబడి నప్పుడు ఉత్బా బిన్ రబీయా శవాన్ని బావి వైపునకు ఈడ్చుకుపోవడం జరిగింది. అప్పుడు మహాప్రవక్త (స), అతని తనయుడైన అబూ హుజైఫా(ర) ముఖం వైపు జూశారు. ఆయన విచారంతో నిలబడి ఉన్నారు. ముఖకవళికలు మారిపోయి ఉన్నాయి. ఇది చూసిన మహాప్రవక్త (స) ఆయనున్నుద్దేశించి,"అబూ హుజైఫా! బహుశా మీ తండ్రి విషయమై మీ మనస్సులో ఏవో భావోద్రేకాలు ఉత్పన్నమవుతున్నట్లున్నాయే?" అని అన్నారు.

"కాదు, దైవసాక్షిగా! ఓ ప్రవక్తా! నా మనస్సులో నా తండ్రి మరణం గురించిగాని, ఆయన విషయం గురించిగాని ఎలాంటి సందిగ్ధం లేదు. అయితే నాకు తెలుసు. ఆయన ఎంతో వివేచన గలవారని, దూరదృష్టి గలవారని. అందుకనే ఆయన ఇస్లామ్ ధర్మం స్వీకరిస్తారేమో అని అనుకునేవాణ్ణి. కాని ఇప్పుడు ఆయన అంతం చూసి ఆ ఆశ కూడా సన్నగిల్లింది. దైవధిక్కార వైఖరిపైన్నే ఆయన ప్రాణాలు వదిలాడని విచారంగా ఉంది" అన్నారు. మహాప్రవక్త (స) ఆయన్ను దీవించి మెచ్చుకున్నారు.

యుద్ధంలో హతులైన ఇరుపక్షాల సైనికులు

ఈ యుద్ధం, ముష్రిక్కుల ఘోర పరాజయం మరియు ముస్లిముల ఘన విజయంతో పరిసమాప్తమైంది. ఇందులో పదునాల్గు మంది ముస్లిములు షహీద్ అయ్యారు (అమరగతిని పొందారు). వారిలో ఆరుగురు ముహాజిర్లు, ఎనమండుగురు అన్సారులు. కాని బహుదైవారాధకులకు మాత్రం పెద్ద నష్టమే జరిగింది. వారిలో మొత్తం డెబ్భై మంది హతులయ్యారు. మరి డెబ్భై మంది బందీలుగా చిక్కారు. వీరంతా ముష్రిక్కుల నాయకులు, సర్దారులు, పేరుమోసిన యోధానయోధులే.

యుద్ధం ముగిసిన తరువాత మహాప్రవక్త (స) ముష్రిక్కు హతుల వద్ద నిలబడి, "మీరు మీ ప్రవక్తకు చెందిన ఎంత పెద్ద కుటుంబమో! మీరు నన్ను తిరస్కరించారు, ఇతరులు నన్ను ధృవపరిచారు. మీరు నన్ను నిస్సహాయ కునిగా వదిలేశారు, ఇతరులు నన్ను ఆదుకుని సహాయపడ్డారు. మీరు నన్ను వెడలగొట్టారు, ఇతరులు నాకు రక్షణ కల్పించారు" అని చెబుతూ, వీరందరిని ఈడ్చుకు వెళ్ళి బద్ర్‌లోని ఫలానా బావిలో పడవేయండని ఆదేశించారు. వారందరినీ అలానే ఈడ్చుకుంటూ వెళ్ళి ఆ బావిలో పడవేయడం జరిగింది.

హజ్రత్ అబూ తల్హా (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స) ఆదేశం మేరకు బద్ర్ రోజున, ఖురైషులకు చెందిన ఇరువై నలుగురు గొప్ప సర్దారుల శవాలను బద్ర్‌లోని ఓ కంపుకొట్టే బావిలో పడవేయడం జరిగింది.

ఏ పోరాటంలోనైనా నెగ్గినప్పుడు, ఆ యుద్ధ మైదానంలో మూడు రోజుల వరకు ఆగి ఉండడం ఆయన(స) గారి అలవాటు. కాబట్టి బద్ర్‌లో మూడో రోజు రాగానే ఆయన ఆదేశం మేరకు ఆయన వాహనంపై అంబారీ కట్టబడింది. ఆ తరువాత ఆయన కాలినడకన నడుస్తూ ఆ బావి ఒడ్డుకు వచ్చి నిలబడ్డారు. వెంట సహాబా (ర) కూడా నడిచారు. అక్కడ నిలబడి ఆ హతుల పేరుపేరున, వారి తండ్రి పేర్లతో సహా ఒక్కొక్కరినే పిలుస్తూ, "మీరే గనక అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విధేయించి ఉంటే నాకు సంతోషం కలిగి ఉండకపోయేదా? ఎందుకంటే మాతో మా ప్రభువు చేసిన వాగ్దానాన్ని సత్యమైనట్లు కనుగొన్నాము. మరి మీతో మీ ప్రభువు చేసిన వాగ్దానం నెరవేరిందా?" అని అనటం ప్రారంభించారు.

ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర), "దైవప్రవక్తా! ఆత్మలు లేని ఈ

శరీరాలతోనా తమరు మాట్లాడుతూ ఉన్నది!" అని అడగగా, "ముహమ్మద్ (స) ప్రాణం ఎవరి చేతిలోనైతే ఉందో ఆ దైవం సాక్షి! నేను చెప్పిన దానికంటే అధికంగా మీరు మరే విషయాన్నీ వినలేరు" అన్నారు. మరో ఉల్లేఖ నంలో,"మీరు ఇంతకంటే మరేమీ వినలేరు. కాని వీరు సమాధానం ఇవ్వలేరు అంతే"[11] అని ఉంది.

మక్కాకు అందిన పరాజయం కబురు

బహుదైవారాధకులు బద్ర్ మైదానం నుండి అస్తవ్యస్త రీతిలో పరుగిడుతూ భయభీతులై మక్కాకు పారిపోనారంభించారు. ఎదురైన పరాజయానికి కుంచించుకుపోయి తల ఎత్తలేని స్థితిలో సిగ్గుపడుతూ వస్తున్నారు. మక్కాలో ఎలా ప్రవేశించాలో వారికి అర్థం కావడం లేదు.

ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, అందరికంటే ముందు ఏ వ్యక్తి అయితే మక్కాకు పరాజయం కబురు తెచ్చాడో, అతడు 'హైస్మాన్ బిన్ అబ్దుల్లా ఖుజాయి.' అతణ్ణి చూడగానే ప్రజలు ఎగబడి యుద్ధ వార్తలేమిటో చెప్పమని అడిగారు. అతను నోరువిప్పుతూనే, "ఉత్బా బిన్ రబీయా, షైబా బిన్ రబీయా, అబుల్ హకం బిన్ హష్షామ్, ఉమయ్యా బిన్ ఖల్ఫ్ - ఇంకా కొందరు సర్దారుల పేర్లు చెబుతూ - వీరంతా వధించబడ్డారు" అని అన్నాడు. అతను చెప్పిన జాబితాలో అందరూ ఖురైష్‌కు చెందిన గౌరవనీయులైన సర్దారుల పేర్లే ఉన్నాయి. సుఫ్వాన్ బిన్ ఉమయ్యా అనేవాడు అక్కడనే హతీమ్ గోడపై కూర్చుని ఉన్నాడు. అది విన్నతోడనే, "దైవసాక్షి! ఇతనే గనక స్పృహలో ఉంటే నా గురించి అడిగి చూడండి తెలుస్తుంది" అని అన్నాడు. ప్రజలు నిజంగానే, "సుఫ్వాన్ బిన్ ఉమయ్యా ఏమయ్యాడూ?" అని అడగగా, "అతను అడిగో! హతీమ్ గోడపై కూర్చొని ఉన్నాడు. దైవసాక్షి! అతని తండ్రి, అతని సోదరుడు చంపబడుతుండగా నేను స్వయంగా నా కళ్ళతో చూసొచ్చాను" అన్నాడు.

మహాప్రవక్త (స)గారి ద్వారా బానిస సంకెళ్ళ నుండి విముక్తులైన హజ్రత్ అబూ రాఫె (ర) కథనం ఇలా ఉంది.

నేను ఆ రోజుల్లో హజ్రత్ అబ్బాస్ (ర)గారి బానిసగా ఉన్నాను. మా ఇంట్లో ఇస్లాం ప్రవేశించింది. హజ్రత్ అబ్బాస్ (ర) ఇస్లామ్ స్వీకరించి ఉన్నారు.

11. ముత్తఫిఖున్ అలైహి-మిష్కాత్-2/345

ఉమ్ముల్ ఫజ్ల్ కూడా ముస్లిముగా మారిపోయారు. నేను కూడా ఇస్లామ్‌ను స్వీకరించే ఉన్నాను. అయితే హజ్రత్ అబ్బాస్ (ర) మాత్రం తమ ఇస్లామ్ స్వీకారాన్ని రహస్యంగానే ఉంచారు. ఇటు అబూ లహబ్ బద్ర్ యుద్ధంలో పాల్గొనలేదు. అతనికి ఈ కబురు అందగానే అతను సిగ్గుపడిపోయాడు. అతన్ని అవమానం ఆవహించింది. మాకు మాత్రం సంతోషం కలిగి మాలో ఓ క్రొత్త బలం వచ్చినట్లు అయింది. నేను ఓ బలహీనుణ్ణి, బాణాలు (అంబులు) తయారు చేయడం నా వృత్తి. జమ్‌జమ్ బావి వద్ద ఉన్న గుడారంలో కూర్చుని అంబుల పుల్లల్ని చెక్కేవాణ్ణి. ఆ సమయంలో ఆ గుడారంలో కూర్చుని వాటిని చెక్కుతున్నాను. నా ప్రక్కన ఉమ్ముల్ ఫజ్ల్ కూడా కూర్చుని ఉన్నారు. ఈ వార్త అప్పుడే మా చెవిన పడగా మేము ఆనందంతో సతమతమవుతున్నాము. అప్పుడే అబూ లహబ్ కాళ్ళీడ్చుకుంటూ మా దగ్గరకు వచ్చి ఆ గుడారంలో ఓ మూలన కూర్చున్నాడు. అతని వీపు నా వీపు వైపున ఉంది. కూర్చున్నాడో లేదో ఒక్కసారే గోల వినిపించింది. "అడిగో అబూ సుఫ్‌యాన్ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వచ్చాడు" అనే మాటలు వినబడ్డాయి. అతను అబూ సుఫ్‌యాన్‌ను తన వద్దకు పిలిపించుకొని అడిగాడు. "ఇటురా! నా వయస్సు సాక్షిగా చెప్పు. ఏం వార్తలో" అని. అతను అబూ లహబ్ వద్ద కూర్చున్నాడు. జనం అంతా నిలబడే ఉన్నారు. "కుమారా! చెప్పు వారి పరిస్థితి ఎలా ఉంది?"

"ఏమీ లేదు! వారికి మాకు నడుమ యుద్ధం జరిగింది. మేము మా భుజాల్ని వారికి అందించాం. వారు మమ్మల్ని ఎలా చంపాలో అలా చంపే శారు. ఎలా బందీలుగా పట్టుకోవాలో వారిష్టమొచ్చినట్లు మమ్మల్ని బందీలుగా పట్టుకున్నారు. దైవసాక్షి! అయినా నేను వారిని తూలనాడడం లేదు. యదార్థం ఏమిటంటే, మేము ఎదుర్కొన్నది ఎర్రగా, ఎత్తుగా ఉన్న స్ఫురద్రూపుల్ని. వీరు భూమికీ ఆకాశానికి నడుమ విచిత్రమైన మచ్చలుగల గుర్రాలపై ఎక్కి ఉన్నారు. దైవసాక్షి! వారు దేన్నీ వదలట్లేదు. మరేదీ వారికి దీటుగా రాలేక పోయింది."

నేను వెంటనే గుడారం పరదాను పైకెత్తి ఇంకెవరూ? దైవసాక్షి! వారు దైవదూతలే అని అన్నాను. ఆ మాట విన్న అబూ లహబ్ తన చేయి పైకెత్తి నా చెంప పగిలేటట్లు కొట్టాడు. నాకూ కోపం వచ్చింది. అతణ్ణి ఎదుర్కొన్నాను. అయితే అతను నన్నుపైకెత్తి భూమ్మీద పడేశాడు. ఆ తరువాత తన మోకాలిపై కూర్చుని నన్ను కొట్టనారంభించాడు. ఇంతలోనే ఉమ్ముల్ ఫజ్ల్ గుడారపు ఓ

గడను పీకి అతని తల పగిలేటట్లు కొట్టారు. అతని తల పగిలి రక్తం కారసాగింది. వెంటనే ఆమె అతణ్ణి ఉద్దేశించి, "అతని యజమాని ఇక్కడ లేనందుకే గదా బలహీనుడనుకొని కొట్టావు" అని అనగా, అతను సిగ్గుతో తల దించుకొని అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అల్లాహ్ ఓ వారం తిరగక మునుపే అతనికి ఓ భయంకరమైన 'అద్సా' అనే వ్యాధికి గురి చేశాడు (అద్సా ప్లేగులాంటి ఓ వ్యాధి). ఆ వ్యాధితోనే అతను అంతమైపోయాడు. అద్సా బొబ్బల్ని అరబ్బులు పెద్ద అపశకునంగా భావించేవారు కాబట్టి, (చనిపోయిన తరువాత) అతని కుమారులు కూడా అతని దగ్గరకు రాలేదు. రెండు మూడు రోజులు అలానే గడిచిపోయాయి. అతని దగ్గరకు పోవడంగాని, అతణ్ణి పూడ్చి పెట్టడానికిగాని వారికి ధైర్యం చాలడం లేదు. అలా వదిలి పెట్టడం వల్ల ప్రజలు తమను తూలనాడగలరనే భయంతో అక్కడనే ఓ గోతి తీసి ఆ శవాన్ని అందులోని కర్రల సహాయంతో నెట్టి పడవేశారు. దూరం నుండే రాళ్ళు రువ్వి ఆ గోతిని పూడ్చివేశారు.

మొత్తానికి మక్కావాసులకు బద్ర్ మైదానంలో ఘోర అపజయం ఎదురైన కారణంగా వారిపై పడిన దుష్ప్రభావం అంతా ఇంతా కాదు. వారు చనిపోయిన వారిని గురించి 'నౌహా' (ఏడ్వడం) చేయడానికి కూడా అనుమతించలేరు. ఇలా నౌహా చేయడం వలన ముస్లిములకు తమ విజయంపై పొంగిపోయే అవకాశం లభిస్తుంది అని వారి అనుమానం.

దీనికి సంబంధించిందే ఆసక్తికరమైన సంఘటన ఒకటి జరిగింది. బద్ర్ యుద్ధంలో అస్వద్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ అనే ఆయన ముగ్గురు కుమారులు హతులయ్యారు. వారి కోసం అతను రోదించదలిచాడు. అతను గ్రుడ్డివాడు. ఓ రాత్రి అతను ఓ ఏడ్చే మహిళ గొంతు విని తన బానిసను విషయం తెలుసుకురమ్మని అక్కడికి పంపించాడు, ఏడ్చే అనుమతి లభించిందేమో అనే ఆశతో. ఖురైషులకు తమ హతులను గురించి 'నౌహా' చేసే అనుమతి లభించిందేమో, ఆ మహిళ అందుకే ఏడుస్తుందేమో కూడా తన కుమారుడు అబూ హకీమాను తలుచుకొని ఏడ్వవచ్చని అతని ఆశ. బానిస తిరిగి వచ్చి ఆ స్త్రీ జాడలేకుండా పోయిన తన ఒంటెను తలుచుకొని ఏడుస్తోంది అని సమా చారం అందించాడు. 'అస్వద్' ఇది విని, తనను తాను సంభాళించుకోకుండా ఇలా అన్నాడు.

"ఏమిటీ! ఆమె తన ఒంటె పోయిందని ఏడుస్తూ ఉందా? దాని కోసం నిద్రను పాడుచేసుకుంటుందా? (ఆమెతో చెప్పు) పోయిన ఒంటె కోసం ఏడ్వవద్దని. అదృష్టాలు మట్టిలో కలిసిపోయిన ఆ బద్ర్ కోసం ఏడ్వమను. అవును! ఆ బద్ర్ యుద్ధాన్ని తలుచుకొని ఏడ్వమను. ఎక్కడైతే బనీ హసీస్, బనీ మగ్జూమ్ మరియు అబుల్ వలీద్‌కు చెందిన తెగల సర్దారులు, వ్యక్తులు చనిపోయారో. ఏడ్వదలుచుకుంటే అకీల్ కోసం ఏడ్వమను, హారిస్ కోసం ఏడ్వమను. అతను పులులకు పులి. వారి కోసమే ఏడ్వమను. అందరి పేర్లు చెప్పి మరీ ఏడ్వమను. అబూ హకీమా? అతనికి సాటి ఎవరూ లేరు. చూడూ! అతని తరువాత అందరూ సర్దారులై పోతున్నారు. బద్ర్ యుద్ధం జరగకుండా ఉండి ఉంటే, వారిలో ఏ ఒక్కడూ సర్దారు కాకపోయేవాడు."

మదీనాకు అందిన విజయ శుభవార్త

ఇటు ముస్లిములకు పూర్తి విజయం లభించగా దైవప్రవక్త (స) మదీనా ప్రజలకు ఈ శుభవార్తను త్వరగా అందించడానికి ఇద్దరు మనుషుల్ని పంపించారు. పంపబడిన వారిలో హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర) ఒకరు. ఈయన ఎగువ మదీనాలో ఉన్న వారి కోసం ఈ శుభవార్తను తీసుకు వెళ్ళారు. రెండవవారు హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర). ఈయన్ను దిగువ మదీనా ప్రజల వద్దకు పంపించడం జరిగింది.

ఈలోపు యూదులు మరియు మునాఫిక్‌లు (కపట ముస్లిములు) మదీనాలో ప్రాపగండ ద్వారా ప్రజల్ని భయభీతులుగా చేస్తున్నారు. చివరికి దైవప్రవక్త (స) కూడా యుద్ధంలో హతులయ్యారని కూడా ప్రచారం చేశారు. ఓ మునాఫిక్ మహాప్రవక్త (స)గారి ఒంటెపై ఎవరో వ్యక్తి ఎక్కి వస్తుండగా చూసి, "ఇంకేముందీ! ముహమ్మద్ (స) యుద్ధంలో చంపబడ్డారు, అదిగో చూడండి, అది ఆయన ఒంటే! మేము దాన్ని గుర్తించగలం. ఆ వ్యక్తి జైద్ బిన్ హారిసా (ర), యుద్ధంలో ఓడిపోయి పారిపోయి వస్తున్నాడు, ఏం చెప్పాలో పాలుపోక దిక్కులు చూస్తున్నాడంటూ" సంబరపడిపోతూ అరిచాడు. మొత్తానికి, ఆ ఇద్దర[illegible]హరులు మదీనా చేరగా ముస్లిములు వారిని చుట్టుముట్టారు. వివరాలన[illegible]లుసుకున్న తరువాత, ముస్లిములు ఘన విజయాన్ని సాధించార[illegible]తెలిసిపోయింది. ఎటు చూసినా ఆనందమే. మదీనా ఇళ్ళు,

వాడలు అన్నీ దైవ నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి. మదీనాలోనే ఉండిపోయిన పెద్దలు దైవప్రవక్త (స)కు శుభాకాంక్షలు తెలుపడానికి మదీనా నుండి బయలుదేరి బద్ర్ మార్గం పట్టారు.

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (ర) గారి కథనం ఇలా ఉంది:

"మాకు విజయ శుభవార్త మహాప్రవక్త (స) గారి కుమార్తె హజ్రత్ రుఖయ్యా (ర) గారిని ఖననం చేసేటప్పుడు తెలిసింది. ఈమె హజ్రత్ ఉస్మాన్ (ర)గారికి సతీమణి. ఆమె వ్యాధిగ్రస్తులుగా ఉన్న కారణంగా పరిచర్యలు చేయడానికిగాను హజ్రత్ ఉస్మాన్ (ర)ను దైవప్రవక్త (స) మదీనాలోనే వదిలిపెట్టి వెళ్ళారు."

యుద్ధంలో లభించిన యుద్ధధనం సమస్య

మహాప్రవక్త (స) యుద్ధం ముగిసిన తరువాత మూడు రోజుల వరకు బద్ర్‌లోనే ఉండిపోయారు. ఆయన (స) బద్ర్ మైదానం నుండి బయలుదేర డానికి సిద్ధపడుతున్నప్పుడే, యుద్ధధనం విషయంలో అభిప్రాయ భేదాలు పొడసూపాయి సైన్యంలో. ఈ విభేదాలు తీవ్రస్థాయికి చేరగానే, దైవప్రవక్త (స), ఎవరి వద్ద ఏ సొత్తు అయితే ఉందో తనకు అప్పగించమని ఆదేశించారు. సహాబా (ర) ఆయన ఆదేశాలను వెంటనే అమలు చేశారు. ఆ తరువాత అల్లాహ్ వహీ (దివ్యవాణి) ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపెట్టాడు.

హజ్రత్ ఉబాదా బిన్ సామత్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది:

మేము మదీనా నుండి బయలుదేరి బద్ర్‌కు చేరుకున్నాం. అక్కడ సంకుల సమరం జరిగింది. అల్లాహ్ శత్రువుకు అపజయాన్ని కలిగించాడు. ఆ తరువాత మాలోని ఓ వర్గం శత్రువులను వెన్నాడుతూ వారి వెనుకగా వెళ్ళింది. వారిని వెంటాడి తరిమికొట్టి చంపింది. మరో వర్గం ఖురైష్‌కు సంబంధించిన సొమ్మును లూటీ చేసి ప్రోగు చేయడంలో నిమగ్నమైంది. ఇంకొక వర్గం మహాప్రవక్త (స)ను చుట్టుముట్టి, శత్రువు తిరిగి దాడి చేయకుండా కాపాడనారంభించింది. రాత్రి బాగా ప్రొద్దుపోయినప్పుడు అందరూ ఒక చోట చేరగానే, ధనాన్ని ప్రోగుచేసినవారు, "ఈ ధనాన్ని మేమే ప్రోగు చేశాం, ఇందులో మరెవ్వరికీ వాటా లేదన్నారు. "శత్రువును వెన్నాడిన వర్గం వారు, "మీరు మా

కంటే ఎక్కువ హక్కుదారులు కారు. మేము శత్రువును పారద్రోలడంలోనూ, మీ దగ్గరకు చేరకుండా ఉంచడంలోనూ సహాయపడ్డాం" అన్నారు. దైవప్రవక్త (స) గారి చుట్టూ చేరి ఆయన ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేసిన వర్గం, "శత్రువు ఏమరుపాటులో వచ్చి దైవప్రవక్త(స)పై దాడిచేసే భయం ఉన్నందువల్లనే మేము ఆయన చుట్టూ చేరి పహరా కాశాం" అని అంది. ఈ జగడం గురించే అల్లాహ్ ఈ ఆయత్‌లను అవతరింపజేసి దాన్ని పరిష్కరించాడు.

يَسْـَٔلُونَكَ عَنِ الْأَنفَالِ ۖ قُلِ الْأَنفَالُ لِلَّهِ وَالرَّسُولِ ۖ فَاتَّقُوا اللَّهَ وَأَصْلِحُوا ذَاتَ بَيْنِكُمْ ۖ وَأَطِيعُوا اللَّهَ وَرَسُولَهُ إِن كُنتُم مُّؤْمِنِينَ ①

"వారు నిన్ను, 'అన్‌ఫాల్' (అల్లాహ్ అనుగ్రహం వలన లభించిన యుద్ధ ధనం) గురించి అడుగుతున్నారు. ఇలా అను: ఈ అన్‌ఫాల్ అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకూ చెందుతాయి. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. మీ పరస్పర సంబంధాలను సంస్కరించుకోండి. అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి, మీరు గనక విశ్వాసులే అయితే." (8: 1)

ఆ తరువాత దైవప్రవక్త (స) అల్లాహ్ ఆదేశం మేరకు ఆ యుద్ధధనాన్ని ముస్లిములకు పంచిపెట్టారు.[12]

మదీనాకు పయనమైన ఇస్లామీయ సైన్యం

దైవప్రవక్త (స) మూడు రోజుల అనంతరం బద్ర్ నుండి మదీనాకు బయలుదేరారు. ఆయన వెంట ముష్రిక్కు ఖైదీలు కూడా ఉన్నారు. వారితో పాటు యుద్ధంలో వారి నుండి హస్తగతం చేసుకున్న ధన సంపద కూడా ఉంది. ఆ సంపద పరిరక్షణ బాధ్యత హజ్రత్ అబ్దుల్లా బిన్ కఅబ్ (ర)గారికి అప్పగించడం జరిగింది. మహాప్రవక్త (స) 'సఫా' లోయ నుండి బయటకు వచ్చి కనుమకు మరియు కనుమకు నడుమన గల ఓ ఎత్తయిన దిబ్బపై మకాం వేశారు. అక్కడే 'ఖమ్స్'(అయిదింట ఒక భాగం యుద్ధధనం) వేరు చేశారు. తక్కిన నాల్గు భాగాలను ముస్లిముల్లో సమానంగా పంచిపెట్టారు.

12. *ముస్నదె అహ్మద్-5/323, 324; హాకిమ్-2/326*

నజ్ర్ బిన్ హారిస్‌ను చంపేయమని ఆ ప్రదేశంలోనే ఆదేశం ఇవ్వడం జరిగింది. కారణం ఏమిటంటే, అతను బద్ర్ యుద్ధంలో ముష్రిక్కుల పతాకాన్ని ఎత్తుకొని ఉన్న వ్యక్తి, అంతేకాదు, ఖురైషులకు సంబంధించిన గొప్ప నేరగాళ్ళలో ఒకడు కూడా. ఇస్లామ్ ధర్మాన్ని వ్యతిరేకించడంలోనూ, మహాప్రవక్త (స)ను బాధించడంలోను అందరికంటే ముందుండేవాడు. మహాప్రవక్త (స)గారి ఆదేశంపై హజ్రత్ అలి (ర) అతని మెడను నరికివేశారు.

ఆ తరువాత దైవప్రవక్త (స) అర్క్యుజ్ జబియా అనే ప్రదేశానికి చేరగానే 'ఉత్బా బిన్ ముఅయిత్'ను చంపేయమని ఆదేశించారు. ఇతను దైవ ప్రవక్త(స)ను హింసిస్తూ ఉండేవాడు. ఇతని గురించి ఇదివరకే చెప్పుకున్నాం. మహాప్రవక్త (స) నమాజు చేసేటప్పుడు ఆయన వీపుపై ఒంటె పొట్టపేగుల్ని పడవేసింది కూడా ఇతనే. అంతేకాదు, తన దుప్పటిని ఆయన మెడకు చుట్టి ఆయన్ను చంపే ప్రయత్నం కూడ చేశాడు. ఆ సమయంలో హజ్రత్ అబూ బక్ర్(ర) వచ్చి మహాప్రవక్త (స)ను రక్షించకపోతే (తాను తలచినట్లు) గొంతు నులిమి చంపేసేవాడే. మహాప్రవక్త (స) ఇతని తలను తొలగించమని ఆదేశించి నప్పుడు అతను, "ఓ ముహమ్మద్! నా పిల్లల గతేమిటి?" అని అడగగా, 'అగ్ని'[13] అని బదులిచ్చారు దైవప్రవక్త (స). ఆ తరువాత హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ (ర) లేదా హజ్రత్ అలి (ర) అతని తలను నరికేశారు.

యుద్ధనీతి దృష్ట్యా ఆ ఇద్దరి తలలను ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉంది. వారు కేవలం ఖైదీలు మట్టుకే కాదు, నేటి ఆధునిక పదజాలం ప్రకారం యుద్ధ నేరస్తులు.

శుభాకాంక్షలు చెబుతూ ఎదురుగా వచ్చిన బృందాలు

మహాప్రవక్త (స) 'రౌహ' అనే ప్రదేశానికి చేరగానే, ఆ ఇద్దరు వార్తా హరుల ద్వారా అందిన శుభవార్తలు విని దైవప్రవక్త(స)ను ఆహ్వానించడానికి, ఆయనకు శుభాభినందనలు తెలుపడానికి మదీనా నుండి బయలుదేరి వచ్చినవారు ఎదురయ్యారు. వారు ప్రవక్త (స)ను చూడగానే అభినందనలు తెలుపుతూ ఉండగా, హజ్రత్ సల్మా బిన్ సలామా(ర) వారినుద్దేశించి, "మీరు

13. ఈ హదీసు సిహా గ్రంథాల్లో ఉంది. ఉదాహరణకు చూడండి: సునన్ అబూ దావూద్-3/12

మాకు అభినందనలు తెలుపుతున్నారా? ఎందుకు? మేము ఢీకొన్నది బట్టతల వృద్ధ యోధుల్ని, వారి తలలు ఒంటె తలల్లా అగుపడ్డాయి మాకు" అని అన్నారు. ఇది విన్న మహాప్రవక్త (స) చిరునవ్వు నవ్వుతూ , "సోదర కుమారా! వీరేనయ్యా వారి జాతిలోని గొప్ప యోధానయోధులు" అన్నారు.

ఆ తరువాత హజ్రత్ అసీద్ బిన్ హజీర్ (ర) దైవప్రవక్త(స)తో, "దైవప్రవక్తా! స్తోత్రాలన్నీ అల్లాహ్‌కే. ఆయనే తమకు విజయాన్ని చేకూర్చింది. తమ కళ్ళు చల్లబడ్డాయి. దైవసాక్షి! మీరు శత్రువులను ఢీకొంటారని నేను అనుకోలేదు. అది కేవలం ఓ వర్తక బిడారం వ్యవహారమే కదా అని నేను మదీనాలో ఉండి పోయాను. శత్రువుతో ఢీకొనవలసి ఉంటుందని నేనను కుంటే నేను వెనుకబడి ఉండేవాణ్ణికాదు" అని విన్నవించుకున్నారు. మహాప్రవక్త (స), "అవును మీరు చెప్పేదే సరియైనది" అని బదులిచ్చారు.

దైవప్రవక్త (స) దైవ సహాయంతో విజేతలై మదీనా నగరంలో కాలు పెట్టారు. ఆ పట్టణం మరియు చుట్టుపట్ల ప్రాంతాల్లో ఉన్న ఆయన శత్రువు లపై ఆయన ప్రభావం ప్రాభవం కూడా పడింది. విజయ ప్రభావం కారణంగా మదీనాకు చెందిన అనేక మంది ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. ఈ సందర్భంలోనే అబ్దుల్లా బిన్ ఉబై మరియు అతని అనుచరులు కూడా విధిలేక అందరికీ తెలియాలనే ఉద్దేశ్యంతో ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు.

దైవప్రవక్త(స) మదీనా చేరిన మరునాడుగాని ఖైదీలు మదీనాకు రాలేకపోయారు. ఆయన(స) వారిని సహాబా (ర)కు పంచిపెడుతూ వారి పట్ల సత్ప్రవర్తనతో మెలగాలి అని ఉద్బోధించారు. ఈ ఉద్బోధ ఫలితంగా సహాబా (ర) తాము స్వయంగా ఖర్జూరాలు తిని, తమ ఖైదీలకు రొట్టె తినిపించేవారు. (మదీనాలో ఖర్జూరానికి అంత విలువ లేదు. రొట్టె ఎంతో ప్రియమైన వంటకం అనేది గమనార్హం).

ఖైదీల సమస్య - దాని పరిష్కారం

దైవప్రవక్త (స) మదీనాకు చేరగానే, సహాబా (ర) ఖైదీల గురించి సలహాలడిగారు. హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్(ర) ఇలా అన్నారు: "ఓ మహాప్రవక్తా (స)! వీరు దాయాదులు(అంటే పినతండ్రుల కుమారులు). మన కుటుంబా లకు, మన వంశానికి చెందినవారు. నా సలహా ప్రకారం తమరు వీరి నుండి

ఫిదియా (పరిహారం) తీసుకొని వదిలేయండి. మనం వారి నుండి పొందిన ధనం, ఈ దైవధిక్కారులకు వ్యతిరేకంగా మనకు బలం చేకూర్చుతుంది. బహుశా అల్లాహ్ మునుముందు వారికి మార్గదర్శన భాగ్యం కలిగిస్తాడేమో. అప్పుడు వారు మనకు అండగా నిలుస్తారేమో."

ఆ తరువాత హజ్రత్ ఉమర్ (ర) గారిని ఉద్దేశించి దైవప్రవక్త (స), "ఓ ఉమర్! నీ సలహా ఏమిటి?" అని అడిగారు. దానికి హజ్రత్ ఉమర్(ర) ఇచ్చిన సలహా ఇది:

"దైవసాక్షి! నా సలహా హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇచ్చిన సలహాకు పూర్తిగా వ్యతిరేకం. నా సలహా ఏమిటంటే, తమరు ఫలానా వ్యక్తిని- ఎవరైతే ఉమర్‌కు దగ్గరి బంధువో- నాకు అప్పగించండి. నేను అతని తలను ఖండిస్తాను. అకీల్ బిన్ అబీ తాలిబ్‌ను - హజ్రత్ అలీ సోదరుడు- అలీ (ర)కి అప్పజెప్పండి. ఆయన అతని తలను నరికేస్తాడు. హమ్‌జా(ర)కు సోదరుడైన ఫలానా వ్యక్తిని హమ్‌జా(ర)కు అప్పజెప్పండి. ఆయన అతని తలను ఖండిస్తారు. చివరికి అల్లాహ్‌కు తెలిసిపోవాలి మా హృదయంలో ముష్రిక్‌ల కోసం ఎలాంటి దయ లేదని. వీరంతా ముష్రిక్‌ల సర్దారులు, నాయకులూను."

హజ్రత్ ఉమర్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది: మహాప్రవక్త (స) నా సలహాకు విలువ ఇవ్వకుండా హజ్రత్ అబూ బక్ర్(ర)గారి సలహాకే విలువ నిచ్చారు. కాబట్టి ఖైదీల నుండి ఫిదియా తీసుకోడానికే నిర్ణయం అయింది. ఆ తరువాత మరుసటి రోజు నేను ఉదయాన్నే దైవప్రవక్త (స)గారి సన్నిధికి రాగా మహాప్రవక్త (స) మరియు అబూ బక్ర్(ర) ఇద్దరు కలసి రోదించడం చూశాను. నేను, "ఓ దైవప్రవక్తా (స)! విషయం ఏమిటో నాకు చెప్పండి. మీరూ, మీ స్నేహితుడు ఇద్దరూ కలిసి ఎందుకు రోదిస్తున్నారో. ఆ కారణం ఏదో తెలిస్తే నేను మీతోపాటే ఏడుస్తాను. ఆ కారణం తెలియకపోయినా మీరిద్దరు కలసి రోదిస్తున్నారు కాబట్టి నేనూ రోదిస్తాను" అన్నాను. దానికి దైవప్రవక్త (స), "ఫిదియా తీసుకునే నిర్ణయం కారణంగా, మీ మిత్రులకు పడబోయే శిక్షను చూసి రోదిస్తున్నాను" అంటూ దగ్గరలో ఉన్న ఓ చెట్టును చూపిస్తూ, "నాకు వారిపై పడనున్న శిక్షను, ఆ చెట్టుకంటే దగ్గరగా చూపించడం జరిగింది.[14] అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు"అన్నారు.

14. తారీఖె ఉమర్ బిన్ ఖత్తాబ్-ఇబ్నె జూజీ - పుట. 36

مَا كَانَ لِنَبِيٍّ اَنْ يَّكُوْنَ لَهٗٓ اَسْرٰى حَتّٰى يُثْخِنَ فِى الْاَرْضِ ؕ
تُرِيْدُوْنَ عَرَضَ الدُّنْيَا ۖ وَاللّٰهُ يُرِيْدُ الْاٰخِرَةَ ؕ وَاللّٰهُ عَزِيْزٌ حَكِيْمٌ ﴿۶۷﴾
لَوْلَا كِتٰبٌ مِّنَ اللّٰهِ سَبَقَ لَمَسَّكُمْ فِيْمَآ اَخَذْتُمْ عَذَابٌ عَظِيْمٌ ﴿۶۸﴾

"ధరణిలో శత్రువును పూర్తిగా అణచనంత మట్టుకు, తన వద్ద యుద్ధ ఖైదీలను ఉంచుకోవడం అనేది ఏ ప్రవక్తకూ తగదు. మీరు ప్రాపంచిక ప్రయోజనాలను కాంక్షిస్తున్నారు. కాని అల్లాహ్ (మీ కొరకు) పరలోకాన్ని కాంక్షిస్తున్నాడు. అల్లాహ్ శక్తిమంతుడూ, వివేకవంతుడూను. ముందే గనక అల్లాహ్ ఫర్మానా ఒకటి వ్రాయబడి ఉండకపోతే, మీరు తీసుకున్నదాని పర్యవసానంగా మీకు పెద్ద శిక్ష పడి ఉండేది." (8 : 67,68)

ముందే వచ్చిన ఆ ఫర్మానా ఇది: కనుక మీరు అవిశ్వాసులతో తలపడి నప్పుడు, వారి మెడలను ఖండించడమే మీరు చేయవలసిన మొదటి పని. చివరకు మీరు వారిని పూర్తిగా అణచివేసిన తరువాత ఖైదీలను గట్టిగా బంధించండి. ఆ తరువాత (మీకు ఇలా చేసే అధికారం ఉంది)

فَاِمَّا مَنًّۢا بَعْدُ وَاِمَّا فِدَآءً

"వారికి మేలైనా చేయండి లేదా వారి నుండి పరిహారం (సొమ్ము) తీసుకొని వదిలేయండి." (47 : 4)

ఈ ఫర్మానాలో యుద్ధ ఖైదీల నుండి ఫిదియా (పరిహారం) తీసుకునే అనుమతి ఇవ్వడం జరిగింది గనుక, సహాబా (ర)కు ఫిదియా తీసుకున్నందుకు శిక్షించడం జరగలేదు. అది కేవలం ఓ హెచ్చరిక మాత్రమే. ఆ హెచ్చరికైనా ఎందుకు చేయడం జరిగిందంటే, వారు దైవ తిరస్కారుల్ని బాగా అణచక ముందే యుద్ధ ఖైదీలుగా పట్టుకున్నందుకు. అదే కాదు, వారు ఫిదియా తీసు కొని వదలివేసిన యుద్ధ ఖైదీలు మామూలు యుద్ధ ఖైదీలు కాదు. యుద్ధంలో ఓడిన గొప్ప యుద్ధనేరస్తులు కూడా. ఏ ఆధునిక చట్టం అయినా, వారిని న్యాయస్థానం ముందు నిలబెట్టకుండా వదలివేసే నేరస్తులు కారు. ఏ న్యాయ స్థానం అయినా వారికి మరణదండన విధించనిదే వదలిపెట్టే అవకాశమే లేదు.

ఏది ఏమైనా, హజ్రత్ అబూ బక్ర్(ర) గారి సలహా ప్రకారమే వ్యవహారం పరిష్కరించడం జరిగింది. ముష్రిక్కుల నుండి ఫిదియా తీసుకొని వారిని వదలి వేయడమూ జరిగింది. ఫిదియా పరిమాణం నాల్గు వేలు మరియు మూడు వేల దిర్హముల నుండి ఒక వెయ్యి దిర్హమ్‌ల వరకు నిర్ణయించడం జరిగింది. మదీనావాసులు చదువుకున్నవారుకారు. అందుకని, ఎవరైతే ఫిదియా చెల్లించలేదో వారు, మదీనాలోని పదేసి మంది పిల్లలకు చదువు చెప్పాలనే షరతు విధించడం జరిగింది. ఆ పిల్లలు బాగా చదవనూ రాయనూ నేర్చుకుంటే అదే వారి ఫిదియా అవుతుంది అని ప్రకటించడం జరిగింది.

మహాప్రవక్త (స) అనేక మంది యుద్ధ ఖైదీలను కరుణించి ఫిదియా లేకుండానే వదలివేశారు. ఈ జాబితాలో ముతల్లిబ్ బిన్ హన్తిబ్, సైఫీ బిన్ రిఫాఅ, అబూ ఉజ్జా హమ్జిల పేర్లు కూడా ఉన్నాయి. అబూ ఉజ్జా హమ్జి ఉహద్ యుద్ధంలో బందీ అయి చంపబడ్డాడు (వివరాలు ముందు రాబో తున్నాయి).

దైవప్రవక్త (స)గారి అల్లుడు అబుల్ ఆస్‌ను కూడా తమ కుమార్తె హజ్రత్ జైనబ్(ర) మార్గానికి అడ్డురాకుండా ఉండే షరతుపై వదలివేయడం జరిగింది. దీనికి కారణం ఏమిటంటే, హజ్రత్ జైనబ్ (ర) తన భర్త అబుల్ ఆస్‌ను విడిపించుకోవడానికి దైవప్రవక్త (స) గారి వద్దకు ఓ కంఠహారాన్ని పంపించారు. ఈ హారం, అసలు హజ్రత్ ఖదీజా (ర)గారి కంఠహారం. వివాహం అయిన తరువాత హజ్రత్ జైనబ్(ర)ను అత్తవారింటికి పంపించేటప్పుడు ఆమె మెడలో అలంకరించి పంపించారు. మహాప్రవక్త(స)కు ఆ హారాన్ని చూడగానే దుఃఖం ఆగలేదు. ఆయన(స), ఈ హారానికి బదులు అబుల్ ఆస్‌ను వదలిపెట్టే అనుమతిని కోరారు సహాబా (ర)ను. సహాబా (ర) సంతోషంగా అంగీకరించిన మీదట దైవప్రవక్త(స), అబుల్ ఆస్‌ను వదలిపెట్టడానికి ఓ షరతు పెట్టారు. ఆ షరతు ప్రకారం, అతను హజ్రత్ జైనబ్(ర)ను వదలిపెట్టడం. ఆ షరతునను సరించి అబుల్ ఆస్ ఆమె దారికి అడ్డు తొలగిపోయాడు. అప్పుడుగాని హజ్రత్ జైనబ్ (ర) హిజ్రత్ చేయలేదు. దైవప్రవక్త (స) హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర) మరియు మరో అన్సారీ సహాబీని పంపిస్తూ మీరు 'బత్న్' లేదా 'జజ్' అనే ప్రదేశంలో ఆగండి. జైనబ్ (ర) అక్కడకు రాగానే ఆమెను తోడ్కొని మదీనాకు తీసుకురండి అని ఆదేశించారు. వారిద్దరు వెళ్ళి హజ్రత్ జైనబ్‌ను మదీనాకు

తోడ్కొని వచ్చారు. హజ్రత్ జైనబ్ (ర)గారి హిజ్రత్ సంఘటన బహు బాధా కరమైనది, సుదీర్ఘమైనదీను.

యుద్ధ ఖైదీల్లో సుహైల్ బిన్ అమ్రూ అనేవాడు కూడా ఉన్నాడు. అతను మంచి వక్త కూడా. హజ్రత్ ఉమర్ (ర) అతని విషయంలో మహాప్రవక్త (స)కు ఇచ్చిన సలహా ఏమిటంటే, అతని ముందటి రెండు పళ్ళను విరగొట్టమని. తద్వారా అతని ఉచ్ఛారణ సరిగా ఉండదు, ఆపై మహాప్రవక్త (స)కు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇవ్వకుండా ఉంటాడని. కాని దైవప్రవక్త (స) ఆయన ఈ అభ్యర్థనను త్రోసిపుచ్చుతూ, ఇది 'ముస్లా' (ముఖాన్ని చెడగొట్టడం) క్రిందికి వస్తుందని, ఇలా చేసినందుకు అల్లాహ్ ప్రళయం రోజున తనను ప్రశ్నిస్తాడని చెప్పారు.

హజ్రత్ సఅద్ బిన్ నోమాన్ (ర) ఉమ్రా చేయడానికి బయలుదేరి నప్పుడు అబూసుఫ్యాన్ ఆయన్ను బందీగా చేశాడు. అబూ సుఫ్‌యాన్ కుమారుడు అమ్రూ కూడా బద్ర్ యుద్ధ ఖైదీల్లో ఉన్నాడు. అందుకని అమ్రూను అబూ సుఫ్‌యాన్‌కు అప్పజెప్పి హజ్రత్ సఅద్(ర)ను అతని చెర నుండి విడిపించుకున్నారు.

దివ్యఖుర్‌ఆన్ వాక్యాల పునర్విమర్శ

ఈ యుద్ధానికి సంబంధించే ఖుర్‌ఆన్‌లో అన్ఫాల్ అధ్యాయం (సూరా) అవతరించింది. ఇది యదార్థంగా ఈ యుద్ధం గురించి అల్లాహ్ చేసిన సమీక్ష అని చెప్పవచ్చు - ఇదే నిజమైతే ఈ పునర్విమర్శ రాజులు, కమాండర్ల విజయా లపై చేసే సమీక్షకు పూర్తిగా భిన్నమైన సమీక్ష. ఈ సమీక్షలోని కొన్ని అంశాలు ఇవి:

అల్లాహ్ మొట్టమొదట ముస్లిముల్లో మిగిలిపోయిన తప్పుల్ని, వారి నైతిక లోపాలను చూపెట్టడం జరిగింది. ఆ తప్పులు ఈ సందర్భంలో వారి ద్వారా దొరలిపోయాయి. ఈ హెచ్చరికను చేసి అల్లాహ్ వారిలో ఉన్న బలహీన తల్ని తొలగించి, సంపూర్ణ వ్యక్తిత్వం గలవారుగా మలచదలుచుకున్నాడు.

ఆ తరువాత ఈ విజయంలో అల్లాహ్ చేసిన సహాయాన్ని, పరోక్షంగా వారికి అందించిన సహకారాన్ని గుర్తుచేస్తూ, ముస్లిములు తమ ధైర్యశౌర్యాలను చూసి విర్రవీగకూడదు అని చెప్పడం. అప్పుడప్పుడు వారి మనస్సుల్లో గర్వం

ఏర్పడవచ్చు. కాబట్టి ఇక నుండి వారు అల్లాహ్‌నే నమ్ముకుని దైవప్రవక్త (స)కు విధేయత చూపుతూ ఉండాలి.

ఆ పిదప దైవప్రవక్త (స) ఏ మహోన్నతమైన లక్ష్యాలను, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ యుద్ధరంగంలో కాలిడారో, ఆ లక్ష్యాలు మరియు ఆ అవసరాలు ఏమై ఉంటాయో, అవి ఇలాంటి యుద్ధాలలో ఎలా విజయాన్ని చేకూర్చిపెడతాయో చెప్పడం జరిగింది.

ఆ తరువాత ముష్రిక్కులను, యూదుల్ని మరియు యుద్ధ ఖైదీలను సంబోధిస్తూ, వారు సత్యం ముందు వంగిపోయి దాన్నే అనుసరించాలని హితవు చెప్పడం జరిగింది.

ఆ పిదప ముస్లిములను సంబోధిస్తూ, లభించిన యుద్ధ ధన సమస్యను పరిష్కరించుకోడానికి అవసరమైన మౌలిక సూత్రాలను, విధానాలను బోధించడం జరిగింది.

అదే కాదు, ఇస్లామీయ సందేశ ప్రచారంలో అవలంబించవలసిన యుద్ధం మరియు సంధికి అవసరమైన చట్టాలను చెప్పడం జరిగింది. ఈ చట్టాలు, విధానాలను ఉపయోగించుకొని అజ్ఞానులు (అంటే ఇస్లామ్ ధర్మాన్ని కాదని తమ తాతముత్తాతల మార్గంపై నడిచేవారు) మరియు ముస్లిములలో గల తేడా ప్రస్ఫుటంగా అగుపడాలని చెప్పడం జరిగింది. నైతికతా విలువల్లో మరియు నడవడికలో ముస్లిములకే ఆధిక్యత ఉండాలి, ఇస్లామ్ కేవలం ఒక సైద్ధాంతిక మతం కాదు, ఏ సిద్ధాంతాల వైపునకు, సూత్రాల వైపునకు అయితే అది ఆహ్వానిస్తుందో దాన్ని పూర్తిగా ఆచరించి చూపెట్టే ధర్మం అని ప్రపంచానికి తెలిసిపోవాలి. అది నమ్మిన సూత్రాలకు అనుగుణంగా నడవడానికి ప్రతి ముస్లిమ్‌కు శిక్షణ కూడా ఇస్తుందని ప్రపంచం గ్రహించాలి.

ఈ అధ్యాయంలో ఇస్లామీయ చట్టానికి సంబంధించిన అనేక అధికరణలను కూడా తెలుపుతూ, దీని ద్వారా ఇస్లామీయ ప్రభుత్వ పరిధిలో నివసించే ముస్లిములకు, దానికి వెలుపల నివసించే ముస్లిములకు గల తేడా ఏమిటో విడమర్చి చెప్పడం జరిగింది.

పరోక్ష సంఘటనలు

హిజ్రీ శకం రెండులో రమజాన్ ఉపవాస దీక్ష మరియు సద్‌ఖయె ఫిత్ర్ (ఫిత్రా దానం) విధిగా చేయడం జరిగింది. అదేకాకుండా జకాత్ దానానికి సంబంధించిన పరిమాణాలు ఏమిటో తెలుపడం జరిగింది. ఫిత్రా దానం

మరియు జకాత్ చెల్లించే కనీస ఆదాయ పరిధిని నిర్ణయించడం వలన అనాథలు, నిస్సహాయులు, ముహాజిర్లు అనుభవిస్తున్న కష్టాల భారం కొంత తగ్గిపోయింది. ఎందుకంటే వీరు తమ ఉపాధిని పొందేందుకు మార్గాలులేక బాధపడుతుండేవారప్పుడు.

ఓ శుభ సందర్భంలో సంభవించిన మరో ఆసక్తికరమైన సంఘటన ఏమిటంటే, ముస్లిములు తమ జీవితంలోనే మొట్టమొదటి 'ఈద్' ఏదైతే జరుపుకున్నారో, అది షవ్వాల్ మాసం రెండవ హిజ్రీ శకంలో జరుపుకున్న ఈద్. అది బద్ర్ యుద్ధ విజయం తరువాత వచ్చిన పర్వదినం. ఎంత ఆనందమయమైనదీ ఆ సుదినం! ఆ సంతోష సమయంలోనే అల్లాహ్ వారి తలలపై విజయ కిరీటాన్ని అలంకరించింది. ఆ పండుగ వాతావరణం ఎంత ఆహ్లాదకరంగా, విశ్వాసాన్ని ఇనుమడింపజేసేదిగా ఉంది! ముస్లిములు తమ ఇళ్ళ నుండి బయటకు వచ్చి దైవనామ స్మరణ చేస్తూ ఈద్‌గాహ్‌కు వెళ్ళి ఈద్ నమాజును చేసిన ఆ దృశ్యం ఎంత ఆహ్లాదాన్ని కలిగించిందో. ఆ సందర్భంలో ముస్లిముల హృదయాలు, అల్లాహ్ ఒసగిన వరాలు, ఆయన అందిం చిన సహాయం వల్ల భారంగా అణిగిపోతున్నాయి. వారి నొసళ్ళు ఆయన కృతజ్ఞతకు భూమిపై ఆని ఉన్నాయి. అల్లాహ్ ఈ వరాన్ని గురించి ఈ ఆయత్‌లో ఇలా వివరించాడు:

وَاذْكُرُوٓا إِذْ أَنتُمْ قَلِيلٌ مُّسْتَضْعَفُونَ فِي الْأَرْضِ تَخَافُونَ أَن يَتَخَطَّفَكُمُ
النَّاسُ فَآوَاكُمْ وَأَيَّدَكُم بِنَصْرِهِۦ وَرَزَقَكُم مِّنَ الطَّيِّبَٰتِ لَعَلَّكُمْ تَشْكُرُونَ ۝

"జ్ఞాపకం తెచ్చుకోండి ఆ సమయాన్ని, అప్పుడు మీరు అల్పసంఖ్యలో ఉండేవారు, భూమి మీద మీరు దుర్బలులుగా పరిగణించబడేవారు, మిమ్మల్ని ప్రజలు రూపుమాపుతారేమో అని భయపడుతూ ఉండేవారు, తరువాత అల్లాహ్ మీకు ఆశ్రయ స్థలాన్ని సమకూర్చాడు. తన సహాయంతో మీ చేతులకు బలం చేకూర్చాడు. మీకు మంచి ఉపాధిని ఏర్పాటు చేశాడు. బహుశా మీరు కృతజ్ఞతలు చూపుతారేమోనని." (8 : 26)

'బద్ర్' తరువాయి యుద్ధ సన్నాహాలు

బద్ర్ పోరాటం ముస్లిములకు ముష్రిక్కులకు మధ్య జరిగిన నిర్ణయాత్మకమైన సాయుధ పోరాటం, ఆ పోరాటంలో ముస్లిములకు ఘనవిజయం లభించింది. దీన్ని అరేబియా మొత్తం గమనించింది కూడా. దీని దుష్పరిణామాన్ని అధికంగా అనుభవించినవారు ముష్రిక్కులు. ఎందుకంటే, ఈ యుద్ధంలో వారికే గొప్ప నష్టం వాటిల్లింది కనుక. అంతే కాకుండా ఆ తరువాత బాధపడింది యూదులు. వీరు ముస్లిముల ఆధిక్యతను, ఔన్నత్యాన్ని తమ ఆర్థిక మనుగడకు ప్రమాదంగా తలచినవారు. కాబట్టి బద్ర్ మైదానంలో ముస్లిములకు లభించిన విజయం కారణంగా వారికి విరుద్ధంగా కారాలు మిరియాలు నూరనారంభించారు. ఆ ఆగ్రహంలో ముస్లిములపై పగ తీర్చుకోవాలని ప్రయత్నం మొదలెట్టారు. దైవగ్రంథం వారి గురించి ఇలా సెలవిస్తోంది:

لَتَجِدَنَّ أَشَدَّ النَّاسِ عَدَاوَةً لِّلَّذِينَ آمَنُوا الْيَهُودَ وَالَّذِينَ أَشْرَكُوا

"విశ్వాసుల పట్ల విరోధం విషయంలో నీవు యూదులనూ, ముష్రిక్కులనూ అందరికంటే ఎక్కువ ప్రచండులుగా కనుగొంటావు." (5 : 82)

మదీనాలో కొందరు ఈ ఇరువర్గాలకు సన్నిహితులు, మిత్రులుగా ఉండేవారు. తమ గౌరవాన్ని కాపాడుకోవడానికి ఎలాంటి మార్గం కనబడకపోయేసరికి వారు, అందరికి తెలిసినట్లు బూటకపు ముస్లిములుగా మారారు. వీరు 'అబ్దుల్లా బిన్ ఉబై' మరియు అతని అనుచరగణం. వీరు కూడా ముస్లిములకు వ్యతిరేకంగా యూదులు మరియు ముష్రిక్కుల్లా లోలోన వారికి వ్యతిరేకంగా కుతకుతలాడుతున్నవారే.

వీరే కాకుండా మరో నాల్గో వర్గం కూడా ఉంది. అంటే 'బద్దూ'ల వర్గం. ఇది మదీనా పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఉండేది. వారికి ఇస్లామ్‌తో గానీ, అవిశ్వాసంతోగానీ ఎలాంటి సంబంధం లేదు. వీరు దోపిడీ దొంగలు. అందువల్ల బద్ర్ విజయం వారికీ కంటగింపుగానే ఉంది. మదీనాలో ఓ

దృఢమైన, పటిష్ఠమైన ప్రభుత్వం ఏర్పడితే వారి ఈ దారిదోపిడి మార్గం మూసుకుపోతుందనే భయం పట్టుకుంది వారికి. ఆ కారణం చేత ఇస్లామ్ అంటే వారి మనస్సుల్లో వైషమ్యం పొడసూపనారంభించింది. వీరూ ముస్లిములకు బద్ధ శత్రువులుగా మారిపోయారు.

ఇలా ముస్లిములు నలువైపుల నుండి ప్రమాదంలో చిక్కుకున్నట్లయింది. అయితే ముస్లిముల విషయంలో ఆ వర్గాల వైఖరి పూర్తిగా భిన్నంగా ఉండేది. ప్రతి వర్గం తన స్వప్రయోజనం, స్వార్థాన్నే దృష్టిలో ఉంచుకొని పని చేయనారంభించింది. కాబట్టి మదీనాలో ఉన్న వర్గం ఇస్లామ్ ధర్మం స్వీకరించి చాటుమాటుగా కుట్రలు, కుతంత్రాలు పన్ని ముస్లిముల్లో పరస్పరం మనస్పర్థలు సృష్టించనారంభించింది. యూదులకు చెందిన ఓ వర్గం బాహాటంగా ముస్లిములపై తన కోపతాపాలను ప్రదర్శించనారంభించింది. మక్కాకు చెందిన వర్గం ముస్లిముల నడ్డి విరిచేస్తామని బెదిరించనారంభించింది. ప్రతీకారాన్ని తీర్చుకోడానికి బాహాటంగా ప్రకటనలు కూడా వెలువరించింది. వీరు యుద్ధ సన్నాహాల్లో నిమగ్నమైపోయి ముస్లిములను హెచ్చరించడం ఆరంభించింది.

ఒక సంవత్సరం గడిచిందో లేదో పెద్ద సైన్యంతో మదీనాపై దండెత్తి వచ్చారు. చరిత్రలో ఆ యుద్ధం 'ఉహద్' యుద్ధం లేదా గజ్వయె ఉహద్‌గా పేరుగాంచింది. ఈ యుద్ధంలో ముస్లిముల కీర్తి బాగా దెబ్బతిన్నది.

ఈ ప్రమాదాలను ఎదుర్కోడానికి ముస్లిములు కీలకమైన నిర్ణయాలు గైకొనవలసి వచ్చింది. ఈ నిర్ణయాలలో మహాప్రవక్త (స)గారి నాయకత్వపు చతురత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. దీని ద్వారా మనకు మదీనా నాయకత్వం, తన పరిసరాలలో తలెత్తిన ప్రమాదాల గురించి ఎంత జాగరూకత వహించిందో తెలుస్తుంది. ఆ ప్రమాదాలను అడ్డుకోవడానికి ఎలాంటి ప్రణాళికలను సిద్ధం చేసిందో అవగతం అవుతుంది. వచ్చే పంక్తుల్లో ఈ వివరాలే విశదంగా చర్చించబడతాయి.

1. గజ్వయె బనీ సులైమ్ (కుద్ర్ ప్రదేశం)

గజ్వయె బద్ర్ తరువాత వేగుల వారి ద్వారా తెలిసిన మొట్టమొదటి వార్త, గత్ఫాన్ తెగకు చెందిన ఓ శాఖ బనూ సులైమ్ మదీనాపై దండెత్తడానికి

సైన్యాన్ని సమీకరిస్తోంది అన్నది. దీన్ని అణచడానికి దైవప్రవక్త (స) రెండు వందల ఉష్ట్రారోహులతో స్వయంగా వారి ప్రాంతాలపై హఠాత్తుగా విరుచుకు బడ్డారు. కుద్ర్[1] అనే ప్రదేశంలో వారి శిబిరాల వరకు చొచ్చుకు వెళ్ళారు. హఠాత్తుగా సంభవించిన ఈ పరిణామానికి బనూ సులైమ్ సైన్యంలో భయభీతులు చెలరేగాయి. హఠాత్పరిణామానికి వారు ఆ లోయలో తమ అయిదు వందల ఒంటెల్ని వదిలేసి పారిపోయారు. దైవప్రవక్త (స) అందులో ఖుమ్స్ తీసి మిగతా ఒంటెల్ని ముజాహిద్‌లలో పంచిపెట్టారు. ప్రతి వాని వాటాకు రెండు ఒంటెల చొప్పున వచ్చాయి.

ఈ యుద్ధంలో యసార్ పేరుగల ఓ బానిస దైవప్రవక్త (స) చేతికి చిక్కాడు. అతణ్ణి దైవప్రవక్త (స) స్వతంత్రుణ్ణిగా చేసి వదిలేశారు. ఆ తరువాత ఆయన(స) బనూ సులైమ్ నివాసస్థలంలో మూడు రోజులుండి మదీనా తిరిగి వచ్చేశారు.

ఈ పోరాటం హిజ్రీ శకం 2, షవ్వాల్ మాసంలో బద్ర్ నుండి తిరిగి వచ్చిన ఏడు రోజుల తరువాత జరిగిన పోరాటం. ఈ గజ్వాకు వెళ్ళేటప్పుడు దైవప్రవక్త(స) మదీనా ఆజమాయిషీని సబా బిన్ అరఫ్తాకు మరో ఉల్లేఖనం ప్రకారం, ఇబ్నె ఉమ్మె మక్తూమ్‌కు అప్పగించి వెళ్ళారు.[2]

2. దైవప్రవక్త (స)ను హతమార్చడానికి పన్నిన కుట్ర

బద్ర్‌యుద్ధంలో పరాజయంపాలైన ముష్రిక్కుల రక్తం ఉడుకెత్తి పోతోంది. మక్కా మొత్తమే కోపంతో గంగెర్లెత్తుతోంది. చివరికి మక్కాకు చెందిన ఇద్దరు యువకులు మహాప్రవక్త (స)ను అంతమొందించడానికి నిర్ణయించుకున్నారు.

బద్ర్ యుద్ధం తరువాత కొన్ని రోజుల్లోనే జరిగిన ఓ సంఘటన ఇలా ఉంది:

1. *కుద్ర్ అనేది ఓ బూడిద రంగు గల చిన్న పక్షికి పేరు. కాని ఇక్కడ బనూ సులైమ్‌కు చెందిన ఓ నీటి చెలమను కుద్ర్ అంటారు. ఇది నజద్‌లో మక్కా నుండి నజద్ నుండి సిరియాకు వెళ్ళే వ్యాపార రహదారిపై ఉంది.*
2. *జాదుల్ ముఆద్-2/90; ఇబ్నె హిషామ్-2/43,44; ముఖ్తరుస్సీరత్ - లిషేక్ అబ్దుల్లా-పుట. 236*

ఉమైర్ బిన్ వహబ్ హుమజీ - ఇతను ఖురైష్ రాక్షస మూకల్లో ఒకడు- మక్కాలో దైవప్రవక్త (స)ను, ఆయన అనుచరుల్ని నానా హింసలకు గురి చేసి ఉన్నాడు. అతని కుమారుడు వహబ్ బిన్ ఉమైర్ ఇప్పుడు దైవప్రవక్త(స)కు బందీ అయి చెరసాలలో ఉన్నాడు. ఈ ఉమైర్ ఓ రోజు తాను సుఫ్వాన్ బిన్ ఉమయ్యాతో కలసి కాబా ప్రక్కనే ఉన్న హతీమ్‌లో కూర్చుని, బద్ర్ బావిలో పడవేసిన వారి గురించిన వారి ప్రస్తావన ఎత్తగా, సుఫ్వాన్ అందుకొని, "దైవసాక్షి! వారు పోయిన తరువాత బ్రతికి ఉండడం వ్యర్థమే" అన్నాడు. దానికి ఉమైర్, "నీవు నిజమే చెబుతున్నావు. చూడు! దైవసాక్షి! నా పైన్నే రుణభారం లేకపోతే ఎంత బాగుండు. నా దగ్గర అప్పు తీర్చడానికి చిల్లి గవ్వ కూడా లేదు. నా భార్యాపిల్లలు కూడా ఉన్నారు. నా తరువాత వారి గతి ఏమవుతుందో అనే బెంగ కూడా ఉంది. ఈ ఝుంజాటాలే లేకపోతే నేను వాహనమెక్కి ముహమ్మద్ (స) దగ్గరకు వెళ్ళి ఆయన్ను చంపివేసేవాణ్ణే. నేను అక్కడికి వెళ్ళడానికి మార్గం కూడా ఉంది సుమా! నా కుమారుడు వారి ఖైదీల్లో ఉన్నాడు" అన్నాడు.

సుఫ్వాన్ ఈ మాటలను ఆసరాగా తీసుకొని, "సరే! నీ అప్పునంతా నేను తీర్చేస్తాను. నీ భార్యాపిల్లలు కూడా నా భార్యాపిల్లల్లాంటివారే. వారున్నంత కాలం వారి బాగోగుల్ని చూస్తూ ఉంటాను. నా దగ్గర ఉన్నది వారి దగ్గర ఉండకుండా ఉండదు" అన్నాడు.

"సరే, ఈ విషయం నీకు నాకు మధ్యనే రహస్యంగా ఉండాలి" అని అనగా సరే అన్నాడు సుఫ్వాన్.

ఆ తరువాత ఉమైర్ తన కత్తికి పదును పెట్టాడు. దాన్ని విషంలో ముంచి తీసుకొని బయలుదేరాడు. మదీనా వెళ్ళి మస్జిద్ ముందు తన ఒంటెను కూర్చుండబెట్టాడో లేదో హజ్రత్ ఉమర్ (ర) దృష్టి అతనిపై పడింది - ఆయన అప్పుడు ముస్లిములతో కలసి కూర్చుని బద్ర్ నాడు అల్లాహ్ బహూకరించిన గౌరవం గురించి ముచ్చటిస్తున్నారు - ఆయన ఉమైర్‌ను చూడగానే, ఈ కుక్క, దైవవిరోధి అయిన ఉమైర్ ఏదో చెడు ఉద్దేశ్యంతోనే ఇక్కడికి వచ్చాడు అన్నారు. వెంటనే మహాప్రవక్త (స) గారి దగ్గరకు వెళ్ళి, "ఓ దైవప్రవక్తా! ఈ దైవ విరోధి కరవాలాన్ని చేతబట్టుకొని వచ్చాడు చూడండి" అన్నారు. "అతణ్ణి నా వద్దకు తీసుకురండి" అని ఆదేశించారు మహాప్రవక్త (స). ఉమైర్ రాగానే

కరవాలం పిడితో సహా అతని మెడ దగ్గర పట్టుకున్నారు. ఆ తరువాత అన్సారులతో, "మీరు దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి అక్కడనే కూర్చుని ఉండండి. మహాప్రవక్త(స)ను ఈ నీచుడి బారి నుండి రక్షించడానికి సిద్ధంగా ఉండండి. ఇతను నమ్మదగినవాడు కాదు" అని చెప్పారు. అలా ఆయన ఉమైర్‌ను పట్టుకొని దైవప్రవక్త(స) దగ్గరకు లాక్కొనిరాగా, దైవప్రవక్త(స), ఉమర్(ర) కరవాలం పిడితోసహా అతని మెడను పట్టుకొనే ఉండటాన్ని చూసి, "ఉమర్, అతణ్ణి వదలిపెట్టండి, ఉమైర్ ! నీవు ముందుకురా" అని అనగా అతను ముందుకు వచ్చి, "మీరందరికీ శుభోదయం" అన్నాడు. ఇది విన్న దైవప్రవక్త(స) అతనితో, "అల్లాహ్ మాకు శుభాశ్శీసులు పలకడానికి ఇంతకంటే మేలైన పదాన్ని బహూకరించాడు. అది సలాం. ఇది స్వర్గంలో ఉండే వారికి ఇవ్వబడ్డ శుభప్రదమైన పదం" అన్నారు. తరువాత,

"ఓ ఉమైర్! నీవిక్కడికి ఎందుకు వచ్చావు?" అని అడిగారు.

"మీ చెరలో ఉన్న ఖైదీని విడిపించుకుని వెళ్ళడానికి ఇక్కడకు వచ్చాను. తమరు ఈ విషయంలో నాపై కరుణ చూపండి" అన్నాడు.

"మరి ఈ కరవాలం నీ వెంట ఎందుకు ఉంది?"

"అల్లాహ్ ఈ కరవాలాలను నాశనం చేయుగాక. ఇవి మాకు ఏమైనా పనికి వచ్చాయా చెప్పండి?"

"నిజం చెప్పు! ఎందుకొచ్చావో?" అడిగారు మహాప్రవక్త (స).

"కేవలం ఒక్క ఖైదీ కోసమే వచ్చాను" అన్నాడతడు.

"లేదు! నీవూ, సుఫ్వాన్ బిన్ ఉమయ్యా హతీమ్‌లో కూర్చోలేదా ఆనాడు? ఖురైష్ హతుల శవాలను బద్ర్ బావిలో పడవేసిన విషయం అతనితో నీవు చెప్పలేదా? పిదప నాపై రుణభారం, నా ఆలుబిడ్డలు గనకా లేకపోతే ఇక్కడినుండి మదీనాకు వెళ్ళి ముహమ్మద్‌ను హతమారుస్తాను అని చెప్పలేదా అతనితో? దీనికి సుఫ్వాన్ నీ రుణాన్ని తీర్చే బాధ్యతను, నీ ఆలుబిడ్డల్ని పోషించే పూచీని తీసుకొని నన్ను చంపమని పంపించాడు ఔనా? గుర్తుంచుకో! నాకూ నీకు నడుమ అల్లాహ్ ఉన్న సంగతి గుర్తుంచుకో" అన్నారు.

ఉమైర్ వెంటనే, "తమరు అల్లాహ్ ప్రవక్త (స) అని నేను సాక్ష్యం ఇస్తున్నాను. ఓ ప్రవక్తా! తమరు మా వద్దకు ఆకాశ వార్తలను ఏవైతే తెచ్చి

వినిపించేవారో వాటిని, తమపై అవతరించే దివ్యవాణిని మేము తిరస్కరించేవాళ్ళం. ఇది నాకూ సుఫ్వాన్‌కు నడుమ జరిగిన రహస్య ఒడంబడిక. అక్కడ మూడో వాడు మరెవ్వడూ లేడు. అందుకని దైవసాక్షి! నాకు పూర్తి విశ్వాసం ఏర్పడింది, ఈ విషయాన్ని అల్లాహ్ తప్ప మీకు మరెవ్వరూ అందించలేదని. కాబట్టి నన్ను ఇస్లామ్ ధర్మం వైపునకు మార్గం చూపుతూ ఇక్కడి వరకు తీసుకొని వచ్చిన ఆ అల్లాహ్‌కు స్తోత్రాలు" అన్నాడు. పిదప ఉమైర్ షహాదత్ కలిమా పఠించి ముస్లిం అయిపోయారు. మహాప్రవక్త (స) సహాబీలనుద్దేశించి, "మీ సోదరునికి ధర్మం ఏమిటో నేర్పండి, ఖుర్‌ఆన్ చదివించండి, అతని ఖైదీని విడిచిపెట్టండి" అని ఆదేశించారు.

ఇటు మక్కాలో సుఫ్వాన్ ప్రజలతో, "చూడండి ఓ శుభవార్త! కొద్ది రోజుల్లోనే ఓ అసాధారణ సంఘటన జరగబోతోంది. బద్ర్ యుద్ధంలో మనం అనుభవించిన కష్టాలను, నష్టాలను ఆ సంఘటన మరచిపోయేటట్లు చేస్తుంది. వేచి ఉండండి" అని చెబుతున్నాడు. వచ్చిపోయే వారిని ఉమైర్ బాబతు ఆచూకీ కూడా తెలుసుకుంటున్నాడు. చివరికి ఓ ఉష్ట్రారోహి వచ్చి ఉమైర్ ఇస్లామ్ స్వీకరించిన వివరాలను తెలుపడం జరిగింది. ఇది విన్న సుఫ్వాన్, ఉమైర్ విషయంలో ఇక తాను ఎన్నిటికీ పెదవి విప్పబోనని, ఉమైర్‌కు ఎలాంటి సహాయ సహకారాలను అందించనని ప్రతిజ్ఞ చేశాడు. హజ్రత్ ఉమైర్(ర), ఇస్లామ్ ధర్మాన్ని బాగా అధ్యయనం చేసి మక్కాకు వచ్చేశారు. అక్కడ ఉంటూ ఆయన మక్కా ప్రజల్లో ఇస్లామ్ ధర్మాన్ని ప్రచారం చేయనారంభించారు. ఆయన చేతి మీదుగా అనేక మంది ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడం జరిగింది.[3]

3. బనీ ఖైనుఖా పోరాటం (గజ్వయె బనీ ఖైనుఖా)

మహాప్రవక్త (స) మదీనాకు అరుదెంచిన తరువాత యూదులతో ఏ ఒప్పందం అయితే కుదుర్చుకోవడం జరిగిందో, ఆ ఒప్పందంలోని షరతులు ఏవో మనం వెనుకటి పుటల్లో చెప్పుకున్నవే. ఆ ఒప్పందం ప్రకారమే నడుచుకోవాలని దైవప్రవక్త (స) ఎప్పుడూ కాంక్షిస్తూనే ఉన్నారు. కాబట్టి ఇప్పటివరకు ఆ ఒప్పందాన్ని భగ్నం చేసే ఏ ప్రయత్నమూ జరగకుండా మహాప్రవక్త (స)

3. ఇబ్నె హిషామ్-1/661,662,663

ముస్లిములను నిలువరిస్తూ వచ్చారు. కాని యూదులు మాత్రం తాము చేసిన ఒప్పందంపై నిలువలేకపోయారు. వారి వైఖరే అలాంటిది మరి. యూదుల చరిత్ర పూర్తిగా విద్రోహం, అసత్యం, దగా మరియు చేసిన వాగ్దానంపై నిలకడలేని దుర్గుణాల పుట్ట. వారు త్వరలోనే తమ పురాతన వైఖరి వైపునకు మళ్ళారు. ముస్లిముల్లో కుట్రలు, కుతంత్రాలు, వారిని పరస్పరం కలహాలకు గురిచేయడం, అశాంతిని రేకెత్తించడం లాంటి కార్యకలాపాలకు పాల్పడనారంభించారు. వారి ఈ ప్రవృత్తికి ఓ మచ్చుతునక ఇది:

యూదుల ఎత్తుగడకు సంబంధించిన ఓ ఉదాహరణ

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, ఓ వృద్ధ యూదుడు 'షాష్ బిన్ ఖైస్' కరుడు కట్టిన దైవతిరస్కారి, ముస్లిములంటే గిట్టనివాడు. అతను ఓ రోజు సహాబా (ర) ఓ చోట కూర్చుని మాట్లాడుకోవడం చూశాడు. ఆ సమావేశంలో అవస్ మరియు ఖజ్రజ్ తెగలకు చెందిన వారు ఎంతో కలుపుగోలుగా మాట్లాడుకుంటున్నారు. ఆ దృశ్యాన్ని చూసిన అతనికి, అజ్ఞానకాలంలో ఆ రెండు తెగల నడుమ రగిలిన వైషమ్యం గుర్తుకు వచ్చింది. ఆ వైషమ్యానికి బదులు ఇప్పుడు వారిలో ఇస్లామ్ ధర్మం బోధించిన ప్రేమానురాగాలు, సామూహికత కానవస్తున్నాయి. వారి పాత కక్షలన్నీ మటుమాయమైపోవడాన్ని చూసి అతను ఓర్వలేకపోయాడు, అమితంగా బాధపడ్డాడు.

"ఓహో! ఇక్కడ బనూ ఖైలాకు చెందిన పెద్ద మనుషులందరూ సమైక్యంగా కూర్చుని ఉన్నారా? దైవసాక్షి! వీరి ఈ సమైక్యత వల్ల మనం ఇక్కడ మనుగడ సాగించలేం" అంటూ తనకు తోడుగా వస్తున్న ఓ యువ యూదునితో, "నీవు వారు కూర్చుని ఉన్న చోటికి వెళ్ళి వారితో పాటు కూర్చో. ఆ తరువాత బుఆస్ యుద్ధం మరియు దానికి పూర్వపు పరిస్థితులనుగూర్చి వివరించి చెప్పు. ఆ కాలంలో ఇరుపక్షాలు పలికిన బీరాలను వారికి గుర్తు చెయ్యి" అని పంపించాడు. ఆ యూద యువకుడు ఆ వృద్ధుడు చెప్పినట్లుగానే చేశాడు.

దీని ప్రభావం వల్ల అవస్ మరియు ఖజ్రజ్ తెగల్లో వాగ్వివాదం చెలరేగింది. పరస్పరం ఒకరి మాటలను ఒకరు ఖండించుకోవటం ప్రారంభించారు. వారిలో ఒకడు తమ ప్రత్యర్థుల ముందుకు వచ్చి మీరనుకుంటే ఆ

యుద్ధాగ్నిని తిరిగి రాజేద్దాం సిద్ధమేనా అని కూడా అనేశాడు. దీనికి రెండు తెగలకు పౌరుషం హెచ్చింది. సరే, దానికి మేం సిద్ధమే పదండి. హర్రా అనే ప్రదేశంలో తలపడదాం అంటూ ఆయుధాలు సమకూర్చుకుని 'హర్రా'కు బయలుదేరారు. ఓ భీకర యుద్ధం జరిగే లోపునే దైవప్రవక్త (స)కు ఈ విషయం తెలిసింది. ఆయన ముహాజిర్లను వెంటబెట్టుకొని వెంటనే ఆ ప్రదేశానికి వెళ్ళారు. వారిని సంబోధిస్తూ, "ఓ ముస్లిమ్ వర్గమా! నేను బ్రతికి ఉండగానే మీ నోట వెలువడుతున్న ఈ అజ్ఞానపు మాటలు ఏమిటి? అది కూడా, అల్లాహ్ మీకు ఇస్లామ్ లాంటి రుజుమార్గం చూపించిన తరువాతనా? ఆ ఇస్లామ్ ధర్మమే కదా మీ నుండి అజ్ఞానాన్ని తుడిచేసి మీ దైవతిరస్కార వైఖరిని మటుమాయం చేసింది? మిమ్మల్ని ఏకం చేసింది?" అని అడిగారు. ఈ మాటలు విన్న సహాబా (ర)కు, ఇది షైతాన్ పన్నిన పన్నాగమని, అతను వారిని అలా చేయడానికి పురికొల్పాడన్న విషయం అర్థం అయిపోయింది. వారు అవలంబించిన వైఖరికి పశ్చాత్తాపపడుతూ రోదించనారంభించారు. అవస్ మరియు ఖజ్రజ్ తెగవారంతా తిరిగి ఒకరినొకరు ప్రేమతో కౌగలించుకోనారంభించారు. దైవప్రవక్త (స)కు విధేయత చూపే మార్గం వైపునకు మరలిపోయారు. ఇలా అల్లాహ్ వారి శత్రువు అయిన షాష్ బిన్ ఖైస్ పన్నిన కుట్రను భగ్నం చేశాడు.[4]

యూదులు ముస్లిముల నడుమ అశాంతిని, కలహాన్ని రేకెత్తించడానికి చేసిన ప్రయత్నానికి, వారు ఇస్లామీయ సందేశ ప్రచార మార్గంలో కలిగించే అడ్డంకులకు ఇదో ఉదాహరణ. దీనికోసం వారు అనేక ప్రణాళికల్ని కూడా రూపొందించుకున్నారు. వాటిలో ముస్లిములకు వ్యతిరేకంగా అసత్య ప్రచారం చేయడం, ఉదయం ముస్లిములుగా మారి సాయంత్రం అయ్యేసరికల్లా ఇస్లామ్‌ను తిరస్కరించడం, అమాయకుల్లో అనుమానాలను రేకెత్తించడం లాంటివి కొన్ని. తాము అందించిన ఆర్థిక సాయం పొందిన వ్యక్తి ఎవరైనా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే అతణ్ణి అప్పు తీర్చమని అతని నెత్తికెత్తి కూర్చునేవారు. ఒకవేళ వారే ఓ ముస్లిముకు రుణగ్రస్తులై ఉంటే, దాన్ని ఎగగొట్టేవారు. అన్యాయంగా ఆ సొమ్మును కాజేసేవారు. ఆ అప్పును అడిగినపుడు వారు, మీరు మీ తాతముత్తాతల ధర్మంపై ఉన్నంత వరకు దాన్ని తీర్చే బాధ్యత

4. ఇబ్నె హిషామ్-1/555, 556

మాపై ఉండింది. ఇప్పుడు మీరు ఆ ధర్మాన్ని మార్చుకున్నారు కాబట్టి అది తీర్చే సమస్యే లేదు అని అనేవారు.[5]

యూదులు ఈ వైఖరిని బద్ర్ పోరాటానికి పూర్వమే అవలంబించి ఉన్నారన్న విషయం గమనించతగినది. ఇదంతా వారు మహాప్రవక్త (స)గారితో కుదుర్చుకున్న ఒప్పందానికి పూర్తిగా వ్యతిరేకమైన వైఖరి. కాని దైవప్రవక్త (స)గాని, ఆయన అనుచరగణంగాని యూదులు మార్గదర్శకత్వం పొందు తారేమో అనే ఆశతో ఈ వైఖరిని సహనంతో భరిస్తూ వచ్చారు. ఇదే కాదు, ఈ ప్రాంతంలో శాంతి విలసిల్లాలని కూడా ఆకాంక్షించేవారు.

బనీ ఖైనుఖా తెగ ఉల్లంఘించిన ఒప్పందం షరతులు

అల్లాహ్ బద్ర్ యుద్ధ మైదానంలో ముస్లిములకు గొప్ప సహాయం అందించి వారికి గౌరవం కలగజేసినందుకు వారి ఈర్ష్య, విరోధం మరింత పెరిగిపోయింది. వారు బాహాటంగా దుశ్చర్యకు దిగి శత్రుత్వాన్ని ప్రకటించు కున్నారు. బాహాటంగా విద్రోహ చర్యలను చేబడుతూ ముస్లిములను బాధింప జొచ్చారు.

ముస్లిములను బాధలకు గురిచేయడంలోను, వారి ఎడల శత్రుత్వం వహించడంలోనూ అందరికీ మిన్న అయినవాడు 'కఅబ్ బిన్ అష్రఫ్.' అతని గురించి రాబోయే పుటల్లో చర్చిద్దాం. అలాగే యూదులకు సంబంధించిన మూడు తెగల్లోనూ అన్నిటికంటే దుష్టమైన తెగ బనూ ఖైనుఖా తెగే. వీరు ఉండేది మదీనాలోనే. వారి వాడ పేరు కూడా ఆ తెగ పేరు మీదనే ఉండింది. వీరు వృత్తి రీత్యా స్వర్ణకారులు, కంచర్లు, పాత్రలను తయారు చేసేవారు. ఈ వృత్తుల కారణంగా వారి వద్ద కావలసినంత యుద్ధసామగ్రి, ఆయుధాలు ఉండేవి. వారి సైన్యం మొత్తం ఏడు వందలు. వీరందరూ మదీనాకు చెందిన పరాక్రమశీలురైన యోధులు. వారే అందరికంటే ముందు ఒప్పందాన్ని ఉల్లంఘించారు. దాని వివరణ ఇలా ఉంది:

దైవం బద్ర్ యుద్ధ మైదానంలో ముస్లిములకు ఘన విజయాన్ని చేకూర్చిపెట్టిన తరువాత వారి ఈర్ష్యా వైషమ్యాలు మరింత పెరిగిపోయాయి.

5. ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు, ఆలి ఇమ్రాన్ వగైరా సూరాల వ్యాఖ్యానాలను రాసేట ప్పుడు, యూదులు అవలంబించిన ఈ వైఖరినే వ్రేలెత్తి చూయించడం జరిగింది.

వారు తమ దుష్ట ప్రవర్తనను మరింత పెంచి అశాంత వాతావరణాన్ని సృష్టిం చారు. ఏ ముస్లిమైనా బజారులోనికి వస్తే అతణ్ణి ఎగతాళి చేసి పంపేవారు, బాధించేవారు. అంతేకాదు, ముస్లిం మహిళల ఎడల కూడా ఆకతాయిగా వ్యవహరించనారంభించారు.

పరిస్థితి మరీ విషమించి, వారి తలబిరుసుతనం మరింతగా పెరిగి నప్పుడు మహాప్రవక్త(స) వారందరినీ సమావేశపరిచి వారిని పరిపరివిధాల నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారి ఆగడాలను మానుకొమ్మని, వాటి దుష్పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొమ్మని బోధించారు. అయితే వారి ఆగడాలు మరింత పెరిగాయే కాని తగ్గలేదు.

ఇమామె అబూ దావూద్ వగైరాలు, హజ్రత్ ఇబ్నె అబ్బాస్(ర)గారి ఉల్లేఖనాన్ని ఇలా ఉటంకిస్తున్నారు:

"మహాప్రవక్త (స), ఖురైష్‌ను బద్ర్ యుద్ధంలో ఓడించి మదీనాకు అరుదెంచిన తరువాత బనీ ఖైనుఖా వాడలో వారిని సమావేశపరిచారు. వారిని సంబోధిస్తూ, "ఓ యూద వర్గమా! మీకు ఖురైషులకు పట్టిన గతి పట్టక మునుపే మీరు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించండి" అని చెప్పగా వారు, "ఓ ముహమ్మద్ (స)! మీరు ఆత్మవంచనకు పాల్పడకండి. మీరు ఎదుర్కొన్నది ఖురైషుల అమాయక సైన్యంతో. వారికి యుద్ధం ఎలా చేయాలో తెలియదు. కాబట్టి వారిని మీరు ఓడించగలిగారు. ఒకవేళ ఆ యుద్ధం మాతోనే జరిగి ఉంటే అప్పుడు తెలిసేది మా తడాకా ఏమిటో! మేము పురుషులం. మాలాంటి వారితో మీకు ఇప్పటి వరకు పనిపడలేదు" అని బీరాలు పలికారు. దీనికి సమాధానంగా అల్లాహ్ ఈ వచనాన్ని అవతరింపజేశాడు.[6]

قُلْ لِّلَّذِيْنَ كَفَرُوْا سَتُغْلَبُوْنَ وَتُحْشَرُوْنَ اِلٰى جَهَنَّمَ ۭ وَبِئْسَ الْمِهَادُ ۝۱۲
قَدْ كَانَ لَكُمْ اٰيَةٌ فِيْ فِئَتَيْنِ الْتَقَتَا ۭ فِئَةٌ تُقَاتِلُ فِيْ سَبِيْلِ اللّٰهِ
وَاُخْرٰى كَافِرَةٌ يَّرَوْنَهُمْ مِّثْلَيْهِمْ رَاْيَ الْعَيْنِ ۭ وَاللّٰهُ يُؤَيِّدُ بِنَصْرِهٖ
مَنْ يَّشَاۗءُ ۭ اِنَّ فِيْ ذٰلِكَ لَعِبْرَةً لِّاُولِي الْاَبْصَارِ ۝۱۳

6. సునన్ అబూ దావూద్ మఅ ఔనుల్ మఅబూద్-3/115; ఇబ్నె హష్షామ్-1/552

> "కనుక ఓ ప్రవక్తా! నీ సందేశాన్ని స్వీకరించడానికి నిరాకరించిన వారికి ఇలా చెప్పు: "అనతి కాలంలోనే మీరు లోబరుచుకోబడతారు. నరకం చాలా చెడ్డ నివాసం. (బద్ర్ యుద్ధ రంగంలో) మార్కొన్న ఆ రెండు వర్గాల్లో మీకు గుణపాఠ సూచన ఉండింది. ఒక వర్గం అల్లాహ్ మార్గంలో పోరాడింది. రెండోది అవిశ్వాసుల వర్గం. అవిశ్వాసులు విశ్వాసులకు రెట్టింపుగా ఉన్న విషయాన్ని చూసేవారు స్వయంగా తమ కళ్ళతోనే చూశారు. కాని అల్లాహ్ తాను ఇష్టపడ్డ వారిని తన సహాయంతో బలపరుస్తాడు (అనే విషయాన్ని యుద్ధ పరిణామం నిరూపించింది). కళ్ళున్న వారికి ఇందులో ఒక మహత్తరమైన బోధ ఇమిడి ఉంది." (3 : 12-13)

ఇటు ఈ బోధ తరువాత బనీ ఖైనుఖా యూదుల దుస్సాహసం ఇనుమడించింది. కొన్ని రోజులు గడిచీ గడువక మునుపే వారు మదీనాలో కల్లోలాన్ని, మారణకాండను సృష్టించారు. దీని ఫలితంగా వారు తాము త్రవ్వుకున్న గోతిలో తామే పడిపోయారు.

ఇబ్నె హష్షామ్ అబూ ఔన్ ఉల్లేఖనాన్ని ఇలా గ్రంథస్థం చేశారు:

"ఓ అరబ్బు మహిళ బనూ ఖైనుఖా సంతలో పాలు తెచ్చి అమ్మింది, ఆమె ఏదో పని ఉండి ఓ యూద స్వర్ణకారుని దుకాణానికి వెళ్ళి కూర్చుంది. అక్కడున్న యూదులు ఆమె ముఖంపై ఉన్న ముసుగును తొలగించే ప్రయత్నం చేశారు. కాని ఆమె దాన్ని అడ్డుకుంది. ఆ స్వర్ణకారుడు ఆమెకు తెలియకుండా ఆమె కట్టుకున్న వస్త్రాన్ని ఆమె వీపుపై వేసి కట్టి వేశాడు. ఆమె లేచి నిలబడగానే (ఆ వస్త్రం వీపుపై కట్టబడి ఉన్నందున) ఆమె రహస్యభాగాలు బయట పడిపోయాయి. యూదులందరూ గొల్లున నవ్వారు. ఆ మహిళ గగ్గోలు పెడుతూ ఉండగా ఓ ముస్లిం యువకుడు అది చూశాడు. అతను కోపాన్ని ఆపుకోలేక ఆ స్వర్ణకారుడిపై దాడి చేసి అతణ్ణి చంపేశాడు. దీనికి జవాబుగా యూదులందరూ కలసి ఆ ముస్లిం యువకునిపై విరుచుకుపడి అతణ్ణి చంపేశారు. ఆ తరువాత హతుని కుటుంబీకులు గగ్గోలు పెడుతూ యూదులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తపరుస్తూ ముస్లిములకు న్యాయం చేయమని అర్థించారు. ఫలితంగా ముస్లిములకు, బనీ ఖైనుఖా యూదులకు నడుమ కొట్లాట ఆరంభమైంది."[7]

---

7. ఇబ్నె హష్షామ్-2/47,48

ముట్టడి, లొంగుబాటు మరియు దేశ బహిష్కరణ

ఈ సంఘటన జరిగిన అనంతరం మహాప్రవక్త (స) చేసేదిలేక, మదీనా పాలనా బాధ్యతను అబూ లుబాబా బిన్ అబ్దుల్ మున్జిర్ (ర)కు అప్పగించి, హజ్రత్ హమ్‌జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌గారి చేతికి ముస్లిముల పతాకాన్ని అందించి స్వయంగా అల్లాహ్ సైన్యంతో సహా బనూ ఖైనుఖా వైపు బయలుదేరారు. వారిని చూడగానే వారు తమ కోటలో దూరి దాక్కున్నారు. మహాప్రవక్త(స) గట్టిగా ఆ కోటను చుట్టుముట్టారు. ఆ రోజు శుక్రవారం, షవ్వాల్ నెల పదిహేనవ తేది (హి.శ.2). పదిహేను రోజుల వరకు ఆ కోటను చుట్టుముట్టి వారి కోసం నిరీక్షిస్తూ ఉన్నారు (అంటే జీఖాదా చంద్ర దర్శనం అయిన రోజు వరకు అన్నమాట). ఆ తరువాత అల్లాహ్ యూదుల హృదయాల్లో భయాన్ని ముస్లిముల ఎడల అఘోరాన్ని సృష్టించాడు. అల్లాహ్ ఏ జాతికైనా అపజయాన్ని కల్గించదలుచుకుంటే, ఇలా వారి హృదయాల్లో ఓ విధమైన భయవిహ్వాలతను సృష్టించడం ఆయన సంప్రదాయం. కనుక వారు, దైవప్రవక్త (స) వారి ధన ప్రాణాలు, వారి కుటుంబాలు మరియు వారి భార్యా పిల్లల విషయంలో ఏ తీర్పు ఇస్తే దానికి తాము బద్ధులై ఉంటామని ఒప్పుకొని లొంగిపోయారు. ఆ తరువాత మహాప్రవక్త (స)గారి ఆదేశం ప్రకారం వారందరిని బంధించడం జరిగింది.

అయితే ఈ సమయంలోనే అబ్దుల్లా బిన్ ఉబైకు తన కపట నాటక మాడడానికి సమయం లభించింది. అతను మహాప్రవక్త (స)ను వారందరినీ క్షమించి వదిలేయాలని ప్రాధేయపడ్డాడు.

కావున అతను దైవప్రవక్త (స)తో, "ఓ ప్రవక్తా! నాతో ఒప్పందం కుదుర్చుకొని ఉన్న వారిని కరుణించండి" అన్నాడు - బనూ ఖైనుఖా, ఖజ్రజ్ తెగకు మిత్రపక్షంగా ఉండిన విషయం గమనార్హం - కాని మహాప్రవక్త (స) మాత్రం మాట్లాడలేదు. అతను తిరిగి ఆ విన్నపాన్నే విన్నవించుకున్నప్పుడు మహాప్రవక్త (స) ముఖం మరో వైపునకు త్రిప్పుకున్నారు. కాని అతను దైవప్రవక్త (స)గారి చొక్కా పట్టుకొన్నప్పుడు, ఆయన, "నన్ను వదిలేయి" అని అంటూ కోపాన్ని ప్రదర్శించారు. నన్ను వదిలేయి, నీవు పాడుగాను అని కసురుకున్నారు కూడా. అయినా ఆ మునాఫిక్ (కపట ముస్లిం) తన పంతాన్ని వదల్లేదు. "లేదు, నాతో ఒప్పందం కుదుర్చుకొని ఉన్నవారిని కరుణించే వరకు తమరిని

వదలిపెట్టేది లేదు. నన్ను బాగోగుల నుండి రక్షించిన ఆ నాల్గు వందల మంది యువకుల్ని మరి కవచధారులైన మూడు వందల మంది సైనికుల్ని మీరు ఒక రోజు నరికి వేయగలరు. దైవసాక్షి! రాబోవు పరిణామాలను గురించి నేను భయపడుతున్నాను" అని పదే పదే విన్నవించుకోనారంభించాడు.

చివరికి ఆ మునాఫిక్ విన్నపాన్ని మన్నించి వారిని ప్రాణాలతో వదలడానికి సిద్ధమయ్యారు దైవప్రవక్త (స) (అబ్దుల్లా బిన్ ఉబై కపట ఇస్లామ్ ధర్మం స్వీకారం చేసి ఒక నెల మాత్రమే అయింది అప్పటికి). కాని వారంతా మదీనా దరిదాపుల్లో లేకుండా వెళ్ళిపోవాలని ఆదేశించారు. కనుక ఈ యూదులు అందరూ సిరియా భూభాగంలోనికి వెళ్ళిపోయారు. కొన్ని రోజుల తరువాత అక్కడ చాలా మంది మరణించడం కూడా జరిగింది.

దైవప్రవక్త (స) వారి ఆస్తులన్నిటినీ జప్తు చేసుకున్నారు. అందులో నుండి మూడు విల్లులు, రెండు కవచాలు మరియు మూడు కరవాలాలను తన కోసం ఉంచుకున్నారు. వారి మాలె గనీమత్ (యుద్ధధనం) నుండి ఖమ్స్ కూడా తీశారు. ఈ మాలె గనీమత్ (యుద్ధధనాన్ని) ప్రోగు చేసే పని ముహమ్మద్ బిన్ ముస్లిమాకు అప్పగించడం జరిగింది.[8]

4. గజ్వయె సవీఖ్

ఓ వైపు సుఫ్వాన్ బిన్ ఉమయ్యా, యూదులు మరియు మునాఫిక్‌లు తమ తమ కుట్రలు పన్నుతూనే ఉన్నారు. మరో వైపు అబూ సుఫ్యాన్ కూడా మరో పన్నాగంలో ఉన్నాడు. దానివల్ల పని తక్కువై ప్రభావం మాత్రం అధికంగా పడాలనే కుతంత్రాలు పన్నుతున్నాడు. అతను తన జాతి గౌరవాన్ని తిరిగి నిలబెట్టి తన బలాన్ని చాటే సైనిక చర్య ఒక దాన్ని చేపట్టాలని ఎదురు చూస్తున్నాడు. అతను, ముహమ్మద్ (స)తో యుద్ధం చేయనంత వరకు భార్యతో సంభోగించనని ప్రతిజ్ఞ కూడా చేశాడు. కనుక అతడు తన ప్రతిజ్ఞను నెరవేర్చుకునే ఉద్దేశ్యంతో రెండు వందల మంది ఉష్ట్రారోహుల్ని వెంటబెట్టుకొని బయలుదేరి ఖనాత్ లోయ అంచున ఉన్న 'నైబ్' అనే ప్రదేశానికి వచ్చి అక్కడి పర్వత సానువుల్లో విడిది చేశాడు. మదీనాకు అది పన్నెండు మైళ్ళ దూరాన ఉంది. అయితే అబూ సుఫ్యాన్ మాత్రం మదీనాపై బాహాటంగా దాడి

8. జాదుల్ ముఆద్-2/71,91; ఇబ్నె హష్షామ్-2/47, 48, 49.

చేయడానికి జంకాడు. అందుకని అతను చేబట్టిన విధానం ఓ దోపిడిగాళ్ళ విధానం లాంటిది. ఈ సైనిక చర్య వివరాలు ఇలా ఉన్నాయి: అతను రాత్రి పూట బాగా చీకటి పడిన తరువాత మదీనా పరిసరాల్లో నివసిస్తున్న 'హుయయ్ బిన్ అక్తబ్' అనే యూదుని ఇంటికి వెళ్ళి తలుపుతట్టాడు. హుయయ్ రాబోయే దుష్పరిణామాలను దృష్టిలో ఉంచుకొని భయంతో అతని మాటను నిరాకరించాడు. అబూ సుఫ్యాన్ అక్కడి నుండి 'బనూ నజీర్' తెగకు చెందిన మరో సర్దారు సలామ్ బిన్ ముష్కమ్ వద్దకు వెళ్ళాడు. అతను బనూ నజీర్ తెగ కోశాధికారి. అబూ సుఫ్యాన్ లోనికి ప్రవేశించే అనుమతి కోరగా అతను అతణ్ణి సాదరంగా లోనికి పిలిచి అతిథి మర్యాదలు చేశాడు. భోజనాలే కాకుండా సారాయి కూడా అందిస్తూ పరిస్థితులేమిటో వివరించాడు. రాత్రి చివరి ఝామున అబూ సుఫ్యాన్ అతని ఇంటి నుండి బయలుదేరి తన అనుచరుల వద్దకు వెళ్ళాడు. ఓ పటాలాన్ని పంపి మదీనా పరిసర ప్రాంతంలో ఉన్న 'ఉరైజ్' అనే ఓ ప్రదేశంపై దాడి చేయించాడు. ఈ పటాలం అక్కడి కొన్ని ఖర్జూరపు చెట్లను నరికి కాల్చివేసింది. ఓ అన్సారీ మరియు అతని మిత్రపక్షానికి చెందిన ఓ వ్యక్తిని హతమార్చింది. ఆ తరువాత అబూ సుఫ్యాన్ మక్కా వైపునకు వేగంగా ప్రయాణించి పారిపోయాడు.

దైవప్రవక్త (స)కు ఈ సంఘటనా వార్త అందగానే మరింత వేగంగా అబూ సుఫ్యాన్‌ను వెంటాడారు. కాని అతను మరింత వేగంగా పరుగులంకించుకున్నాడు. కనుక వారు దైవప్రవక్త (స)కు అందలేకపోయారు. కాని తమ ఒంటెలపై ఉన్న భారాన్ని తగ్గించడానికి 'సత్తూ' (పేలపిండి), తినుబండారాలు, ఇంకా ఇతర సామగ్రిని క్రింద పడేసి పారిపోయాడు. అది ముస్లిముల చేత చిక్కింది. మహాప్రవక్త (స), 'కుద్‌కరతుల్ కద్ర్' వరకు అతణ్ణి వెంబడించి తిరిగి మదీనాకు ఆ సత్తూను, ఇతర సామగ్రిని తమ ఒంటెలపై వేసుకొని బయలుదేరి వచ్చారు. ఈ సైనిక చర్య పేరు 'గజ్వయె సవీఖ్'గా పడిపోయింది (సవీఖ్ అరబీ భాషాపదం. దానికి అర్థం పేలపిండి అని). ఈ పోరాటం బద్ర్ యుద్ధం జరిగిన రెండు నెలల తరువాత జిల్‌హజ్జా మాసం రెండవ హిజ్రీ శకంలో సంభవించింది. ఈ గజ్వాకు వెళ్ళేటప్పుడు దైవప్రవక్త (స) మదీనా పాలనా బాధ్యతను అబూ లుబాబా బిన్ మున్‌జిర్(ర) గారికి అప్పజెప్పడం జరిగింది.[9]

9. జాదుల్ ముఆద్-2/90,91; ఇబ్నె హష్షామ్-2/44,45

5. గజ్వయె జీఅమ్ర్

బద్ర్ యుద్ధం మరియు ఉహద్ యుద్ధానికి మధ్య కాలంలో జరిగిన పోరాటం ఇది. దైవప్రవక్త (స)గారి నాయకత్వంలో వెళ్ళిన అతి పెద్ద సైనిక దళం. ఇది ముహర్రం నెల, హిజ్రీ శకం మూడులో సంభవించింది.

ఈ పోరాటం జరగడానికి కారణం ఏమిటంటే, మదీనా వార్తాహరుల ద్వారా మహాప్రవక్త (స)కు, బనూ సఅలబా మరియు యుద్ధయోధుల ఓ పెద్ద సమూహం మదీనాపై దండెత్తడానికి మోహరిస్తూ ఉందని తెలియడమే. ఈ వార్త అందగానే దైవప్రవక్త (స) ముస్లిములను కూడా దానికి వ్యతిరేకంగా పోరాడడానికి సంసిద్ధం కావాలని ఆదేశమిచ్చారు. ఉష్ట్రారోహులు మరియు పదాతి దళానికి చెందిన నాల్గు వందల మంది యోధుల్ని వెంటబెట్టుకొని ఆయన బయలుదేరారు. హజ్రత్ ఉస్మాన్ బిన్ అప్ఫాన్(ర)కు మదీనా బాధ్యతలను అప్పగించారు.

మార్గమధ్యంలో సహాబా (ర), 'బనూ సఅలబా'కు చెందిన ఓ వ్యక్తిని బంధించి దైవప్రవక్త (స) గారి ఎదుట హాజరుపరిచారు. దైవప్రవక్త (స) మొదట ఇస్లామ్ సందేశాన్ని అతనికి అందించగా అతను ముస్లిం అయిపోయాడు. ఆ తరువాత ఆయన అతనిని హజ్రత్ బిలాల్(ర)కు సహచరుడుగా చేశారు. ఆ వ్యక్తి మార్గం చూపే బాధ్యతను స్వీకరించి ముస్లిములను శత్రువు భూభాగానికి చేర్చడం జరిగింది.

ఇటు శత్రువుకు మదీనా సైన్యం వస్తున్న విషయం తెలిసి అది చుట్టు ప్రక్కల కొండల్లోనికి చెల్లాచెదరైపోయింది. కాని మహాప్రవక్త (స) మాత్రం ఆగకుండా ముందుకే వెళుతున్నారు. తమ సైన్యంతో ఆయన, శత్రువు తన శిబిరం కోసం ఎంపిక చేసిన ప్రదేశానికి వెళ్ళి ఆగారు. ఒక విధంగా చెప్పాలంటే, ఆ ప్రదేశంలో ఓ నీటి చెలమ ఉంది. అది జీఅమ్ర్ పేరున పిలువబడే నీటి చెలమ. అక్కడ ఆయన, బద్దూలపై తమ ప్రభావాన్ని, శక్తిని ప్రదర్శించడానికి సఫర్ మాసం పూర్తిగా లేదా దాదాపుగా ఉండిపోయారు. ఆ తరువాత ఆయన మదీనాకు తిరిగివచ్చేశారు.[10]

10. *ఇబ్నె హిషామ్-2/46; జాదుల్ ముఆద్-2/91. ఈ గజ్వాలోనే దాసూర్ లేదా గౌరిస్ అనే సైనికుడు మహాప్రవక్త (స)ను చంపడానికి ప్రయత్నించాడని చెప్పు కోవడం జరుగుతోంది. అయితే ఈ సంఘటన మరో గజ్వాలో సంభవించిందని చెప్పడమే సరియైనది. చూడండి. సహీ బుఖారి-2/593.*

6. కఅబ్ బిన్ అష్రఫ్ సంహారం

ముస్లిములు మరియు ఇస్లామ్ ధర్మం ఎడల శత్రుత్వం వహించిన యూదుల్లో ఇతనే ప్రముఖుడు. ఇతను దైవప్రవక్త (స)ను అనేక రకాలుగా హింసించేవాడు. ఆయనకు వ్యతిరేకంగా బాహాట యుద్ధం కోసం పురికొలిపే వాడు.

ఇతను 'తై' వంశానికి చెందన 'బనూ నిబ్హాన్' తెగకు చెందినవాడు. అతని తల్లి బనీ నజీర్ తెగకు చెందిన ఆడపడుచు. ఇతను గొప్ప ధనవం తుడేకాక అరేబియాలోనే అందమైన వ్యక్తి. అదే కాదు, అతను సుపరిచితుడైన కవి కూడాను. ఇతని కోట మదీనాకు దక్షిణంగా ఉన్న బనీ నజీర్ ఆవాస ప్రాంతం వెనుక భాగంలో ఉంది.

బద్ర్ యుద్ధంలో ముస్లిములకు లభించిన విజయం మరియు ఖురైష్ సర్దారుల ఘోర పరాజయ వార్త వినగానే అతను అన్న మాటలు ఇవి:

"ఏమిటీ! నిజంగానే అలా జరిగిందా? వీరు అరబ్బుల గౌరవనీయులు మరియు అరేబియా ప్రజలకే రాజులు కదా! ఒకవేళ ముహమ్మదే వారిని ఓడిస్తే ఇక వారు ఈ భూమిపై బ్రతికి బట్టకట్టడం కంటే చనిపోయి భూమిలో ఖననం అయిపోవడమే మేలు."

ఈ వార్త పూర్తి రుజువులతో అతని ముందుకు వచ్చిన తరువాత ఈ దైవవిరోధి ముస్లిములను హజ్వ్ చేయడం (అంటే కవనంలో ముస్లిములను తూలనాడడం) మరియు ఇస్లామ్ విరోధుల్ని పొగుడుతూ, వారిని ముస్లిములకు వ్యతిరేకంగా ఉసికొల్పనారంభించాడు. అప్పటికి అతనికి సంతృప్తి కలగక ఒంటెను అధిరోహించి ఖురైషుల వద్దకు వెళ్ళి, మక్కాలో ముత్తలిబ్ బిన్ అబీ వదాఆ సహ్మీకి అతిథి అయ్యాడు. ఆ తరువాత ముష్రిక్కుల పౌరుషాన్ని, ఆత్మాభిమానాన్ని రెచ్చగొట్టి, వారి ప్రతీకారేచ్ఛను ఇనుమడింపజేస్తూ దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా యుద్ధం చేయడానికి కవన భాషలో, బద్ర్ యుద్ధంలో వారి సర్దారులు హతులై బావిలో పడవేయబడ్డ దృశ్యాన్ని చిత్రీకరిస్తూ నౌహా (హతుల గురించి రోదించే విధానం)ను ప్రారంభింపజేశాడు. మక్కాలో మకాం వేసిన కాలంలో అతనితో అబూ సుఫ్యాన్ మరియు ఇతర ముష్రిక్కులు, "మా మతం మీ దృష్టిలో మేలైనదా లేదా ముహమ్మద్ మరియు అతని అనుచరులు అవలంబిస్తున్న మతమా? మా రెండు మతాల్లో ఏ మతం రుజు

మార్గంపై ఉంది?" అని అడగనారంభించారు. దానికి కఅబ్ బిన్ అష్రఫ్, "అదేమిటీ, మీరే వారికంటే సన్మార్గంపై ఉన్నవారు. మీరు అవలంబించే మతమే వారి మతం కంటే మేలైనది" అని అన్నాడు. అతని ఈ మాటల విషయంలోనే దివ్యగ్రంథంలోని ఈ వచనం అవతరించింది.

اَلَمْ تَرَ اِلَى الَّذِيْنَ اُوْتُوْا نَصِيْبًا مِّنَ الْكِتٰبِ يُؤْمِنُوْنَ بِالْجِبْتِ وَالطَّاغُوْتِ
وَيَقُوْلُوْنَ لِلَّذِيْنَ كَفَرُوْا هٰٓؤُلَآءِ اَهْدٰى مِنَ الَّذِيْنَ اٰمَنُوْا سَبِيْلًا ﴿٥١﴾

"గ్రంథ జ్ఞానంలో కొంత భాగం ఇవ్వబడిన వారిని నీవు చూడలేదా? వారి పరిస్థితి ఎలా ఉందంటే, వారు జిబ్త్‌ను (మంత్రతంత్రాలు, జోతిష్యం, భూతవైద్యం, శకునాలు, ముహూర్తాలు వగైరా), తాగూత్‌ను (ధర్మసమ్మత మైన హద్దులను అతిక్రమించి ప్రవర్తించే ప్రతీ మనిషి తాగూత్) నమ్ముతారు. ఇంకా వారు అవిశ్వాసులను గురించి "విశ్వాసులకంటే వీరే చాలా వరకు సరైన మార్గంలో ఉన్నారు" అని అంటారు. ఇటువంటి వారినే అల్లాహ్ శపించింది. అల్లాహ్ శపించిన వాడికి సహాయం చేసేవాడు ఎవ్వడూ నీకు దొరకడు" అంటారు. (4 : 51)

ఇలా కఅబ్ బిన్ అష్రఫ్ మక్కాలో ముష్రిక్కుల మనస్సుల్లో విష బీజాలు నాటి మదీనాకు వచ్చేశాడు. వచ్చి, మహాప్రవక్త (స)గారి అనుచరుల స్త్రీలను గురించి అవమానకరమైన కవితలు అల్లి చెప్పనారంభించాడు. వారిని తన తిట్లు, దుర్భాషలతో తీవ్రంగా బాధింపసాగాడు.

ఈ పరిస్థితులను సహించలేకనే మహాప్రవక్త (స) తన అనుచరుల నుద్దేశించి, "కఅబ్ బిన్ అష్రఫ్ పని పట్టేవారు మీలో ఎవ్వరూ? అతను అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను బాధిస్తున్నాడు" అని అడిగారు.

సమాధానంగా ముహమ్మద్ బిన్ సల్మా, అబ్బాద్ బిన్ బష్ర్, అబూ నాయిలా - ఈయన మరో పేరు సల్కాన్ బిన్ సలామా కూడాను. ఆయన అష్రఫ్ బిన్ కఅబ్‌కు అతని తల్లి పాలు త్రాగడం రీత్యా సోదరుడు - హారిస్ బిన్ అవస్ మరియు అబూ అబస్ బిన్ జబ్ర్ లేచి ముందుకువచ్చారు. ఈ చిన్నపాటి కంపెనీకి కమాండరుగా ముహమ్మద్ బిన్ సల్మా నియమితులైనారు.

కఅబ్ బిన్ అష్రఫ్ హత్యకు సంబంధించిన ఉల్లేఖనాలన్నిటినీ జోడిస్తే

అతని హత్య జరిగిన తీరు ఎలాంటిదో తెలుస్తుంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:

దైవప్రవక్త (స), తమ అనుచరులనుద్దేశించి, "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)ను నొప్పించిన ఆ కఅబ్ బిన్ అష్రఫ్ పని ఎవరు పడతారు" అని అనగానే ముహమ్మద్ బిన్ సల్మా లేచి నిలబడి ఇలా విన్నవించుకున్నారు:

"దైవప్రవక్తా! నేను దానికి సిద్ధం. అతణ్ణి చంపేయమంటారా?"

"అవును" అని మహాప్రవక్త (స)అనగా, ఆయన,

"నాకు అతనితో మాట్లాడే అనుమతి ఇవ్వగలరా?"

"అవును. అతనితో సంభాషించవచ్చు" అన్నారు దైవప్రవక్త (స).

ఆ తరువాత ముహమ్మద్ బిన్ సల్మా (ర), కఅబ్ బిన్ అష్రఫ్ వద్దకు వెళ్ళారు. అతనితో మాట్లాడుతూ,

"అతను చూశావా! (అంటే దైవప్రవక్త(స) అన్నమాట) మా నుండి సదఖా వసూలు చేస్తున్నాడు. నిజం చెప్పాలంటే ఆయన మమ్మల్ని కష్టాలకడలిలో ముంచాడనుకో."

"దైవసాక్షి! ఇప్పుడేమైంది! ముందుంది ముసళ్ళ పండుగ" అన్నాడు కఅబ్.

"మేము అతనికి విధేయులమైపోయాము కాబట్టి పర్యవసానం ఏమవుతుందో చూడందే వదలిపెట్టేవాళ్ళం కాము. సరే, మీరు మాకు ఒకటి లేదా రెండు వస్కుల ధాన్యం (ఓ రకం కొలత) ఇవ్వాలి సుమా" అన్నారు.

"దానికి ఏదైనా కుదవపెట్టాలి కదా!"

"మీరు ఏం కోరుతారో చెప్పండి, కుదవబెడతాం."

"మీ స్త్రీలను నా వద్దకు పంపించి కుదవబెట్టండి."

"అదేమిటి! మేము మా స్త్రీలను మీ దగ్గర ఎలా కుదవపెట్టగలం? మీరు అరేబియాలోనే అందమైనవారు కదా?"

"సరే, మీ కుమారుల్నే కుదవబెట్టండి."

"మేము మా కుమారులను ఎలా కుదవబెడ్తాం? అలా జరిగితే మీరు ఒకటి లేదా రెండు వస్కుల ధాన్యం కోసం కుదవబడ్డవారని వారిని ఎత్తి

పొడవరా? అది మాకు సిగ్గుచేటైన విషయం అవుతుంది. ఆ ధాన్యానికి మా నుండి మీరు ఆయుధాలను పొంది కుదవబెట్టుకోవచ్చు. ఏమంటారు?" అని అడిగారు ముహమ్మద్ బిన్ ముస్లిమా.

దానికి "సరే" అన్నాడు కఅబ్ బిన్ అష్రఫ్.

ఆ పిదప వారిద్దరి నడుమ జరిగిన ఒప్పందం ప్రకారం ముహమ్మద్ బిన్ ముస్లిమా ఆయుధాలు తీసుకొని కఅబ్ దగ్గరకు వస్తారు.

ఇటు అబూ నాయిలా (ర) కూడా ఒంటరిగా కఅబ్ బిన్ అష్రఫ్ దగ్గరికి వచ్చారు. కొంతసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్న తరువాత కఅబ్ కవనాన్నీ విన్నారు. తాను కొన్ని పద్యపాదాలను అతనికి వినిపించారు. ఆ తరువాత అతనిని ఉద్దేశిస్తూ, "ఇబ్నె అష్రఫ్! నేను నీ దగ్గరకు ఓ అవసరం ఉండి వచ్చాను. దాన్ని నీ ముందుంచుతానుగాని నీవు దాన్ని రహస్యంగా ఉంచు తావని మాటివ్వాలి" అని అడిగారు.

"సరే, నేను దాన్ని రహస్యంగానే ఉంచుతాను. అదేమిటో చెప్పు" అన్నాడు.

"ఏమీ లేదు. ఆ వ్యక్తి - అంటే దైవప్రవక్త (స) - రాక మా కోసం ఓ చిక్కు తెచ్చిపెట్టింది. అరేబియా అంతా మాకు శత్రువు అయిపోయింది. అందరూ కలసి మమ్మల్ని సంహరింపజూస్తున్నారు. మాకు వేరే మార్గాలు లేవు. మా పిల్లాజెల్లా సర్వానాశనమైపోతున్నారు. మా ప్రాణాలపైకి వచ్చింది" అంటూ ముహమ్మద్ బిన్ ముస్లిమా చెప్పినట్లుగానే చెప్పారు. ఇలా మాట్లాడు కుంటూనే మరో విషయం చెప్పారు అబూ నాయిలా.

"నా వెంట ఇంకొందరు మిత్రులున్నారు. నా భావాలే వారి భావాలు కూడా. వారిని నీ వద్దకు తీసుకురాదలిచాను. వారికి కూడా ఏదైనా అమ్మి సహాయపడు" అన్నారు.

ముహమ్మద్ బిన్ ముస్లిమా మరియు అబూ నాయిలా ఈ చర్చ ద్వారా తమ లక్ష్యం నెరవేర్చుకోగలిగారు. దీని తరువాత ఇలా ఆయుధాలు మరియు సహాయకులతో రావడం వల్ల కఅబ్‌కు అనుమానం ఏమాత్రం కలగదు. ఈ ప్రాథమిక ఘట్టం పూర్తి అయిన తదుపరి 14 రబీఉల్ అవ్వల్, హిజ్రీ శకం 3న పున్నమి రాత్రి ఓ చిన్న సైనిక పటాలం మహాప్రవక్త (స) దగ్గరకు వచ్చింది.

దైవప్రవక్త (స) కూడా వారి వెంట బకీయె గర్‌ఖద్ వరకు తోడుగా వెళ్ళారు. ఆ తరువాత ఆయన వారితో, "వెళ్ళండి! బిస్మిల్లాహ్! ఓ అల్లాహ్ వీరికి సహాయ పడు!" అని దీవించి ఇంటికి తిరిగి వచ్చి నమాజు మరియు వేడుకోలులో నిమగ్నమైపోయారు.

ఇటు ఈ చిన్న పటాలం కఅబ్ బిన్ అష్రఫ్ ఉండే దివాణం గుమ్మం వరకు వెళ్ళి అబూ నాయిలా అంటూ బిగ్గరగానే అతణ్ణి పిలిచారు. ఆ పిలుపు విని అతను వారి దగ్గరకు రావాలని. లేచి నిలబడగానే క్రొత్తగా పెళ్ళి అయి వచ్చిన అతని భార్య అడ్డుకుంటూ, "మీరెక్కడికి వెడుతున్నారు? నాకు వినవచ్చే శబ్దాలను బట్టి చూస్తే ఏదో రక్తం చిందినట్లుగా అనిపిస్తోంది" అని అంది.

"ఓ అతనా, నా సోదరుడు ముహమ్మద్ బిన్ ముస్లిమా. మరొకడు నా చిన్ననాటి నాతో పాలు త్రాగిన మిత్రుడు అబూ నాయిలా" అంటూ బయటకు వచ్చేశాడు. నిలువెల్ల సువాసన పులుముకొని ఉన్నాడు. తల నుండి అత్తరు వాసన గుబాళింపు తెరలు తెరలుగా వ్యాపిస్తోంది.

అబూ నాయిలా తన అనుచరులకు ప్లానును సూచిస్తూ, "అతను బయటకు వచ్చిన తరువాత నేను అతని వెంట్రుకలు పట్టి వాసన చూస్తాను. నేను గట్టిగా అతని తల పట్టుకొని నా నియంత్రణలోనికి తీసుకోగానే మీరు అతనిపై పడి వధించాలి" అని చెప్పారు.

కఅబ్ ఇంటి నుండి బయటకు వచ్చిన తరువాత కొంతసేపు మాట్లాడు కోవడం జరిగింది, ఆ తరువాత అబూ నాయిలా ఇలా అన్నారు:

"అబూ అష్రఫ్! మనం షీబె అజూజ్ వరకు వెళ్ళి కూర్చొని ఎందుకు మాట్లాడుకో కూడదు?" అని అనగా అతను సంతోషంగా అక్కడి వరకు వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. అందరూ కలసి షీబె అజూజ్ వరకు వెడుతూ ఉన్నారు. దారిలో అబూ నాయిలా అతణ్ణి ఉద్దేశించి, "ఈ రోజు వచ్చే అత్తరు సువాసనను నేను ఎప్పుడూ ఆఘ్రాణించలేదే!" అని ఆశ్చర్యం ప్రకటించారు. ఇది విన్న కఅబ్ వక్షస్థలం గర్వంతో పొంగిపోయింది. "అదా, నా దగ్గర ఇప్పుడు అరేబియాలోనే సువాసన గల మహిళ ఉంది తెలుసా?" అని అన్నాడు.

"అనుమతిస్తే నీ తలను వాసన చూస్తాను" అన్నారు అబూ నాయిలా.

"ఎందుకు చూడకూడదు, చూడండి" అని అనగా తలలో చేయిపెట్టి తీసి తానూ వాసన చూశారు, తన వెంట ఉన్న వారికి ఆ వాసనను చూయిం చారు.

మరికొంత దూరం వెళ్ళిన తరువాత అబూ నాయిలా తిరిగి మరోసారి వాసన చూడనివ్వరా అని అడిగారు. "చూడండి, దానికేముంది?" అని అనగా, తిరిగి అబూ నాయిలా ఇది వరకు వాసన చూసినట్లే వాసన చూశారు.

ఇంకొంత దూరం వెళ్ళిన తరువాత మళ్ళీ అబూ నాయిలా అదే కోరిక కోరారు. ఈసారి కూడా అతను గర్వపడుతూ వాసన చూసుకొమ్మని తలను అందించాడు. ఈసారి అబూ నాయిలా అతని తలలో చెయ్యిదూర్చి పెట్టి గట్టిగా పట్టుకుని, "ఇడిగో అల్లాహ్ విరోధి!" అనగానే అతనిపై ఎన్నో కరవాలాలు విరుచుకుపడ్డాయి. అయినా అవి అతనిపై పనిచేయలేదు. ఇది చూసిన ముహమ్మద్ బిన్ ముస్లిమా తన పిక్కాసును అతని పొత్తికడుపుపై వేసి బలంగా గుద్దారు. అది అతని కడుపులోనికి దూరి శరీరం నుండి బయటికి వచ్చింది. ఈ దైవ విరోధి అక్కడనే అంతమైపోయాడు. ఆ దాడి జరిగినప్పుడు అతను పెట్టిన కేక చుట్టుపట్ల సంచలనం సృష్టించింది. కాగడాలు ముట్టించకుండా ఉండని ఏ కోట కూడా మిగల్లేదు (అయినా ఏమీ జరగలేదు).

ఈ చర్య సందర్భంగా హజ్రత్ హారిస్ (ర) బిన్ అవస్ గారికి కొందరు సహచరుల కరవాలపు మొన తగిలి గాయమైంది. ఆయన శరీరం నుండి రక్తం కారనారంభించింది. ఈ సైనిక పటాలం తిరిగి హుర్రయె అరీజ్‌కు చేరి చూసుకుంటే హజ్రత్ హారిస్ బిన్ అవస్ వారి వెంట లేరు. అందరూ అక్కడనే ఆగిపోయారు. కొంచెం సేపైన తరువాత ఆయన వీరి అడుగుజాడల్ని గుర్తిస్తూ అక్కడికి వచ్చి చేరారు. అక్కడ నుండి ఆయన్ను ఎత్తుకొని బకీయె గర్ఖద్ వరకు వెళ్ళి 'అల్లాహు అక్బర్' అంటూ పెద్ద పెట్టున నినదించారు. ఈ నినాదం మహాప్రవక్త (స)కు కూడా వినబడింది. వీరు అతణ్ణి చంపేశారని వెంటనే గ్రహించి ఆయన కూడా 'అల్లాహు అక్బర్' అని అన్నారు. వీరంతా కలసి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చిన తరువాత ఆయన, "ఈ ముఖాలు విజయంతో కూడుకున్న ముఖాలు" అన్నారు. వచ్చిన వారు కూడా అందుకొని, "మీ వదనం కూడాను ఓ మహాప్రవక్తా (స)!" అన్నారు. ఆ వెంటనే ఆ దైవధిక్కారి తల ఆయన ముందు ఉంచడం జరిగింది. ఆయన అతని మరణానికి అల్లాహ్‌ను

స్తుతించారు. హారిస్‌గారి గాయంపై తమ ఉమ్మిని ఊయగా ఆయనకు బాధ పోయింది. ఆ తరువాత ఆ గాయం మానిపోయింది. ఇంకెప్పుడు ఆ గాయం ఆయన్ను బాధించలేదు.[11]

ఇటు యూదులకు తమ నాయకుడు కఅబ్ బిన్ అష్రఫ్ హత్యోదంతం తెలిసినప్పుడు, వారి మొండి హృదయాల్లో భయాందోళనలు రేకెత్తాయి. శాంతి వాతావరణాన్ని భగ్నం చేస్తూ, కల్లోలాల్ని రేకెత్తించి ప్రజల్లో అశాంత వాతా వరణాన్ని సృష్టించేవారిపై, ఒప్పందాన్ని భగ్నం చేసేవారిపై, తన ప్రబోధం పనిచేయడం లేదని తెలిస్తే దైవప్రవక్త (స) బలప్రయోగం చేసి వారిని అణచడానికి వెనుకాడబోరన్న విషయం వారికి తెలిసిపోయింది. అందుకనే వారు ఆ యూద నాయకుని హత్య విషయంలో నోరు మెదపలేకపోయారు. అప్పటి నుండి దైవప్రవక్త (స)తో జరిగిన ఒప్పందానికి కట్టుబడి మిన్నకుండ ఉండిపోయారు.

ఇలా దైవప్రవక్త (స)కు మదీనాకు వెలుపల జరిగే కుట్రలను ఎదుర్కో డానికి అవకాశం లభించింది. ముస్లిములకు కూడా మదీనాలో అంతర్గతంగా పొడసూపే ప్రమాదాల నుండి కొంత ఊరట కలిగినట్లయింది.

7. గజ్వయె బహ్రాన్

దైవప్రవక్త (స) సైనిక కార్యంలో నిమగ్నమై ఉన్న ఓ పెద్ద సైన్యాన్ని తీసుకొని రబీ ఉల్ ఉఖ్రా మాసం (హిజ్రీ శకం 3)లో బహ్రాన్ పేరుగల ఓ ప్రాంతానికి బయలుదేరారు. మొత్తం సైనికుల సంఖ్య మూడు వందలు. ఇది హిజాజ్‌లో 'ఫరా' అనే ప్రదేశంలో ఉన్న ఖనిజ ప్రాంతం - రబీ ఉల్ ఉఖ్రా మరియు జమాదిల్ ఊలా రెండు నెలల వరకు అక్కడనే ఉండి పోయారు. ఆ తరువాత మదీనాకు తిరిగివచ్చారు. ఎలాంటి యుద్ధం జరగలేదు.[12]

8. సరియ్యా జైద్ బిన్ హారిసా

ఉహద్ యుద్ధానికి పూర్వం ముస్లిముల చిట్టచివరి మరియు విజయ

11. వివరాలన్నీ ఇబ్నె హిషామ్-2/51-57; సహీ బుఖారి-1/341-425, 2/577; సునన్ అబూదావూద్-2/42,43 ; జాదుల్ ముఆద్-2/91 నుండి గ్రహించబడి నాయి.
12. ఇబ్నె హిషామ్-2/50,51; జాదుల్ ముఆద్-2/91. ఈ గజ్వాకు సంబంధించిన కారణాలను నిర్ణయించడంలో అభిప్రాయ భేదాలున్నాయి. ఓ ఉల్లేఖనం

వంతమైన సైనిక చర్య ఇది. ఇది జమాదిల్ ఆఖిరా, హి.శ. 3లో సంభవించింది.

ఆ సంఘటన జరిగిన తీరు ఇది:

ఖురైషులు బద్ర్ యుద్ధం తరువాత అవమానానికీ, అసంతృప్తికీ గురి అయ్యే ఉన్నారు. కావున అంతలోనే వేసవి కాలం కూడా వచ్చేసింది. సిరియాకు వ్యాపార బిడారం వెళ్ళే సమయం కూడా ఆసన్నమైంది. కనుక వారికి మరో బెంగ పట్టుకుంది. ఈ సంవత్సరం సుఫ్వాన్ బిన్ ఉమయ్యా ఖురైష్ వర్తక బిడారం వెంట సిరియాకు వెళ్ళవలసి ఉంది. అతను ఖురైషులతో, "ముహమ్మద్(స) మరియు అతని అనుయాయులు మన వర్తక రహదారిని కష్టతరం చేసి ఉన్నారు. మనం ఎటు నుండి వెళ్ళాలో అర్థం కావడం లేదు. వారిని ఎలా ఎదుర్కోవాలో తోచడం లేదు. వారు సముద్ర తీరం వదలి ఎటూ పోవడం కూడా లేదు. అక్కడ నివసించే తెగలతో సంధి కూడా కుదుర్చుకొని ఉన్నారు. సాధారణ ప్రజలు సైతం వారి వెంటే ఉన్నారు. ఏ మార్గాన్ని అవలంబించాలో అర్థం కావడం లేదు. మనం ఇలానే ఇంట కూర్చుని ఉంటే మన అసలు సొమ్మును కూడా తినేయగలం. ఇక మనకు ఏమీ మిగలదు. మక్కాలో మన జీవన మనుగడ ఈ వ్యాపారమే మరి. వేసవిలో సిరియాకు, చలి కాలంలో అబీసీనియాకు వెళ్ళి వ్యాపారం చేయడమే మన వృత్తి కదా!" అన్నాడు.

సుఫ్వాన్ లేవనెత్తిన ఈ ప్రశ్నకు ఖురైషులు ఆలోచనలో పడిపోయారు. చివరికి అస్వద్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ సుఫ్వాన్‌ను ఉద్దేశించి, "నీవు సముద్ర మార్గం వెంట వెళ్ళే రహదారిని వదిలేసి ఇరాక్ మార్గాన బయలుదేరు" అన్నాడు- ఈ మార్గం చాలా పొడుగైనది. 'నజద్' నుండి వెళ్ళవలసి ఉంటుంది. మదీనాకు తూర్పున చాలా ఎడంగా వెళ్ళే మార్గమిది - ఖురైషులకు ఈ మార్గం గురించి

ప్రకారం, బనూ సులైమ్ తెగవారు మదీనాపై దాడి చేయడానికి మదీనా పరిసర ప్రాంతాల్లో ఓ పెద్ద సైన్యాన్ని మోహరిస్తున్నారన్న వార్త విని బయలుదేరారని, మరో ఉల్లేఖనంలో, దైవప్రవక్త (స) ఖురైష్ వర్తక బిడారాన్ని పట్టుకోడానికి బయలుదేరారని చెప్పుకోవడం జరుగుతోంది. ఇబ్నె హష్షామ్ ఈ కారణాన్నే ఉటంకించారు. ఇబ్నె ఖైమ్ కూడా దాన్నే అనుసరించారు. బనూ సులైమ్ తెగ ప్రస్తావనే అక్కడ లేదు. ఇదే సరైందని చెప్పవచ్చు కూడా. ఎందుకంటే బనూ సులైమ్ 'ఫరా' చుట్టుపట్ల కాకుండా నజద్‌లో నివాసమున్నవారు. ఇది ఫరాకు చాలా దూరాన ఉన్న ప్రదేశం.

ఏమీ తెలియదు అనేది ఇక్కడ గమనించవలసిన విషయం - అందుకని అస్వద్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్, సుఫ్వాన్‌కు సలహా ఇస్తూ, "ఫరాత్ బిన్ హయ్యాన్‌ను వెంటబెట్టుకు వెళ్ళు - అతను బక్ర్ బిన్ వాయిల్ తెగకు చెందినవాడు - అతను మార్గం చూపడానికి సహాయపడతాడు" అన్నాడు.

చివరికి ఖురైషుల వర్తక బిడారం సుఫ్వాన్ బిన్ ఉమయ్యా సారథ్యంలో క్రొత్త మార్గం గుండా బయలుదేరింది. అయితే ఈ వర్తక బిడారం ఎటు వెడుతుందో మదీనాకు వార్త అందనే అందింది. జరిగినదేమిటంటే, సులైత్ బిన్ నోమాన్ అనే వ్యక్తి రహస్యంగా ఇస్లామ్‌ను స్వీకరించి ఉన్నారు. ఆయన ఇంకా ఇస్లామ్ స్వీకరించని నుఅయిమ్ బిన్ మస్ఊద్‌తో కలసి మధుశాలలో సారా త్రాగుతున్నారు - ఇది సారాయి హరాం కాక పూర్వం నాటి మాట - నుఅయిమ్‌కు బాగా మత్తు వచ్చినప్పుడు ఆయన ఆ వర్తక బిడారం వెళ్ళే ప్లానునంతా సులైత్‌కు చెప్పేశాడు. సులైత్ ఆఘమేఘాల మీద దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి విషయమంతా చెప్పేశారు.

మహాప్రవక్త (స) వెంటనే దాడికి సిద్ధం కావలసిందిగా ముస్లిములను ఆదేశించారు. వంద మంది ఉష్ట్రారోహుల ఓ పటాలాన్ని హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర)కు ఇచ్చి పంపించారు. హజ్రత్ జైద్ (ర) ఎంతో వేగంగా ఖురైషుల వర్తక బిడారానికి ఈ విషయం తెలియకుండా పయనించి 'ఖిర్దా' అనే నీటి చెలమ వద్దకు వెళ్ళి దాడి చేశారు. హఠాత్తుగా తమపై జరిగిన ఈ దాడికి ఆ బిడారంవారు పారిపోయారు. ఆ వర్తక సామగ్రినంతా హస్తగతం చేసుకున్నారు హజ్రత్ జైద్(ర).

ముస్లిములు ఆ బిడారానికి మార్గం చూపుతున్న ఫరాత్ బిన్ హయ్యాన్‌ను మరో ఇద్దరిని కూడా బంధించారు. బిడారానికి సంబంధించిన పాత్రలు, వెండి, మరి ఇతర సామగ్రి ఖరీదు మొత్తం ఒక లక్ష దిరహమ్‌ల వరకు ఉంటుంది. ఈ యుద్ధధనం నుండి 'ఖమ్స్' తీసి దైవప్రవక్త (స) మిగిలినదాన్ని ఆ సైనిక చర్యలో పాల్గొన్న వారికి పంచిపెట్టారు. ఫరాత్ బిన్ హయ్యాన్ దైవప్రవక్త (స) గారి చేతి మీదుగా ఇస్లామ్ స్వీకరించారు.[13]

బద్ర్ అపజయం తరువాత ఇది ఖురైషుల పాలిట గొప్ప బాధాకరమైన

13. ఇబ్నె హష్షామ్-2/50,51; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/219

ఓటమి. ఇది వారి బాధను మరింత పెంచేసింది. ఇక వారి ముందు రెండే రెండు మార్గాలు మిగిలిపోయాయి. తమ గర్వాన్ని, బింకాన్ని వీడి ముస్లిములతో సంధి కుదుర్చుకోవడం ఒకటైతే, శక్తి మేరకు యుద్ధం చేసి తాము పోగొట్టుకున్న గౌరవాన్ని తిరిగి నిలబెట్టుకోవడం, ముస్లిములు తిరిగి తల ఎత్తకుండా వారిని అణచివేయడం రెండవది. మక్కా ఖురైషులు ఈ రెండవ మార్గాన్నే అవలంబించారు. ఈ సంఘటన జరిగిన తరువాత ఖురైషుల ప్రతీకారేచ్ఛ మరింత ఉగ్రరూపం దాల్చింది. ముస్లిములను, వారి స్వస్థలంలోకే చొరబడి వారిపై దాడి చేయడానికి పూర్తి సన్నాహాలు చేయడంలో నిమగ్నమైపోయారు. ఇలా గతంలో జరిగిన సంఘటనలే కాకుండా ఈ సంఘటన కూడా ఉహద్ యుద్ధాన్ని పురికొల్పడానికి కారణభూతమైంది.

ఉహద్ పోరాటం (గజ్వయె ఉహద్)

ప్రతీకారాన్ని తీర్చుకోవడానికి ఖురైష్ చేస్తున్న యుద్ధ సన్నాహాలు

మక్కావాసులు బద్ర్ యుద్ధంలో తమకు సంభవించిన ఘోర పరాజయం, తమ నాయకులు, గౌరవనీయుల సంహారం విషయంలో ఏ బాధను అయితే అనుభవిస్తున్నారో దాన్ని మరచిపోలేకపోతున్నారు. ముస్లిములకు వ్యతిరేకంగా పగ తీర్చుకోవడానికి ఒంటికాలిపై నిలబడ్డారు. ఆ ప్రతీకారాగ్ని చివరకు, ముస్లిములకు తమ బాధ తెలిసిపోతే వారు పులులైపోతారేమో అనే భయంతో హతుల గురించి ఏడ్వడం, పెడబొబ్బలు పెట్టడాన్ని కూడా అడ్డుకున్నారు. అదే కాదు, యుద్ధఖైదీలను విడిపించుకోడానికి ఫిదియా చెల్లించడంలో తొందరపడవద్దని హితవులు చేశారు. వారంతా కలసి బద్ర్ యుద్ధానికి ప్రతీకారంగా ఓ గొప్ప యుద్ధం చేసి తమ కోపాగ్నిని చల్లార్చుకుందామని నిర్ణయం తీసుకోవడం జరిగింది. అలా నిర్ణయం అయిపోగానే యుద్ధ సన్నాహాలకు నడుము బిగించారు. ఈ విషయంలో ఖురైష్ సర్దారుల్లో ఇక్రమా బిన్ అబీ జహెల్, సుఫ్వాన్ బిన్ ఉమయ్యా, అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ మరియు అబ్దుల్లా బిన్ రబీయాలు ఉత్సాహంగా పాల్గొని తతంగం నడపనారంభించారు.

ఈ యుద్ధం కోసం వారు చేసిన మొట్టమొదటి పని, బద్ర్ యుద్ధానికి దారితీసిన ఏ వర్తక బిడారన్నయితే అబూ సుఫ్యాన్ రక్షించుకొని మక్కాకు చేర్చాడో ఆ వర్తక బిడారానికి సంబంధించిన పూర్తి వర్తక సామగ్రి, యుద్ధ సామగ్రిని కొనుగోలు చేయడానికి, యుద్ధ ఖర్చుల కోసమే కేటాయించడం, మక్కా ప్రజల ఏ సరుకు అయితే ఆ బిడారం వెంట ఉందో వారిని పిలిపించి, "ఓ ఖురైష్ ప్రజలారా! మీకు ముహమ్మద్ గొప్ప దెబ్బ కొట్టాడు. మీరు ఏరి కోరిన సర్దారులందరిని చంపివేశాడు. కాబట్టి ఇప్పుడు మీరు తిరిగి యుద్ధం చేయడానికి మీ సరుకును మాకు ఇవ్వండి. బహుశా దాన్ని మేము

మీకు తీర్చేయనూ వచ్చు" అని నచ్చజెప్పగా వారంతా దానికి తమ సమ్మతిని తెలుపుకోవడం జరిగింది. కాబట్టి ఈ పూర్తి వ్యాపార సామగ్రి విలువ ఒక వెయ్యి ఒంటెలు మరియు యాభై వేల దీనార్లు. దాన్ని యుద్ధం కోసం అమ్మేయడం జరిగింది. ఈ సందర్భంగానే అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యాన్ని అవతరింపజేశాడు:

إِنَّ الَّذِيْنَ كَفَرُوْا يُنْفِقُوْنَ أَمْوَالَهُمْ لِيَصُدُّوْا عَنْ سَبِيْلِ اللّٰهِ ؕ فَسَيُنْفِقُوْنَهَا ثُمَّ تَكُوْنُ عَلَيْهِمْ حَسْرَةً ثُمَّ يُغْلَبُوْنَ ۵

"సత్యాన్ని ఒప్పుకోవడానికి నిరాకరించినవారు, తమ సంపదను ప్రజలు అల్లాహ్ మార్గం వైపునకు రాకుండా ఆపడం కోసం వ్యయపరుస్తున్నారు. ఇంకా వ్యయపరుస్తూనే పోతారు. కాని చివరకు ఈ ప్రయత్నాలే వారి దుఃఖానికి కారణభూతమవుతాయి." (8 : 36)

ఆ తరువాత స్వచ్ఛందంగా యుద్ధంలో పాల్గొనేందుకు పిలుపునిస్తూ, అహాబీష్ (నీగ్రోలు), కనానా మరియు తెహామా వారెవరైతే ముస్లిములకు వ్యతిరేకంగా పోరాడదలచుకున్నారో వారంతా, ఖురైష్ పతాకం క్రిందికి వచ్చి చేరమని ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చడానికి వారు ప్రోత్సాహం, ఆశలను రేకెత్తించేందుకు అనేక మార్గాలను అవలంబించడం జరిగింది. చివరికి, బద్ర్ యుద్ధంలో బందీ అయి, ఇక ఎన్నడూ దైవప్రవక్తకు వ్యతిరేకంగా నిలబడను అని ప్రతిజ్ఞ చేసి ఫిదియా లేకుండానే విడుదల అయిన అబూ ఉజ్జా అనే కవిని కూడా సుఫ్వాన్ బిన్ ఉమయ్యా అరబ్బు తెగలను ముస్లిములకు వ్యతిరేకంగా ఉసికొల్పమని ఆశజూపాడు. అతను అలా చేసి యుద్ధం నుండి బ్రతికి బయటపడి వస్తే అతనికి ధనసహాయం చేస్తానని, చనిపోతే అతని కుమార్తెలను సంరక్షిస్తానని మాట ఇచ్చాడు అబూ ఉజ్జా. దైవప్రవక్త (స)గారితో చేసిన ప్రతిజ్ఞను ధిక్కరించి అరబ్బు తెగల భావోద్రేకాలను, పౌరుషాన్ని, ఆత్మాభిమానాన్ని రెచ్చగొట్టే కవితలు వినిపించి వారిని యుద్ధానికి సంసిద్ధులుగా మార్చాడు. ఇలాగే ఖురైషులకు చెందిన మరో కవి ముసాఫె బిన్ అబ్దె మునాఫ్ జుహమీని కూడా ఈ కార్యం కోసం సన్నద్ధం చేశాడు.

ఇటు అబూ సుఫ్‌యాన్ గజ్వయె సవీఖ్‌లో అపజయం పొంది, ఆహార

పదార్థాలను పెద్ద మొత్తంలో నష్టపోయి తిరిగి వచ్చిన తరువాత ముస్లిములకు వ్యతిరేకంగా ప్రజల్ని రెచ్చగొట్టడంలో మరింత చురుకుదనాన్ని చూపిస్తున్నాడు.

చివరిగా జరిగిన 'సరియ్యాయె జైద్ బిన్ హారిసా' సంఘటన అయితే ఖురైషులను ఏ గడ్డు పరిస్థితులకు లోను చేసిందో, ఆర్థికంగా వారి నడ్డిని ఎంతగా విరిచిందో మనకు తెలిసిందే. దీనివల్ల వారికి కలిగిన మనస్తాపం అగ్నికి ఆజ్యం పోసింది. ఆ తరువాతనే వారు ముస్లిములతో ఓ నిర్ణయాత్మకమైన యుద్ధం చేయడానికి త్వరితగతిన సంసిద్ధులవడం మొదలుపెట్టారు.

ఖురైషుల సైన్యం, యుద్ధ సామగ్రి మరియు నాయకత్వం

ఆ సంవత్సరం పూర్తయ్యేసరికి ఖురైషుల యుద్ధ సన్నాహాలు కూడా ఓ కొలిక్కి వచ్చాయి. మక్కా సైన్యమే కాకుండా మిత్రపక్షాలైన అహాబీష్ (నీగ్రోలు)లను కలుపుకొని మొత్తం సైనిక బలం మూడు వేలకు చేరింది. ఖురైష్ నాయకులు తమ వెంట స్త్రీలను కూడా తీసుకొని వెళ్ళాలని, ఇలా వారు వెంట ఉంటే, వారి మాన పరిరక్షణా భావంతో సైనికులు మరింత తెగించి పోరాడగలరనే తలంపుతో వారిని వెంటబెట్టుకు వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. ఆ సైన్యంలో కొందరు స్త్రీలను కూడా వెంట తీసుకొని వెళ్ళడం జరిగింది. వారి సంఖ్య మొత్తం పదిహేను వందల వరకు ఉంటుంది. స్వారీ మరియు సామానులు మోయడానికి వెంట మూడు వేల ఒంటెలు, సైనికుల కోసం రెండొందల గుర్రాలు కూడా ఉన్నాయి.[1] ఈ గుర్రాలు అలసిపోకుండా ఉండడానికిగాను వాటిపై స్వారీ చేయకుండా ప్రక్కన నడిపించుకొని వెళ్ళారు. రక్షణ ఆయుధాల్లో ఏడు వందల కవచాలు కూడా ఉన్నాయి.

అబూ సుఫ్‌యాన్‌ను సైన్యానికి సర్వసైన్యాధిపతిగా నియమించడం జరిగింది. సైన్యం కమాండరుగా ఖాలిద్ బిన్ వలీద్ నియమించబడ్డాడు. ఇక్రమా బిన్ అబూ జహల్ అతనికి సహాయ కమాండరు. జెండా అక్కడి సంప్రదాయం ప్రకారం బనీ అబ్దుద్దార్ తెగ చేతికి ఇవ్వడం జరిగింది.

బయలుదేరిన మక్కా సైన్యం

యుద్ధానికి అన్ని రకాలుగా సిద్ధం అయిన మక్కా సైన్యం, ముస్లిముల

---

1. జాదుల్ ముఆద్ - 2/92; అయితే ఫత్హుల్ బారీ - 7/346లో గుర్రాల సంఖ్య మాత్రం ఒక వంద మాత్రమే చెప్పబడింది.

ఎడల కోపతాపాల్ని ప్రదర్శిస్తూ, వారికి బుద్ధిచెప్పే తలంపుతో, తమ ప్రతీకా రాగ్నిని చల్లార్చుకోవడానికి బయలుదేరింది. మునుముందు జరగబోయే ఓ భయంకర యుద్ధాన్ని ఆహ్వానిస్తుందా అన్నట్లుంది వీరి వాలకం.

మదీనాకు చేరిన వార్త

హజ్రత్ అబ్బాస్ (ర), ఖురైషుల ప్రతి కదలికను, వారి యుద్ధ సన్నాహాల్ని ఎంతో లోతుగా అధ్యయనం చేస్తూనే ఉన్నారు మక్కాలో ఉండి. ఈ సైన్యం బయలుదేరగానే ఆయన దైవప్రవక్త (స)కు వివరాలతో కూడిన ఓ లేఖను పంపించారు.

హజ్రత్ అబ్బాస్ (ర) గారి దూత ఈ వార్తను ఎంతో వేగంగా తెచ్చి మదీనాలో ఉన్న మహాప్రవక్త (స)కు అందించాడు. అతను మక్కా నుండి మదీనా వరకు గల అయిదు వందల కిలోమీటర్ల దూరాన్ని కేవలం మూడు రోజుల్లోనే అధిగమించి మదీనా చేరుకున్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) మస్జిదె ఖుబాలో ఉన్నారు.

ఈ లేఖను హజ్రత్ ఉబై బిన్ కఅబ్ (ర) దైవప్రవక్త (స)కు చదివి వినిపించారు. ఆయన (స) దీన్ని రహస్యంగానే ఉంచమని తాకీదు చేసి వెంటనే మదీనాకు వచ్చి అన్సారుల మరియు ముహాజిర్ల సర్దారులను సంప్ర దించి వారి సలహా ఏమిటని అడిగారు.

అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సిద్ధపడడం

ఆ తరువాత మదీనాలో సార్వత్రికంగా సైనిక భర్తీ ప్రారంభం అయింది. ప్రజలు సంసిద్ధులై, ఏ క్షణంలోనైనా పరిస్థితిని ఎదుర్కోడానికి ఆయుధధారులై మెలుకువగా ఉన్నారు. చివరికి నమాజు చేసే సమయంలో కూడా ఆయు ధాలను వారు తమ నుండి వేరు చేయలేదు.

ఇటు అన్సారులకు చెందిన ఓ చిన్న దళం దైవప్రవక్త (స) సంరక్షణ కోసం నియమించబడింది. అందు హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్, ఉసైద్ బిన్ హుజైర్ మరియు సఅద్ బిన్ ఉబాద్ (ర)లు ఉన్నారు. వీరు ఆయుధధారులై రాత్రంతా మహాప్రవక్త (స) గారి గుమ్మం ముందు పహరా కాచేవారు.

మరికొన్ని దళాలు, ఏమరుపాటుగా ఉన్న సమయంలో శత్రువు మదీనాలో చొరబడి దాడి చేస్తాడనే శంకతో మదీనాలో ప్రవేశించే అన్ని మార్గాలపై నియమించబడ్డారు.

ఇంకొన్ని సైనిక దళాలు శత్రువు కదలికలను పసిగట్టడానికి, శత్రువు మదీనాపై దాడి చేసే ఆస్కారం ఉన్న ప్రతి మార్గంపై గస్తీ తిరుగుతూ ఉన్నాయి.

మదీనా ముంగిట నిలిచిన మక్కా సైన్యం

మక్కా సైన్యం అందరికీ తెలిసిన వ్యాపార మార్గం గుండా పయని స్తోంది. 'అబ్వా' అనే ప్రదేశానికి చేరిన వెంటనే అబూ సుఫ్‌యాన్ భార్య 'హింద్ బిన్తె ఉత్బా', దైవప్రవక్త (స) గారి మాతృమూర్తి సమాధిని పెకిలించి వేయాలనే సలహా ఇచ్చింది. అయితే అలా చేయడం వల్ల ఎదురయ్యే దుష్పరి ణామాల్ని దృష్టిలో ఉంచుకొని ఖురైష్ సర్దారులు ఆమె సలహాను త్రోసి పుచ్చారు. ఆ సైన్యం అలా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఎట్టకేలకు మదీనా దాపున ఉన్న వాదియె అతీక్ (అతీక్ లోయ) ప్రక్కగా సాగింది. ఆ తరువాత కొంత కుడి ప్రక్కగా మళ్ళీ ఉహద్ కొండ దాపున 'అయినైన్' పేరుగల ప్రదే శంలో విడిది చేసింది. ఈ ప్రదేశం మదీనాకు ఉత్తరంగా ఉన్న 'ఖనాత్' అనే ఊసర క్షేత్రం. ఆ రోజు శుక్రవారం. షవ్వాల్ నెల 6వ తేది. హిజ్రీ శకం 3.

మదీనాను సంరక్షించేందుకు సలహా సంఘ సమావేశం

మదీనా వేగులు మక్కా సైన్యానికి చెందిన ఒక్కొక్క వార్తను మదీనాకు చేరవేస్తున్నారు. సైన్యం విడిది చేసిన స్థలం గురించిన చివరి సమాచారం కూడా దైవప్రవక్త (స)కు అందింది. ఈ సమాచారం అందగానే దైవప్రవక్త (స) సైనిక హైకమాండ్‌కు చెందిన సలహా సంఘాన్ని సమావేశపరచి, సరియైన విధానాన్ని అవలంబించడానికి వారి సలహాలను అడిగారు. మహాప్రవక్త (స) తాను కన్న ఓ కలను ప్రస్తావిస్తూ, "దైవసాక్షి! నేను ఓ ఉత్తమమైన దృశ్యాన్ని చూశాను. ఆ దృశ్యం ఏమిటంటే, కొన్ని ఆవులు జిబహ్ చేయబడుతున్నాయి. అలానే నా కరవాలం చివర కొంత మొక్కవోయి ఉంది. నేను నా చేతిని ఓ సురక్షితమైన కవచంలో దూర్చడం చూశానన్నారు. మహాప్రవక్త (స) ఆవులు జిబహ్ చేయబడిన దృశ్యానికి అర్థం చెబుతూ, "కొందరు సహాబాలు

హతులవుతారని, కరవాలం మొక్కబోవడమంటే తన కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి షహీద్ అవుతాడని (అమరగతి నొందుతాడని), సురక్షిత కవచానికి మదీనా నగరమని" అర్థం చెప్పారు.

పిదప ఆయన (స), సహాబా (ర) గార్లకు డిఫెన్సు చేసే విధానాన్ని సూచిస్తూ ఓ సలహా ఇచ్చారు. దాని ప్రకారం, మదీనా నుండి బయటకు వెడలకుండా లోనే ఉండి కాచుకోవాలని, ముష్రిక్కులు వారి శిబిరాల్లోన్నే ఉండిపోతే అది వారికి లక్ష్యాన్ని నెరవేర్చజాలదు మరియు వారు అక్కడనే ఉండిపోవడం వారికి చేటుతెస్తుంది. అలా కాకుండా వారే మదీనా నగరంలో చొరబడి వస్తే ముస్లిములు వారిని సందుగొందుల మూలల్లో నిలువరించి యుద్ధం చేసి చంపేయవచ్చు, స్త్రీలు ఇళ్ళ కప్పులపై నుండి వారిపై రాళ్ళ వర్షం కూడా కురిపించవచ్చు అని అన్నారు. ఇదే సరియైన సలహా కూడా. ఈ సలహాతో మునాఫిక్‌ల నాయకాగ్రేసరుడైన అబ్దుల్లా బిన్ ఉబై కూడా ఏకీభవించాడు. అతను ఖజ్రజ్ తెగ తరపున సమావేశానికి హాజరైన ప్రతినిధి. అయితే, అతను ఈ సలహాతో ఏకీభవించడానికి గల కారణం, యుద్ధవ్యూహం దృష్ట్యా ఇదే సరైన సలహా అని మాత్రం కాదు. అతని ధ్యేయం మాత్రం వేరు. అతను యుద్ధానికి దూరంగా ఉండాలని, ఎవరి కంటబడకుండా ఉండాలన్నదే అది. కాని అల్లాహ్ చేయదలుచుకున్నది మాత్రం మరొకటి. ఆయన తలచుకున్నది, ఈ వ్యక్తి తన మిత్రులతో సహా అందరి ముందు అగౌరవంపాలు కావాలన్నదే. వారి దైవతిరస్కార వైఖరి, కపట నాటకంపై పడి ఉన్న తెర తొలగిపోయి, సంకట సమయంలో వీరు ఎంత ద్రోహానికి పాల్పడతారో ముస్లిములకు తెలిసిరావాలన్నదే.

కనుక బద్ర్ యుద్ధంలో పాల్గొనకుండా మదీనాలోనే ఉండిపోయిన కొందరు ప్రవక్త (స)గారి అనుచరులు మాత్రం మదీనా నగరాన్ని వదలి బయట మైదానంలో వారిని మార్కొనాలని సలహాలిచ్చారు. వారు తమ ఈ సలహాపై గట్టిగా అమలు చేస్తూ దైవప్రవక్త (స)ను బలవంతపెట్టనారంభించారు. వారు ఆయన్ను అభ్యర్థిస్తూ, "ఓ దైవప్రవక్తా! మేము ఈ రోజు కోసమే ఎదురు చూసేవాళ్ళం. దైవాన్ని ఇలాంటి అవకాశం కల్పించమని వేడుకునేవారం. ఇప్పుడు అల్లాహ్ మాకు ఈ అవకాశాన్ని కల్పించాడు. యుద్ధ రంగంలోనికి వెళ్ళే సమయం కూడా ఆసన్నమైంది. తమరు శత్రువును

ఢీకొనడానికి బయలుదేరండి. అలా జరగకపోతే శత్రువులు మనం భయపడి పోయామని అనుకుంటారు" అని అన్నారు.

యుద్ధోత్సాహంతో ఉరకలేసే ఈ వ్యక్తుల్లో దైవప్రవక్త (స) గారి పిన తండ్రి హజ్రత్ హమ్‌జా(ర) ప్రముఖ పాత్రను పోషించారు. ఆయన బద్ర్ యుద్ధంలో తన ఖడ్గ నైపుణ్యాన్ని ప్రదర్శించినవారు. ఆయన దైవప్రవక్త(స) ఎదుట ప్రమాణం చేస్తూ, "ఓ ప్రవక్తా! ఎవరైతే తమరిపై గ్రంథాన్ని అవతరింపజేశాడో ఆ దైవసాక్షిగా చెబుతున్నాను, మదీనాకు వెలుపల నా కరవాలం ఝుళిపించనంత వరకు ఏమీ తినేదే లేదు."[2]

మహాప్రవక్త (స), చాలా మంది చేసిన బలవంతం మీద తన సలహాను రద్దు చేసుకోవడం జరిగింది. మదీనా నుండి బయటకువచ్చే శత్రువుతో ఢీకొనాలనే చివరి తీర్పు వెలువడింది.

ఇస్లామీయ సేన క్రమబద్ధీకరణ - యుద్ధరంగానికి బయలుదేరడం

ఆపై దైవప్రవక్త (స) జుమా నమాజు చేయించినప్పుడు వారికి హితోపదేశం చేశారు. అవిరామ కృషి సల్పమని ప్రోత్సహించారు. సహనం, స్థైర్యం ద్వారానే ఆధిక్యత సంపాదించగలమని చెబుతూ, శత్రువుకు వ్యతిరేకంగా సంసిద్ధులుకండని ఆదేశించారు. ఇంకేముంది ప్రజల్లో ఆనందాతిరేకం వెల్లివిరిసినట్లయింది ప్రవక్త (స) గారి ఉద్బోధతో.

మహాప్రవక్త (స) అసర్ నమాజు చేసేటప్పటికి ప్రజలు ఓ చోటికి చేరిపోయారు. అంతలోనే 'అవాలీ' అనే ప్రదేశానికి చెందినవారు కూడా వీరిలో వచ్చి చేరారు. నమాజు చేసిన తరువాత దైవప్రవక్త (స) తన ఇంటిలోనికి ప్రవేశించారు. ఆయన వెంట హజ్రత్ అబూ బక్ర్(ర) మరియు ఉమర్ (ర)లు కూడా ఉన్నారు. వారిద్దరు దైవప్రవక్త (స) తలపై అమామా కట్టి వస్త్రాలను తొడిగారు. మహాప్రవక్త (స) క్రింద ఒకటి, పైన ఒకటిగా ఒకదానిపైఒకటి రెండు కవచాలను ధరించారు. కరవాలాన్ని కట్టుకుని ఆయుధధారులై ఆయన కోసం వేచిచూస్తున్న వారి ముందుకు వచ్చేశారు.

ప్రజలు ఆయన(స) కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈలోపు హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) మరియు ఉసైద్ బిన్ హుజైర్(ర)లు ప్రజలను

---

2. సీరతె హల్‌బియా-2/14

ఉద్దేశించి, "మీరు దైవప్రవక్త(స)ను యుద్ధమైదానానికి బయలుదేరడానికి బలవంతం చేశారు. వ్యవహారాన్ని ఆయనకే వదలిపెట్టాలిగాని బలవంతపెట్ట కూడదు" అని అనగా ప్రజలు సిగ్గుపడ్డారు. మహాప్రవక్త (స) బయటకు రాగానే, "మహాప్రవక్తా (స)! మేము మీతో విభేదించవలసింది కాదు. తమకు ఇష్టమైనట్లే కానివ్వండి" అని అభ్యర్థించనారంభించారు. దీనికి దైవప్రవక్త (స), "ఏ ప్రవక్త అయినా ఆయుధధారుడైనప్పుడు, అల్లాహ్ ఆయనకు ఆయన శత్రువుకు నడుమ తీర్పు చేసేటంత వరకు ఆయుధాలను తొలగించడం సబబు కాదు" అని బదులిచ్చారు.[3]

ఆ తరువాత మహాప్రవక్త (స) సైన్యాన్ని మూడు భాగాలుగా విభజించారు.

1. **ముహాజిర్ల పటాలం:** దీని పతాకాన్ని హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ అబ్దరీ (ర)కు అందజేశారు.
2. **అవస్ తెగ (అన్సార్ల) పటాలం:** ఈ పటాలానికి సంబంధించిన జెండాను హజ్రత్ ఉసైర్ బిన్ హుజైర్ (ర)గారి చేతికందించారు.
3. **ఖజ్రజ్ తెగ (అన్సార్) పటాలం:** దీని జెండాను హబ్బాబ్ బిన్ మున్జిర్ (ర)కు అప్పజెప్పారు.

సైన్యం పూర్తి సంఖ్య ఒక వేయి మంది యోధులతో కూడుకొని ఉంది. వారిలో ఒకే ఒక కవచధారుడు, యాభై మంది గుర్రపు రౌతులున్నారు.[4] మరో ఉల్లేఖనంలో గుర్రపు రౌతే లేడని ఉంది.

హజ్రత్ ఇబ్నె ఉమ్మెమక్తూమ్ (ర)కు మదీనాలో ఉన్నవారికి నమాజు చేయించే పనిని అప్పగించారు. ఆ తరువాత సైన్యం బయలుదేరే ఆదేశం ఇవ్వబడింది. ఇస్లామీయ సైన్యం ఉత్తర దిశ వైపునకు బయలుదేరింది.

---

3. ముస్నదె అహ్మద్, నిసాయి, హారిమ్-ఇబ్నె ఇస్హాక్
4. ఈ విషయం ఇబ్నె ఖైమ్ జాదుల్ ముఆద్-2/92లో చెప్పింది. హాఫిజ్ బిన్ హిజ్ర్ ఇది పెద్ద పొరపాటని అంటారు. మూసా బిన్ అక్బా పూర్తి నమ్మకంగా చెప్పిన విషయం ఏమిటంటే, ముస్లిముల వద్ద ఉహద్ యుద్ధం సందర్భంగా ఏ ఒక్క గుర్రమూ లేదన్నది. వాఖిదీ కథనం ప్రకారం, రెండే రెండు గుర్రాలున్నాయని, వాటిలో ఒకటి దైవప్రవక్త (స) గారి వద్ద మరొకటి అబూ బర్దా(ర)గారి దగ్గర ఉంది. -ఫత్హుల్‌బారి-7/350

హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) మరియు సఅద్ బిన్ ఉబాదా (ర)లు కవచధారులై దైవప్రవక్త (స)గారికి ముందు నడుస్తున్నారు.

'సనీయతుల్ వదా' అనే ప్రదేశానికి చేరగానే ఓ సైనిక దళం, ఎంతో మేలైన ఆయుధాలు ధరించి ఇస్లామీయ సైన్యానికి పూర్తిగా ఎడంగా ఉన్నట్లు అగుపడింది. దైవప్రవక్త (స) దాన్ని చూసి, "ఇదేమి సైన్యం?" అని అడిగారు. వీరు ఖజ్రజ్ తెగకు మిత్రపక్షమైన యూదులు[5]అని, వీరు ముష్రిక్‌లకు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొనడానికి వచ్చారని చెప్పడం జరిగింది.

"వీరు ఇస్లాం స్వీకరించారా?" అని అడిగారు దైవప్రవక్త (స).

"లేదు, ఇంకా ఇస్లామ్ స్వీకరించలేదు" అని కొందరు పలకగా దైవప్రవక్త (స), "బహుదైవారాధకులతో జరుగుతున్న యుద్ధంలో మనం దైవతిరస్కారుల మద్దతు పొందకూడదు" అని వారి సాయాన్ని నిరాకరించారు.

సైన్యాన్ని మరోమారు పరికించిన మహాప్రవక్త (స)

షైకాన్ అనే ప్రదేశానికి చేరిన తరువాత దైవప్రవక్త (స) తన ఇస్లామీయ సేనను మరోసారి పరికించి చూశారు. మరీ వయసు తక్కువగా ఉన్నవారు మరియు యుద్ధానికి పనికిరానివారిని ఏరి వెనక్కు పంపించారు. ఆ వెనక్కు పంపించిన వారిలో హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (ర), ఉసామా బిన్ జైద్(ర), అసీద్ బిన్ జహీర్ (ర) మరియు సఅద్ బిన్ హబ్బా (ర)లు ఉన్నారు. ఈ జాబితాలోనే హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (ర) పేరు కూడా ఉంది అని చెప్పు కోవడం జరుగుతోంది. కాని సహీ బుఖారిలో ఉల్లేఖించబడిన ఉల్లేఖనం ద్వారా ఆయన బద్ర్ యుద్ధంలో పోరాడారని ఉంది.

కాని పిన్న వయస్కులైనప్పటికీ హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (ర) మరియు సమా బిన్ జుందుబ్ (ర)లు ఈ యుద్ధంలో పాల్గొనే అనుమతి పొందారు. విషయం ఏమిటంటే, హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (ర) ఓ మంచి విలుకాడు. అందుకని ఆయనకు అనుమతి లభించింది. ఆయనకు అనుమతి లభించ గానే, హజ్రత్ సమ్రా బిన్ జుందుబ్ (ర) అందుకొని నేను రాఫె కంటే బలవం

---

5. ఈ సంఘటన ఇబ్నె సఅద్ ఉల్లేఖించినది. ఇందు వీరు బనీ ఖునైఖాకు చెందిన యూదులని కూడా ఉంది(2/34). కాని ఇది సరియైనది కాదు. ఎందుకంటే బనీ ఖునైఖాను బద్ర్ యుద్ధం తరువాత కొన్ని రోజులకే దేశ బహిష్కరణ చేయడం జరిగింది.

తుణ్ణి, అతణ్ణి నేను ఎత్తి క్రిందపడవేయగలను అని అన్నారు. దైవప్రవక్త(స)కు ఈ మాట చెప్పగా ఆయన (స) వీరిద్దరినీ కుస్తీ పట్టించండి అని ఆదేశించారు. నిజంగానే సమ్రా రాఫెను క్రిందపడవేయగలిగారు. కాబట్టి ఆయనకు కూడా యుద్ధంలో పాల్గొనే అనుమతి లభించింది.

ఉహద్ మరియు మదీనాకు నడుమ రేయి గడపడం

ఇక్కడనే ప్రొద్దుగ్రుంకింది. కాబట్టి దైవప్రవక్త (స) అక్కడనే మగ్రిబ్ నమాజు ఆ తరువాత ఇషా నమాజు చేశారు. ఈ ప్రదేశంలోనే రాత్రి గడిపేందుకు తీర్మానించుకున్నారు. పహరా కోసం యాభై మంది సహాబా(ర)లు ఎంపికయ్యారు. వీరు శిబిరం చుట్టూ తిరిగి పహరా కాచారు. ఈ పహరా దళానికి సారథి ముహమ్మద్ బిన్ ముస్లిమా (ర) అన్సారీ, ఈయన కఅబ్ బిన్ అష్రఫ్‌ను అంతమొందించిన సైనిక పటాలానికి సారథిగా ఉండినవారు. ఊక్వాన్ బిన్ అబ్దుల్లా బిన్ ఖైస్(ర) మహాప్రవక్త (స)కు దాపుగా ఉండి పహరా కాచారు.

అబ్దుల్లా బిన్ ఉబై మరియు అతని అనుచరుల విద్రోహ చర్య

మహాప్రవక్త (స) ఫజ్ర్ నమాజుకు కొంత ముందే లేచి మళ్ళీ బయలుదేరారు. షౌత్ అనే ప్రదేశానికి చేరి అక్కడ ఫజ్ర్ నమాజు చేశారు. ఇప్పుడు శత్రువు దరిదాపులకు చేరినట్లయింది. ఒక వర్గం మరో వర్గాన్ని బాగా చూడగలుగుతోంది. ఇక్కడకు చేరగానే అబ్దుల్లా బిన్ ఉబై విద్రోహం తలపెట్టాడు. దాదాపు మూడింట ఒక వంతు సైనికుల్ని తీసుకొని, "అనవసరంగా మేమెందుకు ప్రాణాలను అర్పించాలి" అంటూ వెళ్ళిపోనారంభించాడు. తాను వెళ్లిపోతూ, దైవప్రవక్త (స) నా మాట వినలేదని, ఇతరుల మాట విని మదీనా వదిలారని నిరసన కూడా వ్యక్తపరిచాడు.

అతను వేరుబడడానికి కారణం యదార్థంగా, దైవప్రవక్త (స) అతని మాట వినలేదనేందుకు కాదు, అలా అయితే దైవప్రవక్త (స)గారి సేనతో కలసి ఇక్కడి వరకు వచ్చే ఆస్కారమే ఉండకపోయేది. అతను బయలుదేరిన వెంటనే అలా చేసేవాడు. కాని అలా జరగలేదు. అసలు యదార్థం ఏమిటంటే, ఈ క్లిష్టపరిస్థితిలో వేరుబడి ఇస్లామీయ సేనలో భయోత్పాతాన్ని సృష్టించడం అతని ఉద్దేశ్యం. అతను శత్రుసేన కదలికలను గమనించి తాను వెనక్కు

వెళ్ళిపోవడం వలన సాధారణ సైనికులు ప్రవక్త (స)ను విడిచిపెట్టి వెనక్కి మరలిపోవాలని, మిగిలిన వారి ధైర్యం సన్నగిల్లిపోవాలన్నదే. అంతే కాకుండా మరో వంక ఈ పరిస్థితిని చూసి శత్రు సైనికుల సాహసం మరింత పెరిగి వారు యుద్ధంలో విజయం పొందాలన్నదే. కాబట్టి ఈ ప్రవర్తన, మహాప్రవక్త(స) మరియు ఆయన అనుచరగణాన్ని అంతమొందించే ఓ రకమైన ఎత్తుగడే అనాలి. ఈ కపటి, ఆ తరువాత తనకు, తన మిత్రబృందానికి మదీనా పెత్తనం చెలాయించే అవకాశం లభిస్తుందని తలచడమే.

ఈ మునాఫిక్ మాటలు విని మరి రెండు వర్గాలు అంటే అవస్ తెగకు సంబంధించిన బనూ హారిసా మరియు ఖజ్రజ్ తెగకు సంబంధించిన బనూ సల్మా వారు కూడా వెనక్కు మరలడానికి సిద్ధపడ్డారు. కాని అల్లాహ్, ఈ రెండు వర్గాల్లో చోటు చేసుకున్న భయోత్పాతాన్ని తొలగించి ఆదుకోవడం జరిగింది. వారు తమ నిర్ణయాన్ని మార్చుకొన్నారు. వారి గురించే అల్లాహ్ దివ్యగ్రంథంలో ఇలా సెలవిస్తున్నాడు:

اِذْ هَمَّتْ طَّآئِفَتٰنِ مِنْكُمْ اَنْ تَفْشَلَا ۙ
وَاللّٰهُ وَلِيُّهُمَا ۗ وَعَلَى اللّٰهِ فَلْيَتَوَكَّلِ الْمُؤْمِنُوْنَ ۝

"మీలోని రెండు వర్గాలు పిరికితనం చూపడానికి సిద్ధపడిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. వాస్తవానికి అల్లాహ్ వారికి సహాయంగా అక్కడ ఉన్నాడు. విశ్వాసులైన వారు అల్లాహ్‌నే నమ్ముకోవాలి." (3 : 122)

ఏది ఏమైనా మునాఫిక్‌లు వెనక్కు మరలే నిర్ణయం గైకొనగానే ఈ క్లిష్టపరిస్థితిలో హజ్రత్ జాబిర్ (ర)గారి తండ్రి హజ్రత్ అబ్దుల్లా బిన్ హిరామ్ (ర) వారికి వారి బాధ్యత ఏమిటో గుర్తు చేశారు. వారిని హెచ్చరిస్తూ వెనక్కు మరలమని వారి వెంటే కొంత దూరం నడిచారు. అలా నడుస్తూనే, "రండి! దైవమార్గంలో పోరాడండి లేదా రక్షణకు నిలబడండి" అన్నారు. కాని వారు దానికి సమాధానమిస్తూ, "మీరే గనక యుద్ధం చేస్తారని అనుకుంటే మేము వెనక్కు మరలేవారం కాము" అన్నారు. ఈ సమాధానం విన్న హజ్రత్ అబ్దుల్లా బిన్ హిరామ్ (ర), "ఓ దైవ విరోధుల్లారా! మీపై అల్లాహ్ శాపం పడుగాక. గుర్తు రాసుకోండి! అల్లాహ్ తన ప్రవక్త (స)కు మీ అవసరం లేకుండానే చేస్తాడు" అని వెనక్కు మరలి వచ్చారు.

ఈ మునాఫిక్‌ల గురించే అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు:

وَلِيَعْلَمَ الَّذِيْنَ نَافَقُوْا ۖ وَقِيْلَ لَهُمْ تَعَالَوْا قَاتِلُوْا فِيْ سَبِيْلِ اللّٰهِ اَوِ ادْفَعُوْا ۭ قَالُوْا لَوْ نَعْلَمُ قِتَالًا لَّا اتَّبَعْنٰكُمْ ۭ هُمْ لِلْكُفْرِ يَوْمَىِٕذٍ اَقْرَبُ مِنْهُمْ لِلْاِيْمَانِ ۚ يَقُوْلُوْنَ بِاَفْوَاهِهِمْ مَّا لَيْسَ فِيْ قُلُوْبِهِمْ ۭ وَاللّٰهُ اَعْلَمُ بِمَا يَكْتُمُوْنَ ۝

"ఆ కపటులతో, "రండి, అల్లాహ్ మార్గంలో యుద్ధం చేయండి లేదా కనీసం (మీ నగరాన్నయినా) రక్షించుకోండి" అని అన్నప్పుడు వారు ఇలా అన్నారు; "ఈ రోజు యుద్ధం జరిగి ఉంటుందని మాకు తెలిసి ఉన్నట్లయితే మేము తప్పకుండా మీతోపాటు వచ్చి ఉండేవారము." ఈ మాటలు అంటున్నప్పుడు వారు విశ్వాసానికంటే అవిశ్వాసానికే చేరువగా ఉన్నారు. వారు తమ హృదయాలలోలేని మాటలను తమ నోటితో అంటారు. వారు తమ హృదయాలలో దాస్తున్న దానిని గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు." (3 : 167)

తక్కిన ఇస్లామీయ సేన ఉహద్ ముంగిట్లో

ముస్లిములకు విద్రోహం తలపెడుతూ వారు వెనక్కు వెళ్ళిపోయిన తరువాత మహాప్రవక్త (స) మిగిలిన ఇస్లామీయ సేనను వెంటబెట్టుకొని శత్రువు వైపునకు కదిలారు. అప్పుడు ఇస్లామీయ సైన్యంలో ఏడు వందల మంది సైనికులు మాత్రమే ఉన్నారు.

దైవప్రవక్త (స) గారి సైన్యానికీ, ఉహద్ కొండకూ నడుమ శత్రువుల సైనిక శిబిరం విస్తరించి ఉంది. ఇది గమనించిన దైవప్రవక్త (స), "శత్రువు దాపునకు పోకుండా సైన్యాన్ని ఉహద్ కొండకు చేర్చే దగ్గరి మార్గాన్ని ఎవరైనా చూయించగలరా?" అని అడిగారు.

సమాధానంగా అబూ ఖైస్మా, "దైవప్రవక్తా! నేను ఈ సేవకు సిద్ధంగా ఉన్నా" నంటూ ముష్రిక్కుల సేనను పశ్చిమ దిశగా వదలి బనూ హారిసాకు చెందిన పొలాల్లో నుండి బయలుదేరి అక్కడికి చేరుకున్నారు.

ఆ మార్గాన వెడుతూ ఇస్లామీయ సేన మర్‌బా బిన్ ఖన్జీ తోటగుండా పోవడం జరిగింది. ఈ వ్యక్తి ఓ మునాఫిక్ (కపటి). అదేకాకుండా అంధుడు కూడా. అతను సేన రాకను చూసి ముస్లిముల వైపు మట్టి విసురుతూ, "మీరే గనక దైవప్రవక్త (స) అయితే జ్ఞాపకముంచుకోండి. మీరు నా

తోటగుండా వెళ్ళే అనుమతి ఇవ్వను" అని అనసాగాడు. ఇది చూసిన కొందరు అతణ్ణి చంపడానికి ముందుకు ఉరకగా దైవప్రవక్త (స) వారిని వారిస్తూ, "అతణ్ణి చంపవద్దు. అతను హృదయం మరియు కళ్ళు రెంటికీ అంధుడే" అన్నారు.

ఆ తరువాత ప్రవక్తశ్రీ(స) ముందుకు కదలి ఆ మైదానానికి చివరగా ఉన్న కొండ లోయలో ప్రవేశించారు. అక్కడే తన సేనకు శిబిరం ఏర్పాటు చేశారు. ఇప్పుడు ముస్లిములకు ముందు మదీనా నగరం, వెనుక వైపు ఎత్తయిన ఉహద్ పర్వతమూ ఉంది. ఇలా శత్రుసేన ముస్లిములకు, మదీనాకు నడుమ అడ్డుగా నిలబడి ఉంది.

రక్షణ వ్యూహం

ఇక్కడికి చేరిన తరువాత దైవప్రవక్త (స) తమ సైన్యాన్ని ఓ క్రమపద్ధతిలో నిలబెట్టారు. యుద్ధ వ్యూహాన్ని బట్టి దాన్ని అనేక వరుసలుగా తీర్చిదిద్దారు. నిపుణులైన ఓ యాభై మంది విలుకాండ్ర ఓ పటాలాన్ని కూడా ఎంపిక చేశారు. ఆ దళానికి హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ బిన్ నోమాన్ అన్సారి (ర)ని కమాండర్‌గా నియమించారు. ఆయనకు ఖనాత్ మైదానానికి ప్రక్కన ఉన్న ఓ చిన్న కొండను రక్షించే బాధ్యతను అప్పగించారు. అది ఇస్లామీయ శిబిరానికి నూటయాభై మీటర్ల దూరాన తూర్పు వైపు ఉంది. ఇప్పుడు దాన్ని జబ్లె రమాత్‌గా పిలుస్తున్నారు. ఆ నియామకం ప్రాముఖ్యత ఏమిటో మహాప్రవక్త (స) ఆ విలుకాండ్రకు ఇచ్చిన ఆదేశాల ద్వారా తెలుస్తోంది. ఆయన (స) ఆ పటాలం కమాండరును సంబోధిస్తూ, "వచ్చే అశ్విక దళాన్ని వారు వెనుక వైపు నుండి మాపై దాడి చేయకుండా మీ శరపరంపరతో అడ్డుకోండి. మేము గెలిచినా, ఓడిపోయే పరిస్థితి ఏర్పడినా, ఏ సందర్భంలోనూ మీరు, మీరు నిలుచున్న చోటు నుండి మాత్రం కదలవద్దు"[6] అని ఆదేశించారు. విలుకాండ్రను ఉద్దేశించి, "మీరు మా వెనుక భాగాన ఉండి మమ్మల్ని రక్షించండి. చూడండి! మేము చంపబడుతూ ఉన్నా సరే మీరు మా సహాయం కోసం రావద్దు, అలాగే మేము యుద్ధ ధనాన్ని ప్రోగు చేస్తున్నా సరే మీరు మాత్రం ఆ ప్రదేశాన్ని వదలి మా దగ్గరకు రావద్దు"[7] అని చెప్పారు. సహీ

6. ఇబ్నె హష్షామ్-2/65,66
7. అహ్మద్, తిబ్రానీ, హాకిమ్- ఇబ్నె అబ్బాస్‌గారి ఉల్లేఖనం-చూడండి, ఫత్‌హుల్ బారి-7/350

బుఖారిలో గ్రంథస్థమై ఉన్న ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త (స)గారి ప్రవచనం ఇలా ఉంది:

"చూడండి! మీరు మమ్మల్ని పక్షులు పీక్కుతింటున్నా సరే చూసి మీ ప్రదేశాన్ని వదలిపెట్టకూడదు. నేను మిమ్మల్ని వెనక్కు పిలిచితే తప్ప. అలాగే, మేము జాతిని ఓడించి దాన్ని అణిచివేస్తున్నా తిరిగి నేను మిమ్మల్ని వెనక్కు పిలిపించనంతమట్టుకు మీ ప్రదేశం నుంచి వదలిరాకూడదు."[8]

ఈ గంభీరమైన సైనిక ఆదేశాలు ఇచ్చిన తరువాత దైవప్రవక్త (స) ఆ విలుకాండ్ర సైనిక పటాలాన్ని ఆ కొండపై నియమించి అక్కడ ఉన్న ఒకే ఒక మార్గాన్ని మూసివేశారు. ఇక దాన్ని దాటి ముష్రిక్కులు ముస్లిములపై దాడి చేయలేరు, వారిని చుట్టుముట్టనూ లేరు.

తక్కిన సేన ఈ విధంగా తీర్చిదిద్దడం జరిగింది. 'మైమనా' (కుడి పార్శ్వం) కమాండరుగా హజ్రత్ మున్జిర్ బిన్ అమ్రూ (ర), 'మైసరా'(ఎడమ పార్శ్వం)కు హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ (ర) కమాండరుగా నియమించ బడ్డారు. ఈయనకు సహాయకునిగా హజ్రత్ మిఖ్దాద్ (ర) బిన్ అస్వద్‌ను నియమించడం జరిగింది. హజ్రత్ జుబైర్ (ర)కు, ఖాలిద్ బిన్ వలీద్ నియంత్రించే అశ్విక దళాన్ని నిలువరించే కార్యభారాన్ని అప్పగించారు. ఇలా ఎవరి బాధ్యతలను వారికి అప్పజెప్పడమే కాకుండా సైన్యం ముందు భాగంలో, పరాక్రమశీలురైన ముస్లిమ్ యోధుల్ని నియమించారు. ఈ యోధులు, ధైర్యస్థయిర్యాలు, పరాక్రమాల్లో ఒక్కొక్కరు వేయి మందికి సమాధానం చెప్పేటంతటివారు.

ఈ ప్లాను ఎంతో వివేచనతో కూడుకున్న ప్లాను. ఇది దైవప్రవక్త (స)గారి యుద్ధ కౌశల్యాన్ని చాటి చెబుతోంది. యుద్ధ కౌశల్యం మరియు వివేచనతో కూడిన ఎంతటి సైనిక కమాండరు అయినా, దైవప్రవక్త (స) అనుసరించిన ఇంత తెలివిగల ప్లానును సైతం తయారు చేయలేడనే విషయం ఆయన అవలంబించిన విధానాన్ని బట్టి రుజువు అవుతోంది. ఎందుకంటే, మహాప్రవక్త (స) మదీనాను వదలి శత్రుసైన్యం దాపుకు వచ్చినా, ఆయన(స) తన సేన కోసం యుద్ధం చేసే ఈ విధానాన్ని అనుసరించి, యుద్ధరంగానికి సంబం ధించిన అతి ఉత్తమమైన ప్రదేశాన్ని ఎన్నుకోవడమే అందుకు తార్కాణం.

8. సహీ బుఖారి-కితాబుల్ జిహాద్-1/426

అంటే, ఆయన పర్వతశ్రేణిని మాటుగా చేసుకొని తన సేన వెనుక భాగాన్ని మరియు కుడి పార్శ్వాన్ని సురక్షితం చేసుకున్నారు. ఎడమ పార్శ్వాన ఉన్న ఏకైక మార్గం ద్వారా ఈ సేనపై వెనుక భాగం నుండి దాడి చేసే అవకాశం ఉంది. దాన్ని కూడా ఆయన విలుకాండ్రను నియమించి పూడ్చివేశారు. తన విడిది కోసం ఓ ఎత్తయిన ప్రదేశాన్ని ఎంచుకున్నారు. ఒకవేళ అపజయాన్నే చవిచూడవలసివస్తే, వెనక్కు మరలి పారిపోవడం లేదా శత్రువుకుచిక్కి ఖైదు అయ్యే బదులు ఇస్లామీయ క్యాంపులో రక్షణ తీసుకోవడానికి అవకాశం లభిస్తుంది. శత్రువే గనక ఆ క్యాంపును హస్తగతం చేసుకునే ప్రయత్నం చేస్తే దానికి ఎనలేని నష్టాన్ని కలిగించవచ్చు. ఈ వ్యూహాన్ని అలా ఉంచి, దైవప్రవక్త (స), శత్రువును విధిలేక, అది విజయం సాధించినా ఏమంత ప్రయోజనం పొందకుండా ఉండేందుకు పల్లపు ప్రాంతంలో శిబిరం ఏర్పాటు చేసుకునేటట్లు చేశారు. ముస్లిములే విజయం సాధిస్తే శత్రువును వెంటాడి పట్టుకోవచ్చు. అదేకాకుండా ఆయన(స) యోధుల ఓ పటాలాన్ని కూడా నియమించి సైనిక లోటును భర్తీ చేయగలిగారు. దైవప్రవక్త (స) షవ్వాల్ నెల 7వ తారీఖు, హిజ్రీ శకం 3న శనివారం నాడు చేసిన ముస్లిమ్ సేన ఏర్పాటు ఇది.

ఇస్లామీయ సేనలో ధైర్యోత్సాహాలను రేకెత్తించిన మహాప్రవక్త (స)

సేన సన్నద్ధమైన తరువాత దైవప్రవక్త (స) ఓ ప్రకటన చేస్తూ, తాము ఆదేశించనంత వరకు యుద్ధం ప్రారంభించవద్దని చెప్పారు. ఆయన(స) ఒకదానిపై మరొకటి రెండు కవచాలను ధరించి ఉన్నారు. అనుచరగణానికి యుద్ధోత్సాహాన్ని కలిగిస్తూ, శత్రువును ఢీకొన్నప్పుడు ధైర్యంగా, కార్యాన్ని సాధించే దృఢచిత్తంతో యుద్ధం చేయాలని తాకీదు చేశారు. ఒరలో నుంచి కరవాలాన్ని లాగి, "ఈ కరవాలాన్ని తీసుకొని దీని హక్కును నెరవేర్చే వారెవరు?" అని పైకెత్తారు. సహాబాల్లో చాలా మంది దాన్ని అందుకోడానికి ముందుకు వచ్చారు. వారిలో హజ్రత్ అలి (ర), జుబైర్ బిన్ అవామ్ (ర), ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) ప్రముఖులు. అయినా అబూ దుజానా సిమాక్ బిన్ ఖర్షా (ర) ముందుకొచ్చి, "దైవప్రవక్తా! దీని హక్కు ఏమిటి?" అని అడిగారు.

"ఈ కరవాలంతో, ఇది వంకరబోయినంత వరకు శత్రువు ముఖంపై

కొట్టడమే దీని హక్కు" అని సెలవిచ్చారు ఆయన (స). దానికి అబూ దుజానా, "దైవప్రవక్తా (స)! ఈ కరవాలం చేతబూని నేను దీని హక్కును నెరవేర్చదలుచుకున్నాను" అనగా మహాప్రవక్త (స) ఆ కరవాలాన్ని అబూ దుజానా చేతికి అందించారు.

అబూ దుజానా ప్రాణాలనైనా లెక్కచేయని యోధుడు, యుద్ధ సమయంలో నిట్టనిల్గి నడిచే అలవాటుంది ఆయనకు. ఆయన దగ్గర ఓ ఎరుపు రంగు రుమాలు ఉండేది. దాన్ని తలపై కట్టుకున్నప్పుడు ప్రజలు, "ఇక ఆయన ప్రాణం వదిలే వరకు పోరాడుతూనే ఉంటారు" అని అనేవారు. అబూ దుజానా ఆ కరవాలాన్ని దైవప్రవక్త (స) గారి చేతి నుండి అందుకొని తలపై ఆ ఎరుపు రంగు రుమాలును చుట్టుకున్నారు. ఇరు సేనలు చూస్తూ ఉండగా ఆయన నీల్గుతూ నడుస్తూ ఉండగా దైవప్రవక్త (స) చూసి, "ఈ నీల్గి నడవడం అల్లాహ్‌కు ఇష్టమైనది కాదు, కాని ఈ సమయంలో మాత్రం కాదు" అని అన్నారు.

మక్కా సేన బారులు తీరి నిలబడడం

ముష్రిక్కులు కూడా బారులు తీరి యుద్ధం చేసే విధానాన్నే అవలంబిస్తూ తమ సేనను నిలబెట్టారు. వారి సైన్యాధ్యక్షుడు అబూ సుఫ్‌యాన్. ఇతను సేన మధ్యలో తన స్థానాన్ని కేటాయించుకున్నాడు. మైమనా కమాండరుగా ఖాలిద్ బిన్ వలీద్ ఉన్నారు(ఇంకా ఆయన ఇస్లామ్ స్వీకరించలేదు అప్పటి వరకు). మైస్రా కమాండరుగా ఇక్రమా బిన్ అబూ జహల్ ఉన్నాడు. పదాతిదళం సుఫ్‌వాన్ బిన్ ఉమయ్యా ఆధీనంలో ఉంది. విలుకాండ్రకు కమాండరుగా అబ్దుల్లా బిన్ రబీయా నియమించబడి ఉన్నారు.

యుద్ధ పతాకం బనూ అబ్దుద్దార్ తెగ వారికి చెందిన ఓ చిన్న వర్గం చేతిలో ఉంది. ఈ జెండాను రక్షించే హోదా, బనూ అబ్దె మునాఫ్, ఖుస్సై నుండి వారసత్వంలో పొందిన హోదాలను పంచినప్పటి నుండే వారికి దక్కి ఉంది. ఈ వివరాలు ఈ గ్రంథం ప్రారంభంలో చెప్పుకున్నవే. తాతముత్తాతల నుండి వచ్చే సంప్రదాయం ప్రకారం ఇంకెవ్వరూ ఈ హోదా గురించి కలహించుకోడానికి కూడా వీల్లేదు. కాని, అబూ సుఫ్‌యాన్, బద్ర్ యుద్ధం రోజున జరిగిన సంఘటనను మననం చేసుకున్నాడు. ఆ రోజు ఆ జెండా ఎత్తుకొని

ఉన్న నజ్ర్ బిన్ హారిస్ బందీ అయితే, ఖురైష్ ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చిందో అతనికి కళ్ళకుకట్టినట్లు అగుపించింది. ఈ విషయం గుర్తుకు రాగానే వారి కోపాన్ని మరింత రెచ్చగొట్టడానికి అతను, "ఓ అబ్దుద్దార్ సంతానమా! బద్ర్ రోజున మీరు మన జెండాను ఎత్తుకొని ఉండగా, మనం ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వచ్చిందో మీకు బాగా తెలుసు. యదార్థం ఏమిటంటే, సేనపై పతాకం మాధ్యమంగానే దెబ్బపడుతుంది. జెండా పడిపోతే సేన చెల్లాచెదురైపోతుంది. కాబట్టి ఈసారి అయినా మీరు జెండాను సక్రమంగా రక్షించండి. లేదంటారా, ఈ జెండాను వదిలేసి వైదొలగండి. దీన్ని ఎవరికివ్వాలో మేము ఆలోచిస్తాము" అన్నాడు. ఈ సంభాషణ ద్వారా అబూ సుఫ్‌యాన్ లక్ష్యం నెరవేరినట్లయింది. అతను తన ఎత్తుగడలో సఫలీకృతుడయ్యాడు. అబూ సుఫ్‌యాన్ మాటలు విని వారు మండి పోయారు. అతణ్ణి బెదిరిస్తూ అతనిపైబడి కొట్టేటంత పౌరుషంతో ఊగిపోయారు. అతణ్ణి సంబోధిస్తూ, "ఏమిటీ! జెండా నీకివ్వడమా? రేపు యుద్ధం జరగనీ చూద్దువు గాని మా తడాకా" అని ప్రతిజ్ఞ చేశారు. యుద్ధం ప్రారంభం అయిన తరువాత నిజంగానే వారు తమ ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నారు. వారిలోని ఒక్కొక్కడూ ప్రాణాలు వదిలినంత మట్టుకు ఆ జెండాను క్రిందపడనీయలేదు.

ఖురైషుల రాజకీయ ఎత్తుగడ

యుద్ధం ఆరంభానికి ముందు ఖురైషులు ముస్లిములను చీల్చడానికిగాను, వారిలో మనస్పర్థలు ఏర్పడడానికిగాను ప్రయత్నం చేయడం జరిగింది. దీని కోసం అబూ సుఫ్‌యాన్ అన్సారుల వద్దకు, "మీరు, మాకు, మా పినతండ్రి కుమారుడు అయిన ముహమ్మద్ (స)కు నడుమన అడ్డులేకుండా తొలగిపోండి. అలా చేస్తే మేము మీ జోలికి రాము. మీతో యుద్ధం చేసే అవసరం మాకు లేదు" అని ఓ సందేశం పంపించాడు. కాని ఏ విశ్వాసం ముందు పర్వతాలు సైతం నిలువలేవో, ఆ విశ్వాసం ముందు ఈ ఎత్తుగడ ఎలా పారుతుంది? కాబట్టి అన్సారులు దానికి ధీటైన సమాధానం చెప్పి ఆ సందేశాన్ని ఖండించిపారేశారు.

ఇక యుద్ధ సమయం రానే వచ్చింది. ఇరుపక్షాల సైన్యాలు మరీ దగ్గరకు వచ్చేశాయి. అప్పుడు ఖురైషులు మరో ఎత్తుగడ పన్నారు. అంటే,

వారిలోని ఓ నీచుడు అబూ ఆమిర్ ముస్లిముల ఎదురుగా వచ్చాడు. అతని అసలు పేరు అబ్దె అమ్రూ ఇబ్నె సైఫీ. అతణ్ణి రాహిబ్ అని కూడా పిలిచేవారు. అయితే మహాప్రవక్త (స) అతని పేరు ఫాసిఖ్‌గా పెట్టి ఉన్నారు. ఇతను అజ్ఞాన కాలంలో అవస్ తెగకు సర్దారుగా ఉండేవాడు. కాని ఇస్లామ్ ప్రాభవం తరువాత ఇతనికి ఇది కంటకంగా తయారైంది. మహాప్రవక్త (స)కు వ్యతిరేకంగా బహిరంగ ప్రచారం చేయనారంభించినవాడు. అతను మదీనా నుండి బయలుదేరి ఖురైషుల వద్దకు వచ్చాడు. వారిని దైవప్రవక్తకు వ్యతిరేకంగా పురికొల్పి యుద్ధానికి సన్నద్ధం చేసిన వ్యక్తి ఇతను. యుద్ధ సమయంలో అతని జాతి అతణ్ణి చూడగానే ముస్లిమ్ సేనను వదిలేసి తనను వచ్చి కలుస్తుందని వారికి నమ్మబలికినవాడు. కాబట్టి అతను ఉహద్ యుద్ధ మైదానంలో నీగ్రోలు మరియు మక్కా బానిసలను వెంటబెట్టుకొని వచ్చి ముస్లిములకు ఎదురుగా నిలబడి తన జాతికి తన పరిచయం చేస్తూ, "ఓ అవస్ తెగ ప్రజలారా! నేను అబూ ఆమిర్"ని అన్నాడు. దానికి సమాధానంగా ముస్లిములు, "ఓ ఫాసిఖ్! అల్లాహ్ నీకు ఆనందం కలుగ చేయకుండుగాక!" అని జవాబిచ్చారు. ఇది విన్న అతను, "ఓహో! నేను వెళ్ళి పోయిన తరువాత నా జాతి మార్గం తప్పినట్లుందే" అనుకుంటూ వెనక్కు వెళ్ళిపోయాడు. (యుద్ధం ప్రారంభం అయిన తరువాత అతను ఖురైషుల వైపు నుండి భీకరంగా పోరాడాడు. ముస్లిములపై రాళ్ళూ రువ్వాడు).

ఇలా ఖురైషులను, ముస్లిములను చీల్చడానికి చేసిన రెండో ప్రయత్నం కూడా విఫలం అయిపోయింది. ఈ సంఘటన ద్వారా సైనిక సంఖ్యలోనూ, ఆయుధ సంపత్తిలోనూ, ముస్లిముల కంటే ఎన్నో రెట్లు ఆధిక్యతలో ఉన్న ముష్రిక్కులు ఎంత భయోత్పాతానికి గురిఅయి ఉన్నారన్న విషయం తెలిసి పోతోంది.

ఖురైష్ సైన్యానికి ధైర్యం నూరిపోయడంలో ఖురైష్ స్త్రీల పాత్ర

ఇటు ఖురైషులకు చెందిన స్త్రీలు కూడా యుద్ధంలో తమ వంతు పాత్రను పోషించడానికి లేచి నిలబడ్డారు. వీరికి అబూ సుఫ్‌యాన్ భార్య 'హింద్' నాయకత్వం వహిస్తోంది. వీరు సైనిక వరుసల్లో తిరిగి డప్పు వాయిస్తూ సైనికులను ఉత్సాహపరచనారంభించారు. యుద్ధం కోసం పురికొల్పుతూ

వారి పౌరుషాన్ని ఇనుమడింపజేస్తున్నారు. బరిశెల పోరాటం, ఖడ్గయుద్ధం, ముష్టిఘాతాలు మరియు శరపరంపరలను ఉధృతం చేయడానికి వారి ఉద్రేకాలను హెచ్చింప ప్రయత్నం చేస్తున్నారు. జెండా పట్టుకున్న వారిని సంబోధిస్తూ;

"చూడండి! అబ్దుద్దార్ సంతానమా! చూడండి! మీరు వెనుక వైపున ఉండి సైన్యాన్ని రక్షించేవారు. ఖడ్గ ప్రహారాల్లో వెనుకాడబోకండి" అని ఉత్సాహ పరిచారు. మరోవైపు జాతికి పౌరుషాన్ని నూరిపోస్తూ, "మీరే గనక ముందుకు వెడితే, మేము మిమ్మల్ని ఆలింగనం చేసుకుంటాం. నడువడానికి తివాచీలు పరుస్తాం. వెనక్కు మళ్ళారా! గుర్తుంచుకోండి. మేము మీ దగ్గరకు కూడా వచ్చేవారంకాము. వేరుబడిపోతాము సుమా" అని అంటున్నారు.

యుద్ధాగ్నికి ఆహుతి అయిన మొదటి సమిధ

ఇరుపక్షాలు ఎదురెదురుగా మరీ దగ్గరకు వచ్చేశాయి. యుద్ధం ప్రథమ దశ ప్రారంభం అయింది. యుద్ధపు ప్రథమ సమిధ ముష్రిక్కుల ధ్వజవాహకుడు తల్హా బిన్ అబీ తల్హా అబ్దరీ. ఇతను ఖురైషులకు చెందిన అతి ధైర్యవంతుడైన యోధుడు. ముస్లిములు అతణ్ణి 'కబ్షుల్ కతీబా' (సేన పొట్టేలు) అనే పేరుతో పిలిచేవారు. ఇతను ఓ ఒంటెనెక్కి బయటకు వచ్చాడు. వ్యక్తిగత పోరాటం కోసం రమ్మని ముస్లిములకు సవాలు విసిరాడు. అతని మితిమీరిన ధైర్యసాహసాలకు సాధారణ ముస్లిములు అతనికి ఎదురుగా రావడానికి జంకారు. కాని హజ్రత్ జుబైర్ (ర) ముందుకురికి అతనిని ఒక్క క్షణం కూడా తెములుకోనివ్వకుండా పులిలా అతని ఒంటె పైకి లంఘించి దానిపైకి చేరారు. అతణ్ణి తన బాహుబంధాల్లో బిగించి ఒంటెపై నుండి క్రిందికి దుముకి తన కరవాలంతో గొంతుకోసివేశారు.

మహాప్రవక్త (స) భయం కలిగించే ఈ శౌర్యప్రతాప దృశ్యాన్ని చూసి ఆనందంతో అల్లాహు అక్బర్ అని అరిచారు. ముస్లిములంతా తిరిగి ఆ తక్బీర్ నినాదం చేశారు. ఆ తరువాత దైవప్రవక్త (స) జుబైర్ (ర)ను మెచ్చుకుంటూ, "ప్రతి ప్రవక్తకు ఓ హవారీ ఉంటాడు. నా హవారీ జుబైర్" అన్నారు.[9]

---

9. ఈ సంఘటనను సీరతె హల్బియా చరిత్రకారుడు వివరించారు. హదీసుల్లో ఈ వాక్యం మరో సందర్భంగా పలికినట్లుగా ఉంది.

ప్రధాన యుద్ధ కేంద్రం మరియు యుద్ధ పతాకధారుల వధ

ఆ తరువాత అన్ని వైపుల నుండి యుద్ధ జ్వాలలు మిన్నుముట్టాయి. యుద్ధరంగం అంతటా వధ ప్రారంభం అయింది. ముష్రిక్కుల యుద్ధ పతాకం యుద్ధకేంద్రంగా మారింది. బనూ అబ్దుద్దార్, తమ కమాండరు తల్హా బిన్ అబీ తల్హా వధ తరువాత ఒక్కొక్కరుగా యుద్ధ పతాకాన్ని కాపాడ నారంభించారు. కాని వారంతా వధించబడ్డారు. మొట్టమొదట యుద్ధ పతాకాన్ని తల్హా సోదరుడు ఉస్మాన్ బిన్ అబీ తల్హా ఎత్తుకున్నాడు. అతను ఆ జెండాను ఎత్తుకొని, “బరిశె రక్తంతో తడిసినా లేదా విరిగిపోయినా, అంత వరకు యుద్ధం చేయడం పతాకాన్ని ఎత్తుకున్నవాడి విధి” అని ముందుకు ఉరికాడు.

అతనిపై హజ్రత్ హమ్‌జా(ర) బిన్ అబ్దుల్ ముత్తలిబ్ దాడి చేశారు. ఆయన అతని భుజంపై వేసిన ఖడ్గం దెబ్బకు ఆయన కరవాలం, అతని చేతితో సహా భుజాన్ని తెగగొట్టుకుంటూ అతని ఊపిరితిత్తులు అగుపడేటట్లు శరీరాన్ని చీల్చుతూ నాభి వరకు వచ్చి ఆగింది.

ఆ తరువాత అబూ సఅద్ బిన్ అబూ తల్హా జెండా ఎత్తిపట్టుకున్నాడు. అతనిపై హజ్రత్ సఅద్ బిన్ అబీ విఖాస్(ర) బాణాన్ని గురిచూసి వదిలారు. అది నేరుగా అతని కంఠంలో దిగబడింది. ఆ బాణం దెబ్బకు అతని నాలుక బయటకు వచ్చి వెంటనే చనిపోయాడు - అయితే కొందరు సీరత్ రచయితలు, అబూ సఅద్ బయటకు వచ్చి వ్యక్తిగత పోరాటం కోసం సవాలు విసరగా హజ్రత్ అలి(ర) వచ్చి అతణ్ణి ఎదుర్కొన్నారనీ, కత్తి యుద్ధంలో హజ్రత్ అలి(ర) అతణ్ణి చంపేశారనీ ఉంది.

ఆ తరువాత యుద్ధ పతాకాన్ని ముసాఫె బిన్ తల్హా బిన్ అబీ తల్హా ఎత్తుకున్నాడు. కాని అతణ్ణి ఆసిమ్ బిన్ సాబిత్ బిన్ అబీ అఫ్లహ్ (ర) బాణం వేసి చంపేశారు. పిదప జెండాను అతని సోదరుడు కిలాబ్ బిన్ తల్హా బిన్ అబీ తల్హా అందుకున్నాడు. అయితే అతనిపై హజ్రత్ జుబైర్ బిన్ అవామ్(ర) విరుచుకుపడ్డారు. అతనితో యుద్ధం చేసి అతన్ని అంతమొందించడం జరిగింది. ఆ ఇద్దరు మరణించిన తరువాత వారి సోదరుడు జలాస్ బిన్ తల్హా బిన్ అబీ తల్హా ఆ పతాకం క్రింద పడకుండా ఎత్తుకున్నాడు. అతణ్ణి తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (ర) బరిశెతో పొడిచి చంపేశారు. మరో ఉల్లేఖనంలో, అతణ్ణి ఆసిమ్ బిన్ సాబిత్ బిన్ అబీ అఫ్లహ్ (ర) బాణం వేసి చంపినట్లుంది.

వీరందరూ ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు యోధులు. అంటే అందరూ అబూ తల్హా అబ్దుల్లా బిన్ ఉస్మాన్ బిన్ అబ్దుద్దార్ కుమారులు, మనుమలూను. వీరంతా ముష్రిక్కు సైనిక పతాకాన్ని పరిరక్షిస్తూ ప్రాణాలు వదిలినవారు. ఆ తరువాత బనీ అబ్దుద్దార్ వంశానికే చెందిన మరో వ్యక్తి అర్‌లూత్ బిన్ షుర్జీల్ పతాకాన్ని ఎత్తుకున్నాడు. అతణ్ణి హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (ర), మరో ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ హమ్‌జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ సంహరించినట్లు ఉంది. అతను అంతమైపోగానే షురేహ్ బిన్ ఖారిజ్ ఆ జెండాను ఎత్తుకున్నాడు. కాని అతను ఖజ్మాన్ చేతిలో హతమైపోయాడు - ఖజ్మాన్ ఓ కపట ముస్లిమ్ (మునాఫిక్). ఇస్లామ్ కోసం కాకుండా అరేబియా తెగల ఆత్మాభిమానం పెల్లుబికి యుద్ధంలోకి వచ్చి చేరినవాడు - షురేహ్ తరువాత అబూ జైద్ అమ్రూ బిన్ అబ్దె మునాఫ్ అబ్దరీ జెండాను అందుకున్నాడు. అతణ్ణి కూడా ఈ ఖజ్మానే సంహరించేశాడు. ఆ పిదప అతని కుమారుడు షుర్జీల్ బిన్ హాషిమ్ అబ్దరీ జెండాను ఎత్తుకొనగా ఖజ్మానే అతణ్ణి చంపేశాడు.

ఇలా బనూ అబ్దుద్దార్‌కు చెందిన పది మందీ ముష్రిక్కుల జెండా కోసం ప్రాణాలను పోగొట్టుకున్నట్లయింది. ఆ తరువాత ఆ వంశంలో మరెవ్వరూ జెండాను ఎత్తుకోడానికి మిగిలిపోలేదు. అయితే అంతలోనే ఓ నీగ్రో బానిస ‘సువాబ్’ పరుగున వచ్చి ఆ జెండాను ఎత్తుకున్నాడు. అతను ఆ జెండానెత్తుకొని పోరాడిన విధం క్రితం తన యజమానులు చేసిన యుద్ధాన్ని మించిపోయినట్లుగా ఉంది. అంటే అతను నిర్విరామంగా తన రెండు చేతులు నరకబడినా సరే పోరాడుతూనే ఉన్నాడు. అయినా అతను జెండాను మాత్రం క్రిందపడనీయలేదు. ఆ జెండాను తాను మోకాలిపై కూర్చుని దాన్ని వక్షస్థలానికి ఆనించి భుజంపై వేసుకుని నిలబెట్టే ఉంచాడు. చివరికి ఆ పరిస్థితిలోనే అతను ప్రాణాలను వదిలేయాల్సి వచ్చింది. ప్రాణాలు పోయేటప్పుడు అతను చెప్పిన మాటలు ఇవి:

“ఓ ప్రభూ! నేను నాకు సాధ్యమైనంత వరకు పోరాడాను. అంతకంటే నేనింకేమి చేయలేను.”

ఈ బానిస (సువాబ్) మరణం తరువాత జెండా భూమిపై పడిపోయింది. ఇక దాన్ని మరెవ్వరూ ఎత్తుకోలేదు. అది అలానే క్రిందపడి ఉండిపోయింది.

తక్కిన భాగాల్లో జరిగిన యుద్ధ వైనం

ఓ వైపు ముష్రిక్కుల జెండా ఆ యుద్ధంలో ఆకర్షణ కేంద్రంగా ఉండింది. మరో ప్రక్క తక్కిన యుద్ధరంగంలోనూ భీకరయుద్ధం కొనసాగుతూనే ఉంది. ముస్లిముల వరుసల్లో విశ్వాస పటిమ ఎల్లెడలా వ్యాపిస్తూనే ఉంది. ముష్రిక్కుల మరియు దైవతిరస్కారుల సేనపై వెల్లువలా దానికి ఏ ఆనకట్టా నిలువదన్నట్లుగా ముస్లిములు విరుచుకుపడుతున్నారు. ఈ పరిస్థితిలో వారి నోట 'అమిత్, అమిత్' (చంపండి, చంపండి) అనే పదం ఒక్కటే వెలువడుతోంది.

ఇటు అబూ దుజానా (ర) తన ఎర్ర ఒంటెపై తలపై ఎర్ర రుమాలు కట్టుకొని చేత కరవాలం దూసి పోరాడుతున్నారు. ఆ కరవాలం హక్కును పూర్తిగా నిర్వర్తించేందుకు దృఢనిశ్చయంతో ముష్రిక్కుల శిరస్సులను నరుకుతూ ముందుకు సాగుతూనే ఉన్నారు. అలా పోరాడుతూ ఆయన, శత్రు సేనలో చాలా దూరం వరకు వెళ్ళిపోయారు. ఏ ముష్రిక్కులు ఆయనకు అడ్డం వచ్చినా అతణ్ణి తుదముట్టిస్తున్నారు. అలా ఆయన ముష్రిక్ సేన వరుసలను చిందరవందర చేస్తూ, వారిని నేల కూలుస్తూ ముందుకు వెళ్ళిపోతున్నారు.

ఆయన యుద్ధం చేసిన తీరు గురించి హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ (ర) ఉల్లేఖనం ఇలా ఉంది:

"నేను మహాప్రవక్త (స)ను ఆ కరవాలాన్ని నాకివ్వమని అడగ్గా ఆయన (స)దాన్ని నా చేతికి ఇవ్వలేదు. నాకు కొంత బాధ కూడా కలిగింది. నేను నా మనస్సులో, 'నేను దైవప్రవక్త (స)కు మేనత్త అయిన సఫియా (ర)గారి కుమారుణ్ణి కదా! అదే కాకుండా ఓ ఖురైషీని కూడా. అబూ దుజానా కంటే ముందే వెళ్ళి కరవాలాన్ని అడిగానాయె. అంతలోనే దాన్ని నా చేతికి ఇవ్వకుండా అబూ దుజానాకు ఇచ్చారు. సరే! దైవసాక్షి! నేనూ చూస్తాను, ఆయన ఈ కరవాలాన్ని ఎలా ఉపయోగిస్తారో" అని తలిచాను. అందుకని నేను అబూ దుజానా వెనకాలే బయలుదేరాను. ఆయన ముందు తన ఎర్ర రుమాలును తీసి తలపై కట్టుకున్నారు. అది చూసిన అన్సారులు, 'ఓహో! అబూ దుజానా తన నెత్తిపై చావుగుడ్డను కట్టుకున్నాడే' అని అనుకోసాగారు. అలా ఆ పట్టీని తలపై కట్టుకొని ఆయన, 'నేను ఈ ఒయాసిస్సు ప్రాంగణంలో

నా మిత్రునికి, ఎన్నడూ యుద్ధంలో సైనిక వరుసలకు వెనుకన ఉండనని, వారి మధ్యలో చొరబడిపోరాడుతానని మాట ఇచ్చి ఉన్నాను' అంటూ అందిన వాడినల్లా ఆ కరవాలంతో హతమార్చనారంభించారు. అటు ముష్రిక్‌లకు చెందిన ఓ వ్యక్తి మాలోని క్షతగాత్రులను ఏరి వధించనారంభించాడు. అతనూ, అబూ దుజానా పరస్పరం దగ్గరవుతున్నారు. నేను, వారిద్దరూ ఎదురు ఎదురుగా వచ్చి తలపడాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తూనే ఉన్నాను. సరిగ్గా అలానే జరిగింది, అతను అబూ దుజానాకు ఎదురుగా వచ్చి ఆయనపై ఖడ్గప్రహారాన్ని చేశాడు. అబూ దుజానా ఆ దాడిని తన ఢాలుపై ఆపారు. అతని ఖడ్గం అబూ దుజానా ఢాలులో ఇరుక్కుపోయింది. ఆ తరువాత ఆయన తన కరవాలంతో అతని తలను నరికివేశారు.[10]

అనంతరం అబూ దుజానా (ర) శత్రు వరుసల్ని ఛిన్నాభిన్నం చేస్తూ ముందుకు కదిలిపోతున్నారు. చివరికి ఆయన ఖురైష్ స్త్రీల కమాండరు దగ్గరకు చేరుకోగలిగారు. ఆమె స్త్రీ అన్న విషయం ఆయనకు బొత్తిగా తెలియదు. ఆయన ఖుద్దుగా చెప్పినదాని ప్రకారం, నేను ఓ వ్యక్తిని చూశాను. ఆ వ్యక్తి శత్రుసైనికులను ఎంతో ఉత్సాహంతో యుద్ధానికి పురికొల్పుతున్నాడు. అందుకని ముందు అతని పని పడదామని నా కరవాలంతో దాడి చేయబోగా ఆ వ్యక్తి హాహాకారాలు చేస్తూ వెనక్కు తగ్గుతున్నాడు. అప్పుడుగాని నాకు తెలిసి రాలేదు ఆ వ్యక్తి ఓ స్త్రీ అన్న విషయం. నేను, ఓ స్త్రీని చంపి దైవప్రవక్త(స) గారు ఇచ్చిన కరవాలానికి మచ్చ ఎలా తేగలను? అందుకని ఆమెను వదలివేశాను.

ఈమె ఉత్బా కుమార్తె హింద్. హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ (ర)గారి కథనం ప్రకారం, "అప్పుడు నేను చూసిన దృశ్యం ఏమిటంటే, అబూ దుజానా హింద్ నడినెత్తిపై తన కరవాలాన్ని ఎత్తి వ్రేటు వేయబోయి వెంటనే దాన్ని ప్రక్కకు జరిపేశారు. ఇలా ఎందుకు జరిగిందో అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)కే బాగా తెలుసు."[11]

మరో ప్రక్క హజ్రత్ హమ్‌జా(ర) పులిలా గాండ్రిస్తూ శత్రు మూకలపై దాడి చేస్తున్నారు. ఆయన అసాధారణమైన ఖడ్గ ప్రహారాలు చేస్తూ శత్రుసైన్యం మధ్య భాగంలోనికి చొరబడుతున్నారు. ఆయన ముందు గొప్ప గొప్ప

10. ఇబ్నె హష్షామ్-2/68,69

11. ఇబ్నె హష్షామ్-2/92

యోధులు కూడా నిలువకుండా, సుడిగాలిలో ఎగిరిపోయే ఆకుల్లా చెల్లాచెదరై పోతున్నారు. హజ్రత్ హమ్‌జా(ర) ముష్రిక్కుల ధ్వజవాహకుల వధలో ప్రముఖ పాత్రను పోషించినవారు. దానికితోడు యోధానయోధుల పరిస్థితిని కూడా అధ్వాన్నపరిచినవారాయన. కాని విచారకరమైన విషయం ఏమిటంటే, ఇలాంటి పరిస్థితిలోనే ఆయన అమరగతిని పొందారు. అయితే ఆయన్ను షహీద్ చేసింది ఎదురెదురుగా జరిగిన యుద్ధంలో మాత్రం కాదు. మాటువేసి పిరికి పందలుగా ఆయనను నేలకూల్చడం జరిగింది.

హజ్రత్ హమ్‌జా (ర) గారి షహాదత్ (అమరగతి పొందడం)

హజ్రత్ హమ్‌జా(ర) గారి హంతకుని పేరు 'వహ్షీ బిన్ హరబ్'. మనం ఆయన ఎలా వధించబడ్డారో అతని నోటనే విందాం.

"నేను జుబైర్ బిన్ ముత్‌యిమ్‌కు బానిసగా ఉండేవాణ్ణి. ఆయన పినతండ్రి తుఅయిమా బిన్ అద్దీ బద్ర్ యుద్ధంలో చంపబడ్డాడు. ఖురైష్ ఉహద్ యుద్ధం కోసం బయలుదేరి వెళ్ళేటప్పుడు జుబైర్ బిన్ ముత్‌యిమ్ నాతో, "నీవే గనక ముహమ్మద్ పినతండ్రి హమ్‌జా(ర)ను నా పినతండ్రికి బదులుగా చంపితే నిన్ను స్వతంత్రుణ్ణిగా చేస్తాను" అన్నాడు. అతను ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవడానికి నేను కూడా సైన్యం వెంట బయలుదేరాను. నేను నీగ్రో బానిసను. నీగ్రోల్లా బరిశె విసరడంలో మంచి నైపుణ్యం గలవాణ్ణి. నా గురి తప్పడం చాలా అరుదు. యుద్ధం తారస్థాయికి చేరినప్పుడు నేను నా బరిశెను చేతబట్టి హజ్రత్ హమ్‌జా(ర) కోసం ఎదురు చూడనారంభించాను. ఎట్టకేలకు ఆయన భీకరంగా యుద్ధం చేస్తూ నా కంటబడ్డారు. అప్పుడు ఆయన వాలకం ఓ బూడిద రంగు గల ఒంటెలా ఉంది. సైనికులను చెల్లాచెదురు చేస్తూ సంహరిస్తూ పోతున్నారు. ఆయన ముందు ఎవరూ నిలిచేటట్లు అగుపడడం లేదు.

దైవసాక్షిగా చెబుతున్నాను! నేను ఆయన్ను సంహరించడానికి ఓ చెట్టో లేదా ఓ రాతి బండ చాటున ఒరిగి దగ్గరకు రాగానే దాడి చేయాలని సిద్ధపడు తున్నాను. ఆ సమయంలోనే 'సబా బిన్ అబ్దుల్ ఉజ్జా' నా కంటే ముందుకు ఉరికి ఆయన ముందుకు వెళ్ళాడు. హజ్రత్ హమ్‌జా(ర) అతణ్ణి హెచ్చరిస్తూ అతని తలపై తన కరవాలంతో వ్రేటు వేయనేవేశారు. ఆ దెబ్బకు అతని తల మొండెం నుండి వేరై క్రిందపడిపోయింది.

ఆ సమయంలోనే నేను నా బరిశెను గురిపెట్టి ఆయన వైపునకు విసిరాను. ఆ బరిశె ఆయన నాభి క్రింద తగిలి కాళ్ళ సందుల్లో నుండి బయటకు వచ్చేసింది. ఆయన నన్ను చూసి నా వైపునకు రావడానికి ప్రయత్నం చేశారుగాని శక్తి ఉడిగి క్రిందపడిపోయారు. ఆయన్ను నేను అదే పరిస్థితిలో వదలివేశాను. ఆ తరువాత ఆయన ప్రాణాలు ఎగిరిపోయిన తరువాత నా బరిశెను బయటకులాగి శుభ్రం చేసి నా సైన్యంలోనికి వచ్చి కూర్చుండి పోయాను నా పని పూర్తి అయిపోయినట్లుగా. నాకు కావలసింది ఆయన ఒక్కడే. ఆయన్ను నేను చంపింది కేవలం బానిసత్వ బంధాలను త్రెంచుకొని స్వాతంత్ర్యం పొందడానికే. మక్కా వచ్చిన తరువాత నాకు ఆ స్వాతంత్ర్యం లభించింది కూడా."[12]

యుద్ధంలో ముస్లిముల ఆధిక్యత

హజ్రత్ హమ్‌జా(ర) గారు అమరగతినొందిన ఫలితంగా ముస్లిములకు తీరని నష్టం వాటిల్లింది. అయినప్పటికీ విజయం ముస్లిముల వైపే మొగ్గుజూపుతోంది. హజ్రత్ అబూ బక్ర్, హజ్రత్ ఉమర్, హజ్రత్ అలి, జుబైర్ బిన్ ముస్అబ్ బిన్ ఉమైర్, తల్హా బిన్ ఉబైదుల్లా, అబ్దుల్లా బిన్ హజష్, సఅద్ బిన్ ముఆజ్, సఅద్ బిన్ ఉబాదా, సఅద్ బిన్ రబీ (ర)లు ఇంకా నజ్ర్ బిన్ అనస్ (ర) వగైరాలు చూపిస్తున్న ధైర్యసాహస పరాక్రమాల కారణంగా ముష్రిక్కులు నిలువలేకపోతున్నారు. వారి ధైర్యం దెబ్బతింటోంది. వారి శక్తి పూర్తిగా సన్నగిల్లుతోంది.

స్త్రీ కౌగిలింపును వదిలించుకొని కరవాలపు నీడల్లోకి దుమికిన యోధుడు

రండి! మనమిప్పుడు ఆ యోధుల్లో మరొకరి యుద్ధ పటిమను కూడా వీక్షిద్దాం. ఆ యోధుడు హజ్రత్ హంజలా అల్‌గసీల్ (ర). ఆయన ఈ రోజు

12. ఇబ్నె హష్షామ్-2/69-72; సహీ బుఖారి-2/583. వహ్షీ, తాయెఫ్ యుద్ధం జరిగిన తరువాత ఇస్లామ్ స్వీకరించారు. ఆయన ఆ బరిశెతోనే, అబూ బక్ర్ సిద్దీఖ్ ఖిలాఫత్ కాలంలో, యమామా యుద్ధం సందర్భంగా ముసైలమా కజ్జాబ్‌ను హత మార్చారు. రోమనులకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధం యర్‌మోక్‌లోనూ పాల్గొ న్నారు.

ఓ వినూత్న ఉత్సాహంతో యుద్ధరంగంలో ప్రవేశించారు - మనం వెనుకటి పుటల్లో చర్చించుకున్న ఫాసిక్ బిరుదాంకితుడు అబూ ఆమిర్ రాషిబ్ కుమారుడు ఈయన - హజ్రత్ హంజలా (ర)కు యుద్ధం జరిగే రోజుల్లోనే పెళ్ళయింది. యుద్ధం కోసం దైవప్రవక్త (స) గారి పిలుపు అందినప్పుడు ఆయన తన భార్య అలింగనంలో ఉన్న వ్యక్తి. ఆ పిలుపు వినగానే అదే పరిస్థితిలో జిహాద్ కోసం బయలుదేరి వచ్చారు. ముష్రిక్కులతో యుద్ధం ప్రారంభం కాగానే వారి వరసల్ని చీల్చుకుంటూ ఆ సేనకు సర్వసైన్యాధ్యక్షుడు అయిన అబూ సుఫ్యాన్ వరకు వెళ్ళగలిగారు. అతణ్ణి అంతం చేద్దాం అని అతనిపై కరవాలం ఎత్తారో లేదో షద్దార్ బిన్ అవస్ అనేవాడు ఆయన్ను చూశాడు. వెంటనే ఆయనపై దాడి చేసి నేలకూల్చాడు. హజ్రత్ హంజలా(ర) అక్కడనే ప్రాణాలు వదిలి అమరగతిని పొందారు.

విలుకాండ్ర ఘనకార్యం

జబలె రమాత్‌పై ఏ విలుకాండ్రనైతే మహాప్రవక్త (స) నియమించారో వారు యుద్ధాన్ని ముస్లిములకు అనుకూలంగా మార్చడంలో ప్రముఖ పాత్రను పోషించారు. ఖాలిద్ బిన్ వలీద్ నడుపుతున్న మక్కా ఆశ్విక దళం సైనికులు, అబూ ఆమిర్ ఫాసిక్ సహాయంతో ఇస్లామీయ సైన్యపు ఎడమ పార్శ్వాన్ని బీటలువార్చి ముస్లిముల వెనుక భాగానికి చేరి వారిని ఛిన్నాభిన్నం చేసి ఓడించడానికి మూడుసార్లు విఫల ప్రయత్నం చేసింది. ఆ మూడు మార్లు కూడా ముస్లిమ్ విలుకాండ్రు ఆ పటాలాన్ని తమ బాణాల వర్షంతో అడ్డుపడి ఆ ప్రయత్నాన్ని విఫలం చేశారు.[13]

ముష్రిక్కుల ఓటమి

కొంతకాలం వరకు భీకర సంగ్రామం జరుగుతూనే ఉంది. ముస్లిముల ఈ చిన్న సేన, యుద్ధగమనంపై పూర్తి ఆధిక్యతను సంపాదిస్తోంది. చివరికి ముష్రిక్కుల ధైర్యం సన్నగిల్లి వారి వరుసలు కుడి ఎడమలుగా, ముందు వెనుకలుగా చెల్లాచెదరవుతున్నాయి. అంటే మూడు వేల మంది ముష్రిక్కు సైనికులు, ఏడు వందలు కాదు, ముప్పై వేల మంది ముస్లిముల సైన్యంతో

13. చూడండి, ఫత్‌హుల్ బారి-7/346

తలపడినట్లుగా అగుపడుతోంది. ఇటు ముస్లిములు విశ్వాసం, నమ్మకం మరియు పరాక్రమానికి మారుపేరుగా ఖడ్గ విన్యాసాలు సాగిస్తున్నారు.

ఖురైషులు ముస్లిముల ఎడతెగని ఈ దాడులను అడ్డుకోవడానికి తమ శక్తినంతా వెచ్చిస్తూనే ఉన్నారు. అయినా వారిలో నిరుత్సాహం, చేతకానితనం చోటు చేసుకుంటున్నాయి. 'సువాబ్' హత్య తరువాత యుద్ధాన్ని కొనసాగించ డానికి, తమ పడిపోయిన జెండా దగ్గరకు చేరి దాన్ని ఎత్తుకునే ధైర్యం కూడా ఎవ్వరూ చేయలేకపోతున్నారు. ఆ పరిస్థితిలోనే వారు వెనక్కు తగ్గనారం భించారు. ఆ తరువాత పారిపోయే ప్రయత్నంలోపడ్డారు. పగ తీర్చుకోవడానికి, గౌరవమర్యాదలను నిలబెట్టుకోవడానికి వారు ఏ ప్రగల్భాలనైతే పలికారో, వాటన్నింటినీ మరచిపోయి యుద్ధరంగం నుండి పారిపోతున్నారు.

ఆ సమయంలో అల్లాహ్ ముస్లిములకు తన సహాయాన్ని అందించి తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇబ్నె ఇస్‌హాక్ కథనం ఇలా ఉంది:

"ముస్లిములు తమ కరవాలాలతో ముష్రిక్కులను వధించిన తీరు ఎలాంటిదీ అంటే, వారు తమ క్యాంపుకు కూడా చేరకుండా దూరంగా పారి పోయారు. అలా పారిపోవడం వలన వారికి పూర్తి ఓటమిని చవిచూసి నట్లయింది."

నా తండ్రి ఆ సమయంలో ఇలా అన్నారని అబ్దుల్లా బిన్ జుబైర్ ఇలా ఉల్లేఖిస్తున్నారు: "దైవసాక్షి! ఉత్బా కుమార్తె హింద్ మరియు ఆమె తోటి స్త్రీలంతా కాలిపిక్కెలు అగుపడేటట్లు కట్టుకున్న వస్త్రాలను చేతితో పైకెత్తుకొని పరుగులుదీస్తున్నారు. వారిని బంధించడం అప్పుడు సులభం."[14]

సహీ బుఖారీలో హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (ర)గారి ఓ ఉల్లేఖనం ఇలా ఉంది. దాని ప్రకారం ఆయన, "ముష్రిక్కులతో మాకు పోరు జరిగి నప్పుడు వారి సైన్యంలో త్రొక్కిసలాట ప్రారంభం అయింది. చివరికి స్త్రీలు కూడా తమ వస్త్రాలను చేత్తో పైకెత్తుకొని వేగంగా పరుగెడుతున్నారు. వారు పరుగెత్తేటప్పుడు వారి కాళ్ళ పట్టీలు అగుపడుతున్నాయి."[15]

ఎటూ పాలుపోక శత్రు సైన్యం పారిపోతున్న ఆ తరుణంలో ముస్లి ములు వారిపై ఖడ్గ ప్రహారాలు చేస్తూ, వారి సొమ్మును ప్రోగుచేస్తూ వెంటాడు తున్నారు.

14. ఇబ్నె హష్షామ్-2/77 15. సహీ బుఖారి-2/579

విలుకాండ్ర ఘోర తప్పిదం

ఈ పరిమిత ఇస్లామీయ పటాలం, మక్కా పౌరులకు వ్యతిరేకంగా చరిత్ర పుటల్లో, బద్ర్ యుద్ధ విజయానికి తీసిపోని మరో మహోన్నత విజయాన్ని నమోదు చేస్తున్న శుభ తరుణంలోనే, దైవప్రవక్త(స)చే జబ్లెరమాత్‌పై నియమించబడిన విలుకాండ్ర అధిక సంఖ్య ఓ ఘోర తప్పిదానికి పాల్పడింది. ఈ తప్పిదం వల్ల యుద్ధ ఫలితమే తారుమారైపోయింది. ముస్లిములు తీరని నష్టానికి గురైపోయారు. అంతేకాదు, స్వయంగా దైవప్రవక్త (స) కూడా వెంట్రుక వాసిలో అమరగతిని తప్పించుకున్నారు. బద్ర్ యుద్ధం కారణంగా ముష్రిక్కుల గుండెల్లో ముస్లిములంటే ఏర్పడ్డ భయోత్పాతం, అఘోరం, విలువ అన్నీ వీరి ఈ తప్పిదం వల్ల తుడుచుకుపోయినట్లయింది.

వెనుకటి పుటల్లో దైవప్రవక్త (స), విలుకాండ్రను నియమిస్తూ విజయం పొందినా, అపజయం పాలైనా అన్ని పరిస్థితుల్లోనూ ఆ కొండను వదిలిపెట్టి పోవద్దని తాకీదు చేయడం మనకు గుర్తు ఉండే ఉంటుంది. అయినా ఇన్ని ఆదేశాలు ఇచ్చినప్పటికీ వారు, ముస్లిములు యుద్ధ ధనాన్ని ప్రోగుచేసుకోవడం చూసి వారిలో ప్రపంచ వ్యామోహం కొంత పొడసూపింది. వారిలో కొందరు మరికొందరితో, "యుద్ధధనం, యుద్ధధనం! మనమే గెలిచాం. ఇక మనకు ఇక్కడేం పని" అని చెప్పనారంభించారు.

ఈ మాటలు విన్నంతనే ఆ పటాలం కమాండరు హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (ర), దైవప్రవక్త (స) గారి ఆదేశాలను వారికి గుర్తు చేస్తూ, "దైవప్రవక్త(స) మీకు ఏ ఆదేశాలైతే ఇచ్చారో వాటిని మీరు మరచి పోయినట్లుంది" అని వారించడానికి ప్రయత్నం చేశారు. అయినా ఆయన ఈ హితవుల్ని చాలా మంది పట్టించుకోకుండా, "దైవసాక్షి! మేము వారి దగ్గరికి తప్పకుండా వెడతాము. యుద్ధధనం నుండి మేము కొంత ప్రోగు చేసుకుంటాం" అన్నారు.[16]

ఆ తరువాత నలభై మంది విలుకాండ్రు తమ యుద్ధ మోర్చాలను వదిలి యుద్ధధనం ప్రోగు చేసుకోవడానికి సైన్యంలో చొరబడ్డారు. ఇలా ముస్లిముల వెనుక భాగం అంతా ఖాళీ అయిపోయింది. అక్కడ కేవలం హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (ర) మరియు ఆయనతోపాటు మరి తొమ్మండు

16. *ఈ విషయం సహీ బుఖారిలో హజ్రత్ బరా బిన్ ఆజిబ్(ర) గారు ఉల్లేఖించినట్లుంది. చూడండి, 1/426*

గురు మాత్రమే మిగిలిపోయారు. చివరి ఆదేశం లభిస్తే అక్కడికి వెడదామని, లేని పక్షంలో అక్కడనే ఉండి పోరాడి అవసరమొస్తే ప్రాణాలను సైతం ధారపోస్తామని శపథం చేసి నిలబడ్డారు.

ఇస్లామీయ పటాలాన్ని చుట్టుముట్టిన ముష్రిక్కు సేన

ఇదివరకే మూడు మార్లు ఈ విలుకాండ్ర వలయాన్ని ఛేదించి ముస్లిమ్ సేన వెనుక భాగాన చేరి దాడి చేయడానికి ప్రయత్నించిన ఖాలిద్ బిన్ వలీద్ ఈ స్వర్ణావకాశాన్ని ఎలా చేజార్చుకుంటాడు. ఆయన అదునుచూసి ఎంతో వేగంగా చుట్టు తిరిగి కొన్ని నిమిషాల్లోనే హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (ర) మరియు ఆయన సహచరుల్ని చంపేసి ఇస్లామీయ సైనిక పటాలంపై వెనుక నుండి దాడి చేయనే చేశారు. ఆయన నడుపుతున్న అశ్విక దళం ఒక్కసారే నినాదం చేయడం వల్ల ఓడి అలసిసొలసిపోయి ఉన్న ముష్రిక్కు సేనలో ఓ క్రొత్త ప్రాణం వచ్చినట్లయింది. వారు కూడా వెనుదిరిగి ముస్లిములపై విరుచుకుబడ్డారు. ఇటు బనూ హారిస్ వంశానికే చెందిన ఓ స్త్రీ 'ఉమ్రా బిన్తె అల్కమా' వెంటనే క్రిందపడిపోయి ఉన్న ముష్రిక్కుల పతాకాన్ని పైకి ఎత్తి పట్టుకుంది. ఇంకేముంది! చెల్లాచెదురు అయిపోయిన ముష్రిక్కులు దాని చుట్టూ చేరనారంభించారు. వారలా జెండా వైపునకు వస్తూ ఒకరినొకరు కేకలేసి పిలువడం వలన ముస్లిములకు వ్యతిరేకంగా ఓ పెద్ద సేన తయారైపోయింది. అక్కడ నుండి వారు స్థిరంగా ఉంటూ ముస్లిములను ఎదుర్కోనారంభించారు. ఇప్పుడు ముస్లిములు ముందూ వెనుకా ముష్రిక్కులచే చుట్టుముట్టబడి, తిరుగలి రెండు రాళ్ళ నడుమ నలుగుతున్న గింజల్లా మారిపోతున్నారు.

మహాప్రవక్త (స) తీసుకున్న ప్రమాదభరితమైన మరియు సాహసోపేతమైన నిర్ణయం

ఆ సమయంలో దైవప్రవక్త (స) వెనుకా[17] ముందూ ఉన్న తన తొమ్మండుగురు[18] సహాబాల నడుమ ఉన్నారు. ఆయన ముస్లిములు శత్రువును

17. *దీనికి ఆధారం దివ్యఖుర్ఆన్‌లోని ఆయత్ (అర్థం: ప్రవక్త మిమ్మల్ని మీ వెనుక వైపు నుండి పిలుస్తున్నాడు అన్నది.)*
18. *సహీ ముస్లిమ్-2/107లోని ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స) ఏడుగురు అన్సారులు మరియు ఇద్దరు ఖర్షీ (ముహాజిర్) సహాబాల నడుమ ఉన్నారు.*

వెనక్కునెట్టడం శత్రు సేన ఓడిపోయి వెనక్కి పారిపోవడం చూస్తున్నారు. హఠాత్తుగా ఆయన ఖాలిద్ బిన్ వలీద్ ఆశ్విక దళం తమ వెనుకకు రావడం చూశారు. ఇప్పుడు దైవప్రవక్త (స) ముందు రెండే రెండు మార్గాలున్నాయి. శత్రువు చుట్టుముట్టిన తన సేనను వారి అదృష్టం మీద వదిలిపెట్టి ఆయన, తన వెంట ఉన్న వారితో సహా కలసి ఏదైనా సురక్షిత ప్రాంతానికి వెళ్ళిపోవడం ఒక మార్గం. అయితే రెండో మార్గం, తన ప్రాణాలను సైతం ప్రమాదంలో పడవేసి, ఓ పటిష్టమైన శక్తిని తయారు చేయడానికి సహాబా(ర)లను తమ వద్దకు పిలిచి ముష్రిక్కుల వలయాన్ని ఛేదించి తమ సేనను ఉహద్ కొండ పైకి తీసుకువెళ్ళే మార్గం చూపెట్టడం.

కఠిన పరీక్షకు సంబంధించిన ఈ కీలకమైన తరుణంలో దైవప్రవక్త(స) గారి యుద్ధకౌశల్యం, సాటిలేని ధైర్యసాహసం తీరు ఎలాంటిదో ద్యోతకమవుతాయి. ఎందుకంటే, ఆయన(స) తన ప్రాణాలను కాపాడుకోవడానికి పారిపోయే బదులుగా తన ప్రాణాన్ని ప్రమాదంలో పడవేసి సహాబా (ర) గార్ల ప్రాణాలను కాపాడే నిర్ణయం గైకొన్నారు.

కాబట్టి ఖాలిద్ బిన్ వలీద్ సైన్యాన్ని చూడగానే ఆయన(స) పెద్దగా అరుస్తూ, "ఓ దైవదాసుల్లారా! ఇటు రండి" అని పిలిచారు. ఆయనకు తెలుసు ఈ పిలుపు ముస్లిములకంటే ముందు ముష్రిక్కులకే వినబడుతుందన్న విషయం. జరిగింది కూడా అదే. ఇది విన్న ముష్రిక్కులకు దైవప్రవక్త (స) అక్కడనే ఉన్నారన్న విషయం తెలిసిపోయింది. కాబట్టి ముష్రిక్కుల పటాలం ఒకటి ముస్లిములకంటే ముందే దైవప్రవక్త (స) దగ్గరకు చేరుకుంది. తక్కిన గుర్రపు రౌతులు వేగంగా ముస్లిములను చుట్టుముట్టనారంభించారు. ఇప్పుడు మేము, ఈ రెండు యుద్ధరంగాల వివరాలను వేరువేరుగా విశదీకరిస్తాము.

చెల్లాచెదరవుతున్న ముస్లిములు

ముస్లిములు దిగ్బంధంలోనికి వచ్చాక వారి ఓ వర్గంవారి మెదళ్ళే మొద్దుబారిపోయాయి. కేవలం ప్రాణాలు ఎలా దక్కించుకోవాలా అన్నదే వారి ఆలోచన. కాబట్టి వారు యుద్ధ మైదానాన్ని వదిలిపెట్టి పారిపోయారు కూడా. వెనుక ఏం జరుగుతోందో వారికి తెలియదు. వారిలో ఒక వర్గం వారు పారిపోయి మదీనాలో ఆశ్రయం కూడా పొందారు. కొందరు కొండలపైకి ఎక్కేశారు. మరో వర్గం వెనక్కు తిరిగి ముష్రిక్కు సేనలోనికి పోయి కలగా

పులగమైపోయింది. ఒకరికి మరొకరి ధ్యాసే లేకుండాపోయింది. దీని ఫలితంగా స్వయంగా ముస్లిములే ముస్లిముల చేతిలో హతులవుతున్నారు. సహీ బుఖారిలో హ్రజత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, ఉహద్ యుద్ధం రోజున (మొదట) ముష్రిక్కులకు ఘోర పరాజయం ఎదురైంది. ఆ తరువాత ఇబ్లీస్ ఓ కేక వేశాడు. దైవదాసుల్లారా వెనక్కు మళ్ళండని. మొదటి వరుసలోని వారు వెనక్కు మళ్ళి వారి వెనకన ఉన్న వరసతో తలపడనారంభించారు. హజీఫా(ర), తన తండ్రి యమాన్‌పై దాడి జరగడం చూసి, అల్లాహ్ దాసులారా! ఆయన నా తండ్రి అని హెచ్చరించారు కూడా. కాని చంపేశారు ఆయన్ను వదల్లేదు. చివరికి ఆయన చనిపోయారు. హజీఫా (ర), అల్లాహ్ మిమ్మల్ని మన్నించుగాక' అని పలికి ఊరకుండిపోయారు. హ్రజత్ ఉర్వా ఉల్లేఖనం ప్రకారం, హ్రజత్ హుజైఫా మరణించినంత వరకు ముస్లిముల మేలునే కాంక్షించేవారు.[19]

ఎలాగైతేనేమి ముస్లిముల సేన తీవ్రమైన అస్తవ్యస్తకు, ఛిన్నాభిన్నానికి గురైపోయింది. చాలా మంది ఎటు పోవాలో తోచక స్తబ్దంగా నిలుచుండిపోయారు. ఈలోపునే ఓ వ్యక్తి, "దైవప్రవక్త (స) చంపబడ్డారని అరవనారంభించాడు. ఈ అరపులు వినగానే ముస్లిములకున్న ఆ కాస్త స్పృహ కూడా ఉడిగిపోయింది. చాలా మందికి ధైర్యం అడుగంటిపోయింది. కొందరు యుద్ధాన్ని కూడా ఆపేశారు. తమ చేతుల్లో ఉన్న ఆయుధాలను విసరికొట్టారు. ఇంకొందరికి, మునాఫిక్‌ల సర్దారు అయిన అబ్దుల్లా బిన్ ఉబై దగ్గరకు వెళ్ళి వారి కోసం అబూ సుఫ్యాన్‌తో తమను రక్షించమని అడుగుదాం అనే ఆలోచన కూడా వచ్చింది.

కొంతసేపు గడిచిన తరువాత హ్రజత్ అనస్ బిన్ నజ్ర్ (ర) వారి దగ్గరకు రావడం జరిగింది. వారంతా మిన్నకుండా కూర్చుని ఉండటాన్ని

---

19. *సహీ బుఖారి 1/539, 2/581; ఫత్‌హుల్ బారి 7/351, 362, 363. బుఖారే కాకుండా మరికొన్ని ఉల్లేఖనాల్లో, దైవప్రవక్త (స) హ్రజత్ హుజైఫా తండ్రి యమాన్ దీత్ (రక్తపరిహారం) చెల్లించడానికి సిద్ధపడితే హ్రజత్ హుజైఫా (ర), "నేను ఆయన దీత్‌ను ముస్లిములకు దానం చేసేశానన్నారు." దీని ఫలితంగా ఆయన దైవ ప్రవక్త(స) గారికి మరింత ప్రేమపాత్రుడయ్యారు. చూడండి, ముక్తసురుస్సీరత్ లిష్షేక్ అబ్దుల్ వహ్హాబ్ నజదీ పుట. 246.*

చూశారాయన. "ఏమిటి దేనికోసం ఎదురుచూస్తున్నారు?"అని అడగగా వారు, "దైవప్రవక్త(స) చంపబడ్డారట"అని బదులు పలికారు.

"అయితే ఆయన పోయిన తరువాత మీరు బ్రతికుండి ఏం చేస్తారు? లేవండి! దేనికోసమైతే మహాప్రవక్త (స) ప్రాణాలనర్పించారో మీరు కూడా మీ ప్రాణాలను అర్పించండి" అన్నారాయన. తన సంభాషణను కొనసాగిస్తూ, "ఓ అల్లాహ్! వీరు- అంటే ముస్లిములు - ఏ వైఖరినైతే అవలంబిస్తున్నారో దానికి నేను నిన్ను క్షమాపణ కోరుకుంటున్నాను. వారు- అంటే ముష్రిక్కులు- ఏదైతే చేశారో దానికి మేము బాధ్యులం కాము" అంటూ ముందుకు వెళ్ళిపోయారు. కొంతదూరం వెళ్ళారో లేదో ఆయనకు హజ్రత్ సఅద్ (ర) బిన్ ముఆజ్ తారసబడ్డారు. ఆయన ఈయన్నుద్దేశించి, "ఓ అబూ ఉమర్! ఎక్కడికి వెడుతున్నావు" అని అడుగగా, "ఆహా! స్వర్గసుగంధం గురించి ఏం చెప్పను! ఓ సఅద్! నేను ఆ సుగంధాన్ని ఉహద్ కొండకు అవతలి ప్రక్క నుంచి ఆఘ్రాణిస్తున్నాను" అని చెబుతూ హజ్రత్ అనస్ (ర) ముందుకు దూసుకు వెళ్ళి, ముష్రిక్కులతో పోరాడుతూ అమరగతులయ్యారు. యుద్ధం ముగిసిన తరువాత ఆయనకు గుర్తు పట్టలేనంతగా గాయాలు అయ్యాయి. చివరికి ఆయన చెల్లెలు ఆయన్ను ఆయన చేతివ్రేళ్ళను చూసి గుర్తు పట్టగలిగారు. ఆయన శరీరంపై బరిశెలతో, బాణాలతో ఎనభైకిపైగా గాయాలున్నాయి.[20]

ఇలాగే, సాబిత్ బిన్ వహ్హాబ్ (ర) తన జాతిని పిలుస్తూ, "ఒకవేళ ముహమ్మద్ (స)గారే చంపబడితే చంపబడ్డారు. కాని అల్లాహ్ మాత్రం బ్రతికే ఉన్నాడు కదా! ఆయనకు మరణం లేదు. మీరు మీ ధర్మం కోసం పోరాడండి. అల్లాహ్ మీకు తప్పకుండా సహాయపడి విజయాన్ని చేకూరుస్తాడు" అని అన్నారు. ఈ పిలుపు విన్న అన్సారుల ఓ వర్గం సిద్ధమై లేచి నిలబడింది. హజ్రత్ సాబిత్ (ర)వారి సహాయంతో ఖాలిద్ పటాలంపై దాడి చేశారు. ఆయన అలా యుద్ధం చేస్తూ ఖాలిద్ విసిరిన బరిసె దెబ్బకు షహీద్ అయిపోయారు. ఆయనలాగే ఆయన అనుచరులు కూడా యుద్ధం చేస్తూ షహీదులై పోయారు.[21]

---

20. జాదుల్ ముఆద్-2/93,96; సహీ బుఖారి-2/579
21. అస్సీరతుల్ హల్బియా -2/22

ఓ ముహాజిర్ సహాబీ (ర), ఇంకో అన్సారీ సహాబీ (ర) ప్రక్క నుండి వెళ్ళడం తటస్థించింది. ఆయన అప్పుడు రక్తంతో ముద్దగా తడిసి ఉన్నారు. ఆయన్ను చూసి ఆ ముహాజిర్ సహాబీ (ర), "ఓ సోదరా! ముహమ్మద్ (స) చనిపోయిన విషయం నీకు తెలిసిందా?" అని అడగగా, ఆయన, "ఒకవేళ ముహమ్మద్ (స) గారే చనిపోతే, ఆయన మటుకు అల్లాహ్ ధర్మాన్ని అందించినట్లే. ఇప్పుడు ఆ ధర్మాన్ని పరిరక్షించడం నీ వంతు" అని సమాధానమిచ్చారు.[22]

ఇలా ఉత్సాహపూరితమైన హృదయాలను చూరగొనే మాటల వల్ల ఇస్లామీయ సైన్యానికి కోల్పోయిన ధైర్యం తిరిగివచ్చినట్లయింది. వారికి స్పృహవచ్చినట్లయింది. వారు ఆయుధాలను పడవేయడం లేదా అబ్దుల్లా ఉబైతో కలసి రక్షణ కోసం అబూ సుఫ్యాన్‌ను యాచించే ఆలోచనను వదిలి తిరిగి తమ ఆయుధాలను చేబట్టారు. ముష్రిక్కుల పటిష్టమైన వలయాన్ని ఛేదించి ఇస్లామీయ కేంద్రం వైపునకు పోయే మార్గాన్ని సుగమం చేయడానికి ప్రయత్నించనారంభించారు. ఈలోపే, దైవప్రవక్త (స)గారి హత్యా వార్త కేవలం కల్పితమైందని, అసత్యమైందనే విషయం వారికి తెలిసినప్పుడు వారి శక్తి ద్విగుణీకృతమైపోయింది. వారి పరాక్రమంలోకి క్రొత్త ఊపిరి వచ్చినట్లయింది. కాబట్టి వారు ఓ భయంకరమైన దాడి చేసి ఆ వలయాన్ని ఛేదించి ఓ పటిష్టమైన కేంద్రం చుట్టూ చేరడంలో కృతకృత్యులయ్యారు.

ఇస్లామీయ సైనిక పటాలానికి చెందిన మూడవ వర్గం కేవలం దైవ ప్రవక్త (స) రక్షణ గురించే ఆలోచిస్తోంది. ఈ వర్గం, ముష్రిక్కుల వలయం ఛేదించబడిందన్న విషయం తెలుసుకోగానే దైవప్రవక్త(స) వైపునకు నడిచింది. ఆ వర్గంలో హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్(ర), ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) మరియు అలీ బిన్ అబీ తాలిబ్ (ర)లు ప్రముఖులు. వీరు శత్రు సేనను తుదముట్టించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. కాని దైవప్రవక్త(స)గారికి ప్రమాదం ఏర్పడిందన్న విషయం తెలుసుకోగానే ఆయన సంరక్షణార్థం ముందుకు ఉరికారు.

దైవప్రవక్త (స) చుట్టూ జరుగుతున్న భీకర పోరాటం

ఇస్లామీయ సేన చుట్టుముట్టబడి ముష్రిక్కుల దాడులకు బలి

---

22. జాదుల్ ముఆద్ -2/96

అవుతున్న సమయంలోనే మహాప్రవక్త (స) చుట్టూ కూడా భీకర పోరాటం జరుగుతోంది. ముష్రిక్కుల వలయం ప్రవక్త (స) చుట్టూ బిగిస్తూ ఉన్నప్పుడు మహాప్రవక్త (స) వెంట తొమ్మండుగురు సహాబాలు ఉన్న విషయం, ఆయన (స) ముస్లిములను నా వైపునకు రండి, నేను అల్లాహ్ ప్రవక్తను అని పిలిచినప్పుడు ఆ పిలుపు ముస్లిములకు ముందే ముష్రిక్కులకు చేరిందన్న విషయం, వారు ఆయన్ను చుట్టుముట్టిన తీరు మనం ఇదివరకే చెప్పుకున్నాం. కాబట్టి వారు ఆలస్యం చేయకుండా దైవప్రవక్త (స)పై దాడి చేయనే చేశారు. ఏ ఒక్క ముస్లిమ్ ఆయన్ను చేరకమునుపే వారు తమ శక్తినంతా ఆయన(స)పై ప్రయోగించనారంభించారు. హఠాత్తుగా జరిగిన ఈ దాడి ఫలితంగా ఆయన (స) వెంట ఉన్న తొమ్మండుగురు సహాబా(ర)లకు ముష్రిక్కులకు నడుమ భీకర యుద్ధం ప్రారంభం అయింది. ఈ దాడిలో ప్రాణాలు అర్పించే వైనం, ధైర్య సాహసాలు, పరాక్రమానికి సంబంధించిన అసాధారణ సంఘటనలు ఉనికిలోకి వచ్చాయి.

సహీ ముస్లిమ్‌లో హజ్రత్ అనస్ (ర)గారి ఉల్లేఖనం ఆ దృశ్యాన్ని ఇలా వివరిస్తోంది.

"ఉహద్ యుద్ధం రోజున దైవప్రవక్త (స) గారి వెంట ఉన్న ఏడుగురు అన్సారులు, ఇద్దరు ఖురైషీ సహాబా (ర)లు ముస్లిమ్ సైన్యానికి దూరంగా ఉన్నారు. దాడి చేసేవారు మరీ దగ్గరకు రావడం చూసి మహాప్రవక్త (స) వారిని ఉద్దేశించి, "వారిని దగ్గరకు రాకుండా ఎవరు అడ్డుకోగలరో వారి కోసం స్వర్గం ఎదురు చూస్తోంది" లేదా "అతను నా వెంట స్వర్గంలో ఉంటాడు" అని అన్నారు. ఆ తరువాత ఓ అన్సారీ సహాబీ ముందుకొచ్చి యుద్ధం చేస్తూ అమరగతినొందారు. ఆ తరువాత ముష్రిక్కులు మరింత దగ్గరకు రాగానే తిరిగి అలానే జరిగింది. అలా ఒకరి తరువాత మరొకరు ఏడుగురు అన్సారీ సహాబా (ర)లు అమరగతిపొందారు. ఇది చూసిన దైవప్రవక్త (స), మిగిలిన తన ఇద్దరు అనుచరులను - అంటే ఖురైషీలను సంబోధిస్తూ మనం మన ఈ సహచరుల ఎడల న్యాయం చేయలేదు"[23]అని అన్నారు.

ఈ ఏడుగురిలో చివరి సహాబీ హజ్రత్ అమ్మారా బిన్ యజీద్ బిన్ అలస్కన్. ఆయన పోరాడుతూ బాగా గాయాలై క్రిందపడిపోయారు.[24]

23. *సహీ ముస్లిమ్-బాబుల్ గుజ్వా ఉహద్-2/107*

24. *ఓ క్షణం తరువాత దైవప్రవక్త (స) దగ్గరకు సహాబా (ర)కు చెందిన కొందరు*

అమ్మారా (ర) పడిపోయిన తరువాత దైవప్రవక్త (స)గారి వెంట ఉన్న వారు కేవలం ఇద్దరు ఖురైషీ సహాబీలే. సహీహైన్‌లో హజ్రత్ అబూ ఉస్మాన్(ర) గారి ఉల్లేఖనం ప్రకారం, ఆ మిగిలి ఉన్న ఇద్దరు తల్హా బిన్ ఉబైదుల్లా (ర) మరియు సఅద్ బిన్ అబీ వికాస్ (ర)లు.[25] ఈ క్షణం దైవప్రవక్త (స) కోసం ఎంతో కఠినమైనది మరియు ముష్రిక్కుల కోసం అది ఎంతో స్వర్ణావకాశంగా పరిణమించింది. నిజం చెప్పాలంటే ముష్రిక్కులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవడంలో ఏ మాత్రం జాప్యం చేయలేదు. వారు ఎడతెగ కుండా దైవప్రవక్త(స)పై దాడి చేస్తూనే ఉన్నారు, ఆయన్ను హతమార్చడానికి. ఈ దాడిలో ఉత్బా బిన్ అబీ వికాస్ దైవప్రవక్త(స)పై ఒక రాయి విసరగా ఆయన (స) ప్రక్కకు పడిపోవడం జరిగింది. ఆయన కుడి వైపున ఉన్న క్రింది 'రుబాయి'[26] దంతం విరిగిపోయింది. దానికితోడు దైవప్రవక్త (స)గారి క్రింది పెదవికి కూడా గాయమైంది. అబ్దుల్లా బిన్ షహాబ్ జహ్రీ ముందుకు వెళ్ళి దైవప్రవక్త(స) నొసటిని కూడా గాయపరిచాడు. మరో అశ్వారూఢుడైన దైవ ధిక్కారి 'అబ్దుల్లా బిన్ ఖమా' ఆయన(స) గారి భుజంపై కత్తివ్రేటు వేశాడు (ఆ దెబ్బ బాధను దైవప్రవక్త (స) ఒక నెల వరకు అనుభవించారని ఉల్లేఖనాలు చెబుతున్నాయి). అయితే దైవప్రవక్త (స) తొడిగిన రెండు కవచాల్లోని ఒక కవచం మాత్రం తెగలేదు. ఆ తరువాత అతడు మొదటి వ్రేటు వేసినట్లే రెండో వ్రేటు కూడా వేశాడు. అది కంటి కింద ఉన్న ఎముకపై తగిలింది. దాని కారణంగా తలపై పెట్టుకున్న శిరస్త్రాణపు[27] రెండు చివర్లు ఆయన (స)గారి ముఖంలో గ్రుచ్చుకున్నాయి. వెంటనే అతడు, నేను ఖుమా (విరిచే

చేరిపోయారు. వారు దైవతిరస్కారుల్ని హజ్రత్ అమ్మారాకు దూరంగా నెట్టారు. ఆయన్ను మహాప్రవక్త (స) దగ్గరికి తీసుకుని వెళ్ళగా ఆయన్ను తన కాళ్ళకు ఆధారంగా ఆనించి కూర్చున్నారు. అదే స్థితిలో ఆయన ప్రాణాలు గాలిలో కలసి పోయాయి. ప్రాణం విడిచేటప్పుడు ఆయన చెక్కిలి దైవప్రవక్త(స) గారి పాదాలపై ఉంది. (ఇబ్నె హష్షామ్-2/81)

25. *సహీ బుఖారి-1/527, 2/581)*

26. *నోటిలోని మునిపళ్ళలోని పైవి, క్రిందివి రెండు దంతాలను 'సనాయా' అంటారు. అదే విధంగా పైన, క్రింద ఉన్న కుడి ఎడమలు గల రెండు దంతాలు రుబాయి దంతాలు. అంటే కోర పంటికి ప్రక్కనున్న దంతాలన్నమాట.*

27. *ఇనుముతో లేదా రాతితో తయారైన శిరస్త్రాణం (హెల్మెట్). యుద్ధంలో తలను రక్షించుకోడానికి దీన్ని తలపై ధరిస్తారు.*

వాడు) కుమారుణ్ణి అని చెప్పి పరిచయం చేసుకోగా, దైవప్రవక్త (స) రక్తాన్ని తుడుచుకుంటూ, "అల్లాహ్ నిన్ను కూడా విరిచేయుగాక!" అన్నారు.[28]

సహీ బుఖారీ గ్రంథంలో ఇలా ఉంది:

"దైవప్రవక్త (స)గారి రుబాయీ దంతం విరిచేయబడింది. తలను గాయపర్చడం జరిగింది. ఆ సమయంలో ఆయన రక్తం తుడుచుకుంటూ ఇలా పలుకుతున్నారు. "ఏ జాతి అయితే, దైవం వైపునకు పిలిచే తన ప్రవక్తను గాయపరిచిందో, ఆయన దంతాన్ని విరిచిందో, అది ఎలా సాఫల్యం పొంద గలదు?" దీనికి అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు.

لَيْسَ لَكَ مِنَ الْأَمْرِ شَيْءٌ أَوْ يَتُوبَ عَلَيْهِمْ أَوْ يُعَذِّبَهُمْ فَإِنَّهُمْ ظَٰلِمُونَ ۝

"(ఓ ప్రవక్తా!) నిర్ణయాధికారాలలో నీకు పాత్ర ఏమీ లేదు. వారిని క్షమించే, శిక్షించే అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. ఎందుకంటే వారు దుష్టులు." [29] **(3:128)**

తిబ్రానీ ఉటంకించిన ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చినట్లుగా ఉంది.

"ఆ జాతిపై అల్లాహ్ శిక్ష పడుగాక! ఏ జాతి అయితే తన ప్రవక్త (స) ముఖాన్ని రక్తసిక్తం చేసిందో." కొంచెం ఆగి మళ్ళీ ఇలా అన్నారు: "ఓ అల్లాహ్! నా జాతిని మన్నించు. దానికి ఏమీ తెలియదు."[30]

సహీ ముస్లిం గ్రంథంలో ఈ ఉల్లేఖనం ఉంది. ఆయన (స) పదే పదే ఇలా పలుకుతున్నారని.

---

28. అల్లాహ్, ప్రవక్త (స) గారి దుఆను విన్నాడు. ఇబ్నె ఆయిజ్ (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, ఇబ్నె ఖుమా యుద్ధానంతరం ఇంటికి వెళ్ళి తన మేకలను చూడడానికి బయలుదేరాడు. అతని మేకలు గుట్ట శిఖరంపై ఉన్నాయి. ఇతను అక్కడికి వెళ్ళగా ఓ కొండ పొట్టేలు అతనిపై దాడి చేసింది. కొమ్ములతో కుమ్మి ఆ ఎత్త యిన కొండ నుండి క్రిందికి దొర్లించింది (ఫత్‌హుల్ బారి-7/373). తిబ్రానీ ఉల్లే ఖనం ప్రకారం, అల్లాహ్ అతనిపై ఓ కొండ పొట్టేలును ఉసికొల్పాడు. అది అతణ్ణి కొమ్ములతో పొడిచి పొడిచి ముక్కముక్కలుగా చేసింది. (ఫత్‌హుల్ బారి-7/322).

29. సహీ బుఖారి-2/582, సహీ ముస్లిమ్-2/108)

30. ఫత్‌హుల్ బారి-7/373

"ఓ ప్రభూ! నా జాతిని క్షమించు, దానికి ఏదీ తెలియదు."[31]

ఖాజీ అయ్యాజ్ రచించిన 'షఫా' గ్రంథంలో ఈ పదాలు కనబడతాయి.

"ఓ అల్లాహ్! నా జాతికి రుజుమార్గం చూపు! దానికి ఏమీ తెలియదు."[32]

దైవప్రవక్త (స)ను అంతమొందించేందుకే ముష్రిక్కులు ఆయనపై దాడి చేశారనడంలో సందేహం ఏమాత్రం లేదు. కాని ఆ ఇద్దరు ఖురైషీ సహాబా (ర)లు, అంటే హజ్రత్ సఅద్ బిన్ అబీ వికాస్ (ర) మరియు తల్హా బిన్ ఉబైదుల్లా (ర)లు అసాధారణ పరాక్రమం, ధైర్యసాహసాలతో ఇద్దరే అయినప్పటికీ ముష్రిక్కుల విజయాన్ని అసాధ్యంగా మార్చివేశారు. ఈ ఇద్దరు అరబ్బులు నిపుణులైన విలుకాండ్రు. వారు తమ శరాఘాతాలతో ముష్రిక్కు సేనను దైవప్రవక్త (స) దాపుకు రాకుండా అడ్డుకున్నారు.

సఅద్ బిన్ అబీ వికాస్ (ర) గారి విషయానికొస్తే, దైవప్రవక్త(స) ఆయనకు తన తూణీరం నుండి బాణాలు అందిస్తూ, "బాణాలు వదలండి! నా తల్లిదండ్రులు మీపై అర్పితం"[33] అంటున్నారు. దైవప్రవక్త (స) ఇప్పటి వరకు తన తల్లిదండ్రులను అర్పించే మాట మరే సందర్భంలోనూ అనలేదు. దీనిద్వారా హజ్రత్ సఅద్ బిన్ అబీ వికాస్ (ర) గారి సామర్థ్యం ఎంతో అర్థమవు తుంది.[34]

ఇక హజ్రత్ తల్హా (ర)గారి విషయానికొస్తే, ఆయన ఘనకార్యం ఎలాంటిదో నిసాయీ గ్రంథంలో ఉటంకించిన ఉల్లేఖనం ద్వారా తెలుస్తుంది. ఈ గ్రంథంలో హజ్రత్ జాబిర్(ర)గారు వ్రేళ్ళపై లెక్కబెట్టేటంత మంది సహచరులతో ఉన్నప్పుడు ముష్రిక్కులు దైవప్రవక్త (స)పై దాడి చేసిన వైనాన్ని వివరించారు. ఆయన ఉల్లేఖనం ఇలా ఉంది:

"ముష్రిక్కులు దైవప్రవక్త (స)పై దాడికి దిగినతోడనే ఆయన (స), "వారిని ఎవరు అడ్డగించగలరూ?" అని అనగా, హజ్రత్ తల్హా, "నేను సిద్ధంగా ఉన్నాను దైవప్రవక్తా(స)"అని అన్నారు. ఆ తరువాత జాబిర్ (ర) అన్నారులు

---

31. సహీ ముస్లిమ్-గుజ్వయె ఉహద్ అధ్యాయం-2/108

32. కితాబుష్షఫా-1/81

33, 34. సహీ బుఖారి-1/407, 2/580,581

ముందుకు రావడం, ఒక్కొక్కరుగా షహీద్ అయిన తీరును వివరించారు. (ఆ వివరాలను మేము సహీ ముస్లిమ్ ఆధారంగా ఇదివరకే చెప్పి ఉన్నాం.)

హజ్రత్ జాబిర్ (ర)గారి కథనం ప్రకారం, వీరందరూ షహీదులు (అమరులు) అయిన పిదప హజ్రత్ తల్హా (ర) ముందుకు వచ్చారు. ఆయన పదకొండు మందికి ధీటుగా ఒక్కరే యుద్ధం చేశారు. చివరికి, చేతిపై తగిలిన ఖడ్గప్రహారానికి ఆయన చేతివ్రేళ్ళు తెగిపోయాయి. అలా వ్రేళ్ళు తెగగానే ఆయన నోట ఓ బాధాకరమైన శబ్దం వెలువడింది 'శ్శ్' అని. అది విన్న దైవప్రవక్త (స) ఆయనతో, "నీవే గనక బిస్మిల్లాహ్ అని ఉంటే దైవదూతలు నిన్ను ఎత్తుకునేవారు, ప్రజలు నిన్ను గమనించేవారు కూడా" అన్నారు. ఆ తరువాత ముష్రిక్కులను అల్లాహ్ వెనక్కు పంపించేశాడు.[35]

హాకిమ్ ఉల్లేఖనం ప్రకారం, ఆయనకు ఉహద్ రోజున ముప్పై తొమ్మిది లేదా ముప్పై అయిదు గాయాలైనట్లు, ఆ గాయాల్లో చేతి మధ్య వ్రేళ్ళు మరియు చూపుడు వ్రేలు ఉన్నాయని ఉంది.[36]

ఇమామ్ బుఖారి, ఖైస్ బిన్ అబీ హాజిమ్ ఉల్లేఖనాన్ని ఉటంకిస్తూ ఆయన ఇలా చెప్పాడని రాశారు. "నేను హజ్రత్ తల్హా (ర)గారి చేతి వైపు చూశాను. ఆయన చేయి మొద్దుబారి ఉంది. ఆ చేత్తోనే ఆయన ఉహద్ రోజున దైవప్రవక్త (స)ను రక్షించారు."[37]

తిర్మిజీ ఉల్లేఖనంలో, దైవప్రవక్త (స) ఆయన గురించి ఓ రోజున ఇలా సెలవిచ్చినట్లు ఉంది. "ఎవరైనా ఓ షహీద్‌ను భూమ్మీద తిరగాడుతూ చూడదలిస్తే, అతడు తల్హా (ర) బిన్ ఉబైదుల్లాను చూడవచ్చు" అన్నారు.[38]

అబూ దావూద్ తయాసీ, హజ్రత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనాన్ని ఇలా ఉల్లేఖించినట్లు చెబుతారు. "అబూ బక్ర్ (ర) ఉహద్ యుద్ధం గురించి చెప్పినప్పుడల్లా, ఈ యుద్ధం పూర్తిగా హజ్రత్ తల్హా (ర) కోసమే జరిగింది."[39] (అంటే ఇందులో దైవప్రవక్త (స)ను సంరక్షించే ఘనకార్యం ఆయనే నిర్వహించారు). హజ్రత్ అబూ బక్ర్(ర) ఆయన గురించి ఇంకా ఇలా కూడా చెప్పినట్లు ఉంది.

---

35. ఫత్‌హుల్ బారి-7/361; సునన్ నిసాయి-2/52,53

36. ఫత్‌హుల్ బారి-7/361

37. సహీ బుఖారి-1/527, 581

38. మిష్కాత్ -2/566; ఇబ్నె హష్షామ్-2/86

39. ఫత్‌హుల్ బారీ-7/361

"ఓ తల్హా బిన్ ఉబైదుల్లాహ్! నీ కోసం స్వర్గాలు వాజిబ్ అయ్యాయి (లిఖించబడ్డాయి). ఇంకా నీ వద్ద ఇప్పుడు హూరాెఐన్‌లు (పెద్ద కళ్ళుగల స్వర్గ అప్సరసలు) ఉన్నారు."[40]

ఈ సున్నితమైన, కష్టతరమైన తరుణంలోనే అల్లాహ్ పరోక్షంగా తన సహాయాన్ని అందించాడు. సహీహైన్ గ్రంథంలో హజ్రత్ సఅద్(ర)గారు ఉల్లేఖనం ఇలా ఉంది:

"ఉహద్ నాడు నేను దైవప్రవక్త (స) వైపు చూడగా ఇద్దరు వ్యక్తులు తెల్లటి దుస్తులు ధరించి ఆయన (స)గారి తరపున భయంకరంగా పోరాడుతున్నారు. వారిద్దరిని అంతకు పూర్వం నేను చూసి ఎరుగను. ఆ తరువాత కూడా వారు నా కంటబడలేదు." మరో ఉల్లేఖనంలో వారిరువురు హజ్రత్ జిబ్రీల్ మరియు మీకాయీల్ (దైవదూతలు) అని ఉంది.[41]

దైవప్రవక్త (స) వద్దకు సహాబా చేరుకోనారంభించడం

ఇదంతా కొన్ని క్షణాల్లోనే, హఠాత్తుగా, అతి శీఘ్రంగా సంభవించిన సంఘటన. దైవప్రవక్త (స) ఎంపిక చేసిన సహాబా (ర) మొదటి వరుసలో ఉన్నారు. యుద్ధ పరిస్థితి మారిపోగానే లేదా ప్రవక్త (స) గారి పిలుపు వినగానే వీరంతా మహాప్రవక్త (స) వైపునకు, దైవప్రవక్త (స)కు ఏ ప్రమాదమూ సంభవించకూడదు అనే ఉద్దేశ్యంతో పరుగెత్తుకు వచ్చేశారు. కాని వీరు వచ్చే లోపలే మహాప్రవక్త (స) గాయపడి ఉన్నారు. ఆరుగురు అన్సారీ సహాబా షహీద్ అయి ఉన్నారు. ఏడవ అన్సారీ గాయాలతో క్రిందపడిపోయి ఉన్నారు. హజ్రత్ సఅద్ (ర) మరియు హజ్రత్ తల్హా ప్రాణాలకు తెగించి దైవప్రవక్త (స)ను రక్షించడంలో నిమగ్నమై ఉన్నారు. వచ్చిన సహాబాలు అక్కడికి చేరగానే తమ శరీరాలను మరియు ఆయుధాలను అడ్డంగా ఉంచి మహాప్రవక్త (స) చుట్టూ గోడలా నిలబడ్డారు. శత్రువు ఎడతెగకుండా చేస్తున్న దాడుల్ని ఎంతో ధైర్యంగా ప్రతిఘటించడానికి ప్రయత్నం చేస్తున్నారు. యుద్ధ మైదానం నుండి మొట్టమొదట వచ్చిన సహాబీ, గుహ సహవాసి హజ్రత్ అబూ బక్ర్ (ర)యే. ఇబ్నె హబ్బాన్ తన సహీహ్ గ్రంథంలో హజ్రత్ ఆయిషా(ర) గారి ఉల్లేఖనాన్ని ఉటంకిస్తూ హజ్రత్ అబూ బక్ర్ (ర) గారు ఇలా చెప్పారని రాశారు:

---

40. ముఖ్తసిర్ తారీఖెడిమిష్క్-7/82

41. సహీ బుఖారి-2/580

"ఉహద్ రోజున అందరూ దైవప్రవక్త (స)ను వదిలి వెళ్ళిపోయారు. (అంటే ఆ తొమ్మండుగురు సంరక్షకులు తప్ప తక్కిన సహాబా (ర) అంతా యుద్ధం చేయడానికి ముందు వరుసల్లోనికి వెళ్ళిపోయి ఉన్నారు. ఆ తరువాత దిగ్బంధం జరిగిన తరువాత) మొట్టమొదటగా దైవప్రవక్త (స) గారి వద్దకు వచ్చినవాణ్ణి నేనే. చూద్దునుగదా! దైవప్రవక్త (స) గారి ముందు నిలబడి ఆయన తరఫున యుద్ధం చేస్తూ ఓ వ్యక్తి అగుపించాడు. అతను దైవప్రవక్త (స)ను రక్షిస్తున్నాడు. నేను (నా మనస్సులో), "తప్పక నీవు తల్హావే అయివుంటావు. నా తల్లిదండ్రులను నీకు అర్పింతునుగాక! తప్పకుండా నీవు తల్హావే అయి ఉంటావు" అనుకున్నాను. అంతలోనే అబూ ఉబైదా బిన్ జర్రాహ్, పక్షి ఎగురుతూ ఉన్నట్లు పరుగెత్తుకొని నా దగ్గరకు వచ్చేశారు, ఇప్పుడు మేమిద్దరం కలిసి దైవప్రవక్త (స) వైపునకు పరుగుతీశాం. చూద్దుము కదా! దైవప్రవక్త (స) ముందు హజ్రత్ తల్హా పడిపోయి ఉన్నారు. మహాప్రవక్త (స) మమ్మల్ని చూసి, "మీ సోదరుణ్ణి కాపాడండి! ఇతను స్వర్గాన్ని వాజిబ్ చేసుకున్నాడు" అన్నారు. మేము అక్కడికి వెళ్ళి చూద్దుముగదా దైవప్రవక్త (స)గారి ముఖం గాయపడి ఉంది. శిరస్త్రాణం రెండు అంచులు ఆయన కంటి క్రింద చెక్కిలిలో దూరిపోయి ఉన్నాయి. నేను వాటిని లాగడానికి ప్రయత్నం చేయగా అబూ ఉబైదా నన్ను వారిస్తూ,"దేవుని కోసం ఆగండి, వాటిని నేను పీకుతాను" అని అన్నారు. ఆ తరువాత ఆయన తన మునిపళ్ళతో ఒక దాన్ని దైవప్రవక్త (స)కు బాధ కలగకుండా పీకి బయటకు లాగిపారేశారు. (ఈ ప్రయత్నంలో) ఆయన క్రింది పన్ను ఒకటి ఊడిపోయింది. ఇక రెండో అంచును కూడా మెల్లగా మునిపళ్ళతోనే లాగారు. అప్పుడు కూడా ఆయన మరో పన్ను ఊడిపోయింది. ఆ తరువాత దైవప్రవక్త (స), "మీ సోదరుడు తల్హాను కాపాడండి, (అతను స్వర్గాన్ని)వాజిబ్ చేసుకున్నాడు" అని అన్నారు. మేము హజ్రత్ తల్హా వైపునకు తిరిగి ఆయన్ను ఆదుకున్నాం. ఆయనకు పదికంటే ఎక్కువ గాయాలే అయ్యాయి.[42] (హజ్రత్ తల్హా (ర) ఆ రోజు ఎంత పరాక్రమంగా ప్రాణాలొడ్డి దైవప్రవక్త (స)ను రక్షించారో ఈ సంఘటన ద్వారా అంచనా వేయవచ్చు.)

42. జాదుల్ మఆద్-2/95

ఈ సున్నితమైన క్షణాల్లోనే దైవప్రవక్త (స)గారి చుట్టూ ధీరులైన ముస్లిములు వచ్చి చేరారు, వచ్చినవారి పేర్లు ఇవి:

1. అబూ దుజానా (ర), 2. ముస్అబ్ బిన్ ఉమైర్ (ర), 3. అలీ బిన్ అబీ తాలిబ్ (ర), 4. సహల్ బిన్ హునైఫ్ (ర), 5. మాలిక్ బిన్ సనాన్ (ర), 6. (అబూ సయీద్ ఖుద్రీ (ర) గారి తల్లి) ఉమ్మె అమ్మారా నుసైబా బిన్తె కఅబ్ మాజనీయా (ర). 7. ఖతాదా బిన్ నోమాన్ (ర), 8.ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర), 9. హాతిమ్ బిన్ ముల్తఆ(ర) మరియు 10. అబూ తల్హా (ర)లు.

పెరుగుతున్న ముష్రిక్కుల ఒత్తిడి

ఇటు ముష్రిక్కుల సంఖ్య కూడా క్షణక్షణం పెరిగిపోతూనే ఉంది. దీని ఫలితంగా దాడులు కూడా తీవ్రం కానారంభించాయి. ఒత్తిడి కూడా బాగా పెరుగుతోంది. దైవప్రవక్త (స), అబూ ఆమిర్ ఫాసిక్ ఇలాంటి సమయం కోసమే త్రవ్వి ఉంచిన గుంటల్లో ఒక దానిలోనికి ఒరిగిపోతున్నారు. ఆ సమయంలోనే ఆయన మోకాలు బెణికింది. హజ్రత్ అలి (ర) ఆయన (స) చేయి పట్టుకొని ఊతమిచ్చారు. గాయాలతో పడి ఉన్న తల్హా బిన్ ఉబైదుల్లా ఆయన్ను బాహువుల్లో చిక్కించుకొని బయటకులాగి నిలబెట్టడం వలన దైవప్రవక్త (స) లేచి సరిగా నిలబడగలిగారు.

నేను ఓ ముహాజిర్ను ఇలా చెబుతూ ఉండగా విన్నాను అని నాఫె బిన్ జుబైర్ (ర) ఉల్లేఖిస్తున్నారు.

"యుద్ధం జరిగేటప్పుడు నేను అక్కడే ఉన్నాను. అన్ని వైపుల నుండి దైవప్రవక్త (స)పై బాణాల వర్షం కురుస్తోంది. అన్ని బాణాలూ ఆయనకు తగలకుండా ప్రక్కకు నెట్టివేయబడుతున్నాయి (అంటే చుట్టుముట్టి ఉన్న సహాబా వాటిని దైవప్రవక్త (స)కు తగలకుండా అడ్డుపడుతున్నారు). నేను చూస్తూ ఉండగానే, అబ్దుల్లా బిన్ షహాబ్ జహ్రీ అనేవాడు, "ముహమ్మద్ ఎక్కడున్నాడో నాకు చూపించండి. నేనైనా ఉండాలి లేదా ఆయననైనా బ్రతికి ఉండాలి" అని అంటున్నాడు.

దైవప్రవక్త (స) అతని ప్రక్కనే నిలబడి ఉన్నారప్పుడు. ఆయన ప్రక్కన ఇంకెవరూ లేరు. అలా అంటూనే అతను ముందుకు వెళ్ళిపోయాడు. అది చూసి సుఫ్వాన్ అతణ్ణి తిడుతూ (దైవప్రవక్త (స)గారి ఉనికిని చూపించగా)

అతను, "దైవసాక్షి! ఆయన నాకు కనబడలేదే! దైవసాక్షి! అల్లాహ్ ముహమ్మద్‌ను నాకు కనబడకుండా చేశాడట్లుంది" అన్నాడు. ఆ తరువాత మేము నలుగురం కలసి ముహమ్మద్ (స)ను హతమార్చే ప్రతిజ్ఞ చేస్తూ ముందుకు వెళ్ళాం. కాని మేమాయన్ను చేరలేకపోయాం."[43]

అద్భుతమైన పరాక్రమం

మొత్తానికి, ఈ సందర్భంలోనే ముస్లిములు అసాధారణ ధైర్యసాహసాలను, పరాక్రమాన్ని ప్రదర్శించి చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచే త్యాగానికి పూనుకున్నారు. అబూ తల్హా (ర) తన శరీరాన్ని మహాప్రవక్త (స)కు అడ్డంగా పెట్టి నిలబడ్డారు. ఆయన (స)కు ఎదురుగా పెట్టి వచ్చే శరపరంపరను మహాప్రవక్త (స)కు తగలకుండా తన వక్షస్థలాన్ని పైకెత్తి నిలుచున్నారు. హజ్రత్ అనస్(ర)గారి కథనం ప్రకారం, ఆ ఉహద్ యుద్ధం నాడు సాధారణ ముస్లిములు పరాజయంపాలై దైవప్రవక్త (స) దగ్గరికి రావడానికి బదులుగా అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు. హజ్రత్ అబూ తల్హా (ర) మాత్రం దైవప్రవక్త (స) గారి ఎదుట ఢాలులా నిలబడి ఆయన్ను రక్షిస్తున్నారు. ఆయన ఓ ఆరితేరిన విలుకాడు. బాణాన్ని బాగా లాగి వదలడం ఆయన ప్రత్యేకత. కాబట్టి ఆ రోజు రెండో మూడో విల్లుల్ని విరగకొట్టేశారాయన. దైవప్రవక్త (స) దగ్గర నుండి ఎవరైనా బాణాల తూణీరాన్ని తీసుకొని పోతూ ఉంటే, ఆయన (స) వారితో మీ బాణాలన్నీ అబూ తల్హా (ర)కు ఇచ్చేయండి అని ఆదేశిస్తున్నారు. దైవప్రవక్త (స) తన జాతి వైపు తల ఎత్తి చూసినప్పుడల్లా, అబూ తల్హా (ర), "ఓ ప్రవక్తా (స)! నా తల్లిదండ్రులు మీకై అర్పితం. తమరు తల ఎత్తి చూడొద్దు. బహుశా వారి బాణం ఏదైనా తమకు వచ్చి తాకవచ్చు. నా వక్షస్థలం తమ వక్షస్థలానికి అడ్డంగా ఉంది కదా" అని అనేవారు.[44]

హజ్రత్ అనస్ (ర) గారి మరో ఉల్లేఖనం ప్రకారం, "హజ్రత్ అబూ తల్హా దైవప్రవక్త (స) గారితోపాటు ఒకే ఒక ఢాలుతో ఆ బాణాల్ని అడ్డుకుంటున్నారు. అబూ తల్హా (ర) ఓ మంచి విలుకాడు, ఆయన బాణాన్ని వదలగానే మహాప్రవక్త (స) ఆ బాణం ఎక్కడ పడిందా అని మెడ పైకెత్తి చూసేవారు."[45]

43. జాదుల్ ముఆద్-2/97

44. సహీ బుఖారి-2/581   45. సహీ బుఖారి-1/406

హజ్రత్ అనస్ (ర) గారి మరో ఉల్లేఖనం ప్రకారం, "హజ్రత్ అబూ తల్హా దైవప్రవక్త (స) గారితోపాటు ఒకే ఒక ఢాలుతో ఆ బాణాల్ని అడ్డుకుంటున్నారు. అబూ తల్హా (ర) ఓ మంచి విలుకాడు, ఆయన బాణాన్ని వదలగానే మహాప్రవక్త (స) ఆ బాణం ఎక్కడ పడిందా అని మెడ పైకెత్తి చూసేవారు."[45]

హజ్రత్ అబూ దుజానా (ర) దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి నిలబడ్డారు. తన వీపును ఆయన (స) కోసం ఢాలుగా ఉంచారు. వీపుపై బాణాలు వచ్చి పడ్డా ఆయన ఎటూ కదలలేదు.

హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్‌తఆ (ర), ఉత్బా బిన్ అబీ వికాస్‌ను తరుముతున్నారు. అతను దైవప్రవక్త (స)గారి దంతాన్ని విరగగొట్టినవాడు, అలా తరుముతూ వెళ్ళి అతనిపై ఖడ్గఘాతాన్ని వేయగా అతని తల తెగి క్రిందపడిపోయింది. ఆయన అతని గుర్రాన్ని, ఖడ్గాన్ని స్వాధీనం చేసుకున్నారు. హజ్రత్ సఅద్ (ర) బిన్ అబీ వికాస్ తన సోదరుడు ఉత్బా బిన్ అబీ వికాస్‌ను చంపడానికి చాలా ప్రయత్నించారు కాని ఆ ప్రయత్నంలో ఆయన సఫలీకృతులు కాలేకపోయారు. ఈ అదృష్టం హజ్రత్ హాతిబ్ (ర)గారికే దక్కింది.

హజ్రత్ సహల్ (ర) బిన్ హునైఫ్ కూడా ఓ పరాక్రమవంతుడైన విలుకాడు. ఆయన దైవప్రవక్త (స) ఎదుటకు వచ్చి ప్రాణాలు వదలిందాక పోరాడుతానని ప్రతిజ్ఞ చేశారు. ఆ తరువాత ఆయన ముష్రిక్కులను అడ్డుకోవడానికి తన శక్తినంతా ధారపోశారు.

మహాప్రవక్త (స) స్వయాన బాణాలు వదులుతున్నారు. ఈ విషయంలో ఖతాదా బిన్ నోమాన్ (ర)గారి ఉల్లేఖనం ఒకటుంది. దాని ప్రకారం, దైవప్రవక్త (స) తన విల్లుతో బాణాలు వదులుతూ ఉండగా దాని చివరి భాగం విరిగిపోయింది. ఆ తరువాత ఆ విల్లును హజ్రత్ ఖతాదా (ర) బిన్ నోమాన్‌కు ఇచ్చివేయగా అది ఆయన దగ్గరనే ఉండిపోయింది.

ఆ రోజు మరో సంఘటన కూడా జరిగింది. హజ్రత్ ఖతాదా (ర)గారి కంటికి దెబ్బ తగిలి ఆయన కనుగ్రుడ్డు బయటపడి ముఖంపై జారిపోయింది. దైవప్రవక్త (స) తన చేత్తో దాన్ని దాని స్థానంలో దూర్చివేశారు. ఆ తరువాత ఆ కన్ను యథాస్థితికి వచ్చేసింది. ఆయన రెండు కళ్ళల్లో ఈ కన్నే ఎంతో అందంగా అగుపడసాగింది. దాని చూపు కూడా మొదటికంటే పెరిగిపోయింది.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) పోరాడుతూ ఉండగా ఆయన నోటిలో గాయం అయింది. దానివల్ల ఆయన ముందటి పన్ను విరిగిపోయింది. ఆయనకు ఇరవై లేదా ఇరవై రెండు గాయాలయ్యాయి. వాటిలో కొన్ని కాలికి తగలడం వలన ఆయన కుంటివారైపోయారు.

అబూ సయీద్ ఖుద్రీ (ర)గారి తండ్రి మాలిక్ బిన్ సనాన్ (ర)గారు, దైవప్రవక్త (స)గారి ముఖం నుండి ప్రవహిస్తున్న రక్తాన్ని నోటితో పీల్చి శుభ్రం చేయగా, ఆయన (స) దాన్ని ఊసివేయమని చెప్పారు. దానికి ఆయన (ర), "దైవసాక్షి! దీన్ని నేనసలే ఊసివేయను" అంటూ వెనక్కు తిరిగి యుద్ధంలో నిమగ్నమైపోయారు. ఆయన్ను చూసి దైవప్రవక్త (స), "ఎవరైనా ఓ స్వర్గ నివాసిని చూడదలుచుకుంటే ఆయన్నే చూడాలి" అని అన్నారు. ఆ తరువాత హజ్రత్ మాలిక్ బిన్ సనాన్ (ర) యుద్ధం చేస్తూ అమరగతి పొందారు.

మరో అసాధారణ ఘనకార్యం; మహిళా సహాబియా హజ్రత్ ఉమ్మె అమ్మారా నసీబా బిన్తె కఅబ్ (ర) నిర్వహించినది. ఆమె కొందరు ముస్లిములతో కలసి పోరాడుతూ ఇబ్నె ఖుమా ఎదురుగా వెళ్ళి నిలబడ్డారు. ఇబ్నె ఖుమా, ఆమె భుజంపై వేసిన కత్తి వ్రేటుకు లోతైన గాయం అయింది. ఆమె కూడా ఇబ్నె ఖుమాపై ఎన్నో కత్తివ్రేటులను వేశారు. కాని అతను రెండు కవచాలు ఒకదానిపై ఒకటి ధరించటం వలన బ్రతికి బయటపడ్డాడు. హజ్రత్ ఉమ్మె అమ్మారా (ర) అలా పోరాడుతూ ఉండగా ఆమెకు పన్నెండు గాయాలయ్యాయి.

హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (ర) ఎంతో వీరోచితంగా పోరాడుతున్నారు. ఆయన దైవప్రవక్త (స)ను, ఇబ్నె ఖుమా మరియు అతని అనుచరులు చేసిన ఎడతెగని దాడుల్ని అడ్డుకుంటున్నారు. ఆయన చేతిలో ఇస్లామీయ సైన్యపతాకం రెపరెపలాడుతోంది. దుష్టులు ఆయన చేతిపై వేసిన ఖడ్గపు వ్రేటుకు ఆయన చేయి తెగిపడిపోయింది. ఆ తరువాత ఆయన ఆ జెండాను ఎడమ చేతిలోనికి తీసుకొని దైవధిక్కారుల ఎదురుగా నిలబడ్డారు. చివరికి ఆయన ఎడమ చేయి కూడా నరకబడింది. పిదప ఆయన మోకాలిపై కూర్చొని ఆ పతాకాన్ని తన వక్షస్థలానికి ఆనించుకుని నిలబెట్టారు. అదే పరిస్థితిలో ఆయన అమరగతి పొందారు. ఆయన్ను చంపినవాడు ఇబ్నె ఖుమాయే. అతను హజ్రత్ ముస్అబ్‌ను చూసి ఈయనే ముహమ్మద్ (స)

46. చూడండి, ఇబ్నె హిషామ్-2/73,80,83; జాదుల్ ముఆద్-2/97

ఉహద్ యుద్ధభూమి పటము





ఇది ఉహద్ కొండలలో ఒకటి. ఇక్కడే మహాప్రవక్త(స) గాయపడిన తరువాత విశ్రాంతి తీసుకున్నది.

అనుకున్నాడు. ఎందుకంటే ముస్అబ్ బిన్ ఉమైర్ (ర) దైవప్రవక్త (స) గారి పోలికలు గలిగి ఉండేవారు. కాబట్టి అతను ముస్అబ్ (ర)ను షహీద్ చేసి ముష్రిక్కుల వైపునకు వెళ్ళి, పెద్దగా అరుస్తూ ముహమ్మద్ (స) హతమై పోయారు అని ప్రకటించనారంభించాడు.[46]

మహాప్రవక్త (స)గారి మరణ వార్త - యుద్ధంపై దాని ప్రభావం

దైవప్రవక్త(స) హతులైనట్లు వెలువడిన వార్త ముస్లిములు మరియు ముష్రిక్కుల నడుమ దావానలంలా వ్యాపించింది. దైవప్రవక్త (స) నుండి వేరుబడిపోయి ముష్రిక్కుల దిగ్బంధంలో చిక్కిపోయిన ముస్లిములకు అది సున్నితమైన ఘడియ. వారి ధైర్యాలు పూర్తిగా అడుగంటిపోయాయి. వారి స్థయిర్యం చల్లబడిపోయింది. వారి వరసలు ఛిన్నాభిన్నమైపోయాయి. అయితే దైవప్రవక్త (స)గారి మరణ వార్తతో ఓ మేలే జరిగింది. ముష్రిక్కులు చేస్తున్న దాడుల్లో కొంత తీవ్రత తగ్గిపోయింది. ఎందుకంటే, దైవప్రవక్త (స)ను హత మార్చడమే వారి లక్ష్యం. ఆ లక్ష్యం కాస్తా నెరవేరిపోయింది కాబట్టి ముష్రిక్కులు తమ దాడుల్ని ఆపి ముస్లిం షహీదుల (అమరగతినొందిన వారి) శరీరాలను ముస్లా (చనిపోయినవారి ముక్కులు చెవులు కోసి ముఖాల్ని చెడగొట్టడం) చేయనారంభించారు.

దైవప్రవక్త (స) యుద్ధాన్ని కొనసాగిస్తూ పరిస్థితులను నియంత్రించడం

హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (ర)గారి అమరగతి తరువాత ముస్లిముల యుద్ధపతాకం హజ్రత్ అలి (ర)కు ఇవ్వడం జరిగింది. ఆయన స్థిరంగా నిలబడి యుద్ధం చేయనారంభించారు. అక్కడ ఉన్న సహాబా (ర)లు కూడా అసాధారణ ధైర్యసాహసాలను ప్రదర్శించి శత్రువు దాడుల్ని అడ్డుకుంటూ ఎదురు దాడులకు దిగారు. దీనివల్ల మహాప్రవక్త (స)కు, శత్రువుల దిగ్బంధాన్ని చీల్చి సహాబా ఉన్న వైపునకు దారి కల్పించడానికి అవకాశం లభించింది. కాబట్టి మహాప్రవక్త (స) అడుగు ముందుకువేస్తూ సహాబా (ర) ఉన్న వైపునకు కదలడం ఆరంభించారు. అందరికంటే ముందు హజ్రత్ కఅబ్ బిన్ మాలిక్(ర) దైవప్రవక్త (స)ను గుర్తు పట్టారు. సంతోషాతిరేకంతో, "ఓ ముస్లిమ్ యోధుల్లారా! సంబరపడండి, చూడండి, ఇరుగో దైవప్రవక్త (స)!" అంటూ అరవనా

రంభించారు. దానికి మహాప్రవక్త (స) ఆయన్ను, తమ ఉనికి మరియు తాము నిలబడిన స్థానం ఏదో తెలియకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో అరవకండి! అని సైగతో వారించారు. కాని కఅబ్ (ర)గారి కేక ముస్లిముల చెవులకు చేరనేచేరింది. ముస్లిములు ఒక్కొక్కరుగా ఆయన దగ్గరకు చేరనారంభించారు. క్రమక్రమంగా వారి సంఖ్య నలభై మంది వరకు పెరిగిపోయింది.

ఇంతమంది సహాబా (ర)లు చేరిన తరువాత మహాప్రవక్త (స) కొండ లోయ వైపు అంటే ముస్లిముల క్యాంపు వైపునకు కదలనారంభించారు. వెనక్కు తిరిగే ఈ చర్య వల్ల ముష్రిక్కులు ముస్లిములను తమ దిగ్బంధంలోకి తీసుకుని వారిని సంహరిద్దామనే పథకం పూర్తిగా నిరుపయోగమైపోయింది. ఇలా ముష్రిక్కుల ఈ నిర్బంధాన్ని ఛేదించి బయటపడే మార్గం ఏర్పడింది. ముస్లిమ్ యోధుల పరాక్రమం ముందు వారు నిలువలేకపోయారు. ఈలోపే ముష్రిక్కులకు చెందిన తల తిరిగిన అశ్విక యోధుడు ఉస్మాన్ బిన్ అబ్దుల్లా ముగైరా ప్రవక్త (స)పైకి, తానైనా ఉండాలి లేదా ముహమ్మద్ (స) అయినా ఉండాలంటూ లంఘించాడు. అటు దైవప్రవక్త (స) కూడా అతణ్ణి మార్కొన డానికి సిద్ధంగా లేచి నిలబడ్డారు. కాని దాడి చేసే అవకాశమే లభించలేదతనికి. ఎందుకంటే ఆ సమయంలోనే అతని గుర్రం ఓ గోతిలో పడిపోవడం జరిగింది. అంతలోనే హారిస్ బిన్ సమా (ర) అతని దగ్గరకు వచ్చి అతని కాలిపై తన కరవాలంతో ఓ గట్టి దెబ్బ వేశారు. ఆ దెబ్బకు అతను అక్కడనే కుప్పకూలి పోయాడు. అతణ్ణి అంతమొందించి, అతని ఆయుధాన్ని తీసుకొని దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చారాయన. కాని ఇంతలోనే మక్కా సేనకు చెందిన మరో అశ్వికుడు అబ్దుల్లా బిన్ జాబిర్ వెనుదిరిగి హజ్రత్ హారిస్ బిన్ సమా (ర)పై దాడి చేశాడు. ఆయన భుజంపై ఖడ్గప్రహారం చేసి గాయపరిచాడు. కాని ముస్లిములు ఆయన్ను ఎత్తుకున్నారు. తలపై ఎర్ర రుమాలు చుట్టుకొని యుద్ధం చేస్తున్న హజ్రత్ అబూ దుజానా (ర) ఇది చూసి అబ్దుల్లా బిన్ జాబిర్‌పై విరుచుకుపడ్డారు. ఆయన వేసిన ఖడ్గం వ్రేటుకు అతని తల ఎగిరి దూరంగా పడిపోయింది.

ఆ సంకుల సమరం జరిగేటప్పుడు దైవలీల ఏమిటోగాని ముస్లిము లకు నిద్ర ఆవహించి కునుకులు పడుతున్నారు. ఖుర్‌ఆన్‌లో చెప్పినట్లుగా,

"ఇది అల్లాహ్ తరపున వారికి ప్రశాంతత, సాంత్వన." ఈ విషయంలో అబూ తల్హా (ర) ఉల్లేఖనం ఇలా ఉంది:

"ఉహద్ రోజున నిద్ర ఆవహిస్తున్న వారిలో నేనూ ఒకణ్ణే. నా చేతిలోని కరవాలం ఆ కునుకులు పడుతున్నప్పుడు అనేకసార్లు చేతి నుండి జారిపోయింది. అది చేతి నుండి జారిపోతుంటే నేను దాన్ని ఎత్తుకునేవాణ్ణి. అలా అనేకమార్లు అది భూమ్మీద పడిపోగా నేను దాన్ని ఎత్తుకుంటున్నాను."[47]

చెప్పొచ్చిందేమిటంటే, ఇలా పరాక్రమం, ధైర్యసాహసాలను ప్రదర్శిస్తూ ఈ దళం పకడ్బందీగా వెనక్కి తగ్గుతూ పర్వత లోయల్లో ఉన్న తన శిబిరానికి చేరిపోయింది. తక్కిన సేన కోసం ఈ సురక్షిత ప్రదేశం వరకు చేరే మార్గాన్ని సుగమం చేసింది. మిగిలిన సేన అంతా సురక్షితంగా దైవప్రవక్త (స) వరకు చేరగలిగింది. ఇలా ఖాలిద్ బిన్ వలీద్ యుద్ధకౌశల్యం, మహాప్రవక్త (స)గారి యుద్ధకౌశల్యం ముందు పనిచేయలేక విఫలం అయిపోయింది.

ఉబై బిన్ ఖల్ఫ్ సంహారం

ఇబ్నె ఇస్‌హాక్ ఉల్లేఖనం ప్రకారం, మహాప్రవక్త (స) ఆ లోయలోనికి వచ్చి చేరిన తరువాత, ఉబై బిన్ ఖల్ఫ్ అనేవాడు, "ముహమ్మద్ ఎక్కడ? ఈ రోజు నేను లేదా అతను ఎవరో ఒకరు బ్రతికి ఉంటారంటూ" ముందుకు రానారంభించాడు. ఇది చూసిన సహాబా (ర), "దైవప్రవక్త (స)! అతనిపై దాడి చేయడానికి మాలో ఎవరికైనా అనుమతి ఇవ్వండి" అని అభ్యర్థించారు. దానికి దైవప్రవక్త (స), "అతణ్ణి దగ్గరకు రానివ్వండి"అని వారిని వారించారు. అతను ప్రవక్త (స)కు చేరువగా వచ్చినప్పుడు ఆయన(స), హారిస్ బిన్ సమా (ర)గారి చేతిలో ఉన్న చిన్న బరిశెను తీసుకొని విదిలించారు. ఈ విదిలింపుకు అక్కడున్నవారంతా, ఒంటె తన శరీరాన్ని జలదరించినప్పుడు దాని శరీరంపై ఉన్న జోరీగల్లా ఎగిరిపోయారు. ఆ తరువాత ఆయన (స) అతనికి ఎదురుగా వెళ్ళి అతను ధరించి ఉన్న కవచం మరియు శిరస్త్రాణం నడుమ గొంతు దగ్గర ఉన్న ఖాళీ ప్రదేశంలో ఆ బరిశెను ఆనించి గ్రుచ్చారు. ఆ దెబ్బకు అతను తన గుర్రం మీది నుండి ఎన్నోమార్లు దొర్లిపోయాడు. ఆ తరువాత ఖురైష్ దగ్గరకు వెళ్ళి- అతని గొంతు వద్ద ఏమంత పెద్ద గాయం కూడా

---

47. సహీ బుఖారి-2/582

లేదు. కేవలం బరిశె గీరుకొనిపోయిన ఆనవాళ్ళు మాత్రమే కనబడుతున్నాయి. ఆ గాయం నుండి రక్తం కూడా కారడం లేదు- దైవసాక్షి! ముహమ్మద్ నన్ను హత్య చేశాడు అని బెంబేలెత్తడం ప్రారంభించాడు. వాళ్ళు అతని వాలకం చూసి, "దైవసాక్షి! నీకు పిచ్చిపట్టినట్లుంది. నీకు ఎలాంటి గాయం కూడా తగల్లేదు" అని అన్నారు. అది విన్న అతను, "మీకు తెలియదు, మక్కాలో ఉన్నప్పుడు నేను నిన్ను చంపేస్తానని అని చెప్పి ఉన్నాడు."[48]

అందుకని "దైవసాక్షి! అతను నాపై ఉమ్మి వేసినా నా ప్రాణం పోయేది" అని అన్నాడు. చివరకు ఈ అల్లాహ్ విరోధి, మక్కాకు తిరిగి వెడుతున్నప్పుడు 'సర్ఫ్' అనే చోటుకు చేరిన తరువాత చనిపోయాడు.[49] అబుల్ అస్వద్, హజ్రత్ ఉర్వా (ర) గారు ఉల్లేఖిస్తూ, "ఇతను ఎద్దు అరిచినట్లుగా అరుస్తూ, ఎవరి చేతిలోనైతే నా ప్రాణం ఉందో ఆ దైవం సాక్షిగా చెబుతున్నాను. నాకు ఈ రోజు ఉన్న బాధను జిల్‌మజాజ్‌కు చెందిన ప్రజలందరికీ పంచి పెట్టినా వారందరూ ఆ బాధను భరించలేక చచ్చిపోతారు" అని చెప్పాడు.[50]

మహాప్రవక్త (స) గారికి ఊతమిచ్చి లేపిన హజ్రత్ తల్హా(ర)

మహాప్రవక్త (స) కొండ వైపునకు వెళ్ళేటప్పుడు మార్గమధ్యంలో ఒక ఎత్తయిన బండరాయి అడ్డుగా ఉంది. దైవప్రవక్త (స) దాన్ని ఎక్కడానికి ప్రయత్నించారు కాని సాధ్యం కాలేదు. దానికి కారణం, ఆయన శరీరం బరువుగా ఉండడం, దానికి తోడు ఒక దానిపై మరొకటిగా రెండు కవచాలను ధరించి ఉండడం. పైగా గాయపడి ఉన్నారు కూడా. అందుకని హజ్రత్

48. మక్కాలో దైవప్రవక్త (స) ఎదురైనప్పుడల్లా అతను, "ఓ ముహమ్మద్ ! నా దగ్గర ఇవద్ అనే పేరుగల గుర్రం ఉంది. నేను దానికి ప్రతి రోజు మూడు 'సాఅ'ల (అంటే ఏడున్నర కిలోల) దాణా వేసి మేపుతున్నాను. దాని వీపుపై కూర్చుని నిన్ను హతమారుస్తాను చూడు" అని అనేవాడు. సమాధానంగా మహాప్రవక్త (స), "కాదు! దైవచిత్తమైతే నేనే నిన్ను చంపుతాను"అనేవారు.

49. ఇబ్నె హిషామ్-2/84; జాదుల్ ముఆద్-2/97

50. ముక్తరుస్సీరతుర్రసూల్-షేక్ అబ్దుల్లాహ్, పుట. 250

51. ఇబ్నె హిషామ్-2/86

తల్హా బిన్ ఉబైదుల్లా (ర) క్రింద కూర్చోగా దైవప్రవక్త (స) ఆయన భుజాలపైకి ఎక్కి కూర్చున్నారు. అలా తల్హా (ర) లేచి నిలబడగా దైవప్రవక్త (స) ఆ బండరాయిపైకి చేరగలిగారు. అలా ఎక్కిన తరువాత దైవప్రవక్త (స), "తల్హా (ర) స్వర్గాన్ని వాజిబ్ చేసుకున్నారు" అన్నారు.[51]

బహుదైవారాధకులు చేసిన అంతిమ దాడి

ప్రవక్త శ్రీ(స) లోయలోని తమ శిబిర కేంద్రానికి చేరిపోయిన తరువాత బహుదైవారాధకులు ముస్లిములకు నష్టం కలిగించే ఉద్దేశ్యంతో చివరి ప్రయత్నంగా దాడి చేశారు. ఇబ్నె ఇస్‌హాక్ కథనం ఇలా ఉంది:

దైవప్రవక్త (స) లోయలోనికి వెళ్ళిపోయే లోపల అబూ సుఫయాన్ మరియు ఖాలిద్ బిన్ వలీద్‌ల నాయకత్వంలో బహుదైవారాధకుల ఒక సైనిక పటాలం వారిపై దాడి చేయడానికి వచ్చేసింది. ఆ సందర్భంలోనే మహాప్రవక్త (స) ఈ దుఆ చేశారు.

"ఓ అల్లాహ్! వీరిని మాకంటే పైకి ఎక్కకుండా చెయ్యి."

ఆ దుఆ చేసిన తరువాత హజ్రత్ ఉమర్ (ర) బిన్ ఖత్తాబ్ మరియు ముహాజిర్లకు చెందిన కొంతమంది వారితో పోరాడి వారిని కొండపైకి ఎక్కకుండా క్రిందికి దించేశారు.[52]

ముగాజీ ఉమవీగారి ఉల్లేఖనం ప్రకారం, బహుదైవారాధకులు కొండపైకి ఎక్కడం చూసి దైవప్రవక్త (స) హజ్రత్ సఅద్ (ర)గారితో, "వారిని భయభీతులుగా చేయండి (అంటే వారిని వెనక్కు నెట్టేయండి)"అని అన్నారు. దానికి సఅద్ (ర) సందిగ్ధపడుతూ, "నేనొక్కడినే వారిని ఎలా భయపెట్టగలను" అని అన్నారు. ఇలా దైవప్రవక్త (స) మూడుమార్లు ఆ మాటనే చెప్పగా ఆయన తన తూణీరం నుండి బాణం తీసి దాన్ని సంధించారు. శత్రు సైనికుల్లో ఒకడు అక్కడనే కుప్పకూలిపోయాడు. హజ్రత్ సఅద్(ర)గారి కథనం ప్రకారం, "నేను ఆ బాణాన్ని గుర్తుపట్టి తీసుకున్నాను. తిరిగి ఆ బాణంతోనే మరొకణ్ణి చంపేశాను. ఆ బాణాన్ని గుర్తుపట్టి వెనక్కు తీసుకొని మూడో వ్యక్తిని దానితో

52. ఇబ్నె హిషామ్-2/86

53. జాదుల్ ముఆద్-2/95

అంతమొందించాను. ఆ తరువాత బహుదైవారాధకులు పైకి ఎక్కకుండా క్రిందికి దిగిపోయారు. ఇది ఎంత శుభప్రదమైన బాణం అనుకుంటూ దాన్ని నా తూణీరంలో ఉంచుకున్నాను." ఈ బాణం ఆయన జీవితకాలం అంతా ఆయన వద్దనే ఉండిపోయింది. ఆ తరువాత అది ఆయన సంతానం సొత్తయి పోయింది.[53]

అమరగతినొందిన వారిని ముస్లా చేయడం (ముక్కు చెవులను కోసి ముఖాన్ని చెడగొట్టడం)

దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా ముష్రిక్కులు పాల్పడిన చిట్టచివరి హేయమైన కార్యం ఇది. దైవప్రవక్త (స)గారి విషయంలో చివరి వరకూ వారికి సరియైన అవగాహన ఏదీ లేదు. కాగా ఆయన(స) అమరగతినొందారనే వారనుకుంటున్నారు దాదాపుగా, అందుకని వారు తమ శిబిరం వైపునకు తిరిగి వెళ్ళిపోయారు. మక్కాకు తిరిగి వెళ్ళేందుకు సంసిద్ధులవుతున్నారు. కొందరు ముష్రిక్కులు మరికొందరు స్త్రీలు ముస్లిమ్ షహీదుల 'ముస్లా'కు ఉపక్రమించారు. అంటే అమరగతినొందిన వారి మర్మాంగాలను, చెవుల్ని, ముక్కులను కోసి వేశారన్నమాట. పొట్టల్ని చించి పారవేశారు. హింద్ బిన్తె ఉత్బా, హజ్రత్ హమ్జా(ర)గారి కాలేయాన్ని బయటకు లాగి కక్షతో నమల నారంభించింది. దాన్ని మ్రింగాలనుకుంది కాని మ్రింగలేక బయటకు ఉమ్మేసింది. కోసిన ముక్కులను మరియు చెవులను దండలుగా చేసి కాళ్ళకు పట్టీలుగా, మెడలో దండలుగా వేసుకుంది.[54]

చివరి వరకు పోరాడేందుకు ముస్లిముల సన్నాహాలు

చివరి సమయంలో రెండు సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ సంఘటనల ద్వారా ప్రాణాలను సైతం తెగించి పోరాడే ముస్లిములు చివరి ఘడియ వరకు యుద్ధం చేయడానికి ఎలా సంసిద్ధులై ఉన్నారో, అల్లాహ్ మార్గంలో ప్రాణాలు అర్పించడానికి ఎంత స్థయిర్యంగా ఉన్నారో అర్థం చేసుకో వచ్చు.

1. హజ్రత్ కఅబ్ బిన్ మాలిక్ (ర) ఇలా ఉల్లేఖిస్తున్నారు:

54. ఇబ్నె హష్షామ్-2/90

"నేను లోయ వదిలి బయటకు వచ్చిన ముస్లిముల్లో ఒకణ్ణి. ముష్రిక్కులు ముస్లిమ్ షహీదుల ముస్లా చేయడం నాకు కనిపించింది. నేను అక్కణ్ణే ఆగిపోయాను. ఆ తరువాత ఇంకొంత ముందుకు వెళ్ళి చూద్దునుగదా, ఓ లావుపాటి బలాఢ్యుడైన ముష్రిక్ కవచం ధరించి షహీదుల మధ్య నుండి వెళుతూ హేళనగా, "కోసిపారేసిన మేకల్లా పడి ఉన్నారు వీరు" అని అంటు న్నాడు. ఇంకో ముస్లిమ్ కొంచెం దూరంగా ఉండి అతని రాక కోసం ఎదురు చూస్తున్నాడు. అతను కూడా కవచాన్ని ధరించి ఉన్నాడు. నేను ఇంకొంత ముందుకు పోయి అతని వెంట నడువసాగాను. ఆ తరువాత నిలబడి కళ్ళతోనే ఆ ఇద్దరి శక్తిని బేరీజు వేయనారంభించాను. ఆ దైవ తిరస్కారే తన శరీరం, తన ఆయుధాలు మరియు తన శక్తిలో మిన్నగా అగుపించాడు. వారిద్దరు ఎప్పుడు తలపడతారా అని ఎదురు చూస్తూ నిలబడ్డాను. చివరికి ఇద్దరూ ఢీకొనడం జరిగింది. ఆ ముస్లిమ్ వేసిన కత్తి వ్రేటు ఆ ముష్రిక్ శరీరాన్ని రెండుగా చీల్చుకుంటూ కాళ్ళ వరకు వచ్చి ఆగింది. ఆ ముష్రిక్కు రెండు ముక్కలై క్రిందపడిపోయాడు. ఆ ముస్లిం తన ముఖంపై ఉన్న ముసుగును తొలగిస్తూ "ఓ కఅబ్! ఎలాగుంది? నేను అబూ దుజానాను" అని అన్నాడు.[55]

2. యుద్ధం చివరి దశలో కొందరు ముస్లిమ్ మహిళలు జిహాద్ రంగంలోకి దుమికారు. హజ్రత్ అనస్ (ర)గారు ఆ దృశ్యాన్ని ఇలా వివరి స్తున్నారు: "నేను హజ్రత్ ఆయిషా బిన్తె అబీ బక్ర్ (ర) (ప్రవక్త (స)గారి సతీమణి) మరియు ఉమ్మె సులైమ్(ర)లను కాళ్ళలోవున్న పట్టీలు కనబడేటట్లు తమ వస్త్రాన్ని పైకెత్తి, తోలు సంచులతో నీళ్ళను నింపి వీపులపై పెట్టుకొని మోసుకు రావడం చూశాను. వారు ఆ నీళ్ళను ముస్లిముల నోటిలో పోసి వారి దాహం తీరుస్తున్నారు."[56] హజ్రత్ ఉమర్ (ర)గారి ఉల్లేఖనంలో, "ఉహద్ రోజున హజ్రత్ ఉమ్మె సలీత్(ర) తోలు సంచితో నీళ్ళు మోసుకురావడం నేను

55. అల్ బదాయా వన్న హాయా-4/17 56. సహీ బుఖారి-1/403, 2/581
57. సహీ బుఖారి-1/403, 2/581
58. నూలు వడకడం అరబ్బు స్త్రీల ప్రత్యేక వృత్తి. అందుకని నూలు వడికే తకిలీ (అంటే కండెతో సహా) ఆ స్త్రీలకు సంబంధించిన ప్రత్యేక అలంకరణ, మన దేశంలో స్త్రీలకు గాజుల్లా. ఈ సందర్భంలో మన భాషలోని సామెత, గాజులు తొడుక్కొని కరవాలానివ్వండి అనే విధంగా తకిలీ తీసుకొని కరవాలానివ్వండి అన్నట్లు అన్నమాట.

చూశాను"[57]అని ఉంది.

ఆ మహిళల్లోనే హజ్రత్ ఉమ్మె అయిమన్ (ర) కూడా ఉన్నారు. ఆమె ఓడిపోయి మదీనాకు పారిపోయి వచ్చిన ముస్లిము ముఖంపై మట్టిని చిమ్ముతూ, "ఇదిగో ఈ నూలువడికే తకిలీ- ఇది తీసుకొని మా చేతికి మీ కరవాలాలను ఇవ్వండి"[58] అంటూ వేగంగా యుద్ధరంగానికి చేరుకున్నారు. క్షతగాత్రులకు నీరు త్రాపించనారంభించారు. ఈమెపై హిబ్బాన్ బిన్ అరక్ బాణం వదిలాడు. ఆమె క్రిందపడిపోగా ఆమె ముసుగు (పరదా) తొలగి పోయింది. దాన్ని చూసి ఆ దైవవిరోధి వికటాట్టహాసం చేశాడు. ఇది దైవప్రవక్త (స)కు రుచించలేదు. ఆయన(స), హజ్రత్ సఅద్ బిన్ అబీ వికాస్‌కు ఓ బాణం అందిస్తూ, "ఇదిగో దీన్ని వదలండి" అని అన్నారు. హజ్రత్ సఅద్ బిన్ అబీ వికాస్ (ర) ఆ బాణాన్ని వదలగా అది అతని గొంతుపై తగిలింది. వెంటనే అతను వెల్లెకిలా పడిపోయాడు. అతని వస్త్రాలు ఊడిపోయాయి. దీన్ని చూసి మహాప్రవక్త (స) దంతాల చిగుళ్ళు అగుపడేటట్లు దరహాసం చేస్తూ, "సఅద్, ఉమ్మె అయిమన్ (ర) పగ తీర్చుకున్నారు. అల్లాహ్ ఆయన దుఆను మన్నించుగాక"[59] అన్నారు.

లోయలో స్థిమితపడిన తరువాత

దైవప్రవక్త (స) కొండ లోయలోని తమ స్థావరంలో కొంచెం స్థిమితపడిన తరువాత హజ్రత్ అలి (ర) లేచి 'మెహ్రాస్' నుండి తన ఢాలులో కొన్ని నీళ్ళు తెచ్చారు - మెహ్రాస్ రాతి బండలో ఏర్పడిన గుంట అని చెప్పుకోవడం జరుగు తోంది. ఆ గుంటలో కొంత అధికంగానే నీరు నిలువ ఉంటుంది. అదేకాదు మెహ్రాస్ అనేది ఉహద్‌కు చెందిన ఓ నీటి చెలమ పేరని కొందరి వాదన - ఏదైతేనేమి హజ్రత్ అలి (ర) ఆ నీటిని తెచ్చి దైవప్రవక్త (స)కు తాగమని అందించారు. ఆ నీటిలో ఓ విధమైన దుర్వాసన రావడం వలన దైవప్రవక్త (స) ఆ నీటిని సేవించలేదు కాని తన ముఖం మీద ఉన్న రక్తాన్ని శుభ్రం చేసుకున్నారు. తలపై కూడా చల్లుకున్నారు. అలా రక్తాన్ని శుభ్రం చేస్తూ దైవప్రవక్త (స) ఇలా అంటూ ఉండగా వినడం జరిగింది.

59. అస్సీరుతుల్ హల్బియా-2/22

60. ఇబ్నె హష్షామ్-2/85

"ప్రవక్త ముఖాన్ని రక్తసిక్తం చేసిన ఆ దుష్టుడిపై దైవాగ్రహం పడుగాక!"[60]

హజ్రత్ సహల్ (ర) ఇలా అంటారు:

"దైవప్రవక్త (స)గారి గాయాన్ని కడిగిందెవరో, నీరు పోసిందెవరో, చికిత్స చేసినదెవరో నాకు బాగా తెలుసు. ఆమె ఆయన (స) ముద్దుల పట్టి హజ్రత్ ఫాతిమా (ర). నీరు వేసి కడగడం వల్ల రక్తస్రావం కొంత అధికం అవుతూ ఉంటే ఆమె ఓ చాప ముక్కను తీసుకొని కాల్చి ఆ గాయంపై వేసి అదిమారు. అలా చేయడం వలన రక్తస్రావం ఆగిపోయింది."[61]

అటు హజ్రత్ ముహమ్మద్ బిన్ ముస్లమా (ర) తీయటి రుచికరమైన నీటిని తేగా దైవప్రవక్త (స) దాన్ని త్రాగి ఆయనను దీవించారు.[62] గాయం అయిన కారణంగా దైవప్రవక్త (స) జొహ్ర్ నమాజు కూర్చునే చేశారు. సహాబా (ర) కూడా ఆయన (స) వెనుక కూర్చునే నమాజు చేశారు.[63]

అవహేళనకు దిగిన అబూ సుఫ్యాన్-హజ్రత్ ఉమర్ (ర)తో సంవాదం

బహుదైవారాధకుల తిరుగు ప్రయాణ సన్నాహాలు పూర్తి అయిపోగానే, అబూ సుఫ్‌యాన్ ఉహద్ కొండ మీద ప్రత్యక్షమై ముస్లిములకు వినబడేటట్లు బిగ్గరగా, "మీలో ముహమ్మద్ (స) ఉన్నారా?" అని అడిగాడు.

ముస్లిములు ఏమీ మాట్లాడకుండా మిన్నకుండిపోయారు. అతను తిరిగి అదే ప్రశ్నను రెట్టిస్తూ, "మీలో అబూ ఖహాఫా కుమారుడు (అబూ బక్ర్-ర) ఉన్నారా" అని అడిగాడు. దానికి కూడా ఎవ్వరూ సమాధానం ఇవ్వ లేదు. ఆ తరువాత మూడవసారి, "మీలో ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) ఉన్నాడా" అని అడిగాడు. ఈసారి కూడా ముస్లిములెవరూ మారుపలుక లేదు - దీనికి కారణం, దైవప్రవక్త (స) సహాబా (ర)ను అలా మాట్లాడకుండా ఉండ మని ఆదేశించడమే - అబూ సుఫ్‌యాన్ ఈ ముగ్గురు తప్ప మరెవరిని గురించీ అడగలేదు. ఎందుకంటే ఇస్లామ్ ధర్మసంస్థాపనం ఈ ముగ్గురి ద్వారానే సాధ్యమని అతనికీ, అతని జాతికీ బాగా తెలుసు గనుక. మొత్తానికి వారి నుండి ఏ సమాధానం రాకపోయేసరికి అతను, తన సైన్యాన్నుద్దేశించి,

61. సహీ బుఖారి - 2/584 62. అస్సీరతుల్ హల్బియా-2/30

63. ఇబ్నె హష్షామ్-2/87

"పదండి, ఆ ముగ్గురూ అంతమైపోయారు" అంటూ బయలుదేరడానికి ఆదేశమిచ్చాడు. ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర), తన సహనాన్ని కోల్పోయి, "ఓరీ దైవ విరోధి! నీవు ఇప్పటి వరకు ఏ ముగ్గురి పేర్లయితే ఉచ్చరించావో వారంతా సజీవంగానే ఉన్నారు. దేవుడు ఇంకా నిన్ను అగౌరవానికి, అపఖ్యాతికి గురిచేయాలనే చూస్తున్నాడు" అన్నారు. ఆ తరువాత అబూ సుఫ్యాన్ ముస్లిములనుద్దేశించి, "మీ హతుల ముస్లా చేయబడింది. దానికి నేను ఆదేశించలేదు అని తెలుసు కోండి. హుబల్‌కు జయం, హుబల్‌కు జయం" అన్నాడు.

దైవప్రవక్త (స) ముస్లిములనుద్దేశించి, "మీరేమీ మాట్లాడరేమిటీ?" అని అడగగా వారు, "ఏమని చెప్పాలి దైవప్రవక్తా!" అని అడిగారు.

"అనండి, అల్లాహు ఆలా వఅజల్ల్," (అల్లాహ్‌యే ఘనమైనవాడు, అధికుడూను.)

ముస్లిముల ఈ మాటలు విన్న అబూ సుఫ్యాన్ మరో నినాదం చేశాడు. "మా కోసం ఉజ్జా ఉన్నాడు. మీకు ఉజ్జా లేడు" అని.

దైవప్రవక్త (స) తిరిగి మాట్లాడరేమటి అని సహాబాలను అడగగా, "ఏమని చెప్పాలి దైవప్రవక్తా!" అని వారు అడిగారు.

"అనండి, అల్లాహు మౌలానా, వలా మౌలా లకుం" (అల్లాహ్ మా సంరక్షకుడు, మీకు సంరక్షకుడు ఇంకెవరూ లేరు) అని.

ముస్లిములు అబూ సుఫ్యాన్‌కు అదే సమాధానమిచ్చారు.

తిరిగి అబూ సుఫ్యాన్, "ఎంత గొప్ప కార్యం ఇది. ఇది బద్ర్ యుద్ధానికి జవాబు. యుద్ధం ఒక బొక్కెనలాంటిది."[64]

దీనికి సమాధానంగా హజ్రత్ ఉమర్ (ర), "లేదు, అలా అనుకోకు. మనం సమానులం కాము. మా హతులు స్వర్గంలో ఉన్నారు. మీ హతులు నరకంలో పడి కాలుతున్నారు" అన్నారు.

పిదప అబూ సుఫ్యాన్, హజ్రత్ ఉమర్ (ర)ను, "నా దగ్గరకు రా"

64. అంటే ఓ పక్షం ఓసారి విజయం సాధిస్తే మరో పక్షం మరోసారి విజయం సాధిస్తుంది. ఎలాగైతే నీటితో నిండిన బొక్కెనను ఒకరు ఓసారి లాగితే ఇంకొకరు మరో సారి లాగుతారు అని అర్థం.

అని పిలువగా మహాప్రవక్త (స),"వెళ్ళండి ఉమర్, అతని దగ్గరకు వెళ్ళండి. అతను ఏమి అడుగుతాడో వినండి" అని ఆదేశించారు. ఆయన అతని దగ్గరకు వెళ్ళగా అబూ సుఫ్యాన్, "ఓ ఉమర్! నేను దైవాన్ని సాక్ష్యంగా నిలబెట్టి అడుగుతున్నాను. ముహమ్మద్(స)ను మేము అంతమొందించలేదా చెప్పండి" అని అడిగాడు.

"దైవసాక్షి! ముమ్మాటికి మీరు ఆయన్ను అంతమొందించలేదు. ఇప్పుడు ఆయన (స) నీవు చెప్పే మాటలను వింటున్నారు" అని అన్నారు.

"ఉమర్! మీరు నా దృష్టిలో ఇబ్నె ఖుమా కంటే సత్యసంధులు అని ఒప్పుకుంటాను" అన్నాడు.[65]

బద్ర్ మైదానంలో మరో యుద్ధం చేస్తానని ప్రమాణం చేయడం

ఇబ్నె ఇస్‌హాక్‌గారి కథనం ప్రకారం, అబూ సుఫ్యాన్, అతని సహచరులు యుద్ధరంగం నుండి వెళ్ళిపోవడానికి సిద్ధపడగా, అబూ సుఫ్యాన్ ముస్లిముల ముందు ఓ సవాలు విసిరాడు. "వచ్చే సంవత్సరం బద్ర్ మైదానంలో తిరిగి యుద్ధం చేద్దాం సిద్ధమేనా?" అని. దైవప్రవక్త (స) ఓ సహాబీతో ఆ సవాలుకు ప్రతి సవాలుగా, "సరే ఈ విషయం మీకు మాకు మధ్య జరిగిన ఒప్పందంగా భావించు" అని చెప్పమన్నారు. ఆయన అలానే అబూ సుఫ్యాన్‌కు ప్రతిసవాలుగా ఆ మాటలు పలికారు.[66]

ముష్రిక్కుల తదుపరి కార్యక్రమాన్ని తెలుసుకునే ప్రయత్నం

బహుదైవారాధకులు బయలుదేరి వెడుతూ ఉండగా వారి ఆంతర్యాన్ని తెలుసుకోగోరి దైవప్రవక్త (స) హజ్రత్ అలీని వారిని వెంబడించమని, వారేం జేస్తున్నారో చూసిరమ్మని పంపించారు. ఇలా పంపిస్తూ ఆయన (స) హజ్రత్ అలీ (ర)తో, "వారే గనక గుర్రాలను ప్రక్కన నడుపుకుంటూ ఒంటెలపై ఎక్కి వెడితే మక్కాకే బయలుదేరి వెడుతున్నట్లు, అలా కాకుండా గుర్రాలపై వెడుతూ ఉంటే మదీనా వైపునకు వెడుతున్నట్లు గ్రహించమని, ఏ విషయం వెంటనే వచ్చి తెలియజేయమని, వారే గనక మదీనాకు వెళ్ళదలిస్తే మాత్రం

65. ఇబ్నె హష్షామ్-2/93,94; జాదుల్ ముఆద్-2/94; సహీ బుఖారి-2/579
66. ఇబ్నె హష్షామ్-2/94

నేను వెళ్ళి తిరిగి యుద్ధం చేస్తానని" అన్నారు. హజ్రత్ అలీ (ర) గారి ఉల్లేఖనం ఇలా ఉంది:

"నేను వారిని అనుసరిస్తూ వెళ్ళి చూడగా, వారు గుర్రాల్ని ప్రక్కన నడిపిస్తూ ఒంటెలపైన్నే స్వారీ చేస్తూ మక్కా దారి పట్టడం గమనించాను."[67]

షహీదులు మరియు క్షతగాత్రులను వెదకడం

ఖురైషులు వెళ్ళిపోయిన తరువాత ముస్లిములు తమకు చెందిన షహీదులను (అమరగతినొందిన వారిని), క్షతగాత్రులను వెదకడానికి పూను కున్నారు. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (ర) గారి కథనం ఇలా ఉంది:

మహాప్రవక్త (స) నన్ను ఉహద్ యుద్ధం నాడు, సఅద్ బిన్ రబీను వెదకమని పంపిస్తూ, మార్గంలో ఎవరైనా కనబడితే, వారికి నా సలాం అందించమని, ఇప్పుడు మీరేమనుకుంటున్నారని అడిగి తెలుసుకురమ్మని నన్ను పంపించారని చెప్పమన్నారు. నేను హతుల నడుమ తిరుగుతూ ఆయన దగ్గరకు వెళ్ళాను. ఆయన అప్పుడు కొనఊపిరితో ఉన్నారు. ఆయనకు బరిశెలు, కరవాలాలు మరియు బాణాలు తగిలి డెబ్భైకి పైన్నే గాయాలు అయివున్నాయి. నేను ఆయన దగ్గరకు వెళ్ళి, "సఅద్! అల్లాహ్ ప్రవక్త (స) మీకు సలాం చెప్పారు, మీరు ఇప్పుడు ఏమనుకుంటున్నారో అడిగి రమ్మని నన్ను పంపించారు, ఇప్పుడు మీ గురించి చెప్పండి" అని అడిగాను. ఆయన, దైవప్రవక్త (స)కు సలాం చెప్పండి. ఆయనతో, "ఓ ప్రవక్తా! నేనిప్పుడు స్వర్గ సుగంధాన్ని ఆఘ్రాణిస్తున్నానని" చెప్పండి. నా జాతి అన్సారులతో, "మీరు బ్రతికివుండగా ఏ శత్రువువైనా దైవప్రవక్త (స) దగ్గరకు చేరితే, అల్లాహ్ ఎదుట ఇక మీ సాకేదీ పనికిరాదని చెప్పండి" అన్నారు. ఆ మాట అనగానే ఆయన ప్రాణాలు గాలిలో ఎగిరిపోయాయి.[68]

ఆ క్షతగాత్రుల్లో ఉసైరమ్ అనే వ్యక్తి కూడా ఉన్నాడు. ఆయన మరో పేరు అమ్రూ బిన్ సాబిత్. ఆయన కూడా కొనఊపిరితోనే ఉన్నాడు. ఇంతకు పూర్వం ఆయనకు ఇస్లామ్ ధర్మం వైపునకు పిలిస్తే దాన్ని పెడచెవిన పెట్టేవాడు.

67. ఇబ్నె హిషామ్-2/94; హాఫిజ్ ఇబ్నె హజర్ ఫత్హుల్ బారీ (7/347)లో, ముష్రిక్కుల ఆంతర్యం తెలుసుకురావడానికి సఅద్ బిన్ అబీ వికాస్ (ర) వెళ్ళినట్లు రాశారు.

68. జాదుల్ ముఆద్-2/96

ఇది చూసిన ముస్లిములు (ఆశ్చర్యంగా) ఇతను ఉసైరమ్ కదా. ఇక్కడికి ఎలా వచ్చాడు. ఇతను ఇస్లామ్ ధర్మాన్ని ధిక్కరిస్తూ ఉండేవాడు కదా! అని అనుకోసాగారు. వీరిలో ఒక ముస్లిమ్ అతణ్ణి ఉద్దేశించి, "ఓ ఉసైరమ్! నీవీ యుద్ధరంగానికి ఎందుకు వచ్చినట్లు? జాత్యాభిమానం వల్ల యుద్ధంలో వచ్చి చేరావా లేదా ఇస్లామ్ ధర్మం ఎడల ప్రేమతోనా?" అని అడిగారు. జవాబుగా ఆయన, "నేను ఇస్లామ్ ధర్మం ఎడల అభిమానంతో ఈ యుద్ధంలో చేరాను. నిజం చెప్పాలంటే నేను అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త ముహమ్మద్ (స)ను విశ్వసించినవాణ్ణి. అందుకనే యుద్ధరంగంలో ఇస్లామ్‌కు అండగా వచ్చి చేరాను. ఇప్పుడు మీరు చూస్తున్న పరిస్థితిలో ఉన్నాను" అంటూ ప్రాణాలు విడిచారు. దైవప్రవక్త (స)కు ఈ విషయం చెప్పగా ఆయన, "ఆయన స్వర్గవాసుడయ్యాడు" అని చెప్పడం జరిగింది. అబూ హురైరా (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, ఆయన ఒక పూట నమాజు కూడా చేయలేదు.[69] (అంటే ఇస్లామ్ ధర్మం స్వీకరించిన తరువాత ఏ నమాజు చేసే సమయం కూడా ఆయనకు చిక్కలేదని అర్థం. ఆ స్థితిలోనే షహీద్ అయిపోయారు. అమరగతిని పొందారు.)

ఈ క్షతగాత్రుల్లోనే ఖుజ్మాన్ కూడా ఉన్నాడు. అతను యుద్ధంలో ఎంతో పరాక్రమాన్ని ప్రదర్శించి ఒక్కడే ఏడు లేదా ఎనిమిది మందిని హతమార్చాడు. అతను ఒక చోట గాయాలతో పడి ఉండగా అతణ్ణి బనూ జఫర్ వాడలోనికి తీసుకొని వెళ్ళడం జరిగింది. ముస్లిములు అతనికి శుభవార్తను అందించారు. ఇది విన్న అతను, "లేదు! దైవసాక్షి! నేను పోరాడింది నా జాతి గౌరవాన్ని నిలబెట్టడానికి, అదే లేకపోతే నేను యుద్ధం చేసేవాణ్ణికాదు" అన్నాడు. ఆ తరువాత ఆ గాయాలను భరించలేక తన గొంతును కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది వరకు ఇతన్ని గురించి ప్రస్తావన ఏదైనా వస్తే దైవప్రవక్త (స) అతడు నరకవాసి అని అంటూ ఉండేవారు.[70] (ఈ సంఘటన దాన్ని రుజువు చేసింది). యదార్థం ఏమిటంటే, ఇతను మహాప్రవక్త (స)మరియు ఆయన సహాబా (ర)లతో కలసి యుద్ధం చేసినప్పటికీ దైవధర్మోన్నతికి పాటుబడుతూ ప్రాణాలు అర్పించడానికి బదులు మరో ధ్యేయంతో పోరాడి ప్రాణాలర్పించాడు.

69. జాదుల్ ముఆద్-2/94; ఇబ్నె హిషామ్-2/90

70. జాదుల్ ముఆద్-2/97; 98-ఇబ్నె హిషామ్-2/88

దీనికి పూర్తి భిన్నంగా, ఆ చనిపోయిన వారిలో 'బనూ సఅలబా' తెగకు చెందిన ఓ యూదుడు కూడా ఉన్నాడు. ఇతను యుద్ధ మేఘాలు ఆవరిస్తూ ఉండగా తన జాతినుద్దేశించి, "ఓ యూదు జాతి ప్రజలారా! దైవసాక్షి! ముహమ్మద్ (స)గారికి సహాయం అందించడం మీ విధి" అని అనగా, వారు, ఈ రోజు 'సబ్బత్' రోజు (అంటే యూదులకు పవిత్రమైన శనివారం రోజు) అని అన్నారు. అతను "మీ కోసం సబ్బత్ అనేది ఏదీ లేదు" అంటూ కరవాలాన్ని, యుద్ధ సరంజామాను తీసుకొని, "నేనే చనిపోతే నా సొత్తు అంతా ముహమ్మద్ (స)కే చెందుతుంది. ఆయన దాన్ని ఏమైనా చేసుకో నివ్వండి" అంటూ యుద్ధరంగంలోనికి వచ్చి దుమికాడు. అలా యుద్ధం చేస్తూ తన ప్రాణాలను అర్పించాడు. ఈ విషయం తెలిసిన దైవప్రవక్త (స) 'ముఖైరీఖ్' (ఆ యూదుని పేరు) అతి ఉత్తముడైన యూదుడు అన్నారు.[71]

ఇదే సందర్భంలో దైవప్రవక్త (స) అమరగతినొందిన సహాబాల (ర)ను చూడడం జరిగింది. వారిని చూసి ఆయన ఇలా సెలవిచ్చారు.

"వీరి గురించి నేను సాక్షిగా ఉంటాను. యదార్థంగా ఎవరైతే అల్లాహ్ మార్గంలో గాయపర్చబడతాడో అతణ్ణి అల్లాహ్ ప్రళయం రోజున, అతని శరీరం నుండి రక్తం కారే విధంగా లేపుతాడు. అక్కడ అది రక్తమే అయినా, అందులో నుంచి కస్తూరి సువాసన వస్తూ ఉంటుంది."[72]

కొందరు సహాబా (ర)లు తమ షహీదుల్ని మదీనాకు కూడా చేర్చారు. దైవప్రవక్త (స) వారికి ఆదేశమిస్తూ, వారందరినీ తిరిగి ఉహద్ మైదానానికి తీసుకురమ్మన్నారు. వారిని వారు అమరగతి పొందిన స్థలంలోనే ఖననం చేయమన్నారు. అంతేకాదు, వారు తమ శరీరాలపై ఉన్నటువంటి తోలు వస్త్రాలను సైతం తీసివేసి, అదే స్థితిలో గుస్ల్ (స్నానం) ఇవ్వకుండా ఖననం చేయమని ఆదేశించారు. దైవప్రవక్త (స) ఇద్దరేసి, ముగ్గురేసి షహీదుల్ని ఒకే సమాధిలో వేసి ఖననం చేయనారంభించారు. అలా ఇద్దరేసి షహీదుల్ని ఒకే వస్త్రంలో కలిపి చుట్టి వేస్తూ, "వీరిలో ఎవరికి ఖుర్ఆన్ బాగా చదవడం వచ్చు?" అని అడిగేవారు. అక్కడున్నవారు ఫలానా వ్యక్తి ఖుర్ఆన్ పారాయణంలో మిన్న అయినవాడు అని అనగా, ఆ షహీదును ముందు సమాధిలోనికి దించేవారు. అలా దించుతూ, "నేను ప్రళయం రోజున వీరిని గురించి సాక్ష్య

71. ఇబ్నె హిషామ్-2/88,89 72. ఇబ్నె హిషామ్-2/98

మిస్తాను" అని అనేవారు. అబ్దుల్లా బిన్ అమ్రూ బిన్ హిరామ్ మరియు అమ్రూ బిన్ జమూహ్ (ర)లను ఆయన ఒకే సమాధిలో ఖననం చేశారు. కారణం, వారిద్దరు మంచి మిత్రులు కావడమే.[73]

హజ్రత్ హన్జలా (ర)గారి శవం కనబడలేదు. వెతకగా ఓ చోట ఆయన భౌతికకాయం, భూమికి ఆనకుండా పైన గాలిలో తేలుతూ కనబడింది. ఆయన శరీరం నుంచి నీరు కారుతూ ఉంది. దైవప్రవక్త (స) సహాబా(ర)లకు ఆయన శవాన్ని చూపిస్తూ, "ఈయన్ని దైవదూతలు స్నానం (గుసుల్) చేయిస్తున్నారు" అని చెప్పారు. ఆ తరువాత ఆయన (స), "ఆయన భార్యను అడగండి అసలు విషయం ఏమిటో అని?" అని అన్నారు. ఆయన భార్యతో విషయం అడగగా ఆమె అసలు విషయం చెప్పారు. అప్పటి నుంచే హజ్రత్ హన్జలా (ర)గారి బిరుదు "గుసైలుల్ మలాయికా" (దైవదూతలు గుస్ల్ ఇవ్వబడినవాడు)గా పడిపోయింది.[74]

మహాప్రవక్త (స) తమ పినతండ్రి హజ్రత్ హమ్జా(ర)గారి పరిస్థితిని కూడా చూశారు. ఆయన (స)కు దుఃఖం ఆగలేదు. ఆ తరువాత ప్రవక్త శ్రీ (స) మేనత్తగారైన హజ్రత్ సఫియా (ర) తన సోదరుణ్ణి చూసుకుందామనే తలంపుతో అక్కడకు అరుదెంచగా, ఆమె తనయుడు హజ్రత్ జుబైర్ (ర)గారితో దైవప్రవక్త (స) ఆమె తన సోదరుని పరిస్థితిని చూడలేరని చెప్పి వెనక్కు తీసుకువెళ్ళమని అన్నారు. కాని హజ్రత్ సఫియా (ర), "ఏమిటి? నేనెందుకు ఆయన్ని చూడకూడదు. ఆయన్ను 'ముస్లా' చేసిన విషయం నాకు తెలుసు. అలా జరిగింది అల్లాహ్ మార్గంలోనే. నేను దానికి పూర్తిగా సంసిద్ధురాలనయ్యే వచ్చాను. ఆయన్ను చూసి పుణ్యం కట్టుకోదలచు కుంటున్నాను. ఇన్షా అల్లాహ్ (అల్లాహ్ కోరితే) నేను సహనం వహిస్తాను. నాకు ఆయన ముఖం చూపించండి" అని గట్టిగా కోరారు. ఆ తరువాత ఆమెకు ఆమె సోదరుడైన హజ్రత్ హమ్జా (ర) గారి శవాన్ని చూయించడం జరిగింది. అలా చూస్తూ ఆమె ఇన్నాలిల్లాహ్ చదివారు. అల్లాహ్‌తో ఆయన (ర) మన్నింపు కోసం దుఆ చేశారు. ఆ తరువాత మహాప్రవక్త (స), ఆయన్ను హజ్రత్ అబ్దుల్లా బిన్ హజష్ (ర)గారితో కలిపి ఖననం చేయమని ఆదేశించారు.

73. జాదుల్ ముఆద్-2/98, సహీ బుఖారి-2/584 74. జాదుల్ ముఆద్-2/94

అబ్దుల్లా బిన్ హజష్, హజ్రత్ హమ్‌జా (ర)గారికి మేనల్లుడు మరియు వారు ఉభయులూ ఒకే తల్లి పాలు త్రాగడం వల్ల సోదరుడు కూడాను.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్తశ్రీ (స) హజ్రత్ హమ్‌జా(ర) గారిని గురించి ఏడ్చినంతగా మరెవ్వరి గురించీ ఏడ్వలేదు. ప్రవక్తశ్రీ (స) ఆయన శవాన్ని ఖిబ్లా వైపునకు ఉంచి ఆయనకు ఎదురుగా నిలబడి విలపిస్తూ ఉండగా ఆయన గొంతులో నుంచి ఏడుస్తున్న శబ్దం కూడా మాకు వినిపించింది అని అంటారు హజ్రత్ మస్‌ఊద్ (ర).[75]

నిజం చెప్పాలంటే, షహీదుల దృశ్యమే హృదయాలను కదిలించేదిగా ఉంది అప్పుడు. హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్‌గారి ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ హమ్‌జా (ర)గారి కఫన్ కోసం నల్లటి చారలు గల ఓ దుప్పటి తప్ప మరేదీ లభించలేదు. ఈ దుప్పటి తలపై వేస్తే కాళ్ళు కనిపిస్తాయి. కాళ్ళపైకి జరిపితే శిరస్సు బయటబడుతూ ఉంది. చివరకు ఆ దుప్పటితో తలను కప్పివేయడం జరిగింది. కాళ్ళపై ఇజ్‌ఖర్[76] గడ్డిని వేసి కప్పివేశారు.[77]

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) గారు ఇలా అంటారు:

"హజ్రత్ ముస్‌అబ్ బిన్ ఉమైర్(ర) అమరగతిని పొందారు- ఆయన నాకంటే శ్రేష్ఠులు- ఆయన్ను ఒకే దుప్పటిలో చుట్టి ఖననం చేయడం జరిగింది. ఈ దుప్పటి తలపై వేసి కప్పినప్పుడు కాళ్ళు బయటపడేవి. కాళ్ళపై వేసినప్పుడు తల బయటపడేది. ఈయనగారి ఈ పరిస్థితినే హజ్రత్ ఖబ్బాబ్ (ర) కూడా వివరించడం జరిగింది. అయితే అందులో ఈ వాక్యాలు అదనంగా ఉన్నాయి. (ఈ పరిస్థితిని చూసి) మహాప్రవక్త (స), ఆయన తలను ఆ దుప్పటితో కప్పివేసి, కాళ్ళపై ఇజ్‌ఖర్ గడ్డిని పరచండి" అని ఆదేశించారు.[78]

ప్రవక్తశ్రీ (స) దైవాన్ని స్తుతించటం - ఆయన్ను వేడుకోవడం

ఇమామె అహ్‌మద్‌గారి ఉల్లేఖనం:

"ఉహద్ రోజున బహుదైవారాధకులు వెళ్ళిపోయిన తరువాత ప్రవక్తశ్రీ

75. ఇది ఇబ్నె షాదాన్ కథనం. చూడండి, ముఖ్తసర్ సీరత్ -షేఖ్ అబ్దుల్లాహ్ పుట-255
77. ముస్నదె అహ్మద్, మిష్కాత్-1/140
78. సహీ బుఖారి-2/579,584

(స) సహాబా (ర)లతో, "అందరూ వరుసలు కట్టండి, నేను నా ప్రభువు స్తోత్రం చేస్తాను" అని అనగా వారంతా ఆయన వెనుక బారులు తీరి నిల బడ్డారు. అప్పుడు ప్రవక్తశ్రీ (స) ఇలా విన్నవించుకున్నారు.

"ఓ అల్లాహ్! నీ కోసమే సర్వస్తోత్రాలన్నీ. ఓ ప్రభూ! నీవు దేన్నయితే పెద్దదిగా చేస్తావో దాన్ని ఎవ్వరూ కుదించలేరు. నీవు కుదించినదాన్ని మరెవ్వరూ విస్తరించలేరు. నీవు ఎవరిని మార్గభ్రష్టుడుగా చేస్తావో అతనిని ఎవడూ సన్మార్గగామిగా చెయ్యలేడు. అలాగే నీవు ఎవరికైతే సన్మార్గాన్ని చూపుతావో ఆ వ్యక్తిని ఇంకెవ్వడూ మార్గభ్రష్టుడుగా మార్చలేడు. దేన్నయితే నీవు ఇవ్వకుండా ఆపేస్తావో దాన్ని ఎవ్వరూ ఇవ్వలేరు. మరిదేన్నయితే నీవు ప్రసాదిస్తావో మరెవ్వరూ దాన్ని లభించకుండా అడ్డుకోలేరు. నీవు దేన్నయితే దూరం చేస్తావో దాన్ని ఇంకెవ్వరూ దగ్గరకు చేర్చలేరు. మరి దేన్నయితే నీవు దగ్గరకు చేరుస్తావో దాన్ని మరొకడెవ్వడూ దూరం చేయలేడు. ఓ ప్రభూ! మాపై నీ శుభాలను, నీ కారుణ్యాన్ని, నీ దయను మరియు నీ ఉపాధిని విస్తరింపజెయ్యి.

ఓ అల్లాహ్! నేను నీతో శాశ్వతంగా ఉండే వరాన్ని యాచిస్తున్నాను. ఆ వరం అందనిదై, అంతమైనదై ఉండకూడదు. ఓ ప్రభూ! నేను దారిద్ర్యం నాడు సహాయాన్ని, భయం రోజున శాంతాన్ని కోరుకుంటున్నాను. ఓ అల్లాహ్! నీవు మాకు ఇచ్చిన దాని చెడుగు నుండి, మరేదైతే నీవు మాకు ఇవ్వలేదో దాని చెడుగు నుండి కూడా నీ శరణు వేడుకుంటున్నాను. ఓ ప్రభూ! మాకు నీ విశ్వాసాన్నే ప్రియమైనదిగా చెయ్యి. దాన్ని మా హృదయాల్లో మనోహర మైనదిగా మలుచు. కుఫ్రను, ఫిస్కను, నీ అవిధేయతను మాకు వెగటైనదిగా, అయిష్టమైనదిగా మలుచు. మమ్మల్ని సన్మార్గగాములుగా చెయ్యి. ఓ అల్లాహ్! మమ్మల్ని ముస్లిములుగా ఉంటూనే మరణించే మరియు ముస్లిము లుగా ఉంటూనే జీవించే భాగ్యాన్ని కలుగజెయ్యి. మమ్మల్ని సంక్షోభానికి అతీతంగా అగౌరవంపాలు కాకుండా చేసి నీ పుణ్యపురుషుల్లో, సన్మార్గ గాముల్లో కలుపు. ఓ అల్లాహ్! నీ ప్రవక్తలను ధిక్కరించే వారిపై, నీ మార్గంపైకి రాకుండా అడ్డుకునే కాఫిర్‌లపై నీ భయంకర శిక్షను అవతరింపజెయ్యి. ఓ అల్లాహ్! గ్రంథవహులైన నీ ధిక్కారులను కూడా తుదముట్టించు- యా ఇలాహుల్ హఖ్!"[79]

79. బుఖారి, అల్ అదబుల్ ముఫ్రిద్, ముస్నదె అహ్మద్-3/324

మదీనాకు తిరుగు ప్రయాణం - దైవప్రవక్త (స) పట్ల అభిమానం, ప్రేమ ఉట్టిపడే అసాధారణ సంఘటనలు

షహీదుల ఖననం, అల్లాహ్ స్తోత్రం మరియు ఆయన సమక్షంలో చేసిన వేడుకోలు అనంతరం ప్రవక్తశ్రీ (స) మదీనాకు తిరుగు ప్రయాణం కట్టారు. యుద్ధరంగంలో ప్రవక్త(స)గారి అనుచరగణం ప్రదర్శించిన అభిమానం, ప్రేమలాంటి సంఘటనలే తిరుగు ప్రయాణంలో మహిళా విశ్వాసులు కూడా ప్రదర్శించడం జరిగింది. ఈ ఆసక్తిగొలిపే సంఘటనలు కొన్ని ఇక్కడ పొందుపర్చడం జరుగుతోంది.

మదీనాకు తిరుగు ప్రయాణం చేసేటప్పుడు మార్గమధ్యంలో హజ్రత్ హమ్నా బిన్తె హజష్ (హజష్ కుమార్తె హమ్నా) కలిశారు. ఆమెగారికి ఆమె సోదరుడు అబ్దుల్లాహ్ బిన్ హజష్‌గారు పరమపదించారనే వార్త ఇదివరకే అందింది. ఆమె ఆయన మరణానికి ఇన్నాలిల్లాహ్ చదివి ఆయన మన్నింపు కోసం దుఆ కూడా చేశారు. ఆ తరువాత, ఆమె మేనమామ హజ్రత్ హమ్‌జా (ర) బిన్ అబ్దుల్ ముత్తలిబ్ అమరగతి పొందారన్న విషయం చెప్పగా ఆమె తిరిగి "ఇన్నాలిల్లాహి వ ఇన్నాఇలైహి రాజిఊన్" అని చదివి, మన్నింపు కోసం దైవాన్ని వేడుకున్నారు. ఆ పిదప ఆమె భర్త అయిన హజ్రత్ ముస్‌అబ్ బిన్ ఉమైర్ (ర) గారు అమరగతిని పొందారని చెప్పడం జరిగింది. ఆ వార్త వినగానే ఆమె పెద్దగా కేక పెట్టారు. అందరికీ వినబడేటట్లు రోదించనారంభించారు. ఇది చూసిన దైవప్రవక్త (స), "స్త్రీ దృష్టిలో ఆమె భర్త ఓ ప్రత్యేక స్థానాన్ని అలంకరించి ఉంటాడు" అన్నారు.[80]

ఇలాగే మార్గంలో బనూ రీనార్ తెగకు చెందిన ఓ స్త్రీ దైవప్రవక్త (స)ను కలవడం జరిగింది. ఆమె భర్త, ఆమె సోదరుడు మరియు ఆమె తండ్రి ఈ యుద్ధంలో అమరగతిని పొందినవారే. ఆమెకు వీరి మరణవార్తను చేరవేయగా అదేమీ పట్టించుకోకుండా, "మహాప్రవక్త (స) ఏమయ్యారు?" అని అడగనారంభించారామె. ఆమెను, "ఓ ఫలానా వ్యక్తి తల్లీ! దైవప్రవక్త (స) క్షేమంగా ఉన్నారు, దైవకృప వలన ఆయన నీవు అనుకున్నట్లుగానే క్షేమంగా ఉన్నా"రనే విషయం చెప్పడం జరిగింది. దానికి ఆమె, "నాకు ఆయన్ను

80. ఇబ్నె హష్షామ్-2/98

చూపించండి, నా కళ్ళతో ఆయన్ను దర్శించుకుంటాను" అని అనగా అక్కడున్నవారు సైగచేసి ఓ వైపునకు చూపెట్టారు. ఆమె దృష్టి ప్రవక్తశ్రీ(స)పై పడగానే ఆమె, "చాలు! నాకింకేం కావాలి! తమరుంటే చాలు, నా కష్టాలన్నీ తమ ముందు దిగదుడుపే!" అన్నారు.[81]

ఇలా ప్రయాణం చేస్తూ ఉండగానే, హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర)గారి మాతృమూర్తి ప్రవక్తశ్రీ (స) వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చారు. ఆ సమయంలో హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) దైవప్రవక్త (స)గారి గుర్రం కళ్ళెం పట్టుకొని నడుస్తున్నారు. ఆమెను చూసి ఆయన ప్రవక్తశ్రీ(స)తో, "దైవప్రవక్తా! ఈమె నా తల్లిగారు" అని పరిచయం చేయగా, మహాప్రవక్త (స) ఆమెకు శుభాకాంక్షలు అంటూ ఆమెకు స్వాగతం పలకడానికి ఆగిపోయారు. ఆమె దగ్గరకు రాగానే, ఆమె కుమారుడు అమ్రూ బిన్ ముఆజ్ (ర)గారి వీరమరణ వార్త చెప్పి ఓదార్చారు. అది విన్న ఆమె, "ప్రవక్తా (స)! మిమ్మల్ని సజీవంగా చూసిన తరువాత నా దుఃఖాలు, కష్టాలు అన్నీ మటు మాయమైపోయాయి చాలు" అని అన్నారు. తరువాత దైవప్రవక్త (స) ఉహద్ యుద్ధంలో అమరగతి పొందిన యోధులను గురించి దుఆ చేస్తూ, ఓ ఉమ్మె సఅద్! (సఅద్ మాతృమూర్తి!) మీరు సంబరపడండి, అలాగే వీరమరణం పొందిన వారి ఇంటి వారికీ శుభవార్త చెప్పండి, వారంతా స్వర్గంలో తోడుగా ఉన్నారని. వారి ఇంటివారి కోసం వారి సిఫార్సు స్వీకరించబడిందని అన్నారు. ఈ శుభవార్త విన్న ఉమ్మె సఅద్(ర), "ఓ దైవప్రవక్తా (స)! చనిపోయిన వారి కుటుంబ సభ్యుల కోసం కూడా ప్రార్థించండి" అని అనగా దైవప్రవక్త (స), "ఓ అల్లాహ్! వీరి హృదయాల్లోని దుఃఖాన్ని పోగొట్టు, వారు అనుభవించే కష్టానికి ప్రత్యామ్నాయాన్ని ఒసగు, మిగిలిన వారి కుటుంబ సభ్యులను కాపాడు" అని ప్రార్థించారు.[82]

దైవప్రవక్త (స) మదీనాలో

అదే రోజు - సోమవారం, షవ్వాల్ నెల 7వ తేది, హి.శ. 3న సాయంత్రం అయ్యేసరికి ప్రవక్తశ్రీ (స) మదీనాలో కాలుపెట్టారు. ఇంటికి చేరగానే తన కరవాలాన్ని తన ముద్దులపట్టి హజ్రత్ ఫాతిమా (ర)కు అందిస్తూ, "అమ్మా! దీనికి అంటి ఉన్న రక్తాన్ని కడిగెయ్యి. దైవసాక్షి! ఇది ఈ రోజు నా కోసం

81. ఇబ్నె హష్షామ్-2/99

82. అస్సీరతుల్ హల్బియా-2/47

సరైన పనిని నెరవేర్చింది" అన్నారు. హజ్రత్ అలీ (ర) కూడా తన కరవాలాన్ని ఆమెకు అందిస్తూ, "దీని రక్తం కూడా కడిగెయ్యి. దైవసాక్షి! ఇది నాకు బాగా పనికొచ్చింది" అనగా, దైవప్రవక్త (స) అలీ (ర)నుద్దేశించి, "ఒకవేళ నీవు బాగా యుద్ధం చేశానని అనుకుంటే గుర్తుంచుకో, నీతోపాటు సహల్ బిన్ హునైఫ్ (ర) మరియు అబూ దుజానా (ర) కూడా బాగా యుద్ధం చేశారు సుమా!" అన్నారు.[83]

అమరగతి పొందిన వారి సంఖ్య డెభ్భయి. అందులోను అధికులు అన్సార్‌కు చెందిన వారు, అంటే వారు మొత్తం 65 మంది అమరగతి పొందారని, (నలభైఐక్క మంది ఖజ్రజ్ తెగకు మరియు 24 మంది అవస్ తెగకు చెందినవారు అన్నమాట.) యూదుల్లో షహీద్ అయినవారు ఒకరని, తక్కిన వారంతా ముహాజిర్లు, వారి సంఖ్య నాలుగు అని అనేక ఉల్లేఖనాలు చెబుతున్నాయి.

ఇక మిగిలిన వారు ఖురైషులు. వారి హతుల సంఖ్య మొత్తం 22 మంది అని ఇబ్నె ఇస్‌హాక్ గారి కథనం. కాని ముగాజీ, ఇతర సీరత్ చరిత్ర కారులు ఈ యుద్ధం గురించి అందించిన వివరాల ప్రకారం, ఆ యుద్ధం వివిధ దశల్లో హతులైన బహుదైవారాధకుల సంఖ్యను బేరీజు వేస్తే వారి సంఖ్య 22 కాకుండా 37 మంది అని తెలుతుంది. (వల్లాహుఆలం)[84]

మదీనాలో ఆత్యయిక పరిస్థితి

ముస్లిములు ఉహద్ యుద్ధం నుండి తిరిగి వచ్చారు. అది షవ్వాల్ నెల ఎనిమిదవ తారీఖు హి.శ. 3, ఆదివారం. ఆ రోజు నడిరేయి వారు జాగరూకులై మెలగవలసి వచ్చింది. యుద్ధం వారిని బాగా అలసటకు గురిచేసి ఉంది. అయినా వారు రాత్రంతా మదీనాకు వచ్చే మార్గాలపై పహరా కాస్తూనే ఉన్నారు. తమ సర్వసైన్యాధ్యక్షులు దైవప్రవక్త (స)ను ప్రత్యేకంగా రక్షణలోనికి తీసుకున్నారు. ఎందుకంటే, వారికి అన్ని వైపుల నుండి ప్రమాదం వచ్చిపడే భయం ఉంది కనుక.

83. ఇబ్నె హష్షామ్-2/100

84. చూడండి, ఇబ్నె హష్షామ్-2/122-129. ఫతహుల్ బారీ-7/351 మరియు ముహమ్మద్ అహ్మద్ బాష్మీల్ ఉహద్ యుద్ధం గురించి రాసిన గ్రంథం, పుట. 278, 279, 280

గజ్వయె హుమరా ఉల్ అసద్

ఇటు దైవప్రవక్త (స) రాత్రి అంతా, యుద్ధం వల్ల ఉత్పన్నమైన గడ్డు పరిస్థితిని సమీక్షిస్తూ గడిపివేశారు. యుద్ధంలో ముష్రిక్కులు తమదే గెలుపైనా, దీనివల్ల ఎలాంటి ప్రయోజనం పొందలేరు అని గ్రహిస్తే అది వారికి తలవంపులుగా ఉండవచ్చు. అందువలన తిరిగి మదీనాపై దండెత్తనూ వచ్చు అని ఆలోచించారు మహాప్రవక్త (స). అందుకని ఆయన (స) మక్కా సైన్యాన్ని వెంటాడటానికే నిశ్చయించుకున్నారు.

సీరత్ చరిత్రకారుల కథనం ప్రకారం, ప్రవక్తశ్రీ (స) ఉహద్ యుద్ధం జరిగిన రెండో రోజే అంటే ఆదివారం, షవ్వాల్ నెల 8వ తారీఖున ఉదయమే శత్రువును తరమడానికి బయలుదేరాలని ప్రకటించారు, దానికితోడు ఆ ప్రకటనలో, ఉహద్ యుద్ధంలో పాల్గొన్న యోధులే శత్రువును తరమడానికి వెళ్ళాలని నిక్కచ్చిగా చెప్పారు. అయినా అబ్దుల్లా బిన్ ఉబై కపట ముస్లిమ్ మాత్రం ప్రవక్త (స) వెంట వస్తానని అనుమతి కోరగా ఆయన అతనికి అనుమతి ఇవ్వలేదు. ఇటు ఉన్న ముస్లిములంతా ఏదో ఒక రూపంలో గాయపడి, దుఃఖ సముద్రంలో మునిగి భయాందోళనలతో ఉన్నవారు. కాని వారంతా మహాప్రవక్త (స)గారి ఈ ప్రకటనకు సంతోషభరితులై సన్నద్ధులయ్యారు. ఉహద్ యుద్ధంలో పాల్గొనే అవకాశం లభించని హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (ర) వచ్చి దైవప్రవక్త (స)తో, "ఓ మహాప్రవక్తా (స)! తమరు ఏ యుద్ధానికి వెళతారో, ఆ యుద్ధంలో నేను కూడ మీ వెంటే ఉండాలని అనుకుంటున్నాను, తమరు ఉహద్ యుద్ధానికి వెళ్ళేటప్పుడు (ఆ యుద్ధంలో పాల్గొనకుండా) నా తండ్రి మరియు నా కుమార్తెల బాగోగులు చూడమని మీరే నన్ను మదీనాలోనే విడిచిపెట్టి వెళ్ళారు. ఇప్పుడు నాకు తమ వెంట ఉండే అనుమతి ఇవ్వండి" అని విన్నవించుకోగా ప్రవక్తశ్రీ (స) ఆయన ఒక్కరికే ఆ అనుమతి ఇచ్చారు.

అనుకున్నట్లుగానే మహాప్రవక్త (స) ముస్లిములను వెంటబెట్టుకొని మదీనాకు ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న 'హుమరా ఉల్ అసద్' అనే ప్రదేశానికి చేరి అక్కడ గుడారాలు వేసుకుని ఆగిపోయారు.

ఈ సందర్భంలోనే 'మఅబద్ బిన్ అబీ మఅబద్ ఖజాయి' దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి ఇస్లామ్ స్వీకరించడం జరిగింది - అతను తన పాత ధర్మం

మీదనే ఉన్నాడుగాని దైవప్రవక్త (స)కు సానుభూతిపరుడు అని చెప్పుకోవడం కూడా జరుగుతోంది - ఎందుకంటే బనూ ఖుజాఅ మరియు బనూ హాషిమ్ తెగ (దైవప్రవక్త (స)గారి వంశం)ల నడుమ స్నేహసంబంధం ఉంటూ వచ్చింది. అందుకని అతడు దైవప్రవక్త (స)తో, "ఓ ముహమ్మద్ (స)! మీకూ, మీ అనుచరులకు తగిలిన దెబ్బ మాకు బాధ కలిగించింది. మిమ్మలను క్షేమంగా తీసుకురావాలని అల్లాహ్‌ను వేడుకునేవారం" అని అన్నాడు. అతని ఈ సాను భూతి వచనాలను విన్న మహాప్రవక్త (స) అతనితో, "నీవు అబూ సుఫ్‌యాన్ వద్దకు వెళ్ళి అతణ్ణి నిరుత్సాహపరిస్తే బాగుండు" అన్నారు.

బహుదైవారాధకులకు తిరిగి మదీనాపైకి దాడి చేసే ఆలోచన రావచ్చు అనే అనుమానం మహాప్రవక్త (స)కు కలిగింది; అది కాస్త నిజమై కూర్చుంది. ముష్రిక్కులు మదీనా నుండి 32 మైళ్ళ దూరానికి వెళ్ళి 'రౌహా' అనే ప్రదేశంలో విడిది చేశారు. అప్పుడు వారికి తట్టింది మదీనాపై తిరిగి దాడి చేయాలన్న విషయం. వారు పరస్పరం ఒకరినొకరు తిట్టుకుంటూ, "మీరేం జేశారు గనుక? వారి శక్తిని, ప్రాభవాన్ని విరిచేసి అలానే వదిలి వచ్చేశారు. ఇంకా వారిలో అనేక తలలు మిగిలే ఉన్నాయి. అవి మనకు తలనొప్పిగా మారవచ్చు. కనుక పదండి తిరిగి వెనక్కు. వారిని పూర్తిగా తుదముట్టించి వద్దాం" అని అనుకోసాగారు.

అయితే ఈ సలహా అంత విలువైనది కాదు. వారికి ప్రత్యర్థి శక్తిసామ ర్థ్యాలు, అతని ధైర్యసాహసాలను గురించి సరైన అవగాహన లేదు. వారిలోని ఓ సైనిక కమాండరు, సుఫ్‌వాన్ బిన్ ఉమయ్యా లేచి ఈ సలహాను కొట్టి పారేశాడు. వారినుద్దేశించి, "ప్రజలారా! అలా చేయకండి. ఏ ముస్లిములైతే ఉహద్ యుద్ధంలో పాల్గొనలేదో వారూ మీకు వ్యతిరేకంగా ఓ చోట చేరి ఉంటారు. కాబట్టి ఈ పరిస్థితిలోనే మనం మక్కాకు వెళ్ళిపోదాం. ఎటొచ్చీ విజయం మనదే కదా! మీరే గనక తిరిగి మదీనాపై దాడిచేస్తే చిక్కుల్లో పడి పోతారు" అన్నాడు. కాని వారిలో చాలా మంది సుఫ్‌వాన్ బిన్ ఉమయ్యా మాటలను త్రోసిపుచ్చారు. తిరిగి మదీనాపై దాడి చేద్దాం అనే నిర్ణయించు కున్నారు. అబూ సుఫ్‌యాన్ మరియు అతని సైన్యం బయలుదేరడానికి ఇంకా సన్నద్ధమైందో లేదో 'మఅబద్ బిన్ అబీ మఅబద్ ఖుజాయి' అక్కడికి చేరనే చేరాడు. ఈయన ముస్లిం అయిన విషయం అబూ సుఫ్‌యాన్‌కు బొత్తిగా తెలియదు.

"మఅబద్! అక్కడి విషయాలేమిటీ?" అనడిగాడు.

"ఇంకేముందీ! ముహమ్మద్ తన అనుచరుల్ని వెంటబెట్టుకొని మిమ్మల్ని తరుముకు వస్తున్నాడు. అబ్బో అది ఎంత పెద్ద సైన్యమో! మీకు వ్యతిరేకంగా క్రోధాగ్నిలో కాలిపోతున్నారు. నేనిప్పటి వరకు అలాంటి సైన్యపటాలాన్నే చూసి ఎరుగను అనుకోండి. ఉహద్ యుద్ధంలో పాల్గొనని వారు కూడా ఆ సైన్యంలో వచ్చిచేరారు. వారు పోగొట్టుకున్న దాన్ని గురించి వారికి బాధగా ఉంది. మీకు వ్యతిరేకంగా వారు నూరుతున్న కారాలు మిర్యాలు నేనింత వరకు చూడలేదు సుమా" అంటూ వారిని మానసికంగా కృంగదీశాడు మఅబద్ బిన్ అబీ మఅబద్.

"అదేమిటయ్యా నువ్వు అనేది?" అడిగాడు అబూ సుఫ్‌యాన్ ఆశ్చర్యంగా.

"దైవసాక్షి! మీరు ఇక్కడి నుండి వెళ్ళే ముందు మీ గుర్రాలను సిద్ధం చేసుకునే లోపలే వారి మొదటి దళం అదిగో ఆ ఇసుక తిన్నె వెనుక నుండి ప్రత్యక్షం అవగలదు."

"ఓహో! మేమైతే వారిపై తిరిగి విరుచుకుపడదామనీ, వారిని మొద లంటా నరికేద్దామనీ అనుకున్నామే."

"అబ్బో! అలా మాత్రం చేయకండి. నేను చెప్పేదంతా మీ మేలు కోరే సుమా!" అన్నాడు మఅబద్.

ఈ వార్త వినీవినగానే వారి గుండెలు గుభేలుమన్నాయి. భయం వారిని ఆవహించసాగింది. ఇక మక్కాకు తిరిగి వెళ్ళడంలోనే క్షేమం ఉందని అను కున్నారు. అబూ సుఫ్‌యాన్, ఇస్లామీయ సైన్యాన్ని తమ వెన్నంటి రాకుండా, తిరిగి సాయుధ పోరాటం ఎదురవకుండా ఉంచడానికిగాను మానసికమైన ఓ ఎత్తు వేశాడు. జరిగిందేమిటంటే, అతను, అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన ఓ బిడారం మదీనా వైపునకు పోవడం చూసి, వారి నాయకునితో, "మీరు ముహమ్మద్‌కు నా సందేశం ఒకటి వినిపించాలి. నేను మీరు తిరిగి వచ్చిన తరువాత మక్కాలో ఉన్న ఉక్కాజ్ సంతలో మీ ఈ పెంటి ఒంటె మోసినంత బరువు ఎండు ద్రాక్ష ఇస్తాను సరేనా?" అని అడిగాడు.

వారు దానికి సరే అని సమాధానం ఇవ్వగా అబూ సుఫ్‌యాన్, "మీరు వెళ్ళి ముహమ్మద్‌కు ఈ కబురు అందించండి. మేము ఆయన్నూ, ఆయన

అనుచరుల్నీ తుదముట్టించటానికి తిరిగి మదీనాపై దాడి చేస్తున్నామని నమ్మించాలి" అని చెప్పాడు.

ఆ బిడారం హుమా ఉల్ అసద్‌కు చేరగానే, మహాప్రవక్త (స) మరియు ఆయన అనుచరులు దానికి తారసబడ్డారు. వారు ఆయనకు అబూ సుఫ్‌యాన్ సందేశాన్ని అందించారు. ఆ మాటలు విన్న ముస్లిముల్లో భయానికి బదులు విశ్వాసం మరింత పెరిగిపోయింది. వారు, "హస్బునల్లాహు వనేమల్ వకీల్" (మాకు అల్లాహ్ సహాయం చాలు, ఆయన గొప్ప సహాయకుడు) అని నినదించారు. (ఈ విశ్వాసపటిమ) కారణంగా వారు అల్లాహ్ వరాలతో, ఆయన దయతో వెనక్కు మరిలారు. వారికి ఎలాంటి ప్రమాదం సంభవించ లేదు. వారు అల్లాహ్ ప్రసన్నతను బడిశారు. ఆయనకు విధేయత చూపారు. అల్లాహ్ ఎంతో దయామయుడు.

మహాప్రవక్త (స), ఆదివారం రోజున హుమ్రాఉల్ అసద్‌కు చేరి, సోమ, మంగళ మరియు బుధవారం (అంటే 9, 10, 11 షవ్వాల్, హిజ్రీ శకం 3) వరకు అక్కడనే బస చేశారు. ఆ తరువాతగాని ఆయన (స) మదీనాకు తిరిగి రాలేదు. మదీనాకు తిరిగి వచ్చేముందు 'అబూ అజ్జా హుజ్మీ' ఆయనకు పట్టుబడ్డాడు. బద్ర్ యుద్ధంలో బందీ అయిన తరువాత అతని దారిద్ర్యం, అతని కుమార్తెల ముఖం చూసి దైవప్రవక్త (స) అతనికి, తమకు వ్యతిరేకంగా ఖురైషులకు ఎలాంటి సాయం చేయబోడన్న షరతు విధించి విడుదల చేసి ఉన్న విషయం మనకు తెలిసిందే. కాని అతను చేసిన వాగ్దానానికి వ్యతిరేకంగా తన కవనంతో దైవప్రవక్త(స) మరియు సహాబా(ర)లకు వ్యతిరేకంగా ఖురైషుల భావోద్రేకాలను రెచ్చగొట్టాడు. ఈ విషయం కూడా మనం వెనుకటి పుటల్లో చదువుకున్నదే. ఆ తరువాత అతను ముస్లిములతో పోరాడడానికి స్వయంగా యుద్ధంలో పాల్గొన్నాడు. అతణ్ణి దైవప్రవక్త (స) దగ్గరకు తీసుకురాగా అతను, "ముహమ్మద్ (స)! నా తప్పును క్షమించండి. నాపై కరుణ చూపండి. నా కుమార్తెల కోసం అయినా నన్ను వదలిపెట్టండి. నేను ఇక నుండి ఇలాంటి బుద్ధితక్కువ చర్యకు పాల్పడను" అంటూ పరిపరి విధాల కాళ్ళావేళ్ళా బడ్డాడు. మహాప్రవక్త (స), "ఇప్పుడు నీవు మక్కాకు వెళ్ళి ముహమ్మద్‌ను రెండుమార్లు మోసగించానని చెప్పే అవకాశమే ఇవ్వడం జరగదు. ఓ విశ్వాసి ఒకే కన్నం నుండి రెండుసార్లు కాటుకు గురికాజాలడు (రెండుసార్లు అదే మోసానికి గురికాజాలడు అని అర్థం)" అని అన్నారు.

పిదప హజ్రత్ జుబైర్ (ర) లేదా హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ (ర)ను అతని మెడ నరకమని ఆదేశించారు.

అలాగే మక్కాకు చెందిన మరో వేగులవాడు కూడా చంపబడ్డాడు. అతని పేరు ముఆవియా బిన్ ముగైరా బిన్ అబిల్ ఆస్. ఇతను అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్‌కు తాత. ఇతను ముస్లిములకు పట్టుబడ్డ తీరు ఎలాంటిదంటే, తన పినతండ్రి కుమారుడు అయిన హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (ర)ను చూసి పోదామని వచ్చి దైవప్రవక్త (స) సంరక్షణ కోరాడు. మహాప్రవక్త (స) అతనికి మూడు రోజులకంటే ఎక్కువ కాలం మదీనాలో ఉంటే అతని తల మొండెం నుండి వేరుచేయబడుతుందనే షరతుపై అను మతి ఇచ్చారు. కాని మదీనా నగరం ఇస్లామీయ సేన లేకుండా ఖాళీ అయిన తరువాత రహస్య సమాచారాన్ని సేకరించేందుకు మూడు రోజుల కంటే అధికంగా మదీనాలో ఉండిపోయాడు. ఇస్లామీయ సేన తిరిగి రావడం చూసి పారిపోవడానికి సన్నద్ధుడవుతుండగా అతణ్ణి పట్టుకోవడం జరిగింది. మహాప్రవక్త (స), హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర)నో లేదా అమ్మార్ బిన్ యాసిర్ (ర)నో అతణ్ణి వెంబడించి చంపేయమని ఆదేశం ఇచ్చారు. మహాప్రవక్త (స) ఆదేశం మేరకు అతను చంపబడ్డాడు.[85]

గజ్వాయె హుమరా ఉల్ అసద్‌ను ఓ ప్రత్యేకమైన పేరుతో పిలువడం జరుగుతోంది. కాని యదార్థం ఏమిటంటే, అది ఓ శాశ్వతమైన గజ్వా మాత్రం కాదు. ఇది ఉహద్ యుద్ధానికి సంబంధించిన ఓ భాగం. అంటే ఆ యుద్ధ చరిత్రకు సంబంధించిన ఓ పుట మాత్రమే.

ఉహద్ యుద్ధ జయాపజయాలపై ఓ సమీక్ష

'గజ్వాయె ఉహద్' లేదా ఉహద్ యుద్ధానికి సంబంధించిన దశలు, వివరాలన్నీ పైన చెప్పుకున్నాం. ఈ యుద్ధ పరిణామం గురించి ముస్లిములు, ఈ యుద్ధంలో అపజయం పాలయ్యారా లేదా అన్న దానిపై సుదీర్ఘమైన చర్చలూ జరిగాయి. ఆ యుద్ధం గురించిన యదార్థాలను పరిశీలిస్తే యుద్ధం లోని రెండవ రౌండులో (దశలో) బహుదైవారాధకులకే ఆధిక్యత లభించిం దని, వారే విజయం సాధించారని, నష్టం ముస్లిములకే అధికంగా జరిగిందని

85. *గజ్వాయె ఉహద్, గజ్వాయె హుమరా ఉల్ అసద్ వివరాలు ఇబ్నె హిషామ్-2/60-129; జాదుల్ ముఆద్-2/91-108; ఫతహుల్, బారీ నహీ బుఖారితో*

చెప్పవచ్చు. ముస్లిముల ఓ వర్గం ఓడి పారిపోయి మదీనాకు చేరింది కూడా. యుద్ధ గమనం కూడా మక్కా సైన్యానికి అనుకూలంగానే మారింది. అయితే, ఇంత జరిగినా, కొన్ని సంఘటనలు చోటు చేసుకోవడం మూలంగా ఈ విజయం బహుదైవారాధకులకే లభించింది అనడానికి వీల్లేదు. ఆ సంఘట నలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

మక్కా సైన్యం ముస్లిముల శిబిరాన్ని హస్తగతం చేసుకోలేకపోయింది. మదీనా సైన్యంలో అస్తవ్యస్త పరిస్థితి, క్రమశిక్షణారాహిత్యం ఏర్పడినప్పటికీ వారు పూర్తిగా పలాయనాన్ని చిత్తగించలేదు. కాగా, ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించి పోరాడుతూ తమ సర్వసైన్యాధ్యక్షుని వద్దకు చేరుకోవడం జరిగింది. అంతేకాదు, ముస్లిములు మక్కా సైన్యం వెంటాడి తరిమే అంత బలహీనంగా కూడా లేరు. దైవధిక్కారులు ఎలాంటి యుద్ధ సొత్తునూ హస్తగతం చేసుకునే అవకాశమే లభించలేదు. దానికి తోడు ఇస్లామీయ సైన్యం ఇంకా తన క్యాంపులోనే ఉన్నప్పటికీ ముష్రిక్కుల సైన్యం యుద్ధం మూడో రౌండు కోసం సిద్ధం కాలేకపోయింది. అదేకాకుండా, బహుదైవారాధకుల సేన యుద్ధ మైదానంలో రెండూ లేక మూడు రోజుల వరకు వేచి చూడలేకపోయింది. అలా మూడు రోజుల వరకు యుద్ధరంగంలో వేచి ఉండడం విజయం పొందిన సేన సంప్రదాయం. ఇది విజయానికి సంబంధించిన అత్యవసరమైన చర్య. కాని దైవతిరస్కారులు ఎంతో వేగంగా, ముస్లిముల కంటే ముందరే యుద్ధరంగాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోయారు. దైవధిక్కారులకు మదీనా పట్టణం కొంత దూరంలోనే ఉన్నప్పటికీ దాన్ని దోచుకోవడానికి వారికి ధైర్యం చాలలేదు. అదేకాకుండా ఆ సమయంలో వారిని అడ్డగించేవారు కూడా లేరు.

ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే, ఖురైషులు మహా అయితే, సమయం, సందర్భాన్ని ఆసరాగా తీసుకొని ముస్లిములకు భారీ నష్టాన్నే కలిగించగలరు. అలా జరగక ఉంటే, ఇస్లామీయ సేనను చుట్టుముట్టిన తరువాత దాన్ని పూర్తిగా తుడిచిపెట్టడమో లేదా సైనికుల్ని బందీలుగా చేసుకోవడమో జరగాల్సి ఉంది, యుద్ధం దృష్టి కోణంతో చూస్తే అలా తప్ప కుండా జరగాలి కూడా. ఆ పనిలో మాత్రం ఖురైషులు పూర్తిగా విఫలం

కలుపుకొని-7/345-377; ముక్తరుస్సీరత్-షేక్ అబ్దుల్లా పుట. 242-257 నుండి సేకరించడం జరిగింది. ఇతర ఆధారాలు వాటికి సంబం ధించిన సందర్భాల్లో ఇవ్వబడ్డాయి.

అయ్యారనే చెప్పవచ్చు. ముస్లిం సేన పెద్ద నష్టం పొందినప్పటికీ వారి దిగ్బంధాన్ని ఛేదించి బయటపడగలిగింది. ఇలాంటి నష్టం ఖుద్దు అనేకమంది విజేతలకు కూడా చవిచూడవలసి వస్తుంది యుద్ధ సమయంలో, కాబట్టి దీన్ని ముష్రిక్కుల విజయంగా నిర్ణయించడానికి వీల్లేదు.

కాగా, తిరుగు ప్రయాణంలో అబూ సుఫ్యాన్ ప్రదర్శించిన తొందర పాటు ద్వారా యుద్ధం మూడో దశ ప్రారంభం అయితే తన సేన ఎనలేని నష్టానికి, ఓటమికి గురిఅయి పోతుంది అనే భయం కూడా అవగత మవుతోంది. అబూ సుఫ్యాన్ 'గజ్వాయె హుమరా ఉల్ అసద్' సందర్భంగా అవలంబించిన తీరు ఈ విషయాన్ని మరింతగా ధృవపరుస్తోంది.

ఇలాంటి పరిస్థితిలో మనం గజ్వాయె ఉహద్‌లో ఒక వర్గానికి విజయం, మరో వర్గానికి పరాజయం లభించింది అని అనడం కంటే, దీన్ని ప్రయోజనం లేని ఓ యుద్ధంగా పరిగణించవచ్చు. ఈ యుద్ధంలో ప్రతి వర్గం తనకు కలిగిన నష్టాన్ని చవి చూడవలసి వచ్చింది. అదేకాదు, యుద్ధరంగం నుండి పారిపోయే బదులు తన క్యాంపును శత్రువుకు ఆధీనం కాకుండా రక్షించుకొని యుద్ధం జరగకుండా చూడడం చేశారు ముస్లిములు. అందుకనే దీన్ని అసం పూర్ణ యుద్ధంగానే అభివర్ణించవచ్చు. ఈ విషయాన్నే ఉటంకిస్తూ దివ్య ఖుర్‌ఆన్ ఇలా అంటోంది.

وَلَا تَهِنُوا فِي ابْتِغَاءِ الْقَوْمِ ۖ إِن تَكُونُوا تَأْلَمُونَ فَإِنَّهُمْ يَأْلَمُونَ كَمَا تَأْلَمُونَ ۖ
وَتَرْجُونَ مِنَ اللَّهِ مَا لَا يَرْجُونَ ۗ وَكَانَ اللَّهُ عَلِيمًا حَكِيمًا ﴿١٠٤﴾

"ఈ వర్గాన్ని వెన్నాడడంలో బలహీనతను ప్రదర్శించకండి. ఒకవేళ మీరు బాధపడుతూ ఉంటే మీ మాదిరిగానే వారు కూడా బాధపడుతూ ఉన్నారు. పైగా అల్లాహ్ నుండి వారు ఆశించని దానిని మీరు ఆశిస్తు న్నారు, అల్లాహ్‌కు అంతా తెలుసు. ఆయన అత్యంత వివేక సంపన్నుడు." (4 : 104)

ఈ ఆయత్‌లో బాధించడం, బాధపడడం అనే విషయంలో ఇరు వర్గాలు సమానం అని అల్లాహ్ చెప్పడం జరిగింది. ఈ రెండు వర్గాల్లో, ఏ ఒక్క వర్గమూ మరో వర్గంపై విజయం సాధించకుండా వెనక్కు మళ్ళింది.

ఈ పోరాటం గురించి ఖుర్‌ఆన్ చేసిన విశ్లేషణ

దివ్యఖుర్‌ఆన్, ఈ పోరాటానికి సంబంధించిన ఒక్కొక్క దశను వెలుగులోకి తెచ్చి, వాటిని విడమర్చి చెబుతూ, ముస్లిములు ఏయే కారణాల వల్ల పెద్ద నష్టానికి గురికావలసి వచ్చిందో విశదీకరించింది. నిర్ణయాత్మకమైన ఈ తరుణంలో, ఇతర సమాజాలకంటే మిన్న అయిన ఈ విశ్వాసుల సమాజాన్ని ఏ ఉన్నత ధ్యేయాల కోసమైతే ఉనికిలోనికి తేవడం జరిగిందో, దానికి చెందిన వివిధ వర్గాల్లో ఎలాంటి బలహీనతలు చోటు చేసుకొని ఉన్నాయో వ్రేలెత్తి చూపించింది.

అలాగే దివ్యఖుర్‌ఆన్ వంచకుల వైఖరిని కూడా బట్టబయలు చేసింది. వారి హృదయాల్లో దైవం మరియు దైవప్రవక్త (స) ఎడల దాగి ఉన్న కక్షను, కార్పణ్యాన్ని కూడా బయటకు లాగి బహిర్గతం చేసింది. అలాగే ఈ వంచకులు వారి యూద సోదరులతో చేసుకున్న రహస్య ఒప్పందాల్ని కూడా బహిరంగ పరచింది. దీనికి తోడు ఈ పోరాటం వెనుక దాగివున్న మహోన్నత ధ్యేయాల వైపునకు దృష్టిని కూడా మళ్ళించింది.

దివ్యగ్రంథం ఖుర్‌ఆన్‌లోని ఆలి ఇమ్రాన్ సూరా (అధ్యాయం)లో ఈ పోరాటానికి సంబంధించినవే అరవై ఆయత్‌లు అవతరించాయి. ప్రథమంగా ఇందు ఈ పోరాటం యొక్క మొదటి దశను వివరిస్తూ ఇలా చెప్పడం జరిగింది:

وَاِذْ غَدَوْتَ مِنْ اَهْلِكَ تُبَوِّئُ الْمُؤْمِنِيْنَ مَقَاعِدَ لِلْقِتَالِ ۔

"(ఓ ప్రవక్తా! నీవు ముస్లిములకు ఆ సమయాన్ని గురించి తెలుపు) అప్పుడు నీవు వేకువఝామున నీ యింటి నుండి బయలుదేరి (ఉహద్ క్షేత్రంలో) ముస్లిములను యుద్ధం కొరకు వారి వారి స్థానాల్లో నియమించావు." (3 : 21)

ఆ తరువాత చివరిలో ఈ యుద్ధం పరిణామాలు, దాని ఆంతర్యంపై వెలుగును ప్రసరింపజేస్తూ ఇలా చెప్పడం జరిగింది:

مَا كَانَ اللّٰهُ لِيَذَرَ الْمُؤْمِنِيْنَ عَلٰى مَآ اَنْتُمْ عَلَيْهِ حَتّٰى يَمِيْزَ الْخَبِيْثَ مِنَ الطَّيِّبِ ؕ وَمَا كَانَ اللّٰهُ لِيُطْلِعَكُمْ عَلَى الْغَيْبِ وَلٰكِنَّ اللّٰهَ يَجْتَبِيْ مِنْ رُّسُلِهٖ مَنْ يَّشَآءُ ۖ فَاٰمِنُوْا بِاللّٰهِ وَرُسُلِهٖ ۚ وَاِنْ تُؤْمِنُوْا وَتَتَّقُوْا فَلَكُمْ اَجْرٌ عَظِيْمٌ ﴿۱۷۹﴾

"మీరు ప్రస్తుతం ఉన్నటువంటి స్థితిలో అల్లాహ్ విశ్వాసులను ఏ మాత్రం ఉండనివ్వడు. ఆయన పవిత్రులను అపవిత్రుల నుండి తప్పకుండా వేరు చేస్తాడు. అయితే అగోచర విషయాలను మీకు తెలుపడం అల్లాహ్ విధానం కాదు. (అగోచర విషయాలు తెలపడానికి) అల్లాహ్ తన ప్రవక్తలలో నుండి తాను కోరిన వారిని ఎన్నుకుంటాడు. కనుక (అగోచర విషయాలను గురించి) అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలను నమ్మండి. మీరు గనక విశ్వాస భయభక్తుల మార్గాన్ని అవలంబిస్తే మీకు పెద్ద బహుమానం లభిస్తుంది." (3:179)

ఆ పోరాటంలో ఇమిడి ఉన్న దైవాంతర్యాలు, దైవధ్యేయాలు

అల్లామా ఇబ్నె ఖైమ్ ఈ విషయం గురించి చాలా వివరంగా రాశారు.[86]

హాఫిజ్ ఇబ్నె హజర్, ధార్మిక పండితులు ఉహద్ యుద్ధం, ఆ యుద్ధంలో ముస్లిములకు ఎదురైన చేదు అనుభవంలో అనేక దైవనిర్ణయాలు, ప్రయోజనాలు ఉన్నాయి అని అంటారు. ఉదాహరణకు, ముఖ్యంగా ముస్లిముల ఆనాటి దుర్వ్యవహారం, ప్రవక్త (స)గారి ఆదేశాలను శిరసావహించకుండా ఉండడంలాంటి విషయాల్లో అనేక అపశకునాలు ఎదురైనాయని చెప్పడం. ఎందుకంటే, విలుకాండ్రను తమ స్థానాల్లో స్థిరంగా నిలబడే ఏ ఆదేశం అయితే దైవప్రవక్త (స) ఇచ్చారో వారు దాన్ని ఉల్లంఘించటం జరిగింది. వారు, వారి కేంద్ర స్థానాల్ని విడిచిపెట్టి యుద్ధరంగంలో యుద్ధ ధనాన్ని ప్రోగు చేయడానికి వచ్చేశారు (ఈ కారణంగానే వారు కష్టాలపాలైపోవడం జరిగింది). మరో విషయం ఏమిటంటే, దైవప్రవక్తలందరూ మొదట కష్టాలకు గురి కావడం సంప్రదాయంగా వస్తున్న విషయం. చివరికి వారికే విజయం చేకూరుతుంది. అయితే వారికే గనక విజయాలపై విజయాలు లభిస్తూపోతుంటే, అల్లాహ్‌పై విశ్వాసం లేని వారు కూడా ముస్లిమ్ సమాజంలో చోటుచేసుకునే అవకాశం లభిస్తుంది. ఆ తరువాత సత్యసంధులు ఎవరో, అసత్యవాదులు ఎవరో తెలుసుకునే అవకాశమే చిక్కదు. అలాగే సతతం అపజయానికే గురికావలసి వస్తే వారు ప్రభవించడంలో అర్థమే ఉండకపోయేది. అందుకని దైవ వివేచన ప్రకారం వారికి ఈ రెండూ

86. చూడండి, జాదుల్ ముఆద్-2/99-108

(జయాపజయాలు) సంభవించి తీరాల్సిందే. ఇలా జరగడం వలన తన వారూ, పరాయి వారిలో భేదం కనిపిస్తుంది. ఎందుకంటే, వంచకుల విశ్వాసం ముస్లిములకు తెలియదు. ఈ సంఘటన జరిగిన తరువాత కపట ముస్లిముల మాటలు, చేతలు బయటబడ్డాయి. ముస్లిములకు, వారి ఇండ్లలోనూ వారికి శత్రువులు ఉన్నారన్న విషయం అర్థమైపోయింది. ఈ కారణం చేత విశ్వాసులు వారిని ఎదుర్కోడానికి జాగరూకతతో సంసిద్ధులైపోయారు.

మరో విషయం ఏమిటంటే, కొన్ని చోట్ల దైవ సహాయం అందడంలో కొంత ఆలస్యం జరగడం వల్ల వారిలో నమ్రత పొడసూపి, వారిలో చోటు చేసుకున్న గర్వం కాస్తా మటుమాయమైపోయింది. విశ్వాసులు ఈ కష్టాలను చవి చూసిన తరువాత ఎంతో సహనాన్ని అవలంబించారు. అయితే వంచకులలో హాహాకారాలు చెలరేగాయి.

అల్లాహ్ విశ్వాసుల గౌరవం కోసం స్వర్గంలో కొన్ని హోదాలను, అంతస్తులను సిద్ధపరచి ఉంచాడు. కేవలం ముస్లిముల కార్యాచరణ, సత్ప్రవర్తన ఆ హోదాలు, ఆ అంతస్తుల వరకు చేర్చజాలవు. కాబట్టి వారిని ఈ యుద్ధం ద్వారా కొంత పరీక్షకు గురిచేయడం జరిగింది. ఆ పరీక్షలో నెగ్గినవారికే ఆ అంతస్తులు, ఆ హోదాలు లభ్యం అవుతాయి. ఇది కూడా దైవ వివేచనకు సంబంధించిన ఓ విషయమే.

ఇదే కాదు, దైవమార్గంలో ప్రాణాలు అర్పించి షహీద్ కావడం కూడా దైవానికి అతిప్రియమైన అవులియాల హోదా. ఈ యుద్ధంలో ఆయన ధర్మం కోసం ప్రాణాలు అర్పించి ఆ హోదాను పొందగలిగారు.

ఇంకో దైవాంతర్యం ఏమిటంటే, ఈ యుద్ధం ద్వారా అల్లాహ్ తన శత్రువుల్ని సంహరింపజేయాలనుకోవడం. కాబట్టి వారి కోసం అలాంటి పరిస్థితులను సృష్టించాడు. అంటే తనకు ప్రియమైన అవులియాలను బంధించడం, హింసించడం లాంటివి మితిమీరిపోయాయి. (దాని ఫలితంగా) అల్లాహ్ విశ్వాసుల పాపాలను కడిగివేసి వారిని పరిశుద్ధులుగా చేశాడు. దైవధిక్కారులను సంహరించి భంగపాటుకు గురిచేశాడు.[87]

87. ఫత్హుల్ బారి-7/347

ఉహద్ పోరాటం తరువాతి సైనిక చర్యలు

ఉహద్ యుద్ధంలో అపజయానికి గురియైన తరువాత ముస్లిములకు ఇప్పటి వరకు లభించిన ఖ్యాతి కాస్తా మట్టిలో కలిసిపోయింది. విరోధుల హృదయాల్లో వారి ఎడల ఉన్న భయభీతులు తొలగిపోయి పులులైపోయారు. దీని ఫలితంగా, విశ్వాసులపై ఇటు మదీనాలోనూ, అటు మదీనాకు వెలుపల నుండి వచ్చిపడే కష్టాలు అధికమైపోయాయి. మదీనా నలువైపుల నుండి ప్రమాదాలు పొంచి చూస్తున్నాయి. యూదులు, వంచకులు మరియు బుద్దూలు బాహాటంగా వారి శత్రుత్వాన్ని బహిర్గతం చేయనారంభించారు. ప్రతి వర్గం ముస్లిములకు నష్టం కలిగించే ప్రయత్నంలో నిమగ్నమైపోయింది. ఇంకా చెప్పాలంటే, ఇప్పుడు ముస్లిములను అంతమొందించడం తేలిక అనీ, వారిని నామరూపాల్లేకుండా చేయవచ్చనే ధైర్యం కూడా వారికి కలిగింది. కాబట్టి ఉహద్ పోరాటం జరిగి రెండు నెలలు గడిచాయో లేదో 'బనూ అసద్' తెగ మదీనాపై దాడి చేయడానికి సంసిద్ధమైంది. సఫర్ నెల హిజ్రీ శకం 4లో అజ్ల్ మరియు ఖారా అనే రెండు తెగలు పన్నిన కుట్ర మూలంగా పదుగురు సహాబా (ర)లు అమరగతిని పొందవలసి వచ్చింది. అదే నెలలో బనూ ఆమిర్ అనే ధనవంతుడు అలాంటిదే మరో ద్రోహం తలపెట్టడం వలన డెబ్బయి మంది సహాబా (ర)లు అమరగతి పొందారు. ఈ సంఘటన 'బీరె మఊనా' పేరుతో ప్రఖ్యాతిగాంచింది. ఈ తరుణంలోనే బనూ నజీర్ తెగ కూడా బాహాటంగా ముస్లిములకు వ్యతిరేకంగా కక్ష సాధించడానికి సిద్ధపడింది. ఆ తెగ, రబీఉల్ అవ్వల్ నెల, హిజ్రీ శకం 4లో స్వయంగా మహాప్రవక్త (స)నే హతమార్చే ప్రయత్నం చేసింది. ఇటు బనీ గత్ఫాన్ తెగ ధైర్యం పెచ్చుపెరిగి జమాదిల్ ఊలా మాసం (హి.శ. 4)లో మదీనాపై దాడి చేసే పథకాన్ని కూడా సిద్ధం చేసుకుంది.

మొత్తానికి ఉహద్ యుద్ధంలో మట్టిపాలైన ముస్లిముల గౌరవం ఫలితంగా వారు ఓ కొంత కాలం మట్టుకు ప్రమాదాల వలలో చిక్కుకుపోయా

రన్నది వాస్తవం. అయితే, ఈ తరుణంలో మహాప్రవక్త (స) అనుసరించిన యుద్ధనీతి, చతురత, వివేచనలు ఆ ప్రమాదాలన్నిటిని తప్పించి ముస్లిములకు వారి పూర్వ గౌరవోన్నతులను తెచ్చిపెట్టగలిగాయి. తిరిగి వారికి పూర్వ వైభవం కట్టబెట్టాయి. ఈ విషయంలో మహాప్రవక్త (స) 'హుమ్రా ఉల్ అసద్' వరకు బహుదైవారాధకులను వెంటాడిన తీరు మొదటిది. ఈ చర్య మూలంగా ఆయన సేన గౌరవం చాలా మటుకు నిలబడగలిగింది. ఎందుకంటే ఈ చర్య ఎంతో ధైర్యసాహసాలతో కూడిన యుద్ధవ్యూహానికి సంబంధించిన చర్య. ముఖ్యంగా దైవప్రవక్త (స)ను విరోధించే వారు ముఖ్యంగా 'మునాఫిక్‌లు మరియు యూదులు' ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టారు. ఆ తరువాత ఆయన ఎడతెగకుండా నడిపిన సైనిక చర్యల్లో ముస్లిముల పూర్వ ప్రాభవం తిరిగి రావడమే కాకుండా ఆ ప్రాభవం మరింత పెరిగిపోయింది కూడా. ముందు పుటల్లో ఆ విషయాల గురించే చెప్పడం జరుగుతోంది.

1. సరియ్యా అబీ సల్మా

ఉహద్ పోరాటం తరువాత ముస్లిములకు వ్యతిరేకంగా మొట్టమొదట బనూ అసద్ బిన్ ఖజీమా తెగ సమాయత్తమైంది. ఖువైలీద్ ఇద్దరు కుమారులు తల్హా మరియు సల్మాలు కలసి తమ జాతిని, విధేయుల్ని వెంటబెట్టుకుని బనూ అసద్ తెగను దైవప్రవక్త (స)పై దాడి చేయడానికి పురికొల్పుతున్నారనే వార్త మదీనాకు చేరింది. వెంటనే మహాప్రవక్త (స) నూటయాభై మంది అన్సారులు మరియు ముహాజిర్లతో కూడిన ఓ సైనిక పటాలాన్ని సిద్ధపరిచారు. హజ్రత్ అబూ సల్మా (ర)కు ఆ సైనిక పటాలం జెండానిచ్చి ఆయనను ఆ పటాలం కమాండరుగా నియమించి పంపారు. హజ్రత్ అబూ సల్మా (ర), బనూ అసద్ బయలుదేరక మునుపే వారిపై విరుచుకుబడ్డారు. ఈ హఠాత్పరిణామానికి ఏమీ పాలుపోక వారు చెరో దిక్కు పారిపోయారు. ముస్లిములు వారి ఒంటెల్ని, మేకల్ని స్వాధీనపరచుకొని మదీనాకు తిరిగి వచ్చారు. వారిని ఎదుర్కొని యుద్ధం చేసే అవసరమే ఏర్పడలేదు.

ఈ సరియ్యా, ముహర్రం నెల, హిజ్రీ శకం 4న నెలపొడుపు రోజున పంపించడం జరిగింది. తిరిగివచ్చిన తరువాత హజ్రత్ సల్మా(ర)కు ఉహద్ యుద్ధంలో అయిన గాయం వల్ల మరణం సంభవించింది.[1]

1. జాదుల్ ముఆద్-2/108

2. అబ్దుల్లా బిన్ ఉనీస్ (ర) గారు జరిపిన సైనిక చర్య

అదే నెల ముహర్రం 5వ తారీఖున (హి.శ. 4) ఖాలిద్ బిన్ సుఫ్యాన్ హుద్‌లీ అనేవాడు ముస్లిములపై దాడి చేయడానికి సైన్యాన్ని సమీకరిస్తున్నాడన్న వార్త అందింది. మహాప్రవక్త (స) అతని పీచమణచడానికిగాను హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉనీస్ (ర)ను పంపారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉనీస్ (ర) పద్దెనిమిది రోజుల తరువాత తిరిగి వచ్చారు. ఆయన ఖాలిద్‌ను చంపి అతని తలను కూడా వెంటతెచ్చారు. మదీనా చేరి ఆయన దైవప్రవక్త (స) ముందు ఆ తలను పడవేయగా ఆయన (స) ఆయనకు ఓ చేతికర్రను బహూకరిస్తూ, ఇది నాకు నీకు నడుమ ప్రళయం రోజున గుర్తుగా ఉంటుంది అన్నారు. ఆయన మరణించేటప్పుడు ఈ చేతి కర్రను నా కఫన్‌లో చుట్టి దాన్ని కూడా ఖననం చేయమని మరణ శాసనం చేశారు.[2]

3. రజీ సంఘటన

ఆ సంవత్సరమే (హి.శ. 4) సఫర్ నెలలో దైవప్రవక్త (స) వద్దకు అజ్ల్ మరియు ఖారా తెగలకు చెందిన కొంత మంది వచ్చి, వారి తెగలో ఇస్లాం ధర్మం గురించి బాగా ప్రచారం జరుగుతోందని, తమరు ధర్మబోధ కోసం, ఖుర్ఆన్ చదివించడానికి కొంతమందిని పంపాలని కోరారు. మహాప్రవక్త (స), ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, ఆరుగురిని మరియు సహీ బుఖారి ఉల్లేఖనం ప్రకారం, పది మందిని వారి వెంట పంపించారు. ఇబ్నె ఇస్‌హాక్ చెప్పినట్లు, ముర్సిద్ బిన్ అబీ ముర్సిద్ గనవీకు, సహీ బుఖారి ఉల్లేఖనం ప్రకారం, ఆసిమ్ బిన్ ఉమర్ బిన్ ఖత్తాబ్ తాతగారైన హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ (ర)ను ఆ బృందానికి అమీరుగా (నాయకునిగా) చేసి పంపించినట్లు చెప్పబడుతోంది. వీరంతా రాబెగ్ మరియు జిద్దా నడుమన గల హుజైల్ తెగకు చెందిన 'రజీ' అనే చెలమకు చేరగానే, అజ్ల్ మరియు ఖారాకు చెందిన వారు హుజైల్ తెగ వారిని వారిపై పురికొల్పి వెన్నంటి చంపమని పంపించారు. బనూ లహియ్యాన్‌కు చెందిన ఓ వంద మంది విలుకాండ్రు ఆ బృందం

2. జాదుల్ ముఆద్-2/109; ఇబ్నె హష్షామ్-2/619, 620

వెంటబడ్డారు. వారి అడుగుజాడల్ని చూస్తూ ఆ బృందాన్ని చేరుకోవడం జరిగింది. ఇది గమనించిన సహాబా (ర) ఓ ఎత్తయిన కొండపైకెక్కి రక్షణ పొందారు.

బనూ లహియ్యాన్ విలుకాండ్రు వారిని చుట్టుముట్టి, మీరు దిగివస్తే మిమ్మల్ని చంపము అని మాటిస్తున్నాం అన్నారు. హజ్రత్ ఆసిమ్ (ర) దిగడానికి సిద్ధపడక తమ మిత్రులతో యుద్ధానికి దిగారు. చివరికి బాణాల వర్షం కురిపించి ఏడుగురిని చంపడం జరిగింది. ఇక హజ్రత్ ఖుబైబ్(ర), జైద్ బిన్ దస్నా (ర), మరో సహాబీ (ర) ముగ్గురూ మిగిలిపోయారు. ఇప్పుడు కూడా బనూ లహియ్యాన్ తన వాగ్దానాన్ని వారి ముందుంచడం వలన ఆ ముగ్గురు క్రిందికి దిగివచ్చారు. అయితే వారు క్రిందికి రాగానే తమ మాటపై నిలబడక వారిని తమ వింటి నారులతో కట్టివేస్తుండగా, అందు మూడో సహాబీ (ర), ఇది మీరు చేసిన వాగ్దానానికి విరుద్ధమైన విషయం అంటూ వారి వెంట వెళ్ళడానికి నిరాకరించారు. వారు ఆయన్ను ఈడ్చుకొని తమ వెంట తీసుకు వెళ్ళే ప్రయత్నం చేయగా ఆయన నిరాకరించడం వల్ల అక్కడనే చంపేశారు. హజ్రత్ ఖుబైబ్ మరియు హజ్రత్ జైద్ (ర)లను మక్కాకు తీసుకొని వెళ్ళి అమ్మేశారు. ఈ ఇద్దరు సహాబా (ర)లు బద్ర్ యుద్ధంలో మక్కా సర్దారులను మట్టుపెట్టినవారు.

హజ్రత్ ఖుబైబ్ (ర) కొంతకాలం మక్కా వారి ఖైదులోనే ఉన్నారు. ఆ తరువాత ఆయన్ను హత్య చేద్దామనే ఉద్దేశ్యంతో హరం (బైతుల్లాహ్) బయట ఉన్న 'తన్ఈమ్' అనే ప్రదేశానికి తీసుకొని రావడం జరిగింది. ఆయన్ను ఉరికంబం ఎక్కించడానికి సిద్ధమైనప్పుడు ఆయన వారితో, "నన్ను వదలండి, నేను రెండు రకాతుల నమాజు చేసుకుంటాను" అన్నారు. బహుదైవారాధకులు ఆయన ఈ చివరి కోరికను మన్నించి కట్లు విప్పారు. ఆయన రెండు రకాతుల నమాజు చేశారు. నమాజు ముగించుకొని సలాము పూర్తి చేసిన తరువాత ఆయన వారినుద్దేశించి, "నేను భయం వల్ల ఇలా చేస్తున్నానని అనుకుంటారని నమాజును త్వరగా ముగించాను. అలా కాని పక్షంలో నా నమాజును ఇంకొంత పొడిగించేవాణ్ణి అంటూ, ఓ అల్లాహ్! వీరిని ఒక్కొక్కరిగా లెక్కించు, పిదప వారిని విడదీసి చంపు, వీరిలో మరెవ్వరినీ వదలిపెట్టకు" అని ప్రార్థించారు. ఆ తరువాత ఈ క్రింది అర్థం వచ్చే పద్యపాదాలను పఠించారు.

"ప్రజలు నా చుట్టు గుంపులు గుంపులుగా ప్రోగయ్యారు. తమ తెగల్ని నాపైకి ఉసిగొల్పారు. ఇలా ఓ పెద్ద సమూహాన్ని కూడదీశారు. తమ కుమారుల్ని, తమ స్త్రీలను కూడా పిలుచుకున్నారు. నన్ను ఓ దృఢమైన ఎత్తయిన బోదె దగ్గరకు చేర్చారు. నేను నా దీన స్థితి, స్వస్థలం నుండి నా ఎడబాటు, నా వధ్యస్థలం దగ్గర ప్రోగైన బృందాలు పెట్టే బాధలను గురించి అల్లాహ్‌కే ఫిరియాదు చేస్తున్నాను. ఓ ఆకాశాల స్వామీ! నా ఎడల నా శత్రువులు అవలంబిస్తున్న ఈ వైఖరిపై నాకు సహనం వహించే భాగ్యం కలుగజెయ్యి. వారు నన్ను ముక్కలుముక్కలుగా నరికేస్తారు. వారు నన్ను, నిన్ను ధిక్కరించమని ఒత్తిడి చేస్తున్నారు. అయినా మరణమే అంతకంటే సులభతరమైనది. నా కళ్ళు కన్నీళ్ళు లేకుండా బయటకు రావాలి. నేను చంపబడితే, ఏ ప్రక్కన పడిపోయి చస్తానో అనే బెంగ నాకు లేదు. నా ఈ మరణం దైవమార్గంలో వచ్చే మరణం. ఖండఖండాలుగా నరికిన నా అవయవాల్లో ఆయన శుభాన్ని కలుగజేస్తాడు."

ఆ తరువాత అబూ సుఫ్యాన్, హజ్రత్ ఖుబైబ్(ర)తో, "ముహమ్మదే గనుక (నీకు బదులు) మా దగ్గర ఉండి ఉంటే, మేము ఆయన మెడను నరికేస్తే, నీవు నీ భార్యాబిడ్డలతో సుఖంగా ఉంటే ఇది నీకు ఇష్టమేనా?" అని అడిగాడు. ఇది విన్న హజ్రత్ ఖుబైబ్ (ర), "దైవసాక్షి! దాన్ని నేను ఎన్నటికీ సహించజాలను. ఆయనే తన భార్యాబిడ్డలతో సుఖంగా ఉంటూ ఆయన కాలిలో ఓ ముల్లు గ్రుచ్చుకొని అది ఆయనకు బాధ కలిగించినా నేను సహించే విషయం కాదు" అని బదులు పలికారు.

పిదప ఆయనను ముష్రిక్కులు ఉరివేసి శవాన్ని వ్రేళ్ళాడదీశారు. దాని రక్షణ కోసం మనుషుల్ని నియమించారు. కాని హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా (ర) అక్కడికి వచ్చి వారిని మోసగించి శవాన్ని రాత్రికి రాత్రే మాయం చేశారు. దాన్ని ఖననం చేశారు. హజ్రత్ ఖుబైబ్(ర)ను చంపినవాడు ఉక్బా బిన్ హారిస్. హజ్రత్ ఖుబైబ్ (ర) అతని తండ్రి హారిస్‌ను బద్ర్ యుద్ధంలో సంహరించారు.

సహీ బుఖారీలో ఉల్లేఖించిన దాని ప్రకారం, హత్య సమయంలో రెండు రకాతుల నమాజు చేసే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టినవారు హజ్రత్ ఖుబైబ్ (ర) మాత్రమే అని ఉంది. ఆయన్ను చంపే ముందు ఖైదు చేయగా ఆయన దగ్గర ద్రాక్ష గుత్తులు కొన్ని కనుగొనడం జరిగింది. ఆయన అప్పుడు వాటిని తింటున్నారు. మక్కాలో ఖర్జూరం కూడా లభించని రోజులవి.

ఈ సంఘటనలో బందీ అయిన మరో సహాబీ (ర) అంటే హజ్రత్ జైద్ బిన్ దస్నా (ర)ను సఫ్వాన్ బిన్ ఉమయ్యా కొని తన తండ్రి హత్యకు బదులు చంపేశాడు.

ఆ సహాబాల బృందానికి నాయకునిగా ఉన్న ఆసిమ్ బిన్ సాబిత్ (ర) అల్లాహ్‌ను వేడుకొని ఉన్నారు, తన శరీరంలోని ఏ భాగాన్నీ ముష్రిక్కులు తాకకూడదని, తానూ ఏ ముష్రిక్కునూ అంటుకోనని. ఆయన బద్ర్ యుద్ధంలో ఖురైషులకు చెందిన ఓ ముష్రిక్కును సంహరించి ఉన్నారు. అందుకని ఖురైషులు ఆయన శవానికి చెందిన ఓ ఖండాన్నేదైనా తీసుకురమ్మని మనుషుల్ని పంపించారు. కాని అల్లాహ్ ఆయన వేడుకోలును మన్నించి ఆయన శవాన్ని కాపాడడానికి కందిరీగల ఓ పెద్ద తుట్టెను పంపించాడు. ముష్రిక్కులు ఆయన శవం వద్దకు పోలేక వెనక్కు మరలి వచ్చేశారు. హజ్రత్ ఉమర్ (ర) గారికి ఈ సంఘటన గురించి తెలిసినప్పుడు ఆయన తరచూ ఇలా అంటూ ఉండేవారు.

"అల్లాహ్ విశ్వాసిని అతను జీవించి ఉన్నప్పటివలెనే మరణించిన తరువాత కూడా రక్షిస్తూ ఉంటాడు."[3]

4. 'బిఇరెమఊనా' ఉదంతం

రజీ సంఘటన జరిగిన మాసంలోనే బిఇరెమఊనా ఉదంతం కూడా చోటు చేసుకుంది. ఇది రజీ సంఘటనకంటే ఘోరమైనది.

ఈ ఉదంతం వివరాలు ఇలా ఉన్నాయి:

'మసాయిబుల్ అస్‌నా' (శూలాలతో ఆటలాడుకునేవాడు) బిరుదు గల 'అబూ బరా ఆమిర్ బిన్ మాలిక్' అనేవాడు మదీనాపురంలో మహాప్రవక్త (స) సన్నిధికి హాజరయ్యాడు. అతన్ని దైవప్రవక్త (స) ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించారు. అతను ఇస్లామ్ ధర్మాన్నయితే స్వీకరించలేదుగాని, ముస్లిములకు విరోధిగా కూడా ఉండలేదు. అతను దైవప్రవక్త (స)తో, "దైవప్రవక్తా! తమరేగనక మీ అనుచరుల్లో కొందరిని నజర్‌కు పంపిస్తే, వారు ఇస్లామ్

3. ఇబ్నె హష్షామ్-2/169-179; జాదుల్ ముఆద్-2/109; సహీ బుఖారి-2/568, 569, 585

ధర్మాన్ని స్వీకరిస్తారని ఆశగా ఉంది" అన్నాడు. దానికి మహాప్రవక్త (స), ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, నలభై మందిని, సహీ బుఖారి ఉల్లేఖనం ప్రకారం, డెభ్భయి మందిని అతని వెంట పంపించారు- డెభ్భయి మందిని పంపించారనే ఉల్లేఖనం సరైనది- సాయిదా తెగకు చెందిన మున్జిర్ బిన్ అమ్రూ (ర)ను ఆ బృందానికి అమీరుగా చేసి పంపించారు. ఈ బృందంలో ఉన్న సహాబాలంతా మేధావులు, ఖుర్‌ఆన్ పారాయణంలో దిట్టలు, సహాబాల్లోకెల్లా ఉత్తమమైన వారు. వీరు పగలు కట్టెలు కొట్టి వాటిని అమ్మి 'సుఫ్ఫా' వారి కోసం భోజనం సమకూర్చిపెట్టేవారు. వారికి ఖుర్‌ఆన్ చదివించేవారు. రాత్రి పూట మహాప్రవక్త (స) గారితోపాటు నమాజులోనూ, వేడుకోళ్ళలోనూ నిమగ్నమై ఉండేవారు. ఈ బృందం ప్రయాణిస్తూ మఊనా బావి వద్దకు చేరుకున్నారు. ఈ బావి బనూ ఆమిర్ మరియు హుర్రా బనీ సులైమ్ తెగలు నివసించే ప్రదేశానికి నడుమన గల ఓ ప్రదేశంలో ఉంది. అక్కడ విడిది చేసిన తరువాత సహాబా (ర), ఉమ్మె సులైమ్ సోదరుడు హిరామ్ బిన్ మల్హాన్‌కు దైవప్రవక్త (స)గారి లేఖనిచ్చి, దైవ విరోధి అయిన ఆమిర్ బిన్ తుఫైల్ వద్దకు పంపించారు. కాని అతను ఆ ఉత్తరాన్ని చూడనైనా చూడలేదు. ఓ మనిషికి సైగ చేశాడు; ఆ మనిషి హజ్రత్ హిరామ్ (ర) వీపులో శూలాన్ని దిగగొట్టాడు. అది ఆయన శరీరంలో నుంచి బయటకు వచ్చేసింది. రక్తాన్ని చూడగానే హజ్రత్ హిరామ్ (ర)గారి నోట, "అల్లాహు అక్బర్! కాబా ప్రభువు సాక్షి! నేను విజేతనయ్యాను" అనే పలుకులు వెలువడ్డాయి.

వెంటనే దైవ విరోధి అయిన ఆమిర్, మిగిలిన సహాబా(ర)లపై విరుచుకుపడమని తన తెగ బనీ ఆమిర్‌ను ఉసికొల్పాడు. కాని వారు బరా సంరక్షణలో ఉండడం వలన అతని మాటలను లెక్కచెయ్యలేదు. చేసేదిలేక అతను బనూ సులైమ్‌ను కేకవేశాడు. బనూ సులైమ్‌కు చెందిన మూడు తెగలు'అసియా, రఅల్, జకాన్'లు అతని పిలుపునకు పరుగెత్తుకొచ్చారు. రాగానే వారు ఆ సహాబా (ర)లను చుట్టుముట్టేశారు. సమాధానంగా సహాబాలు కూడా తమ ఆత్మరక్షణ కోసం పోరాడవలసి వచ్చింది. అయినా అందరూ అమరగతి పొందారు. ఒక్క హజ్రత్ కఅబ్ బిన్ జైద్ బిన్ నజ్జార్ (ర) మాత్రం బ్రతికిపోయారు. గాయాలతో పడివున్న ఆయన్ను షహీదుల నడుమ నుండి ఎత్తుకు రావడం జరిగింది. అగడ్త యుద్ధం వరకు ఆయన జీవించే ఉన్నారు. ఆయనే కాకుండా మరిద్దరు సహాబా (ర)లు హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా

జమరీ (ర) మరియు హజ్రత్ మున్జిర్ బిన్ ఉఖబా బిన్ ఆమిర్ (ర)లు ఒంటెలను మేపడానికి వెళ్ళడం వలన మిగిలిపోయారు. వారు ఆ పోరాటం జరిగిన చోట గ్రద్దలు ఎగరడం చూసి నేరుగా అక్కడికి వెళ్ళి చూడగా వారి సహచరులు ముష్రిక్కులతో యుద్ధం చేస్తూ చనిపోయారన్న విషయం తెలిసింది. అక్కడ హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమరీని బందీగా పట్టు కోవడం జరిగింది. ఆయన తాను ముజర్ తెగకు చెందిన వాడని పరిచయం చేసుకోగా, ఆమిర్, ఆయన నొసటి వెంట్రుకలను కత్తిరించి తన తల్లి తరపున స్వతంత్రునిగా చేసి వదిలేశాడు. అతని తల్లి ఇదివరకే ఓ బానిసను విడిచి పెడ్తానని మ్రొక్కుకొని ఉంది.

హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర) ఈ దుర్ఘటనను మదీనాకు చేరవేయడానికి బయలుదేరారు. డెబ్భయి మంది ముస్లిముల అమరగతి, ఉహద్ యుద్ధ గాయాన్ని తిరిగి తోడేసింది. ఉహద్ యుద్ధంలో చనిపోయిన వారు బాహాబాహి యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్నవారు. కాని పాపం వీరు మాత్రం ఓ హేయమైన మోసం, దగా మరియు కుట్ర కారణంగా చనిపోయారు.

హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర) తిరుగు ప్రయాణంలో ఖనాత్ లోయ చివర్లో ఉన్న 'ఖర్ఖరా' అనే ప్రదేశానికి చేరి ఓ చెట్టు నీడన సేద తీర్చుకుంటున్నారు. అక్కడే బనూ కిలాబ్ తెగకు చెందిన ఇద్దరు వ్యక్తులు కూడా వచ్చి చేరారు. వారిద్దరు ఆదమరిచి నిద్రించే సమయంలో హజ్రత్ అమ్రూ (ర) వారిద్దరిని చంపేశారు. అలా చేయడం ఆయన దృష్టిలో, తమ స్నేహితుల హత్యకు పగ తీర్చుకుంటున్నానని అనుకోవడమే. అయితే, ఆ ఇద్దరికి మహాప్రవక్త (స) గారు సంరక్షణ హామీ ఇచ్చి ఉన్నారన్న విషయం ఆయనకు తెలియదు. మదీనాకు వచ్చి ఈ విషయం గురించి చెప్పగా, ఆయన(స), "అయ్యో! నీవు నా రక్షణ పొందిన ఇద్దరిని చంపేశావు. వారి దీత్ (రక్తపరిహారం) నేను తప్పకుండా చెల్లించాల్సి ఉంది" అని అన్నారు. ఆ తరువాత మహాప్రవక్త (స) వారి మిత్రపక్షాలైన యూదుల నుండి ఆ దీత్‌ను కూడగట్టడంలో నిమగ్నమైపోయారు.[4] ఆ తరువాతే ఈ సంఘటన గజ్వాయె బనూ నసీర్‌కు కారణభూతమైంది.

4. చూడండి, ఇబ్నె హష్షామ్-2/183-188; జాదుల్ ముఆద్-2/109,110; సహీ బుఖారి-2/584, 586

మఊనా మరియు రజీ దుర్ఘటనలు ఒకదాని తరువాత మరొకటి ఉనికిలోనికి రావడం మూలంగా[5] దైవప్రవక్త (స) ఎనలేని దుఃఖానికి లోన య్యారు.[6] ఏ జాతులు, మరే తెగలైతే ఈ సహాబా (ర)ల పట్ల ఈ విధంగా ప్రవర్తించాయో, మహాప్రవక్త (స) ఒక నెల వరకు వారిని శపిస్తూనే ఉన్నారు. సహీ బుఖారిలో హజ్రత్ అనస్ (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, ఆయన (స) ముప్పై రోజుల వరకు ఆ షహీదులను చంపిన వారిని శపించారని, ఆయన (స) ఫజ్ర్ నమాజులో రఅల్, జక్వాన్, లహియ్యాన్ మరియు ఉసయ్యాను శపించేవారు. అల్లాహ్ ఈ విషయంలో దైవప్రవక్త (స)పై దైవవాణిని అవతరింపజేశాడు. అది ఆ తరువాత రద్దు అయింది. ఆ దైవవాణిలో ఇలా ఉంది.

"మా జాతికి చెప్పండి, మేము మా ప్రభువును కలుసుకున్నామని, ఆయన మా ఎడల సంతుష్టుడయ్యాడని, మేము ఆయన పట్ల సంతుష్టులయ్యాము." ఆ తరువాత దైవప్రవక్త (స) తన ఈ శాపాన్ని వదిలేశారు.[7]

5. గజ్వాయె బనూ నజీర్

యూదులకు ఇస్లామ్ అన్నా, ముస్లిములు అన్నా గిట్టేది కాదన్న విషయం, వారు రణధీరులు కాకపోవడం వలన కుట్రలు, కుతంత్రాల మాధ్యమంగానే తమ పబ్బం గడుపుకుంటూ, ఇస్లామ్‌కు వ్యతిరేకంగా రంగం సిద్ధం చేసి దాన్ని సర్వనాశనం చేసే ప్రయత్నాలు చేస్తున్నారనే విషయం మనం ఇదివరకు చెప్పుకున్నదే. ముస్లిములతో చేసుకున్న ఒప్పందాన్ని తుంగలో తొక్కి వారిని సకల విధాల బాధలకు గురిచేయడం వారి అలవాటుగా మారిపోయింది. అయితే బనీ ఖైనుఖా దేశ బహిష్కరణ మరియు కఅబ్ బిన్ అష్రఫ్ హత్యతో వారి ధైర్యం కాస్తా సన్నగిల్లిపోయింది. వారు భయభీతులై మిన్నకుండిపోవలసివచ్చింది. కాని ఉహద్ యుద్ధం తరువాత వారికి ధైర్యం తిరిగివచ్చినట్లయింది. వారు బాహాటంగా

5. వాఖిదీ, రజీ మరియు మఊనా దురంతాల వార్త దైవప్రవక్త (స)కు ఒకే రాత్రి చేరినట్లు చెప్పారు.
6. ఇబ్నె సఅద్ (ర), హజ్రత్ అనస్ (ర)గారి ఉల్లేఖనాన్ని ఉల్లేఖిస్తూ, బిఇరె మఊనా సంఘటనపై దుఃఖించినంతగా మరే సంఘటనపై ఆయన దుఃఖించలేదు అని అంటారు. చూడండి, ముక్తసరుస్సీరత్- అబ్దుల్లాహ్-పుట.260
7. సహీ బుఖారి-2/586, 587, 588

ముస్లిములతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించారు. వారు మదీనాలోని వంచకులతోనూ, మక్కాలోని ముష్రిక్కులతోనూ తిరిగి రహస్య సంబంధాలు ఏర్పరచ్చుకున్నారు. ముస్లిములకు వ్యతిరేకంగా ముష్రిక్కులకు చేయూతనివ్వసాగారు.[8]

దైవప్రవక్త (స)కు ఇదంతా తెలిసినప్పటికీ సహనం వహించేవారు. కాని రజీ మరియు మఊనా దుర్ఘటనల తరువాత వారి ధైర్యం, తెగింపు హద్దులు మీరాయి. వారు మహాప్రవక్త (స)ను అంతమొందించే పథకాన్ని సిద్ధం చేశారు. ఆ పథకం వివరాలు ఇలా ఉన్నాయి.

దైవప్రవక్త (స), తమ సహచరులు కొందరితో యూదుల దగ్గరకు వెళ్ళారు. వారి నుండి బనూ కిలాబ్‌కు చెందిన ఆ ఇద్దరు హతుల దీత్ (రక్తపరిహారం) సహాయం కోసం మాట్లాడారు (వీరిద్దరిని హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ పొరపాటున హత్య చేసిన విషయం మనకు తెలుసు). ఒప్పందం ప్రకారం వారు దీనికి సహాయపడవలసి ఉంది. వారు మహాప్రవక్త (స)తో, "ఓ అబుల్ ఖాసిం! సరే, మేము అలానే సహాయపడతాం. మీరు ఇక్కడ కూర్చొని ఉండండి" అని అనగా, దైవప్రవక్త (స) వారి మిద్దె గోడకు ఆనుకొని కూర్చుని వారు తమ వాగ్దానాన్ని పూర్తి చేస్తారనే ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆయన (స) వెంట హజ్రత్ అబూ బక్ర్ (ర), హజ్రత్ ఉమర్(ర), హజ్రత్ అలి (ర) ఇంకొందరు సహాబాలు కూడా కూర్చుని ఉన్నారు.

అక్కడ నుండి బయలుదేరి వెళ్ళిన యూదుల బుద్ధివివేకాలను షైతాను ప్రక్కదారికి మళ్ళించాడు. ఏ దురదృష్టం అయితే వారి పాలిట శాపంగా మారనుందో, షైతాను దాన్ని ఎంతో మనోహరమైనదిగా వారికి చూపుతున్నాడు. అంటే అలా వెళ్ళిన ఆ యూదులు పరస్పరం దైవప్రవక్త (స)ను హత్య చేసే కుట్ర పన్నడంలో మునిగిపోయారు. వారు ఓ తిరుగలి (విసుర్రాయి) బండను చూపిస్తూ, "దీన్ని ఎత్తుకొని పైకి వెళ్ళి అక్కడ నుంచి ముహమ్మద్(స) తలపై పడవేయటానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు?" అని అడగగా, అందులోని ఓ దురదృష్టవంతుడైన యూదుడు 'అమ్రూ బిన్ హజాష్' నిలబడి "నేను దానికి సిద్ధం" అని అన్నాడు. వారిలోనే ఓ వ్యక్తి సలామ్ బిన్ ముష్కం ఇది గమనించి, "అలా చేయకండి! దైవసాక్షి! వారికి మీరు పన్నే

8. *సునన్ అబీ దావూద్-షరహ్ ఔనుల్ మాబూద్-3/116, 117*

పన్నాగం తెలుపబడుతుంది. ఆ తరువాత మీకూ వారికి మధ్య గల ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లవుతుంది, జాగ్రత్త!" అని హెచ్చరించాడు. అయినా వారు అతని మాటలను ఖాతరు చేయలేదు. తమ ఈ పథకాన్ని అమలు చేయడానికి దృఢంగా నిశ్చయించు కున్న తరువాతనే అక్కడ నుండి లేచారు.

అటు అల్లాహ్ తరఫున హజ్రత్ జిబ్రీల్ (అ.స.) మహాప్రవక్త (స) వద్దకు వచ్చారు. ఆయన యూదులు పన్నుతున్న కుట్రను గురించి ఆయనకు తెలియ జేశారు. దైవప్రవక్త (స) వెంటనే ఆ ప్రదేశం నుండి లేచి మదీనా వైపునకు బయలుదేరారు. ఆ తరువాత తక్కిన సహాబాలు (ర) కూడా ఆయన వెనుకగా వచ్చి ఆయన్ను కలిశారు. "దైవప్రవక్తా! తమరు అకస్మాత్తుగా అక్కడి నుండి ఎందుకు లేచి వచ్చేసినట్లు?" అని అడిగారు. దానికి సమాధానంగా మహాప్రవక్త (స), యూదుల పన్నాగం గురించి వారికి ఎరుకపరిచారు.

మదీనాకు తిరిగివచ్చిన వెంటనే మహాప్రవక్త (స) ముహమ్మద్ బిన్ ముస్లిమాను బనూ నజీర్ వద్దకు పంపించి, "మీరందరూ మదీనా నుండి బయటకు వెళ్ళిపోండి. ఇక్కడ నాతో ఉండడానికి అర్హులు లేరు, మీకు పది రోజుల గడువు ఇవ్వబడుతోంది. ఆ తరువాత మీలో ఎవరైనా ఇక్కడ కనిపిస్తే అతని మెడను నరకడం జరుగుతుందని" చెప్పించారు. ఈ హెచ్చరిక తరువాత యూదులకు దేశ బహిష్కరణ తప్ప వేరే మార్గం కానరాలేదు. వారు కొన్ని రోజుల వరకు ప్రయాణ సన్నాహాలు చేసుకోనారంభించారు. కాని ఈ సమయంలోనే వంచకుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై వారికి, "మీరంతా వెళ్ళడానికి వీల్లేదు. మీ స్థలంలోనే స్థిరంగా ఉండిపోండి. మీరు ఇళ్ళూవాకిళ్ళు వదలడానికి వీల్లేదు. నా దగ్గర రెండు వేల మంది యోధులు ఉన్నారు. వారు మీ కోటలలో ఉంటూ మిమ్మల్ని రక్షించడం కోసం వారు తమ ప్రాణాలనైనా పణంగా పెట్టగలరు. వారే గనక మిమ్మల్ని వెళ్ళగొడితే మీ వెంట దేశ బహిష్కరణకు మేమూ గురి అవుతాము. మీ గురించి ఎవరు ఒత్తిడి తెచ్చినా వినేవారం కాము. మీతోనే యుద్ధం జరిగితే మేము మీ సహాయం కోసం సిద్ధంగా ఉన్నాం. బనూ ఖురైజా మరియు బనూ గత్‌ఫాన్‌లు కూడా మీకు మిత్రపక్షాలే. వారూ మీకు సహాయపడగలరు" అని చెప్పి పంపించాడు.

కపట ముస్లిమ్ నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై అందించిన ఈ

సందేశం వల్ల యూదులకు ప్రాణం లేచివచ్చినట్లయింది. దేశ బహిష్కరణకు గురి కావడానికి బదులు ముస్లిములను ఎదుర్కొనేందుకు వారు సిద్ధపడ్డారు. ఆ యూదుల నాయకుడు హుయ్ బిన్ అఖ్తబ్‌కు, అబ్దుల్లా బిన్ ఉబై చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటాడనే ఆశ పొడసూపింది. కాబట్టి అతను దైవప్రవక్త (స) వద్దకు సమాధానంగా, "మేము మా స్వస్థలం నుండి ఏ మాత్రం బయటకు వెళ్ళేది లేదని, చేసేది ఏమిటో చేసుకోమని" చెప్పి పంపించాడు.

ముస్లిములకు ఈ పరిస్థితి అతిగడ్డయిన పరిస్థితి అనడంలో సందేహం ఏమాత్రం లేదు. ఎందుకంటే, వారు తమ చరిత్రలోనే ఈ కీలకమైన మరియు గడ్డు పరిస్థితిలో శత్రువులతో ఢీకొనడం అంటే మాటలు కాదు, పరిణామం బహు ప్రమాదకరంగా ఉంటుంది. అరేబియా దేశం మొత్తమే ముస్లిములకు ఎదురు తిరుగుతున్న రోజులవి. ముస్లిములకు చెందిన రెండు ప్రచార బృందాలు ఎంతో నిర్దయగా చంపివేయబడ్డాయి. అదే కాదు, బనీ నజీర్‌కు చెందిన యూదులు కూడా ఎంతో శక్తిని పుంజుకొని ఉన్నారు. వారు ఆయుధాలను పడవేసి వెళ్ళిపోవడం కూడా జరగని పనిలా అగుపిస్తోంది. వారితో యుద్ధానికి తలపడితే అనేక ప్రమాదాలు ఎదురు కావచ్చు కూడా. కాని బిఇరె మఊనా దుర్ఘటనకు పూర్వం నెలకొన్న పరిస్థితులు చాలా మటుకు మారిపోవడం వలన ముస్లిములు హత్యలు మరియు వాగ్దాన భంగం లాంటి విషయాల్లో ఎంతో జాగరూకతతో మెలగుతున్నారు. ఆ నేరాలు చేసేవారి ఎడల వారి ప్రతీకార భావం రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. అందుకని వారు ఓ నిర్ణయానికి వచ్చారు. బనూ నజీర్ యూదుల తెగ దైవప్రవక్త (స) గారిని హత్య చేయడానికి పన్నాగం పన్నారు కాబట్టి వారితో తప్పకుండా తలపడవలసిందే. పరిణామాలు ఏమైనప్పటికీ వారిని అణచివేయవలసిందే అన్నది ఆ నిర్ణయం. దైవప్రవక్త (స)కు హుయ్ బిన్ అఖ్తబ్ సందేశం అందగానే ఆయన తమ సహాబాలనందరినీ ఓ చోట సమావేశపరచి యుద్ధం చేయడానికే నిర్ణయం తీసుకున్నారు. అల్లాహు అక్బర్ అనే నినాదం చేస్తూ అందరూ లేచి నిలబడ్డారు. హజ్రత్ ఉమ్మె మక్తూమ్ (ర)కు మదీనా సంరక్షణ బాధ్యతను అప్పగించి బనూ నజీర్ నివసిస్తున్న ప్రాంతానికి బయలుదేరారు. హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (ర)గారి చేతిలో యుద్ధ పతాకం రెపరెపలాడుతోంది. వీరు బనూ నజీర్ ప్రాంతానికి చేరి వారిని చుట్టుముట్టేశారు.

ఇటు బనూ నజీర్ యూదులు తమ కోటల్లో దాక్కొని తలుపులు మూసుకున్నారు. కోట గోడలపై నుండి బాణాలు, రాళ్ళు రువ్వనారంభించారు. వారి కోట చుట్టూ ఉన్న ఖర్జూరపు తోటలు వారిని రక్షిస్తున్నాయి. కాబట్టి మహాప్రవక్త (స) ఆ చెట్లను నరికి కాల్చిపారవేయమని ఆదేశం ఇచ్చారు. ఆ తరువాత హజ్రత్ హస్సాన్ (ర)ను సంబోధిస్తూ ఇలా అన్నారు:

"బనీలవీ సర్దారులకోసం, బవైరా (బనూ నసీర్‌కు చెందిన ఓ ఖర్జూరపు తోట పేరు)లో అగ్ని కీలలు పైకిలేవడం ఓ మామూలు విషయంలా ఉంది."

దీని గురించే అల్లాహ్ ఆదేశం కూడా అవతరించింది.

مَا قَطَعْتُمْ مِّنْ لِّيْنَةٍ اَوْ تَرَكْتُمُوْهَا قَآئِمَةً عَلٰٓى

اُصُوْلِهَا فَبِاِذْنِ اللّٰهِ وَلِيُخْزِىَ الْفٰسِقِيْنَ۝

"మీరు ఏ ఖర్జూరపు చెట్లను నరికివేశారో లేక ఏ ఖర్జూరపు చెట్లను వాటి వ్రేళ్ళపై యథాతథంగా ఉండనిచ్చారో, ఇదంతా అల్లాహ్ ఆజ్ఞతోనే జరిగింది. (అల్లాహ్ ఈ ఆజ్ఞను) దుర్మార్గులను అవమానపరిచేందుకు (ఇచ్చాడు)." (59 : 5)

ఎలాగైతేనేమి, వారిని చుట్టుముట్టిన తరువాత బనూ ఖురైజా తెగ ఇందులో తలదూర్చకుండా మిన్నకుండిపోయింది. అబ్దుల్లా బిన్ ఉబై జాడే లేదు. అతను యూదులను మోసగించాడు. వారి మిత్రపక్షం అయిన గత్ఫాన్ కూడా వారి సహాయం కోసం రాలేదు. మొత్తానికి ఏ ఒక్కడూ వారిని ఆదుకోడానికిగాని, వారి కష్టాలను కడతేర్చడానికిగాని ముందుకురాలేదు. అల్లాహ్ ఈ పరిస్థితిని ఈ ఉపమానం ద్వారా ఇలా సెలవిచ్చాడు:

كَمَثَلِ الشَّيْطٰنِ اِذْ قَالَ لِلْاِنْسَانِ اكْفُرْ فَلَمَّا كَفَرَ قَالَ اِنِّىْ بَرِىْٓءٌ مِّنْكَ

"వీరి దృష్టాంతం షైతాన్ దృష్టాంతం మాదిరిగా ఉంది; ప్రారంభంలో వాడు మానవునితో, 'సత్యాన్ని తిరస్కరించు' అని అంటాడు. తీరా మానవుడు సత్యాన్ని తిరస్కరిస్తే, వాడు, 'నీ పట్ల నాకు ఏ విధమైన బాధ్యతా లేదు. సకల లోకాల ప్రభువు అయిన అల్లాహ్ అంటే నాకు భయం' అని అంటాడు." (59 : 16)

ఆ దిగ్బంధం ఎన్నో రోజులు కొనసాగలేదు. కేవలం ఆరు రాత్రులు- మరో ఉల్లేఖనం ప్రకారం, పదిహేను రాత్రులు- మాత్రమే కొనసాగింది. అల్లాహ్ వారి హృదయాల్లో భయాన్ని ముస్లిముల ఎడల అఘోరాన్ని పుట్టించాడు. వారి ధైర్యం పటాపంచలైపోయింది. విధిలేక ఆయుధాలు పడవేయడానికి సిద్ధపడ్డారు. దైవప్రవక్త (స)కు ఓ సందేశం పంపిస్తూ, "మేము మదీనాను విడిచి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాము, తమరు ప్రతిపాదించిన దేశ బహిష్కారాన్ని మేము శిరసావహిస్తున్నాము" అని చెప్పారు. మహాప్రవక్త (స), వారి ఈ ప్రతిపాదనను మంజూరు చేస్తూ, మీ ఆయుధాలు తప్ప మీ సొత్తునంతా ఒంటెలపై వేసుకొని మీ భార్యాపిల్లలతో సహా మదీనాను విడిచి వెళ్ళండని ఆదేశించారు.

దైవప్రవక్త (స) ఇచ్చిన ఈ ఆదేశం మేరకు వారు తమ ఆయుధాలను పడవేసి, తమ చేతులతోనే తమ ఇండ్లను పడగొట్టి కిటికీలు ద్వారబంధాలతో, చివరికి గోడలోని మేకులతో సహా ఒంటెలపై వేసుకొని కట్టుకున్నారు. ఆ తరువాత తమ భార్యాబిడ్డలను ఎక్కించుకొని ఆరు వందల ఒంటెలపై మదీనాను విడిచి వెళ్ళిపోయారు. వారిలో చాలా మంది యూదులు, వారి సర్దారులు హుయ్ బిన్ అఖ్తబ్ మరియు సలాం బిన్ అబిల్ హుఖైఖ్‌తో సహా ఖైబర్ దారిపట్టారు. వారిలోని ఓ బృందం సిరియా వైపునకు వెళ్ళిపోయింది. కేవలం ఇద్దరు వ్యక్తులు అంటే యామీన్ బిన్ అమ్రూ మరియు అబూ సయీద్ బిన్ వహబ్‌లు మాత్రమే ఇస్లామ్ స్వీకరించి మదీనాలో ఉండిపోయారు. వారి ఆస్తులను ఏమాత్రం ముట్టుకోవడం జరగలేదు.

మహాప్రవక్త (స) బనూ నజీర్‌కు చెందిన ఆయుధాలు, భూములు, ఇళ్ళు మరియు తోటలను తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఆయుధాల్లో యాభై కవచాలు, యాభై శిరస్త్రాణాలు, మూడు వందల నలభై ఖడ్గాలు ఉన్నాయి.

బనూ నజీర్‌కు చెందిన తోటలు, భూములు మరియు ఇళ్ళపై హక్కు కేవలం దైవప్రవక్త (స) గారిదే. వాటిని తామే ఉంచుకునే లేదా ఇతరులకు పంచిపెట్టే అధికారం ఆయనకే ఉంది. కాబట్టి ఆయన(స), (యుద్ధ ధనంలా) ఈ సంపద నుండి 'ఖమ్స్' (అయిదో వంతు) తీయలేదు. ఎందుకంటే అల్లాహ్ ఆయనకు ఈ ధన సంపద 'ఫై' ధనంగా బహూకరించినది. ఎందుకంటే ఈ సంపదను పొందడానికి ముస్లిములు గుర్రాలను, ఒంటెలను పరుగుదీయించి

దాన్ని (ఖడ్గబలంతో) జయించలేదు గనుక. మహాప్రవక్త (స) తన ప్రత్యేక అధికారాన్ని ఉపయోగించి ఈ ధన సంపదను ప్రథమంగా హిజ్రత్ చేసి వచ్చిన ముహాజిర్లకు పంచిపెట్టారు. అయితే ఇద్దరు అన్సారులకు చెందిన సహాబా (ర) అంటే హజ్రత్ అబూ దుజానా (ర) మరియు సహల్ బిన్ హునైఫ్ (ర)లకు వారి దారిద్ర్య జీవితాన్ని చూసి అందులో నుంచి కొంత ఇచ్చారు. అదే కాకుండా ఆయన (స) కొంత భూభాగాన్ని తన కోసం ఉంచుకున్నారు. దీని ద్వారా ఆయన (స) తనకు, తన భార్యామణులకు కావలసిన వార్షిక బత్తెం అందుండే వచ్చేది. అందులో మిగిలినదంతా జిహాద్ కోసం, గుర్రాల కొనుగోలు కోసం ఖర్చుపెట్టేవారు.

గజ్వయె బనూ నజీర్, రబీఉల్ అవ్వల్ మాసం హి.శ. 4 అంటే క్రీ.శ. 625, ఆగస్టు మాసంలో సంభవించింది. అల్లాహ్ దానికి సంబంధించి పూర్తి ఒక సూరా, 'సూరయె హష్ర్'నే అవతరింపజేశాడు. అందు యూదుల దేశ బహిష్కరణను వివరిస్తూ, వంచకుల వైఖరిని కూడా బట్టబయలు చేయడం జరిగింది. అందులోనే 'ఫై' ధనం గురించిన ఆదేశాలు జారీ చేస్తూ, ముహాజిర్లు మరియు అన్సారులను పొగడడం జరిగింది. అదే కాకుండా యుద్ధవ్యూహం ప్రకారం శత్రువుల చెట్లను కూడా నరకవచ్చని, వాటిని కాల్చవచ్చనే అనుమతి కూడా ఇవ్వడం జరిగింది. ఇలా చేయడం భూమిలో సంక్షోభాన్ని లేవనెత్తడం కాదు అని చెప్పడం జరిగింది. ఆ తరువాత ముస్లిములను, దైవభీతిని అవలంబిస్తూ పరలోక జీవితం గురించి సిద్ధపడవలసిందిగా తాకీదు చేయడం జరిగింది. చివరిగా అల్లాహ్ స్తోత్రాలతో తన నామాలను, సుగుణాలను చెబుతూ ఆ అధ్యాయాన్ని ముగించాడు.

ఇబ్నె అబ్బాస్ (ర) ఈ అధ్యాయం (హష్ర్ సూరా) ప్రస్తావన వచ్చినప్పుడల్లా, దీన్ని 'సూరయె బనీయిన్నజీర్' అనండి" అనేవారు.[9]

6. గజ్వయె నజద్

బనీ నజీర్ పోరాటంలో ఎలాంటి త్యాగాలు చేయకుండానే ముస్లిములు విజయాన్ని సాధించగలిగారు. దీనివల్ల మదీనాలో నెలకొన్న ఇస్లామియ అధికారం మరింత దృఢపడింది. వంచకులు నిరాశకు గురైపోయారు.

9. ఇబ్నె హష్షామ్-*2/190, 191, 192*; జాదుల్ ముఆద్-*2/71, 110*; సహీ బుఖారి-*2/574, 575*

ఇప్పుడు వారికి బహిరంగంగా ఏ పనీ చేసే ధైర్యమూ లేదు. ఈ పోరాటం అనంతరం దైవప్రవక్త (స)కు బద్దూలను అణచివేయడానికి దృష్టిని కేంద్రీకరించే అవకాశం లభించింది. ఈ బద్దూలు ఉహద్ పోరాటం జరిగిన వెంటనే ముస్లిములను అనేక కడగండ్లకు గురి చేశారు. ఎంతో పాశవికంగా ఇస్లామ్ ధర్మానుయాయులపై దాడులు చేసి వారిని చంపేశారు. ప్రస్తుతం వారి ధైర్యం మరింత హెచ్చి మదీనాపై దాడి చేయడానికి సంసిద్ధులవుతున్నారు.

బనూ నజీర్ పోరాటం ముగించుకొని దైవప్రవక్త (స), ఈ బద్దూలను అణచడానికి సిద్ధమయ్యారో లేదో, బనీ గత్ఫాన్‌కు చెందిన రెండు తెగలు బనూ ముహారిబ్ మరియు బనూ సఅలబాలు కలసి బద్దూలు మరియు ఆరాబీలను కూడగట్టుకొని మదీనాపై దాడి చేయాలని చూస్తున్నారన్న వార్త దైవప్రవక్త (స)కు అందింది. ఈ వార్త అందగానే మహాప్రవక్త (స), నజద్‌పై దాడి చేసే నిర్ణయం గైకొన్నారు. నజద్ ఎడారిలో చాలా దూరం వరకు చొచ్చుకొని వెళ్లిపోయారు. దీని లక్ష్యం, ఆ కఠిన హృదయులైన బద్దూలను భయభీతులుగా చేయాలని, తిరిగి వారికి ముస్లిములకు వ్యతిరేకంగా ఇదివరకటి తీవ్రమైన చర్యలు గైకొనే ధైర్యం లేకుండా చేయాలన్నదే.

ఇటు తలబిరుసుగల బద్దూలు, దోపిడీలకు, హత్యలకు సమాయత్తమవుతూ ఉండగానే, ముస్లిములు హఠాత్తుగా వారిపై విరుచుకుపడుతున్నారనే వార్త అందింది. భయకంపితులై పారిపోయి పర్వతాల శిఖరాలపై దాగి కూర్చున్నారు. ముస్లిములు ఈ దోపిడీగాళ్ళ తెగలపై తమ భయాన్ని ఆవహింపజేసి ప్రశాంతంగా మదీనాకు తిరిగివచ్చేశారు.

సీరత్ చరిత్రకారులు, రబీ ఉల్ ఉఖ్రా లేదా జమాదిల్ ఊలా మాసాలు హి.శ. 4 లో నజద్ ప్రాంతంలో జరిగిన ఓ గజ్వా గురించి ప్రత్యేకంగా చెబుతారు. ఆ గజ్వా గజ్వయె జాతుర్రిఖాఖ్ అని వారి వాదన. ఆధారాల ప్రకారం, ఆ రోజుల్లో నజద్ ప్రాంతంలో ఓ గజ్వా చోటుచేసుకొన్న విషయం యదార్థం. ఎందుకంటే మదీనా పరిస్థితులే అప్పుడు అలా ఉన్నాయి మరి. అబూ సుఫ్‌యాన్ ఉహద్ యుద్ధం నుండి వెళ్ళిపోతూ మరుసటి సంవత్సరం బద్ర్ మైదానంలో మరో యుద్ధం కోసం సవాలు విసిరాడు. ఆ సవాలును ముస్లిములు స్వీకరించారు కూడా. ఇప్పుడు ఆ సమయం దాపురిస్తూ ఉంది. యుద్ధవ్యూహం దృష్ట్యా, బద్దూలు మరియు ఆరాబీల పీచమణచకుండా బద్ర్ లాంటి మహా సంగ్రామంలో పాల్గొనడానికి మదీనాను ఖాళీ చేసి వెళ్ళడం

సరైనది కాదు. బద్ర్ యుద్ధం లాంటి మరో యుద్ధంలో పాల్గొనే ముందు ఈ బద్దూల పీచమణచి వారిని మదీనా వైపునకు రాకుండా చేయడం కూడా ఒక వ్యూహమే అనాలి.

ఇక మిగిలింది, రబీ ఉల్ ఉఖ్రా మరియు జమాదిల్ ఊలా మాసాల్లో (హి.శ. 4) సంభవించినది ఈ గజ్వాయే, గజ్వయె జాతుర్రిఖాఖ్ అన్నది మా పరిశోధన ప్రకారం సరైనది కాదు. ఎందుకంటే హజ్రత్ అబూ హురైరా (ర) ఖైబర్ యుద్ధానికి కొన్ని రోజులకు పూర్వమే ఇస్లామ్ స్వీకరించారు. అలాగే అబూ మూసా అష్అరీ (ర) కూడా ముస్లిమై యమన్ నుండి బయలుదేరి వచ్చారు. ఆయన వచ్చి దైవప్రవక్త (స)ను కలసినది ఖైబర్‌లోనే. కాబట్టి గజ్వయె జాతుర్రిఖాఖ్, గజ్వయె ఖైబర్ తరువాత సంభవించిన పోరాటం కావచ్చు.

హిజ్రీ శకం 4 తరువాత కొంతకాలానికి గజ్వయె జాతుర్రిఖాఖ్ సంభవించినదన్న దానికి ఓ ఆధారం, దైవప్రవక్త (స) ఆ యుద్ధంలో సలాతుల్ ఖౌఫ్ చేయడం.[10]

సలాతె ఖౌఫ్ మొట్టమొదటగా గజ్వయె బనూ అస్ఫాన్‌లో చేయడం జరిగింది. గజ్వయె అస్ఫాన్, గజ్వయె ఖందఖ్ తరువాత జరిగిన పోరాటం అనడంలో ఎవరికీ భేదాభిప్రాయం లేదు. గజ్వయె ఖందఖ్ కాలం హిజ్రీ శకం 5కు సంబంధించినది. గజ్వయె అస్ఫాన్ హుదైబియా ప్రయాణానికి సంబంధించిన ఓ సంఘటన. హుదైబియా ప్రయాణం హిజ్రీ శకం 6 చివరి కాలంలో జరిగింది. ఆ ప్రయాణం నుండి తిరిగివచ్చి మహాప్రవక్త (స) ఖైబర్ వైపునకు బయలుదేరారు. దీని ప్రకారం, గజ్వయె జాతుర్రిఖాఖ్ సంభవించిన కాలం ఖైబర్ తరువాత సంభవించిన కాలమని రుజువు అవుతోంది.

7. రెండో బద్ర్ పోరాటం

బద్దూలను అణచేసి, వారు ఇక ముస్లిములకు నష్టం చేకూర్చలేరనే

10. యుద్ధంలో చేసే నమాజును సలాతుల్ ఖౌఫ్ అంటారు. ఈ నమాజు చేసే విధానం ఏమిటంటే, సగం సైన్యం ఆయుధధారి అయి ఇమామ్ వెనుక నిలబడి నమాజు చేయాలి. తక్కిన సగం సైన్యం ఆయుధాలు ధరించి శత్రువును కనిపెట్టు కొని ఉండాలి. ఒక రకాత్ అయిన తరువాత ఈ సైన్యం ఇమామ్ వెనుకకు వచ్చేయాలి. మొదటి సైన్యం తిరిగి వెళ్ళి శత్రువును కనిపెట్టుకొని ఉండాలి. ఇమామ్ తన నమాజు రెండవ రకాత్ పూర్తి చేసిన తరువాత సైన్యం తమ తమ రకాత్‌లను ఇదివరిలా పూర్తి చేసుకోవాలి. ఇలాంటి నమాజ్‌కు సంబంధించినవి ఇలాంటివే మరికొన్ని విధానాలు ఉన్నాయి. అవి హదీసు గ్రంథాల్లో లభిస్తాయి.

స్థిమితం ఏర్పడిన తరువాత ముస్లిములు తమ పెద్ద శత్రువు (ఖురైష్)తో యుద్ధం చేయడానికి సంసిద్ధులై ఉన్నారు. సంవత్సరం పూర్తికావస్తోంది. ఉహద్ యుద్ధ సమయంలో ఖురైష్ విసిరిన సవాలు కాలం దగ్గరబడుతోంది. ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులు యుద్ధరంగంలో అబూ సుఫ్‌యాన్ మరియు అతని జాతితో బాహాబాహీ చేసే సమయం ఆసన్నమవుతోంది. జరగబోయే ఈ యుద్ధం పూర్తిగా ముస్లిముల మనుగడకు మార్గం చూపేదై, ఇస్లామ్ ధర్మాన్ని వ్యాపింపజేసేదై ఉండాలని ఓ నిర్ణయాత్మకమైన రీతిలో యుద్ధం కోసం సంసిద్ధులవుతున్నారు ముస్లిములు.

హి.శ. 4, షాబాన్ నెల (క్రీ.శ. 626, జనవరి)లో మదీనా బాధ్యతను హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర)కు అప్పగించి ఈ నిర్ణయించబడిన యుద్ధం కోసం బద్ర్ వైపునకు బయలుదేరారు ప్రవక్త శ్రీ (స). ఆయన వెంట పదిహేను వందల మంది సైనికులు, పది గుర్రాలున్నాయి. యుద్ధ పతాకాన్ని హజ్రత్ అలీ (ర) గారికి ఇవ్వడం జరిగింది. బద్ర్ ప్రదేశానికి వెళ్ళి ముష్రిక్కుల రాక కోసం ఎదురు చూడనారంభించారు వీరు.

మరోవంక అబూ సుఫ్‌యాన్ యాభై మంది అశ్వికదళంతో, రెండు వేల మంది ముష్రిక్కుల సైన్యాన్ని తీసుకొని బయలుదేరాడు. మక్కాకు ఓ మజిలీ దూరాన ఉన్న మర్రఉజ్జహ్రాన్ చేరి మజిన్నా పేరుగల ప్రఖ్యాత ఊటబావి వద్ద విడిది చేశాడు. అయితే అతను మక్కా నుండి బయలుదేరడమే అయిష్టంగా బయలుదేరాడు. అతను మాటిమాటికి ముస్లిములతో జరగ బోయే యుద్ధాన్ని తలుచుకుంటూ దాని పరిణామం ఎలా బయటపడు తుందో అనేది జ్ఞప్తికి రాగానే భయకంపితుడవుతున్నాడు. మర్ర ఉజ్జహ్రాన్‌కు చేరిన వెంటనే అతని ధైర్యం దెబ్బతిన్నది. వెనక్కు మళ్ళడం ఎలా? అనే ఆలోచనలో పడిపోయాడు. చివరికి అతను తన వారిని సంబోధిస్తూ, "మిత్రులారా! యుద్ధం అనేది పచ్చిక రోజుల్లో జరిగితేనే మంచిది. మన పశువులూ మేతమేయగలవు, మనము పాలూ త్రాగగలం. కాని ఇప్పుడు చూడండి అంతటా కరువు తాండవిస్తోంది. కాబట్టి నేను వెనక్కు మళ్ళిపోతున్నాను. మీరు కూడా వెనక్కు మళ్ళండి" అన్నాడు.

ఆ సేన మొత్తం మీదనే భయభీతులు ఆవహించాయా అన్నట్లు ఉంది. అబూ సుఫ్‌యాన్ ఇచ్చిన సలహాను ఎవరూ కాదనలేకపోయారు. అందరూ తిరుగు ముఖం పట్టి వెళ్ళిపోతున్నారు.

ఇటు ముస్లిములు బద్ర్ మైదానంలో ఎనిమిది రోజుల వరకు నిరీక్షించారు. ఈలోపు వారు తాము తెచ్చుకున్న సామగ్రిని అమ్మి డబ్బు బాగా గడించారు. వారందరూ విజేతలై తిరిగివచ్చినట్లుగా మదీనా చేరుకున్నారు. ముష్రిక్కుల హృదయాలు వారి భయం వల్ల గడగడలాడుతూ ఉండగా, వాతావరణం అంతా వారికి అనుకూలంగా మారినట్లుగా వారు మదీనాకు తిరిగి వచ్చారు. ఈ గజ్వాను "గజ్వయె బద్రె మౌఇద్‌గా, బద్రె సానియాగా, బద్రె ఆఖిరాగా మరియు బద్రె సుగ్రాగా" కూడా పిలుస్తారు.[11]

గజ్వయె దూమతుల్ జందల్ (దూమతుల్ జందల్ పోరాటం)

దైవప్రవక్త (స) గజ్వయె బద్రెసాని (రెండవ బద్ర్ యుద్ధం) ముగించుకొని మదీనాకు వచ్చేశారు. మదీనాలో ఎల్లెడల శాంతి వాతావరణం నెలకొని ఉంది. పూర్తి ఇస్లామీయ సామ్రాజ్యంలో ఓ విధమైన స్థిమితం ఏర్పడింది. ఇప్పుడు మహాప్రవక్త (స)కు అరేబియా చివరి సరిహద్దుల వైపు దృష్టిని సారించే అవకాశం లభించింది. అలా చేయడం కూడా అవసరమే మరి. ఎందుకంటే, పరిస్థితులపై ముస్లిములకు అదుపు ఉండాలి మరియు మిత్రులు, శత్రువులు దీన్ని గమనించవలసిన తరుణం కాబట్టి.

ఈ గజ్వా తరువాత ఆరు నెలల వరకు ఎలాంటి చీకూచింతా లేకుండా మహాప్రవక్త (స) మదీనాలో గడిపారు. ఆ తరువాత సిరియా దాపున దూమతుల్ జందల్ అనే ప్రదేశం చుట్టుపట్ల నివసిస్తున్న తెగలు, వచ్చిపోయే బిడారాలను దోచుకుంటున్నాయనీ ఆ మార్గాన వెళ్ళే వారి సామగ్రినంతా దోచుకుంటు న్నాయనే వార్త మహాప్రవక్త (స)కు అందింది. అంతేకాదు, వారు మదీనాపై దండెత్తడానికి ఓ పెద్ద సైన్యాన్ని కూడా సమీకరిస్తున్నారనీ తెలిసింది. ఈ వార్తల దృష్ట్యా మహాప్రవక్త (స), సబా బిన్ అరఫ్తా గప్ఫారీ (ర)కు మదీనా బాధ్యతలను అప్పగించి ఒక వేయి మంది ముస్లిమ్ యోధులతో వారిని అణచడానికి బయలుదేరారు. ఇది రబీఉల్ అవ్వల్ మాసం, హిజ్రీ శకం 5కు సంబంధించిన సంఘటన. దారి చూపడానికి 'మజ్‌కూర్' పేరుగల ఓ వ్యక్తిని వెంటబెట్టుకొని వెళ్ళడం జరిగింది.

11. ఈ గజ్వా వివరాల కోసం చూడండి, ఇబ్నె హష్షామ్-2/209,210; జాదుల్ ముఆద్-2/112

ఈ గజ్వా సందర్భంలో మహాప్రవక్త (స) రాత్రి పూట ప్రయాణం చేస్తూ శత్రువుపై హఠాత్తుగా దాడి చేయడానికిగాను పగలు ఎవరికీ అగుపడకుండా దాగి ఉండేవారు. తీరా దగ్గరికి వెళ్ళిన తరువాత వారంతా పారిపోయారని తెలిసింది. అందుకని ఆయన సేన వారి పశువులు, పశువుల కాపరులపై దాడి చేసేసింది. వారిలో కొందరు ఆయనకు చిక్కారు కూడా. మరికొందరు పారిపోయారు.

ఇక దూమతుల్ జందల్‌లో నివసిస్తున్న వారి విషయానికొస్తే, వారంతా ఎటూ దిక్కుతోచక పారిపోవలసి వచ్చింది. దూమతుల్ జందల్‌కు చేరినప్పుడు ముస్లిములకు ఎవరూ పట్టుబడలేదు. మహాప్రవక్త (స) అక్కడ కొన్ని రోజులు గడిపి మదీనాకు తిరిగివచ్చేశారు. ఈ గజ్వా సందర్భంగానే యుయైనా బిన్ హసన్‌తో సంధి కూడా కుదుర్చుకోవడం జరిగింది. (దూమతుల్ జందల్, సిరియా సరిహద్దులోని ఓ పట్టణం. ఇక్కడి నుండి డెమాస్కస్ అయిదు రాత్రుల ప్రయాణ దూరంలోనూ, మదీనా పదిహేను రాత్రుల ప్రయాణ దూరంలోనూ ఉంది.)

హఠాత్తుగా తీసుకుంటున్న ఈ నిర్ణయాలు, వివేచనతో కూడిన ఈ చర్యల ద్వారా మహాప్రవక్త (స), ఇస్లామీయ సామ్రాజ్యంలో శాంతి భద్రతలను నెలకొల్పడంలో, పరిస్థితులను అదుపులోనికి తేవడంలోనూ కృతకృత్యులయ్యారు. ఆయన ఆ పరిస్థితిని ముస్లిములకు అనుకూలంగా మలుచుకొని తమను ఎల్లవేళల చికాకుపరిచే మదీనా అంతర్గత విరోధుల వల్ల మరియు వెలుపలి నుండి వచ్చిపడే కష్టాలను తగ్గించడంలో విజయం సాధించినట్లయింది. మహాప్రవక్త (స) అనుసరిస్తున్న ఈ వ్యూహాల వల్ల వంచకులు ఎటూ పాలుపోకుండా మిన్నకుండిపోయారు. యూదులకు చెందిన ఓ తెగ దేశ బహిష్కరణకు గురి అయిపోయింది. ఇతర తెగలు కూడా ముస్లిములతో సత్సంబంధాలు పెట్టుకునేందుకు వివశులైపోయారు. బద్దూలు మరియు మక్కా ఖురైష్‌ల బలం సన్నగిల్లిపోయింది. ఇలా ముస్లిములకు, ఇస్లామ్ ధర్మ ప్రచారం చేయడానికి, సృష్టికర్త అందించిన సందేశాన్ని అరేబియాలో వ్యాపింపజేయడానికి అవకాశాలు లభించాయి.

గజ్వయె అహ్జాబ్ (అగడ్త యుద్ధం)

ఇలా ఎడతెగకుండా జరిగిన సైనిక చర్యలు, యుద్ధాలు ముగిసిన తరువాత అరేబియా ద్వీపకల్పంలో ప్రశాంతత నెలకొంది. శాంతిభద్రతలు ఎల్లెడలా వ్యాపించాయి. ఎటు చూసినా ప్రశాంత వాతావరణమే కానవచ్చింది. కాని యూదులకు మాత్రం ఇంకా స్పృహ రాలేదు. వారు తమ కుట్రలు, కుతంత్రాల వల్ల అనేక రకాలుగా అగౌరవంపాలైనా వారికి ఇంకా బుద్ధి రాలేదు. వీరు తమ ఈ వైఖరి వల్ల ఉత్పన్నమైన దుష్పరిణామాల నుండి ఎలాంటి గుణపాఠమూ నేర్చుకోలేదు. మదీనా నుండి దేశ బహిష్కరణకు గురై ఖైబర్ చేరిన తరువాత వారు, విగ్రహారాధకులు మరియు ముస్లిముల నడుమ జరుగుతున్న సంఘర్షణ ఫలితాలను వేచిచూడనారంభించారు. కాని పరిస్థితులు ముస్లిములకే అనుకూలంగా మారడం గమనించి, ఎటు చూసినా వారి మాటే చెల్లడం చూసి అగ్గి మీద గుగ్గిలం అయిపోయారు. క్రొత్త తరహా కుట్రను ప్రారంభిస్తూ వారు ముస్లిములపై చిట్టచివరి ప్రహారం చేయడానికి సంసిద్ధులయ్యారు. దీని ఫలితంగా నామరూపాల్లేకుండా పోతామనే ధ్యాసే వారికి లేకుండాపోయింది. ఈ లక్ష్యసాధన కోసం యూదులు ఓ భయం కరమైన క్రొత్త పథకాన్ని సిద్ధం చేశారు.

బనూ నజీర్ తెగకు చెందిన ఇరవై మంది సర్దారులు కలసి మక్కాలోని ఖురైషు నాయకుల వద్దకు వెళ్ళారు. వారిని దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా యుద్ధం కోసం పురికొల్పుతూ, తమ సహాయం కూడా ఉంటుందని నమ్మబలికారు. ఖురైషులు వారి ఈ కల్లబొల్లి మాటలను నమ్మి యుద్ధం కోసం సంసిద్ధం కాసాగారు. ఉహద్ యుద్ధం రోజున, తిరిగి బద్ర్ మైదానంలో తలపడ డానికి సిద్ధంగా ఉండమని సవాలు విసిరి ఉండడం, ఆ సవాలును తామే విరమించుకోవడం వల్ల వారికి తలకొట్టేసినట్లయింది. ఇప్పుడు యుద్ధం చేసి తాము పోగొట్టుకున్న గౌరవమర్యాదలను తిరిగి రాబట్టుకోవచ్చు, తాము విసిరిన సవాలును కూడా నిలుపుకోవచ్చు అని భావించారు.

పిదప యూదుల ప్రతినిధి వర్గం బనూ గత్ఫాన్ తెగ వద్దకు వెళ్ళింది. ఖురైషులను ఒప్పించినట్లే వారిని కూడా కదన రంగంలోకి దుమకడానికి సిద్ధపరిచింది. బనూ గత్ఫాన్ వారు యుద్ధానికి సిద్ధపడ్డారు. ఆ తరువాత ఈ యూదుల ప్రతినిధి వర్గం అరేబియా అంతటా తిరిగి ఇతర తెగల ప్రజలను యుద్ధం కోసం పురికొల్పనారంభించింది. ఆ తెగలు కూడా యుద్ధానికి సన్నద్ధం కానారంభించాయి. ఇలా యూదుల రాజకీయ నాయకులు విజయవంతంగా దైవధిక్కారుల గొప్ప గొప్ప తెగలను, సమూహాలను దైవప్రవక్త (స)కూ, ఆయన సందేశానికీ, ముస్లిములకూ వ్యతిరేకంగా యుద్ధాగ్నిలో దుమకడానికి సిద్ధపరిచారు.

ఆ తరువాత వారు తాము అనుకున్న ప్లాను ప్రకారం దక్షిణ దిశ నుండి ఖురైష్, కనానా మరియు తహామాలో నివసించే ఇతర మిత్రపక్షాల తెగలతో సహా మదీనా వైపునకు బయలుదేరారు. ఈ సైన్యం సర్వసైన్యాధ్యక్షుడు అబూ సుఫ్యాన్. ఈ సైనికుల సంఖ్య మొత్తం నాల్గు వేలు. ఇది మర్రఉజ్జ్రాహ్రాన్‌కు చేరగానే బనీ సులైమ్ తెగ కూడా వచ్చి వీరితో కలిసి పోయింది. అటు ఆ సమయంలోనే తూర్పు వైపు నుండి గత్ఫాన్ తెగలైన ఫజారా, ముర్రా మరియు అష్జాలు కూడా బయలుదేరారు. ఫజారా సైన్యాధ్యక్షుడు యుయైనా బిన్ హస్న్, బనూ ముర్రా కమాండరు హారిస్ బిన్ ఔఫ్ మరియు బనూ అష్జా నాయకుడు 'మస్అర్ బిన్ రఖీలా'లు. వీరి వెంటే బనూ అసద్, ఇంకా ఇతర తెగలకు చెందిన వారు చాలా మంది ఉన్నారు.

ఈ తెగలన్నీ అనుకున్న సమయంలో, నిర్ణీత ప్రోగ్రామ్‌ననుసరించి మదీనాకు బయలుదేరాయి. కొన్ని రోజులలోనే మదీనా దాపున పదివేల మంది సైనికులతో కూడిన ఓ మహా సేన ఓ చోట చేరుకుంది. ఇంత బ్రహ్మాండమైన సేనకు పూర్తి మదీనా జనసంఖ్య (స్త్రీలు, పిల్లలు, వృద్ధులు మరియు యువకు లను కలిపి) కూడా తక్కువే. ఒకవేళ దాడి చేయడానికి వచ్చిన ఈ సేనావాహిని మదీనా పొలిమేరల్లోకి వచ్చేస్తే ముస్లిములకు పెద్ద ప్రమాదమే వాటిల్లగలదు. వారు నామరూపాల్లేకుండా పోతారనడంలో సందేహం కూడా లేదు. అయితే మదీనా నాయకత్వం ఎంతో మెలుకువ మరియు జాగ్రత్తలు కలిగిన నాయ కత్వం. ఆ నాయకత్వం ఎల్లప్పుడూ

పరిస్థితులను గమనిస్తోంది. దాన్ని బేరీజు వేసుకోవడానికి జరగబోయే సంఘటనలను దృష్టిలో ఉంచుకొని, వాటిని ఎలా ఎదుర్కోవాలో ఆలోచించే వివేచనగల నాయకత్వం అది. దైవవిరోధుల ఈ మహా సేన కదలికలను గమనించిన మదీనా వేగులు వెంటనే దైవప్రవక్త (స)కు పరిస్థితులను గురించి తెలియజేశారు.

ఈ వార్తలు అందగానే మహాప్రవక్త (స), హైకమాండ్‌కు (అధిష్ఠాన వర్గం) చెందిన సలహా సంఘాన్ని సమావేశపరిచారు. వారితో ఆత్మరక్షణకు సంబంధించిన సలహాలు ఇవ్వమని అడిగారు. సలహా సంఘం నాయకులు ఎంతో విజ్ఞతతో ఆలోచించి, హజ్రత్ సల్మాన్ ఫార్సీ (ర)గారు ఇచ్చిన సలహాను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ సలహా ఏమిటంటే, హజ్రత్ సల్మాన్ ఫార్సీ(ర) దైవప్రవక్త (స)తో, "మహాప్రవక్తా! ఎప్పుడైనా మేము చుట్టుముట్టబడినప్పుడు మా చుట్టూ కందకం త్రవ్వుకొని మా ఆత్మరక్షణ చేసుకునేవారం" అనే సలహా ఇచ్చి ఉన్నారు.

ఇది ఎంతో బుద్ధివివేకాలతో కూడిన సలహా. అరబ్బులకు ఈ యుద్ధ విధానం గురించి తెలియదు. దైవప్రవక్త (స) వెంటనే ఈ సలహాను అమలు చేయమని చెబుతూ, ప్రతి పది మంది గల బృందానికి నలభై మూరల కందకం త్రవ్వే పనిని అప్పగించేశారు. ముస్లిములు ఎంతో కష్టపడి ఏకాగ్రతతో ఆ అగడ్తను త్రవ్వే పనిని మొదలెట్టారు. మహాప్రవక్త (స) వారిని ప్రోత్సహిస్తూ తాము కూడా ఆ త్రవ్వకంలో పాలుపంచుకున్నారు. సహీ బుఖారి గ్రంథంలో హజ్రత్ సహెల్ బిన్ సఅద్ (ర) ఇలా ఉల్లేఖిస్తున్నారు:

మేము దైవప్రవక్త (స)తో కలసి ఆ అగడ్తను త్రవ్వుతున్నాం. ముస్లిములు తమ భుజాలపై మట్టి తట్టలు పెట్టుకొని మోస్తున్నారు. ఈ సందర్భంలోనే మహాప్రవక్త (స) దేవుణ్ణి ఇలా వేడుకుంటున్నారు.

"ఓ అల్లాహ్! జీవితం కేవలం పరలోక జీవితమే. ముహాజిర్లు, అన్సారులు ఉభయుల్నీ మన్నించు."[1]

హజ్రత్ అనస్(ర) గారు ఉల్లేఖించిన మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: "దైవప్రవక్త (స) కందకం వైపునకు వచ్చి చూడగా అన్సార్లు మరియు

1. సహీ బుఖారి-గజ్వయె అహ్జాబ్ అధ్యాయం-2/588

ముహాజిర్లు కలసి ఉదయం పూట ఎముకలు కొరికే చలిలో త్రవ్వకం కొనసాగిస్తూ ఉన్నారు. వారికి సహాయపడడానికి వారి వద్ద బానిసలు కూడా లేరు. ఆకలి బాధలోనూ వారి ఈ కష్టాన్ని చూసి మహాప్రవక్త (స) ఇలా దుఆ చేశారు.

"ఓ ప్రభూ! జీవితం తప్పకుండా పరలోక జీవితమే. కాబట్టి అన్సారు లను, ముహాజిర్లను మన్నించు."

ఇది విన్న అన్సారులు, ముహాజిర్లు దానికి సమాధానంగా, "మేము బ్రతికి ఉన్నంత కాలం, సతతం జిహాద్ చేయడానికి ముహమ్మద్(స) గారి చేతి మీదుగా ప్రమాణం చేసి ఉన్నాం" అన్నారు."[2]

సహీ బుఖారీ గ్రంథంలోనే మరో ఉల్లేఖనం హజ్రత్ బరా బిన్ ఆజిబ్(ర) ఉల్లేఖించనట్లుంది. ఆయన ఇలా అంటారు:

"నేను మహాప్రవక్త (స) కందకం నుండి మట్టి మోస్తూ వెళ్ళగా చూశాను. ఇలా మోస్తున్నప్పుడు ఆయన పొట్టంతా దుమ్ముతో కప్పివేయబడి ఉంది. ఆయన (స)గారికి పొట్టపై దట్టంగా వెంట్రుకలు ఉన్నాయి. ఆ పరిస్థితిలోనే ఆయన అబ్దుల్లా బిన్ రవాహా యుద్ధ సమయంలో చెప్పిన పద్యపాదాలను వల్లిస్తూ ఉండగా విన్నాను. ఆ పద్యపాదాలు ఇలా ఉన్నాయి:

"ఓ అల్లాహ్! నీవే లేకపోతే మేము సన్మార్గాన్ని పొందేవారం కాదు. దానధర్మాలు చేయడం, నమాజు సల్పడం చేసేవారం కాదు. ఓ అల్లాహ్! మాపై స్థిమితాన్ని వర్షింపజెయ్యి. యుద్ధమే చేయాల్సి వస్తే మమ్మల్ని స్థిరంగా ఉంచు. వీరు మాకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టారు. వారేగనక ఏదైనా సంక్షోభాన్ని రేకెత్తిస్తే మేము దానికి తలవంచేవారం కాదు."

దైవప్రవక్త (స) చివరి అక్షరాలను కొంత ఒత్తి పలికేవారని హజ్రత్ బరా (ర) చెబుతారు. మరో ఉల్లేఖనంలోని ఆ చివరి పద్యపాదాలు ఇలా ఉన్నాయి.

"వారు మాపై జులుము చేశారు. వారే మమ్మల్ని సంక్షోభంలోకి నెట్టదలచుకుంటే మాత్రం మేము వారికి తలవంచేవారం కాదు."[3]

ముస్లిములు ఉత్సాహంగా ఓ వైపు అలా పని చేస్తూ పోతుంటే మరో ప్రక్క అంతే తీవ్రమైన ఆకలి బాధతోనూ అలమటిస్తున్నారు. ఆ పరిస్థితి

2. సహీ బుఖారి-1/397, 2/588 3. సహీ బుఖారి-2/589

చూసేవారి గుండెలు పగిలిపోగలవు.

హజ్రత్ అనస్ (ర)గారి ఉల్లేఖనంలో, దైవప్రవక్త (స) గారి వద్దకు రెండు దోసిళ్ళ జౌ ధాన్యం తీసుకురావటం జరిగింది. దానికి కొంత నూనెను కలిపి ఆయన తినడానికి పని చేసే వారి ముందు ఉంచేవారు. అది మ్రింగుడు పడని ఆహార పదార్థం. అయితే అందులో నుండి సువాసన వెలువడింది[4] అని ఉంది.

అబూ తల్హా (ర) ఇలా అంటారు:

"మేము ఆకలి బాధను భరించలేక దైవప్రవక్త (స) ముందుకు వచ్చి మా పొట్టలపై కట్టబడివున్న ఒక్కొక్క రాయిని చూయించాం. అది చూసిన మహాప్రవక్త (స) తన పొట్ట మీది నుండి చొక్కాను ఎత్తి చూయించగా, దాని మీద రెండు రాళ్ళువేసి కట్టుకొని ఉన్నారు (అది చూసి మేము సిగ్గుపడ్డాము).[5]

కందకం త్రవ్వేటప్పుడు దైవప్రవక్త (స) ద్వారా అనేక చమత్కారాలు వెలుగులోనికి వచ్చాయి. సహీ బుఖారి ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ జాబిర్ (ర) దైవప్రవక్త (స)గారు ఆకలి బాధతో అలమటించగా చూసి ఓ మేక పిల్లను జిబహ్ చేశారు. ఆయన భార్య ఓ సాఅ (దాదాపు రెండున్నర కిలో గ్రాముల) ఓట్లను విసరి ఎవరికీ తెలియకుండా మహాప్రవక్త (స) ముందు తినమని తెచ్చిపెట్టారు. కొందరు సహచరులను తినడానికి పిలుచుకురమ్మని ఆజ్ఞాపించారు. కాని దైవప్రవక్త (స) కందకం త్రవ్వేవారందరినీ పిలుచుకొని ఆమె ఇంటికి భోజనానికి బయలుదేరి వెళ్ళారు. వారి సంఖ్య మొత్తం వేయి మంది. అందరూ ఆ కొద్ది భోజనం ముందు కూర్చుని తినసారంభించారు. అందరూ కడుపార భుజించారు. అయినా ఆ మాంసం పాత్ర మాత్రం ఎప్పటి లాగే నిండుగా ఉంది. కలుపబడిన పిండి ఎంత మాత్రం తగ్గడం లేదు. ఆమె రొట్టెలు చేసి అందరికీ వడ్డిస్తూనే ఉన్నారు.[6]

హజ్రత్ నోమాన్ బిన్ బషీర్ సోదరి కందకం వద్దకు తన సోదరుడు భుజించాలనే ఉద్దేశ్యంతో రెండు దోసిళ్ళ ఖర్జూరాలను పట్టుకొచ్చారు. ఆమె దైవప్రవక్త (స) ముందుగా వెడుతూ ఉంటే, ఆయన(స) ఆ ఖర్జూరాలను

4. సహీ బుఖారి-2/588
5. ఈ సంఘటన సహీ బుఖారిలో ఉల్లేఖించబడి ఉంది. చూడండి, 2/588,589
6. ఈ సంఘటన సహీ బుఖారిలో ఉల్లేఖించబడింది. చూడండి, 2/588,2/589

అడిగి తీసుకున్నారు. వాటిని ఓ వస్త్రంపై పరచి పనిచేస్తున్న వారందరినీ తినమని పిలుపునిచ్చారు. వారందరూ వచ్చి దాని చుట్టూ కూర్చుని తిననారంభించారు. ఆ ఖర్జూరాలు పెరుగుతూ పోతున్నాయి. చివరికి అందరూ కడుపునిండా వాటిని భుజించి వెళ్ళిపోయినప్పటికీ ఆ ఖర్జూరాలు ఆ వస్త్రం అంచుల నుండి బయటపడిపోతున్నాయి.[7]

ఆ కాలంలోనే ఈ రెండు సంఘటనలకు మించిన మరో సంఘటన కూడా జరిగింది. ఇది ఇమామె బుఖారి, హజ్రత్ జాబిర్ (ర) గార్ల ఉల్లేఖనాల నుండి గ్రహించిన సంఘటన. హజ్రత్ జాబిర్ (ర)గారు ఇలా ఉల్లేఖించారు.

"మేము అగడ్తను త్రవ్వుతూ ఉండగా ఓ శిల అడ్డుపడింది. అది ఎంతకూ పగలకపోయేసరికి ముస్లిములు దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి ఈ గండు శిలలాంటి రాయి అడ్డుపడడం వల్ల కందకం పని ఆగిపోయిందని చెప్పారు. ఇది విన్న దైవప్రవక్త (స), ఆగండి! నేను కూడా దిగుతున్నానని ఆయన (స) కందకం లోనికి దిగారు. అప్పుడు ఆయన పరిస్థితి, ఆకలి బాధతో పొట్టపై రాయి కట్టుకొని ఉన్న పరిస్థితి- మేమూ మూడు రోజుల నుండి ఏ పదార్థమూ తినలేదు- ఆ తరువాత మహాప్రవక్త (స) తన గొడ్డలి (గడ్డపార)తో ఆ బండపై వ్రేటువేయగా ఆ బండరాయి పైకి ఉబికి ఉన్న ఓ మట్టి దిబ్బగా మారిపోయింది."[8]

హజ్రత్ బరా (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, కందకం త్రవ్వేటప్పుడు ఓ చోట ఓ గట్టి చట్టుబండ అడ్డం వచ్చింది. దానిపై వ్రేటువేయగా గడ్డపార ఎగిరెగిరిపడుతోంది. అది ఏ మాత్రం తునగడం లేదు. మేము దైవప్రవక్త (స) వద్దకు వచ్చి దాన్ని గురించి చెప్పుకోగా ఆయన కందకంలో దిగి గడ్డపలుగును తీసుకొని బిస్మిల్లాహ్ అంటూ ఓ దెబ్బ వేశారు (అప్పుడు ఓ ముక్క విరిగి పడిపోయింది). అప్పుడాయన "అల్లాహు అక్బర్! నాకు సిరియా దేశపు తాళపు చేతులు ఇవ్వబడ్డాయి. దైవసాక్షి! నేనిప్పుడు అక్కడి ఎరుపురంగు మహళ్ళను నా కళ్ళతో చూస్తున్నాను" అని అన్నారు. మరో దెబ్బ వేయగా మరో ముక్క విరిగిపడిపోయింది. అప్పుడు మహాప్రవక్త (స), "అల్లాహు అక్బర్! నాకు పర్షియా ఇవ్వబడింది. దైవసాక్షి! నేనిప్పుడు మదాయన్‌కు సంబంధించిన శ్వేతసౌధాన్ని చూస్తున్నాను" అన్నారు. ఆ తరువాత బిస్మిల్లాహ్ అంటూ

7. ఇబ్నె హష్షామ్-2/218   8. సహీ బుఖారి-2/588

మూడవ వ్రేటువేయగా మిగిలిన బండ పూర్తిగా తెగిపడిపోయింది. ఆ తరువాత ఆయన, "అల్లాహు అక్బర్! నాకు యమన్ తాళాలు ఇవ్వబడ్డాయి. దైవసాక్షి! నేనిప్పుడు ఇక్కడి నుండి సన్ఆ కోట గుమ్మాలను చూస్తున్నాను" అని అన్నారు.[9]

ఇబ్నె ఇస్‌హాక్, ఇలాంటిదే మరో ఉల్లేఖనాన్ని సల్మాన్ ఫార్సీ ఉల్లేఖించినట్లుగా రాశారు.[10]

మదీనా పట్టణం ఉత్తర దిశను వదిలేసి మిగిలిన మూడుప్రక్కలా లావా కొండ శిలలతో, కొండలతో మరియు ఖర్జూరపు తోటలతో పరివేష్టించబడి ఉంది. మహాప్రవక్త (స) ఓ నైపుణ్యంగల సైన్యాధ్యక్షునిలా, మదీనాపై దాడి కేవలం ఉత్తర దిశ నుండే జరగవచ్చని ఊహించారు. కాబట్టే ఆయన మదీనాకు ఉత్తర దిశగా కందకాన్ని త్రవ్వించడం జరిగింది.

ముస్లిములు అలుపూసొలుపూ లేకుండా కందకాన్ని త్రవ్వుతూనే ఉన్నారు. పగలు కందకాన్ని త్రవ్వుతూ రాత్రి కాగానే ఇండ్లకు వెళ్ళిపోయేవారు. మదీనా పొలిమేరల వరకు దైవతిరస్కారుల సైన్యం చేరేటప్పటికీ ఈ పని పూర్తి అయిపోయింది.[11]

ఇటు ఖురైషులు తమ నాల్గు వేల సైనికులతో మదీనా దాపున ఉన్న రోమా, జుర్ఫ్ మరియు జగాబాలకు నడుమగల మజ్మ ఉల్ అస్‌యాల్ అనే ప్రదేశంలో విడిది చేశారు. మరోవంక గత్ఫాన్ మరియు వారి నజద్‌కు చెందిన సహచరులు ఆరు వేల మందితో ఉహద్ పర్వతం తూర్పు ప్రక్కన 'జన్బె నఖమీ' అనే ప్రదేశంలో వచ్చి దిగారు.

ముస్లిములు ఈ సేనను చూసినప్పుడు వారి పరిస్థితి ఎలా ఉందో దివ్యఖుర్ఆన్ ఇలా వివరిస్తోంది.

وَلَمَّا رَاَ الْمُؤْمِنُوْنَ الْاَحْزَابَ ۙ قَالُوْا هٰذَا مَا وَعَدَنَا اللّٰهُ وَرَسُوْلُهٗ
وَصَدَقَ اللّٰهُ وَرَسُوْلُهٗ ۫ وَمَا زَادَهُمْ اِلَّآ اِيْمَانًا وَّتَسْلِيْمًا ۝

"సత్యవిశ్వాసులు దాడి చేసిన సైన్యాలను చూసినప్పుడు (వారి స్థితి ఇలా

9. సునన్ నిసాయీ-2/56, ముస్నదె అహ్మద్   10. ఇబ్నె హష్షామ్-2/21
11. ఇబ్నె హష్షామ్-3/220,221

ఉంది). వారు ఇలా పలికారు: "అల్లాహ్, ఆయన ప్రవక్త మనకు వాగ్దానం చేసిన విషయం ఇదే. అల్లాహ్ ఆయన ప్రవక్త నిజమే పలికారు." ఈ సంఘటన వారి విశ్వాసాన్నీ, వారి ఆత్మ సమర్పణనూ మరింత అధికం చేసింది." (33 : 22)

కాని వంచకులు మరియు రోగగ్రస్త హృదయులు ఆ సైన్యాన్ని చూడగానే వారి గుండెలు దడదడలాడాయి. ఈ విషయాన్నే దివ్యఖుర్ఆన్ ఇలా వివరిస్తోంది:

وَاِذْ يَقُوْلُ الْمُنٰفِقُوْنَ وَالَّذِيْنَ فِيْ قُلُوْبِهِمْ مَّرَضٌ مَّا وَعَدَنَا اللّٰهُ وَرَسُوْلُهٗۤ اِلَّا غُرُوْرًا ۝

"(ఓ ప్రవక్తా!) కపటులూ, రోగగ్రస్త హృదయులూ అందరూ, "అల్లాహ్, ఆయన ప్రవక్త మనతో చేసిన వాగ్దానాలన్నీ భ్రమలు తప్ప మరేమీ కావు" అని స్పష్టంగా ప్రకటించినప్పటి సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో." (33:12)

ఎలాగైతేనేమి ఆ సేనను ఢీకొనడానికి దైవప్రవక్త (స) కూడా మూడు వేల మంది ముస్లిముల సేనను తీసుకొని అక్కడికి వచ్చారు. సలా పర్వతాన్ని వెనుకగా ఉంచి సంరక్షణ వలయాన్ని ఏర్పరిచారు. ఇక ముందు ఉన్నది అగడ్తే. ఇది ముస్లిములకు `దైవధిక్కారులకు నడుమ అడ్డుగా ఉంది. ముస్లిముల కోడ్ వర్డ్ (సంకేత పదం) "హామ్మీమ్ లా యున్సరూన్" (అంటే హామ్మీమ్ వారికి ఎలాంటి సహాయం అందబోదు అని అర్థం). మదీనా పాలనా బాధ్యతను హజ్రత్ ఉమ్మె మక్తూమ్ (ర)గారికి అప్పజెప్పడం జరిగింది. స్త్రీలను, పిల్లలను మదీనా కోటల్లోనూ, చిన్న చిన్న గఢాలలోనూ సురక్షితంగా ఉంచడం జరిగింది.

బహుదైవారాధకులు మదీనాపై దండెత్తడానికి దాని దాపుకు రాగానే వారికి అడ్డంగా ఓ వెడల్పాటి కందకం అగుపడింది. విధిలేక వారు అక్కడనే ఆగిపోవలసివచ్చింది. వారు ఇండ్ల నుండి బయలుదేరేటప్పుడు ఈ పరిస్థితిని ఎదుర్కోవలసివస్తుందని అనుకోలేదు. ఎందుకంటే ఆత్మరక్షణకు సంబంధించిన ఈ ఎత్తుగడ- వారు చెప్పేదాని ప్రకారం- ఇప్పటి వరకు అరబ్బులకు తెలియని ఎత్తుగడ. కాబట్టి వారు దీనికి ఏమాత్రం సిద్ధమై రాలేదు.

బహు దైవారాధకులు అగడ్త దగ్గరకు వచ్చి క్రోధం మితిమీరేటట్లు దాని ప్రక్కగా చిందులేయనారంభించారు. అగడ్తలో దిగడానికి ఏదైనా బలహీన మైన ప్రదేశం కనబడుతుందేమోనని వెతకనారంభించారు. ఇటు ముస్లిములు వారి రాకపోకలను ఓ కంట కనిపెట్టుకునే ఉన్నారు. వారిపై బాణాల వర్షాన్ని కురిపిస్తూ కందకం దగ్గరకు రాకుండా చూస్తున్నారు. కందకాన్ని పూడ్చడానికి గాని, అందులో దుమికి ముస్లిముల వైపునకు రావడానికిగాని అవకాశం ఇవ్వడం లేదు.

ఇటు ఖురైష్ అశ్వారూఢులకు, కందకానికి ఈ ప్రక్కన ఎదురు చూస్తూ కాలం గడపడం భరింపరానిదైపోతోంది. అది వారి గౌరవానికే మచ్చ. కాబట్టి ఆ అశ్వారూఢుల ఓ బృందం ఓ ఇరుకైన ప్రదేశం నుండి కందకాన్ని దాటటంలో విజయం సాధించగలిగింది. ఆ బృందంలో అమ్రూ బిన్ అబ్దె ఉద్, ఇక్రమా బిన్ అబీ జహల్ మరియు జిరార్ బిన్ ఖత్తాబ్ కూడా ఉన్నారు. వీరు ఓ ఇరుకైన చోటు నుండి గుర్రాలను దూకించి ఇవతలికి వచ్చారు. 'సలా' కొండ మరియు కందకం నడుమన గుర్రాలు పరుగెత్తిస్తున్నారు. ఇటు ముస్లిముల వైపు నుండి హజ్రత్ అలి (ర) కొందరు యోధులను తీసుకొని వారు గుర్రాలను దూకించిన ప్రదేశంలోనికి వెళ్ళి నిలబడ్డారు. వారు ఇక వెనక్కు పోయే మార్గాన్ని మూసేశారు. ఇది చూసిన అమ్రూ బిన్ అబ్దె ఉద్ వ్యక్తిగత పోరాటానికి తొడ చరిచి పిలిచాడు. హజ్రత్ అలి (ర) అతణ్ణి ఎదుర్కోడానికి ముందుకు వచ్చారు. ఆయన ఎత్తి పొడుపు మాటకు అతని ఉక్రోషం మిన్నుముట్టింది. ఆ క్రోధంలో అతను గుర్రం దూకి దాని కాళ్ళు నరికేశాడు. ఆ తరువాత తొడ చరిచి హజ్రత్ అలి (ర)కి ఎదురుగా వచ్చేశాడు. అతను మహా బలవంతుడూ, ధైర్యసాహసాలు గల పహిల్వాను. ఆ ఇద్దరి నడుమ భీకరంగా యుద్ధం జరుగుతోంది. ఒకరిపై ఒకరు ఖడ్గప్రహారాలు చేస్తున్నారు. చివరికి హజ్రత్ అలి (ర) అతణ్ణి అంతమొందించేశారు. మిగిలిన బహుదైవారాధకులు కందకం దాటేసి పారిపోయారు. ఆ హత్యతో ముష్రిక్కులు భయభీతి చెందిపోయారు. ఇక్రమా అయితే పారిపోతూ తన శూలాన్ని కూడా తీసుకొని వెళ్ళడం మరచిపోయాడు.

బహు దైవారాధకులు కొన్ని రోజుల వరకు కందకాన్ని దాటడానికి, దాన్ని మూసేసి మార్గం సుగమం చేయడానికి శతవిధాలా ప్రయత్నం చేశారు.

కాని ముస్లిములు వారిని ఎంతో చాకచాక్యంగా అలా చేయకుండా అడ్డుకున్నారు. అలాగే శర పరంపరలతో వారిని దగ్గరకు రాకుండా చేస్తూ అటువైపు నుండి వచ్చిపడే బాణాల నుండి తమను తాము రక్షించుకుంటూ ఉన్నారు.

ఇలా జరిగిన దాడుల సందర్భంలోనే మహాప్రవక్త (స)గారి మూడు పూటల నమాజు పోయింది. సహీహైయెన్‌లో హజ్రత్ జాబిర్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది; "హజ్రత్ ఉమర్ (ర) కందకం యుద్ధం నాడు బహుదైవారాధకులను తిట్టారు కూడా. ఆయన దైవప్రవక్త (స) దగ్గరకొచ్చి ఓ దైవప్రవక్తా! నేను ఈ రోజు సూర్యాస్తమయ్యేటప్పుడుగాని నమాజు చేయడానికి కుదిరింది కాదు అని అనగా, మహాప్రవక్త (స), "దైవసాక్షి! నేనైతే ఇంకా నమాజే చేయలేదు" అని అన్నారు. ఆ తరువాత మేమందరం కలిసి బత్‌హాన్ అనే ప్రదేశానికి వెళ్ళి వుజూ చేశాం. ఆ తరువాత ఆయన మొదట అస్ర్ నమాజ్ చేశారు. ఇది సూర్యుడు అస్తమించినప్పటి విషయం. ఆ తరువాతగాని మగ్రిబ్ నమాజు చేయలేదు."[12]

దైవప్రవక్త (స)కు నమాజు చేయలేకపోయినందుకు ఎంతో బాధ కలిగింది. ఆ బాధతో ఆయన బహుదైవారాధకులను శపించారు కూడా. సహీ బుఖారీ గ్రంథంలో హజ్రత్ అలీ (ర) గారి ఉల్లేఖనం ఉంది. దాని ప్రకారం, దైవప్రవక్త (స) అగడ్త యుద్ధం రోజున, "అల్లాహ్ ఈ బహుదైవారాధకులకు తోడు వారి ఇళ్ళను, వారి సమాధుల్ని అగ్నితో నింపేయుగాక! మమ్మల్ని వీరు సూర్యాస్తమయం అయినా 'నమాజె వుస్తా'ను చేయకుండా అడ్డు కున్నారు"[13] అని శపించారు.

ముస్నదె అహ్మద్ మరియు ముస్నదె షాఫయీలోని ఉల్లేఖనాల ప్రకారం, ముష్రిక్కులు దైవప్రవక్త (స)ను జుహ్ర్, అస్ర్, మగ్రిబ్ మరియు ఇషా నమాజులు చేయకుండా యుద్ధంలో నిమగ్నులుగా చేశారు. ఆయన ఈ మొత్తం నమాజులు ఒకేసారి చేశారు. ఇమామె నోవీ (రహ్మలై), ఈ ఉల్లేఖనాల నడుమగల తేడాలను ఉటంకిస్తూ, కందక యుద్ధం చాలా రోజుల వరకు కొనసాగిందని, ఓ రోజు ఓ నమాజు ఖజా అయితే, మరో రోజు మరో నమాజు ఖజా అయి ఉండవచ్చని అంటారు.[14]

12. సహీ బుఖారి-2/590 *13. సహీ బుఖారి-2/590*

14. ముక్తసరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లాహ్-పుట 287; షరహ్ ముస్లిమ్ లిల్‌నూవీ-1/227

ఇలా జరగడం వల్లనే బహుదైవారాధకులు కందకాన్ని దాటడానికి సతతం ప్రయత్నిస్తూనే ఉన్నారని, దాన్ని ముస్లిములు అడ్డుకోవడం జరిగిందన్నది వ్యక్తమవుతోంది. ఆ ఇరుసేనలకు నడుమ కందకం ఉండడం వలన ఎదురెదురు దాడి జరిగే అవసరమే కలుగలేదు. కేవలం బాణాల యుద్ధం ఒక్కటే జరిగింది.

ఈ బాణాల యుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన కొందరు చనిపోయారు. అయితే వారి సంఖ్య బహు తక్కువ. అంటే ఆరుగురు ముస్లిములు, పది మంది ముష్రిక్కులు చనిపోయారు. వీరిలోనూ ఒకరిద్దరు ఖడ్గఘాతం వల్ల హతులైనారు.

ఈ శరపరంపర సందర్భంలోనే హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర)కు కూడా ఓ బాణం వచ్చి తగిలింది. దీనివల్ల ఆయన చేతి ప్రధాన నరం ఒకటి తెగిపోయింది. ఆయనకు బాణం వేసింది హబ్బాన్ బిన్ అర్కా అనేవాడు. ఇతను ఖురైష్‌కు చెందిన ముష్రిక్కు. హజ్రత్ సఅద్(ర) (గాయపడ్డ తరువాత) దేవుణ్ణి ఇలా వేడుకున్నారు. "ఓ అల్లాహ్! ఏ జాతి అయితే నీ ప్రవక్త (స)ను ధిక్కరించిందో, ఆయన్ను ఇంటి నుండి గెంటివేసిందో, వారితో నీ మార్గంలో యుద్ధం చేయడం ఎంత ప్రియమైన విషయమో నీకు బాగా తెలుసు. ఓ అల్లాహ్! నీవు ఈ యుద్ధాన్ని చివరి దశకు చేరుస్తున్నావని అనుకుంటున్నాను. ఖురైషులతో ఇంకా యుద్ధం కొనసాగించవలసి వస్తే నన్ను వారి కొరకు సజీవంగా ఉంచు. నేను నీ మార్గంలో వారితో జిహాద్ చేస్తాను. ఒకవేళ నీవే ఈ యుద్ధాన్ని ఇంతటితో ముగించదలిస్తే మాత్రం నాకు కలిగిన ఈ గాయాన్ని మానకుండా అలానే ఉంచు. ఈ గాయంతోనే నన్ను మరణించేటట్లు చెయ్యి."[15]

ఆయన వేడుకోలులోని చివరి వాక్యం ఇలా ఉంది: "(కాని), బనూ ఖురైజా వ్యవహారంలో నా కళ్ళు చల్లబడే వరకు నాకు మరణాన్ని ఇవ్వవద్దు."[16]

మొత్తానికి ఓ వైపు ముస్లిములు యుద్ధరంగంలో ఈ కష్టాలను ఎదుర్కొంటూ ఉంటే మరొక వైపు కుట్రలు, కుతంత్రాలను పన్నే యూదులు తమ పనిలో తాము నిమగ్నమై ఉన్నారు. ముస్లిములను ఎలా మట్టుపెట్టాలనే ప్లానులు వేస్తున్నారు. బనూ నజీర్ తెగకు చెందిన దుష్ట సర్దారు హుయ్ బిన్

15. సహీ బుఖారి-2/591 *16. ఇబ్నె హిషామ్-2/227*

అఖ్తబ్, బనూ ఖురైజా దర్బారుకు వచ్చి వారి నాయకుడు కఅబ్ బిన్ అసద్ ఖర్జీని కలిశాడు. ఈ కఅబ్ బిన్ అసద్ ఖర్జీ బనూ ఖురైజా తరఫున నిర్ణయాలు తీసుకోడానికి అర్హత పొందిన వ్యక్తి. ఇతనే దైవప్రవక్త (స)తో క్రితం యుద్ధ సమయంలో ఆయనకు సహాయపడతానని వాగ్దానం చేసి ఉన్న వ్యక్తి. ఈ విషయం మనం వెనుకటి పుటల్లో చదువుకున్నదే. హుయ్ వచ్చి అతని ఇంటి తలుపు తట్టాడు. అతను లోన్నుండి గడియ వేసుకొని కూర్చున్నాడు. కాని హుయ్, అతనితో చెప్పిన కల్లబొల్లి మాటలకు తలుపు తీయక తప్పలేదు. హుయ్ అతనితో, "ఓ కఅబ్! నేను నీ దగ్గరకు గౌరవాన్ని, సేనావాహినిని తీసుకువచ్చాను. ఖురైష్ సర్దారుల్ని, నాయకులందరిని తీసుకొని వచ్చి మజ్మ ఉల్ అస్యాల్ అనే ప్రదేశంలో ఉంచాను. ఇదే కాదు, బనూ గత్ఫాన్ తెగను వారి సర్దారులతో సహా పిలుచుకు వచ్చి ఉహద్ కొండ దాపున 'జన్బె నఖమీ'లో విడిది చేయించాను. వారంతా నాతో, "ముహమ్మద్ మరియు అతని అనుచరులను తుడిచేసే వరకు ఇక్కడి నుండి కదలం అని ప్రతిజ్ఞ కూడా చేసి ఉన్నారు" అని అన్నాడు.

ఈ మాటలు విన్న కఅబ్, "దైవసాక్షి! నీవు నా వద్దకు ప్రపంచంలోని అగౌరవాన్నంతా వెంటపెట్టుకొచ్చావు. అది వర్షించి ఖాళీ అయిన మేఘం తప్ప అందులో ఏ పసా లేదు. అది కేవలం ఉరుములు మెరుపుల మట్టుకే పరిమితమై ఉంది. ఓ హుయ్! నన్ను నా మానాన వదిలిపెట్టేసెయ్యి, నేను ముహమ్మద్ (స)తో చేసుకున్న ఒప్పందాన్ని భంగపర్చను. ఆయనకు విద్రోహం తలపెట్టేది లేదు" అని నిక్కచ్చిగా చెప్పేశాడు.

కాని హుయ్ మాత్రం అంతటితో వదలకుండా బహువిధాల నచ్చ జెబుతూ ఉన్నాడు. చివరికి అతణ్ణి ఒప్పించి తీరాడు. అయితే హుయ్ బిన్ అఖ్తబ్‌కు ఓ షరతును ఒప్పుకోవలసివచ్చింది. దాని ప్రకారం, వారు ముహమ్మద్ (స)ను అంతమొందించకుండా వెళ్ళవలసి వస్తే మాత్రం తాను కూడా కఅబ్‌తో పాటే అతని కోటలో ప్రవేశిస్తాను అని, వారికి పట్టే గతిని తాను కూడా అనుభవిస్తానని మాటిచ్చాడు. హుయ్ చేసిన ఈ ప్రతిజ్ఞకు కఅబ్ దైవప్రవక్త (స)తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని త్రుంచివేశాడు. ఆ ఒప్పందం ప్రకారం, ముస్లిముల ఎడల గల బాధ్యతలన్నీ వదిలేసుకున్నాడు. దానికి

17. ఇబ్నె హిషామ్-2/220, 221

భిన్నంగా ముష్రిక్కుల వైపు నుండి యుద్ధంలో పాల్గొనడానికే నిశ్చయించు కున్నాడు.[17]

హుయ్‌తో జరిగిన ఒప్పందం ప్రకారం, బనీ ఖురైజా తెగకు చెందిన యూదులు యుద్ధ కార్యకలాపాల్లో నిమగ్నమైపోయారు. ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, హజ్రత్ సఫియ్యా బిన్తె అబ్దుల్ ముత్తలిబ్ (ర), హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ (ర)తో 'ఫారే' పేరుగల కోటలో ఉన్నారు. హజ్రత్ హస్సాన్(ర)కు స్త్రీలను, పిల్లలను కాపాడే బాధ్యత అప్పగించబడి ఉంది. హజ్రత్ సఫియ్యా (ర)గారు ఓ రోజు జరిగిన సంఘటనను ఇలా వివరిస్తున్నారు.

"ఓ యూదుడు మేము ఉన్న కోట చుట్టూ తిరుగుతూ కోట లోపలి పరిస్థితులను తెలుసుకోడానికి చక్కర్లు కొడుతున్నాడు. బనూ ఖురైజా దైవప్రవక్త (స)తో చేసుకున్న ఒప్పందాన్ని భంగపరిచి యుద్ధానికి సన్నద్ధమవుతున్న సమయమది. బనూ ఖురైజా నుండి రక్షించడానికి మా వద్ద ఏ పురుషుడూ లేడు. దైవప్రవక్త (స) ముస్లిములందరితో సహా శత్రువును ఎదుర్కోడానికి కందకం ఈవల పొంచివున్న సమయమది. ఎవరైనా మాపై దాడి చేస్తే ఆయన వారిని వదిలి మమ్మల్ని రక్షించడానికి రాలేని పరిస్థితి అది. అందుకని నేను హజ్రత్ హస్సాన్ (ర)తో, "చూడండి! ఈ యూదుడు వచ్చి మనం ఉన్న కోట చుట్టూ తిరుగుతున్నాడు. దైవసాక్షిగా చెబుతున్నాను, ఇతను యూదులకు మన బలహీనతల గురించి చెప్పి మనపై దాడి చేయడానికి పురికొల్పవచ్చు. అటు దైవప్రవక్త (స) సహాబా (ర)తో సహా యుద్ధంలో చిక్కుకొని ఉన్నారు. ఆయన మన సహాయానికి రాలేరు. కాబట్టి వెళ్ళి అతణ్ణి సంహరించండి" అన్నాను. దానికి హజ్రత్ హస్సాన్ (ర), "దైవసాక్షిగా! నేను అలాంటి పనికి ఉపయోగపడే వ్యక్తిని కానని మీకు తెలియదా?" అన్నారు. అప్పుడు నేనే స్వయంగా నడుము బిగించి గుడారానికి కట్టి ఉన్న ఓ గడను ఊడదీశాను. కోట దిగి అతని వద్దకు వెళ్ళి ఆ గడతో అతని తలపై ఓ గట్టి దెబ్బ వేశాను. అతను ఆ దెబ్బకు చనిపోయాడు. తిరిగి వచ్చి హజ్రత్ హస్సాన్(ర)తో, "వెళ్ళి అతని ఆయుధాలు, అతని బట్టలు ఒలుచుకు రండి, అతను పురుషుడు కాబట్టి నేను అతణ్ణి తాకలేను" అని అన్నాను. దానికి ఆయన

18. ఇబ్నె హిషామ్-2/228

నాతో, "నేనక్కడికి వెళ్ళలేను. అతని ఆయుధాలతో నాకు పని కూడా లేదు" అని అన్నారు.[18]

యదార్థం ఏమిటంటే, ముస్లిమ్ మహిళలు మరియు పిల్లల సంరక్షణ కోసం, మహాప్రవక్త (స)గారి మేనత్త హజ్రత్ సఫియ్యా (ర) నిర్వహించిన ఈ ఘనకార్యం యూదులపై పెద్ద ప్రభావాన్నే చూపించింది. బహుశా యూదులు, ఆ కోటలో మరింత మంది ముస్లిమ్ యోధుల పటాలం ఉందని అనుకోవడమే- అయితే అక్కడ ముస్లిమ్ యోధుల పటాలం ఏదీ లేదు- అందుకని యూదులు తిరిగి కోటలోనికి వెళ్ళే ధైర్యం ఏ మాత్రం చేయలేదు. కాని వారు విగ్రహారాధకుల సైన్యానికి సహాయపడుతున్నామని చూపడానికి వారికి నిరంతరం ఆహారాన్ని సరఫరా చేస్తూనే ఉన్నారు. ఆ ఆహారాన్ని మోసుకొని వెళ్ళే ఇరవై ఒంటెలను సైతం ముస్లిములు పట్టుకోవడం జరిగింది.

యూదుల ఈ వాగ్దానభంగానికి సంబంధించిన ఈ వార్త దైవప్రవక్త (స)కు అందగానే ఆయన (స), నిజానిజాలను తెలుసుకునేందుకు దృష్టిని మళ్ళించారు. బనూ ఖురైజా వైఖరి ఏమిటో తెలిసిపోతే దానికి అనుగుణంగా యుద్ధవ్యూహం దృష్ట్యా ఏ అవసరమైన చర్య తీసుకోవాలో ఆలోచించవచ్చు. దాని కోసం ఆయన(స), హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర), సఅద్ బిన్ ఉబాదా బిన్ రవాహా (ర) మరియు ఖవాత్ బిన్ జుబైర్ (ర)లను పంపిస్తూ, "చూడండి! బనీ ఖురైజా గురించి ఏ వార్త అయితే అందిందో అది ఎంత మట్టుకు సరి యైనది? అదే గనక నిజమైతే తిరిగి వచ్చి, ముస్లిముల ధైర్యానికి దెబ్బ తగల కుండా అది నాకొక్కడికే తెలియజేయండి. అది కూడా సంజ్ఞల రూపంలోనే సుమా! అలా కాకుండా, బనూ ఖురైజా తమ ప్రతిజ్ఞపై నిలకడగా ఉంటే మాత్రం ఆ వివరాలను అందరికీ తెలిసేటట్లు ప్రకటించండి" అని తాకీదు చేశారు. వీరు బనూ ఖురైజా యూదుల దగ్గరకు వెళ్ళగా వారు తలబిరుసుగా ప్రవర్తిస్తున్నట్లు గమనించారు. అంతేకాదు, ఆ యూదులు బాహాటంగా దుర్భాషలకు దిగి తమ శత్రుత్వాన్ని చాటుకున్నారు. దైవప్రవక్త (స)ను అగౌరవ పరిచే మాటలన్నారు.

"అల్లాహ్ ప్రవక్తనా? ఆయన ఎవరు? మాకూ, ముహమ్మద్‌కు నడుమ ఎలాంటి ప్రమాణం జరగలేదు. ఎలాంటి వాగ్దానమూ లేదు" అని తిరస్కరించారు. పోయినవారు తిరిగి వచ్చి దైవప్రవక్త (స)కు పరిస్థితినంతా సైగలతో విన్నవిస్తూ, కేవలం 'అజ్ల్ మరియు ఖారా' అనే పదాలను మాత్రమే పలికారు. అంటే అజ్ల్ మరియు ఖారాలు ఎలాగైతే రజీ సహాబీలను మోసగించారో, ఈ యూదులు కూడా అలాగే తమ వాగ్దానాన్ని భంగపరిచారని చెప్పడం అన్నమాట.

పోయివచ్చిన ఈ సహాబా (ర)లు యదార్థాన్ని దాయడానికి ఎంత ప్రయత్నం చేసినా, సామాన్య ప్రజలకు పరిస్థితి ఏమిటో అర్థమైపోయింది. ఇలా ఓ భయంకర ప్రమాదం వారి ముందుకొచ్చి నిలబడినట్లయింది.

యదార్థంగా, అప్పుడు ముస్లిములు కీలకమైన, సున్నితమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణమది. వెనుక వైపు బనూ ఖురైజా యూదులు, వారి దాడిని అడ్డుకోవడానికి, వారికీ ముస్లిములకు నడుమ మరెవ్వరూ అడ్డుగా లేరు. ముందు చూస్తే ముష్రిక్కుల విశాలమైన సేనావాహిని. వారిని వదిలి వెనక్కు పోవడానికీ వీల్లేదు. అటు ముస్లిమ్ స్త్రీలు, పిల్లలు ఎలాంటి సంరక్షణ లేకుండా ఒప్పందాన్ని త్రెంచేసిన యూదులకు దాపునే ఉన్నారు. ఈ పరిస్థితిలో ముస్లిములలో భయం అలుముకుంది. ఈ పరిస్థితినే దివ్యఖుర్‌ఆన్ ఇలా వివరిస్తోంది.

وَإِذْ زَاغَتِ الْأَبْصَارُ وَبَلَغَتِ الْقُلُوبُ الْحَنَاجِرَ وَتَظُنُّونَ بِاللَّهِ الظُّنُونَا ۝ هُنَالِكَ ابْتُلِيَ الْمُؤْمِنُونَ وَزُلْزِلُوا زِلْزَالًا شَدِيدًا ۝

"శత్రువులు మీ మీదకు పై నుండి, క్రింది నుండీ దండెత్తి వచ్చినప్పుడు, భయం వల్ల మీ కళ్ళు తేలగిల్లినప్పుడు మీ గుండెకాయలు గొంతులోనికి వచ్చినప్పుడు, మీరు అల్లాహ్‌ను గురించి రకరకాలుగా అనుమానించారు. ఆ సమయంలో విశ్వాసులు కఠిన పరీక్షకు గురి అయ్యారు, తీవ్రంగా ఊపివేయబడ్డారు." (33 : 10,11)

అదే సమయంలో కొందరు మునాఫిక్‌లు (కపట ముస్లిములు) కూడా బయటకు వచ్చి, ముహమ్మద్ మాతో, "మేము కైసరు మరియు కిస్రాల బొక్కసాలను సొంతం చేసుకుంటామని వాగ్దానం చేశాడు. మరిప్పుడు మేము కాలకృత్యాలు తీర్చుకోడానికి అయినా బయటకు వెళ్ళే అవకాశం లేదు" అని అనజొచ్చారు. కొందరు వంచకులైతే తమ జాతి గౌరవనీయులతో, "మా

ఇళ్ళు శత్రువుల కోసం తెరువబడి ఉన్నాయి. మాకు అనుమతినివ్వండి వెళ్ళి వాటిని రక్షించుకుంటాం, మా ఇళ్ళు నగరానికి చాలా ఎడం" అని కూడా అనసాగారు. బనూ సల్మా తెగ పూర్తిగా ధైర్యాన్ని వదిలేసి పారిపోవాలని కూడా ఆలోచించనారంభించింది. ఆ మునాఫిక్‌ల గురించే దివ్యఖుర్‌ఆన్ ఇలా సెలవిచ్చింది:

وَاِذْ يَقُوْلُ الْمُنٰفِقُوْنَ وَالَّذِيْنَ فِيْ قُلُوْبِهِمْ مَّرَضٌ مَّا وَعَدَنَا اللّٰهُ وَرَسُوْلُهٗٓ اِلَّا غُرُوْرًا ۝

وَاِذْ قَالَتْ طَّاۤىِٕفَةٌ مِّنْهُمْ يٰٓاَهْلَ يَثْرِبَ لَا مُقَامَ لَكُمْ فَارْجِعُوْا ۚ وَيَسْتَاْذِنُ فَرِيْقٌ

مِّنْهُمُ النَّبِيَّ يَقُوْلُوْنَ اِنَّ بُيُوْتَنَا عَوْرَةٌ ۛ وَمَا هِيَ بِعَوْرَةٍ ۚ اِنْ يُّرِيْدُوْنَ اِلَّا فِرَارًا ۝

"కపటులూ, రోగగ్రస్త హృదయులూ అందరూ, "అల్లాహ్, ఆయన ప్రవక్త (స) మనతో చేసిన వాగ్దానాలన్నీ భ్రమలు తప్ప మరేమీ కావు" అని స్పష్టంగా ప్రకటించినప్పటి సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు వారి లోని ఒక వర్గం, "ఓ యస్‌రిబ్ ప్రజలారా! ఇక మీకు ఇక్కడ ఉండే అవకాశమేదీ లేదు, వెనక్కి వెళ్ళిపోండి" అని అన్నది. అప్పుడు వారిలోని మరొక వర్గం "మా గృహాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి" అని దైవ ప్రవక్తకు చెప్పి సెలవు కోరింది. వాస్తవానికి వాటికి ఏ ప్రమాదమూలేదు. అసలు వారు (యుద్ధ మైదానంనుండి) పారిపోదలిచారు." (33:12,13)

ఓ వైపు ఇస్లామీయ సేనలో అలుముకున్న పరిస్థితి ఇది. మరొక వంక దైవప్రవక్త (స), బనూ ఖురైజా తలపెట్టిన ద్రోహానికి తన తలను ముఖాన్ని గుడ్డతో కప్పుకున్నారు. అలానే చాలా సేపటి వరకు వెల్లకిలా పడుకుని ఉన్నారు. మహాప్రవక్త (స)గారి ఈ పరిస్థితిని చూసి ముస్లిముల్లో భయభీతులు చోటుచేసుకున్నాయి. అయితే ఆ తరువాత ఆయనకు స్థిమితం చేకూరింది. ఆయనలో క్రొత్త ఆశలు పొడసూపాయి. దైవప్రవక్త (స) తమ నిస్సహాయ స్థితి నుండి అల్లాహు అక్బర్ అంటూ లేచి నిలబడ్డారు. ముస్లిములనుద్దేశించి, "ముస్లిములారా వినండి! అల్లాహ్ తరపున సహాయం మరియు విజయ శుభవార్త వచ్చింది" అన్నారు. ఆ పిదప ఆయన పరిస్థితులను అడ్డుకునే పథకం తయారు చేశారు. ఈ పథకంలోని ఓ భాగంగా, ముస్లిములు ఏమరు పాటులో ఉన్నప్పుడు యూదులు స్త్రీలు మరియు పిల్లలపై హఠాత్తుగా విరుచుకుపడకుండా, మదీనాను సంరక్షించడానికిగాను ముస్లిం యోధుల

ఓ దళాన్ని అక్కడికి పంపించారు. అయితే ఈ సందర్భంగానే ఆయన మరో వ్యూహం పన్నుతూ, శత్రువులకు చెందిన వివిధ వర్గాలను ఒకదానికి ఒకటి సంబంధం లేకుండా చేసేందుకు ఓ నిర్ణయానికి రావలసి వచ్చింది. ఈ లక్ష్య సాధన కోసం ఆయన(స), బనూ గత్ఫాన్‌కు చెందిన ఇద్దరు సర్దారులు ఉయైనా బిన్ హసన్ మరియు హారిస్ బిన్ ఔఫ్‌తో ఓ ఒప్పందం కుదుర్చుకో దలిచారు. దాని ప్రకారం, మదీనావాసులు పండించే పంటలో మూడింట ఒక వంతును వారికి ముట్టచెప్పడం బదులుగా ఆ ఇద్దరు సర్దారులు తమ తమ తెగలను తీసుకొని యుద్ధం నుండి వెళ్ళిపోవడం, ఈ వ్యూహరచన ద్వారా ముస్లిములు ఖురైషులను మార్కొని వారిని ఓడించ వచ్చని భావిం చారు. ఈ సలహా గురించి సహాబాల మధ్య చర్చ కూడా జరిగింది. కాని దైవప్రవక్త(స) ఈ వ్యూహాన్ని హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్(ర) మరియు హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా (ర)ల ముందుపెట్టగా వారు ఇద్దరు ఏక కంఠంగా, "దైవప్రవక్తా (స)! ఒకవేళ అల్లాహ్‌యే ఇలా చేయమని ఆదేశిస్తే మేము దీన్ని మారుమాట్లాడకుండా శిరసావహిస్తాం. ఒకవేళ తమరు మా కోసమని అలా చేస్తున్నారు అనుకుంటే మాత్రం, ఈ ఒప్పందం మాకు ససేమిరా శిరోధార్యం కాదు. మేమూ, వారూ ఉభయులం బహుదైవారాధకు లుగా ఉన్నప్పుడు, వారు మా అతిథి సత్కారం లేదా క్రయవిక్రయాలు తప్ప ఓ గింజ కూడా పొందలేకపోయినవారు. ఇప్పుడు, అల్లాహ్ మాకు ఇస్లామ్ అనే రుజుమార్గాన్ని ప్రసాదించి, తమ ద్వారా మాకు గౌరవం కలిగించాక ఇక మేము వారికి మా ధనసంపదలను ఎలా ఇస్తాము? దైవసాక్షి! మేమైతే వారికి కేవలం మా కరవాలాలను మాత్రమే అందించగలం" అని సమాధాన మిచ్చారు. దైవప్రవక్త (స) వీరి సలహాలను విని, "మీ సలహాలు అంగీకరించ దగినవే, పూర్తి అరేబియాయే ఏకమై మీపై విరుచుకుపడడం చూసి మీ మేలు కోరే నేను ఈ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది, అంతకంటే మరేమీ కాదు" అని అన్నారు.

దైవలీల ఏమిటోగాని శత్రు సేనలోనే చీలిక ఏర్పడింది. ఆ తరువాత వారు ఓటమికి గురి అయిపోయారు. అది ఎలా సాధ్యం అయిందో ఆ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

బనూ గత్ఫాన్‌కు చెందిన ఓ వ్యక్తి 'నుఅయిమ్ బిన్ మస్ఊద్ బిన్

ఆమిర్ అష్జయీ' మహాప్రవక్త (స) సన్నిధికి రావడం జరిగింది. ఆయన దైవప్రవక్త (స)తో ఇలా విన్నవించుకున్నారు.

"ఓ దైవప్రవక్తా! నేను ఇస్లామ్ స్వీకరించాను. కాని ఈ విషయం నా జాతికి ఇప్పటి వరకూ తెలియదు. తమరు నాకు ఏదైనా ఆదేశం ఇవ్వండి దాన్ని పాలించడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నారు.

"నీవు కేవలం ఒంటరివాడివి. (ఆ సైన్యంతో యుద్ధం చేయలేవు) అయితే సాధ్యమైనంతమట్టుకు శత్రు శిబిరంలో చీలిక తెచ్చి వారి ధైర్యాన్ని పోగొట్టు, యుద్ధం అంటేనే కుయుక్తులకు మారుపేరు మరి" అని సలహా ఇచ్చారు. ఇది విన్న హజ్రత్ నుఅయిమ్ (ర) వెంటనే బనూ ఖురైజా యూదుల వద్దకు వెళ్ళారు. ఇస్లామ్ స్వీకరించక పూర్వం ఆయన వారితో ఎంతో కలుపుగోలుగా ఉంటూ వచ్చినవారు. అక్కడకు వెళ్ళి, "మీ ఎడల నాకు ఎంత ప్రేమ ఉందో, నాకూ మీకూ నడుమగల ప్రత్యేక సంబంధం ఎలాంటిదో మీరు ఎరిగిన విషయమే కదా!" అని పలికారు.

"అవును, ఇందులో సందేహమేముంది?" అన్నారు వారు.

"అయితే వినండి! ఖురైషుల వ్యవహారం మీకు భిన్నమైన వ్యవహారం. ఈ ప్రాంతం అంతా మనకు చెందిన ప్రాంతం. ఇక్కడ మీ ఇళ్ళూవాకిళ్ళూ ఉన్నాయి. మీ వ్యాపారం అంతా ఈ ప్రాంతానికి చెందిందే. మీ ధనసంపద, పిల్లాజెల్లా అంతా ఇక్కడే ఉంటున్నారు. మీరు వారిని వదిలి ఎక్కడికీ పోలేరు కూడా. అయితే ఖురైషులు మరియు గత్ఫానులు కలసి ముహమ్మద్ (స)తో యుద్ధం చేయడానికి వస్తే మీరు ముహమ్మద్‌కు వ్యతిరేకంగా వారికి సహాయ పడుతున్నారు. వారికి ఇక్కడ ఇళ్ళూ వాకిళ్ళుగానీ, భార్యాపిల్లలుగానీ, ధన సంపదలుగానీ ఏవీ లేవు. వారికి అవకాశం చిక్కితేనే ముహమ్మద్‌ను జయించ గలరు. లేని పక్షంలో తమ పెట్టేబేడా సర్దుకొని ఇంటి ముఖం పట్టేస్తారు. ఇక మిగిలేది మీరూ, ముహమ్మద్ (స) మాత్రమే. ఇప్పుడేం చేస్తారు చెప్పండి" అని భయపెట్టారు. ఈ మాటలు విన్న బనూ ఖురైజా యూదులకు గుండెలు దడదడలాడాయి.

"చెప్పండి నుఅయిమ్! మమ్మల్ని ఏమి చేయమంటారో" అని అడిగారు.

"ఏముందీ! ఖురైషులకు చెందిన కొంతమందిని మీ దగ్గర ఉంచు

కోండి. వారే గనక దానికి సిద్ధపడకపోతే యుద్ధంలో మీరు పాల్గొనకూడదు" అని సలహా ఇచ్చారు.

"ఓహో! ఎంత మంచి సలహా ఇది" అని ఆయన్ను పొగడనారంభిం చారు వారు.

ఆ తరువాత నుఅయిమ్ నేరుగా ఎవరికీ తెలియకుండా ఖురైషుల శిబిరానికి వెళ్ళారు. ఖురైషులను ఉద్దేశించి,

"మీరంటే నాకెంత ఇష్టమో, మీకు మేలు జరగాలని ఎంతగా ఆకాం క్షిస్తున్నానో ఆ విషయం మీకు తెలిసిందే" అన్నారు. దానికి ఖురైషులు, "అవును. అది మాకు బాగా తెలుసు. మీరు మా మేలు కోరేవారే" అన్నారు.

"అయితే వినండి! యూదులు ముహమ్మద్ (స)తో చేసుకున్న ఒప్పందాన్ని భంగపరచి ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారు. ఇప్పుడు అందరూ కలసి ఓ నిర్ణయానికి వచ్చారు. అదేమిటంటే, వారు (ఆ యూదులు) మీ దగ్గర నుండి కొందరు మనుషుల్ని కుదువపెట్టుకొని ముహమ్మద్ (స)కు అప్పజెప్పి క్షమాపణ కోరుకుంటారట. తిరిగి ముహమ్మద్ (స)తో చేసిన ఒడంబడికను పునరుద్ధరిస్తారట. కాబట్టి ఆ యూదులే గనక మీ మనుషుల్ని కుదువపెట్టమని అడిగితే, జాగ్రత్త! ఒక్కరిని కూడా కుదువపెట్టవద్దు సుమా!" అని హితవు చేసి వెళ్ళిపోయారు.

అలాగే హజ్రత్ నుఅయిమ్ గత్ఫాన్ తెగ సర్దారుల వద్దకు వెళ్ళి ఆ మాటలనే రెట్టించారు. వారు కూడా జాగరూకులైపోయారు.

ఇది జరిగిన తరువాత శుక్రవారం మరియు శనివారం నాటి మధ్యరాత్రి ఖురైషులు, యూదుల వద్దకు, "మా విడిది అంత సరైన ప్రదేశంలో లేదు. అందువల్ల మా గుర్రాలు, ఒంటెలు చనిపోతున్నాయి. కాబట్టి అటు నుండి మీరు ఇటు నుండి మేము ముహమ్మద్ (స)పై వెంటనే దాడి చేయాలి" అని వర్తమానం పంపించారు. కాని యూదులు సమాధానంగా, "ఈ రోజు శనివారం, మీకు తెలుసు సబ్బత్ రోజున మేము ఏ పనీ చేయమనేది. గతంలో దైవ ఆదేశాన్ని ధిక్కరించిన వారు దైవశిక్షను ఎలా అనుభవించారో మాకు బాగా తెలుసు. అంతేకాదు మీరు మీ మనుషులు కొందర్ని మా వద్ద కుదువ బెట్టనంత వరకు మేము యుద్ధంలో పాల్గొనే ప్రసక్తే లేదు" అని చెప్పి పంపించారు.

వార్తాహరుడు తెచ్చిన ఈ వార్త వినగానే ఖురైషులు మరియు గత్ఫానులు, "దైవసాక్షి! నుఅయిమ్ నిజమే చెప్పాడు" అని యూదులకు, "మేము ఏ ఒక్కరినీ మీ దగ్గర కుదువపెట్టేవారం కాదు. మీరు త్వరగా మాతో సహకరించి (ఇరువైపుల నుండి) ముహమ్మద్ (స)పై దాడి చేయాల్సి ఉంది" మరో వర్తమానం పంపించారు. ఖురైష్ గత్ఫాన్‌ల ఈ వైఖరిని గమనించిన బనూ ఖురైజా యూదులు, "దైవసాక్షి! నుఅయిమ్ నిజమే చెప్పారు" అని అనుకున్నారు.

ఇలా రెండు వర్గాల్లో చీలిక ఏర్పడి పరస్పరం ఒకరిపై మరొకరికి ఉన్న నమ్మకం కాస్తా అడుగంటిపోయింది. వారి సైన్యంలో చీలిక ఏర్పడి, ధైర్యాలు సన్నగిల్లాయి.

ఈ సందర్భంలో ముస్లిములు అల్లాహ్‌ను ఇలా వేడుకుంటున్నారు:

"ఓ ప్రభూ! మా రహస్యాలను శత్రువుకు తెలియకుండా దాచి ఉంచు. మమ్మల్ని అన్ని రకాల ప్రమాదాల నుండి కాపాడు."

మహాప్రవక్త (స) దైవాన్ని ఇలా వేడుకుంటున్నారు:

"ఓ అల్లాహ్! గ్రంథాన్ని అవతరించినవాడా! కర్మల లెక్కల్ని త్వరగా తీసుకునే ఓ ప్రభూ! ఈ సైన్యాలకు ఓటమిని కలుగజెయ్యి. ఓ అల్లాహ్! వారిని ఓడించు, ఊపివెయ్యి."[19]

చివరికి అల్లాహ్ ముస్లిముల వేడుకోలును విన్నాడు. ముష్రిక్కులలో చీలిక ఏర్పడి వారు భయభీతులు అయిపోయిన తరువాత అల్లాహ్ వారిపై భీకరమైన తుఫానును పంపాడు. ఆ తుఫాను గాలులు వారి గుడారాల్ని పీకి వేశాయి. పొయ్యిల్లో ఉన్న వంట పాత్రలు దొర్లిపోయాయి. ఏ వస్తువూ స్థిరంగా ఉండలేదు. దానికితోడు దైవదూతల సేనను కూడా పంపించాడు అల్లాహ్. ఈ సేన వారందరినీ కుదిపివేసింది. వారి హృదయాల్లో భయభీతుల్నీ, ముస్లిములంటే జంకునూ సృష్టించాడు.

ఈ ఎముకలు కొరికి వేసే శీతల రాత్రి వేళనే దైవప్రవక్త (స), దైవధిక్కారుల పరిస్థితి ఎలాగుందో తెలుసుకురమ్మని హజ్రత్ హుజైఫా బిన్ యమాన్ (ర)ను పంపించారు. ఆయన యుద్ధరంగంలోనికి వెళ్ళి చూడగా అక్కడ పరిస్థితి అంతా అస్తవ్యస్తంగా ఉంది. ముష్రిక్కులు తిరుగు ప్రయాణానికి

19. సహీ బుఖారి, కితాబుల్ జిహాద్-1/411; కితాబుల్ ముగాజీ-2/590

సంసిద్ధులవుతున్నారు. తిరిగి వచ్చి ఆ పరిస్థితి గురించి మహాప్రవక్త (స)కు తెలియజేశారు ఆయన. తెల్లవారిన తరువాత చూడగా (యుద్ధరంగం అంతా ఖాళీ అయిపోయింది) అల్లాహ్ శత్రువును ఎలాంటి ప్రయోజనం పొందకుండా ఆ కోపంలోనే వెనక్కు పంపించడం అగుపడింది దైవప్రవక్త (స)కు. మొత్తానికి అల్లాహ్ తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడు. తన సేనకు గౌరవాన్ని చేకూర్చాడు. తన దాసునికి సహాయపడుతూ ఆయన ఒక్కడే ఈ అపార సేనావాహినిని ఓడించాడు. ఆ తరువాత మహాప్రవక్త (స) మదీనాకు బయలుదేరి వెళ్ళిపోయారు.

అగడ్త యుద్ధం (గజ్వయె అహ్జాబ్) ప్రామాణికమైన ఉల్లేఖనం ద్వారా, షవ్వాల్ నెల హిజ్రీ శకం 5లో సంభవించింది. ముష్రిక్కులు ఒక నెల పాటు లేదా దాదాపుగా ఒక నెల వరకు దైవప్రవక్త (స)ను మరియు ముస్లిములను దిగ్బంధంలో ఉంచారు ఆ యుద్ధంలో. అన్ని ఆధారాలను పరిగణనలోనికి తీసుకుంటే, ఈ దిగ్బంధం షవ్వాల్ నెల ఆరంభం నుండి ప్రారంభమై జీఖాదా నెల వరకు కొనసాగిందని తెలుస్తోంది. ఇబ్నె సఅద్ ఉల్లేఖనం ప్రకారం, అహ్జాబ్ యుద్ధం నుండి తిరుగు ప్రయాణమైన రోజు బుధవారం. జీఖాదా మాసం పూర్తి కావడానికి ఇంకా ఏడు రోజులు మిగిలి ఉన్నాయి.

అహ్జాబ్ యుద్ధం వాస్తవానికి నష్టాల యుద్ధం అనే బదులు మానసికమైన ఒత్తిడికి గురిచేసిన యుద్ధమే అని అనడం సబబు. ఈ యుద్ధంలో ఎలాంటి రక్తపాతం జరుగలేదు. అయినా ఇది ఇస్లామీయ చరిత్రకు సంబంధించిన నిర్ణయాత్మకమైన యుద్ధం. ఈ యుద్ధంలో ముష్రిక్కుల మనోబలం పూర్తిగా దెబ్బతిన్నది. అరేబియాకు చెందిన మరే శక్తి, మదీనాలో జీవం పోసుకుంటున్న ఈ చిన్న శక్తిని అంతమొందించజాలదు అనే విషయం తెలిసిపోయింది. ఎందుకంటే, అహ్జాబ్ యుద్ధంలో సమీకరించబడినంత సైనిక బలాన్ని తిరిగి సమకూర్చడం అరబ్బులకు సాధ్యం అయ్యే పని కాదు. అందుకని దైవప్రవక్త (స) అహ్జాబ్ యుద్ధం నుండి తిరిగివచ్చిన తరువాత ఇలా సెలవిచ్చారు:

"ఇక మనమే వారిపై దండెత్తి వెళ్ళవలసి ఉంది. వారు ఇక మనపై దండెత్తి రాలేరు. మన సేనయే వారి వైపునకు వెడుతుంది" అని ప్రకటించారు.



గజ్వయె బనూ ఖురైజా

అహ్జాబ్ యుద్ధం నుండి తిరిగివచ్చిన రోజునే దైవప్రవక్త (స), ఉమ్మె సల్మా (ర)గారి ఇంట్లో స్నానం చేస్తూ ఉండగా హజ్రత్ జిబ్రీల్ (అ.స.) ఆయన (స) వద్దకు వచ్చి, "ఏమిటీ! మీరు అప్పుడే ఆయుధాలను పడవేశారా? ఇంకా దైవదూతలు తమ ఆయుధాలను పడవేయలేదే? నేను కూడా ఆ జాతిని వెంటాడి ఇప్పుడే మీ దగ్గరకు వచ్చాను. లేవండి! తమ సహచరు లందరినీ తీసుకొని బనూ ఖురైజా వైపునకు బయలుదేరండి. నేను ముందు అక్కడికి వెళ్ళి వారి కోటల్ని కంపనానికి గురిచేస్తాను. వారి హృదయాల్లో భయాందోళనలను రేకెత్తిస్తాను" అని చెప్పి దైవదూతల్ని వెంటబెట్టుకొని అక్కడికి వెళ్ళిపోయారు.

ఇటు మహాప్రవక్త (స) ఓ సహాబీ (ర)తో, "ఎవరైతే విధేయతపై నిలకడగా ఉన్నారో వారంతా అస్ర్ నమాజును బనూ ఖురైజా ఉంటున్న చోటుకు వెళ్ళి చేయాలి" అని ప్రకటన చేయించారు. ఆ తరువాత ఆయన (స) మదీనాను కాపాడే బాధ్యతలను ఉమ్మె మక్తూమ్ (ర)గారికి అప్పగించారు. హజ్రత్ అలీ (ర)గారి చేతికి యుద్ధపతాకాన్ని ఇచ్చి వెంట సైన్యం ఇచ్చి బయలుదేరదీశారు. హజ్రత్ అలీ (ర) తన సహచరులతో బనూ ఖురైజా కోటల దగ్గరికి వెళ్ళగానే ఆ యూదులు దైవప్రవక్త (స)ను తిట్టడం మొదలెట్టారు.

ఇంతలోనే మహాప్రవక్త (స) కూడా ముహాజిర్లు మరియు అన్సారుల సంరక్షణలో బయలుదేరడం జరిగింది. బనూ ఖురైజా ఉంటున్న ప్రదేశానికి దగ్గరలో ఉన్న 'అనా' అనే ఓ బావి వద్ద విడిది చేశారు. సాధారణ ముస్లిములు కూడా ఆ ప్రకటన వినడంతోనే బనీ ఖురైజా ఉండే చోటుకు తరలివెళ్ళ నారంభించారు. మార్గం మధ్యలో అస్ర్ నమాజు వేళ అయిపోయింది. కొందరు "మనకు ఏ ఆదేశం అయితే ఇవ్వబడిందో దాని ప్రకారం బనూ ఖురైజా వద్దకు వెళ్ళే అస్ర్ నమాజ్ చేద్దాం" అని అన్నారు. ఇలా వారు అస్ర్

నమాజును అక్కడికి చేరిన తరువాత ఇషా నమాజు అయిన తరువాత చేసుకున్నారు. మరికొందరు సహాబా(ర)లు, "అలా కాదు! దైవప్రవక్త (స) గారి ఉద్దేశ్యం కేవలం, మనం వెంటనే బయలుదేరి వెళ్ళాలి అన్నదే" అని మార్గం మధ్యలోనే అస్ర్ నమాజు చేసుకున్నారు. అయితే ఈ విషయం దైవప్రవక్త (స)కు తెలిసి నప్పుడు ఆయన ఎవ్వరినీ మందలించలేదు.

ఎలాగైతేనేమి, వివిధ వర్గాలుగా ఇస్లామీయ సేన బనూ ఖురైజా నివసిస్తున్న ప్రదేశానికి వచ్చి చేరుకుని మహాప్రవక్త (స)ను కలుసుకోవడం జరిగింది. వీరంతా కలసి బనూ ఖురైజా కోటలను చుట్టుముట్టారు. ఈ సైన్యం సంఖ్య మొత్తం మూడు వేలు. ఇందులో ముప్పై గుర్రాలు కూడా ఉన్నాయి.

దిగ్బంధం మరీ తీవ్రమైన తరువాత యూదుల సర్దారు కఅబ్ యూదుల ముందు మూడు ప్రత్యామ్నాయ మార్గాలను ఉంచాడు:

1. ఇస్లామ్ స్వీకరించి ముహమ్మద్ (స) ధర్మంలో చేరిపోయి తమ భార్యా పిల్లల్ని, ధనసంపదలను రక్షించుకోవడం. కఅబ్ ఈ ప్రతిపాదన చేస్తూ, "దైవసాక్షి! మీకు బాగా తెలుసు. ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్త అన్న విషయం. మన గ్రంథాల్లో చెప్పబడిన వ్యక్తే ఆయన" అని కూడా అనడం జరిగింది.
2. లేదా, మన భార్యాబిడ్డల్ని స్వయంగా మన చేతుల మీదుగా హతమార్చి కరవాలంబట్టి ప్రవక్త (స) వైపునకు వెళ్ళి పూర్తి శక్తినుపయోగించి ఆయనను ఢీకొనడం. ఆ తరువాత విజయమో లేదా మనమందరం చంపబడడమో జరుగుతుంది.
3. లేదా, ముహమ్మద్(స)పై శనివారం రోజున ఏమరుపాటుగా ఉన్నప్పుడు విరుచుకుపడడం. శనివారం మనం యుద్ధం చేయమని వారికి గట్టి నమ్మకం కూడా.

కాని యూదులు ఈ మూడు ప్రతిపాదనల్లో ఏ ఒక్కదాన్నీ ఒప్పుకోలేదు. ఇది చూసిన వారి సర్దారు వారినుద్దేశించి, "మీరు మీ తల్లి గర్భం నుండి జన్మించినప్పటి నుండి ఒక్క రాత్రి కూడా వివేకంతో గడిపినట్లు లేదు" అని తిట్టాడు.

ఈ మూడు ప్రతిపాదనలను రద్దుపరిచిన తరువాత బనూ ఖురైజా ముందు కేవలం ఒకే ఒక మార్గం మిగిలిపోయింది. అది, దైవప్రవక్త (స)కు లొంగిపోయి, తమ ఆయుధాలను పడవేయడం. తమ అదృష్టాన్ని ఆయన చేతిలో ఉంచి ఆయన తీర్పు కోసం ఎదురుచూడడం. అయితే యూదులు తమ ఆయుధాలను పడవేసి లొంగిపోయే ముందు తమ మిత్రపక్షాలైన ముస్లిములతో కూడా సంప్రతించాలని అనుకున్నారు. బహుశా ఆయుధాలు పడవేసిన తరువాత వారికి పట్టబోయే గతి ఎలాంటిదో తెలుసుకునే ఉద్దేశ్యంతో. యూదులు ఇలా అనుకొని దైవప్రవక్త (స) వద్దకు ఓ దూతను పంపిస్తూ, "అబూ లుబాబా (ర)ను మా వద్దకు పంపించండి. ఆయన్ను మేము సలహా అడగాలనుకుంటున్నాం" అని చెప్పి పంపారు. అబూ లుబాబా (ర) వారికి మిత్రపక్షం వారు. ఆయన తోటలు, వారి కుటుంబాలు కూడా ఆ ప్రదేశంలోనే ఉన్నాయి. హజ్రత్ అబూ లుబాబా (ర) వారి దగ్గరకు వెళ్ళగానే పురుషులందరూ ఆయన వైపునకు పరుగుపరుగున వచ్చి చేరారు. స్త్రీలు, పిల్లలు ఆయన ఎదురుగా నిలబడి శోకాలు తీస్తూ ఏడ్పులంకించుకున్నారు. ఈ పరిస్థితిని చూసి అబూ లుబాబా (ర) మనస్సు చలించింది. కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. యూదులు ఆయనతో, "అబూ లుబాబా (ర)! మీరు చెప్పండి, మేము ముహమ్మద్ (స) చేసిన తీర్పుపై ఆయుధాలు పడవేయాల్సిం దేనా?" అని.

"అవును. ఆయుధాలు పడవేయాల్సిందే" అన్నారాయన. అలా అంటూనే తన చేతితో గొంతు వైపునకు సైగ కూడా చేశారు. అంటే, మీరం దరూ చంపబడతారు అని చెప్పడం అన్నమాట. కాని ఆయనకు వెంటనే స్పృహ వచ్చింది. ఇది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) ఎడల ద్రోహం అన్న విషయం వెంటనే గ్రహించారు. ఆయన దైవప్రవక్త (స) దగ్గరకు రాకుండా నేరుగా మస్జిదె నబవీకి వెళ్ళి అక్కడ తాను ఓ స్తంభానికి వేసి కట్టుకున్నారు. అలా కట్టుకున్నాక ఆయన, తనను కేవలం ఒక్క దైవప్రవక్త (స) మాత్రమే విప్పాలి అంటూ శపథం చేశారు. ఇటు దైవప్రవక్త (స) అబూ లుబాబా (ర) ఎంత వరకూ రాకపోవడం చూసి అడిగారు. ఆయన మస్జిద్‌లో ఓ స్తంభానికి వేసి కట్టుకున్నట్లు తెలిసి, "ఆయన కోసం నేను మన్నింపు దుఆ మాత్రం చేయగలను. అంతకంటే ఏమీ చేయలేను. ఆయన అంత పని చేసినప్పుడు

ఆయన్ను నా చేతుల మీదుగా విప్పివేయలేను కూడా. అల్లాహ్ ఆయన తౌబా (పశ్చాత్తాపాన్ని)ను స్వీకరిస్తే తప్ప" అన్నారు.

ఇటు అబూ లుబాబా (ర) చేసిన సైగను కూడా అర్థం చేసుకోకుండా బనూ ఖురైజా, దైవప్రవక్త (స)కు లొంగిపోయి ఆయుధాలు పడవేయడానికి, ఆయన తీర్పును శిరసావహించడానికి సిద్ధపడ్డారు. కాగా, బనూ ఖురైజా వారు ఓ సుదీర్ఘ కాలం వరకు ముస్లిముల దిగ్బంధాన్ని భరించే స్థితిలోనే ఉన్నారు. వారి వద్ద కావలసిన ఆహార పదార్థాలూ ఉన్నాయి. త్రాగడానికి నీటి చెలమలూ, బావులూ, ఉండడానికి దృఢమైన కోటలూ ఉన్నాయి. మరో వైపు ముస్లిములు ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా ఆకాశం క్రింద రక్తాన్ని గడ్డ కట్టించే చలిని భరిస్తూ ఉన్నారు. ఆకలి బాధ కూడా వారిని వెంటాడుతూనే ఉంది. అహ్జాబ్ యుద్ధం మొదలుకాక పూర్వం నుండే సతతం యుద్ధ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్న కారణంగా బాగా అలసిపోయి ఉన్నారు కూడా. అయితే ఈ యుద్ధం వారి మానసిక స్థితిని కూడా బాగా దెబ్బతీసింది. అల్లాహ్ బనూ ఖురైజా మనస్సుల్లో భయాందోళనలను రేకెత్తించడం వల్ల వారి ధైర్యం పూర్తిగా దెబ్బతిన్నది. అంతేకాదు, హజ్రత్ అలీ (ర) మరియు జుబైర్ బిన్ అవామ్ (ర)లు కలసి ముందుకు వచ్చి వారిని గదమాయించడం మొదలెట్టారు. హజ్రత్ అలి (ర) అయితే ముస్లిములను ఉద్దేశించి, "ఓ సైనికులారా! దైవసాక్షి! హజ్రత్ హమ్జా (ర) గారు అమరగతిపొందినట్లే నేనన్నా అమరగతిని పొందుతాను, లేదా వారి ఈ కోటను జయించనైనా జయిస్తాను" అన్నారు.

హజ్రత్ అలి (ర) గారి ఈ బహిరంగ ప్రకటన విన్నంతనే బనూ ఖురైజా యూదులు ఆలస్యం చేయకుండా తమను దైవప్రవక్త (స)కు సరండరు చేసుకొని, "ఓ ప్రవక్తా (స)! తమరు ఏ విధంగా తీర్పు ఇచ్చినా అది మాకు సమ్మతమే" అని అన్నారు. మహాప్రవక్త (స), పురుషుల చేతులను వెనక్కి విరిచి కట్టేయమని ఆదేశం ఇవ్వగా, ముహమ్మద్ బిన్ ముస్లిమా (ర) గారి పర్యవేక్షణలో అందరి చేతులు కట్టివేయడం జరిగింది. స్త్రీలను, పిల్లలను వారి నుండి వేరు చేసి దూరంగా ఉంచారు. ఈ పరిస్థితిని చూసి అవస్ తెగకు చెందిన వారు దైవప్రవక్త (స)ను, "తమరు బనూ ఖైనుఖాతో ఏ విధంగా ప్రవర్తించారో వీరి ఎడల కూడా అదే విధంగా ప్రవర్తించండి. బనూ ఖైనుఖా

మా సోదరులైన ఖజ్రజ్‌కు మిత్రపక్షాలు, వీరు మాకు మిత్రపక్షాలు. కాబట్టి వీరిపై కరుణ, దయ చూపండి" అని ప్రాధేయపడ్డారు. ఇది విన్న దైవప్రవక్త (స) అవస్ తెగవారినుద్దేశించి, "మీ నుండే ఓ వ్యక్తి వీరి గురించి తీర్పు చెబుతాడు, దీనికి మీరు సిద్ధమేనా?" అని అడిగారు.

"అవును. అది మాకు సమ్మతమైన విషయమే" అన్నారు అవస్ తెగవారు.

"అయితే ఈ వ్యవహారాన్ని సఅద్ బిన్ ముఆజ్ (ర) గారికి అప్పజెబుతున్నాను" అన్నారు మహాప్రవక్త (స).

"మేము తమ ఈ తీర్పును సంతోషంగా స్వీకరిస్తున్నాం" అన్నారు వారు.

ఆ తరువాత మహాప్రవక్త (స) మదీనాలో ఉన్న హజ్రత్ సఅద్ (ర)ను పిలువనంపారు. ఆయనకు గాయం అయి ఉండడం వల్ల ఈ సైన్యంతో ఇక్కడికి రాలేని స్థితిలో ఉన్నారప్పుడు. అహ్జాబ్ యుద్ధంలో ఆయన చేతి ప్రధాన నరం ఒకటి తెగిపోయి ఉంది. ఆయన్ను కంచర గాడిదపై ఎక్కించుకొని దైవప్రవక్త (స) గారి సన్నిధికి తీసుకురావడం జరిగింది. ఆయన దగ్గరకు రాగానే, ఆయన తెగ అవస్ వారు అన్ని వైపుల నుండి ఆయన్ను చుట్టుముట్టారు.

"సఅద్! మీ మిత్రపక్షం అయిన బనూ ఖురైజా విషయంలో మేలు తలచి వారిపై దయ చూపండి. దైవప్రవక్త (స) మిమ్మల్ని, వారి ఎడల దయ జూపే ఉద్దేశ్యంతోనే మిమ్మల్ని న్యాయనిర్ణేతగా ఎన్నుకున్నారు" అని అన్నారు.

హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) ఏమీ మాట్లాడలేదు. ప్రజలు ఆయన్ను బలవంతం పెట్టడం చూసి, "ఇప్పుడు సమయం వచ్చేసింది. అల్లాహ్ విషయంలో మరెవ్వరు తూలనాడినా సఅద్ మాత్రం పట్టించుకునే సమయం కాదిది" అన్నారు.

ఇది విన్నంతనే కొందరు మదీనాకు వెళ్ళిపోయి ఖైదీలకు మరణదండన పడిందని ప్రకటించనే ప్రకటించేశారు.

హజ్రత్ సఅద్ (ర) దైవప్రవక్త (స) సన్నిధికి రాగానే ఆయన (స) ప్రజలతో, "లేవండి! మీ సర్దారును ఆహ్వానించడానికి లేవండి" అనగా వారంతా ఆయన్ను ఆ కంచర గాడిద మీద నుండి క్రిందికి దించారు.

"ఓ సఅద్! వీరంతా మీ తీర్పు కోసం సంసిద్ధులై ఉన్నారు" అన్నారు దైవప్రవక్త (స) ఆయన దగ్గరకు రాగా.

"అయితే నేను ఇచ్చే తీర్పు అమలు చేయబడుతుందా?" ప్రశ్నించారు ఆయన.

"ఔను. మీ తీర్పే శిరోధార్యం" అన్నారు అక్కడి వారంతా.

"ముస్లిములు కూడా దీన్ని శిరసావహిస్తారా?"

"ఔను, తప్పకుండా."

"మరి ఇక్కడ ఉన్నవారు కూడానా?" ఆయన ఉద్దేశ్యం దైవప్రవక్త (స) కూడానా? అని చెప్పడం అన్న మాట. కాని దైవప్రవక్త (స) గారి మూర్తిమత్వాన్ని గమనించిన ఆయన తన ముఖాన్ని మరో వైపు ఉంచి అడిగిన ప్రశ్న అది.

"ఔను. నాకు కూడా మీ తీర్పు శిరోధార్యం" అన్నారు దైవప్రవక్త (స) అది గమనించి.

"అయితే నా తీర్పు వినండి! వారి పురుషులందరిని హతమార్చండి. స్త్రీలను, పిల్లల్ని ఖైదీలుగా చేసుకోండి. వారి ధనాన్ని పంచేయండి" తీర్పు వినిపించారు హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర).

ఈ తీర్పును విన్న దైవప్రవక్త (స) -

"ఓ సఅద్! ఏడు ఆకాశాలపైన అల్లాహ్ చేసిన తీర్పే మీరిచ్చిన తీర్పు" అని పొగిడారు.

హజ్రత్ సఅద్ (ర) గారు ఇచ్చిన తీర్పు ఎంతో వివేకంతో, న్యాయ బద్ధంగా ఇచ్చిన తీర్పు. ఎందుకంటే, బనూ ఖురైజా యూదులు, ముస్లిములు చావు బ్రతుకులు అనుభవిస్తున్న తరుణంలోనే ఓ భయంకరమైన ద్రోహానికి తలపడ్డారు. అదేకాదు, వారు ముస్లిములను కడతేర్చడానికి రెండు వేల అయిదు వందల కరవాలాలు, రెండు వేల బల్లాలు, మూడు వందల కవచాలు మరియు అయిదు వందల ఢాలులను సమకూర్చుకొని ఉన్న సమయం అది. విజయం తరువాత వాటన్నిటిని ముస్లిములు హస్తగతం చేసుకోవడం జరిగింది.

ఈ తీర్పు వెలువడిన తరువాత దైవప్రవక్త (స) గారి ఆదేశం మేరకు, బనూ ఖురైజాను మదీనాకు తెచ్చి బనూ నజ్జార్‌కు చెందిన ఓ మహిళ - ఈమె హారిస్ కుమార్తె - ఇంట ఖైదు చేయడం జరిగింది. మదీనా వీధుల్లో కందకాలు

త్రవ్వి వారిని ఒక్కొక్క బృందంగా తెచ్చి మెడలు నరికి ఆ కందకాల్లో పడ వేయడం జరుగుతోంది. ఈ పని ప్రారంభం అయిన కొంత సేపటికి మిగిలిన ఖైదీలు తమ సర్దారు కఅబ్ బిన్ అసద్‌తో, "మీ అభిప్రాయం ఏమిటి? మా ఎడల వారు ప్రవర్తించే తీరు ఎలాంటిది?" అని అడగగా అతను,

"మీకు రవ్వంత జ్ఞానమైనా ఉందా? అలా అడుగుతున్నారు. చూడడం లేదా పిలిచేవాడు పిలుస్తూనే ఉన్నాడు. వెళ్ళినవారు తిరిగి రావడమూ లేదు. దైవసాక్షి! ఇది హత్య తప్ప మరేమీ కాదు" అని అన్నాడు.

ఎలాగైతేనేమి (వారి సంఖ్య మొత్తం ఆరు మరియు ఏడు వందల లోపులో ఉంటుంది) అందరి మెడలు నరికి పూడ్చివేయడం జరిగింది.

ఈ చర్య వల్ల కుట్రదారులైన ఈ సర్పాల తలలు చితకకొట్టబడ్డాయి. వారంతా అంతమైపోయారు. వీరు దృఢమైన ఒడంబడికను త్రుంచి దాన్ని కాలరాచిన వారు. ముస్లిములను తుదముట్టించడానికి, అతి క్లిష్టమైన పరిస్థితిలో శత్రువుకు సహాయపడి పెద్ద నేరానికి పాల్పడ్డవారు వీరు. ఇప్పుడు వారి చావుకు వారే స్వయంగా కారకులయ్యారు.

బనూ ఖురైజా వినాశనానికి గురి అయిన వెంటనే బనూ నజీర్ తెగకు చెందిన సర్దారు, ఈ యుద్ధానికి సంబంధించిన పెద్ద నేరగాడు హుయ్ బిన్ అఖ్తబ్ కూడా అంతం చేయబడ్డాడు. ఇతను ఉమ్ముల్ మోమినీన్ (ముస్లిముల మాతృమూర్తి) హజ్రత్ సఫియ్యా (ర) గారి తండ్రి. ఖురైష్ మరియు గత్ఫాన్ వెనక్కు మళ్ళిపోయిన తరువాత బనూ ఖురైజా దిగ్బంధానికి గురి అయినప్పుడు వారి వెంటే అతనూ, తాను చేసిన శపథం ప్రకారం వారితోనే కోటలోనికి వెళ్ళి దాక్కున్నాడు. అహ్జాబ్ యుద్ధం జరిగే రోజుల్లో ఇతను కఅబ్ బిన్ అసద్‌ను ముహమ్మద్ (స)కు వ్యతిరేకంగా తిరగబడి ద్రోహం చేయడానికి పురికొల్పినవాడు. అతను ఇప్పుడు కఅబ్‌కు ఇచ్చిన ఆ మాటను నిలబెట్టుకుంటున్నాడు.

అతణ్ణి పట్టి దైవప్రవక్త (స) వద్దకు తీసుకువచ్చినప్పుడు తన ఒంటెపై మేలైన వస్త్రాలను తొడిగి ఉన్నాడు. వాటిని తాను స్వయంగా చుట్టూ, ఒక్కొక్క అంగుళం మేర చించుకున్నాడు. అతని ఉద్దేశ్యం, తాను మరణించిన తరువాత తన ఈ బట్టలు యుద్ధ ధనానికి పనికిరాకుండా ఉండాలి అన్నదే.

అతని రెండు చేతులు మెడ వెనుకకు వేసి కట్టబడి ఉన్నాయి. అతను దైవప్రవక్త (స)ను సంబోధిస్తూ, "వినండి! నేను మీ ఎడల శత్రుత్వం వహించి నందుకు సిగ్గుపడడం లేదు. కాని అల్లాహ్‌తో యుద్ధం చేసిన వాడు ఓడిపోక తప్పదు" అన్నాడు. ఆ తరువాత అక్కడున్న వారిని సంబోధిస్తూ :

"ప్రజలారా! అల్లాహ్ ఇచ్చిన తీర్పులో తేడా ఏదీ లేదు. ఇది మా పాలిట రాయబడిన దురదృష్టం. ఇది బనీ ఇస్రాయీల్ కోసం రాసిపెట్టి ఉంచిన పెద్ద హత్యాకాండ" అంటూ కూర్చోగా అతని తల నరికివేయబడింది.

ఈ సంఘటనలో బనూ ఖురైజాకు చెందిన ఓ స్త్రీని కూడా చంపడం జరిగింది. ఆమె హజ్రత్ ఖల్లాద్ బిన్ సువైద్ (ర) పై తిరుగల బండ విసిరి చంపిన స్త్రీ. దీనికి బదులుగా ఆమెను హతమార్చడం జరిగింది.

మహాప్రవక్త (స), నాభి క్రింద వెంట్రుకలు మొలిచిన ప్రతివాణ్ణి చంప మని ఆదేశం ఇచ్చి ఉన్నారు. అయితే అతియా కర్జీకి ఇంకా వెంట్రుకలు మొలవలేనందున ఆమెను వదలివేయడం జరిగింది. ఆ తరువాత ఆమె ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి దైవప్రవక్త (స) గారి సహచరుల్లో చేరారు.

హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (ర), 'జుబైర్ బిన్ బాతా' మరియు ఆయన కుటుంబ సభ్యులను తనకు హిబా చేయమని అర్థించగా ఆయన ఆ విన్న పాన్ని స్వీకరించి హిబా చేశారు. ఇది వరకు జుబైర్ సాబిత్‌ను ఆదుకొని ఉండ డమే దానికి కారణం. ఆ తరువాత సాబిత్ బిన్ ఖైస్ (ర) జుబైర్‌తో దైవప్రవక్త (స) నిన్నూ నీ కుటుంబాన్నీ నా కోసం హిబా చేసి ఉన్నారు. ఇప్పుడు వారం దరిని నీకు అప్పజెప్పేస్తున్నాను (అంటే వారందరిని స్వతంత్రులుగా చేస్తున్నా నని అర్థం) అన్నారు. కాని ఆ తరువాత జుబైర్‌కు తన జాతి అంతా అంతం అయిపోయిందన్న విషయం తెలియగా అతను, "జుబైర్! నేను నీకు చేసిన సహాయానికి ప్రతిగా నన్ను నా మిత్రుల్లా అంతమొందించు" అని అడగగా జుబైర్, బాతాను కూడా చంపేయడం జరిగింది. అయితే జుబైర్ కుమారుడు అబ్దుర్రహ్మాన్‌ను మాత్రం అలానే వదిలివేశారు. తరువాత ఆయన ఇస్లామ్ స్వీకరించి ముస్లిములైపోయారు. అలాగే బనూ నజ్జార్‌కు చెందిన ఓ మహిళ హజ్రత్ ఉమ్ముల్ ముంజిర్ సల్మా బిన్తె ఖైస్ చేసిన అభ్యర్థన మేరకు సమ్ వాయిల్ ఖర్జీ కుమారుడు రిఫాఅను ఆమె కోసం హిబా చేయడం జరిగింది. రిఫాఅను ఆమెకు అప్పగించారు. ఆమె రిఫాఅకు జీవితం ఒసగారు. ఆ

తరువాత ఆయన కూడా ఇస్లామ్ స్వీకరించి దైవప్రవక్త (స)కు సహచరు లయ్యారు.

మరికొందరు వ్యక్తులు ఆయుధాలు పడవేసేముందే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడం వలన వారి ఆస్తిపాస్తులు, ధన ప్రాణాలు అన్నీ సురక్షితంగానే ఉండిపోయాయి. అదే రాత్రి, బనూ ఖురైజా చేసిన కుట్రలో పాలుపంచు కోకుండా, ఒప్పందాన్ని భంగపరిచినవారికి దూరంగా ఉన్న వ్యక్తి బయటకు రాగా, పహరా కాస్తున్న కమాండరు ముహమ్మద్ బిన్ ముస్లిమా (ర) చూశారు. కాని అతణ్ణి గుర్తు పట్టి వదలివేయడం జరిగింది. ఆ తరువాత అతను ఎటు వెళ్ళిపోయాడో తెలియరాలేదు.

బనూ ఖురైజా యూదులకు చెందిన ఆస్తులు, ధన సంపద నుండి దైవప్రవక్త (స) ఖుమ్స్ తీసి అందరికీ పంచిపెట్టారు. అశ్వారూఢులకు మూడు భాగాలు ఇచ్చారు. ఆ మూడు భాగాల్లో రెండు భాగాలు గుర్రాలవి, ఒక భాగం సైనికునిది. పదాతిదళానికి ఒక భాగం పంచిపెట్టారు. ఖైదీలను, పిల్లలను హజ్రత్ సఅద్ బిన్ జైద్ పర్యవేక్షణలో నజద్‌కు పంపించి, బదులుగా గుర్రాలను, ఆయుధాలను కొనడం జరిగింది.

దైవప్రవక్త (స) తన కోసం బనూ ఖురైజా స్త్రీలలో ఒకామె హజ్రత్ రీహానా బిన్తె అమ్రూ బిన్ ఖనాఫాను ఎంచుకున్నారు. ఈమె ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, దైవప్రవక్త (స) గారి మరణం వరకు ఆయన అధీనంలోనే ఉన్నారు.[1] కాని కలబీ కథనం ప్రకారం, దైవప్రవక్త (స) ఆమెను హిజ్రీశకం ఆరులో స్వతంత్రురాలిగా చేసి వివాహమాడినట్లు ఉంది. ఆయన చివరి హజ్ (హజ్జతుల్ విదా) నుండి తిరిగి వచ్చేటప్పటికి ఆమె చనిపోయారని, ఆమెను బకీ ఖనన వాటికలో ఖననం చేశారని ఉంది.[2]

బనూ ఖురైజా పని పూర్తిగా పట్టిన తరువాత హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) గారి వేడుకోలు స్వీకరించబడే తరుణం ఆసన్నమైంది. ఈ దుఆ ఏమిటో గజ్వాయె అహ్‌జాబ్ సందర్భంలో మనం చెప్పుకున్నదే. కాబట్టి ఆయన గాయం తిరిగతోడింది. ఆయన అప్పుడు మస్జిదె నబవీలో ఉన్నారు. దైవ ప్రవక్త (స), ఆయన్ను పరామర్శించే ఉద్దేశ్యంతో అక్కడనే ఓ గుడారం వేయించి ఉంచారు. హజ్రత్ ఆయిషా (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, ఆయన

1. ఇబ్నె హష్షామ్-2/245 2. తల్ఖీహుల్ ఫహూమ్-పుట. 12

గాయం పగిలి రక్తం స్రవించనారంభించింది. ఆ మసీదులోనే బనూ గిఫ్ఫార్‌కు చెందిన కొన్ని గుడారాలు కూడా ఉన్నాయి. ఆ రక్తం స్రవించి వారి వైపునకు రానారంభించినందున దాన్ని చూసి భయపడ్డారు. వారు గుడారవాసులతో, "ఓ గుడారవాసులారా! ఇదేమిటీ మన వైపునకు వస్తున్నది, కొంచెం చూడండి" అని అరిచారు. చూడగా అది హజ్రత్ సఅద్ (ర) గారి గాయం నుండి స్రవించి వస్తున్న రక్తం. ఆ రక్తస్రావం వల్లనే ఆయన మరణం సంభవించింది.[3]

సహీ హైన్ గ్రంథాల్లో ఉటంకించిన హజ్రత్ జాబిర్(ర) గారి ఉల్లేఖ నంలో మహాప్రవక్త (స) ఇలా ప్రవచించారని ఉంది:

"సఅద్ బిన్ ముఆజ్ (ర) గారి మరణంతో రహ్మాన్ సింహాసనం కదిలిపోయింది."[4] ఇమామె తిర్మిజీ, హజ్రత్ అనస్ (ర) గారి ఉల్లేఖనాన్ని ఉటంకించి అది ప్రామాణికమైనదని చెబుతూ, హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ జనాజాను (శవపేటికను) ఎత్తినప్పుడు మునాఫిక్‌లు ఆశ్చర్యంగా, వీరి జనాజా ఇంత తేలిగ్గా ఉందేమిటీ అని అన్నారు. దానికి మహాప్రవక్త (స), దాన్ని దైవ దూతలు ఎత్తుకున్నారు (కాబట్టి అది మీకు తేలికగా అనిపిస్తోంది) అని అన్నారు.[5]

బనూ ఖురైజా దిగ్బంధం జరుగుతున్న సమయంలోనే ఓ ముస్లిమ్ అమరగతి పొందాడు. ఆయన పేరు ఖల్లాద్ బిన్ సువైద్ (ర). ఈయనపై బనీ ఖురైజాకు చెందిన ఓ స్త్రీ తిరుగలి బండను ఎత్తి పడేసి చంపేసింది. ఈయన కాకుండా హజ్రత్ అక్కాషా (ర) గారి సోదరుడు అబూ సనాన్ బిన్ ముహ్సిన్ కూడా ఈ దిగ్బంధం సందర్భంగానే మరణించారు.

అబూ లుబాబా (ర) గారి విషయానికొస్తే, ఆయన ఆరు రాత్రిళ్ళు తనను తాను మస్జిద్ కంబానికి వేసి కట్టుకునే ఉన్నారు. ఆయన భార్య నమాజు సమయం కాగానే వచ్చి ఆయన కట్లను విప్పేసేవారు. నమాజు పూర్తి అయిన తరువాత తిరిగి ఆయన తనను ఆ కంబానికి వేసి కట్టుకునేవారు. ఆ తరువాత మహాప్రవక్త (స) పై తౌబా సూరా అవతరించింది. ఆ సమయంలో ఆయన (స) ఉమ్మె సల్మా (ర) గారి ఇంట ఉన్నారు. అబూ

3. సహీ బుఖారి-2/591
4. సహీ బుఖారి-1/536; సహీ ముస్లిమ్-2/294; జామయె తిర్మిజీ-2/225
5. జామయె తిర్మిజీ-2/225

లుబాబా (ర) స్వయంగా ఈ సంఘటన గురించి చెబుతూ, హజ్రత్ ఉమ్మె సల్మా (ర) గారు తన గది ద్వారం వద్ద నిలబడి నాతో, "ఓ అబూ లుబాబా! సంబరపడు. అల్లాహ్ నీ తౌబాను స్వీకరించాడు" అన్నారు. అక్కడ దాపులో ఉన్న సహాబా (ర)లు ఇది విని ఆయన కట్లు ఊడదీయడానికి పరుగున వచ్చారు. కాని ఆయన వారు తన కట్లను విప్పడాన్ని అంగీకరించలేదు. నా కట్లను దైవప్రవక్త (స) తప్ప మరెవ్వరూ విప్పడానికి వీల్లేదు అని అన్నారు. మహాప్రవక్త (స) ఆయన ప్రక్క నుండి పోతున్నప్పుడు తన స్వహస్తాలతో ఆయన కట్లు విప్పి స్వతంత్రులుగా చేశారు.

ఈ గజ్వా జీఖాదా నెలలో సంభవించిన గజ్వా. దాదాపు ఇరవై అయిదు రోజుల వరకు యూదుల్ని దిగ్బంధించి ఉంచడం జరిగింది.[6] అల్లాహ్ ఈ గజ్వా మరియు గజ్వయె అహ్జాబ్ గురించిన వివరాలను తెలుపుతూ అల్ అహ్జాబ్ సూరాలో అనేక ఆయత్‌లు అవతరింపజేశాడు. ఈ రెండు పోరాటాలకు సంబంధించిన విషయాలను విడమర్చి చెప్పాడు అందులో. మోమిన్‌లు (విశ్వాసులు) మరియు మునాఫిక్‌ల (కపట ముస్లిముల) పరిస్థితుల్ని వివరించాడు. విరోధి పక్షానికి సంబంధించిన వర్గాల్లో చీలిక ఎలా ఏర్పడిందో, వారు భయానికి ఎలా లోనయ్యారో వివరించి చెప్పాడు. అదే కాకుండా గ్రంథవహుల (యూదుల) వాగ్దానభంగం వల్ల ఎలాంటి ఫలితాలు చోటుచేసుకున్నాయో వివరించాడు.

6. ఇబ్నె హష్షామ్-2/237, 238. గజ్వా వివరాల కోసం చూడండి, ఇబ్నె హష్షామ్-2/233-237 వరకు. సహీ బుఖారి-2/590, 591; జాదుల్ ముఆద్-2/72, 74. ముక్తతుస్సీరత్- షేక్ అబ్దుల్లాహ్, పుట. 287, 288, 289, 290.

అహ్జాబ్ మరియు ఖురైజా పోరాటాల తదుపరి సైనిక చర్యలు

1. సలామ్ బిన్ అబిల్ హకీక్ సంహారం

సలామ్ బిన్ అబిల్ హకీక్ - ఇతని మారు పేరు అబూ రాఫె కూడా - యూదులకు చెందిన ఓ దుష్టుడు. ఇతను ముష్రిక్కులను ముస్లిములకు వ్యతిరేకంగా ఉసికొల్పిన నేరస్తుడు. అలాగే ముష్రిక్కులకు ధనధాన్యాలు సరఫరా చేసి ఆదుకున్నవాడు.[1] దానికితోడు, అతను దైవప్రవక్త (స)ను బాధించే వాడు కూడా. ముస్లిములు బనూ ఖురైజా దిగ్బంధం నుండి వెనక్కు మరలి వచ్చిన తరువాత ఖజ్రజ్ తెగవారు దైవప్రవక్త (స)ను అతణ్ణి అంత మొందించే అనుమతి కోరారు. ఇంతకు పూర్వం కఅబ్ బిన్ అష్రఫ్‌ను అవస్ తెగవారు సంహరించి ఉన్నందున ఈ తెగ ఖజ్రజ్ కూడా అలాంటిదే ఓ ఘన కార్యం చేయాలని ఉవ్విళ్ళూరుతూ ఉంది. అందుకనే వారు దైవప్రవక్త (స)ను అనుమతి కోరడంలో తొందరపడడం జరిగింది.

మహాప్రవక్త (స) వారికి అనుమతి అయితే ఇచ్చారుగాని వారిని హెచ్చ రిస్తూ వారి స్త్రీలు, పిల్లల జోలికి మాత్రం పోవద్దని తాకీదు చేశారు. ఆ తరు వాత అయిదుగురు యువకులతో కూడిన బృందం ఒకటి ఆ దుష్టుణ్ణి సంహ రించడానికి బయలుదేరి వెళ్ళింది. వీరంతా ఖజ్రజ్ తెగకు చెందిన బనూ సల్మాకు సంబంధించినవారే. వీరి కమాండరు హజ్రత్ అబ్దుల్లా బిన్ అతీక్ (ర).

ఈ వర్గం నేరుగా ఖైబర్ వైపునకు బయలుదేరింది. ఎందుకంటే, అబూ రాఫె కోట అక్కడనే ఉంది కనుక. వీరు దాని దాపునకు చేరేటప్పటికి ప్రొద్దు క్రుంకింది. ప్రజలు తమ పశువులను తోలుకొని కోటలోనికి వెళ్ళిపోయారు. అబ్దుల్లా బిన్ అతీక్ (ర) తన అనుచరులతో, "మీరు ఇక్కడనే ఆగండి. నేను

1. చూడండి, ఫతహుల్ బారి - 7/343

వెళ్ళి కోటను రక్షిస్తున్నవానితో ఏదో సాకు చెప్పి లోనికి వెళ్ళిపోతాను, బహుశా లోనికి వెళ్ళే మార్గం ఏదైనా అగుపడవచ్చు" అన్నారు. ఆ తరువాత ఆయన కోట గుమ్మం దగ్గరగా వెళ్ళి, తన తలపై ఓ వస్త్రాన్ని కప్పుకొని మల విసర్జనం చేసేవాని వలె ప్రక్కన కూర్చున్నారు. పహరా కాచేవాడు అది చూసి బిగ్గరగా, "ఓ మనిషీ! లోపలికి వచ్చేయదలుచుకుంటే త్వరగా వచ్చేయి. నేను ద్వారా లను మూసేస్తున్నాను" అని ఆయన్ను పిలిచాడు.

ఇదే అదనుగా హజ్రత్ అబ్దుల్లా బిన్ అతీక్ లోనికి వెళ్ళిపోయారు. ఆయన కథనం ప్రకారం, "నేను లోనికి చొరబడి ఓ మూలన ఎవరూ చూడ కుండా నక్కాను. అందరూ లోనికి వచ్చేసిన తరువాత ఆ భటుడు తలుపులు మూసి దాని తాళపు చెవులను ఓ గోడపై ఉన్న ఓ శీలకు తగిలించాడు. (అన్ని వైపుల సద్దుమణిగిన తరువాత) ఆ తాళపు చెవులను తీసుకొని కోట ద్వారం తెరిచేశాను. అబూ రాఫె తన ఇంటి పై అంతస్తులో ఉంటున్నాడు. అక్కడనే అతని సభ కూడా జరిగేది. సభికులంతా వెళ్ళిపోయిన తరువాత నేను పై అంతస్తు పైకి ఎక్కనారంభించాను. ఏ తలుపు అడ్డం వచ్చినా దాన్ని తెరుస్తూ, తిరిగి లోన్నుండి గడియవేసుకుంటూ వెళుతున్నాను. అక్కడున్న వారు నన్ను కనుగొన్నప్పటికి వారు నా దగ్గరకు వచ్చి చేరే లోపలే అబూ రాఫెను సంహ రిద్దాం అనే ఉద్దేశ్యంతో అలా ముందుకు వెళుతూనే ఉన్నాను. చివరికి నేను అతని దాపునకు చేరగానే చూద్దును కదా, అతను తన భార్యాపిల్లలతో ఓ చీకటి గదిలో ఉన్నాడు. అతను ఆ గదిలో ఏ మూలన ఉన్నాడో నాకు అగు పడడం లేదు. అందుకని నేను అతను ఎక్కడున్నాడో తెలుసుకునే ఉద్దేశ్యంతో ఓ అబూ రాఫె అని పిలిచాను. అతను నా పిలుపుకు సమాధానంగా 'ఎవరూ?' అని అనగానే ఆ శబ్దం వైపునకు కదిలి అటు వైపు ఓ ఖడ్గప్రహారాన్ని చేశాను. అయితే నేను ఆ సమయంలో అయోమయ స్థితిలో ఉన్నందున ఏమీ చేయలేకపోయాను (అంటే నేనేసిన ఖడ్గ ప్రహారం అతనిపై పడలేదన్నమాట). అటు అతను ఓ పెద్ద గావుకేక పెట్టగా నేను ఆ గది నుండి వెంటనే బయటకు వచ్చేశాను. తిరిగి (నా గొంతును మార్చి), అబూ రాఫె ఏమిటా కేక అని అన్నాను. అతను, "నీ తల్లి నాశనం గాను! ఇప్పుడే ఎవరో నాపై కత్తి వ్రేటు వేశాడు" అని అన్నాడు. అతను మాట్లాడుతూ ఉండగా ఆ శబ్దం వైపునకు వెళ్ళి మరొక కత్తిపోటు వేశాను. ఆ దెబ్బతో అతను రక్తసిక్తమైపోయాడు. అయితే

ఇంకా నేనతణ్ణి చంపలేకపోయాను. అందుకని నా ఖడ్గం మొన అతని కడుపు మీద వేసి అదమగా అది పొట్టలో దూరి వీపు వైపు నుండి బయటకు వచ్చేసింది. అప్పుడు నాకు నమ్మకం కుదిరింది అతను చనిపోయాడని. ఆ తరువాత నేను ఒక్కొక్క తలుపును తెరుచుకుంటూ బయటకు వచ్చి మెట్ల దగ్గర నేను భూమి మీద ఉన్నాననే ధ్యాసతో అడుగు ముందుకు వేశాను. వెంటనే క్రిందపడిపోగా నా చీలమండ ఎముక తొలిగిపోయింది. నేను దాన్ని నా తలపాగా వేసి గట్టిగా చుట్టి తలుపు దగ్గరగా వచ్చి కూర్చున్నాను. అబూ రాఫె చనిపోయిన విషయం తెలియనంత వరకు నేను ఇక్కడి నుండి కదలవద్దని తీర్మానించుకున్నాను. కోడి కూసిన తరువాత మరణ వార్తను చాటేవాడు కోటపైకెక్కి పెద్దగా, "ఓ హిజాజ్ వర్తకులారా! అబూ రాఫె చనిపోయాడని" ప్రకటించగా అప్పుడు నేను నా సహచరుల వద్దకు వచ్చి చేరాను. పదండి, ఇక్కడి నుంచి పారిపోదాం అని చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోయాం. అల్లాహ్ అబూ రాఫెను అతని దురాగతాలకు శిక్ష వేశాడు. మేము దైవప్రవక్త (స) సన్నిధికి చేరి విషయమంతా విన్నవించుకున్నాము. ఆయన నా కాలును చాపమని చెప్పగా నేను నా కాలుని బార్లా చాపాను. దైవప్రవక్త (స) తన చేతితో దానిపై నిమిరారు, వెంటనే నా బాధ మటుమాయమైపోయింది."[2]

ఇది సహీ బుఖారి ఉల్లేఖనం. అయితే ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖనం మరోలా ఉంది. అదేమిటంటే, అబూ రాఫె ఇంట అయిదుగురు సహాబాలు చొరబొడ్డారు. వారంతా అతని హత్యలో పాల్గొన్నవారే. ఏ సహాబీ (ర) అయితే అబూ రాఫె పొట్టపై తన కరవాలాన్ని వేసి అదిమి చంపారో ఆయన హజ్రత్ అబ్దుల్లా బిన్ అనీస్ (ర).

ఈ ఉల్లేఖనంలో, వారంతా రాత్రి సమయంలో అబూ రాఫెను చంపినప్పుడు, హజ్రత్ అబ్దుల్లా బిన్ అతీక్ (ర) గారి పిక్క ఎముక విరిగిపోయింది. ఆయన్ను వారు మోసుకొని కోట గోడలో నుండి ఓ నీటి కాలువ పోతుంటే అందు చొరబడి దాక్కున్నారు అని ఉంది. యూదులు కాగడాలు ముట్టించి అన్ని వైపులా తిరిగి చూసి ఎవరూ కనబడకపోయేసరికి తిరిగి హతుని వద్దకు వెళ్ళగా సహాబా (ర) హజ్రత్ అబ్దుల్లా బిన్ అతీక్ (ర)ను మోసుకొని దైవప్రవక్త (స)వద్దకు గొనివచ్చారు.[3]

---

2. సహీ బుఖారి-2/577

3. ఇబ్నె హష్షామ్-2/274, 275

ఈ సరియ్యా జీఖాదా లేదా జీహజ్జా మాసం, హిజ్రీ శకం 5లో జరిగింది.[4]

దైవప్రవక్త(స)కు అహ్జాబ్ మరియు ఖురైజా పోరాటాల నుండి తీరిక లభించింది. యుద్ధ నేరస్తులకు తగిన శిక్ష కూడా లభించింది. ఇక శాంతి భద్రతలకు అడ్డుగా నిలిచి ఉన్న బద్దూల పనిపట్టవలసి ఉంది. ఈ బద్దూలు ఓ మహాశక్తి భయం లేకపోతే తమ ఆగడాలను కట్టిపెట్టేవారుకారు మరి. కాబట్టి దైవప్రవక్త (స) వారి వైపునకు దృష్టిని సారించారు. ఇప్పుడు బద్దూలకు వ్యతిరేకంగా చేపట్టిన సైనిక చర్యలను గురించి చెప్పుకుందాం.

2. ముహమ్మద్ బిన్ ముస్లిమా సరియ్యా

అహ్జాబ్ మరియు ఖురైజా యుద్ధాల నుండి తీరిక లభించిన తరువాత చేపట్టిన ప్రథమ సరియ్యా ఇది. ఈ సైనిక చర్యలో కేవలం ముప్పై మంది ముస్లిం యోధులే పాల్గొన్నారు.

ఈ సైనికుల్ని 'నజద్'లోని 'బక్రాత్' ప్రాంతం దాపులో ఉన్నటువంటి 'ఖర్తా' అనే పేరుగల ప్రదేశానికి పంపించడం జరిగింది. 'ఖర్తా', 'జరియా'కు దాపులో ఉంది. జరియా, మదీనాకు ఏడు రాత్రుల ప్రయాణ దూరంలో ఉంది. ఈ సైనిక పటాలం ముహర్రం పదవ తేదీ (హి.శ. ఆరు)న బయలు దేరింది. వీరి లక్ష్యం బనూ బక్ర్‌కు చెందిన ఓ తెగ 'కిలాబ్'. ముస్లిములు ఆ తెగపై దాడి చేయగా వారంతా పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు. వారి గొర్రెలను, పశువులను తోలుకొని ముస్లిములు ముహర్రం నెల పూర్తికావడానికి ఇంకా ఒక రోజు మిగిలి ఉండగానే మదీనాకు చేరుకున్నారు. వీరు తమ వెంట బనూ హనీఫా సర్దారు సమామా బిన్ అసాల్ హనఫీని కూడా బంధించి తెచ్చారు. అతను మారు వేషంలో, ముసైలమా కజ్జాబ్ ఆదేశం మేరకు దైవప్రవక్త (స)ను హతమార్చడానికి బయలుదేరినవాడు.[5] మదీనాకు గొనివచ్చి మస్జిదె నబవీ కంబానికి కట్టిపడేశారు. మహాప్రవక్త (స) అతని వద్దకు వచ్చి, 'సమామా! నీవు ఏ ఉద్దేశ్యంతో వచ్చినట్లు?" అని అడిగారు.

"ఓ ముహమ్మద్ (స)! నేను సదుద్దేశ్యంతో వచ్చినవాణ్ణి. తమరే గనక నన్ను చంపేస్తే కేవలం ఎలాంటి తప్పు చేయనివాని రక్తం చిందించినట్లవు

---

4. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/233. ఇంకా ఈ వివరాలు గజ్వాయె అహ్జాబ్‌కు సంబంధించిన ఇతర ఆధారాల నుండి సేకరించబడినవి.

5. సీరతె హల్బియా-2/297

తుంది. ఒకవేళ తమరే నన్ను వదిలేస్తే నాపై దయజూపినవారవుతారు. ధన సంపదే కావలసి వస్తే అడగండి, ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను" అని అన్నాడు.

అది విన్న దైవప్రవక్త (స) అతణ్ణి ఆ పరిస్థితిలోనే ఉంచి వెళ్ళిపోయారు. రెండోసారి అతని వద్ద నుండి వెలుతూ ఇదివరకు అడిగినట్లే అడిగారు దైవ ప్రవక్త (స) సమామానుద్దేశించి. అతను క్రితం ఇచ్చిన సమాధానమే ఇచ్చాడు. మూడోసారి అటుగా వెలుతూ తిరిగి సమామాను అదే ప్రశ్న అడిగారు. అతను ఈసారి కూడా అదే సమాధానాన్ని రెట్టించాడు. ఆ తరువాత మహాప్రవక్త (స) తన అనుచరులతో అతణ్ణి స్వతంత్రుణ్ణి చేసెయ్యండి అనగా వారు అతణ్ణి బంధవిముక్తునిగా చేశారు. సమామా మస్జిదె నబవీ ప్రక్కన ఉన్న తోటలోనికి వెళ్ళి స్నానం చేసి తిరిగి దైవప్రవక్త (స) గారి సన్నిధికి వచ్చి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమ్ అయిపోయారు. ఆ తరువాత ఆయన దైవప్రవక్త (స)తో, "ఓ ప్రవక్తా (స)! దైవసాక్షి! ఒకప్పుడు ఈ భూమండలం మీద ఏ ముఖమూ నాకు మీ ముఖం కంటే కంటకంగా ఉండ లేదు. కాని ఇప్పుడు, తమ ముఖార విందం ఇతర ముఖాలన్నిటికంటే అత్యంత ప్రియమైనదైనది. అలాగే దైవ సాక్షిగా చెబుతున్నాను. క్రితం, ఈ భూమండలం మీద ఏ ధర్మం నా దృష్టిలో ఇస్లామ్ కంటే కంటగింపుగా ఉండలేదు. కాని ఇప్పుడు తమ ధర్మం ఇతర ధర్మాలన్నిటికంటే అత్యంత ప్రియమైపోయినది, తమ ఉష్ట్రారోహులు నన్ను బంధించినప్పుడు నేను ఉమ్రా చేసే సంకల్పం చేసి ఉన్నాను" అన్నారు. మహాప్రవక్త (స) ఆయనకు శుభవార్తనందిస్తూ 'ఉమరా' చేసి రమ్మని పంపించేశారు. సమామా ఉమ్రా కోసం మక్కా వెళ్ళగా ఆయన్ను చూసి ఖురైషులు, "నీవు ధర్మభ్రష్టుడవై పోయావని తెలిసిందే!" అని అడిగారు. దానికి సమాధా నంగా ఆయన, "కాదు! నేను ముహమ్మద్ (స) చేతిమీదుగా ముస్లిమునై పోయాను. జాగ్రత్తగా వినండి! దైవసాక్షిగా చెబుతున్నాను, మీ వద్దకు యమామా నుండి ఒక్క గోధుమ గింజను సయితం రానివ్వను, దైవప్రవక్త (స) అనుమతిస్తే తప్ప."

యమామా వాసులు మక్కా ప్రజలకు పంట చేనులాంటివారు. హజ్రత్ సమామా తన స్వదేశానికి తిరిగివెళ్ళి మక్కాకు వెళ్ళే ధాన్యాన్ని పోకుండా అడ్డు కున్నారు. ఇది ఖురైషుల కోసం మరిన్ని కష్టాలను తెచ్చిపెట్టింది. ఖురైషులు దైవప్రవక్త (స) వద్దకు వచ్చి ఆయనతో తమకు గల బంధుత్వాన్ని

గుర్తుచేస్తూ ఆ ధాన్యాన్ని తిరిగి పంపించమని అర్థించారు. దైవప్రవక్త (స) దాన్ని మన్నించి తిరిగి ధాన్యం పంపించే ఆదేశం ఇచ్చారు సమామా (ర)కు.[6]

3. గజ్వయె బనూ లహియ్యాన్

గతంలో రజీ అనే ప్రదేశంలో సహాబా (ర)లను చుట్టుముట్టి వారిలో ఎనమండుగురిని మోసంతో హతమార్చినవారే బనూ లహియ్యాన్ తెగవారు. ఇద్దరిని మక్కావాసులకు బానిసలుగా అమ్మేయగా వారిని నిర్దయగా చంపడం జరిగింది. కాని వీరు నివసించే ప్రాంతం హిజాజ్‌లో చాలా దూరాన మక్కా పొలిమేరలకు దాపున ఉన్నందున, ఆ పరిస్థితుల్లో ముస్లిములకు, బద్దూలకు నడుమ తీవ్రమైన సంఘర్షణ చోటు చేసుకొని ఉండడం మూలంగానూ మహాప్రవక్త (స) ఆ ప్రాంతంలో చాలా దూరంగా ఉన్న తమ పెద్ద శత్రువు దాపుకు వెళ్ళడం సరికాదని తలుస్తూ ఉండేవారు. కాని దైవతిరస్కారుల వివిధ తెగల్లో చీలిక ఏర్పడి, వారు బలహీనపడిన తరువాత ఆ పరిస్థితులను ఆసరాగా చేసుకొని, ఇప్పుడు బనూ లహియ్యాన్ తెగతో తమ హతుల ప్రతీ కారాన్ని తీర్చుకోడానికి అవకాశం ఏర్పడింది.

కాబట్టి మహాప్రవక్త (స) రబీ ఉల్ అవ్వల్ లేదా జమాదిల్ ఊలా (హి.శ. ఆరు)లో రెండు వందల సహాబా (ర)లను వెంటబెట్టుకొని బనూ లహియ్యాన్ వైపునకు బయలుదేరారు. మదీనా బాధ్యతలను హజ్రత్ ఉమ్మె మక్తూమ్ (ర)కు అప్పగిస్తూ, "మేము సిరియా వైపు వెలుతున్నామని" చెప్పి అమ్జ్ మరియు అస్ఫాన్ నడుమన గల 'బత్నెగరాన్' పేరుగల ఓ లోయలో వచ్చి దిగారు- అక్కడే ఇదివరకు తన సహాబీలను సంహరించడం జరిగింది- అక్కడే ఆయన ఆ హతుల మన్నింపు కోసం అల్లాహ్‌ను వేడుకోవడం జరిగింది. అటు బనూ లహియ్యాన్‌కు దైవప్రవక్త (స)గారి రాక గురించిన వర్తమానం అందగా వారు పారిపోయి కొండ శిఖరా లపై తలదాచుకున్నారు. వారికి చెందిన ఏ వ్యక్తీ పట్టుబడలేదు. దైవ ప్రవక్త (స) రెండు రోజులు వారి ప్రాంతంలోనే విడిది చేశారు. ఈలోపు ఆయన మరికొన్ని సరియ్యాలను (సైనిక పటాలాలను) పంపించి వెదికిం చారు. కాని వారు దాగి ఉండడం కారణంగా పట్టుబడలేదు. ఆ తరువాత ఆయన 'గస్ఫాన్' వైపునకు బయలుదేరారు.

6. జాదుల్ ముఆద్-2/119; ముఖ్తరుసీరత్-షేక్ అబ్దుల్లాహ్-పుట. 292, 293.

అక్కడ నుండి పది మంది అశ్వారోహకులను 'కరాగుల్ గమీమ్' వైపునకు ఖురైషులకు తమ రాక తెలిసిరావాలనే ఉద్దేశ్యంతో పంపించారు. ఆ తరువాత దైవప్రవక్త (స) అక్కడ పూర్తిగా పదునాలుగు రోజులు గడిపి మదీనాకు వచ్చేశారు.

ఈ సైనిక చర్య నుండి తిరిగివచ్చి మహాప్రవక్త (స) ఒకదాని తరువాత మరొకటి సరియ్యాలను, సైనిక పటాలాలను పంపించడం జరిగింది. వాటి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

4. సరియ్య గమర్

రబీఉల్ అవ్వల్ లేదా రబీఉల్ ఆఖిర్ మాసం (హి.శ. ఆరు)లో హజ్రత్ అక్కాషా బిన్ ముహ్సిన్ (ర) గారి వెంట నలభై మందిని ఇచ్చి 'గమర్' వైపునకు పంపించడం జరిగింది. 'గమర్' బనూ అసద్‌కు చెందిన ఓ ఊట బావి పేరు. ముస్లిముల రాకను గమనించిన శత్రువులు పారిపోయారు. ముస్లిములు వారికి చెందిన రెండొందల ఒంటెలను తోలుకొని మదీనాకు వచ్చారు.

5. సరియ్యయె జుల్‌ఖస్సా-1

అదే నెల రబీ ఉల్ అవ్వల్ లేదా రబీ ఉల్ ఆఖిర్ (హి.శ. ఆరు)లో హజ్రత్ ముహమ్మద్ బిన్ ముస్లిమా (ర) గారి నేతృత్వంలో పది మంది యోధుల ఓ పటాలాన్ని 'జుల్‌ఖస్సా' వైపునకు పంపడం జరిగింది. ఈ ప్రదేశం బనూ సఅలబాకు చెందిన ప్రదేశం. శత్రువులు మొత్తం వంద మంది. వీరంతా పారిపోయి దాక్కున్నారు. సహబా (ర) లందరూ నిశ్చింతగా నిద్రపోతు నప్పుడు శత్రువులను హఠాత్తుగా దాడిచేసి వారిని హతమార్చారు. ఈ దాడిలో కేవలం ఒక ముహమ్మద్ బిన్ ముస్లిమా (ర) గారు ఒక్కరే గాయపడి ప్రాణాలు దక్కించుకోగలిగారు.

6. సరియ్యయె జుల్‌ఖస్సా-2

ముహమ్మద్ బిన్ ముస్లిమా సహచరులు అమరగతి పొందిన తరువాత రబీ ఉల్ అవ్వల్ నెల (హి.శ.6) లోనే దైవప్రవక్త (స) హజ్రత్ అబూ ఉబైదా (ర) గారి నేతృత్వంలో ఓ సైనిక పటాలం ఇచ్చి 'జుల్‌ఖస్సా' వైపునకు పంపిం చడం జరిగింది. ఆ సైనిక పటాలంలో మొత్తం నలభై మంది సహాబాలు పాల్గొన్నారు. వీరంతా క్రితం సహబా (ర)లు అమరగతి పొందిన ప్రదేశానికి

చేరి ఒక్కసారిగా దాడి చేశారు. కాని బనూ సఅలబా వీరికి చిక్కకుండా ఎంతో వేగంగా కొండల్లోకి పోయి దాక్కున్నారు. కేవలం ఒక వ్యక్తి మాత్రమే పట్టు బడ్డాడు. ఆ తరువాత అతను ఇస్లామ్ ధర్మం స్వీకరించి ముస్లిము అయి పోయాడు. అయితే వారి మేకలు, గొర్రెలు, ఇతర పశువులన్నీ ముస్లిముల చేతికి చిక్కాయి.

7. సరియ్యయె జమూమ్

ఈ సరియ్యా జైద్ బిన్ హారిసా (ర) గారి నేతృత్వంలో, రబీ ఉల్ ఉఖ్రా (హి.శ.6) లోనే జమూమ్ వైపునకు పంపబడిన సరియ్యా. జమూమ్ అనేది మర్రజ్ జహ్రాన్ (ప్రస్తుతం వాదియె ఫాతిమా)లోని ఓ ఊట బావి పేరు. హజ్రత్ జైద్ (ర) అక్కడికి చేరగా ఆ తెగకు చెందిన ఓ మహిళ 'హలీమా' వారికి చిక్కింది. ఆమె బనూ సులైమ్ ఉంటున్న ఓ ప్రదేశాన్ని చూపించింది. ఆ సరియ్యాలో ముస్లిముల చేతికి అనేక పశువులు, మేకలు మరియు ఖైదీలు చిక్కారు. హజ్రత్ జైద్ (ర) వారందరిని వెంటబెట్టుకొని మదీనాకు తిరిగి వచ్చేశారు. మహాప్రవక్త (స) ఆముజనీ మహిళను స్వతంత్రురాలుగా చేసి ఓ ముస్లిముకిచ్చి వివాహం చేశారు.

8. సరియ్యయె ఈస్

ఈ సరియ్యా నూటా డెబ్బై మంది ఉష్ట్రారోహుల సైన్యంతో కూడిన సరియ్యా. దాని నేతృత్వం కూడా హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర) గారే నిర్వహిం చారు. జమాదిల్ ఊలా (హి.శ.6)లో ఈ పటాలాన్ని 'ఈస్' అనే ప్రదేశం వైపు నకు పంపించారు దైవప్రవక్త (స). ఈ సైనిక చర్యలో ఖురైషులకు చెందిన ఓ వర్తక బిడారం చేతచిక్కింది. ఈ బిడారం దైవప్రవక్త (స) గారి అల్లుడు హజ్రత్ అబుల్ ఆస్ (ర) గారి నేతృత్వంలో ప్రయాణిస్తోంది. అప్పటికి హజ్రత్ అబుల్ ఆస్ ఇస్లామ్ స్వీకరించి ఉండలేదు. ఆయన పట్టుబడలేదు. నేరుగా మదీనాకు పారిపోయి వచ్చి హజ్రత్ జైనబ్ (ర) గారి సంరక్షణ పొందారు. ఆమెతో, దైవప్రవక్త (స) గారికి చెప్పి ఆ వర్తక బిడారానికి సంబంధించిన సొత్తును తిరిగి ఇవ్వమని సిఫార్సు చెయ్యమని కోరారు. ఆమె మహాప్రవక్త (స)కు ఈ విషయం గురించి విన్నవించుకోగా ఆయన ఎలాంటి ఒత్తిడి చేయకుండా సహాబాను ఆ సొత్తును తిరిగి ఆయనకు ఇచ్చేయమని సైగ

చేశారు. సహాబా పూర్తి వ్యాపార సామగ్రిని ఆయనకు అప్పజెప్పడం జరిగింది. ఆ తరువాత అబుల్ ఆస్ (ర) మక్కాకు వెళ్ళి ఆ సామగ్రిని వారి యజమానులకు అప్పజెప్పేశారు. పిదప ముస్లిమై మదీనాకు తిరిగి వచ్చేశారు. మహాప్రవక్త (స) మొదటనే హజ్రత్ జైనబ్ (ర) నిచ్చి ఆయన నికాహ్ చేశారు. ఇది ప్రామాణికమైన హదీసు ద్వారా రుజువైన విషయం.[7]

మహాప్రవక్త (స) మొదటనే నికాహ్ ఆధారంగా ఆమెను ఆయనకు అప్పజెప్పడం జరిగింది అంటే, అప్పటి వరకు దైవధిక్కారులకు ముస్లిమ్ మహిళలను నిషిద్ధం చేసే ఆదేశం అవతరించకపోవడమే. ఓ హదీసులో, దైవ ప్రవక్త (స) క్రొత్తగా నికాహ్ చేసి ఆయనకు అప్పజెప్పిన విషయం ఏదైతే చెప్పబడినదో లేదా ఆరు సంవత్సరాల తరువాత ఆయన వెంట పంపించడం జరిగిందో అర్థరహితమైనది, ఆధారంలేని విషయం.[8] అదే కాదు, ఈ రెండు హదీసులు బలహీనమైనవి.

9. సరియ్యయె తర్ఫ్ లేదా తర్ఖ్

ఈ సరియ్యా కూడా హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర) గారి నేతృత్వంలో, జమాదిల్ ఆఖిరా మాసంలో 'తర్ఫ్' లేదా 'తర్ఖ్' చోటికి పంపబడిన సరియ్యా. ఈ ప్రదేశం బనూ సాలిబా ప్రాంతంలో ఉంది. హజ్రత్ జైద్ (ర) కేవలం పదిహేను మంది యోధులు మాత్రమే ఉన్నారు. కాని బద్దూలు వీరి రాకను పసికట్టి పారిపోయారు. మహాప్రవక్త (స) గారే స్వయంగా వస్తున్నారని వారు తలచారు. హజ్రత్ జైద్ (ర) గారి చేతికి కేవలం నాలుగు ఒంటెలు మాత్రమే చిక్కాయి. ఆయన నాలుగు రోజులు అయిన తరువాత మదీనాకు తిరిగి వచ్చేశారు.

10. సరియ్యయె వాదియె ఖురా

ఈ సరియ్యా పన్నెండు మంది యోధులతో కూడుకున్నది. దీని కమాండరు కూడా హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర) గారే. ఆయన రజబ్ నెల (హి.శ.6)లో వాదియె ఖురా (ఖురా లోయ) వైపునకు బయలుదేరారు. దీని

7. చూడండి, సునన్ అబీ దావూద్-షరహ్ ఔనుల్ మాబూద్.
8. ఈ రెండు హదీసుల గురించి తెలుసుకోవాలంటే చూడండి, తొహ్ఫయల్ అహ్వజీ-2/195-196

లక్ష్యం శత్రువు కార్యకలాపాల్ని గమనించడం. కాని వాదియె ఖురావాసులు వీరిపై దాడి చేయగా తొమ్మిది మంది సహాబాలు అమరగతి పొందారు. ముగ్గురు తప్పించుకోగలిగారు. వీరిలో హజ్రత్ జైద్ (ర) ఒకరు.[9]

11. సరియ్యు ఖబ్త్

ఇది రజబ్ నెల (హి.శ.8) లో జరిగినట్లు చెప్పబడుతోంది. కాని సందర్భాన్ని బట్టి చూస్తే ఇది హుదైబియా ఒప్పందానికి ముందు జరిగిన సంఘటన. హజ్రత్ జాబిర్ (ర) గారి ఉల్లేఖనం ఇలా ఉంది ఈ విషయంలో :

"దైవప్రవక్త (స) మా వెంట మూడొందల మంది ఉష్ట్రారోహుల పటాలం ఇచ్చి పంపించారు. మాకు కమాండరు హజ్రత్ అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (ర). ఖురైషులకు చెందిన ఓ వర్తక బిడారం ఆచూకీ తెలుసుకోవడానికి మమ్మల్ని పంపించడం జరిగింది. మేము ఈ సైనిక కార్యం సందర్భంగా ఆకలితో అలమటించాం. చివరికి మేము ఆకలి బాధకు తాళలేక చెట్ల ఆకులు కొట్టుకొని తిననారంభించాం. అందుకే ఈ పటాలం పేరు 'జైషుల్ ఖబ్త్' (ఖబ్త్ అంటే ఆకులను దులిపేవాడు, రాల్చేవాడు అని అర్థం) పడింది. చివరికి ఓ వ్యక్తి మూడు ఒంటెల్ని జిబహ్ చేశాడు. ఆ తరువాత మూడు ఒంటెలు, మరో మారు మూడు ఒంటెలు జిబహ్ చేయబడ్డాయి. కాని ఆ తరువాత హజ్రత్ అబూ ఉబైదా అలా చేయకుండా మమ్మల్ని వారించారు. ఆ తరువాత సముద్రం నుండి మా వైపునకు 'అంబర్' పేరుగల ఓ చేప కొట్టుకువచ్చింది. దాన్ని మేము పదిహేను రోజుల వరకు తిని ఆకల్ని తీర్చుకున్నాం. దాని నూనెను కూడా ఒంటిపై పూసుకునేవాళ్ళం. అప్పటికిగాని మా శరీరాలు తిరిగి మునుపటిలా తయారు కాలేదు. మేము తిరిగి ఆరోగ్యాన్ని పొందగలిగాము. హజ్రత్ అబూ ఉబైదా (ర) దాని ప్రక్కటెముకకు చెందిన ఓ ముల్లు తీసుకొని నిలబెట్టారు. మా సైన్యంలోని అతి పొడుగైన వ్యక్తి మరో ఎత్తయిన ఒంటెపై నిలబడి ఆ చేప ప్రక్కటెముక క్రింది నుండి సునాయసంగా రాగలిగాడు (అంటే అది అంత పెద్ద చేప అన్నమాట). మేము ఆ చేప మాంసాన్ని ముక్క లుగా చేసి చద్దిగా ఉంచుకున్నాం. మదీనాకు చేరి ఈ విషయాన్ని మహాప్రవక్త (స)కు చెప్పగా ఆయన, "ఇది అల్లాహ్ మీ కోసం పంపించిన భోజనం. దాని మాంసం ఏదైనా మీ దగ్గర ఉంటే నాకు కూడా

పెట్టండి'' అని అన్నారు. అప్పుడు మేము దైవప్రవక్త (స) సన్నిధికి కొంత మాంసాన్ని పంపించాము[10] ఈ సంఘటన ఇక్కడ ఇంతటితో ముగుస్తోంది.

అయితే పైన ఈ సంఘటనకు సంబంధించిన సందర్భాన్ని చెబుతూ మేము, ఇది హుదైబియా ఒప్పందానికి పూర్వం జరిగిన సంఘటన అని చెప్పుకున్నాం. దీనికి కారణం ఏమిటంటే, హుదైబియా ఒప్పందం జరిగిన తరువాత ముస్లిములు ఖురైషులకు సంబంధించిన ఏ వర్తక బిడారం జోలికి పోలేదు.

10. సహీ బుఖారి-2/625-626; సహీ ముస్లిమ్-2/145, 146

గజ్వయె బనీయిల్ ముస్తలిక్

(హిజ్రీ శకం 5 లేక 6)

ఈ గజ్వా, యుద్ధం దృష్టికోణంతో చూస్తే, ఓ ముఖ్యమైన గజ్వా మాత్రం కాకపోయినప్పటికి దాని ప్రాధాన్యత మాత్రం గొప్పదే. కారణం, ఆ గజ్వాలో చోటు చేసుకున్న సంఘటనలు ఇస్లామీయ సమాజంలో పెద్ద సంచలనాన్ని రేకెత్తించాయి. దాని ఫలితంగా ఓ వైపు మునాఫిక్‌ల కాపట్యం కాస్తా బయట పడిపోతే, మరోవంక ఇస్లామీయ సమాజానికి గౌరవం మరియు ఔన్నత్యాన్ని చేకూర్చిపెట్టిన క్రిమినల్ చట్టాలు అవతరించాయి. దీనివల్ల దానికి ఓ ప్రత్యేక రూపం వచ్చినట్లయింది. మొదట మేము ఆ గజ్వాకు సంబంధించిన వివరాలను చెప్పి ఆ తరువాత ఆ సంఘటనలేవో చెబుతాము.

ఈ గజ్వా - సీరత్ చరిత్రకారుల కథనం ప్రకారం, హిజ్రీ శకం 5, షాబాన్ నెల లేదా హిజ్రీ శకం 6లో[1] సంభవించింది- ఈ గజ్వా కోసం వెళ్ళడానికి గల కారణాలు ఏమిటంటే, దైవప్రవక్త (స)కు, బనూ ముస్తలిక్ సర్దారు హారిస్ బిన్ అబీ జరార్ యుద్ధానికి సిద్ధమై తన తెగలతో ఇంకా ఇతర అరబ్బులతో కలసి వస్తున్నాడని వార్త అందడమే. మహాప్రవక్త (స) బరీదా బిన్ హసీబ్ అస్లమీ (ర) గారిని అది ఎంత వరకు నిజమో తెలుసుకురమ్మని పంపించారు. ఆయన బనూ హారిస్ నాయకుడు హారిస్ బిన్ అబీ జరార్‌ను కలసి మాట్లాడారు. తిరిగి వచ్చి విషయమంతా మహాప్రవక్త (స)కు విన్నవించుకున్నారు.

ఈ వార్త నిజమే అన్న విషయం తెలియగానే మహాప్రవక్త (స), సహాబా (ర)ను బయలుదేరడానికి సిద్ధంకమ్మని ఆదేశం ఇచ్చారు. ఆ తరువాత ఆయన త్వరలోనే అటు వైపునకు బయలుదేరి వెళ్ళారు. ముస్లిముల సైన్యం షాబాన్ నెల 2వ తారీఖున బయలుదేరింది. ఈ గజ్వాలో దైవప్రవక్త (స) వెంట

1. ఈ గజ్వా నుండి వెనక్కు మళ్ళేటప్పుడు ఇఫక్ (హజ్రత్ ఆయిషా (ర) పై అపనింద వేసే) సంఘటన జరిగింది.

మునాఫిక్‌ల ఓ వర్గం కూడా ఉంది. ఇంతకు పూర్వం వారు ఏ యుద్ధంలోనూ పాల్గొన్నవారు కారు. ఆయన (స) మదీనా బాధ్యతల్ని హజ్రత్ జైద్ బిన్ హారిసాకు (మరో ఉల్లేఖనంలో అబూ జర్ (ర)కు, ఇంకో ఉల్లేఖనంలో నమీలా బిన్ అబ్దుల్లాహ్(ర)కు) అప్పగించారు. హారిస్ బిన్ జరార్, ఇస్లామీయ సేన ఆచూకి తెలుసుకోడానికి ఓ వేగులవాణ్ణి పంపగా ముస్లిములు అతణ్ణి పట్టుకొని హతమార్చారు.

హారిస్ బిన్ అబీ జరార్‌కు, అతని అనుచరులకు దైవప్రవక్త (స) బయలుదేరడం మరియు తమ వేగులవాడు హతమార్చబడటం తెలిసి భయ భీతులయ్యారు. ఏ అరబ్బులయితే వారి వెంట బయలుదేరారో వారంతా చెల్లాచెదరై పారిపోయారు. మహాప్రవక్త (స) 'మురైసీ'[2] అనే ఊట బావి వద్దకు చేరుకోగా బనూ ముస్తలిక్ యుద్ధానికి సిద్ధమై ముందుకు వచ్చేశారు. మహాప్రవక్త (స) తన సేనను వరుసలుగా నిలబెట్టి సేనా పతాకాన్ని హజ్రత్ అబూ బక్ర్ (ర) చేతికి ఇచ్చారు. అలాగే అన్సారుల ప్రత్యేక పతాకం ఒకటి హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా (ర) చేతిలో ఉంది. కొంతసేపటి వరకు ఇరు పక్షాల నడుమ ధనుర్యుద్ధం జరిగింది. ఆ తరువాత మహాప్రవక్త (స) ఒక్కసారే వారిపై దాడి చేసి విజయం సాధించారు. బహుదైవారాధకులకు ఓటమి ఎదురైంది. కొందరు చంపబడ్డారు. స్త్రీలను, పిల్లలను ఖైదీలుగా పట్టుకోవడం జరిగింది. అలాగే వారి మేకలు, పశువులు ముస్లిముల చేత చిక్కాయి. ముస్లిములకు చెందిన ఒకే ఒక వ్యక్తి హతుడయ్యారు. అది కూడా ఓ అన్సారీ ఆయన్ని శత్రువుకు చెందిన మనిషిగా భావించి చంపడం జరిగింది.

సీరత్ చరిత్రకారులు ఈ గజ్వా వివరాలను ఇంతవరకే చెప్పారు. కాని అల్లామా ఇబ్నె ఖైమ్ మాత్రం యుద్ధం జరగలేదని రాశారు. కేవలం దైవప్రవక్త (స) ఆ ఊట బావిపై దాడి చేసి స్త్రీలను, పిల్లల్ని, పశువుల్ని పట్టుకోవడం మాత్రమే జరిగింది అని అంటారు. 'సహీహ్' హదీసులలోని ఓ ఉల్లేఖనంలో దైవప్రవక్త (స) బనూ ముస్తలిక్‌పై దాడి చేసినప్పుడు వారు ఏమరుపాటులో ఉన్నారని ఉంది.[3]

2. మురైసీ అనే ఊట బావి ఖదీర్‌కు దాపులో ఉంది. ఇది సముద్ర తీరంలోని బనూ ముస్తలిక్‌కు చెందిన ఊట బావి.
3. చూడండి, సహీహ్ బుఖారి, కితాబుల్ ఇత్క్-1/345, ఫత్హుల్ బారి-7/431

ఖైదీల్లో హజ్రత్ జువైరియా (ర) కూడా ఉన్నారు. ఈమె బనూ ముస్తలిక్ నాయకుడు హారిస్ బిన్ అబీ జరార్ కుమార్తె. ఈమె సాబిత్ బిన్ ఖైస్ వాటాకు వచ్చిన మహిళ. ఆయన ఆమెను 'మకాతిబ్'[4] చేసి తన వద్ద ఉంచుకున్నారు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఆయనకు, నిర్ణీత ధనమిచ్చి స్వతంత్రురాలిగా చేసి వివాహం చేసుకున్నారు. ఈ వివాహం కారణంగా, ఓ వంద మంది బనూ ముస్తలిక్ కుటుంబం వారు ముస్లిములైపోయారు. వారిని విడుదల చేయడం జరిగింది. ముస్లిములు వారిని విడుదల చేస్తూ, వీరు మహాప్రవక్త (స) గారి అత్తగారి కుటుంబానికి సంబంధించిన వారు అని చెప్పుకున్నారు కూడా.[5]

ఇవీ ఆ గజ్వాకు సంబంధించిన వివరాలు. ఇక ఆ గజ్వా సందర్భంగా చోటు చేసుకున్న సంఘటనల విషయానికి వస్తే, వాటికి మూలకారణం మునాఫిక్‌ల నాయకుడైన అబ్దుల్లా బిన్ ఉబై మరియు అతని అనుచరులే. ఇస్లామీయ సమాజంలో వారి నడవడి, వారు అవలంబించిన వైఖరి ఎలాంటిదో చెప్పుకోవడం ఎంతైనా అవసరం. ఈ వివరాలు మనం తరువాత తెలుసుకుందాం.

గజ్వయె బనీ ముస్తలిక్‌కు పూర్వం మునాఫిక్ అవలంబించిన వైఖరి

అబ్దుల్లా బిన్ ఉబైకు ఇస్లామ్ మరియు ముస్లిముల ఎడల సాధారణంగాను, దైవప్రవక్త (స) ఎడల ప్రత్యేకంగాను కక్ష ఉన్న విషయం మనం ఇదివరకు చెప్పుకొన్నదే. ఎందుకంటే, అవస్, ఖజ్రజ్ తెగలు దైవప్రవక్త (స) మదీనాకు రాకపూర్వం అతణ్ణి తమ నాయకునిగా చేసుకోడానికి ఏకగ్రీవంగా తీర్మానించుకొని ఉన్నారు. అతని తలపై కిరీటం పెట్టి తమ రాజుగా చేసుకోవడానికి ఓ పగడాల కిరీటం కూడా తయారు చేసుకుని ఉన్నారు. అంతలోనే మదీనాలో ఇస్లామ్ వెలుగు విస్తరించనారంభించింది. వారి దృష్టి కాస్తా అతని వైపు నుండి మళ్ళిపోయింది. అందుకని అతను, దైవప్రవక్త (స) అతని రాచరికాన్ని లాక్కున్నారని బాధపడిపోతున్నాడు.

ఇతని ఈ కక్ష, హిజ్రత్ ప్రారంభం అయినప్పటి నుండే కొనసాగుతూ ఉంది. అప్పుడు అతను ఇస్లామ్ స్వీకరించి ఉండలేదు. ఆ తరువాత తాను

4. 'మకాతిబ్' అంటే తన జమానత్‌తో ఓ నిర్ణీత ధనం ఇచ్చి విడుదల అయ్యే ఒప్పందం కుదుర్చుకునే బానిస లేక బానిసరాలు అని అర్థం.
5. అజాదుల్ ముఆద్-2/112, 113, ఇబ్నె హిషామ్-2/289, 294, 295.

ఇస్లామ్ స్వీకరించినట్లు ప్రకటించిన తదుపరి కూడా అతని వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. అతను ఇస్లామ్ ధర్మం స్వీకరించక ముందు ఓసారి దైవప్రవక్త (స) గారు కంచర గాడిదపై ఎక్కి హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా (ర) గారిని పరామర్శించడానికి వెలుతూ ఉండగా ఓ చోట అబ్దుల్లా బిన్ ఉబై తన సహచరులతో పిచ్చాపాటి మాట్లాడుతున్నాడు. అతను దైవప్రవక్త (స)ను చూడగానే తన ముక్కుకు అడ్డంగా గుడ్డను పెట్టుకుంటూ, అనవసరంగా దుమ్మురేపవద్దు అని హెచ్చరించాడు కూడా. ఆ తరువాత దైవప్రవక్త (స) అక్కడ ఆగి ఆ సమూహం వినేటట్లు దివ్యఖుర్అన్ పారాయణం చేయగా అతను, "మీరు మీ ఇంట్లోనే ఉండండి. అనవసరంగా మా దగ్గరకు వచ్చి మమ్మల్ని చీకాకుపరచకండి" అని అన్నాడు.[6]

ఇది ఇస్లామ్ ధర్మం స్వీకరించడానికి పూర్వపు మాట. కాని బద్ర్ యుద్ధం తరువాత గాలివాటం చూసి అతను ముస్లిమ్ అయినట్లు ప్రకటించుకున్నాడు. అప్పటికి అతను అల్లాహ్, ఆయన ప్రవక్త (స), విశ్వాసుల ఎడల శత్రుత్వం వహిస్తూనే ఉన్నాడు. ఇస్లామీయ సమాజంలో కల్లోలాన్ని రేకెత్తించడానికి, ఇస్లామ్ పిలుపును బలహీనపరిచేందుకు సతతం కుట్రలు పన్నుతూనే ఉన్నాడు. ఇస్లామ్ విరోధులతో సత్సంబంధాలను ఏర్పరచుకుంటూనే ఉన్నాడు. బనూ ఖైనుఖా వ్యవహారంలో అతను అనవసరంగా జోక్యం చేసుకోవడం జరిగింది (ఆ వివరాలు వెనుకటి పుటల్లో మనం చదువుకున్నవే). అలాగే ఉహద్ పోరాట సమయంలోనూ కుట్రపన్ని ముస్లిముల్లో చీలిక తేవడానికి ప్రయత్నం చేశాడు.

ఈ మునాఫిక్ కుతంత్రాలు ఎలా సాగాయంటే, అతని ఇస్లామ్ స్వీకారం తరువాత ప్రతి జుమా రోజున, దైవప్రవక్త (స) జుమా ప్రసంగం కోసం లేచి నిలబడక ముందే తాను నిలబడి, "ప్రజలారా! ఈయన గారు మీ నడుమ నిలుచున్న వ్యక్తి దైవప్రవక్త (స). అల్లాహ్ ఆయన ద్వారా మీకు గౌరవాన్ని, ఔన్నత్యాన్ని చేకూర్చాడు. కాబట్టి మీరు ఆయనకు సహాయంగా ఉండండి. ఆయన మాటలను విని వాటి ప్రకారం నడుచుకోండి" అని చెప్పి కూర్చునేవాడు. ఆ తరువాత లేచి దైవప్రవక్త (స) ప్రసంగించేవారు. ఇలా చేయడం అతనికి అలవాటుగా మారింది (కారణం అందరూ అతణ్ణి నిజమైన ముస్లిమ్

6, ఇబ్నె హష్షామ్-1/584-587; సహీ బుఖారి-2/924; సహీ ముస్లిమ్-2/109

అనుకోవాలని). అయితే ఉహద్ యుద్ధం ముగిసిన తరువాత మొదటి జుమా (శుక్రవారం) రాగానే- ఆ యుద్ధంలో అతను ఓ పెద్ద ద్రోహానికి పాల్పడినప్పటికీ - లేచి ఇదివరకటిలా తన మాటలను వల్లించసాగాడు. కాని ఈసారి ముస్లిములు అన్ని వైపుల నుంచి అతణ్ణి చుట్టుముట్టి చొక్కాబట్టి క్రింద కూర్చోబెడుతూ, "ఓ దైవ విరోధీ! కూర్చో. నీవు చేసిన ద్రోహానికి తిరిగి ఆ మాటలు పలికే అర్హత నీకు లేదు." అనగా, అతను మనుషుల తలలపై నుండి దాటుకుంటూ, "నేను వారి ప్రవక్త (స)ను బలపరచడానికి లేచి నిలబడితే వారు నన్ను ఏదో నేరం చేసినవాడిలా కూర్చోబెడుతున్నారు" అని గొణుక్కుంటూ మస్జిద్ బయటకు వెళ్ళిపోయాడు. మస్జిద్ ద్వారం వద్ద అనుకోకుండా ఓ అన్సారి అతనికి తారసపడి, "నీవు నాశనం అయిపోను! పద, వెనక్కు వెళదాం. బహుశా దైవప్రవక్త (స) నీ మన్నింపు కోసం దుఆ చేస్తారేమో" అని అన్నారు. అతను దానికి, "దైవసాక్షి! ఏమీ వద్దు. ఆయన (స) నా మన్నింపు కోసం ఎలాంటి వేడుకోలు చేయవద్దు" అంటూ వెళ్ళిపోయాడు.[7]

అదే కాదు ఇతను బనూ నజీర్ యూదులతో సంబంధాన్ని స్థాపించుకొని వారితో కలసి ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రలూ పన్నాడు.

అలాగే అహ్జాబ్ యుద్ధం సందర్భంలో కూడా అబ్దుల్లా బిన్ ఉబై, అతని సహచరులు ముస్లిముల నడుమ భయోత్పాతాన్ని సృష్టించేందుకు, వారి ధైర్యసాహసాలను దెబ్బకొట్టేందుకు రకరకాలుగా ప్రయత్నించి ఉన్నారు. ఆ విషయమే దివ్యఖుర్అన్‌లోని అల్ అహ్జాబ్ సూరాలో ఈ క్రింది విధంగా వివరించడం జరిగింది:

وَإِذْ يَقُولُ الْمُنَافِقُونَ وَالَّذِينَ فِي قُلُوبِهِم مَّرَضٌ مَّا وَعَدَنَا اللَّهُ وَرَسُولُهُ إِلَّا غُرُورًا ۝ وَإِذْ قَالَت طَّائِفَةٌ مِّنْهُمْ يَا أَهْلَ يَثْرِبَ لَا مُقَامَ لَكُمْ فَارْجِعُوا ۚ وَيَسْتَأْذِنُ فَرِيقٌ مِّنْهُمُ النَّبِيَّ يَقُولُونَ إِنَّ بُيُوتَنَا عَوْرَةٌ ۚ وَمَا هِيَ بِعَوْرَةٍ ۖ إِن يُرِيدُونَ إِلَّا فِرَارًا ۝ وَلَوْ دُخِلَتْ عَلَيْهِم مِّنْ أَقْطَارِهَا ثُمَّ سُئِلُوا الْفِتْنَةَ لَآتَوْهَا وَمَا تَلَبَّثُوا بِهَا إِلَّا يَسِيرًا ۝ وَلَقَدْ كَانُوا عَاهَدُوا اللَّهَ مِن قَبْلُ لَا يُوَلُّونَ الْأَدْبَارَ ۚ وَكَانَ عَهْدُ اللَّهِ مَسْئُولًا ۝ قُل لَّن يَنفَعَكُمُ الْفِرَارُ إِن فَرَرْتُم مِّنَ الْمَوْتِ أَوِ الْقَتْلِ وَإِذًا لَّا تُمَتَّعُونَ إِلَّا قَلِيلًا ۝ قُلْ مَن ذَا الَّذِي يَعْصِمُكُم مِّنَ اللَّهِ إِنْ أَرَادَ بِكُمْ سُوءًا أَوْ أَرَادَ بِكُمْ رَحْمَةً ۚ وَلَا يَجِدُونَ لَهُم مِّن دُونِ اللَّهِ وَلِيًّا وَلَا نَصِيرًا ۝ قَدْ يَعْلَمُ اللَّهُ الْمُعَوِّقِينَ مِنكُمْ وَالْقَائِلِينَ لِإِخْوَانِهِمْ هَلُمَّ إِلَيْنَا ۖ وَلَا يَأْتُونَ الْبَأْسَ إِلَّا قَلِيلًا ۝ أَشِحَّةً عَلَيْكُمْ ۖ

7. ఇబ్నె హష్షామ్-2/105

فَإِذَا جَاءَ الْخَوْفُ رَأَيْتَهُمْ يَنْظُرُوْنَ إِلَيْكَ تَدُوْرُ أَعْيُنُهُمْ كَالَّذِيْ يُغْشٰى عَلَيْهِ مِنَ الْمَوْتِ ۚ فَإِذَا
ذَهَبَ الْخَوْفُ سَلَقُوْكُمْ بِأَلْسِنَةٍ حِدَادٍ أَشِحَّةً عَلَى الْخَيْرِ ۚ أُولٰئِكَ لَمْ يُؤْمِنُوْا فَأَحْبَطَ اللّٰهُ أَعْمَالَهُمْ ۚ
وَكَانَ ذٰلِكَ عَلَى اللّٰهِ يَسِيْرًا ﴿١٩﴾ يَحْسَبُوْنَ الْأَحْزَابَ لَمْ يَذْهَبُوْا ۖ وَإِنْ يَأْتِ الْأَحْزَابُ يَوَدُّوْا لَوْ أَنَّهُمْ
بَادُوْنَ فِي الْأَعْرَابِ يَسْأَلُوْنَ عَنْ أَنْبَائِكُمْ ۖ وَلَوْ كَانُوْا فِيْكُمْ مَا قَاتَلُوْا إِلَّا قَلِيْلًا ﴿٢٠﴾

"కపటులూ, రోగగ్రస్త హృదయులూ అందరూ, "అల్లాహ్, ఆయన ప్రవక్త (స) మనతో చేసిన వాగ్దానాలన్నీ ఒట్టి భ్రమలు తప్ప మరేమీ కావు" అని స్పష్టంగా ప్రకటించినప్పటి సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు వారిలోని ఒక వర్గం "ఓ యస్‌రిబ్ ప్రజలారా! ఇక మీకు ఇక్కడ ఉండే అవకాశమేదీ లేదు, వెనక్కివెళ్ళిపోండి" అని అన్నది. అప్పుడు వారిలోని మరొక వర్గం "మా గృహాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి" అని దైవ ప్రవక్తకు చెప్పి సెలవుకోరింది. వాస్తవానికి వాటికి ఏ ప్రమాదమూ లేదు. అసలు వారు (యుద్ధ మైదానం నుండి) పారిపోదలచారు; ఒకవేళ నగరం చుట్టుప్రక్కల నుండి శత్రువులు లోనికి చొరబడి వారిని విద్రోహ చర్యకు పాల్పడమని పిలుపు ఇస్తే, అప్పుడు వారు తప్పకుండా అలా చేస్తారు; విద్రోహ చర్యలో పాల్గొనడానికి వారు చాలా తక్కువగా సంకోచిస్తారు. వారు ఇదివరకు తాము వెన్ను చూపమని అల్లాహ్‌కు వాగ్దానం చేసి ఉన్నారు. అల్లాహ్‌కు చేసిన వాగ్దానం గురించి తప్పకుండా ప్రశ్నించడం జరుగుతుంది.

ఓ ప్రవక్తా! వారితో ఇలా అను, "ఒకవేళ మీరు మృత్యువు బారి నుండి లేదా హత్య బారి నుండి తప్పించుకోవాలని పారిపోతే, ఈ పారిపోవడం మీకు ఏ మాత్రం లాభదాయకం కాబోదు. దీని తరువాత జీవిత సుఖాలను అనుభవించడానికి కొద్దిపాటి అవకాశం మాత్రమే మీకు లభిస్తుంది." వారిని ఇలా అడుగు : "ఒకవేళ అల్లాహ్ మీకు నష్టం కలిగించదలిస్తే, ఆయన నుండి మిమ్మల్ని కాపాడగలిగే వాడు ఎవడు? ఒకవేళ అల్లాహ్ మిమ్మల్ని కరుణించ దలిస్తే, ఆయన కరుణను ఆపగలిగే వాడు ఎవడు? అల్లాహ్‌కు ప్రతిగా వారు ఏ సంరక్షకుణ్ణీ, ఏ సహాయకుణ్ణీ పొందలేరు."

మీలో (యుద్ధకార్యంలో) ప్రతిబంధకాలు సృష్టించే వారినీ, తమ సోదరులను "మా వైపునకు రండి" అని పిలిచేవారినీ, లెక్కకు మాత్రమే యుద్ధంలో పాల్గొనే వారినీ, నీకు తోడ్పడే విషయంలో పరమ లోభులైన వారినీ

అల్లాహ్ బాగా ఎరుగును. మరణ సమయంలో అపస్మారక స్థితికి గురి అయిన వారి వలె వారు ప్రమాదం సంభవించినప్పుడు గుడ్లు తిప్పుతూ నీ వైపు చూస్తారు. కాని ప్రమాదం తొలగిపోగానే, వారే లాభాలను పొందాలని దురాశా పరులై కత్తెరల వలె ఆడే నాలుకలతో నీకు స్వాగతం చెప్పడానికి వస్తారు. వారు ఏ మాత్రం విశ్వసించినవారు కారు. కనుకనే అల్లాహ్ వారి కర్మలను అన్నింటినీ నిరర్థకం చేశాడు. అల్లాహ్‌కు అలా చేయడం చాలా సులభం. దాడి చేసిన వర్గాలు ఇంకా వెళ్ళిపోలేదు అనేవారు భావిస్తున్నారు, ఒకవేళ ఆ వర్గాలు మళ్ళీ దాడి చేస్తే, ఎడారిలో ఎక్కడికైనా పోయి పల్లెల్లో అరబ్బుల మధ్య కూర్చుందామనీ, అక్కడ నుండే మీ పరిస్థితులను గురించి తెలుసుకుందామనీ వారి మనస్సు కోరుతోంది. ఒకవేళ వారు మీ మధ్య ఉన్నా, యుద్ధంలో చాలా తక్కువగానే పాల్గొంటారు." (33 : 12-20)

పై ఖుర్‌ఆన్ వాక్యాలలో సందర్భాన్నిబట్టి, మునాఫిక్‌ల భావోద్రేకాలు, వారి వైఖరి, వారి మానసిక పరిస్థితి, స్వార్థం, అవకాశవాదానికి సంబంధించిన ఓ విస్పష్ట చిత్రం మన ముందు ఉంచుతోంది.

దీనికి తోడు యూదులకు, మునాఫిక్‌లకు, బహుదైవారాధకులకు మాత్రమే కాదు ఇస్లామ్ విరోధి మూకలన్నిటికీ, ఇస్లామ్ ప్రాబల్యానికి కారణం, భౌతిక ఆధిక్యత, ఆయుధ సంపత్తి, సైనికబలం మాత్రమే కాదనీ, ఈ ప్రాబల్యానికి గల ప్రధాన కారణం ముస్లిములలో నెలకొని ఉన్న నైతిక సుగుణాలే అన్న విషయం తెలిసివచ్చింది. ఈ నైతిక సుగుణాలు ఆనాటి ఇస్లామీయ సమాజంలో మరియు ఇస్లామ్ ధర్మంతో ఏ మాత్రం సంబంధం కలిగి ఉన్న ప్రతి వ్యక్తిలోనూ ప్రస్ఫుటంగా అగుపించేవి. ఇంకా ఈ ఇస్లామ్ విరోధి మూకలకు, శుభాల సరోవరమైన దైవప్రవక్త (స) గారి వ్యక్తిత్వమే అన్న విషయమూ ఆ నైతిక సుగుణాలు ఆయన (స)లో మహత్యాల కంటే ఉన్నతమైనవిగా ఉన్నాయన్న విషయమూ తెలిసి ఉండడమే.

అలాగే, ఇస్లామ్ ధర్మవిరోధులు అయిదు సంవత్సరాల వరకు ఆయనతో యుద్ధం చేస్తూ, ఈ ధర్మానుయాయుల్ని ఆయుధ బలంతో లోబరుచుకోవడం లేదా వారిని నామరూపాల్లేకుండా చేయడం దుస్సాధ్యం అన్న విషయాన్ని గ్రహించే ఉన్నారు. అందుకని వారు, బహుశా నైతిక కోణంతో

అ ధర్మానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచార యుద్ధాన్ని ప్రారంభిం చాలనుకున్నారు. మొట్టమొదటగా దైవప్రవక్త (స) గారి వ్యక్తిత్వంపై గురిపెట్టి ఆ ప్రచారాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. మునాఫిక్‌లు ముస్లిములలో అయిదో వర్గం. వీరు మదీనాలోనే ఉంటూ ఉన్నారు. ముస్లిములతో ఎలాంటి అరమరికలు లేకుండా కలసిపోయినవారు. వారి భావోద్రేకాలను కూడా సమయాన్నిబట్టి సునాయాసంగా రెచ్చగొట్టనూగలరు. కాబట్టి ఈ దుష్ప్రచార బాధ్యతను తమ నెత్తినేసుకున్నారు ఈ మునాఫిక్‌లు. అబ్దుల్లా బిన్ ఉబై దీనికి నాయకత్వం వహించాడు.

వారి ఈ ప్రణాళిక వెలుగుజూసింది ఎప్పుడంటే, జైద్ బిన్ హారిసా (ర) తన భార్య జైనబ్ (ర)కు విడాకులు ఇచ్చి ఆమెను దైవప్రవక్త (స)కు ఇచ్చి వివాహం చేసినప్పుడు. అరేబియా సంప్రదాయం ప్రకారం, వారు ముతబన్నా (పెంపుడు కుమారుడు)కు తమ సొంత కుమారుని హోదా కల్పిస్తూ ఉండేవారు. అతని భార్యను సొంత కుమారుని భార్యగా నిషిద్ధం అని అనుకునేవారు. అందుకని దైవప్రవక్త (స), హజ్రత్ జైనబ్ (ర)ను వివాహమాడగానే మునాఫిక్‌లకు దైవప్రవక్త (స) గారికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడానికి మంచి అవకాశం లభించింది. వారి దృష్టిలో వారికి రెండు బలహీన అవకాశాలు చేతచిక్కాయని అనుకోవడం జరిగింది.

హజ్రత్ జైనబ్ (ర) దైవప్రవక్త (స) గారి అయిదవ సతీమణి. దివ్య ఖుర్ఆన్ నలుగురి కంటే ఎక్కువ మందిని ఏక కాలంలో భార్యలుగా ఉంచడానికి అనుమతి ఇవ్వలేదు. కాబట్టి ఈ వివాహం సక్రమమైన వివాహం ఎలా అవుతుంది? అన్నది ఒకటి.

రెండవది, హజ్రత్ జైనబ్ (ర) ఆయన కుమారుని - అంటే పెంపుడు కుమారుని - భార్య. కాబట్టి అరేబియా సంప్రదాయం ప్రకారం, ఆమెను వివాహమాడడం ఓ పెద్ద నేరం మరియు తీవ్రమైన పాపం కూడా. కాబట్టి ఈ విషయంలోనూ బాగా ప్రాపగాండా చేయడం జరిగింది. రకరకాల కట్టుకథలు అల్లడమూ జరిగింది. దుష్ప్రచారం చేసేవారు ఈ కట్టుకథల్లో, ముహమ్మద్ (స) హజ్రత్ జైనబ్ (ర)ను చూడగానే ప్రేమలో పడిపోయారనీ, ఈ విషయం ఆయన కుమారునికి తెలియగానే ఆయన దైవప్రవక్త (స) కోసం మార్గాన్ని సుగమం చేయడానికి ఆమెకు విడాకులిచ్చారని కూడా చెప్పడం జరిగింది.

మునాఫిక్‌లు అల్లిన ఈ కట్టుకథలను ఎంత విస్తృతంగా ప్రచారం చేశారో ఆ విషయాలు ఇప్పటి వరకూ హదీసు గ్రంథాల్లో, ఖుర్ఆన్ వ్యాఖ్యానాల్లో కానవస్తాయి. ఆ కాలంలో ఈ ప్రాపగాండాకు బలహీనులు, అమాయకులూ అయిన ముస్లిములు బాగా ప్రభావితం అయినందునే, ఈ విషయానికి సంబంధించి అల్లాహ్ దీన్ని ఖండించడానికి దివ్యవాణిని అవతరింపజేశాడు. ఆ ఆయత్‌లలో వీరి అనుమానాలకు సంబంధించి వారి హృదయాల్లో చోటుచేసుకున్న వ్యాధికి సంబంధించిన పూర్తి చికిత్స ఉంది. ఈ ప్రాపగాండ ఎంత పెద్ద ఎత్తున చేబట్టడం జరిగిందో, దాని తీవ్రతను గ్రహించేందుకు, దాని ఖండన కోసం అహ్‌జాబ్ సూరా (అధ్యాయం) ఈ క్రింది వాక్యాలతోనే ప్రారంభం అయింది అన్నది గ్రహించవచ్చు.

يٰۤاَيُّهَا النَّبِيُّ اتَّقِ اللّٰهَ وَلَا تُطِعِ الْكٰفِرِيْنَ وَالْمُنٰفِقِيْنَ ؕ اِنَّ اللّٰهَ كَانَ عَلِيْمًا حَكِيْمًا ۙ﴿۱﴾

"ఓ ప్రవక్తా! అల్లాహ్‌కు భయపడు. అవిశ్వాసులకూ, కపటులకూ విధేయత చూపకు. వాస్తవానికి అల్లాహ్‌యే జ్ఞాని మరియు వివేకి." (33:1)

మునాఫిక్‌ల దుష్ప్రచారాన్నీ, వారి వైఖరినీ వ్రేలెత్తి చూపుతున్న సమగ్ర చిత్రమే ఈ వాక్యాలు. మహాప్రవక్త (స) ఈ కపటులు అవలంబిస్తున్న ఈ వైఖరిని ఎంతో సహనంతో, సంయమనంతో భరిస్తూనే ఉన్నారు. అటు ముస్లిములు కూడా ఈ దుష్ప్రచారానికి ప్రభావితులు కాకుండా సహనం వహిస్తున్నారు. దైవం తరపు నుండి అప్పుడప్పుడు మునాఫిక్‌లు అగౌరవం పాలు అవుతున్న అనుభవం వారికి ఉంది కనుక. ఈ విషయంలో ఈ క్రింది ఆయత్‌లు అవతరించాయి.

اَوَلَا يَرَوْنَ اَنَّهُمْ يُفْتَنُوْنَ فِيْ كُلِّ عَامٍ مَّرَّةً اَوْ مَرَّتَيْنِ
ثُمَّ لَا يَتُوْبُوْنَ وَلَا هُمْ يَذَّكَّرُوْنَ ﴿۱۲۶﴾

"తాము ప్రతి సంవత్సరం ఒకటి రెండు సార్లు పరీక్షకు గురిచేయబడటాన్ని వారు చూడడం లేదా? కాని దీని తరువాత కూడా వారు పశ్చాత్తాపము పడటంలేదు. ఏ గుణపాఠాన్నీ నేర్చుకోవటంలేదు." (9 : 126)

గజ్వయె బనూ ముస్తలిక్‌లో మునాఫిక్‌ల పాత్ర

గజ్వయె బనీ ముస్తలిక్ జరిగినప్పుడు మునాఫిక్‌లు కూడా ఆ పోరాటంలో దైవప్రవక్త (స)తో వెళ్ళడం జరిగింది. వారు అల్లాహ్ తన గ్రంథంలో ఈ క్రింద చెప్పిన విధంగానే ప్రవర్తించారు:

لَوْ خَرَجُوْا فِيْكُمْ مَّا زَادُوْكُمْ اِلَّا خَبَالًا وَّلَاْ اَوْضَعُوْا
خِلٰلَكُمْ يَبْغُوْنَكُمُ الْفِتْنَةَ ۚ

"వారు గనక మీతో బయలుదేరి ఉండి ఉన్నట్లయితే, మీకు కీడు తప్ప మరి దేనినీ అధికం చేసి ఉండేవారు కాదు. వారు మీ మధ్య విభేదాల్ని సృష్టించే నిమిత్తం తీవ్ర ప్రయత్నాలు చేస్తూ ఉంటారు." (9 : 47)

కాబట్టి ఈ పోరాటంలో వారికి రెండు అవకాశాలు లభించాయి. వాటిని ఆసరాగా తీసుకొని ముస్లిములలో విభేదాలు, వైషమ్యాలు సృష్టించి దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా నీచమైన దుష్ప్రచారం చేశారు. ఈ రెండు సంఘటనలకు సంబంధించిన వివరాలు కొన్ని ఇక్కడ చెబుతున్నాము.

1. మదీనా నుండి అతి నీచుడైన వ్యక్తిని గెంటివేసే విషయం

గజ్వయె బనీ ముస్తలిక్‌ను ముగించుకొని మహాప్రవక్త (స), ముర్‌యసీ ఊట బావి వద్దకు వచ్చి విడిది చేశారో లేదో, అక్కడకు కొంత మంది నీళ్ళు తెచ్చుకోడానికి వెళ్ళడం జరిగింది. వెళ్ళిన వారిలో హజ్రత్ ఉమర్ (ర) గారికి చెందిన ఓ కూలీవాడు కూడా ఉన్నాడు. అతని పేరు 'జహ్‌జాహ్ గిఫ్ఫారి.' అక్కడ అతనికి, మరో వ్యక్తి 'సనాన్ వబర్ జుహ్నీ'కి నడుమ తోపులాట జరిగింది. వారిద్దరూ కొట్టుకున్నారు కూడా. అంతలోనే జుహ్నీ, "ఓ అన్సారు ప్రజలారా! సహాయానికి రండి" అని పిలిచాడు అన్సారులను. ఇటు జహ్‌జాహ్ కూడా తమ జాతి ప్రజల్ని, "ఓ ముహాజిర్‌లారా! సహాయానికి రండి" అని పిలిచాడు. దైవప్రవక్త (స)కు ఈ వార్త అందగానే అక్కడికి వెళ్ళి, "ఇంకా నేను మీలో ఉండగానే ఈ అజ్ఞానపు పిలుపులా? ఈ వైఖరిని వదలండి, ఇది ఎంతో హేయమైన విషయం" అని చెప్పగా వారందరూ వెళ్ళిపోయారు.

ఈ వార్త అబ్దుల్లా బిన్ ఉబై చెవిన కూడా పడింది. అతను కోపంతో, "వారు ఇలా చేశారా? వీరు మన ప్రాంతానికి వచ్చి మనకే ఎదురు తిరుగు

తున్నారా? దైవసాక్షి! మనం మన కుక్కను బాగా బలిసినట్లు పెంచితే అది మనల్నే పీక్కుతిన్నట్లుగా ఉంది. మన పూర్వీకులు చెప్పిన సామెత మనపై పూర్తిగా నిజం చేశారు వారు. వినండి! మనం మదీనాకు తిరిగి వెళ్ళాక మనలోని అతి గౌరవనీయుడు మనలోని అతి నీచమైన వ్యక్తిని మదీనా నుండి వెళ్ళగొడతాడు" అంటూ అక్కడున్న వారిని ఉద్దేశించి, "ఈ పీడను స్వయంగా మీరే కొనుక్కున్నారు, వీరిని తీసుకొచ్చి మీ నగరంలో చోటిచ్చారు, మీ ఆస్తుల్ని పంచిపెట్టారు. చూడండి! ఇప్పుడు మీ దగ్గర ఉన్నది వారికి ఇవ్వడం మానేస్తే, వీరు మీ నగరాన్ని వదిలి ఎక్కడికైనా వెళ్ళిపోతారు" అని రెచ్చగొట్టనారంభించాడు.

ఆ సమయాన అక్కడ ఓ యువ సహాబీ హజ్రత్ జైద్ బిన్ అర్కమ్ కూడా ఉన్నారు. ఆయన వచ్చి ఈ విషయాన్ని తన పినతండ్రికి వివరించారు. ఆయన పినతండ్రి దైవప్రవక్త (స) గారికి ఈ వృత్తాంతాన్ని వివరించారు. హజ్రత్ ఉమర్ (ర) ఇది విని, "దైవప్రవక్తా! అబ్బాద్ బిన్ బిష్ర్‌కు ఆదేశం ఇవ్వండి, అతణ్ణి వధించమని" అన్నారు.

"ఉమర్! ఇదెలా సాధ్యం? ప్రజలంతా, ముహమ్మద్ తన సహచరుల్ని వధిస్తున్నాడని చెప్పుకోరా? లేదు! ఇప్పుడే బయలుదేరే ప్రకటన చేయండి" అన్నారు దైవప్రవక్త (స).

దైవప్రవక్త (స) ఆ సమయాన ఎప్పుడూ బయలుదేరి ఉండలేదు. సహచరులంతా బయలుదేరగా చూసి హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్(ర) దైవప్రవక్త (స) గారి దగ్గరకు వచ్చి, "ఏమిటీ దైవప్రవక్తా! తమరు ఈ రోజు ఎటూ కాని వేళలో బయలుదేరమని ఆదేశమిచ్చారు?" అని అడిగారు.

"ఏమిటీ? మీ మనిషి (అంటే అబ్దుల్లా బిన్ ఉబై) చెప్పింది నీకు తెలియదా?" అడిగారు దైవప్రవక్త(స).

"అతనేమన్నాడు?" ప్రశ్నించారు ఉసైద్ (ర).

"అతను మదీనాకు వెళ్ళగానే అతి గౌరవనీయుడు అతి నీచమైన వ్యక్తిని మదీనా నుండి గెంటివేస్తాడట."

"దైవప్రవక్తా! తమరే అనుకుంటే అతణ్ణి మదీనా నుండి గెంటివేయగలరు. దైవసాక్షి! అతను ఎంతో నీచమైనవాడు. తమరు అతి గౌరవనీయులు.

దైవప్రవక్తా! అతని ఎడల కొంత మెత్తగా వ్యవహరించండి. ఎందుకంటే, దైవసాక్షి! అల్లాహ్ తమరిని మా వద్దకు తీసుకువచ్చినప్పుడు మా జాతి అతణ్ణి కిరీటధారునిగా చేయడానికి పగడాల కిరీటం తయారు చేయిస్తోంది. కాబట్టి అతను ఇప్పుడు, తమరు అతని రాజ్యాధికారాన్ని లాక్కున్నారని తలుస్తున్నాడు" అన్నారు.

దైవప్రవక్త (స) ప్రొద్దుక్రుంకే వరకు రోజంతా, ఉదయం అయ్యే వరకు రాత్రంతా అలా ప్రయాణిస్తూనే ఉన్నారు. మరీ చెప్పాలంటే, బాగా ప్రొద్దెక్కే వరకు తమ ప్రయాణాన్ని సాగిస్తూనే ఉన్నారు అనవచ్చు. బాగా ప్రొద్దెక్కి ఎండ వేడిమి అధికమైనప్పుడు ఓ చోట విడిది చేశారు. అలసి ఉండడం వల్ల ఆదమరిచి నిద్రపోయారందరూ. దైవప్రవక్త (స) గారి ధ్యేయం కూడా అదే. తమ వెంట ఉన్న వారు అలా అలసిపోయి ఉండకపోతే పిచ్చాపాటి మాట్లాడుకునే అవకాశం లభిస్తుంది మరి.

ఇటు జైద్ బిన్ అర్కమ్ (ర) తన ప్రేలాపనలన్నింటినీ దైవప్రవక్త (స)కు వినిపించిన విషయం అబ్దుల్లా బిన్ ఉబైకు తెలిసిపోయింది. అతను ఆయన (స) గారి సన్నిధిలో హాజరై అల్లాహ్‌పై ఒట్టేసుకుని, అర్కమ్ ఏదైతే చెప్పారో తాను అనలేదని బొంకనారంభించాడు. అక్కడ అన్సారులకు చెందిన కొందరు వ్యక్తులూ ఉన్నారు. వారు కూడా మహాప్రవక్త(స)తో, "ఓ ప్రవక్తా! జైద్ బిన్ అర్కమ్ ఉత్త తగువుల మారి. అతని మాట నమ్మకండి, బహుశా అతను తప్పుగా అర్థం చేసుకొని ఉంటారు. ఇతను చెప్పినదాన్ని సరిగా గుర్తుంచుకోలేదేమో" అని వంతపాడనారంభించారు. కాబట్టి దైవప్రవక్త (స) అబ్దుల్లా బిన్ ఉబై నిజం చెబుతున్నాడని అనుకొని అతని మాటను నమ్మారు. ఈ విషయం జైద్ బిన్ అర్కమ్ (ర) కు తెలిసింది. ఆయన మాటల్లోనే, "నాకు అప్పుడు కలిగిన మనస్తాపం ఏనాడూ కలుగలేదు. నేను ఆ బాధతో నా ఇంటనే కూర్చుని ఉండిపోయాను. అల్లాహ్ సూరయె మునాఫికీన్‌లో అవతరింప జేసిన ఆయత్‌లో ఈ విషయమే ప్రస్తావించనంత వరకు నేను ఎటూ కదల లేదు" అని అన్నారు. ఆ ఆయత్‌లో ఈ రెండు విషయాలు ఉన్నాయి.

هُمُ الَّذِيْنَ يَقُوْلُوْنَ لَا تُنْفِقُوْا عَلٰى مَنْ عِنْدَ

رَسُوْلِ اللّٰهِ حَتّٰى يَنْفَضُّوْا ؕ

"వారే ఇలా అనేది, "ప్రవక్త అనుచరుల కోసం ఖర్చుపెట్టడం ఆపేయండి. అప్పుడు వారు చెల్లాచెదరైపోతారు." (63 : 7)

يَقُوْلُوْنَ لَئِنْ رَّجَعْنَآ اِلَى الْمَدِيْنَةِ لَيُخْرِجَنَّ الْاَعَزُّ مِنْهَا الْاَذَلَّ ؕ

"వారు ఇంకా ఇలా అంటారు: "మనం మదీనా నగరానికి తిరిగివెళ్ళిన తరువాత మనలోని గౌరవనీయులను, నీచులను అక్కణ్ణుంచి వెళ్ళగొట్టాలి." (63 : 9)

హజ్రత్ జైద్ (ర) ఇలా అంటారు: "ఆ వాక్యాలు అవతరించిన తరువాత దైవప్రవక్త (స) నన్ను పిలిపించి వాటిని చదివి వినిపించారు. ఆ తరువాత ఆయన (స), (జైద్!) అల్లాహ్ నిన్ను ధృవపరిచాడు" అని చెప్పారు.[8]

ఈ మునాఫిక్ కుమారుడు అబ్దుల్లా (ర) అతనికి భిన్నమైన వ్యక్తిత్వం గలవారు. ఆయన ఓ మంచి సహచరుడు కూడాను. ఆయన తన తండ్రి మాటలను ఖండిస్తూ మదీనా ప్రవేశ ద్వారం వద్ద కత్తి దూసి నిలబడ్డారు, ఆయన తండ్రి అబ్దుల్లా బిన్ ఉబై అక్కడికి చేరగానే అతనిని అడ్డుకుంటూ, "దైవసాక్షి! మీరు ఇక్కడ నుండి ముందుకు వెళ్ళడానికి వీల్లేదు. దైవప్రవక్త (స) అనుమతిస్తే తప్ప, ఎందుకంటే దైవప్రవక్తే అందరికంటే గౌరవనీయులు. మీరే అందరికంటే నీచులు" అని నిలదీశారు. ఆ తరువాత దైవప్రవక్త (స) అక్కడకు చేరగానే అతణ్ణి మదీనాలోనికి ప్రవేశించే అనుమతి ఇచ్చారు. అప్పుడుగాని అతని కుమారుడు అతని మార్గానికి అడ్డుతొలగలేదు. ఆ సందర్భంలోనే అబ్దుల్లా బిన్ ఉబై కుమారుడు అబ్దుల్లాహ్ (ర) దైవప్రవక్తతో, "దైవప్రవక్తా! తమరే అతణ్ణి హతమార్చదలుచుకుంటే నాకు ఆదేశం ఇవ్వండి. దైవసాక్షి! నేను ఆయన తలను నరికి మీ కాళ్ళ దగ్గర పడవేస్తాను" అని విన్నవించుకోవడం కూడా జరిగింది.[9]

2. ఇఫ్క్ సంఘటన

ఈ గజ్వాకు సంబంధించిన మరో ముఖ్య సంఘటన 'ఇఫ్క్' సంఘటన. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఏమిటంటే,

8. చూడండి, సహీ బుఖారి-1/499, 2/227, 228, 229; ఇబ్నె హష్షామ్-2/290, 291, 292

9. ఇబ్నె హష్షామ్-1/499, 2/227, 228, 229; ముఖ్తసరుస్సీరత్ -షేక్ అబ్దుల్లాహ్-పుట. 277

దైవప్రవక్త (స) ప్రయాణానికి బయలుదేరే ముందు తమతోపాటు ఏ సతీమణిని తీసుకు వెళ్ళాలి అని చీటి వేసి ఎవరి పేరు వస్తే వారిని తమ వెంట తీసుకువెళ్ళడం రివాజు. ఈ గజ్వాలో కూడా అలా చీటి వేయడం జరిగింది. అందు హ(జత్ ఆయిషా (ర) గారి పేరు రావడం వలన ఆమెను తమ వెంట తీసుకువెళ్ళారు. తిరుగు ప్రయాణంలో ఓ చోట విడిది చేసినప్పుడు హ(జత్ ఆయిషా (ర) బహిర్భూమికని వెళ్ళడం జరిగింది. ఆమె వెళ్ళేటప్పుడు తన సోదరి వద్ద నుండి అడిగి ధరించిన కంఠహారం అక్కడ పడిపోయింది. అది తెలియగానే తిరిగి అదే ప్రదేశానికి వెళ్ళి వెదకనారంభించారు. ఈలోపు బయలుదేరే ఆదేశం అందగానే, అంబారీని ఒంటెపై ఎత్తిపెట్టేవారు వచ్చి అంబారీనీ ఎత్తి ఒంటెపైకి ఎక్కించారు. వారు హ(జత్ ఆయిషా (ర) అందులోనే ఉన్నారని తలచడం జరిగింది. అంబారీ తేలికగా ఉండటాన్ని వారు పట్టించుకోలేదు. ఎందుకంటే హ(జత్ ఆయిషా (ర) గారి వయస్సు పిన్న వయస్సు. శరీరం ఏమంత బరువుగా కూడా లేదు. అదే కాకుండా ఆ అంబారీని చాలా మంది పట్టి పైకి ఎక్కించడం మూలంగా ఈ విషయం వారికి అర్థం కాలేదు. ఒకరు ఇద్దరు ఎత్తితే బహుశా బరువు గురించి అనుమానం వచ్చి ఉండేదేమో.

ఎలాగయితేనేమీ, హ(జత్ ఆయిషా (ర) తన హారాన్ని వెదికి దాన్ని తీసుకొని విడిదికి వచ్చి చూడగా సేన మొత్తం వెళ్ళిపోయి ఆ ప్రదేశం ఖాళీగా ఉంది. పిలిచేవారుగాని, పిలుపుకు సమాధానం పలికేవారుగాని ఎవ్వరూ అక్కడ లేరు. అందుకని ఆమె, తాను సేన వెంట లేనని విషయం తెలుసు కొని ఎవరైనా తిరిగి రాకమానరనే ఉద్దేశ్యంతో అక్కణ్ణే కూర్చుండిపోయారు. అయితే అల్లాహ్ ఏది తలిస్తే అది అయితీరుతుంది. ఆయన ఆకాశం నుంచి ఏ ఆదేశం ఇస్తాడో అదే అమలు జరుగుతుంది. కాబట్టి అలా కొద్దిసేపు కూర్చోగా ఆమెకు కన్ను మలిగింది. అంతే ఆమె నిద్ర ఒడిలోకి జారిపోయారు. ఆ తరువాత హ(జత్ సుఫ్వాన్ బిన్ ముఅత్తల్ (ర) గారి పిలుపును విని నిద్ర నుండి మేల్కొన్నారు. ఆయన ఆమెను చూడగానే "ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్" అని పఠిస్తూ అయ్యో! ఈమెగారు దైవప్రవక్త (స) గారి సతీమణి...! అని ఆశ్చర్యాన్ని ప్రకటించారు. హ(జత్ సుఫ్వాన్ సైన్యం వెనుకగా నిద్రపోయినవారు. ఆయన అలవాటు బాగా నిద్రించే అలవాటు. ఆయన ముస్లిముల మాతృమూర్తి హ(జత్ ఆయిషా (ర)ను చూసి గుర్తుపట్టారు. ఎందు

కంటే పరదా ఆదేశం వెలువడక పూర్వం ఆయన ఆమెను చూసి ఉన్నారు. ఆయన ఇన్నాలిల్లాహ్ తప్ప తన నోట మరే పలుకూ పలకలేదు. తన వాహనాన్ని ఆమెకు దాపుగా కూర్చోబెట్టగా ఆమె దానిపై ఎక్కి కూర్చున్నారు. ఒంటె ముకుత్రాడు పట్టుకొని కాలి నడకన నడుస్తూ సైన్యం వెళ్ళిన దిశగా బయలు దేరారు. మిట్టమధ్యాహ్న సమయాన సైన్యం ఓ చోట విడిది చేసి ఉంది. ఆయన ఆ పరిస్థితిలో సైన్యంలోనికి వచ్చేశారు. చూసేవారు రకరకా లుగా చెప్పుకోవడం ఆరంభించారు. దైవ విరోధి అబ్దుల్లా బిన్ ఉబైకు కూడా తన కక్షను తీర్చుకోవడానికి అవకాశం లభించినట్లయింది. అతని హృదయంలో కాపట్యం, ఈర్ష్యాజ్వాలలు ఏవయితే రగులుతున్నాయో, ఆ బాధను బయటపెట్టడానికి అతను ముందుకు వచ్చాడు. ముస్లిముల మాతృమూర్తి హ(జత్ ఆయిషా (ర)పై అపవాదు వేస్తూ కట్టుకథలు అల్లడం ఆరంభించాడు. ఆ అపవాదును ప్రజల్లో వ్యాపింపజేయడానికి శాయశక్తులా ప్రయత్నాలు మొదలెట్టాడు. అతని అనుచరులు కూడా ఈ విషయాన్ని ప్రాతిపదికగా చేసి సాధ్యమైనంత దుష్ప్రచారం చేయనారంభించారు. అటు మహాప్రవక్త (స) ఏమీ మాట్లాడకుండా మిన్నకుండిపోయారు.

కాని ఓ సుదీర్ఘ కాలం వరకు దైవవాణి అవతరించకపోవడంతో, ఆయన హ(జత్ ఆయిషా (ర)కు దూరంగా ఉండి పోయే విషయంలో తన అనుచరులతో సంప్రదిం చాల్సివచ్చింది. హ(జత్ అలీ (ర), వివరాలు నోటితో చెప్పే బదులు సైగలతోనే, ఆమెకు దూరంగా ఉంటూనే మరొకరిని వివాహమాడమని సలహా ఇచ్చారు. కాని హ(జత్ ఉసామా (ర) వగైరా సహాబాలు మాత్రం, ఆమెను తన భార్యగానే ఉంచుకుని వేచి చూడండి, దైవవిరోధుల దుష్ప్రచారాలకు చెవులొగ్గవద్దని సలహా ఇచ్చారు. ఆ తరువాత మహాప్రవక్త (స) మెంబరు (ప్రసంగ వేదిక)పై నిలబడి, అబ్దుల్లా బిన్ ఉబై ఆగడాల నుండి తనను రక్షించమని సహచరు లకు చెప్పడం జరిగింది. అది విన్న హ(జత్ సఅద్ బిన్ ముఆజ్ (ర), అతణ్ణి హతమార్చమని మహాప్రవక్త (స)కు సలహా ఇచ్చారు. అయితే, అబ్దుల్లా బిన్ ఉబై తెగ ఖ(జజ్‌కు సర్దారు అయిన హ(జత్ సఅద్ బిన్ ఉబాదాకు ఈ మాటలు రుచించలేదు. ఆయనకు తెగ దురభిమానం పొడుచుకు వచ్చింది. ఇరువైపుల నుండి కఠిన పదజాలాలు వెలువడనారంభించాయి. దీని ఫలితంగా అవస్ మరియు ఖ(జజ్ తెగలు

తిరిగి ఉగ్రులయ్యారు. మహాప్రవక్త (స) ఆ రెండు తెగలను ఎంతో కష్టపడి శాంతపరచగలిగారు. దైవప్రవక్త (స) కూడా ఆ విషయాన్ని గూర్చి మరి మాట్లాడలేదు.

ఇటు హజ్రత్ ఆయిషా (ర) గారి పరిస్థితి ఎలాగుందంటే, ఆమె ఆ గజ్వా నుండి తిరిగి రాగానే వ్యాధికి గురై మంచానపడ్డారు. అలా పూర్తి ఒక నెల వరకు వ్యాధిలోనే ఉండిపోయారు. ఆమెకు ఈ అపవాదు గురించి ఏ మాత్రం తెలియదు. అయితే ఆమెకు మాత్రం దైవప్రవక్త (స) వ్యాధి సమయంలో చేసే పరామర్శ గురించి బాగా తెలుసు. ఆయన మాటిమాటికి పరామర్శిం చడానికి వచ్చేవారు. కాని ఇప్పుడు ఒక నెల అయిపోయినా తన వైపు చూడ నైనా చూడడంలేదు. ఇదే ఆమె మనస్సును తొలుస్తున్న ప్రశ్న. వ్యాధి నయమై పోయిన తరువాత ఆమె 'ఉమ్మె మస్తహ్' వెంట బహిర్భూమి కని బయలు ప్రదేశానికి వెళ్ళారు. అనుకోకుండా ఉమ్మె మస్తహ్ తాను కప్పుకున్న దుప్పటి కాళ్ళలో పడగా పడిపోయారు. అలా పడిపోయిన తరువాత ఆమె తన కుమారుడు మస్తహ్‌ను శపించారు. అలా ఆమె తన కుమారునికి శాపనార్థాలు పెడుతూ ఉండగా చూసి హజ్రత్ ఆయిషా (ర) ఆమెను మందలించడం జరిగింది. ఉమ్మె మస్తహ్, హజ్రత్ ఆయిషా (ర)కు, తన కుమారుడు అపవాదులు వేసేవారిలో ఒకడని చెప్పడానికిగాను అసలు విషయం అంతా చెప్పెయ్యడం జరిగింది. హజ్రత్ ఆయిషా (ర) తిరిగి వచ్చి అసలు విషయాన్ని తెలుసుకోవడానికి గాను దైవప్రవక్త (స)గారి అనుమతి తీసుకొని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్ళిపోయారు. అసలు విషయం పూర్తిగా తెలియగానే ఆమెకు దుఃఖం ఆగలేదు. అలా రెండు రాత్రులు, ఒక పగలు ఏడుస్తూనే గడిపివేశారు. ఈలోపు నిద్రాహారాలు మానేశారు. అలా ఏడుస్తూ గుండె పగిలి చనిపోతానేమో అని కూడా అనుకున్నారామె. ఈ పరిస్థితిలోనే దైవప్రవక్త (స) ఆమె వద్దకు అరుదెంచారు. సద్వచనంతో కూడిన ఖుత్బా చదివి, ఆమెతో, "ఓ ఆయిషా! నాకు నీ గురించి ఫలానా విధంగా జరిగిందని తెలిసింది. నీవే గనక దాని గురించి ఏమీ తెలియదు అని చెబితే, అల్లాహ్ త్వరలోనే నీ నిర్దోషి త్వాన్ని చాటుతాడు. ఒకవేళ నీవే గనక దానికి ఒడిగట్టి ఉంటే మాత్రం అల్లాహ్ మన్నింపు కోసం వేడుకో. తౌబా చెయ్యి. ఎందుకంటే దాసుడు తన పాపాలను ఒప్పుకొని దైవం ఎదుట పశ్చాత్తాపపడితే, అల్లాహ్ ఆ దాసుని తౌబా మన్నించి క్షమిస్తాడు" అన్నారు.

ఆ మాటలు వినగానే హజ్రత్ ఆయిషా (ర) గారి ఏడుపు ఆగిపోయింది. కన్నీళ్ళు మటుమాయమయ్యాయి. ఆమె తన తల్లిదండ్రులతో దైవప్రవక్త (స)కు సమాధానం ఇవ్వండి అని చెప్పారు. అయితే ఏమని సమాధానం ఇవ్వాలో వారికి తోచలేదు. అందుకని ఆమెయే స్వయంగా కల్పించుకొని, "దైవసాక్షి! నాకు తెలుసు. ఈ విషయాన్ని వినీ వినీ అది మీ హృదయాల్లో ముద్రించుకుపోయిందని. మీరంతా దీన్ని నిజం అని అనుకుంటున్నారు. కాబట్టి ఒకవేళ నేను ఇది తప్పు అని, నాకు దానితో ఏ సంబంధం లేదని చెప్పినా మీరు నమ్మరు- అల్లాహ్‌కు బాగా తెలుసు, నేను నిర్దోషినని- ఒకవేళ నేను దీన్ని ఒప్పుకుంటే - అల్లాహ్‌కు బాగా తెలుసు, నేను నిర్దోషినన్న విషయం - మీరు అది నిజమే అని అనుకుంటారు. ఇలాంటి పరిస్థితిలో, నాకూ మీకు నడుమగల విషయం అచ్చం హజ్రత్ యూసుఫ్ (అ.స.) గారి తండ్రి చెప్పిన విషయం, "సహనమే మేలైనది. మీరు చెప్పే విషయాలను గురించి నాకు అల్లాహ్ సహాయం ఒక్కటే చాలు అన్నట్లు ఉంటుంది" అన్నారు.

ఆ తరువాత హజ్రత్ ఆయిషా (ర) మరో ప్రక్కకు తిరిగి పడుకున్నారు. ఆ సమయంలోనే దైవప్రవక్త (స) పై దివ్యావిష్కృతి అవతరింపనారంభించింది. దివ్యవాణి అవతరణ కఠినత్వం పూర్తిగా తొలగిపోయిన తరువాత మహాప్రవక్త (స) చిరునవ్వునవ్వుతూ ఉన్నారు. ఆయన మొట్టమొదటగా తన నోటి నుంచి పలికిన పదం, "ఓ ఆయిషా! అల్లాహ్ నీవు నిర్దోషివి అని చాటాడు" అన్నదే. ఇది విన్న ఆమె గారి తల్లి (సంతోషం పట్టలేక) "ఆయిషా! ప్రవక్త (స) వైపునకు కదిలివెళ్ళు. ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకో" అనగా, ఆమె ప్రేమాతిశయం ఉట్టిపడుతూ కొంత బింకంగా, "దైవసాక్షి! నేనెందుకు వెళ్ళాలి. నేను అల్లాహ్‌నే స్తుతిస్తాను" అన్నారు.

ఈ సందర్భంలో ఇఫ్క్ సంఘటనకు సంబంధించిన ఏ వాక్యాలు అయితే నూర్ సూరాలో అవతరించాయో అవి

فَصَبْرٌ جَمِيلٌ ۖ وَاللَّهُ الْمُسْتَعَانُ عَلَىٰ مَا تَصِفُونَ ۝

"ఇన్నల్లజీన జాఊబిల్ ఇఫ్కి ఉస్బతమ్ మిన్‌కుమ్" (ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చిన వారు, మీలోని ఒక వర్గంవారే) (24 : 11) నుండి ప్రారంభం అవుతాయి.

తదుపరి ఈ అపవాదును, అభాండాన్ని వేసిన నేరానికి మిస్తహ్ బిన్

అసాసా, హస్సాన్ బిన్ సాబిత్ మరియు హమ్నా బిన్తె హజష్ (ర)లకు ఎనభైయ్యేసి కొరడాల దండన విధించడం జరిగింది.[10]

అయితే ద్రోహి, నీచుడు అయిన అబ్దుల్లా బిన్ ఉబై వీపు ఈ కొరడాల బారిన పడకుండా తప్పించుకుంది. అభాండాలు వేసిన వారిలో అగ్రగణ్యుడు- అతడే ఈ వ్యవహారంలో ప్రముఖ పాత్రను పోషించినవాడు. అతనికి శిక్ష పడకపోవడానికి కారణం బహుశా, ఎవరికయితే దైవం నిర్దేశించిన శిక్షలు పడతాయో, వారి కోసం పరలోకంలో పడబోయే శిక్షల్లో తగ్గింపుగాని, క్షమాపణ గాని లభించడమే అయి ఉండవచ్చు. ఇహలోకంలో పడే శిక్ష వల్ల వారికి మన్నన లభించడం జరుగుతుంది. అల్లాహ్ అబ్దుల్లా బిన్ ఉబైకు పరలోకంలో భయంకరమైన శిక్షకు లోనుచేయదలచి ఉండడం వల్లనే ఇహలోక శిక్ష పడలేదు. ఈ కారణం మూలంగానే అతణ్ణి హతమార్చడం జరగలేదేమో.[11]

ఇలా ఒక నెల తరువాతగాని మదీనా వాతావరణం నుండి అనుమాన మేఘాలు దూరం కాలేదు. అబ్దుల్లా బిన్ ఉబై అగౌరవంపాలై తిరిగి తల ఎత్తుకోలేకపోయాడు. ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, అతను ఎప్పుడైనా నీచ కార్యానికి లేదా ముస్లిముల్లో భేదాభిప్రాయాలు సృష్టించడానికి ప్రయత్నిస్తే స్వయంగా అతని జాతివారే అతణ్ణి ఎత్తిపొడుస్తూ తిట్టేవారు. అతని ఈ పరిస్థితిని చూసి దైవప్రవక్త (స) హజ్రత్ ఉమర్ (ర)తో, "చూశావా ఉమర్! నీవు అతణ్ణి చంపివేయమని సలహా ఇచ్చిన నాడే అతణ్ణి హతమార్చి ఉన్నట్లయితే ప్రజలు మనలను తూలనాడేవారు కాదా? కాని ఈ రోజు అతనికి మరణ శిక్షను విధిస్తే వారే ఆ పని చేసిపెట్టేటట్లు ఉన్నారు" అనగా హజ్రత్ ఉమర్ దైవసాక్షి! ఈ విషయం నాకు బాగా అర్థం అయిపోయింది. దైవప్రవక్త (స) నిర్ణయమే నా నిర్ణయం కంటే మేలైన నిర్ణయం.[12]

---

10. ఇస్లామీయ చట్టంలో ఎవరయితే ఒకరిపై వ్యభిచారానికి సంబంధించిన అపవాదు వేస్తాడో దానికి తగిన సాక్ష్యాలు చూపకపోతే (ఆ అపవాదు వేసేవానికి) ఎనభై కొరడాల శిక్ష విధించాలని ఉంది.
11. సహీ బుఖారి-1/346, 2/696-698; జాదుల్ ముఆద్-2/113, 114, 115
12. ఇబ్నె హష్షామ్-2/293.

గజ్వయె బనీ ముస్తలిక్ తరువాత చేపట్టిన సైనిక చర్యలు

1. సరియ్యా దయారె బనీ కల్బ్ (దూమతుల్ జందల్ ప్రాంతం)

ఈ సైనిక పటాలాన్ని హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) గారి సారథ్యంలో షాబాన్ నెల హి.శ. 6లో పంపడం జరిగింది. దైవప్రవక్త (స) ఆయన్ను తన ఎదురుగా కూర్చోబెట్టుకొని స్వయంగా తన చేతి మీదుగా ఆయన తలపై తలపాగా కట్టారు. యుద్ధంలో మేలైన తీరును అవలంబించమని హితవు జేస్తూ, "వారే గనక మీకు విధేయులైపోతే వారి రాకుమార్తెను వివాహమాడండి" అని చెప్పి సాగనంపారు. అచ్చం దైవప్రవక్త (స) గారు చెప్పినట్లే జరిగింది. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) తమాజిర్ బిన్తె అజ్బగ్‌ను వివాహమాడారు. ఆ తరువాత ఈమె అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) గారి కుమారుడు అబూ సల్మాకు తల్లి అయింది. ఈ మహిళ తండ్రి తన జాతికి చెందిన సర్దారు మరియు రాజు కూడాను.

2. సరియ్యా దయారె బనీ సఅద్ (ఫిదక్ ప్రాంతం)

ఈ సైనిక పటాలం హజ్రత్ అలీ (ర) గారి నేతృత్వంలో షాబాన్ నెల హి.శ. 6లోనే పంపబడింది. ఈ సైనిక చర్యకుగల కారణం, బనూ సఅద్ తెగ ఓ యూదుల సైన్యానికి సహాయం అందిస్తూ ఉంది అనే వార్త అందడమే. కాబట్టి దైవప్రవక్త (స) హజ్రత్ అలీ (ర) గారికి తోడు రెండు వందల సైనికులనిచ్చి పంపించారు. వీరు రాత్రి పూట ప్రయాణిస్తూ పగలు దాగి ఉండేవారు. చివరికి వారికి ఓ వేగులవాడు పట్టుబడ్డాడు. అతను, యూదులకు ఖర్జూరాలు సరఫరా చేసేందుకు సహాయం చేయడానికి సిద్ధపడ్డానన్న విషయాన్ని అంగీకరించాడు. అదేకాకుండా ఆ వేగులవాడు, బనూ సఅద్ ఏ ప్రదేశంలో ప్రోగై ఉన్నారో కూడా తెలిపాడు. హజ్రత్ అలీ (ర), వారిపై రాత్రి పూట దాడి చేసి అయిదువందల ఒంటెల్ని, రెండు వేల మేకల్ని హస్తగతం చేసుకున్నారు. అయితే బనూ సఅద్ తమ భార్యాపిల్లలతో సహా పారిపోవడంలో కృతకృత్యులయ్యారు. వారి సర్దారు పేరు వబ్ర్ బిన్ అలీమ్.

3. సరియ్యా వాదియుర్ ఖురా (ఖురా లోయ)

ఈ సైనిక చర్య హజ్రత్ అబూ బక్ర్ సిద్దీక్ (ర) లేదా హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర) గారి నేతృత్వంలో రమజాన్ మాసం హి.శ. 6లో పంపబడిన సైనిక చర్య. ఈ సైనిక పటాలాన్ని పంపడానికి గల కారణం, ఫజారా తెగకు చెందిన ఓ శాఖ, మోసంతో దైవప్రవక్త (స)ను హతమార్చే ప్లాను వేయడమే. కాబట్టి మహాప్రవక్త (స) హజ్రత్ అబూ బక్ర్ సిద్దీక్ (ర)ను పంపించడం జరిగింది. హజ్రత్ సల్మా బిన్ అకూ (ర) ఆయన వెంట ఉన్నారు. ఆయన కథనం ప్రకారం, "ఈ సరియ్యాలో నేను కూడా ఆయన వెంటే ఉన్నాను. మేము ఫజ్ర్ నమాజు చేసిన తరువాత హజ్రత్ అబూ బక్ర్ (ర) దాడి చేయమని ఆదేశించ గానే మేము వారిపై దాడి చేశాము. అక్కడున్న ఊట బావిని హస్తగతం చేసుకున్నాము. అబూ బక్ర్ (ర) కొందరిని చంపేశారు. నేను, స్త్రీలు పిల్లలు కలిగిన ఓ గుంపును చూశాను. వీరు నా కంటే ముందు కొండపైకి వెళ్ళి పోతారేమోననే అనుమానం కలిగింది నాకు. కాబట్టి నేను వారిపైబడ్డాను. వారికి, కొండకు నడుమన ఉండి వారిపై శరపరంపరలను కురిపించగా వారు అక్కడనే ఆగిపోయారు. ఆ గుంపులో ఉమ్మె ఖర్ఫా పేరు గల ఓ మహిళ కూడా ఉంది. ఆమె పాత చొక్కాను తొడుక్కొని ఉంది. ఆమె వెంట ఆమె కుమార్తె కూడా ఉంది. ఈమె అరేబియాలోనే అతి అందగత్తెగా పేరుగాంచిన స్త్రీ. వారందరినీ అబూ బక్ర్ (ర) దగ్గరకు తీసుకొని వచ్చాను. ఆయన ఆ అమ్మాయిని నాకు బహూకరించారు. కాని నేను ఆమె ముసుగును మాత్రం తొలగించ లేదు."

ఆ తరువాత దైవప్రవక్త (స) ఈ యువతిని హజ్రత్ సల్మా బిన్ అకూ నుండి వేరు చేసి మక్కాకు పంపించారు. ఆమెకు బదులు అక్కడ నివసించే అనేక మంది ముస్లిము ఖైదీలను విడిపించడం జరిగింది.[1]

ఉమ్మె ఖర్ఫా ఓ షైతాను స్త్రీ. దైవప్రవక్త (స)ను హతమార్చడానికి అనేక పన్నాగాలు పన్నేది. దీని కోసమని ఆమె తన కుటుంబానికి చెందిన ముప్ఫై మంది ఉష్ట్రారోహుల్ని సిద్ధపరిచి ఉంచింది కూడా. దానికి ఆమెకు సరి అయిన ప్రతిఫలమే లభించింది. ఆ ముప్ఫై మంది ఉష్ట్రారోహులు చంపివేయబడ్డారు.

1. చూడండి, సహీ ముస్లిమ్-2/89; ఈ సరియ్యా హి.శ. 7లో సంభవించింది అని చెప్పుకోవడం కూడా జరిగింది.

4. సరియ్యా ఉర్నియ్యీన్

ఈ సైనిక పటాలం షవ్వాల్ నెల హిజ్రీ శకం ఆరులో, హజ్రత్ కర్జ్ బిన్ జాబిర్ ఫహ్రీ (ర)[2] గారి నేతృత్వంలో పంపబడింది. అక్ల్ మరియు ఉరీనాకు చెందిన కొందరు వ్యక్తులు మదీనాకు వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. వారు మదీనాలో ఉంటూ ఉండగా అక్కడి వాతావరణం వారికి సరిపడక రోగగ్రస్తు లయ్యారు. దైవప్రవక్త (స) వారికి కొన్ని ఒంటెలనిచ్చి పచ్చికబయళ్ళలో ఉంటూ ఒంటెల పాలు, దాని మూత్రం త్రాగుతూ ఉండండి అని పంపిం చారు. వీరు అలా చేసి ఆరోగ్యవంతులయ్యారు. దైవప్రవక్త (స)గారు వారి వెంట పంపించిన కాపరిని హతమార్చి వారు ఒంటెల్ని తోలుకొని వెళ్ళి పోయారు. అంటే, ఇస్లామ్ స్వీకరించిన తరువాత తిరిగి ముర్తద్‌లు (ధర్మ భ్రష్టులు) అయ్యారన్న మాట. కాబట్టి వారిని పట్టుకోడానికిగాను కర్జ్ బిన్ జాబిర్ ఫహరీ (ర)కి ఇరవై మందిని ఇచ్చి పంపించడం జరిగింది. పోయే టప్పుడు దైవప్రవక్త (స) అల్లాహ్‌ను ఇలా వేడుకున్నారు.

"ఓ అల్లాహ్! ఉర్నీలకు మార్గం అగుపడకుండా చెయ్యి. వారి మార్గాన్ని కష్టతరం చెయ్యి."

అల్లాహ్, ప్రవక్త (స) గారి ఈ దుఆను మన్నించాడు. వారికి మార్గం ఏమీ తోచలేదు. వారు పట్టుబడిపోయారు. వారు ముస్లిమ్ కాపరుల ఎడల అవలంబించిన తీరుకు ప్రతీకారంగా వారి కాళ్ళు చేతులు నరికివేయడం, వారి కళ్ళకు వాతలు పెట్టడం జరిగింది. అలా వారిని హర్రాలోని ఓ మారుమూల ప్రదేశంలో వదిలేయడం వల్ల అక్కడే అంతమైపోయారు.[3]

ఈ సంఘటన హజ్రత్ అనస్ (ర) గారు ఉల్లేఖించినట్లు సహీ బుఖారీ వగైరా గ్రంథాల్లో ఉంది.[4]

సీరత్ చరిత్రకారులు ఆ తరువాత మరో సరియ్యా గురించి రాస్తారు. అది హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర), హజ్రత్ సల్మా బిన్ అబీ సల్మా

2. బద్ర్ యుద్ధానికి పూర్వం గజ్వయె సఫ్వాన్‌లో మదీనా పశువులపై దాడి చేసి వాటిని మక్కాకు తోలుకుపోయిన వర్జ్ బిన్ జాబిర్ ఫహ్‌రీయే ఈయన. ఆ తరువాత ఆయన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి మక్కా విజయం సందర్భంగా అమరగతినొందారు.

3. జాదుల్ ముఆద్-2/122

4. సహీబుఖారి 2/602 వగైరాలు.

(ర)తో కలిసి షవ్వాల్ నెల హిజ్రీ శకం ఆరులో నడిపినట్లుగా చెప్పబడుతోంది. దీని వివరాల్లోనికి వెడితే, హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర), అబూ సుఫ్యాన్‌ను హతమార్చే ఉద్దేశ్యంతో మక్కాకు వెళ్ళారు. ఎందుకంటే, అబూ సుఫ్యాన్ ఓ బద్దూ (పల్లెవాసి)ను దైవప్రవక్త (స)ను హతమార్చే ఉద్దేశ్యంతో మదీనాకు పంపించడం జరిగింది. అయితే ఆ ఉభయుల్లో ఏ ఒక్కరూ తాము చేపట్టిన కార్యంలో కృతకృత్యులు కాలేకపోయారు.

అహ్‌జాబ్ యుద్ధం మరియు బనీ ఖురైజా గజ్వా తరువాత చోటు చేసుకున్న సరాయాలు మరియు గజ్వాలు ఇవి. వీటిలో ఎలాంటి భయంకరమైన యుద్ధమూ జరగలేదు. కేవలం మామూలు దాడులు మాత్రమే జరిగాయి. కాబట్టి వీటిని పోరాటాలకు బదులు సైనిక చర్యలుగానే చెప్పుకోవడం సమంజసమైన విషయం. ఇవి కేవలం సైనిక కవాతుల్లాంటివి. వీటి ఉద్దేశ్యం బద్దూలను, శత్రువులను భయభీతులు చేయడమే అని చెప్పవచ్చు. ఆ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తే, అహ్‌జాబ్ యుద్ధం తరువాత వాటిలో మార్పు రావడం గమనించవచ్చు. ఇస్లామ్ విరోధుల ధైర్యాలు దెబ్బతిన సాగాయి. ఇక ఇస్లామ్ ప్రాభవాన్ని భంగపరిచి ఇస్లామీయ ప్రచారాన్ని అడ్డుకోవడంలో ఎలాంటి ఆశ వారిలో మిగిలిలేదు. కాని ఈ మార్పు ప్రస్ఫుటంగా అగుపించింది ముస్లిములు హుదైబియా ఒప్పందం చేసుకున్న ప్పుడు మాత్రమే. ఈ ఒప్పందం అసలు ఇస్లామీయ శక్తిని గుర్తించి చేసుకున్న ఒప్పందం. ఆ కాలంలో ఈ శక్తికి అరేబియా ద్వీపకల్పంలో వ్యాపింపజేయకుండా ఉండడానికి ఏ శక్తీ అడ్డుకోజాలదు అనే యదార్థాన్ని చాటి చెప్పిన ఒప్పందం అది.

హుదైబియా ఒప్పందం

(జీఖాదా మాసం, హిజ్రీ శకం ఆరు)

ఉమ్రా కొరకు వెళ్ళడానికి గల కారణాలు

అరేబియా ద్వీపకల్పంలో పరిస్థితులు చాలామటుకు ముస్లిములకు అనుకూలంగా మారిపోయినందున ఇస్లామీయ సందేశ ప్రచారం విజయవంతం అవుతుందనే శుభ సూచనలు ఒక్కొక్కటిగా స్పష్టంగా గోచరించ సాగాయి. ఆరు సంవత్సరాల వరకు ముస్లిముల కొరకు మూయబడిన మస్జిదె హరాం (కాబా మస్జిద్) ద్వారాలు తెరుచుకొని, వారి ఆరాధనకు అడ్డు తగిలిన పరిస్థితులు కూడా మారిపోనారంభించాయి.

మదీనాలో మహాప్రవక్త (స)కు, తాము, తమ అనుచరగణం కలసి మస్జిదె హరాంలో ప్రవేశిస్తున్నట్లుగా, ఆయన (స) కాబా తాళపు చెవులను తన చేతిలో తీసుకొని సహబా (ర)తో సహా బైతుల్లాహ్ (కాబా) తవాఫ్ (ప్రదక్షిణ) చేస్తున్నట్లుగా, కొందరు తల వెంట్రుకలను గొరిగించుకున్నట్లుగా, మరికొందరు వెంట్రుకల్ని కత్తిరించుకున్నట్లుగా ఓ స్వప్నంలో చూయించడం జరిగింది. మహాప్రవక్త (స) ఈ స్వప్న వృత్తాంతాన్ని తమ అనుచరగణానికి చెప్పగా వారికి ఎంతో ఆనందం కలిగింది. ఈ స్వప్నాన్ని విన్నంతనే వారు, ఈ సంవత్సరమే తమకు మక్కాలో ప్రవేశించే భాగ్యం లభిస్తుందని తలపోశారు. అంతేకాదు మహాప్రవక్త (స) వీరికి తాము (స) ఉమ్రా కూడా చేస్తామని సూచించడం మూలంగా వారంతా ప్రయాణానికి సిద్ధం అయిపోయారు.

బయలుదేరడానికి వెలువడిన ప్రకటన

దైవప్రవక్త (స) మదీనా చుట్టుపట్ల ఉన్న జనవాసాల్లో వారంతా తన వెంట ఉమ్రా చేయడానికి బయలుదేరమని ప్రకటన చేయించారు. కాని అనేక బద్దూలు తాత్సారం చేయనారంభించారు. ఇటు దైవప్రవక్త (స) సిద్ధమై

మదీనా వ్యవస్థను పర్యవేక్షించడానికి ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (ర), మరో ఉల్లేఖనంలో, నమీలా లైసీ (ర)ను నియమించి తన 'ఖస్వా' పేరు గల ఒంటెనెక్కి, జీఖాదా మాసం ఒకటవ తేదీ (హి.శ.6) సోమవారం రోజున బయలుదేరారు. మహాప్రవక్త (స) గారి వెంట ఉమ్ముల్ మోమినీన్ (ముస్లిముల మాతృమూర్తి) హజ్రత్ ఉమ్మె సల్మా (ర) కూడా ఉన్నారు. మొత్తం బయలుదేరి వెళ్ళిన సహాబా (ర)ల సంఖ్య పదునాలుగు వందలు (పదిహేను వందలు అని ఓ ఉల్లేఖనంలో ఉంది). దైవప్రవక్త (స) కేవలం ప్రయాణంలో వెంట ఉంచుకునే ఆయుధాలు అంటే ఒరలోనే ఉన్న ఖడ్గాలు తప్ప మరే ఆయుధాలు ఆయన వద్ద లేవు.

మక్కా వైపునకు ముస్లిముల కదలిక

దైవప్రవక్త (స) మక్కా వైపునకు బయలుదేరి ప్రయాణం చేస్తూ 'జుల్‌హులీఫా' అనే ప్రదేశానికి వెళ్ళి "హదీ"[1] పశువుల మెడల్లో పట్రాలు తొడిగారు. ఒంటెల మూపరాలను చీల్చి గుర్తులు పెట్టి ఉమ్రా ఎహ్రామ్ కట్టుకున్నారు. ఇలా చేయడం వల్ల చూసేవారు, వారు యుద్ధం చేయడానికి రాలేదని తెలియపర్చడం. అలా చేసిన తరువాత ఖురైష్ ఏమనుకుంటున్నారో తెలుసుకురమ్మని ఖుజాఅ తెగకు చెందిన ఓ వేగులవాణ్ణి పంపించి ఆరా తీయడం జరిగింది. వీరు ప్రయాణిస్తూ అస్ఫాన్ దాపుకు చేరగానే ఆ వేగుల వాడు వచ్చి, కఅబ్ బిన్ లువై అనేవాడు తమతో ఢీకొనడానికి అహాబీష్‌ను (మిత్రపక్షాల నీగ్రో సైన్యాన్ని) సమీకరిస్తున్నాడని, తమరు కాబా గృహానికి వెళ్ళకుండా అడ్డుకోడానికి ప్రయత్నిస్తున్నాడని వార్తనందించాడు ప్రవక్త (స) గారికి. ఈ వార్త అందిన తరువాత మహాప్రవక్త (స) తన సహచరులను సంబోధిస్తూ, "వీరు ఖురైష్ కొమ్ముకాస్తున్నారు. అందుకని మనం వారి కుటుంబాలపై విరుచుకుపడి వారిని ఎందుకు పట్టుకోకూడదు? మనం

1. హదీ అంటే హజ్ లేదా ఉమ్రాకు వెళ్ళేవారు మినా అనే ప్రదేశంలో జిబహ్ చేసే జంతువులు. అరేబియా సంప్రదాయం ప్రకారం, హదీ పశువు మేక లేక గొర్రె అయినట్లయితే అది జిబహ్ చేసే జంతువు అని తెలియడానికిగాను దాని మెడలో ఖలాదా (పట్టా) వేసేవారు. అదే ఒంటె అయితే దాని మూపరాన్ని చీల్చి దానిపై రక్తం పులిమేవారు. అరబ్బులు ఇలాంటి జంతువు జోలికి పోయేవారు కారు. ఆ తరువాత ఇస్లామీయ ధర్మశాస్త్రం ఆ సంప్రదాయాన్నే కొనసాగించింది.

అలాగే మిన్నకుండిపోతే వారు, మనం యుద్ధం వల్ల ఏర్పడిన దుఃఖం వల్ల మిన్నకుండిపోయాము అని అనుకుంటారు. మీ సలహా ప్రకారం మనం కాబా గృహం వైపునకు ప్రయాణించి ముందుకు వెడితే మనకు ఎదురైన వారితో తలపడాల్సి ఉంటుంది. ఈ విషయంలో మీరిచ్చే సలహా ఏమిటో చెప్పండి" అని అడిగారు. దీనికి హజ్రత్ అబూ బక్ర్ సిద్దీక్ (ర) లేచి, "ఈ విషయం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) గారికే బాగా తెలుసు. కాని మనం మాత్రం ఉమ్రా చేయడానికి బయలుదేరివచ్చినవారం. ఎవరితోనూ యుద్ధం చేయడానికి రాలేదు. అయితే మనకూ, దైవగృహానికీ మధ్య ఎవరైనా అడ్డుగా నిలిస్తే మాత్రం వారిని చీల్చి చెండాడుతాం" అని విన్నవించుకున్నారు. దైవ ప్రవక్త (స) ఈ మాటలు విని, "సరే పదండి అలానే చేద్దాం" అని తమ ప్రయాణాన్ని కొనసాగించనారంభించారు.

కాబా గృహానికి రాకుండా ముస్లిములను అడ్డుకునే ప్రయత్నం

ఇటు ప్రవక్తశ్రీ (స) ఉమ్రా కోసం బయలుదేరిన విషయం తెలిసిన ఖురైష్‌లు ఓ సలహా సంఘాన్ని పిలిచారు. ఎలాగైనా సరే ముస్లిములను కాబా గృహానికి దూరంగా ఉంచడమే వారి అభిమతం. దైవప్రవక్త (స) అహాబీష్ (నీగ్రో) మూకలను తప్పించుకొని తమ ప్రయాణం కొనసాగిస్తూ ఉండగా, బనీ కఅబ్‌కు చెందిన ఓ వ్యక్తి వచ్చి, ఖురైష్ 'తువా' అనే ప్రదేశంలో విడిది చేసి ఎదురుచూస్తున్నారన్న వార్తను అందించాడు. ఖాలిద్ బిన్ వలీద్ రెండు వందల ఉష్ట్రారోహుల్ని వెంటబెట్టుకొని 'కురా అల్ గనీమ్' అనే చోట వేచి చూస్తున్నాడని తెలియజేశాడు (కురా అల్ గనీమ్ మక్కాకు వెళ్ళే ప్రధాన వ్యాపార రహదారిపై ఉంది). ఖాలిద్ ముస్లిములను మక్కాకు వెళ్ళకుండా అడ్డగించడానికి తన ఉష్ట్రారూఢుల్ని కనుచూపు మేరలో నిలబెట్టాడు. ఖాలిద్, ముస్లిములు జొహ్ర్ నమాజులో రుకూ మరియు సజ్దాలు చేస్తుండగా చూసి, వీరు ఏమరుపాటులో ఉన్నారు. ఈ సమయంలో దాడి చేస్తే ఎంత బాగుండును అని అనుకున్నాడు. ఆ తరువాత అతను అస్ర్ నమాజులో ముస్లిములపై ఒక్కసారే విరుచుకుపడడానికి నిర్ణయం తీసుకున్నాడు. కాని అల్లాహ్ ఈలోపు 'సలాతుల్ ఖౌఫ్' (యుద్ధ పరిస్థితిలో చేసే నమాజు విధానం) గురించి ఆదేశాలు అవతరింపజేయడం వల్ల ఖాలిద్‌కు ఆ అవకాశం కూడా చేదాటి పోయినట్లయింది.

భీకర పోరాటాన్ని తప్పించుకోవడానికి మార్గాన్ని మార్చడం

ఇటు మహనీయ ముహమ్మద్ (స) కురా అల్ గనీమ్ ప్రధాన రహదారిని వదిలి ఓ క్లిష్టమైన మార్గాన్ని ఎంచుకున్నారు. అది దుర్గమ పర్వత లోయల గుండా వెళ్ళే దారి. అంటే ఆయన (స) కుడి ప్రక్కగా బయలుదేరి హమష్ మధ్య భాగం నుండి వెడుతున్నారు. అది సనియతుల్ మరార్ అనే ప్రదేశం గుండా పోయే మార్గం. సనియతుల్ మరార్‌ను దాటి 'హుదైబియా' అనే ప్రదేశంలో విడిది చేశారు ఆయన. ఈ హుదైబియా మక్కాకు దిగువన ఉన్న ప్రాంతం. ఈ మార్గాన్ని ఎంచుకోవడం వల్ల మహాప్రవక్త (స)కు చేకూరిన ప్రయోజనం ఏమిటంటే, తన్‌ఈమ్ మీదుగా హరమ్‌కు (కాబాకు) వెళ్ళే మార్గం కురా అల్ గనీమ్ రాచమార్గం ఎడమ వైపున ఉండిపోతుంది. ఈ మార్గం పైన్నే ఖాలిద్ బిన్ వలీద్ సైనిక పటాలం మాటువేసి ఉంది. ఖాలిద్ బిన్ వలీద్ ముస్లిములు రేపే దుమ్మును చూసి వారు మార్గాన్ని మార్చారని అర్థం చేసుకుని తిరుగుముఖం పట్టాడు. హుటాహుటిన ఖురైష్‌కు ఈ క్రొత్త పరిస్థితిని తెలియజేసేందుకు పరుగులు తీస్తూ మక్కా చేరాడు.

ఇటు మహాప్రవక్త (స) తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ 'సనియ్యతుల్ మరార్' చేరగా ఆయన ఒంటె ఆ ప్రదేశంలో కూర్చుండిపోయింది. దాన్ని ఎంత అదిలించినా అది కదలలేదు. ఇది చూసిన ముస్లిములు దైవప్రవక్త (స)తో, "ప్రవక్తా! ఇది మొండికేసింది" అన్నారు.

"కాదు! ఇది మొండికేయలేదు. దానికి ఆ అలవాటు కూడా లేదు. ఏనుగుల్ని సయితం నిలిపివేసిన ఆ అల్లాహ్‌యే దాన్ని ఇక్కడ ఆపేశాడు. ఎవరి గుప్పెట్లోనయితే నా ప్రాణాలున్నాయో ఆ దేవుని సాక్షి! వీరు దైవం నిర్దేశించిన ఏ హద్దుల్ని కూడా గౌరవించరు. కాని నేను మాత్రం వాటిని పూర్తిగా గౌరవిస్తాను" అని చెప్పి తన ఒంటెను ఒక్కసారే అదిలించగా అది లేచి నిలబడింది. ఆ తరువాత దైవప్రవక్త (స) తాను వెడుతున్న మార్గాన్ని కొంత మార్చి హుదైబియా ప్రాంతంలో ఉన్న ఓ ఊట బావి వద్దకు వచ్చి ఆగారు. ఆ ఊట బావిలో నీరు అడుగంటి ఉంది. సహచరులు కొద్దికొద్దిగా నీరు తీసుకోవడం మూలంగా ఉన్న ఆ నీరు కాస్తా మాయమైపోయింది. వారు దాహం గురించి దైవప్రవక్త (స)కు విన్నవించుకోగా ఆయన తన తూణీరం నుండి ఓ బాణాన్ని తీసి, దాన్ని ఆ ఊట బావిలో పడవేయమని ఆదేశించారు. ఆ

బాణాన్ని అందు పడవేయగానే ఆ ఊట బావిలో నీరు పైకి ఉబకనారంభించింది. అందరూ కడుపార నీరు త్రాగి వెనక్కు వచ్చేశారు.

బుదైల్ బిన్ వర్కా మధ్యవర్తిత్వం

దైవప్రవక్త (స)కు, హుదైబియాకు వచ్చిన తరువాత కొంత స్థిమితం ఏర్పడింది. ఈలోపు 'బుదైల్ బిన్ వర్కా ఖుజాయి' తన ఖుజాఅ తెగకు చెందిన కొందరు పెద్ద మనుషుల్ని వెంటబెట్టుకొని మహాప్రవక్త (స) గారి సన్నిధిలో హాజరయ్యాడు. ఖుజాఅ తెగ దైవప్రవక్త (స) శ్రేయాన్ని కోరుతున్న తెగ. అతను దైవప్రవక్త (స)తో ఇలా అన్నాడు.

"నేను కఅబ్ బిన్ లుబా దగ్గర నుండే ఇటు వచ్చాను. అతను హుదైబియాకు చెందిన ఒయాసిస్సు దగ్గర విడిది చేసి ఉన్నాడు. అతని వెంట స్త్రీలు, పిల్లలు కూడా ఉన్నారు. అతను తమతో పోరాడడానికి, కాబా గృహానికి పోకుండా తమను అడ్డుకోవడానికి గట్టి నిర్ణయం తీసుకున్నాడు."

"మేము ఎవరితోనూ పోరాడడానికి రాలేదు. ఖురైషలను యుద్ధాలు సర్వనాశనం చేసివేశాయి. వారే కోరితే ఓ నిర్ణీత కాలం వరకు సంధి చేసుకోదలిచాను. వారు నాకు, నా సహచరులకు నడుమ అడ్డుగా నిలువ కుండా ఉండాలి. ప్రజలు ఇస్లామ్ ధర్మంలో ఎలా చేరిపోతున్నారో వారు కూడా ఇస్లామ్ ధర్మంలో చేరితే మంచిదే. కాదంటారా ఈ ఒప్పందం ద్వారా వారికి శాంతి అయినా లభిస్తుంది. ఒకవేళ వారికి పోరాటం తప్ప మరేదీ నచ్చనట్లయితే దైవసాక్షిగా చెబుతున్నాను! ఎవరి చేతుల్లోనయితే నా ప్రాణాలున్నాయో, నేను నా ధర్మం విషయంలో నా తల నా మొండెం నుండి వేరైనంతమట్టుకు పోరాడుతూనే ఉంటాను. లేదా అల్లాహ్ తన నిర్ణయాన్ని వారిపై అమలునయినా చేస్తాడు" అన్నారు మహాప్రవక్త (స).

"తమరు చెప్పిన విషయం ఉన్నది ఉన్నట్లుగా వారికి తెలియజేస్తాను" అంటూ బుదైల్ ఖురైష్‌ల వద్దకు వెళ్ళి, "నేను ఆయన్ను కలిసే వస్తున్నాను. నేను ఆయన చెప్పిన మాటలు బాగా విన్నాను. మీరు వినదలచుకుంటే మీ ముందు ఉంచగలను" అన్నాడు బుదైల్.

"లేదు, మేము వినే అవసరమే లేదు. నీవు మా ముందు ఆయన చెప్పింది ఏమీ చెప్పొద్దు" అన్నారు వారిలోని కొందరు మూర్ఖులు.

కాని ఎవరికయితే కొంత బుద్ధివివేచనలున్నాయో వారు మాత్రం, "చెప్పు, ఆయన ఏమని చెప్పాడో" అని అడిగారు.

బుదైల్, దైవప్రవక్త (స) చెప్పిన మాటలనే వారికి వినిపించాడు.

ఈ మాటలు విన్న ఖురైషులు ప్రవక్త (స) వద్దకు ముక్రజ్ బిన్ హఫజ్ అనే వ్యక్తిని విషయాలు తెలుసుకురమ్మని పంపించారు. దైవప్రవక్త (స) అతణ్ణి దూరం నుండే చూస్తూ, "ఒప్పందాలను త్రెంచే నీచుడు వస్తున్నాడు చూడండి" అని సహాబాకు చెప్పారు. అతను దగ్గరకు వచ్చి దైవప్రవక్త (స)తో మాట్లాడాడు. ఇదివరకు బుదైల్‌కు చెప్పిన విషయమే అతనికి చెప్పారు దైవప్రవక్త (స). అతను వెనుదిరిగి వెళ్ళి ఆ విషయం పూర్తిగా ఖురైషులకు చెప్పాడు.

ఖురైష్ పంపిన దూతలు

ఆ మాటలు విన్న హలీస్ బిన్ అల్కమా అనేవాడు, నాకు ఆయన దగ్గరకు పోయే అనుమతినివ్వండి అని అడగగా, ఖురైష్ అతన్ని వెళ్ళిరమ్మని పురమాయించారు. అతను దైవప్రవక్త (స)కు అగుపడగానే ఆయన తన సహచరులతో, "చూడండి, వచ్చేవాడు ఫలానా వ్యక్తి. ఇతను హదీ పశువులను అధికంగా గౌరవించే జాతికి చెందినవాడు. కాబట్టి మీరు అతనికి ఎదురుగా మీ హదీ పశువులను నిలబెట్టండి" అని ఆదేశించారు. సహాబా (ర) ఆ ఖుర్బానీ పశువులను అతనికి ఎదురుగా తోలి తల్బియా పఠించనారంభించారు. అతను అది చూసి, "సుబ్హానల్లాహ్! వీరిని దైవగృహానికి పోకుండా ఆపడం సరి అయిన విషయం కాదు" అంటూ మాట్లాడకుండానే వెనక్కు వెళ్ళిపోయి, తన మిత్రులతో,

"నేను హదీ పశువుల్ని చూశాను. వాటి మెడలలో పట్టాలున్నాయి. ఒంటెల కోహాన్లు (మూపరాలు) కూడా చీల్చబడి ఉన్నాయి. నేను మాత్రం వారిని దైవగృహం కాబాకు రాకుండా అడ్డుకోవడం సరి అయిన విషయం కాదని తలుస్తున్నాను" అన్నాడు. దీనికి ఖురైష్ అన్న మాటలకు అతనికి కోపం కూడా వచ్చింది.

ఈ సందర్భంలోనే ఉర్వా బిన్ మస్ఊద్ సఖఫీ కల్పించుకుని,

"ఆ వ్యక్తి (ముహమ్మద్-స) మీ ముందు ఓ మంచి ప్రతిపాదనను ఉంచాడు. కాబట్టి మీరు దాన్ని స్వీకరించాలి. ఆయన దగ్గరకు నన్ను

పోనివ్వండి" అని అడిగాడు. సరే అన్నారు వారు. అతను దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి మాట్లాడనారంభించగా, ఇదివరకు బుదైల్‌కు చెప్పిన విషయమే అతనికి చెప్పారు మహాప్రవక్త (స). అది విన్న ఉర్వా,

"ఓ ముహమ్మద్! గతంలో తన జాతినే అంతమొందించిన ఏ వ్యక్తి గురించి అయినా విన్నావా? ఇప్పుడు నీవు నీ జాతినే అంతమొందించ బూనావు. ఒకవేళ అలా కాని పక్షంలో, దైవసాక్షిగా చెబుతున్నాను, నీ వెంట ఉన్న వారంతా నిన్ను వదిలేసి పారిపోయే పోకిరి వెధవల్లా అగుపడుతున్నారు నాకు" అని రెచ్చగొట్టే మాటలు మాట్లాడనారంభించాడు. ఇది విన్న హజ్రత్ అబూ బక్ర్(ర) గారికి కోపం కట్టలు త్రెంచుకుంది. "ఓరీ నీచుడా, లాత్ దేవుని మర్మాంగాన్ని నాకేవాడా! మేమా దైవప్రవక్త (స)ను వదిలి పారిపోయేవారం!" అని తిట్టారు. ఇది విన్న ఉర్వా, అబూ బక్ర్ (ర) వైపు చూసి ఇతనెవరూ? అని అడిగాడు. ఈయన హజ్రత్ అబూ బక్ర్ (ర) అని పరిచయం చేశారు అక్కడున్న వారు. అతను అబూ బక్ర్ (ర)ను సంబోధిస్తూ,

"చూడూ! నా ప్రాణాలు ఎవరి చేతిలో ఉన్నాయో ఆ దైవం సాక్షిగా చెబుతున్నాను. నీవు ఒకప్పుడు నాకు సహాయం చేసి ఉన్నావు. దానికి ప్రతిఫలం ఇంకా నేను నీకు ముట్టజెప్పలేదు. అదే గనక అప్పుడు జరిగి ఉంటే నీవు అన్న మాటలకు సమాధానం ఇచ్చి ఉండేవాణ్ణి" అన్నాడు.

ఆ తరువాత ఉర్వా, దైవప్రవక్త (స)తో మాట్లాడనారంభించాడు. అతను మాటల సందర్భంలో మాటిమాటికి మహాప్రవక్త (స) గారి గెడ్డాన్ని పట్టుకుంటున్నాడు. ముగైరా బిన్ షూబా (ర) దైవప్రవక్త (స) గారి వెనుకే నిలబడి ఉన్నారు. ఆయన చేతిలో కరవాలం ఉంది. తలపై శిరస్త్రాణమూ ఉంది. ఉర్వా అలా దైవప్రవక్త (స) గారి గెడ్డం వైపునకు తన చేతిని చాచుతూ ఉండగా చూసి తన కరవాలం పిడితో అతని చేతి మీద కొడుతూ, జాగ్రత్త! నీ చేతిని ప్రవక్త (స) గారి గెడ్డానికి దూరంగా ఉంచు అంటున్నారు. చివరికి ఉర్వా తన తలను పైకెత్తి ఆయన వైపు చూస్తూ ఇతనెవరూ? అని అడిగాడు.

"ఈయన ముగైరా బిన్ షూబా (ర)" అని బదులిచ్చారు అక్కడున్న వారు.

"ఓహో! ఓ విశ్వాసఘాతకుడా! నేను నీ విశ్వాసఘాతుకానికి తగిన శిక్షను వేయడానికి ప్రయత్నం చేయడంలేదనుకున్నావా?" అని అడిగాడు.

అసలు జరిగిన విషయం ఏమిటంటే, అజ్ఞాన కాలంలో (ఇస్లామ్ స్వీకరించక ముందు కాలం అన్న మాట) హజ్రత్ ముగైరా కొందరితో కలసి ఉన్నప్పుడు ఆయన వారిని సంహరించి వారి సంపదనంతా ఎత్తుకొని పారిపోయారు. ఆ తరువాత ఆయన వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. అప్పుడు దైవప్రవక్త (స) ఆయనతో ఇలా అన్నారు కూడా.

"నేను నీ ఇస్లామ్ స్వీకారాన్ని ఒప్పుకుంటున్నాను కాని నీవు కొల్లగొట్టిన ధన సంపదతో నాకెలాంటి సంబంధం లేదు." (ఈ వ్యవహారంలో ఉర్వా చేసిన ప్రయత్నం ఎలాంటిదంటే ఆయన అతని సోదర కుమారుడై ఉండడమే.)

ఆ తరువాత దైవప్రవక్త (స) గారి ఎడల వారి సహచరుల సంబంధాలు ఎలా ఉన్నాయో గమనిస్తూపోయాడు. తన మిత్రుల దగ్గరకు తిరిగి వచ్చి ఇలా అన్నాడు.

"ఓ నా జాతి ప్రజలారా! దైవసాక్షి! నేను కైజరు, కిస్రా మరియు నజాషి లాంటి రారాజుల దర్బారులకు కూడా పోయి వచ్చినవాణ్ణి. దైవాన్ని సాక్షిగా పెట్టి చెబుతున్నాను. నేను వారిలో ఏ రాజును కూడా ముహమ్మద్ (స) సహచరులు గౌరవించినంతగా గౌరవించడం చూడలేదు. ఆయన కాండ్రించి ఉమ్మి వేస్తే అది ఎవరిపైనైనా పడితే దాన్ని వారు తాము ముఖాలపై, శరీరాలపై పులుముకుంటారు. ఆయన ఏ ఆదేశం ఇచ్చినా దాన్ని నిర్వర్తిం చడానికి పరుగిడుతారు. ఆయన వుజూ చేసుకునేటప్పుడు, వారంతా ఆ నీటి కోసం తగువులాడుతున్నారా అన్నట్లు ఎగబడతారు. ఆయన ఏదైనా పలుకును తమ నోటి నుండి వెలువరించినా నిశ్శబ్దంగా వింటారు. గౌరవం ఉట్టిపడే టట్లు ఆయన వైపు సరిగా చూడనైనా చూడరు. ఆయన ఓ ప్రతిపాదన చేశారు. అది ఎంతో మేలైన ప్రతిపాదన. కాబట్టి మీరు దాన్ని ఒప్పుకోక తప్పదు."

యుద్ధం జరగకుండా మిమ్మల్ని రక్షించినవాడు ఆయనే

ఖురైష్‌కు చెందిన యుద్ధోన్మాదులైన యువకులు, వారికి సంబంధించిన నాయకులే సంధికి దిగివస్తున్నారన్న విషయాన్ని తెలుసుకొని దాన్ని భంగపరచడానికిగాను ఓ ప్రణాళికను సిద్ధం చేశారు. వారు రాత్రి అంధకారంలో ఎవరికీ తెలియకుండా ముస్లిముల శిబిరంలో చొరబడి బీభత్సం సృష్టిద్దామని అనుకున్నారు. దీనివల్ల సంధికి బదులు యుద్ధం అనివార్యమైపోతుంది అని

వారి అంచనా. అంతేకాదు వారు దీన్ని అమలుపరచడానికి అడుగు ముందుకు వేశారు కూడా. రాత్రి నడిఝాము సమయంలో డెబ్భై మంది యువకులు జబ్లె తన్‌యీమ్ (తన్‌యీమ్ పర్వతం)పైనుండి క్రిందికి దిగి ముస్లిముల శిబిరంలో చొరబడే ప్రయత్నం చేశారు. కాని ఇస్లామీయ పహరాదార్ల కమాండరు ముహమ్మద్ బిన్ ముస్లిమా వారందరిని చుట్టుముట్టి బంధించేశారు. ఆ తరువాత వారిని దైవప్రవక్త (స) గారి ఎదుటకు తీసుకురాగా, ఆయన జరగబోయే సంధిని దృష్టిలో ఉంచుకొని వారందరిని విడుదల చేసేశారు. ఈ విషయమే దివ్యఖుర్ఆన్‌లో ఇలా వివరించబడింది.

وَهُوَ الَّذِي كَفَّ أَيْدِيَهُمْ عَنكُمْ وَأَيْدِيَكُمْ عَنْهُم
بِبَطْنِ مَكَّةَ مِنۢ بَعْدِ أَنْ أَظْفَرَكُمْ عَلَيْهِمْ ۚ

"మక్కా లోయలో వారి చేతులను మీ నుండి, మీ చేతులను వారి నుండి ఆపినవాడు ఆయనే. వాస్తవానికి ఆయన మీకు వారిపై ఆధిక్యం ఇచ్చాడు." (48 : 24)

హజ్రత్ ఉస్మాన్ (ర) గారి దౌత్యం

ఇప్పుడు దైవప్రవక్త (స), తమ ప్రస్తుత ప్రయాణాన్ని గురించి విడమర్చి చెప్పడానికి ఖురైష్‌ల ముందుకు ఓ దూతను పంపాలని నిశ్చయించుకున్నారు. దాని కోసం ఆయన (స), హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)ను పిలువనంపారు. కాని ఆయన, "ఓ అల్లాహ్ ప్రవక్తా! ఒకవేళ అక్కడ నన్ను బాధించడం జరిగితే, బనీ కఅబ్‌లో ఏ వ్యక్తి కూడా వారి ఆగడాలను సహించక నన్ను ఆదుకునేవాడు కానరావడం లేదు. కాబట్టి తమరు హజ్రత్ ఉస్మాన్ (ర)ను అక్కడికి పంపించండి. ఆయన వంశం, కుటుంబం అంతా మక్కాలోనే ఉంది. అలా ఆయన తమ సందేశాన్ని వారికి అందజేసినవారవుతారు" అని విన్నవించుకున్నారు. మహాప్రవక్త (స) హజ్రత్ ఉస్మాన్ (ర)ను పిలువనంపి ఆయన్ను ఖురైషుల వద్దకు వెళ్ళమని ఆదేశిస్తూ, "వారికి ఎరుకపరచండి! మేము పోరాడడానికి రాలేదు, కేవలం ఉమ్రా చేయడానికి వచ్చాము అని. దానితో పాటు వారిని ఇస్లామ్ వైపునకు రమ్మని ఆహ్వానించండి. మక్కాలో ఉన్న విశ్వాసుల స్త్రీ పురుషులందరికి త్వరలోనే విజయం చేకూరుతుంది అనే శుభ వార్తను కూడా తెలుపండి. అల్లాహ్ తన ధర్మాన్ని మక్కాలో విస్తరింపజేస్తాడనీ, దానికే

విజయం చేకూరుతుందనీ, ఇస్లామ్ విషయంలో మునుముందు ఎవ్వరూ దాక్కునే అవసరం కూడా ఉండబోదనీ శుభవార్తనందించండి" అని చెప్పి పంపించారు.

హజ్రత్ ఉస్మాన్ (ర) దైవప్రవక్త (స) గారి సందేశాన్ని తీసుకొని మక్కాకు బయలుదేరారు. బల్దహ్ అనే ప్రదేశంలో ఖురైష్‌లు కూర్చుని ఉన్నారు. ఆయన్ను చూసి వారు ఎక్కడికీ ప్రయాణం? అని అడగగా, "దైవప్రవక్త (స) గారి సందేశాన్ని తీసుకుని వస్తున్నాను" అన్నారు.

"అది మాకు తెలుసులే. నీ పని నీవు చూసుకో" అని నిర్లక్ష్యంగా మాట్లాడారు. అక్కడే ఉన్న సయీద్ బిన్ ఆస్ లేచి ఆయన్ను ఆహ్వానించాడు. తన గుర్రంపై జీనుకట్టి ఆయన్ను ఎక్కించుకొని తన సంరక్షణలో మక్కాకు తీసుకొని వచ్చాడు. అక్కడకు వెళ్ళి ఆయన ఖురైషులకు దైవప్రవక్త (స)గారి సందేశాన్ని వినిపించారు. అది పూర్తి అయిన తరువాత ఖురైష్ హజ్రత్ ఉస్మాన్ (ర)తో మీరు కాబా గృహం ప్రదక్షిణ చేసుకోండని కోరారు. కాని ఆయన వారి ఈ కోరికను త్రోసిపుచ్చుతూ, దైవప్రవక్త (స) కంటే ముందు తాను తవాఫ్ చేయడం సరిఅయినది కాదని వారికి చెప్పారు.

హజ్రత్ ఉస్మాన్ (ర) అమరగతినొందారనే పుకారు - బైతె రిజ్వాన్

హజ్రత్ ఉస్మాన్ (ర) తన దౌత్యకార్యాన్ని పూర్తి చేసుకున్నారు. అయితే ఆయన్ను తిరిగి వెళ్ళకుండా ఖురైషులు తమ దగ్గరనే అపివేశారు. దీనికి కారణం లేకపోలేదు. ఖురైషులు ఆయన తెచ్చిన సందేశానికి ఏం సమాధానం చెప్పాలో వెంటనే అర్థం కాలేదు. వారు ఆయనకు ఏదో సమాధానం చెప్పి పంపిద్దామని అనుకున్నారు. ఈలోపు ముస్లిములు ఆయన కోసం ఎదురు చూస్తూ ఉండడం వల్ల వారిలో ఓ పుకారు బయలుదేరింది. హజ్రత్ ఉస్మాన్(ర)ను ఖురైషులు చంపివేశారనేదే ఆ పుకారు. దైవప్రవక్త (స)కు ఈ వార్త అందగానే ఆయన, "మనం యుద్ధం చేసి ఏదో ఒకటి తేల్చుకోనంత మట్టుకు ఇక్కడ నుండి కదిలేదే లేదు" అని చెప్పి తమ సహాబా(ర)లందరిని ఆ యుద్ధం కోసం ప్రయాణం చేయడానికి పిలుపునిచ్చారు. సహాబా (ర) లు దైవప్రవక్త (స)గారి ఆదేశం మేరకు ఆయన చుట్టూ ప్రోగైపోయారు. ఓ వర్గం; "మేము యుద్ధరంగాన్ని వదిలి పారిపోయేవారం కాదు" అనగా, మరో

వర్గం "ప్రాణాలు త్యాగం చెయ్యటానికి మేము సిద్ధం" అని ప్రమాణం చేసింది. అందరికంటే ముందు అబూ సనాన్ అసదీ ప్రమాణం చేశారు. హజ్రత్ సల్మా బిన్ అకూ (ర) అయితే మూడుసార్లు, బైత్ ప్రారంభంలో, మధ్యలో, చివరగా ప్రమాణం చేశారు. దైవప్రవక్త (స) స్వయంగా తన చేయినే పట్టుకొని, ఇది ఉస్మాన్ చెయ్యి అని అనగా అందరూ ఆ చేతి మీదుగా బైత్ చేయడం జరిగింది. బైత్ పూర్తి అవగానే హజ్రత్ ఉస్మాన్ (ర) కూడా మక్కా నుంచి తిరిగి వచ్చేశారు. ఆయన కూడా దైవప్రవక్త (స) గారి చేయి పట్టుకొని ప్రమాణం చేశారు. ఈ బైత్‌లో కేవలం ఒకే ఒక వ్యక్తి జుద్ బిన్ ఖైస్ అనేవాడు పాల్గొనలేదు. అతను మునాఫిక్.

దైవప్రవక్త (స) ఓ చెట్టు క్రింద కూర్చుని ఈ బైత్ తీసుకున్నారు. హజ్రత్ ఉమర్ (ర) దైవప్రవక్త (స)గారి చెయ్యి పట్టుకొని ఉన్నారు. హజ్రత్ మాఖిల్ బిన్ యసార్ (ర) ఆ చెట్టు కొమ్మలు కొన్నింటిని పట్టుకొని దైవప్రవక్త (స) పై పడకుండా ఎత్తి పట్టుకున్నారు. ఈ బైత్ (ప్రమాణం) పేరే బైతె రిజ్వాన్. ఈ బైత్ గురించి అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు.

لَقَدْ رَضِيَ اللّٰهُ عَنِ الْمُؤْمِنِيْنَ اِذْ يُبَايِعُوْنَكَ تَحْتَ الشَّجَرَةِ

"విశ్వాసులు వృక్షం క్రింద నీతో విధేయతా ప్రమాణం చేస్తున్నప్పుడు అల్లాహ్ వారిని చూసి ఆనందించాడు." (48:18)

ఒప్పందం మరియు ఆ ఒప్పందపు షరతులు

ఎలాగైతేనేమి ఖురైషులు పరిస్థితులు తమకు అనుకూలంగా లేవని గ్రహించి వెంటనే సుహైల్ బిన్ అమ్రూను వ్యవహారాన్ని చక్కబెట్టమని, సంధి కుదుర్చుకొని రమ్మని దైవప్రవక్త (స) వద్దకు పంపించారు. అలా పంపిస్తూ ఒప్పందంలో తప్పనిసరిగా, దైవప్రవక్త (స) ఈ సంవత్సరం వెనక్కు తిరిగి వెళ్ళిపోయే షరతు ఉండాలని మరీ మరీ తాకీదు చేశారు. అరబ్బులు, ప్రవక్త (స), వారి నగరంలో బలవంతంగా ప్రవేశించారనే భావన కలుగకుండా ఉండాలనేదే వారి అభిమతం. వారి సూచనలతో సుహైల్, మహాప్రవక్త (స) గారి సన్నిధిలో హాజరయ్యాడు. దైవప్రవక్త (స) అతను రావడం చూసి తన సహచరులతో, "మీ పని మీ కోసం సులువుగా మార్చడం జరిగింది. ఆ

వ్యక్తిని వారు పంపిస్తున్నారంటే ఖురైషులు మనతో సంధి కుదుర్చుకోడానికి సిద్ధపడ్డారన్నమాట" అన్నారు. సుహైల్, దైవప్రవక్త (స) వద్దకు వచ్చి చాలాసేపు చర్చించాడు. చివరకు, ఉభయ వర్గాల నడుమ ఈ క్రింది షరతులపై ఏకాభిప్రాయం కుదిరింది.

1. అల్లాహ్ ప్రవక్త (స) ఈ సంవత్సరం మక్కాలో ప్రవేశించకుండానే వెనక్కు మళ్ళిపోతారు. మరుసటి సంవత్సరం ముస్లిములు మక్కాకు వస్తారు. అక్కడ మూడు రోజులు ఉంటారు. వారి వెంట వాహనాలు ఉంటాయి. కరవాలాలు ఒరల్లోనే ఉంచుకోవాలి. వారిని ఏ విధంగానూ అడ్డుకోవడం జరగదు.
2. పదేళ్ళ వరకు ఉభయ వర్గాలు యుద్ధం జోలికి పోరాదు. ఈ కాలంలో అందరూ ప్రశాంతంగా ఉంటారు. ఏ ఒక్కడూ మరొకనిపై చెయ్యి ఎత్తడానికి వీల్లేదు.
3. ఎవరైనా ముహమ్మద్ (స)తో సంధి చేసుకుంటే చేసుకోవచ్చు. అలాగే మరెవరైనా ఖురైషులతో సంధి చేసుకుంటే చేసుకోవచ్చు. ఏ తెగ అయినా ఓ వర్గంలో చేరిపోతే అది ఆ వర్గానికి చెందినదిగానే భావించ బడుతుంది. కాబట్టి అలాంటి ఏ తెగపైనైనా దౌర్జన్యం జరిగితే అది ఆ వర్గంపై దౌర్జన్యం చేసినట్లే అవుతుంది.
4. ఖురైషులకు చెందిన ఏ వ్యక్తి అయినా అతని సంరక్షకుని అనుమతి లేకుండా- అంటే పారిపోయి ముహమ్మద్ (స) వద్దకు వచ్చి చేరితే ముహమ్మద్ (స), అతనిని ఖురైషులకు అప్పజెప్పవలసి ఉంటుంది. కాని ముహమ్మద్(స) అనుచరుల్లో ఎవరైనా- రక్షణ నిమిత్తం పారిపోయి - ఖురైషుల వద్దకు వచ్చి చేరితే ఖురైషులు అతన్ని ముహమ్మద్ (స)కు అప్పజెప్పరు.

ఈ షరతులపై ఏకాభిప్రాయం కుదిరిన తరువాత దైవప్రవక్త (స), హజ్రత్ అలీ (ర)ను పిలిచి ఆ షరతులను ఓ పత్రంపై చెప్పి రాయించ నారంభించారు. ఆ పత్రం ప్రారంభంలో ఆయన 'బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం' రాయమని చెప్పగా, సుహైల్ అందుకొని, "మాకు తెలియదు రహ్మాన్ ఎవరో. మీరు బిస్మికల్లాహుమ్మ (ఓ అల్లాహ్ నీ పేరుతో ప్రారంభిస్తున్నాను)" అని

రాయమన్నాడు. దైవప్రవక్త (స) హజ్రత్ అలీ (ర)ని అదే రాయమని ఆదేశించారు. అది రాసిన తరువాత తిరిగి దైవప్రవక్త (స) ఇలా చెప్పనా రంభించారు.

"ఇది దైవప్రవక్త అయిన ముహమ్మద్ (స) రాయించిన పత్రం" అనగా, సుహైల్ అడ్డుకుంటూ, "మీరే గనక దైవప్రవక్త అని మాకు తెలిస్తే, మిమ్మల్ని బైతుల్లాహ్‌కు రాకుండా ఎందుకు అడ్డగించేవారం? అదేకాకుండా యుద్ధం కూడా ఎందుకు చేసేవారం? మీరు కేవలం ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (అబ్దుల్లాహ్ కుమారుడు ముహమ్మద్)అని మాత్రమే రాయించండి" అని అన్నాడు.

దీనికి దైవప్రవక్త (స), "నేను అల్లాహ్ ప్రవక్తనే. మీరు దీన్ని ఖండించినా సరే" అంటూ హజ్రత్ అలి (ర)కు ముహమ్మద్ బిన్ అబ్దుల్లాయే రాయమని అల్లాహ్ ప్రవక్త అనే పదాన్ని తొలగించమని ఆదేశించారు. అయితే హజ్రత్ అలి (ర)కు మాత్రం ఆ పదాన్ని తొలగించటానికి మనసొప్పక అలానే కూర్చోగా స్వయంగా దైవప్రవక్తయే ఆ పదాన్ని తమ స్వహస్తాలతో చెరిపివేశారు. ఆ తరువాత పూర్తి దస్తావేజు రాయించడం జరిగింది.

ఒప్పంద పత్రం పూర్తి అయిన తరువాత ఆ ఒప్పందం ప్రకారం బనూ ఖుజాఅ తెగ దైవప్రవక్త (స)గారి పక్షాన చేరినట్లయింది. వీరు వాస్తవంగా అబ్దుల్ ముత్తలిబ్ కాలం నుండే బనూ హాషిమ్‌కు మిత్రపక్షంగా ఉంటూ ఉండేవారు. మనం ఈ గ్రంథం ప్రథమాంకంలో ఈ విషయాన్ని చర్చించుకొని ఉన్నాం. అందుకని వారు ఈ ఒప్పందంలో చేరడం అంటే ఆ పురాతన ఒప్పందాన్ని ధృవపర్చడమే అన్నమాట. మరోవంక బనూ బక్ర్ ఖురైషుల పక్షాన చేరిపోయారు.

అబూ జందల్‌ను అప్పగించడం

ఒప్పంద పత్రం రాయడం ఇంకా పూర్తి కానేలేదు. సుహైల్ కుమారుడు అబూ జందల్ తన కాళ్ళకు వేయబడిన సంకెళ్ళను ఈడ్చుకుంటూ ప్రవక్త (స)గారి సన్నిధికి వచ్చారు. ఆయన దిగువ మక్కా నుండి పారిపోయి వచ్చినవారు. ఆయన ఇక్కడకు వచ్చి ముస్లిముల అండకు చేరిపోవడం జరిగింది. ఇది చూసిన సుహైల్, "ఇతను ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రథమ వ్యక్తి. కాబట్టి ఇతణ్ణి మీరు నాకు అప్పగించాలి" అని డిమాండు చేశాడు.

"ఇంకా మేము ఈ పత్రాన్ని రాయటమే పూర్తి చేయలేదు గదా?" అన్నారు దైవప్రవక్త (స).

"అయితే నేను మీతో ఎలాంటి ఒప్పందం చేసేదే లేదు" మొండి కేశాడు సుహైల్.

"సరే, నీవు ఇతణ్ణి నా కోసమైనా వదిలిపెట్టు" అని కోరారు మహాప్రవక్త (స).

"లేదు. నేను వీణ్ణి మీ కోసమైనా వదిలేది లేదు" అన్నాడు సుహైల్.

"లేదు. అలా అనకు. అతణ్ణి వదిలేయి, నా మాట విను" అన్నారు తిరిగి మహాప్రవక్త (స).

"కానేకాదు. నేనలా చేయను" అంటూ అతని మెడ పట్టుకొని లాగటం ప్రారంభించాడు.

అబూ జందల్, "ముస్లిములారా! నేను తిరిగి ముష్రిక్కుల వద్దకు వెళ్ళాలా? వీరు నా ధర్మం గురించి నన్ను బాధలకు గురిచేస్తారు" అని పెద్దగా అరవనారం భించారు.

ఇది విన్న మహాప్రవక్త (స), "అబూ జందల్! సహనం వహించు. దీన్ని పుణ్యకార్యంగా భావించు, అల్లాహ్ నీ కోసం, నీ వెంట ఉన్నటువంటి బలహీన ముస్లిముల కోసం ఏదైనా మార్గం చూపకపోడు. మీ కష్టాలను తీర్చకమానడు. మేము ఖురైషులతో ఒప్పందం కుదుర్చుకున్నాం. మేము వారికి, వారు మాకు దైవాన్ని సాక్షిగా చేసి ప్రమాణం చేసుకున్నాము. అందు కని మేము ఇప్పుడు ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించలేము" అన్నారు బాధగా.

ఇది చూసిన హజ్రత్ ఉమర్(ర) ఒక్క దూకులో అబూ జందల్ (ర) దగ్గరకు వచ్చి చేరారు. అతను నడుస్తూ ఉండగా ఆయన అతని వెంటే నడుస్తూ, "అబూ జందల్! సహనం వహించు. వీరు ముష్రిక్కులు. వీరి రక్తం, కుక్క రక్తం" అంటూ తన కరవాలం పిడిని అతని చేతికి దగ్గరగా చేస్తూ పోతున్నాడు. బహుశా ఆయన ఈ కరవాలం తీసుకొని తన తండ్రి (సుహైల్)ని నరికేస్తారేమో అనే ఉద్దేశ్యంతో. కాని ఆయన తన తండ్రిని చంపే ధైర్యం చేయలేదు. అలా ఆ ఒప్పందం అమలులోకి వచ్చేసింది.

ఉమ్రా సంకల్పం నుండి బయటపడడానికి చేసిన ఖుర్బానీ మరియు శిరోముండనం

దైవప్రవక్త (స) హుదైబియా ఒప్పంద పత్రాన్ని పూర్తి చేసి సహాబాతో, "లేవండి! మీ మీ పశువులను ఖుర్బానీ చేయండి" అని అన్నారు. కాని ఏ ఒక్కడూ తన స్థానం నుంచి లేవలేదు. ఆయన ఈ విషయాన్ని మూడుసార్లు అన్నారు. అయినా ఎవ్వరూ లేచి నిలబడలేదు. అప్పుడు మహాప్రవక్త (స) ఉమ్మె సల్మా (ర) గారి దగ్గరకు వెళ్ళి సహచరుల ఈ వైఖరిని గురించి చెప్పారు. ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఉమ్మె సల్మా (ర);

"మహాప్రవక్తా (స)! తమరు అలా చేయదలుచుకుంటే మారు మాట్లాడకుండా వెళ్ళి మీ ఖుర్బానీ జంతువును జిబహ్ చేసెయ్యండి. మీ మంగలిని పిలిపించి తల గొరిగించుకోండి" అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త (స) బయటకు వచ్చి ఎవరితోనూ ఏమీ చెప్పకుండా అలానే చేశారు. అంటే హదీ జంతువును జిబహ్ చేశారు. మంగలిని పిలిపించి తల గొరిగించు కున్నారు. దైవప్రవక్త (స) ఇలా చేస్తుండగా చూసి సహచరులు కూడా లేచి తమ తమ హదీ జంతువుల్ని జిబహ్ చేశారు. పరస్పరం ఒకరి తలను మరొకరు గొరుగుకున్నారు. ఆ పరిస్థితి, వారికి కలిగిన మనస్తాపం వల్ల ఒకరిని ఒకరు పొడుచుకుంటారేమో అనేలా ఉంది. ఆ సందర్భంలో ఆవును, ఒంటెను ఏడుగురి తరపున జిబహ్ చేయడం జరిగింది. దైవప్రవక్త (స) అబూ జహల్ ఒంటెను జిబహ్ చేశారు. దాని ముక్కున ఓ వెండి ముక్కెర ఉంది. దాన్ని ఇలా జిబహ్ చేయడానికి కారణం, ముష్రిక్కులు కోపంతో తల్లడిల్లిపోవాలన్నదే. ఆ తరువాత మహనీయ ముహమ్మద్ (స), తల గొరిగించుకున్న వారి మన్నింపు కోసం మూడుసార్లు దుఆ చేశారు. కత్తెరతో వెంట్రుకలను కత్తిరించుకున్న వారి కోసం ఒక్క మారే దుఆ చేశారు. ఈ ప్రయాణం సందర్భంగానే అల్లాహ్ హజ్రత్ కఅబ్ బిన్ ఇజ్రా (ర) గారి విషయమై ఈ ఆదేశాన్ని కూడా అవతరింపజేశాడు.

"ఎవరైనా బాధను తాళలేక (ఇహ్రామ్ పరిస్థితిలో) తల గొరిగించుకుంటే, అతను రోజా లేదా సదఖా లేదా ఖుర్బానీ రూపంలో ఫిదియా ఇవ్వాలి."

హిజ్రత్ చేసివచ్చిన మహిళల అప్పగింతను నిరాకరించడం

ఆ తరువాత కొందరు మహిళా విశ్వాసులు దైవప్రవక్త (స) వద్దకు వచ్చి చేరడం జరిగింది. వారి సంరక్షకులు, హుదైబియాలో జరిగిన ఒప్పందం ప్రకారం వారిని తమకు అప్పగించమని డిమాండు చేశారు. కాని వారి ఈ డిమాండును ఒప్పందంలోని ఈ షరతును అనుసరించి తిరస్కరించడం జరిగింది. ఆ షరతులో ఇలా ఉంది.

"(ఈ ఒప్పందం ఈ షరతులకు లోబడి చేయబడినదేమిటంటే) మా పురుషులు ఎవరైనా మీ వద్దకు వస్తే మీరు వారిని తప్పకుండా మాకు అప్పజెప్పవలసి ఉంటుంది. వారు మీ ధర్మాన్ని అవలంబించిన వారు అయినా సరే."[1]

కాబట్టి మహిళల ప్రస్తావన ఈ ఒప్పందంలో లేనేలేదు. ఆ తరువాత అల్లాహ్ ఈ విషయమై తన గ్రంథంలో ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا جَاءَكُمُ الْمُؤْمِنَاتُ مُهَاجِرَاتٍ فَامْتَحِنُوهُنَّ ۖ

"విశ్వసించిన ప్రజలారా! విశ్వసించిన స్త్రీలు మీ వద్దకు వలస వచ్చి నప్పుడు (వారు విశ్వసించిన వారు అవునో కాదో) పరీక్షించి తెలుసు కోండి. వారి విశ్వాసం ఎంత వాస్తవమైనదో అల్లాహ్‌యే బాగా ఎరుగును. తరువాత, వారు విశ్వసించిన వారే అని మీకు తెలిస్తే వారిని అవిశ్వాసుల వద్దకు త్రిప్పిపంపకండి. వారూ అవిశ్వాసులకు ధర్మసమ్మతం కారు, అవిశ్వాసులూ వారికి ధర్మసమ్మతం కారు. అవిశ్వాసులైన వారి భర్తలు వారికి ఇచ్చిన 'మహర్'ను వారికి తిరిగి ఇచ్చివేస్తే, అప్పుడు మీరు వారిని వివాహమాడడంలో దోషం లేదు. స్వయంగా మీరు కూడా అవిశ్వా సులైన స్త్రీలను మీ వివాహబంధంలో ఆపి ఉంచకండి." (60:10)

1. సహీ బుఖారి-1/380

ఈ ఆదేశం అవతరించిన తరువాత, ఎవరైనా మహిళా విశ్వాసి హిజ్రత్ చేసి వస్తే దైవప్రవక్త (స) ఈ దిగువ ఆయత్ వెలుగులో ఆమెను పరీక్షించేవారు. దివ్యఖుర్ఆన్‌లోని ఆ ఆయత్ ఇది:

إِذَا جَاءَكَ الْمُؤْمِنَاتُ يُبَايِعْنَكَ عَلَىٰ أَنْ لَا يُشْرِكْنَ بِاللَّهِ شَيْئًا

"ప్రవక్తా! విశ్వసించిన స్త్రీలు బైత్ చేయడానికి నీ వద్దకు వచ్చి, తాము ఎవరినీ అల్లాహ్‌కు సాటిగా నిలబెట్టము అనీ, దొంగతనం చేయము అనీ, వ్యభిచారానికి పాల్పడము అనీ, తమ సంతానాన్ని హత్య చేయము అనీ, తమ కాళ్ళు చేతుల మధ్య ఏ అపనిందనూ కల్పించి తీసుకురాము అనీ, ధర్మసమ్మతమైన మంచి విషయాలలో మీకు అవిధేయత చూపము అని ప్రమాణం చేస్తే, వారి నుంచి బైత్ తీసుకో; వారిని క్షమించమని అల్లాహ్‌ను ప్రార్థించు. నిశ్చయంగా అల్లాహ్ ఎంతో క్షమించేవాడు, కరుణించేవాడూను." (60 : 12)

కాబట్టి ఏ మహిళలైతే ఈ ఆయత్‌లో చెప్పబడిన షరతులకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేస్తారో, వారితో దైవప్రవక్త (స), "నేను నీతో బైత్ తీసుకున్నాను" అంటూ వారిని వెనక్కు పంపించకుండా మదీనాలోనే ఉంచేవారు.

ఈ ఆదేశం ప్రకారం ముస్లిములు తమ అవిశ్వాస భార్యలకు తలాక్ ఇచ్చేశారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (ర) వివాహబంధంలో బహుదైవారాధకు లుగా ఉన్న ఇద్దరు భార్యలు ఉండేవారు. ఆయన ఆ ఇద్దరికీ తలాక్ ఇచ్చే శారు. ఆ తరువాత వారిలో ఒకామెను ముఆవియా, మరొకామెను సఫ్వాన్ బిన్ ఉమయ్యా వివాహమాడారు.

హుదైబియా ఒప్పందపు షరతుల వల్ల ఒనగూడిన ప్రయోజనాలు

పైన పేర్కొన్న హుదైబియా ఒప్పందపు షరతుల్ని గనక ఎవరైనా, వాటి నేపథ్యంతో సహా అధ్యయనం చేస్తే, వారు ఇది ముస్లిములకు లభించిన ఘన విజయంగా తలచడంలో ఏ మాత్రం సందేహానికి గురికారు. దానికి కారణాలు కూడా లేకపోలేదు. ఖురైషులు అప్పటివరకు ముస్లిముల ఉనికినే గుర్తించేవారు కాదు. వారిని సర్వనాశనం చేయడానికే కంకణం కట్టుకున్నారు. ఏదో ఓ రోజున ముస్లిముల ఈ శక్తి క్షీణించి అంతమైపోతుందని తలచేవారు.

అదేకాదు, అరేబియా ద్వీపకల్పంలో ఈ ఖురైషులు ధార్మిక పురోహితులుగా, అరబ్బులకు నాయకులుగా కూడా చెలామణి అవుతున్నారు. ఈ రూపంగానైనా వారు ఇస్లామీయ సందేశ ప్రచారానికి, సాధారణ ప్రజలకు నడుమ తమ శక్తియుక్తులన్నిటినీ ధారపోసి అడ్డుతగలాలి. ఈ నేపథ్యంలో గనక దీన్ని గమనించినట్లయితే, ముస్లిముల వైపునకు కేవలం సంధి కోసం ఒగ్గిపోవడం ముస్లిముల శక్తిసామర్థ్యాలను గుర్తించినట్లే లెక్క. ఇంకా వారు ముస్లిముల శక్తిని అణచలేము అని చాటి చెప్పడం అవుతుంది.

ఇక ఈ ఒప్పందంలోని మూడవ షరతు వెనుక వారి స్వార్థం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఖురైషులకు ఇదివరకు ఏ నాయకత్వపు లక్షణాలు, ఏ ధార్మిక పెత్తనం అయితే లభించాయో వాటిని వారు పూర్తిగా విస్మరించి కేవలం తమ సొంత ప్రయోజనాల్నే లెక్కలోనికి తీసుకున్నారు. ఇతరులు ఏమైపోయినా వారికి పట్టేటట్లు లేదు. అంటే పూర్తి అరేబియా ద్వీపకల్పమే ఇస్లామ్ ధర్మం స్వీకరించినా ఖురైషులకు దాని చింత లేదు. ఆ విషయంలో వారు ఎలాంటి జోక్యం చేసుకోకుండా ఉంటామని చెప్పడం అన్నమాట. మరి ఇది ఖురైషుల ధ్యేయం ప్రకారం, వారి ఘోర పరాజయం కాకపోతే మరేమిటి? ముస్లిముల లక్ష్యం ప్రకారం ఇది వారి ఘన విజయం కాకపోతే మరింకేమిటి? ముస్లిములకు, ముస్లిమ్ విరోధులకు నడుమ ఏ రక్తపాత యుద్ధాలైతే జరిగాయో వాటి ధ్యేయం కూడా అదే. విశ్వాసం మరియు ధర్మం విషయంలో ప్రజలకు పూర్తి స్వాతంత్ర్యం ఉండాలన్నదే కదా! అంటే తమ ఇష్ట ప్రకారం ఏ వ్యక్తి అయినా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించవచ్చు, మరెవరైనా దైవతిరస్కార వైఖరిని అవలంబించినా అవలంబించవచ్చు. ఏ శక్తి కూడా వారి ఇష్టానికి అడ్డుగా నిలబడడానికి వీలులేదు అన్నదే. ముస్లిముల ధ్యేయం, వారి ధన సంపదను కొల్లగొట్టడంగానీ, వారిని సంహరించడంగానీ, వారిని బలవంతంగా ముస్లిములుగా మార్చడంగానీ కాదు.

ఈ ఒప్పందం ద్వారా ముస్లిములకు పైన చెప్పిన లక్ష్యం దాని అన్ని హంగులతో సహా ప్రాప్తమైపోయింది. ఇది ఒక్కొక్కప్పుడు యుద్ధం చేసి ఘన విజయం సాధించినా లభించని లక్ష్యం అది అన్నది మీరు గ్రహించగలరు. హుదైబియా ఒప్పందం వల్ల ఒనగూడిన స్వాతంత్ర్యం కారణంగా, ముస్లిములు ధర్మ ప్రచార రంగాల్లో ఎనలేని గొప్ప విజయాన్నీ పొందగలిగారు. ముస్లిముల

సైన్యం సంఖ్య ఈ ఒప్పందానికి పూర్వం మూడు వేలకంటే మించి ఉండలేదు. అది కేవలం రెండు సంవత్సరాల్లోనే మక్కా విజయం నాటికి పది వేలకు చేరిపోయింది.

ఒప్పందంలోని రెండో షరతు కూడా ఈ ఘన విజయానికి సంబంధించిన ఓ భాగమే. ఎందుకంటే యుద్ధానికి కాలుదువ్వింది ముస్లిములు కాదు, ముష్రిక్కులే. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

"మొదటిసారిగా వారే మీతో యుద్ధానికి తలపడ్డారు."

ముస్లిముల సైనిక కవాతులు, సైనిక చర్యల విషయానికి వస్తే, ఖురైషులు తమ మొండి ధైర్యం, గర్వాలతో ప్రజలను అడ్డుకోకుండా ఉండాలని, సమానత్వం ప్రాతిపదికపై వ్యవహారాన్ని చక్కబెట్టుకోవాలని చెప్పడం. అంటే, ప్రతి వర్గం తన తన మార్గాన్ని అనుసరించడానికి స్వాతంత్ర్యం పొంది ఉందన్న మాటే. ఇప్పుడు ఆలోచించండి! పదేళ్ళ వరకు యుద్ధం జరగకుండా చూడడం అనే ఒప్పందం, వారు తమ గర్వాన్ని వదిలి అల్లాహ్ మార్గంలో అడ్డు నిలువకుండా ఉంటామని చేసిన ఒప్పందమే కదా! యుద్ధాన్ని ప్రారంభించిన వర్గం బలహీనపడిపోయి తన ధ్యేయంలో అపజయం పొందిందనడానికి ఇది ఓ నిదర్శనం కాదా?

ఇక మొదటి షరతు గురించి ఆలోచిస్తే, ఆ షరతులో ముస్లిములకు అపజయంకంటే వారి విజయమే కానవస్తోంది. అది ఎలాగంటారా? ఈ షరతు వాస్తవంగా ఖురైషులు కాబా గృహంలో ముస్లిములు ప్రవేశించకుండా విధించిన నిషేధాన్ని అంతం చేస్తున్నాము అని చెప్పి చేయించిన ప్రకటనే. అయితే ఆ షరతులో ఖురైష్‌కు సంతృప్తి కలిగించిన విషయం, ఈ సంవత్సరం వారు ముస్లిములను కాబా గృహంలోనికి అడుగు పెట్టకుండా ఉండడంలో కృతకృత్యులవడం. కాని ఇది ఓ తాత్కాలికమైన మరియు విలువలేని ప్రయోజనం మాత్రమే.

ఆ తరువాత దానికితోడు ఈ ఒప్పందంలో ఖురైషులు, ముస్లిములకు మూడు రాయితీలనిచ్చి కేవలం ఒక రాయితీ మాత్రమే పొందగలిగారు. అది ఆ ఒప్పందం నాల్గవ షరతులో ఉన్న రాయితీ. కాని ఆ రాయితీ కూడా అంత విలువ లేని మామూలు రకం రాయితీ మాత్రమే. దీనివల్ల ముస్లిములకు ఎలాంటి నష్టం వాటిల్లబోదు. ఎందుకంటే ఓ ముస్లిమ్ ముస్లిమ్‌గా

ఉన్నంత మట్టుకు, మదీనా నుండి దైవప్రవక్త (స)ను వదిలి పారిపోయి మక్కాకు వచ్చే ప్రసక్తే లేదు, అతను ధర్మభ్రష్టుడు అయితే తప్ప. ఒకవేళ అతను ధర్మభ్రష్టుడు అయిపోతే, ముస్లిములకు అతని అవసరమే ఉండదు. అతడు తప్పకుండా వారిని వదలివెళ్ళవలసిందే.

"ఎవరైతే మమ్మల్ని వదలి ముష్రిక్కుల వైపునకు పారిపోతాడో అతణ్ణి అల్లాహ్ సర్వనాశనం చేసినట్లే" అని దైవప్రవక్త (స) ఈ సందర్భంలోనే చెప్పి ఉండడం గమనార్హం.

ఇక మిగిలిపోయింది, ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి మక్కాలో ఉంటున్న వారు, ఇంకా కొంతమంది ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే వారి కోసం మదీనా నగరమే కాకుండా అరేబియాలోని ఇతర ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఇదివరకు మదీనా ప్రజలు ఇస్లామ్ గురించి ఇంకా విని ఉండని కాలంలో సైతం, మక్కావాసుల ఆగడాలను భరించలేక అబీసీనియా ప్రాంతానికి వెళ్ళిపోలేదా? అలాగే ఈ ముస్లిముల కోసం అరేబియాలో ఏ ప్రాంతం అయినా చోటు కల్పించక మానదు. ఈ విషయమే దైవప్రవక్త (స) గారి ఈ ప్రవచనంలో చెప్పబడింది:

"వారికి చెందిన ఏ వ్యక్తి అయినా మన దగ్గరకు వస్తే, అతని కోసం అల్లాహ్ మార్గాన్ని చూపకపోడు."

ఇలాంటి షరతులు పెట్టి ఖురైషులు ఏదో గౌరవాన్ని పొందారని అగుపడుతున్నప్పటికీ, వారు పొందిన రాయితీలన్నీ వారి మానసిక ఆందోళన, భయం, ఒత్తిడి, అపజయాలకే నిదర్శనాలు.

విగ్రహారాధక సమాజం గురించి భయం ఆవరించిందని, వారు కట్టుకున్న గుజ్జనగూడు కాస్తా కూలిపోతోందని భావించడమే. మరోవంక మహాప్రవక్త (స) ఏ విశాల హృదయంతో ఈ ఒప్పందం షరతుల్లోని నాల్గవ షరతు ఒప్పుకోవడానికి కారణం, తన సమాజం స్థైర్యంపై, దృఢత్వంపై ఉన్న పూర్తి విశ్వాసమే. ఈ షరతును ఆయన ఏ భయం వల్లనో ఒప్పుకున్నది కాదు.

ముస్లిములకు కలిగిన మనస్తాపం, హజ్రత్ ఉమర్ (ర) గారి వాగ్వివాదం

హుదైబియా ఒప్పందంలోని షరతుల వాస్తవికత ఇది. వీటిలో రెండు విషయాలు మాత్రం ముస్లిములను మనస్తాపానికి గురిచేశాయి. ఒకటి; దైవప్రవక్త (స) వారితో, మనం కాబా గృహానికి వెళ్ళి దాని తవాఫ్ చేస్తాము అని చెప్పిన విషయం. అయితే ఆయన తవాఫ్ చేయకుండానే వెనక్కు మరలుతున్నారు. రెండవది; ఆయన(స) అల్లాహ్ ప్రవక్త. సత్యం ఆయనకు తోడుగా ఉంది. దానితోపాటు అల్లాహ్ తన ధర్మానికి ప్రాబల్యం కలిగిస్తానని మాట కూడా ఇచ్చి ఉన్నాడు. మరి ఏ కారణం వలన దైవప్రవక్త (స) ఖురైషుల ఒత్తిడిని స్వీకరించవలసివచ్చింది? వారు ప్రవేశపెట్టిన షరతులపైనే ఎందుకు ఒప్పందం చేసుకోవలసి వచ్చింది? ఈ రెండు విషయాలు రకరకాల అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఇటు ముస్లిముల భావోద్రేకాలు దెబ్బతినడం వలన వారు సంధి షరతులను లోతుగా తరచి చూడ్డానికి బదులు మనస్తాపం, దుఃఖంతో తల్లడిల్లిపోతున్నారు. బహుశా, అందరికంటే ఈ మనస్తాపానికి గురియైన వారు హజ్రత్ ఉమర్ (ర) గారేనేమో. ఆయన దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరై, "ఓ దైవప్రవక్తా! మనం సత్యంపై లేమా? వారు అసత్య వాదులు కారా? చెప్పండి" అని అడిగేశారు. దైవప్రవక్త (స) "తప్పకుండా" అని జవాబు ఇచ్చారు. ఆయన తిరిగి, "మన హతులు స్వర్గస్థులు కాలేదా?" "వారి హతులు నరకంలో బడలేదా?" అని అడిగారు. "అవును, అది యదార్థం అని బదులిచ్చారు మహాప్రవక్త (స). దీనికి హజ్రత్ ఉమర్ (ర), "మరి మనం మన ధర్మం విషయంలో ఒత్తిడికి ఎందుకు లోనుకావలసి వచ్చింది? అల్లాహ్ కూడా మా నడుమన ఇంకా ఎలాంటి తీర్పు ఇవ్వనిదే మనం ఎందుకు వెనకకు మరలాలి?" అని బాధపడుతూ అడిగారు.

"ఓ ఖత్తాబ్ కుమారుడా! నేను అల్లాహ్ ప్రవక్తను. నేను ఆయనకు ఎన్నడూ అవిధేయత చూపను. ఆయన నాకు సహాయాన్ని సమకూరుస్తాడు. నన్ను ఎన్నటికీ విడిచిపెట్టడు" అన్నారు మహాప్రవక్త (స).

"అయితే, మీరు బైతుల్లాహ్ వద్దకు వెళతానని, దాని తవాఫ్ చేస్తానని మాతో అనలేదా?"

"అవును అన్నాను. కాని నేను ఈ సంవత్సరమే అక్కడికి వెళతానని అన్నానా?" అడిగారు మహాప్రవక్త (స).

"లేదు" జవాబిచ్చారు హజ్రత్ ఉమర్ (ర).

"అయితే మొత్తానికి మీరు బైతుల్లాహ్ దగ్గరకు రాగలరూ, దాని తవాఫ్ కూడా చేయగలరు" అన్నారు మహాప్రవక్త (స).

అప్పటికీ హజ్రత్ ఉమర్ (ర) కోపం చల్లారలేదు. ఆయన నేరుగా హజ్రత్ అబూ బక్ర్ (ర)గారి దగ్గరకు వెళ్ళారు. ఆయనతో దైవప్రవక్త (స)తో వాదించినట్లుగానే వాదించారు. హజ్రత్ అబూబక్ర్ (ర) కూడా మహాప్రవక్త (స) గారిచ్చిన సమాధానమే ఇస్తూ దానికి అదనంగా, "ఓ ఉమర్! అల్లాహ్ సాక్షిగా! ఆయన సత్యంపైన్నే ఉన్నారు గనుక నీ చివరి శ్వాస వరకు ఆయన్నే అనుసరిస్తూ ఉండు" అని మందలించారు.

ఆ తరువాత "ఇన్నా ఫతహ్నాలక ఫత్హం ముబీనా" అనే దివ్యవాణి ఆయత్‌లు అవతరించాయి. ఈ ఆయత్‌లలో హుదైబియా ఒప్పందాన్ని "ప్రస్ఫుటమైన విజయం"గా ఖరారు చేయడం జరిగింది. ఈ వాక్యాలు అవతరించిన తరువాత మహాప్రవక్త (స), హజ్రత్ ఉమర్ (ర)గారిని పిలిపించి వాటిని చదివి వినిపించారు. అది విన్న హజ్రత్ ఉమర్ (ర), "దైవప్రవక్తా! ఇది విజయమా?" అని అడగగా, ఆయన'అవును' అని బదులిచ్చారు. అప్పుడుగాని హజ్రత్ ఉమర్ (ర) మనస్సు శాంతించలేదు. ఆయన వెనక్కు తిరిగి వెళ్ళి పోయారు. అప్పటికిగాని హజ్రత్ ఉమర్(ర)గారికి తన తప్పిద మేమిటో తెలియలేదు. ఆయనకు ఎంతో సిగ్గేసింది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే,

"నేను ఆ రోజు చేసిన పొరపాటుకు దైవప్రవక్త (స)తో సంవాదానికి దిగిన తీరుకు భయపడి అప్పటి నుండి నేనెన్నో పుణ్యకార్యాలు చేసుకుంటూ పోతున్నాను. దానధర్మాలు చేస్తూపోయాను. నమాజులు చేస్తూపోయాను. బానిసలను స్వతంత్రులుగా చేశాను. ఇప్పుడు నాకు మేలు జరుగుతుందనే నమ్మకం ఉంది."[2]

బలహీన ముస్లిముల సమస్య పరిష్కరించబడింది

మహాప్రవక్త (స) మదీనాకు తిరిగివచ్చి నిశ్చింతగా ఉన్నప్పుడు, మక్కా వాసుల హింసలకు గురియైన ఓ ముస్లిమ్ పారిపోయి మదీనాకు వచ్చాడు.

2. *హుదైబియా ఒప్పందానికి సంబంధించిన ఆధారాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. ఫత్‌హుల్ బారి-7/439-458; సహీ బుఖారి-1/378-381, 2/598, 600, 717; సహీహ్ ముస్లిమ్-2/104-105, 106; ఇబ్నె హష్షామ్-2/308-322; జాదుల్ ముఆద్-2/122-127; ముఖ్తరుస్సీరత్-షేక్ అబ్దుల్లాహ్, పుట. 207-305; తారీఖ్ ఉమర్ బినుల్ ఖత్తాబ్-ఇబ్నె జూజీ -పుట. 39, 40.*

ఆయన పేరు అబూ బసీర్. ఈయన 'సఖీఫ్' తెగకు చెందినవారు. సఖీఫ్ తెగ ఖురైష్ మిత్రపక్షం. ఖురైషులు ఆయన్ను వెనక్కు పిలుచుకొనిరమ్మని ఇద్దరు మనుషుల్ని పంపిస్తూ, దైవప్రవక్త (స)కు, మీకూ, మాకూ నడుమ ఏ ఒప్పందాలైతే జరిగాయో వాటికి అనుగుణంగా అబూ బసీర్‌ను మాకు అప్ప జెప్పమని అడిగారు. దైవప్రవక్త (స) అబూ బసీర్‌ను వారిద్దరికి అప్పజెప్పారు. వీరిద్దరు ఆయన్ను వెంటబెట్టుకొని బయలుదేరి జుల్ హులీఫాకు చేరి మజిలీ చేశారు. అక్కడ కూర్చుని వారు ఖర్జూరాలు తింటున్నప్పుడు అబూ బసీర్ ఒకణ్ణి ఉద్దేశించి, ఓ ఫలానా వ్యక్తీ! దైవసాక్షి! నీ కరవాలం ఎంతో మేలైనదిగా తోస్తుందే అని పొగిడారు. అతను ఆ పొగడ్తకు తన కరవాలాన్ని ఒరలో నుండి బయటకు తీసి, "అవును, ఏమనుకున్నావు? ఇది ఎంత మేలైన కరవాలమో! నేను దీన్ని ఎన్నోమార్లు ఉపయోగించాను తెలుసా!" అని తన ప్రతాపాన్ని చాటుకున్నాడు.

"'ఏదీ, నన్ను కూడా చూడనీ, అది ఎలాంటిదో చూస్తాను" అని అన్నారు అబూ బసీర్ (ర).

అతను అబూ బసీర్ చేతికి ఆ కరవాలాన్ని అందించగానే ఒకే వ్రేటుతో అతని తలను నరికేశారు ఆయన.

రెండో వ్యక్తి పారిపోయి మదీనాకొచ్చి మస్జిదె నబవీలో చొరబడ్డాడు. అతణ్ణి చూడగానే దైవప్రవక్త (స), "ఇతను ఏదో ప్రమాదంలో పడినట్లున్నాడే?" అన్నారు. అతను మహాప్రవక్త (స) వద్దకు వచ్చి, "నాతో వచ్చినవాడు చంపివేయ బడ్డాడు, నేనూ చంపివేయబడతాను" అంటూ ఉండగా అబూ బసీర్ అక్కడికి వచ్చి, "దైవప్రవక్తా! అల్లాహ్ మీరు చేసిన ప్రమాణాన్ని మీచే నిలబెట్టించాడు. ఆయన నన్ను మీ వద్దకు తిరిగి పంపించేశాడు. అల్లాహ్ నాకు ముక్తి ప్రసాదించాడు" అని అంటుండగా, దైవప్రవక్త (స) "అయ్యో! ఇతని తల్లి నాశనం కానూ! ఇతనికి మరెవరైనా తోడైతే యుద్ధజ్వాలలు రేపేటట్లు అగుపడు తున్నాడే!" అన్నారు.

ఇది విన్న అబూ బసీర్ తనను తిరిగి దైవతిరస్కారులకు అప్పజెప్పడం జరుగుతుందేమో అని తలచి మదీనా నుండి పారిపోయి సముద్ర తీరాన్ని చేరుకున్నాడు. అటు అబూ జందల్ బిన్ సుహైల్ కూడా పారిపోయి

అబూ బసీర్‌తో కలిసిపోయారు. ఇప్పుడు ఖురైషులకు చెందిన ఏ వ్యక్తి అయినా ఇస్లామ్ స్వీకరించి పారిపోయి వస్తే, అతను అబూ బసీర్ దగ్గరకు వచ్చి చేరేవాడు. ఇలా వారి ఓ బృందం తయారైపోయింది. ఆ తరువాత ఈ బృందం, సిరియా వెళ్ళే వర్తక బిడారం ఆచూకి ఏదైనా తెలుసుకుంటే, ఆ బిడారాన్ని కవ్వించి వారిని చంపి ఆ సరకును దోచుకునే వారు. ఇలా ఖురైషులు వీరి ఈ ఆగడాలను భరించలేక మహాప్రవక్త(స)తో, అల్లాహ్ మరియు తమతో వారి బాంధవ్యాన్ని అడ్డంగా పెట్టి ఆ బృందాన్ని వెనక్కు పిలుచుకోండని, ఇక మీదట ఎవరైనా మక్కా నుండి పారిపోయి మీ దగ్గరకు వస్తే మీరు వారిని మా వద్దకు తిరిగి పంపించే పని లేదని వార్త పంపించారు. అప్పుడుగాని దైవప్రవక్త (స) ఆ బృందాన్ని మదీనాకు పిలిపించుకోలేదు.[3]

ఖురైష్ సోదరుల ఇస్లామ్ స్వీకారం

ఈ సంధి జరిగిన తరువాత హిజ్రీ శకం 7, ప్రారంభకాలంలో హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర), ఖాలిద్ బిన్ వలీద్ (ర), ఉస్మాన్ బిన్ తల్హా (ర)లు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిములైపోయారు.[4] వీరు దైవప్రవక్త (స) గారి సన్నిధిలో హాజరవగా, వారిని చూసి ఆయన(స), "మక్కా తన కాలేయ శకలా లను మాకు అప్పగించింది" అని పలికారు.

---

3. అధఃసూచిక మూడులో చెప్పిన ఆధారాల నుండి గ్రహించడం జరిగింది.
4. ఈ సహాబాలు హిజ్రీ శకం ఏ సంవత్సరంలో ఇస్లామ్ స్వీకరించారు అన్న విష యంలో అభిప్రాయబేధాలు ఉన్నాయి. అస్మా ఉర్రిజాల్ గ్రంథాల్లో ఈ సంఘటన హి.శ. ఏడవ సంవత్సరంలో జరిగినట్లుంది. హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర) అబీసీ నియా నుండి తిరిగివచ్చిన తరువాత హజ్రత్ ఖాలిద్ మరియు ఉస్మాన్ బిన్ తల్హాలు ఇస్లామ్ స్వీకరించారన్నది తెలిసిన విషయమే. కారణం ఏమిటంటే, ఆయన అబీసీనియా నుండి తిరిగివచ్చి మదీనాకు బయలుదేరేటప్పుడు వీరిద్దరూ ఆయన్ను కలిశారు. ఈ ముగ్గురు కలసి దైవప్రవక్త (స) గారి సన్నిధికి చేరి ఇస్లాం స్వీకరించారు. అంటే వీరంతా హిజ్రీ శకం 7వ సంవత్సర ప్రారంభకాలంలోనే ముస్లిములయ్యారు. (వల్లాహు ఆలమ్)

రెండవ దశ

క్రొత్త మార్పు

హుదైబియా ఒప్పందం, యదార్థంగా ముస్లిముల జీవితంలో వచ్చిన ఓ క్రొత్త మార్పే అనాలి. ఖురైష్ జాతి, ఇస్లామ్ పట్ల వైరంలోను, శత్రుత్వంలోను తీవ్రమైన మొండి వైఖరిగల జగడాలమారి జాతి. అందుకని వారు యుద్ధంలో అపజయంపాలై శాంతి వైపునకు మొగ్గుజూపినప్పుడు, అహ్జాబ్ యుద్ధంలో కలసి పోరాడిన మూడు పక్షాల్లో- ఖురైష్, గత్ఫాన్ మరియు యూదులు- పటిష్టమైన ఒక పక్షం ఛిన్నాభిన్నమైపోయింది. ఖురైష్‌లే పూర్తి అరేబియా ద్వీపకల్పంలో విగ్రహారాధనకు ప్రాతినిధ్యం వహించేవారుగా, దానికి నాయకులుగా ఉన్నందువలన, వారు యుద్ధమైదానం నుండి వైదొలగిపోగానే విగ్రహారాధకుల భావోద్రేకాలు కాస్తా చల్లబడిపోయాయి. వారి శత్రుత్వ వైఖరిలో చాలా మటుకు మార్పు వచ్చేసింది. అందుకని ఈ ఒప్పందం జరిగిన తరువాత గత్ఫాన్ వారి వైపు నుండి ఎలాంటి గొడవలు జరిగినట్లు మనకు అగుపడదు. వారేదైనా చేయగలిగారంటే అది కూడా యూదులు రెచ్చగొట్టడం మూలంగానే.

ఇక యూదుల విషయానికి సంబంధించినంత మటుకు, వారు యస్రిబ్ (మదీనా) నుండి బహిష్కరింపబడిన తరువాత 'ఖైబర్' చేరి దాన్ని తమ కుట్రలకు, కుతంత్రాలకు కేంద్రంగా మలుచుకున్నారు. అక్కడ యూదులకు చెందిన కుట్రదారులు తమ ప్రయత్నాలలో నిమగ్నమైపోయి సంక్షోభాన్ని రేకెత్తించే ప్రయత్నంలో మునిగిపోయారు. తమ చుట్టుపట్ల నివసిస్తున్న బద్దూలను ఉసిగొలుపుతూ దైవప్రవక్త (స) మరియు ముస్లిములను హతమార్చేందుకు లేదా కనీసం వారికి భారీ నష్టాన్నయినా కలిగించే ప్రయత్నం చేస్తూ ఉండేవారు. కాబట్టి హుదైబియా ఒప్పందం తరువాత దైవప్రవక్త (స) మొట్టమొదటగా యూదుల ఆటపట్టువైన ఖైబర్‌ను

జయించి వారి ఆగడాలను మట్టుబెట్టేందుకు నిర్ణయాత్మకమైన సైనిక చర్య చేబట్టారు.

ఎలాగైతేనేమీ, హుదైబియా ఒప్పందం తరువాత ప్రారంభమైన శాంతి ఘట్టం ద్వారా ముస్లిములకు ఇస్లామీయ సందేశ ప్రచారాన్ని వ్యాపింపజేసే ముఖ్యమైన అవకాశం లభించినట్లయింది. ఇస్లామీయ ప్రచార కార్యక్రమాల కోసం, ఈ రంగంలో వారి కృషి, సైనిక చర్యలకంటే ముఖ్యమైపోయింది. కాబట్టి ఆ కాలంలో జరిగిన కార్యక్రమాలను రెండు విధాలుగా విభజించి చూడడం సబబుగా తోస్తుంది.

1. సందేశ ప్రచారం మరియు రాజులకు, సర్దారులకు లేఖలు పంపించడం.

2. యుద్ధ కదలికలు.

ఈ దశలో, యుద్ధ కదలికలను గురించి చెప్పే బదులు, రాజులు సర్దారుల పేర పంపబడిన లేఖల గురించిన వివరాలు చెప్పడం ముఖ్యమని భావిస్తున్నాము. ఎందుకంటే, సహజంగా ఇస్లామీయ సందేశ ప్రచార ధ్యేయమే అసలు ఇస్లామ్ యొక్క ధ్యేయం. ఈ లక్ష్యాన్ని సాధించడానికే ముస్లిములు రకరకాల కష్టాలను, యుద్ధాలను, సంక్షోభాలను భరిస్తూ వస్తున్నారు.

రాజులకు, సర్దారులకు పంపించిన లేఖలు

హిజ్రీ శకం 6 చివరన దైవప్రవక్త (స) హుదైబియా నుండి మదీనాకు తిరిగివచ్చాక, వివిధ రాజుల పేరున లేఖలు రాసి వారిని ఇస్లామ్ సందేశం వైపునకు ఆహ్వానించారు.

మహాప్రవక్త (స) వారికి ఆ లేఖలను రాయడానికి ఉపక్రమించినప్పుడు, ఏ రాజైనా, ఏ చక్రవర్తి అయినా ఆ లేఖను స్వీకరించాలంటే దానిపై ముద్ర తప్పక ఉండాలి అనే సలహా ఇవ్వడం జరిగింది. కాబట్టి ఆయన ఓ వెండి ముద్రను తయారు చేయించారు. ఆ ముద్రపై 'ముహమ్మదురసూలుల్లాహ్' అనే అక్షరాలు చెక్కబడి ఉన్నాయి.[1]

అలా లేఖలు రాయించి అనుభవజ్ఞులైన సహాబాలకిచ్చి దూతలుగా

1. సహీహ్ బుఖారి-2/872,873.

వారి వద్దకు పంపారు. ఈ దూతల్ని, ఖైబర్ యుద్ధానికి బయలుదేరడానికి కొన్ని రోజుల ముందు, ఒకటవ ముహర్రమ్ హి.శ. 7న పంపారని 'అల్లామా మన్సూర్ పూరి' పూర్తి ఆధారాలతో చెబుతారు.[2] వచ్చే పంక్తుల్లో ఆ లేఖలు, ఆ లేఖల వలన కలిగిన ప్రతిస్పందనలను గురించి తెలుసుకుందాం.

1. అబీసీనియా చక్రవర్తి 'నజాషీ' పేరున పంపిన లేఖ

ఈ నజాషీ పేరు అస్హమా బిన్ అబ్హర్. దైవప్రవక్త (స) అతని పేర రాసిన లేఖను, అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రి చేతికిచ్చి హి.శ. 6 చివరన లేదా హి.శ. 7 ప్రారంభంలో పంపించారు. 'తిబ్రీ' ఈ లేఖలోని పూర్తి పాఠాన్ని కూడా ఉటంకించాడు. అయితే ఈ లేఖలో రాయబడిన విషయాన్ని లోతుగా అధ్యయనం చేస్తే, దీన్ని దైవప్రవక్త (స) హుదైబియా ఒప్పందం తరువాత రాసిన లేఖలా అగుపించదు. బహుశా ఈ లేఖలో రాసిన విషయాలు దైవప్రవక్త (స) మక్కాలో ఉన్నప్పుడే, హజ్రత్ జాఫర్ అబీసీనియాకు హిజ్రత్ చేసి వెళ్ళే టప్పుడు రాసి ఇచ్చిన లేఖ అనిపిస్తూ ఉంది. ఎందుకంటే ఈ లేఖ చివరన ముహాజిర్ల ప్రస్తావన ఈ క్రింది మాటల్లో ఉంది.

"నేను మీ వద్దకు నా పినతండ్రి కుమారుడైన జాఫర్ వెంట ఓ బృందాన్ని పంపించాను. వీరు మీ వద్దకు వచ్చినప్పుడు వీరికి మీ దేశంలో శరణు ఇవ్వండి. వారిపై ఎలాంటి వత్తిడి చేయకండి."

బైహఖీ, హజ్రత్ అబ్బాస్ (ర) ఉల్లేఖించిన ఉల్లేఖనం ద్వారా మరో ఉత్తరం పూర్తి పాఠం ఇలా ఉందని రాస్తున్నారు. దాని అనువాదం ఇలా ఉంది:

"ఈ లేఖ ముహమ్మద్ దైవప్రవక్త (స) తరపున నజాషీ అస్హం, అబీసీనియా చక్రవర్తికి రాయబడుతూ ఉంది.

సన్మార్గాన్ని అనుసరిస్తూ, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించిన వారికి సలామ్ (శుభాలు). ఏ ఒక్కడూ సాటిగా రాని ఆ అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు అని నేను సాక్ష్యం ఇస్తున్నాను. ఆయనకు భార్యగాని, కుమారుడుగాని లేరు. అలాగే ముహమ్మద్ ఆయన దాసుడు మరియు ప్రవక్త అని కూడా నేను సాక్ష్యం ఇస్తున్నాను. నేను మిమ్మల్ని ఇస్లామ్ వైపునకు ఆహ్వానిస్తున్నాను. ఎందుకంటే నేను అల్లాహ్

2. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/171

ప్రవక్తను గనుక. కాబట్టి మీరు ఇస్లామ్ స్వీకరిస్తే శాంతిని పొందగలరు. "ఓ గ్రంథవహులారా! మాకూ, మీకూ నడుమ సమానంగా ఉన్న ఆ విషయం వైపునకు రండి. అదేమిటంటే, అల్లాహ్ తప్ప మరెవ్వరినీ ఆరాధించము అని, ఆయనకు ఇంకెవ్వరినీ సాటి కల్పించము అని మరియు మనలో ఏ ఒక్కరూ మరి ఒకరిని అల్లాహ్ తప్ప ప్రభువుగా చేసుకోము అనేది. ఒకవేళ వారు దాన్ని తిరస్కరిస్తే చెప్పేయండి, మేము ముస్లిములము, మీరే దానికి సాక్షి అని" మీరు ఈ సందేశాన్ని స్వీకరించకపోతే మీ జాతి నసారా (క్రైస్తవుల) పాపం అంతా మీదే అవుతుంది."

డాక్టరు హమీదుల్లాహ్ (ప్యారిస్), ఇంకో లేఖలో ఉన్న వస్తువును తన గ్రంథంలో ఉటంకించారు. ఇది ఇటీవలే లభ్యమైన లేఖ. ఒకే ఒక పదం తేడాతో ఆ లేఖే అల్లామా ఇబ్నె ఖైమ్ గ్రంథం జాదుల్ ముఆద్‌లోను నిక్షిప్తమై ఉంది. డాక్టరు హమిదుల్లాహ్, ఈ లేఖలో రాసివున్న వస్తువు గురించి పరిశోధించడంలో ఆధునిక విధానాలను అనుసరించారు. ఈ లేఖ ఫోటోను తన గ్రంథంలో అచ్చువేయించారు కూడా. ఆ లేఖ అనువాదం ఇది:

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్, అబీసీనియా చక్రవర్తి నజాషీకి వ్రాయునది.

సన్మార్గాన్ని అనుసరించే వ్యక్తికి సలామ్ (శాంతి కలుగుగాక). అల్లాహ్ తప్ప మరే పూజ్యుడు లేడనీ, ఆయన ఖుద్దూస్ (పవిత్రుడు) మరియు సలామ్ (దైవ సుగుణాల్లో ఓ సుగుణం, శాంతి) అనీ, శాంతి ప్రదాత, సంరక్షకుడు అనీ మీకు నేను తెలియపరుస్తున్నాను. ఈసా ఇబ్నె మర్యమ్ (మరియమ్ కుమారుడు ఈసా), అల్లాహ్ తన ఆత్మను మరియమ్‌లోకి ఊదడం వల్ల ఆమె గర్భవతి అయిందని నేను సాక్ష్యం ఇస్తున్నాను. ఇది అల్లాహ్ ఆదమ్ (అ)ను సృష్టించిన తీరు లాంటిదే. నేను, ఆయనకు ఎవరూ సాటిలేరని ఆ అల్లాహ్ వైపునకు, ఆయన విధేయతకు పరస్పరం సహకారాన్ని అందించే వైపునకు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. దీనికితోడు, మీరు నన్ను అనుసరించాలని, నా వైపునకు ఏదైతే వచ్చిందో దాన్ని విశ్వసించమని పిలుపునిస్తున్నాను. ఎం మకంటే, నేను అల్లాహ్ ప్రవక్తను. నేను మిమ్మల్ని మీ సైన్యాన్ని అల్లాహ్

వైపునకు పిలుస్తున్నాను. నేను నా సందేశాన్ని మీకు వినిపించేశాను. కాబట్టి నా హితబోధను స్వీకరించండి.[3] ధర్మమార్గాన్ని అనుసరించే వారికి శాంతి కలుగుగాక.[4]

ఏదైతేనేమీ, అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర), దైవప్రవక్త (స) పంపించిన ఈ లేఖను నజాషీకి అందించగా అతను దాన్ని తీసుకొని కళ్ళకు అద్దుకున్నాడు. అదే పరిస్థితిలో సింహాసనం నుండి క్రిందికి దిగి వచ్చి హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ చేతుల మీదుగా ఇస్లామ్ స్వీకరించాడు. దైవప్రవక్త (స) గారి సన్నిధికి ఈ విషయం గురించి ఏ జవాబు అయితే రాసి పంపాడో దాని అనువాదాన్ని ఇక్కడ రాయడం జరిగింది.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

దైవప్రవక్త ముహమ్మద్ (స)గారి సన్నిధికి అస్‌హమా వ్రాయునది.

ఓ దైవప్రవక్తా! ఆరాధనకు అర్హుడైన ఆ అల్లాహ్ తరపున తమకు సలాములు, కారుణ్యం మరియు శుభాలు కలుగుగాక. ఆ తరువాత.

ఓ అల్లాహ్ ప్రవక్తా! నాకు మీరు పంపిన లేఖ అందింది. ఈ లేఖలో హజ్రత్ ఈసా (అ.స.)గారి ప్రస్తావన ఉంది. భూమ్యాకాశాల ప్రభువు సాక్ష్యంగా, తమరు (తమ లేఖలో) ప్రస్తావించినట్లుగానే హజ్రత్ ఈసా (అ.స.) ఓ గడ్డిపోచకంటే ఎక్కువ ఏమీ కాదు. తమరు వర్ణించిన మనిషే ఆయన.[5]

తమరు మా వద్దకు పంపించిన సందేశాన్ని తెలుసుకున్నాము. మీ పినతండ్రి కుమారునికి మరియు మీ అనుచరులకు ఆతిథ్యం ఇచ్చాము. తమరు అల్లాహ్ యొక్క నిజమైన ప్రవక్త అని నేను సాక్ష్యం ఇస్తున్నాను. నేను మీతో బైత్ చేశాను. మీ పినతండ్రి కుమారుని చేతి మీదుగానూ బైత్ చేశాను. ఆయన చేతి మీదుగానే అల్లాహ్ రబ్బుల్ ఆలమీన్ కోసం ఇస్లామ్ స్వీకరించాను."[6]

---

3. చూడండి, 'దైవప్రవక్త రాజకీయ జీవితం' రచన: డాక్టర్ హమిదుల్లాహ్ సాహెబ్- 108, 109, 122-125.
4. జాదుల్ ముఆద్‌లో చివరి పదం వస్సలాము అలా మనిత్తబ ఉల్ హుదా (ధర్మ మార్గాన్ని అనుసరించే వారికి శాంతి కలుగుగాక)కు బదులు అస్లిమ్ అన్త (నీవు ముస్లిం అయిపో) అని ఉంది. చూడండి, జాదుల్ ముఆద్-3/60
5. డాక్టర్ హమీదుల్లాహ్ గ్రంథం -పుట. 108-114, 121-131
6. జాదుల్ ముఆద్-2/61

ప్రవక్త మహనీయులు (స), హజ్రత్ జాఫర్ (ర) మరియు అబీ సీనియాకు వెళ్ళిన ఇతర ముహాజిర్లను వెనక్కు పంపించమని కూడా కోరి ఉన్నారు నజాషీని. అందుకని అతను హజ్రత్ జాఫర్, హజ్రత్ అబూ మూసా అష్అరీ (ర)లను ఇంకా ఇతర సహాబా (ర)లను హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర) వెంట వెళ్ళడానికి రెండు పడవలను కూడా సమకూర్చాడు. వీరు నేరుగా ఖైబర్‌కు చేరి దైవప్రవక్త (స)ను దర్శించుకున్నారు. మరో పడవలో వీరి కుటుంబ సభ్యులు నేరుగా మదీనాకు చేరుకున్నారు.[7]

పైన పేర్కొన్న నజాషీ, తబూక్ యుద్ధానంతరం రజబ్ నెల హిజ్రీ శకం 9లో మరణించగా, దైవప్రవక్త (స) అతని మరణం రోజున్నే సహాబా (ర)కు అతని మరణ వార్తను తెలియజేశారు. ఆ తరువాత అతని "గాయిబానా నమాజె జనాజా" చేశారు. అంటే అతని మృతదేహం ఎదురుగా లేకుండానే జనాజా నమాజు చేశారన్నమాట. అతని మరణానంతరం మరో రాజు సింహాసనాన్నధిష్టించగా దైవప్రవక్త (స) అతనికి కూడా ఓ లేఖ రాసి పంపించారు. అయితే అతను ఇస్లామ్ స్వీకరించింది లేనిది తెలిపే ఆధారాలు లభించలేదు.[8]

2. ఈజిప్టు చక్రవర్తి ముఖౌఖిస్‌కు పంపిన లేఖ

ప్రవక్తశ్రీ (స) ఓ లేఖను జరీహ్ బిన్ మత్తై[9] పేరున పంపించడం జరిగింది. అతని బిరుదు 'ముఖౌఖిస్'. ఇతను ఈజిప్టుకు, అలెగ్జాండ్రియాకు రాజు. ఆ లేఖ ఇలా ఉంది:

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అయిన ముహమ్మద్, ఖిబ్త్ చక్రవర్తి అయిన ముఖౌఖిస్‌కు వ్రాయునది.

సన్మార్గాన్ని అవలంబించేవానికి శుభం కలుగుగాక.

నేను మిమ్మల్ని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానిస్తున్నాను. ఇస్లామ్

7. ఇబ్నె హష్షామ్-2/359 వగైరా
8. హజ్రత్ అనస్ (ర)గారు ఉల్లేఖించిన ఓ ఉల్లేఖనం సహీ ముస్లిమ్ గ్రంథంలో ఉంది. దాని ద్వారా కొంత వరకు గ్రహించగలం.
9. ఈ పేరును అల్లామా మన్సూర్ పూరి గారు రహ్మతుల్ లిల్ ఆలమీన్ 1/78లో ప్రస్తావించారు. డాక్టర్ హమీదుల్లా గారు అతని పేరును బిన్ యామీన్ అని వ్రాశారు. చూడండి దైవప్రవక్త (స) గారి రాజకీయ జీవితం (రసూలె అక్రమ్ కి సియాసి జిందగి) పేజి 141

స్వీకరిస్తే మీరు క్షేమంగా ఉండగలరు. ముస్లిములైపోతే అల్లాహ్ మీకు రెట్టింపు ప్రతిఫలం ఇస్తాడు. కాని దీన్ని తిరస్కరిస్తే ఖిబ్త్ వారి పాపం కూడా మీదే. ఓ ఖిబ్త్ ప్రజలారా! మాకూ, మీకూ మధ్య సమానంగా ఉన్న ఆ విషయం వైపునకు రండి. అదేమిటంటే అల్లాహ్ తప్ప మనం మరెవ్వరినీ ఆరాధించము అనేది, ఆయనకు మరెవ్వరినీ సాటి కల్పించము అనేది మరియు మనలో ఏ ఒక్కడూ మరొకరిని అల్లాహ్ తప్ప ప్రభువుగా చేసుకోము అనేదే. ఒకవేళ వారు దాన్ని తిరస్కరిస్తే చెప్పేయండి, మేము ముస్లిములము, మీరే దానికి సాక్షి అని."[10]

ఈ లేఖను అందించడానికి ఆయన (స) హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ (ర)ను ఎంపిక చేశారు. ఆయన ముఖౌఖిస్ దర్బారుకు చేరి ఇలా అన్నారు:

"(ఈ భూమ్మీద) మీకంటే పూర్వం ఓ వ్యక్తి గతించాడు. అతను తనను తాను మహా దేవుడని పిలుచుకున్నాడు. అల్లాహ్ అతణ్ణి చివరి వారికి, మొదటి వారికి గుణపాఠంగా చేశాడు. మొదట అతను తన ఈ అధికారం ఉపయోగించి ప్రజల పగ తీర్చుకున్నాడు. ఆ తరువాత తానే ఆ పగకు బలైపోయాడు. కాబట్టి, ఇతరులు మిమ్మల్ని చూసి బుద్ధి తెచ్చుకోక మునుపే ఇతరులను చూసి మీరు బుద్ధి తెచ్చుకోండి."

ఇది విన్న ముఖౌఖిస్, "మాకూ ఒక ధర్మమంటూ ఉంది. అంతకంటే మేలైన ధర్మం మాకు లభించనంతమట్టుకు దాన్ని త్యజించేవారము కాము" అని అనగా హజ్రత్ హాతిబ్,

"మేము మిమ్మల్ని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానిస్తున్నాము. దీన్ని అల్లాహ్ తక్కిన (ధర్మాల) వాటి కంటే ఉత్తమమైనదిగా చేశాడు. చూడండి! ఆ ప్రవక్త ప్రజలను ఇస్లామ్ వైపునకు ఆహ్వానించినప్పుడు ఖురైషులు అందరి

10. జాదుల్ ముఆద్ అల్ ఇబ్నె ఖైమ్-3/61. ఇటీవలి కాలంలోనే ఈ లేఖ లభించింది. డాక్టరు హమీదుల్లా ఏ ఫోటో అయితే తన గ్రంథంలో ప్రచురించారో దానికి మరియు జాదుల్ ముఆద్ లేఖలో కేవలం రెండే రెండు అక్షరాల తేడా ఉంది. జాదుల్ ముఆద్‌లో 'అస్లమ్ తస్లిమ్. అస్లమ్ యూతికల్లాహ్- చివరి వరకు'. లేఖలో ఫస్లిమ్ తస్లిమ్ యూతికల్లాహ్ అని ఉంది. అలాగే జాదుల్ ముఆద్ గ్రంథంలోని లేఖలో అసిమ్ అహ్లల్ ఖిబ్త్ అని ఈ లేఖలో అసిముల్ ఖిబ్త్ అని ఉంది. చూడండి, 'ప్రవక్త రాజకీయ జీవితం' పుట-136, 137.

కంటే కఠినులై దాన్ని వ్యతిరేకించారు. యూదులు అందరికంటే ఎక్కువగా శత్రుత్వాన్ని వహించారు. కాని 'నసారా' (క్రైస్తవులే) దీనికి దగ్గరగా ఉన్నారు. నా ఈ వయస్సు సాక్షిగా! హజ్రత్ మూసా(అ.స.), హజ్రత్ ఈసా (అ.స.) ఆగమన శుభవార్త ఇచ్చినట్లే, హజ్రత్ ఈసా(అ.స.) హజ్రత్ ముహమ్మద్ (స)గారి ఆగమన వార్తనిచ్చారు. మీరు తౌరాత్ గ్రంథవహులకు ఇంజీల్ (బైబిల్) గ్రంథం గురించి బోధించినట్లే మేము మీకు దివ్యఖుర్ఆన్ బోధనల వైపునకు రమ్మంటున్నాం. ఏదైనా ఓ జాతిలో ప్రవక్త ప్రభవిస్తే ఆ జాతి ఆయన సమాజమైపోతుంది. ఆ జాతి ఇక ఆ ప్రవక్తను విధేయించడం తప్పనిసరి. మీరు ఆయన కాలంలో ఉన్నవారు. అదేకాదు, మేము మిమ్మల్ని మెసయ్యా ధర్మం నుండి అడ్డుకోవడం లేదు. ఆ ధర్మం బోధించిన విషయాన్నే మేమూ మీకు బోధిస్తున్నాం."

ముఖౌఖిస్ ఆ ఉత్తరాన్ని అందుకొని, గౌరవపూర్వకంగా దాన్ని ఏనుగు దంతంతో చేయబడిన డబ్బీలో వేసి దానిపై సీలు వేశాడు. దాన్ని తన స్త్రీ బానిసకు దాయమని ఇచ్చాడు. అరబీ భాష రాయగల ఒక మనిషిని పిలిపించి దైవప్రవక్త (స) గారి సన్నిధికి ఈ క్రింది లేఖ రాయించాడు.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

ముహమ్మద్ బిన్ అబ్దుల్లాకు చక్రవర్తి ముఖౌఖిస్ రాయునది.

మీకు సలాము. అనంతరం, నేను తమ లేఖను చదివాను. ఆ లేఖలో ప్రస్తావించబడిన విషయాన్ని, తమ సందేశాన్ని అర్థం చేసుకున్నాను. నాకు తెలిసినంతమట్టుకు ఓ ప్రవక్త ఇంకా రావలసి ఉంది. ఆయన సిరియా దేశం నుండి ప్రభవిస్తాడని నా అంచనా. నేను తమ దూతను గౌరవించాను. తమ సన్నిధికి ఇద్దరు స్త్రీ బానిసలను పంపిస్తున్నాను. వీరికి ఖిబ్తీలలో గొప్ప గౌరవం ఉంది. కొన్ని వస్త్రాలను, తమరు స్వారీ చేయడానికిగాను ఓ ఖచ్చర్ (కంచర గాడిద)ను కూడా కానుకలుగా పంపిస్తున్నాను. మీకు సలామ్. (శుభాలు కలుగుగాక)."

ముఖౌఖిస్ అంతకంటే మరింకేమీ రాయలేదు. ఇస్లామ్ ధర్మాన్నీ స్వీకరించలేదు. ఇద్దరు స్త్రీ బానిసలు మారియా మరియు సిరీన్‌లు. ఖచ్చర్ పేరు 'దుల్‌దుల్'. ఇది హజ్రత్ అమీరె మావియా కాలం వరకు జీవించి

ఉండింది.[11] దైవప్రవక్త (స) మారియాను తమ వద్దే ఉంచుకున్నారు. ఆమె గర్భాన దైవప్రవక్త (స) కుమారుడు ఇబ్రాహీం జన్మించారు. ఇక సిరీన్‌ను హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ అన్సారి (ర)కు అప్పజెప్పారు.

3. పర్షియా చక్రవర్తి ఖుస్రో పర్వేజ్‌కు పంపిన లేఖ

దైవప్రవక్త (స) ఓ లేఖను పర్షియా చక్రవర్తి కిస్రా (ఖుస్రో)కు పంపించారు. ఆ లేఖ ఇది.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

ముహమ్మద్ రసూలుల్లాహ్ తరపున పర్షియా చక్రవర్తి కిస్రాకు రాసిన లేఖ ఇది:

సన్మార్గాన్ని అవలంబించే వ్యక్తికీ, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసిస్తూ, అల్లాహ్ తప్ప వేరెవరూ ఆరాధనలకు అర్హులుకారని, ఆయన ఒక్కడూ, ఆయనకు మరెవ్వరూ సాటిలేరని, ముహమ్మద్ అల్లాహ్ దాసుడు మరియు ప్రవక్త అని సాక్ష్యం ఇచ్చే వ్యక్తికి శుభాలు కలుగుగాక. నేను మిమ్మల్ని అల్లాహ్ వైపునకు ఆహ్వానిస్తున్నాను. ఎందుకంటే, జీవించి ఉన్న వానికి అతని దుష్పరిణామాలను గురించీ, తిరస్కారులకు సత్యమేదో తెలియజేయటానికీ నేను మానవులందరి తరపున అల్లాహ్ ద్వారా పంపించబడినవాణ్ణి గనుక. కాబట్టి మీరు ఇస్లామ్ స్వీకరించండి క్షేమంగా ఉండగలరు. దాన్నే గనక తిరస్కరిస్తే మీ భుజస్కంధాలపై మజూస్‌ల (అగ్ని ఆరాధకుల) పాపభారం కూడా పడగలదు."

ఈ లేఖను కిస్రాకు అందించడానికి దైవప్రవక్త (స), హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఖుజాఫా సహమీ (ర) గారిని ఎంపిక చేశారు. ఆయన ఈ ఉత్తరాన్ని బహ్రైన్ పాలకునికి అందజేశారు. బహ్రైన్ పాలకుడు ఈ లేఖను తన మనిషి కిచ్చి కిస్రాకు పంపించాడా లేదా ఖుద్దు అబ్దుల్లాహ్ బిన్ ఖుజాఫా సహమీ(ర) గారినే అక్కడకు పంపించాడా అనే విషయం గ్రంథాల ఆధారంగా తెలియ రాలేదు. మొత్తానికి ఈ లేఖను కిస్రాకు చదివి వినిపించగా అతను దాన్ని చించివేశాడు. ఎంతో గర్వాన్ని ప్రదర్శిస్తూ,

11. జాదుల్ మఆద్-3/61.

"నా పాలితుల్లో ఓ నీచమైన బానిస తన పేరును నా పేరుకంటే ముందు రాస్తాడా?" అని మండిపడ్డాడు.

దైవప్రవక్త (స)కు ఈ వార్త తెలియగా ఆయన, "అల్లాహ్ అతని రాచరికాన్ని ఛిన్నాభిన్నం చేయుగాక" అని శపించారు. (ఆ తరువాత దైవప్రవక్త (స) గారు శపించినట్లే జరిగిపోయింది.)

అనంతరం కిస్రా తన యమన్ గవర్నరు అయిన బాజాన్‌కు లేఖ రాస్తూ, హిజాజ్‌లో ఉన్న ఆ వ్యక్తి వద్దకు ఇద్దరు బలాఢ్యులైన మనుషుల్ని పంపి, బంధించి నా సన్నిధికి హాజరుపర్చమని ఆదేశించాడు. బాజాన్ ఆ ఆదేశాన్ని శిరసావహిస్తూ ఇద్దరు వ్యక్తుల్ని ఎంపిక చేస్తూ వారి ద్వారా దైవ ప్రవక్తకు ఓ లేఖ రాసి పంపాడు. ఆ లేఖలో అతను, ఈ ఇద్దరి వెంట వెళ్ళి కిస్రా దర్బారులో హాజరుకమ్మనే ఆదేశం ఉంది. వారిరువురు మదీనాకు వెళ్ళి ప్రవక్త సన్నిధికి చేరిన తరువాత వారిలో ఒకడు, "చక్రవర్తి కిస్రా, బాజాన్ గవర్నరుకు ఓ ఉత్తరం ద్వారా మిమ్మల్ని కిస్రా వద్దకు హాజరుపర్చమని ఉత్తరం రాయడం వలన ఆయన నన్ను మీ వద్దకు పంపించాడు. మీరు నా వెంట కిస్రా దగ్గరకు బయలుదేరి రావాలి" అన్నాడు. ఇదేకాకుండా వారిరువురు బెదిరింపు ధోరణిని అవలంబించారు కూడా. దైవప్రవక్త (స) వారిరువురిని రేపు వచ్చి కలవమని చెప్పారు.

ఇటు మదీనాలో ఆసక్తికరమైన కార్యం జరుగుతూ ఉండగానే, అటు ఖుస్రో పర్వేజ్ కుటుంబంలోనే అతనికి వ్యతిరేకంగా తిరుగుబాటు జ్వాల భగ్గుమంది. దీని ఫలితంగా కైసరు సైన్యాల చేతిలో పార్సీ సైన్యాలు ఎడతెగకుండా అపజయాలను ఎదుర్కొంటున్నాయి. ఆ అదనులోనే ఖుస్రో తనయుడు 'షేరూయా' తన తండ్రిని హతమార్చి రాజైపోయాడు. అది మంగళ వారం రాత్రి, జమాదిల్ అవ్వల్ నెల, పదవ తారీఖు హి.శ. 7నాడు జరిగిన సంఘటన.[12] దైవప్రవక్తకు ఈ విషయం వహీ (దివ్యావిష్కృతి) ద్వారా తెలిసింది.

మరుసటి రోజు ఆ ఇద్దరు పర్షియా ప్రతినిధులు దైవప్రవక్త (స)గారి సన్నిధికి హాజరు కాగానే ఆయన వారికి ఈ సంఘటన గురించి తెలియజేశారు. ఇది విన్న వారిద్దరూ, ఏమిటీ మీరు స్పృహలో ఉండే మాట్లాడుతున్నారా? మేము ఇంతకంటే మామూలు విషయాలను మీ నేరాల్లో చేర్చి ఉన్నాం.

12. ఫత్‌హుల్‌బారి-8/127

మరి మీ ఈ మాటల్ని మేము మా చక్రవర్తికి రాసి పంపించాలా? అని బెదిరించారు.

"అవును, అతనికి నా ఈ మాటలను గురించి తప్పకుండా తెలియజేయండి. అతనికి ఇంకా ఇలా కూడా రాసి పంపించండి. అతనితో చెప్పండి. నా ధర్మం, నా పాలన, కిస్రా ఇప్పటి వరకు చేరినంత దూరం చేరగలదని. అంతేకాదు ఈ పాలన అలా విస్తరిస్తూ, గుర్రాలుకాని, ఒంటెలుకాని వెళ్ళలేనంత వరకు వెళ్ళి ఆగిపోగలదని కూడా చెప్పండి. మీరిరువురు అతనితో, నీవే గనక ముస్లిం అయిపోతే ప్రస్తుతం నీ అధికారంలో ఉన్నదంతా నీదే అవుతుంది, నిన్ను నీ జాతికి రాజుగా చేస్తాను అని కూడా చెప్పండి" అని అన్నారు.

ఆ తరువాత వారిద్దరు మదీనా నుండి బయలుదేరి బాజాన్ దగ్గరకు వెళ్ళారు. అతనికి వివరాలన్నీ తెలియజేశారు. కొన్ని రోజుల అనంతరం అతనికి ఓ లేఖ అందింది. 'షేరూయా' తన తండ్రిని హతమార్చాడని, ఏ వ్యక్తి గురించి తన తండ్రి బాజాన్‌కు రాశాడో తిరిగి ఆదేశం వచ్చే వరకు అతని జోలికి పోవద్దని ఉంది ఆ లేఖలో.

ఈ సంఘటన జరిగిన తోడనే బాజాన్ మరియు యమన్‌లో ఉంటున్న అతని పర్షియన్ సహచరులంతా ముస్లిములైపోయారు.[13]

4. రోము చక్రవర్తి కైజరుకు పంపిన లేఖ

సహీ బుఖారి గ్రంథంలోని ఓ సుదీర్ఘమైన హదీసులో ఓ లేఖ గురించిన ఆధారం లభిస్తోంది. ఈ లేఖను దైవప్రవక్త (స) రోమన్ చక్రవర్తి 'హిరక్ల్'కు పంపించింది. ఆ లేఖ ఇది:

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

అల్లాహ్ దాసుడు మరియు ప్రవక్త అయిన ముహమ్మద్ తరపున మూడవ హిరక్ల్ చక్రవర్తికి.

సన్మార్గాన్ని అవలంబించే వ్యక్తికి శుభాలు. మీరు ఇస్లామ్‌ను స్వీకరించండి క్షేమంగా ఉంటారు. ఇస్లామ్ స్వీకరించండి అల్లాహ్ మీ ప్రతిఫలాన్ని రెట్టింపుజేస్తాడు. మీరే గనక దీన్ని తిరస్కరిస్తే 'పరారీసీల' (మీ ప్రజల) పాపభారం కూడా మీ భుజస్కంధాలపైన్నే పడుతుంది.

13. ముహాజిరాతె ఖజ్రీ-1/147; ఫత్‌హుల్‌బారి-8/127,128; రహ్మతుల్ లిల్ ఆలమీన్.

"ఓ గ్రంథవహులారా! మాకూ, మీకూ మధ్య సమానంగా ఉన్న విషయం వైపునకు రండి. అదేమిటంటే అల్లాహ్ తప్ప మనం మరెవ్వరినీ ఆరాధించము అనీ, ఆయనకు మరెవ్వరినీ సాటి కల్పించము అనీ మరియు మనలో ఏ ఒక్కడూ మరొకరిని, అల్లాహ్ తప్ప ప్రభువుగా చేసుకోము అనేదే. ఒకవేళ వారు దాన్ని తిరస్కరిస్తే చెప్పేయండి, మేము ముస్లిములము, మీరే దీనికి సాక్షి అని."[14]

ఈ లేఖను అందించడానికి విహ్యా బిన్ ఖలీఫా కలబీ (ర)ను ఎంచుకోవడం జరిగింది. దైవప్రవక్త (స) ఆయనకు ఆదేశమిస్తూ మీరు దీన్ని బస్రా గవర్నరుకు అందించండి, అతను దీన్ని కైసరు వద్దకు పంపుతాడు అని చెప్పారు. ఆ తరువాత జరిగిన వివరాలన్నీ సహీ బుఖారి గ్రంథంలో ఇబ్నె అబ్బాస్ (ర) గారు ఉల్లేఖించిన హదీసులో ఉన్నాయి. ఆయన ఇలా ఉల్లేఖిస్తున్నారు.

అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ నాతో ఇలా అన్నారు; "హిరక్ల్ తనను ఖురైషుల ఓ బృందంతో సహా తన వద్దకు రప్పించుకున్నాడు. ఈ బృందం హుదైబియా ఒప్పందం జరిగిన తరువాత ఆ షరతులకు లోబడి ప్రశాంత వాతావరణంలో సిరియాకు వెళ్ళి ఉంది. మేము ఏలియా (బైతుల్ మఖ్దిస్)లో అతని దర్బారులో హాజరయ్యాము.[15] హిరక్ల్ మమ్మల్ని తమ దర్బారులో హాజరుపర్చుకున్నాడు. ఆ సమయంలో దర్బారులో గొప్ప గొప్ప వారు కూర్చుని ఉన్నారు. ఆ తరువాత అతను తన దుబాషీని పిలిచి అతని మాధ్యమంగా మాతో సంభాషించాడు.

---

14. సహీ బుఖారి-1/4,5.

15. ఆ సందర్భంలో హిరక్ల్, అల్లాహ్ అతని చేతుల మీదుగా పర్షియన్లను ఘోరపరాజయానికి గురిచేయగా కృతజ్ఞతలు చెల్లించుకోవడానికి ఏలియా వెళ్ళి ఉన్నాడు. (చూడండి, సహీ ముస్లిమ్-2/99). దీని వివరాలు ఇలా ఉన్నాయి: పార్సీలు ఖుస్రో పర్వేజును హతమార్చిన తరువాత రోమన్లతో వారు హస్తగతం చేసుకున్న ప్రాంతాలను వెనక్కు తిరిగి ఇచ్చే షరతు మీద సంధి కుదుర్చుకున్నారు. వారు దానికి ప్రతిగా, వారి విశ్వాసం ప్రకారం, ఈసా (అ.స.)ను శిలువ వేసిన శిలువను కైజరుకు అప్పజెప్పారు. కైజరు ఈ సంధి జరిగిన తరువాత దాన్ని దాని యధాస్థానంలో ప్రతిష్టించినందుకు, ఈ విజయం గురించి కృతజ్ఞతలు అర్పించుకునేందుకు క్రీ.శ. 629 అంటే హి.శ. 7లో ఏలియా (బైతుల్ మఖ్దిస్)కు వెళ్ళాడు.

"ఇప్పుడు తనను తాను దైవప్రవక్తగా ప్రకటించిన ఈ వ్యక్తికి మీలో ఎవరు వంశం రీత్యా దగ్గరి సంబంధం కలిగి ఉన్నారు?" అని అడిగాడు.

"నేను ఆయన వంశం రీత్యా అతనికి దగ్గరివాణ్ణి" అని బదులిచ్చాన్నేను.

"ఇతణ్ణి నాకు దగ్గరగా తీసుకురండి, ఇతని అనుచరుల్ని కూడా అతని వెనుకాలే కూర్చోబెట్టండి" అని ఆదేశించాడు హిరక్ల్.

అనంతరం అతను తన దుబాషీని సంబోధిస్తూ, "ఆయన వెంట ఉన్న మనుషులతో చెప్పు, ఇతనే గనక అసత్యమాడితే వెంటనే దాన్ని మీరు ఖండించాలి" " అని అనగా, "దైవసాక్షి! అగౌరవంపాలు అవుతాననే భయమే లేకుండా ఉండి ఉంటే నేను ముహమ్మద్ (స) గురించి అసత్యమాడేవాణ్ణే కదా!" అని అనుకున్నాను నా మదిలో.

దుబాషీ మాధ్యమంగా ఆ ఇరువురి నడుమ కొనసాగిన సంభాషణ ఇలా ఉంది:

అతను అడిగిన మొట్టమొదటి ప్రశ్న, "ఆయన వంశం ఎలాంటిది అని అనుకుంటున్నారు మీరు?"

అబూ సుఫ్యాన్: ఆయన గొప్ప వంశానికి చెందినవాడు.

హెరక్ల్: నీవే కాకుండా ఈ మాట మీరెవరైనా ఇదివరకు అని ఉన్నారా?

అబూ సుఫ్యాన్ : లేదు.

హెరక్ల్: ఈయన తాతముత్తాతల్లో ఎవరైనా రాజుగా రాజ్యమేలారా?

అబూ సుఫ్యాన్ : లేదు

హెరక్ల్: సరే, ధనవంతులు ఆయన్ను అనుసరించారా లేదా బలహీనులా?

అబూ సుఫ్యాన్: అందరూ బలహీనులే.

హెరక్ల్: వీరి సంఖ్య అధికం అవుతుందా లేదా క్షీణిస్తోందా?

అబూ సుఫ్యాన్: పెరుగుతూనే ఉంది.

హెరక్ల్: ఈ ధర్మంలో ప్రవేశించిన తరువాత ఏ ఒక్కడైనా ఈ ధర్మం నుండి బయటపడి ధర్మభ్రష్టుడయ్యాడా?

అబూసుఫ్‌యాన్: లేదు.

హెరక్ల్: ఈయన ఏ విషయాన్నయితే చెబుతున్నాడో ఆ విషయం గురించి ఇంతకు పూర్వం అతని కంటే ఎవరైనా చెప్పి ఉన్నారా?

అబూ సుఫ్‌యాన్: లేదు.

హెరక్ల్: ఆయన చెప్పిన మాటను ఎప్పుడైనా తప్పడం జరిగిందా?

అబూ సుఫ్‌యాన్: లేదు. అయితే మేము ఇప్పుడు అతనితో చేసుకున్న ఒప్పందంలో కుదుర్చుకున్న కాలాన్ని గడుపుతున్నాం. ఈ కాలంలో అతను తన మాటను నిలుపుకుంటాడో లేదో మాకు తెలియదు.

అబూ సుఫ్‌యాన్ కథనం ప్రకారం, ఈ ఒక్క మాట తప్ప మరే మాటనూ నేను నా తరపు నుంచి చెప్పే అవకాశం నాకు లభించలేదు.

హెరక్ల్: మీరు ఆయనతో యుద్ధం చేయడం జరిగిందా?

అబూ సుఫ్‌యాన్: అవును, మేము ఆయనతో యుద్ధం కూడా చేశాము.

హెరక్ల్: అయితే మీకు, ఆయనకు మధ్య జరిగిన యుద్ధ పరిణామాలు ఎలాగున్నాయి?

అబూ సుఫ్‌యాన్: యుద్ధం మాకూ, ఆయనకు నడుమ ఓ బొక్కెన లాంటిది. ఆయన మమ్మల్ని నష్టబెడితే మేము ఆయన్నూ నష్టానికి గురిచేసే వారం.

హెరక్ల్: ఆయన మీకు దేని గురించి ఆదేశిస్తున్నాడు.

అబూ సుఫ్‌యాన్: ఆయన చెప్పేది, మేము కేవలం అల్లాహ్‌నే ఆరాధించాలని, ఆయనకు మరెవ్వరినీ సాటి కల్పించరాదని, మీ తాతముత్తాతలు ఏవైతే చెబుతూ వచ్చారో దాన్ని వదిలేయమని. ఆయన మాకు నమాజు చెయ్యమని, సత్యం పలకమని, చెడుకు దూరంగా ఉండమని, సౌశీల్యం మరియు బంధువుల ఎడల సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఆదేశిస్తున్నాడు.

ఆ తరువాత హెరక్ల్ తన దుబాషీని సంబోధిస్తూ, నీవు ఇతనితో (అబూ సుఫ్‌యాన్‌తో) ఇలా చెప్పు అంటూ తన అభిప్రాయాన్ని ఇలా బహిర్గతం చేశాడు.

“నేను ఆయన వంశం గురించి అడిగినప్పుడు నీవు ఆయన ఉన్నత మైన వంశానికి చెందినవాడని చెప్పావు. ప్రవక్తలు తన జాతిలోని ఉన్నత వంశం నుండే ప్రభవింపజేయబడతారు.

ఈ మాటలు మీలో ఇంకెవరైనా చెప్పి ఉన్నారా? అని అడిగినప్పుడు నీవు, అలా ఎవరూ చెప్పలేదని అన్నావు. ఈ మాటలు ఇంతకు పూర్వం ఇంకెవరైనా చెప్పి ఉండి ఉంటే ఇతను వాటినే వల్లిస్తున్నాడని నేను అనుకొని ఉండేవాణ్ణి.

ఈయన తాతముత్తాతల్లో ఎవరైనా రాజుగా చెలామణి అయ్యారా? అని అడిగినప్పుడు, నీవు లేదు అని సమాధానమిచ్చావు. ఇతని తాతముత్తాతల్లో ఎవరైనా రాచరికం చేసి ఉంటే, ఈయన తన తాతముత్తాతల రాచరికాన్ని కోరుకుంటున్నాడని అనుకొని ఉండేవాణ్ణి.

అలాగే, ఏ మాటైతే ఆయన అంటున్నాడో అంతకు పూర్వం మీరు దాన్ని అసత్యంగా ఖండించి ఉన్నారా? అని నేనడిగినప్పుడు నీవు అలా జరగ లేదని అన్నావు. అందుకని ఆయన మీతో ఎప్పుడూ అసత్యం పలకనప్పుడు అల్లాహ్ గురించి ఎలా అసత్యం పలుకగలడు?

సంపన్నులు ఆయనను అనుసరిస్తున్నారా లేదా పేదవారా? అని నేనడిగినప్పుడు బలహీన ప్రజలు, పేదలే ఆయన్ను అనుసరిస్తున్నారని నీవు అన్నావు. యదార్థంగా ఇలాంటివారే ప్రవక్తలను అనుసరించేవారుగా ఉంటారు.

ఆయన ధర్మాన్ని అవలంబించిన తరువాత ఎవరైనా తిరిగి ఆ ధర్మాన్ని వదిలి మార్గభ్రష్టులైపోతున్నారా? అని అడగగా నీవు లేదు అని సమాధాన మిచ్చావు. యదార్థం ఏమిటంటే, విశ్వాస మాధుర్యం హృదయాల్లో చోటుచేసు కున్నప్పుడే అలా జరుగుతుంది.

ఆయన ఆడిన మాట ఎప్పుడైనా తప్పారా అని అడగగా నీవు అలా ఎప్పుడూ జరగలేదని సమాధానమిచ్చావు. ప్రవక్తలు అలాగే ఉంటారు, ఎప్పుడూ ఆడిన మాటను జవదాటరు.

నేను నిన్ను, ఆయన వేటిని గురించి ఆదేశిస్తున్నాడు? అని అడిగిన ప్పుడు నీవు, ఆయన అల్లాహ్‌ను ఆరాధించమని, ఆయనకు మరెవ్వరినీ

సాటి కల్పించకు అనే ఆదేశం ఇస్తున్నాడు అనీ, విగ్రహారాధన విడువమనీ, నమాజు, సత్యం మరియు సౌశీల్యం గురించి బోధిస్తున్నాడని చెప్పావు.

నీవు చెప్పిందే నిజమైతే ఈ వ్యక్తి అతి త్వరలోనే నా ఈ కాళ్ళ క్రింద ఉన్న భూభాగానికి యజమాని అవుతాడు. ఓ ప్రవక్త వస్తాడన్న విషయం నాకు తెలుసు. అయితే ఆయన మీ జాతి నుండి ప్రభవించడని నేను అనుకున్నాను. నేను ఆయన వద్దకు వెళ్ళే నమ్మకమే ఉండివుంటే ఆయన వద్దకు వెళ్ళే శ్రమ తీసుకునేవాణ్ణే. ఆయన సాన్నిధ్యంలోనికి వెళ్ళగలిగితే ఆయన రెండు కాళ్ళను కడిగేవాణ్ణే."

ఆ తరువాత హిరక్ల్, దైవప్రవక్త (స)గారి లేఖను తెప్పించి అక్కడున్న వారందరికీ చదివి వినిపించాడు. లేఖ చదవడం పూర్తి కాగానే అక్కడ బిగ్గరగా మాట్లాడుకోవడం, పెద్ద గోల జరగటం వినిపించింది. మమ్మల్ని బయటకు పంపించేయమని అతను ఆదేశమివ్వగా మమ్మల్ని బయటకు పంపించడం జరిగింది. మేము బయటకు వచ్చిన తరువాత నేను నా అనుచరులతో, 'అబూ కబ్షా'[16] కుమారుని వ్యవహారం బాగా ముదిరిపోయింది. ఇతనంటే, బనుల్ అస్ఫర్ (రోమనుల)[17] రాజు కూడా భయపడుతున్నాడు అన్నాను. ఈ సంఘటన తరువాత నాకు దైవప్రవక్త (స) గారి ధర్మమే ప్రాబల్యం పొందగలదనే గట్టి నమ్మకం కుదిరింది. చివరకు నా హృదయ కవాటాలను అల్లాహ్ ఇస్లామ్ కోసం తెరిచేశాడు.

కైసరుపై, దైవప్రవక్త (స)గారి లేఖ ఎలాంటి ప్రభావం చూపిందో అబూ సుఫ్యాన్ మాటల వల్ల అర్థం చేసుకోవచ్చు. కైసరు, దైవప్రవక్త (స)గారి

16. అబూ కబ్షా కుమారుడు అంటే దైవప్రవక్త (స) అన్నమాట. అబూ కబ్షా ఆయన (స)గారి తాతో పితామహులు లేదా మాతామహుల్లో ఒకరి మారు పేరు. ఆయనకు పాలు పట్టిన తల్లి హలీమా సారియా గారి భర్త మారు పేరు కూడా అదే అని చెప్పడం జరుగుతోంది. మొత్తానికి ఈ అబూ కబ్షా పేరు అంత ప్రాచుర్యంలో లేని పేరు. అరబ్బుల్లో, ఎవరినైనా అగౌరవపర్చాలంటే అతని వంశంలోనే అప్రసిద్ధ వ్యక్తితో జోడించి చెప్పడం ఆచారంగా వస్తూ ఉండేది.

17. బనుల్ అస్ఫర్ (అస్ఫర్ సంతతి, అస్ఫర్ అంటే పసుపు రంగు అని అర్థం). రోమనులను బనుల్ అస్ఫర్ అనడానికి కారణం ఏమిటంటే, రోమనుల ఏ వ్యక్తి ద్వారా అయితే రోమను సంతతి వికసించిందో అతణ్ణి 'అస్ఫర్' (పసుపు రంగువాడు) అని ప్రాచుర్యం పొందడమే.

లేఖ నందించడానికి వెళ్ళిన దూత హజ్రత్ దిహ్యా కలబీ (ర)గారికి డబ్బు, వస్త్రాలిచ్చి సత్కరించాడు. కాని హజ్రత్ దిహ్యా కలబీ (ర) వాటిని తీసుకొని మదీనాకు వచ్చేటప్పుడు 'జిజామ్' తెగకు చెందిన కొందరు వ్యక్తులు దోపిడి చేసి అవన్నీ దోచుకోవడం జరిగింది. ఆయన మదీనాకు చేరి నేరుగా దైవప్రవక్త (స)గారి సన్నిధికే వెళ్ళారు. వివరాలన్నీ ఆయనకు తెలియజేయగా, మహాప్రవక్త (స) జైద్ బిన్ హారిసా నేతృత్వంలో అయిదు వందల మంది సహాబాల ఓ సైనిక పటాలాన్నిచ్చి 'హుస్మా'కు పంపించారు. హజ్రత్ జైద్ (ర) జిజామ్ తెగ వారిపై రాత్రి పూట దాడి చేసి చాలా మందిని సంహరించారు. వారి పశువుల్ని, స్త్రీలను తోలుకొని మదీనాకు వచ్చారు. పశువుల్లో వేయి ఒంటెలు, అయిదు వేల మేకలు ఉన్నాయి. ఖైదీల్లో వంద మంది స్త్రీలు, పిల్లలూ ఉన్నారు.

జిజామ్ తెగ వారికి, దైవప్రవక్త (స)కు నడుమ అప్పటికే సంధి కుదిరి ఉన్నందువలన ఆ తెగకు చెందిన ఓ సర్దారు జైద్ బిన్ రిఫాఅ జిజామీ పరుగున దైవప్రవక్త (స) వద్దకు వచ్చి నిరసన ప్రకటిస్తూ వేడుకున్నాడు. జైద్ బిన్ రిఫాఅ, ఆ తెగకు చెందిన కొందరు వ్యక్తులతో సహా ఇదివరకే ఇస్లామ్ స్వీకరించి ఉండడం, దోపిడి జరిగినప్పుడు ఆయన హజ్రద్ జైద్ (ర)కు కూడా సహాయపడి ఉండడం మూలంగా దైవప్రవక్త (స) అతని నిరసనను స్వీకరించి యుద్ధధనాన్ని, ఖైదీలను అతనికి అప్పజెప్పేశారు.

"గజ్వా"ల చరిత్ర రాసేవారు చాలా మంది ఈ సంఘటన హుదైబియా ఒప్పందం కంటే ముందు జరిగిన సంఘటన అని చెబుతారు. కాని ఇది పెద్ద పొరపాటు. ఎందుకంటే కైసరు వద్దకు లేఖ పంపించింది హుదైబియా ఒప్పందం తరువాతనే. అందుకని, అల్లామా ఇబ్నె ఖైమ్ గ్రంథస్తం చేసిన దాని ప్రకారం, ఈ సంఘటన హుదైబియా ఒప్పందం తరువాతనే సంభవించిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.[18]

5. ముస్జిర్ బిన్ సావీ పేరున రాసిన లేఖ

మహాప్రవక్త (స), బహ్రైన్ పాలకుడైన ముస్జిర్ బిన్ సావీ వద్దకు ఓ లేఖను పంపుతూ అతన్ని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించారు. ఇది

18. చూడండి, జాదుల్ ముఆద్-2/122; తల్ఖీహుల్ ఫహూమ్, పుట. 29

అలా బిన్ హజ్రమీ చేతికిచ్చి పంపిన లేఖ. సమాధానంగా మున్జిర్ బిన్ సావి మహాప్రవక్త (స)కు ఇలా రాశాడు.

ఓ దైవప్రవక్తా! నేను తమ ఉత్తరాన్ని బహ్రైన్ ప్రజలకు చదివి వినిపించాను. కొందరు ఇస్లామ్ ధర్మాన్ని పవిత్రమైనదిగా తలంచి ఇష్టపూర్వకంగా దాన్ని స్వీకరించారు. కొందరికి మీ ఆహ్వానం నచ్చలేదు. నా ఈ రాజ్యంలో యూదులు మరియు మజూస్‌లు (అగ్ని ఆరాధకులు) కూడా ఉన్నారు. తమరు ఈ విషయంలో ఆదేశాలివ్వండి."

ఈ ఉత్తరానికి సమాధానంగా దైవప్రవక్త (స) అతనికి ఈ లేఖను రాశారు.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

దైవప్రవక్త ముహమ్మద్ (స) తరఫున మున్జిర్ బిన్ సావీకి,

నీకు సలాములు. నేను నీ తరఫున అల్లాహ్‌ను స్తుతిస్తున్నాను. ఆయన తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులైన వారు లేరని, ముహమ్మద్ అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను.

తరువాతన్నూ- నేను నిన్ను అల్లాహ్‌కు భయపడమని గుర్తు చేస్తున్నాను. చూడు! ఎవరైతే మేలును, పుణ్యాలను చేసుకుంటాడో, అతను తన కోసమే మేలు చేసుకున్నవాడవుతాడు. ఎవరైతే నా దూతల ఆదేశాలను పాటిస్తాడో అతను నా ఆదేశాలను పాటించినట్లే. ఎవరైనా వారితో సత్ప్రవర్తనగా మెలిగితే అతను నా ఎడల సత్ప్రవర్తనతో మెలిగినట్లే. నా దూతలు నిన్ను బాగా పొగిడారు. నేను నీ జాతి విషయంలో నీ సిఫార్సును స్వీకరిస్తున్నాను. కాబట్టి ముస్లిములు ఏ పరిస్థితిలోనైతే ఇస్లామ్ స్వీకరించారో, వారిని ఆ పరిస్థితిలోనే ఉండనివ్వు. తప్పు చేసిన వారిని నేను క్షమించేస్తున్నాను. కాబట్టి నీవు వారిని క్షమించు. ఇంకా ఎప్పటివరకైతే నీవు సంస్కరణ మార్గాన్ని అనుసరిస్తూ ఉంటావో, అప్పటివరకు నిన్ను తొలగించేది లేదు. ఎవరైతే యూదత్వం మరియు అగ్ని ఆరాధనపైన్నే స్థిరంగా ఉంటారో, వారిపై జిజ్‌యాను విధిస్తున్నాను.[19]

19. *జాదుల్ ముఆద్-3/61,62. ఈ లేఖ ఇటీవలే లభించింది. డాక్టర్ హమీదుల్లాహ్ దీని ఫోటోను ప్రచురించారు కూడా. జాదుల్ ముఆద్ మరియు ఈ ఫోటోలో రాసి ఉన్న అంశంలో కేవలం ఒకే ఒక పదం తేడా అగుపిస్తుంది. (అంటే ఫోటోలో) 'లా ఇలాహ ఇల్లాహువ' కు బదులు 'లా ఇలాహ గైరహూ' అని ఉంది.*

6. యమామా పాలకుడు హౌజా బిన్ అలి పేరున రాసిన ఉత్తరం

దైవప్రవక్త (స), ఈ క్రింది ఉత్తరాన్ని యమామా పాలకుడు హౌజా బిన్ అలి పేరున రాసి పంపించడం జరిగింది.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (స) తరఫున హౌజాకు వ్రాయునది.

సద్బోధనలను అవలంబించే వ్యక్తికి సలాము కలుగుగాక. నా ధర్మం గుర్రాలు, ఒంటెలు ఏ హద్దు వరకు వెళ్ళగలవో అక్కడి వరకు విస్తరిస్తుంది అన్న విషయం నీకు తెలిసి ఉండాలి. కాబట్టి నీవు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించు. క్షేమంగా ఉంటావు. నీ ఆధీనంలో ఉన్నదంతా నీ ఆధీనంలోనే ఉండగలదు.

ఈ ఉత్తరాన్ని తీసుకువెళ్ళడానికి దూతగా హజ్రత్ సలీత్ బిన్ అమ్రూ అమిరీని ఎంపిక చేయడం జరిగింది. హజ్రత్ సలీత్ ఈ సీలు వేసిన ఉత్తరాన్ని తీసుకొని హౌజా వద్దకు వెళ్ళగా, అతను ఆయనను తన అతిథిగా చేసుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశాడు. హజ్రత్ సలీత్ ఆ ఉత్తరాన్ని అతనికి చదివి వినిపించగా అతను అవునూ కాదు అనకుండా మధ్యేమార్గాన్ని అవలంబిస్తూ ఇలా జవాబు రాసి ఇచ్చాడు:

"తమరు దేని వైపునకైతే ఆహ్వానిస్తున్నారో, అంతకంటే మేలైనది మరింకేముంటుంది? అరబ్బులు నేనంటే గడగడలాడుతున్నారు. కాబట్టి మరేదైనా పనిని నాకు అప్పగించండి. నేను మిమ్మల్ని అనుసరిస్తాను."

అతను హజ్రత్ సలీత్‌కు కానుకలు కూడా సమర్పించుకున్నాడు. హిజ్‌లో తయారైన వస్త్రాలు కూడా బహూకరించాడు. హజ్రత్ సలీత్ ఆ కానుకలను తీసుకొని దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి వివరాలన్నీ వినిపించారు. మహాప్రవక్త (స) అతని ఉత్తరాన్ని చదివి, "అతను భూమికి సంబంధించిన ఓ చిన్న ముక్క అడిగినా నేను అతనికి ఇచ్చేవాణ్ణి కాదు. స్వయంగా అతను నాశనం కావడమేకాక అతని వద్ద ఉన్నదంతా నాశనమైపోతుంది" అన్నారు. మహాప్రవక్త (స) మక్కా జయించి తిరిగి వచ్చినప్పుడు హజ్రత్ జిబ్రీల్ (అ.స.) వచ్చి, హౌజా మరణించాడని వార్త అందించారు. అప్పుడు దైవప్రవక్త (స) తన అనుచరులతో ఇలా అన్నారు:

"వినండి! యమామాలో నా తరువాత ఓ అసత్య (ప్రవక్త) పుట్టబోతు న్నాడు. అతను చంపివేయబడతాడు."

"ప్రవక్తా! అతణ్ణి ఎవరు చంపుతారు?" అని వారిలో ఒకరు అడగగా, "నీవు, నీ సహచరులు" అని బదులిచ్చారు ఆయన.

ఆ తరువాత దైవప్రవక్త (స) చెప్పినట్లే జరిగింది.[20]

7. డెమాస్కస్ పాలకుడు హారిస్ బిన్ అబీ షమర్ గస్సానీ పేరున రాసిన లేఖ

దైవప్రవక్త (స) అతని వద్దకు ఈ క్రింది ఉత్తరాన్ని రాసి పంపించారు.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (స) తరపున హారిస్ బిన్ అబీ షమర్‌కు రాయునది.

సన్మార్గాన్ని అవలంబిస్తూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి దాన్ని ధృవీకరించే వ్యక్తికి సలామ్ (శుభాలు కలుగుగాక). నేను నిన్ను, ఎలాంటి భాగస్వామ్యంలేని ఆ అల్లాహ్ ధర్మాన్ని విశ్వసించమని ఆహ్వానిస్తున్నాను. (ఇలా చేస్తే) నీ రాచరికం నీదే అవుతుంది.

ఈ ఉత్తరాన్ని అసద్ బిన్ ఖుజైమా తెగకు చెందిన ఓ సహాబీ హజ్రత్ షుజా బిన్ వహబ్ చేతికి ఇచ్చి పంపడం జరిగింది. ఆయన ఆ ఉత్తరాన్ని హారిస్‌కు అందించగా అతను, "నా నుండి నా రాచరికాన్ని ఎవరు లాక్కో గలరు? చూడు, అతనిపై దాడి చేయనున్నాను" అని చెప్పి పంపించాడు. అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు.

8. అమ్మాన్ రాజుకు రాసిన లేఖ

దైవప్రవక్త (స) ఓ లేఖను అమ్మాన్ రాజు జైఫర్, అతని సోదరుడు అబ్ద్ పేరున రాసి పంపించారు. ఆ ఇరువురి తండ్రి పేరు జలందీ. ఆ లేఖ ఇలా ఉంది:

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

ముహమ్మద్ (స) బిన్ అబ్దుల్లాహ్ తరపున జలందీ కుమారులు జైఫర్ మరియు అబ్ద్ పేర.

20. జాదుల్ మఆద్-3/63

ఇస్లామ్ ధర్మాన్ని అనుసరించే వ్యక్తికి సలామ్ (శుభాలు). తరువాత-

"నేను మీ ఇరువురిని ఇస్లామ్ వైపునకు ఆహ్వానిస్తున్నాను. ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే క్షేమంగా ఉండగలరు. ఎందుకంటే నేను మానవాళి అందరికీ అల్లాహ్ ప్రవక్తను అయినందువలన, జీవించి ఉన్న ప్రతివానికి అతని దుష్పరిణామాలను గురించి హెచ్చరించవలసి ఉంది. దైవ తిరస్కారులు నా మాట సత్యమైనది అని తెలుసుకోవాలి. మీరిరువురే గనక ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే, మీరిరువురిని పాలకులుగానే కొనసాగించగలను. మీరే గనక ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించకపోతే, మీ రాచరికం మంటగలిసి పోతుంది. మీ రాజ్యంపై అశ్వాల దాడి జరుగగలదు. మీ రాచరికంపై నా ప్రవక్త పదవే ప్రాబల్యం పొందగలదు."

ఈ లేఖను తీసుకువెళ్ళడానికి దూతగా హజ్రత్ అమ్రూ బినుల్ ఆస్ (ర)గారిని ఎంపిక చేయడం జరిగింది. ఆయన మాటల్లో తదుపరి వృత్తాంతం ఇలా ఉంది.

నేను బయలుదేరి అమ్మాన్ చేరి అబ్ద్‌ను కలిశాను. ఆ ఇరువురు అన్నదమ్ముల్లో ఇతనే దూరదృష్టిగలవాడు, ఆలోచనాపరుడూను. నేను అతనితో, "నేను మీ వద్దకు, మీ అన్న వద్దకు దైవప్రవక్త (స) గారి దూతగా వచ్చాను."

అతను, "నా సోదరుడు వయస్సులోనూ, రాజుగానూ నాకంటే పెద్ద వాడు, కాబట్టి నేను మిమ్మల్ని ఆయన వద్దకు పంపిస్తాను. ఉత్తరం ఆయనకు ఇచ్చేద్దురుగాని" అని చెప్పి, "అవునూ! మీరు దేని వైపునకు ఆహ్వాని స్తున్నట్లు?" అని అడిగాడు. అతనితో జరిగిన సంభాషణ ఇలా కొనసాగింది.

నేను : మేము అల్లాహ్ మార్గం వైపునకు ఆహ్వానిస్తున్నాం. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు. ఆయన తప్ప మీరు ఎవరినైతే పూజిస్తున్నారో వారందరినీ వదిలేయాలి. ముహమ్మద్ (స) అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని సాక్ష్యం పలుకమని చెబుతున్నాము.

అబ్ద్: ఓ అమ్రూ! నీవు నీ జాతి సర్దారు కుమారుడివి. చెప్పు, నీ తండ్రి ఏం చేశాడో? ఎందుకంటే అతణ్ణే నీవు అనుసరించవలసి ఉంది.

నేను: ఆయన ముహమ్మద్ (స)ను విశ్వసించకనే మరణించాడు. కాని నేను మాత్రం ఆయన ఇస్లామ్ స్వీకరించి ఉంటే ఎంత బాగుండేదో అనేదే నా బాధ. నేనూ ఆయన మార్గాన్నే అవలంబించాను కాని అల్లాహ్ నాకు ఇస్లాం ధర్మ రుజుమార్గాన్ని చూపించాడు.

అబ్ద్: నీవు ఆయన్ను ఎప్పుడు అనుసరించావు?

నేను: ఇటీవలే.

అబ్ద్: నీవు ఇస్లామ్ స్వీకరించినది ఎక్కడ?

నేను: నజాషీ వద్ద ఉన్నప్పుడు. నజాషీ కూడా ఇస్లామ్ స్వీకరించిన విషయం నీకు తెలుసా?

అబ్ద్: మరి అతని జాతి అతని రాచరికాన్ని స్వీకరించిందా?

నేను: అవును. దాన్ని ఆ జాతి కొనసాగనిచ్చింది. అతన్నే అది అనుసరించింది.

అబ్ద్: క్రైస్తవ మత ఫాదరీలు, సన్యాసులు కూడా ఆయన్ను అనుసరించారా?

నేను: అవును.

అబ్ద్: ఓ అమ్రూ! నీవేం మాట్లాడుతున్నావో కొంచెం ఆలోచించావా? మనిషి ఏ వైఖరి అయినా అసత్యం కంటే చెడ్డది కాదు సుమా?

నేను: నేను అసత్యం పలకడం లేదు. దాన్ని మేము ధర్మసమ్మతమైనదిగా తలిచేవారం కాము.

అబ్ద్: 'హిరక్ల్'కు నజాషీ ఇస్లామ్ స్వీకరించిన విషయం తెలియదేమో అని నేననుకుంటున్నాను.

నేను: ఎందుకు కాదు! అది అతనికి తెలిసిందే.

అబ్ద్: మరి ఈ విషయం నీకెలా తెలిసింది?

నేను: నజాషీ 'హిరక్ల్'కు కప్పం కడుతూ ఉండేవాడు. కాని అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన తరువాత దైవప్రవక్త (స)యొక్క ప్రవక్తా (స) పదవిని ధృవపరిచిన తరువాత అతను, "దైవసాక్షి! అతను నాకు ఒక్క దిర్హమ్‌ను చెల్లించమన్నా నేను చెల్లించేవాణ్ణికాదు" అని అన్నాడు. ఈ విషయం హిరక్ల్‌కు తెలిసినప్పుడు అతని సోదరుడు యనాక్, "ఏమిటీ నీకు కప్పం కట్టకుండా ఉన్న ఆ బానిసను, నీ ధర్మం

కాకుండా మరొకరి ధర్మాన్ని అనుసరించే ఆ బానిసను ఇట్టే వదిలేస్తావా" అని అడిగాడు. దానికి హిరక్ల్, "నేను అతణ్ణి ఏమీ చేయలేను. దైవసాక్షిగా చెబుతున్నాను నాకే గనుక ఈ రాచరికం పోతుందనే భయం లేకపోతే నేను కూడా అతను అనుసరించిన మార్గాన్నే అనుసరించేవాణ్ణి" అన్నాడు.

అబ్ద్: ఓ అమ్రూ! నీవు అనేది ఏమిటో కొంత ఆలోచించి మాట్లాడు.

నేను: దైవసాక్షి! నేను నిజమే పలుకుతున్నాను.

అబ్ద్: సరే! ఆయన దేన్ని గురించి ఆదేశిస్తున్నారు మరియు ఏ విషయం గురించి వారిస్తున్నారో చెప్పు.

నేను: ఆయన అల్లాహ్ ఆదేశాలను పాటించే ఆదేశం ఇస్తున్నారు. అలాగే ఆయన అవిధేయత నుండి మిమ్మల్ని వారిస్తున్నారు. సత్కార్యాలు చెయ్యమని, బంధువుల ఎడల సత్ప్రవర్తనతో మెలగాలని ఆదేశిస్తున్నారు. జులుము, అత్యాచారం, వ్యభిచారం, మద్యపానం వలదని, రాళ్ళు, విగ్రహాలు మరియు శిలువను పూజించకూడదని చెబుతూ వాటి నుండి మమ్మల్ని అడ్డుకుంటున్నారు.

అబ్ద్: ఆయన దేని వైపునకైతే పిలుస్తున్నారో అది ఎంత మేలైన విషయం! నా సోదరుడే ఈ విషయంలో నాతో ఏకీభవిస్తే, మేము ప్రయాణించి అక్కడికి వెళ్ళి ముహమ్మద్ (స)ను విశ్వసించేవాళ్ళం. ఆయనను ధృవపరిచేవాళ్ళం. కాని, నా సోదరుడు దీనికంటే రాచరికాన్నే అధికంగా ప్రేమిస్తున్నాడు. అతను దాన్ని వదిలి ముహమ్మద్ (స) అనుయాయునిగా మారడం కష్టమే.

నేను: అతనే గనక ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిం అయిపోతే మహాప్రవక్త (స), అతనికి తన జాతిపై ఉన్న అధికారాలను అలానే కొనసాగించగలరు. అయితే మీ ధనవంతుల నుండి మాత్రం 'సదఖా' వసూలు చేయడం జరుగుతుంది.

అబ్ద్: ఇంకేం కావాలి? సరే, సదఖా అంటే ఏమిటీ?

దీనికి సమాధానంగా నేను రకరకాల సొత్తుల నుండి దైవప్రవక్త (స)

ఏయే సదఖాలు తీయమని ఆదేశించారో వాటన్నిటి వివరాలు ఆయన ముందు ఉంచాను. ఒంటె గురించిన సదఖా గురించి చెప్పినప్పుడు అతను నాతో, ఓ అమ్రూ! వాటికవే సొంతంగా వెళ్ళి చెట్లను మేసి వచ్చే పశువుల్లో నుండి కూడా సదఖా ఉందా అని అడిగాడు. "అవును" అని సమాధానమిచ్చాన్నేను.

అబ్ద్: దైవసాక్షిగా చెబుతున్నాను! ఇంత విశాలమైన భూభాగం మరియు జనసాంద్రతగల మా జాతి దీన్ని ఒప్పుకుంటుందని నేననుకోను.

నేను అతని దివాణంలో కొన్ని రోజుల వరకు వేచి ఉన్నాను. అతను తన సోదరుని వద్దకు వెళ్ళి వివరాలన్నీ చెప్పి వస్తున్నాడు. ఓ రోజు అతను నన్ను పిలిపించాడు. నేను లోనికి ప్రవేశించబోగా పహరా దారులు నా రెక్కలు పట్టుకొని ఆపేశారు. అతను ఆయన్ను వదలమని వారిని ఆదేశించగా వారు నన్ను విడిచిపెట్టేశారు. నేను అతని దగ్గరకు వెళ్ళి కూర్చోబోగా ఆ పహరాదార్లే నన్ను కూర్చోకుండా అడ్డుకున్నారు. నేను రాజు వైపు చూశాను. అతను నాతో నీవు తెచ్చిన సమాచార మేమిటో చెప్పు అని అడిగాడు. సీలు వేసిన ఉత్తరాన్ని నేను అతనికి ఇచ్చివేశాను. అతను దాని సీలు తీసి చదివి తన సోదరునికి అందించాడు. తమ్ముడు కూడా దాన్ని అలానే చదివాడు కాని అతని వాలకం తన అన్నకంటే మెత్తగా కనబడింది. ఆ తరువాత రాజుకు, నాకు నడుమ ఈ సంభాషణ జరిగింది.

రాజు: ఖురైషులు ఏ వైఖరిని అవలంబించారో చెప్పు.

నేను: వారంతా ఆయనకు విధేయులైపోయారు. కొందరు ఇస్లామ్ ధర్మం ఎడల ప్రేమతో మరికొందరు కరవాలం ఎడల భయంతో.

రాజు: ఆయన వెంట ఉన్నదెవరు?

నేను: అందరూ ఆయన వెంటే ఉన్నారు. వారందరు ఇస్లామ్ ధర్మాన్ని ఏరికోరి స్వీకరించినవారే. ఇతర అన్ని విషయాలకంటే దీనికే అధిక ప్రాధాన్యత ఇస్తారు. వారికి అల్లాహ్ మార్గదర్శకత్వం ద్వారా, తమ బుద్ధివివేకాల ద్వారా తాము ఇప్పటి వరకు మార్గభ్రష్టులమై ఉన్నామనే విషయం

తెలిసింది. ఇక మీ ప్రాంతంలో మీరు తప్ప ఇంకెవరైనా అలా అప మార్గంలో ఉన్నారో లేదో నాకు తెలియదు. మీరే గనక ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించక, దైవప్రవక్త ముహమ్మద్ (స) గారికి విధేయత చూపకపోతే మిమ్మల్ని మా ఉష్ట్రారోహులు, అశ్వారోహులు తమ కాళ్ళ క్రింద వేసి నలిపేస్తారు. మీ పచ్చికబయళ్ళు మటుమాయమైపోతాయి. కాబట్టి మీరు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించండి. క్షేమంగా ఉండగలరు. దైవప్రవక్త (స) మిమ్మల్ని మీ జాతికి నాయకునిగా, పాలకునిగా చేస్తారు. మీ దగ్గరకు అశ్వికదళంగాని, పదాతిదళంగాని రానేరదు.

రాజు: ఈ రోజు నన్ను ఆలోచించుకోనీ. రేపు తిరిగి వచ్చేయి.

ఆ తరువాత నేను అతని తమ్ముని ఇంటికి తిరిగి వచ్చేశాను. అతను నాతో, "అమ్రూ? అతనికే గనక రాచరికపు దురాశ అడ్డుకోకుంటే ఇస్లామ్ తప్పక స్వీకరిస్తాడు అనే నమ్మకం నాకుంది" అని అన్నాడు.

నేను రెండో రోజు దర్బారుకు వెళ్ళగా అతను అనుమతి ఇవ్వడానికి నిరాకరించాడు. కాబట్టి నేను అతని తమ్మునితో కలసి అతనింటికి వచ్చి, "రాజు దగ్గరకు నేను వెళ్ళలేకపోయాను" అని చెప్పగా అతను నన్ను తన సోదరుని వద్దకు తీసుకువెళ్ళాడు. అతడు, "నేను మీ ఆహ్వానం గురించి బాగా ఆలోచించాను. నేనే గనక నా రాజ్యాన్ని, ఇప్పటి వరకు ఇంకా నా రాజ్యంలో ప్రవేశించని దళాల అధిపతికి అప్పగిస్తే నేను అరేబియాలోనే అతి బలహీనునిగా తలచబడతాను. ఒకవేళ మీ అశ్వికదళం, ఉష్ట్రారోహులే ఇక్కడికి వస్తే, మీకు ఇప్పటి వరకు ఎదురుకాని యుద్ధం జరిగితీరుతుంది" అని చెప్పాడు.

"సరే, నేను రేపు తిరిగి వెళ్ళిపోతున్నాను" అని చెప్పగా అతను తన సోదరునితో ఏకాంతంలో మాట్లాడుతూ, "ఈ ప్రవక్త ఎవరిపైనైతే ప్రాబల్యం సంపాదించారో వారి ముందు మనమెంత? ఆయన ఎవరి వద్దకైతే తన సందేశాన్ని పంపించారో వారు ఈయన ఆహ్వానాన్ని స్వీకరించినవారే" అని చెప్పాడు.

---

21. జాదుల్‌ముఆద్-3/62,63

రెండవ రోజు నన్ను దర్బారుకు పిలువనంపారు. ఆ రాజు మరియు అతని సోదరుడు ఇద్దరూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. ప్రవక్త (స)ను ధృవపరిచారు. సదఖా వసూలు చేయడానికి, వారి నడుమ తీర్పుజెప్పడానికి నన్ను స్వతంత్రునిగా వదిలేశారు. ఎవరైనా నాతో విభేదిస్తే వారిద్దరూ నాకు సహాయపడ్డారు.[21]

ఈ సంఘటన జరిగిన సందర్భాన్నిబట్టి చూస్తే, ఇతర రాజుల వద్దకు పంపిన లేఖల కంటే ఈ ఇద్దరి వద్దకు పంపిన లేఖ ఆలస్యంగా చేరింది. బహుశా ఇది మక్కా విజయం తరువాత జరిగిన సంఘటన కావచ్చు.

ఈ లేఖల ద్వారా దైవప్రవక్త (స) తన సందేశాన్ని అన్ని దేశాల పాలకుల వద్దకు పంపడం జరిగింది. ఫలితంగా కొందరు ఇస్లామ్ స్వీకరించగా కొందరు దాన్ని తిరస్కరించారు. అయితే తిరస్కరించిన వారికి కూడా ఇస్లామ్ ఏమిటో తెలిసిపోయింది. వారి మనస్సులో ప్రవక్త (స) గారి ధర్మం, ఆయన పేరు బాగా నాటుకుపోయి సుపరిచితమైంది.

హుదైబియా ఒప్పందం తరువాతి సైనిక చర్యలు

'గజ్వయె గాబా' లేదా 'గజ్వయె జీఖరద్'

ఈ గజ్వా, బనూ ఫరాజా తెగకు చెందిన కొందరిని నిలువరించడానికి వెన్నాడినటువంటి సైనిక చర్య. ఈ తెగ దైవప్రవక్త (స)కు చెందిన పశువుల్ని దొంగమాటుగా తోలుకుపోయినందున దాన్ని వెంటాడవలసివచ్చింది.

హుదైబియా ఒప్పందం తరువాత ఖైబర్ యుద్ధానికి ముందు మహా ప్రవక్త (స) నిర్వహించిన మొట్టమొదటి గజ్వా ఇది. ఇమామె బుఖారి కథనం ప్రకారం, ఇది ఖైబర్ కంటే మూడు రోజులు ముందు జరిగింది. ఈ గజ్వాలో పాల్గొని ప్రత్యేకంగా యుద్ధం చేసిన హజ్రత్ సల్మా బిన్ అకూ (ర)గారి ఉల్లేఖనం కూడా దీన్ని బలపరుస్తోంది. ఈయన ఉల్లేఖనాలను సహీహ్ ముస్లిం గ్రంథంలో మనం చూడొచ్చు. యుద్ధాల చరిత్రను రాసే చరిత్రకారులు ఈ సంఘటన హుదైబియా ఒప్పందానికి పూర్వం జరిగిన సంఘటనగా చెబుతారు. అయితే, సహీహ్ గ్రంథాల్లో చెప్పబడిన విషయం ఆ చరిత్రకారులు చెప్పినదానికి భిన్నమైనది. అదే సరియైనదీను.[1]

ఈ గజ్వా హీరో అయిన హజ్రత్ సల్మా బిన్ అకూ (ర) గారు ఉల్లేఖించిన ఉల్లేఖనాల సారాంశం ఇలా ఉంది:

"దైవప్రవక్త (స) తాము స్వారీ చేసే ఒంటెలను మేపడానికి తమ బానిస రిబాహ్‌ను పంపించారు. నేను కూడా అబూ తల్హా గుర్రంతో సహా ఆయన వెంటే ఉన్నాను. హఠాత్తుగా తెల్లవారుతూ ఉండగా అబ్దుర్రహ్మాన్ ఫరాజీ అనేవాడు ఒంటెలపై దాడి చేసి వాటిని తోలుకొని వెళ్ళిపోయాడు. కాపరిని చంపేశాడు. నేను రిబాహ్‌తో, "రిబాహ్! ఈ గుర్రాన్ని తీసుకెళ్ళి అబూ తల్హాకు అప్పజెప్పి ఈ విషయం దైవప్రవక్త (స)కు తెలియజెయ్యి" అని ఓ ఎత్తయిన

1. *చూడండి, సహీ బుఖారి, గజ్వయె జీఖరద్ అధ్యాయం-2/603, సహీ ముస్లిం-2/113, 114, 115, ఫత్‌హుల్‌బారి-7/460,461,462, జాదుల్ ముఆద్-2/120*

తిన్నె పైకి ఎక్కాను. మదీనా వైపు తిరిగి, 'యాసబాహ్ హాహ్' (అయ్యో! ఉదయం పూట జరిగిన దాడి) అని మూడుమార్లు అరిచాను. ఆ తరువాత నేను దాడి చేసిన వారిని వెంబడిస్తూ వారిపై శరపరంపరలను కురిపిస్తూ ఈ క్రింది యుద్ధ గీతాన్ని ఆలపించసాగాను:

"నేను అకూ కుమారుణ్ణి. ఈ రోజు పాలు త్రాగేవాని రోజు (అంటే ఈ రోజు ఎవరు తల్లిపాలు త్రాగారో తెలిసే రోజు)."

నేను వారిని, దైవసాక్షిగా! ఎడతెగకుండా బాణాలు వేసి గాయపరుస్తూనే ఉన్నాను. ఏ అశ్వారూఢుడైనా నా వైపునకు తిరిగితే నేను ఏదో ఒక చెట్టు వెనుక నక్కిపోయేవాణ్ణి. ఆ తరువాత నా బాణంతో అతణ్ణి గాయపరిచేవాణ్ణి. చివరికి వారంతా ఓ కొండ గుండా వెళ్ళే ఇరుకైన మార్గంలోనికి ప్రవేశించగా నేను ఆ కొండపైకి వెళ్ళిపోయాను. బండరాళ్ళు త్రోసి వారిని గాయపర్చసాగాను. ఇలా విరామం లేకుండా నేను వారిని వెన్నంటే ఉన్నాను. చివరికి దైవప్రవక్త (స)గారి ఒంటెలన్నింటిని నా వెనుకగా చేసుకోగలిగాను. వారు ఆ ఒంటెలని వదిలేశారు. అయినా నేను వారిని వెంబడించడం మానలేదు. వారిపై బాణాల వర్షం కురిపిస్తూనే ఉన్నాను. వారు తమ బరువును తగ్గించుకోడానికిగాను ముప్పైకిపైన్నే దుప్పట్లను, ముప్పై బల్లేలను పారవేయవలసివచ్చింది. వారు పారవేసిన వాటిపై (గుర్తుగా) కొన్ని రాళ్ళు వేస్తూ వెళుతున్నాను. ఎందుకంటే దైవప్రవక్త (స) మరియు ఆయన సహాబాలు, ఇది శత్రువు నుండి లాక్కున్న సొత్తు అని తెలుసుకోవటానికి. అనంతరం వారంతా లోయలోని ఇరుకైన ప్రదేశంలో కూర్చుని మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. నేను ఆ కొండ శిఖరానికి చేరుకుని కూర్చున్నాను. వారికి సంబంధించిన నలుగురు కొండ ఎక్కి నా వైపు రావడం గమనించాను. వారు నా మాటల్ని వినేటంతటి దూరానికి రాగానే వారినుద్దేశించి, "నేనెవరినో మీకు తెలుసా? నేను సల్మా బిన్ అకూను, నేను మీలో ఎవరి వెంటబడతానో వారిని ఇట్టే పట్టేయగలను. కాని మీరు నన్ను మాత్రం పట్టుకోలేరు సుమా!" అని అన్నాను. అంతే వారు నా మాటలు విని వెనుదిరిగి వెళ్ళిపోయారు. నేను అక్కడే కూర్చుండిపోయాను. చివరికి నేను దైవప్రవక్త (స)గారి అశ్వారోహుల్ని చూశాను. వారు చెట్ల సందుల్లో నుండి నా వైపే వస్తున్నారు. అందరికంటే ముందున్నది అఖ్రమ్. ఆయన వెనుక అబూ ఖతాదా, ఆయన వెనుకాల మిగ్దాద్ బిన్ అస్వద్ ఉన్నారు.

(వారు శత్రువులున్న చోటికి చేరుకొన్న తరువాత) అబ్దుర్రహ్మాన్‌తో అఖ్రమ్ ఢీకొన్నారు. హజ్రత్ అఖ్రమ్, అబ్దుర్రహ్మాన్ గుర్రాన్ని గాయపరిచేశారు. కాని అబ్దుర్రహ్మాన్ ఆయన మీదకు తన బల్లెం విసిరి చంపేశాడు. అంతలోనే అబూ ఖతాదా (ర), అబ్దుర్రహ్మాన్‌పై విరుచుకుపడి బల్లెంతో అతణ్ణి గాయ పరిచారు. తక్కిన శత్రువులు కాలికి బుద్ధి చెప్పారు. మేము వారిని వెంటాడి చీల్చిచెండాడుతున్నాం. నేను మాత్రం కాళ్ళపై ఎగురుతూ వారిని వెంటాడు తూనే ఉన్నాను. సూర్యాస్తమయం కాకపూర్వమే వారు ఓ లోయ వైపునకు పారిపోయారు. ఆ లోయలో 'జీఖరద్' అనే ఊటబావి ఉంది. బాగా దాహార్తులుగా ఉన్నందున ఆ ఊటబావి నీళ్ళు త్రాగాలని అక్కడికి వెళ్ళారు వారు. కాని నేను మాత్రం వారిని ఆ ఊటబావి దరికి చేరకుండా నిలువరిం చాను. దైవప్రవక్త (స) మరియు అశ్వారూఢులు ప్రొద్దుక్రుంకిన తరువాతగాని నా దగ్గరకు చేరలేదు. నేను దైవప్రవక్త (స) గారికి ఇలా విన్నవించుకున్నాను;

"దైవప్రవక్తా (స)! వీరంతా దాహార్తులుగా ఉన్నారు. తమరే గనక నాకు ఓ వంద మందిని ఇస్తే జీనులతో సహా వారి గుర్రాలనన్నింటినీ హస్తగతం చేసుకోగలను. వారి మెడలు పట్టి మీ ముందు హాజరుపర్చగలను."

దీనికి మహాప్రవక్త (స), "ఓ అకూ కుమారా! నీవే వారిపై విజయం సాధించావు. ఇప్పుడు కొంత మెత్తదనాన్ని పాటించు. ఇప్పుడు వారు బనూ గత్ఫాన్ తెగకు అతిథులయ్యారు" అన్నారు.

ఈ గజ్వాను గురించి వ్యాఖ్యానిస్తూ దైవప్రవక్త (స), "ఈ రోజు మాలో అందరికంటే మేలైన అశ్వారోహి అబూ ఖతాదా (ర) మరియు అందరికంటే మేలైన పదాతి సైనికుడు సల్మా" అని అన్నారు. ఆయన (స) నాకు రెండు భాగాలు ఒసగారు. ఒకటి, పదాతిదళ సైనికునిది, మరొకటి గుర్రపు రౌతుది. మదీనా తిరిగివచ్చేటప్పుడు ఆయన తన 'అస్బా' అనే స్వారి ఒంటెపై నన్ను తమ వెనుకాలే కూర్చోబెట్టుకొని గౌరవించారు.

ఈ గజ్వాలో దైవప్రవక్త (స) మదీనా బాగోగుల్ని చూసే బాధ్యతలు హజ్రత్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (ర)కు అప్పగించారు. ఈ గజ్వా పతాకాన్ని హజ్రత్ మిగ్దాద్ (ర)కు ఇచ్చారు.[2]

---

2. అధఃసూచికలోని ఆధారాలు

గజ్వయె ఖైబర్; గజ్వయె వాదియిల్ ఖురా

(ఖైబర్ యుద్ధం, ఖురా లోయ యుద్ధాలు)

ఖైబర్ అనేది ఒకప్పుడు మదీనాకు ఉత్తరాన ఎనభై లేదా అరవై మైళ్ళ దూరాన ఉండే ఓ పెద్ద పట్టణం, ఇక్కడ కోటలే కాకుండా పంట పొలాలు కూడా ఉండేవి. ప్రస్తుతం అది ఓ చిన్న టౌనుగానే ఉండిపోయింది. ఇక్కడి వాతావరణం ఆరోగ్యానికి అంత మేలైన వాతావరణం కాదు.

దైవప్రవక్త (స) హుదైబియా ఒప్పందం ఫలితంగా, అహ్జాబ్ యుద్ధంలో పాల్గొన్న మూడు పక్షాల్లో పటిష్టమైన ఓ పక్షం. ఖురైష్ వైపు నుండి ఇక ఎలాంటి ప్రమాదం లేదని తృప్తిపడ్డారు. దీని ద్వారా తక్కిన ఆ ఇరుపక్షాల బెడద లేకుండా పోతుందని ఆ తరువాత ఆ ప్రాంతంలో శాంతి భద్రతలు ఏర్పడగలవని, ముస్లిములు ఎడతెగకుండా కొనసాగుతున్న రక్తపాతం నుండి విముక్తి పొంది అల్లాహ్ ధర్మాన్ని వ్యాపింపజేయడానికి తీరిక లభిస్తుందనే ఉద్దేశ్యంతో, ఖురైష్‌కు సహాయపడ్డ మిగిలిన రెండు వర్గాల- యూదులు మరియు నజద్ తెగలు- వైపు నుండి కూడా ఎలాంటి బెడద లేకుండా పోతుందనే ఉద్దేశ్యంతో వారి పని పట్టడానికి ఉపక్రమించారు మహాప్రవక్త(స).

ఖైబర్ కుట్రలు, కుతంత్రాలకు పుట్టినిల్లు. సైనిక కవ్వింపులకు కేంద్రం. యుద్ధ జ్వాలలను చెలరేగింపజేసే జ్వాలాముఖి అయినందున ముస్లిములు దీన్నే ఎంచుకోవడం జరిగింది.

మరి ఖైబర్ నిజంగానే అలాంటి ప్రదేశమా? అని ప్రశ్నించినప్పుడు, అహ్జాబ్ యుద్ధం (అగడ్త యుద్ధం)లో ముష్రిక్కుల వర్గాలన్నిటిని ఉసికొల్పి ముస్లిములపైకి దండెత్తి వచ్చిన వారు ఖైబర్ ప్రజలే అని మనం మరవకూడదు. అదేకాదు, బనూ ఖురైజాను కూడా తెరమాటున ఒప్పందం తెంచడానికి ప్రోత్సహించిన వారు ఈ ఖైబర్ వారే. అంతటితో సరిపుచ్చక, ఇస్లామీయ సమాజంలోని మునాఫిక్‌లతో మరియు అగడ్త యుద్ధంలో పాల్గొన్న మూడవ

పక్షం - బనూ గత్ఫాన్ మరియు బద్దూలతో సతతం సంబంధాలు పెట్టుకొని స్వయంగా యుద్ధ సన్నాహాలు జరిపిన వారు వీరు. తమ కుట్రలతో ముస్లిములను పరీక్షకు గురి చేశారు.

దైవప్రవక్త (స)ను కూడా చంపడానికి ప్రయత్నించారు. పరిస్థితులు అలా మారిపోతుండడంతో దైవప్రవక్త (స) మాటిమాటికి సైనిక చర్యలను చేపట్టవలసి వచ్చేది. ఈ కుట్రదారులకు, కుతంత్రరాయుళ్ళకు నాయకులైన సలామ్ బిన్ అబిల్ హుఖైఖ్ మరియు అసీర్ బిన్ జారిమ్‌లాంటి వాళ్ళను తుడిచిపెట్టవలసి వచ్చింది. అంతకంటే ముందే ముస్లిములు యూదుల్ని అణచివేయాల్సి ఉండింది. ఈ విషయంలో వారు కొంత ఆలస్యం చేయడానికి కారణం, యూదుల కంటే శక్తిలోను, యుద్ధ కౌశల్యంలోను మిన్న అయిన మరో వర్గం- ఖురైష్. ముస్లిములను తుదముట్టించడానికి సన్నద్ధమై ఉంది. దాన్ని విస్మరించి వారు యూదుల పని పట్టడానికి వెళ్ళలేరు. అయితే ఖురైష్‌తో నిర్యుద్ధ ఒడంబడిక (హుదైబియా ఒప్పందం) జరగగానే ముస్లిములు ఈ నేరస్తులను తుదముట్టించేందుకు మార్గం సుగమం అయిపోయింది. యూదుల లెక్కల గడియ దగ్గరకు వచ్చేసినట్లయింది.

ఖైబర్ ప్రయాణం

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, దైవప్రవక్త (స) హుదైబియా నుండి తిరిగి వచ్చి జిహజ్జా మాసం పూర్తిగాను మరియు ముహర్రం మాసంలోని కొన్ని రోజుల వరకు మదీనాలోనే ఉండిపోయారు. ముహర్రం నెల మిగిలిన రోజుల్లో ఖైబర్ వైపునకు బయలుదేరారు.

ఖైబర్ అల్లాహ్ చేసిన వాగ్దానమని, ఆయన ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్ ద్వారా దాన్ని నిలబెట్టుకున్నాడని ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు అంటారు. ఆ ఆయత్ ఇది.

وَعَدَكُمُ اللَّهُ مَغَانِمَ كَثِيرَةً تَأْخُذُونَهَا فَعَجَّلَ لَكُمْ هَٰذِهِ

అల్లాహ్ మీకు అమితమైన విజయ ధనాలను వాగ్దానం చేస్తున్నాడు. వాటిని మీరు పొందుతారు. వెంటనే ఆయన మీకు ఈ విజయాన్ని ప్రసాదిస్తాడు. (48 : 20)

"వెంటనే ఆయన మీకు ఈ విజయాన్ని ప్రసాదిస్తాడు" అనేది

హుదైబియా ఒప్పందం అని, "విజయ ధనాలను వాగ్దానం చేస్తున్నాడు" అంటే అది ఖైబర్ అని అర్థం.

ఇస్లామీయ సైనిక బలం

మునాఫిక్‌లు, విశ్వాసంలో బలహీనులు హుదైబియా ప్రయాణంలో దైవప్రవక్త (స) వెంట వెళ్ళకుండా తమ ఇండ్లలోనే ఉండిపోయిన కారణంగా అల్లాహ్ తన ప్రవక్త (స)కు ఈ విషయంలో ఆదేశాలిస్తూ ఇలా చెప్పాడు;

سَيَقُولُ الْمُخَلَّفُونَ إِذَا انطَلَقْتُمْ إِلَىٰ مَغَانِمَ لِتَأْخُذُوهَا ذَرُونَا نَتَّبِعْكُمْ ۖ يُرِيدُونَ أَن يُبَدِّلُوا كَلَامَ اللَّهِ ۚ قُل لَّن تَتَّبِعُونَا كَذَٰلِكُمْ قَالَ اللَّهُ مِن قَبْلُ ۖ فَسَيَقُولُونَ بَلْ تَحْسُدُونَنَا ۚ بَلْ كَانُوا لَا يَفْقَهُونَ إِلَّا قَلِيلًا ﴿١٥﴾

నీవు విజయ ధనాన్ని పొందడానికి వెళ్ళేటప్పుడు, వెనుక ఉండిపోయిన వారు నీతో, "మమ్మల్ని కూడా మీ వెంట రానీయండి" అని తప్పకుండా అంటారు. వారు అల్లాహ్ ఉత్తర్వును మార్చగోరుతున్నారు. వారికి స్పష్టంగా ఇలా చెప్పు, "మీరు మాతో రావడానికి ఎంత మాత్రం వీలు లేదు. అల్లాహ్ ఈ విషయాన్ని ముందే చెప్పేశాడు." వారు, "అది కాదు, మీరు మేమంటే అసూయ పడుతున్నారు" అని అంటారు. (అసలు ఇక్కడ విషయం అసూయకు సంబంధించింది కాదు), కాని వారు సరియైన మాటను చాలా తక్కువగానే అర్థం చేసుకుంటారు. (48 : 15)

అందుకని దైవప్రవక్త (స) ఖైబర్‌కు బయలుదేరేటప్పుడు, తమ వెంట కేవలం జిహాద్‌లో పాల్గొనే కోరిక కలవారే రావాలని ప్రకటించారు. ఈ ప్రకటన అర్థం ఏమిటంటే, హుదైబియాలో చెట్టు క్రింద బైతె రిజ్వాన్ చేసిన వారే వెళ్ళగలరు అని. వారి సంఖ్య మొత్తం పదునాల్గు వందల మంది.

ఈ గజ్వా సందర్భంగా మదీనా బాధ్యతలను హజ్రత్ సబా బిన్ అరఫ్తా గిఫ్ఫారీకి- ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం - నుమైలా బిన్ అబ్దుల్లాహ్ లైసీకి అప్పగించడం జరిగింది. పరిశోధకులు మొదటి పేరే సరిఅయినది అని అంటారు.[1]

1. ఫత్‌హుల్ బారీ-7/465; జాదుల్ ముఆద్-2/133

ఈ సందర్భంలోనే హజ్రత్ అబూ హురైరా (ర)గారు కూడా ముస్లిం అయి మదీనాకు వచ్చేశారు. అప్పుడు సబా బిన్ అరఫ్తా ఫజ్ర్ నమాజు చేయిస్తున్నారు. నమాజు పూర్తి చేసుకొని అబూ హురైరా ఆయన దగ్గరకు వెళ్ళగా, దారి బత్తాన్ని సమకూర్చి ఆయన్ను మహాప్రవక్త (స) వద్దకు పంపించేశారు. అబూ హురైరా ఖైబర్‌కు చేరి దైవప్రవక్త (స)గారి దర్శనం చేసుకున్నారు (అప్పటికే ఖైబర్ జయించబడింది). దైవప్రవక్త (స) ముస్లిము లతో మాట్లాడి ఆయనకు, ఆయన వెంట వచ్చిన వారికి కూడా విజయధనాన్ని పంచిపెట్టారు.

యూదులకు మునాఫిక్‌ల సహాయం

ఈ సందర్భంగా యూదులకు వెన్నుదన్నుగా మునాఫిక్‌లు ప్రయత్నాలు ప్రారంభించారు. మునాఫిక్‌ల సర్దారు అబ్దుల్లా బిన్ ఉబై, ఖైబర్ యూదులకు, "ముహమ్మద్ మీపై దాడి చేయడానికి వస్తున్నాడు, కాబట్టి జాగ్రత్తగా ఉండండి, యుద్ధం కోసం సమాయత్తమవ్వండి భయపడకండి. ఎందుకంటే మీ సైనికుల సంఖ్య, యుద్ధ సామగ్రి ముహమ్మద్ మరియు ఆయన అనుచరుల కంటే పెద్దది. ప్రస్తుతం వారి వద్ద ఏదీ లేదు. ఆయుధాలు కూడా చాలా తక్కువ" అని సమాచారం పంపించాడు.

ఈ వార్త విన్న ఖైబర్ ప్రజలు, కనానా బిన్ అబిల్ హుఖైఖ్ మరియు హౌజా బిన్ ఖైస్‌ను బనూ గత్ఫాన్ వారి వద్దకు సహాయార్థం పంపించడం జరిగింది. ఎందుకంటే బనూ గత్ఫాన్ తెగవారు యూదులకు మిత్రపక్షం మరియు ముస్లిములకు విరోధులు. దీనికితోడు యూదులు, వారే గనక ముస్లిములపై విజయం సాధిస్తే ఖైబర్ పంటలో సగభాగం వారికి అప్పచెబుతామన్న భరోసా కూడా ఇచ్చారు.

ఖైబర్ మార్గం

దైవప్రవక్త (స) ఖైబర్‌కు వెళుతూ 'జబ్లెఇస్ర్'ను దాటి, వాదియె సహబా (సహబా లోయ) గుండా ప్రయాణం సాగించారు. ఆ తరువాత రజీ అనే లోయలోనికి వచ్చి చేరారు. (కాని ఈ రజీ, అజ్ల్ మరియు కారా వారి కుట్ర మూలంగా బనూ లహియ్యాన్ చేతిలో ఎనమండుగురు సహాబాలు చంపబడిన రజీ కాదు).

రజీ నుండి బనూ గత్ఫాన్ నివాసం కేవలం ఒక పగలు ఒక రాత్రి ప్రయాణ దూరంలో ఉంది. అప్పటికే బనూ గత్ఫాన్ యూదుల సహాయం కోసం ఖైబర్‌కు బయలుదేరి ఉన్నారు. అయితే బయలుదేరి కొంత దూరం వెళ్ళారో లేదో, వెనుక వైపు పెద్ద గొడవ వినబడింది. ముస్లిములు తమ భార్యాపిల్లలు, పశువులపై దాడి చేశారేమో అని తలచి వెనుకకు మరలి వెళ్ళిపోయారు. ఇలా ఖైబర్‌కు వెళ్ళే మార్గంలో ముస్లిములకు ఎలాంటి అడ్డంకి లేకుండాపోయింది.

దైవప్రవక్త (స) సైనిక పటాలానికి మార్గం చూపించడానికి నియమించ బడిన ఇద్దరు నిపుణుల్ని పిలిపించారు. అందులో ఒకరి పేరు హుసైల్. వీరిద్దరితో, ఖైబర్‌కు ఉత్తరం వైపు నుండి అంటే, మదీనా వైపు నుండి కాకుండా సిరియా వైపు నుండి ఖైబర్‌లో ప్రవేశించే సరియైన మార్గం ఏదో తెలియజేయ మని అడిగారు. ఈ యుద్ధవ్యూహం ద్వారా యూదులు సిరియా వైపు పారి పోకుండా, మరో వైపు బనూ గత్ఫాన్ మరియు యూదుల నడుమకు వచ్చి గత్ఫాన్ వైపు నుండి ఎలాంటి సహకారం అందకుండా చేయడం ప్రవక్త (స)గారి యుద్ధచాతుర్యం.

వారిలో ఓ మార్గదర్శకుడు దైవప్రవక్త(స)తో అలాంటి మార్గం గుండానే తీసుకొని వెళతానని మాట ఇచ్చాడు. అతను సైనిక పటాలానికి ముందు నడుస్తూ ఓ చోటకు చేరాడు. అది అనేక మార్గాల కూడలి. అక్కడికి చేరిన తరువాత అతడు, "దైవప్రవక్తా (స)! తమరు వీటిలో ఏ మార్గాన్నయినా ఎంచుకోండి. వీటన్నిటి ద్వారా తమరు గమ్యాన్ని చేరుకోగలరు" అన్నాడు. ఒక్కొక్క మార్గం పేరేమిటో చెప్పు అని అడగగా అతను, ఓ మార్గం పేరు 'హజ్న్' (దుఃఖపూరితమైనది) అన్నాడు. ప్రవక్త దాన్ని అనుసరించ నిరాక రించగా, అతను రెండో మార్గం పేరు 'షాష్' (కడగండ్లతో కూడుకున్నది) అని చెప్పాడు. దైవప్రవక్త (స) దాన్నీ వదిలేశారు. మూడో మార్గం పేరు 'హాతిబ్' (కట్టెలు కొట్టేవాడు) అని అనగా దాన్ని అనుసరించడానికీ నిరాకరించారాయన. తదుపరి హుసైల్ ఇక మిగిలిపోయింది ఓ మార్గమే అని చెప్పాడు. హజ్రత్ ఉమర్ (ర) అందుకొని దాని పేరు ఏమిటీ? అని అడగగా, 'మర్‌హబ్' అన్నా డతడు. మహాప్రవక్త (స) ఆ మార్గంపై నడువడానికే ఇష్టపడ్డారు.

ప్రయాణంలో జరిగిన కొన్ని సంఘటనలు

1. హజ్రత్ సల్మా బిన్ అకూ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది: "మేము దైవప్రవక్త (స) గారి వెంట బయలుదేరాము. అది రాత్రి ఝాము, ఓ వ్యక్తి ఆమిర్‌నుద్దేశించి, "ఆమిర్! నీ కవిత్వాన్ని గానం చేసి వినిపించవూ?" అని అడిగాడు. ఆమిర్ ఓ కవి. ఆయన తన ఒంటెను దిగి తోటివారికి పాటపాడి వినిపించనారంభించారు. ఆ పాట అర్థం ఇలా ఉంది:

"ఓ అల్లాహ్! నీవే లేకపోతే మేము రుజుమార్గాన్ని పొందేవారం కాదు. దానధర్మాలు చేసేవారం కాదు. నమాజు చేసేవారం కాదు. మమ్మల్ని మేము నీకు అర్పించుకున్నాము. నీ భయభీతులు కలిగి ఉన్నంత వరకు మమ్మల్ని మన్నిస్తూ ఉండు. మేము (నీ మార్గంలో) ఎవరినైనా ఢీకొంటే మాకు స్థయిర్యం కలుగజెయ్యి. మాపై శాంతి కురిపించు. మమ్మల్ని ఎవరైనా సవాలు విసిరి నిలువరిస్తే మేము దృఢంగా నిలబడతాము. మా సవాలుపై ప్రజలు నమ్మకం కలిగి ఉన్నారు."

ఈ పాట విన్న దైవప్రవక్త (స) ఎవరా పాటపాడిన వ్యక్తి? అని అడిగారు. ఈయన ఆమిర్ బిన్ అకూ అని బదులిచ్చారు సహచరులు. ఆయన్ని అల్లాహ్ కరుణించుగాక అని దైవప్రవక్త (స) దీవించగా, ఓ వ్యక్తి, అయితే, ఆయన అమరగతి నొందడం ఖాయం అని అనేశాడు కూడా. ప్రవక్త (స) ఇప్పటి వరకు ఆ మాట మాకుచెప్పలేదేమిటీ? అని అన్నాడు.[2]

(యుద్ధ సమయంలో) దైవప్రవక్త (స) ఓ వ్యక్తి గురించి ప్రత్యేకంగా కరుణించమని అల్లాహ్‌ను వేడుకుంటే అతను అమరగతి నొందుతాడన్న విషయం సహాబాలకు తెలుసు.[3] ఈ సంఘటనే ఖైబర్ యుద్ధ సమయంలో హజ్రత్ ఆమిర్ (ర) విషయంలో జరిగింది. (ఆ కారణంచేతనే, దైవప్రవక్త (స) ఆయన వయస్సు పెరగాలని ఎందుకు దుఆ చేయలేదు, మేము ఆయన కవిత్వాన్ని మరింత ఆస్వాదించేవారం కదా! అని అనుకోవడం కూడా జరిగింది.

2. ఖైబర్‌కు మరీ చేరువలో మహాప్రవక్త (స) సహ్బా లోయలో అస్ర్ నమాజు చేశారు. తినుబండారాలను తెప్పిస్తే కేవలం 'సత్తూ' (ప్యాల పిండి)

---

2. సహీ బుఖారి, గజ్వయె ఖైబర్ అధ్యాయం-2/603; సహీ ముస్లిమ్, గజ్వయె జీఖరద్ అధ్యాయం-2/115

3. సహీహ్ ముస్లిమ్-2/115

తీసుకురావడం జరిగింది. దాన్ని ఆయన ఆదేశం మేరకు ముద్దగా చేయడం జరిగింది. మహాప్రవక్త (స)తో సహా సహాబాలందరూ దాన్ని ఆరగించారు. ఆ తరువాత మగ్రిబ్ నమాజు కోసం లేచి కేవలం నీరు నోటబట్టి పుక్కిలించగా సహాబాలు కూడా దైవప్రవక్త (స)ను అనుసరిస్తూ పుక్కిలించారు. ఆ తరువాత వుజూ చేయకుండానే ఆయన మగ్రిబ్ నమాజు చేశారు.[4] (అంటే అస్ర్ నమాజులో చేసిన వుజూతోనే సరిపెట్టుకున్నారు) ఆ తరువాత ఆయన (స) ఇషా నమాజు చేశారు. [5]

ఖైబర్ సానువుల్లో ఇస్లామీయ సైన్యం

ఉదయం యుద్ధం జరుగుతుందనగా ఆ రాత్రి ముస్లిములు తమ చివరి రేయి ఖైబర్ దాపున గడిపారు. కాని ఈ విషయం యూదులకు ఏమాత్రం తెలియలేదు. రాత్రి పూట శత్రువుకు దాపుగా వచ్చినా సూర్యోదయం కాక పూర్వం యుద్ధం మొదలుపెట్టడం మహాప్రవక్త (స) సంప్రదాయం కాదు. కాబట్టి పూర్వసంధ్యాసమయంలో (కొంత చీకటిగా ఉన్నప్పుడే) ఆయన ఫజ్ర్ నమాజు చేశారు. ఆ తరువాత ముస్లిములు తమ వాహనాలనెక్కి ఖైబర్ వైపునకు బయలుదేరారు. ఇటు ఖైబర్ ప్రజలు ఆ విషయం తెలియనందున తమ పారలు, గునపాలు పట్టుకొని వ్యవసాయ పనుల కోసం బయలుదేరారు. హఠాత్తుగా ముస్లిం సైన్యాన్ని చూసి భయకంపితులై నగరం వైపునకు పరుగిడుతూ, "దైవసాక్షి! ఇంకేముందీ! ముహమ్మద్ (స) సైన్యం మన మీదకు వచ్చిపడిందని" అరవనారంభించారు. (ఈ దృశ్యాన్ని చూసి) మహాప్రవక్త (స), "అల్లాహు అక్బర్! ఖైబర్ సర్వనాశనం అయింది. "అల్లాహు అక్బర్! ఖైబర్ సర్వనాశనమైంది, మనం ఏ జాతి మైదానంలోనైతే కాలిడుతామో భయభీతులైన ప్రజల ఆ రోజు చెడ్డదే అవుతుంది" అని అన్నారు.[6]

మహాప్రవక్త (స) తన సైన్యాన్ని విడిది చేయించడానికి ఓ ప్రదేశాన్ని ఎంచుకున్నారు. ఇది చూసిన హబ్బాబ్ బిన్ మున్జిర్ (ర) దైవప్రవక్త(స)తో ఇలా విన్నవించుకున్నారు.

---

4. అయ్‌జన్ సహీ బుఖారి 2/603

5. ముగాజి, అల్ వాఖిదీ (గజ్వయె ఖైబర్, పుట.112)

6. సహీహ్ బుఖారి, గజ్వయె ఖైబర్ అధ్యాయం-2/603,604

"దైవప్రవక్తా(స)! ఈ ప్రదేశంలో విడిది చేయడానికి దైవం మీకు ఏమైనా ఆదేశం ఇచ్చాడా? లేదా కేవలం తమరు యుద్ధవ్యూహంగా ఈ చోటును ఎంపిక చేసుకున్నారా?"

"లేదు! ఇది కేవలం నా సొంత నిర్ణయం" అన్నారు దైవప్రవక్త (స).

"ఓ దైవప్రవక్తా! ఈ ప్రదేశం నజాత్ కోటకు చాలా దాపుగా ఉంది. ఖైబర్‌కు చెందిన యుద్ధ యోధులు ఈ కోటలోనే ఉన్నారు. వారికి మన పరిస్థితులు ఏమిటో తెలిసిపోతుంది. కాని వారి గురించి మాత్రం మనకు ఏదీ తెలియరాదు, వారి బాణాలు మన మీదకు వచ్చిపడతాయి కాని మన బాణాలు వారి మీదకు వెళ్ళలేవు. వారు రాత్రి పూట చేసే దాడి నుండి కూడా మనం రక్షించుకోలేం. ఇంతేకాదు, ఈ ప్రదేశం ఖర్జూరపు చెట్లతో నిండి ఉంది. దిగువ ప్రదేశం కూడానూ. ఇక్కడి భూమి కూడా రోగాల పుట్ట. కాబట్టి తమరు ఈ లోపాలు లేనటువంటి మరేదైనా ప్రదేశాన్ని ఎన్నుకొని అక్కడ విడిది చేయడానికి ఆదేశమివ్వండి" అని విన్నవించుకున్నారు హబ్బాబ్(ర).

"నీవు ఇచ్చిన సలహా చాలా బాగుంది" అంటూ మహాప్రవక్త (స) మరో ప్రదేశానికి వెళ్ళి విడిది చేశారు.

ఖైబర్ నగరం కనుచూపు మేరకు రాగానే మహాప్రవక్త (స) తమ సైన్యాన్ని ఆగండి అని చెప్పగా సైన్యం ఆగిపోయింది. అక్కడ ఆయన ఈ దుఆ చేశారు.

"ఓ అల్లాహ్! సప్తాకాశాల స్వామీ! వేటినైతే అవి తమ నీడతో కప్పాయో వాటి స్వామీ! సప్త భూమండలాల ప్రభూ! వేటినైతే అవి ఎత్తుకొని ఉన్నాయో వాటి ప్రభూ! షైతానులను మార్గభ్రష్టులుగా చేసిన స్వామీ! మేము నీ నుండి ఈ బస్తీ మేలును, అక్కడి ప్రజల శ్రేయాన్ని, ఇందులో ఉన్న వాటన్నిటి మేలు గురించి నిన్ను అర్థిస్తున్నాం. ఈ బస్తీలోని చెడు నుండి, ఇక్కడి ప్రజల చెడుగు నుండి, ఈ బస్తీలో ఉన్నవాటి చెడుగు నుండి నీ శరణు వేడుతున్నాము."

ఆ పిదప "పదండి ముందుకు" అంటూ అక్కడి నుంచి కదిలారు.[7]

---

7. ఇబ్నె హష్షామ్-2/329

యుద్ధ సన్నాహం-ఖైబర్ కోటలు

ఖైబర్ సరిహద్దుల్లోనికి చేరిన రాత్రే మహాప్రవక్త (స), "రేపు నేను జెండాను ఓ వ్యక్తి చేతికి ఇవ్వబోతున్నాను. అతను అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను ప్రేమించేవాడు, ఆయనంటే అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు మహా ఇష్టం" అన్నారు. తెల్లారగానే సహాబా (ర) అందరూ దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరయ్యారు. ప్రతి వ్యక్తీ ఆ జెండా తనకే దక్కాలనే ఆశిస్తున్నాడు. మహాప్రవక్త (స) అడిగారు "అలి ఇబ్నె తాలిబ్ ఎక్కడా?" అని.

"ఆయనకు కళ్ళు కలిగాయి"[8] అన్నారు సహాబా సమాధానంగా.

"ఆయన్ను పిలువండి" అన్నారు మహాప్రవక్త (స).

ఆయన్ను పిలుచుకురాగా దైవప్రవక్త (స) తమ లాలాజలాన్ని ఆయన కళ్ళకు పెట్టి దుఆ చేయగా ఆయనకు వెంటనే స్వస్థత చేకూరింది. కళ్ళకలక ఏమీ లేకుండా పోయింది. ఆ తరువాత జెండాను ఆయన చేతికి అందించడం జరిగింది. జెండా చేతబట్టి హజ్రత్ అలీ దైవప్రవక్త (స)తో,

"ఓ అల్లాహ్! నేను వారంతా మాలా మారిపోయేటంత వరకు వారితో పోరాడుతాను" అనగా,

"ధీమాగా యుద్ధ మైదానానికి వెళ్ళి వారికి ఇస్లామ్ సందేశాన్ని ఇవ్వు. ఇస్లామ్ ధర్మంలో అల్లాహ్ హక్కులేమిటో వారికి తెలియజెయ్యి. దైవసాక్షి! నీ ద్వారా ఒక్క వ్యక్తికి అయినా రుజుమార్గం లభిస్తే, అది నీ కోసం ఎర్ర ఒంటెలు పొందడం కన్నా ఎంతో మేలైనది" అన్నారు దైవప్రవక్త (స).[9]

ఖైబర్ ప్రజలు రెండు మండలాల్లో విభజించబడి ఉన్నారు. ఒక మండలంలో ఈ క్రింది అయిదు కోటలున్నాయి.

1. హిస్న్ నాయిమ్, 2. హిస్న్ సఅబ్ బిన్ ముఆజ్, 3. హిస్న్ జుబైర్ కోట, 4. హిస్న్ అబీ, 5. హిస్న్ నజార్ (హిస్న్ అంటే కోట అని అర్థం).

వీటిలో మొదటి మూడు కోటలకు సంబంధించిన ప్రాంతం 'నజాత్'గా పిలువబడేది. మిగతా రెండు కోటలకు సంబంధించిన ప్రాంతం 'షిక్' పేరున ప్రఖ్యాతిగాంచింది.

---

8. ఈ కళ్ళకలక వలననే ఆయన వెనుకబడి ఉన్నారు. చివరగా ప్రవక్త (స) చేరుకోగలిగారు

9. సహీ బుఖారి, గజ్వాయె ఖైబర్-2/605, 606

ఖైబర్ జనసంఖ్యకు సంబంధించిన రెండవ మండలం 'కతైబా' అనబడేది. ఇందులో కేవలం మూడు కోటలు మాత్రమే ఉన్నాయి.

1. హిస్న్ ఖముస్ (ఇది బనూ నజీర్ వంశానికి చెందిన అబుల్ హుఖైఖ్ కోట), 2. హిస్న్ వతీహ్, 3. హిస్న్ సలాలమ్.

ఈ ఎనిమిది కోటలే కాకుండా ఖైబర్‌లో మరి కొన్ని కోటలు గఢులు కూడా ఉన్నాయి. కాని అవన్నీ చిన్నవే. శక్తిలోను, సంరక్షణలోనూ అవి పై కోటలకు సరితూగేవి కావు.

యుద్ధం విషయానికొస్తే అది మొదటి మండలంలోనే జరిగింది. రెండో మండలంలోని మూడు కోటల్లో యోధులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ యుద్ధం చేయకుండానే వారు ఆ కోటలను ముస్లిములకు అప్పగించేశారు.

యుద్ధం ప్రారంభం - నాయిమ్ కోట కైవసం

పైన చెప్పిన ఎనిమిది కోటల్లో మొట్టమొదటగా నాయిమ్ కోటపైన్నే దాడి జరిగింది. ఎందుకంటే ఈ కోట దాని ఉనికి, యుద్ధ నీతి ప్రకారం యూదుల మొదటి రక్షణ శ్రేణిలోనిది. ఈ కోట మర్‌హబ్ అనే పేరుగల యూద యోధుని కోట. ఇతడు "వేయి మందికి సమానమైన బలాఢ్యుడు" అని చెప్పుకోవడం జరిగేది.

హజ్రత్ అలి బిన్ అబీ తాలిబ్ (ర) ముస్లిముల సైన్యాన్ని వెంటబెట్టు కొని ఆ కోట ముందుకు వెళ్ళారు. యూదులకు ఇస్లామ్ సందేశాన్ని వినిపించి దాని వైపునకు ఆహ్వానించగా వారు నిరాకరించారు. తమ రాజు మర్‌హబ్ నేతృత్వంలో ముస్లిములతో యుద్ధం చేసే ఉద్దేశ్యంతో ముందుకు వచ్చి నిలిచారు. యుద్ధరంగంలోకి దూకి మొదట మర్‌హబ్ ఒంటరి పోరాటం కోసం సవాలు విసిరాడు. ఆ తీరును హజ్రత్ సల్మా బిన్ అకూ ఇలా వర్ణిస్తున్నారు.

"మేము ఖైబర్‌కు చేరగా వారి రాజు మర్‌హబ్ తన కరవాలాన్ని చేతబట్టి నిక్కుతూ నీల్గుతూ, యుద్ధజ్వాలలు ఎగిసే సమయంలో, నేను మర్‌హబ్‌ను, ఆయుధధారుణ్ణయి ధైర్యంగా పోరాడుతానని, అనుభవం గల యోధుణ్ణి అన్న విషయం ఖైబర్ ప్రజలకు బాగా తెలుసు" అంటూ ముందుకొచ్చి నిలిచాడు.

అతనిని మార్కొనడానికి నా పినతండ్రి ఆమిర్ ముందుకొచ్చారు. ఆయన అతనితో ఇలా అన్నారు.

"నేను ఆమిర్‌ను, ఆయుధధారుణ్ణి, బలవంతుణ్ణి, యోధుణ్ణి అన్న విషయం ఖైబర్ ప్రజలు బాగా ఎరుగుదురు."

అనంతరం ఆ ఇరువురు ఒకరిపైనొకరు ఖడ్గ ప్రహారాలు ప్రారంభించారు. మర్‌హబ్ కరవాలం నా పినతండ్రి ఢాలులో గ్రుచ్చుకున్నది. ఆమిర్ అతణ్ణి క్రింది నుంచి కొట్టబోయారు. కాని ఆయన కరవాలం పొట్టిది అయినందు వలన, ఆ యూదుని శిలమండపై విసిరారు. కరవాలం పిడి తిరిగి వచ్చి ఆయన మోకాలికి తగిలింది. చివరికి ఆ గాయంతోనే ఆయన అమరగతిని పొందారు. దైవప్రవక్త (స) తన రెండు వ్రేళ్ళను కలిపి చూయిస్తూ, "ఈయనకు రెట్టింపు ప్రతిఫలం దక్కుతుంది. ఆయన గొప్ప ధైర్యవంతుడైన ముజాహిద్. బహుశా ఈ అరేబియాలోనే అలాంటి అరబ్బు లేడేమో!" అని అన్నారు.[10]

ఎలాగైతేనేమీ, హజ్రత్ ఆమిర్ గాయపడిన తరువాత మర్‌హబ్‌ను ఎదుర్కోడానికి హజ్రత్ అలి (ర) వచ్చారు. ఆయన అప్పుడు ఈ పద్యపాదాలను వల్లించారు.

"నేను ఎవరిననుకున్నావు? నా తల్లి నా పేరు హైదర్ (పులి)గా పెట్టారు. అడవి పులిలా భయంకరుణ్ణి. కొలపాత్ర 'సాఅ' కు బదులు నా బల్లెంతో నిన్ను కొలువగలను."

ఆ తరువాత మర్‌హబ్ తలపై తన కరవాలంతో వ్రేటువేయగా అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అలా హజ్రత్ అలి (ర) చేతుల మీదుగా విజయం లభించినట్లయింది.[11]

యుద్ధం జరిగేటప్పుడు హజ్రత్ అలి (ర) యూదుల కోట దాపుకు

10. సహీహ్ ముస్లిమ్, ఖైబర్ యుద్ధ అధ్యాయం-2/122, గజ్వయె జీఖరద్ అధ్యాయం వగైరా-2/115; సహీ బుఖారి గజ్వయె ఖైబర్ అధ్యాయం-2/603.
11. మర్‌హబ్‌ను చంపిన వారెవరూ? అన్న విషయంలో విభేదాలున్నాయి. అదే కాకుండా అతను చనిపోయిందెప్పుడు? కోట స్వాధీనమైనదెప్పుడు? అన్న విషయంలోనూ గట్టి భేదాభిప్రాయాలున్నాయి. సహీ షైన్‌లోని ఉల్లేఖనాల సందర్భాలలోను కొంత అభిప్రాయభేదం ఉంది. మేము పైన చెప్పినదంతా సహీహ్ బుఖారి ఉల్లేఖనం సందర్భాన్ని దృష్టిలో ఉంచుకునే చెప్పడం జరిగింది.

చేరినప్పుడు ఓ యూదుడు ఆ కోటపై నుండి తొంగిచూసి నీవెవరవూ? అని అడిగాడు. సమాధానంగా హజ్రత్ అలి (ర),

"నేను అలీని" అన్నారు. ఆ పేరు వినడంతోనే ఆ యూదుడు, "ఆ గ్రంథం సాక్షి! ఏదైతే మూసా (అ.స.)పై అవతరించిందో, మీరే ఔన్నత్యాన్ని పొందుతారు" అని వెళ్ళిపోయాడు.

ఆ తరువాత మర్‌హబ్ తమ్ముడు యాసిర్, "నాతో తలపడే శక్తి ఎవరికుంది?" అని సవాలు విసురుతూ ముందుకు వచ్చాడు. ఈ సవాలును స్వీకరించి హజ్రత్ జుబైర్ (ర) యుద్ధ మైదానంలోనికి దిగారు. అది చూసిన ఆయన తల్లిగారు హజ్రత్ సఫియా (ర), "దైవప్రవక్తా! నా కుమారుడు చంపివేయబడతాడా?" అని ఆందోళన పడుతూ అడిగారు.

"లేదు! నీ కుమారుడే అతణ్ణి చంపేస్తాడు" అన్నారు దైవప్రవక్త (స). అలాగే జరిగింది. హజ్రత్ జుబైర్(ర) యాసిర్‌ను హతమార్చారు.

ఆ తరువాత నాయిమ్ కోట దగ్గర భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ప్రఖ్యాత యూద యోధులు హతులైపోయారు. మిగిలిన యూదులకు నిరోధించే శక్తి ఉడిగిపోయినందున ముస్లిముల దాడిని ఎదుర్కోలేకపోయారు. కొన్ని ఆధారాల్లో ఈ యుద్ధం ఎన్నో రోజుల వరకు కొనసాగిందని, ముస్లిములకు గట్టి ప్రతిఘటన ఎదురైందని ఉంది. అయినా యూదులు ముస్లిములను ఓడించలేక నిరాశా నిస్పృహలతో వెనక్కు మళ్ళి సఅబ్ కోటలోనికి వెళ్ళిపోయారు. ముస్లిములు నాయిమ్ కోటను వశపర్చుకున్నారు.

సఅబ్ బిన్ ముఆజ్ కోటను జయించడం

నాయిమ్ కోట తరువాత సఅబ్ కోట తన బలం, రక్షణ రీత్యా రెండవ పటిష్టమైన కోట. ముస్లిములు హజ్రత్ హుబ్బాబ్ బిన్ మున్జిర్ అన్సారీ నాయకత్వంలో ఈ కోటపై దాడి చేశారు. మూడు రోజుల వరకు దాన్ని తమ దిగ్బంధంలో ఉంచుకోవడం జరిగింది. మూడో రోజున మహాప్రవక్త (స) ఈ కోటను జయించేందుకు ప్రత్యేకంగా దుఆ చేశారు.

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ఇలా ఉంది:

"అస్లమ్ తెగకు చెందిన ఓ శాఖ 'సహెమ్' మనుషులు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నారు:

"ఓ ప్రవక్తా! మేము బాగా అలసిపోయాము. మా వద్ద ఏమీ మిగల్లేదు." దానికి దైవప్రవక్త (స) ఇలా దుఆ చేశారు;

"ఓ అల్లాహ్! వీరి పరిస్థితి ఏమిటో నీవు బాగా ఎరుగుదువు. వీరి శక్తి ఉడిగిపోయిన విషయం కూడా నీకు తెలుసు. వారికి ఇవ్వడానికి నా దగ్గరా ఏదీ లేదు. కాబట్టి ఎంతో ప్రయోజనకారి అయిన, సమృద్ధమైన ఆహార పదార్థాలు, క్రొవ్వు గల ఓ కోట విజయాన్ని వీరికి సంప్రాప్తం చెయ్యి."

ఆ ప్రార్థన తరువాత ముస్లిములు ఆ కోటపై విరుచుకుపడ్డారు. అల్లాహ్ సఅబ్ బిన్ ముఆజ్ కోట విజయాన్ని వారికి ఇచ్చాడు. ఖైబర్‌లో ఆహార పదార్థాలు, క్రొవ్వుగల మరే కోట అంతకంటే లేదు.[12]

దైవప్రవక్త (స) దుఆ చేసి ఆ కోటపై దాడి చేయడానికి పిలుపునివ్వగా దాడి చేసే వారిలో బనూ అస్లమ్ వారే ముందంజలో ఉన్నారు. ఈ కోట ముందు కూడా వ్యక్తిగత యుద్ధం, సామూహిక యుద్ధం జరిగింది. అదే రోజు సూర్యాస్తమయానికి ముందే కోట జయించబడింది. అక్కడ ముస్లిములకు కొన్ని పెద్ద పెద్ద రాళ్ళు విసిరే వరిసేలలూ, దబాబాలు[13] లభించాయి.

ఇబ్నె ఇస్‌హాక్ కథనంలో, తీవ్రమైన ఆకలి బాధ యొక్క ప్రస్తావన ఉంది. ఈ ఆకలి బాధను తాళలేక సైనికులు (విజయం లభించగానే) గాడిదలను జిబహ్ చేసి వాటి మాంసాన్ని వండనారంభించారు. దైవప్రవక్త (స)కు ఈ విషయం తెలిసి, పెంపుడు గాడిదల మాంసం తినకుండా వారిని వారించారు.

జుబైర్ కోట విజయం

నాయిమ్ కోట, సఅబ్ కోట వశమైన తరువాత యూదులు నజాత్ కోటలన్నిటినీ వదిలేసి జుబైర్ కోటలో తలదాచుకున్నారు. ఇది సురక్షితమైన పర్వతంపై నిర్మించబడిన కోట. కోటకు చేరడానికి మార్గం బహుదుర్గమంగా ఉంది. అశ్వారూఢులుగాని, పదాతిదళ సైనికులుగాని అక్కడికి చేరడం బహు

12. ఇబ్నె హష్షామ్-2/332
13. కట్టెతో తయారైన సురక్షితమైన వాహనంలాంటి ఓ పెట్టె. ఇందు చొరబడి చాలా మంది శత్రువు ప్రహారాల నుండి రక్షణ పొందుతూ కోట గోడ వరకు వెళ్ళి అందు రంధ్రం చేయడానికి పనికొచ్చే ఓ సాధనం. వాటినే దబాబా అంటారు. ఇప్పుడు యుద్ధ టాంకుల్ని దబాబాలుగా పిలుస్తున్నారు.

కష్టం. మూడు రోజుల వరకు దాన్ని దిగ్బంధించి అక్కడనే ఉండిపోవలసి వచ్చింది. ఆ తరువాత ఓ యూదుడు వచ్చి దైవప్రవక్త(స)తో, "ఓ అబుల్ ఖాసిం! మీరు ఒక నెల వరకు ఇక్కడ దిగ్బంధం సాగించినా వారికి జరిగే నష్టం ఏమీ ఉండదు. కాని వారు ఏ ఊటబావుల్లో నుండి అయితే నీరు తీసుకుంటారో, అవి క్రింద ఉన్నాయి. వీరు రాత్రిపూట బయటకు వచ్చి నీరు త్రాగి వెడుతూ ఉంటారు. మీరే గనక వారు నీరు త్రాగకుండా, తీసుకొని పోకుండా అడ్డుకుంటే దాసోహం అనక మానరు." ఈ వార్త అందగానే దైవప్రవక్త(స) వారి నీటిని ఆపేశారు. ఆ తరువాతగాని యూదులు బయటకు వచ్చి యుద్ధంలో పాల్గొనలేదు. ఈ యుద్ధంలో ఎందరో ముస్లిములు హతుల య్యారు. పదుగురు యూదులు కూడా చనిపోయారు. కాని కోట వశమై పోయింది.

కైవసం అయిన 'అబీ' కోట

జుబైర్ కోట కోల్పోయిన యూదులు హిస్న్ అబీ (అబీ కోట) లోనికి వెళ్ళి రక్షణ పొందారు. ముస్లిములు ఆ కోటను కూడా దిగ్బంధించారు. ఈసారి ఇద్దరు యూద యోధులు ఒకరి తరువాత ఒకరు వ్యక్తిగత పోరాటం కోసం సవాలు విసురుతూ యుద్ధరంగంలోకి దుమికారు. ఆ ఇరువురు కూడా ముస్లిముల చేతిలో ప్రాణాలొదలడం జరిగింది. రెండో యూదుణ్ణి చంపిన వారు ఎర్ర తలపాగ చుట్టుకున్న ప్రఖ్యాత యోధుడు అబూ దుజానా సమాక్ బిన్ ఖర్షా అన్సారి (ర) గారే. ఆయన ఆ యూదుణ్ణి చంపి ఎంతో చురుకుగా వారి కోటలో చొరబడ్డారు. వారి వెంటే ఇస్లామియ సేన కూడా ఆ కోటలో ప్రవేశించింది. లోపల కొంత సమయం వరకు ఘోర యుద్ధం జరిగింది. కాని ఆ తరువాత యూదులు ఆ కోట నుండి పారిపోనారంభించారు. చివరకు అందరూ పారిపోయి 'నజార్' కోటలోకి చేరుకున్నారు. ఇది ఖైబర్‌లోని మొదటి అర్ధ భాగానికి (అంటే మొదటి మండలం) చెందిన చిట్టచివరి కోట.

జయించబడిన 'నజార్' కోట

ఈ కోట ఆ ప్రాంతానికి చెందిన పటిష్టమైన కోట. ముస్లిములు వారి శక్తినంతా ఉపయోగించినా ఈ కోటలో ప్రవేశించలేరనేది యూదుల ధీమా. కాబట్టి వారు తమ స్త్రీలు, పిల్లలతో సహా ఆ కోటలోనే రక్షణ పొందడానికి

ఏర్పాట్లు చేసుకొని ఉన్నారు. ఇప్పటి వరకు నాల్గు కోటల్లోని ఏ కోటలో కూడా వారు పిల్లలను, స్త్రీలను ఉంచలేదు.

ముస్లిములు ఆ కోటను కూడా ఎంతో పకడ్బందీగా దిగ్బంధించారు. యూదులపై బాగా వత్తిడిని తెచ్చారు. కాని ఈ కోట ఓ ఎత్తయిన, సురక్షితమైన కొండపై కట్టబడి ఉండడం మూలంగా అందులో ప్రవేశించడానికి మార్గం ఏదీ అగుపడలేదు ముస్లిములకు. అటు యూదులకు కోట నుండి బయటకు వచ్చి ముస్లిములను ఎదుర్కోడానికి ధైర్యం చాలడం లేదు. అయితే బాణాల వర్షం కురిపిస్తూ, రాళ్ళు విసురుతూ వారిని అడ్డగిస్తున్నారు.

ఈ కోటను వశపర్చుకోవడం ముస్లిములకు కష్టసాధ్యం అని అనిపించగా, దైవప్రవక్త (స), మిన్జనీక్‌లు (పెద్ద రాళ్ళను విసిరే వడిసెలలు) ఉపయోగించమని ఆదేశం ఇచ్చారు. ముస్లిములు కొన్ని గుండ్లను ఆ కోట పైకి విసరివేయగా ఆ కోట గోడల్లో పగుళ్ళు ఏర్పడి మార్గం లభించింది. ఆ తరువాత కోట లోపల భీకర యుద్ధం జరిగింది. యూదులకు ఘోర పరాజయం ఎదురైంది. తక్కిన కోటల నుండి పారిపోయి ఎలా ఆత్మరక్షణ చేసుకున్నారో యూదులు ఈ కోట నుండి కూడా అలానే జారుకున్నారు. పారిపోయేటప్పుడు వారు తమ స్త్రీలను, పిల్లలను కూడా తీసుకువెళ్ళడం మరచిపోయారు. వారిని ముస్లిముల దయాదాక్షిణ్యాలపైన్నే వదిలేశారు.

ఈ పటిష్టమైన కోట విజయం తరువాత ఖైబర్ యొక్క మొదటి సగభాగం (నజాత్ మరియు షిక్ ప్రాంతం) గెలుచుకున్నట్లయింది. ఈ ప్రాంతంలో మరికొన్ని చిన్న చిన్న కోటలు కూడా ఉన్నాయి. కాని ఈ కోట చేజారిపోయిన తరువాత యూదులు ఆ మిగిలిన కోటల్ని కూడా ఖాళీ చేసి ఖైబర్‌కు చెందిన రెండవ మండలం 'కతీబా' వైపునకు పారిపోయారు.

జయించబడిన ఖైబర్ రెండవ సగభాగం

నజాత్ మరియు షిక్ ప్రాంతం జయించబడిన తరువాత మహాప్రవక్త (స), కతీబా, వతీష్ మరియు సలాలిమ్ ప్రాంతం వైపునకు మళ్ళారు. 'సలాలిమ్' బనూ నజీర్‌కు చెందిన ప్రముఖ యూదుడు 'అబుల్ హుఖైబ్'కు చెందిన కోట. ఇటు నజాత్ మరియు షిక్ ప్రాంతాల నుండి పారిపోయి వచ్చిన యూదులందరూ ఇక్కడికి చేరి తలదాచుకుని పటిష్టమైన పహరా కాస్తున్నారు.

ఇక్కడున్న మూడు కోటల్లో ఏ కోటలోనైనా యుద్ధం జరిగిందా లేదా అనే విషయంలో యుద్ధాల చరిత్ర రాసిన చరిత్రకారుల్లో అభిప్రాయ భేదాలున్నాయి. ఇబ్నె ఇస్‌హాక్ కథనంలో, ఖమూస్ కోటను జయించడానికి యుద్ధం చేయవలసి వచ్చిందనే వివరణ మాత్రం ఉంది. దీని సందర్భాన్ని పురస్కరించుకొని చూడగా ఈ కోట కేవలం యుద్ధం చేసే గెలుచుకోవడం జరిగిందని చెప్పవచ్చు. ఇక్కడి యూదులు లొంగిపోవడానికి ఎలాంటి ప్రతిపాదనలు పెట్టలేదు.[14]

కాని వాఖిదీ కథనం ప్రకారం, ఇక్కడి మూడు కోటలు కూడా చర్చల ద్వారా యూదులు, ముస్లిములకు కైవసం చేసినట్లు ఉంది. బహుశా వారు ఖమూస్ కోటను అప్పగించడానికి కొంత యుద్ధం చేయవలసివచ్చి ఉండవచ్చు. ఆ తరువాతనే సంప్రదింపులు జరిపి కోటను అప్పగించారేమో. అయితే తక్కిన రెండు కోటలు మాత్రం ఎలాంటి యుద్ధం చేయకుండానే ముస్లిములకు అప్పగించడం జరిగింది.

దైవప్రవక్త (స) కతీబాకు అరుదెంచిన తరువాత ఆ ప్రాంతం (కతీబా) ప్రజలను దిగ్బంధంలోనికి తీసుకోవడం జరిగింది. ఈ దిగ్బంధం పదునాల్గు రోజులు కొనసాగింది. యూదులు మాత్రం తమ కోటలో నుండి బయటికి రావడం లేదు. చివరికి దైవప్రవక్త (స) మిన్జనీక్‌లను సిద్ధం చేస్తూ ఉండగా యూదులకు తమ వినాశం గురించి పూర్తి నమ్మకం ఏర్పడింది. అప్పుడుగాని వారు దైవప్రవక్త (స)తో సంధి సంప్రదింపులకు దిగలేదు.

సంధి సంప్రదింపులు

మొదట అబుల్ హుఖైఖ్, దైవప్రవక్త (స) వద్దకు సందేశం పంపిస్తూ, "నేను మీ దగ్గరకు వచ్చి మాట్లాడదలుచుకున్నాను" అన్నాడు. దైవప్రవక్త (స) రావచ్చుననే అనుమతి నొసగగా, అతను సంధి షరతులతో మహాప్రవక్త (స) దగ్గరికి వచ్చి ఈ క్రింది సంధి షరతును ప్రతిపాదించాడు.

దాని ప్రకారం, కోటలో ఉన్న సైన్యాన్ని చంపకుండా ఉండాలి. వారి భార్యాపిల్లలు వారివద్దే ఉంటారు (అంటే వారిని బానిసలుగా చేయకూడదు). కాగా వారంతా తమ భార్యాపిల్లల్ని వెంటబెట్టుకొని ఖైబర్ భూభాగం నుండి

---

14. చూడండి, ఇబ్నె హష్షామ్-2/331, 336, 337

వెళ్ళిపోతారు. తమ ఆస్తిపాస్తులను, ధనసంపదలను, తోటల్ని, భూముల్ని వెండిబంగారాలను, గుర్రాలను, కవచాలను వగైరాలను దైవప్రవక్త (స)కు అప్పగిస్తారు. కేవలం వారు కట్టుబట్టలతో బయటకు వెళ్ళిపోతారు.[15] దానికి దైవప్రవక్త (స), మీరు ఏదైనా దాచినట్లయితే దానికి బాధ్యులు మీరే అని చెప్పి యూదులు ప్రవేశపెట్టిన ఈ సంధి షరతులను ఒప్పుకోవడం జరిగింది.[16] ఈ సంధి అయిన పిదప వారు తమ మూడు కోటలు ముస్లిములకు అప్ప జెప్పారు. ఇలా ఖైబర్ విజయం పరిపూర్ణమైపోయింది.

అబుల్ హుఖైఖ్ ఇద్దరు కుమారుల మోసం - వారి హత్య

ఈ సంధికి వ్యతిరేకంగా అబుల్ హుఖైఖ్ ఇద్దరు కుమారులు ఓ పెద్ద ధనరాశిని మాయం చేశారు. హుయ్ బిన్ అఖ్తబ్ దాచిపెట్టిన బంగారు నగల తోలు సంచిని మాయం చేశారు. అవి హుయ్ బిన్ అఖ్తబ్, బనూ నజీర్ దేశ బహిష్కరణ జరిగినప్పుడు మదీనా నుండి వెంట తీసుకొనివచ్చిన నగలు.

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ఇలా ఉంది:

"అబుల్ హుఖైఖ్ కుమారుడు కనానాను మహాప్రవక్త (స) వద్దకు తీసుకురావడం జరిగింది. అతని వద్ద బనూ నజీర్ ధనాగారం ఉండింది. ఆయన (స) అతణ్ణి ఆ ధనాగారం గురించి అడగగా అతను ఆ ధనం గురించి గాని, అది దాచిపెట్టిన స్థలం గురించిగాని తనకు ఏమీ తెలియదు అని నిరాకరించాడు. ఆ తరువాత ఓ యూదుడు వచ్చి, నేను కనానాను రోజూ ఓ పాడుబడిన ప్రదేశంలోనికి వచ్చి పోతూ ఉండగా చూస్తూ ఉండేవాణ్ణి అని చెప్పాడు. ఇది విన్న మహాప్రవక్త (స), కనానాతో, ఒకవేళ ఆ భాండా గారాన్ని మేము నీ నుండి వెలికితీస్తే నిన్ను చంపవచ్చా? అని అడిగారు, అలా జరిగితే తమరు నన్ను చంపవచ్చు అన్నాడు కనానా. మహాప్రవక్త (స) ఆ ధనం ఎక్కడ దాచి ఉంచబడిందో త్రవ్వి చూడండని ఆదేశించగా ఆ ప్రదేశం నుండి కొంత ధనం వెలికివచ్చింది. మిగిలిన ధనం ఎక్కడా? అని

15. కాని సునన్ అబూ దావూద్ గ్రంథంలో దైవప్రవక్త (స), ముస్లిముల తరఫున ఖైబర్ నుండి వెళ్ళిపోయేటప్పుడు యూదులు తమ వాహనాలపై ఎంత సొత్తునైతే తీసుకొని వెళ్ళగలరో తీసుకు వెళ్ళమని అనుమతి ఇచ్చినట్లు ఉంది. అబూ దావూద్, ఖైబర్ అధ్యాయం-2/76.

16. జాదుల్ మఆద్-2/136.

అడగగా అతడు నాకు తెలియదు అని మళ్ళీ బొంకాడు. ఆ తరువాత మహాప్రవక్త (స) అతనిని హజ్రత్ జుబైర్‌కు అప్పజెబుతూ అతను దాచిన ధనం బయటపడేవరకు అతనిని బాధించమని ఆదేశించారు. హజ్రత్ జుబైర్ అతనిని హింసించగా అతను చెప్పేశాడు. ఆ పిదప అతనిని దైవప్రవక్త (స) మహ్మూద్ బిన్ ముస్లిమాకు అప్పజెప్పగా ఆయన అతని తలను ఖండించారు. (మహ్మూద్ నీడ కోసం నాయిమ్ కోటను ఆనుకొని కూర్చుని ఉండగా అతడు ఆయనపై తిరుగలి బండ పడేసి చంపి ఉన్నాడు.)

ఇబ్నె ఖైమ్, దైవప్రవక్త (స) అబుల్ హుఖైఖ్ ఇద్దరు కుమారుల్ని, వారిద్దరు సొమ్ము దాచారని వారి పినతండ్రి కుమారుడు సాక్ష్యం ఇవ్వగా చంపించారని రాశారు.

ఆ తరువాత దైవప్రవక్త (స) హుయ్ బిన్ అఖ్తబ్ కుమార్తె సఫియ్యాను ఖైదు చేశారు. ఆమె కనానా బిన్ హుఖైఖ్‌కు భార్యగా ఉన్నారు. అప్పుడామె నవ వధువు.

విజయ ధన పంపకం

దైవప్రవక్త (స) యూదులను ఖైబర్ నుండి బహిష్కరించాలనుకున్నారు. సంధి షరతుల్లో ఇది కూడా ఓ షరతే. కాని యూదులు దైవప్రవక్త (స)తో, "ఓ ముహమ్మద్ (స)! మమ్మల్ని ఈ భూభాగంలోనే ఉండనివ్వండి. మేము దీన్ని కాపాడుతుంటాము. ఎందుకంటే, మీకంటే మాకే ఎక్కువ తెలుసు దీన్ని గురించి" అని విన్నవించుకున్నారు. ఇటు దైవప్రవక్త (స) వద్ద ఈ భూమిని దున్ని వేయడానికి, పంటలు పండించడానికి చాలినంత మంది బానిసలు కూడా లేరు. అదేకాకుండా సహాబా (ర) ఈ పని చూడడానికి వారి వద్ద సమయం కూడా లేదు. అందుకని అక్కడి పంట పొలాల్లో పండిన పంటను, తోటల ఫలసాయంలో సగం ఇస్తామని, దైవప్రవక్త (స)కు ఇష్టం ఉన్నంత మట్టుకు వారు అక్కడ ఉండి పంటలు పండించుకోవాలని, ఆయన కోరినప్పుడు ఆ ప్రాంతాన్ని వదలివెళ్ళిపోవాలనే షరతుపై ఆ ప్రాంతాన్ని యూదులకు తిరిగి అప్పగించడం జరిగింది. దాని తరువాత హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర) ఖైబర్ పంటలు, ఫలసాయం లెక్క చూడడానికి అక్కడ ఉండిపోయారు.

ఖైబర్‌ను ముప్పై ఆరు భాగాలుగా విభజించడం జరిగింది. ఒక్కో భాగాన్ని తిరిగి వంద భాగాలుగా విడగొట్టారు. అలా మొత్తం కలిసి 3600 భాగాలయ్యాయన్న మాట. అందులో సగం అంటే 1800 భాగాలు దైవప్రవక్త (స) మరియు ముస్లిములవి. అందరు ముస్లిముల్లా దైవప్రవక్త (స)కూ ఒక భాగమే వచ్చింది. మిగిలిన 1800 భాగాలు గల రెండవ అర్థ భాగాన్ని దైవప్రవక్త (స) ముస్లిముల సామూహిక అవసరాల్లో, గడ్డు సమయాల్లో పనికిరావడానికి గాను వేరు చేసి ఉంచబడింది. పద్దెనిమిది వందల భాగాలుగా ఖైబర్‌ను పంచడానికి గల కారణం, అది అల్లాహ్ తరపున హుదైబియాకు వెళ్ళిన ముస్లిములకు కానుక. అప్పుడు అక్కడ హాజరుగా ఉన్నవారికి, హాజరుగా లేని వారి కోసమూ అన్నమాట. హుదైబియాకు వెళ్ళిన ముస్లిముల సంఖ్య మొత్తం పదునాల్గు వందలు. వారు ఖైబర్‌కు వస్తూ తమ వెంట రెండు వందల గుర్రాలను కూడా తెచ్చారు. గుర్రపు రౌతుకే కాకుండా గుర్రానికి కూడా ఒక భాగం లభిస్తుంది. గుర్రానికి లభించే భాగం రెండంతలు (అంటే ఇద్దరు పదాతులకు సమానమైన భాగం). అందుకని ఖైబర్‌ను పద్దెనిమిది వందల భాగాలుగా విభజించడం జరిగింది. ఇలా రెండు వందల అశ్వారూఢులకు మూడు భాగాల చొప్పున 600 భాగాలు లభించాయి. పన్నెండు వందల పదాతి దళానికి ఒక్కొక్క భాగం చొప్పున 1200 భాగాలు లభించాయి.[17]

సహీహ్ బుఖారీలో హజ్రత్ ఇబ్నె ఉమర్ (ర) గారి ఉల్లేఖనం ద్వారా ఖైబర్‌లో లభించిన విజయ ధనాన్ని అంచనా వేయవచ్చు. ఆయన ఇలా ఉల్లేఖిస్తారు:

"మేము ఖైబర్ జయించనంత మట్టుకు తృప్తిగా భోజనం చేసిన రోజు లేదు." అలాగే హజ్రత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనంలో, ఖైబర్ జయించబడిన తరువాతగాని మేమనుకున్నాం, ఇక మాకు కడుపునిండా తినడానికి ఖర్జూరాలు లభిస్తాయని.[18]

అంతేకాదు, మహాప్రవక్త (స) మదీనాకు తిరిగి వచ్చిన తరువాత మక్కా నుండి హిజ్రత్ చేసి వచ్చిన ముహాజిర్లకు అన్సారులు ఏ ఖర్జూరపు చెట్లనైతే

17. జాదుల్ ముఆద్-2/137,138 వివరాలతో సహా

18. సహీ బుఖారి-3/603

ఇచ్చారో ముహాజిర్లు వాటిని వారికి ఇచ్చివేశారు. ఎందుకంటే, ఇప్పుడు వారికి ఖైబర్‌లో ధనం మరియు ఖర్జూరపు చెట్లు లభించాయి కదా![19]

హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ మరియు అష్అరీ సహాబాల రాక

ఈ యుద్ధం సందర్భంగానే హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ (ర) దైవ ప్రవక్త (స)గారి సన్నిధికి హాజరుకావడం జరిగింది. ఆయన వెంట అష్అరీ సహాబాలు అంటే, హజ్రత్ అబూ మూసా అష్అరీ (ర) మరియు ఆయన సహచరులూ ఉన్నారు.

హజ్రత్ అబూ మూసా అష్అరీ (ర)గారి కథనం ఇలా ఉంది: "మేము యమన్ దేశంలో ఉండగానే దైవప్రవక్త (స)గారి ప్రాభవం గురించి తెలిసింది. నేను, నా ఇద్దరు సోదరులు, ఇంకా, మా జాతికి చెందిన యాభై మంది అందరం కలసి మా మాతృభూమి అయిన యమన్‌ను వదిలేసి (అంటే హిజ్రత్ చేసి) ఓ పడవనెక్కి దైవప్రవక్త (స) సన్నిధికి హాజరయ్యాము. అయితే మా పడవ మమ్మల్ని నజాషీ చక్రవర్తి రాజ్యం అయిన అబీసీనియాలో విసరి వేసింది. అక్కడ మాకు హజ్రత్ జాఫర్ (ర), ఆయన సహచరులు కలిశారు. ఆయన మాతో, "దైవప్రవక్త (స) మమ్మల్ని ఇక్కడికి పంపించారు. మేము ఇక్కడే ఉండాలని ఆదేశాలిచ్చారు, మీరు కూడా మాతోపాటే ఇక్కడే ఉండి పొండి" అని అన్నారు. మేమందరం అక్కడనే ఉండిపోయాం. మహాప్రవక్త (స) ఖైబర్‌ను జయించిన తరువాతగాని మేము ఆయన సన్నిధికి రాలేదు. దైవప్రవక్త (స) ఆ విజయ ధనంలో మాకూ భాగం పంచిపెట్టారు. మాకు తప్ప ఖైబర్ యుద్ధంలో పాల్గొనని ఏ వ్యక్తికీ భాగం అందలేదు. అదంతా యుద్ధంలో పాల్గొన్న వారి భాగమే. కాని హజ్రత్ జాఫర్ (ర), ఆయన సహచరులు, మా పడవలో ఉన్న వారికి భాగం పంచిపెట్టడం జరిగింది. వారికీ విజయ ధనం నుండి బహూకరించడం జరిగింది."[20]

హజ్రత్ జాఫర్ (ర) దైవప్రవక్త (స) సన్నిధికి చేరగానే దైవప్రవక్త (స) ఆయన్ను ముద్దాడుతూ, "దైవసాక్షి! నాకు ఆనందం కలిగింది జాఫర్ రాక

19. జాదుల్ ముఆద్ -2/148; సహీ ముస్లిమ్-2/96

20. సహీహ్ బుఖారి-1/443; ఫత్‌హుల్‌బారి-7/484-487 వరకు

వలనా లేదా ఖైబర్ జయించబడినందునా" అనేది నేను చెప్పలేకపోతున్నాను అన్నారు.[21]

వీరిని పిలుచుకురమ్మని దైవప్రవక్త(స) హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యాను నజాషీ వద్దకు పంపిన విషయం మనకు గుర్తుండే ఉంటుంది. వీరందరిని తమ వద్దకు పంపించమని చెప్పి పంపడం జరిగింది. అప్పుడు నజాషీ వీరిని రెండు పడవల్లోనికి ఎక్కించి పంపాడు. వీరంతా పదహారుగురు. వారి వెంట మిగిలినవారంతా పిల్లలు, స్త్రీలే. తక్కిన వారంతా ఇదివరకే మదీనాకు చేరుకొని ఉన్నారు.[22]

హజ్రత్ సఫియ్యా (ర)తో వివాహం

హజ్రత్ సఫియ్యా (ర)గారి భర్త కనానా బిన్ అబిల్ హుఖైఖ్ సంధి షరతులు భంగపర్చినందుకు చంపబడిన విషయం మనం ఇదివరకే చెప్పుకున్నాం. హజ్రత్ సఫియ్యా (ర)ను ఖైదు చేసి స్త్రీ ఖైదీల్లోనికి పంపించడం జరిగింది. ఆ తరువాత స్త్రీ బందీలందరినీ ఓ చోట చేర్చగా, హజ్రత్ వహియా బిన్ ఖలీఫా కలబీ (ర) దైవప్రవక్తను, తనకు స్త్రీ బందీల నుండి ఓ స్త్రీ బానిసను ఇప్పించమని అర్థించారు. మహాప్రవక్త (స) ఆయనకు వారిలో నుంచి ఒకరిని తీసుకొమ్మని చెప్పగా, ఆయన సఫియ్యా బిన్తె హుయ్ (హుయ్ కుమార్తె సఫియ్యా)ను ఎంపిక చేసుకున్నారు. ఇది చూసిన ఓ వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి, ఓ దైవప్రవక్తా! తమరు బనీ ఖురైజా మరియు బనూ నజీర్ తెగలకు చెందిన మహిళను వహియాకు అప్పజెప్పారేమిటి? ఆమె ఆయనకు తగిన మహిళ కాదు. అప్పుడు దైవప్రవక్త (స) వహియాను సఫియ్యాతో సహా ఇక్కడికి రమ్మని కబురు పంపారు. ఆయన వచ్చిన తరువాత మహాప్రవక్త(స), నీవు బందీల్లో నుండి మరో మహిళను ఎంచుకో అని చెప్పారు. ఆ తరువాత హజ్రత్ సఫియ్యా (ర) ముందు ఇస్లామ్ సందేశాన్ని ఉంచగా ఆమె ఇస్లామ్ ధర్మం స్వీకరించారు. పిదప ఆయన (స) ఆమెను స్వతంత్రురాలుగా చేసి ఆమెతో వివాహమాడారు. ఆమె స్వాతంత్ర్యమే ఆమెకు మహ్రాగా నిర్ణయించడం జరిగింది. మదీనాకు తిరుగు ప్రయాణంలో 'సహ్బా' అనే ప్రదేశానికి చేరి ఆమె ధర్మసమ్మతమయ్యారు. ఆ తరువాత ఉమ్మె

21. *జాదుల్ మఆద్-2/139*
22. *తారీఖె ఖిజ్రీ-1/128*

సులైమ్ (ర) ఆమెను అలంకరించి రాత్రి ఆయన దగ్గరకు పంపించారు. దైవప్రవక్త (స) వరునిగా ఆమెతో రేయి గడిపారు. మరునాడు ఖర్జూరం, నెయ్యి మరియు సత్తూ (పేలపు పిండి) కలిపి వలీమా విందు భోజనాలు పెట్టారు. మార్గంలో మూడు రోజుల వరకు ఆమె వద్దనే ఉన్నారు.[23] ఈ సందర్భంలోనే ఆమె ముఖంపై ఓ పచ్చని గుర్తు చూశారు మహాప్రవక్త (స). ఇదేమిటీ? అని ప్రశ్నించగా, ఆమె, "దైవప్రవక్తా! తమరు ఖైబర్‌కు రాక పూర్వమే నేను ఓ కలగన్నాను. చంద్రుడు తన స్థానం నుండి దిగి నా ఒడిలో పడినట్లు కలగన్నాను. దైవసాక్షిగా చెబుతున్నాను. నాకు మీ గురించి ఎలాంటి ఊహ కూడా జనించలేదు. అయితే నేను ఈ కలను గురించి నా భర్త (కనానా)కు చెప్పగా, "'ఏమిటీ? మదీనాలో ఉన్న ఆ రాజును కోరుకుంటున్నావా?" అని నా చెంప పగిలేటట్లు కొట్టాడు అన్నారు."[24]

విషపూరితమైన మేక మాంసం

ఖైబర్‌పై విజయం లభించిన తరువాత దైవప్రవక్త (స) ఏకాగ్రచిత్తులై ఉన్నప్పుడు, సలామ్ బిన్ ముష్కమ్ భార్య, జైనబ్ బిన్తె హారిస్ ఆయన వద్దకు వేయించిన ఓ మేకను పంపించింది. దైవప్రవక్త (స) మేక మాంసంలో ఏ భాగాన్ని తినడానికి ఎక్కువ ఇష్టపడతారో అన్న విషయం గురించి ఆమె ఇదివరకే ఆరా తీసి ఉంది. ఆమెకు దైవప్రవక్త (స) 'దస్తా' అనే భాగం అంటే మహా ఇష్టమని తెలిసి అందులో బాగా విషం కలిపింది. తక్కిన మాంసంలోనూ విషం కలిపింది. దాన్ని తీసుకొని మహాప్రవక్త (స) వద్దకు వచ్చి దాన్ని ఆయన ముందు తినమని పెట్టింది. దైవప్రవక్త (స) (తమకు ఇష్టమైన) దస్తాను ఎత్తి ఓ ముక్క నోట్లో పెట్టుకుని నమిలేశారు. కాని మ్రింగే బదులు దాన్ని క్రింద ఊసేశారు. ఇందులో విషం కలిసి ఉందని నాకు ఈ ఎముక చెబుతోంది అంటూ జైనబ్‌ను పిలువనంపారు. ఆమె విషం కలిపానని ఒప్పుకుంది. అలా ఎందుకు చేశావు అని అడగగా మీరు గనుక రాజు అయితే మీ నుంచి మాకు ముక్తి కలుగుతుందని, లేదా మీరే ప్రవక్త అయితే ఈ విషయం మీకు తెలియజేయబడుతుందని చూడడానికే అలా చేశాను అన్నది. మహాప్రవక్త (స) ఆమెను క్షమించి వదిలిపెట్టారు.

23. *సహీహ బుఖారి-1/54, 2/604, 606; జాదుల్ మఆద్-2/137*
24. *జాదుల్ మఆద్-2/137; ఇబ్నె హష్షామ్- 2/336*

భోజనం చేసేటప్పుడు దైవప్రవక్త (స) వెంట హజ్రత్ బిష్ర్ బిన్ బరా బిన్ మారూర్ కూడా ఉన్నారు. ఆయన ఓ ముక్క మింగేశారు. ఆ విషం ప్రభావం వల్ల ఆయన ప్రాణాలు వదిలేశారు.

ఆ స్త్రీని దైవప్రవక్త (స) క్షమించి వదిలిపెట్టరా లేదా హతమార్చారా అన్న విషయం గురించి ఉల్లేఖనాల్లో అభిప్రాయ భేదాలున్నాయి. అయితే ఆమెను ముందు క్షమించి వదిలిపెట్టడం జరిగిందని, ఆ తరువాత హజ్రత్ బిష్ర్ (ర)గారి మరణం ఆసన్నమవగా ఆమెను హతమార్చడం జరిగిందని చెప్పడం జరిగింది.[25]

ఖైబర్ యుద్ధంలో హతులైన ఇరుపక్షాల వారు

ఖైబర్ యుద్ధానికి చెందిన వివిధ ఘట్టాల్లో ఏ ముస్లిములైతే అమరగతి నొందారో వారి సంఖ్య మొత్తం 16. నలుగురు ఖురైషువారు, ఒకరు అష్జఅ తెగవారు, ఒకరు అస్లమ్ తెగకు చెందిన వారు, ఒకరు ఖైబర్‌కు చెందిన వారు, మిగిలిన వారు అన్సారులు.

మరో ఉల్లేఖనంలో మొత్తం 18 మంది షహీద్ అయ్యారని ఉంది. అల్లామా మన్సూర్ పూరీ తమ గ్రంథంలో 19 మంది అని రాస్తూ, "సీరత్ చరిత్రకారులు చెప్పిన వారి సంఖ్య మొత్తం 15 మందే. అయితే నేను పరిశోధించగా నాకు 23 పేర్లు లభించాయి" అన్నారు. జనీఫ్ బిన్ వాయిలా పేరును వాఖిదీ రాస్తే, జనీఫ్ బిన్ హబీబ్ పేరును 'తిబ్రీ' గ్రంథస్థం చేశారు. బిష్ర్ బిన్ బరా బిన్ మారూర్ మరణం యుద్ధం ముగిసిన తరువాత విషపూరితమైన మేక మాంసం తినగా సంభవించింది. బిష్ర్ బిన్ అబ్దుల్ మున్జిర్ గురించి రెండు ఉల్లేఖనాలున్నాయి. ఆయన బద్ర్ యుద్ధంలో అమరగతి నొందారన్నది ఒకటయితే, ఖైబర్ యుద్ధంలో షహీద్ అయ్యారనేది రెండవది. నా దృష్టిలో మొదటి ఉల్లేఖనమే సరియైనది.[26]

రెండో పక్షమైన యూదుల హతుల సంఖ్య 93.

25. చూడండి, జాదుల్ ముఆద్-2/139, 140; ఫత్‌హుల్ బారి-7/497; అసలు సంఘటన సహీహ్ బుఖారీ గ్రంథంలో విశదంగానూ, క్లుప్తంగానూ రెండు విధాలా ఉల్లేఖించబడింది. చూడండి-1/449, 2/160, 860. ఇబ్నె హష్షామ్-2/337, 338

26. రహ్మతుల్‌లిల్ ఆలమీన్-2/268, 269, 270

ఫిదక్

మహా ప్రవక్త (స) ఖైబర్‌కు చేరగానే ముహయిసా బిన్ మస్‌ఊద్ (ర)ను, ఫిదక్ యూదుల వద్దకు ఇస్లామ్ సందేశమిచ్చి పంపించడం జరిగింది. కాని ఫిదక్ ప్రజలు ఇస్లామ్ స్వీకరించడానికి నిరాకరించారు. కాని అల్లాహ్ ముస్లిములకు ఖైబర్ విజయాన్ని చేకూర్చిన తరువాత వారిలో భయభీతులు చోటుచేసుకున్నాయి. వారు మహా ప్రవక్త (స) వద్దకు మనిషిని పంపి, ఖైబర్ ప్రజలకు వలెనే మేము ఫిదక్ యొక్క అర్ధ పంటను ఇస్తామనే షరతుపై సంధి కుదుర్చుకోదలిచామని అనే ప్రతిపాదన పెట్టారు. మహా ప్రవక్త (స) ఆ సంధి షరతులను ఒప్పుకోవడం జరిగింది. ఇలా ఫిదక్ భూభాగం పూర్తిగా దైవప్రవక్త (స) వశమైపోయింది. ఎందుకంటే ముస్లిములు ఆ భూభాగంపై తమ గుర్రాలను కాని, ఒంటెలను గాని పరుగెత్తించలేదు.[27] (అంటే దాన్ని బలప్రయోగం చేసి జయించలేదన్నమాట.)

వాదియిల్ ఖుర్‌ఆ (ఖుర్‌ఆ లోయ)

ప్రవక్త మహనీయులు (స) ఖైబర్ యుద్ధం ముగించుకొని 'వాదియిల్ ఖుర్‌ఆ'కు వచ్చారు. అక్కడ కూడా యూదుల ఓ వర్గం నివాసం ఉంటోంది. వారి వెంట అరబ్బులకు చెందిన మరో వర్గం ఉంది. ముస్లిములు అక్కడకు చేరగానే యూదులు ముస్లిములను బాణాలు సంధించి ఆహ్వానించారు. వారు మొదటి నుండే యుద్ధానికి కాచుకొని వరుసలు తీరి ఉన్నారు. ఆ శరాఘాతాలకు దైవప్రవక్త(స)గారి ఓ బానిస బలి అయ్యాడు. ప్రజలు అది చూసి ఇతనికి స్వర్గం ప్రాప్తించింది అనగా దైవప్రవక్త (స), "కానేకాదు, ఏ దైవం చేతిలోనైతే నా ప్రాణాలున్నాయో ఆయన సాక్షి! ఇతను ఖైబర్ యుద్ధంలో విజయ ధనం నుండి ఏ దుప్పటినైతే దొంగలించాడో, ఇప్పుడది అతని పాలిటి అగ్నిజ్వాలగా మారి అతణ్ణి దహించివేస్తోంది" అన్నారు. ఇక ప్రవక్త (స) నోట ఈ మాటలు వినగానే ఓ వ్యక్తి చెప్పుక్రింద వేసి కుట్టే తోలు తస్మాలను (ఒకటో రెండో) ముక్కలు తెచ్చి ఇచ్చాడు. మహా ప్రవక్త (స) వాటిని చూసి ఈ ఒకటి లేదా రెండు తస్మాలు అగ్నివే అన్నారు.[28]

ఆ తరువాత దైవప్రవక్త (స) యుద్ధం కోసం సహాబాను తీర్చిదిద్దారు. సర్వసైన్య పతాకాన్ని హజ్రత్ సఅద్ బిన్ ఉబాదాకు అందించి, రెండోదాన్ని

27. ఇబ్నె హష్షామ్-2/337,353

28. సహీ బుఖారి-2/608

హుబాబ్ బిన్ ముంజిర్ (ర)కు, మూడోదాన్ని ఉబాదా బిన్ బిష్ర్ (ర)కు ఇచ్చారు. ఆ తరువాత యూదులకు ఇస్లామ్ వైపు రమ్మని ఆహ్వానించారు. వారు దాన్ని స్వీకరించలేదు. వారిలో ఒకడు యుద్ధ మైదానంలోనికి దిగగా ఇటు నుండి హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ ప్రత్యక్షమయ్యారు. వచ్చీరాగానే అతణ్ణి చంపివేశారు. తరువాత రెండవవాడు బయటకురాగా హజ్రత్ జుబైర్ అతణ్ణి కూడా తుదముట్టించారు. ఆ తరువాత ఇంకొకడు ముందుకు వచ్చాడు. అతనిని ఢీకొనడానికి హజ్రత్ అలి (ర) వరుసల్లో నుండి బయటకు వచ్చి అతని పీచమణిచేశారు. అలా వరుసగా యూదులకు చెందిన పదకొండుగురు హతులైపోయారు. ఒక్కొక్క యూదుడు చనిపోతున్నప్పుడల్లా మహాప్రవక్త (స), యూదుల్ని ఇస్లామ్ వైపునకు రమ్మని ఆహ్వానిస్తూ ఉండేవారు.

ఆ రోజు నమాజు వేళ కాగానే దైవప్రవక్త (స) సహాబాలకు నమాజు చేయించడం, నమాజు ముగిసిన వెంటనే యూదుల ఎదురుగా వెళ్ళి ఇస్లామ్, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) సందేశాన్ని వినిపించేవారు. అలా యుద్ధం చేస్తూనే ప్రొద్దుక్రుంకింది. రెండో రోజు మహాప్రవక్త (స) మళ్ళీ యుద్ధరంగానికి వెళ్ళారు. ప్రొద్దు బారెడు ఎక్కిందోలేదో యూదులు తమ వద్ద ఉన్నదంతా ప్రవక్త (స)కు స్వాధీనం చేసేశారు. అంటే మహాప్రవక్త (స) తమ శక్తితో వారిపై విజయం సాధించినట్లయింది. అల్లాహ్ వారి విజయ ధనాన్ని దైవప్రవక్త(స)కు ఇచ్చాడు. సహాబాలకు ఆ విజయధనం నుండి పెద్ద మొత్తంలో వాటాగా లభించింది.

మహాప్రవక్త (స) వాదియిల్ ఖుర్ఆలో నాల్గు రోజులు మకాం వేశారు. చేతికి చిక్కిన విజయ ధనాన్ని సహాబా (ర)కు పంచిపెట్టారు. అయితే పంట భూములు, ఖర్జూరపు తోటలు యూదుల వద్దనే ఉంచి అందుండి క్రితం ఖైబర్ ప్రజల పంట నుండి ఎలా సగభాగం పొందే ఒప్పందం చేసుకున్నారో వీరితోనూ అలాంటి ఒప్పందాన్నే కుదుర్చుకున్నారు.[29]

తైమా

తైమా యూదులకు, ఖైబర్, ఫిదక్ మరియు వాదియిల్ ఖుర్ఆ ప్రజలు ఎలా లొంగిపోయింది తెలియగానే వారు ఎలాంటి ప్రతిఘటన లేకుండానే ఓ మనిషిని పంపించి సంధికి దిగివచ్చారు. మహాప్రవక్త (స) వారి ఈ సంధి

29. జాదుల్ ముఆద్-2/146, 147.

ప్రస్తావనను స్వీకరించారు. దాని ప్రకారం యూదులు తమ ఆస్తిపాస్తులతో సుఖంగా ఉండిపోయారు.[30] ఈ విషయంలో ఓ సంధి పత్రం కూడా వారికి రాసిచ్చారు దైవప్రవక్త (స).

ఆ పత్రం ఇలా ఉంది: "ఇది ముహమ్మద్ రసూలుల్లాహ్ తరపున బనూ ఆదియా వారి కోసం రాసిన పత్రం. వారి కోసం బాధ్యతలున్నాయి. వారిపై జిజియా ఉంది. ఇక నుండి వారిపై ఎలాంటి వత్తిడిగాని, వారిని దేశ బహిష్కరణకు గురి చేయడం గాని జరగదు. రాత్రి వారికి సహకారిగా, పగలు దృఢమైనదిగా ఉంటుంది (అంటే ఈ ఒప్పందం శాశ్వతమైనది అని అర్థం). దీన్ని ఖాలిద్ బిన్ సయీద్ (ర) రాశారు.[31]

మదీనాకు తిరుగు ప్రయాణం

అనంతరం మహాప్రవక్త (స) మదీనాకు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో వారు ఓ లోయకు దాపుగా చేరగానే అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహ్ అంటూ నినదించారు ఆయన సహచరులు. ఇది విన్న దైవప్రవక్త (స), "ఎందుకు అంత కష్టబడతారు. మీరు ఏ చెవిటి వాణ్ణిగానీ, అప్రత్యక్షమైన వాణ్ణిగానీ పిలవడం లేదు. మీరు పిలిచేది వినేవాణ్ణి, మీకు దగ్గరగా ఉన్నవాణ్ణి" అన్నారు.[32]

ఇదే కాకుండా ప్రయాణిస్తూ ఆయన (స) చివరి రోజు రాత్రి ఓ ప్రదేశంలో విడిది చేశారు. నిద్రకు ఉపక్రమిస్తూ ఆయన, హజ్రత్ బిలాల్ (ర)ను పిలిచి, "నేను నిద్రపోతున్నాను. నీవు మా కోసం రేయిని కాచుకొని ఉండు" (అంటే ఉదయం కాగానే ఫజ్ర్ నమాజు కోసం మమ్మల్ని మేల్కొలుపు) అని తాకీదు చేశారు. కాని హజ్రత్ బిలాల్ (ర)గారికి కూడా కన్ను మలిగింది. ఆయన (తూర్పు వైపున ముఖం పెట్టి) తన స్వారీకి ఆనుకొని కూర్చుని ఉండగా నిద్రలోకి జారిపోయారు. వారిలో ఏ ఒక్కరూ మేల్కొనలేదు. వారిపై ఎండ వేడిమి పడగా మొట్టమొదట దైవప్రవక్త (స)గారే నిద్ర నుండి మేల్కొన్నారు. (ఆ తరువాత అందరినీ లేపారు) ఆ లోయ నుండి బయటకు కొంత దూరం వచ్చి ఆగిపోయారు. అప్పుడు ఆయన(స) అందరిచేత ఫజ్ర్

30. జాదుల్ ముఆద్-2/147 31. ఇబ్నె సఅద్-1/279
32. సహీహ్ బుఖారి-2/605

నమాజు చేయించారు. ఈ సంఘటన మరో ప్రయాణంలో జరిగిన సంఘటన అని కూడా చెప్పుకోవడం జరుగుతోంది.[33]

ఖైబర్‌లో జరిగిన యుద్ధాల వివరాలను అధ్యయనం చేస్తే, దైవప్రవక్త (స) ఖైబర్ నుండి మదీనాకు (హి.శ.7 చివరన) సఫర్ మాసాంతంలోనో లేదా రబీవుల్ అవ్వల్ నెలలోనో తిరిగివచ్చినట్లు గ్రహించవచ్చు.

సరియ్యా అబాన్ బిన్ సయీద్

దైవప్రవక్త (స), హరామ్ నెలలు (నిషిద్ధ మాసాలు) పూర్తికాగానే మదీనాను సైనికులు లేకుండా ఖాళీగా వదిలేయడం దూరదృష్టికి వ్యతిరేక మైనది అన్న విషయం ఇతర సైన్యాధ్యక్షులకంటే బాగా ఎరుగుదురు. మదీనా చుట్టుపట్ల దారి దోపిడీలు, హింసాదౌర్జన్యాలకు పాల్పడే బద్దూలు ఉన్నారన్న విషయం, ముస్లిములు ఎప్పుడు ఏమరుపాటుగా ఉంటారా అనే అవకాశం కోసం వారు ఎదురు చూస్తూ ఉంటారన్నది ఆయనకు బాగా తెలుసు. అందుకని ఆయన ఏ కాలంలోనయితే ఖైబర్‌కు బయలుదేరి వెళ్ళారో ఆ రోజుల్లోనే ఆ బద్దూలను భయభీతులుగా చేయడానికి 'అబాన్ బిన్ సయీద్ (ర)' సారథ్యంలో నజద్ వైపునకు ఓ సరియ్యాను పంపించారు. అబాన్ బిన్ సయీద్ తన విధిని నిర్వహించి వెనుదిరిగి దైవప్రవక్త (స)ను ఖైబర్‌లో వచ్చి కలిశారు. అప్పటికే ఖైబర్ జయించబడింది.

బహుశా ఈ సరియ్యా హి.శ. 7 సఫర్ నెలలో పంపించబడి ఉంటుంది. దీని ప్రస్తావన సహీ బుఖారీలోనూ ఉంది.[34] హాఫిజ్ ఇబ్నె హజర్ తన గ్రంథంలో, "ఈ సరియా గురించి నాకు ఎలాంటి ఆధారం లభించలేదని" అంటారు.[35]

33. ఇబ్నె హిషామ్-2/340; జాదుల్ మఆద్-2/147

34. చూడండి, సహీహ్ బుఖారి, ఖైబర్ యుద్ధ అధ్యాయం-2/608,609

35. ఫత్‌హుల్ బారి-7/491

గజ్వయె జాతుర్రిఖాఖ్

(జాతుర్రిఖాఖ్ యుద్ధం- హి.శ. 7)

మహాప్రవక్త (స) అహ్జాబ్ యుద్ధంలో పాల్గొన్న మూడు పటిష్టమైన పక్షాల్లో రెండింటిని విరిచేసిన తరువాత మూడో పక్షం అయిన బద్దూల వైపునకు దృష్టిని సారించారు. వీరు నజద్ ఎడారిలో నివాసం ఉంటూ అదను చూసి దోపిడీలు, హత్యలకు పాల్పడుతూ ఉండేవారు.

ఈ బద్దూలు ఏ బస్తీకో లేదా ఏ పట్టణానికో చెందినవారు కాదు కాబట్టి వారు ఇండ్లలోను, కోటల్లోను నివసించకుండా పూర్తి ఎడారిలో విస్తరించి ఉండే దేశదిమ్మర్లు. మక్కావాసులు, ఖైబర్ వాసులకు మల్లే వీరిని ఓడించి వారిపై నియంత్రణ సాధించడం, వారి ఆగడాలను పూర్తిగా అణచివేయడం కష్టసాధ్యమైన పని. కాబట్టి వారిని భయభీతులుగా చేయడానికి దండనా విధానాన్నే అవలంబించడం ప్రయోజనకరమైనది.

వారికి ముస్లిముల పేరు వినగానే భయం పుట్టుకొచ్చేందుకూ - మరో ఉల్లేఖనం ప్రకారం, మదీనా చుట్టుపట్ల దాడి చేయడానికి సమాయత్తమవు తున్న బద్దూలను చెల్లాచెదరు చేయడానికీ- దైవప్రవక్త (స) ఓ సైనిక చర్యను చేపట్టారు. ఇదే గజ్వయె జాతుర్రిఖాఖ్‌గా పేరుగాంచింది.

చరిత్రకారులు ఈ గజ్వా గురించి రాసిన వివరాల సారాంశం ఇలా ఉంది:

దైవప్రవక్త (స), అన్మార్ తెగ లేదా బనూ గత్ఫాన్ తెగకు చెందిన రెండు శాఖలు బనీ సఅలబా మరియు బనీ ముహారిబ్‌లు సమాయత్తమవు తున్నారన్న వార్త విని మదీనా బాధ్యతలను హజ్రత్ అబూజర్ (ర) లేదా హజ్రత్ ఉస్మాన్ (ర)కు అప్పగించి నాల్గు వందలు లేదా ఏడు వందల మంది సహాబా (ర)ను వెంట బెట్టుకొని నజద్ ఎడారిలోని పల్లెల వైపునకు బయలు దేరారు. మదీనాకు రెండు రోజుల ప్రయాణ దూరంలో ఉన్న 'నఖ్ల్'

అనే ప్రదేశానికి చేరినప్పుడు బనూ గత్ఫాన్‌కు చెందిన ఓ సైనిక పటాలం ఎదురైంది వారికి. యుద్ధం మాత్రం జరగలేదు. అయితే ఈ సందర్భంలోనే సలాతె ఖౌఫ్ (యుద్ధం జరిగేటప్పుడు చేసే నమాజు) మాత్రం చేయించారు ప్రవక్త(స).

సహీ బుఖారీ గ్రంథంలో హజ్రత్ అబూ మూసా అష్అరీగారి ఉల్లేఖనం ఇలా ఉంది: "దైవప్రవక్త (స) వెంట మేము మొత్తం ఆరుగురం బయలు దేరాం. మా దగ్గర ఉన్న వాహనం ఒకే ఒక ఒంటె. దాని మీద మేము వంతులవారీగా ఎక్కి ప్రయాణించాం. ఇలా నడవడం వలన మా కాళ్ళు గాయాలమయమయ్యాయి. నా రెండు కాళ్ళు బాగా గాయపడి ఓ గోరు కూడా ఊడిపోయింది. మేము, మా కాళ్ళపై గుడ్డ పేలికలను చుట్టుకొని ప్రయాణం సాగించవలసి వచ్చింది. అందుకనే ఈ ప్రయాణం జాతుర్రిఖాఖ్‌గా పేరుగాంచింది (అంటే గుడ్డ పేలికల ప్రయాణం). ఎందుకంటే మేము మా కాళ్ళకు గుడ్డ పేలికలు కట్లుగా వేసి నడిచాం కాబట్టి.[1]

సహీహ్ బుఖారీలోనే హజ్రత్ జాబిర్ (ర)గారి ఉల్లేఖనం కూడా ఇలా ఉంది: "మేము జాతుర్రిఖాఖ్‌లో దైవప్రవక్త (స) వెంట ఉన్నాం. ఎక్కడైనా నీడనిచ్చే చెట్టు కనబడితే దాన్ని దైవప్రవక్త (స) కోసం కేటాయించేవాళ్ళం. (ఓసారి) దైవప్రవక్త (స) విడిది చేయగా సహచరులు నీడ కోసం ఇటూ అటూ ముళ్ళ పొదల్లోనికి చెల్లాచెదురైపోయారు. మహాప్రవక్త (స) కూడా ఓ చెట్టు నీడన విడిది చేశారు. ఆ చెట్టుకే తన కరవాలాన్ని వ్రేలాడదీసి నిద్రించారు. మాకు కన్ను మలిగింది. అంతలోనే ఓ ముష్రిక్ (బహు దైవారాధకుడు) వచ్చి దైవప్రవక్త (స)గారి కరవాలాన్ని ఒర నుండి లాగి ఎదురుగా నిలబడ్డాడు. కరవాలం చూపిస్తూ, "నీవు నాకు భయపడతావా?" అని అడగ్గా, "లేదు" అని సమాధానమిచ్చారు దైవప్రవక్త (స).

"అయితే నిన్ను ఇప్పుడు ఎవరు రక్షిస్తారు?" అడిగాడు ఆ ముష్రిక్కు.

"అల్లాహ్" అన్నారు మహాప్రవక్త (స).

హజ్రత్ జాబిర్ (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, మేము హఠాత్తుగా మహాప్రవక్త (స) పిలుపు విని అక్కడికి పరుగున చేరాము. ఓ ఆరా (బద్దూ)

1. సహీ బుఖారి, గజ్వాయె జాతుర్రిఖాఖ్ అధ్యాయం-2/592; సహీ ముస్లిమ్-2/118

ఆయన వద్ద కూర్చుని ఉన్నాడు. మమ్మల్ని చూసి ఆయన ఇలా అన్నారు:

"నేను నిద్రిస్తున్నప్పుడు ఇతను నా ఖడ్గాన్ని ఒర నుండి తీసి నా ఎదురుగా నిలబడ్డాడు. అంతలోనే నేను మేలుకొనగా ఇతని చేతిలో నా నగ్న కరవాలాన్ని చూశాను. అతడు నాతో 'నిన్ను ఎవరు రక్షిస్తారు' అని అడగ్గా నేను అల్లాహ్ (రక్షిస్తాడు) అన్నాను. ఇప్పుడు చూడండి, ఇతను ఇక్కడ కూర్చుని ఉన్నాడు" అని సెలవిచ్చారు. దైవప్రవక్త (స) అతనిపై ఎలాంటి ఆగ్రహాన్ని ప్రదర్శించలేదు.

అబూ అవానా ఉల్లేఖనంలో ఈ వివరణ కూడా ఉంది: (దైవప్రవక్త (స) అతని ప్రశ్నకు జవాబుగా అల్లాహ్ అని అనడంతోనే) అతని చేతి నుండి కరవాలం జారిపడిపోయింది. ఆ కరవాలాన్ని మహాప్రవక్త (స) చేతబట్టుకొని అడిగారు, "ఇప్పుడు చెప్పు, నిన్ను ఎవరు రక్షిస్తారో?" అని. అతడు, "నాపై కరుణ చూపండి" అని విన్నవించుకున్నాడు.

"సరే, అల్లాహ్ తప్ప వేరే పూజ్యుడు లేడని, నేను అల్లాహ్ ప్రవక్తనని నీవు సాక్ష్యం ఇస్తావా?" అని అడిగారు దైవప్రవక్త (స).

"నేను మీతో యుద్ధం చేయనని, మీతో యుద్ధం చేసే వారికి సహాయపడనని మాటిస్తున్నా"నన్నాడతడు.

ఆ తరువాత దైవప్రవక్త (స) అతణ్ణి కరుణించి వదిలేశారు. అతడు తన జాతిలోనికి వెళ్ళి, "నేను మీ దగ్గరకు వచ్చింది అందరికంటే మేలైన మనిషి దగ్గర నుండి" అని చెప్పుకున్నాడు.[2]

సహీ బుఖారీలోని ఓ ఉల్లేఖనంలో, నమాజు కొరకు అఖామత్ చెప్పగా దైవప్రవక్త (స) రెండు రకాఅత్‌ల నమాజు చేయించారు. వారంతా వెనక్కు వెళ్ళిపోయిన తరువాత మరో వర్గం వచ్చి నమాజుకు నిలుచోగా తక్కిన రెండు రకాఅత్‌ల నమాజు చేయించారు. ఇలా దైవప్రవక్త (స) నమాజు నాలుగు రకాఅత్‌లైంది. సహాబా (ర) గార్ల నమాజు రెండేసి రకాఅత్‌లైంది.[3] ఈ ఉల్లేఖనం సందర్భాన్ని బట్టి చూస్తే ఈ నమాజు, పైన చెప్పిన సంఘటన తరువాతనే చేయబడిందని అర్థం అవుతుంది.

2. ముక్తరుసీరత్-షేఖ్ అబ్దుల్లాహ్ నజదీ, పుట. 266; ఫత్‌హుల్ బారి-7/416
3. సహీ బుఖారి-1/407,408; 2/593

సహీ బుఖారీలో ఉల్లేఖించబడిన ఓ ఉల్లేఖనాన్ని మస్‌దూద్ (ర), అబూ అవానా ద్వారా, ఆయన అబూ బషీర్ ద్వారా విని ఉల్లేఖించారని ఉంది. దాని ప్రకారం, ఆ వ్యక్తి పేరు గౌరిస్ బిన్ హారిస్.[4] ఇబ్నె హజర్, వాఖిదీ ఈ సంఘటనను వివరిస్తూ ఆ పల్లెవాసి (బద్దూ) పేరు దాషూర్ అని రాశారు. అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించినట్లు చెప్పబడి ఉంది. కాని వాఖిదీ కథనాన్ని తరచి చూస్తే ఇవి వేరువేరుగా జరిగిన రెండు సంఘటనలని, అవి వేరువేరు గజ్వాలలో జరిగాయని తెలుస్తుంది.[5] వల్లాహు ఆలం (దైవానికే బాగా తెలుసు).

ఈ గజ్వా నుండి తిరిగి వచ్చేటప్పుడు సహాబా (ర), ఓ ముష్రిక్ స్త్రీని (బహు దైవారాధకురాలు) బంధించడం జరిగింది. అలా చేసినందుకు ఆమె భర్త, ముహమ్మద్ అనుచరుల్లో రక్తపాతం సృష్టిస్తానని మ్రొక్కుకున్నాడు. అతను రాత్రి పూట అక్కడికి వచ్చాడు. దైవప్రవక్త (స) శత్రువు ఏమరుపాటులో దాడి చేయకుండా ఇద్దరు మనుషుల్ని, ముస్లిములకు అంటే అబ్బాద్ బిన్ బిష్ర్ (ర) మరియు అమ్మార్ బిన్ యాసిర్ (ర)ను పహరా కాయడానికి నియమించారు. ఆ వ్యక్తి అక్కడికి వచ్చినప్పుడు హజ్రత్ అబ్బాద్ (ర) నిలబడి నమాజు చేస్తున్నారు. అతను ఆయన్ను ఆ స్థితిలోనే బాణం వేసి గాయ పరిచాడు. అదే పరిస్థితిలో ఆయన నమాజును భంగపర్చకుండా ఆ బాణాన్ని తీసి ప్రక్కకు పారవేశారు. ఆ తరువాత రెండవ బాణాన్ని, మూడవ బాణాన్ని కూడా వదిలాడు. అయినా ఆయన నమాజును భంగపర్చలేదు. సలాం చేసి దాన్ని పూర్తి చేసే తన అనుచరుణ్ణి నిద్రలేపారు. (ఈ పరిస్థితిని చూసి) ఆ రెండవ అనుచరుడు, "సుబ్‌హానల్లాహ్! మీరు నన్నెందుకు మేల్కొల్పలేదు?" అని అడగగా, ఆయన, "నేను ఓ సూరాను స్తోత్రం చేస్తున్నాను. మధ్యలోనే ఆపడం నాకు ఇష్టం లేదు" (అందుకనే అలా చేశాను) అన్నారు.[6]

కఠినాత్ములైన ఆ రాజులను (బద్దూలను) భయభీతులుగా చేసి లొంగిపోయేటందుకు ఈ గజ్వా మంచి ప్రభావాన్నే చూపింది. మనం గనక

4. సహీ బుఖారి-2/593 5. ఫత్‌హుల్ బారి-7/428

6. జాదుల్ ముఆద్-2/112; ఇంకా ఈ గజ్వా వివరాల కోసం చూడండి. ఇబ్నె హష్షామ్-2/203 నుండి 209 వరకు. జాదుల్ ముఆద్-2/110, 111, 112; ఫత్‌హుల్ బారి -7/417 నుండి 428 వరకు

ఈ గజ్వా తరువాత జరిగిన సరియ్యాలు (పోరాటాలు) వాటి వివరాలపై దృష్టిని సారిస్తే, గత్ఫాన్ తెగలు ఈ గజ్వా తరువాత తల ఎత్తడానికి సాహసించ లేదని, కాగా పూర్తిగా బలహీనమైపోవడం, ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడం జరిగిందన్న విషయాన్ని గమనించగలం. అదే కాకుండా, చివరికి ఈ ఆరాబులకు సంబం ధించిన అనేక తెగలు మక్కా విజయం మరియు హునైన్ యుద్ధంలో ముస్లిముల వెంట రావడం, వారికి హునైన్ యుద్ధంలో లభించిన విజయ ధనం నుండి వాటా కూడా ఇవ్వడం; మక్కాను జయించి వెనుదిరిగేటప్పుడు వారి నుండి సదఖాత్ (జకాత్ ధనం) వసూలు చేయడానికి ఇస్లామీయ ప్రభుత్వం తన రెవెన్యూ అధికారుల్ని పంపించడం, వారు చట్టం ప్రకారం సదఖాలు చెల్లించడం కూడా జరిగిందన్న విషయాన్ని మనం తెలుసుకోగలం. మొత్తానికి ఈ యుద్ధ వ్యూహం వల్ల, కందకం యుద్ధం (అగడ్త యుద్ధం)లో పాల్గొన్న మూడు పటిష్టమైన పక్షాల పీచం అణిగి పోయింది. ఈ ప్రాంతం అంతటా శాంతి అలుముకున్నట్లయింది. ఆ తరువాత ఏ తెగలైతే కొన్ని ప్రాంతాల్లో కల్లోలాన్ని రేకెత్తించడానికి ప్రయత్నం చేశాయో వాటిని ముస్లిములు సునాయాసంగా అణిచిపారవేయడం జరిగింది. కాగా ఈ గజ్వా తరువాత పెద్ద పెద్ద పట్టణాలు మరియు దేశాలను జయించే మార్గం సుగమం కానారం భించింది. కారణం, ఈ గజ్వా తరువాత అరేబియా ద్వీపంలో పరిస్థితులు పూర్తిగా ముస్లిములకు అనుకూలంగా మారిపోవడమే.

హిజ్రీ శకం 7కు సంబంధించిన కొన్ని సరియ్యాలు

గజ్వా జాతుర్రిఖాఖ్ నుండి తిరిగివచ్చిన తరువాత దైవప్రవక్త (స), షవ్వాల్ నెల (హి.శ. 7) వరకు మదీనాలోనే ఉండిపోయారు. ఈ మధ్య కాలంలో ఆయన అనేక సరియ్యాలను (సైనిక పటాలాలను) పంపించడం జరిగింది. వాటి వివరాలు ఇక్కడ ఇవ్వడం జరుగుతోంది.

1. సరియ్యా ఖదీద్ (సఫర్ లేదా రబీవుల్ అవ్వల్ మాసం, హి.శ. 7)

ఈ సరియ్యా బహుశా గాలిబ్ బిన్ అబ్దుల్లా లైసీ (ర)గారి సారథ్యంలో, బనీ మలూహ్ తెగను అణచడానికి పంపించబడిన సరియ్యా. దీనికి కారణం, బనూ మలూహ్ (మలూహ్ తెగవారు) బిష్ర్ బిన్ సువైద్ (ర) మరియు ఆయన సహచరుల్ని హతమార్చడమే. ఈ హత్యలకు పగ తీర్చుకునే

ఉద్దేశ్యంతోనే ఈ సరియ్యాను పంపించడం జరిగింది. ఈ సైనిక పటాలం రాత్రి పూట దాడి చేసి చాలా మందిని సంహరించింది. వారికి సంబంధించిన పశువులను తోలుకొని వచ్చింది. వెనుక నుండి శత్రువుకు చెందిన ఓ పెద్ద సైన్యం ముస్లిములను వెంటాడి వచ్చింది కాని వారు ముస్లిముల దగ్గరికి చేరగానే కుంభవర్షం కురవనారంభించింది. చూస్తూ ఉండగానే పెద్ద వరదలు వచ్చి ఇరుపక్షాల నడుమ అడ్డుగా నీరు ప్రవహించనారంభించింది. ఇలా ముస్లిములు మిగిలిన దూరాన్ని కూడా నడిచి క్షేమంగా వచ్చేశారు.

2. సరియ్యా హుస్మీ (జమాదిల్ ఉఖ్రా మాసం, హి.శ.7)

దీని గురించిన వివరాలు, దైవప్రవక్త (స) రాజులకు రాసిన ఉత్తరాల సందర్భంలో చెప్పుకున్నాం.

3. సరియ్యా తర్బా (షాబాన్, హి.శ. 7)

ఇది హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)గారి సారధ్యంలో పంపించబడిన సరియ్యా. ఆయన వెంట మొత్తం ముప్పై మంది ఉన్నారు. వీరు రాత్రి పూట ప్రయాణం చేస్తూ, పగలు దాగి ఉండేవారు. కాని ఈ విషయం బనూ హవాజిన్ తెగకు తెలిసి వారంతా పారిపోయారు. హజ్రత్ ఉమర్ (ర) వారి ప్రాంతానికి చేరినప్పుడు ఏ ఒక్కడూ వారికి దొరకనందున తిరిగి మదీనాకు వచ్చేశారు.

4. ఫిదక్ పరిసరాలకు పంపిన సరియ్యా (షాబాన్ నెల, హి.శ.7)

ఇది హజ్రత్ బషీర్ బిన్ సఅద్ అన్సారీ (ర)గారి నేతృత్వంలో ముప్పై మందినిచ్చి 'బనూ ముర్రా' తెగను అణచడానికి పంపించబడిన సరియ్యా. హజ్రత్ బషీర్ (ర) వారి ప్రాంతానికి వెళ్ళి గొర్రెలను, మేకలను, పశువుల్ని తోలుకొని తిరుగు ప్రయాణం చేసేటప్పుడు రాత్రి పూట శత్రువులు వారిపైకి వచ్చిపడ్డారు. ముస్లిములు స్థిరంగా నిలబడి బాణాల వర్షం కురిపించారు. చివరకు వారి బాణాలు అయిపోగా శత్రువులు వారందరినీ హతమార్చేశారు. కేవలం ఒక బషీర్ మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. గాయాలపాలైన బషీర్ (ర)ను ఫిదక్‌కు తీసుకొచ్చారు వారు. ఆయన అక్కడనే యూదుల దగ్గర ఉండిపోయారు. చివరికి ఆయన గాయాలు మానిన తరువాత మదీనాకు తిరిగి వచ్చారు.

5. సరియ్యా మైఫా (రమజాన్ నెల, హి.శ. 7)

ఈ సరియ్యా హజ్రత్ గాలిబ్ బిన్ అబ్దుల్లా లైసీ (ర)గారి నాయకత్వంలో బనూ అవాల్‌నూ, బనూ అబ్ద్ బిన్ సాలిబానూ అణచడానికీ, మరో ఉల్లేఖ నంలో, జుహైనియా తెగకు చెందిన ఓ శాఖ హర్ఖాత్‌ను అణచడానికీ పంపించ బడిన సరియ్యా. ముస్లిముల సంఖ్య మొత్తం నూటా ముప్పై. వారు శత్రువు లపై ఒకేసారి దాడి చేశారు. ఎదురుతిరిగిన వారినందరినీ చంపేశారు. వారి గొర్రెలను, మేకలను తోలుకొని వచ్చేశారు. ఈ సరియ్యాలోనే హజ్రత్ ఉసామా బిన్ జైద్ (ర), 'నహీక్ బిన్ మర్దాస్' అనే వ్యక్తిని, అతను 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే సద్వచనం పఠించినప్పటికీ హతమార్చారు. ఈ విషయం తెలిసిన దైవప్రవక్త (స) ఆయనపై కోపాన్ని ప్రదర్శిస్తూ, "నీవు అతని గుండె చీల్చి చూడకపోయావా, అతను నిజం చెప్పాడో, అబద్ధం పలికాడో తెలుసుకోవ టానికి" అని అడిగారు.

6. సరియ్యా ఖైబర్ (షవ్వాల్ నెల, హి.శ. 7)

ఈ సరియ్యాకు వెళ్ళిన వారి సంఖ్య మొత్తం ముప్పై మంది. ఇది హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహా (ర) నేతృత్వంలో పంపబడిన సరియ్యా. అసీర్ లేదా బషీర్ బిన్ జరామ్, బనూ గత్ఫాన్‌ను ముస్లిములకు వ్యతిరేకంగా కూడగడుతున్నాడనే వార్త అందడం వలన పంపబడింది ఇది. ముస్లిములు అక్కడికి వెళ్ళి దైవప్రవక్త (స) అతణ్ణి ఖైబర్‌కు గవర్నరుగా చేస్తారని చెప్పి అతణ్ణి, అతనితో ఉన్న ముప్పై మందిని మదీనాకు వచ్చేటట్లు ఒప్పించారు. కాని 'కర్కరా నియార్'కు చేరిన తరువాత ముస్లిములకు, అతనికి మధ్య అనుమానాలు పొడసూపాయి. దీని ఫలితంగా అసీర్ మరియు అతని 30 మంది సహచరులూ ప్రాణాలు వదలాల్సి వచ్చింది.

7. సరియ్యా యమన్ మరియు జబార్ (షవ్వాల్ నెల, హి.శ. 7)

'జబార్' అనేది బనూ గత్ఫాన్- మరో ఉల్లేఖనంలో బనూ ఫరాజా మరియు బనూ ఇజ్రా - తెగలకు చెందిన ప్రాంతం. ఇక్కడికి, హజ్రత్ బషీర్ బిన్ కఅబ్ అన్సారీ (ర) సారధ్యంలో మూడొందల మంది ముస్లిములనిచ్చి పంపబడిన సరియ్యా ఇది. మదీనాపై దండెత్తడానికి సిద్ధమవుతున్న ఓ పెద్ద సైనిక పటాలాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఉద్దేశించినది. ముస్లిములు రాత్రి

పూట ప్రయాణిస్తూ పగలు దాగి ఉండేవారు. శత్రువుకు హ'జ్రత్ బషీర్ రాక గురించి తెలిసి పారిపోయాడు. ఆయన శత్రువులకు చెందిన పశువుల్ని వశపర్చుకున్నారు. ఇద్దరు వ్యక్తుల్ని కూడా బందీలుగా పట్టుకెళ్ళారు. వారిద్దరినీ దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరుపర్చగా వారిద్దరూ ఇస్లామ్ స్వీకరించి ముస్లిములైపోయారు.

8. సరియ్యా గాబా

ఇమామె ఇబ్నె ఖైమ్ ఈ సరియ్యా 'ఉమ్రయె ఖజా' కంటే పూర్వం హి.శ.7లో జరిగిన సరియ్యాల్లోని ఒకటిగా అభివర్ణించారు. దీని వివరాల్లోనికి వెడితే, జష్మ్ బిన్ ముఆవియా తెగకు చెందిన ఓ వ్యక్తి చాలా మందిని తోడ్కొని 'గాబా'కు వచ్చాడు. అతను బనూ ఖైస్ తెగకు ముస్లిములపైకి ఉసిగొల్పాలన్నది అతని ఉద్దేశ్యం. దైవప్రవక్త (స), హ'జ్రత్ అబూ హద్రద్ (ర)కు కేవలం ఇద్దరు మనుషులనిచ్చి పంపించారు. హ'జ్రత్ అబూ హద్రద్ (ర) అవలంబించిన యుద్ధవ్యూహం కారణంగా శత్రువుకు ఘోర పరాజయం ఎదురైంది. ఆయన శత్రువులకు చెందిన ఒంటెల్ని, గొర్రెల్ని, మేకలను తోలుకొని తిరిగి వచ్చారు.[7]

---

7. *జాదుల్ ముఆద్-2/149,150; ఈ సరియ్యాల వివరాలు, రహ్మతుల్ లిల్ ఆలిమీన్-2/229-231; జాదుల్ ముఆద్-2/148-150; తఫీముల్ ఫహూమ్ అధఃసూచికతో సహా పుట. 31; ముఖ్తసరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లాహ్ నజదీ, పుట. 322-324 లలో చూడవచ్చు.*

ఉమ్రయె ఖజా

ఇమామె హాకిమ్ ఇలా అంటున్నారు: "జీఖాదా మాసం చంద్రవంక అగుపడగానే దైవప్రవక్త (స) తమ అనుచరగణానికి, తప్పిపోయిన తమ ఉమ్రాను 'ఖజా'గా పూర్తి చేయండని, హుదైబియాలో హాజరైన వారిలో ఏ ఒక్కడూ ఆగిపోవడానికి వీల్లేదని ఓ ఆదేశాన్ని జారీ చేయగా, (ఈ మధ్య కాలంలో) ఎవరైతే అమరగతినొందారో వారు తప్ప మిగిలిన వారందరూ ఉమ్రా చేయడానికి బయలుదేరారు. హుదైబియాలో పాల్గొన్న వారే కాకుండా ఇంకా కొందరు ఉమ్రా చేయడానికిగాను వెంట రావడం జరిగింది. వారందరి సంఖ్య మొత్తం రెండు వేలకు చేరింది. స్త్రీలు, పిల్లలు వారికి అదనం.[1]

ఈ సందర్భంగా మహాప్రవక్త (స), అబూ రహ్మ్ (ర)ను తమ స్థానంలో మదీనా బాగోగులను చూడడానికి నియమించడం జరిగింది. అరవై ఒంటెలను వెంటబెట్టుకొని వాటిని పరిరక్షించేందుకు నాజియా బిన్ జుందుబ్ (ర)ను నియమించారు. 'జుల్ హలీఫా' అనే ప్రదేశం నుండి ఉమ్రా 'ఎహ్రామ్' కట్టి 'లబ్బైక్' పలికారు. ఆయనతో సహా ముస్లిములందరూ లబ్బైక్ అన్నారు. ఖురైష్‌వారు ఏదైనా వాగ్దానభంగానికి పాల్పడతారేమోననే ఉద్దేశ్యంతో అందరూ ఆయుధధారులై మరీ బయలుదేరారు. 'యాజిజ్' లోయకు చేరగానే ఆయుధాలన్నిటినీ అంటే ఢాళ్ళు, బాణాలు, బల్లేలు వగైరాలన్నిటిని ఆ ప్రదేశంలో ఉంచి, వాటిని సంరక్షించడానికి అవస్ బిన్ ఖౌలీ అన్సారీ (ర) గారి నాయకత్వంలో రెండొందల మందిని నియమించి, అశ్వారూఢులు ఉపయోగించే ఆయుధం మరియు ఒరలో ఉంచిన ఖడ్గం మాత్రమే తీసుకొని మక్కాలో ప్రవేశించారు.[2]

దైవప్రవక్త (స) మక్కాలో ప్రవేశించేటప్పుడు 'కస్వా' పేరుగల ఒంటెపై

---

1. *ఫత్‌హుల్ బారి-7/500.*
2. *ఫత్‌హుల్ బారి-7/500; జాదుల్ ముఆద్-2/151తో సహా.*

స్వారీ చేస్తున్నారు. ముస్లిములు ఖడ్గాలను మెడలకు తగిలించుకొని దైవప్రవక్త (స)ను చుట్టుముట్టి లబ్బైక్ పలుకుతున్నారు.

ముష్రిక్కులు ముస్లిములను చూడడానికి తమ ఇండ్ల నుండి బయటకు వచ్చి కాబాకు ఉత్తరాన ఉన్న 'జబ్లె ఖైకాన్' కొండ పైకి ఎక్కి కూర్చున్నారు. వారు పరస్పరం మాట్లాడుకుంటూ, "మీ వద్దకు వస్తున్న వారిని యస్రిబ్ జ్వరం పూర్తిగా నీరసులుగా చేసివేసింది" అని అనుకోజొచ్చారు. దైవప్రవక్త (స) తమ అనుచరులకు (సహాబాకు) ఆదేశమిస్తూ, ప్రదక్షిణ లేక తవాఫ్‌లో మొదటి మూడు ప్రదక్షిణలు పరుగెత్తుతూ చేయండని, అయితే 'రుక్నె యమాని' మరియు 'హజ్రె అస్వద్' (యమన్ వైపున ఉన్న కాబా గృహం మూల మరియు హజ్రె అస్వద్ ఉన్న ప్రదేశానికి నడుమ ఉన్న చోటు అంటే కాబా దక్షిణ గోడ) వరకు నడుస్తూ వెళ్ళమని చెప్పారు. ఈ ఆదేశం ఇవ్వడానికి కారణం కేవలం దైవకారుణ్యం పొందడమే కాకుండా, ముష్రిక్కులు వారి శక్తిని కూడా అంచనా వేసుకోవాలనే ఉద్దేశ్యం కూడా ఆ ఆదేశంలో ఉంది.[3] ఇదేకాక ఆయన(స) సహాబాకు 'ఇజ్‌తిబా' చేసే ఆదేశం కూడా ఇచ్చారు. ఇజ్‌తిబా అంటే కుడి భుజంపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా చేయడం. (పైన కప్పుకున్న అంగవస్త్రం అంచును కుడి చంక క్రింది నుండి తీసి వెనుకా ముందుగా రెండో అంచును ఎడమ భుజంపై వేసుకోవడం).

దైవప్రవక్త (స) మక్కాలోనికి ప్రవేశించిన మార్గం, కొండ లోయగుండా వెళ్ళి 'హజూన్'కు చేరే మార్గం. ముష్రిక్కులు మహాప్రవక్త (స) మరియు ఆయన అనుయాయుల్ని చూసేందుకు వరుసకట్టి నిలబడి ఉన్నారు. ఆయన (స) ఆపకుండా లబ్బైక్ పలుకుతూ (హరమ్ లోనికి చేరి) తన చేతికర్రతో హజ్రె అస్వద్‌ను తాకారు. అక్కడి నుండి ప్రదక్షిణ ప్రారంభించారు. తక్కిన ముస్లిములు కూడా ఆయన్ను అనుసరించారు. అప్పుడు అబ్దుల్లా బిన్ రవాహా (ర) తన కరవాలాన్ని ధరించి దైవప్రవక్త (స) ముందు నడుస్తున్నారు. అలా నడుస్తూ ఈ యుద్ధ గీతాన్ని ఆలపిస్తున్నారు.

"దైవ తిరస్కారుల మనుమల్లారా! ఈయన కోసం మార్గాన్ని వదలండి. సకల శ్రేయాలు ఈ ప్రవక్త (స) వద్దే ఉన్నాయి కాబట్టి ఆయన మార్గానికి అడ్డుతొలగండి. ఆ శ్రేయం రహ్మాన్ తన గ్రంథంలో అవతరింపజేశాడు. అంటే,

3. *సహీహ్ బుఖారి-1/218, 2/610,611; సహీ ముస్లిమ్-1/412.*

ఆయన ప్రవక్తపై పఠించబడే గ్రంథం అన్నమాట. ఓ ప్రభూ! నేను వీటిని విశ్వసిస్తున్నాను. దాన్ని స్వీకరించడమే సత్యమార్గం అని నాకు తెలుసు-మేలైన హత్య అల్లాహ్ మార్గంలో చేసే హత్య. నేడు అవతరించిన ఈ గ్రంథం ప్రకారం మేము మీపై వేసే వ్రేటుకు మీ కపాళం బ్రద్దలవుతుంది. ఈ దెబ్బ స్నేహాన్ని త్రెంచేస్తుంది."[4]

ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర), హజ్రత్ రవాహాతో, "ఓ రవాహా! నీవు దైవప్రవక్త (స) ఎదుట, అల్లాహ్ గృహంలోనా ఈ పద్యపాదాల్ని వల్లిస్తున్నావు?" అని అడిగారు. దీనికి మహాప్రవక్త (స), "ఓ ఉమర్! వల్లించనీ! ఈ పద్య పాదాలు వారికి బాణాలకంటే ఎక్కువగా గ్రుచ్చుకొని బాధిస్తున్నాయి" అన్నారు.[5]

మహాప్రవక్త (స) మరియు ముస్లిములంతా మూడు ప్రదక్షిణలు పరుగిడుతూ చేయగా, ముష్రిక్కులు అది చూసి, "వీరి గురించి మనం జ్వరం వారిని నిర్వీర్యం చేసేసిందని అనుకున్నాంగాని వారు ఫలానా, ఫలానా వారి కంటే కూడా బలవంతులు" అని అనుకోజొచ్చారు.[6]

తవాఫ్ పూర్తి అయిన పిదప ఆయన(స) సఫా మరియు మర్వా కొండల నడుమ సయీ చేశారు. అప్పుడు ఆయన హదీ అంటే ఖుర్బానీ పశువులు మర్వా వద్ద నిలబడి ఉన్నాయి. ఆయన సయీ పూర్తి చేసిన తరువాత "ఇది బలి స్థానం, మక్కా వీధులన్నీ బలి స్థానాలే" అని సెలవిచ్చారు. ఆ తరువాత మర్వా వద్దనే ఖుర్బానీ పశువులను బలి ఇవ్వటం జరిగింది. ఆ చోటే తమ తలను గొరిగించుకున్నారు. ముస్లిములు కూడా తమ తల వెంట్రుకలను గొరిగించుకున్నారు. కొందరిని 'యాజిజ్'కు పంపి అక్కడున్న ఆయుధాల సంరక్షణా బాధ్యతను తీసుకొని అక్కడున్న వారిని ఉమ్రా కోసం పంపించమని చెప్పి పంపారు.

మహాప్రవక్త (స) మక్కాలో మూడు రోజుల వరకు మకాం వేశారు. నాల్గవ రోజు తెల్లారిన తరువాత ముష్రిక్కులు హజ్రత్ అలీ (ర) వద్దకు

4. ఉల్లేఖనాల్లో ఈ పద్యపాదాలు వాటి క్రమం వేరువేరుగా ఉంది. వాటన్నిటినీ ఓ చోట చేర్చి రాయడం జరిగింది.
5. జామె తిర్మిజీ, అబ్వాబుల్ ఇస్తీజాన్ వల్ అదబ్, జాబుత్ మాజా అషీర్నిన్షా వష్షేర్-2/107.
6. సహీ ముస్లిమ్-1/412.

వచ్చి, "మీ నాయకునితో, గడువు తీరిపోయింది వెనక్కు వెళ్ళిపొమ్మని చెప్పండి" అని అన్నారు. పిదప దైవప్రవక్త (స) మక్కా నుండి బయలుదేరి సర్ఫ్ అనే ప్రదేశంలోనికి వచ్చి విడిది చేశారు.

మక్కా నుండి బయలుదేరేటప్పుడు, హజ్రత్ హమ్జా (ర)గారి కుమార్తె బాబాయి, బాబాయి అంటూ వెంటబడింది. ఆమెను హజ్రత్ అలీ (ర) ఎత్తుకున్నారు. ఆ తరువాత ఆమె గురించి హజ్రత్ అలీ (ర), హజ్రత్ జాఫర్ (ర) మరియు హజ్రత్ జైద్ (ర) నడుమ వివాదం వచ్చింది (ప్రతి వ్యక్తీ తానే ఆ అమ్మాయి పోషణకు హక్కుదారుణ్ణని వాదించసాగాడు). దైవప్రవక్త (స) హజ్రత్ జాఫర్(ర) గారికి అప్పగించారు. ఎందుకంటే ఆ అమ్మాయి చిన్నమ్మ ఆయనకు భార్య కాబట్టి.

ఈ ఉమ్రా సందర్భంలోనే దైవప్రవక్త (స)కు, హజ్రత్ మైమూనా బిన్తె హారిస్ ఆరియా (ర)తో వివాహం జరిగింది. దైవప్రవక్త (స) మక్కాలో ప్రవేశించక ముందే, హజ్రత్ జాఫర్ బిన్ అబూ తాలిబ్ (ర)ను వివాహ సంబంధం గురించి మాట్లాడమని మైమునా (ర) వద్దకు పంపించి ఉన్నారు. ఆమె ఈ వ్యవహారాన్ని హజ్రత్ అబ్బాస్ (ర) కు అప్పగించారు. అప్పటికే హజ్రత్ మైమునా సోదరి హజ్రత్ ఉమ్ముల్ ఫజల్ ఆయన వివాహ బంధంలో ఉన్నారు. హజ్రత్ అబ్బాస్ (ర) మైమునా (ర) గారిని దైవప్రవక్త (స)కు ఇచ్చి వివాహం చేశారు. మక్కా నుండి తిరిగి వచ్చేటప్పుడు, హజ్రత్ మైమునా (ర)ను తోడ్కొని రమ్మని హజ్రత్ అబూ రాఫె (ర)ను అక్కడే వదిలి వచ్చేశారు. దైవప్రవక్త (స) సర్ఫ్‌కు చేరేటప్పటికి ఆయన మైమునా (ర)ను సన్నిధికి గొనివచ్చారు.[7]

ఈ ఉమ్రా పేరు 'ఉమ్రయె ఖజా'గా పడిపోవడానికి కారణం, బహుశా ఇది హుదైబియా ఉమ్రాకు బదులుగా చేసిన ఉమ్రా అయినా కావచ్చు లేదా హుదైబియా ఒప్పందంలో నిర్ణయించిన షరతులకు అనుగుణంగానైనా జరిగి ఉండవచ్చు. రెండో కారణాన్నే పరిశోధకులు సరియైనదిగా తలుస్తారు.[8] అదేకాకుండా దీన్ని నాల్గు రకాలుగా కూడా పిలుస్తారు. 1. ఉమ్రయె ఖజా, 2. ఉమ్రయె ఖజియా, 3. ఉమ్రయె ఖిసాస్, 4. ఉమ్రయె సులాహ్.

7. జాదుల్ ముఆద్-2/152

8. జాదుల్ ముఆద్-1/172; ఫత్‌హుల్ బారి-7/500

మరికొన్ని సరియ్యాలు

1. సరియ్యా అబుల్ ఇవజా (జిల్‌హజ్జా మాసం, హి.శ. 7)

దైవప్రవక్త (స), యాభై మందిని హజ్రత్ అబుల్ ఇవజాకు ఇచ్చి బనూ సులైమ్ తెగవారిని ఇస్లామ్ వైపునకు ఆహ్వానించమని పంపించారు. కాని బనూ సులైమ్‌కు ఇస్లామ్ వైపునకు రమ్మని పిలుపునివ్వగా వారు, "మీరు దేని వైపునకైతే మమ్మల్ని పిలుస్తున్నారో అది మాకు అవసరం లేదు" అంటూ వారితో యుద్ధానికి దిగారు. భీకర పోరాటం జరిగింది. ఆ పోరాటంలో హజ్రత్ అబుల్ ఇవజా గాయపడ్డారు. అయినప్పటికీ ముస్లిములు శత్రువులకు చెందిన ఇద్దరిని బందీలుగా పట్టుకొని వచ్చారు.

2. సరియ్యా గాలిబ్ బిన్ అబ్దుల్లాహ్ (సఫర్ నెల, హి.శ. 8)

ఈయనకు రెండొందల మందినిచ్చి ఫిదక్ చుట్టుపట్ల హజ్రత్ బషీర్ బిన్ సఅద్ సహచరులు అమరగతినొందిన ప్రదేశానికి పంపించారు మహాప్రవక్త (స). వీరు శత్రువుల పశువులను హస్తగతం చేసుకుని అనేక మందిని హత మార్చారు.

3. సరియ్యా జాతె అత్లహ్ (రబీవుల్ అవ్వల్ నెల, హి.శ. 8)

ఈ సరియ్యా వివరాలు ఇలా ఉన్నాయి. బనూ ఖుజాఅ వారు ముస్లిములపై దాడి చేయడానికి పెద్ద సైన్యాన్ని సమీకరించుకొని ఉన్నారు. ఈ వార్త మహాప్రవక్త (స)కు తెలిసింది. ఆయన 'కఅబ్ బిన్ ఉమైర్ (ర)' గారి నేతృత్వంలో కేవలం పదిహేను మంది సహాబాలనే అటు వైపునకు పంపించారు. సహాబా (ర)కు వారు ఎదురుపడినప్పుడు వారిని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించడం జరిగింది. కాని వారు ఇస్లామ్ స్వీకరించడానికి బదులు సహాబా (ర)ను బాణాలు సంధించి అందరినీ షహీద్ చేశారు. కేవలం ఒకే ఒక వ్యక్తి బ్రతికి ఉండగా ఆయనను హతుల నడుమ నుండి ఎత్తుకు రావడం జరిగింది.[9]

9. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/231

4. సరియ్యా జాతె అర్ఖ్ (రబీవుల్ అవ్వల్ హి.శ. 8)

బనూ హవాజిన్ తెగ ఎడతెగకుండా శత్రువుకు సహాయం అందిస్తూ ఉండేది. అందుకని పాతిక మందిగల ఓ పటాలాన్ని హజ్రత్ షుజా బిన్ వహబ్ అసదీ (ర)గారికిచ్చి అటు పంపించడం జరిగింది. వీరు శత్రువులకు చెందిన పశువులను మాత్రమే తోలుకొని వచ్చారు. పోరాటం జరిగే అవకాశం కలుగలేదు.[10]

10. *రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/231; తల్ఖీహుల్ ఫహూమ్-పుట.33 (అధఃసూచిక)*

'మూతా' పోరాటం

'మూతా' జోర్డాన్‌లోని బల్కా దాపులో ఉన్న ఓ జనవాసం పేరు. ఇక్కడి నుండి 'బైతుల్ మఖ్దిస్' రెండు మజిలీల దూరంలో ఉంది. ఇప్పుడు చెప్పబోతున్న యుద్ధం ఈ ప్రదేశంలోనే జరిగింది.

ఇది అన్నిటికంటే భయంకరమైన, రక్తపాతంతో కూడిన పోరాటం. మహాప్రవక్త (స) సజీవంగా ఉన్న కాలంలోనే జరిగింది. ఈ పోరాటమే క్రైస్తవ దేశాల విజయానికి నాంది పలికింది. ఈ పోరాటం జరిగిన కాలం జమాదిల్ ఊలా హి.శ. 8లో (అంటే క్రీ.శ. 629, ఆగస్టు లేదా సెప్టెంబరు నెలలో జరిగింది.)

పోరాటానికి గల కారణాలు

జరిగిందేమిటంటే, దైవప్రవక్త (స) హారిస్ బిన్ ఉమైర్ అజ్దీ (ర)కు తన లేఖనిచ్చి బస్రా పాలకుని వద్దకు పంపించారు. ఆయన్ను రోమన్ చక్రవర్తికి గవర్నరు అయిన షర్జీల్ బిన్ అమ్రూ గస్సానీ- ఇతను అప్పుడు బల్కా గవర్నరుగా ఉన్నాడు- బంధించి త్రాళ్ళతో కట్టి ఆయన మెడ నరికివేశాడు.

దూతలను, సందేశం తెచ్చే వ్యక్తులను చంపడం ఘోరమైన నేరంగా పరిగణించబడుతుంది. అది ఒక విధంగా యుద్ధ ప్రకటనే కాకుండా అంతకు మించినదిగా భావించబడేది. దైవప్రవక్త (స)కు ఈ వార్త అందగా, అది ఆయన్ను బాగా కలిచివేసింది. మహాప్రవక్త (స) ఆ ప్రాంతంపై దండెత్తడానికి మూడు వేల మందితో కూడిన ఓ సైన్యాన్ని సమాయత్తపరిచారు.[1] ఇంత పెద్ద సైన్యం ఇంతకు పూర్వం ఒక అహ్జాబ్ యుద్ధంలో తప్ప మరే యుద్ధం లోనూ సమీకరించబడలేదు.

1. *జాదుల్ ముఆద్-2/155; ఫత్‌హుల్ బారి-7/511.*

సైన్యాధ్యక్షులు, వారికి దైవప్రవక్త (స) గారి హితబోధ

దైవప్రవక్త (స) ఈ సైన్యానికి సైన్యాధ్యక్షునిగా హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర)ను నియమించారు. వారికి హితబోధ చేస్తూ, ఒకవేళ జైద్ (ర) చంపబడితే జాఫర్ (ర), జాఫర్ (ర) చంపబడితే అబ్దుల్లా బిన్ రవాహా సైన్యాధ్యక్షులవు తారు.[2]

మహాప్రవక్త (స) సైన్యం కొరకు తెల్లజెండా కట్టి దాన్ని హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర)గారి చేతికి అందించారు.[3] వెళ్ళే సైన్యానికి హితబోధ చేస్తూ, "ఆ ప్రదేశానికి చేరగానే ప్రజలను ఇస్లామ్ వైపునకు ఆహ్వానించండి. ఒకవేళ వారు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే మంచిదే. అలా జరగని పక్షంలో వారు దైవ సహాయాన్ని కోరండి. యుద్ధం ప్రారంభించండి." మహాప్రవక్త (స) ఇలా కూడా హితబోధ చేశారు వారికి; "మీరు అల్లాహ్ పేరుతో, అల్లాహ్ మార్గంలో, అల్లాహ్‌ను తిరస్కరించేవారితో పోరాడండి. చూడండి! వాగ్దానభంగం చేయ కూడదు. బాధ్యతలను విస్మరించవద్దు. ఏ స్త్రీనిగానీ, చిన్నపిల్లలనుగానీ, వృద్ధుల్ని గానీ, చర్చీల్లో ఉంటూ సన్యాసం పుచ్చుకున్న ఏ ఒక్కరిని గాని హత మార్చవద్దు. ఖర్జూరపు చెట్టును గానీ, మరే వృక్షాన్నిగాని నరకివేయకూడదు. అలాగే ఏ కట్టడాన్ని కూడా కూల్చకూడదు."[4]

ఇస్లామీయ సైన్యం బయలుదేరడం - అబ్దుల్లా బిన్ రవాహా (ర) గారి దుఃఖం

ఇస్లామీయ సైన్యం బయలుదేరడానికి సిద్ధమైంది. ప్రజలందరూ వచ్చి మహాప్రవక్త (స) గారు నియమించిన సైన్యాధ్యక్షులను సాగనంపుతూ వారికి సలాములు చెబుతున్నారు. అదే సమయంలో సర్వ సైన్యాధ్యక్షులైన హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర) దుఃఖించనారంభించారు. "మీరెందుకు ఏడుస్తున్నారు?" అని ప్రజలు ఆయన్ను అడగగా, "చూడండి దైవసాక్షి! (ఈ ఏడ్పుకు) ప్రపంచ వ్యామోహం లేదా మీతో గల సంబంధం అసలు దీనికి కారణం కాదు. నేను దైవప్రవక్త (స)ను దివ్యఖుర్‌ఆన్‌లోని ఓ ఆయత్‌ను పఠిస్తూ ఉండగా విన్నాను. ఆ ఆయత్‌లో నరక ప్రస్తావన ఉంది. ఆ ఆయత్ ఇది:

2. సహీ బుఖారి- మూతా యుద్ధ అధ్యాయం-2/611.
3. ముక్తసిరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లాహ్-పుట.327
4. ముక్తసిరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లాహ్- పుట.327; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/271

"మీలో నరకం దరిదాపులకు పోనివాడు ఎవడూ లేడు. ఇది ఓ నిర్ణీత విషయమే." (19 : 71)

"నరకం దాపుకు వెళ్ళిన తరువాత అక్కడి నుండి నేను ఎలా వెనక్కి వస్తానో నాకు తెలియదు. అందుకనే ఈ దుఃఖం" అన్నారాయన.

"అల్లాహ్ మీకు తోడుంటాడు. మిమ్మల్ని క్షేమంగా పరిరక్షిస్తాడు. ఆయన మిమ్మల్ని కాపాడుగాక! విజయ ధనంతో మిమ్మల్ని మా వద్దకు తీసుకువచ్చుగాక!" అని దీవించడం నారంభించారు వారందరు. హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర) మాత్రం కొన్ని పద్యపాదాలను చదివారు. వాటి అర్థం ఇలా ఉంది:

"కాని నేను రహ్మాన్ నుండి కోరుకునేదల్లా ఆయన మన్నింపును, నా ఎముకలను విరిచే, నా తలను నరికే లేదా ఓ బల్లెం విసిరే వాని చేత విసరబడిన బల్లెం నా శరీరం నుండి ఆవలికి వెళ్ళే ప్రహారాలను కోరుకుం టున్నాను. నేను చనిపోయిన తరువాత నా సమాధిని చూసి వెళ్ళేవారు, అయ్యో. ఇది అల్లాహ్ చేత మార్గం చూయించబడిన వ్యక్తి సమాధి" అని అనుకోవాలి.

ఆ తరువాత సైన్యం బయలుదేరింది. మహాప్రవక్త (స) దాన్ని సాగ నంపుతూ సనియతుల్ విదా వరకు వెళ్ళారు. అక్కడ నుండే ఆ సైన్యానికి వీడ్కోలు పలికారు.[5]

ఇస్లామీయ సైన్యం ముందడుగు- అనుకోకుండా ఎదురైన గడ్డు పరిస్థితి

ఇస్లామీయ సైన్యం ఉత్తరం వైపునకు పయనిస్తూ 'ముఆన్' అనే ప్రదేశానికి చేరింది. ఇది ఉత్తర హిజాజ్‌కు ఆనుకొని ఉన్న సిరియా (జోర్డాన్) ప్రాంతంలోని ఓ ప్రదేశం. ఇక్కడ సైన్యం విడిది చేసింది. వేగులవారు, రోమన్ చక్రవర్తి హిరక్ల్, 'బల్కా' ప్రాంతంలోని 'మాఆబ్'లో లక్ష మంది రోమను సైన్యంతో సహా విడిది చేసి ఉన్నాడని, అతని జెండా క్రింద లక్మ్, జిజామ్, బల్కీన్, బహ్రా మరియు బలీ అరబ్బు తెగలకు చెందిన మరో లక్ష మంది కూడా ఉన్నారని వార్త అందించారు.

5. ఇబ్నె హిషామ్ 2/373, 374 జాదుల్ మఆద్-2/156 ముక్తరుస్సీరత్ షేఖ్ అబ్దుల్లా 327

'మఅన్'లో సలహా సంఘం భేటీ

ఇంత పెద్ద సైన్యాన్ని ఎదుర్కోవలసి వస్తుందని ముస్లిములు ఊహించనైనా ఊహించలేదు. ఓ సుదూర ప్రాంతంలో అనుకోకుండా అలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఎవ్వరూ అనుకోలేదు. ప్రస్తుతం వారి ముందున్న ప్రశ్నల్లా, మూడు వేల మంది సైనికులు, రెండు లక్షల సైన్యంగల ఓ మహా సముద్రంలాంటి సేనతో ఢీకొనడం ఎలా అన్నదే. ముస్లిములు ఈ పరిస్థితిలోనే 'మఅన్'లో రెండు రాత్రిళ్ళు సలహాలతోనే గడిపేశారు. కొందరు మాత్రం, మనం దైవప్రవక్త (స)కు లేఖ రాసి శత్రువు సేన బలం గురించి తెలియజేయాలన్నారు. ఆ తరువాత ఆయన మదీనా నుండి సైన్యాన్ని సహాయంగా పంపించవచ్చు, లేదా మరే ఆదేశం అయినా ఇవ్వవచ్చు వేచి చూద్దాం అని సలహా ఇచ్చారు.

కాని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహా (ర) వారి ఈ సలహాలను వ్యతిరేకిస్తూ, "ప్రజలారా! దైవసాక్షి! దేని గురించైతే మీరు వెనకా ముందాడుతున్నారో అది 'షహాదత్' (అమరత్వం), ఆ షహాదత్ పొందడానికే కదా మీరు ఇంత దూరం వచ్చింది? చూడండి! శత్రువుతో మన పోరాటం దాని సంఖ్యా బలం, ఆయుధ బలం ఆధారంగా కాదు. కేవలం మనం పోరాడేది అల్లాహ్ మనకు మార్గం చూపిన ఆ ధర్మబలం ఆధారంగానే. పదండి! ముందుకు ఉరకండి. మనకు రెండు మేళ్ళలో ఏదో ఒకటి లభించి తీరుతుంది. మనమైనా వారిపై ఆధిక్యతను పొందగలం లేదా అమరగతి అయినా నొందుదాం" అని సైన్యానికి క్రొత్త ఊపిరి పోశారు. చివరికి అబ్దుల్లాహ్ బిన్ రవాహా (ర)గారు ప్రతిపాదించిన విషయమే ఖరారు అయింది.

శత్రువు వైపునకు ముందడుగు వేసిన ఇస్లామీయ సైన్యం

ఎలాగైతేనేమి ఇస్లామీయ సైన్యం మఅన్‌లో రెండు రాత్రులు గడిపిన తరువాత శత్రువు వైపునకు కదిలి వెళ్ళింది. బల్కాలోని ఓ బస్తీ 'మషారిఫ్' వద్ద హిరక్ల్ సైన్యంతో ముఖాముఖిగా నిలిచింది. శత్రువు మరింత చేరువకు రాగానే ముస్లిములు 'మూతా' వైపునకు వెళ్ళి అక్కడ విడిది చేశారు. ఆ పిదప సైన్యాన్ని యుద్ధం చేసేందుకు తీర్చిదిద్దారు దాని సైన్యాధ్యక్షులు. మైమనా (కుడి పార్శ్వం)కు ఖుత్బా బిన్ ఖతాదా అజ్రీ (ర) నియమితులవగా, మైసరా (ఎడమ పార్శ్వం)కు ఉబాదా బిన్ మాలిక్ అన్సారి (ర) నియమించబడ్డారు.

యుద్ధారంభం - సైన్యాధ్యక్షులు ఒకరి తరువాత మరొకరు అమరత్వం పొందడం

మూతాలోనే ఉభయ సేనల్లో పోరు ప్రారంభం అయింది. అది అతిభయంకరమైన పోరాటం. మూడు వేల మందిగల చిన్న సైనిక పటాలం, రెండు లక్షల మిడతల దండులాంటి అపార సేనావాహిని ప్రహారాలను ఎదుర్కొంటోంది. అది ఓ విచిత్రమైన పోరాటం. ఆశ్చర్యంగా గమనిస్తోంది ప్రపంచం. అయితే విశ్వాసం గాలి వీస్తున్నప్పుడు ఇలాంటి విచిత్ర పరిస్థితులే ఉనికిలోనికి వస్తాయి మరి.

అందరికంటే ముందు దైవప్రవక్త (స) గారికి ప్రియాతి ప్రియులైన హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర) జెండా పుచ్చుకున్నారు. ఆ జెండా చేతికి రాగానే, ఇస్లామీయ యోధుల్లో తప్ప మరెవ్వరిలోనూ కానరాని సాహసంలా ప్రాణాలకు తెగించి పోరాడనారంభించారు. అలా యుద్ధం చేస్తూ ఆయన శత్రువుల బల్లేలకు నేల ఒరిగి షహీద్ అయిపోయారు.

ఆ తరువాత హజ్రత్ జాఫర్ (ర) వంతు వచ్చింది. ఆయన పడిపోయిన జెండాను చేతబట్టి పైకి ఎత్తి భీకరంగా పోరాడనారంభించారు. యుద్ధం బాగా ఊపందుకున్నప్పుడు ఆయన ఎరుపు, తెలుపు మచ్చలుగల గుర్రం మీది నుండి దూకేశారు. ఖడ్గ ప్రహారాలు చేస్తూ తమపై బడుతున్న దెబ్బలను దానితో అడ్డుకోనారంభించారు. చివరికి శత్రువు వేసిన దెబ్బకు ఆయన కుడి చేయి తెగిపోయింది. జెండాను ఆయన ఎడమ చేతబట్టుకొని క్రిందపడకుండా ఆపుతున్నారు. చివరికి ఎడమ చేయి కూడా తెగిపోయింది. ఇక తెగిపోయి మొండాలైన బాహువుల సహాయంతో ఆ జెండాను తన ఒడిన ఉంచుకొని అమరత్వం పొందే వరకు అలానే లేపి ఉంచారు. ఓ రోము సైనికుడు వేసిన ఖడ్గప్రహారంతో ఆయన రెండు ముక్కలుగా తెగిపోయారని చెప్పడం జరుగుతోంది. అల్లాహ్ ఆయన తెగిన రెండు చేతులకు బదులు స్వర్గంలో రెండు రెక్కలను ప్రసాదించాడు. వాటి సహాయంతో ఆయన స్వర్గంలో ఎక్కడికైనా ఎగిరి వెళ్ళగలరు. అందుకనే ఆయన బిరుదు 'జాఫరె తయ్యార్' మరియు 'జాఫరె జుల్ జినాన్'గా పడిపోయింది.

(తయ్యార్ అంటే ఎగిరేవాడు అని, జుల్ జినాన్ అంటే రెండు రెక్కలు గలవాడు అని అర్థం.)

ఇమామె బుఖారి, 'నాఫె' ద్వారా ఇబ్నె అబ్బాస్ (ర)గారి ఈ కథనాన్ని ఉటంకించారు. ఆ కథనంలో హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (ర)గారు ఇలా అంటారు.

"నేను మూతా యుద్ధం జరుగుతూ ఉండగా హజ్రత్ జాఫర్ (ర)గారి వద్దకు వెళ్ళి చూడగా ఆయన అమరగతిని పొంది ఉన్నారు. నేను ఆయన మృతదేహం వద్ద నిలబడి ఆయన శరీరంపై బడిన ఖడ్గ ప్రహారాలను, శూలాలు దిగిన గాయాలను లెక్కించగా అవి మొత్తం యాభై గాయాలున్నాయి. వాటిలో ఏ గాయం కూడా వెనుక వైపు నుండి తగిలిన గాయం కాదు."[6]

మరో ఉల్లేఖనంలో ఇబ్నె ఉమర్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది.

"నేను ముస్లిముల వెంట ఉన్నాను. మేమందరం హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్‌ను వెతుకుతూ ఉండగా ఆయన్ను మేము హతుల్లో పడి ఉండగా కనుగొన్నాము. ఆయన శరీరంపై ఖడ్గం మరియు బల్లేల గాయాలు తొంభై కంటే ఎక్కువగానే ఉన్నాయి."[7] నాఫె ద్వారా ఉమర్ (ర) గారి ఉల్లేఖనంలోనే ఈ విషయం అదనంగా ఉంది; "ఆ గాయాలన్నీ ఆయన శరీరానికి ఎదుటి భాగంలో అయిన గాయాలే".[8]

ఇలా ధైర్యం ఉట్టిపడేలా చేసిన యుద్ధంలో హజ్రత్ జాఫర్ (ర) కూడా అమరగతిని పొందారు. ఇప్పుడు హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర) జెండాను ఎత్తుకొని తన గుర్రమెక్కి ముందుకు కదిలారు. కాని కొంత ఆలోచనలో పడిపోయారు. కాని ఆ తరువాత ఇలా అంటూ శత్రువును ఢీకొన్నారు.

"ఓ మనసా! నీవు తప్పకుండా వారిని ఢీకొను, ఇష్టంగానైనా, అయిష్టం గానైనా. వీరు యుద్ధాన్ని రగిలిస్తున్నారు. శూలాలను నీ వైపునకు గురిపెట్టి ఉన్నారు. మరి నీవెందుకు స్వర్గాన్ని కాదంటున్నావు?"

అంతలోనే ఆయన పినతండ్రి కుమారుడు మాంసం ఉన్న ఓ ఎముకను ఆయనకు అందిస్తూ దీన్ని తిని కొంత శక్తిని కూడగట్టుకోండి.

---

6. సహీ బుఖారి, సిరియాలో జరిగిన మూతా యుద్ధ అధ్యాయం-2/611.

7. సహీ బుఖారి, సిరియాలో జరిగిన మూతా యుద్ధ అధ్యాయం-2/611.

8. ఫత్‌హుల్ బారి-7/512. చూడ్డానికి రెండు ఉల్లేఖనాల్లో సంఖ్య గురించి తేడా ఉంది. అయితే ఆ సంఖ్యలో బాణాలు గుచ్చుకోగా అయిన గాయాలను కలుపుకుంటే ఆ సంఖ్య పెరిగిపోతుంది.

మీరు ఈ కాలంలో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు అని అన్నాడు. ఆయన ఆ ఎముకను తీసుకొని ఓసారి నోటబెట్టి మాంసాన్ని పీకి నమిలారు. ఆ తరువాత దాన్ని పారవేసి యుద్ధం చేస్తూ అమరగతిని పొందారు.

దైవకరవాలాల్లో ఓ కరవాలం చేతిలో ఇస్లామీయ యుద్ధ పతాకం

జెండా క్రిందపడిపోగానే బనూ అజ్లాన్‌కు చెందిన సాబిత్ బిన్ అర్కమ్ అనే సహాబీ ఒకరు దాన్ని పైకి ఎత్తి, "ముస్లిములారా! మీలోని మరొక్కరిని సైన్యాధ్యక్షునిగా చేసుకోండి" అని అరిచాడు.

"మీరే ఆ పని చేయండి" అని చెప్పారు ముస్లిములు.

"కాదు! నేను ఈ పని చేయలేను" అన్నారు సాబిత్.

అనంతరం సహాబాలందరూ కలసి ఖాలిద్ బిన్ వలీద్ (ర)ను సైన్యాధ్యక్షునిగా ఎంపిక చేశారు. ఆయన జెండాను ఎత్తుకుంటూనే భయంకరంగా శత్రువుపై విరుచుకుపడ్డారు.

సహీ బుఖారీలో స్వయంగా హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర)గారి ఉల్లేఖనం ఇలా గ్రంథస్థమై ఉంది;

"మూతా యుద్ధం జరిగిన నాడు నా చేతిలో మొత్తం తొమ్మిది కరవాలాలు విరిగిపోయాయి. చివరికి నా చేతిలో కేవలం ఒకే ఒక యమనీ ఖడ్గం (చిన్న ఖడ్గం) మాత్రం మిగిలిపోయింది."[9]

ఇంకో ఉల్లేఖనంలో ఆయన ఇలా ఉల్లేఖిస్తున్నారు.

"మూతా యుద్ధం జరిగిన రోజున నా చేతిలో తొమ్మిది కరవాలాలు విరిగిపోయాయి. కేవలం ఒక్క 'యమనీ బానా' అనే చిన్న కత్తి మాత్రం నా చేతిలో మిగిలిపోయింది."[10]

ఇటు దైవప్రవక్త (స)కు ఆ యుద్ధం జరిగిన రోజున్నే- అప్పటికి యుద్ధ రంగం నుండి ఎలాంటి వార్త అందలేదు- వహీ (దివ్యవాణి)ద్వారా అల్లాహ్ అక్కడి పరిస్థితుల్ని తెలియజేయగా సహాబా (ర) నుద్దేశించి ఇలా సెలవిచ్చారు.

"జెండాను జైద్ తీసుకున్నారు. ఆయన షహీద్ అయిపోయారు. ఆ తరువాత జాఫర్ దాన్ని ఎత్తి పట్టుకోగా ఆయన కూడా అమరగతిని పొందారు. పిదప దాన్ని ఇబ్నె రవాహా తీసుకున్నారు. ఆయన కూడా అమరత్వం

---

9. సహీ బుఖారి-మూతా యుద్ధ అధ్యాయం-2/611.

10. సహీహ బుఖారి; గజ్వయె మూతా మిన్ అర్దష్షామ్ అధ్యాయం-2/611.

పొందారు."-మహాప్రవక్త (స)కళ్ళ వెంట అశ్రుధారలు రాలుతున్నాయి- చివరికి జెండాను అల్లాహ్ కరవాలాల్లోని ఒక కరవాలం దాన్ని చేతబూనింది. (ఆయన చేసిన యుద్ధం వల్ల) అల్లాహ్ ఆయనకు విజయం చేకూర్చాడు."[11]

యుద్ధాంతం

ప్రాణాలకు తెగించి, ధైర్యసాహసాలు ప్రదర్శించి యుద్ధం చేసినప్పటికీ, ముస్లిముల ఈ చిన్న సైనిక దళం, రోమనుల సేనావాహిని ముందు ఎలా నిలబడగలిగింది? అన్నది ఆశ్చర్యకరమైన విషయం. ఈ గడ్డు పరిస్థితిలో హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర) ముస్లిములను ఆ యుద్ధం సుడిగుండం నుంచి బయటపడవేయడానికి స్వయంగా తానే అందులోకి దుమికేశారు. తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

ఈ యుద్ధ పరిణామాలు ఎలాగున్నాయి అనే విషయంలో ఉల్లేఖనాల్లో చాలా తేడా అగుపడుతున్నప్పటికీ, ఆ ఉల్లేఖనాలన్నింటిని దృష్టిలో ఉంచుకొని చూస్తే పరిస్థితి ఏమిటో మనకు అర్థం అవుతుంది.

యుద్ధం మొదటి రోజు ఖాలిద్ బిన్ వలీద్ (ర) రోమనులను ధైర్యంగా అడ్డుకున్నారు. కాని ఆయన, రోమనులను భయభీతులుగా చేసి ముస్లిములను వారి బారి నుండి ఎలా తప్పించాలి? ముస్లిములను తరమ కుండా వారిని ఎలా నిలువరించాలి? అనే యుద్ధవ్యూహరచనను గురించి ఆలోచిస్తూనే ఉన్నారు. ముస్లిములే గనక పారిపోనారంభిస్తే, రోమనులు వారిని తరుముకు వస్తే వారిని కాపాడడం ఎంతో కష్టం మరి.

రెండో రోజు పొద్దు పొడవగానే, ఆయన తన సేనాబలాన్ని, దాని రూపురేఖల్నీ మార్చిపారేశారు. దాన్ని కొత్త తరహాలో తీర్చిదిద్దారు. మొదటి వరుసను వెనుకటి వరుసలోనూ, వెనుకటి వరుసను ముందు వరుసలోనూ నియమించారు. అలాగే కుడి పార్శ్వాన్ని ఎడమ పార్శ్వంలోనికి, ఎడమ పార్శ్వాన్ని కుడి పార్శ్వం స్థానంలోనికి మార్చివేశారు. ఇది చూసిన శత్రువులు నివ్వెరపోయారు. వారు పరస్పరం, "ముస్లిములకు సైనిక సహాయం అందింది" అని అనుకోనారం భించారు. ఎలాగైతేనేమి రోమనులు మొదట్లోనే ముస్లిములంటే భయపడ నారంభించారు. ఆ తరువాత రెండు సైన్యాలు ఢీకొనగా కొంతసేపు యుద్ధం జరిగింది. అప్పుడు ఖాలిద్ తన సైన్యాన్ని ఓ

11. సహీహ్ బుఖారి-గజ్వయె మూతా మిన్ అర్దుష్షామ్ అధ్యాయం-2/611.

సురక్షిత ప్రదేశంలో ఉంచుతూ, ముస్లిములను కొంత వెనక్కు తగ్గమని ఆదేశించారు. ముస్లిములు అలా వెనక్కు తగ్గుతున్నప్పుడు రోమనులు, ముస్లిములు వారిని మోసగిస్తున్నారని, వారు ఎడారి యుద్ధానికి సంబంధించిన ఏదో ఒక ఎత్తుగడ వేస్తున్నారని భావించి ముస్లిములను తరమడం మానివేశారు. దీని ఫలితంగా శత్రువులు తిరిగి తమ ప్రాంతానికి వెళ్ళిపోయారు. ఇటు ముస్లిములు విజయ పతాకాన్ని ఎగురవేస్తూ సురక్షితంగా వెనకకు తగ్గి మదీనాకు వచ్చి చేరారు.[12]

ఇరుపక్షాలకు చెందిన హతుల సంఖ్య

ఈ యుద్ధంలో పన్నెండుగురు ముస్లిములు షహీద్ అయ్యారు. రోమను హతుల సంఖ్య ఎంతో తెలియరాలేదు. అయితే జరిగిన యుద్ధం తీరు గురించి తెలుసుకున్నదేమిటంటే, వారు పెద్ద సంఖ్యలోనే హతులై ఉండవచ్చు. కేవలం హజ్రత్ ఖాలిద్ (ర) గారి చేతిలోనే తొమ్మిది కరవాలాలు విరిగిపోతే హతులు, క్షతగాత్రుల సంఖ్య ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు.

ఈ యుద్ధ ప్రభావం

ఈ యుద్ధం కోసం ముస్లిములు ఏ కష్టాలను అనుభవించారో, ఆ కష్టాలకు తగినట్లుగా శత్రువుపై పగ తీర్చుకోలేకపోయినప్పటికీ, ఈ పోరాటం వలన ముస్లిముల భయం, వారి ప్రఖ్యాతి చాలా మటుకు పెరిగిపోయిందని చెప్పవచ్చు. దీనికి కారణం లేకపోలేదు. ఎందుకంటే, రోమనులు ప్రపంచంలో కెల్లా ఓ సూపర్ పవర్‌గా వెలుగొందుతున్న కాలమది. వారితో కయ్యం పెట్టుకోవడం ఆత్మహత్యాసదృశంగా తలచేవారు ఆనాటి అరబ్బులు. అందుకని మూడు వేల మంది గలిగిన ఓ చిన్న సైనిక దళం రెండు లక్షల ఓ భారీ సైన్యాన్ని ఢీకొని ఎలాంటి నష్టం వాటిల్లకుండా తిరిగిరావడం అరబ్బులందరినీ ఆశ్చర్యంలో ముంచేసింది. అప్పటి వరకు అరబ్బులకు ఎవరి గురించి అయితే తెలుసో, ముస్లిములు వారికంటే కూడా భిన్నమైనవారుగా, భిన్నమైన మనస్తత్వం గలవారుగా తెలియవచ్చింది. ముస్లిములు అల్లాహ్ ద్వారా

12. చూడండి, ఫత్‌హుల్ బారి-7/513, 514; జాదుల్ ముఆద్-2/156. యుద్ధం వివరాలు ఆధారాలతో సహా ఈ రెండు గ్రంథాల నుండి గ్రహించడం జరిగింది.

సహాయం పొందారని, వారి నాయకుడు నిజంగానే ఓ ప్రవక్త అని తెలిసి వచ్చింది వారికి. ముస్లిములతో ఎడతెగకుండా పోరుసలిపే మంకుపట్టుగల ఏ అరబ్బు ఆటవిక తెగలైతే ఉన్నాయో అవన్నీ ఈ పోరాటం తరువాత ఇస్లామ్ ధర్మం వైపునకు మొగ్గు చూపనారంభించాయి. బనూ సులైమ్, అష్జ, గత్ఫాన్, జీబాన్ మరియు ఫరాజా తెగలన్నీ ఆ తరువాతనే ఇస్లామ్ ఛత్రఛాయల్లోనికి వచ్చేశాయి.

రోమనులతో జరిగిన ఈ రక్తపాత సహిత పోరాటం, భవిష్యత్తులో రోమను సామ్రాజ్య దేశాలపై విజయ దుందుభులు మ్రోగించడానికి, సుదూర తీరాల వరకు ముస్లిముల అధికారం బలపడడానికి కారణభూతం అయింది.

సరియ్యా జాతుస్సలాసిల్

మూతా పోరాటం సందర్భంగా సిరియాలో నివసించే అరబ్బు తెగలు ముస్లిములతో యుద్ధం చేయడానికిగాను రోమనుల పతాకం క్రిందికి వచ్చారన్న విషయం తెలిసిన మహాప్రవక్త (స)కు, ఆ అరబ్బు తెగలకు, రోమనులకు నడుమ చీలిక తెచ్చి వారు తిరిగి ముస్లిములకు వ్యతిరేకంగా అంత పెద్ద సైన్యాన్ని కూడగట్టకుండా ఉంచడానికిగాను ఓ వ్యూహాన్ని పన్నవలసి ఉందనే తలంపు కలిగింది.

దీని కోసమని ఆయన (స) హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర)ను ఎంపిక చేశారు. కారణం, ఆయన నాయనమ్మ బలీ తెగకు చెందినది కావడం. మూతా యుద్ధం తరువాత, అంటే జమాదిల్ ఉఖ్రా నెల హి.శ. 8లో వారిని మార్చ డానికిగాను హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర)ను అక్కడికి పంపించడం జరిగింది. ఈలోపు వేగులవారు, బనూ ఖుజాఅ తెగవారు మదీనా పరిసరాలపై దాడి చేయడానికి మనుషుల్ని సమీకరిస్తున్నారనే వార్తను అందించినట్లుగా చెప్పుకోవడం జరుగుతోంది. కాబట్టి ఆయన (స) హజ్రత్ అమ్రూ బిన్ ఆస్(ర)ను అటు వైపునకు పంపించి ఉండవచ్చు. బహుశా ఈ రెండు కారణాలు కూడా ఆయన్ను పంపించడానికి పురికొల్పి ఉండవచ్చు.

మొత్తానికి, దైవప్రవక్త (స), అమ్రూ బిన్ ఆస్(ర) కోసం శ్వేత పతాకాన్ని కట్టి, దానికి తోడు నల్ల జెండాలను కూడా ఇచ్చారు. ఆయన నేతృత్వంలో అన్సారులకు చెందిన ప్రముఖులు మూడొందల మంది ఉన్నారు. వారి

వెంట ముప్ఫై గుర్రాలు కూడా ఉన్నాయి. వెళ్ళేటప్పుడు మహాప్రవక్త (స) ఆయన్ను ఆదేశిస్తూ, బలీ, ఇజ్రా, బల్కీన్ తెగలకు చెందినవారితో కలిసి వారి సహాయ సహకారాలను కోరాలని చెప్పారు. వారంతా రాత్రి పూట ప్రయాణిస్తూ పగలు దాగి ఉండేవారు. చివరికి శత్రు సైన్యం వరకు చేరగా అది సంఖ్యాపరంగా పెద్ద సైనిక పటాలం అని తెలిసింది. అందుకని ఆయన హజ్రత్ రాఫె బిన్ ముకీస్ జుహ్నీని మరింత సైనిక సహాయం అందించమని దైవప్రవక్త (స) సన్నిధికి పంపించారు. మహాప్రవక్త (స) హజ్రత్ అబూ ఉబైదా (ర) బిన్ జర్రాహ్‌కు జెండా ఇచ్చి ఆయన నేతృత్వంలో మరి రెండొందల మంది సైనికులనిచ్చి పంపించడం జరిగింది. ఆ సైన్యంలో ముహాజిర్ ప్రముఖులు- అబూ బక్ర్(ర) మరియు ఉమర్(ర)లు- అన్సారు సర్దారులు కూడా ఉన్నారు. అబూ ఉబైదాకు, అమ్రూ బిన్ ఆస్ (ర)ను కలుసుకొని ఇద్దరు కలసి కార్యాన్ని సాధించుకురమ్మని, విభేదాలు సృష్టించుకోవద్దని చెప్పి పంపించారు. అక్కడికి వెళ్ళిన హజ్రత్ అబూ ఉబైదా (ర) నమాజుకు ఇమామత్ చేయబోగా హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర), "మీరు నా వద్దకు మద్దతుగా వచ్చిన వారు, నేను అమీరును (నాయకుణ్ణి)" అనగా అబూ ఉబైదా (ర) ఆయన మాటలను స్వీకరించారు. నమాజు హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర) గారే చేయిస్తూ ఉండేవారు.

సహాయం అందగానే ఈ సైన్యం మరికొంత ముందుకు నడిచి 'ఖజా' అనే ప్రాంతానికి చేరుకుంది. ఆ ప్రాంతాన్ని దాటి చాలా దూరం వరకు వెళ్ళిపోయింది. చివరకు అక్కడ శత్రు సైన్యం ఎదురైంది. ముస్లిములు ఆ సైన్యంపై దాడిచేయగా అది పారిపోయి తలదాచుకోవలసివచ్చింది.

అనంతరం అవుఫ్ బిన్ మాలిక్ అష్జయీ (ర)ను దూతగా చేసి దైవప్రవక్త (స) సన్నిధికి పంపించారు. ఆయన ముస్లిములు తిరుగుముఖం పట్టి క్షేమంగా వస్తున్నారని, ఆ పోరాటం ఎలా జరిగిందో ఆ వివరాలన్నీ మహాప్రవక్త (స)కు పూస గ్రుచ్చినట్లు విశదీకరించారు.

జాతుస్సలాసిల్, వాదియిల్ ఖుర్అ అవల ఉన్న ఓ భూభాగం పేరు. ఇక్కడి నుండి మదీనా పది రోజుల ప్రయాణ దూరంలో ఉంది. ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, ముస్లిములు జిజామ్ తెగకు చెందిన ప్రాంతంలోని ఓ

ఊటబావి దగ్గర విడిది చేశారు కాబట్టి ఆ సైనిక చర్య పేరు జాతుస్సలాసిల్‌గా పడిపోయింది.[13]

సరియ్యా ఖిజ్రా (షాబాన్ నెల, హి.శ. 8)

ఈ సరియ్యాను పంపించడానికి గల కారణం, మహారిబ్ తెగ ప్రాంతంలో ఖిజ్రా పేరుగల ఓ ప్రదేశంలో బనూ గత్ఫాన్ సైన్యాన్ని సమీకరిస్తున్నారనే వార్త అందడమే. దాన్ని అణచడానికి మహాప్రవక్త (స), హజ్రత్ అబూ ఖతాదా (ర)గారికి పదిహేనుగురు మనుషులనిచ్చి అక్కడికి పంపించారు. వారు శత్రువుకు చెందిన అనేకుల్ని హతమార్చారు. చాలా మందిని బందీలుగా చేసి విజయ ధనంతో తిరిగి వచ్చారు. ఈ సైనిక చర్య సందర్భంగా వారు మదినాకు వెలుపల పదిహేను రోజులు గడపవలసివచ్చింది.[14]

13. చూడండి, ఇబ్నె హిషామ్ -2/623-626; జాదుల్ ముఆద్-2/157
14. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/233; తల్ఖీహుల్ ఫహూమ్- పుట.33

మక్కా విజయం

ఇమామె ఇబ్నె ఖైమ్ తన గ్రంథం జాదుల్ ముఆద్‌లో ఈ విజయం గురించి ఇలా రాస్తున్నారు.

“మక్కా విజయం ఓ ఘనమైన విజయం. అల్లాహ్ దీని ద్వారా తన ధర్మానికీ, తన ప్రవక్త (స)కూ, తన సైన్యానికీ, అమానతుదారు అయిన తన వర్గానికి శాశ్వత గౌరవాన్ని ప్రసాదించిన ఘన విజయం. తన నగరాన్ని, ప్రపంచ ప్రజలకు మార్గదర్శకమైన తన గృహాన్ని, దైవ తిరస్కారులు, ముష్రిక్కుల నుండి అల్లాహ్ ముక్తిని ప్రసాదించిన విజయమది. ఈ విజయం వల్ల ఆకాశ వాసులు ఆనందడోలికలలో ఓలలాడారు. దాని గౌరవం ఆకాశాన్నంటింది. ఈ విజయం కారణంగానే ప్రజలు అల్లాహ్ ధర్మంలో గుంపులు గుంపులుగా ప్రవేశించారు. భూపటలం అంతా ఆనందంతో వెల్లివిరిసింది.[1]

ఈ గజ్వాకు దారితీసిన కారణాలు

సులే హుదైబియా (హుదైబియా ఒప్పందం) జరిగినప్పుడు ఆ ఒప్పందంలోని ఓ షరతు ప్రకారం, ఎవరైతే ముహమ్మద్ (స)గారితో మైత్రి చేసుకోదలుస్తారో వారు ఆయనతో మైత్రీ సంబంధాలు పెట్టుకోవచ్చని, అలాగే ఎవరైతే ఖురైషులతో కలసి ఉండేందుకు సిద్ధపడతారో, వారు ఖురైషులతోనే ఉండవచ్చు. అలాగే ఏ తెగ అయితే వాటిలో ఏ పక్షం వైపు ఉంటుందో అది ఆ పక్షంగానే గుర్తించబడుతుంది. కాబట్టి ఏ తెగ అయినా దౌర్జన్యానికి బలి అయితే ఆ దౌర్జన్యం ఆ పక్షంపై జరిగినట్లుగానే భావించబడుతుంది అన్నది మనం చదువుకున్న విషయమే.

ఈ షరతుకు లోబడి బనూ ఖుజాఅ తెగ దైవప్రవక్త (స) పక్షాన, బనూ బక్ర్ ఖురైష్ పక్షాన చేరిపోయాయి. అలా ఈ రెండు తెగలు కూడా ఒకదాని పీడనకు మరొకటి బలి కాకుండా ప్రశాంతంగా ఉంటున్నాయి. కాని ఈ

1. జాదుల్ ముఆద్

రెండు తెగల్లోనూ అజ్ఞాన కాలం నుండే శత్రుత్వం, సంఘర్షణలు బాగా వ్రేళ్ళూనుకొని ఉన్నందున, ఆ ఒప్పందం జరిగిన తరువాత ఈ ప్రశాంత వాతావరణ అవకాశాన్ని ఆసరాగా తీసుకొని బనూబక్ర్, బనూ ఖుజాఅతో పాత పగతీర్చుకోడానికి పూనుకున్నారు. 'నౌఫిల్ బిన్ ముఆవియా వేలీ' అనే వ్యక్తి బనూ బక్ర్‌కు చెందిన ఓ వర్గాన్ని వెంట బెట్టుకొని షాబాన్ నెల హి.శ. 8లో రాత్రి సమయంలో 'బనూ ఖుజాఅ'పై దాడి చేశాడు. ఆ సమయంలో బనూ ఖుజాఅ 'వతీర్' అనే ఒయాసిస్సు వద్ద గుడారాలు వేసుకొని ఉన్నారు. బనూ ఖుజాఅకు చెందిన అనేకమంది హతులయ్యారు. ఇటు ఖురైష్ వారు ఈ దాడిలో బనూ బక్ర్‌కు ఆయుధాలిచ్చి సహాయపడడమే కాకుండా చీకటిని ఆసరాగా చేసుకొని వారు కూడా ఆ పోరాటంలో పాల్గొన్నారు. ఎలాగైతేనేమి, దాడి చేసిన వారు బనూ ఖుజాఅను ఓడించడం వలన వారు దైవగృహానికి వచ్చి చేరారు. హరమ్ (దైవగృహం)లోనికి చేరిన బనూ బక్ర్ నౌఫిల్‌తో, "ఓ నౌఫిల్! మనమిప్పుడు హరమ్‌లోనికి వచ్చేశాము. ఇది మీ ఆరాధ్య దైవగృహం" అన్నారు. దానికి నౌఫిల్ జవాబిస్తూ, "బనూ బక్ర్! నేడు ఏ దేవుడూ లేడు. కావాలంటే పగ తీర్చుకోండి. నా అనుభవం సాక్షి! మీరు దైవగృహంలో దొంగతనం చేస్తూ ఉండేవాళ్ళు కదా? మరి మీ పగను తీర్చుకోలేరా?" అని ప్రశ్నించాడు.

ఇటు బనూ ఖుజాఅ మక్కా చేరి, 'బుదైల్ బిన్ వర్కా ఖుజాయి' మరియు వారిచే స్వాతంత్ర్యం పొందిన బానిస రాఫె ఇండ్లల్లో రక్షణ పొందారు. అమ్రూ బిన్ సాలిమ్ ఖుజాయీ హుటాహుటిన మదీనాకు బయలుదేరి దైవప్రవక్త (స) వద్దకు వచ్చి నిలబడ్డారు. అప్పుడు మహాప్రవక్త (స) మస్జిదె నబవీలో సహాబా (ర) మధ్యన కూర్చుని ఉన్నారు. రాగానే అమ్రూ బిన్ సాలిమ్ పద్యరూపంలో తన గోడును ఇలా చెప్పనారంభించారు. ఆ పద్యాల భావం ఇలా ఉంది:

"ఓ ప్రభూ! నేను ముహమ్మద్ (స) మరి ఆయన తండ్రి గారితో చేసుకున్న ఒప్పందం సాక్షి[2] చెబుతున్నాను. మీరంతా మా సంతానం. మేము

2. బనూ ఖుజాఅ మరియు బనూ హాషిమ్ నడుమ అబ్దుల్ ముత్తలిబ్ కాలం నుండి కొనసాగుతూ వస్తున్న ఒప్పందం. దీని వివరాలు ఈ గ్రంథం ప్రారంభంలోనే చెప్పడం జరిగింది.

మిమ్మల్ని కన్నవారం.[3] ఆ తరువాత మేము మిమ్మల్ని విధేయించి ఎప్పుడూ వెనకాడలేదు. అల్లాహ్ మీకు మార్గం చూయించుగాక! మీరు మాకు గట్టి మద్దత్తునివ్వాలి. దైవదాసుల్ని పిలువండి, వారూ మా సాయానికి వస్తారు. దైవప్రవక్త (స) వారిలో ఉంటారు. ఆయుధధారులై పైకి వచ్చిన పున్నమి చంద్రునిలా అందంగా వచ్చి నిలుస్తారు, ఖురైషులు మీతో చేసుకున్న ఒప్పందాన్ని భంగపరిచారు. మీకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారు. వారు నా కోసం కిదాలో మాటువేశారు. నేను ఎవరినీ సాయానికి పిలువననే ఉద్దేశ్యంతో వచ్చారు వారు. వారు చాలా నీచమైనవారు. సంఖ్యలోను అతి అల్పులు. వారు 'వతీరా'లో మేము నమాజు చేస్తూ ఉండగా దాడి చేశారు. మమ్మల్ని హతమార్చారు."

ఇది విన్న మహాప్రవక్త (స), "ఓ అమ్రూ బిన్ సాలిమ్! పో! నీకు సహాయం అందింది" అని అన్నారు. ఆ తరువాత ఆకాశంలో ఓ మబ్బు తునక అగుపడగా, "ఈ మబ్బు తునక బనూ కఅబ్ సహాయ శుభవార్తనందిస్తోంది" అని అన్నారు.

ఆ తరువాత బుదైల్ బిన్ వర్కా ఖుజాయీ నేతృత్వంలో బనూ ఖుజాఅ చెందిన ఓ ప్రతినిధి వర్గం మదీనాకు వచ్చి దైవప్రవక్త (స)కు, ఎవరెవరు చంపబడిందీ, ఖురైష్, బనూ బక్ర్‌కు ఎలా సహాయం అందించింది పూసగ్రుచ్చినట్లు చెప్పి మక్కాకు వెళ్ళిపోయారు.

ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి అబూ సుఫ్యాన్ మదీనా రాక

ఖురైష్ మరియు దాని మిత్రపక్షాలు దేనికైతే పాల్పడ్డారో అది ఓ ప్రస్ఫుటమైన వాగ్దాన భంగం మరియు సంధి సూత్రాలను త్రెంచేసే కార్యం. అందుకని ఖురైషులు తాము చేసిన తప్పును గ్రహించి నాలుక కర్చుకున్నారు. వారు దీని విషయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఓ సలహా సంఘాన్ని నిర్వహించి తమ సర్దారు అయిన అబూ సుఫ్యాన్‌ను ఆ ఒప్పందాన్ని తిరిగి పునరుద్ధరించుకు రమ్మని మదీనాకు పంపించారు.

ఇటు మదీనాలో దైవప్రవక్త (స), సహాబాలందరినీ సమావేశపరచి, ఖురైషులు తాము చేసుకున్న ఒప్పందాన్ని భంగపర్చారు కాబట్టి ముందు

3. అబ్దె మునాఫ్ తల్లి బనూ ఖుజాఅ తెగకు చెందిన మహిళ. అందుకని దైవప్రవక్త వంశం బనూ ఖుజాఅ సంతానమే.

కార్యక్రమం ఏమిటో తెలియ చేస్తూ, "తిరిగి ఆ ఒప్పందాన్ని పునరుద్ధరించ డానికి, దాని గడువును పెంచడానికి అబూ సుఫ్యాన్ మీ దగ్గరకు వస్తున్న ట్లుగా నేను చూస్తున్నాను" అని అన్నారు.

అబూ సుఫ్యాన్ మక్కాలో జరిగిన తీర్మానం ప్రకారం బయలుదేరి గస్ఫాన్ అనే ప్రదేశానికి చేరాడు. అక్కడ అతనికి బుదైల్ బిన్ వర్కా ఎదు రయ్యాడు. ఆయన మదీనా నుండి తిరిగివస్తున్నాడు. బుదైల్ దైవప్రవక్త (స) వద్దకు వెళ్ళి వస్తున్నాడని గ్రహించి అబూ సుఫ్యాన్, "ఎక్కడి నుండి వస్తున్నావు?" అని అడిగాడు.

"నేను ఖుజాఅ వెంట ఆ సముద్ర తీరానికి, అక్కడి నుండి ఫలానా లోయకు వెళ్ళి వస్తున్నాను" అన్నాడు బుదైల్.

"నీవు ముహమ్మద్ (స) దగ్గరకు వెళ్ళలేదా?" రెట్టించాడు అబూ సుఫ్యాన్.

"లేదు" జవాబిచ్చాడు బుదైల్.

కాని బుదైల్ మక్కా వైపునకు వెళ్ళిపోగానే అబూ సుఫ్యాన్‌కు అనుమానం వచ్చింది. అతనే గనక మదీనాకు వెళ్ళి ఉంటే తన ఒంటెకు గింజలు గల దాణా పెట్టి ఉండాలి అని అనుకొని వెనక్కు వెళ్ళి బుదైల్ తన ఒంటెను కట్టేసిన చోటికి వెళ్ళి చూశాడు. ఒంటె పెంటికలను త్రుంచి చూడగా వాటిలో ఖర్జూరపు విత్తనం అగుపడింది. అప్పుడు అబూ సుఫ్యాన్, "దైవసాక్షి! బుదైల్ తప్పకుండా ముహమ్మద్ (స)దగ్గరకు వెళ్ళ వస్తున్నాడని" గొణిగాడు.

మొత్తానికి అబూ సుఫ్యాన్ మదీనా చేరి తన కుమార్తె ఉమ్ముల్ మోమినీన్ (ముస్లిముల మాతృమూర్తి) హజ్రత్ ఉమ్మె హబీబా (ర) ఇంటికి వచ్చాడు. అతను దైవప్రవక్త (స) పడుకునే పడకపై కూర్చోబోగా ఆమె దాన్ని వెంటనే చుట్టి వేశారు. అది చూసిన అబూ సుఫ్యాన్, "అమ్మాయి! ఆ పడకపై నేను కూర్చోడానికి అర్హుణ్ణికానా?" అని అడిగాడు.

"ఇది దైవప్రవక్త (స) గారి పడక. ఓ అశుద్ధుడు, అపవిత్రుడైన ముష్రిక్ (బహుదైవారాధకుడు) కూర్చునే పడక కాదు" అని మొహమాటపడకుండా బదులిచ్చారు హజ్రత్ ఉమ్మె హబీబా (ర).

"ఓహో! నా తరువాత నీకు చెడే కలిగిందే" అంటూ అబూ సుఫ్యాన్ అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అతను దైవప్రవక్త (స)తో కలిసి మాట్లాడాడు. కాని మహాప్రవక్త (స) అతనికి ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదు.

పిమ్మట అతను హజ్రత్ అబూ బక్ర్ (ర) దగ్గరికి వెళ్ళి, ఆయన్ను మహాప్రవక్త (స)తో మట్లాడమని అడిగాడు. ఆయన అతనితో, నేను అలా చేయలేను అని అనగా, నేరుగా హజ్రత్ ఉమర్ (ర) గారి దగ్గరికి చేరాడు. ఆయన కూడా, నేను మీ గురించి దైవప్రవక్త (స)కు సిఫార్సు చేయాలా? విను! దైవసాక్షి! మరేది కాకపోయినా నాకు కేవలం ఓ కర్రముక్క లభించినా సరే మీతో జిహాద్ చేస్తూనే ఉంటాను అన్నారాయన. చివరగా అతను హజ్రత్ అలీ (ర) గారింటికి వెళ్ళాడు. అక్కడ హజ్రత్ ఫాతిమా (ర) కూడా ఉన్నారు. హజ్రత్ హసన్ ఇంకా చిన్న పిల్లవాడు. తల్లిదండ్రుల ముందు కూర్చుని ఆడుకుంటున్నారు.

"ఓ అలీ (ర)! నా వంశం, మీ వంశం ఒక్కటే. నేను ఓ పని ఉండి మదీనాకు వచ్చాను. మీరు నా గురించి ముహమ్మద్ (స)తో సిఫార్సు చేయరా?" అని అడిగాడు అబూ సుఫ్యాన్.

"అయ్యో! దైవప్రవక్త (స)గారి మాట మాటే. మేము ఈ విషయంలో జోక్యం చేసుకోబోము" అని బదులిచ్చారు హజ్రత్ అలీ (ర).

ఆ తరువాత అతను హజ్రత్ ఫాతిమా (ర) గారి వైపునకు తిరిగి, "మీరు మీ ఈ చిన్నారి కుమారుని ద్వారా మాకు రక్షణ కల్పించామన్న ప్రకటన చేయించండి. అలా చేస్తే ఆయన అరబ్బులకే సర్దారు అయి పోగలడు" అని అడిగాడు.

"దైవసాక్షి! నా కుమారుడు మీకు రక్షణ ఇచ్చాననేటంతటి హోదాకు చేరలేదు. దైవప్రవక్త (స) తప్ప మరెవ్వరూ మీకు రక్షణను కల్పించలేరు" అన్నారు హజ్రత్ ఫాతిమా (ర).

తన ప్రయత్నాల్లో విఫలమైన తరువాత అబూ సుఫ్యాన్‌కు ప్రపంచమే అంధకారంగా అగుపడసాగింది. అతను హజ్రత్ అలీ (ర) గారితో నిరాశగా,

"అబుల్ హసన్! పరిస్థితులు విషమించిపోతున్నాయన్న విషయాన్ని నేను గమనిస్తున్నాను. మీరే నాకు ఏదైనా మార్గం చూపించాలి" అని వేడు కున్నాడు.

"దైవసాక్షి! నీ ఈ వ్యవహారంలో నీకు మేలు జరిగేది ఏదీ లేదు. అయితే నీవు బనూ కనానా సర్దారువి. కనుక ప్రజల్లో నిలబడి శాంతి ఒప్పందాన్ని పునరుద్ధరిస్తున్నానహో! అంటూ బహిరంగంగా ప్రకటించి మక్కాకు వెళ్ళిపో" అన్నారు హజ్రత్ అలి (ర).

"ఇలా ప్రకటించడం మేలు కలిగించగలదంటారా?" అడిగాడు అబూ సుఫ్యాన్.

"దైవసాక్షి! అది ప్రయోజనాన్ని కలిగిస్తుందని నేనైతే అనుకోనుగాని, అంతకంటే మార్గం మరొకటి లేదు కదా?" అన్నాడు అలీ (ర).

ఆ తరువాత అబూ సుఫ్యాన్ మస్జిద్‌లో నిలబడి, "ప్రజలారా! నేను మీ నడుమ ఒడంబడిక పునరుద్ధరించబడిందని ప్రకటిస్తున్నాను" అని ప్రకటించి ఒంటెనెక్కి మక్కాకు వెళ్ళిపోయాడు.

ఖురైషుల వద్దకు వెళ్ళిన అబూ సుఫ్యాన్‌ను వారు, ఏం జరిగింది అని అడిగారు.

"నేను ముహమ్మద్ (స) దగ్గరకు వెళ్ళాను. ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. ఆ తరువాత అబూ ఖహాఫా కుమారుని వద్దకు వెళ్ళగా అతనూ నాకు ఎలాంటి సహాయమూ చేయలేదు. తరువాత నేను ఉమర్ (ర) దగ్గరకు వెళ్ళగా అతను మన పట్ల బాగా శత్రుత్వం వహించి ఉన్నాడన్న విషయం తెలిసింది. హజ్రత్ అలీ (ర) దగ్గరకు వెళ్ళగా ఆయనలో కొంత మెత్తదనాన్ని గమనించాను. అయితే ఆయన ఇచ్చిన సలహా ప్రయోజనాన్ని ఇస్తుందో లేదో తెలియదు.

"ఆ సలహా ఏమిటీ?" అని అడిగారు ఖురైషులు.

"ప్రజల్లో నిలబడి ఒడంబడిక పునరుద్ధరించబడిందని ప్రకటన చేయమన్నదే ఆయన సలహా. నేను ఆయన చెప్పినట్లే నిలబడి ప్రకటించి వస్తున్నాను" అన్నాడు అబూ సుఫ్యాన్.

"మరైతే నీ ఈ ప్రకటన అమలవుతుందని ముహమ్మద్ (స) అన్నారా?" అడిగారు ఖురైషులు.

"లేదు" సమాధానమిచ్చాడు అబూ సుఫ్యాన్.

"నీవు నాశనం కాను! ఆ వ్యక్తి (అలి-ర) నిన్ను ఆటపట్టించడానికే అలా అన్నాడు" అన్నారు ఖురైషులు.

"కానీయండి! అంతకంటే నేను మరేదీ చేయలేని పరిస్థితి అది" బదులిచ్చాడు అబూ సుఫ్యాన్.

గజ్వా (పోరాటం) కోసం సిద్ధపడడం- దాన్ని రహస్యంగా ఉంచే ప్రయత్నం చేయడం

తిబ్రానీ ఉల్లేఖనంలో, ఒడంబడిక భంగం అయిన వార్త రావడానికి మూడు రోజుల ముందే దైవప్రవక్త (స), హజ్రత్ ఆయిషా (ర)కు ప్రయాణ సన్నాహాలు చేయమని, దాన్ని రహస్యంగా ఉంచమని ఆదేశం ఇచ్చినట్లు ఉంది. ఆ తరువాత ఆయిషా (ర)గారి దగ్గరికి ఆమె తండ్రి హజ్రత్ అబూ బక్ర్(ర) వచ్చారు. ఆమె ప్రయాణ సన్నాహాలు చేయటాన్ని చూసి, "అమ్మా! ఏమిటీ ఈ సన్నాహాలు?" అని అడిగారు.

"నాన్నగారూ! నాకైతే ఏమీ తెలియదు" అన్నారు హజ్రత్ ఆయిషా(ర).

"బనూ అజ్గర్ (అంటే రోమనులు)తో యుద్ధం చేసే సమయం రాలేదే? మరి దైవప్రవక్త (స) ఎటు వెళ్ళాలని ఈ సన్నాహాలు చేయిస్తున్నారు?" అని సంశయాన్ని వెలిబుచ్చారు అబూ బక్ర్ (ర).

"నాకు తెలియదు" అని జవాబిచ్చారు హజ్రత్ ఆయిషా (ర).

తండ్రీ కుమార్తెల్లో ఈ సంభాషణ జరిగిన మూడు రోజుల తరువాత ఉదయాన్నే అమ్రూ బిన్ సాలిమ్ తన నలభై మంది ఉష్ట్రారోహులతో రావడం, ఒప్పందం భంగం జరిగిన విషయం చెప్పడం వగైరా అంతా జరిగిపోయాయి. ఆ తరువాత బుదైల్ రావడం, ఆ పిదప అబూ సుఫ్యాన్ వచ్చి ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి చేసిన ప్రయత్నం వల్ల అందరికీ ఈ విషయం తెలిసి పోయింది.

ఆ తరువాత మహాప్రవక్త (స) మక్కాపై దండయాత్ర చేయడానికి సహాబా (ర)కు ఆదేశమిచ్చి అల్లాహ్‌ను ఇలా వేడుకున్నారు.

"ఓ అల్లాహ్! మేము ఆ ప్రాంతంలోనికి వెళ్ళి వారిపై విరుచుకుబడేంత వరకు వారి వేగులవారిని, వార్తాహరుల్ని అడ్డుకో."

ఎంతో రహస్యంగా, ఎవరికీ తెలియకుండా మహాప్రవక్త (స) రమజాన్ నెల ఆరంభ దినాల్లో (హి.శ. 8) హజ్రత్ అబూ ఖతాదా బిన్ రబీ నేతృత్వంలో

ఎనిమిది మందితో కూడిన ఓ సైనిక పటాలాన్ని 'సరియ్యాయె బత్న్' వైపునకు పంపించారు. ఈ ప్రదేశం 'జిల్ మర్వా'కు నడుమ మదీనాకు 36 అరబిక్ మైళ్ళ దూరంలో ఉంది. దీని ఉద్దేశ్యం, చూసేవారికి దైవప్రవక్త (స) అటు వైపు వెడుతున్నారని తెలియాలని, ఆ వార్తలు ఖురైషులకు చేరాలన్నదే. కాని అది తన గమ్యస్థానం చేరగా, దైవప్రవక్త (స) మక్కా వైపునకు బయలుదేరారని తెలిసి వారు కూడా మక్కా వైపునకు బయలుదేరారు.[4]

ఇటు హాతిబ్ బిన్ అబీ బల్తఆ (ర), ఖురైషులకు ఓ లేఖ రాసి, దైవప్రవక్త(స) దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్న విషయం తెలియజేయడం జరిగింది. ఆయన ఆ లేఖను ఓ మహిళకు ఇచ్చి పంపించారు. దాన్ని ఖురైషుల వరకు చేరవేయడానికి ప్రతిఫలం కూడా ఖరారు చేసుకున్నారు. ఆ స్త్రీ ఆ లేఖను తన జుట్టు ముడిలో భద్రంగా ఉంచుకొని బయలుదేరింది. కాని మహాప్రవక్త (స)కు హాతిబ్ చేసిన ఈ నిర్వాకం గురించి దైవవాణి ద్వారా తెలియజేయబడింది. ఆయన (స) హజ్రత్ అలి (ర), హజ్రత్ మెగ్దాద్ (ర), హజ్రత్ జుబైర్(ర), హజ్రత్ అబూ మర్సిద్ గనవి (ర)లను రౌజయె ఖాఖ్ ప్రదేశానికి వెళ్ళండి. అక్కడ మీకు అంబారీలో కూర్చుని ఉన్న ఓ స్త్రీ కనబడు తుంది. ఆమె వద్ద ఖురైషుల పేరున ఉన్న ఓ లేఖ ఉంది అని చెప్పారు. వీరందరూ గుర్రాలను అటు వైపునకు దౌడు తీయించారు. అక్కడకు చేరగా ఆ స్త్రీ వారికి అగుపడింది. వారు ఆమెను క్రిందికి దిగి రమ్మని ఆదేశించారు. ఆమె క్రిందికి రాగానే, "నీవద్ద ఏదైనా లేఖ ఉందా?"

4. *ఈ సరియ్యా అక్కడకు వెళ్ళగా ఆమిర్ బిన్ అజ్బత్ ఎదురై వారికి ఇస్లామీయ విధానం ప్రకారం సలామ్ చేశాడు. కాని ముహ్లిమ్ బిన్ జసామా ఏదో పాత కక్షల కారణంగా అతణ్ణి సంహరించాడు. అతని ఒంటెలను, అతని సొత్తునంతటిని హస్తగతం చేసుకున్నాడు. దీని కోసం ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్ అవతరించింది. "ఎవరైనా నీకు సలామ్ చేస్తే, అతను మోమిన్ (విశ్వాసి) కాదు అని అనకు." ఆ తరువాత సహాబా, ముహ్లిమ్‌ను, అతని మన్నింపు కోసం దుఆ చేయమని దైవ ప్రవక్త (స)గారి సన్నిధికి తీసుకురాగా, ఆయన మూడుమార్లు, "ఓ అల్లాహ్! ముహ్లిమ్‌ను మన్నించకు" అన్నారు. ఆ తరువాత ముహ్లిమ్ తన చొక్కా అంచుతో తన కన్నీటిని తుడుచుకుంటూ లేచి వెళ్ళిపోయాడు. ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, ఆ తరువాత మహాప్రవక్త (స) అతని మన్నింపు కోసం దుఆ చేశారని అతని జాతి ప్రజలు చెప్పారు అని ఉంది. జాదుల్ ముఆద్-2/150; ఇబ్నె హష్షామ్-2/626, 627, 628.*

అని అడిగారు. "నా దగ్గర ఎలాంటి లేఖా లేదు" అని ఆమె బొంకింది. వారు ఆమె కూర్చుని ప్రయాణం చేస్తున్న అంబారీని పూర్తిగా శోధించారు. అక్కడ వారికి ఏ లేఖా లభించలేదు. చివరకు హజ్రత్ అలి (ర) ఆమెతో, "నేను దైవంపై ప్రమాణం చేసి చెబుతున్నాను. మహాప్రవక్త (స)గాని, మేముగాని అసత్యం పలకటం లేదు, నీవు ఆ ఉత్తరాన్నయినా తీసి మాకు ఇచ్చెయ్యి లేదా మేము నిన్ను నగ్నంగా చేసి అయినా ఆ ఉత్తరాన్ని నీ నుండి హస్తగతం చేసుకుంటాము" అంటూ కొంత కఠినంగానే అడిగారు. ఆమె వీరి వాలకం చూసి, "సరే, మీరు మీ ముఖాలను అటు వైపునకు త్రిప్పుకోండి" అని చెప్పగా వారు అలాగే చేశారు. ఆమె తన జుట్టు ముడి విప్పి అందుండి ఆ లేఖను తీసి వారికి అందించింది. వీరు ఈ లేఖను తీసుకొని దైవప్రవక్త (స)గారి దగ్గరకు వచ్చారు. లేఖను విప్పి చదవగా అందులో "ఇది హాతిబ్ బిన్ బల్తఆ తరపున ఖురైషులకు రాసిన ఉత్తరం" అంటూ దైవప్రవక్త (స) మక్కాపై దండెత్తి వచ్చే విషయం అందులో పూసగ్రుచ్చినట్లుగా రాసి ఉంది.[5]

మహాప్రవక్త (స) హజ్రత్ హాతిబ్‌ను పిలిచి, "ఇదేమిటీ?" అని అడిగారు. దానికి ఆయన, "దైవప్రవక్తా! నా గురించి తమరు తొందరపాటుకు గురికాకూడదు. దైవసాక్షిగా చెబుతున్నాను. అల్లాహ్‌పై, ఆయన ప్రవక్త(స)పై నాకు విశ్వాసం ఉంది. నేను ధర్మభ్రష్టుణ్ణి కాలేదు, నాలో ఏ మార్పూ రాలేదు. నేను ఖురైషుల మనిషినీ కాదు. కాని వారితో ముడిపడి ఉండేవాడిని. నా భార్యాపిల్లలు అక్కడే ఉన్నారు. ఖురైషులతో నాకు ఎలాంటి బంధుత్వమూ

5. *సహీలీ కొందరు యుద్ధం గురించిన రాసే చరిత్రకారుల మాధ్యమంగా ఆ ఉత్తరం లోని సారాంశాన్ని ఇలా ఉల్లేఖించారు. అమ్మాబాద్ (తరువాతను). ఓ ఖురైష్ వర్గమా! దైవప్రవక్త (స) మీపైకి ఓ సేనావాహినిగొని వస్తున్నారు. ఆయన ఒక్కరే మీ దగ్గరకు వచ్చినా ఆయనకు అల్లాహ్ సహాయపడగలడు. ఆయనతో చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటాడు. కాబట్టి మీరు మీ గురించి ఆలోచించు కోండి. వస్సలాం.*
వాఖిదీ కథనం ప్రకారం, హజ్రత్ హాతిబ్, సుహైల్ బిన్ అమ్రూ, సుఫ్వాన్ బిన్ ఉమయ్యా, ఇక్రమాలకు రాసిన లేఖ ఇలా ఉంది.
"మహాప్రవక్త (స) ప్రజల్లో యుద్ధం గురించి ప్రకటన చేశారు. మీ వైపు తప్ప మరెవ్వరితోను యుద్ధానికి వెళుతున్నారని నేననుకోను. నేను కోరేదల్లా నేను చేసిన ఈ సహాయాన్ని మీరు మరువరనేదే." (ఫత్‌హుల్ బారి-7/521)

లేదు, వారు నా భార్యాపిల్లల్ని పరిరక్షించడానికి, దీనికి భిన్నంగా తమతో ఉన్న వారికి అక్కడ బంధువులు, మిత్రులు ఉన్నారు. వారి భార్యాపిల్లల క్షేమాన్ని వారు చూస్తున్నారక్కడ. అందుకని నేను వారికి ఏదో ఒక సహాయం చేసినందుకు వారు నా భార్యాపిల్లల బాగోగులు చూస్తారని ఆశించాను" అని విన్నవించుకున్నారు.

ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర), "దైవప్రవక్తా! ఇతని మెడను నరకడానికి నాకు అనుమతి ఇవ్వండి. ఇతను అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త (స)కూ ద్రోహం చేశాడు. ఇతను మునాఫిక్ అయిపోయాడు" అన్నారు కోపంగా.

దానికి మహాప్రవక్త (స), "చూడండి! ఇతను బద్ర్ యుద్ధంలో మనతో పాటే పాల్గొన్న వ్యక్తి. బహుశా బద్ర్ యుద్ధంలో పాల్గొన్న వారిని గురించి అల్లాహ్, "మీరు ఏమి చేసినా మిమ్మల్ని క్షమించను అని ఉండవచ్చు కదా?" అన్నారు.

దైవప్రవక్త (స) నోట ఈ మాటలు వెలువడగానే హజ్రత్ ఉమర్ (ర) కళ్ళు చెమ్మగిల్లాయి. ఆయన, "దైవప్రవక్తా! ఇది తమకూ, అల్లాహ్‌కే బాగా తెలిసిన విషయం"[6] అని అక్కడి నుండి వెళ్ళిపోయారు.

ఇలా అల్లాహ్ వేగులవారి ఎత్తుగడల్ని అడ్డుకొన్నాడు. ముస్లిముల యుద్ధసన్నాహాలు ఏమాత్రం ఖురైషులకు చేరలేకపోయాయి.

మక్కా వైపునకు తరలివెళ్ళిన ఇస్లామీయ సైన్యం

రమజాన్ నెల 10వ తారీఖు (హి.శ.8)న మహాప్రవక్త (స) మదీనాను వదిలి మక్కా వైపునకు బయలుదేరారు. ఆయన (స) వెంట పది వేల మంది సహాబాలు (ర) ఉన్నారప్పుడు. మదీనాను సంరక్షించడానికి అబూ అర్హమ్ గిఫ్ఫారీ (ర)ను నియమించడం జరిగింది.

'హజ్ఫా' లేదా ఇంకొంత దూరం వెళ్ళాక దైవప్రవక్త (స)కు ఆయనగారి పినతండ్రి హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వచ్చి కలిశారు. ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి తన భార్యాపిల్లలతో సహా హిజ్రత్ చేసి మదీనాకు బయలు దేరారాయన. 'అబ్వా' అనే ప్రదేశంలో తమ పినతండ్రి కుమారుడు అబూ సుఫ్‌యాన్ బిన్ హారిస్ మరియు మేనత్త కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ ఉమయ్యా వచ్చి కలిశారు. మహాప్రవక్త (స) వారిద్దరిని చూసి ముఖం త్రిప్పు

6. సహీ బుఖారి-1/422; 2/612.

కున్నారు. ఎందుకంటే వారు దైవప్రవక్త (స)ను తీవ్రమైన హింసలకు గురిచేసినవారు. ఈ పరిస్థితిని చూసి హజ్రత్ ఉమ్మె సల్మా (ర), "దైవప్రవక్తా! మీ పినతండ్రి కుమారుడు, మీ మేనత్త కుమారుడు మీ దృష్టిలో అంత దురదృష్టవంతులు, దుష్టులుగా ఉండకూడదు" అని అన్నారు. ఇటు హజ్రత్ అలి (ర), అబూ సుఫ్‌యాన్ బిన్ హారిస్‌కు, "నీవు మహాప్రవక్త (స)గారి ఎదుటకు వెడితే నీవు చెప్పవలసిందల్లా హజ్రత్ యూసుఫ్ (అ) గారి సోదరులు హజ్రత్ యూసుఫ్‌తో అన్న మాటలు. **"అల్లాహ్ తోడు! అల్లాహ్ మాకంటే నీకు ఎక్కువ ఔన్నత్యాన్ని ప్రసాదించాడు"** (12-91) అని పలకాలి. ఎందుకంటే ఇంతకంటే మంచి సమాధానాన్ని ఆయన (స) ఒప్పుకోరు సుమా" అన్నారు. అబూ సుఫ్‌యాన్ బిన్ హారిస్ వెంటనే ఆ పదాలను పలకగా దైవప్రవక్త (స) ఇలా అన్నారు. **"ఈ రోజు మిమ్మల్ని నిందించడం జరగదు. అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక! ఆయన అందరికంటే అధికంగా కరుణించేవాడు."** (12-92)

ఇది విని అబూ సుఫ్‌యాన్ సంబరపడిపోతూ కొన్ని పద్యపాదాలను చదివాడు. వాటి భావం ఇలా ఉంది:

"నీ వయస్సు సాక్షి! లాత్ దేవుని సైన్యం ముహమ్మద్ సైన్యాన్ని జయిస్తుంది అనే ఉద్దేశ్యంతో నేను జెండా ఎత్తుకున్నప్పుడు నా పరిస్థితి అగమ్యగోచరంగా చీకటిలో కొట్టుమిట్టాడే ఆ బాటసారిలా మారిపోయింది. కాని నాకు సన్మార్గం లభించే సమయం ఆసన్నమైనందున నేను మార్గదర్శకత్వం పొందుతున్నాను. నా మనోవాంఛలకు బదులు నాకు ఓ మార్గదర్శకుడు మార్గాన్ని చూపెడుతున్నాడు. అది అల్లాహ్ వైపునకు పురోగమించే మార్గం. ఈ మార్గదర్శకుణ్ణి క్రితం నేను ప్రతి సందర్భంలోను చీదరించుకునేవాణ్ణి."

ఇది విన్న దైవప్రవక్త (స) అతని వక్షస్థలంపై కొడుతూ, "అవును, నీవు నన్ను అన్ని సందర్భాల్లోనూ చీదరించుకున్నావు"[7] అన్నారు.

7. ఆ సంఘటన తరువాత అబూ సుఫ్‌యాన్ బిన్ హారిస్‌లో మంచి మార్పు వచ్చేసింది. సిగ్గు వల్ల మహాప్రవక్త (స) వైపునకు కన్నెత్తయినా చూళ్ళేదాయన. దైవప్రవక్త (స) కూడా ఆయన ఎడల ప్రేమగా మెలిగేవారు. ఆయనకు స్వర్గం లభిస్తుందనే శుభవార్త కూడా అందించేవారు. ఇంకా ఇలా అనేవారు, "ఈయన హజ్రత్ హమ్‌జా (ర) గారికి ప్రత్యామ్నాయం అవుతాడు" అని. అబూ సుఫ్‌యాన్ మరణ సమయం ఆసన్నమైనప్పుడు ఆయన, "నా గురించి ఏడవకండి ఇస్లామ్ స్వీకరిం చిన తరువాత నేను ఎలాంటి చెడు మాటను నా నోట వెలువరించలేదు." (జాదుల్ మఆద్-2/162, 163.)

మర్రజ్జహ్రాన్‌లో ఇస్లామీయ సైన్యం

మహాప్రవక్త (స) తమ ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఆయన (స) మరియు ఆయన అనుచరులంతా రోజా పాటిస్తున్నారు. కాని 'అస్ఫాన్' మరియు 'ఖుదైద్' నడుమ గల 'కదీర్' పేరుగల ఊట బావికి చేరగానే ఆయన తన ఉపవాస వ్రతాన్ని భంగపరిచారు.[8] అది చూసిన ఆయన సహచరులంతా రోజాను భంగపరిచారు. ఆ తరువాత ప్రయాణం కొనసాగిస్తూ రాత్రి మొదటి ఝాము మర్రజ్జహ్రాన్- వాదియె ఫాతిమా- చేరి అక్కడ విడిది చేశారు. అక్కడకు చేరి వేరువేరుగా అగ్నిని రాజేయమని ఆదేశించగా వారంతా ఆయన ఆదేశాన్ని శిరసావహించి విశాల మైదానంలో దూరదూరాల వరకు తమ వంట పొయ్యిలను రాజేశారు. దైవప్రవక్త (స) హజ్రత్ ఉమర్ (ర)ను పహరాదారునిగా నియమించారు ఆ సమయంలో.

అబూ సుఫ్‌యాన్ దైవప్రవక్త (స) సన్నిధిలోనికి

మర్రజ్జహ్రాన్‌లో విడిది చేసిన తరువాత హజ్రత్ అబ్బాస్ (ర) దైవప్రవక్త (స) గారి తెల్ల కంచర గాడిదనెక్కి బయలుదేరారు. కట్టెలు కొట్టేవాడెవడైనా కనబడితే ఈ వార్తను ఖురైషులకు అందించాలన్నదే ఆయన ధ్యేయం. దైవప్రవక్త (స) మక్కాలో ప్రవేశిస్తున్నారనే విషయాన్ని తెలుసుకొని ఎవరైనా వచ్చి ఆయన శరణు వేడుకుంటారేమో అనేదే ఆయన కోరుకున్న విషయం.

ఇటు అల్లాహ్ ఖురైషులకు ఏ వార్తా తెలియకుండా అడ్డుకొని ఉన్నాడు. అందుకని వారికి పరిస్థితులను గురించి ఎలాంటి అవగాహనా లేదు. అయితే వారు భయం వల్ల సతమతమవుతూనే ఉన్నారు. అబూ సుఫ్‌యాన్ బయటకు వెళ్ళి వార్తలను సేకరిస్తూనే ఉన్నాడు. ఆ సమయంలోనే అబూ సుఫ్‌యాన్, బుదైల్ బిన్ వర్కా, హకీమ్ బిన్ హిజామ్ ముగ్గురూ కలిసి వార్తలు సేకరించే ఉద్దేశ్యంతో మక్కా నగరాన్ని విడిచి బయటకు వచ్చారు.

శుభవార్త కూడా అందించేవారు. ఇంకా ఇలా అనేవారు, "ఈయన హజ్రత్ హమ్‌జా (ర) గారికి ప్రత్యామ్నాయం అవుతాడు" అని. అబూ సుఫ్‌యాన్ మరణ సమయం ఆసన్నమైనప్పుడు ఆయన, "నా గురించి ఏడవకండి, ఇస్లామ్ స్వీకరించిన తరు వాత నేను ఎలాంటి చెడు మాటను నా నోట వెలువరించ లేదు." (జాదుల్ మఆద్-2/162, 163)

8. సహీ బుఖారి-2/613

హజ్రత్ అబ్బాస్(ర) గారి ఉల్లేఖనం ఇలా ఉంది ఈ విషయంలో:

"దైవసాక్షి! నేను దైవప్రవక్త (స) గారి కంచర గాడిదనెక్కి వెడుతూ ఉండగా అబూ సుఫ్‌యాన్ మరియు బుదైల్ బిన్ వర్కా నడుమ జరుగుతున్న సంభాషణను విన్నాను. వారు పరస్పరం ఒకరి మాటలను మరొకరు ఖండించుకుంటున్నారు. అబూ సుఫ్‌యాన్ మరియు బుదైల్ బిన్ వర్కా నడుమన జరిగిన సంభాషణ ఇలా ఉంది:

అబూ సుఫ్‌యాన్: దైవసాక్షి! ఈ రోజు రాత్రి వెలుగుతున్నట్టి మంటలను, ఇలాంటి సైన్యాన్ని నేనెన్నడూ చూడలేదు.

బుదైల్: దైవసాక్షిగా చెబుతున్నాను. వీరు బనూ ఖుజాఅ తెగవారు. యుద్ధం వాళ్ళను బాగా కృంగదీసింది.

అబూ సుఫ్‌యాన్: ఖుజాఅ వాళ్ళ సైన్యం ఇంత గొప్పది కాదు. వీరు రాజేసిన అగ్ని అంత పెద్దదిగా ఉండదు.

నేను వారిద్దరి గొంతుల్ని గుర్తు పట్టాను. వారిని పిలుస్తూ అబూ హంజలానా? అని అడిగాను. అతను కూడా నా గొంతును గుర్తు పట్టి, ఓహో అబుల్ ఫజల్‌వా? అన్నాడు.

"అవును" అన్నాన్నేను.

"ఏమిటి విశేషం?" అడిగాడు అతను.

"వీరు దైవప్రవక్త (స)కు చెందినవారు. అయ్యో ఖురైష్ దురదృష్టం! దైవసాక్షి! వారు నాశనం కాక తప్పదు" అన్నాన్నేను.

"మరిప్పుడేం చేయాలి?" అడిగాడతను.

"అల్లాహ్ తోడు! వారే నిన్ను పట్టుకుంటే నీ మెడ నరికేయడం ఖాయం. కాబట్టి రా, ఈ గాడిదపై నా వెనుకాల కూర్చో. నేను నిన్ను దైవప్రవక్త (స) వద్దకు గొనిపోతాను. నీ కోసం ఆయన శరణాన్ని కోరుతాను" అన్నాను.

పిదప అబూ సుఫ్‌యాన్ నా వెనుకాల గాడిదనెక్కి కూర్చున్నాడు. అతనితో వచ్చిన ఆ ఇద్దరు సహచరులు వెనక్కు వెళ్ళిపోయారు.

నేను అబూ సుఫ్‌యాన్‌ను వెంటబెట్టుకొని నడుస్తున్నాను. ప్రతి అగ్నిగుండం దాపు నుండి వెడుతూ ఉంటే అక్కడి వారు ఇతనెవరు? అని అడగడం, ఇది దైవప్రవక్త (స)గారి కంచర గాడిద అని, దానిపై నేను ఎక్కి

ఉండడం చూసి, ఓహో, ఈయన దైవప్రవక్త (స)గారి పినతండ్రి అనడం మారుమాట్లాడకపోవడం జరిగిపోతూనే ఉంది. చివరకు నేను హజ్రత్ ఉమర్(ర) గారి అగ్నిగుండం ప్రక్కగా వెడుతున్నప్పుడు, “ఎవరూ?” అంటూ లేచి మా దగ్గరకు వచ్చారాయన. నా వెనుకాల అబూ సుఫ్యాన్‌ను చూసి, “అబూ సుఫ్యానా? ఓ దైవ విరోధి! అల్‌హమ్‌దులిల్లాహ్! ఆయన ఎలాంటి ఒప్పందం లేకుండానే నిన్ను మాకు అధీనం చేశాడు” అంటూ బయలుదేరి దైవప్రవక్త (స) ఉంటున్న గుడారం వైపునకు చకచకా వెళ్ళిపోయారు. నేను కూడా నా కంచర గాడిదను వేగంగా తోలుకుంటూ ఆయన కంటే ముందే దైవప్రవక్త (స) సన్నిధికి చేరిపోయాను. గాడిదపై నుండి దూకి పరుగున ఆయన దగ్గరకు వెళ్ళిపోయాను. అంతలోనే హజ్రత్ ఉమర్ (ర) మమ్మల్ని వెంబడిస్తూ గుడారంలో చొరబడ్డారు.

“దైవప్రవక్తా! ఇతను అబూ సుఫ్యాన్. ఇతని మెడ నరకడానికి నాకు అనుమతినొసగండి” అన్నారాయన.

“ఓ ప్రవక్తా! నేను ఇతనికి శరణమిచ్చాను” అని చెప్పాన్నేను.

ఆ తరువాత మహాప్రవక్త (స) దగ్గర కూర్చుని ఆయన తలను పట్టుకొని, “దైవసాక్షి! ఈ రాత్రి నేను తప్ప మరెవ్వరూ తమతో మాట్లాడడానికి వీల్లేదు” అన్నాను. అబూ సుఫ్యాన్ విషయంలో హజ్రత్ ఉమర్ మాటిమాటికి దైవప్రవక్త (స)ను అడుగుతూ ఉండగా నేను, “ఉమర్ ఆగు! దైవసాక్షి! ఒకవేళ ఇతను బనీ అద్దీ బిన్ కఅబ్ మనిషి అయితే నీవు అలా అనకపోయేవాడివి” అని మందలించాను.

“అబ్బాస్ ఆగు! అల్లాహ్ తోడు! నీవు ఇస్లామ్ స్వీకరించడం నా దృష్టిలో ఖత్తాబ్ ఇస్లామ్ స్వీకరించడంకంటే- ఒకవేళ ఆయన ఇస్లామ్ స్వీకరించి ఉండి ఉన్నట్లయితే-మేలైన విషయం. దానికి కారణం దైవప్రవక్త (స) దృష్టిలో నీ ఇస్లామ్ స్వీకారం ఖత్తాబ్ ఇస్లామ్ స్వీకారం కంటే మిన్న అయినది కనుక.”

చివరకు మహాప్రవక్త (స) నాతో, “అబ్బాస్! ఇతణ్ణి డేరా లోనికి తీసుకువెళ్ళి రేపు ఉదయాన్నే నా వద్దకు తీసుకురండి” అని చెప్పారు. ఆ ఆదేశాన్ని అనుసరించి నేను మరుసటి రోజు ప్రవక్త (స) సన్నిధికి హాజరుపరిచానతడిని. ఆయన (స) అతణ్ణి చూసి, “అబూ సుఫ్యాన్! అల్లాహ్ తప్ప

మరే పూజ్యుడు లేడు అన్న విషయాన్ని తెలుసుకునే సమయం ఇంకా ఆసన్నం కాలేదా?” అని అడిగారు.

“నా తల్లిదండ్రులు తమపై అర్పితం. తమరు ఎంత దయాళురు! ఎంత సహనశీలురు. నేను బాగా తెలుసుకున్నాను. ఒకవేళ అల్లాహ్ కాకుండా మరెవరైనా ఆరాధ్యుడు ఉంటే ఇప్పటి వరకు నాకు సహాయపడి ఉండేవాడే” అన్నాడు అబూ సుఫ్యాన్.

“అయ్యో అబూ సుఫ్యాన్! నేను అల్లాహ్ ప్రవక్త అన్న విషయం అర్థం చేసుకునే సమయం ఇంకా రాలేదా?” అని అడిగారు మహాప్రవక్త (స).

“నా తల్లిదండ్రులు తమపై అర్పితం! మీరు ఎంత గొప్పవారు, ఎంత కరుణామయులు, మరెంత బంధుజనప్రీతి కలిగినవారో! ఈ విషయంలో ఇంకా నా మనస్సు సంశయిస్తూనే ఉంది” అన్నాడు. ఈ మాటలు విన్న నేను, “ఒరేయ్! నీ మెడ నరకబడక పూర్వమే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించు. అల్లాహ్ తప్ప ఇంకెవరూ ఆరాధనకు అర్హులుకారని, ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అని సాక్ష్యం ఇవ్వు” అన్నాను.

నా మాటలు విన్న అబూ సుఫ్యాన్ వెంటనే కలిమా పఠించి ఇస్లామ్ స్వీకరించారు. ఆ తరువాత నేను దైవప్రవక్త (స)తో, “మహాప్రవక్తా! ఇతను బహుమానాన్ని కాంక్షించేవాడు. అతనికి ఏదైనా బహుమానం ఇవ్వరా?” అని అడిగాను.

“సరే! ఎవరైతే అబూ సుఫ్యాన్ ఇంట జొరబడతారో వారికి నా రక్షణ లభిస్తుంది. మరెవరైతే తమ తలుపులు లోన్నుండి మూసుకుంటారో వారికీ నా రక్షణ ఉంది. అలాగే ఎవరైతే మస్జిదె హరామ్‌లో చొరబడతారో వారందరికీ నా రక్షణ ఇవ్వడం జరుగుతుంది” అని అన్నారు.

మర్రజ్జహ్రాన్ నుండి బయలుదేరి మక్కావైపు పయనమైన ఇస్లామీయ సేన

అదే రోజు ఉదయం - అంటే మంగళవారం, రమజాన్ నెల 17వ తారీఖు హి.శ. 8 నాటి ఉదయం- దైవప్రవక్త (స) మర్రజ్జహ్రాన్ నుండి బయలుదేరారు. అలా బయలుదేరుతూ హజ్రత్ అబ్బాస్ (ర)ను, “అబూ

సుఫ్‌యాన్, దైవమార్గంలో బయలుదేరిన సైన్యాన్ని వీక్షించేందుకు వీలుగా ఈ లోయ చివరన ఉన్న ఇరుకైన మార్గం దగ్గర నిలబెట్టి ఉంచండి" అని ఆదేశించారు. ఆయన ప్రవక్త ఆదేశాలను శిరసావహించి అతడిని అక్కడికి తీసుకువెళ్ళి నిలబెట్టారు.

ఆ మార్గంగుండా వెళ్ళే ప్రతి తెగను చూస్తూ, "వీరెవరూ?" అని అడగనారంభించాడు అబూ సుఫ్‌యాన్. జవాబుగా ఆ తెగల గురించి పరిచయం చేస్తూపోతున్నారు హజ్రత్ అబ్బాస్ (ర). వాటిని చూసి వీరితో నాకేమిటి పని అంటున్నాడు అబూ సుఫ్‌యాన్. చివరకు దైవప్రవక్త (స) తన ఆకుపచ్చ రంగు గల దుస్తుల సైనిక పటాలం వెంట అక్కడికి చేరు కున్నారు. ఆయన (స) వెంట ముహాజిర్లు మరియు అన్సారులు ఉన్నారు. వీరు మనుషుల్లా కాకుండా ఓ ఉక్కువాహినిలా అగుపిస్తున్నారు అబూ సుఫ్‌యాన్‌కు. ఇది చూసిన అబూ సుఫ్‌యాన్, "సుబ్‌హానల్లాహ్! ఓ అబ్బాస్, వచ్చేవారు ఎవరు?" అని అడిగాడు.

"అన్సారులు మరియు ముహాజిర్ల వెంట 7 మహాప్రవక్త (స) అరుదెస్తున్నారు" అన్నారు అబ్బాస్.

"వీరితో తలపడే ధైర్యం ఎవరికి ఉంది? అబుల్ ఫజల్! నీ సోదర కుమారుని రాచరికం ఎంత ఘనమైనది?" అని ఆశ్చర్యాన్ని ప్రకటించాడు అబూ సుఫ్‌యాన్. దీనికి సమాధానంగా హజ్రత్ అబ్బాస్ (ర), "అబూ సుఫ్‌యాన్, ఇది ప్రవక్త పదవి" అన్నారు.

"అవును, అది నిజమే" అని ఒప్పుకున్నాడు అబూ సుఫ్‌యాన్.

ఈ సందర్భంలోనే ఓ సంఘటన జరిగింది. అన్సార్ పతాకం హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా (ర)గారి చేతిలో ఉంది. ఆయన అబూ సుఫ్‌యాన్ ముందు నుండి పోతూ ఇలా అన్నారు.

"ఈ రోజు రక్తపాతం జరిగే రోజు. ఈ రోజు నిషిద్ధమైనది ధర్మసమ్మతంగా మార్చబడే రోజు. ఈ రోజు అల్లాహ్ ఖురైష్‌ను అగౌరవానికి గురిచేస్తాడు."

మహాప్రవక్త (స) అక్కడికి రాగానే అబూ సుఫ్‌యాన్, "ఓ మహాప్రవక్తా! తమరు సఅద్ అన్న మాటలు వినలేదా?" అని అడిగాడు.

"సఅద్ ఏమన్నాడు?" అడిగారు దైవప్రవక్త (స).

సఅద్ అన్న మాటలు ఏవో మహాప్రవక్త (స)కు వినిపించాడు అబూ సుఫ్‌యాన్. ఇది విన్న హజ్రత్ ఉస్మాన్ మరియు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)లు, "దైవప్రవక్తా! సఅద్ ఖురైష్‌లో రక్తపాతాన్ని సృష్టిస్తారేమో అని మాకు భయంగా ఉంది" అని విన్నవించుకోగా ఆయన, "లేదు, ఈ రోజు కాబా గృహాన్ని గౌరవించే రోజు. ఈ రోజు అల్లాహ్ ఖురైష్‌కు గౌరవం ప్రసాదించే రోజు" అంటూ సఅద్ వద్దకు మనిషిని పంపించి ఆయన చేతిలో ఉన్న జెండాను వెనక్కి తెప్పించుకున్నారు. దాన్ని ఆయన కుమారుడు 'ఖైస్' చేతికి అందించారు. అంటే జెండా మాత్రం హజ్రత్ సఅద్ చేతి నుండి మరొకరి చేతిలోనికి పోలేదన్నట్లే.

మరో ఉల్లేఖనంలో జెండాను హజ్రత్ జుబైర్ (ర)గారికి అందించినట్లు ఉంది.

హఠాత్తుగా ఖురైష్ పైకి వచ్చిపడ్డ ఇస్లామీయ సైన్యం

మహాప్రవక్త (స) అబూ సుఫ్‌యాన్‌ను దాటి వెళ్ళగా, హజ్రత్ అబ్బాస్ (ర) అతనితో, "అబూ సుఫ్‌యాన్ వెంటనే మక్కా వెళ్ళు" అని చెప్పారు. అతను రొప్పుతూ మక్కాకు వెళ్ళి పెద్దగా అరుస్తూ, "ఖురైష్ ప్రజలారా! ముహమ్మద్ మీ వద్దకు పెద్ద సైన్యంతో దండెత్తి వచ్చేశారు. ఆ సైన్యాన్ని అడ్డుకునే శక్తి మీకు లేదు. కాబట్టి ఎవరైతే నా ఇంట చొరబడతారో వారికి రక్షణ లభిస్తుంది" అని అన్నాడు. ఈ మాటలు విన్న అతని భార్య లేచి అతని మీసాలను పట్టుకుని,

"అధిక ప్రేలాపన చేసే వీణ్ణి పట్టుకొని చంపేయండి. ఓరి నీ బండబడా! ఎలా శరీరాన్ని పెంచావురా. ఇలాంటి కబురారా నీవు తీసుకువచ్చింది?" అని తిట్టింది.

"మీరు నాశనం కాను. చూడండి, ఈ దెయ్యం మీ ప్రాణాల విష యంలో మిమ్మల్ని మోసగిస్తోంది. మోసపోకండి. ఎందుకంటే ముహమ్మద్ వెంట వచ్చిన సైన్యాన్ని అడ్డుకోవడం మీ తరం కాదు. కాబట్టి ఎవరైతే అబూ సుఫ్‌యాన్ ఇంట రక్షణ పొందుతాడో అతనికి రక్షణ లభిస్తుంది" అన్నాడు అబూ సుఫ్‌యాన్ మళ్ళీ,

"ఒరేయ్ నీవు చావా! నీ ఇల్లు మా ఎంత మందికి రక్షణ ఇస్తుందిరా?" అడిగారు వారు.

"అదేకాదు, ఎవరైతే తమ ఇండ్లల్లో ఉండి లోన గడియ వేసుకుంటారో వారికీ రక్షణ లభిస్తుంది. మరెవరైతే మస్జిదె హరామ్‌లో చొరబడతారో వారికీ రక్షణ లభిస్తుంది" అన్నాడు అబూ సుఫ్‌యాన్.

ఈ మాటలు విన్న ప్రజలు తమ ఇండ్ల వైపునకు, మస్జిదె హరామ్ వైపునకు పరుగులు తీశారు. అయితే ఖురైష్, తమ పోకిరిగాళ్ళను మాత్రం ముస్లిములను అడ్డుకునేందుకు ముందుకు పంపించారు. ఒకవేళ వారికి ఏదైనా సాఫల్యం లభిస్తే సరేసరి లేదా వారేగనక వెనక్కు తగ్గితే ముస్లిముల డిమాండులను ఒప్పుకుందాం అనే ఉద్దేశ్యం వారిది. ఖురైషులు ముస్లిములను ఎదుర్కోవడానికి ఏ రౌడీలనైతే ముందుకు పంపారో ఆ రౌడీమూకలు సుఫ్‌వాన్ బిన్ ఉమయ్యా మరియు సుహైల్ బిన్ అమ్రూ నేతృత్వంలో 'ఖంద్‌మా' అనే ప్రదేశంలో బారులు తీరి ఉన్నారు. వీరిలో బనూ బక్ర్‌కు చెందిన ఓ వ్యక్తి హమాస్ బిన్ ఖైస్ కూడా ఉన్నాడు. ఇతను ఇదివరకు ఆయుధాలకు సానపెట్టే పనిచేస్తూ ఉండేవాడు. అతను ఆయుధాలకు సానపెట్టడం చూసి అతని భార్య అతణ్ణి ఉద్దేశించి, "ఏమిటీ నీవు చేస్తున్నది? ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చేయబోతున్నావు?" అని అడిగింది.

"ఇదా! ముహమ్మద్ (స)నూ మరియు ఆయన అనుచరుల్నీ ఎదుర్కోవడానికి."

"దైవసాక్షి! ముహమ్మద్ (స) మరియు ఆయన సహచరుల ధాటికి ఎవరూ నిలువలేరు."

"దైవసాక్షి! నీవలా అనుకుంటున్నావేమో? ఆయన అనుచరుల్లో కొందరిని పట్టుకొచ్చి నీకు సేవకులుగా చేస్తాను చూడు" అంటూ తన ఆయుధాలను చూయిస్తూ,

"ఈ రోజే గనక ఆయన నాకు ఎదురుబడితే నాకు ఎలాంటి భయం ఉండదు. చూశావా ఈ ఆయుధం, ఈ శూలం, ఒర నుండి వెంటనే దూసుకు వచ్చే రెండు వైపులా పదునున్న ఈ కరవాలం?" అని బింకాలు పలుకసాగాడు.

ఖంద్‌మా యుద్ధంలో ఇతను కూడా పాల్గొన్నవాడే.

'జీతువా'కు చేరిన ఇస్లామీయ సైన్యం

ఇటు మహాప్రవక్త (స) మర్రజ్జహ్రాన్ దాటి జీతువాకు చేరుకున్నారు - ఈలోపు అల్లాహ్ ప్రసాదించిన విజయాన్ని తలచుకొని కృతజ్ఞతాపూర్వకంగా ఆయన తన తలను క్రిందికి వంచి ఉంచారు. అలా తలవంచడం వలన ఆయన గెడ్డం వెంట్రుకలు 'కజావా' (అంబారి) కర్రను తాకుతున్నాయి - జీతువాలో ఆగి ఆయన (స), తన సైన్యాన్ని తీర్చి నిలబెట్టారు. ఖాలిద్ బిన్ వలీద్ (ర)ను కుడి వైపున ఉన్న సైన్యానికి నాయకునిగా చేశారు - ఆ సైన్యంలో అస్లమ్, సులైమ్, గిఫ్ఫార్, ముజీనా, జుహైనా ఇంకొన్ని అరబ్బు తెగలకు చెందినవారున్నారు- మక్కా దిగువ భాగం నుండి ప్రవేశించమని, ఖురైషులకు చెందిన వాడెవడైనా అడ్డుపడితే అతడిని నరికివేసి 'సఫా' కొండ వద్ద తనను వచ్చి కలువమని ఖాలిద్ బిన్ వలీద్ (ర)కు ఆదేశమిచ్చారాయన.

హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ (ర) ఎడమ కొమ్ముకు ఉన్నారు. ఆయన వెంట దైవప్రవక్త (స) గారి పతాకం ఉంది. ఎగువ భాగం ద్వారా మక్కా నగరంలో ప్రవేశించి 'కిదా'కు చేరమని, 'హజూన్' అనే చోట ఆ జెండాను పాతి అక్కడనే తన రాక కోసం ఎదురుచూడమని ఆదేశించారాయనకు,.

హజ్రత్ అబూ ఉబైదా (ర) పదాతిదళ కమాండరుగా నియుక్తులయ్యారు. 'బత్నెవాదీ' (బత్న్ లోయ) వైపునకు పయనిస్తూ తనను మక్కాలో వచ్చి కలువమని ఆదేశమిచ్చారాయనకు.

మక్కాలో ప్రవేశించిన ఇస్లామీయ సైన్యం

ఈ ఆదేశాలందుకున్న అన్ని సైనిక పటాలాలు వాటికి నిర్దేశించబడిన మార్గాలగుండా బయలుదేరి వెళ్ళాయి.

హజ్రత్ ఖాలిద్ (ర) మరియు ఆయన సహచరులు పోరాటం చేసే ఉద్దేశ్యంతో ఎదురు వచ్చిన ప్రతి ముష్రిక్కును మట్టుబెట్టారు. అయితే ఖాలిద్ సైన్యంలోని ఇద్దరు, కర్జ్ బిన్ ఫహ్రీ (ర) మరియు ఖునైస్ బిన్ ఖాలిద్ బిన్ రబీయా (ర)లు అమరగతినొందవలసివచ్చింది. జరిగినదేమిటంటే, వీరిద్దరు సైన్యం నుండి తప్పిపోయి వేరే దారిపట్టడం వల్ల చంపబడ్డారు. 'ఖంద్‌మా' అనే చోటికి చేరగానే ఖాలిద్ (ర)కు ఖురైషులు పంపిన పోకిరిమూక ఎదురుబడింది. ఓ చిన్న పోరాటం జరిగి అందులో పన్నెండుగురు ముష్రిక్కులు హతమయ్యారు. ఆ తరువాత ముష్రిక్కుల పటాలంలో అస్తవ్యస్త

పరిస్థితి నెలకొని పారిపోయారు. ముస్లిములతో తలపడడానికి ఆయుధాలు సానపెట్టిన హమ్మాస్ బిన్ ఖైస్ పారిపోయి తన ఇంట చొరబడి తన భార్యతో తలుపులు మూసేయ్ అని చెప్పగా ఆమె, "ఏమిటి? నీవు పలికిన బీరాలు ఏమయ్యాయి?" అని అడిగింది.

"నీవే గనక ఆ యుద్ధం తీరు చూసి ఉంటే ఇలా అనకపోయేదానివి. సుఫ్వాన్ బిన్ అక్రమా పారిపోయాడు. నగ్నకరవాలాలతో మాకు స్వాగతం పలుకబడింది. అవి మనవారి మణికట్టులను, తలలను నరికిపారవేశాయి. వెనుక వైపు పెద్ద గోల కంటే మాకు మరేదీ వినబడలేదు. అదే నీవు చూసి ఉంటే అంత తేలిగ్గా ఆ మాట అనకపోయేదానివి" అన్నాడు భయంభయంగా.

అనంతరం హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర), మక్కా బజార్లు సందు గొందుల్ని దాటేసుకుంటూ సఫా కొండపై దైవప్రవక్త (స) గారిని వచ్చి కలిశారు.

ఇటు హజ్రత్ జుబైర్ (ర), ముందుకు వెడుతూ 'హజూన్'లో (మస్జిదె ఫతహ్ దగ్గర) దైవప్రవక్త (స) గారి ధ్వజాన్ని పాతి నిలబెట్టారు. ఆయన కోసం ఓ గుడారాన్ని కూడా నిర్మించి అక్కడనే దైవప్రవక్త (స) గారి రాక కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. మహాప్రవక్త (స) కూడా అక్కడికి చేరుకున్నారు.

దైవ గృహంలోనికి ప్రవేశించిన మహాప్రవక్త (స)-విగ్రహాల తొలగింపు

తదనంతరం మహాప్రవక్త(స) లేచి బయలుదేరారు. అన్సారులు, ముహాజిర్ల బృందాలు ఆయన వెనుకగా, ముందుగా నడుస్తున్నారు. మస్జిదె హరామ్‌లో ప్రవేశించి ముందు హజ్రె అస్వద్‌ను ముద్దాడారు. ఆ తరువాత దైవగృహం (బైతుల్లాహ్) ప్రదక్షిణ చేశారు. అప్పుడు ఆయన చేతిలో ఓ ధనస్సు ఉంది. బైతుల్లాహ్ చుట్టూ, దాని కప్పుపైనా మూడు వందల అరవై విగ్రహాలు ప్రతిష్టించబడి ఉన్నాయి ఆ సమయంలో. మహాప్రవక్త (స) ఆ ధనస్సుతో ఆ విగ్రహాలను కొడుతూ ఇలా పలుకనారంభించారు.

جَآءَ الْحَقُّ وَ زَهَقَ الْبَاطِلُ ۭ اِنَّ الْبَاطِلَ كَانَ زَهُوْقًا ۝

"సత్యం వచ్చేసింది, అసత్యం నశించింది. అసత్యం నశించక తప్పదు." (17: 81)

جَآءَ الْحَقُّ وَمَا يُبْدِئُ الْبَاطِلُ وَمَا يُعِيْدُ ۝

"సత్యం వచ్చేసింది. ఇక అసత్యం ఏది చేసినా నెగ్గజాలదు." (34 : 49)

ఆ దెబ్బలకు ఆ విగ్రహాలు వాటి ముఖాలపై బోర్లాపడిపోతున్నాయి. మహాప్రవక్త (స) తన ఒంటె నెక్కి దైవగృహం తవాఫ్ చేశారు. ఇహ్రామ్ కట్టుకోలేదు కనుక ఆ తవాఫ్‌తోనే సరిపుచ్చారు. కాబా గృహ ప్రదక్షిణ అయిన తరువాత ఆయన (స) హజ్రత్ ఉస్మాన్ బిన్ తల్హా (ర)ను పిలిచి ఆయన చేతిలో నుండి దైవగృహం తాళాలు తీసుకున్నారు. ఆయన ఆదేశించగా కాబా గృహం తలుపులు తెరువబడ్డాయి. లోనికి ప్రవేశించగా ఆయనకు చిత్రపటాలు అగుబడ్డాయి. వాటిలో హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) మరియు హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) గారి చిత్రపటాలు కూడా ఉన్నాయి. వారి చేతుల్లో శకునాలు చూసే బాణాలు ఉన్నాయి. ఈ దృశ్యం చూడగానే మహాప్రవక్త (స), "అల్లాహ్! ఈ విగ్రహారాధకులను నాశనం చేయుగాక! దైవసాక్షి! ఈ ఇద్దరు ప్రవక్తలు ఏనాడూ శకునాలు చూసే బాణాలను ఉపయోగించలేదు" అన్నారు. ఆయన (స) కాబా గృహంలో కర్రతో చేయ బడిన ఓ పావురాన్ని కూడా చూశారు. దాన్ని తన చేతులతో విరిచేశారు. అక్కడున్న పటాలన్నీ ఆయన ఆదేశం మేరకు చెరిపివేయబడ్డాయి.

కాబా గృహంలో దైవప్రవక్త (స) గారి నమాజు - ఖురైష్‌ను సంబోధించడం

ఆ తరువాత మహాప్రవక్త (స) కాబా తలుపును లోపలి నుంచి గడియవేసుకున్నారు. హజ్రత్ ఉసామ (ర) మరియు హజ్రత్ బిలాల్ (ర) కూడా లోపలే ఉన్నారు. పిదప దైవప్రవక్త (స) ద్వారానికి ఎదురుగా ఉన్న గోడ వైపు నడిచారు. గోడ కేవలం మూడు మూరల దూరంలో ఉండగా ఆగిపోయారు. రెండు స్తంభాలు ఆయనకు ఎడమ వైపున, ఒక స్తంభం కుడి వైపున, మూడు స్తంభాలు వెనుకగా చేసి - ఆ రోజుల్లో కాబా గృహంలో ఆరు స్తంభాలుండేవి- అక్కడే నిలబడి నమాజు చేశారు. తరువాత బైతుల్లాహ్ లోపలి భాగంలో చుట్టూ తిరిగి వచ్చారు. 'అన్ని మూలల్లోను తక్బీర్ (దైవ ఔన్నత్యం), తౌహీద్ (ఏకత్వం) వచనాలను (అంటే అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహ్) పలికారు. ఆ తరువాత ద్వారాన్ని తెరిచేశారు. ఖురైష్

ఎదురుగా మస్జిదె హరామ్‌లో వరుసలు కట్టి కిటకిటలాడుతూ నిలబడి ఉన్నారు. వారు మహాప్రవక్త (స) ఏం చేస్తారో అని నిరీక్షిస్తున్నారు. మహాప్రవక్త (స) గుమ్మంలో నిలబడి దాని రెండు నిలువు కమ్మీలను పట్టుకున్నారు. క్రింది వైపున ఖురైషులు ఉన్నారు. వారినుద్దేశించి ఇలా అన్నారు:

"అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడూ లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు. ఆయన తన వాగ్దానాన్ని నిజం చేసి చూపించాడు. తన దాసునికి సహాయపడ్డాడు. తానొక్కడే మూకలన్నిటికీ పరాజయాన్ని కలుగజేశాడు. వినండి! బైతుల్లాహ్ (కాబా గృహం) తాళపుచెవులను కలిగివుండడం, హాజీలకు దాహం తీర్చడం లాంటివి తప్ప తక్కిన బిరుదులు లేదా ఉన్నత స్థానాలు లేదా రక్తం నా ఈ రెండు పాదాల క్రింద ఉన్నవే. జ్ఞాపకం ఉంచుకోండి. కావాలని హత్య చేసిన దానికి 'దీత్' (రక్తపరిహారం) వంద ఒంటెలు. వాటిలో నలభై ఒంటెలు చూడివి అయి ఉండాలి.

ఓ ఖురైషు ప్రజలారా! అల్లాహ్ మీ నుండి అజ్ఞాన కాలపు నీల్గును, తాతముత్తాతల పేరు చెప్పి గర్వపడడాన్ని అంతమొందించాడు. ప్రజలందరూ ఆదం సంతానం. ఆదం మట్టితో సృజించబడినవాడు" అంటూ ఈ ఖుర్‌ఆన్ ఆయత్‌ను పఠించారు.

يَٰٓأَيُّهَا ٱلنَّاسُ إِنَّا خَلَقۡنَٰكُم مِّن ذَكَرٖ وَأُنثَىٰ وَجَعَلۡنَٰكُمۡ شُعُوبٗا وَقَبَآئِلَ
لِتَعَارَفُوٓاْۚ إِنَّ أَكۡرَمَكُمۡ عِندَ ٱللَّهِ أَتۡقَىٰكُمۡۚ إِنَّ ٱللَّهَ عَلِيمٌ خَبِيرٞ ﴿١٣﴾

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరి కంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవ పాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడు." (49 : 13)

ఈ రోజు మీపై ఎలాంటి నిందమోపను

దాని తరువాత మహాప్రవక్త (స) ఖురైషులను సంబోధిస్తూ ఇలా

అన్నారు: "ఓ ఖురైషు ప్రజలారా! నేను ఈ రోజు మీ ఎడల ఎలా ప్రవర్తించ బోతున్నానో మీకు తెలుసా?" అని అడగగా వారు;

"మేలైన ప్రవర్తన! తమరు దయాళువు అయిన సోదరులు, దయాళువు అయిన సోదరుని కుమారులు" అని అరిచారు.

నేను మీతో, హజ్రత్ యూసుఫ్ (అ.స.) తన సోదరులతో అన్న మాటలనే అంటాను. ఆయన ఆనాడు ఇలా అన్నారు: 'లా తస్రీబఅలైకుముల్ యౌమ్' (ఈ రోజు మీపై ఎలాంటి నిందను మోపబోవడం లేదు, పొండి, మీరంతా ఈ రోజు నుండి స్వతంత్రులు) మహాప్రవక్త (స).

కాబా తాళం చెవిని దాని హక్కుదారునికి అందించడం

మహాప్రవక్త (స) ఆపై మస్జిదులో కూర్చున్నారు. కాబా తాళపు చెవిని చేతబట్టుకొని ఉన్న హజ్రత్ అలి (ర) దైవప్రవక్త (స) సన్నిధిలోనికి వచ్చి, "ప్రవక్తా! హాజీలకు నీరు త్రాగించే హోదా మరియు గౌరవంతో పాటే ఈ గృహం తాళాన్ని కలిగి ఉండే హోదా కూడా మాకే ప్రసాదించండి. దైవం మిమ్మల్ని కరుణించుగాక" అని విన్నవించుకున్నారు.

మరో ఉల్లేఖనంలో, ఈ విన్నపం హజ్రత్ అబ్బాస్ (ర) చేసినట్లుగా ఉంది. దైవప్రవక్త (స), "ఉస్మాన్ ఏడీ!" అని అడగగా ఆయన్ను పిలువ నంపడం జరిగింది.

దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు; "ఉస్మాన్ ఇదిగో నీ తాళపు చెవి, ఈ రోజు సత్కార్యాలకు సంబంధిం చిన రోజు. విశ్వాసపాత్రులకు సంబంధించిన రోజు".

తబ్కాత్ ఇబ్నె సఅద్‌లోని ఉల్లేఖనంలో, మహాప్రవక్త (స) ఆ తాళపు చెవిని హజ్రత్ ఉస్మాన్ బిన్ తల్హా (ర)కు అందిస్తూ,

"దీన్ని శాశ్వతంగా నీ దగ్గరనే ఉంచుకో. మీ నుండి ఈ తాళపు చెవిని బలవంతంగా లాక్కున్నవాడు దౌర్జన్యపరుడు. ఓ ఉస్మాన్! అల్లాహ్ మిమ్మల్ని తన గృహానికి అమానతుదారులుగా చేశాడు. కాబట్టి కాబా గృహం నుండి మీకు లభించే సొత్తును ప్రసిద్ధ రీతిలో (అందరికీ ఆమోదకరమైన రీతిలో) అనుభవించండి" అని సెలవిచ్చారు.

కాబా గృహ కప్పుపై నిలబడి హజ్రత్ బిలాల్ (ర) పలికిన అజాన్

నమాజు వేళ కాగానే మహాప్రవక్త (స) హజ్రత్ బిలాల్(ర)ను పిలిచి కాబా గృహం పైకి ఎక్కి అజాన్ పిలుపు ఇవ్వమని ఆదేశించారు. అప్పుడు అబూ సుఫ్యాన్ బిన్ హరబ్, అత్తాబ్ బిన్ అసీద్ మరియు హారిస్ బిన్ హిష్షామ్ కాబా గృహ ప్రాంగణంలో కూర్చుని ఉన్నారు. వారి నడుమ ఈ క్రింది సంభాషణ జరిగింది. అతాబ్ బిన్ అసీద్ ఆ సందర్భంగా తన మిత్రులతో మాట్లాడుతూ;

"అల్లాహ్ అసీద్‌కు ఆ పిలుపు (అజాన్) వినకుండా ఉండే భాగ్యాన్ని ప్రసాదించాడు. లేకుంటే ఆ కటువైన పలుకులు వినవలసివచ్చేదే" అన్నాడు.

"వినవయ్యా దైవసాక్షిగా చెబుతున్నాను! ఆయనే గనక నిజంగా ప్రవక్త అయితే నేను ఆయనకు అనుచరుణ్ణయి విధేయిస్తాను" అన్నాడు హారిస్.

"అబ్బే నేనేం మాట్లాడను. నేనేదైనా మాట్లాడానా ఈ గులక రాళ్ళున్నాయి చూశావు ఇవి కూడా నా గురించి ఆయనకు చెప్పేస్తాయి" అన్నాడు అబూ సుఫ్యాన్.

ఆ తరువాత ఆ ముగ్గురు కలసి మహాప్రవక్త (స) దగ్గరకు వెళ్ళారు. ఆయన వారిని చూసి;

"ఇప్పుడిప్పుడే మీ ముగ్గురు కలసి ఏం మాట్లాడుకున్నారో అది నాకు తెలిసిపోయింది" అంటూ ఈ ముగ్గురి సంభాషణను వారికి వినిపించారు మహాప్రవక్త (స). దైవప్రవక్త (స) నోట ఈ మాటలు విన్నారో లేదో హారిస్ మరియు అతాబ్‌లు వెంటనే, "మేము సాక్ష్యం ఇస్తున్నాం. తమరు అల్లాహ్ ప్రవక్తేనని. దైవసాక్షి! మేము మాట్లాడుకున్నప్పుడు మా ముగ్గురి తప్ప అక్కడ మరెవ్వరూ లేరు మా సంభాషణను విని మీకు చెప్పడానికి" అంటూ ఇస్లామ్ ధర్మం స్వీకరించారు.

విజయం లభించినందుకు లేదా కృతజ్ఞతలు తెలుపుకోడానికి చేసిన నమాజు

అదే రోజు మహాప్రవక్త (స) అబూ తాలిబ్ కుమార్తె 'ఉమ్మె హానీ' ఇంటికి వెళ్ళారు. అక్కడ ఆయన స్నానం చేసి ఆ యింటనే ఎనిమిది రకాఅత్‌ల నమాజు చేశారు. ఇది చాష్త్ సమయం (అంటే ప్రొద్దు కొంత ఎక్కిన తరువాతి సమయం). కాబట్టి ఈ నమాజును కొందరు చాష్త్ నమాజ్‌గా, మరికొందరు అది విజయం ప్రాప్తించినందుకు కృతజ్ఞతాపూర్వకంగా చేసిన నమాజు ఏమో అని అనుకున్నారు. ఉమ్మె హాని తన ఇద్దరు మరదులకు (భర్త సోదరులకు) రక్షణ ఇచ్చి ఉన్నారు. అది గమనించిన మహాప్రవక్త (స) ఆమెతో, "ఉమ్మె హానీ! నీవు ఎవరికైతే రక్షణ ఇచ్చావో నేనూ రక్షణ ఇచ్చానని అనుకో" అన్నారు. ఇలా చెప్పడానికి కారణం, ఉమ్మె హానీ సోదరుడు హజ్రత్ అలీ (ర) వారిద్దరిని హతమార్చాలని అనుకోవడమే. అందుకని ఉమ్మె హాని వారిద్దరిని తన ఇంట ఉంచి తలుపులు గడియ వేసి ఉంచవలసి వచ్చింది. మహాప్రవక్త (స) ఆమె ఇంటికి వెళ్ళినప్పుడు వారి విషయం అడిగారు. దైవప్రవక్త (స) వారికి రక్షణ ఇచ్చానని తెలిసి ధైర్యాన్ని తెచ్చుకున్నారు ఆమె.

కరుడుగట్టిన నేరస్తుల హత్యలకు రక్తపరిహారం నాస్తి

మక్కా విజయం నాడు కరుడుగట్టిన తొమ్మండుగురు నేరస్తుల హత్యకు రక్తపరిహారం లేదంటూ ప్రకటించబడింది. వారు కాబా గృహం పరదా వెనుకను దాక్కున్నాసరే వారిని సంహరించవలసిందే అని ఆదేశించడం జరిగింది. వారి పేర్లు ఇవి:

1) అబ్దుల్ ఉజ్జా బిన్ ఖలీల్ 2) అబ్దుల్లాహ్ బిన్ సఅద్ బిన్ అబీసరహ్ 3) అక్రమా బిన్ అబీ జహల్ 4) హారిస్ బిన్ నుఫైల్ బిన్ వహబ్ 5) ముఖైస్ బిన్ సబాబా 6) హబ్బార్ బిన్ అస్వద్ 7-8) ఇబ్నె కతల్‌కు చెందిన ఇద్దరు స్త్రీ బానిసలు (వీరు దైవప్రవక్త (స)ను తిడుతూ ఉండేవారు). 9) సారా. ఈమె అబ్దుల్ ముత్తలిబ్ వంశంలో ఒకరికి బానిసగా ఉండేది. ఈమె వద్ద హాతిబ్ (ర) లేఖ పట్టుబడింది.

ఇబ్నె అబీ సరహ్‌ను హజ్రత్ ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (ర) దైవప్రవక్త (స) సన్నిధికి గొనిపోయి అతనికి ప్రాణభిక్ష పెట్టమని అర్థించారు. ఆయన (స) అతనికి ప్రాణభిక్ష పెట్టగా అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. అంతకు ముందు మహాప్రవక్త (స) అతనికి ప్రాణభిక్ష పెట్టకుండా కొంత తాత్సారం చేశారు. దానికి కారణం లేకపోలేదు. తను అనుచరుల్లో ఎవరైనా లేచి అతని తలను మొండెం నుండి వేరుచేస్తారేమో అని ఎదురు చూశారు. ఎందుకంటే

ఈ వ్యక్తి ఇంతకు పూర్వం కూడా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిము అయి హిజ్రత్ చేసి మదీనా వచ్చినవాడు. కాని ఆ తరువాత ధర్మభ్రష్టుడు (ముర్తద్) అయి పారిపోయి మక్కా చేరుకున్న వ్యక్తి. (అయినప్పటికీ ఆ తరువాత అతను ఇస్లామ్ ప్రకారంగానే నడుచుకున్నాడు.)

అక్రమా బిన్ అబీ జహల్ యమన్‌కు పారిపోయాడు. అయితే అతని భార్య దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరై అతనికి ప్రాణభిక్ష పెట్టమని ప్రాధేయ పడింది. మహాప్రవక్త (స) అతనికి ప్రాణభిక్షను ప్రసాదించారు. ఆ తరువాత ఆమె అక్రమాను వెన్నంటి వెళ్ళి అతణ్ణి తోడ్కొని వచ్చింది. రాగానే అతను ఇస్లామ్ ధర్మం స్వీకరించాడు.

ఇబ్నె ఖతల్ కాబా గృహం పరదా పట్టుకొని వ్రేళ్ళాడుతున్నాడు. ఓ సహాబీ (ర) దైవప్రవక్త (స)కు ఈ విషయాన్ని తెలియజేశారు. ఆయన, అతణ్ణి చంపేయండి అని చెప్పగా ఆ సహాబి అతణ్ణి చంపేశారు.

ముఖీస్ బిన్ సబాబాను హజ్రత్ సుమైలా బిన్ అబ్దుల్లా హతమార్చారు. ముఖైస్ ఇదివరకే ఇస్లామ్‌ను స్వీకరించినవాడు కాని ఓ అన్సారీని హతమార్చి ధర్మభ్రష్టుడై ముష్రిక్కుల వద్దకు పారిపోయి వచ్చినవాడు.

హారిస్, ఇతను మక్కాలో దైవప్రవక్త (స)ను బాగా హింసించేవాడు. అతణ్ణి హజ్రత్ అలి (ర) హతమార్చారు.

హబ్బార్ బిన్ అస్వద్ ఒకప్పుడు దైవప్రవక్త (స) గారి కుమార్తె హజ్రత్ జైనబ్‌ను, ఆమె హిజ్రత్ చేసి మదీనాకు వెళ్ళేటప్పుడు- నెట్టడం వలన ఆమె ఒంటె అంబారీ నుండి క్రిందపడిపోయారు. అలా పడిపోవడం వలన ఆమె గర్భం పడిపోయింది. ఇతను మక్కా విజయం రోజున మక్కా నుండి పారిపోయాడు. ఆ తరువాత ఇస్లామ్ స్వీకరించి బ్రతికిపోయాడు.

ఇబ్నె ఖతల్‌కు చెందిన ఇద్దరు స్త్రీ బానిసల్లో ఒకామె చంపేయబడింది. మరొకామె కోసం ప్రాణభిక్ష కోరడం జరిగింది. ఆ తరువాత ఆమె కూడా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించింది. అలాగే సారా కోసం కూడా ప్రాణభిక్ష కోరడం జరిగింది. ఆమె కూడా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించింది.

(మొత్తానికి తొమ్మండుగురిలో నలుగురు మాత్రమే చంపబడ్డారు. తక్కిన అయిదుగురికి ప్రాణభిక్ష లభించింది. వారంతా ఇస్లామ్‌ను స్వీకరించారు ఆ తరువాత).

హాఫిజ్ ఇబ్నె హజర్ ఇలా రాస్తున్నారు:

ఎవరి హత్యలకు రక్తపరిహారం లేదని ప్రకటించబడిందో వారిలో అబూ మాషిర్, హారిస్ బిన్ తలాల్ ఖజాయీ పేరు కూడా ఉందని అబూ మాషిర్ అంటారు. అతణ్ణి హజ్రత్ అలి (ర) సంహరించారు. ఇమామె హాకిమ్ ఓ పట్టికలో కఅబ్ బిన్ జుబైర్ పేరును కూడా ఉటంకించడం జరిగింది - కఅబ్‌కు సంబంధించిన సంఘటన ప్రాచుర్యం పొందిన సంఘటన- అతను ఆ తరువాత వచ్చి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. దైవప్రవక్త (స)ను పొగిడాడు కూడా. (అదే పట్టికలో) వహ్షీ బిన్ హరబ్ (హజ్రత్ హమ్‌జా (ర)గారి హంతకుడు), అబూ సుఫ్‌యాన్ భార్య హింద్ బిన్తె ఉత్బాలు కూడా ఉన్నారు. వీరిద్దరు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. అయితే ఇబ్నె ఖతల్ బానిసరాలు అర్‌నిబ్ చంపబడింది. ఉమ్మె సఅద్ కూడా సంహరించబడింది. ఇబ్నె ఇస్‌హాక్ కథనంలో మొత్తం ఎనిమిది మంది పురుషులు, ఆరుగురు స్త్రీలని ఉంది. బహుశా వారు స్త్రీ బానిసలు అర్నిబ్, ఉమ్మె సఅద్‌లు అయి ఉంటారు. ఈ అభిప్రాయభేదం కేవలం పేర్లకు సంబంధించినది మాత్రమే. వారి మారు పేర్లను గురించి ఈ తేడా కనిపిస్తుందేమో.[9]

'సుఫ్‌వాన్ బిన్ ఉమయ్యా' మరియు 'ఫిజాలా బిన్ ఉమైర్'ల ఇస్లామ్ స్వీకారం

సుఫ్‌వాన్ హత్యకు రక్తపరిహారం లేదు అని ప్రకటించబడినప్పటికీ అతను ఖురైష్‌కు చెందిన ఓ పెద్ద నాయకుడు అయినందున తాను తన ప్రాణాలను దక్కించుకునే ఉద్దేశ్యంతో పారిపోవాల్సివచ్చింది. ఉమైర్ బిన్ వహబ్ హుజ్మీ, మహాప్రవక్త (స) సన్నిధిలో హాజరై తనకు రక్షణ కల్పించండని కోరారు. మహాప్రవక్త (స) అతనికి రక్షణ ఇచ్చారు. గుర్తుగా ఉమైర్‌కు అతను మక్కాలో ప్రవేశించేటప్పుడు తన తలపై కట్టుకున్న తలపాగాను కూడా ప్రసాదించారు. ఉమైర్ సుఫ్‌వాన్‌ను వెదుకుతూ అతని వద్దకు వెళ్ళినప్పుడు అతను 'జిద్దా' నుండి యమన్‌కు వెళ్ళడానికి ఓడ ప్రయాణం కోసం సంసిద్ధం అవుతున్నాడు. ఉమైర్ అతణ్ణి వెనక్కు పిలుచుకువచ్చారు. సుఫ్‌వాన్ బిన్

9. ఫత్‌హుల్ బారీ-8/11,12

ఉమయ్యా దైవప్రవక్త (స) గారి సన్నిధికి వచ్చి రెండు నెలల గడువు కోరగా అతనికి ఆయన నాలుగు నెలల గడువును ఇచ్చారు. ఆ తరువాత సుఫ్వాన్ ఇస్లామ్ స్వీకరించాడు. అతని భార్య ఇదివరకే ఇస్లామ్ స్వీకరించి ముస్లింగా మారిపోయి ఉన్నందున వారిద్దరినీ వారి మునుపటి నికాహ్ బంధంలోనే ఉంచారు మహాప్రవక్త (స).

'ఫిజాలా' ఓ ధైర్యసాహసాలుగల మనిషి. దైవప్రవక్త (స) కాబా గృహం తవాఫ్ (ప్రదక్షిణ) చేసేటప్పుడు ఆయన్ను చంపడానికి ధైర్యం చేసిన వ్యక్తి. కాని అతను దగ్గరకు రాగానే తాను ఏ ఉద్దేశ్యంతో అక్కడికి వచ్చిందో చెప్పారు మహాప్రవక్త (స) అతనితో. దానితో అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించాడు.

మక్కా విజయం మరుసటి రోజున మహాప్రవక్త (స) గారి ప్రసంగం

మక్కా జయించబడిన మరునాడు మహాప్రవక్త (స) ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడానికి తిరిగి లేచి నిలబడ్డారు. మొదట ఆయన దైవస్తుతి చేస్తూ ఆయన్ను శ్లాఘించారు. ఆ తరువాత ఇలా ప్రసంగించారు:

"ప్రజలారా! అల్లాహ్ ఏ రోజైతే ఈ భూమ్యాకాశాల్ని సృజించాడో ఆ రోజే మక్కాను హరామ్ (పవిత్రమైన నగరంగా) చేశాడు. కాబట్టి అది అల్లాహ్ పవిత్రత కారణంగా ప్రళయ దినం వరకు పవిత్రంగానే ఉంటుంది. అల్లాహ్‌ను, ప్రళయ దినాన్నీ విశ్వసించే వారెవరికీ ఈ ప్రదేశంలో రక్తపాతం సృష్టించడం లేదా ఇక్కడి చెట్లను నరకడం ధర్మసమ్మతమైన విషయం కాదు. ఎవరైనా దైవప్రవక్త (స) ఇక్కడ యుద్ధం చేశారుగదా అని అనుకొని అలా చేస్తే, అల్లాహ్ తన ప్రవక్తకు ఆ అనుమతి ఇచ్చాడన్నది, మీకు ఆ అనుమతి లేదు అన్న విషయం వారికి తెలియజెప్పండి. నా కోసం కూడా ఆ అనుమతి కేవలం ఒక రోజులోని ఓ గంట కోసమే ధర్మసమ్మతం చేయబడింది. ఇక ఈ రోజు నుండి దాని పవిత్రత నిన్నటి వరకు ఎలాగుండిందో అలానే తిరిగి వచ్చేసింది. ఇప్పుడు ప్రస్తుతం ఇక్కడున్న ప్రతివాడూ ఇక్కడ హాజరుగా లేని ప్రతివానికి ఈ మాటను అందించవలసి ఉంటుంది."

మరో ఉల్లేఖనంలో మరికొంత అదనంగా ఈ విషయం కూడా చెప్పడం జరిగింది. అదేమిటంటే:

"ఇక్కడి ముల్లునైనా విరువకూడదు. వేటాడకూడదు. క్రిందపడి ఉన్న

ఏ వస్తువును ఎత్తకూడదు. అయితే ఆ వస్తువు తనది అని తెలియజేసి మరీ ఎత్తవలసి ఉంటుంది. ఇక్కడి గడ్డిని కూడా కోయకూడదు." ఇది విన్న హజ్రత్ అబ్బాస్ (ర), "దైవప్రవక్తా! 'ఇజ్‌గర్' గడ్డి విషయంలో మీ అభిప్రాయం ఏమిటి? (ఇజ్‌గర్ అరబ్బుకు చెందిన ఓ రకమైన గడ్డి. దీన్ని టీగా, మందుగా ఉపయోగిస్తారు) ఇది కమ్మరులకు, ఇతర గృహావసరాలకు పనికి వస్తుంది కదా?" అని అడగగా, "అవును, ఆ ఇజ్‌గర్‌ను తప్ప" (ఇతర అన్ని రకాల గడ్డిని కోయకూడదు) అని అన్నారు.

బనూ ఖుజాఅ ఆ రోజు బనూ లైస్‌కు చెందిన ఓ వ్యక్తిని చంపేశారు. ఎందుకంటే అజ్ఞాన కాలంలో బనూ లైస్ చేతిలో వారికి చెందిన ఓ వ్యక్తి చంపబడ్డాడు గనుక. ఈ విషయంలో మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు.

"ఖుజాఅ ప్రజలారా! హత్యలు చేయడం మానుకోండి. ఎందుకంటే ఆ హత్యలే ప్రయోజనాన్ని కలిగిస్తే, ఇప్పటివరకు ఎన్నో హత్యలు జరిగి ఉండేవి. మీరు చంపిన ఆ వ్యక్తికి రక్తపరిహారాన్ని నేను చెల్లిస్తాను. ఇక నుండి మీరు నా ఈ ప్రదేశంలో మరెవ్వరినైనా హతమారిస్తే, హతుని సంరక్షకులకు నేను రెండు విషయాల అధికారాన్ని ఇస్తున్నాను. వారనుకుంటే దానికి బదులు మరొకరిని హత్య చేయవచ్చు. లేదా వారు కోరితే ఆ హతునికి బదులు దీత్ (రక్తపరిహారం) పొందవచ్చు.

ఓ ఉల్లేఖనంలో, దైవప్రవక్త (స) అలా చెప్పగా యమన్‌కు చెందిన ఓ వ్యక్తి లేచి (అతని పేరు అబూ షాహ్) "దైవప్రవక్తా! ఈ హత్య రక్తపరిహారాన్ని నా పేర రాయండి" అనగా, మహాప్రవక్త (స) "దీన్ని అతని పేరున్నే రాయండి" అని అన్నారు.[10]

ఆందోళనకు గురియైన అన్సారులు

మక్కా విజయం పరిపూర్ణమైపోయింది. ఇది మహాప్రవక్త (స) గారి స్వంత నగరం, ఆయన పుట్టిన చోటు అని గ్రహించిన అన్సారులు పరస్పరం గుసగుసలాడుకోసాగారు. మహాప్రవక్త (స) తమ స్వస్థలాన్ని జయించారు

10. ఈ ఉల్లేఖనాల గురించి చూడండి, సహీ బుఖారి-1/22, 216, 247, 328, 329, 2/615, 617; సహీ ముస్లిమ్ - 1/437, 438, 439; ఇబ్నె హిషామ్-2/415, 416; సునన్ అబూ దావూద్-1/276

గనుక ఆయన ఇక్కడనే ఉండిపోతారేమో అనేదే వారి అనుమానం. వీరు ఈ ఆందోళన చెందుతూ ఉండగా దైవప్రవక్త (స) సఫా కొండపై నిలబడి దుఆ చేస్తున్నారు. దుఆ పూర్తి అయిన తరువాత ఆయన అన్సారులనుద్దేశించి, "ఇప్పటిదాక మీరు అనుకునేదేమిటి?" అని అడిగారు. "అబ్బే, మేమేం అనుకోలేదే?" అని జవాబు చెప్పగా, 'కాదు, మీరు ఏమని అనుకున్నారో చెప్పవలసిందే" అని పట్టుపట్టారు దైవప్రవక్త (స). చివరికి విషయం ఏమిటో చెప్పేశారు వారు. ఈ మాటలు విన్న మహాప్రవక్త (స), "అంత తీవ్రంగా ఆలోచించారా మీరు? ఇక నుండి నా జీవితం, నా మరణం మీతోనే" అని వారికి భరోసా ఇచ్చారు.

బైత్ (ప్రమాణం)

అల్లాహ్ దైవప్రవక్తకు, ఆయన తోటి ముస్లిములకు మక్కా విజయాన్ని ప్రసాదించిన తరువాత అసలు సత్యం ఏమిటో మక్కా ప్రజలకు తెలిసిపోయింది. ఇస్లామ్ తప్ప మరెందులోనూ మనం నెగ్గుకురాలేం అని అనుకున్నారు. కాబట్టి వారు దైవప్రవక్త (స) చేతి మీదుగా ప్రమాణం చేసి (బైత్ చేసి) ఇస్లామ్ ధర్మంలోనికి రావడం ప్రారంభించారు. హజ్రత్ ఉమర్ (ర) మహాప్రవక్త (స) ఎత్తయిన ప్రదేశంలో కూర్చుని ఉండగా ప్రజల నుండి ప్రమాణం చేయించుకుంటున్నారు. ప్రజలు ఆ బైత్‌లో సాధ్యమైనంత మట్టుకు ప్రవక్త (స) గారిని విధేయిస్తూ ఆయన ఆదేశాలను పాటిస్తాము అని ప్రమాణం చేస్తున్నారు.

తఫ్సీర్ మదారిక్ అనే గ్రంథంలో ఈ సందర్భం గురించే ఓ ఉల్లేఖనం ఉంది. దాని ప్రకారం:

"మహాప్రవక్త (స) పురుషులందరి చేత ప్రమాణం చేయించుకున్న తరువాత సఫా కొండపై స్త్రీల చేత కూడా ప్రమాణం చేయించుకో నారంభించారు. ఆ సమయంలో హజ్రత్ ఉమర్ (ర) క్రింద కూర్చుని ఉన్నారు. దైవప్రవక్త (స) ఆదేశం మేరకు ఆయన స్త్రీల చేత ప్రమాణం చేయించుకుంటున్నారు. వారికి మహాప్రవక్త (స)గారి ఆదేశాలను విడమర్చి చెబుతున్నారు. ఈ సందర్భంలోనే అబూ సుఫ్యాన్ భార్య హింద్ బిన్తె ఉత్బా

మారువేషంలో అక్కడికి వచ్చింది. దానికి కారణం, హజ్రత్ హమ్‌జా (ర)గారి శవం ఎడల ఆమె ప్రవర్తించిన తీరుకు భయపడిపోవడం, మహాప్రవక్త (స) ఆమెను గుర్తుపట్టకుండా ఉండడానికే. ఇటు మహాప్రవక్త (స) (బైత్ ప్రారంభిస్తూ) ఇలా అన్నారు:

"నేను మిమ్మల్ని అల్లాహ్‌కు ఎవరినీ సాటి కల్పించబోమనే మాటపై ప్రమాణం చేయిస్తున్నాను" అనగా హజ్రత్ ఉమర్ ఆ వచనాలనే తిరిగి మహిళలకు వల్లించి చెబుతున్నారు. ఆ తరువాత "దైవప్రవక్త (స) దొంగతనం చేయము" అని పలుకగా హిందా, "అబూ సుఫ్‌యాన్ చాలా పిసినిగొట్టు- ఒకవేళ నేను అతని సొత్తులో నుండి ఏదైనా తీసుకుంటే?(అది దొంగతనం అవుతుందా?)" అని అడిగింది. అబూ సుఫ్‌యాన్ కూడా అక్కడనే కూర్చుని ఉన్నారు.

"సరే నీవు ఆ సొత్తులో ఏది తీసుకున్నా అది నీకు ధర్మసమ్మతమైనదే అవుతుంది" అన్నారు అబూ సుఫ్‌యాన్.

ఇది విన్న మహాప్రవక్త (స) చిరునవ్వు నవ్వారు. ఆయన హింద్‌ను గుర్తు పట్టేశారు.

"ఓహో నీవు హింద్‌వా?" అనగా; "అవును, దైవప్రవక్తా! నేను హిందానే. ప్రవక్తా! జరిగిపోయిందేదో జరిగిపోయింది. దాన్ని తమరు క్షమించివేయండి, అల్లాహ్ తమరిని క్షమించుగాక" అన్నదామె.

ఆ తరువాత మహాప్రవక్త (స) మహిళలనుద్దేశించి, "వ్యభిచారము చేయము" అనగా హిందా; "ఏమిటి 'హుర్రా' (స్వతంత్రురాలైన స్త్రీ) ఎక్కడైనా వ్యభిచారానికి పాల్పడుతుందా?" అని అడిగింది.

"మా సంతానాన్ని హతమార్చము."

"మేము బాల్యంలో వారిని పెంచి పోషించినవాళ్ళం. కాని పెద్దయిన తరువాత మీరే వారిని హతమార్చారు. కాబట్టి ఈ విషయం మీకూ వారికే బాగా తెలుసు" అన్నది హిందా.

(హిందా కుమారుడు హంజలా బిన్ అబీ సుఫ్‌యాన్ బద్ర్ యుద్ధంలో

చంపబడిన విషయం మనకు గుర్తు ఉండే ఉంటుంది.) ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర) నవ్వును ఆపుకోలేక క్రిందపడిపోయారు. దైవప్రవక్త (స) కూడా చిరునవ్వు నవ్వేశారు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"ఎవరి మీదా అపనింద వేయము."

"దైవసాక్షి! అపనింద చాలా చెడ్డది. తమరు మాకు సన్మార్గాన్ని, నైతికతలను నేర్పుతున్నారు."

"ప్రసిద్ధమైన ప్రతి విషయంలోనూ దైవప్రవక్తకు అవిధేయత చూపము" అని పలికారు మహాప్రవక్త (స).

"దైవసాక్షిగా! మేము ఈ సభలో తమకు అవిధేయతను చూపుతామనే భావాన్నయినా మనస్సులో పెట్టుకుని రాలేదు" అంది హిందా.

హిందా వెనక్కు వెళ్ళిపోయి తన ఆరాధ్య దైవవిగ్రహాన్ని తునాతునకలు చేస్తూ, "మేము ఇప్పటివరకు నీ గురించి మోసంలో పడివున్నాం" అని పలుకసాగింది.[11]

మక్కాలో మకామేసి దైవప్రవక్త (స) చేసిన పని

మక్కాలో మహాప్రవక్త (స) మొత్తం పందొమ్మిది రోజులు ఉన్నారు. ఈ కాలంలో ఆయన ఇస్లామ్ గుర్తుల్ని పునరుద్ధరించడం, ప్రజలను సన్మార్గం వైపునకు పిలువడం, వారిలో దైవభీతిని కలుగజేయడం చేశారు. ఆ రోజుల్లోనే దైవప్రవక్త (స) ఆదేశమివ్వగా హజ్రత్ అబూ అసీద్ ఖుజాయి (ర), క్రొత్తగా 'హరం' సరిహద్దులుగా స్తంభాలు పాతారు. మహాప్రవక్త (స) ఇస్లామ్ ధర్మప్రచారం కోసం, మక్కా మరియు చుట్టుపట్ల ప్రతిష్టించబడి ఉన్న విగ్రహాలను రూపుమాపేందుకుగాను సరాయాలు పంపించడం జరిగింది. అలా అక్కడి విగ్రహాలన్నీ నామరూపాల్లేకుండా పోయాయి. మహాప్రవక్త(స) మక్కావాసుల్లో, "ఎవరైతే అల్లాహ్ మరియు ప్రళయ దినాన్ని విశ్వసిస్తున్నాడో అతను తన ఇంట ఎలాంటి విగ్రహాన్ని ఉంచకూడదు. సరికదా, వెంటనే దాన్ని రూపుమాపేయాలి" అని చాటింపు వేయించారు.

---

11. చూడండి, మదారకుతన్జీల్

సరాయా మరియు ప్రతినిధి బృందాలు

1. మక్కా విజయం పూర్తియైన తరువాత మహాప్రవక్త (స), రమజాన్ నెల 25వ తేదీ (హి.శ. 8) నాడు హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర)గారి సారధ్యంలో 'ఉజ్జా దేవుని' ప్రతిమను నాశనం చేసేందుకు ఓ సరియ్యాను పంపించారు. 'ఉజ్జా' నఖ్లా అనే ప్రదేశంలో ప్రతిష్టించబడి ఉన్న విగ్రహం. ఖురైష్ మరియు బనూ కనానా తెగవారంతా దాన్ని పూజిస్తూ ఉండేవారు. ఇది వారికి చెందిన అన్నిటికంటే పెద్ద దేవతా విగ్రహం. బనూ షైబాన్ దానికి పూజారులుగా ఉంటూ వస్తున్నారు. హజ్రత్ ఖాలిద్ (ర) ముప్ఫయి మంది ఆశ్వారూఢులతో 'నఖ్లా' వెళ్ళి ఆ 'ఉజ్జా' ప్రతిమను పడగొట్టారు. హజ్రత్ ఖాలిద్ (ర) తన పనిని పూర్తి చేసుకొని దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చారు.

"అక్కడ నీవేదైనా విశేషం చూశావా?" అని అడిగారు ప్రవక్తశ్రీ(స).

"లేదు" అని బదులిచ్చారు ఖాలిద్(ర).

"అయితే నీవు ఆ విగ్రహాన్ని పడగొట్టనే లేదన్నమాట. వెళ్ళి దాన్ని పడగొట్టిరా" అని చెప్పారు మహాప్రవక్త (స).

హజ్రత్ ఖాలిద్(ర) మళ్ళీ తన నగ్న కరవాలంతో అక్కడికి వెళ్ళగా, అక్కడ ఆయన వైపునకు తల విరబూసుకుని ఉన్న నల్లటి ఆకారం గల ఓ దిగంబర స్త్రీ రావడం కనబడింది. పూజారి ఆమెను పెద్దగా అరుస్తూ పిలుస్తున్నాడు. ఇంతలోనే హజ్రత్ ఖాలిద్ (ర) ఆమెపై వేసిన కత్తి వ్రేటుకు ఆమె రెండు ముక్కలుగా అయి క్రిందపడిపోయింది. ఆ తరువాత ఆయన మహాప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఆ వృత్తాంతమంతా చెప్పారు. అప్పుడాయన, "ఆమే ఉజ్జా. ఆమె పని అయిపోయింది. మీ దేశంలో ఆమెను ఇక పూజించేవారే ఉండరు" అన్నారు.

2. మహాప్రవక్త (స) అమ్రూ బిన్ ఆస్ (ర)ను, ఆ నెలలోనే, 'సువా' పేరుగల దేవతా విగ్రహాన్ని నిర్మూలించి రమ్మని పంపించారు. ఇది మక్కాకు మూడు మైళ్ళ దూరంలోని 'రిబాత్' అనే ప్రదేశంలో 'బనూ హుజైద్' తెగకు చెందిన దేవతా విగ్రహం. హజ్రత్ అమ్రూ (ర) అక్కడకు చేరగా అక్కడి పూజారి ఆయనతో, నీకేం కావాలి? అని అడిగాడు.

"దైవప్రవక్త (స), నాకు ఈ దేవతా విగ్రహాన్ని పడగొట్టి రమ్మని పంపించారు" అన్నారు అమ్రూ (ర).

"అది నీకు చేతనయ్యే పని కాదు."

"ఎందుకు?" అని అడిగారు అమ్రూ(ర).

"నీవు అలా చేయకుండా అడ్డుకోబడతావు చూడు" అన్నాడు పూజారి.

"ఓహో! నీవింకా అంధకారంలోనే ఉన్నావన్నమాట. ఇది చూడడంగాని, వినడంగాని చేస్తుందా?" అంటూ దాని దగ్గరకు వెళ్ళి దాన్ని ముక్కలుగా చేసివేశారాయన. తనతో వచ్చిన వారిని, వెళ్ళి ఈ విగ్రహానికి సంబంధించిన ధనాగారాన్ని పడగొట్టండి అని ఆదేశించారు. అక్కడ ఆయనకు ఏమీ లభించలేదు. పూజారిని చూసి "ఇప్పుడెలా ఉందో చెప్పు" అనగా అతను, "నేను అల్లాహ్‌ను విశ్వసిస్తున్నానని" ముస్లిమ్ అయిపోయాడు.

3. ఆ నెలలోనే హజ్రత్ సఅద్ బిన్ జైద్ అష్హలీ (ర)కు ఇరవై మంది అశ్వికులనిచ్చి మనాత్ వైపునకు పంపించారు మహాప్రవక్త (స). 'మనాత్', ఖుదియా దాపులో 'ముస్‌లుల్' అనే చోట అవస్, ఖజ్రజ్ మరియు గస్సాన్ తెగలకు సంబంధించిన దేవతా విగ్రహం ఉంది. హజ్రత్ సఅద్ (ర) అక్కడికి చేరగానే దాని పూజారి ఎందుకు వచ్చావు అని అడిగాడు.

"నేను నీ మనాత్ దేవతా విగ్రహాన్ని పడగొట్టి ధ్వంసం చేయడానికి వచ్చాను" అనగా, అతను అది నీ ఇష్టం అని అడ్డం తొలిగాడు. హజ్రత్ సఅద్ మనాత్ వైపునకు అడుగు ముందుకు వేయగానే ఓ నలుపు రంగు గల దిగంబర స్త్రీ జుట్టును విరబూసుకొని ఆయన వైపునకు రానారంభించింది. ఆమె తన ఎదురు రొమ్మును బాదుకుంటోంది. అంతలోనే ఆ విగ్రహ పూజారి ఆమెతో ఓ దేవతా! నీ ధిక్కారులను సంహరించు అని మొరపెట్టుకుంటున్నాడు. కాని ఇంతలోనే హజ్రత్ సఅద్ ఆమెపై వేసిన కత్తి వ్రేటుకు ఆమె ప్రాణాలు వదిలేసింది. వెంటనే వెళ్ళి ఆయన ఆ విగ్రహాన్ని ముక్కలు ముక్కలుగా చేసేశారు. ధనాగారంలో ఆయనకు ఏమీ లభించలేదు.

4. ఉజ్జా దేవతా విగ్రహాన్ని ధ్వంసం చేసి వచ్చిన హజ్రత్ ఖాలిద్ (ర)కు మహాప్రవక్త (స), షవ్వాల్ నెల (హి.శ. 8)లో 'బనూ జజీమా' వద్దకు

పంపించారు. ఇస్లామ్ ధర్మప్రచారం చేయడమే ఉద్దేశ్యంగా ఆయన్ను అక్కడకు పంపించడం జరిగింది. హజ్రత్ ఖాలిద్ (ర) తన వెంట ముహాజిర్లు, అన్సారులు మరియు బనూ సులైమ్ తెగకు చెందిన మొత్తం మూడొందల యాభై మందిని తీసుకొని అక్కడికి వెళ్ళారు. బనూ జజీమా వద్దకు వెళ్ళి ఆయన వారికి ఇస్లామ్ వైపునకు ఆహ్వానించారు. వారు 'అస్లమ్నా' (మేము ఇస్లామ్ స్వీకరించాము) అనే బదులు 'సబానా, సబానా' (మేము మా ధర్మాన్ని వీడాము) అననారంభించారు. ఈ మాటలు విన్న ఖాలిద్ వారిపై విరుచుకుపడి చాలా మందిని సంహరించి తక్కిన వారిని బంధించనారంభించారు. అలా తనతో వచ్చిన వారందరికీ ఒక్కో ఖైదీని అప్పజెప్పారు. ఓ రోజు ఖాలిద్ తనతో వచ్చిన వారందరికీ తన ఖైదీలను సంహరించండి అని ఆదేశం జారీచేశారు. కాని హజ్రత్ ఇబ్నె ఉమర్ (ర) మరియు ఆయన సహచరులు ఆయన ఆదేశాన్ని పాటించడానికి నిరాకరించారు. మహాప్రవక్త (స) వద్దకు వచ్చి ఈ వృత్తాంతాన్ని ఆయనకు చెప్పగా మహాప్రవక్త (స), తన రెండు చేతుల్ని పైకెత్తి రెండుమార్లు, "ఓ అల్లాహ్! ఖాలిద్ ఏదైతే చేశాడో దానికి నేను బాధ్యుణ్ణి కాను" అన్నారు. [12]

ఈ సందర్భంగా బనూ సులైమ్ తెగ వారు తమ ఖైదీలను హత మార్చారు. అన్సారులు, ముహాజిర్లు దాని జోలికిపోకుండా ఉన్నారు. మహాప్రవక్త (స) హజ్రత్ అలి (ర)ను అక్కడికి పంపించి వారి హతుల 'దీత్'ని (రక్తపరిహారాన్ని), వారికి జరిగిన నష్టానికి నష్టపరిహారాన్ని చెల్లించారు. ఈ వ్యవహారంలో హజ్రత్ ఖాలిద్ (ర)కు మరియు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)కు నడుమ వాగ్వివాదం కూడా జరిగింది. ఈ వార్త మహాప్రవక్త (స)కు అందగా ఆయన ఖాలిద్‌నుద్దేశించి, "ఖాలిద్ ఇక చాలించు! నా ఈ సహచరులను ఇంకేమీ అనకు. దైవసాక్షిగా చెబుతున్నాను, ఉహద్ కొండ పూర్తిగా బంగారమైపోయి, దాన్నంతటిని నీవు దైవమార్గంలో ఖర్చు చేసేసినా, నా ఈ సహచరుల్లోని ఏ ఒక్క వ్యక్తి చేసిన ఉదయం పూట ఆరాధన లేదా సాయంత్రం చేసిన ఒక్క ఆరాధనకు కూడా నీవు చేరలేవు" అన్నారు.[13]

---

12. సహీహ్ బుఖారి-1/450, 2/622.

13. ఈ గజ్వాకు సంబంధించిన ఆధారాలు ఈ గ్రంథాల నుండి పొందవచ్చు. ఇబ్నె హిషామ్ 2/389 - 437; సహీ బుఖారి - కితాబుల్ జిహాద్, కితాబుల్

ఇవీ గజ్వయె ఫతహె మక్కా (మక్కా విజయం గజ్వా) వివరాలు- ఈ నిర్ణయాత్మకమైన ఘన విజయం విగ్రహారాధనకు సంబంధించిన శక్తినంతటిని విరిచివేసింది. ఇంకా అరేబియా ద్వీపంలో మనజాలనంతగా దాని నడ్డి విరిచేసిన గజ్వా ఇది. ఎందుకంటే అప్పటివరకు సాధారణ తెగలన్నీ, ముస్లిములు మరియు విగ్రహారాధకుల నడుమ ఏ పోరాటం అయితే కొనసాగుతోందో దాని పరిణామం ఎలా ఉంటుందో అని వేచిచూస్తున్న తరుణం అది. సత్యం ఎవరి పక్షాన్నయితే ఉంటుందో వారే దైవగృహాన్ని కైవసం చేసుకుంటారని ఈ తెగలకు బాగా తెలిసిన విషయం.

ఈ విషయంలో అప్పటికి యాభై ఏళ్ళ క్రితం ఏనుగు బలం ద్వారా కాబా గృహాన్ని పడగొట్టడానికి ప్రయత్నించిన అబ్రహా గతి ఏమైందో వారికి బాగా తెలుసు. అల్లాహ్ గృహం వైపునకు అబ్రహా తన సైన్యంతో దురుద్దేశ్యంతో వచ్చినందుకు అల్లాహ్ వారిని హతమార్చి ఊకలా మార్చేసిన విషయం అరేబియా ప్రజలకు ఇంకా గుర్తే ఉంది.

సులే హుదైబియా (హుదైబియా ఒప్పందం) ఈ ఘన విజయానికి నాంది పలికిందన్న విషయం కూడా గుర్తుంచుకోవలసి ఉంది. దీని కారణంగా ఎల్లెడల శాంతి వాతావరణం నెలకొంది. ప్రజలు స్వతంత్రంగా ఒకరితో ఒకరు మాట్లాడుకునే స్వేచ్ఛ కూడా వచ్చేసింది. ఇస్లామ్ ధర్మం విషయంలో చర్చలూ జరిగేవి. ఎవరైతే రహస్యంగా ముస్లిములు అయి మక్కా నుంచి వలస పోయారో వారికి కూడా ఈ ఒప్పందం తరువాత తమ ధర్మం గురించి ప్రకటించే, దాన్ని ప్రచారం చేసే అవకాశం లభించింది. ఈ పరిస్థితుల మూలంగా చాలా మంది ఇస్లామ్ ధర్మం ఛత్ర ఛాయల్లోకి వచ్చారు. చివరికి, ఒకప్పుడు మూడు వేలకంటే పెరగని ఇస్లామీయ సంఖ్య సేన ఈ మక్కా విజయం సందర్భంగా పది వేల వరకు చేరిపోయింది.

ఈ నిర్ణయాత్మకమైన గజ్వా (మక్కా విజయం) ప్రజల కళ్ళను తెరిచింది. ఇస్లామ్ ధర్మస్వీకారం విషయంలో అడ్డుగోడగా నిలిచివున్న ఆ అడ్డంకి కూడా తొలగిపోయింది. ఈ విజయం తరువాత అరేబియా ద్వీప రాజకీయ, ధార్మిక

మునాసిక్-2/612 - 615, 622; ఫత్‌హుల్ బారి, 8/3 - 27; సహీముస్లిమ్-1/437, 438, 439; 2/102, 103, 130; జాదుల్ ముఆద్ - 2/160 - 168; ముక్తరుస్సీరత్ - షేక్ అబ్దుల్లాహ్, పుట. 322 - 351

దిగ్మండలంపై ఇస్లాం సూర్యుడు వెలగనారంభించాడు. ఇప్పుడు ధార్మిక పెత్తనం, ప్రాపంచిక అధికార పగ్గాలు మొత్తం ముస్లిముల చేతుల్లోకి వచ్చేశాయి.

అంటే, హుదైబియా ఒప్పందం తరువాత ముస్లిములకు అనుకూలంగా ఏ మార్పు అయితే ప్రారంభం అయిందో, ఈ విజయం తరువాత అది సంపూర్ణతను సంతరించుకుందన్న మాట. ఆ తరువాత మరో శకం ఆరంభమైంది. ఆ శకం పూర్తిగా ముస్లిములకే అనుకూలమైన శకం. ఇందు పరిస్థితి పూర్తిగా ముస్లిముల నియంత్రణలోనికి వచ్చేసింది. ఇక అరబ్బుల ముందు ఉన్నది ఒకే ఒక మార్గం, అది, వారు తండోపతండాలుగా దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడం, ఆయన పిలుపును తీసుకొని ప్రపంచంలో విస్తరించడం. వచ్చే రెండేళ్ళలో చేపట్టిన కార్యక్రమం కూడా అదే.



మూడవ దశ

ఈ దశ మహాప్రవక్త ముహమ్మద్ (స)గారి ప్రవక్త జీవితానికి సంబంధించిన చివరి దశ. ఇది దాదాపుగా 23 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం, కృషి ద్వారానూ, అనేక కడగండ్లను భరించి అనేక కుట్రలు, కలహాలు మరియు రక్తపాత యుక్త యుద్ధాలనెదుర్కొని ఆయన సాధించిన ఇస్లామీయ సందేశ ఫలితాలకు అద్దం పట్టే దశ ఇది.

ఈ సుదీర్ఘ కాలంలో ముస్లిములు మక్కాను జయించి సాధించిన ఘన కార్యమిది. ఈ కారణాల వల్లనే పరిస్థితుల ప్రవాహం దాని దిశను మార్చుకుంది. అరేబియా వాతావరణపరమైన మార్పు వచ్చేసింది. యదార్థం ఏమిటంటే, ఈ విజయాన్ని, దాని పూర్వపు రెండు కాలాలకు నడుమ ఓ ప్రస్ఫుటమైన సంఘటనగా చెప్పుకోవచ్చు. ఖురైషులు అరేబియా ప్రజల దృష్టిలో ధార్మిక పరిరక్షకులుగా ఉన్నందున మొత్తం అరేబియాయే వారికి దాసోహం అంటూ వచ్చింది. ఇప్పుడు ఖురైషులే లొంగిపోవడం వలన మొత్తం అరేబియా ద్వీపకల్పం నుండి విగ్రహారాధనా ధర్మం తుడుచుకుపోయిందనవచ్చు.

ఈ చివరి దశను రెండు భాగాలుగా విభజించవచ్చు.

1. జిహాద్ మరియు యుద్ధాలు.
2. ఇస్లామ్ ధర్మస్వీకారం కోసం జాతులు, తెగల పరుగు.

ఈ రెండు పరిస్థితులు కూడా ఒకదానితో మరొకటి ముడివడి ఉన్నాయి. అయితే ప్రస్తుతం గ్రంథక్రమం చెడిపోకుండా మేము వాటిని వేరువేరుగానే చర్చించదలిచాము. ప్రస్తుతం వెనుకటి పుటల్లో పోరాటాలు, యుద్ధాలను గురించే చెప్పుకుంటూ వస్తున్నాము గనుక, మునుముందు జరుగబోయే యుద్ధం కూడా దానికి సంబంధించినదే అయినందున ఇక్కడ ముందు యుద్ధాలను గురించే వివరించదలిచాము.

గజ్వయె హునైన్ (హునైన్ యుద్ధం)

మక్కా విజయం, ఖురైషులపై హఠాత్తుగా విరుచుకుపడినందుకు ముస్లిములకు చేకూరిన విజయం. ఈ హఠాత్పరిణామానికి అరబ్బులు నివ్వెర పోయారు. చుట్టుపట్లగల వారి మద్దత్తుదారులైన తెగలకు ఈ హఠాత్పరిణామాన్ని అడ్డుకునే ధైర్యం లేకపోయింది. కాబట్టి కొందరు తలబిరుసుగల, శక్తిమంతులైన కొన్ని తెగలను విడిచి, అన్ని తెగలూ ముస్లిములకు లొంగి పోవలసివచ్చింది. ఈ తలబిరుసుగల తెగల్లో 'హవాజిన్, సఖీఫ్' తెగలు ముఖ్యమైనవి. వారి వెంట 'ముజర్, జుషమ్, సఅద్ బిన్ బకర్'కు చెందిన తెగలు మరియు బనూ హలాల్ తెగకు సంబంధించిన కొందరు ఉన్నారు. ఈ తెగలన్నీ ఖైస్ బిన్ ఈలాన్‌కు చెందినవే. ముస్లిములకు లొంగిపోవడమనేది తమ ఆత్మాభిమానాన్ని భంగపరిచే విషయంగా స్ఫురించింది వారికి. ఈ తెగలన్నీ కలసి 'మాలిక్ బిన్ ఔఫ నస్రీ'తో కలసి, ముస్లిములపై దాడి చేయాలని నిర్ణయించుకున్నాయి.

శత్రు సైన్యం బయలుదేరి ఔతాస్‌లో విడిది చేయడం

అలా నిర్ణయించుకున్న ఆ తెగలు ముస్లిములతో తలపడేందుకు బయలుదేరారు- వారి జనరల్ కమాండర్ మాలిక్ బిన్ ఔఫ్- వారు తమ భార్యాపిల్లలను, పశుసంపదను కూడా వెంటబెట్టుకొచ్చారు. ముందుకు వెళ్ళి 'వాదియె ఔతాస్'లో విడిది చేశారు. ఇది 'హునైన్'కు దాపున, బనూ హవాజిన్ ప్రాంతంలో ఉన్న ఓ లోయ. అయితే ఇది హునైన్ లోయతో కలిసి లేదు. హునైన్ అనేది మరో లోయ. అది జుల్ మజాజ్ ప్రక్కనే ఉంది. అక్కడి నుండి 'అరఫాత్' మీదుగా మక్కా ప్రయాణ దూరం పది మైళ్ళ కంటే ఎక్కువే.[1]

సైన్యాధ్యక్షుణ్ణి విమర్శించిన ఓ యుద్ధ నిపుణుడు

'అవుతాస్'లో విడిది చేసిన వారంతా తమ కమాండరు చుట్టూ

1. ఫత్‌హుల్ బారి - 8/27, 42.

మూగారు. వారిలో 'దురైద్ బిన్ సిమ్మా' కూడా ఉన్నాడు - ఇతను వృద్ధుడై పోయి నందు వలన కేవలం యుద్ధ అనుభవాల రీత్యా సలహాలు మాత్రమే ఇవ్వ గలడు. కాని మునుపు అతను గొప్ప యోధుడు, యుద్ధ నిపుణుడుగా కూడా పేరు పొంది ఉన్నవాడు - అతను ప్రజల నుద్దేశించి,"మనం ఏ లోయలో ఉన్నామిప్పుడు?" అని అడగ్గా, "అవుతాస్ లోయలో" అని సమాధానమిచ్చారు వారు. అతను ఆ లోయ గురించి మెచ్చుకుంటూ, "ఇది ఓ మేలైన ప్రదేశం. రాళ్ళు తేలి, గుంటలు పడిన నేల కాదిది. ఎత్తుపల్లాలు లేనిది ఇది. కాని ఇక్కడ నేను ఒంటెల అరుపులు, గాడిదల ఓండ్రింపులు, పిల్లల ఏడ్పులు, మేకల అరుపులు వింటున్నానేమిటీ?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"మాలిక్ బిన్ ఔఫ్ సైన్యంతో పాటే వారి స్త్రీలను, పిల్లల్ని, పశువుల్ని కూడా తోలుకొచ్చాడు" సమాధానమిచ్చారు వారు.

దురైద్, మాలిక్‌ను పిలిచి, "అలా ఎందుకు చేశావు?" అని అడిగాడు.

"ప్రతి వ్యక్తి వెనుకాల అతని భార్యాపిల్లలు, పశుసంపదను ఉంచితే అతడు వారి రక్షణార్థమైనా ప్రాణాలకు తెగించి యుద్ధం చేస్తాడని భావించి అలా చేశాను" అన్నాడు మాలిక్.

"దైవసాక్షి! నీవు ఉత్త గొడ్లకాపరిలా ఉన్నావు. ఓడిపోయే వాడిని ఏది రక్షించగలదు గనుక? చూడు యుద్ధంలో నీవే విజయం పొందావనుకో సరేసరి. అది నీ దగ్గరున్న కరవాలం మరియు శులాల ద్వారానే సాధ్యం. కాని నీవు ఓడిపోతే మాత్రం, నీవు నీ భార్యాపిల్లలను, పశుసంపదను శత్రువుకు అప్పగించి అగౌరవాన్ని పొందే పరిస్థితికి దిగజారగలవు" అన్నాడు దురైద్.

ఆ తరువాత తక్కిన సర్దారుల విషయం గురించి కూడా ఆరా తీసిన తరువాత ఇలా అన్నాడు:

"మాలిక్! నీవు బనూ హవాజిన్ స్త్రీలను, పిల్లల్ని సైన్యం నెత్తిపై భారంగా మోపి నీవేమీ ఘనకార్యాన్ని వెలగబెట్టలేదు. ఇప్పటికైనా మించిపోలేదు. వారిని వారికి చెందిన సురక్షిత ప్రాంతాలకు పంపించేయి. ఆ తరువాత గుర్రాల వీపులపై కూర్చుని ఆ ధర్మభ్రష్టులను మార్కో. నీకే విజయం ప్రాప్తిస్తే వారంతా వచ్చి నిన్ను కలుసుకోగలరు. నీకే ఓటమి ఎదురైతే నీ భార్యాపిల్లలు, నీ పశుసంపద సురక్షితంగా ఉంటారు."

కాని సర్వసైన్యాధిపతి అయిన మాలిక్, అతని ఈ సలహాను త్రోసి పుచ్చుతూ, "దైవసాక్షి! నేనలా చేయలేను. నీవు ముసలివాడివి. నీ బుద్ధి కూడా ముసలిదైపోయింది. దైవసాక్షి! ఈ హవాజిన్ వారు నాకు సహాయమన్నా చేస్తారు. లేదా నేను నా ఈ కరవాలాన్ని భూమ్మీద నిలబెట్టి పొట్టకు ఆన్చి క్రిందకు వత్తుకొని ఆత్మహత్యనైనా చేసుకుంటాను. అది నా పొట్టలో నుండి దూరి ఆవలికైనా వెళ్ళగలదు" అన్నాడు మాలిక్.

యదార్థం ఏమిటంటే మాలిక్‌కు, ఈ యుద్ధంలో దురైద్ పేరును ఎత్తడం, లేదా అతని సలహా పొందడం ఇష్టం లేదు. మాలిక్ పంతాన్ని పసిగట్టిన హవాజిన్ తెగ వారు అతణ్ణి విధేయించడానికే సిద్ధపడ్డారు. అది చూసిన దురైద్, "ఈ యుద్ధంలో పాల్గొన్న వాణ్ణీ కాను, పాల్గొనకుండా ఉండినవాణ్ణీ కాను" అంటూ ఈ పద్యపాదాల్ని వల్లించాడు.

"నేను వయస్సులో ఉన్నవాడై ఉంటే బాగుండును. ప్రాణాలకు తెగించి యుద్ధం చేసేవాణ్ణి, ఓ ఎత్తయిన గుర్రంపై ఉండి ఈ సైన్యాన్ని నడిపించే వాణ్ణి."

శత్రువు గూఢాచారులు

ఆ తరువాత ముస్లిముల పరిస్థితులెలా ఉన్నాయో తెలుసుకోవడానికి వెళ్ళిన గూఢాచారులు రావడం జరిగింది. బాగా గాయాలపాలై ఉన్నారు. అది చూసిన మాలిక్ వారితో, "మీరు నాశనం కాను, మీ పరిస్థితి ఇలా ఉందేమిటీ?"అని అడిగాడు.

"మేము మచ్చల గుర్రాలపై స్వారీ చేస్తున్న శ్వేత వర్ణంగల వారిని చూశాం. ఆ తరువాత మాకు ఈ గతి పట్టింది" అన్నారు వారు.

మహాప్రవక్త (స) గారి గూఢాచారులు

ఇటు మహాప్రవక్త (స) కూడా శత్రువుల కదలికలను పసిగట్టేందుకు పంపిన గూఢాచారుల ద్వారా శత్రువు కదలి వస్తున్నాడని తెలుసుకున్నారు. అబూ హద్‌రొ అస్లమీ (ర)ను, శత్రువు బస చేసివున్న చోటుకు వెళ్ళి వారితో కలిసి ఉండమని, వారి పరిస్థితుల గురించి తెలియజేయమని ఆయన్ను అక్కడికి ఇదివరకే పంపించి ఉన్నారు. ఆయన దైవప్రవక్త (స) ఆదేశం మేరకు అలానే చేశారు.

మక్కానుండి హునైన్‌కు బయలుదేరిన మహాప్రవక్త (స)

శనివారం, షవ్వాల్ నెల 6వ తేదీ (హి.శ: 8) రోజున దైవప్రవక్త (స) మక్కా నుండి బయలుదేరారు. ఆయన మక్కాలో ప్రవేశించిన పందొమ్మిదవ రోజది. పన్నెండు వేల సైన్యం ఆయన వెంట ఉంది. మక్కా విజయం కోసం ఆయనతో బయలుదేరిన పది వేల మంది, రెండు వేల మంది మక్కా వాసులు. వారిలో చాలా మంది అప్పుడే ఇస్లామ్ ధర్మం స్వీకరించిన నవముస్లిములు. మహాప్రవక్త (స) సుఫ్‌వాన్ బిన్ ఉమయ్యా నుండి వంద కవచాలను ఆయుధాలతో సహా బదులు తీసుకున్నారు. అత్తాబ్ బిన్ అసీర్(ర)ను మక్కాకు గవర్నరుగా నియమించారు.

మధ్యాహ్నం అయ్యేకల్లా ఓ అశ్వారూఢుడొచ్చి, "నేను ఫలానా కొండ నెక్కి చూడగా బనూ హవాజిన్ వారు వారి సర్వస్వాన్ని వెంటబెట్టుకొని వస్తున్నట్లు అగుపించింది. వారి వెంట వారి స్త్రీలు, పశువులు, మేకలు కూడా ఉన్నాయి" అని చెప్పాడు.

మహాప్రవక్త (స) చిరునవ్వు నవ్వి, "ఇన్షా అల్లాహ్, అవన్నీ రేపు ముస్లిములకు విజయ ధనంగా వస్తాయి" అన్నారు. రాత్రి కాగానే హజ్రత్ అనస్ బిన్ అబీ మర్సిద్ గనవీ (ర) స్వచ్ఛందంగా కాపలా కాస్తానని ఒప్పుకొని కాపలా కాశారు.[2]

హునైన్‌కు వెళ్ళే మార్గంలో పెద్ద వృక్షం ఒకటుంది. దాన్ని 'జాతుల్ అన్వాత్'గా పిలుస్తారు - అరబ్బు ముష్రికులు దానిపై తమ ఆయుధాలను వ్రేళ్ళాడదీసేవారు. దాని ముందు పశువుల్ని బలి ఇచ్చేవారు. అక్కడ జాతర కూడా చేసేవారు - కొందరు సైనికులు దాన్ని చూసి దైవప్రవక్త (స)తో మీరు కూడా మా కోసం 'జాతె అన్వాత్' లాంటిది ఒకటి సమకూర్చి పెట్టండి అని విన్నవించుకోగా, మహాప్రవక్త (స) కొంత అసహనంగా, "ఎవరి చేతిలోనైతే నా ప్రాణాలున్నాయో ఆ దేవుని సాక్షి! మీరు కూడా, మూసా (అ.స.) జాతి మూసాతో, "మా కోసం కూడా వీరిలాంటి ఓ ఆరాధ్య దైవాన్ని సమకూర్చండి" అని చెప్పినట్లే చెబుతున్నారు. ఇదా మీ తీరు? మీరు కూడా మీ పూర్వీకుల ఆచారాలనే నమ్ముకొని ఉన్నారిప్పటి వరకు?" అని అన్నారు.[3]

---

2. చూడండి, సునన్ అబూ దావూద్-2/317

3. తిర్మిజీ, ఫిత‌న్ అధ్యాయం-2/41; ముస్నదె అహ్మద్ - 5/281

(మార్గమధ్యంలో) కొందరు తమ సైనికుల సంఖ్యను చూసి విర్రవీగే ధోరణిలో, "మేము ఈ రోజు అసలే ఓడిపోము" అని అనగా, ఈ మాటలు దైవప్రవక్త (స) కు ఆగ్రహాన్ని తెచ్చిపెట్టాయి.

ఇస్లామీయ సైన్యంపై హఠాత్తుగా వర్షించిన బాణాల వర్షం

ఇస్లామీయ సైన్యం మంగళవారం మరియు బుధవారాల మధ్యనాటి రాత్రి (షవ్వాల్ 10) నాడు హునైన్‌కు చేరుకుంది. కాని మాలిక్ బిన్ ఔఫ్ వారి రాకకు పూర్వమే అక్కడికి చేరి తన సైన్యాన్ని రాత్రి అంధకారంలో ఆ లోయలోనికి తీసుకు వచ్చి ఉన్నాడు. దాన్ని మార్గంలోని కొండల్లో, గుహల్లో, రహస్య ప్రదేశాల్లో నియమించాడు. ముస్లిములు అక్కడికి రాగానే ముందు వారిని మీ శరపరంపరలతో సంహరించండని, ఆ తరువాత ఒక్కసారే వారిపై దాడి చేయండని ఆదేశించి ఉన్నాడు.

ఇటు వేకువనే మహాప్రవక్త (స) తన సైన్యాన్ని తీర్చిదిద్దారు. తన చేతుల మీదుగా యుద్ధ పతాకాలను కట్టి ముస్లిమ్ సైనికులకు పంచి పెట్టారు. ఆ తరువాత తెల్లవారుతూ ఉండగా ముస్లిములు హునైన్ లోయ లోనికి అడుగుపెట్టారు. వారికి అక్కడ శత్రువు తమ కోసం మాటువేసుకొని ఉన్నాడన్న సంగతి తెలియదు. వారు ఏమరుపాటుగా ఆ కొండలోయలోనికి దిగుతున్నారు. అంతలోనే వారిపై బాణాల వర్షం కురువనారంభించింది. ఆ వెంటనే శత్రుమూకలు ఒక్కసారిగా వారిపై విరుచుకుపడ్డారు. (హఠాత్తుగా జరిగిన ఈ దాడికి ముస్లిములు తెములుకోలేకపోయారు) వారు చెల్లాచెదురై ఎవరు ఎటు పరుగిడుతున్నారో తెలియకుండా అయోమయ స్థితిలో పడిపోయారు. ఇది ఘోర పరాజయం. ఇది చూసిన అబూ సుఫ్‌యాన్ బిన్ హరబ్- ఆయన అప్పుడే ముస్లింగా మారి సైన్యంలో ఉన్నాడు - "అయ్యో! ఈ అస్తవ్యస్త పరిస్థితి ఆగేది కాదు!" అన్నాడు.

ఇదంతా ఇబ్నె ఇస్‌హాక్ కథనం. బరా బిన్ ఆజిబ్ (ర) ఉల్లేఖనం సహీ బుఖారీలో ఉంది. ఆ ఉల్లేఖనం పైన చెప్పిన పరిస్థితికి భిన్నమైనది. ఆయన మాటల్లో:

హవాజిన్ వారు కేవలం ధనుర్విద్యలో నిపుణులు. మేము తిరిగి దాడి

చేయగానే వారు పారిపోయారు. ఆ పిదప మేము వారి విజయ ధనంపై విరుచుకుబడ్డాము. వారు మాపై బాణాలను సంధించనారంభించారు.[4]

హజ్రత్ అనస్‌గారి ఉల్లేఖనం సహీ ముస్లిమ్ గ్రంథంలో ఉల్లేఖించబడి ఉంది. అది కూడా దీనికి కొంత భిన్నంగానే ఉన్నా, దాన్ని బలపరుస్తూ ఉంది కూడా. ఆయన ఉల్లేఖనం ఇది:

"మేము మక్కాను జయించాం. ఆ తరువాత హునైన్ పైకి దండెత్తాం. ముష్రికులు ఎంతో మిన్నగా వరుసలు కట్టి మా ముందుకు వచ్చారు. నేను ఇప్పటి వరకు అలాంటి యుద్ధవ్యూహాన్ని చూడలేదు. ముందు అశ్వారూఢులు, వారి వెనుక పదాతి దళం, దాని వెనుక స్త్రీలు వారి వెనుకాల మేకలు, గొర్రెలు ఇతర పశువులు ఉన్నాయి. మా సంఖ్య కూడా గొప్పదే. మా అశ్విక సైనికుల మైమనా (కుడి పార్శ్వం) పై హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర) ఉన్నారు. కాని వారు మా వెనకాల దాక్కోడం ఆరంభించారు. కొంత సేపటిలోనే మా అశ్విక దళం పారిపోనారంభించింది. ఆ తరువాత పల్లె వాసులు కూడా పారిపోతున్నారు. వారెవరో మాకు తెలియదు."[5]

మొత్తానికి, త్రొక్కిసలాట ప్రారంభం కాగానే మహాప్రవక్త (స) తన కుడి చేతి వైపునకు తిరిగి, "ప్రజలారా! నా వైపునకు రండి, నేను అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్‌ను" అని అరిచారు. ఆ సమయంలో అక్కడ ఆయనతోపాటు కొందరు ముహాజిర్లు, వారి కుటుంబీకులు తప్ప మరెవ్వరూ లేరు.[6]

ఈ విషమ పరిస్థితిలో మహాప్రవక్త (స) సాటిలేని శౌర్యాన్ని ప్రదర్శించారు. అంటే తీవ్రమైన త్రొక్కిసలాట, పలాయనాలు జరిగినప్పటికీ ఆయన

---

4. సహీ బుఖారి 5. ఫత్‌హుల్ బారి-8/29

6. ఇబ్నె ఇస్‌హాక్ కథనంలో వారి సంఖ్య తొమ్మిది లేదా పది మంది. నోవీగారి ఉల్లేఖనంలో మహాప్రవక్త (స) వెంట మొత్తం పన్నెండుగురు ఉన్నారని ఉంది. ఇమామె అహ్మద్ మరియు హాకిమ్‌లిద్దరూ ఇబ్నె మస్‌ఊద్ (ర)గారి ఉల్లేఖనాన్ని ఇలా ఉటంకించారు: "నేను హునైన్ యుద్ధం రోజున దైవప్రవక్త (స) గారి వెంటే ఉన్నాను. ప్రజలు వెన్నుజూపి పారిపోయారు. కాని ఆయన (స) వెంట మాత్రం ముహాజిర్లు, అన్సారులు స్థిరంగా నిలబడే ఉన్నారు. మేము కాలినడకనే ఉన్నాం కాని వెన్నుజూపలేదు."

తిర్మిజీ, హజ్రత్ ఇబ్నె ఉమర్ ఉల్లేఖనాన్ని ఉల్లేఖించారు. ఆయన తన

ముఖం దైవతిరస్కారుల వైపే ఉంది. ఆయన ముందుకు వెడుతూనే ఉన్నారు. తన కంచర గాడిదను అదిలిస్తూ ఇలా అంటున్నారు:

"నేను ప్రవక్తను. ఇది అసత్యం కాదు. నేను అబ్దుల్లా కుమారుణ్ణి."

కాని అదే సమయంలో అబూ సుఫ్యాన్ బిన్ హారిస్ (ర) ఆయన కంచరగాడిద కళ్ళెం పట్టుకున్నారు. హజ్రత్ అబ్బాస్ (ర) దాని రికాబును పుచ్చుకున్నారు. వీరిద్దరు ఆ గాడిదను వేగంగా ముందుకు పోకుండా వెనక్కిలాగి నియంత్రిస్తున్నారు. ఆ తరువాత మహాప్రవక్త (స) తమ పినతండ్రి అయిన హజ్రత్ అబ్బాస్ (ర)ను- ఆయన గొంతు పెద్దది- సహాబా (ర)ను పిలువమని ఆదేశించారు. హజ్రత్ అబ్బాస్ (ర) పెద్దగా అరుస్తూ, "ఓ బైతె రిజ్వాన్ చేసినవారలారా! మీరెక్కడున్నారు? నా పిలుపు విని ఆవు తన దూడ వైపునకు తిరిగి వచ్చినట్లుగా పరుగిడి రండి" అని పిలిచారు."ఇదిగో వస్తున్నాం" అని అన్నారు.[7]

ఆ పిలుపును విన్న ప్రతివాడూ తాను ఎక్కి పారిపోతున్న ఒంటెను నిలువరించడానికి ప్రయత్నం చేస్తున్నాడు. అది ఆగక అలానే వెడుతూ ఉంటే తన దగ్గరున్న కవచాన్ని దాని మెడలో వేసి కేవలం కరవాలం, ఢాలు పట్టుకొని దానిపై నుండి దూకి హజ్రత్ అబ్బాస్ (ర) పిలిచిన పిలుపు వైపునకు పరుగిడనారంభించాడు. అలా దైవప్రవక్త (స) వద్దకు వచ్చి చేరిన వారి సంఖ్య వంద వరకు చేరిపోయింది. వీరంతా కలసి శత్రువును ఎదుర్కొంటూ యుద్ధం ఆరంభించారు.

ఆ తరువాత అన్సారుల పిలుపు ఆరంభం అయింది. ఓ అన్సారుల్లారా! ఓ అన్సారుల్లారా! అంటూ. ఈ పిలుపు బనూ హారిస్ బిన్ ఖజ్రజ్ మట్టుకే పరిమితమైంది. ఇటు ముస్లిమ్ పటాలాలు ఏ గతిన యుద్ధరంగాన్ని వీడారో అదే గతిన ఒకరి వెనుక మరొకరు వచ్చి చేరడం ఆరంభించారు. చూస్తూ ఉండగానే ఇరుపక్షాల నడుమ భీకర యుద్ధం ప్రారంభం అయింది. మహా ప్రవక్త (స) అటు దృష్టిని సారించగా భయంకర యుద్ధం జరుగుతోంది. అప్పుడాయన అన్నారు: "ఇప్పుడుగాని పొయ్యి రగులుకోలేదు" అని. పిదప

ఉల్లేఖనంలో ఇలా అంటారు: "నేను మా వారిని హునైన్ రోజున చూద్దును కదా వారు వెన్నుజూపి పారిపోతున్నారు. దైవప్రవక్త (స) వెంట వంద మంది కూడా లేరప్పుడు." (ఫత్‌హుల్ బారి-8/29, 30)

7. సహీ ముస్లిమ్-2/100

ఆయన ఓ పిడికెడు మట్టి ఎత్తి శత్రువు వైపునకు విసురుతూ, "షాహతిల్ వుజూహ్" (మీ ముఖాలు చెడిపోగాక) అన్నారు. ఈ పిడికెడు దుమ్ము శత్రువు కళ్ళలో పడి వారిని గ్రుడ్డివారుగా చేసింది. ఆ తరువాత వారి వాడి వేడి రెండూ తగ్గనారంభించాయి. వారు వెనుతిరిగి పలాయనం చిత్తగించ నారంభించారు.

ఘోర పరాజయం పాలైన శత్రువు

అలా మట్టి విసిరిన కొన్ని నిమిషాలకే శత్రువుకు ఘోర పరాజయం ఎదురైంది. సఖీఫ్ తెగకు చెందిన డెబ్బై మంది ప్రాణాలు వదిలేశారు. వారి వద్ద ఏదైతే ధనసంపద, స్త్రీలు, పిల్లలున్నారో వారందరినీ ముస్లిములు హస్తగతం చేసుకున్నారు.

యుద్ధసమయంలో జరిగిన ఈ అసాధారణ మార్పునే దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَّيَوْمَ حُنَيْنٍ ۙ اِذْ اَعْجَبَتْكُمْ كَثْرَتُكُمْ فَلَمْ تُغْنِ عَنْكُمْ شَيْـًٔا وَّضَاقَتْ
عَلَيْكُمُ الْاَرْضُ بِمَا رَحُبَتْ ثُمَّ وَلَّيْتُمْ مُّدْبِرِيْنَ ۚ ثُمَّ اَنْزَلَ اللّٰهُ
سَكِيْنَتَهٗ عَلٰى رَسُوْلِهٖ وَعَلَى الْمُؤْمِنِيْنَ وَاَنْزَلَ جُنُوْدًا لَّمْ
تَرَوْهَا ۚ وَعَذَّبَ الَّذِيْنَ كَفَرُوْا ۚ وَذٰلِكَ جَزَآءُ الْكٰفِرِيْنَ ۝

"అల్లాహ్ ఇదివరకు చాలా సందర్భాల్లో మీకు సహాయం చేసి ఉన్నాడు. ఇటీవలనే 'హునైన్' సంగ్రామం రోజున ఆయన సహాయం యొక్క మహిమను మీరు చూసి ఉన్నారు. ఆ రోజు మీరు సంఖ్యాబలాన్ని చూసి గర్వపడ్డారు. కాని అది మీకు ఏ విధంగానూ పనికి రాలేదు. భూమి విశాల మైనది అయినప్పటికీ మీకు అది ఇరుకైపోయింది. మీరు వెన్నుజూపి పారి పోయారు. తరువాత అల్లాహ్ తన (తరపు నుండి) ప్రశాంత స్థితిని తన ప్రవక్తపై విశ్వాసులపై అవతరింపజేశాడు; ఇంకా మీకు కనిపించని దళాలను యుద్ధరంగంలోకి దించాడు. సత్యతిరస్కారులను శిక్షించాడు. సత్యాన్ని తిరస్కరించే వారికి లభించే ప్రతిఫలం ఇదే." (9 : 25,26)

తరమబడిన శత్రువు

పరాజయాన్ని చవిజూసిన శత్రువుల పటాలం ఒకటి 'తాయెఫ్' వైపునకూ, మరొకటి 'నక్లా' వైపునకూ, ఇంకొకటి 'అవుతాస్' వైపునకూ పారిపోయాయి. దైవప్రవక్త (స), శత్రువును తరుముతూ వెళ్ళమని అబూ ఆమిర్ అషఅరీ (ర) గారి నేతృత్వంలో ఓ సైనిక పటాలాన్ని 'అవుతాస్' వైపునకు పంపించారు. ఇరుపక్షాల్లో కొంత పోరు జరిగింది. ఆ తరువాత ముష్రిక్కులు పారిపోవడం జరిగింది. అయితే ఈ పోరులోనే ఆ సైనిక పటాలం కమాండరు అబూ ఆమిర్ అష్అరీ (ర) షహీద్ అయ్యారు.

ముస్లిముల వాహనారూఢుల మరో పటాలం నక్లా వైపునకు పారిపోతున్న ముష్రిక్కులను తరుముకుంటూ వెళ్ళింది. అక్కడ వారికి దురైద్ బిన్ సిమ్మా పట్టుబడ్డాడు. రబీయా బిన్ రఫీ (ర) అతణ్ణి అంతమొందించారు.

తాయెఫ్ వైపునకు పారిపోయిన మూడో పటాలం అతి పెద్దది. దీన్ని తరిమిన వారు స్వయంగా దైవప్రవక్త (స)గారే. ఆయన దీన్ని హునైన్‌లో శత్రువు వదిలిపెట్టిన విజయ ధనాన్ని పూర్తిగా ప్రోగుచేసిన తరువాతనే తరుముకు వెళ్ళారు.

విజయ ధనం

విజయధనంలో ఆరు వేల మంది ఖైదీలు, ఇరవై నాలుగు వేల ఒంటెలు, నలభై వేలకంటే ఎక్కువ మేకలు, వెండి నాలుగు వేల ఓకియాలు (అంటే లక్షా అరవై వేల దిర్హములు. దాని బరువు కొన్ని కిలో గ్రాములు తక్కువ మొత్తం ఆరు క్వింటాళ్ళు). మహాప్రవక్త (స) వాటన్నింటినీ ఓ చోట చేర్చే ఆదేశమిచ్చారు. దాన్ని 'జీరానా' అనే ప్రదేశంలో ఉంచి, హజ్రత్ మస్ఊద్ బిన్ అమ్రూ గిఫ్ఫారి (ర)ని కాపలాగా పెట్టారు. దైవప్రవక్త (స) తాయెఫ్ గజ్వాకు వెళ్ళివచ్చిన తరువాత ఆ విజయ ధనాన్ని పంచిపెట్టడం జరిగింది.

ఖైదీల్లో షీమా బిన్తె హారిస్ సఅదియా కూడా ఉన్నారు. ఆమె హలీమా సఅదియా కుమార్తె, చిన్నప్పుడు దైవప్రవక్త (స) హలీమా సఅదియా పాలు త్రాగడం వల్ల ఆమె ఆయనకు క్షీర సంబంధంగా సోదరి అవుతుంది. ఆమె తాను ఫలానా అని పరిచయం చేసుకోగా దైవప్రవక్త (స) ఆమెను గుర్తుపట్టారు.

ఆమెను ఎంతో గౌరవిస్తూ తన దుప్పటి పరిచి దానిపై కూర్చోబెట్టారు. ఆ తరువాత ఆమెను సగౌరవంగా ఆమె జాతివారికి అప్పగించడం జరిగింది.

గజ్వాయె తాయెఫ్

ఈ గజ్వా (పోరాటం) నిజానికి హునైన్ యుద్ధానికి సంబంధించిందే. హవాజిన్ మరియు సఖీఫ్ తెగలకు చెందిన అనేక మంది అపజయంపాలై తమ జనరల్ కమాండర్ మాలిక్ బిన్ అవుఫ్ నస్రీ వెంట పారిపోయి తాయెఫ్‌కు వచ్చేశారు. అక్కడనే కోటలో దాగిపోయారు. కాబట్టి మహాప్రవక్త (స) హునైన్ యుద్ధం అయిపోయిన తరువాత లభించిన విజయ ధనాన్ని 'జీరానా'లో ఉంచి అదే నెల (షవ్వాల్, హి.శ. 8) తాయెఫ్‌కు బయలుదేరారు.

దీని కొరకు ఆయన (స) ముందస్తుగా హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర)కు ఒక వేయి మంది సైనికులనిచ్చి పంపించారు. ఆ తరువాత ఆయన (స) బయలుదేరి తాయెఫ్‌కు వెళ్ళారు. 'నక్లా, యమానియా, ఖర్నెమనాజిల్, లియా'లను దాటారు. లియాలో మాలిక్ బిన్ ఔఫ్‌కు చెందిన ఓ కోట ఉంది. దాన్ని పడగొట్టి తమ ప్రయాణాన్ని కొనసాగిస్తూ 'తాయెఫ్'కు చేరారు. తాయెఫ్ కోట దగ్గర శిబిరాలను ఏర్పాటు చేసి దాన్ని దిగ్బంధించారు.

ఆ దిగ్బంధం కొన్ని రోజుల వరకు కొనసాగింది. సహీ ముస్లిమ్‌లో హజ్రత్ అనస్ (ర) గారి ఉల్లేఖనం ప్రకారం, ఆ దిగ్బంధం నలభై రోజుల వరకు కొనసాగిందని ఉంది. కొందరు చరిత్రకారులు ఆ కాలం ఇరవై రోజులు అని అంటారు. మరికొందరు పది రోజులని, ఇంకొందరు 18 రోజులు, కొందరు చరిత్రకారులు 15 రోజులు అని రాశారు.[8]

కోటను దిగ్బంధించినప్పుడు ఇరుపక్షాల వైపు నుండి బాణాలు సంధించబడ్డాయి. రాళ్ళు రువ్వబడ్డాయి. కాగా మొదట ముస్లిములు కోటను చుట్టిముట్టినప్పుడైతే కోటలో నుండి వారిపై ఎడతెగకుండా బాణాల వర్షం కురిసింది. ఆ శరాఘాతాలకు అనేక మంది ముస్లిములు గాయపడ్డారు కూడా. అందులో పన్నెండుగురు అమరుగతులైపోయారు. చివరికి వారు తమ శిబిరాన్ని లేపి ప్రస్తుతం తాయెఫ్ మస్జిద్ ఉన్న ప్రాంతానికి పోవలసి వచ్చింది.

మహాప్రవక్త (స) ఈ కొత్త పరిస్థితిని అడ్డుకునేందుకుగాను 'మింజ

8. ఫత్‌హుల్ బారి -8/45.

నీక్'లు పెట్టి కోటపైకి గుండ్లను కురిపించారు. దాని వలన కోట గోడలో పగుళ్ళు ఏర్పడ్డాయి. ముస్లిముల ఓ వర్గం పైన కప్పుగల ఓ రక్షణ కవచంలో చొరబడి కోటకు నిప్పుబెట్టే ఉద్దేశ్యంతో దాని గోడ వరకు చేరిపోయింది. కాని శత్రువులు వారిపై ఎర్రగా కాలుతున్న ఇనుప కడ్డీలను విసరనారంభించారు. ఇక చేసేదిలేక వారు ఆ కవచం నుండి బయటకు రాగా శత్రువులు వారిపై బాణాలను కురిపించనారంభించారు. దానివల్ల కూడా కొందరు ముస్లిములు షహీదులు అయిపోయారు.

దైవప్రవక్త (స) శత్రువును లొంగదీయటానికి మరో యుద్ధవ్యూహాన్ని పన్నారు. దాని ప్రకారం, ఆయన తన అనుచరగణానికి, అక్కడున్న ద్రాక్ష తోటల్ని కాల్చి వేయండని ఆదేశమివ్వగా, ముస్లిములు కొంత అధికంగానే ద్రాక్ష తీగల్ని తగులబెట్టనారంభించారు. ఇది చూసిన సఖీఫ్‌వారు లబోదిబో అంటూ అల్లాహ్‌ను, బంధుత్వాన్ని అడ్డంగా పెట్టి ఆ తీగల్ని తగలబెట్టడం ఆపేయమని ప్రాధేయపడ్డారు. మహాప్రవక్త (స) వారి ఈ అభ్యర్థనను మన్నించి అలా చేయకుండా ముస్లిములను ఆపేశారు.

దిగ్బంధం సమయంలో మహాప్రవక్త (స) ఓ చాటింపు వేయించారు. "ఏ బానిస అయితే కోట దిగి మా దగ్గరికి వస్తాడో అతణ్ణి స్వతంత్రునిగా చేస్తాము" అన్నదే ఆ చాటింపు. ఆ చాటింపు విని ముప్పై మంది బానిసలు కోట నుండి బయటకు వచ్చి ముస్లిములతో కలసిపోయారు.[9] వారిలోనే ఓ బానిస హజ్రత్ అబూ బకరా (ర) కూడా ఉన్నారు. ఆయన కోట గోడ పైకి వెళ్ళి ఓ బొక్కెన తాడునాధారంగా చేసుకొని క్రిందికి దిగి వచ్చినవారు. ఆ బొక్కెన త్రాటిని అరబీ భాషలో 'బకరా' అని పిలుస్తారు. కాబట్టి ఆయన పేరు అప్పటి నుండి 'అబూ బకరా'గా పడిపోయింది. ఆ బానిసలందరిని మహాప్రవక్త (స) స్వతంత్రులుగా చేసేశారు. ఒక్కొక్కరిని ఒక్కో ముస్లిముకు అప్పగించి వారి బాగోగులు చూడమని ఆదేశించారు. ఈ సంఘటన కోటలోని వారికి పెద్ద మనస్తాపాన్నే కలిగించింది.

అలా కోట దిగ్బంధనా కాలం పెరిగిపోతూనే ఉంది. కోట మాత్రం కైవసమయ్యే సూచనలు కనపడడం లేదు. పైగా ముస్లిములపై బాణాలు వచ్చి పడుతూనే ఉన్నాయి. బాగా కాలిన ఇనుప ముక్కలూ వారిపై

9. సహీ బుఖారి-2:260

కురుస్తున్నాయి. ఇటు కోటలో శత్రువు ఒక సంవత్సరానికి సరిపడే ఆహార ధాన్యాలు ప్రోగుచేసుకొని ఉన్నాడు. ఆ పరిస్థితిని గమనించిన మహాప్రవక్త (స) 'నౌఫిల్ బిన్ ముఆవియా వేలీ' ని పిలిచి, "నీ సలహా ఏమిటీ?" అని అడిగారు. అతను, "దైవప్రవక్తా! నక్క తన కలుగులో చొరబడింది. మీరే గనక ఇలానే మాటువేసి ఉంటే దాన్ని పట్టుకోగలరు. అయితే మీరు దాన్ని వదిలేసి వెళ్ళిపోయినా అది తమరిని ఏమీ చేయజాలదు" అన్నారు.

ఆయన ఇచ్చిన సలహా ప్రకారం, మహాప్రవక్త (స) దిగ్బంధాన్ని ఎత్తేసే నిర్ణయానికే వచ్చారు. ఈ విషయాన్ని హజ్రత్ ఉమర్ (ర) గారి ద్వారా ప్రజల్లో "రేపు ఇన్షా అల్లాహ్, మనం వెనక్కి వెళ్ళిపోతున్నాం" అనే ప్రకటన చేయించారు. కాని ఈ ప్రకటన సహాబా (ర)కు కొంత ఇబ్బందినే కలుగజేసింది. వారు ఏమిటీ? మనం తాయెఫ్‌ను జయించకుండానే వెనక్కు మళ్ళాలా? అని ప్రశ్నించారు మహాప్రవక్త (స)ను.

"అయితే రేపు ఉదయం తిరిగి యుద్ధరంగానికి వెడదాం" అన్నారాయన. రెండో రోజు యుద్ధరంగానికి వెళ్ళారు. దెబ్బతినడం తప్ప మరేదీ సాధించలేకపోయారు వారు. ఆ తరువాత మహాప్రవక్త (స) అయితే రేపు మనం తిరిగి వెళ్ళిపోదాం అన్నారు. ఈ ప్రకటన విన్న సహాబా (ర) ఆనందం పట్టలేకపోయారు. వారు మారు మాట్లాడకుండా తిరుగు ప్రయాణానికి సంసిద్ధులవుతుండగా దైవప్రవక్త (స) వారిని చూసి చిరునవ్వు నవ్వారు.

పెట్టెబేడా సర్దుకొని తిరుగు ప్రయాణం అవుతుండగా దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"మనం వెనక్కు వెడుతున్నాం. తౌబా చేస్తూ, ఆరాధిస్తూ, మన ప్రభువును స్తుతిస్తూ," అప్పుడు కొందరు మహాప్రవక్త (స)తో, "ప్రవక్తా! సఖీఫ్ వారిని శపించండి" అనగా, ఆయన, "ఓ ప్రభూ! సఖీఫ్ వారికి సద్బుద్ధిని ప్రసాదించు. వారిని మా వైపునకు వచ్చేటట్లు చెయ్యి" అన్నారు.

జీరానాలో విజయ ధనం పంపకం

తాయెఫ్ దిగ్బంధాన్ని ముగించుకొని మహాప్రవక్త (స) జీరానాకు తిరిగివచ్చారు. హునైన్ యుద్ధంలో లభించిన విజయ ధనాన్ని కొన్ని రోజుల వరకు పంచకుండా ఆలస్యం చేశారు. ఈ ఆలస్యానికి కారణం, బహుశా హవాజిన్ తమ ధర్మాన్ని వదిలి అక్కడికి వస్తారేమో, తాము పోగొట్టుకున్న

సొత్తును తిరిగి తీసుకొని వెడతారేమోనన్నదే. కాని ఆలస్యం చేసినప్పటికీ వారు రాలేదు. అప్పుడుగాని ఆయన ఆ విజయ ధనాన్ని పంచడం ప్రారంభించలేదు. తమతో వచ్చిన తెగలవారు, మక్కా సర్దారులు, పెద్దలందరూ ఆ పంపకంపైన్నే ఆశలు పెట్టుకొని ఉండడం వలన వారి నోర్లు మూయడానికి ఆ పంపకాన్ని ప్రారంభించారాయన. 'ముఅల్ల ఫతుల్ ఖులూబ్''[10] (క్రొత్తగా ముస్లిములైనవారి మనస్సుల్ని ఆకట్టుకునేందుకు వారికి ఆర్థిక సహాయం చేసి వారు ఇస్లామ్‌పై దృఢంగా స్థిరంగా ఉండేటట్లు చేయడం) అదృష్టం పండింది. వారికి పెద్ద పెద్ద భాగాలు పంచిపెట్టారు.

అబూ సుఫ్‌యాన్ బిన్ హరబ్ వాటాకు నలభై ఓకియాలు (దాదాపు ఆరు కిలోల వెండి), నూరు ఒంటెలు వచ్చాయి. అతను అది చూసి మరి నా కుమారుడు యజీద్‌కో? అని అడిగాడు. మహాప్రవక్త (స) యజీద్‌కు కూడా అంతే వాటాను ఇచ్చేశారు. ఆ తరువాత అతను "నా కుమారుడు మావియాకో?" అని అడగగా, మావియాకు కూడా అంతే ఇచ్చారు ఆయన. (అంటే ఒక్క అబూ సుఫ్‌యాన్‌కు అతని కుమారులతో సహా లభించింది దాదాపు 18 కిలోల వెండి, మూడొందల ఒంటెలు).

హకీమ్ బిన్ హిజామ్‌కు ఓ నూరు ఒంటెలను బహూకరించగా ఆయన మరో వంద ఒంటెలను అడిగారు. ఆయనకు అదనంగా మరో వంద ఒంటెలను ఇవ్వడం జరిగింది. అలాగే సుఫ్‌వాన్ బిన్ ఉమయ్యా మూడు సార్లు డిమాండు చేసి మూడు వందల ఒంటెలను పొందాడు.[11]

హారిస్ బిన్ కల్దాకు కూడా వంద ఒంటెలు బహూకరించడం జరిగింది. మరికొందరు ఖురైషీ మరియు ఖురైషీయేతర సర్దారులకు వందేసి ఒంటెలు ఇవ్వబడ్డాయి. కొందరికి యాభైయేసి, నలభైయేసి ఒంటెలు లభించాయి. ఇలా బహూకరిస్తూ పోతుంటే, ప్రజల్లో ముహమ్మద్ లెక్క లేకుండా ఇచ్చే విజయ ధనం వల్ల వారికి ఇంకెలాంటి దారిద్ర్యం ఉండబోదు అనే మాటలు వ్యాపించాయి. ఆ ధనాన్ని పొందడానికి బద్దూలు కూడా ఆయన (స)పై విరుచుకుపడ్డారు. అలా చుట్టూ మూగడం వలన దైవప్రవక్త (స) ఓ చెట్టు

10. *క్రొత్తగా ముస్లిములుగా మారిన వారికి ఆర్థిక సహాయం చేసి వారిని ఇస్లాం ధర్మంపై దృఢంగా ఉంచడమే ముఅల్ల ఫతుల్ ఖులూబ్*

11. *ఖాజీ అయాజ్ - 1/86*

వైపునకు జరగాల్సి వచ్చింది. అనుకోకుండా ఆయన (స) దుప్పటి ఆ చెట్టు కొమ్మల్లో చిక్కుకుపోయింది. ఇది చూసిన ఆయన, "ప్రజలారా! నా దుప్పటి నాకివ్వండి. ఆ దైవం సాక్షి! ఎవరి పిడికిటనైతే నా ప్రాణాలున్నాయో, నా దగ్గర తహామా అడవిలో ఉన్న చెట్లన్ని పశువులు ఉంటే వాటిని కూడా నేను మీకు పంచిపెట్టగలను, నన్ను మీరు పిసినారిగా గాని, పిరికివానిగా గాని, అసత్యవంతుడుగా గాని తలచరు సుమా!" అన్నారు.

ఆ తరువాత ఆయన తన ఒంటె ప్రక్కగా నిలిచి దాని మూపరం నుండి కొన్ని వెంట్రుకల్ని ఊడబెరికి చిటికెలో పట్టి పైకెత్తుతూ, "ప్రజలారా! దైవసాక్షి! ఇప్పుడు నాకు సంబంధించిన 'ఫై' ధనంలో ఇంకేమీ మిగల్లేదు, ఈ వెంట్రుకలు తప్ప. కేవలం ఖుమ్స్ మాత్రమే ఉంది. దాన్ని కూడా మీకు పంచివేయడం జరుగుతుంది" అని సెలవిచ్చారు.

"ముఅల్ల ఫతుల్ ఖులూబ్"కు పంచిపెట్టిన తరువాత దైవప్రవక్త (స) హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (ర)ను, విజయ ధనాన్ని, సైన్యాన్ని ఓ చోట చేర్చి వారికి ఎంతెంత వచ్చిందో లెక్క కట్టమని ఆదేశించారు. ఆయన అలా లెక్కకట్టి చూస్తే ఒక్కో సైనికుని వాటాకు నాల్గేసి ఒంటెలు, నలభైయేసి మేకలు వచ్చాయి అని తెలిసింది. గుర్రపు రౌతుకు పన్నెండేసి ఒంటెలు, నూట ఇరవైయేసి మేకలు లభించాయి.

ఈ పంపకం దూరదృష్టిగల రాజకీయ అవసరాలను బట్టి జరిగిన పంపకం. ఎందుకంటే, ప్రపంచంలో చాలా మందిని వారి తెలివితేటలతో కాకుండా వారి పొట్ట మార్గంగానే దారికి తేవలసి ఉంటుంది. అంటే పచ్చటి గడ్డి చూపి పశువుల్ని పిలిస్తే అవి ఆ గడ్డి కోసమైనా తన స్థానానికి వచ్చి చేర గలవు. ఇలాగే, పైన చెప్పిన రకం మనుషుల్ని కూడా మచ్చిక చేసుకోవడానికి ఎన్నో మార్గాలను అవలంబించవలసి ఉంటుంది. వారు విశ్వాసం గురించి పూర్తిగా అవగాహన పొంది, దాని మార్గంలో చురుకుగా తయారు కావడానికే ఈ విధానం అవలంబించబడింది.[12]

అన్సారులలో ఏర్పడిన మనస్తాపం, అలజడులు

ఈ రాజకీయం ప్రథమంగా ఎవరికీ అర్థం కాలేదు. కొందరు ఈ విధానాన్ని విమర్శించారు కూడా. ఈ విధానం అన్సారులను బాగా కృంగదీసింది-

12. *ముహమ్మద్ గజాలీ, ఫిక్కహుస్సీరత్- పుట. 298,299.*

ఎందుకంటే వీరంతా హునైన్‌లో లభించిన విజయ ధనానికి నోచుకోలేక పోవడమే అందుకు కారణం - కష్టసమయంలో వారినే పిలువడం జరిగింది. వారే ముందుకు వచ్చి స్థిరంగా నిలబడి యుద్ధం చేసినవారు. ఘోర పరాజయమల్లా ఘన విజయంగా మారడానికి వారే దోహదపడ్డారు. కాని ఇప్పుడు చూస్తే, పారిపోయిన వారికే ఆ విజయ ధనం లభించింది. వారు రిక్తహస్తాలతోనే ఉండిపోవలసివచ్చింది.[13]

ఇబ్నె ఇస్‌హాక్, హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (ర) ఉల్లేఖనాన్ని ఇలా ఉల్లేఖిస్తున్నారు:

"దైవప్రవక్త (స) ఖురైష్ మరియు అరబ్బు తెగలకు ఆ విజయ ధనాన్ని పంచిపెట్టారు. అందులో నుండి అన్సారులకు ఏమీ లభించకపోయేసరికి వారు లోలోనే మధనపడసాగారు. ఆ విషయమై వారు గుసగుసలాడుకో సాగారు. ఒకరైతే, "దైవసాక్షి! దైవప్రవక్త (స) తిరిగి తమ జాతి వారికే అంకితమై పోయారు" అనడం కూడా జరిగింది. ఇది విన్న హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా (ర) మహాప్రవక్త (స) సన్నిధికి వచ్చి, "దైవప్రవక్తా! మీరు లభించిన 'ఫై' ధనాన్ని పూర్తిగా పంచేసినందుకు అన్సారులు బాగా లోలోనే మధనపడిపోతు న్నారు. మీరు దాన్ని తమ జాతి వారికే పంచిపెట్టేశారు. అరబ్బు తెగలకు పెద్ద మొత్తాన్ని ముట్టజెప్పారు. కాని అన్సారులకు ఏమీ ఇవ్వలేదు" అన్నారు.

"ఓ సఅద్! ఈ విషయంలో నీ అభిప్రాయం ఏమిటి?" అడిగారు దైవప్రవక్త (స).

"ప్రవక్తా! నేను కూడా నా జాతికి చెందిన వాణ్ణే కదా!" అన్నారు సఅద్.

"సరే! మీరు మీ జాతి వారిని ఈ గుడారంలో సమావేశపర్చండి" ఆదేశించారు దైవప్రవక్త(స).

హజ్రత్ సఅద్ వెళ్ళి అన్సారులను ఆ గుడారంలోనికి రమ్మని పిలిచారు. వారి వెంట కొందరు ముహాజిర్లు కూడా ఉన్నారప్పుడు. వారిని కూడా లోనికి అనుమతించారు దైవప్రవక్త (స). మరికొందరు ఇతరులు అక్కడికి వస్తే వారిని వెనక్కు పంపించారు. అందరూ సమావేశమైన తరువాత హజ్రత్ సఅద్ (ర) మహాప్రవక్త (స) వద్దకు వచ్చి, దైవప్రవక్తా! ఇక తమరు రావచ్చు అందరూ వచ్చేశారన్నారు.

13. *ముహమ్మద్ గజాలీ, ఫిక్హుస్సీరత్-పుట. 298, 299.*

మహాప్రవక్త (స) వారి వద్దకు అరుదెంచి, అల్లాహ్‌ను స్తుతించారు. ఆ తరువాత ఇలా సెలవిచ్చారాయన.

"అన్సార్ ప్రజలారా! మీరు పరస్పరం గుసగుసలాడిందేమిటి? నా యెడల మీరు లోలోనే మధనపడడం ఏమిటి? నేను మీ దగ్గరకు వచ్చి నప్పుడు మీరంతా మార్గభ్రష్టులుగా ఉన్న విషయం సరికాదా? అల్లాహ్ మీకు సన్మార్గాన్ని ప్రసాదించాడే! మీరు దరిద్రులుగా ఉంటే అల్లాహ్ మిమ్మల్ని సంపన్నుల్ని చేయలేదా? మీరు పరస్పరం శత్రువులుగా ఉన్నప్పుడు దైవం మీ హృదయాలను కలిపి స్నేహ వాతావరణాన్ని కలిగించలేదా? ప్రజలారా! తప్పకుండా మీపై అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కారుణ్యం కురిసింది. అన్సారు ప్రజలారా! మాట్లాడరేమిటి?" అని అడిగారు.

"ఓ దైవప్రవక్తా! మేమేం సమాధానమివ్వగలం? అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కారుణ్యమే కదా ఇది" అన్నారు అన్సారులు.

"చూడండి! దైవసాక్షి! మీరనుకుంటే చెప్పేయగలరు- సత్యాన్నే పలుకగలరు. మీ మాట సత్యమైనదిగానే భావించబడుతుంది - చెప్పండి, మీరు మా వద్దకు వచ్చిన పరిస్థితిలో నిరాకరింపబడినవారై ఉండగా మేము మిమ్మల్ని ధృవపరిచామని; మిమ్మల్ని నిస్సహాయులుగా వదిలేస్తే మేము మీకు సహాయపడ్డామని; మిమ్మల్ని వెళ్ళగొడితే మేము మీకు ఆశ్రయం ఇచ్చామని, మీరు బాధల్లో ఉంటే మేము మిమ్మల్ని ఆదుకున్నామని."

ఓ అన్సారు ప్రజలారా! ఇప్పుడు మీరు తుచ్ఛమైన ప్రాపంచిక తృణాన్ని గురించి నా ఎడల కోపంగా ఉన్నారు. నేను ఈ గడ్డి ద్వారానే వారు ముస్లిము లుగా మారాలని వారి హృదయాలను ఆకట్టుకున్నాను, మిమ్మల్ని మీ ఇస్లామ్‌కు అప్పగించాను. ఓ అన్సారులారా! వారు ఒంటెలు, మేకలు తీసుకు వెళ్ళి మీరు మీ ప్రవక్తను వెంటబెట్టుకొని మీ వద్దకు తీసుకువెళ్ళడానికి ఇష్టపడరా? ఎవరి పిడికిటనైతే ముహమ్మద్ (స) ప్రాణాలున్నాయో, ఆ దేవుని సాక్షిగా చెబుతున్నాను. హిజ్రతే లేకపోతే నేను కూడా ముహాజిర్లలో ఒకణ్ణి అయి ఉండేవాణ్ణి. అందరూ ఓ మార్గంపై నడిచి అన్సారులు మరో మార్గంపై నడిస్తే నేను కూడా అన్సారుల మార్గాన్నే అవలంబిస్తాను. ఓ అల్లాహ్! అన్సారు లను కరుణించు. అన్సారుల కుమారుల్ని మరియు అన్సారుల కుమారుల కుమారుల్ని (పౌత్రుల్ని) కరుణించు."

దైవప్రవక్త (స)గారి ఈ ప్రసంగం విని అక్కడున్న వారు తమ గెడ్డాలు తడిసే వరకు రోదించారు. "మా వాటాకు దైవప్రవక్త (స) రావడం మాకు ఎంతైనా ఇష్టమైనది" అన్నారు వారు ముక్తకంఠంతో. ఆ తరువాత దైవప్రవక్త (స) అక్కడి నుండి వెళ్ళిపోయాక ప్రజలంతా తమ దారిన తాము వెళ్ళి పోయారు.[14]

హవాజిన్ వారి ప్రతినిధి వర్గం రాక

విజయ ధనం పూర్తిగా పంచబడిన తరువాత హవాజిన్ తెగకు చెందిన ఓ ప్రతినిధి వర్గం తాయెఫ్ నుండి అక్కడికి వచ్చింది. వీరు మొత్తం పదు నాల్గురు. వారికి నాయకుడు 'జుహైర్ బిన్ సురద్'. ఆ ప్రతినిధి వర్గంలో దైవప్రవక్త (స) గారి క్షీరసంబంధమైన పినతండ్రి అబూ యర్కాన్ కూడా ఉన్నాడు. ఆ ప్రతినిధి వర్గం మహాప్రవక్త (స)తో, దయచేసి తమరు మా బందీలను, స్వాధీనం చేసుకున్న సొత్తును తిరిగి ఇప్పించండని ప్రాధేయ పడింది. హృదయం కరిగిపోయేటట్లు వారు తమ మాటను ప్రవక్త (స) ముందు ఉంచారు.[15]

ఇది విన్న దైవప్రవక్త (స), "నా వెంట ఉన్నవారెవరో మీరు చూస్తూనే ఉన్నారు. నాకు నిజం చెప్పడం అంటేనే ఇష్టం. కాబట్టి చెప్పండి, మీకు మీ పిల్లాజెల్లాయే ఎక్కువ ప్రియమైనవారా లేదా మీ ధన సంపదా?" అని అడిగారు.

"మా దృష్టిలో కుటుంబ గౌరవం కంటే మరేదీ మించినది కాదు" అన్నారు వారు.

---

14. *ఇబ్నె హష్షామ్-2/499, 500. ఇలాంటిదే మరో ఉల్లేఖనం సహీ బుఖారిలో ఉంది. 2/620, 621.*

15. *ఇబ్నె ఇస్హాక్ ప్రకారం, వారిలో తొమ్మండుగురు ముస్లిములైన మర్యాదస్తులు. వారు బైత్ చేసి ఇస్లామ్ స్వీకరించారు. ఆ తరువాత దైవప్రవక్త(స)తో మాట్లాడుతూ, ఓ దైవప్రవక్తా! తమరు ఎవరినైతే ఖైదు చేశారో వారిలో తల్లులు, చెల్లెండ్రూ ఉన్నారు. మేనత్తలూ, చిన్నమ్మలు కూడా ఉన్నారు. వీరే జాతికి తలవంపులు తెచ్చిపెట్టేవారు. (ఫత్హుల్ బారి-8/33). తల్లులు అంటే మహాప్రవక్త (స)కు క్షీరసంబంధమైన తల్లులు, చిన్నమ్మలు, మేనత్తలు మరియు చెల్లెండ్రు అని అర్థం. వారిని వెంట పంపమని అడిగిన వారు జుహైర్ బిన్ సర్ద్. అబూ యర్కాన్ పేరు గురించి కొంత అభిప్రాయభేదం ఉంది. ఆయన్ను అబూ మర్వాన్ మరియు అబూ జర్వాన్‌గా కూడా పిలుస్తారు.*

"అయితే నేను జొహ్ర్ నమాజు చేసిన తరువాత మీరు నిలబడి ఇలా అడగండి; మేము దైవప్రవక్త (స)ను మోమినీన్‌ల తరఫున సిఫారసు చేసేవారుగా నిలబెడుతున్నాం. మరియు మోమినీన్ (విశ్వాసులను) దైవప్రవక్త (స) తరఫున సిఫారసు చేసేవారిగా నిలబెడుతున్నాం. మీరు మా ఖైదీలను మాకు అప్పగించండి" అని చెప్పారు.

దైవప్రవక్త (స) జొహ్ర్ నమాజు ముగించగానే వారు దైవప్రవక్త (స) చెప్పిన మాటలనే రెట్టించారు. సమాధానంగా మహాప్రవక్త (స), "నాకు సంబంధించినది, బనీ అబ్దుల్ ముత్తలిబ్‌కు సంబంధించిన ఏ భాగం అయితే ఉందో అది మీదే. నేనిప్పుడే ప్రజల్ని అడుగుతాను ఆగండి" అన్నారు. ఇది విన్న అన్సారులు, ముహాజిర్లూ లేచి, "ఏదైతే మాదో అదంతానూ దైవప్రవక్త (స) కోసమే" అన్నారు.

అయితే వారిలోనే ఉన్న అఖ్రా బిన్ హాబిస్ మాత్రం, "కాని, ఏదైతే నా వాటాకు వచ్చిందో, బనూ తమీమ్‌కు వాటాకు వచ్చిందో అది మాత్రం మీది కాదు" అన్నాడు. ఆ పిదప, ఉయినా బిన్ హిస్న్ కూడా, "ఏదైతే నాకు చెందిందో, బనూ ఫరాజాకు చెందిందో అది కూడా మీకు చెందదు" అనగా మరో వ్యక్తి అబ్బాస్ బిన్ మర్‌దాస్ కూడా, "నాకు చెందింది, బనూ సులైమ్‌కు చెందింది కూడా మీది కాదు" అన్నాడు. ఇది విన్న బనూ సులైమ్ తెగవారు లేచి, "అలా కానేకాదు! మాకు చెందినది కూడా దైవప్రవక్త (స)గారిదే" అన్నారు. అప్పుడు అబ్బాస్ బిన్ మర్దాస్ రుసరుసలాడుతూ, "మీరు నా పరువు తీశారు కదా!" అని అన్నాడు.

అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు.

"చూడండి! వీరు ముస్లిములై వచ్చినవారు. (ఈ కారణంగానే) నేను వారికి ఖైదీలను పంచడంలో కొంత జాప్యం చేసి ఉన్నాను. ఇప్పుడు నేను వారికి మీ ఇష్టమొచ్చింది (అంటే ధనంగాని, భార్యాపిల్లలనుగాని) తీసు కొమ్మని అంటే, భార్యాపిల్లలకంటే మాకు మరేదీ వద్దంటున్నారు. కాబట్టి మీ వద్ద వీరికి సంబంధించిన ఖైదీ ఎవరైనా ఉంటే మనస్ఫూర్తిగా వారికి అప్పగించండి. ఇదే సరైన సలహా. మరెవరైనా తన హక్కును వారికి ఇవ్వ దలచకపోయినా సరే వారి బందీలను వారికి అప్పగించక తప్పేది కాదు.

అయితే ఇక ముందు మొట్టమొదటగా లభించే 'ఫై' ధనం నుండి వారికి అంతకంటే మేలైన వాటా ఇవ్వడం జరుగుతుంది."

ఇది విన్న వారు, "మేము మహాప్రవక్త (స) కోసం మనస్ఫూర్తిగా వారికి అప్పగించడానికి సిద్ధంగా ఉన్నాం" అన్నారు.

"దీనికి ఎవరు ఇష్టపడుతున్నారు, ఎవరు ఇష్టపడడంలేదో నేను తెలుసుకోదలచాను. కాబట్టి మీరంతా వెళ్ళిపోండి. మీ పెద్ద మనుషుల్ని ఈ వ్యవహారం తేల్చడానికి నా వద్దకు పంపించండి" అన్నారు.

తదనంతరం అందరూ వారి వాటాకు వచ్చిన ఖైదీలను తిరిగి ఇచ్చి వేశారు. కేవలం ఒక్క ఉఅయినా బిన్ హిస్న్ మాత్రం మిగిలిపోయాడు. అతని వాటాకు ఓ వృద్ధురాలు వచ్చివుంది. అతను ఆమెను తిరిగి అప్పగించ డానికి నిరాకరించాడు. అయితే చివరన అతను కూడా ఆ వృద్ధురాలిని తిరిగి ఇచ్చివేయడం జరిగింది. మహాప్రవక్త (స) ఖైదీలందరికి ఒక్కో ఖబ్తీ దుప్పటిని బహూకరించి వచ్చిన ప్రతినిధి వర్గానికి అప్పజెప్పేశారు.

ఉమ్రా చెల్లించి మదీనాకు తిరుగు ప్రయాణం

మహాప్రవక్త (స) విజయ ధన పంపకం అయిపోయిన తరువాత 'జీరానా' నుండి ఉమ్రా ఇహ్రామ్ కట్టి ఉమ్రా చేశారు. ఆ పిదప 'అత్తాబ్ బిన్ అసీద్'ను మక్కా గవర్నరుగా నియమించి మదీనాకు పయనమయ్యారు. మదీనాకు జీఖాదా 24, హి.శ. 8 నాడు తిరుగుముఖం పట్టారు.

ముహమ్మద్ గజాలి ఇలా రాస్తున్నారు:

"దైవప్రవక్త (స) శిరస్సుపై అల్లాహ్ సాటిలేని విజయ కిరీటం ఉంచి నప్పటి సమయానికీ, ఎనిమిదేళ్ళ క్రితం ఈ మహానగరంలో ఆయన అడుగి డినప్పటి సమయానికి ఎంత గొప్ప తేడా ఉంది?"

దైవప్రవక్త (స) ఈ నగరానికి వచ్చినప్పుడు ఆయన్ను హింసలకు గురిచేయడం జరిగింది. ఆయన అభయం కోసం అర్రులు చాచిన పరిస్థితి అది. ప్రేమ, వాత్సల్యాల కోసం దిక్కులు చూస్తున్న సమయాన ఇక్కడి పౌరులు ఆయన్ను (స) ఎంతో గౌరవించారు. శరణమొసగినారు. ఆయనకు సహాయాన్నందించారు. ఏ జ్యోతి అయితే ఆయనపై అవతరింపజేయబడిందో

దాన్ని అనుసరించినవారు. ఆయన కోసం ప్రపంచం మొత్తం శత్రుత్వం వహించినా లెక్కచేయలేదు. ఇప్పుడు ఆయన, తాను భయకంపితుడై ఓ ముహాజిర్‌గా ప్రవేశించిన ఆ నగరమే నేడు మక్కా విజయునిగా ఆహ్వానిస్తోంది ఆయన్ను. ఈ మహానగర ప్రజలు అప్పటి ఆత్మాభిమానాన్ని, అజ్ఞానాంధ కారాన్ని దాని కాళ్ళ క్రిందవేసి నలిపి వేస్తున్న సమయమిది. దైవప్రవక్త (స) మక్కావాసుల మునుపటి తప్పిదాలను క్షమించి ఇస్లామ్ ధర్మం ద్వారా దానికి గౌరవోన్నతులు సమకూర్చిన దినమిది."

إِنَّهُۥ مَن يَتَّقِ وَيَصْبِرْ فَإِنَّ ٱللَّهَ لَا يُضِيعُ أَجْرَ ٱلْمُحْسِنِينَ ۝

"వాస్తవం ఏమిటంటే భయభక్తులతో, ఓర్మితో వ్యవహరించే సత్పురుషుల ప్రతిఫలం అల్లాహ్ వద్ద వృథా కాదు."[16] (12:90)

16. *ఫిక్హుస్సీరహ్ - పుట. 303, మక్కా విజయం, తాయెఫ్ యుద్ధం గురించిన వివరాలకు చూడండి, జాదుల్ ముఆద్-2/160 - 201; ఇబ్నె హిషామ్-2/389 - 501; సహీ బుఖారి-2/612 - 622; ఫత్‌హుల్ బారి-8/3-85.)*

మక్కా విజయం తరువాతి సైనిక చర్యలు - ప్రభుత్వాధికారుల నియామకం

సుదీర్ఘమైన ఈ ప్రయాణం నుండి విజయ పతాకం ఎగరవేస్తూ తిరిగి వచ్చిన తరువాత మహనీయ ముహమ్మద్ (స) మదీనాలో కొంత ఎక్కువ కాలమే గడిపారు. ఈ లోపు వివిధ తెగలు పంపిన ప్రతినిధి వర్గాలను ఆహ్వానించడం, ప్రభుత్వాధికారులను వివిధ తెగల వద్దకు పంపించడం జరుగుతూనే ఉంది. అరేబియాలో వచ్చిన ఈ గొప్ప మార్పుకు కూడా చలించక దైవధర్మం అయిన ఇస్లామ్ వైపునకు రాకుండా తలబిరుసుతనాన్ని ప్రకటించే తెగలను అణచడానికిగాను సైన్యాలను పంపించడమూ జరిగింది. ఈ కాలంలోనే దైవధర్మ ప్రచారకులను కూడా అన్ని వైపులకు పంపించారు. దీనికి సంబంధించిన ఓ రేఖా చిత్రాన్ని ఇక్కడ మీ ముందుంచదలిచాము.

జకాత్ వసూలు చేసే ఉమ్మాల్ (రెవెన్యూ అధికారులు)

మక్కాను జయించిన తరువాత దైవసందేశహరులు హజ్రత్ ముహమ్మద్ (స) హిజ్రీ శకం 8 చివరన మదీనాకు తిరిగివచ్చారనే విషయం మనకు తెలిసిందే. హి.శ. 9, ముహర్రం నెలవంక అగుపించగానే ఆయన (స), తెగల వద్దకు సదఖాత్ (జకాత్ ధనం) వసూలు చేయడానికి ఉమ్మాల్‌ను (రెవెన్యూ అధికారుల్ని) పంపించడం జరిగింది. వారి పట్టిక ఇది:

ఉమ్మాల్ పేర్లు జకాత్ ధనం వసూలు చేయవలసిన తెగల పేర్లు

1. ఉయినా బిన్ హస్న్ (ర)- బనూ తమీమ్ తెగ
2. యజీద్ బినుల్ హసీన్ (ర)-అస్లమ్ మరియు గిఫ్ఫార్ తెగలు
3. అబ్బాద్ బిన్ బషీర్ అష్హలీ (ర) - సులైమ్ మరియు ముజీనా తెగలు
4. రాఫె బిన్ ముకైస్ (ర) - జుహైనా తెగ
5. అమ్రూ బినుల్ ఆస్ (ర) - బనూ ఫరాజా తెగ

6. జహ్హాక్ బిన్ సుఫ్‌యాన్ (ర) - బనూ కిలాబ్ తెగ
7. బషీర్ బిన్ సుఫ్‌యాన్ (ర) - బనూ కఅబ్ తెగ
8. ఇబ్నుల్ లుత్బియ్యా అజ్దీ (ర) - బనూ జబియాన్ తెగ
9. ముహాజిర్ బిన్ ఉమయ్యా (ర) - సన్ఆ నగరం (ఈయన అక్కడ ఉండగానే అస్వద్ గన్సీ అనేవాడు తిరుగుబాటు చేశాడు)
10. జయ్యార్ బిన్ లుబైద్ (ర) - హజ్రమౌత్ ప్రాంతం వైపునకు
11. అద్దీ బిన్ హాతిమ్ (ర) - తై మరియు బనూ అసద్ తెగ
12. మాలిక్ బిన్ నువైరా (ర) - బనూ హంజలా తెగ
13. జబర్‌కాన్ బిన్ బద్ర్ (ర) - బనూ సఅద్‌కే చెందిన ఓ శాఖ
14. ఖైస్ బిన్ ఆసిమ్(ర) - బనూ సఅద్ తెగకు చెందిన మరో శాఖ
15. అలా బినుల్ హజ్రమీ (ర) - బహ్‌రైన్ ప్రాంతం
16. అలీ బిన్ అబీ తాలిబ్ (ర) - నజ్రాన్ ప్రాంతం (జకాత్ మరియు జిజియా రెండూ వసూలు చేయడానికి)

ఈ ఉమ్మాల్‌లందరిని మొహర్రం నెల హి.శ. 9లోనే పంపించేయడం జరిగింది. కాగా, సంబంధిత తెగలు ఇస్లామ్ స్వీకరించడం అప్పటికి జరిగిపోయినందున కొందరిని ఆలస్యంగా పంపించడం జరిగింది. అయితే తక్కిన ఉమ్మాల్ (రెవెన్యూ అధికారులు)లను మొహర్రం నెల ప్రారంభంలోనే సాగనంపడం జరిగిపోయింది. హుదైబియా ఒప్పందం జరిగిన తరువాత ఇస్లామీయ ధర్మప్రచారం ఎంత విజయవంతమై ఉధృతమైందో ఈ ఉదాహరణ ద్వారా మనం అంచనా వేసుకోవచ్చు. ఇకపోతే, మక్కా విజయానంతరమైతే ప్రజలు తండోపతండాలుగా ఇస్లామ్ ఛత్రఛాయల్లోనికి రావడం ప్రారంభించారు.

సరాయా (సైనిక చర్యలు)

అరేబియా తెగల వద్దకు ఎలాగైతే జకాత్ వసూలు చేయడానికి ఉమ్మాల్‌లను (రెవెన్యూ అధికారుల్ని) పంపించడం జరిగిందో అలాగే అరేబియా ద్వీపానికి చెందిన ఇతర ప్రాంతాల్లోనూ శాంతిభద్రతలు నెలకొని

ఉన్నప్పటికీ వివిధ ప్రాంతాలకు సైనిక పటాలాలను కూడా పంపించడం జరిగింది. వాటి వివరాలు ఇవి:

1. సరియ్యయె ఉఅయినా బిన్ హిస్న్ ఫరాజీ (మొహర్రం, హి.శ. 9)

ఉఅయినా (ర)ను యాభై మంది ఉష్ట్రారోహుల పటాలానికి నాయకునిగా చేసి బనూ తమీమ్ తెగ వైపునకు పంపించడం జరిగింది. దీనికి కారణం, బనూ తమీమ్, తెగలను రెచ్చగొట్టి జిజియా కట్టకుండా అడ్డుకోవడమే. ఈ సైనిక చర్యలో ఏ ఒక్క ముహాజిర్‌గాని అన్సారీగాని లేరు.

ఉఅయినా బిన్ హిస్న్ (ర) రాత్రిళ్ళు ప్రయాణం చేస్తూ పగలు దాగి గడిపేవారు. చివరకు ఎడారిలో ఉన్న బనూ తమీమ్ తెగపై విరుచుకుపడ్డారు. వారు ఈ హఠాత్పరిణామానికి వెన్నుజూపి పారిపోవలసివచ్చింది. వారికి చెందిన పదకొండు మంది పురుషుల్ని, ఇరవైఒక్క మంది స్త్రీలను, ముప్పై మంది పిల్లలను బంధించి మదీనాకు తీసుకుని వచ్చారు. అక్కడ వారిని రవర్లా బిన్ హారిస్ ఇంట ఉంచడం జరిగింది.

ఆ తరువాత ఆ బందీల కోసం బనూ తమీమ్‌కు చెందిన పదుగురు సర్దారులు ప్రవక్త (స) సన్నిధికి వచ్చారు. ప్రవక్త (స) మహనీయుల ఇంటి గుమ్మం దగ్గర నిలబడి వారిని పిలిచారు. దైవప్రవక్త (స) బయటకు రాగా వారు ఆయనతో మాట్లాడటంలో నిమగ్నమైపోయారు. అలా జొహ్ర్ నమాజ్ సమయం అయిపోయింది అప్పటికే. దైవప్రవక్త (స) నమాజు చేయించి మస్జిద్ ప్రాంగణంలోనే కూర్చుండిపోయారు. వచ్చిన వారు, ఘనకీర్తుల పొగడ్తలో పోటీకి దిగిరమ్మని దైవప్రవక్త (స)ను కోరుతూ తమ వక్త అత్తారుద్ బిన్ హాజిబ్‌ను ముందుకు నెట్టారు. అతను ప్రసంగించిన తరువాత దైవప్రవక్త (స) ఇస్లామ్ వక్త అయిన హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ బిన్ షమాస్‌ను సమాధానంగా ప్రసంగించమని నిలబెట్టారు. ఆయన బనూ తమీమ్ వక్తకు పోటీగా ప్రసంగించారు. ఆ తరువాత వారు తమ కవి జబర్‌కాన్ బిన్ బద్ర్‌ను కవనం వినిపించమని ముందుకు పిలిచారు. అతను పొగడ్తకు సంబంధించిన కొన్ని పద్యపాదాల్ని వర్ణించాడు. దైవప్రవక్త (స) షాయిరుల్ ఇస్లామ్ (ఇస్లామియ కవి) హజ్రత్ హిస్సాన్ బిన్ సాబిత్‌ను నిలబెట్టగా ఆయన ఆ కవనానికి జవాబు కవనంలోనే ఇవ్వడం జరిగింది.

ఇద్దరు వక్తలు, ఇద్దరు కవులు తమ ప్రతాపాల్ని చూపిన తరువాత బనూ తమీమ్‌కు చెందిన ఇక్రా బిన్ హాబిస్ అనేవాడు, "వారి వక్తే మన వక్త కంటే గట్టివాడు, వారి కవే మన కవి కంటే మిన్న, వారి గొంతులు మన వారి గొంతులకంటే పెద్దవి, వారి మాటలే మన మాటలకంటే ఉన్నతమైనవి" అని తీర్పునిచ్చాడు. ఆ తరువాత బనూ తమీమ్ నాయకులందరూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. ప్రవక్త మహనీయులు (స) వారికి మేలైన కానుకలిచ్చి వారి స్త్రీలను, పిల్లల్ని వారికి అప్పజెప్పడం జరిగింది.[1]

2. సరియ్యా ఖత్బా బిన్ ఆమిర్ (సఫర్ నెల, హి.శ. 9)

ఈ దండ యాత్ర 'తర్బా' దాపున ఉన్న 'తబాలా' ప్రాంతంలో ఖష్అమ్ తెగకు సంబంధించిన ఓ శాఖను అణచడానికి పంపించబడిన దండయాత్ర (సరియ్యా). హజ్రత్ ఖత్బా (ర) ఇరవై మందిని తీసుకొని బయలుదేరారు. వారి వెంట పది ఒంటెలే ఉన్నాయి. వీటిపై వీరు వంతులవారీగా స్వారీ చేస్తూ వెళ్ళారు. ముస్లిములు రాత్రి పూట దాడి చేయడం జరిగింది. ఈ భీకర యుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన చాలా మంది క్షతగాత్రులయ్యారు. ఖత్బా, కొందరు సహచరులతో సహా హతమయ్యారు. అయినప్పటికీ ముస్లిములు శత్రువుల గొర్రెల్ని, మేకల్ని, వారి పిల్లాజెల్లాతో సహా తోలుకొని మదీనాకు వచ్చారు.

3. సరియ్యయె జహ్హాక్ బిన్ సుఫ్‌యాన్ కిలాబీ (రబీఉల్ అవ్వల్ నెల, హి.శ. 9)

ఈ సరియ్యా, బనూ కిలాబ్ తెగ వారికి ఇస్లామ్ ధర్మం వైపునకు

---

1. *యుద్ధచరిత్ర రాసే చరిత్రకారుల కథనం ప్రకారం, ఈ సంఘటన ముహర్రం నెల హి.శ. 9లోనే సంభవించింది. అయితే, ఈ సంఘటన సందర్భాన్నిబట్టి చూస్తే ఇక్రా బిన్ హాబిస్ ఆ సంఘటన జరగకముందు ఇస్లాం స్వీకరించలేదు అనేది దీని ద్వారా తెలిసే విషయం. సీరత్ చరిత్రకారుల కథనం ప్రకారం, దైవప్రవక్త (స) బనూ హవాజిన్ ఖైదీలను వారికి అప్పజెప్పండి అని ఆదేశించగా ఈ ఇక్రా బిన్ హాబిస్ లేచి నేనూ, నా బనూ తమీమ్ తెగ ఖైదీలను అప్పజెప్పేవారం కాము అన్నాడు. అంటే ఇప్పుడు మనకు అర్థమైనది ఏమిటంటే, ఇక్రా బిన్ హాబిస్ ముహర్రం నెల హి.శ. 9 కంటే పూర్వమే ఇస్లామ్ స్వీకరించిన వ్యక్తి అని అర్థమవుతోంది.*

ఆహ్వానించడానికిగాను పంపబడిన సరియ్యా (సైనిక పటాలం). అయితే బనూ కిలాబ్ ఆ ఆహ్వానాన్ని తిరస్కరించి యుద్ధం మొదలెట్టారు. ముస్లిములు వారిని ఓడించి వారిలోని ఓ వ్యక్తిని కూడా చంపడం జరిగింది.

4. సరియ్యయె అల్కమా బిన్ ముజ్ర్ జమద్‌లిజి (రబీఉల్ ఆఖిర్ మాసం హి.శ.9)

హజ్రత్ అల్కమా (ర) గారిని మూడొందల మంది సైనికులకు సైన్యాధ్యక్షునిగా చేసి జిద్దా తీరప్రాంతం వైపునకు పంపించడం జరిగింది. ఈ దండయాత్ర పంపడానికి కారణం, కొందరు నీగ్రోలు జిద్దా తీరం దాపునకు చేరి మక్కావాసులను దోచుకోడానికి ప్రయత్నించడమే. అల్కమా (ర) సముద్రంలోనికి దిగి ఓ దీవి వరకు ముందుకు వెళ్ళారు. ఈ విషయం తెలిసిన హబ్షీలు (నీగ్రోలు) పారిపోవడం జరిగింది.[2]

5. సరియ్యయె అలి (ర) ఇబ్నె అబీ తాలిబ్ (రబీఉల్ అవ్వల్, హి.శ.9)

'తై' తెగకు చెందిన ఓ విగ్రహాన్ని - దాని పేరు కల్స్ (కలీసా)- విధ్వంస మొనర్చడానికి పంపించడం జరిగింది. హజ్రత్ అలి (ర)ను, ఆయన నేతృత్వంలో నూరు ఒంటెలు, యాభై గుర్రాలతో సహా మొత్తం నూటాయాభై మంది ముస్లిమ్ యోధులున్నారు. చిరుజెండాలు నలుపు రంగులోనూ, యుద్ధపతాకం తెలుపు రంగులోను వారి చేతుల్లో ఉంది. ముస్లిములు వేకువనే హాతిమ్ తాయీ భవనంపై విరుచుకుపడి కల్స్ అనే విగ్రహాన్ని పడగొట్టేశారు. బందీలు, పశువులు, గొర్రెలు మేకలను హస్తగతం చేసుకున్నారు. ఆ ఖైదీల్లోనే హాతిమ్ తాయి కుమార్తె కూడా ఉంది. అయితే హాతిమ్ తాయి పెద్ద కుమారుడు అద్దీ సిరియా దేశానికి పారిపోయాడు. ముస్లిములకు 'కల్స్' ధనాగారంలో మూడు కవచాలు మట్టుకే లభించాయి. తిరుగు ప్రయాణంలో యుద్ధ సొత్తును పంచుకోవడం జరిగింది. అయితే ఎంపిక చేసిన సొత్తు మాత్రం దైవప్రవక్త (స) కోసం అట్టిపెట్టి ఉంచారు. హాతిమ్ కుటుంబ సభ్యులను మాత్రం ఎవరికీ పంచడం జరగలేదు.

మదీనాకు చేరిన తరువాత హాతిమ్ తాయీ కుమార్తె మహనీయ

2. ఫత్హుల్ బారి-8/59

ప్రవక్త (స)ను కరుణించమని ప్రాధేయపడుతూ, "ఓ దైవప్రవక్తా! ఇక్కడికి రాగలిగిన వాడి జాడ లేదు. నా తండ్రి చనిపోయారు. ఇక నేనంటారా వృద్ధాప్య దశలో ఉన్నాను. ఎలాంటి సేవ చేయలేని పరిస్థితి నాది. తమరు నన్ను కరుణించండి. దైవం మిమ్ములను కరుణించుగాక" అని చెప్పగా;

"నీ కోసం రాగల ఆ వ్యక్తి ఎవరు?" అని అడిగారు మహాప్రవక్త (స),

"అతనే, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)ను కాదని పారిపోయినవాడు" అని బదులిచ్చారామె.

మహాప్రవక్త (స) ఆమె చెప్పింది విని ముందుకు వెళ్ళిపోయారు. మరునాడు ఆమె ఆ మాటలనే వల్లించారు. నిన్న అడిగిన విషయమే అడిగారు దైవప్రవక్త (స). మూడవ రోజు కూడా ఆమె ఆ మాటలనే పలుకగా కరుణాపూరిత హృదయులైన ప్రవక్త (స) ఆమెను స్వతంత్రురాలిగా చేసి వెళ్ళిపొమ్మన్నారు. ఆ సమయంలో ఓ సహాబీ, బహుశా హజ్రత్ అలీ (ర) దైవప్రవక్త (స) వెంట ఉన్నారు. ఆయన ఆ వృద్ధురాలితో ఆ నోటితోనే వాహనం కూడా అడుగు అని అనగా ఆమె వాహనాన్ని సమకూర్చమని ప్రాధేయపడ్డారు. వెంటనే దైవప్రవక్త (స) ఓ మంచి వాహనాన్ని సమకూర్చమని తమ అనుచరులకు ఆదేశించడం జరిగింది.

హాతిమ్ కుమార్తె వెనుదిరిగి తన సోదరుడు అద్దీ వద్దకు సిరియా దేశానికి వెళ్ళారు. ఆయన్ను కలసి దైవప్రవక్త (స) గారి దాతృత్వాన్ని గురించి చెబుతూ, "ఆ మహానుభావుడు చేసిన పని నీ తండ్రి కూడా చేయలేనిది. ఆయన వద్దకు ఇష్టపూర్వకంగానైనా, భయపడుతూనైనా సరే వెళ్ళు" అని హితబోధ చేశారు. కాబట్టి అద్దీ సంరక్షణకు సంబంధించిన ఎలాంటి వాగ్దానం గాని, ఎలాంటి పత్రంగాని లేకుండానే ప్రవక్తశ్రీ(స) సన్నిధికి హాజరయ్యారు. ప్రవక్త మహనీయులు (స) ఆయన్ను తన ఇంటికి పిలుచుకుపోయారు. ప్రవక్త (స) ఎదురుగా కూర్చున్నారు అద్దీ. అలా కూర్చున్న తరువాత మహాప్రవక్త (స) దైవస్తోత్రం చేసి అద్దీని ఇలా అడిగారు:

"అద్దీ! నీవు ఏ విషయాన్ని కాదని పారిపోతున్నావు? లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలకడానికి వెరుస్తున్నావా? అలా అయితే చెప్పు, అల్లాహ్ తప్ప మరే ఆరాధ్య దైవం ఇంకెవరైనా ఉన్నారా?"

"లేదు" అని బదులిచ్చారు అద్దీ బిన్ హాతిమ్.

ఆ తరువాత మహాప్రవక్త (స) కొంతసేపు ఆయనతో మాట్లాడిన తరువాత

"సరే! నీవు అల్లాహు అక్బర్ అని పలుకదలచుకోకనే పారిపోయావు అని అనుకుంటే, మరి అల్లాహ్ కంటే గొప్ప దైవం మరొకడు ఎవడైనా ఉంటే అదీ చెప్పు?" అడిగారు దైవప్రవక్త (స).

"లేదు" అని అన్నారు అద్దీ.

"సరే విను! యూదులపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుతోంది. నసారా (క్రైస్తవులు) మార్గభ్రష్టులు" అన్నారు మహాప్రవక్త (స).

"నేను ఏకాగ్రచిత్తుడనైన ముస్లిమును" అన్నారు అద్దీ వెంటనే.

ఇది వినగానే దైవప్రవక్త (స) గారి ముఖారవిందం ఆనందాతిశయంతో వెలిగిపోయింది. ఆయన ఆదేశం ప్రకారం అద్దీని ఓ అన్సారీ వద్ద అతిథిగా ఉంచడం జరిగింది. అద్దీ ప్రతిరోజు ఉదయం సాయంత్రం దైవప్రవక్త (స)ను దర్శించుకుంటూ ఉండేవారు.[3]

ఇబ్నె ఇస్హాక్ హజ్రత్ అద్దీ (ర)గారి ఈ కథనాన్ని కూడా ఉల్లేఖించడం జరిగింది: ఆయన ఇలా అన్నారు:

దైవప్రవక్త (స) నన్ను తన ఇంట్లో ఎదురుగా కూర్చోబెట్టుకొని ఈ విధంగా మాట్లాడారు.

"ఓ అద్దీ బిన్ హాతిమ్! నీవు రకోసీగా (కలిమి కలవాడిగా) ఉండలేదా?" దానికి నేను"ఔను" అని సమాధానమిచ్చాను.

"మరి నీవు నీ జాతి నుండి నాల్గో వంతు ధనాన్ని వసూలు చేస్తూ ఉండలేదా?" ప్రవక్త (స) గారి ప్రశ్న.

"ఔను" అన్నాన్నేను.

"మరి ఇది మీ ధర్మంలో ధర్మసమ్మతమైంది కాదు కదా?" ప్రశ్నించారు దైవప్రవక్త (స).

"అవును, దైవసాక్షిగా" అని పలికాను నేను. అప్పుడే నాకర్థమైంది

3. జాదుల్ ముఆద్-2/205

నిజంగా ఈయన దైవం తరపున పంపబడిన ప్రవక్త అని. ఎందుకంటే ఇతరులకు తెలియని విషయం ఆయనకు తెలిసింది కనుక.[4]

ముస్నదె అహ్మద్ ఉల్లేఖనం ఇలా ఉంది:

దైవప్రవక్త (స) అద్దీని సంబోధిస్తూ, "ఓ అద్దీ! ఇస్లామ్ స్వీకరించు, క్షేమంగా ఉంటావు" అనగా నేను,

"నేను ఓ ధర్మాన్ని అనుసరించేవాణ్ణి" అని అన్నాను.

"నాకు నీ ధర్మం గురించి నీకంటే బాగా తెలుసు" అన్నారు ప్రవక్తశ్రీ(స).

"నా ధర్మాన్ని నాకంటే బాగా ఎరుగుదురా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాన్నేను.

"ఔను, నీవు రకోసీగా ఉంటున్నప్పటికీ నీ జాతి యుద్ధసొత్తు నుండి పావు భాగాన్ని మ్రింగేసేవాడివి కాదా?"

"ఔను" అన్నాన్నేను.

"ఇదే నీ ధర్మం ప్రకారం ధర్మసమ్మతం కానిది(నిషిద్ధమైనది)".

ఈ మాటలకు నేను మారు మాట్లాడక తల వంచుకోవలసివచ్చింది.[5]

సహీ బుఖారీ గ్రంథంలోనూ హజ్రత్ అద్దీ (ర)గారి ఉల్లేఖనం ఉంది. ఆయన స్వయంగా ఇలా అంటున్నారు:

"నేను దైవప్రవక్త (స) సన్నిధిలో కూర్చుని ఉండగా ఓ వ్యక్తి వచ్చి ఆకలి బాధను గురించి చెప్పుకున్నాడు. మరొకడొచ్చి, తాను దోచుకోబడ్డానని వాపోయాడు. అప్పుడు దైవప్రవక్త (స) నన్ను ఉద్దేశించి, అద్దీ! నీవు 'హిరా' అనే ప్రదేశాన్ని చూశావా? ఓ అంబారీలో కూర్చున్న స్త్రీ ఒంటరిగా ఆ హిరా నుండి మక్కాకు వచ్చి కాబా గృహ ప్రదక్షిణ చేసుకోగలగడం, ఆమెకు అల్లాహ్ ఎడల భయం తప్ప మరే భయం ఉండదనే విషయాన్ని నీవు బ్రతికి ఉంటే చూద్దువుగాని. అలాగే మరిన్నేళ్ళు బ్రతికి ఉంటే, నీవు కిస్రా ధనాగారాలను జయించగలవు. మరిన్నేండ్లు బ్రతికి ఉంటే, మనిషి తన గుప్పెట్లో బంగారాన్నో, వెండినో తీసుకుని దాన్ని ఎవరు స్వీకరిస్తారు అని వెతుకుతూ తిరిగే రోజులను కూడా చూడగలవు. దాన్ని స్వీకరించేవాడే అతనికి లభించడప్పుడు."

4. ఇబ్నె హిషామ్-2/581

5. ముస్నదె అహ్మద్-4/257,378

ఈ ఉల్లేఖనం చివరిలో హజ్రత్ అద్దీ (ర) ఈ మాటలను కూడా జోడించారు:

"నేను నా కళ్ళారా చూశాను. ఓ ఒంటరి స్త్రీ హిరా నుండి వచ్చి కాబా గృహ ప్రదక్షిణం చేసింది; ఆమెకు ఒక్క అల్లాహ్ భయం తప్ప మరెవరి భయమూ కలగలేదు. అలాగే, కిస్రా బిన్ హుర్మిజ్ ధనాగారాలు జయించిన వారిలో నేనూ ఒకణ్ణి. మీరే గనక బ్రతికి ఉంటే ప్రవక్త అబుల్ ఖాసిమ్ (స) చెప్పినట్లుగానే ఓ వ్యక్తి గుప్పెట్లో బంగారాన్ని లేదా వెండిని తీసుకుని తిరగడం చూడగలరు."[6]

6. సహీ బుఖారీ-1/507

గజ్వయె తబూక్ (తబూక్ పోరాటం)

మక్కా విజయం, సత్యాసత్యాల నడుమ జరిగిన ఓ నిర్ణయాత్మకమైన యుద్ధమే అనాలి. ఆ విజయానంతరం అరబ్బుల్లో, మహనీయ దైవప్రవక్త (స) యొక్క దైవదౌత్యం గురించి ఎలాంటి సందేహానికి ఆస్కారం లేకుండా పోయింది. ఈ కారణంగానే పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. దైవధర్మం అయిన ఇస్లామ్‌లో ప్రజలు తండోపతండాలుగా వచ్చి చేరడం ఆరంభమైంది. ప్రతినిధి వర్గాల రాకకు సంబంధించిన అధ్యాయంలో మేము ఇస్తున్న వివరాల ఆధారంగా ఈ విషయాన్ని మీరు అంచనా వేసుకోవచ్చు. అలాగే, హజ్జతుల్ విదా సందర్భంలో హాజరైన ప్రజా సమూహాన్ని బట్టి కూడా దీన్ని మనం గుర్తించవచ్చు - మొత్తానికి, అరేబియాలో అంతర్గతంగా ప్రబలుతున్న తిరుగుబాట్లు, అడ్డంకులన్నీ ఇప్పుడు దాదాపుగా సమసిపోయి నట్లయింది. ముస్లిములు, దైవధర్మ సంవిధానాన్ని, ఇస్లామ్ షరీఅత్‌ను ఎల్లెడలా వ్యాపింపజేయడానికి, ఇస్లామ్ ధర్మప్రచారం కోసం ఏకాగ్రతను సంతరించుకొని ముందుకు పురోగమించడానికి అవకాశం లభించినట్లయింది.

తబూక్ పోరాటం సంభవించడానికి గల కారణం

అయితే ఇప్పుడు, ఎలాంటి కారణం లేకుండానే ముస్లిములతో తలపడడానికి ఓ శక్తి మదీనా వైపునకు దృష్టిని పెట్టింది. దీనికి సంబంధించిన వారు అప్పుడప్పుడు ముస్లిములను కవ్విస్తూ ఉన్నారు. ఈ శక్తి రోమను సామ్రాజ్యానికి సంబంధించినది. అది ఆ కాలంలో ప్రపంచంలోకెల్లా ఓ పెద్ద సూపర్ పవర్‌గా అలరారే సామ్రాజ్యం. వెనుకటి పుటల్లో ఈ కవ్వింపు, షుర్‌జీల్ బిన్ అమ్రూ గస్సానీ చేతిలో దైవప్రవక్త (స) గారి దూత హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ అజ్దీ (ర) హత్యగావించబడడంతో ఆరంభమైంది. హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ బుస్రా గవర్నరు వద్దకు దైవప్రవక్త (స) గారి సందేశాన్ని తీసుకు వెళ్ళిన వ్యక్తి. అదే కాకుండా, మహాప్రవక్త (స) ఆ తరువాత హజ్రత్ జైద్ బిన్

హారిసా నేతృత్వంలో ఓ సైనిక పటాలాన్ని పంపించడం, అది రోమను సామ్రాజ్యంలో 'మూతా'లో భీకరంగా యుద్ధం చేయడం, అయితే ఈ సైనిక పటాలం ఆ తలబిరుసుతనం గల రోమనులను అణచలేకపోవడం కూడా మనం వెనుకటి పుటల్లో చదువుకున్నదే. అయితే, ముస్లిముల ఈ సైన్యం అప్పటి సూపర్ పవర్ అయిన రోమనులతో ఢీకొనడం, అరేబియా పౌరులపై మంచి ప్రభావాన్నే వేసింది.

రోమ్ చక్రవర్తి కైజరు, ఈ ప్రభావం విషయంలో, దాని ఫలితంగా అరబ్బు తెగల్లో రోమనుల నుండి స్వాతంత్ర్యం పొందే భావన జాగృతం అయ్యే విషయంలో, ముస్లిముల ఎడల అరబ్బుల్లో ఏర్పడే సానుభూతి విషయంలో ఎలా ఉపేక్షించగలడు? అవి అతణ్ణి కలచివేస్తున్న ప్రమాద సూచికలే మరి. ఆ ప్రమాదం ఒక్కో అడుగు అతని సరిహద్దుల వైపునకు కదిలివస్తోంది. అరేబియాతో కలిసిన సిరియా సరిహద్దుకు ఓ సవాలుగా నిలిచింది. కాబట్టి కైజరు, ముస్లిముల ఈ మహోన్నతమైన శక్తి, అజేయమైన ఈ ప్రమాదం ముంచుకు రాకపూర్వమే, రోము సామ్రాజ్యానికి అనుకొని ఉన్న అరబ్బు ప్రాంతాల్లో సంక్షోభం, తిరుగుబాట్లు చెలరేగక మునుపే దాన్ని అణచివేయాలనే దృఢసంకల్పానికి వచ్చాడు.

ఈ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకునే, మూతా యుద్ధం జరిగి ఇంకా ఒక్క సంవత్సరం కూడా తిరిగిరాలేదు, రోము చక్రవర్తి రోమను ప్రజల్ని, తన అధీనంలో ఉన్న అరబ్బుల్ని, అంటే ఆలెగస్సాన్ తెగ వగైరాలతో కూడిన ఓ పెద్ద సైన్యాన్ని సమీకరించి, ఓ భయంకరమైన, నిర్ణయాత్మకమైన యుద్ధం కోసం సన్నాహాలు మొదలెట్టాడు.

రోమనులు మరియు గస్సాన్‌ల యుద్ధ సన్నాహాల వార్తలు

రోమను సామ్రాజ్యం ముస్లిములపై దండెత్తడానికి సన్నాహాలు ప్రారంభించిందన్న వార్తలు ఎడతెగకుండా మదీనాకు చేరుతూనే ఉన్నాయి. ఈ కారణంగా ముస్లిములు అప్రమత్తులైపోయారు. ఏ చిన్న అనుమానం వచ్చినా రోమనులు తమపైకి వచ్చిపడ్డారనే భావనకు లోనైపోతున్నారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలంటే ఓ సంఘటనను కూడా ఇక్కడ ఉటంకించక తప్పదు. అదే సంవత్సరం, అంటే హిజ్రీ శకం 9లో దైవప్రవక్త (స) తమ

భార్యామణులతో అలిగి ఒక నెల్లాళ్ళు 'ఈలా'[1] చేసి వారికి దూరంగా ఉన్నారు. సహచరులకు ఈ విషయం తెలిసిరాలేదు. వారు దైవప్రవక్త (స) వారికి తలాక్ ఇచ్చారనే అనుకొని బాధపడిపోయారు.

హజ్రత్ ఉమర్ (ర) ఈ సంఘటన గురించి ఇలా వివరిస్తున్నారు:

"నాకు అన్సారీ మిత్రుడొకడుండేవాడు. నేను (దైవప్రవక్త (స) గారి సన్నిధిలో) లేనప్పుడు అతను అక్కడ జరిగిన విషయాలు వచ్చి చెప్పేవాడు. నేను కూడా అతని గైర్హాజరులో వెళ్ళి జరిగిన విషయాలు అతనికి చెబుతూ ఉండేవాణ్ణి- ఈ ఇద్దరు మిత్రులు మదీనాలోనే ఉంటూ ఉండేవారు. ఇరుగుపొరుగున ఉంటూ వంతుల వారీగా దైవప్రవక్త (స) గారి సన్నిధికి వెళ్ళి వస్తూ ఉండేవారు - ఆ కాలంలోనే మాకు గస్సాన్ రాజు వల్ల ప్రమాదం ఏర్పడుతుందనే శంక ఉంటూ ఉండేది. అతను మాపై దాడి చేయనున్నాడని వస్తున్న వార్తల వల్ల మేము అప్రమత్తులమై ఉండేవారం. ఓ రోజు హఠాత్తుగా నా ఆ అన్సారీ మిత్రుడు నా తలుపును తెగబాదుతూ తలుపు తెరవమని అరవనారంభించాడు. అది విన్న నేను, "ఏమిటీ? గస్సానీలు వచ్చిపడ్డారా?" అని అడిగాను.

"కాదు, అంతకంటే పెద్ద ఘోరమే జరిగిపోయింది. దైవప్రవక్త (స) తమ భార్యామణుల నుండి వేరైపోయారు" అన్నాడు నా మిత్రుడు.[2]

మరో ఉల్లేఖనంలో హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నట్లు ఉంది:

"మాపై దండెత్తడానికి ఆలెగస్సాన్ తమ గుర్రాలకు నాడాలు వేస్తున్నారనే పుకార్లు బాగా వ్యాపించిన రోజులవి. ఓ రోజు నా మిత్రుడు మహాప్రవక్త (స) గారి సన్నిధికి వెళ్ళి ఇషా నమాజు సమయానికి తిరిగివచ్చాడు. నా ఇంటి తలుపును పెద్దగా తడుతూ, "ఆయన నిద్రపోయారా?" అని అరుస్తున్నాడు. నేను బెదిరిపోతూ బయటకు వచ్చేశాను.

1. ఈలా అంటే స్త్రీ వద్దకు వెళ్ళనని ఒట్టేసుకోవడం. ఈ ఒట్టు నాల్గు నెలలు లేదా అంతకంటే తక్కువ గడువు కోసం వేసుకుంటే ధర్మశాస్త్రం ప్రకారం ఫరవాలేదు. ఇదే గనక నాల్గు నెలలు దాటితే షరీఅత్ న్యాయస్థానం ఆ విషయంలో జోక్యం కలుగజేసుకుని భర్త భార్యను భార్యగానైనా ఉంచుకోవాలి లేదా ఆమెకు తలాక్ అయినా ఇవ్వాలి అని ఆదేశిస్తుంది. కొందరు సహాబాల అభిప్రాయం ప్రకారం, నాల్గు నెలల గడువు తీరిపోగానే ఆ స్త్రీకి తలాక్ వర్తిస్తుంది.
2. సహీహ్ బుఖారీ-2/730

"ఓ పెద్ద ప్రమాదం జరిగిపోయింది" అన్నాడతను.

"ఏమిటి? గస్సానులు వచ్చేశారా?" అని అడిగాన్నేను.

"లేదు. అంతకంటే పెద్ద ప్రమాదమే ముంచుకువచ్చింది. దైవప్రవక్త (స) తమ భార్యలకు తలాక్ ఇచ్చేశారు."[3]

ఈ పరిస్థితినిబట్టి రోమనుల వల్ల ముస్లిములలో ఏర్పడిన వ్యాకులత ఎంత తీవ్రమైందో అర్థం చేసుకోవచ్చు. ఇదే కాకుండా, మునాఫిక్‌లు (కపట ముస్లిములు) వ్యాపింపజేస్తున్న పుకార్లు వారిని మరింత చీకాకుపర్చనారంభించాయి. ఈ మునాఫిక్‌లకు, దైవప్రవక్త (స) ప్రతి రంగంలోనూ నెగ్గుకు వస్తున్నారని, ఈ భూమ్మీదనున్న ఏ శక్తికీ వెరవడంలేదని, ఏ అడ్డంకులైతే ఆయన దారికి అడ్డువస్తున్నాయో అవన్నీ ఇట్టే తొలగిపోతున్నాయన్న విషయం తెలిసినప్పటికీ వారు తమ మనస్సుల్లో దాచుకున్నది, ఎదురు చూస్తున్నది తప్పకుండా నెరవేరే తరుణం ఎంతో దూరంగా లేదని తలచి ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రలు పన్ననారంభించారు. వారు తాము భావిస్తున్నట్లుగానే ఓ మస్జిద్‌ను (ఆ మస్జిద్, మస్జిదె జిరార్‌గా ఆ తరువాత ఖ్యాతిగాంచింది) కట్టుకొని ఆ మస్జిద్‌లో కుట్రలు, కుతంత్రాలకు పథకాలు వేయనారంభించారు. దైవం, దైవప్రవక్త (స)ల ఎడల తిరస్కార భావ పునాదులపై నిర్మించబడిన మస్జిద్‌లోనికి వచ్చి నమాజు చేయించమని కూడా ఈ మునాఫిక్‌లు దైవప్రవక్త(స)ను కోరి ఉన్నారు. అలా కోరడానికి కారణం, ముస్లిములను మభ్యపెట్టి వారికి తాము పన్నుతున్న కుతంత్రాలు తెలియకుండా ఉండాలని, ఆ మస్జిద్‌లోకి వచ్చిపోయే వారిపై ముస్లిములు నిఘా ఉంచకుండా ఉండడానికే. కాని దైవప్రవక్త (స) యుద్ధ సన్నాహాల్లో నిమగ్నమై ఉన్నందు వలన ఆ మస్జిద్‌లో నమాజు చేయించే కార్యక్రమాన్ని యుద్ధం నుండి తిరిగి వచ్చే వరకు వాయిదా వేశారు. ఇలా మునాఫిక్‌లు తమ లక్ష్యసాధనలో కృతకృత్యులు కాలేకపోయారు. అల్లాహ్ వారి ఈ ఎత్తుగడను యుద్ధం నుండి తిరిగివచ్చే లోపలే బట్టబయలు చేశాడు. మహాప్రవక్త (స) యుద్ధం నుండి తిరిగివచ్చిన తరువాత ఆ మస్జిద్‌లో నమాజు చేసే బదులు దాన్ని నేలమట్టం చేయించారు.

3. సహీహ్ బుఖారీ-1/334

రోమనులు, గస్సానుల యుద్ధ సన్నాహాలకు చెందిన ప్రత్యేక వార్తలు

ముస్లిములు యుద్ధ వార్తలను వింటూ చీకాకులో ఉన్న కాలంలోనే మదీనాకు సిరియా దేశం నుండి నూనె సరఫరా చేసే 'బన్తీల'[4] ద్వారా హఠాత్తుగా హెరిక్ల్ నలభై వేల మంది సైనికులతో కూడిన ఓ పెద్ద సైన్యాన్ని తయారు చేసి పేరుమోసిన ఓ కమాండరు నేతృత్వంలో యుద్ధానికి పంపిస్తున్నాడని, ఆ సైన్యం జెండా క్రిందికి క్రైస్తవ తెగలైన లఖ్మ్ మరియు జిజాములు కూడా వచ్చి చేరాయని, ఆ సైన్యం ముందస్తు దళం ఒకటి 'బల్కా' వరకు వచ్చేసిందనే పిడుగులాంటి వార్త వినిపించారు. ఇలా అది ఓ పెద్ద ప్రమాద రూపంలో ముస్లిముల ముందుకు వచ్చిన ప్రత్యేక యుద్ధ సంబంధమైన వార్త.

మరింత జటిలంగా మారిన పరిస్థితులు

ఈ పరిస్థితులు ఇలా కొనసాగుతుంటే, వాటికితోడు మరిన్ని విపత్తులు వచ్చిపడ్డాయి. విపరీతమైన ఎండ వేడిమికి తోడు ప్రజలు కరవు వల్ల బాధపడుతున్నారు. వెళ్ళడానికి వాహనాలు కూడా తక్కువే. మదీనాలో పండే పండ్లు పంటకొచ్చాయి. కాబట్టి ప్రజలు మదీనాను వదలక నీడపట్టున ఉండి పంటను దక్కించుకుందామనే ధోరణిలో ఉన్నారు. వెంటనే బయలుదేరడానికి సిద్ధపడడం లేదు. అదేకాకుండా దూరప్రాంతానికి వెళ్ళడం, మార్గంలో ఏర్పడే అవరోధాలు ఓ ప్రక్క పీడించనారంభించాయి వారిని.

ప్రవక్త (స) మహనీయుని ఖచ్చితమైన నిర్ణయం

అయితే దైవప్రవక్త (స) పరిస్థితులను, జరుగబోయే మార్పుల్ని క్షుణ్ణంగా గమనిస్తూనే ఉన్నారు. ఈ నిర్ణయాత్మకమైన ఘడియలో గనక ముస్లిములు రోమనులతో యుద్ధం చేయడానికి బద్ధకించి ముస్లిముల ప్రాంతాల్లోనికి చొరబడే వీలు కలిగిస్తే, వారు మదీనాపై దండెత్తి వస్తే గనకా, ఇస్లామీయ సందేశంపై చెడు ప్రభావాలు పడతాయి. ముస్లిమ్ సైన్యానికి ఇప్పటి వరకు

4. సాబిత్ బిన్ ఇస్మాయీల్ (అ.న.) సంతతికి చెందినవారు. ఒకప్పుడు ఉత్తర హిజాజ్‌లో మంచి పలుకుబడిగల ధనవంతులు. పతనావస్థకు చేరి క్రమక్రమంగా మామూలు రైతులుగా, వ్యాపారులుగా మారిపోయినవారు వీరు.

వచ్చిన కీర్తికాస్తా మంటగలిసిపోతుంది. 'హునైన్' యుద్ధంలో చావుదెబ్బ తిని తుది శ్వాస వదులుతున్న అజ్ఞానం తిరిగి బ్రతికి బట్టకడుతుంది. సమయం కోసం కాచుకొని అబూ అమిర్ ఫాసిక్ ద్వారా రోమను చక్రవర్తితో సంబంధాలు ఏర్పర్చుకున్న మునాఫిక్‌లు, రోమనులతో తలపడబోతున్న ముస్లిములకు వెన్నుపోటు పొడవడానికి కాచుకొని కూర్చున్నారు. ఇలా ఇప్పటి వరకు మహాప్రవక్త (స) మరియు ఆయన అనుచరగణం ఇస్లామ్ వ్యాప్తికి చేసిన కృషి అంతా బూడిదలో బోసిన పన్నీరులా వృథా అయిపోగలదు. ఎడతెగని రక్తపాత సహిత యుద్ధాలు, సైనిక చర్యల ద్వారా సంపాదించిన విజయాలు కాస్తా అపజయాలుగా మారిపోయే ఆస్కారం ఉంది.

ప్రవక్త మహనీయులు (స) ఈ ఫలితాలను పూర్తిగా బేరీజు వేసుకుంటూనే ఉన్నారు. అందుకని, ఓ వైపు విషమ పరిస్థితులు, మరో వైపు దారిద్ర్యం పీడిస్తున్నప్పటికీ, రోమనులను దారుల్ ఇస్లామ్ (మదీనా) వైపునకు పురోగమించే వెసులుబాటును కల్పించే బదులు దైవప్రవక్త (స) తామే స్వయాన వారి ప్రాంతాల్లోనికి చొరబడి వారికి వ్యతిరేకంగా ఓ నిర్ణయాత్మకమైన యుద్ధం చేయాలనే నిర్ణయానికి వచ్చారు.

రోమనులతో యుద్ధానికి సన్నాహాలు

ఈ వ్యవహారాన్ని గురించి బాగా సమీక్షించిన తరువాత ప్రవక్త (స) మహనీయులు సహాబా (ర)లకు, యుద్ధం గురించిన సన్నాహాలు ప్రారంభించమని ప్రకటించారు. అరబ్బు తెగలు, మక్కా ప్రజల్ని కూడా యుద్ధం కోసం బయలుదేరండనే సందేశం పంపించారు. ఏ గజ్వాకైనా వెళ్ళేటప్పుడు దైవప్రవక్త (స) ప్రజల దృష్టిని మరో వైపునకు మళ్ళించడం రివాజు. కాని పరిస్థితి జటిలత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి ఆయన (స), "మనం రోమనులతో యుద్ధానికి వెడుతున్నాం" అని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన 'జిహాద్' గురించి ప్రజల్ని ప్రేరేపించారు. దివ్యఖుర్ఆన్‌లోని 'తౌబా' సూరాలోని ఓ భాగం ఈ సందర్భంలోనే అవతరించింది. దీనికితోడు, ఆయన దానధర్మాల ప్రాశస్త్యం గురించి చెబుతూ, అల్లాహ్ మార్గంలో ప్రియమైనది, మేలైనది అయిన దాన్ని వెచ్చించమని ప్రోత్సహించారు.

యుద్ధ సన్నాహాలకు ముస్లిముల ఉరుకులు పరుగులు

సహాబా (ర)లు, దైవప్రవక్త (స) గారి ప్రకటన వినగానే, రోమనులతో యుద్ధం చేయడానికి సన్నాహాలను ముమ్మరం చేశారు. తెగలు, మిత్రపక్షాలు నలువైపుల నుండి మదీనాకు వచ్చిచేరనారంభించాయి. ఎవరి మనస్సుల్లోనైతే కపటం నాటుకుపోయిందో వారు తప్ప ప్రతి ముస్లిమ్ ఆ గజ్వాకు వెళ్ళడానికి వెనుకాడలేదు. అయితే ముస్లిములలోనే ముగ్గురు వ్యక్తులు మాత్రం ఎలాంటి కారణాలు లేకుండానే ఆ గజ్వాలో చేరకుండా ఆగిపోయారు. వారు కపట ముస్లిములు కారు, నిజమైన ముస్లిములే. ఆర్థికంగా వెనుకబడిన పేద ముస్లిములు సైతం ప్రవక్త (స) మహనీయుల వద్దకు వచ్చి యుద్ధంలో పాల్గొనడానికి తమకు ఏదైనా వాహనాన్ని సమకూర్చమని ప్రాధేయపడనారంభించారు. మహాప్రవక్త (స) తన వద్ద ఏదీ లేదని, ఈ విషయంలో నేను నిస్సహాయుడనని చెప్పి పంపించడం జరుగుతూ ఉండేది. దివ్యఖుర్ఆన్ ఈ సందర్భాన్ని ఈ విధంగా అభివర్ణిస్తోంది.

لَآ اَجِدُ مَآ اَحۡمِلُكُمۡ عَلَيۡهِ ۖ تَوَلَّوۡا وَّاَعۡيُنُهُمۡ تَفِيۡضُ مِنَ
الدَّمۡعِ حَزَنًا اَلَّا يَجِدُوۡا مَا يُنۡفِقُوۡنَ ۟

"నేను మీ కొరకు వాహనాలను ఏర్పాటు చేయలేను అని అన్నప్పుడే, గత్యంతరంలేక వారు మరలిపోయారు. వారి కళ్ళ నుండి అశ్రువులు ప్రవహించాయి. వారు తమ ఖర్చులతో పోరాటంలో పాల్గొనే శక్తి తమకు లేనందుకు చాలా బాధపడ్డారు." (9 : 92)

ఇలాగే ముస్లిములు దైవమార్గంలో ధనాన్ని వెచ్చించే విషయంలో ఒకరినొకరు మించిపోవాలనే ప్రయత్నం కూడా చేయడం జరిగింది. హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (ర), సిరియా దేశం వెళ్ళడానికిగాను వ్యాపార సామగ్రి మూటలు గల రెండు వందల ఒంటెలను, వాటితో సహా రెండు వందల ఓకియాల వెండి (దాదాపు ఇరవై తొమ్మిదిన్నర కిలోల వెండి) తయారు చేసి ఉన్నారు. ఆయన దీన్నంతటిని యుద్ధం కోసం దానంగా ఇచ్చేశారు. ఆ తరువాత అదనంగా ఓ వంద ఒంటెల్ని ప్రయాణ సామగ్రితో సహా సదఖా చేశారు. అది ఇచ్చిన తరువాత ఒక వెయ్యి దీనారాలు (దాదాపు అయిదున్నర

కిలోల బంగారం) తెచ్చి దైవప్రవక్త (స) ఒడిలో పోసేశారు. మహాప్రవక్త (స) ఆ దీనారాలను చేతితో ఇటుఅటు కదిలిస్తూ ఈ రోజు ఉస్మాన్ ఏది చేసినా ఆయనకు నష్టాన్ని చేకూర్చదు[5] అననారంభించారు.

అదే కాకుండా హజ్రత్ ఉస్మాన్ (ర) మళ్ళీ మళ్ళీ సదఖా చేస్తూనే ఉన్నారు. అలా ఆయన సదఖా చేసిన ధనం గాక, ఒంటెల సంఖ్య తొమ్మిది వందలు, గుర్రాల సంఖ్య నూరు వరకు చేరిపోయింది.

ఇటు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) తన రెండొందల ఓకియాలు (అంటే ఇరవైతొమ్మిదిన్నర కిలోల వెండి) తీసుకొచ్చి సమర్పించారు. హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్ (ర) తన దగ్గర ఉన్నదంతా దైవప్రవక్త (స) సన్నిధికి తెచ్చి పడవేశారు. ఆయన భార్యాపిల్లల కోసం మిగిల్చి ఉంచింది కేవలం అల్లాహ్, ఆయన ప్రవక్త (స)ను మాత్రమే. ఆయన చేసిన సదఖా ధనం మొత్తం నాల్గు వేల దిర్హములు. ఆయనే ఈ సదఖా తెచ్చి దైవప్రవక్త (స)కు సమర్పించినవారిలో ప్రథముడు. హజ్రత్ ఉమర్ (ర) తన వద్ద ఉన్న సొత్తులోని సగభాగం తీసుకొని వచ్చి ఇచ్చారు. హజ్రత్ అబ్బాస్ (ర) కూడా పెద్ద మొత్తంలోనే ధనాన్ని తెచ్చి ప్రవక్త (స)కు సమర్పించుకున్నారు. వారే కాకుండా హజ్రత్ తల్హా (ర), సఅద్ బిన్ ఉబాదా (ర), ముహమ్మద్ బిన్ ముస్లిమా (ర)లు కూడా తగినంత డబ్బును సదఖాగా ఇచ్చారు. హజ్రత్ ఆసిమ్ బిన్ అద్దీ (ర) తొంభై వస్కుల (అంటే పదమూడున్నర వేల కిలోలు లేదా పదమూడున్నర టన్నుల) ఖర్జూరాలు తీసుకువచ్చారు. తక్కిన సహాబాలు కూడా ఒకరి తరువాత ఒకరు తమకు తోచిన సదఖా తెచ్చి ఇచ్చారు. చివరికి శక్తి లేనివారు కూడా ఒకటో రెండో ముద్‌లు (ఖర్జూరాలు) సదఖాగా ఇచ్చారు. మహిళలు కూడా తమ కంఠహారాలు, వడ్డాణాలు, కాళ్ళ పట్టీలు, చెవుల రింగులు, ఉంగరాలు వగైరాలు వారి శక్తి మేరకు తెచ్చి మహాప్రవక్త (స)కు సమర్పించుకున్నారు. ప్రతివారూ పిసినారితనాన్ని ప్రదర్శించకుండా సదఖా ఇచ్చినవారే. కేవలం మునాఫిక్‌లు ఒక్కరే ఒకరిని మించి ఒకరు సదఖా చేయడం చూసి (వీరు ప్రదర్శనాబుద్ధితో చేస్తున్న సదఖా అని) తూలనాడనారంభించారు. తమ వద్ద ఇవ్వడానికి ఏమీ లేని పేద ముస్లిములెవరైనా ఒకటి, రెండు ఖర్జూరాలను

5. *జామిఅ తిర్మిజీ: మనాఖిబ్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్-2/211*

తీసుకొని వస్తే వారిని చూసి ఈ మునాఫిక్‌లు, ఓహో ఈ ఖర్జూరాలతో కైజరు సామ్రాజ్యాన్ని జయిస్తారు కాబోలు అని హేళన చేసేవారు. (9 : 97)

తబూక్‌కు బయలుదేరిన ఇస్లామీయ సైన్యం

ఇస్లామీయ సైన్యం యుద్ధానికి పూర్తిగా సన్నద్ధమైన తరువాత దైవప్రవక్త (స) హజ్రత్ ముహమ్మద్ బిన్ ముస్లిమా (ర)ను, మరో ఉల్లేఖనంలో చెప్పబడినట్లుగా సబా బిన్ అరఫ్తా (ర)ను మదీనాకు గవర్నరుగా నియమించారు. హజ్రత్ అలీ (ర)ని తమ కుటుంబ సభ్యులకు సంరక్షకులుగా చేసి మదీనాలోనే ఉండమని చెప్పి ఆదేశించారు. కాని మునాఫిక్‌లు ఆయన్ను తూలనాడడం వలన ఆయన బయలుదేరి దైవప్రవక్త (స) వద్దకు చేరారు. కాని మహాప్రవక్త (స) తిరిగి ఆయన్ను మదీనాకు పంపిస్తూ, "ఏమిటీ! నీకూ నాకూ ఉన్న అనుబంధం, హజ్రత్ మూసా (అ.స.)కు హజ్రత్ హారూన్ (అ.స.)తో ఉన్న అనుబంధం లాంటిది అనే విషయాన్ని గ్రహించలేదా? అయితే నా తరువాత మరో ప్రవక్త రాడు అనే విషయం తెలుసుకో" అని అన్నారు.

ఎట్టకేలకు దైవప్రవక్త (స) ఉత్తర దిశ వైపునకు బయలుదేరారు. (నిసాయీ గ్రంథంలోని ఉల్లేఖనం ప్రకారం అది గురువారం) గమ్యం తబూక్. సైన్యం పెద్దది. ముప్పై వేల మంది యోధులతో కూడిన సైన్యం అది. అంతకు పూర్వం ముస్లిములు అంత పెద్ద సైన్యాన్ని ఎప్పుడూ సమీకరించలేదు. అందుకని, ముస్లిములు దానికోసం తమ శాయశక్తులా ధనాన్ని సమకూర్చినప్పటికీ సైన్యానికి కావలసిన హంగుల్ని సమకూర్చలేకపోయారు. అప్పటికీ వాహనాలు, తినుబండారాలు బాగా తక్కువగానే ఉన్నాయి. కాబట్టి పద్దెనిమిదేసి మంది సిపాయీలకు ఒక్కొక్క ఒంటె కేటాయించబడింది. వారు దానిపై వంతుల వారీగా స్వారీ చేస్తూ వెడుతున్నారు. అలాగే తినుబండారాల కొరత వల్ల అప్పుడప్పుడు చెట్ల ఆకుల్ని సైతం తినవలసి వచ్చింది. ఆ ఆకుల్ని తినడం వలన వారి పెదాలు వాచిపోయాయి. విధిలేక ఒంటెల కొరత ఉన్నప్పటికీ వాటిని జిబహ్ చేసి దాని ప్రేవుల్లో ఉన్న నీటిని త్రాగవలసి వచ్చింది. అందుకొరకే ఆ సైన్యం పేరు 'జైషె ఉస్రత్' (అంటే కష్టాలు అనుభవించిన సైన్యం) అని పడిపోయింది.

తబూక్‌కు వెళ్ళేటప్పుడు ఈ సైన్యం 'హిజ్ర్' (అంటే సమూద్ జాతి నివసించిన ప్రదేశం) గుండా వెళ్ళవలసివచ్చింది. సమూద్ జాతి 'వాదియిల్ ఖురా'లో బండరాళ్ళను తొలిచి ఇండ్లను నిర్మించుకున్న జాతి. సహాబా (ర)లు అక్కడి ఓ బావి నుండి నీటిని నింపుకున్నారు. కాని బయలుదేరే టప్పుడు మహాప్రవక్త (స) వారితో, "మీరు ఈ ప్రదేశంలోని నీరు త్రాగకండి, ఆ నీటితో నమాజు చేసుకోవడానికి వుజూ కూడా చెయ్యొద్దు. ఆ నీటితో ఏ పిండి అయితే కలిపి ముద్దగా చేశారో, దాన్ని పశువులకు పెట్టేయండి. ఆ పిండి తినకండి. మీరు సాలెహ్ (అ.స.)గారి ఒంటె నీళ్ళు త్రాగిన బావిలోని నీటినే ఉపయోగించండి" అని ఆదేశించారు.

'సహీ హీన్' గ్రంథంలో ఇబ్నె ఉమర్ (ర)గారి ఉల్లేఖనం ఒకటుంది. అందులో ఆయన ఇలా సెలవిస్తున్నారు:

"మహాప్రవక్త (స) 'హిజ్ర్' (లేదా సమూద్ జాతి నివాసం) గుండా వెడుతూ, 'ఈ దుష్టులు నివసించిన ప్రదేశంలో ప్రవేశించకండి. వారిపై పడిన ఆపద మీపైనా పడవచ్చు. అయితే వెళ్ళేటప్పుడు మాత్రం బాధతో మూలిగే హృదయాలు రోదిస్తూ నడిచినట్లు నడవండి' అన్నారు. ఆ పిదప ఆయన తన తలపై వస్త్రం కప్పుకుని వేగంగా ప్రయాణిస్తూ ఆ లోయను దాటారు."[6]

మార్గమధ్యంలో సైన్యానికి నీరు కరవై విలవిలలాడిపోతోంది. ఈ విషయం దైవప్రవక్త (స)కు విన్నవించుకున్నారు కొందరు. ప్రవక్త మహనీయులు (స) అల్లాహ్‌ను మొరపెట్టుకోగా అల్లాహ్ మేఘాలను పంపించాడు. అవి బాగా వర్షించగా జనం తనవితీరా దాహాన్ని తీర్చుకోవడమే కాకుండా అవసరానికి కావలసినంత నీటిని నింపుకోవడం జరిగింది.

ఇక తబూక్ దాపుకు చేరుతారనగా మహాప్రవక్త (స) సైన్యాన్ని ఉద్దేశించి, "ఇన్షా అల్లాహ్, మీరు రేపటికల్లా తబూక్ యొక్క నీటి చెలమను చేరుకో గలరు. అయితే చాష్త్ సమయానికి ముందు అక్కడకు వెళ్ళలేరు. కాబట్టి అక్కడికి వెళ్ళినవాడు ఏ ఒక్కడు కూడా నేను చేరనంత వరకు ఆ నీటిని ముట్టుకోవద్దు సుమా!" అని హెచ్చరించారు. హజ్రత్ ముఆవియా (ర) కథనం ప్రకారం, "మేము అక్కడికి చేరేలోపలే ఇద్దరు వ్యక్తులు ఆ చెలమ

6. సహీహ్ బుఖారీ-హిజ్ర్ లోయలో ప్రవేశించిన దైవప్రవక్త (స) అనే అధ్యాయం-2/637

దగ్గరికి వెళ్ళడం గమనించాం. ఊట బావి(చెలమ) నుండి కొద్దికొద్దిగా నీరు ఊరుతోంది. మహాప్రవక్త (స) వారిద్దరిని ఉద్దేశించి, 'మీరు ఈ నీటిని ముట్టుకున్నారా?' అని అడగగా, 'అవును' అని బదులిచ్చారు వారు. ఆ ఇద్దరికి దైవాదేశం మేరకు ఏం చేప్పాలో చెప్పి, ఆ చెలమ నుండి తన ఒక అర చేతిని దొప్పగాచేసి వచ్చిన నీటిని బయటకు తీయనారంభించారు. అలా తీయగా వచ్చిన కొద్దిపాటి నీటితో తన ముఖాన్ని, చేతుల్ని కడిగి తిరిగి ఆ నీటిని ఆ చెలమలో పోసేశారు. ఆ తరువాత ఆ చెలమలో పుష్కలంగా నీరు ఊరనారంభించింది. సహాబా (ర) తనవితీరా ఆ నీటిని త్రాగారు. ఆ తరువాత నన్నుద్దేశించి, 'ఓ ముఆజ్! నీవే గనక బ్రతికి ఉంటే ఈ ప్రదేశాన్ని తోటలతో సస్యశ్యామలంగా అలరారుతున్నట్లు చూస్తావు' అని చెప్పారు."[7]

మార్గం మధ్యలోనో లేదా తబూక్‌కు చేరిన తరువాతనో- ఉల్లేఖనాల్లో కొంత భేదం ఉంది - దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

"ఈ రాత్రి మీ మీదికి పెద్ద ఇసుక తుఫాను ఒకటి వచ్చిపడబోతోంది. అందుకని ఏ ఒక్కడూ లేచి నిలబడకూడదు. ఒంటెగలవాడు దాన్ని త్రాటితో గట్టిగా కట్టేయాలి" అన్నారు. మహాప్రవక్త (స) సెలవిచ్చినట్లుగానే ఆ రాత్రి తీవ్రమైన గాలి దుమారం చెలరేగింది. వారిలో ఒక వ్యక్తి లేచి నిలబడగా ఆ గాలి దుమారం అతణ్ణి ఎగిరేసుకుపోయి రెండు కొండల నడుమ విసరేసింది."[8]

తబూక్ ప్రయాణంలో దైవప్రవక్త (స) జొహ్ర్ మరియు అస్ర్ నమాజులు, మగ్రిబ్ మరియు ఇషా నమాజులు కలిపి చేసేవారు. ఒక్కొక్కసారి ఈ రెండు నమాజుల్ని జమా తఖ్దీమ్‌గాను, జమా తాఖీర్‌గానూ చేసేవారు. ('జమా తఖ్దీమ్' అంటే జొహ్ర్ మరియు అస్ర్ నమాజులు జొహ్ర్ నమాజు వేళ అయినప్పుడు, మగ్రిబ్, ఇషా నమాజులు మగ్రిబ్ వేళ అయినప్పుడు చేయడం. ఇక 'జమా తాకీర్' అంటే, జొహ్ర్, అస్ర్ నమాజులు అస్ర్ నమాజు వేళలో, మగ్రిబ్, ఇషా నమాజులు ఇషా నమాజు వేళలో చేయడం)

తబూక్‌కు చేరిన ఇస్లామీయ సైన్యం

ఇస్లామీయ సైన్యం తబూక్‌కు చేరి గుడారాలను వేసుకొని, రోమను

7. ముస్లిమ్- ముఆజ్ బిన్ జబల్ ఉల్లేఖనం-2/246
8. ముస్లిమ్-ముఆజ్ బిన్ జబల్ ఉల్లేఖనం -2/246

లతో తలబడడానికి సిద్ధమైపోయింది. ఈ సందర్భంలో మహాప్రవక్త (స) సైన్యానుద్దేశించి, విశాలమైన భావాలు స్ఫురించేటట్లుగా ప్రసంగించారు. ఆ ప్రసంగంలో ఇహపరలోకాల సాఫల్యం గురించి ప్రోత్సహించారు. అల్లాహ్ శిక్ష ఎలాంటిదో చూపుతూ భయపెట్టారు. యుద్ధానంతరం లభించబోయే వరాలు, బహుమానాలకు సంబంధించిన శుభవార్తనిచ్చారు. ఇలా సైన్యం యొక్క ధైర్యసాహసాలు పెరిగినట్లయింది. వారిలో ఇప్పటి వరకు, తినుబండారాలు, ఇతర వస్తువుల లేమి గురించి బాధపడుతున్న లోపాలన్నీ తొలగిపోయాయి. మరో ప్రక్క రోమను సామ్రాజ్యానికి మద్దతుగా వచ్చిన తెగలు, మహాప్రవక్త (స) రాక గురించి విని భయభీతులైపోయాయి. ముందుకొచ్చి ముస్లిమ్ సేనను ఢీకొనడానికి ధైర్యం చాలక, దేశంలోని వివిధ పట్టణాల వైపునకు పారిపోనారంభించాయి. వారి ఈ వైఖరి ప్రభావం, అరేబియా ద్వీపంలోనే కాకుండా, బయటి వారిపైనా పడింది. ముస్లిముల ఘనకీర్తికి మరింత బలం చేకూరినట్లయింది. ముస్లిములకు, యుద్ధం ద్వారా సాధించ లేని రాజకీయ ప్రయోజనాలు ఒనగూడాయి. ఆ ప్రయోజనాలేమిటో మనం ఇక్కడ సమీక్షిద్దాం.

'అయిలా' పాలకుడు 'యక్నా బిన్ రౌబా' వెంటనే మహాప్రవక్త (స) సన్నిధిలో హాజరై జిజియా కట్టడానికి ఒప్పుకున్నాడు. సంధి ఒప్పందం చేసుకున్నాడు. 'జర్బా' మరియు 'అజ్‌రూహ్' పౌరులు కూడా దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి జిజియా కట్టడానికి సిద్ధపడ్డారు. మహాప్రవక్త (స) వారికి ఓ పత్రాన్ని రాయించి ఇచ్చారు. వారు దాన్ని సురక్షితంగా తమ వద్ద ఉంచుకోవడం జరిగింది. అలాగే 'అయిలా' పాలకునికి కూడా ప్రవక్త మహనీయులు (స) పత్రాన్ని రాసి ఇచ్చారు. అది ఈ క్రింది విధంగా ఉంది:

"బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం. ఇది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) తరపున, యహినా బిన్ రౌబా మరియు అయిలా ప్రజలకు రాసి ఇచ్చిన శాంతి ఒప్పంద పత్రం. భూతలంపైనా, సముద్రం మీదనూ వారి పడవలు మరియు బిడారాల బాధ్యత అల్లాహ్ మరియు ముహమ్మద్ (స)దే. అలాగే ఈ బాధ్యత 'యహినా'కు మిత్రులైన సిరియా వారి కోసం కూడాను. అయితే, వారి ఏ వ్యక్తి అయినా ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే అతని ధనం అతని

ప్రాణాన్ని రక్షించలేదు. అతని సొత్తును తీసుకున్నవాడికి అది ధర్మసమ్మతమే అవుతుంది. వారు ఏ ఒయాసిస్సుకు వెళ్ళడాన్నిగాని, భూమి మరియు సముద్ర మార్గంపై నడవడాన్నిగాని అడ్డుకోవడం జరుగదు."

ఇదే కాకుండా మహనీయ ప్రవక్త (స), హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర)కు నాల్గు వందల ఇరవై ఉష్ట్రారోహకుల పటాలాన్నిచ్చి దూమతుల్ జందల్ పాలకుడు 'ఉకైదిర్' వద్దకు పంపించారు. వెళ్ళేటప్పుడు ఆయనతో, "నీవు వెళ్ళేటప్పటికి అతడు జింక వేటలో ఉండగా జూస్తావు" అని కూడా చెప్పారు. హజ్రత్ ఖాలిద్ (ర) కోట అగుపడేటంత దూరం వెళ్ళి ఆగిపోయారు. అనుకోకుండా ఓ జింక ఎక్కడి నుండో వచ్చి కోట ద్వారాన్ని కొమ్ములతో చెలుగుతోంది. ఉకైదర్ దాన్ని వేటాడడానికి బయటకు వచ్చాడు. వెన్నెల రాత్రి కావడం వలన, హజ్రత్ ఖాలిద్ (ర), ఆయనగారి అనుచరులు అతణ్ణి పట్టుకొని దైవప్రవక్త (స) సన్నిధికి తెచ్చారు. మహాప్రవక్త (స) అతణ్ణి క్షమించి, రెండు వేల ఒంటెలు, ఎనిమిది వందల బానిసలు, నాల్గు వందల కవచాలు, నాల్గు వందల బరిశెలు ఇచ్చే షరతుపై ఒప్పందం కుదుర్చుకుని వదలివేశారు. అతను ఇక నుండి జిజియా కూడా కడ్తానని ఒప్పుకున్నాడు.

ఇలా మహాప్రవక్త (స) యహినాకు తోడు దూమా, తబూక్, అయిలా మరియు తైమాలతో షరతులతో కూడిన ఒప్పందాలు చేసుకున్నట్లయింది.

ఈ పరిస్థితులను గమనించి, ఇప్పటి వరకు రోమనుల చెప్పుచేతల్లో ఉన్న తెగలు, ఇక తమ పాత సంరక్షకులను నమ్ముకొని ఉండే కాలం చెల్లిపోయిందని తలచి ముస్లిములకు సహకరించనారంభించారు. ఈ విధంగా ముస్లిము సామ్రాజ్య సరిహద్దులు విస్తరించి నేరుగా రోమను సామ్రాజ్యంతో కలిసిపోయాయి. రోమనుల తొత్తులు చాలా మట్టుకు అంతమైపోయారు.

మదీనాకు తిరుగు ప్రయాణం

ఇస్లామీయ సేన ఎలాంటి యుద్ధం చేయకుండానే విజయకేతనం ఎగురవేస్తూ మదీనాకు తిరిగి వచ్చింది. అల్లాహ్, యుద్ధం విషయంలో మోమిన్‌ల (విశ్వాసుల)కు అండగా నిలిచాడు. అయితే మార్గమధ్యంలో ఓ లోయ వద్ద పన్నెండుగురు మునాఫిక్‌లు దైవప్రవక్త (స)ను హతమార్చడానికి

ప్రయత్నించారు. ఆయన అప్పుడు ఆ లోయగుండా వెళుతున్నారు. హజ్రత్ అమ్మార్(ర) ఒంటె ముకుత్రాడు పట్టుకొని ముందు నడుస్తున్నారు. హజ్రత్ హుజైఫా బిన్ యమాన్ (ర) ఒంటె వెనకాల నడుస్తూ దాన్ని తోలుతున్నారు. మిగిలిన సహాబాలందరూ దూరంగా, ఆ లోయ పల్లపు ప్రదేశం గుండా వస్తున్నారు. అందుకని మునాఫిక్‌లకు ప్రవక్త (స)ను హతమార్చే దుష్టావకాశం లభించిందనిపించింది. వారు ప్రవక్త (స) వైపునకు రానారంభించారు. ఇటు ప్రవక్తగారి సహచరులిద్దరు మామూలుగా నడుస్తూనే ఉన్నారు. వెనుక నుండి ఎవరో వస్తున్నట్లు కాళ్ళ సవ్వడి వినబడింది. వీరంతా ముఖాలపై ముసుగులు కట్టుకొని దాడికి సిద్ధపడడం చూసి ప్రవక్త మహనీయులు (స) హుజైఫా (ర)ను వారిని అడ్డగించడానికి పంపారు. ఆయన వారి వాహనాల ముఖాలపై తన ఢాలుతో కొట్టనారంభించారు. అల్లాహ్, ఆయన వేసిన దెబ్బలకు భయపడి పోయేటట్లుగా చేయడం వలన వారు పారిపోయి తమ వారి వద్దకు చేరారు. ఆ తరువాత మహాప్రవక్త (స) వారి పేర్లు చెబుతూ వారెందుకు వచ్చారో తెలియజేశారు. అందుకనే హజ్రత్ హుజైఫా (ర)కు, ప్రవక్త 'నమ్మిన బంటు'గా పేరుబడిపోయింది. ఈ సంఘటనకు సంబంధించే దివ్య ఖుర్‌ఆన్‌లో, "వారు చేయదలిచిన పనిని చేయలేకపోయారు" అనే వాక్యం అవతరించింది.

ప్రయాణం పూర్తిచేసి మదీనా దాపుకు రాగానే దైవప్రవక్త (స)కు మదీనా గురుతులు కానరాగా ఆయన, "అదిగో 'తాబా', అది ఉహద్ కొండ, మనల్ని ప్రేమించేది మనం దాన్ని ప్రేమిస్తున్న కొండ అదిగో" అని సంబరపడుతూ అన్నారు. ఇటు మదీనాలో ఆయన రాక గురించిన వార్త అందగానే స్త్రీలు, పిల్లలు, అమ్మాయిలంతా బయటకు వచ్చి ఎంతో ఘనంగా ఆ సైన్యానికి స్వాగతం పలకుతూ ఈ పద్యపాదాలను చదవనారంభించారు[9] (దాని భావం ఇలా ఉంది):

"సనీయతుల్ విదా దిగ్మండలం నుండి పొడిచిన పున్నమి చంద్రుడడిగో, మమ్మల్ని పిలిచేవాడు పిలుస్తున్నంత వరకు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవడం మన విధి."

మహాప్రవక్త (స) తబూక్‌కు రజబ్ నెలలో బయలుదేరారు. తిరిగి వచ్చేటప్పటికి రమజాన్ నెల నడుస్తోంది. ఈ ప్రయాణం మొత్తం యాభై

9. ఇది ఇబ్నె ఖయ్యిమ్ గారి సూక్తి. దీనిపై చర్చ ఇది వరకే వచ్చింది.

రోజుల ప్రయాణం. ఇరవై రోజులు తబూక్‌లో గడిపినవి, ముప్పై రోజులు అక్కడికి వెళ్ళిరావడానికి జరిగిన ప్రయాణ రోజులు.

దైవప్రవక్త (స) తమ జీవితకాలంలో స్వయంగా పాల్గొన్న గజ్వాల్లో ఈ గజ్వా చిట్టచివరి గజ్వా (పోరాటం).

ముకల్లిఫీన్ (యుద్ధంలో పాల్గొనకుండా వెనుక ఉండిపోయినవారు)

ఈ పోరాటం, దాని ప్రత్యేక పరిస్థితులననుసరించి, అల్లాహ్ తరపున ఓ గట్టి పరీక్ష కూడాను. ఈ పోరాటం ద్వారా, విశ్వాసులెవరో, విశ్వాసులు కానివారెవరో తేలిపోయింది. ఇలాంటి పరిస్థితులు ఏర్పడినప్పుడల్లా ఇలాంటి వారిని ఏరి చూయించడం దేవుని సంప్రదాయం. దివ్యఖుర్‌ఆన్ ఈ విషయాన్ని ఇలా సెలవిస్తోంది:

مَا كَانَ اللّٰهُ لِيَذَرَ الْمُؤْمِنِيْنَ عَلٰى مَآ اَنْتُمْ عَلَيْهِ حَتّٰى
يَمِيْزَ الْخَبِيْثَ مِنَ الطَّيِّبِ

"మీరు ప్రస్తుతం ఉన్నటువంటి స్థితిలో అల్లాహ్ విశ్వాసులను ఏ మాత్రం ఉండనివ్వడు. ఆయన పవిత్రులను, అపవిత్రుల నుంచి తప్పకుండా వేరుచేస్తాడు." (3:179)

కాబట్టి ఈ పోరాటంలో విశ్వాసులు, సత్యవంతులందరూ పాల్గొన్నవారే. ఆ యుద్ధంలో పాల్గొనకపోవడమంటే, అది నిఫాక్‌కు (కాపట్యానికి) గుర్తు. ఎవరైనా యుద్ధంలో పాల్గొనకుండా ఎందుకు ఉండిపోవలసివచ్చిందో ఆ విషయాన్ని దైవప్రవక్త (స)కు విన్నవించుకునేవారు సహాబా (ర). ఆయన దానికి జవాబుగా, "వదిలేయండి! అతని మనస్సులో శ్రేయం పొందాలనే కోరికే ఉంటే, అల్లాహ్ త్వరలోనే అతణ్ణి మీ వద్దకు పంపించేస్తాడు. అలా కాకపోతే అతని నుండి అల్లాహ్ మిమ్మల్ని రక్షించినట్లే" అని అంటూ ఉండేవారు. ఎలాగైతేనేమి, యుద్ధసామగ్రి, వాహనాలులేక యుద్ధంలో పాల్గొనలేక పోయిన వారు కొందరైతే, మునాఫిక్‌లు మరికొందరు. ఈ మునాఫిక్‌లు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)ను విశ్వసించామని దొంగ నటన చేసినవారు. ప్రస్తుతం వారే దొంగసాకులు చెప్పి ఈ గజ్వాలో పాల్గొనకుండా ఆయన (స) అనుమతిని పొంది వెనుక ఉండిపోయినవారు. మరికొందరైతే

ఎలాంటి అనుమతి లేకుండానే ఇండ్లలో కూర్చుండిపోయారు. అయితే పోరాటంలో పాల్గొనకుండా మిగిలిపోయిన ముగ్గురు మాత్రం నిజమైన ముస్లిములు, గట్టి విశ్వాసం గలవారే. వారు ఎలాంటి కారణం లేకుండానే యుద్ధంలో పాల్గొనలేదు. వారిని అల్లాహ్ పరీక్షకు గురిచేసిన తరువాత వారి పశ్చాత్తాపాన్ని మన్నించడం జరిగింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:

తిరుగు ప్రయాణం చేసి మదీనాకు చేరిన మహాప్రవక్త (స) ఎప్పటిలాగే మస్జిదె నబవీకి వెళ్ళారు. అక్కడ రెండు రకాతుల నమాజు చేశారు. ప్రజలు చుట్టుముట్టగా అక్కడనే కూర్చుండిపోయారు. ఇటు మునాఫిక్‌లు - వారు ఎనభై మందికంటే ఎక్కువే."[10] ఒకరి తరువాత ఒకరు వచ్చి ఏదో సాకులు చెప్పనారంభించారు. దేవునిపై ప్రమాణాలు చేస్తూ తాము రాలేకపోయిన విషయాన్ని వివరిస్తున్నారు. మహాప్రవక్త (స) వారు పైకి చెప్పే దాన్ని స్వీకరించి వారితో బైత్ కూడా చేస్తూ వారి మన్నింపు కోసం దైవాన్ని ప్రార్థిస్తున్నారు. వారి మనస్సులోని విషయాన్ని దైవానికే వదలివేశారు.

ఇక మిగిలిన వారు ముగ్గురు మోమిన్‌లు, సత్యసంధులు -అంటే హజ్రత్ కఅబ్ బిన్ మాలిక్(ర), మురారా బిన్ రబీ (ర), హిలాల్ బిన్ ఉమయ్యా (ర)లు- వారు నిజాన్నే అనుసరిస్తూ, "మేము ఎలాంటి కారణం లేకుండానే పోరాటంలో పాల్గొనలేదు" అని ఉన్న విషయం మహాప్రవక్త (స)కు విన్నవించుకున్నారు. దైవప్రవక్త (స), ఈ ముగ్గురు వ్యక్తులతో ఎలాంటి సంభాషణ చేయవద్దని సహాబా (ర)ను ఆదేశించారు. కాబట్టి ఈ ముగ్గురికి వ్యతిరేకంగా తీవ్రమైన బాయికాట్ (సామాజిక వెలి) ప్రారంభం అయింది. ప్రజలంతా ఒక్కసారే మారిపోయారు. జీవితం భయంకరంగా మారిపోయింది. ఇంత పెద్ద వైశాల్యం గల భూమి ఒక్కసారే ఇరుకైనట్లనిపించింది వారికి. అదేకాదు ప్రాణాలు కూడా పోయేటంత గడ్డు పరిస్థితి ఏర్పడింది. అలా నలభై రోజులు గడిచిన తరువాత భార్యల వద్దకుపోవడం కూడా మానుకొమ్మనే ఆదేశం వెలువడింది. బాయికాట్‌కు సంబంధించిన యాభై రోజులు పూర్తి

10. *వాకిదీ కథనం ప్రకారం, ఈ సంఖ్య అన్సారులలోని మునాఫిక్‌లది. వారే కాకుండా బనీ గిఫ్ఫార్ వగైరా బద్దూ తెగల వారి సంఖ్య ఎనభై ఇద్దరు. అబ్దుల్లాహ్ బిన్ ఉబై, అతని సహచరులు వారికి అదనం. వారు కూడా చాలా మందే ఉన్నారు. (చూడండి, ఫత్‌హుల్ బారి-8/119)*

అయిన తరువాత అల్లాహ్ వారి తౌబా స్వీకరించబడినట్లు శుభవార్త అందించాడు. దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ శుభవార్త వాక్యాలు ఇలా ఉన్నాయి.

وَّعَلَى الثَّلٰثَةِ الَّذِيْنَ خُلِّفُوْا ۭ حَتّٰٓي اِذَا ضَاقَتْ عَلَيْهِمُ الْاَرْضُ
بِمَا رَحُبَتْ وَضَاقَتْ عَلَيْهِمْ اَنْفُسُھُمْ وَظَنُّوْٓا اَنْ لَّا مَلْجَاَ مِنَ اللّٰهِ اِلَّآ اِلَيْهِ ۭ
ثُمَّ تَابَ عَلَيْهِمْ لِيَتُوْبُوْا ۭ اِنَّ اللّٰهَ ھُوَ التَّوَّابُ الرَّحِيْمُ

"ఇంకా వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురిని కూడా ఆయన క్షమించాడు. ఇంత పెద్ద వైశాల్యం కలిగి ఉండి కూడా, భూమి వారికి ఇరుకై పోయింది. వారి ప్రాణాలు కూడా వారికి భారమైపోయాయి. అల్లాహ్ నుండి తమను కాపాడుకోవడానికి స్వయంగా అల్లాహ్ కారుణ్యం తప్ప వేరే ఆశ్రయం ఏదీ లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు అల్లాహ్ కనికరంతో వారి వైపునకు మరలాడు, వారు ఆయన వైపునకు మరలి వచ్చేటందుకు. నిశ్చయంగా ఆయన చాలా క్షమించేవాడు, కరుణించే వాడూను." (9 : 118)

ఈ తీర్పు వెలువడగానే ముస్లిములందరూ సాధారణంగానూ, ఆ ముగ్గురు సహాబాలు (ర) ప్రత్యేకంగాను సంబరపడిపోయారు. ప్రజలు పరుగున వచ్చి వారికి ఈ శుభవార్తను అందించనారంభించారు. వారి ముఖాలు ఆనందాతిశయంతో విప్పారిపోయాయి. ప్రజలు వారికి కానుకలు అర్పించనారంభించారు. నిజం చెప్పాలంటే ఆ రోజు వారికి ఎంతో విలువైన రోజు.

అలాగే మరెవరైతే చేతకాక వివశులై ఆ సంగ్రామంలో పాల్గొనలేక పోయారో వారిని గురించి అల్లాహ్ ఈ క్రింది ఆయత్‌లను అవతరింపజేశాడు.

لَيْسَ عَلَى الضُّعَفَاۗءِ وَلَا عَلَي الْمَرْضٰى وَلَا عَلَي الَّذِيْنَ لَا يَجِدُوْنَ
مَا يُنْفِقُوْنَ حَرَجٌ اِذَا نَصَحُوْا لِلّٰهِ وَرَسُوْلِهٖ ۭ

"వృద్ధులూ, వ్యాధిగ్రస్తులూ, పోరాటంలో పాల్గొనడానికి దారి భత్యాలు లేని వారూ ఒకవేళ వెనుక ఉండిపోతే ఏ దోషమూ లేదు. వారు చిత్తశుద్ధితో అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విశ్వాసపాత్రులుగా ఉన్నంతవరకు.

అటువంటి సజ్జనుల పట్ల ఆక్షేపణకు ఏ ఆస్కారమూ లేదు. అల్లాహ్ మన్నించేవాడూ, కరుణించేవాడూను." (9 : 91,92)

మదీనాకు దాపుగా వచ్చినప్పుడు దైవప్రవక్త (స) వారి విషయంలోనే, "మదీనాలో కొందరున్నారు. వారు మీరు ఏయే ప్రదేశాల నుండి ప్రయాణం చేశారో, ఏ లోయల్ని దాటారో అప్పుడు మీ వెంటే ఉన్నారు, వారిని కొన్ని అనివార్య కారణాలు మీ వెంట రాకుండా చేశాయి" అని అనగా, "ఓ దైవప్రవక్తా! వారు మదీనాలో ఉంటూనే మన వెంట ఉన్నారా?" అని అడిగారు అనుచరులు. "అవును, మదీనాలో ఉండి కూడా వారు మీ వెంటే ఉన్నారు" అని సమాధానమిచ్చారు మహాప్రవక్త (స).

ఈ పోరాట ప్రభావం

ఈ సంగ్రామం అరేబియా ద్వీపంపై, ముస్లిముల ప్రభావం విస్తరింప జేయడానికి, బలం చేకూర్చడానికి ఎంతో దోహదపడింది. ఇక అరేబియా ద్వీపంలో ఇస్లామ్ శక్తి తప్ప మరే శక్తి జీవించి ఉండజాలదు అనే విషయం ప్రజల మనస్సుల్లో నాటుకుపోయింది. ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రలు కుతంత్రాలు పన్నుతూ అదను కోసం ఎదురుచూస్తున్న మునాఫిక్‌ల ఆశలు కూడా అడియాసలైపోయాయి. వీరు రోమను సామ్రాజ్యంపై పెట్టుకున్న ఆశలు ఈ సంగ్రామంతో అడుగంటిపోయాయి. అందుకని వారి ధైర్యం కాస్తా సన్నగిల్లి, యదార్థం ముందు మోకరిల్లడం తప్ప మరే మార్గం వారికి లభించలేదు.

ఇలాంటి పరిస్థితి ఏర్పడిన తరువాత ఇక ముస్లిములు, మునాఫిక్‌ల ఎడల మృదువైఖరిని అవలంబించే అవసరమే లేకుండాపోయింది. అల్లాహ్ వారి ఎడల కఠిన వైఖరిని అవలంబించమని ఆదేశం ఇస్తూ, చివరకు వారు ఇచ్చే దానధర్మాలను కూడా స్వీకరించడంగాని, వారి జనాజా నమాజు చేయడం గాని, వారి మన్నింపు కోసం ప్రార్థించడంగాని చేయవద్దని ఆదేశించడం జరిగింది. అలాగే వారి సమాధుల వద్దకు కూడా వెళ్ళవద్దని, మస్జిద్ పేరు మీద వారేదైతే కుట్రల గూడు కట్టుకున్నారో దాన్ని పడవేయమని ఆదేశం చాడు. వాటి గురించి అవతరింపజేసిన ఆయత్‌లు వారిని పూర్తిగా బట్టబయలు చేసివేశాయి. ఇక వారిని గుర్తించడంలో ఎలాంటి పొరపాటు

లేకుండా పోయింది. అంటే, ఈ ఖుర్‌ఆన్ ఆదేశాలు, మదీనా ప్రజలు తెలుసుకునేటట్లు వారి బండారం బయటపెట్టాయన్నమాట.[11]

ఈ సంగ్రామానికి సంబంధించి అవతరించిన ఖుర్‌ఆన్ ఆదేశాలు

ఈ గజ్వాకు సంబంధించి తౌబా సూరా (తౌబా అధ్యాయం)లో అనేక ఆయత్‌లు అవతరించాయి. కొన్ని గజ్వాకు బయలుదేరక పూర్వం అవతరిస్తే, మరికొన్ని బయలుదేరి వెళ్ళిన తరువాత ప్రయాణ సందర్భంగాను, మరికొన్ని మదీనాకు తిరిగి వచ్చిన తరువాతనూ అవతరించాయి. ఈ ఆయత్‌లలో చిత్తశుద్ధిగల విశ్వాసుల ఔన్నత్యం ఎలాంటిదో చెప్పడం జరిగింది. అదే కాకుండా, ఈ ఆయత్‌లలో, గజ్వాలో పాల్గొన్నవారు, గజ్వాలో పాల్గొనలేక పోయిన విశ్వాసులు, సత్యసంధుల తౌబా (పశ్చాత్తాపం) స్వీకరించబడిన విషయమూ వగైరాలు ఉన్నాయి.

ఆ సంవత్సరపు కొన్ని ప్రముఖ సంఘటనలు

ఆ సంవత్సరం (అంటే హిజ్రీ శకం 9)లో చారిత్రాత్మకమైన సంఘట నలు అనేకం చోటు చేసుకున్నాయి.

1. తబూక్ నుండి తిరిగివచ్చిన తరువాత, ఉవైమిర్ అజ్లానీ మరియు ఆయన భార్య నడుమ 'లిఆన్' (రంకు విషయమై ఏర్పడిన జగడం)జరిగింది.

2. ప్రవక్త (స) సమక్షంలో తాను వ్యభిచరించినట్లు చెప్పిన స్త్రీకి 'రజ్మ్' (రాళ్ళతో కొట్టి చంపే శిక్ష) వేయబడింది. ఆ స్త్రీ పురుడు పోసుకొని, పిల్లవాడు పాలుత్రాగడం మానినప్పుడు గాని ఆమెను రజ్మ్ చేయడం జరగలేదు.

3. అబీసీనియా చక్రవర్తి 'అస్మహా నజాషీ' మరణించగా దైవప్రవక్త (స) ఆయన 'గాయిబానా' (పరోక్ష) నమాజె జనాజా చేశారు.

4. ఆ సంవత్సరమే మహాప్రవక్త (స) గారి పుత్రిక ఉమ్మె కుల్సూమ్ (ర) చనిపోయారు. ఆమె మరణం మహాప్రవక్త (స)ను శోకసముద్రంలో

11. *ఈ గజ్వా (సంగ్రామం) గురించిన వివరాలు ఈ క్రింది ఆధారాల నుండి గ్రహించ బడ్డాయి. ఇబ్నె హష్షామ్-2/515 - 517, జాదుల్ ముఆద్-3/2 - 13; సహీ బుఖారి -2/633 - 637, 1/252, 414 వగైరా; సహీహ్ ముస్లిమ్ షరా నూవీ-2/246; ఫత్‌హుల్ బారి-8/110 - 126, ముక్తసరుస్సీరత్-షేక్ అబ్దుల్లాహ్, పుట. 291 - 407)*

ముంచివేసింది. తన అల్లుడు హజ్రత్ ఉస్మాన్(ర)తో ఆయన(స), "ఒకవేళ నాకు మూడవ కుమార్తె ఉండి ఉంటే ఆమె వివాహం కూడా నీతో చేసేవాణ్ణే" అన్నారు.

5. మహాప్రవక్త (స) తబూక్ నుండి తిరిగివచ్చిన తరువాత మునాఫిక్‌ల సర్దారు అబ్దుల్లా బిన్ ఉబై చనిపోయాడు. మహాప్రవక్త (స) అతని మన్నింపు కోసం దుఆ చేశారు. హజ్రత్ ఉమర్(ర) ఆయన్ను వారిస్తున్నప్పటికీ అతని నమాజె జనాజా చేశారు. ఆ తరువాత దివ్యఖుర్‌ఆన్‌లో, హజ్రత్ ఉమర్ (ర)ను బలపరుస్తూ, మునాఫిక్‌ల నమాజె జనాజా చేయకూడదనే ఆదేశం అవతరించింది.

హిజ్రీ శకం 9లో జరిగిన హజ్

(హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్(ర)గారి నాయకత్వంలో)

అదే సంవత్సరం, జీఖాదా లేదా జీహజ్జా నెలలో (హి.శ.9) దైవప్రవక్త (స) హజ్ మనాసిక్ (ఆచారాల)ను ప్రవేశపెట్టే ఉద్దేశ్యంతో హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్(ర)ను అమీర్ (అధ్యక్షుని)గా చేసి పంపించడం జరిగింది.

ఆ తరువాత బరాఅత్ సూరా ప్రథమ భాగం అవతరించింది. ఆ సూరాలో ముష్రిక్‌లతో చేసుకున్న ఒప్పందాలను సమానత్వ ప్రాతిపదికపై త్రెంచుకునే ఆదేశం ఉంది. దైవం తరపున ఆ ఆదేశం వచ్చిన తరువాత దైవప్రవక్త(స), హజ్రత్ అలీ బిన్ అబీతాలిబ్ (ర)ను, ఆ ఆదేశాలను ప్రకటించమని అబూ బక్ర్ (ర) వద్దకు పంపించారు. అలా చేయడానికి కారణం, రక్తం, ధనం విషయంలో జరిగిన ఒప్పందాల విషయంలో అరబ్బుల ఆచారమే అది గనుక (అంటే ఆ విషయంలో మనిషి స్వయంగా గాని, లేదా తన కుటుంబ సభ్యుని ద్వారాగాని ఆ ప్రకటన చేయవలసి ఉంటుంది. కుటుంబ సభ్యుడుకాని వాడెవరైనా ప్రకటన చేస్తే అది చెల్లనేరదు). హజ్రత్ అలీ (ర), హజ్రత్ అబూ బక్ర్ (ర)ను 'అర్జ్' లేదా 'జజ్నాన్ లోయ'లో వచ్చి కలిశారు. హజ్రత్ అలీని ఉద్దేశించి హజ్రత్ అబూ బక్ర్ (ర), "మీరు అధ్యక్ష హోదాలో వచ్చారా లేదా మామూర్‌గా (విధి నిర్వహణ హోదాలో)వచ్చారా?" అని అడగగా, ఆయన, "లేదు, నేను మామూరుగానే వచ్చాను" అని అన్నారు. ఆ ఇద్దరు కలసి ముందుకు నడిచారు. హజ్రత్ అబూ బక్ర్ (ర) వచ్చిన వారికి హజ్ చేయించారు. పదవ తేదీ నాడు ఖుర్బానీ రోజు రాగానే హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (ర) 'జమ్రా' వద్ద నిలబడి దైవప్రవక్త (స) ఇచ్చిన ఆదేశాల ప్రకటన చేశారు. అంటే, ఒప్పందాలు చేసుకున్న వారి గడువును అంతమొందించారన్నమాట. దాని కోసం వారికి నాల్గు నెలల గడువునిచ్చారు ఎలాంటి ఒప్పందం లేని వారికి కూడా నాల్గు నెలల గడువునిచ్చారు. అయితే

ముష్రిక్కులు (బహుదైవారాధకులు) ముస్లిములతో చేసుకున్న ఒప్పందాన్ని నెరవేర్చడంలో ఎలాంటి లోపం కనబరచడంగాని, ముస్లిములకు వ్యతిరేకంగా ఎవరికీ సహాయపడడంగాని చేయనందున, వారితో చేసుకున్న ఒప్పందాన్ని నిర్ణయించిన గడువు వరకు కొనసాగించడం జరిగింది.

హజ్రత్ అబూ బక్ర్ (ర) సహాబా (ర)ల ఓ బృందాన్ని పంపించి, ఇక నుండి ఏ ముష్రిక్ (బహుదైవారాధకుడు) కూడా హజ్ చేయడానికి వీల్లేదని, ఏ ఒక్కరూ నగ్నంగా కాబా గృహ (దైవగృహం) తవాఫ్ (ప్రదక్షిణ)చేయడానికి వీల్లేదని ప్రకటనగావించారు.

ఈ ప్రకటన అరేబియా ద్వీపం నుండి విగ్రహారాధనను అంతం చేసిన ప్రకటన. అంటే, ఆ సంవత్సరం తరువాత విగ్రహారాధనకు ఎలాంటి ఆస్కారం లేదని అర్థం.[1]

1. *ఈ హజ్ గురించిన వివరాల కోసం చూడండి: సహీ బుఖారి-1/220, 451; 2/626, 671; జాదుల్ ముఆద్- 3/25, 26; ఇబ్నె హిషామ్ - 2/543 - 546, ఇంకా బరాత్ సూరా ప్రారంభ వ్యాఖ్యాన గ్రంథాలు.*

గజ్వాలపై ఓ సమీక్ష

యుద్ధ వాతావరణాన్ని, దాని పూర్వాపరాలను, ఆ యుద్ధ ఫలితాలను బేరీజు వేసుకునే సామర్థ్యం గల వారెవరైనా సరే, మహాప్రవక్త (స) నిర్వహించిన గజ్వాలు, సరియ్యాలు, సైనిక చర్యలను సమీక్షించిన తరువాత ఆయన (స) ప్రపంచంలోని మహోన్నతమైన యుద్ధవ్యూహ రచనాచాతుర్యం గల ఓ పెద్ద సైనిక కమాండరు అనీ, ఆయన దూరదృష్టి అందరికంటే సరైనదనీ, ఆయన వివేకము, విషయాన్ని అవలీలగా గ్రహించగలిగే జ్ఞానం అందరికంటే మిన్న అనీ, ఆయన (స) దైవసందేశహరులుగా, ప్రవక్తగా ఎంత గొప్ప స్థానాన్ని అలంకరించి ఉన్నారో, సేనాపతిగా కూడా అంతే తిరుగులేని చతురత కలిగిన వారు అనే విషయాన్నీ ఒప్పుకోక మానరు. కాబట్టి ఆయన ఏ పోరాటాన్ని నిర్వహించినా, దాని కోసం ఆయన ఎంపిక చేసిన పరిస్థితులు, పద్ధతులు ఆయన (స) గారి ముందుచూపుకు, విషయ పరిజ్ఞానానికి, ధైర్యసాహసాలకు అద్దం పట్టేవిగానే ఉన్నాయి. ఏ పోరాటంలోనూ, దాని వ్యూహరచనలోగాని, సైన్యాన్ని సరిదిద్ది కీలకమైన కేంద్రాల్లో నియమించడంలోగాని, సరైన ప్రదేశాన్ని ఎంపిక చేయడంలోగాని, యుద్ధవ్యూహ రచనలోగాని ఆయన పొరబడలేదు. ఈ కారణంగానే ఆయన ఏ యుద్ధంలోనూ కష్టనష్టాలకు గురికాలేదు. కాగా, యుద్ధ వ్యవహారాలు యుద్ధ సమస్యలు విషయాలన్నిటి లోను, గొప్ప గొప్ప సైనిక కమాండర్లు చూపిన యుద్ధ కౌశలం కంటే మహాప్రవక్త (స) చూపిన యుద్ధకౌశలమే వింతైనదిగా, సాటిలేనిదిగా అగుపడుతోంది. ఈ సందర్భంలో మరో విషయాన్ని కూడా ఇక్కడ ఉటంకించడం అవసరం అనిపిస్తోంది. ఉహద్ మరియు హునైన్ యుద్ధాల్లో సంభవించిన దుర్ఘటనలకు కారణం దైవప్రవక్త (స) గారి యుద్ధ చాతుర్య లోపం ఏదీ కాదు. విధిగా నిర్వహించవలసిన అత్యవసరమైన ఆదేశాలను సహాబా (ర) నిర్ణయాత్మకమైన ఆ ఘడియల్లో పాటించకపోవడం వల్లనే ఆ దుర్ఘటనలు చోటుచేసుకున్నాయి అనేది గమనార్హం.

ఆ రెండు గజ్వాలలో ముస్లిములు హతాశులై వెనుకకు తగ్గినప్పుడు, మహాప్రవక్త (స) అనుసరించిన యుద్ధనీతి దానికదే సాటి. ఆయన శత్రువుకు ఎదురొడ్డి నిలబడి ఉహద్ యుద్ధంలో జరిగినట్లు తన అసమాన చతుర్తతో శత్రువు ఖంగుతినేటట్లు చేశారు. అలాగే, హునైన్ యుద్ధంలో వ్యూహాన్ని మార్చి ముస్లిముల అపజయాన్ని కాస్తా ఘన విజయంగా మార్చివేశారు. ఉహద్ యుద్ధంలాంటి ప్రమాద పరిస్థితి, హునైన్ యుద్ధంలో జరిగిన అస్తవ్యస్త పరిస్థితియే సైన్యాధ్యక్షుని నిర్ణయ శక్తినైనా హరించి వేసే పరిస్థితి. ఆ సమయంలో ఆత్మరక్షణ తప్ప మరేదీ పట్టదు సైన్యాధ్యక్షులకు.

పైన చెప్పుకున్నదంతా ఆ గజ్వాలకు సంబంధించిన సైనికపరమైన, పోరాటపరమైన కోణం. ఇక మిగిలిన ఇతర కోణాలను గమనిస్తే అవి కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్న కోణాలే. ప్రవక్త మహనీయులు (స) ఈ గజ్వాల ద్వారా శాంతిభద్రతల్ని నెలకొల్పారు. సంక్షోభాగ్నిని చల్లార్చారు. ఇస్లామ్ మరియు విగ్రహారాధన సంఘర్షణలో శత్రువు నడ్డివిరిచారు. ఇస్లామీయ సందేశ ప్రచార మార్గాన్ని ఎలాంటి అడ్డంకుల్లేకుండా చేస్తామనే ఒప్పందం మీద వారితో సంధి కుదుర్చుకున్నారు. అలాగే ఆయన ఆ యుద్ధాల ద్వారా తనకు తోడుగా నిలిచే వారి చిత్తశుద్ధిని బేరీజు వేసుకున్నారు. వారిలో నిజమైన ముస్లిములెవరో, మునాఫిక్‌లెవరో తెలుసుకోగలిగారు.

ప్రాక్టికల్‌గా సైన్యాలను నడిపి యుద్ధతంత్రానికి సంబంధించిన వ్యూహరచనను నేర్పుతూ, ముస్లిమ్ కమాండర్ల ఓ వర్గాన్ని కూడా సుశిక్షితులుగా చేయగలిగారు దైవప్రవక్త(స). ఆ తరువాత ఈ సైన్యాధ్యక్షులే ఇరాక్ మరియు సిరియా యుద్ధమైదానాల్లో పర్షియన్ మరియు రోమన్ సైన్యాలతో తలపడి, యుద్ధవ్యూహం, యుద్ధ టెక్నిక్‌లతో వారి గొప్ప గొప్ప కమాండర్లను సైతం ఓడించగలిగారు. ఈరాన్ మరియు రోమనులను వారి స్థావరాల నుండి, వారి సామ్రాజ్యం నుండి గెంటివేసి ధనసంపదను, పండ్ల తోటల్ని, నీటి చెలమల్ని, పంట పొలాలను కైవసం చేసుకోగలిగారు.

ఇలాగే, దైవప్రవక్త (స) ఈ గజ్వాల ద్వారా ముస్లిముల కోసం ఉండడానికి ఇళ్ళను, వ్యవసాయం కోసం భూముల్ని, వృత్తుల కోసం పనిని కల్పించినట్లయింది. దిక్కులేని దరిద్ర కాందీశీకుల సమస్యలు ఈ విధంగా

పరిష్కరించబడ్డాయి. ఆయుధాలు, గుర్రాలు, యుద్ధసామగ్రి, యుద్ధాల్లో కావలసిన సరంజామానంతటినీ సమకూర్చగలిగారు. ఇదంతా, దైవదాసులపై రవ్వంతైనా జులుము, అత్యాచారం చేయకుండానే పొందడం విశేషం.

అజ్ఞాన కాలంలో యుద్ధజ్వాలలు చెలరేగడానికి గల మూల కారణాలను కూడా పూర్తిగా మార్చివేశారు మహాప్రవక్త (స). అంటే, అజ్ఞాన కాలంలో యుద్ధం అంటే అర్థం దోపిడి, హత్యలు, వినాశనం, పగతీర్చుకునే తపన, బలహీనుల్ని అణచివేయడం, జనావాసాలను సర్వనాశనం చేయడం, కట్టడాలను పడగొట్టడం, స్త్రీలను అగౌరవానికి పాల్జేయడం, వృద్ధుల ఎడల, మగ ఆడ పిల్లల ఎడల కఠినంగా వ్యవహరించడం, పంటల్ని నాశనం చేయడం, పశువులను హతమార్చడం, భూమిలో కల్లోలాన్ని రేకెత్తించడం ఒక్కటే. ఇస్లామ్ ఆ యుద్ధం యొక్క రూపురేఖల్ని, దాని అర్థాన్ని పూర్తిగా మార్చివేసి దాన్ని ఓ పవిత్రమైన జిహాద్‌గా మలిచింది. ఈ జిహాద్ సరైన, సహేతుకమైన కారణాలతోనే ప్రారంభం అవుతుంది. దాని ద్వారా ప్రతి కాలంలోనూ, ప్రతి దేశంలోనూ మానవ సమాజానికి గౌరవప్రదమైన గుర్తింపు లభిస్తుంది. ఇది సగౌరవ ధ్యేయాలు, మహోన్నత లక్ష్యాల కోసం చేసే పవిత్ర సమరం.

పవిత్ర యుద్ధం అంటే, మనిషిని అన్యాయం, అత్యాచారం, పీడనల నుండి రక్షించి న్యాయవంతమైన వ్యవస్థలోనికి తీసుకురావడానికి సాయుధ పోరాటం సాగించడం. అంటే, బలహీనుణ్ణి దోపిడీ చేసే బలవంతులు ఏర్పర్చుకున్న వ్యవస్థను మార్చివేసి, దాని స్థానంలో బలహీనులు తమ హక్కులను పొందే వరకు బలవంతుణ్ణి అణచివేసి అతణ్ణి బలహీనుడిగా చేసే వ్యవస్థను నెలకొల్పడం అన్నమాట.

అలాగే, రేయింబవళ్ళు తమ దైవానికి, "ఓ ప్రభూ! మాపై అత్యాచారాలు చేస్తున్న ఈ బస్తీ వారి నుండి మాకు విముక్తి కలిగించు. మా కోసం ఎవరినైనా రక్షకునిగా పంపించు" అని మొరపెట్టుకునే బలహీన స్త్రీ పురుషులు, పిల్లలను, ఆ రాక్షసుల బారి నుండి రక్షించడమే జిహాద్ లేదా పవిత్ర యుద్ధ లక్ష్యం. ఇప్పుడు యుద్ధం అంటే అల్లాహ్ యొక్క ఈ భూమిని

అన్యాయం అక్రమాల నుండి, అత్యాచారాలు దౌర్జన్యాల నుండి, పాపాల నుండి ప్రక్షాళన చేసి దాని స్థానంలో శాంతి భద్రతలను, కారుణ్యాన్ని, మానవత్వాన్ని, మానవ హక్కుల పరిరక్షణను నెలకొలిపే వ్యవస్థను పునరుద్ధరించడంగా మారిపోయింది.

మహాప్రవక్త ముహమ్మద్ (స) యుద్ధానికి సంబంధించిన గౌరవ ప్రదమైన సూత్రాలను, నిబంధనలను కూడా ఖరారు చేయడం జరిగింది. తమ సైనికుల్ని, సైన్యాధ్యక్షుల్ని ఆ సూత్రాలను నిబంధనలను అతిక్రమించ కుండా కట్టడి చేయడమూ జరిగింది. హజ్రత్ సులైమాన్ బిన్ బరీదా (ర)గారి ఉల్లేఖనం ద్వారా తెలిసేదేమిటంటే, మహాప్రవక్త (స) ఎవరినైనా సైన్యాధ్యక్షు నిగా చేసి పంపిస్తూ, ప్రత్యేకంగా మనోవాంఛల విషయంలో దైవానికి భయ పడుతూ ఉండమని, తోటి ముస్లిమ్ సహచరుల ఎడల మేలైన రీతిలో ప్రవర్తించమని బోధన చేసేవారు. ఇలాగే ఆయన, "అల్లాహ్ పేరు మీద, అల్లాహ్ మార్గంలో యుద్ధం చేయండి. అల్లాహ్‌ను తిరస్కరించే వారితో యుద్ధం చేయండి. అవినీతికి పాల్పడకండి, వాగ్దాన భంగం చెయ్యకండి, ముక్కూ చెవులూ వగైరాలు ఖండించకండి, ఏ చిన్నపిల్లవాణ్ణయినా చంపకండి... వగైరా" అని హితబోధ చేసేవారు.

ఇలాగే ఆయన(స),"మృదుత్వాన్ని పాటించమనీ, కాఠిన్యాన్ని ప్రదర్శించ వద్దనీ, ప్రజలకు సాంత్వన చేకూర్చమనీ, మీపై ద్వేషాన్ని పెంచుకునేటట్లు వ్యవహరించవద్దనీ" తాకీదు చేసేవారు.[1]

మహాప్రవక్త (స) రాత్రివేళ ఏదైనా జాతి వద్దకు వెళ్ళినప్పుడు, తెల్లవారక ముందే ఆ జాతిపై దాడి చేసేవారు కాదు. అలాగే ఎవరినైనా అగ్నిలో వేసి కాల్చడాన్ని గట్టిగా వ్యతిరేకించేవారు. కట్టిపడేసి చంపడం, స్త్రీలను హత మార్చడం లేదా వారిని కొట్టడాన్ని కూడా నిషేధించారు. దోపిడిని వారించారు. కాగా, అలా దోపిడి చేసిన సొమ్ము మృత జంతువు మాంసం లాంటిది అని కూడా చెప్పారు. పంట పొలాలను నాశనం చేయడం, పశువుల్ని చంపడాన్ని నిషేధించారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే తప్ప చెట్లను నరకడాన్ని

1. సహీహ్ ముస్లిమ్-2/82, 83.

నిషేధించారు. మక్కా విజయం సందర్భంగా ఆయన ఇలా కూడా చెప్పారని ఉల్లేఖనాలున్నాయి:

"ఏ క్షతగాత్రునిపై దాడి చేయవద్దు, పారిపోయేవాణ్ణి వెంటాడవద్దు, ఏ ఖైదీనీ హతమార్చవద్దు."

పాలకులు, సర్దారులు ఎవరైనా చర్చల నిమిత్తం దూతనెవరినైనా పంపితే ఆ దూతను సంహరించకూడదు అనే ఆనవాయితీని ప్రవేశపెట్టినవారు మహాప్రవక్త (స)గారే. అదే కాకుండా, ఒప్పందం కుదుర్చుకున్న (ముస్లిమేతర) పౌరుల్ని సంహరించడాన్ని ఆయన (స) గట్టిగా అడ్డుకున్నారు. ఈ విషయంలో ఆయన(స), "ఎవరైతే ఒప్పందాన్ని కుదుర్చుకున్న ముస్లిమేతరుణ్ణి సంహరిస్తాడో అతను స్వర్గం గుబాళింపుల్ని కూడా ఆఘ్రాణించలేడు. స్వర్గం గుబాళింపులు నలభై ఏళ్ళ ప్రయాణ దూరం నుండే ఆఘ్రాణించబడతాయి" అని సెలవిచ్చారు. (అంటే స్వర్గానికి చాలా దూరంగా ఉంటాడని అర్థం.)

అలాగే, అజ్ఞాన కాలపు పైశాచిక యుద్ధ ప్రక్రియలను తొలగించి, ఆ యుద్ధాన్ని ఓ పవిత్రమైన జిహాద్‌గా తీర్చిదిద్దడానికి దైవప్రవక్త (స) అనేక మహోన్నతమైన యుద్ధ సంప్రదాయాలను, నిబంధనలను ప్రవేశపెట్టడం జరిగింది.

దైవధర్మంలో తండోపతండాలుగా ప్రజల ప్రవేశం

మేము ఇదివరకే చెప్పినట్లుగా మక్కా విజయం ఓ నిర్ణయాత్మకమైన మలుపు. ఆ విజయం విగ్రహారాధనను సమూలంగా తుడిచివేసింది. అరేబియా ద్వీపమంతటా అది సత్యాసత్యాలను గురించి తెలుసుకునేందుకు దోహదపడిన మలుపు. దీని కారణంగానే ప్రజలకున్న అపోహలు, అపార్థాలు దూరమై, వారు శీఘ్రగతిన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించనారంభించారు. ఈ విషయంలో హజ్రత్ అమ్రూ బిన్ సల్మా (ర) గారి కథనం ఇలా ఉంది:

"మేము ఓ ఒయాసిస్సు దాపులో కాపురం ఉండేవాళ్ళం. మేముండే చోటు నుండి ప్రజలు బిడారాల రూపంలో వచ్చిపోతూ ఉండేవారు. మేము వారిని ఆపి, 'ప్రజల పరిస్థితి ఎలాగుంది?' అని అడిగితే, 'ఆ వ్యక్తి- ముహమ్మద్(స) - పరిస్థితి ఏమిటి? ఆయన ఎలాంటివాడు?' అని అడిగేవారు. జవాబుగా వారు, "ఆయన అల్లాహ్ ప్రవక్త అని అనుకుంటున్నాడు. ఆయనపై అల్లాహ్ దైవవాణిని అవతరింపజేస్తున్నాడట. అల్లాహ్ ఆ దైవావిష్కృతిలో ఇలా ఇలా అని చెబుతున్నాడట" అని చెప్పేవారు. వారు చెప్పిన దైవవాణి వాక్యాలను నేను కంఠస్థం చేసుకునేవాణ్ణి. అంటే అవి నా హృదయ ఫలకం మీద అతుక్కుపోయేవి అన్నమాట. అరబ్బులు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడానికి మక్కా విజయం కోసం నిరీక్షిస్తూ, "అతణ్ణి, అతని జాతివారితో తలపడడానికి వదిలేద్దాం. అతనే గనక తన జాతివారిపై ఆధిక్యత సంపాదిస్తే అతను నిజమైన ప్రవక్త అని విశ్వసిద్దాం" అని అనుకుంటూ ఉండేవారు. కాబట్టి మక్కా విజయం సంఘటన జరిగిన తరువాత ప్రతి జాతి, తెగల వారు ఇస్లామ్ స్వీకరించి (మదీనా వైపునకు) వెళ్ళనారంభించారు. నా తండ్రిగారు కూడా నా జాతి వారితో కలసి ఇస్లామ్ ధర్మం స్వీకరించి మదీనాకు వెళ్ళారు. మహాప్రవక్త (స)ను కలిసి తిరిగి వచ్చి, "దైవసాక్షిగా చెబుతున్నాను! నేను మీ వద్దకు ఓ సత్యప్రవక్త దగ్గరికెళ్ళి వస్తున్నాను. ఆయన (స), ఫలానా నమాజును ఫలానా వేళలో చేయమని ఆదేశించారు. నమాజు వేళ కాగానే మీలోని ఒకడు అజాన్ పలకాలి. ఎవరైతే ఖుర్ఆన్ బాగా పఠించ గలడో అతడు ఇమామత్ చేయాలి అని అన్నారు" అని చెప్పారు నా తండ్రిగారు.[1]

మక్కా విజయ సంఘటన పరిస్థితుల్ని మార్చివేయడంలోనూ, ఇస్లామ్ ధర్మానికి బలం చేకూర్చడంలోనూ, అరబ్బు పౌరుల వైఖరిని నిర్ణయించడంలోనూ ఇంకా ఇస్లామ్ ఎదుట వారిని మోకరిల్లజేయడంలోనూ, ఎంతో లోతైన, పటిష్టమైన ప్రభావాలు వేసింది. ఈ విషయాన్ని ఈ హదీసు ద్వారా మనం పసిగట్టవచ్చు. ఈ పరిస్థితే తబూక్ యుద్ధం తరువాత మరింత బలం పుంజుకుంది. ఈ రెండు సంవత్సరాల్లోనే, అంటే హిజ్రీ శకం 9 మరియు 10వ సంవత్సరంలోనే - ప్రతినిధి వర్గాలు గుంపులకు గుంపులుగా మదీనాకు రావడం మనం గమనించగలం. ప్రజలు తండోపతండాలుగా ఇస్లామ్ ధర్మంలో చేరిపోజొచ్చారు. మక్కాను జయించడానికి వెళ్ళినప్పుడు ముస్లిముల సైనిక బలం మొత్తం పది వేలే. ఆ సైనిక బలం గజ్వాయె తబూక్‌కు బయలుదేరేటప్పటికి (అప్పటికీ ఒక సంవత్సరం కూడా పూర్తి కాలేదు) ముప్ఫై వేల సైన్యంతో ఉప్పొంగే సేనావాహినిలా మారిపోయింది. ఆ తరువాత 'హజ్జతుల్ విదా' (చివరి హజ్) సమయానికి ముస్లిముల సంఖ్య లక్షా ఇరవై నాలుగువేలు. మరో ఉల్లేఖనం ప్రకారం, లక్షా నలభైనాలుగు వేలకు పెరిగిపోయింది. వీరంతా దైవప్రవక్త (స) చుట్టూ చేరి 'లబ్బైక్' పలుకుతూ, దేవుని ఏకత్వాన్ని చాటే తక్బీర్ చెబుతూ, ఆయన స్తోత్రం చేస్తూ వెళ్ళగా కొండలు ప్రతిధ్వనించాయి. ప్రతి లోయ, ప్రతి కొండా, దేవుని ఏకత్వం చాటే నినాదాలతో మారుమ్రోగిపోయింది.

ప్రతినిధి వర్గాలు

యుద్ధ చరిత్రలు రాసినవారు ఏ ప్రతినిధి వర్గాల గురించి అయితే రాశారో అవన్నీ కలిపి డెబ్బై వరకు ఉన్నాయి. వాటిని వివరంగా తెలియజేయడంలో ఏలాంటి ప్రయోజనం లేదు. కాబట్టి మేము కేవలం, చారిత్రా

1. సహీహ్ బుఖారి-2/615, 616.

త్మకంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న కొన్ని ప్రతినిధి వర్గాలను గురించి చెప్పదలిచాము. సాధారణ తెగలకు చెందిన ప్రతినిధి వర్గాలు మక్కా విజయం తరువాత ప్రవక్త (స) గారి సన్నిధిలోకి రానారంభించినప్పటికీ, కొన్ని తెగల ప్రతినిధులు మాత్రం మక్కా విజయానికి ముందే మదీనాకు వచ్చారన్న విషయాన్ని పాఠకులు ఇక్కడ గమనించాల్సి ఉంటుంది. మేము ఇక్కడ వారిని గురించి కూడా చెప్పదలిచాము.

1. అబ్దుల్ ఖైస్ ప్రతినిధి వర్గం

ఈ తెగవారి ప్రతినిధి వర్గం రెండుమార్లు మహాప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. మొదటిసారి హిజ్రీ శకం 5లోనో, అంతకు పూర్వమో, రెండోసారి అమ్ముల్ ఉఫూద్ (ప్రతినిధులు వచ్చిన సంవత్సరం) హిజ్రీ శకం 9లో. మొదటిసారి వచ్చిన ప్రతినిధి వర్గం, మొదటిసారి రావడానికి మున్కిద్ బిన్ హబ్బాన్ కారకుడు. అతను వ్యాపార సామగ్రిని తీసుకొని మదీనాకు వచ్చిపోయే వాడు. దైవప్రవక్త (స) హిజ్రత్ చేసి వచ్చిన తరువాత మొదటిసారిగా మదీనాకు వచ్చినప్పుడు అతనికి ఇస్లామ్ ధర్మం గురించి తెలిసింది. అతడు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమైపోయాడు. దైవప్రవక్త (స) ఇచ్చిన ఓ లేఖను తీసుకొని తన తెగ దగ్గరకు వెళ్ళగా వారు కూడా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. వారికే చెందిన పదముగ్గురు లేదా పదునల్గురితో కూడిన ఓ ప్రతినిధి వర్గం నిషిద్ధ మాసాలలో వచ్చి మహాప్రవక్త (స)ను కలిసింది. ఈసారి ఈ ప్రతినిధి వర్గం విశ్వాసం గురించి, పానీయాల గురించి అడిగి తెలుసుకుంది. దాని నాయకుడు అల్ అష్జుల్ అస్రీ.[2] అతనితో మహాప్రవక్త (స), "అల్లాహ్‌కు ఇష్టమైన రెండు సుగుణాలున్నాయి నీలో. అవి: 1. దూరదృష్టి, 2. సహనం" అని చెప్పడం జరిగింది.

రెండోసారి ఆ తెగకు చెందిన ప్రతినిధి వర్గం, పైన చెప్పినట్లు ప్రతినిధి వర్గాలు వచ్చిన సంవత్సరం వచ్చింది. అప్పుడు వారి సంఖ్య మొత్తం నలభై మంది. వారిలో అలా బిన్ జారూద్ అనే క్రైస్తవుడు కూడా ఉన్నాడు. అతను ఇస్లామ్ ధర్మం స్వీకరించాడు.[3]

2. మర్ఆతుల్ మఫాతీహ్-1/71
3. షరహ్ సహీహ్ ముస్లిమ్-నూవీ: 1/33; ఫత్హుల్ బారి - 8/85,86

2. దౌస్ ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం హిజ్రీ శకం 7 ప్రారంభ కాలంలోనే మదీనాకు వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స) 'ఖైబర్'లో ఉన్నారు. ఈ తెగ సర్దారు అయిన 'హజ్రత్ తుఫైల్ బిన్ అమ్రూ దౌసీ' (ర), మహాప్రవక్త (స) మక్కాలో ఉన్నప్పుడే ఇస్లామ్ స్వీకరించారన్న విషయం మనం వెనుకటి పుటల్లో చదువుకున్నదే. ఆ తరువాత ఆయన తన జాతివారి వద్దకు తిరిగి వెళ్ళి ఇస్లామ్ ధర్మప్రచారంలో నిమగ్నమైపోయారు. కాని ఆయన జాతివారు ఇస్లామ్ ధర్మం స్వీకరించకపోయినప్పుడు విసిగిపోయి చివరికి దైవప్రవక్త (స) వద్దకు వచ్చి వారిని శపించమని కోరారు. కాని కారుణ్యమూర్తి (స), "ఓ అల్లాహ్! దౌస్ వారికి సన్మార్గాన్ని చూయించు" అని ప్రార్థించారు. తరువాత ఆ తెగ వారంతా ఇస్లామ్‌ను స్వీకరించి ముస్లిములైపోయారు. హజ్రత్ తుఫైల్ తన జాతికి చెందిన డెబ్భై లేదా ఎనభై కుటుంబాల వారిని వెంట బెట్టుకొని హి.శ.7 ప్రారంభ కాలంలో హిజ్రత్ చేసి మదీనాకు వచ్చేశారు. అప్పుడు మహాప్రవక్త (స) ఖైబర్‌కు వెళ్ళి ఉన్నారు. ఆ తరువాత తుఫైల్ ముందుకు నడిచి దైవప్రవక్త (స) ను వచ్చి కలిశారు.

3. ఫర్‌వాహ్ బిన్ అమ్రూ జిజామీ పంపిన వార్తాహరుడు

హజ్రత్ ఫర్‌వాహ్, రోమను సైన్యంలోని ఓ అరబ్బు కమాండరు. ఆయన్ను రోమనులు తమ సరిహద్దుకు అనుకొని ఉన్న ప్రాంతాలకు గవర్నరుగా నియమించి ఉన్నారప్పుడు. ఆయన మూతా యుద్ధం (హి.శ. 8)లో ముస్లిముల ధైర్యసాహసాలు, యుద్ధతంత్రం మరియు స్థైర్యాన్ని చూసి ఇస్లామ్ స్వీకరించారు. ఓ వార్తాహరుని ద్వారా తాను ముస్లిమునై పోయాననే విషయాన్ని మహాప్రవక్త (స)కు ఎరుకపర్చడం జరిగింది. కానుకగా ఓ తెల్లని కంచర గాడిదను కూడా పంపించారు. రోమనులకు ఆయన ఇస్లామ్ ధర్మం స్వీకరించిన విషయం తెలియగా, మొదట ఆయన్ను బంధించి చెరసాలలో పడవేశారు. ఆ పిదప ఆయనకు, ఆ ధర్మాన్నయినా వదిలి ముర్తద్ కమ్మని లేదా మరణానికి సిద్ధం అయినా కమ్మని చెప్పారు. ఆయన ధర్మభ్రష్టత్వానికి బదులు మరణాన్నే స్వీకరించారు. పాలస్తీనాలో అఫ్రా పేరుగల ఒయాసిస్సు వద్ద ఆయన్ను ఉరివేసి చంపడం జరిగింది.[4]

4. సదాఅ ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం మహాప్రవక్త (స), హి.శ. 8లో 'జిరానా' నుండి తిరిగి వచ్చిన తరువాత హాజరైన ప్రతినిధి వర్గం, ఈ ప్రతినిధి వర్గం రావడానికి కారణం, మహాప్రవక్త (స) నాల్గు వందల ముస్లిములతో కూడిన ఓ పటాలాన్ని సిద్ధం చేసి, యమన్‌లో 'సదాఅ' తెగ నివసిస్తున్న ప్రాంతానికి వెళ్ళిరమ్మని పంపించడమే. ఈ పటాలం ఇంకా 'వాదియె ఖనాత్'లో గుడారాలు వేసిందో లేదో, 'హజ్రత్ జయాద్ బిన్ హారిస్ సదాయీ'కి ఈ విషయం తెలియనే తెలిసింది. అయన ఉరుకులు పరుగుల మీద దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరై, "నా వెనుక ఉన్నవారి (అంటే నా జాతివారి) తరపున మీ దగ్గరకు వారి ప్రతినిధిగా హాజరయ్యాను. తమరు వాదియె ఖనాత్ నుండే ఆ పటాలాన్ని వెనక్కు పిలిపించుకోండి" అని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (స) ఆ సైనిక పటాలాన్ని అక్కడి నుండే వెనక్కు రప్పించుకోవడం జరిగింది. ఆ తరువాత జయ్యాద్ తన జాతివారి వద్దకు వెళ్ళి, మీరు మహాప్రవక్త (స) గారి దగ్గరకు వెళ్ళిరండని ప్రోత్సహించారు. ఆయన ఈ ప్రోత్సాహంపై పదిహేను మంది 'సదాఅ' తెగవారు దైవప్రవక్త (స) వద్దకు వచ్చారు. ఇస్లామ్‌ను స్వీకరించి బైత్ చేశారు. తిరిగి తమ జాతివారి వద్దకు వెళ్ళి ఇస్లామ్ ధర్మప్రచారం ప్రారంభించారు. ఇలా వారిలో ఇస్లామ్ వ్యాపించింది. 'హజ్జతుల్ విదా' సందర్భంగా ఆ తెగకు చెందిన నూరు మంది మహాప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఆయన్ను దర్శించుకున్నారు.

5. కఅబ్ బిన్ జుహీర్ బిన్ అబీ సల్మా రాక

ఈయన ఓ కవి కుటుంబానికి చెందినవాడు. స్వయంగా అరేబియాలోని గొప్ప కవుల్లో ఒకడు. ఇతను దైవ తిరస్కారి. ఎల్లప్పుడూ దైవప్రవక్త(స)ను తన కవనంలో తిట్టేవాడు. ఇమామె మాలిక్ (రహ్మలై) గారి కథనం ప్రకారం, అతను మక్కా విజయమప్పుడు ప్రకటించిన నేరగాళ్ళ పట్టికలో ఒకడు. ఆ నేరగాళ్ళను గురించి మహాప్రవక్త (స), "వారు కాబా పరదాను పట్టుకొని ఉన్నా సరే" సంహరించాలనే ఆదేశం ఇచ్చి ఉన్నారు. కాని అతను పారిపోవడంలో కృతకృత్యుడయ్యాడు. ఇటు మహాప్రవక్త (స) తాయెఫ్ పోరాటం

4. జాదుల్ ముఆద్-3/45.

నుండి తిరిగివచ్చిన తరువాత కఅబ్ సోదరుడు 'బజీర్ బిన్ జుహీర్' అతనికి ఓ ఉత్తరం రాస్తూ, "దైవప్రవక్త (స), తనను కవనంలో తిట్టి బాధించే వారిలో అనేకుల్ని చంపించారని, మిగిలిన కవులంతా తమకు తోచిన దిక్కుకు పారిపోయారని, నీకే గనక నీ ప్రాణం మీద తీపి ఉంటే దైవప్రవక్త (స) వద్దకు సత్వరమే వచ్చెయి, తౌబా చేసి అయన వద్దకు వచ్చేవారిని అయన సంహరించరు. ఇది నీకు సమ్మతం కాకపోతే నీకెక్కడ రక్షణ లభిస్తుందో అక్కడికి వెళ్ళిపో" అని చెప్పాడు. ఆ ఇరువురు సోదరుల్లో ఉత్తరప్రత్యుత్తరాలు కొంత కాలంపాటు జరిగాయి. దాని ఫలితంగా 'కఅబ్ బిన్ జుహీర్'కు ప్రపంచమే ఇరుకైపోయినట్లు అగుపించింది. తన ప్రాణాలు గాలిలో కలిసి పోతాయనే బెంగ పట్టుకుంది. చివరికి అతను మదీనాకు వచ్చి 'జుహైనా' తెగకు చెందిన ఓ వ్యక్తి ఇంట్లో తలదాచుకున్నాడు. అతని వెంటే వెళ్ళి ఫజ్ర్ నమాజు చేశాడు. నమాజు అయిన తరువాత 'జుహైనీ' అతనికి సైగ చేయగా అతను మహాప్రవక్త (స) వద్దకు వెళ్ళి కూర్చుని తన చేతిని అయన (స) చేతిలో పెట్టాడు. మహాప్రవక్త (స) అతణ్ణి ఇప్పటి వరకు చూడలేదు. అతను, "దైవప్రవక్తా! కఅబ్ బిన్ జుహీర్ తౌబా చేసి ముస్లిము అయిపోయాడు. మీ తరపున రక్షణ కోరుతున్నాడు. నేను అతణ్ణి మీ సన్నిధికి పిలుచుకు రానా? మీరు ఈ విషయాలను స్వీకరిస్తారా?" అని అడిగాడు. మహాప్రవక్త (స), 'అవును' అని అనగానే అతడు, "నేనే కఅబ్ బిన్ జుహీర్‌ని" అని అనడంతోనే ఓ అన్సారీ సహాబీ అతనిపై విరుచుకుపడి అతని తలను నరకడానికి మహాప్రవక్త (స)గారి అనుమతిని కోరారు.

"వదిలేయ్! ఈ వ్యక్తి పశ్చాత్తాప హృదయంతో తౌబా చేసి, వెనుకటి విషయాలను వదిలేసి వచ్చినవాడు" అని వారించారు మహాప్రవక్త (స).

ఈ సందర్భంగా కవి కావున 'కఅబ్' దైవప్రవక్త(స)ను శ్లాఘిస్తూ తన ప్రఖ్యాత 'ఖసీదా' (శ్లాఘనీయమైన పదబంధం)ను వినిపించారు.

ఆ తరువాత అయన (ర) ముహాజిర్లను కూడా మెచ్చుకుంటూ, తాను దైవప్రవక్త (స) వద్దకు వచ్చినప్పుడు మేలైన విషయం తప్ప మరే మాట మాట్లాడలేదని కవనం చెప్పారు. అయితే అన్సారులకు చెందిన ఓ

వ్యక్తి అతని మెడ నరకడానికి ఉద్యమించాడని చెబుతూ ఆ మెచ్చుకోలులోనే అతనిపై నింద కూడా వేస్తూ 'ఖసీదా' చదివారు.

కఅబ్ (ర) ఇస్లామ్ ధర్మం స్వీకరించి ముస్లిముగా మారిన తరువాత ఆయనలో పరివర్తన వచ్చింది. అప్పుడు ఆయన అన్సారులను మెచ్చుకుంటూ మరో ఖసీదాను చదివి ఇదివరకు అన్సారుల విషయంలో తప్పు దొరలి పోయిందని పశ్చాత్తాపపడ్డారు.

6. 'అజ్రా' వారి ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం సఫర్ మాసం, హి.శ. 9లో మదీనాకు వచ్చింది. ఇది పన్నెండు మందితో కూడిన ప్రతినిధి వర్గం. ఇందులో హమ్జా బిన్ నోమాన్ కూడా ఉన్నారు. 'మీరెవరూ?' అని ఆ ప్రతినిధి వర్గాన్ని అడిగినప్పుడు, వారి నాయకుడు లేచి, "మేము బనూ అజ్రా తెగవాళ్ళం. ఖుస్సైకు మారుసోదరులం; 'ఖుజాఅ' మరియు 'బనూ బక్ర్' తెగలను మక్కా నుండి వెళ్ళగొట్టినప్పుడు మేము ఖుస్సైను బలపరచినవాళ్ళం. (ఇక్కడ) మా బంధువులు ఉన్నారు" అని చెప్పాడు. ఇది విన్న దైవప్రవక్త (స) వారికి స్వాగతం పలికి సిరియా దేశాన్ని జయిస్తారనే శుభవార్తను అందజేశారు. అదేకాకుండా జ్యోతిష్యం చెప్పే స్త్రీలను ప్రశ్న అడగకూడదని, వారు (బహుదైవారాధనలో ఉంటూ) జిబహ్ చేసుకొని తినే జంతువుల మాంసాన్ని తినవద్దని వారించారు. ఈ ప్రతనిధి వర్గం ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి, కొన్ని రోజులు మదీనాలో మకాం వేసి తిరిగి వెళ్ళిపోయింది.

7. బలీ ప్రతినిధి వర్గం

ఇది రబీవుల్ అవ్వల్, హి.శ. 9లో మదీనాకు వచ్చింది. ఇస్లామ్ స్వీకరించిన తరువాత మూడు రోజుల వరకు మదీనాలో మకాము వేసింది. ఈ మూడు రోజులలో ఆ ప్రతినిధి వర్గానికి నాయకుడైన అబుజ్జుబైబ్ దైవప్రవక్త (స)ను, "అతిథి మర్యాదలు చేయడం పుణ్యకార్యమేనా?" అని అడగగా,

"అవును, అది పుణ్యకార్యమే. దానికి ప్రతిఫలం లభిస్తుంది. ఏ పేదవాని ఎడలా, ధనవంతుని ఎడలా సత్ప్రవర్తనతో మెలిగినా అది సదఖాయే" అని సెలవిచ్చారు మహాప్రవక్త (స).

"అతిథి మర్యాదల గడువు ఎన్ని రోజులు?" అడిగాడు ఆ వ్యక్తి.

"మూడు రోజుల వరకు అతిథి మర్యాదలు చేయవచ్చు."

"జాడలేకుండా పోయిన వ్యక్తికి సంబంధించిన గొర్రె లేదా మేక దొరికితే దాన్ని ఏం చేయాలి?" అడిగాడు అబుజ్జుబైబ్.

"అది నీదే లేదా నీ సోదరునిది, తోడేలుది" అన్నారు మహాప్రవక్త (స). ఆ పిదప అతను ఒంటె గురించి కూడా అడగగా, "దీనితో నీకు సంబంధం ఏమిటి? దాని యజమానికి అది దొరికే అంతవరకు దాన్ని వదిలేయ్" అన్నారు మహాప్రవక్త (స).

8. సఖీఫ్ ప్రతినిధి వర్గం

రమజాన్ నెల (హి.శ. 9)లో తబూక్ నుండి తిరిగివచ్చిన తరువాత దైవప్రవక్త(స) గారి సన్నిధికి హాజరైన ప్రతినిధి వర్గమిది.

ఈ తెగవారిలో ఇస్లామ్ ధర్మం వ్యాపించడానికి కారణం, దైవప్రవక్త (స) జీఖాదా మాసం (హి.శ. 8)లో తాయెఫ్ పోరాటం నుండి మదీనాకు తిరిగిరావడానికి పూర్వమే ఆ తెగ సర్దారు అయిన ఉర్వా బిన్ మస్ఊద్ (ర) ఆయన సన్నిధికి హాజరై ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి తన తెగవారి వద్దకు వెళ్ళి ఇస్లామ్ ధర్మం వైపునకు వారిని ఆహ్వానించడమే. ఆయన తన జాతికి తలమానికం అయినందున, ఆయన మాటలను శిరసావహించడమే కాకుండా, ఆ తెగవారు ఆయన్ను తమ కన్నకూతుళ్ళు, భార్యల కంటే ప్రేమగా చూసుకునేవారు. ప్రజలు తమ ఆహ్వానాన్ని శిరసావహిస్తారనే ఉద్దేశ్యంతో వారి ముందు ఇస్లామ్ ధర్మాన్ని గురించి విడమర్చి చెప్పారు. ఆయన అనుకున్న దానికి పూర్తిగా భిన్నమైన రీతిలో ఆయన తెగవారు అన్ని వైపుల నుండి ఆయనపై బాణాలు వదిలి చంపివేశారు. ఆయన మరణానంతరం కొన్ని నెలల వరకు అలానే ఉండిపోగా, ఆ తరువాత చుట్టుపట్ల ప్రాంతం వారంతా ముస్లిములైపోయినందున, వారిని ఎదిరించడం ఇక సాధ్యం కాదనే తలంపుతో పరస్పరం చర్చించుకొని ఓ మనిషిని మహాప్రవక్త (స) వద్దకు పంపించాలనే నిర్ణయానికి వచ్చారు. దాని కోసం వారు 'అబ్దెయా లైల్ బిన్ అమ్రూ' తో మాట్లాడారు. కాని అతను వెళ్ళడానికి నిరాకరించాడు. ఎందుకంటే, ఇదివరకు

ఉర్వా బిన్ మస్ఊద్ (ర) ఎడల వారు ప్రవర్తించిన తీరు అతన్ని భయ పెట్టడమే. అందుకని అతడు వారితో, "నా వెంట మరికొందరిని తోడుగా పంపించనంత వరకు నేను ఆ కార్యాన్ని చేబట్టలేను" అని ఖచ్చితంగా చెప్పేశాడు. వారు అతని ఈ డిమాండును స్వీకరించి అతని వెంట వారి మిత్రపక్షాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను, బనీ మాలిక్‌కు చెందిన మరో ముగ్గురిని పంపించారు. ఇలా ఈ ఆరుగురు వ్యక్తుల ఓ ప్రతినిధి వర్గం తయారైంది. ఈ ప్రతినిధి వర్గంలో 'ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్ సఖఫీ' కూడా ఉన్నారు. ఈయన వారందరిలో పిన్నవయస్కుడు.

వీరంతా కలసి ప్రవక్త (స) సన్నిధికి చేరగా ఆయన (స) మస్జిద్ ఓ మూలన, వారు ఖుర్ఆన్ పారాయణం వినడానికి, ప్రజలు నమాజు చేస్తూ ఉండడం చూడడానికి గాను విడిది ఏర్పాటు చేయించారు. ఆ తరువాత వీరు మహాప్రవక్త (స) వద్దకు వచ్చిపోవడం, ఆయన (స) వారిని ఇస్లామ్ వైపునకు ఆహ్వానించడం జరుగుతూ ఉండేది. చివరికి ఆ ప్రతినిధి వర్గం నాయకుడు దైవప్రవక్త(స)ను, తమరు, "వ్యభిచారం, మత్తుపానీయాల సేవనం మరియు వడ్డీ వ్యాపారం కోసం అనుమతి ఇస్తూ ఓ ఒడంబడిక పత్రాన్ని రాసి ఇవ్వండని, అలాగే ఆ ఒప్పంద పత్రంలో, వారి ఆరాధ్య దైవం అయిన 'లాత్' దేవుణ్ణి యధాస్థితిలో ఉంచమనీ, నమాజు చేయకుండా ఉండే అనుమతినివ్వమనీ, వారి విగ్రహాలను వారి చేతుల మీదుగా ధ్వంసం చేయించవద్దనే" అనుమతినీ కోరాడు. కాని మహాప్రవక్త (స) ఆ షరతుల్లో ఏ షరతునూ ఒప్పుకోలేదు. ప్రవక్త (స) గారి ఈ వైఖరి చూసిన వారు పరస్పరం చర్చించుకున్నారు. కాని ఆయన (స)గారి ఆదేశాలను శిరసావహించడం తప్ప వారికి మార్గాంతరం అగుపడలేదు. చివరికి వారు విధిలేక దైవప్రవక్త (స)కు లొంగిపోయి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించకతప్పలేదు. అయితే, లాత్ దేవుని విగ్రహాన్ని పడగొట్టే పని మరెవరికైనా అప్పగించమని, సఖీఫ్ తెగవారు స్వయంగా తమ చేతుల మీదుగా దాన్ని పడగొట్టకుండా చూడమని మరో షరతు పెట్టారు. మహాప్రవక్త (స) ఆ షరతును మంజూరు చేస్తూ ఓ పత్రం రాసి ఇచ్చారు. హజ్రత్ ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్ సఖఫీని ఆ బృందానికి అమీరుగా (అధ్యక్షునిగా) చేసి పంపించారు. ఇలా ఆయన్ను అమీర్‌గా చేయడానికి కారణం లేకపోలేదు. ఆయన ఇస్లామ్ ధర్మాన్ని అర్థం చేసు

కోవడంలో, ధర్మం మరియు ఖుర్ఆన్ జ్ఞానాన్ని ఆర్జించడంలో అందరికంటే ముందుండే వ్యక్తి. ఆ ప్రతినిధి వర్గానికి చెందిన సభ్యులంతా కలసి ప్రతి రోజు ఉదయాన్నే దైవప్రవక్త (స) గారి సన్నిధిలో హాజరవుతూ ఉండేవారు. కాని హజ్రత్ ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్ (ర)ను తన గుడారంలోనే వదిలిపెట్టి వెళ్ళేవారు. ఆ ప్రతినిధి వర్గం తిరిగివచ్చి మధ్యాహ్నం పూట మేనువాల్చగానే హజ్రత్ ఉస్మాన్(ర) దైవప్రవక్త (స) గారి వద్దకు వెళ్ళి ఖుర్ఆన్‌ను పఠించేవారు. ధర్మావగాహన చేసుకోవడానికి ప్రశ్నలు కూడా వేసేవారు. దైవప్రవక్త (స) పడుకున్నప్పుడు ఆయన దీని కోసం హజ్రత్ అబూ బక్ర్(ర)గారి వద్దకు వెళ్ళేవారు. (హజ్రత్ ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్(ర)గారి గవర్నరుగిరి ఎంతో శుభాన్ని అందించింది. ఆ తరువాత దైవప్రవక్త (స) గారి మరణానంతరం అబూ బక్ర్ సిద్దీఖ్(ర)గారి ఖిలాఫత్‌లో ఇర్తెదాద్ (ధర్మభ్రష్టత్వం) గాలి బాగా వీచినప్పుడు సఖీఫ్ తెగవారు కూడా ఇస్లామ్ ధర్మాన్ని వీడిపోవాలని నిర్ణయిం చుకున్నారు. అప్పుడు హజ్రత్ ఉస్మాన్ (ర) వారిని వారిస్తూ, "సఖీఫ్ ప్రజలారా! మీరు అందరికంటే వెనుకగా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించినవారు. కాబట్టి ఇప్పుడు అందరికంటే ముందే ధర్మభ్రష్టులు కాకండి" అని హితవు పలికారు. ఆయన మాటలు విని ఆ తెగవారు ఇస్లామ్ ధర్మంపైన్నే స్థిరంగా ఉండి పోయారు.)

మొత్తానికి ఆ ప్రతినిధి వర్గం తిరిగివచ్చి తమ తెగవారితో అసలు విషయం చెప్పకుండా దాచి ఉంచారు. దానికి బదులు తెగ వారిలో యుద్ధం గురించి లేనిపోని అపోహలను సృష్టించారు. విచారాన్ని, బాధను ప్రకటిస్తూ, "దైవప్రవక్త (స) మమ్మల్ని ఇస్లామ్ ధర్మం స్వీకరించమని, వ్యభిచారాన్ని, మద్యపాన సేవనాన్ని, వడ్డీ వ్యాపారాన్ని విడువమని చెప్పారు. లేదంటే పెద్ద యుద్ధమే జరిగేటట్లుంది" అని చెప్పారు. ఇది విన్న సఖీఫ్ తెగ వారిపై అజ్ఞాన కాల పౌరుషపు ఆలోచనలే అలుముకున్నాయి. రెండు మూడు రోజుల వరకు యుద్ధానికి సంబంధించిన విషయాలనే చర్చించుకున్నారు. కాని అల్లాహ్ వారి హృదయాల్లో ముస్లిముల దడుపును పుట్టించాడు. వారంతా కలసి ఆ ప్రతినిధి వర్గంతో, తిరిగి మహాప్రవక్త (స) వద్దకు వెళ్ళి ఆయన షరతులు మాకు సమ్మతమే అని చెప్పి విన్నవించుకోండని చెప్పారు. అప్పుడుగాని ఈ ప్రతినిధి వర్గం అసలు విషయం బయటపెట్టలేదు. ఇదివరకే మేము ఈ

షరతుల్ని ఒప్పుకొని వచ్చాం అని చెప్పగా, సఖీఫ్ తెగ అంతా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిముగా మారిపోయింది.

ఇటు మహాప్రవక్త (స) లాత్ విగ్రహాన్ని పడగొట్టేందుకు హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర)గారి నేతృత్వంలో బహుకొద్ది మందిగల ఓ సైనిక పటాలాన్ని పంపించారు. హజ్రత్ ముగైరా బిన్ షైబా (ర) నిలబడి గద పైకెత్తి తన మిత్రులతో, చూడండి నేనో తమాషా చేయబోతున్నాను. మీరు తాయెఫ్ ప్రజలను చూసి నవ్వేటట్లు చేస్తాను అంటూ 'లాత్' విగ్రహంపై ఒక్క వ్రేటు వేసి తానే క్రిందపడి తన్నుకోనారంభించారు. ఈ నాటకం చూసి సఖీఫ్ తెగవారు గగ్గోలుపెడుతూ అల్లాహ్ ముగైరాను నాశనం చేయుగాక. చూశారా! ఈ దేవత అతణ్ణి చంపేసింది అని అనుకోజొచ్చారు. వెంటనే హజ్రత్ ముగైరా (ర) ఎగిరి లేచి నిలబడ్డారు.

"చూశారా! అల్లాహ్ మిమ్మల్ని నాశనం చేయుగాక! ఇది కేవలం మట్టితో రాళ్ళతో చేసిన ఓ విగ్రహం మాత్రమే" అంటూ ఆ విగ్రహాలయ ద్వారాన్ని బాది విరగొట్టారు. అది విరిగి క్రిందపడిపోగానే ఎత్తయిన ఓ గోడపై నిలబడి ఆ విగ్రహాన్ని పడగొట్టనారంభించారు. ఆయనతో సహా మరికొందరు సహబా (ర)లు గోడపైకెక్కి ఆ విగ్రహాన్ని నేలమట్టం చేయనారంభించారు. చివరికి నుజ్జునుజ్జయి అది పడిపోయింది. ఆ తరువాత వారు దాని పునాదుల్ని కూడా త్రవ్వేశారు. ఆ విగ్రహంపై ఉన్న ఆభరణాలను, వస్త్రాలను ఒలిచేశారు. ఇది చూసిన సఖీఫ్ వారికి నోటమాట పెగల్లేదు. హజ్రత్ ఖాలిద్ (ర) ఆ ఆభరణాలను, వస్త్రాలను తీసుకొని తమ దళంతో సహా దైవప్రవక్త(స) వద్దకు తిరిగి రాగా ఆయన (స) అదే రోజు ఆ వస్తువులను వారికి పంచేశారు. దైవప్రవక్త (స)కు అల్లాహ్ చేకూర్చిన సహాయానికీ, ధర్మానికి గలిగిన గౌరవోన్న తులకూ ఆయన్ను వారంతా కలసి స్తుతించారు.[5]

9. యమన్ రాజుల లేఖ

తబూక్ నుండి తిరిగి వచ్చిన తరువాత 'హిమైర్ రాజులు' అంటే, హారిస్ బిన్ అబ్దె కిలాల్, నయీమ్ బిన్ అబ్దె కిలాల్, రయీన్, హమ్దాన్ మరియు ముఆఫిర్ పాలకుడు నోమాన్ బిన్ ఖీల్ పంపిన ఓ లేఖ దైవప్రవక్త

5. జాదుల్ ముఆద్-3/26,27, 28; ఇబ్నె హిషామ్-2/537-542.

(స)కు అందింది. ఆ లేఖను తెచ్చినవాడు మాలిక్ బిన్ ముర్రా రిహావీ. ఈ రాజులు తాము ఇస్లామ్ స్వీకరించామని, షిర్క్ (బహుదైవారాధన) మరియు బహుదైవారాధకులతో తెగతెంపులు చేసుకున్నామనే విషయం ఆ లేఖ ద్వారా తెలియజేయడం జరిగింది. మహాప్రవక్త (స) వారి వద్దకు సమాధాన పత్రంగా ఓ లేఖ రాస్తూ, విశ్వాసుల హక్కులు, వారి బాధ్యతలు ఏమిటో విడమర్చి చెప్పారు. ఆయన ఈ లేఖలో ముఆహిదీన్ (ఒప్పందం చేసుకున్న వారు) కోసం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) బాధ్యులుగా ఉన్నారంటూ ధైర్యం చెప్పారు. అయితే ఆ ముఆహిదీన్‌లు జిజియా మాత్రం చెల్లించవలసి ఉంటుందని ఆదేశించారు. అదే కాకుండా మహాప్రవక్త (స) కొందరు సహాబా(ర)లను యమన్‌కు పంపిస్తూ దాని నాయకునిగా హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (ర)ను నియమించారు.

10. హమ్దాన్ ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం దైవప్రవక్త (స) వద్దకు ఆయన తబూక్ నుండి తిరిగి వచ్చిన తరువాత హిజ్రీ శకం 9లో హాజరైన ప్రతినిధి వర్గం. మహాప్రవక్త (స) వారికి ఓ రక్షణ పత్రాన్ని రాసి ఇస్తూ వారు అడిగింది ఇచ్చి పంపించారు. మాలిక్ బిన్ నమ్త్ ను అమీరుగా నియమించి, ఆయన జాతికి చెందిన వారెవరైతే ముస్లిములయ్యారో వారికి గవర్నరుగా కూడా చేసి పంపారు. మిగిలిన వారి వద్దకు ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించడానికిగాను హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర)ను పంపించడం జరిగింది. ఆరు మాసాల వరకు ఆయన అక్కడుండి వారిని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ వారు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు. ఆ తరువాత మహాప్రవక్త (స), హజ్రత్ అలీ (ర) బిన్ అబీ తాలిబ్‌ను పంపిస్తూ ఖాలిద్ బిన్ వలీద్‌ను వెనక్కు పంపించమని ఆదేశించారు. హజ్రత్ అలీ (ర) హమ్దాన్ తెగ వారి వద్దకు వెళ్ళి దైవప్రవక్త (స) రాసి ఇచ్చిన లేఖను చదివి వినిపించారు. వారిని ఇస్లామ్ వైపునకు రమ్మని ఆహ్వానించగా వారంతా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిములైపోయారు. వీరంతా ఇస్లామ్ ధర్మం స్వీకరించారనే శుభవార్తను హజ్రత్ అలీ (ర) దైవప్రవక్త (స)కు అందజేయగా దైవప్రవక్త (స) వెంటనే

సజ్దా చేశారు. ఆ తరువాత తలపైకెత్తి, "హమ్దాన్ వారిపై శాంతి కురియుగాక, హమ్దాన్ ప్రజలపై శాంతి కురియుగాక" అని ప్రార్థించారు.

11. బనీ ఫజారా ప్రతినిధి వర్గం

హిజ్రీ శకం 9లో, దైవప్రవక్త (స) తబూక్ నుండి తిరిగివచ్చిన తరువాత హాజరైన ప్రతినిధి వర్గం ఇది. ఈ ప్రతినిధుల సంఖ్య పది మందికి పైన్నే. వీరంతా ఇదివరకే ఇస్లామ్‌ను స్వీకరించినవారు. తమ ప్రాంతంలో కరవు కాటకాలు తాండవిస్తున్నాయని విన్నవించుకున్నారు. మహాప్రవక్త (స) మెంబరు పైకి ఎక్కి రెండు చేతులెత్తి వర్షం కోసం అర్థించారు అల్లాహ్‌ను. ఆయన (స) చేసిన ప్రార్థన ఇలా ఉంది:

"ఓ ప్రభూ! నీ దేశ ప్రజలు, నీ పశుసంపద దప్పికను తీర్చు. నీ కారుణ్యాన్ని విస్తరింపజెయ్యి. నీ మృత నగరాన్ని సజీవమొనర్చు. ఓ అల్లాహ్! మా మొరలను ఆలకించేటటువంటి వర్షాన్ని కురిపించు. మాకు సుఖాన్నిచ్చేదీ, ఉల్లాసాన్ని కలిగించేదీ, విస్తారమైనదీ, త్వరగా కురిసేదీ, ఆలస్యం కానటు వంటిదీ అయిన వర్షాన్ని కురిపించు. మాకు లాభదాయకమైనదీ, నష్టదాయకం కానటువంటిదీ అయిన వర్షం. ఓ ప్రభూ! కారుణ్యప్రదాయిని అయినదీ, శిక్షకు లోను చేసేది కానటువంటిదీ, విధ్వంసకారి కానిదీ, ముంచి వేయనటు వంటిదీ అయిన వర్షం కురిపించు. ఓ దేవా! వర్షం ద్వారా మమ్మల్ని తృప్తిపరచు, శత్రువులకు వ్యతిరేకంగా మాకు సహాయం చెయ్యి."[6]

12. నజ్రాన్ ప్రతినిధి వర్గం

నజ్రాన్ మక్కా నుండి యమన్ వైపు ఏడు మజిలీల దూరంలో ఉన్న ఓ పెద్ద ప్రాంతం. ఈ ప్రాంతంలో 73 బస్తీలు ఉండేవి. వేగంగా ప్రయాణించ గల అశ్వారూఢుడు ఒక్క రోజులో ఈ ప్రాంతాన్నంతా చుట్టి రాగలడు.[7] ఈ ప్రాంతంలో ఒక లక్ష మంది యోధులుండేవారు. వారందరూ క్రైస్తవ మతావలంబీకులే.

నజ్రాన్ ప్రతినిధి వర్గం హిజ్రీ శకం 9లో హాజరైంది. వీరందరూ కలసి మొత్తం అరవై మంది. ఇరవై నలుగురు పలుకుబడి కలిగిన గౌరవనీయులు.

6. జాదుల్ ముఆద్-2/48.
7. ఫత్‌హుల్ బారి-8/94.

వీరిలో ముగ్గురు నజ్రాన్ వారికి నాయకులు కూడా. అందులో ఒకడు 'ఆఖిబ్' (పాలనాధికారాలు గలవాడు). ఇతని పేరు అబ్దుల్ మసీహ్. రెండోవాడు 'సయ్యద్' (రాజకీయ విషయాలను చూసేవాడు). ఇతని పేరు అయిహమ్ లేదా షర్జీత్. ఇక మూడవ వాడు 'అస్‌ఖఫ్' (క్రైస్తవ మతగురువు (ఫాదరు) అంటే ధార్మిక విషయాలకు పెద్ద, ఆధ్యాత్మిక గురువు). ఇతని పేరు అబూ హారిసా బిన్ అల్కమా.

ఈ ప్రతినిధి వర్గం మదీనా నగరానికి చేరి దైవప్రవక్త (స)ను కలసి కొన్ని ప్రశ్నలు అడిగింది. అలాగే మహాప్రవక్త (స) కూడా వారిని కొన్ని ప్రశ్నలు అడిగారు. తరువాత ఆయన(స) వారిని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించారు. దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను చదివి వినిపించారు. కాని వారు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు. ఆ ప్రతినిధి వర్గం వారు, "ఏసుక్రీస్తును గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగారు. మహాప్రవక్త (స) ఆ ప్రశ్నకు జవాబు అప్పుడే చెప్పకుండా ఆ రోజు పూర్తిగా మౌనంగా ఉండి పోయారు. చివరికి ఆయనపై ఈ ఖుర్‌ఆన్ వాక్యాలు అవతరించాయి.

إِنَّ مَثَلَ عِيسَىٰ عِندَ اللَّهِ كَمَثَلِ آدَمَ ۖ خَلَقَهُ مِن تُرَابٍ ثُمَّ قَالَ لَهُ كُن
فَيَكُونُ ۝ الْحَقُّ مِن رَّبِّكَ فَلَا تَكُن مِّنَ الْمُمْتَرِينَ ۝ فَمَنْ حَاجَّكَ فِيهِ مِن
بَعْدِ مَا جَاءَكَ مِنَ الْعِلْمِ فَقُلْ تَعَالَوْا نَدْعُ أَبْنَاءَنَا وَأَبْنَاءَكُمْ وَنِسَاءَنَا
وَنِسَاءَكُمْ وَأَنفُسَنَا وَأَنفُسَكُمْ ثُمَّ نَبْتَهِلْ فَنَجْعَل لَّعْنَتَ اللَّهِ عَلَى الْكَاذِبِينَ ۝

"ఈసా పుట్టుక ఆదమ్ పుట్టుక వంటిదే. అల్లాహ్ ఆదమ్‌ను మట్టితో చేసి, "అయిపో" అని ఆజ్ఞాపించాడు. అతను అయ్యాడు. అసలు వాస్తవం ఇది. అది మీ ప్రభువు తరపు నుండి మీకు తెలుపబడుతోంది. దాన్ని శంకించే వారిలో నీవు చేరిపోకు. ఈ అజ్ఞ వచ్చిన తరువాత ఇక నీతో ఎవరైనా ఈ విషయంలో వివాదానికి దిగితే, ప్రవక్తా! వారితో ఇలా అను: రండి! మీరు మేము స్వయంగానూ వద్దాము. మన ఆలుబిడ్డలను కూడా పిలుచుకు వద్దాము. అసత్యం పలికే వారిపై అల్లాహ్ శాపం పడుగాక అని ప్రార్థిద్దాం." (3 : 59,60,61)

తెల్లవారిన తరువాత మహాప్రవక్త (స), ఈ దైవవాణి వెలుగులో హజ్రత్ ఈసా (అ.స.)ను గురించి వారడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చి ఆ రోజు వారిని ఆలోచించుకొమ్మని స్వతంత్రంగా వదలివేశారు. కాని వారు ఈసా (అ.స.)ను గురించి దైవప్రవక్త (స) ఇచ్చిన వివరణను స్వీకరించడానికి సిద్ధంగా లేరు. రెండో రోజు తెల్లవారిన తరువాత - అప్పటికే ఆ ప్రతినిధి వర్గం వారు హజ్రత్ ఈసా (అ.స.)ను గురించి ఆయన (స) చెప్పిన మాటలను నిరాకరించారు గనుక - మహాప్రవక్త (స) వారిని 'ముబాహిలా' (అసత్యం పలికేవారిపై దైవశాపం పడుగాక అనే ప్రమాణం చేయుట.) (Mutual imprecation to prove truth of one's point) కోసం ఆహ్వానించారు. హజ్రత్ హసన్ మరియు హుసైన్ (ర)లు దైవప్రవక్త మనుమలను తన దుప్పటితో కప్పుకొని బయలుదేరారు ముబాహిలా కోసం. వెనుకగా హజ్రత్ ఫాతిమా (ర) కూడా నడిచి వస్తున్నారు. మహాప్రవక్త (స) సిద్ధమై 'ముబాహిలా' కోసం వస్తున్న దృశ్యాన్ని చూసి వారు ఏకాంతంలోనికి వెళ్ళి చర్చించుకోనారంభించారు. ఆఖిబ్ మరియు సయ్యద్‌లు పరస్పరం, "చూడండి, ముబాహిలాకు దిగవద్దు. దైవసాక్షి! ఒకవేళ ఈయన ప్రవక్తే అయితే మనం గనక ఆయనతో తలపడితే మనంగాని, మన సంతానంగాని ఎంతమాత్రం సాఫల్యం పొందలేము. భూమండలం మీదవున్న ఒక్క వెంట్రుక, ఒక్క గోరు కూడా వినాశానికి గురి కాక తప్పదు. దైవప్రవక్త(స)కే మన విషయంలో న్యాయ నిర్ణేతగా వదిలేద్దాం" అని అనుకొని ఆయన(స) సన్నిధికి తిరిగి హాజరైనారు. "తమరు అడిగింది మేమివ్వడానికి సిద్ధం" అని విన్నవించుకున్నారు. వారి విన్నపాన్ని మన్నించి మహాప్రవక్త (స) వారి నుండి జిజియా తీసుకునే షరతును పెట్టారు. అదేకాకుండా రెండు వేల జతల బట్టలు కూడా ఇవ్వాలని ఒప్పందం కుదుర్చు కుంటూ, ప్రతి బట్టల జతతోపాటు ఒక ఓకియా (నూటా యాభై రెండున్నర గ్రాముల వెండి) కూడా ఇవ్వాలని షరతు పెట్టారు. ఆ ఒప్పందంలో ఒక వేయి జతల బట్టలు రజబ్ నెలలోను, మిగిలిన వెయ్యి జతల బట్టలు సఫర్ నెలలోను ఇవ్వవలసి ఉంటుంది. ఈ విషయంలో మహాప్రవక్త (స) వారికి ఓ పత్రం కూడా రాసిచ్చారు. వారు తిరిగి వెడుతూ, ఓ అమీన్‌ను (అమానతుదారుడు అయిన వ్యక్తిని) పంపించమని కోరగా దైవప్రవక్త (స), ఒప్పందంలో కుదుర్చుకున్న సొమ్మును వసూలు చేయడానికి ముస్లిముల

అమీన్ అయిన హజ్రత్ అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (ర)ను అక్కడికి పంపించారు.

ఆ తరువాత నజ్రాన్ వారిలో ఇస్లామ్ ధర్మం వ్యాపించనారంభించింది. చరిత్రకారుల కథనం ప్రకారం, సయ్యద్ మరియు ఆఖిబ్‌లు నజ్రాన్‌కు వెళ్ళగానే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. వారి నుండి సదఖాలు వసూలు చేయడానికి మహాప్రవక్త (స) హజ్రత్ అలి (ర)ను అక్కడికి పంపించడం జరిగింది. సదఖా అనేది ముస్లిముల నుండే వసూలు చేయబడుతుందన్న విషయం మనకు తెలిసిందే.[8]

13. బనీ హనీఫా ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం హిజ్రీ శకం 9లో మదీనాకు వచ్చింది. ఇందులో 'ముసైలమా కజ్జాబ్'తో సహా డెబ్భై మంది ప్రతినిధులున్నారు.[9] ముసైలమా వంశ వృక్షం ఇలా ఉంది; ముసైలమా తండ్రి సమామా, సమామా తండ్రి కబీర్, అతని తండ్రి హబైబ్, హబైబ్ తండ్రి హారిస్ (ముసైలమా బిన్ సమామా బిన్ కబీర్ బిన్ హబైబ్ బిన్ హారిస్.) ఈ ప్రతినిధులంతా ఓ అన్సారీ సహాబీ ఇంటికొచ్చి దిగారు. ఆ తరువాత దైవప్రవక్త (స) సన్నిధికి హాజరై ఇస్లామ్ స్వీకరించి ముస్లిములై పోయారు. అయితే ముసైలమా కజ్జాబ్ విషయంలో ఉల్లేఖనాల్లో తేడా ఉంది. ఉల్లేఖనాలన్నిటినీ పరిశీలిస్తే, అతడు గర్వాన్ని, అహాన్ని మరియు పెత్తనం కోరికను ప్రకటించినట్లు తెలుస్తోంది. ప్రతినిధి వర్గంలోని తక్కిన సభ్యులంతా మహాప్రవక్త (స) వద్దకు వచ్చారు. మహాప్రవక్త (స) మొదట మాటల ద్వారా, చేతల ద్వారా వారి ఎడల గౌరవంగా ప్రవర్తించి వారి మనసుల్ని ఆకట్టుకున్నారు. అయితే వారిలో ఓ వ్యక్తిపై ఈ వైఖరి ఎలాంటి ప్రభావం చూపడంలేదని గ్రహించి ఆయన దూరాలోచన ద్వారా అతనిలో కీడు ఉందని గ్రహించారు.

---

8. *ఫత్‌హుల్ బారి - 8/94,95; జాదుల్ ముఆద్ - 3/38-41; నజ్రాన్ ప్రతినిధి వర్గం గురించిన వివరాల ఉల్లేఖనాల్లో కొంత అయోమయం ఉంది. ఈ కారణంగానే కొందరు పరిశోధకులు నజ్రాన్ ప్రతినిధి వర్గం రెండుమార్లు మదీనాకు వచ్చిందని అంటారు. కాని మేము పైన చెప్పిన విషయమే సరిఅయినదని నమ్ముతున్నాం.*
9. *ఫత్‌హుల్ బారి-8/87.*

అంతకు పూర్వమే మహాప్రవక్త (స) ఓ కలగన్నారు: ఆయన సమక్షంలో భూమండలంలోని ధనాగారాలన్ని తెచ్చిపెట్టబడడం, అందులో నుండి రెండు బంగారు కంకణాలు ఆయన చేతుల్లోనికి వచ్చి పడడమూ, ఈ రెండు విష యాలు ఆయన్ను మనస్తాపానికి గురిచేయడమూ, వాటిని ఊది పారెయ్యమని దైవవాణి ద్వారా తెలియజేయబడడం, ఆయన అలా చేయగా ఆ రెండూ ఎగిరిపోవడమూ చూసి ఉన్నారు ఆ స్వప్నంలో.

ఆ స్వప్నానికి అర్థం చెబుతూ మహాప్రవక్త (స), నా తరువాత ఇద్దరు కజ్జాబ్‌లు (అత్యంత అబద్ధాలకోరులు, అసత్యవంతులు) బయలుదేరగలరని చెప్పారు. ముసైలమా కజ్జాబ్ తన నీల్గును, తిరస్కారాన్ని ప్రకటించడాన్ని చూసి- అతని వాదన ప్రకారం, మహాప్రవక్త (స) తన తరువాత పాలనాధి కారాలను తనకు అప్పజెబితేనే నేను ఆయన్ను అనుసరిస్తాను అన్నది- అతని వద్దకు వెళ్ళారు. ఆయన చేతిలో ఖర్జూరపు చువ్వ ఒకటుందప్పుడు. ఆయన వెంట సాబిత్ బిన్ ఖైస్ బిన్ షమాస్ (ర) కూడా ఉన్నారు. ముసైలమా తన మిత్రుల వద్ద కూర్చుని ఉండగా మహాప్రవక్త (స) అతని దగ్గరకు వెళ్ళి నిలబడ్డారు. మాటల సందర్భంలో అతను, "మీరనుకుంటే మేము మిమ్మల్ని పరిపాలనా విషయంలో స్వతంత్రులుగా వదిలేస్తాము. అయితే ఆ పాలనా బాధ్యతను మీరు మీ తరువాత నాకు అప్పగించాల్సి ఉంటుంది" అన్నాడు. అతని ప్రేలాపనలు విన్న మహాప్రవక్త (స) (ఖర్జూరపు చువ్వను చూపిస్తూ), "ఒకవేళ నీవు నన్ను ఈ పుల్లను ఇవ్వమని అడిగినా నీకు ఇచ్చేవాణ్ణి కాను. నీవు నీ విషయంలో అల్లాహ్ నిర్ణయాన్ని దాటిపోలేవు. నీవే గనక తిరస్కరిస్తే అల్లాహ్ నిన్ను విరిచి పారేస్తాడు. దైవసాక్షి! అల్లాహ్ నాకు చూపించిన కలలోని వ్యక్తిగానే తలుస్తున్నాను నిన్ను. ఇదిగో! ఈ సాబిత్ బిన్ ఖైస్ ఉన్నారు చూశావు! నా తరఫున నీకు సమాధానం చెబుతారు విను" అని అక్కడి నుండి వెళ్ళిపోయారు.[10]

చివరికి దైవప్రవక్త (స) తన దూరదృష్టి ద్వారా వేసిన అంచనాయే నిజమైంది. అంటే ముసైలమా కజ్జాబ్ 'యమామా'కు తిరిగి వెళ్ళి, మొదట బాగా ఆలోచించుకొని, తనను దైవప్రవక్త (స)గారికి భాగస్వామిగా ప్రవక్త

10. చూడండి, సహీ బుఖారి - 2/627, 628; ఫత్‌హుల్ బారి - 8/87 - 93

పదవిలో చేర్చుకోవడం జరిగిందని ప్రకటించేశాడు. తాను ప్రవక్తనని ప్రకటించే రెండు పాదాలు కలిగి సమప్రాసలతో కూడిన 'సజ్జా' (ద్విపది) కవితను చెప్పనారంభించాడు. తన జాతి కోసం వ్యభిచారం మరియు మత్తుపానీయ సేవనాన్ని ధర్మసమ్మతం చేశాడు. దీనితోపాటే దైవప్రవక్త ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్తే అని సాక్ష్యం కూడా ఇస్తూ ఉంటే ప్రజలు మోసపోయి అతనికి విధేయులై, అతని అడుగులకు మడుగులొత్తనారంభించారు. ఫలితంగా అతని వ్యవహారం మరింత గడ్డుగా మారిపోయింది. ప్రజలు అతణ్ణి 'యమామా రహ్మాన్'గా పిలిచేటంత వరకు పెరిగిపోయింది అతని పలుకుబడి. ముసైలమా కజ్జాబ్ ప్రవక్త (స) గారికి ఓ లేఖ రాసి పంపాడు. "నన్ను ఈ కార్యంలో మీకు భాగస్వామిగా చేయడం జరిగింది. సగం పాలనాధికారం నాది, మరో సగం ఖురైష్‌ది" అని చెప్పే సాహసానికి దిగాడు ఆ లేఖలో. దీనికి జవాబుగా మహాప్రవక్త (స) అతనికి ఓ లేఖ రాస్తూ, "భూమి అల్లాహ్‌ది. ఆయన తన దాసుల్లో కోరిన వారికి దానికి వారసునిగా చేస్తాడు. సత్ఫలితాలు ఆయనకు భయపడేవారి కోసమే"[11] అని చెప్పారు.

ఇబ్నె మస్ఊద్ (ర) గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది:

ఇబ్నె నవాహా మరియు ఇబ్నె అసాల్ ఇద్దరూ ముసైలమా దూతలుగా మహాప్రవక్త (స) గారి దగ్గరకు వచ్చినవారు. దైవప్రవక్త (స) వారితో, "నేను దైవప్రవక్తననే విషయాన్ని మీరు ధృవీకరిస్తున్నారా?" అని అడుగగా వారు, "మేము ముసైలమాయే అల్లాహ్ ప్రవక్త అని సాక్ష్యం ఇస్తున్నాం" అని బదులు పలికారు. వారి జవాబు విన్న మహాప్రవక్త (స), "నేను అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించినవాణ్ణి. ఏ దూతనైనా సంహరించదలుచుకుంటే ముందు మీ ఇద్దరిని సంహరించేవాణ్ణి"[12] అన్నారు.

ముసైలమా కజ్జాబ్ హిజ్రీ శకం 10లో తాను ప్రవక్తనని ప్రకటించు కున్నాడు. రబీఉల్ అవ్వల్ మాసం హి.శ. 12లో అబూ బక్ర్ సిద్దీఖ్ (ర) గారి ఖిలాఫత్‌లో అతను యమామాలో చంపబడ్డాడు. అతణ్ణి చంపినవారు వహ్షీ. వహ్షీ, హజ్రత్ హమ్జా (ర)ను హతమార్చినవారు.

11. జాదుల్ మఆద్- 3/31,32. 12. ముస్నదె అహ్మద్, మిష్కాత్ - 2/347.

ప్రవక్తగా ప్రకటించుకున్న వాడు ఇతను ఒకడైతే, అతని అంతం అలా జరిగింది, అసత్య ప్రవక్తగా ప్రకటించుకున్నవాడు మరొకడున్నాడు. అతని పేరు అస్వద్ అన్సీ. ఇతను యమన్ దేశంలో కల్లోలాన్ని రేకెత్తించినవాడు. అతణ్ణి దైవప్రవక్త (స) మరణానికి ఓ పగలు ఓ రేయికి ముందు హజ్రత్ ఫేరోజ్ (ర) చంపేశారు. అతడు సంహరించబడినట్లు మహాప్రవక్త (స)కు దైవవాణి (వహీ) ద్వారా తెలిసింది. ఆయన (స) అతని సంహారం గురించిన సంఘటన సహాబా (ర)కు తెలియజేశారు. ఆ తరువాత హజ్రత్ అబూ బక్ర్ (ర)గారి దగ్గరకు అతని అంతం గురించిన నిర్ధారణ వార్త వచ్చింది.[13]

14. బనీ ఆమిర్ బిన్ సాసఅ ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గంలోని దైవవిరోధి ఆమిర్ బిన్ తుఫైల్, హజ్రత్ లబీద్ (ర)గారి మారుసోదరుడు. అర్బద్ బిన్ ఖైస్ మరియు ఖాలిద్ బిన్ జాఫర్, జబ్బార్ బిన్ అస్లమ్‌లున్నారు. వీరంతా తమ జాతికి చెందిన పరమ దుష్టులైన సర్దారులు. బైరె మఊనాలో డెబ్భై మంది సహాబా (ర)లను షహీద్ చేయించిన వాడే ఆ ఆమిర్ బిన్ తుఫైల్. వారంతా మదీనాకు బయలుదేరే ముందు, ఆమిర్ మరియు అర్బద్‌లు, దైవప్రవక్త (స)ను మోసగించి చంపేసే ఎత్తుగడ పన్ని అక్కడికి వచ్చినవారు. ఈ ప్రతినిధి వర్గం మదీనాకు వచ్చి మహాప్రవక్త (స)తో మంతనాలకు దిగారు. అర్బద్ దొంగమాటుగా దైవప్రవక్త (స) వెనుకకు వచ్చి ఒర నుండి కరవాలాన్ని జానెడు పైకి లాగాడు. కాని అల్లాహ్ అతని చేతిని అక్కడే నిలువరించాడు. అతను ఆ కరవాలాన్ని పూర్తిగా బయటకు లాగలేకపోయాడు. అలా అల్లాహ్ తన ప్రవక్తను వారి బారి నుండి రక్షించాడు. మహాప్రవక్త (స) ఆ ఇద్దరిని శపించగా తిరుగు ప్రయాణంలో అల్లాహ్, అర్బద్ మరియు అతని ఒంటెపై పిడుగు పడవేయగా అతను అక్కడికక్కడే కాలిబూడిదయ్యాడు. ఇటు ఆమిర్ ఓ సలూలియా స్త్రీకి అతిథి అయ్యాడు. అప్పుడే అతని మెడ మీద ఓ బొబ్బ పుట్టింది. ఆ బొబ్బ కారణంగా అతను ప్రాణాలు వదిలాడు. ప్రాణాలు వదిలేటప్పుడు అతడు, "అయ్యో! ఒంటె గడ్డలాంటి బొబ్బ ఇది. అది కూడా ఓ సలూలియా స్త్రీ ఇంట్లో పుట్టిన బొబ్బ. నేను ఆమె ఇంట చనిపోతున్నానే" అని అంటూ ప్రాణాలు వదిలాడు.

13. ఫత్‌హుల్ బారి - 8/93

సహీహ్ బుఖారి కథనం ప్రకారం, ఆమిర్ దైవప్రవక్త (స) వద్దకు వచ్చి ఇలా అన్నాడు:

"నేను మీకు మూడు విషయాల అధికారం ఇస్తున్నాను. 1) మీ కోసం వాది (లోయ)లో ఉన్న ప్రజలు; నా కోసం ఈ జనావాసంలోనివారు. 2) లేదా నేను మీ తరువాత ఖలీఫా అవుతాను. 3) అలా కాని పక్షంలో నేను గత్ఫాన్ తెగవారికి వెయ్యి మగ గుర్రాలు, వెయ్యి ఆడ గుర్రాలనిచ్చి మీ మీద దాడి చేయడానికి తీసుకొని వస్తాను" అని బెదిరించాడు. ఆ తరువాత అతను ఓ స్త్రీ ఇంట ప్లేగు వ్యాధికి గురైనాడు. (ఆ దుఃఖంలో అతను, ఏమిటి ఒంటెపై ఉబికిన గడ్డ లేదా బొబ్బలాంటిది నాకు పుట్టడమా? అది కూడా ఫలానా వారి స్త్రీ ఇంటిలోనా? నా వద్దకు నా గుర్రాన్ని తీసుకురండి అని చెప్పాడు. గుర్రానెక్కి ఆ గుర్రం మీదనే ప్రాణాలు వదిలేశాడు.)

15. తజీబ్ ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి నర్గం, తమ జాతి నుండి వసూలు చేసిన సదఖాలను పేదలకు పంచిపెట్టగా మిగిలినవి తన వెంట మదీనాకు తెచ్చింది. ఇందులో మొత్తం పదముగ్గురు వ్యక్తులున్నారు. వారు ఖుర్‌ఆన్ మరియు ప్రవక్త (స)గారి సంప్రదాయాలను ప్రజలను అడిగి నేర్చుకుంటూ ఉండేవారు. వారు మహాప్రవక్త (స)ను కొన్ని విషయాలనడిగారు. వాటిని ఆయన (స) వారికి రాసి ఇచ్చారు. ఆ ప్రతినిధి వర్గం మరింత కాలం అక్కడ ఆగలేదు. వెళ్ళే టప్పుడు మహాప్రవక్త (స) వారికి కానుకలు ఇవ్వగా వారు, డేరా వెనుకన ఉన్న ఓ యువకుణ్ణి కూడా ప్రవక్త (స) వద్దకు పంపించారు. ఆ యువకుడు ప్రవక్త (స) వద్దకు హాజరై, "దైవప్రవక్తా! దేవుని సాక్షి! తమరు నా కోసం దుఆ చేస్తారనే ఉద్దేశ్యం తప్ప మరే ఉద్దేశ్యంతోనూ నేను నా ప్రాంతం నుండి ఇక్కడికి రాలేదు. తమరు నా గురించి అల్లాహ్‌ను, నన్ను మన్నించి నాపై కారుణ్యాన్ని కురిపించమని, నా కలిమిని నా మనస్సులోనే ఉండేటట్లు చేయమని ప్రార్థించండి" అని విన్నవించుకున్నాడు. దైవప్రవక్త(స)అతని కోసం ప్రార్థించారు. ఫలితంగా అతడు ఇతరుల కంటే నిరపేక్షాపరుడైపోయాడు. ధర్మభ్రష్టత్వపు గాలి వీచినప్పుడు అతను ఇస్లామ్ ధర్మం మీదే స్థిరంగా

ఉండడమే కాకుండా తన జాతివారికి హితోక్తులు చెప్పడం వల్ల వారు కూడా ఇస్లామ్ ధర్మాన్ని వదలకుండా స్థిరంగా ఉండిపోయారు. ఈ ప్రతినిధి వర్గంలోని సభ్యులు, హిజ్రీ శకం 10లో దైవప్రవక్త (స) హజ్జతుల్ విదాకు వెళ్ళినప్పుడు మరోసారి వెళ్ళి ఆయన్ను కలిశారు.

16. తై తెగవారి ప్రతినిధి వర్గం

ఈ ప్రతినిధి వర్గం సభ్యుల్లో ప్రఖ్యాత అరబ్బు యోధుడు జైదుల్ ఖైల్ కూడా ఉన్నారు. వారంతా కలసి దైవప్రవక్త (స)తో మాట్లాడారు. ఆయన (స) వారిని ఇస్లామ్ స్వీకరించమని కోరగా వారంతా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి నిజమైన ముస్లిములుగా మారిపోయారు. దైవప్రవక్త (స) జైద్‌ను పొగుడుతూ, "నాకు అరేబియాలోని ఆయా వ్యక్తులలోని గొప్పదనాలను గురించి చెప్పడం జరిగింది. అయితే ఆ వ్యక్తులు నా వద్దకు వచ్చినప్పుడు ప్రజలు అనుకున్నంత గొప్పదనాలు వారిలో అగుపడలేదు. కాని దానికి భిన్నంగా జైదుల్ ఖైల్ ఖ్యాతి మాత్రం వారికంటే గొప్పది" అని సెలవిచ్చారు. ఆయన పేరును మార్చి జైదుల్ ఖైర్‌గా పెట్టడం జరిగింది.

ఈ విధంగా, హిజ్రీ శకం 9 మరియు 10లలో ముమ్మరంగా ప్రతినిధి వర్గాలు మదీనాకు వచ్చాయి. సీరత్ చరిత్రకారులు, పైన చెప్పిన ప్రతినిధి వర్గాలే కాకుండా మరికొన్ని ప్రతినిధి వర్గాల గురించి వివరించడం జరిగింది. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి.

అవి, యమన్, అజ్ద్ ఖుజాఅలకు చెందిన బనీ సఅద్, హుజైమ్, బనీ ఆమిర్ బిన్ ఖైస్, బనీ అసద్, బహ్రా, కూలాన్, మహారిబ్, బనీ హారిస్ బిన్ కఅబ్, గామిద్, బనీ మున్తఫిక్, సలామాన్, బనీ అబస్, యజీనా, మరాద్, జుబైద్, కిందా, జీమగ్రాహ్, గస్సాన్, బనీ ఈష్ మరియు నక్‌హాలు. నక్‌హా ప్రతినిధి వర్గం చివరిది. అది ముహర్రం నెల హి.శ. 11 మధ్యభాగంలో వచ్చిన ప్రతినిధి వర్గం. వీరంతా రెండొందల మంది. తక్కిన అనేక ప్రతినిధి వర్గాలు హిజ్రీ శకం 9 మరియు 10లో వచ్చాయి. కొన్ని ప్రతినిధి వర్గాలు మాత్రమే హిజ్రీ శకం 11 వరకు రాకుండా ఆగాయి.

ఈ ప్రతినిధి వర్గాలు ఒకదాని తరువాత మరొకటి మదీనాకు

వచ్చాయంటే, అప్పటి ఇస్లామీయ సందేశ ప్రచారం ఎంత ఊపందుకుందో, దానికి ఎంత జనరంజకత్వం లభించిందో అర్థం చేసుకోవచ్చు. అరబ్బులు మదీనా నగరాన్ని ఎంతగా గౌరవించేవారో, దానికి లొంగిపోవడం తప్ప మార్గాంతరం మరేదీ లేదని తలచేవారో దీని ద్వారా మనం అంచనాగట్టవచ్చు. యదార్థం ఏమిటంటే, మదీనా నగరం అరేబియా ద్వీపానికే రాజధానిగా మారిపోయింది. దాన్ని ఉపేక్షించడం ఇక ఎవరి తరమూ కాలేదు. అయితే, అందరి మనస్సులపై ఇస్లామ్ ధర్మప్రభావం పడిందని మేము చెప్పలేం. ఎందుకంటే, వారిలో అనేకమంది మొదట బద్దూలు (పల్లెవాసులు). కేవలం తమ సర్దారులు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించినందుకు వారిని అనుకరిస్తూ ముస్లిములైనవారు. వారిలో ఇదివరకు చోటుచేసుకొని ఉన్న అజ్ఞాన కాలపు రుగ్మతలన్నీ వేళ్ళూనుకునే ఉన్నాయి. అవి పూర్తిగా వారి నుండి తుడిచి పెట్టుకుపోలేదు. ఇస్లామీయ బోధనలు వారిని ఇంకనూ నాగరికులుగా తీర్చి దిద్దలేదు. కాబట్టి దివ్యఖుర్‌ఆన్ తౌబా సూరాలో ఆ కొందరు వ్యక్తుల దుర్గుణాల గురించి ఇలా చెప్పడం జరిగింది.

اَلْاَعْرَابُ اَشَدُّ كُفْرًا وَّنِفَاقًا وَّاَجْدَرُ اَلَّا يَعْلَمُوْا حُدُوْدَ مَآ اَنْزَلَ اللّٰهُ عَلٰى
رَسُوْلِهٖ ؕ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ۝ وَمِنَ الْاَعْرَابِ مَنْ يَّتَّخِذُ مَا يُنْفِقُ مَغْرَمًا
وَّيَتَرَبَّصُ بِكُمُ الدَّوَآئِرَ ؕ عَلَيْهِمْ دَآئِرَةُ السَّوْءِ ؕ وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ ۝

> "ఈ ఎడారి అరబ్బులు విశ్వాసం విషయంలో, కాపట్యం విషయంలో బహు మూర్ఖులు. కనుక అల్లాహ్ తన ప్రవక్తపై అవతరింపజేసిన ధర్మం యొక్క హద్దులు వారికి తెలియకుండా ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అల్లాహ్‌కు అన్నీ తెలుసు. ఆయన జ్ఞానీ, వివేకవంతుడూను."
> (9 : 97,98)

ఇది ఇలా ఉండగా ఇతరులను పొగడడం కూడా జరిగింది. వారిని గురించి చెబుతూ దివ్యఖుర్‌ఆన్ ఇలా సెలవిస్తోంది.

وَمِنَ الْاَعْرَابِ مَنْ يُّؤْمِنُ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ وَيَتَّخِذُ مَا يُنْفِقُ

قُرُبٰتٍ عِنْدَ اللّٰهِ وَصَلَوٰتِ الرَّسُوْلِ ؕ اَلَاۤ اِنَّهَا قُرْبَةٌ لَّهُمْ ؕ سَيُدْخِلُهُمُ اللّٰهُ فِىْ رَحْمَتِهٖ ؕ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ۝

"ఈ ఎడారి అరబ్బుల్లోనే ఇంకా కొంత మంది ఉన్నారు; వారు అల్లాహ్‌నూ అంతిమ దినాన్నీ విశ్వసిస్తారు, తాము ఖర్చు చేసే దానిని, అల్లాహ్ సాన్నిహిత్యం పొందడానికి, ప్రవక్త నుండి దేవుని కారుణ్యానికై ప్రార్థనలు పొందడానికి సాధనంగా చేసుకుంటారు. అవును! అది నిశ్చయంగా అల్లాహ్ సాన్నిహిత్యాన్ని పొందడానికి సాధనమే. అల్లాహ్ తప్పకుండా వారిని తన కారుణ్యంలోకి ప్రవేశింపజేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూను." (9 : 99)

మక్కా, మదీనా, సఖీఫ్, యమన్ మరియు బహ్రైయిన్ల ప్రజల విషయానికి సంబంధించినంత మట్టుకు, వారిలో ఇస్లామ్ దృఢంగా నాటుకు పోయింది. వారిలో నుండే పేరుమోసిన సహాబాలు ఉద్భవించారు.[14]

14. ఈ మాటలు కిబ్రీ తన ముహాజిరాత్ గ్రంథంలో ఉటంకించిన మాటలు 1/144. ఏ ప్రతినిధి వర్గాలను గురించి అయితే వివరణ లభించిందో ఆ గ్రంథాలు ఇవి: సహీహ్ బుఖారి - 1/13, 2/626 - 630; ఇబ్నె హిష్షామ్ - 2/501 - 503, 510 - 514, 537 - 546, 560 - 601; జాదుల్ మఆద్ - 3/26 - 60; ఫత్‌హుల్ బారి - 8/ 83 - 103; రహ్మతుల్ లిల్ ఆలమీన్ 1/184 - 217.

ఇస్లామ్ ధర్మ ప్రచార సాఫల్యం - దాని ప్రభావాలు

ఇక ఇప్పుడు మనం, మహాప్రవక్త ముహమ్మద్ (స)గారి జీవిత చరిత్ర చరమాంకానికి చేరబోతున్నాం. అయితే, కొంతసేపాగి, ఆయన(స)గారి మహోన్నత కార్యదీక్షాదక్షతలపై ఓ సమగ్ర దృష్టిని సారించి, ఈ దీక్షాదక్షతల కారణంగా ఆయన(స)కు పూర్వం ప్రభవించిన దైవప్రవక్తలు మరియు సందేశహరుల (అవ్వలీన్ వ ఆఖిరీన్) నాయకత్వం వహించే ప్రత్యేకత ఎలా లభించిందో తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

అల్లాహ్ ఆయనకు కొన్ని ప్రత్యేకమైన ఆదేశాలు ఇచ్చాడు. వాటిలో కొన్ని ఆదేశాలు దివ్యఖుర్‌ఆన్‌లోని ముజ్జమ్మిల్ సూరా మరియు ముద్దస్సిర్ సూరాలో ఇలా ఉన్నాయి:

يٰۤاَيُّهَا الْمُزَّمِّلُ ۝ قُمِ الَّيْلَ اِلَّا قَلِيْلًا ۝

"ఓ దుప్పటి కప్పుకొని పడుకునేవాడా! రాత్రి వేళ నమాజులో నిలబడుతూ ఉండు, కాని కొంచెంసేపు మాత్రమే..." (అధ్యాయం 73)

يٰۤاَيُّهَا الْمُدَّثِّرُ ۝ قُمْ فَاَنْذِرْ ۝

"గొంగళి కప్పుకొని పడుకున్న ఓ మనిషీ! లే; లేచి హెచ్చరించు, నీ ప్రభువు ఘనతను చాటి చెప్పు....." (74: 1-7)

ఇంకేముందీ! ఈ ఆదేశాలు అందాయో లేదో ఆయన దిగ్గున లేచి నిలబడ్డారు. తమ భుజస్కంధాలపై, ఈ భూమండలంలోని అన్నింటికంటే గొప్ప అమానతు భారాన్ని ఎత్తుకుని అలా చివరి వరకు నిలబడే ఉన్నారు. అంటే, సకల మానవాళి బరువు భారాన్ని, విశ్వాసానికి చెందిన భారాన్ని; వివిధ రంగాల్లో యుద్ధం, జిహాద్ మరియు సత్ప్రయత్న భారానన్నమాట.

అప్పటి వరకు మానవ అంతరాత్మ మూఢాచారాలు, మూఢనమ్మకాల్లో

పూర్తిగా మునిగి ఉంది. దాన్ని ప్రక్షాళన చేసే రంగంలో ఆయన (స) జిహాద్ చేయవలసి వచ్చింది. సైనిక పోరాటాలకు దిగవలసివచ్చింది. ఇలాంటి ప్రయత్నాల భారాన్ని మోస్తూనే కడవరకు నిలబడ్డారాయన. మనిషి అంతరాత్మ అప్పటికే ఐహిక సుఖభోగాలకు ఆకర్షితమై, కామ, క్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యాల సంకెళ్ళలో బంధించబడి మరింత భారంగా మారి ఉంది. మహాప్రవక్త ముహమ్మద్(స) తమ ప్రయత్నం ద్వారా అనుచరగణం (సహాబా-ర) రూపంలో దాన్ని అజ్ఞానాంధకారం నుండి వెలికి తీసి వారిపై ఉన్న ఆ భారాన్ని తొలగించారు. ఆ పని అయిందో లేదో మరో రంగంలో మరో పోరాటం- ఇంకా చెప్పాలంటే, ఎడతెగని పోరాటం- ఆరంభమైంది. అంటే, దైవసందేశ ప్రచారం పేరు వినగానే చిర్రెత్తిపోయిన శత్రుమూకలు, ఈ విశ్వాసులకు వ్యతిరేకంగా వారిపై విరుచుకుపడనారంభించారని అర్థం. ఈ ఇస్లామ్ ధర్మ పవిత్ర అంకురం, ఇంకా ఆ మట్టిలో వ్రేళ్ళూనుకొని మొక్కయి మానుగా మారి ఫలసాయం అందించక మునుపే దాన్ని త్రుంచివేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు దైవ విరోధులు. ఇస్లామ్ ధర్మ సంరక్షణ కోసం ఆయన ఎడతెగకుండా వారి దాడుల్ని ఎదుర్కోవలసివచ్చింది. అరేబియాలో సంభవించిన యుద్ధాల నుండి ఇంకా తేరుకొనక ముందే, రోమను సామ్రాజ్యం ఇప్పుడిప్పుడే ఏర్పడుతున్న ఇస్లామియ సామ్రాజ్యాన్ని అణచివేయడానికి దాని సరిహద్దుల వద్ద మోహరించింది.

అంతరాత్మతో జరిగే పోరాటం ఓ శాశ్వతమైన పోరాటం. అది షైతానుతో చేసే పోరాటం. వాడు మానవుని అంతరాత్మల్లోకెళ్ళి తన పని ఏదో తాను చేసుకుపోతూనే ఉంటాడు ఒక్క క్షణం తీరిక లేకుండా. మహాప్రవక్త (స) దైవసందేశ ప్రచార కార్యంలో స్థిరంగా నిలబడి వివిధ రంగాల్లో ఎదురయ్యే దాడుల్ని త్రిప్పికొడుతూనే ఉన్నారు. ప్రపంచం ఆయన కాళ్ళ దగ్గరకు వచ్చి వాలినప్పటికీ, ఆయన మాత్రం నిరుపేద జీవితాన్నే గడిపారు. విశ్వాసులంతా ఆయన చుట్టూ చేరి ఆయనకు ప్రశాంతతను చేకూరుస్తున్నారు. మహాప్రవక్త (స) మాత్రం ఎడతెగని కృషి సల్పుతూ అనేక కష్టాలను అనుభవిస్తూనే పోయారు. ఎడతెగని కఠోర పరిశ్రమ చేస్తూ సహనాన్ని సంయమనాన్ని ప్రదర్శించారు. పైన చెప్పిన ఆదేశాలకు అనుగుణంగా రాత్రి వేళ నిలబడి నమాజులు చేస్తూ దైవాన్ని స్తుతించేవారు. దైవగ్రంథ పారాయణాన్ని చేస్తూ మధ్య మధ్య ఆగి దాని సారాంశాన్ని ఆకళింపు చేసుకుంటూ ఉండేవారు.

ప్రాపంచిక జంఝాటాన్ని వదలి ఏకాగ్రతతో దైవధ్యానంలో నిమగ్నమై ఉండేవారు.[1]

ఇలా ఎడతెగని పోరాటాల్లో ఇరవై సంవత్సరాలకు పైన్నే గడిచి పోయాయి. ఈలోపు, ఓ వ్యవహారం మరో వ్యవహారాన్ని ఏ మాత్రం ప్రభావితం చేయలేదు. చివరికి ఇస్లామియ ధర్మ సందేశ ప్రచారం పెద్ద ఎత్తున సఫలం కావడం ఆశ్చర్యాన్ని గొలిపింది. అరేబియా ద్వీపం పూర్తిగా ఆయనకు దాసోహం అంది. అజ్ఞానం తుడిచిపెట్టుకుపోయింది. చివరికి విగ్రహాలను వదిలేయడమే కాకుండా వాటిని నామరూపాల్లేకుండా ధ్వంసం చేయడం జరిగింది. దేవుని ఏకత్వపు నినాదాలతో వాతావరణం మార్మోగనారంభించింది. క్రొత్త విశ్వాసం సంతరించుకున్న ఎడారులు అజాన్‌లతో పులకించాయి. అల్లాహు అక్బర్ అనే ఏకత్వపు నినాదం ఎడారి గుండెల్ని చీల్చనారంభించింది. ఖుర్‌ఆన్ పాఠకులు దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు పఠిస్తూ, అల్లాహ్ ఆదేశాలను అమలు పరుస్తూ ఉత్తరం నుండి దక్షిణం వరకు వ్యాపించారు.

చీలికపేలికలై చెల్లాచెదురుగా జీవితం సాగిస్తున్న జాతులు, తెగలన్నీ ఒక్కటయ్యాయి. మానవుడు, మానవ దాస్యశృంఖలాలను త్రెంచేసి అల్లాహ్‌కే దాసుడైపోయాడు. ఇప్పుడు ఏ ఒక్కడూ, అణచివేసేవాడుగాని, అణచి వేయబడిన వాడుగాని, పాలకుడుగాగాని, పాలితునిగాగాని; యజమానిగాని, బానిసగాని; దౌర్జన్యపరుడుగా గాని, ఆ దౌర్జన్యాన్ని సహించేవాడుగాగాని మిగలలేదు. కాగా, అందరూ అల్లాహ్ దాసులే. పరస్పరం సోదరులే. పరస్పరం ప్రేమించుకుంటూ అల్లాహ్ ఆదేశాలను శిరసావహించేవారే. అల్లాహ్, ఇదివరకు వారిలో వ్రేళ్ళూనికొని ఉండిన అజ్ఞానపు అహంకారాన్ని, గర్వాన్ని, తాతముత్తాతల పేర్లు చెప్పి విర్రవీగే సంప్రదాయాన్ని అంతమొందించాడు. ఇప్పుడిక ఓ అరబ్బుకు అరబ్బేతరునిపైగాని, ఓ అరబ్బేతరునికి అరబ్బుపైగాని, తెల్లవానికి నల్లవానిపైగాని, నల్లవానికి తెల్లవానిపైగాని ఎలాంటి ఆధిక్యత లేదు. ఆధిక్యతను కొలిచే ప్రమాణం కేవలం తఖ్వా (దైవభీతి) ఒక్కటే. మానవులంతా ఆదం సంతానమే. ఆదం (అ.స.) మట్టితో సృజించబడినాడు.

ఎలాగైతేనేమి, ఈ ఇస్లామ్ ధర్మసందేశ ప్రచారం కారణంగా, అరబ్బుల ఐక్యత, మానవాళి సమైక్యత మరియు సామూహిక న్యాయాలు ఉనికిలోనికి

1. ఫీజిలాలిల్ ఖుర్‌ఆన్-సయ్యద్ ఖుతుబ్-29/168, 169

వచ్చేశాయి. మానవాళికి ఐహిక (ప్రాపంచిక) మరియు పారలౌకిక సమస్యల పరిష్కారానికి ఓ మంగళకరమైన, శుభదాయకమైన మార్గం లభించింది. మరో విధంగా చెప్పాలంటే, ప్రపంచ గమనమే మారిపోయింది. భూమ్మీద విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. చరిత్ర మలుపు తిరిగింది. ఆలోచనాసరళే మారిపోయింది.

ఇస్లామ్ ధర్మానికి పూర్వం, ప్రపంచంలో అజ్ఞానం రాజ్యమేలింది. దాని అంతరాత్మ మలినమై మానవుల ఆత్మలు కల్మషపూరితమైపోయాయి. నైతిక ప్రమాణాలు, న్యాయం కొలబద్దలు మంచీ చెడులతో కలగాపులగమై మానవాళిని అనేక భ్రమలకు లోనుచేస్తూ ఉండేది. అన్యాయ అక్రమాలు, హింసాదౌర్జన్యాలు ఎల్లెడలా రాజ్యమేలుతూ ఉండేవి. పాప పంకిలంలో కొట్టుమిట్టాడే 'కలిమి' వినాశానికి గురియైన లేములు కలగలిసి ఎగరేసిన సంఘర్షణా కెరటాలు ఈ ప్రపంచాన్నే కుదిపివేశాయి. దైవం తరపున పంపబడిన దైవధర్మాలు, జీవన వ్యవస్థలు అప్పటికే ప్రపంచంలో చెలామణిలో ఉన్నప్పటికీ అవన్నీ మార్పులకు, చేర్పులకు గురైపోయి బలహీనపడి ఉన్నవే. ప్రజలపై వాటి పట్టు సడలిపోయి ఉంది. అవి కేవలం నిర్జీవ జడపదార్థాలుగా ఉంటూ ఆచార సంప్రదాయాల మట్టుకే పరిమితమై ఉన్నాయి.

ఈ సందేశం మానవ జీవితాలపై తన ప్రభావాన్ని వేస్తూ, మానవ ఆత్మల్ని మూఢనమ్మకాలు, మూఢాచారాల నుండి, మానవ దాస్య శృంఖలాల నుండి, కల్లోల కల్మషాల నుండి విముక్తిని ప్రసాదించింది. మానవ సమాజాన్ని హింసాదౌర్జన్యాల నుండి, వినాశనం, వర్గవిభేధాలు,పాలకుల పీడన కాహిన్‌లు, మత గురువుల పెత్తనం నుండి బయటకు లాగింది. వాటి స్థానంలో ప్రపంచానికి, పవిత్రత, పరిశుద్ధత, సౌశీల్యం, పరిశోధనాత్మక నిర్మాణ పటిమ, ఆలోచనా స్వాతంత్ర్యం, దైవం గురించి తెలుసుకునే నిజమైన జ్ఞానం, విశ్వాసం, న్యాయం, ధర్మం, హక్కుదారుల హక్కుల నిర్వహణకు సిద్ధ పరిచింది.[2]

ఈ మార్పుల కారణంగా అరేబియా ద్వీపం, మానవాళి అప్పటి వరకు ఏ కాలంలోనూ గాంచనటువంటి శుభకరమైన ప్రగతిని గాంచగలిగింది. ఈ ద్వీపం చరిత్ర, మునుపెన్నడూ ఎరుగని మహోజ్వలమైన స్వర్గ యుగాన్ని తన పుటల్లో పొందుపరిచింది.

2. ఫీజిలాలుల్ ఖుర్ఆన్ పీఠిక - సయ్యద్ ఖుతుబ్, పుట. 14

హజ్జతుల్ విదా (చివరి హజ్)

దైవసందేశం అందించే కార్యం పరిపూర్తి అయింది. అల్లాహ్ ఏకత్వం, ఆయన తప్ప మరే ఆరాధ్యుడు లేడన్న సత్యాన్ని ధృవీకరించడం మరియు దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి దైవదౌత్యం పునాదులపై ఓ క్రొత్త సమాజ నిర్మాణ, రూపకల్పన అమల్లోనికి వచ్చేసింది. అంటే, ఇప్పుడు ఆ మహత్కార్యం పూర్తి అయిపోయింది కాబట్టి ఓ అదృశ్యవాణి మహాప్రవక్త ముహమ్మద్(స) గారి మనోఫలకంపై ఆయన ఈ ప్రపంచంలో జీవించి ఉండే కాలం దగ్గరపడుతుందనే సూచనలు ప్రస్ఫుటం చేయనారంభించింది. అందుకేనేమో మహాప్రవక్త (స), హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (ర)ను హిజ్రీ శకం 10లో యమన్‌కు గవర్నరుగా చేసి పంపిస్తూ ఆ పదవికి సంబంధించిన సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆ ఆదేశాలకు తోడు హజ్రత్ ముఆజ్ బిన్ జబల్(ర)తో,"ఓ ముఆజ్! బహుశా నీవు నన్ను ఈ సంవత్సరం తరువాత మళ్ళీ కలుసుకోలేవు అని అనిపిస్తోంది! నా ఈ మస్జిద్ (మస్జిదె నబవీ) మరియు నా సమాధిని మాత్రమే చూడగలవేమో!" అని చెప్పారు, హజ్రత్ ముఆజ్(ర), దైవప్రవక్త (స)గారి ఈ పలుకులు విన్నంతనే దుఃఖాన్ని ఆపుకోలేక పెద్దగా రోదించడం కూడా జరిగింది.

అసలు యదార్థం ఏమిటంటే, అల్లాహ్ తన ప్రవక్త (స)కు ఈ అదృశ్య వాణి ద్వారా ఇస్లామ్ ధర్మసందేశం వలన ఒనగూడిన సత్ఫలితాలేమిటో చూయించదలిచాడు. ఈ దైవసందేశ ప్రచారం కోసమైతే ఆయన అహర్నిశలు ఇరవై సంవత్సరాలకు పైన్నే కష్టాలను, కడగండ్లను అనుభవిస్తూ వచ్చారో దాని ఫలితం ఎంత మహోజ్వలంగా ఉందో కళ్ళారా చూసే భాగ్యాన్ని ప్రసాదించాడన్నమాట. ఇందుకు అల్లాహ్ ఓ సుముహూర్తాన్ని కూడా నిర్ణయించి, తద్వారా హజ్ సందర్భంలో మక్కా పరిసరాల్లో నివసించే అరబ్బు తెగల ప్రతినిధి వర్గాలను ఓ చోట సమావేశపరిచి ప్రవక్తశ్రీ(స) బోధించిన ధార్మిక

విషయాల జ్ఞానాన్ని వారు సముపార్జించడానికి, ఏ అమానతు భారమైతే ఆయన (స) భుజస్కంధాలపై వేయబడిందో దాన్ని ఇప్పుడు వీరు మోయవలసి ఉంటుందని చెప్పడానికి, దైవసందేశాన్ని అందించడం, ముస్లిమ్ సమాజానికి మేలు చేకూర్చే హక్కును సజావుగా నిర్వర్తించడంలో దైవప్రవక్త (స) ఎలాంటి లోటు రానివ్వకుండా ఆ బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించారని వారి నోటే సాక్ష్యం ఇప్పించవలసి ఉంది. ఈ దైవ నిర్ణయం ప్రకారమే దైవప్రవక్త (స) ఈ చారిత్రాత్మకమైన 'హజ్జె మబ్రూర్' (దైవం మెచ్చిన హజ్) చేయవలసి ఉందని ప్రకటించగానే అరేబియా ద్వీపానికి చెందిన ముస్లిమ్ జనసందోహం తండోపతండాలుగా వచ్చి ఆయన చుట్టూ చేరనారంభించింది. ప్రతి వ్యక్తీ, తాను మహాప్రవక్త(స) వెంట వెళ్ళి ఆయన నాయకత్వంలో హజ్ చేయాలని పరితపించిపోతున్నాడు.[1] జీఖాదా నెల ఇంకా నాల్గురోజులకు ముగుస్తుందనగా శనివారం రోజున దైవప్రవక్త (స) హజ్ కోసం బయలుదేరారు.[2]

తలపై నూనె వేసి మర్ధించుకొని దువ్వుకున్నారు. 'తహ్బంద్' (లుంగీ) కట్టుకొని మేనిపై దుప్పటి కట్టుకున్నారు. ఖుర్బానీ పశువుల మెడలలో పట్టెడలు వేసి జొహ్ర్ నమాజు చేసి హజ్ కోసం బయలుదేరారు. అస్ర్ నమాజుకు ముందే 'జుల్‌హులైఫా' వాదీ (లోయ)లోనికి చేరుకుని అక్కడాగి రెండు రకాతుల 'అస్ర్' నమాజు చేశారు. గుడారాలు వేసుకొని రాత్రంతా అక్కడనే గడిపారు. తెల్లవారిన తరువాత ఆయన (స) సహాబా (ర) (అనుచరగణం) ను సంబోధిస్తూ, "రాత్రి నా ప్రభువు వద్ద నుండి వచ్చేవాడు ఒకడొచ్చి నాతో, ఈ శుభమైన లోయలో నమాజు చేయమని, హజ్‌లో 'ఉమ్రా' కూడా ఉందని ప్రకటించు అని చెప్పి వెళ్ళాడు" అని తెలిపారు.[3]

1. ఇది సహీహ్ ముస్లిం గ్రంథంలో ఉన్న హజ్రత్ ఉమర్ (ర) గారి ఉల్లేఖనం. చూడండి, ప్రవక్త హజ్ అధ్యాయం - 1/394.
2. హాఫిజ్ ఇబ్నె హజర్ పరిశోధించి చెప్పిన విషయం ఇది. కొన్ని ఉల్లేఖనాల్లో జీఖాదా నెల ఇంకా అయిదు రోజులకు ముగుస్తుందనగా దైవప్రవక్త (స) బయలుదేరారనే అని వచ్చిన వివరాలను ఆయన సరిదిద్దారు. చూడండి, ఫత్‌హుల్ బారి - 8/104.
3. ఇది హజ్రత్ ఉమర్ (ర) గారు ఉల్లేఖించినట్లు బుఖారీ గ్రంథంలో ఉంది. 1/207.



హరమ్ సరిహద్దు, మీఖాత్ రేఖా చిత్రం

జొహ్రా నమాజుకు ముందే ఆయన (స) 'ఇహ్రామ్' కోసం 'గుస్ల్' చేశారు. హజ్రత్ ఆయిషా (ర), ఆయన (స) శరీరం మీదా, తలపైనా తన చేతులతో 'జరీరా'తో కలిపిన కస్తూరి సువాసన గల పదార్థాన్ని, దాని తళుకు, గుబాళింపు ఆయన తల పాపిటలో, గెడ్డంలో కానవచ్చేటట్లు పులిమారు. అయితే ఆ సువాసనా పదార్థాన్ని ఆయన కడిగివేయకుండా అలాగే ఉంచేసుకున్నారు. ఆ తరువాత తహ్బంద్ కట్టుకొని, శరీరంపై ఓ దుప్పటిని కట్టుకొని 'లబ్బైక్' వాక్యాలను బిగ్గరగా పలికారు. బయటకు వచ్చి తన 'కస్వా' అనే ఆడ ఒంటెపై ఎక్కి కూర్చున్నారు. అప్పుడు కూడా మరోసారి లబ్బైక్ పదాలను బిగ్గరగా పలికారు. అలా ఒంటెనెక్కి ఆయన (స) మైదానం వైపునకు వెళ్ళి అక్కడ కూడా లబ్బైక్ వాక్యాల్ని అందరికీ వినబడేటట్లు పలికారు.

ఆ తరువాత పయనమై ఓ వారం తరువాత ప్రొద్దుగ్రుంకే సమయానికి మక్కా దాపుకు చేరుకున్నారు. అక్కడ ఆయన (స) 'జీతువా'లో మకాం వేశారు. రాత్రి అక్కడనే గడిపి ఫజ్ర్ నమాజు తరువాత 'గుస్ల్' (స్నానం) చేసి ఉదయాన్నే మక్కాలో ప్రవేశించారు. అది హిజ్రీ శక సంవత్సరం 10, జిల్‌హజ్జా మాసం 4వ తేది, ఆదివారం రోజు. ప్రయాణ కాలంలో మొత్తం ఎనిమిది రాత్రిళ్ళు గడిచాయి- సరాసరి ప్రయాణానికి పట్టేకాలం అదే- నేరుగా మస్జిదె హరామ్ (కాబా మస్జిద్)కు చేరి ఆయన మొదట దైవగృహం కాబా తవాఫ్ చేశారు. ఆ తరువాత సఫా మర్వా కొండల నడుమ 'సయీ' చేశారు. ఆయన (స) హజ్ మరియు ఉమ్రాలు రెంటికి సంబంధించిన ఇహ్రామ్ ఒకేసారి కట్టుకోవడం 'హదీ' (ఖుర్బానీ) పశువులను వెంట తీసుకురావడం జరిగింది. కాబట్టి ఇహ్రామ్ వస్త్రాలను మాత్రం తీసివేయక అలానే ఉంచేసుకున్నారు. తవాఫ్ మరియు సయీ రెంటిని ముగించుకొని మహాప్రవక్త (స) ఎగువ మక్కాలో హజూన్ అనే ప్రదేశంలో విడిది చేశారు. అయితే, హజ్ తవాఫ్ తప్ప మరే తవాఫ్ ఆయన చేయలేదు. దైవప్రవక్త (స) వెంట వచ్చిన ఏ సహాబాలైతే తమ వెంట 'హదీ' తీసుకురాలేకపోయారో, వారికి ఆయన (స) తమ ఇహ్రామ్‌ను ఉమ్రా ఇహ్రామ్‌గా మార్చుకొమ్మని, కాబా గృహం తవాఫ్ మరియు సఫా మర్వాల నడుమ 'సయీ' చేసిన తరువాత వాటిని తీసేసి పూర్తిగా 'హలాల్' కమ్మని ఆదేశం ఇచ్చారు. మహాప్రవక్త (స) స్వయంగా ఇహ్రామ్ దుస్తులను తీసివేసి హలాల్ కానందున సహాబాలు కొంత

ఇరుకునబడ్డారు. అది చూసిన మహాప్రవక్త (స) వారితో, "నాకు ఇప్పుడు తెలిసిన విషయం ముందే తెలిసి ఉంటే నేనసలు హదీ తెచ్చేవాడినేకాదు. మీతోపాటే హలాల్ అయి ఉండేవాణ్ణి" అని అనగా సహాబాలు (ర) ఆయన ఆదేశాలను శిరసావహించారు. అంటే ఎవరి వద్ద హదీ పశువు లేదో వారు హలాల్ అయిపోయారు. (హలాల్ కావడం అంటే, ఇహ్రామ్ కట్టుకున్న తరువాత కొన్ని ధర్మసమ్మతమైన విషయాలు ఇహ్రామ్ వదిలినంతవరకు హరామ్ అవుతాయి. ఇహ్రామ్ వదిలిన తరువాత తిరిగి అవి ధర్మసమ్మతం అయిపోతాయి అని అర్థం.)

ఎనిమిది జిల్‌హజ్జా తేదీన- తర్వియా రోజున- మహాప్రవక్త (స) 'మినా'కు వెళ్ళారు. అక్కడ ఆయన (స) జిల్‌హజ్జా తొమ్మిదవ తేదీ ఉదయం వరకు విడిది చేశారు. జొహ్రా, అస్ర్, మగ్రిబ్, ఇషా మరియు ఫజ్ర్ నమాజులు (అయిదు పూటలు) అక్కడనే చేశారు. సూర్యోదయం అయిన వరకు ఆగి 'అరఫా'కు బయలుదేరారు. అక్కడికి చేరేటప్పటికే ఆయన కోసం 'వాదియె నిమ్రా'లో గుడారం సిద్ధపరచబడి ఉంది. పగలంతా ఆయన (స) ఆ గుడారం లోనే ఉండిపోయారు. సూర్యుడు పడమటి దిక్కుకు వాలిన తరువాత ఆయన ఆదేశం మేరకు కస్వాపై కజావా కట్టబడింది. దానిపైనెక్కి 'బత్న్' లోయలోనికి అరుదెంచారు. అప్పుడు ఆయన చుట్టూ ఒక లక్షా ఇరవై నాల్గు వేలు లేదా లక్షా నలభై నాల్గు వేల మంది చేరారు. మహాప్రవక్త (స) వారి నడుమన నిలుచొని ఓ సమగ్రమైన ప్రసంగం చేస్తూ ఇలా సెలవిచ్చారు:

"ప్రజలారా! నా మాటలమ ఆలకించండి! ఎందుకంటే ఈ సంవత్సరం తరువాత ఈ ప్రదేశంలో మీరు నన్ను ఇంకెన్నడూ కలుసుకోలేరు.[4]

ఈ గడుస్తున్న నెల మరియు ఈ నగరం యొక్క పవిత్రతలా, మీ ప్రాణం, మీ సంపద కూడా పరస్పరం ఒకరిపై ఒకరికి అంతే పవిత్రమైనది, నిషిద్ధమైనది. బాగా వినండి! అజ్ఞాన కాలంనాటి ప్రతిదీ నా కాళ్ళ క్రింద నలిపివేయబడింది. అజ్ఞానకాలంలో జరిగిన హత్యల రక్తపరిహారం కూడా అంతం చేయబడింది. మనలో మొట్టమొదటి వ్యక్తి రక్తపరిహారం దేన్నయితే నేను అంతమొందిస్తున్నానో అది రబీయా బిన్ హారిస్ కుమారునిది - ఈ

4. ఇబ్నె హష్షామ్-2/603

పిల్లవాణ్ణి బనూ సఅద్‌లో పాలు త్రాగడానికి వదలినప్పుడు హుజైల్ వంశానికి చెందినవారు అతణ్ణి హతమార్చారు - అజ్ఞాన కాలం నాటి వడ్డీని కూడా అంతం చేసేస్తున్నాను. మన వడ్డీల్లో మొదటి ఏ వడ్డీనైతే నేను అంతం చేస్తున్నానో అది అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ గారి వడ్డీ. ఇప్పుడు ఈ వడ్డీ అంతా లేనట్లే.

అయితే, స్త్రీల విషయంలో అల్లాహ్‌కు భయపడండి. ఎందుకంటే వారిని మీరు అల్లాహ్ అమానతుగా పొందినవారు. అల్లాహ్ వచనం ద్వారా మీ కోసం వారు ధర్మసమ్మతం అయినవారు. మీకు ఇష్టంకాని వారినెవరినీ వారు మీ పడకల పైకి రాకుండా ఉంచాలి. అది మీ హక్కు. వారే గనక అలా చేస్తే మీరు వారిని దండించవచ్చు. అయితే వారిని తీవ్రమైన దండనకు గురి చేయకూడదు. ప్రసిద్ధ రీతిలో వారికి తిండీ బట్టా అందించడం అనేది మీపై వారికి ఉన్న హక్కు.

ఇంకా, మీ కోసం దేన్నయితే వదిలి వెడుతున్నానో దాన్ని మీరు గనక దృఢంగా పట్టుకొని ఉంటే ఇక మీదట మీరు ఏమాత్రం మార్గాన్ని తప్పలేరు. అది అల్లాహ్ గ్రంథం.[5]

ప్రజలారా! గుర్తుంచుకోండి! నా తరువాత మరే ప్రవక్త ఉండడు. అలాగే మీ తరువాత మరే సమాజమూ లేదు. కాబట్టి మీరు మీ ప్రభువును ఆరాధించండి. అయిదు పూటలా నమాజు చేయండి. రమజాన్ మాసంలో రోజా వ్రతాన్ని పాటించండి. మనస్ఫూర్తిగా జకాత్ చెల్లించండి. మీ ప్రభువు గృహ (కాబా) హజ్ చేయండి మరియు మీ పాలకులను విధేయించండి. అలా చేస్తే మీ ప్రభువు యొక్క స్వర్గంలో ప్రవేశిస్తారు.[6]

ఇంకా, నా గురించి మిమ్మల్ని ప్రశ్నించడం జరుగుతుంది. అప్పుడు మీరు ఏమంటారు? దానికి సహాబా (ర), "మీరు ధర్మాన్ని మాకు అందించారు, సందేశ ప్రచారం చేశారు. ఎంత మేలు చేయాలో అంత మేలు చేసి దాని హక్కును నిర్వర్తించారు" అన్నారు. ఇది విన్న మహాప్రవక్త (స), తన చూపుడు వ్రేలిని ఆకాశం వైపునకు ఎత్తి దాన్ని ప్రజల వైపునకు వంచుతూ

5. సహీహ్ ముస్లిమ్ - ప్రవక్త (స)గారి హజ్ అధ్యాయం - 1/397.

6. ఇబ్ను మాజా; ఇబ్ను అసాకర్; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/263.

'ఓ అల్లాహ్ దీనికి నీవే సాక్షివి' అని మూడు మార్లు పలికారు.[7]

మహాప్రవక్త (స)గారి పలుకుల్ని రబీయా బిన్ ఉమయ్యా బిన్ ఖల్ఫ్ ఉచ్ఛస్వరంతో ప్రజలకు వినిపించనారంభించారు.[8] ప్రసంగం పూర్తి చేసిన తరువాత అల్లాహ్ ఈ వాక్యాన్ని అవతరింపజేశాడు.

اَلْيَوْمَ اَكْمَلْتُ لَكُمْ دِيْنَكُمْ وَ اَتْمَمْتُ عَلَيْكُمْ
نِعْمَتِيْ وَرَضِيْتُ لَكُمُ الْاِسْلَامَ دِيْنًا

"అల్ యౌమ అక్మల్తు లకుం దీనకుమ్. వ అత్మమ్తు అలైకుం నిఅమతీ వ రజైతు లకుముల్ ఇస్లామ దీనా." (5 : 3)

(ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీ కొరకు ఇస్లామ్‌ను మీ ధర్మంగా అంగీకరించాను.)

హజ్రత్ ఉమర్ (ర) ఈ ఆయత్‌ను విన్నంతనే దుఃఖించనారంభించారు. మీరెందుకు రోదిస్తున్నారని అడుగగా, "పరిపూర్ణత తరువాత మిగిలేది లోపమే కదా!" అని బదులిచ్చారు ఆయన.[9]

ప్రసంగం తరువాత హజ్రత్ బిలాల్ (ర) అజాన్ పలికి నమాజు కోసం అఖామత్ కూడా పలికారు. మహాప్రవక్త (స) జొహ్ర్ నమాజు చేయించారు. ఆ తరువాత హజ్రత్ బిలాల్ (ర) మరోసారి అఖామత్ పలుకగా దైవప్రవక్త(స) అస్ర్ నమాజు కూడా చేయించారు. ఈ రెండు నమాజుల మధ్యకాలంలో మరే నమాజు చేయలేదు. ఆ తరువాత వాహనమెక్కి తాము విడిది చేసిన చోటికి వెళ్ళిపోయారు మహాప్రవక్త (స). తన ఒంటె కస్వా పొట్టను బండరాళ్ళ వైపునకు మళ్ళించి కూర్చోబెట్టారు. 'జబ్లె ముషాత్' (కాలినడకన వెళ్ళేవారి మార్గంలో ఉన్న మట్టి తిన్నె) ను ముందు ఉండేటట్లు చూసి తన ముఖాన్ని కాబాకు అభిముఖంగా చేసి అక్కడనే ఉండిపోయారు. ప్రొద్దుగ్రుంకుతూ, బాగా ఎరుపెక్కి అస్తమించే వరకు వేచి చూశారు. సూర్యబింబం పూర్తిగా మటుమాయమైపోగానే హజ్రత్ ఉసామా (ర)ను తన ఒంటెపై వెనుక కూర్చో

7. సహీహ్ ముస్లిమ్ - 1/397 8. ఇబ్నె హిషామ్ -2/605

9. బుఖారి, ఇబ్నె ఉమర్‌గారి ఉల్లేఖనం. చూడండి, రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/265

బెట్టుకొని బయలుదేరి 'ముజ్‌దల్ఫా'కు వచ్చేశారు. ముజ్‌దల్ఫాలో మగ్రిబ్ మరియు ఇషా నమాజులు ఒకే అజాన్ మరియు రెండు అఖామత్‌లతో చేశారు. ఆ రెండు నమాజుల మధ్యలో ఎలాంటి నఫిల్ నమాజు చేయలేదు. ఉషోదయం వరకు అలా మేనువాల్చారు. తెల్లవారుతూ ఉండగా అజాన్ కాగానే అఖామత్ చెప్పి ఫజ్ర్ నమాజ్ చేశారు. పిదప కస్వాపై ఎక్కి 'మష్‌అరిల్ హరామ్'కు వెళ్ళిపోయారు. అక్కడ కిబ్లా దిశగా (కాబాభి ముఖంగా) నిలబడి దుఆ చేశారు. ఆయన ఏకత్వం, ఔన్నత్యం గురించి ప్రస్తుతించారు. అలా ఇక్కడా బాగా తెల్లవారిపోయిన వరకు అలా నిలబడి అల్లాహ్‌ను ప్రస్తుతిస్తూనే ఉండిపోయారు. సూర్యోదయం అయ్యే ముందు 'మినా'కు బయలుదేరారు. ఈసారి హజ్రత్ ఫజ్ల్ బిన్ అబ్బాస్(ర)ను తన వెనుకగా ఎక్కించుకోవడం జరిగింది. 'బత్నె ముహస్సిర్'కు చేరగా తన వాహన వేగాన్ని కొంత పెంచి పరుగెత్తించారు. జమ్రయె కుబ్రాకు వెళ్ళే మార్గాన్ని అనుసరించి అక్కడికి చేరుకున్నారు - ఆ కాలంలో అక్కడ ఓ చెట్టు ఉండేది. 'జమ్రయె కుబ్రా' ఆ చెట్టు పేరుతోనే గుర్తించబడేది. ఇదే కాకుండా జమ్రయె కుబ్రాను జమ్రయె అక్బా మరియు జమ్రయె ఊలాగా కూడా పిలుస్తారు- అక్కడికి చేరిన తరువాత మహాప్రవక్త (స) జమ్రయె కుబ్రాపై ఏడు గులకరాళ్ళను విసిరారు. ఒక్కో గులకరాయి విసురుతూ తక్బీర్ (అల్లాహు అక్బర్) అని పలికారు. అవి రెండు వ్రేళ్ళతో పట్టి విసరేటంత చిన్నవి. ఈ గులకరాళ్ళను ఆయన బత్నె వాదీలో నిలబడి విసిరారు. ఆ తరువాత బలి స్థానానికి వెళ్ళి తన చేత్తో 63 ఒంటెల్ని జిబహ్ చేశారు. తక్కిన ఒంటెలను జిబహ్ చేయమని హజ్రత్ అలి (ర)కి అప్పగించారు. ఆయన మిగిలిపోయిన 37 ఒంటెల్ని జిబహ్ చేయడం జరిగింది. ఇలా ఖుర్బానీ ఇచ్చిన ఒంటెల సంఖ్య మొత్తం నూరు అయింది. దైవప్రవక్త (స) హజ్రత్ అలి (ర)ను కూడా తన హదీ (ఖుర్బానీ)లో చేర్చుకున్నారు. దైవప్రవక్త (స) ఆదేశం మేరకు ఆ ఖుర్బానీ ఒంటెల మాంసం నుండి ఒక్కో ముక్కను కోసి వండడం జరిగింది. మహాప్రవక్త (స) మరియు హజ్రత్ అలి (ర) ఆ వండిన మాంసాన్ని కొంత భుజించి దాని పులుసును కూడా త్రాగారు.

ఖుర్బానీ అయిన తరువాత దైవప్రవక్త (స) తన ఒంటెనెక్కి మక్కాకు బయలుదేరారు. బైతుల్లాహ్ (కాబా గృహం) తవాఫ్ (ప్రదక్షిణ) చేశారు - దీన్ని తవాఫె అఫాజా అంటారు - మక్కాలోనే జొహ్ర్ నమాజు చేశారు. పిదప (జమ్‌జమ్ చెలమ) దగ్గర ఉన్న బనూ అబ్దుల్ ముత్తలిబ్ వారి దగ్గరకు వెళ్ళారు. వారు హాజీలకు జమ్‌జమ్ నీరు త్రాగిస్తున్నారప్పుడు. వారిని చూసి మహాప్రవక్త (స), "బనూ అబ్దుల్ ముత్తలిబ్! మీరు నీళ్ళు తోడుతూనే ఉండండి. నీరు త్రాగించే ఈ కార్యంలో ప్రజలు మిమ్మల్ని మించిపోతారనే భయమే లేకపోతే నేను కూడా మీతోపాటే వచ్చి నీళ్ళు తోడేవాణ్ణి" అని సెలవిచ్చారు - అంటే ప్రవక్త (స)గారి అనుచరగణం దైవప్రవక్త (స)ను నీళ్ళు తోడుతూ చూసి ప్రతివాడు ముందుకెళ్ళి నీటిని తోడడానికి ప్రయత్నం చేసేవాడు. ఇలా హాజీలకు నీరు త్రాగించే హోదా, గౌరవం ఏదైతే బనూ అబ్దుల్ ముత్తలిబ్‌కు దక్కిందో, ఆ వ్యవస్థ కాస్తా ఛిన్నాభిన్నమైపోయేది అని అర్థం - బనూ అబ్దుల్ ముత్తలిబ్ జమ్‌జమ్ బావి నుండి ఓ బొక్కెన నీటిని తోడి ఇవ్వగా మహాప్రవక్త (స) అందులో నుండి తనవితీరా నీరు త్రాగారు.[10]

ఆ రోజు యౌమున్నహ్ర్. అంటే జిల్‌హజ్జా పదవ తేది. దైవప్రవక్త (స) ఆ రోజు ప్రొద్దెక్కిన తరువాత (చాష్త్ సమయం) ఓ ఖుత్బా (ప్రసంగం) ఇచ్చారు. ప్రసంగించేటప్పుడు ఆయన కంచర గాడిద (ఖచ్చర్) నెక్కి ఉన్నారు. దైవప్రవక్త (స)గారి ప్రవచనాలను హజ్రత్ అలి(ర), సహాబా(ర)లకు వినబడేటట్లు బిగ్గరగా చెబుతున్నారు. సహాబా(ర)లు ఆ సమయాన కొందరు నిలబడి, మరికొందరు కూర్చుని వింటూ ఉన్నారు.[11] ప్రవక్తశ్రీ(స) ఈ రోజు ప్రసంగం లోనూ, నిన్నటి ఎన్నో మాటలను వల్లించారు. సహీహ్ బుఖారి మరియు సహీహ్ ముస్లిమ్ గ్రంథాల్లో అబూ బక్ర్ (ర)గారి ఉల్లేఖనం ఉంది. ఆయన (ర), యౌమున్నహ్ర్ (పదవ జిల్‌హజ్జా) నాడు దైవప్రవక్త (స) ఇలా ప్రసంగించారని చెప్పారు:

"కాలం పరిభ్రమిస్తూ, మళ్ళీ అల్లాహ్ భూమ్యాకాశాలు సృజించిన ఈ రోజుకు తిరిగివచ్చింది. సంవత్సరానికి పన్నెండు నెలలు. ఈ పన్నెండు నెలల్లో నాల్గు నెలలు హరామ్ నెలలు. మూడు ఒకదాని తరువాత ఒకటి వరుసగా వచ్చేవి. అంటే జీఖాదా, జిల్‌హజ్జా మరియు ముహర్రం. ఇంకొకటి రజబె ముజర్. అది జమాదిల్ ఉఖ్రా మరియు షాబాన్ నెలలకు నడుమన ఉన్న నెల."

10. ముస్లిమ్- అధ్యాయం, ప్రవక్త (స)గారి హజ్ - 1/397 - 400.

11. అబూ దావూద్, దైవప్రవక్త (స)గారి ఖుత్బాల అధ్యాయం- 1/270.

ఇంకా ఆయన (స), "ఇది ఏ మాసం?" అని అడిగారు. మేము జవాబుగా, "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)కే బాగా తెలుసు" అన్నాం. ఇది విన్న మహాప్రవక్త (స) కొంచెంసేపు మౌనం పాటించారు. మేము, ఈ నెలకు ఆయన మరేదైనా పేరు పెట్టనున్నారేమో అని అనుకున్నాం. కాని ఆ తరువాత ఆయన తిరిగి, "ఇది జిల్‌హజ్జా మాసం కాదా?" అని అడిగారు. "అవును. ఎందుకు కాదు" అన్నాం మేము. ఆయన మళ్ళీ, "ఇది ఏ నగరం?" అని ప్రశ్నించారు. మేము, "అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త(స)కు బాగా తెలుసు." అని సమాధానమివ్వగా, ఆయన మళ్ళీ మౌనం వహించారు. మేము, ఆ మౌనాన్ని చూసి ఈ నగరానికి మరే పేరేదైనా పెడతారేమో అని అనుకుంటూ ఉండగా, తమ మౌనాన్ని వీడి, "ఇది బల్దాహ్ (మక్కా) కాదా?" అని ప్రశ్నించారు. "ఔను. తప్పకుండా" అని సమాధానమిచ్చాం మేము.

"సరే, ఈ రోజు ఏ రోజు?" అని అడిగారు ఆయన (స).

"అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త (స)కే బాగా తెలుసు" అన్నాం మేము.

మా సమాధానం విన్న ఆయన (స) తిరిగి మౌనం వహించారు. మౌనాన్ని చూసి, ఈ రోజుకు మరే పేరేదైనా పెడతారేమో అని అనుకుంటూ ఉండగానే ఆయన (స), "ఈ రోజు యౌమున్నహ్ర్ (ఖుర్బానీ రోజు అంటే జిల్‌హజ్జా పదవ తారీకు) కాదా?" అని అడిగారు.

"ఔను. ఎందుకు కాదు" అని అన్నాం మేము. అప్పుడాయన ఇలా సెలవిచ్చారు:

"సరే వినండి, మీ ఈ నగరం, మీ ఈ నెల మరియు మీ ఈ రోజు ఎలా నిషిద్ధం (హరాం) గావించబడిందో, అలానే మీ రక్తం, మీ సంపద, మీ మానం పరస్పరం ఒకరిపై ఒకరికి నిషిద్ధం గావించబడ్డాయి.

మీరు అతి త్వరలోనే మీ ప్రభువును చేరుకుంటారు. ఆయన మిమ్మల్ని మీ కర్మలను గురించి అడుగుతాడు. కాబట్టి చూడండి! నా తరువాత ఒకరి మెడలను మరొకరు నరుక్కునేలా ధర్మభ్రష్టులు కాకండి. నేను దైవసందేశాన్ని మీకు అందించి నా విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చుకున్నానా? చెప్పండి" అని అడిగారు.

సహాబాలందరూ ముక్తకంఠంతో 'అవును' అని పలికారు.

అప్పుడు ఆయన(స), "ఓ అల్లాహ్! నీవే సాక్షి! అంటూ, ఎవరైతే ఇక్కడ హాజరుగా ఉన్నారో (ఈ మాటలను) హాజరుగా లేనివారికి అందించాలి. ఎందుకంటే, ఎవరికైతే (ఈ మాటలు) అందించడం జరుగుతుందో ప్రస్తుతం కొందరు (హాజరుగా) వినేవారికంటే నా ఈ మాటల పరమార్థాన్ని తెలుసు కోగలరు."[12]

మరో ఉల్లేఖనంలో ఈ ఖుత్బాలో ఆయన (స) ఇలా కూడా సెలవిచ్చి నట్లుంది:

"ఏ నేరం చేసినవాడైనా తనకు తాను తప్పు మరొకరికి నేరం చేయడనే విషయాన్ని గుర్తించండి (అంటే ఆ నేరం చేసినందుకు మరొకరు కాకుండా స్వయంగా తానే ఆ నేరం క్రింద పట్టుబడతాడని అర్థం). గుర్తుంచుకోండి! ఏ నేరగాడు అయినా తన కుమారునిపైగాని లేదా ఏ కుమారుడైనా తన తండ్రిపైగాని నేరం చేయడు (అంటే, తండ్రి చేసిన నేరానికి కుమారుణ్ణిగాని, కుమారుడు చేసిన నేరానికి తండ్రినిగాని పట్టుకోవడం జరగదు అని). జ్ఞాపకముంచుకోండి! షైతాన్ ఇప్పుడు, మీ ఈ నగరంలో ఎవ్వరూ అతణ్ణి పూజించేవారు లేరు గనుక నిరాశకు లోనైపోయాడు. ఏ కర్మలనైతే మీరు తుచ్ఛమైనవిగా నీచమైనవిగా తలుస్తున్నారో ఆ కర్మలలోనే అతణ్ణి మీరు విధేయించడం జరుగుతుంది. వాటి ద్వారానే అతడు సంతుష్టుడవుతూ ఉంటాడు.[13] (అంటే ఎలాంటి ప్రాధాన్యత లేని విషయాల్లో మీరు అతణ్ణి అనుసరిస్తారు అని అర్థం.)

ఆ ప్రసంగం అయిన తరువాత ప్రవక్త మహనీయులు (స) అయ్యామె తష్రీక్ (11, 12, 13 జిల్‌హజ్జా తేదీలు)లో మినాలోనే ఉండిపోయారు. ఈ మూడు రోజుల్లో ఆయన (స) 'హజ్ మనాసిక్'ను (హజ్‌లో నిర్వర్తించవలసిన పనులను) కూడా ఆచరించారు. అదేకాకుండా ప్రజలకు ఇస్లామ్ ధర్మశాస్త్రానికి సంబంధించిన విషయాలను గురించి బోధిస్తూ దైవాన్ని ప్రస్తుతించారు. ఇబ్రాహీం (అ.స.) నిర్వహించిన ఖుర్బానీ ఆచారాన్ని నెలకొల్పుతూ షిర్క్‌కు సంబంధించిన గురుతులన్నింటినీ నామరూపాల్లేకుండా చెరిపివేశారు. 'అయ్యామె తష్రీక్'లో ఓ రోజు ప్రసంగించారు కూడా. 'సునన్ అబూ దావూద్'

12. సహీహ్ బుఖారి- మినాలో చేసిన ఖుత్బా అధ్యాయం-1/234.

13. తిర్మిజి-2/38, 135; ఇబ్ను మాజా, కితాబుల్ హజ్ మిష్కాత్-1/234.

గ్రంథంలో ఉటంకించిన ఓ ఉల్లేఖనంలో, హజ్రత్ సరాఅ బిన్తె నిభాన్(ర) గారి కథనం ఇలా ఉంది:

మహాప్రవక్త (స) 'రఊస'[14] రోజున ఖుత్బానిస్తూ మాకు ఇలా బోధించారు: "ఈ దినం అయ్యామె తష్రీక్‌లోని మధ్య రోజు"[15] అని అన్నారు.

నేటి ఖుత్బా కూడా నిన్నటి (యౌమున్నహ్ర్) ఖుత్బాలాంటిదే. ఇది నస్ర్ అధ్యాయం అవతరణ తరువాత ఇచ్చిన ఖుత్బా.

అయ్యామె తష్రీక్ అయిపోయిన తరువాత మరునాడు 'యౌమున్నఫ్ర్' అంటే 13 జిల్‌హజ్జా రోజున ప్రవక్త మహనీయులు (స) మినా నుండి బయలు దేరారు. వాదియె అబ్తహ్‌లో నివసించే 'ఖైఫ్ బనీ కనానా' వారి దగ్గర ఆగి సేద తీర్చుకున్నారు. మిగిలిన ఆ పగలు, రాత్రి కూడా అక్కడనే గడిపేశారు. అక్కడే జొహ్ర్, అస్ర్, మగ్రిబ్ , ఇషా నమాజులు చేశారు. అయితే ఇషా నమాజు తరువాత కొంచెంసేపు నిద్రించి లేచి మళ్ళీ బైతుల్లాహ్‌కు బయలు దేరారు. అక్కడికి చేరి 'తవాఫె విదా' (కాబా గృహపు చివరి తవాఫ్) చేశారు.

ఇప్పుడిక హజ్ మనాసిక్ (హజ్‌లో ఆచరించవలసిన ఆచారాలు) పూర్తి చేసుకొని తమ వాహనాన్ని మదీనా వైపునకు మరల్చి బయలుదేరారు. మదీనాకు వెళ్ళి అక్కడ విశ్రాంతి తీసుకునే ఉద్దేశ్యంతో కాకుండా, ఇప్పుడు అల్లాహ్ కోసం, అల్లాహ్ మార్గంలో తిరిగి ఓ క్రొత్త కృషికి నాంది పలకడానికె ఆ ప్రస్థానం.[16]

---

16. హజ్జతుల్ విదా వివరాల కోసం ఈ గ్రంథాలను చూడండి: సహీ బుఖారి- కితాబుల్ మనాసిక్, సంపుటి 1, సంపుటి-2/631; సహీహ్ ముస్లిమ్ - బాబుల్ హజ్జతున్నబీ (స), ఫత్‌హుల్ బారి - సంపుటం 3, షరహ్ కితాబుల్ మనాసిక్ మరియు సంపుటం-8/103 - 110; ఇబ్నె హిషామ్ 2/601 - 605; జాదుల్ ముఆద్ 1/196, 218 - 240

చిట్టచివరి సైనిక యాత్ర

ఇస్లామ్ ధర్మం మరియు ముస్లిములు జీవించి ఉండే హక్కును గుర్తించడం, రోమన్ సామ్రాజ్యానికి (Roman empire) ఒక పట్టాన నచ్చింది కాదు. అందుకని ఆ సామ్రాజ్యంలో నివసించే ఏ వ్యక్తి అయినా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే ఇక అతని ప్రాణాలు గాలిలో కలసిపోవలసిందే. ఇదివరకు ముఆన్ యొక్క రోమన్ గవర్నరు హజ్రత్ ఫర్వా బిన్ అమ్రూ జిజామి విషయంలో అలానే జరిగింది.

వారి ఈ నిర్భయ తెగింపును మరియు అకారణమైన ఈ గర్వాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రవక్త మహనీయులు (స) హిజ్రీ శక సంవత్సరం 11, సఫర్ నెలలో ఓ పెద్ద సైన్యాన్ని సమాయత్తపరిచారు. రోమనుల గర్వమణ చడానికి హజ్రత్ ఉసామా బిన్ జైద్ బిన్ హారిసా (ర)ను ఆ సైన్యానికి సైన్యాధ్యక్షునిగా నియమించి పంపుతూ, "బల్కా ప్రాంతం మరియు రోమనుల పాలస్తీనా భూభాగాన్ని ఈ సైనిక వాహనాల గిట్టలతో నలిపివేసి రమ్మని" ఆదేశమిచ్చారు. ఈ దండయాత్ర ఉద్దేశ్యం, రోమనులను భయ భ్రాంతులుగా చేసి హడలగొట్టడం, వారి సరిహద్దుల్లో నివసించే అరబ్బు తెగల విశ్వాసాన్ని, స్థయిర్యాన్ని పునరుద్ధరిస్తూ 'కలీసా' (క్రైస్తవ మత చర్చి) చేసే దురంతాలను ఎవరూ ప్రశ్నించే నాథుడే లేడనే భావనను వారి మనసుల నుండి తొలగించడం. దాని స్థానంలో ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడమంటే తన చావును తానే కొనితెచ్చుకోవడం కాదు అనే భావనను వారి మనస్సుల్లో నాటుకునేటట్లు చేయడం.

ఈ సందర్భంగా సైన్యాధ్యక్షుని పిన్నవయస్సు చర్చనీయాంశమైంది. ఈ దండయాత్రలో చేరడానికి ప్రజలు సంకోచించనారంభించారు. ఇది తెలిసిన మహాప్రవక్త(స), "మీరు ఆయన చిన్నవాడని ఎగతాళి చేస్తూ ఉన్నారా? ఇంతకు పూర్వం ఆయన తండ్రిగారి సైన్యాధ్యక్షతను కూడా ఇలానే ఎగతాళి

చేశారు. దైవసాక్షి! ఆయన ఆ పదవికి సమర్ధుడైనవాడే. నాకు ప్రియమైన వారిలో ఒకడాయన. ఈయన కూడా నాకు ప్రియమైనవాడే"[1] అని సెలవిచ్చారు.

ఎలాగైతేనేమి, సహాబా (ర) హజ్రత్ ఉసామా సైన్యాధ్యక్ష పదవిని స్వీకరించి ఆ సైన్యంలో చేరిపోయారు. ఈ సైన్యపటాలం బయలుదేరి మదీనాకు మూడు మైళ్ళ దూరాన గల 'జుర్ఫ్' అనే ప్రదేశానికి వెళ్ళి గుడారాలు వేసుకుంది కూడా. అయితే దైవప్రవక్త (స) ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనకరమైన వార్తలు రావడంతో ముందుకు కదలక అక్కడనే ఆగిపోవలసి వచ్చింది.

ఈ సైన్యం హజ్రత్ అబూ బక్ర్ (ర) గారి ఖిలాఫత్ కాలంలో మొదటి సైనిక కార్యం కావాలనేది అల్లాహ్ నిర్ణయమేమో మరి.[2]

1. సహీ బుఖారి-2/612.
2. సహీ బుఖారి , ఇబ్నె హష్షామ్ 2/606, 610.

చివరి దశ

పరమాప్తుని వైపునకు ప్రస్థానం

అంతిమ ప్రయాణ సూచనలు

దైవసందేశ ప్రచార కార్యక్రమం పూర్తయి అరేబియా ద్వీప అధికార పగ్గాలు చేతికి వచ్చిన తరువాత మహాప్రవక్త (స) గారి భావాలు, ఆలోచనలు, వైఖరి, సంభాషణల ద్వారా ఇక ఆయన ఈ ప్రాపంచిక జీవితానికి స్వస్తి చెప్పబోతున్నారనే సూచనలు, గురుతులు కానరావడం ప్రారంభమయ్యాయి. ఉదాహరణకు:

ఆయన (స) రమజాన్ నెల (హి.శ. 10)లో ఇరవై రోజుల వరకు ఈతికాఫ్ చేశారు. ఇంతకు ముందు రమజాన్ నెలలో ఆయన పది రోజులే ఈతికాఫ్ పాటించేవారు. జిబ్రీల్ (అ.స.) ఈ సంవత్సరం రెండుమార్లు ఖుర్ఆన్ పారాయణాన్ని చేయడం జరిగింది. ప్రతి సంవత్సరం ఒక మారే దివ్యఖుర్ఆన్ పారాయణం చేయించడం ఆనవాయితి. హజ్జతుల్ విదా సందర్భంగా ఆయన ఇలా చెప్పారు కూడా:

"బహుశా ఈ సంవత్సరం తరువాత మీ ఈ ప్రదేశంలో మీతో ఎప్పుడూ కలువలేనేమో."

జమ్రయె అక్బా దగ్గర నిలబడి, "హజ్ నియమాలను నా నుండి తెలుసుకోండి, ఎందుకంటే, బహుశా దీని తరువాత నేను హజ్ చేయలేనేమో."

అయ్యామె తష్రీక్ యొక్క నడిమి రోజున 'నస్ర్ సూరా' అవతరించింది. దీని ద్వారా ఆయన (స) తాము ఇక ఈ ప్రపంచం నుండి వెళ్ళే సమయం ఆసన్నమైందని గమనించారు. ఇదో మరణ ఘంటిక.

సఫర్ నెల ప్రారంభంలో (హి.శ.11) ఆయన ఉహద్ కొండకు చేరు కున్నారు. అమరగతినొందిన సహాబా (ర) కోసం, సజీవులు మరియు నిర్జీవులైన వారి నుండి సెలవు తీసుకున్నట్లుగా దుఆ చేశారు. తిరిగి వచ్చి మెంబరుపై కూర్చుని ఇలా సెలవిచ్చారు:

“నేను మీ బిడారానికి అమీర్‌ను (అధ్యక్షుణ్ణి), మీ గురించి సాక్ష్యం పలికేవాణ్ణి. దైవసాక్షి! నేనిప్పుడు నా ‘హౌజ్‌’ను (హౌజె కౌసర్) చూస్తున్నాను. నాకు భూ ధనాగారాల తాళపు చెవులు ఒసగడం జరిగింది. దైవసాక్షిగా! నా తరువాత మీరు షిర్క్ చేస్తారనే భయం నాకు లేదుగాని, ప్రాపంచిక విషయాల్లో (భౌతిక విషయాల్లో) మనోవాంఛలకు లోనైపోతారనే భయం మాత్రం పీడిస్తోంది.”[1]

ఓ రోజు అర్ధరాత్రి లేచి ఆయన(స) ‘బకీ’ (బకీ ఖనన వాటిక)కు బయలుదేరి వెళ్ళారు. బకీలో ఖననం అయి ఉన్నవారిని మన్నించమని దైవాన్ని ప్రార్థించారు. ఆ సందర్భంలో ఆయన పలికిన పలుకులు ఇవి:

“ఓ సమాధి వాసులారా! మీపై సలాం (శాంతి) ప్రజల పరిస్థితి కంటే ఇప్పుడు మీరున్న పరిస్థితే శుభకరమైనది. మీకు శుభం కలుగుగాక. సంక్షోభాలు కాళరాత్రి తెరలుగా ఒకదాని తరువాత ఒకటి వచ్చి పైనబడు తున్నాయి. వెనుక వచ్చేవాడు ముందు వానికంటే చెడ్డవాడు” అంటూ ఆ ఖనన వాటికలో సమాధి అయినవారికి “మేము కూడా మిమ్మల్ని వచ్చి కలువబోతున్నాం” అనే శుభవార్తనిచ్చారు.

వ్యాధి ప్రారంభ దశ

హిజ్రీ శక సంవత్సరం 11, సఫర్ మాసం 29వ తేదీ సోమవారం నాడు మహాప్రవక్త ముహమ్మద్ (స) ఓ జనాజా వెంట బకీకి వెళ్ళారు. తిరిగి వచ్చేటప్పుడు దారిలోనే ఆయనకు తలనొప్పి ప్రారంభం అయింది. శరీర ఉష్ణోగ్రత, తలపై కట్టిన కట్టుపై నుండి బయటకు వచ్చేటంత తీవ్రమై పోయింది. ఇది ఆయన మరణానికి ప్రారంభ సూచిక. ఆ పరిస్థితిలోనే ఆయన(స) పదకొండు రోజులు నమాజు చేయించారు. వ్యాధి కాలం మొత్తం 13 లేదా 14 రోజులు.

చివరి వారం

మహాప్రవక్త (స) గారి పరిస్థితి రోజురోజుకు క్షీణిస్తూపోతోంది. ఈలోపు ఆయన సతీమణులతో, నేను రేపు ఎక్కడుంటాను? రేపు నేను ఎక్కడ

1. ముత్తఫిఖున్ అలైహ్ - సహీ బుఖారి-2/585

ఉంటాను? అని అడగనారంభించారు. ఇలా ప్రశ్నించడంలో గల ఉద్దేశ్యం ఏదో ప్రవక్త (స)గారి సతీమణులు గ్రహించారు. కాబట్టి వారంతా కలిసి, “తమరెక్కడ ఉండాలనుకుంటే అక్కడ ఉండవచ్చు” అని సమాధాన మిచ్చారు. ఆ తరువాత ఆయన(స), హజ్రత్ ఆయిషా(ర) గారి ఇంటికి వెళ్ళారు. ఆ ఇంటికి వెళ్ళేటప్పుడు హజ్రత్ ఫజ్ల్ బిన్ అబ్బాస్ (ర) మరియు హజ్రత్ అలి బిన్ అబీ తాలిబ్(ర)ల ఆధారంగా నడిచారు. తలపై కట్టు కట్టబడి ఉంది. కాళ్ళు నేలపై ఈడ్చుకుపోతున్నాయి. ఇదే పరిస్థితిలో ఆయన (స) హజ్రత్ ఆయిషా (ర)గారి ఇంట్లోకి ప్రవేశించారు. ప్రవక్త (స) గారి జీవితపు చివరి వారం అక్కడనే గడిచింది.

హజ్రత్ ఆయిషా (ర), ముఅవ్విజాత్ (అల్లాహ్ శరణు వేడే సూరాలు ముఖ్యంగా ఫలక్, నాస్ సూరాలు), మహాప్రవక్త (స)గారి నుండి నేర్చుకొని కంఠస్థం చేసిన దుఆలు పఠించి ఆయనపై ఊదేవారు, శుభం కలగాలనే తలంపుతో ప్రవక్త (స)గారి పవిత్ర హస్తాలనే ఆయన శరీరంపై నిమిరేవారు.

మరణానికి అయిదు రోజుల ముందు

ప్రవక్త (స)గారి మరణానికి అయిదు రోజుల ముందు బుధవారం రోజున ఆయన (స) శరీర ఉష్ణోగ్రత మరింత పెరిగిపోయింది. ఆ కారణంగా ఆయన బాధ బాగా హెచ్చిపోయి అపస్మారక పరిస్థితి ఏర్పడింది. ఆ పరిస్థితిలో ఆయన,“నా శరీరంపై వివిధ బావుల నుండి ఏడు ముష్కీజాల (తోలు సంచి) నీరు తెచ్చి పోయండి. నేను ప్రజల వద్దకు వెళ్ళి వసీయ్యత్ (మరణశాసనం) చేస్తాను” అని కోరారు. దాని కోసం ఆయన్ను ఓ వెడెల్పాటి పాత్రలో కూర్చోబెట్టి ఇక చాలు అన్నంత వరకు ఆయనపై నీరు పోయడం జరిగింది.

అప్పుడుగాని ఆయనకు కొంత ఊరట చేకూరలేదు. మస్జిద్‌లోనికి వెళ్ళారు- తలపై కట్టు అలానే ఉంది - మెంబరుపై కూర్చున్నారు. కూర్చునే ఖుత్బా ఇచ్చారు. ఆయన చుట్టూ సహాబా (ర) గుమిగూడి ఉన్నారు. ఆయన వారిని ఉద్దేశించి ఇలా అన్నారు:

“యూదులు, నసారాల (క్రైస్తవుల)పై అల్లాహ్ శాపం పడుగాక- వారు తమ ప్రవక్తల సమాధుల్ని మస్జిద్‌లుగా (ఆరాధనాలయాలుగా) మార్చారు.” మరో ఉల్లేఖనంలో, “యూదులు మరియు నసారాలపై అల్లాహ్ దెబ్బ

పడుగాక. వారు తమ ప్రవక్తల సమాధుల్ని మస్జిదులుగా చేసుకున్నారు."[2]

ఆయన (స) ఇలా కూడా సెలవిచ్చారు:

"మీరు నా సమాధిని పూజల కోసం ఓ విగ్రహంగా మార్చకండి".[3]

ఆ తరువాత మహాప్రవక్త (స) ఖిసాస్ కోసం సిద్ధపడుతూ, "నేను ఎవరి వీపుపై కొరడాతో కొడితే ఇదిగో నా ఈ వీపు, నన్ను కూడా కొరడాతో కొట్టి బదులు తీర్చుకోవచ్చు. ఎవరి మానమర్యాదలకు భంగం కలిగిస్తే ఆ వ్యక్తి కూడా బదులు తీర్చుకోవాలి" అని పలికారు.

ఆ తరువాత ఆయన మెంబరు నుండి క్రిందికి దిగి వచ్చి జొహ్ర్ నమాజు చేయించారు. ఆ తరువాత తిరిగి మెంబరు పైకి వెళ్ళి తన గురించి ఎవరికైనా పగ ఉంటే తీర్చుకొమ్మని ఇదివరకు అన్నట్లుగానే అన్నారు. ఒక వ్యక్తి లేచి, "దైవప్రవక్తా! మీరు నాకు మూడు దిర్హములు బాకీ ఉన్నారు" అని చెప్పాడు. మహాప్రవక్త (స) ఫజ్ల్ బిన్ అబ్బాస్ (ర)తో, "ఆయనకు ఆ మూడు దిర్హములు చెల్లించండి" అని చెప్పి అన్సారులను గురించి ఇలా వసీయ్యత్ చేశారు.

"నేను మీకు అన్సారులను గురించి వసీయ్యత్ చేస్తున్నాను. ఎందుకంటే వారు నాకు గుండెలాంటివారు. వారు తమ బాధ్యతలను నెరవేర్చారు. కాని వారి హక్కులు మాత్రం మిగిలేపోయాయి. కాబట్టి వారి సత్పురుషుల నుండి గ్రహించండి. వారి దుష్టులను వదిలేయండి." మరో ఉల్లేఖనంలో, "ప్రజలు పెరిగిపోతూనే ఉంటారు. అన్సారులు భోజనంలో ఉప్పులా తగ్గిపోతారు. కాబట్టి మీలో ఏ వ్యక్తి అయితే లాభనష్టాలను చేకూర్చే కార్యాలకు సమర్థుడో, అతను వారి సత్పురుషుల నుండి గ్రహించాలి. వారి దుష్టులను వదిలివేయాలి."[4]

ఆ తరువాత దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ ఓ దాసునికి, ప్రపంచ ఐశ్వర్యాలు, భోగభాగ్యాలు ఒసగడానికి లేదా అల్లాహ్ వద్ద ఉన్నది పొందడానికి అధికారం ఇచ్చాడు. అయితే ఆ దాసుడు అల్లాహ్ వద్ద ఉన్నదాన్నే కోరుకున్నాడు."

2. సహీహ్ బుఖారి-1/62; ముఅత్తా - ఇమామె మాలిక్, పుట. 360.
3. ముఅత్తా - ఇమామె మాలిక్, పుట. 365. *4. సహీహ్ బుఖారి-1/536.*

అబూ సయీద్ ఖుద్రీ (ర) కథనం ప్రకారం, "ఇది విన్న హజ్రత్ అబూ బక్ర్(ర) రోదిస్తూ,"మేము మా తల్లిదండ్రులతో సహా ఆయన(స)కు అర్పించు కున్నాం" అనగా వినేవారికి ఆశ్చర్యం వేసింది. వారు పరస్పరం, "చూడండి ఈ ముసలివాడు! అల్లాహ్ ఓ దాసునికి ప్రపంచ భోగభాగ్యాలు, ఐశ్వర్యాలు లేదా అల్లాహ్ దగ్గర ఉన్నదాన్ని పొందవచ్చునే అధికారం ఇస్తే ఈ వృద్ధుడేమో తన తల్లిదండ్రుల్ని దైవప్రవక్తకు అర్పితం అంటున్నాడేమిటి?" అని అనుకోసాగారు. (కాని కొన్ని రోజులు గడిచిన తరువాత) ఏ దాసునికి అధికారం ఇవ్వబడిందో ఆయన స్వయంగా మహాప్రవక్త ముహమ్మద్ (స) గారే అనే విషయం తెలిసిపోయింది అందరికీ. హజ్రత్ అబూ బక్ర్ (ర) మాలో అందరి కంటే వివేకి."[5]

ఇంకా ఇలా సెలవిచ్చారాయన:

"నాకు అత్యంత ఆప్తుడు అబూ బక్ర్ (ర). ధనం విషయంలో నేను ఆయనకు ఎంతో రుణపడి ఉన్నాను. ఒకవేళ, అల్లాహ్ కాకుండా మరెవరినైనా 'ఖలీల్'గా (మిత్రునిగా) చేసుకోవలసివస్తే, అబూ బక్ర్ (ర)నే ఖలీల్‌గా చేసుకొని ఉండేవాణ్ణి. కాని (ఆయనతో నాకు) ఇస్లామ్ సోదరభావం మరియు ప్రేమ (సంబంధం) ఉంది. మస్జిద్‌లో ఏ ద్వారాన్నీ మిగిల్చి తెరచి ఉంచవద్దు. కాగా దాన్ని తప్పక మూసివేయాలి. ఒక అబూ బక్ర్ (ర) గారి ద్వారం తప్ప."[6]

నాల్గు రోజులకు ముందు

మరణానికి నాల్గు రోజుల ముందు గురువారం రోజున దైవప్రవక్త (స) వ్యాధి బాధతో కొట్టుమిట్టాడుతూ, "మీకు నేను ఓ పత్రం రాసి ఇస్తాను. దాని తరువాత మీరు ఎప్పుడూ మార్గభ్రష్టులు కారు" అన్నారు. ఆ సమయాన ఇంట్లో చాలా మంది ఉన్నారు. హజ్రత్ ఉమర్ (ర) కూడా అక్కడే ఉన్నారు. దైవప్రవక్త (స) గారి పరిస్థితిని చూసి ఆయన వారితో, "చూస్తున్నారుగా ఆయన బాధ. మీ వద్ద దివ్యగ్రంథం ఖుర్‌ఆన్ ఉంది. అల్లాహ్ గ్రంథం మీ కోసం చాలు" అన్నారు. హజ్రత్ ఉమర్(ర) మాటలు విన్న వారు పరస్పరం విభేదించి కయ్యానికి దిగారు. దైవప్రవక్త (స) గారి చేత ఆ పత్రం రాయిద్దాం అని

5. ముత్తఫకున్ అలైహ్: మిష్కాత్-2/546, 554; సహీ బుఖారి-1/516
6. ముత్తఫకున్ అలైహ్-మిష్కాత్-2/546, 554; సహీ బుఖారి-1/516

కొందరంటే, లేదు ఉమర్(ర)గారు చెప్పినట్లే వినుకుందాం అని కొందరు వాదనకు దిగారు. ఇలా పెద్దగా కేకలేసుకోవడం, విభేదించడం చూసి మహాప్రవక్త (స) వారిని అక్కడి నుండి వెళ్ళిపొమ్మని ఆదేశించారు.[7]

ఆ రోజే ఆయన(స) మూడు విషయాలను గురించి వసీయ్యత్ చేశారు. ఒకటి, యూదులు, క్రైస్తవులు మరియు ముష్రిక్‌లను అరేబియా ద్వీపం నుండి వెళ్ళగొట్టడం. రెండు, ప్రతినిధి వర్గాలకు, తాము ఆహ్వానించినట్లుగానే ఆహ్వానించడం. అయితే మూడో వసీయ్యత్ ఏమిటో ఉల్లేఖకుడికి గుర్తులేదు. బహుశా ఈ వసీయ్యత్ దైవగ్రంథం మరియు ప్రవక్త (స)గారి సంప్రదాయాన్ని గట్టిగా పట్టుకొని ఉండే వసీయ్యత్ అయి ఉండవచ్చు. లేదా ఉసామా (ర) సైన్యాన్ని పంపే విషయమో లేదా నమాజును స్థాపించడం మరియు మీకు క్రిందివారు అంటే బానిసల ఎడల సత్ప్రవర్తన కలిగి ఉండే వసీయ్యత్ అయి ఉండవచ్చు.

మహాప్రవక్త (స) వ్యాధి ముదిరిపోయినప్పటికీ, ఆ రోజు వరకు అంటే మరణానికి నాల్గు రోజుల (గురువారం) వరకు అన్ని నమాజులు తామే చేయించేవారు. ఆ రోజు కూడా మగ్రిబ్ నమాజు ఆయనే చేయించారు. ఆ నమాజులో 'వల్ ముర్సలాత్ ఉర్ఫా' అనే సూరాను పఠించారు.[8]

కాని ఇషా నమాజుకు మస్జిద్‌కు వెళ్ళలేని బలహీనత వచ్చేసింది. హజ్రత్ ఆయిషా (ర)గారి కథనం ఇలా ఉంది: "అందరు నమాజు చేశారా?" అని అడగగా, "లేదు దైవప్రవక్తా! మీ రాక కోసం ఎదురు చూస్తున్నారు అని మేమన్నాము."

"నా కోసం పెద్ద పళ్ళెంలో నీరు ఉంచండి" అని ఆదేశించారు. మేము అలా చేయగా ఆయన (స) గుస్ల్ చేశారు. ఆ తరువాత నిలబడ ప్రయత్నించగా స్పృహ తప్పింది. స్పృహలోనికి వచ్చిన తరువాత "నమాజు చేశారా అందరూ?" అని అడిగారు.

"లేదు దైవప్రవక్తా! వారు మీ కోసమే ఎదురు చూస్తున్నారు" అన్నాం మేము. తిరిగి రెండోసారి, మూడోసారి కూడా మొదటిసారి జరిగినట్లే జరిగింది.

7. ముత్తఫకున్ అలైహ్ - సహీ బుఖారి-1/422,429,449; 2/638

8. సహీ బుఖారి-ఉమ్ముల్ ఫజ్ల్ ఉల్లేఖనం: ప్రవక్త వ్యాధి అధ్యాయం-2/637

అదే ఆయన స్థానం చేయడం, తిరిగి స్పృహ కోల్పోవడం లాంటి పరిస్థితి. చివరకు ఆయన (స) అబూ బక్ర్(ర)కు నమాజు చేయించమని కబురు పంపించారు. ఆ తరువాత హజ్రత్ అబూ బక్ర్(ర) గారే నమాజు చేయించారు.[9] ప్రవక్త (స) జీవితంలో ఆయన చేయించిన నమాజుల సంఖ్య మొత్తం 17.

హజ్రత్ ఆయిషా (ర) దైవప్రవక్త (స)తో మూడు నాల్గుసార్లు, ఇమామత్ బాధ్యతను హజ్రత్ అబూ బక్ర్ (ర)కు బదులు మరెవ్వరికైనా ఇవ్వమని చెప్పడం జరిగింది. ఆమె అనుకున్నది, ప్రజలు అబూ బక్ర్ (ర) గురించి అపశకునాలకు లోనుకాకూడదనే. కాని దైవప్రవక్త (స) ప్రతిసారీ ఆమె సలహాలను త్రోసి పుచ్చుతూ, "మీరంతా యూసుఫ్ స్త్రీల లాంటివారు.[10] అబూ బక్ర్ (ర)కు నమాజు చేయించమని ఆదేశించండి" అని చెప్పడం జరిగింది.[11]

ఒకటి లేదా రెండు రోజుల ముందు

శనివారం లేదా ఆదివారం నాడు దైవప్రవక్త (స)గారి వ్యాధి కొంత తగ్గినట్లనిపించింది. ఆయన ఇద్దరు వ్యక్తులను ఆధారంగా చేసుకొని జొహ్ర

9. ముత్తఫకున్ అలైహ్,మిష్కాత్-1/102

10. యూసుఫ్ (అ.స.) విషయంలో ఏ స్త్రీలైతే అజీజెమిస్ర్ (ఈజిప్టు రాజు) భార్యను తూలనాడుతూవచ్చారో అది ప్రత్యక్షంగా అగుపడే దాన్ని గురించే. కాని యూసుఫ్ (అ.స.)ను చూసి వారు తమ వ్రేళ్ళను తెగ కోసుకోవడాన్ని చూస్తే, వారు స్వయంగా లోలోన్నే ఆయన అందానికి బానిసలైపోయి ఉన్నవారే అనే విషయం బహిర్గతమైంది. అంటే నోటితో చెప్పే మాట ఒకటైతే మనసులోని మాట వేరన్న మాట. ఈ పరిస్థితే ఇక్కడ కూడా ఏర్పడింది. పైకి మాత్రం, అబూ బక్ర్ (ర) సున్నిత మనస్కులని, ప్రవక్త (స) గారి స్థానంలో ఆయన నిలబడి నమాజు చేయించేటప్పుడు రోదించడం వలన గ్రంథ పఠనాన్ని సరిగా చేయలేరని చెప్పడం. కాని మనస్సులో మాత్రం, దైవప్రవక్త (స) గారే పరమపదిస్తే ప్రజలు అబూ బక్ర్(ర)ను అపశకునంగా తలుస్తారని, ఇదే భావన వారి మనస్సుల్లో వ్రేళ్ళూను కుంటుందని భావించడం. హజ్రత్ ఆయిషా (ర)గారి విన్నపంలో ఇతర భార్యా మణులు కూడా చేరి ఉండడం మూలంగా, "మీరంతా యూసుఫ్ స్త్రీల లాంటివారు" (అంటే మీ మనస్సులోని మాట ఒకటయితే మీరు పైకి చెప్పేది మరొకటి) అని సెలవిచ్చారు.

11. సహీహ్ బుఖారి-1/99

నమాజు కోసం మస్జిద్‌లోనికి వచ్చారు. అప్పుడు అబూ బక్ర్ (ర) సహాబా(ర)కు నమాజు చేయిస్తున్నారు. ప్రవక్త (స)ను చూసి ఆయన వెనక్కు జరగనారంభించారు. వెనక్కు రావద్దని సైగతో ఆయన్ను వారించారు. తమను తీసుకొని వచ్చినవారితో నన్ను ఆయన ప్రక్కన కూర్చోబెట్టండి అని చెప్పగా, వారు ప్రవక్త (స)ను అబూ బక్ర్(ర)కు ఎడమ ప్రక్కగా కూర్చోబెట్టారు. ఆ తరువాత అబూ బక్ర్ (ర) దైవప్రవక్త (స) గారి నాయకత్వంలో నమాజు చేశారు. సహాబా (ర)కు ప్రవక్త చెప్పిన తక్బీర్‌ను వినిపించనారంభించారు.[12]

ఒక రోజు ముందు

మరణానికి ఒక రోజు ముందు ఆదివారంనాడు దైవప్రవక్త (స) తన దగ్గర ఉన్న బానిసలందరిని స్వతంత్రులుగా చేశారు. దగ్గరున్న ఏడు దీనారాలను దానం చేశారు. తన ఆయుధాలను ముస్లిములకు ఇచ్చేశారు. ఆ రాత్రి దీపం వెలిగించడానికి హజ్రత్ ఆయిషా (ర) తన పొరుగున ఉన్న స్త్రీ దగ్గర నుండి నూనెను అరువుగా తీసుకున్నారు. ఆయన జిరహ్ (కవచం) ఓ యూదుని వద్ద ముప్పై సాఅల ఓట్ల (అంటే 75 కిలోల ఓట్లు) క్రింద తాకట్టులో ఉంది.

జీవితపు చివరి రోజు

హజ్రత్ అనస్ (ర) గారి ఉల్లేఖనం ఇది: "సోమవారం రోజు ముస్లిములంతా ఫజ్ర్ నమాజ్‌లో నిలబడి ఉన్నారు. అబూ బక్ర్(ర) వారికి నమాజు చేయిస్తున్నారు. హఠాత్తుగా మహాప్రవక్త (స) హజ్రత్ ఆయిషా (ర)గారి గుమ్మంపై వేసి ఉన్న పరదాను తొలగించి, బారులు తీరి నిలబడి ఉన్న సహాబా (ర)పై ఓ దృష్టిని సారించి మందహాసం చేశారు. ఇటు అబూ బక్ర్(ర) వెనుకకు జరిగి వరుసలోనికి వెళ్ళే ప్రయత్నం చేశారు. ఆయన (ర), మహాప్రవక్త (స) నమాజుకు వస్తున్నారేమో అని అనుకున్నారేమో. (దైవప్రవక్త (స) హఠాత్తుగా ప్రత్యక్షం అయినందున) ముస్లిములు ఆనందం పట్టలేక నమాజును కూడా భంగపరిచేటంత పని చేస్తారనిపించింది (అంటే ఆయన్ను పరామర్శించడానికి నమాజును భంగపరుస్తారని అనిపించింది అని అర్థం) కాని మహాప్రవక్త (స)

12. సహీహ్ బుఖారి-1/98,99.

తమ చేత్తో మీ నమాజును పూర్తి చేసుకోండని సైగ చేసి తిరిగి తన హుజ్రా గుమ్మంపై పరదా పడవేసి లోనికి వెళ్ళిపోయారు.[13]

ఆ తరువాత అంతిమ దైవప్రవక్త (స)కు మరో నమాజు చేసే సమయమే చిక్కలేదు.

ప్రొద్దు ఎక్కిన తరువాత (చాష్త సమయం) ఆయన (స) తమ ముద్దుల పట్టి ఫాతిమా (ర)ను పిలువనంపారు. ఆమెతో గుసగుసలాడగా ఆమె ఏడ్వనారంభించారు. తిరిగి ఆమెను పిలిచి చెవిలో ఏదో చెప్పగా ఆమె (ర) నవ్వనారంభించారు. హజ్రత్ ఆయిషా (ర)గారి కథనం ప్రకారం, మేము ఆమెను పిలిచి విషయం ఏమిటి? అని అడగగా ఆమె ఇలా చెప్పారు అని ఉంది: "మొదటిసారి దైవప్రవక్త (స) నాతో గుసగుసలాడి చెప్పింది ఆయన (స) ఈ వ్యాధితోనే చనిపోతారనే విషయం. దానికి నేను దుఃఖం ఆపుకోలేక ఏడ్చాను. తదుపరి పిలిచి నా చెవిలో, ఆయన(స)గారి కుటుంబంలో మొట్ట మొదటగా వచ్చి కలిసేదాన్ని నేనే అని చెప్పగా ఆనందం పట్టలేక నవ్వాను" అన్నారు.[14]

మహాప్రవక్త (స) హజ్రత్ ఫాతిమా (ర)కు, "నీవు ప్రపంచ స్త్రీలకు సయ్యిదా (నాయకురాలు)వి" అనే శుభవార్త కూడా నిచ్చారు.[15]

ఆ సమయాన మహాప్రవక్త (స) తీవ్రమైన బాధకు గురియై ఉన్నారు. ఆ పరిస్థితిని చూసి హజ్రత్ ఫాతిమా (ర), అయ్యో! నాన్నగారి బాధ! అని తల్లడిల్లిపోయారు. అది విన్న దైవప్రవక్త (స) ఆమెతో, "అమ్మా! నీ తండ్రికి ఈ రోజు తరువాత మరే బాధ ఉండదు" అని సెలవిచ్చారు.[16]

దైవప్రవక్త (స) తమ ముద్దుల మనుమలు హజ్రత్ హసన్ మరియు హజ్రత్ హుసైన్ (ర)లను పిలిపించి వారిని ముద్దాడారు. వారి ఎడల మేలుగా

13. సహీహ్ బుఖారి - ప్రవక్త వ్యాధి అధ్యాయం-2/240.
14. సహీహ్ బుఖారి -2/638.
15. కొన్ని ఉల్లేఖనాల్లో ఈ శుభవార్త అందించిన సంఘటన ఆయన (స) జీవితపు తుది రోజు జరిగింది కాదు, చివరి వారంలో జరిగిన సంఘటన అని ఉంది. చూడండి, రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/282.
16. సహీహ్ బుఖారి-2/641.

ప్రవర్తించమని వసీయ్యత్ చేశారు. తమ సతీమణులను పిలిచి వారికి హిత బోధగావించారు.

ఇటు క్షణక్షణానికి బాధ పెరుగుతూనేపోతోంది. ఖైబర్‌లో ఆయన(స)కు తినిపించబడిన విషప్రభావం కూడా బయటపడింది. మహాప్రవక్త (స) హజ్రత్ ఆయిషా (ర)తో, "ఓ ఆయిషా (ర)! ఖైబర్‌లో ఏ ఆహారాన్నయితే భుజించానో దాని బాధ ఇప్పుడు అనుభవిస్తున్నాను. ఆ విషప్రభావం వల్ల నా ప్రాణం తెగిపోతుందని అనిపిస్తోంది" అని చెప్పారు.[17]

సహాబా (ర)కు వసీయ్యత్ చేస్తూ, "అస్సలాత్, అస్సలాత్ వమా మలకత్ అయి మానుకుం" (నమాజు, నమాజు. మీ అధీనంలో ఉన్న బానిసలు) అంటూ ఈ పదాలను పదే పదే వల్లించారు.[18]

తుది శ్వాస

ఆ తరువాత తుది శ్వాసలు ఆరంభమయ్యాయి. హజ్రత్ ఆయిషా (ర) ఆయన్ను తనపై వాల్చుకొని ఆధారంగా కూర్చున్నారు. ఆమెగారి కథనం ఇలా ఉంది: "నాపై అల్లాహ్ కారుణ్యాలలో ఓ కారుణ్యం ఏదంటే మహాప్రవక్త (స) నా ఇంట, నా వంతు రోజున, నా వక్షస్థలంపై తలవాల్చి పరమపదించడం. ఆయన (స) మరణ సమయాన అల్లాహ్ నా ఉమ్మిని ఆయన ఉమ్మితో కలిపాడు. జరిగిందేమిటంటే, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బక్ర్ (ర) ఆయన వద్దకు ఓ మిస్వాక్ (పళ్ళ పుల్ల)తో సహా వచ్చారు. అప్పుడు నేను దైవప్రవక్త (స)కు ఆధారంగా కూర్చుని ఉన్నాను. ఆయన (స) ఆ మిస్వాక్ వైపు చూడడం గమనించాను. ఆ మిస్వాక్‌తో పళ్ళను తోముకోవాలని అనుకుంటున్నారని గమనించి, "మీ కోసం దీన్ని తీసుకోనా?" అని అడిగాను. ఆయన(స) అవును అన్నట్లు తల పంకించారు. నేను ఆ మిస్వాక్ పుల్లను తీసుకొని ఆయనకు ఇవ్వగా అది నమలడానికి వీలులేనంత గట్టిగా ఉంది. దాన్ని మెత్తగా చేసి ఇవ్వనా? అని అడగగా ఆయన అవును అన్నట్లు తల ఊపారు. నేను ఆ మిస్వాక్‌ను నమిలి మెత్తగా చేసి ఇచ్చాను. దైవప్రవక్త (స) దానితో తనవితీరా దంతధావనం చేశారు. ఆయన ముందు ఓ పాత్రలో నీళ్ళున్నాయి. ఆయన

17. సహీ బుఖారి-2/637.

18. సహీ బుఖారి-2/637.

తన రెండు చేతుల్ని ఆ పాత్రలో ముంచి తన ముఖంపై జల్లుకొని తుడుచుకో నారంభించారు. అలా తుడుచుకుంటూనే "లా ఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప మరే పూజ్యుడు లేడు), "మరణంలో యాతన ఉంది" అని పలుకనారం భించారు.[19]

మిస్వాక్ చేయడం పూర్తికాగానే ఆయన తన చేతిని లేదా తన చూపుడు వ్రేలిని పైకి లేపారు. చూపు ఇంటిపైకప్పుపై నిలిచింది. రెండు పెదాలు ఏదో చెబుతున్నట్లుగా కదిలాయి. హజ్రత్ ఆయిషా(ర) ఆ పలుకులేమిటో విందామని చెవిని ఆయన దగ్గరకు చేర్చారు. అప్పుడు మహాప్రవక్త (స) చెప్పిన తుది పలుకులు ఇలా ఉన్నాయి.

ఓ అల్లాహ్! ఏ ప్రవక్తలు, సిద్దీఖులు (సత్యసంధులు), ఏ షుహదా (అమరగతినొందిన వారు), మరే సాలిహీన్ (సత్పురుషులు) లను నీవు బహూకరించావో అలాసే నాకు కూడా బహూకరించు. ఓ ప్రభూ! నాకు నీ మన్నింపును ప్రసాదించు, నన్ను కరుణించు. నన్ను నీ ఆప్తుల్లో చేర్చుకో. ఓ అల్లాహ్! ఓ రఫీకెఅలా! (పరమ ఆప్తుడా!)"[20]

ఈ చివరి పదం "ఓ రఫీకె ఆలా" (ఓ పరమ ఆప్తుడా) అనే పదం మూడుమార్లు వల్లించారు. అప్పుడే ఆయన పైకెత్తిన చెయ్యి క్రిందికి వాలిపోయింది. ఆయన (స) రఫీకె ఆలాను కలుసుకున్నారు.

"ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్"

ఈ సంఘటన హిజ్రీ శకం పదకొండవ సంవత్సరం, రబీఉల్ అవ్వల్ నెల పన్నెండవ తేదీ సోమవారం నాడు పొద్దు బాగా ఎక్కి ఎండ ముదిరిన తరువాత సంభవించింది. అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) వయస్సు అరవై మూడు సంవత్సరాల నాల్గు రోజులు.

శోక సముద్రంలో మునిగిపోయిన సహాబా (ర)

హృదయాలను గాయపరచే ఈ వార్త వెంటనే దావానలంలా వ్యాపించి పోయింది. మదీనావాసులపై దుఃఖ మేఘాలు అలుముకున్నాయి. ఎటు

19. సహీహ్ బుఖారి-2/640.

20. సహీహ్ బుఖారి, దైవప్రవక్త (స) వ్యాధి అధ్యాయం మరియు చివరి పలుకులు-3/638-641.

చూసినా అంధకారమే కానవస్తోంది వారికి. హజ్రత్ అనస్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది:

"మహాప్రవక్త (స) మా వద్దకు (హిజ్రత్ చేసి) వచ్చిన ఆ మహోజ్వలమైన రోజును నేను మరెప్పుడూ చూడలేదు. అలాగే, అంతిమ దైవప్రవక్త (స) ఏ రోజు అయితే పరమపదించారో అలాంటి చెడ్డది మరియు అంధకార బంధుర మైనది అయిన రోజును కూడా నేనెప్పుడూ చూడలేదు."[21]

దైవప్రవక్త (స) మరణించిన తరువాత హజ్రత్ ఫాతిమా (ర) తమ దుఃఖాన్ని ఆపుకోలేక, "ప్రభువు పిలుపును శిరసావహించిన ఓ నా తండ్రీ! ఫిర్‌దౌస్ అనే స్వర్గంలో స్థానం పొందిన నాన్నగారు!! మీ మరణ వార్తను జిబ్రీల్ (అ.స.)కు తెలియజేస్తాము"[22] అని చెబుతూ విలపించనారంభించారు.

హజ్రత్ ఉమర్ (ర) గారి తీరు

మరణ వార్త వినగానే హజ్రత్ ఉమర్ (ర) గారు తమ వివేకాన్ని పోగొట్టు కున్నారు. ఆయన నిలబడి,"కొందరు మునాఫిక్‌లు దైవప్రవక్త(స) మరణిం చారని అనుకుంటున్నారేమో! హజ్రత్ మూసా (అ.స.), తన జాతిని వదిలి నలభై రోజులు మాయమై తిరిగి వచ్చినట్లుగా వెళ్ళిపోయారు. ఆయన తిరిగి వచ్చేముందు ఆయన జాతి వారు చనిపోయారనే అనుకున్నారు. నిజం చెప్పాలంటే దైవప్రవక్త (స) పరమపదించలేదు.

దైవసాక్షి! మహాప్రవక్త (స) మళ్ళీ తిరిగి వస్తారు. ఎవరైతే ఆయన చనిపోయారని భావిస్తున్నారో వారి కాళ్ళు చేతులు నరికేస్తారు జాగ్రత్త"[23] అని హెచ్చరించనారంభించారు.

హజ్రత్ అబూ బక్ర్ (ర) గారి తీరు

ఈ వార్త వినగానే హజ్రత్ అబూ బక్ర్ (ర) 'సక్'లోని తమ ఇంటి నుండి గుర్రమెక్కి అక్కడకు వచ్చారు. మస్జిద్‌లో ప్రవేశించి ఎవ్వరినీ పలకరించకుండా నేరుగా హజ్రత్ ఆయిషా (ర)గారి దగ్గరకు వెళ్ళారు. ఆ

21. దారమి, మిష్కాత్ - 2/547. 22. సహీహ్ బుఖారి-2/641.
23. ఇబ్నె హిషామ్-2/655.

తరువాత దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళారు. ఆయన భౌతిక కాయం ఓ చారలుగల యమనీ దుప్పటితో కప్పబడి ఉంది.

ముఖంపై నుండి ఆ దుప్పటిని తొలగించి ముద్దుపెట్టుకొని ఏడ్చారు.

"ప్రవక్తా! నా తల్లిదండ్రులు మీపై అర్పితం. అల్లాహ్ తమకు రెండు మరణాలను ఇవ్వడు. మీకు రాసి ఉన్న మరణం మీకు వచ్చేసింది" అని పలికారు.

ఆ తరువాత ఆయన బయటకు వచ్చారు. ఆ సమయంలోనూ హజ్రత్ ఉమర్(ర) ప్రజలతో అలాగే మాట్లాడుతున్నారు. ఆయన్ను చూసి, "ఉమర్ కూర్చో" అని చెప్పగా హజ్రత్ ఉమర్(ర) ససేమిరా ఒప్పుకోలేదు. సహాబా (ర) అంతా ఉమర్ (ర)ను వదలి అబూ బక్ర్ (ర) చుట్టూ గుమిగూడారు. అప్పుడు హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇలా అన్నారు:

"మీలో ఎవరైనా ముహమ్మద్ (స)ను పూజించేవారుంటే వారికి తెలిసిపోవాలి ముహమ్మద్(స) మరణించారని. అలాగే మీలో ఎవరైతే అల్లాహ్‌ను పూజిస్తున్నారో వారు, తప్పకుండా అల్లాహ్ బ్రతికి ఉన్నాడన్న విషయాన్ని తెలుసుకోవాలి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَمَا مُحَمَّدٌ إِلَّا رَسُولٌ ۚ قَدْ خَلَتْ مِنْ قَبْلِهِ الرُّسُلُ ۚ أَفَإِنْ مَاتَ
أَوْ قُتِلَ انْقَلَبْتُمْ عَلَىٰ أَعْقَابِكُمْ ۚ وَمَنْ يَنْقَلِبْ عَلَىٰ عَقِبَيْهِ فَلَنْ
يَضُرَّ اللَّهَ شَيْئًا ۗ وَسَيَجْزِي اللَّهُ الشَّاكِرِينَ

"ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. అతనికి పూర్వం ఇంకా ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు ఒకవేళ అతను మరణిస్తే లేక హత్య చేయబడితే మీరు వెనుకంజవేసి మరలిపోతారా? జ్ఞాపకం ఉంచుకోండి, మరలిపోయేవాడు అల్లాహ్‌కు ఏమాత్రం నష్టం కలిగించలేడు. కాని అల్లాహ్‌కు కృతజ్ఞత చూపే దాసులుగా జీవించేవారిని ఆయన తగు విధంగా బహూకరిస్తాడు." (3 : 144)

అప్పటి వరకు శోకపరితప్త హృదయాలతో ఎటూ పాలుపోకుండా

ఉన్న సహాబా (ర)కు, హజ్రత్ అబూ బక్ర్(ర) గారి ఈ ప్రసంగం విని నిజంగానే దైవప్రవక్త (స) పరమపదించారనే నమ్మకం కుదిరింది.

హజ్రత్ అబ్బాస్(ర) ఈ సన్నివేశాన్ని ఆయన మాటల్లో ఇలా వివరిస్తున్నారు:

"దైవసాక్షి! ప్రజలకు ఈ ఆయత్ అవతరించిందన్నదే తెలియదన్నట్లుగా ఉంది అప్పుడు. చివరికి హజ్రత్ అబూ బక్ర్ (ర) ఈ ఆయత్‌ను పఠించగానే ప్రజల దృష్టి దాని వైపునకు మరలింది. ఎవరి నోట విన్నా ఈ ఆయత్‌నే పఠిస్తున్నారు."

హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (ర), హజ్రత్ ఉమర్(ర) ఇలా చెబుతూ ఉండగా నేను విన్నానని తెలిపారు.

"దైవసాక్షి! అబూ బక్ర్(ర) ఈ ఆయత్‌ను పఠించగా విన్నంతనే నేను, మట్టి కొట్టుకుపోయానా అన్నట్లనిపించింది (లేదా నా నడ్డి విరిగినట్ల నిపించింది). నా కాళ్ళు నన్ను పైకి లేవనీయలేదు. అలా కూర్చుని ఉన్నవాడినల్లా ఆ ఆయత్ విని దైవప్రవక్త(స) నిజంగానే మరణించారని తెలిసి అక్కడనే కుప్పకూలి పడిపోయాను."[24]

శవ సంస్కారాలు (స్నాన ఖననాలు)

ఇటు మహాప్రవక్త (స)ను ఖననం చేయనేలేదు. అటు ఆయన (స) నాయకత్వ బాధ్యత విషయంలో మత భేదాలు తలెత్తాయి. 'సకీఫా బనీ సాయిదా' లో ముహాజిర్లు మరియు అన్సారుల నడుమ అభిప్రాయభేదం ఏర్పడి వారు వాగ్వివాదాలకు దిగారు. చివరకు ఏకాభిప్రాయంతో హజ్రత్ అబూ బక్ర్ (ర)గారే ఆయన (స) ప్రతినిధిగా ఖలీఫా కావాలనే నిర్ణయానికి వచ్చారంతా. ఈ వాదోపవాదాల నడుమ సోమవారం రోజంతా గడిచి పోయింది. ఆ రాత్రి గడిచి తెల్లవారిపోయింది. ఈ రోజు మంగళవారం. అప్పటి వరకు మహాప్రవక్త (స) భౌతికకాయం చారల అంచుగల ఓ యమనీ దుప్పటితోనే కప్పబడి ఆయన పడక పైన్నే ఉంది. ఇంటివారు తలుపు మూసేసి బయట నుండి గడియ పెట్టేశారు.

24. సహీహ్ బుఖారి-2/640,641

మంగళవారం రోజున దైవప్రవక్త (స)కు ఆయన ధరించి ఉన్న దుస్తులతోనే 'గుస్ల్' ఇవ్వడం జరిగింది. గుస్ల్ ఇచ్చే వారిలో (స్నానం చేయించినవారిలో) హజ్రత్ అబ్బాస్, హజ్రత్ అలి, హజ్రత్ అబ్బాస్‌గారి ఇద్దరు కుమారులు ఫజ్ల్ మరియు ఖష్మ్, మహాప్రవక్త (స) స్వతంత్రులుగావించిన బానిస షక్రాన్, హజ్రత్ ఉసామా బిన్ జైద్ మరియు అవస్ బిన్ కౌలీ (ర)లు ఉన్నారు. హజ్రత్ అబ్బాస్, ఫజ్ల్, ఖష్మ్‌లు ఆయన (స) భౌతిక కాయాన్ని ప్రక్కలకు దొర్లిస్తూ ఉండగా ఉసామా మరియు షక్రాన్‌లు పై నుండి నీరు పోస్తున్నారు. హజ్రత్ అలి (ర) ఆయనకు గుస్ల్ ఇచ్చారు. హజ్రత్ అవస్ (ర) దైవప్రవక్త (స) భౌతిక కాయాన్ని తన వక్షస్థలంపై ఆనించుకొని ఉన్నారు.

ఆ తరువాత ఆయన్ను మూడు తెల్లటి యమనీ దుప్పట్లతో 'కఫన్' ఇచ్చారు. వాటిలో చొక్కా మరియు పగ్డి (తలపాగా) ఏదీ లేదు.[25] కేవలం ఆ దుప్పట్లతోనే ఆయన భౌతిక కాయాన్ని చుట్టివేశారు.

దైవప్రవక్త(స)ను ఎక్కడ ఖననం చేయాలి అన్న విషయంలో సహాబా(ర)ల సలహాలు రకరకాలుగా ఉన్నాయి. అయితే హజ్రత్ అబూ బక్ర్(ర) మాత్రం ఆ విషయాన్ని ఇలా తేల్చేశారు.

"నేను దైవప్రవక్త (స)ను, ఏ ప్రవక్తనైనా ఆయన ఖననం అయిన ప్రదేశం నుండే లేపడం జరిగింది (అంటే ఏ ప్రవక్త అయినా తాను చనిపోయిన ప్రదేశంలోనే ఖననం చేయబడ్డారు అని అర్థం.) అని చెబుతూ ఉండగా విన్నా"నని చెప్పారు. ఈ తీర్పు తరువాత హజ్రత్ అబూ తల్హా (ర) ఆయన(స) ఏ పడకపై పరమపదించారో దాన్ని అక్కడ నుండి తొలగించారు. ఆ ప్రదేశం క్రిందనే గోరి త్రవ్వడం జరిగింది. ఆ గోరి 'లహద్' గోరి. అంటే 'బగ్లీ' (క్రింది భాగంలో ప్రక్కగా శవం పట్టేటంత ప్రదేశాన్ని త్రవ్వి తీసిన గోరి అని అర్థం.)

ఆ తరువాత వంతులవారీగా పదేసి మంది సహాబాలు హుజ్రా (గది)లోనికి వెళ్ళి జనాజా నమాజు చేసి బయటకు రానారంభించారు. నమాజు చేయించడానికి ఏ ఇమామ్ లేడు. అందరికంటే ముందు ఆయన ఖాన్వాదా (కుటుంబం బనూ హాషిమ్) నమాజ్ చేశారు. పిదప ముహాజిర్లు, తరువాత

25. సహీ బుఖారి-1/169; సహీహ్ ముస్లిమ్-1/306

అన్సారులు, ఆ తరువాత స్త్రీలు అందరికంటే వెనుకగా పిల్లలు నమాజె జనాజా చేశారు.

నమాజె జనాజా చేయడంలో మంగళవారం రోజంతా గడిచిపోయింది. బుధవారం రాత్రి (అంటే మరుసటి రోజు బుధవారం అన్నమాట) వచ్చేసింది. ఆ రాత్రే ఆయన (స) గారి భౌతిక కాయాన్ని మట్టిలో కలిపివేశారు. హజ్రత్ ఆయిషా (ర)గారు, "దైవప్రవక్త (స) ఖననం ఎప్పుడు జరిగిందో మాకు తెలియనే లేదు. బుధ వారం మధ్యభాగంలో పారల చప్పుళ్ళు మాత్రం మాకు వినిపించాయి"[26] అని అన్నారు.

26. *ముక్తసరుస్సీరతుర్రసూల్-షేక్ అబ్దుల్లాహ్, పుట. 471. మరణ సంఘటన వివరాల కోసం చూడండి: సహీహ్ బుఖారి, బాబుల్ మర్జున్నబీ, దానికి అనుబంధంగా ఉన్న ఫత్‌హుల్ బారి, సహీహ్ ముస్లిం మిష్కాతుల్ మసాబీహ్ అధ్యాయాలు; ఇబ్నె హిషామ్ - 2/649-665; తల్‌ఖీహ్ ఫహూమ్ అహ్లుల్ అస్ర్- పుట. 38,39; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/277-286. సమయాలను రహ్మతుల్ లిల్ ఆలమీన్ నుండి సేకరించడం జరిగింది.*

మహాప్రవక్త (స) కుటుంబం

1. హిజ్రత్‌కు పూర్వం మక్కాలో దైవప్రవక్త (స) కుటుంబమంతా ఆయన సతీమణి ఖదీజా (ర) ఒక్కరే. ఆయన (స) వివాహం ఆయన ఇరవై అయిదవ ఏట జరిగింది. అప్పుడు హజ్రత్ ఖదీజా (ర)గారి వయస్సు నలభై ఏండ్లు. ఈమె ఆయనకు మొదటి భార్య. ఆమె బ్రతికి ఉండగా దైవప్రవక్త (స) మరే వివాహం చేసుకోలేదు. ఆయన(స) సంతానం ఒక్క హజ్రత్ ఇబ్రాహీం తప్ప కుమారులు, కుమార్తెలందరూ ఆమె గర్భాన జన్మించినవారే. కుమారుల్లో ఏ ఒక్కరూ జీవించి ఉండలేదు. అయితే కుమార్తెలందరూ సజీవంగానే ఉండినారు. వారి పేర్లు ఇవి:

1. హజ్రత్ జైనబ్ (ర)
2. హజ్రత్ రుఖయ్యా (ర)
3. హజ్రత్ ఉమ్మె కుల్సూమ్ (ర) మరియు
4. హజ్రత్ ఫాతిమా (ర)లు.

హజ్రత్ జైనబ్ (ర) పెళ్ళి హిజ్రత్‌కు పూర్వం ఆమె మేనత్త కుమారుడు హజ్రత్ అబుల్ ఆస్ బిన్ రబీతో జరిగింది. హజ్రత్ ఉస్మాన్ (ర)తో హజ్రత్ రుఖయ్యా (ర) వివాహం జరిగింది. ఆమె చనిపోయిన తరువాత దైవప్రవక్త(స) హజ్రత్ ఉమ్మె కుల్సూమ్ (ర) వివాహం తిరిగి ఆయనతోనే చేశారు. హజ్రత్ ఫాతిమా (ర) వివాహం, బద్ర్ యుద్ధం మరియు ఉహద్ యుద్ధం మధ్య కాలంలో హజ్రత్ అలీ (ర)తో జరిగింది. ఆమె గర్భాన హజ్రత్ హసన్(ర), హజ్రత్ హుసైన్ (ర)లు (కుమారులు) హజ్రత్ జైనబ్, ఉమ్మె కుల్సూమ్‌లు (కుమార్తెలు) జన్మించారు.

దైవప్రవక్త (స) తన సమాజానికి భిన్నంగా, ఓ ప్రత్యేకతను సంతరించుకొని ఉన్నారు. వివిధ అవసరాల దృష్ట్యా ఆయన నల్గురికంటే ఎక్కువ

మంది భార్యలను వివాహం చేసుకొనే రాయితీ దైవం ఆయనకు ఒసిగాడన్న విషయం విదితమే. కాబట్టి ఆయన (స) ఏ స్త్రీలనైతే వివాహ మాడారో వారు మొత్తం పదకొండుగురు. వారిలో తొమ్మండుగురు ఆయన పరమపదిం చేటప్పుడు సజీవంగానే ఉన్నారు. ఇద్దరు ఆయన (స) జీవిత కాలంలోనే మరణించారు. (అంటే హజ్రత్ ఖదీజా (ర) మరియు ఉమ్ముల్ మసాకీన్ హజ్రత్ జైనబ్ బిన్తె కజీమా -ర-లు) వీరేకాకుండా మరిద్దరు ఉన్నా రనేది, వారితో ఆయన నికాహ్ జరిగిందా లేదా అనే విషయంలో అభిప్రాయ భేదం ఉంది. కాని వారు ఆయన (స)తో రాత్రి గడపలేదనేది ఏకాభిప్రాయంతో ఒప్పుకున్న విషయం. ఈ క్రింద మేము ప్రవక్త (స) సతీమణుల పేర్లు, వారి వివరాలు క్రమపద్ధతిలో సంగ్రహంగా మీ ముందుంచుతున్నాం.

2. హజ్రత్ సౌదా బిన్తె జమ్అ (ర)

ఈమెగారితో దైవప్రవక్త (స) వివాహం, హజ్రత్ ఖదీజా (ర) మరణా నంతరం, ప్రవక్త అయిన పదవ సంవత్సరం షవ్వాల్ నెలలో జరిగింది. హజ్రత్ సౌదా (ర) అంతకు ముందు తమ పినతండ్రి కుమారుడు సక్రాన్ వివాహ బంధంలో ఉంటూ ఉండేవారు. సక్రాన్ మరణించడం వల్ల ఆమె అప్పుడు వితంతువుగా ఉన్నారు.

3. హజ్రత్ ఆయిషా సిద్దీకా బిన్తె అబూ బక్ర్(ర)

దైవప్రవక్త (స), ఆమెను ప్రవక్త పదవి లభించిన పదకొండవ యేట షవ్వాల్ నెలలో వివాహమాడారు. అంటే హజ్రత్ సౌదా (ర)ను వివాహం చేసుకున్న ఒక సంవత్సరం తరువాత, హిజ్రత్ కంటే రెండు సంవత్సరాల అయిదు నెలలకు ముందు అన్నమాట. అప్పుడు ఆమె వయస్సు ఆరు సంవత్సరాలు. హిజ్రత్ తరువాత ఏడు నెలలకు షవ్వాల్ నెల, హిజ్రీ శకం ఒకటిలో ఆమెను దైవప్రవక్త (స) వద్దకు పంపించడం జరిగింది. అప్పుడు ఆమె వయస్సు తొమ్మిది సంవత్సరాలు, ఆమె అప్పుడు కన్య. ఆమెను తప్ప మరే కన్యను మహాప్రవక్త (స) వివాహం చేసుకోలేదు. హజ్రత్ ఆయిషా (ర) దైవప్రవక్త (స)కు అతిప్రియమైన సతీమణి. సమాజంలోని స్త్రీలందరికంటే ఆమె ఒక్కరే ధర్మజ్ఞానం కలిగిన విద్యావంతురాలు.

4. హజ్రత్ హఫ్సా బిన్తె ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)

ఈమె మొదటి భర్త కనీస్ బిన్ హుజాఫా సహమీ (ర). ఈయన బద్ర్ మరియు ఉహద్ యుద్ధాల మధ్యకాలంలో చనిపోవడం వలన హజ్రత్ హఫ్సా (ర) వితంతువు అయ్యారు. ఆ తరువాత మహాప్రవక్త (స) ఆమెను వివాహమాడారు. ఇది హిజ్రీ శకం మూడవ సంవత్సరంనాటి మాట.

5. హజ్రత్ జైనబ్ బిన్తె కజీమా (ర)

ఈమె బనూ హిలాల్ బిన్ ఆమిర్ సఅసఅ తెగవారు. నిరుపేదలపై ఆమె చూపే ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాల కారణంగా ఆమె ఉమ్ముల్ మసాకీన్ (నిరుపేదల తల్లి)గా ప్రఖ్యాతిగాంచారు. ఈమె హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ హజష్‌కు భార్య. ఆయన ఉహద్ యుద్ధంలో అమరగతి నొందిన తరువాత దైవప్రవక్త (స) ఆమెను వివాహమాడారు. కేవలం ఎనిమిది నెలలు మాత్రమే భార్యగా ఉండి మరణించారు.

6. హజ్రత్ ఉమ్మె సల్మా బిన్తె అబీ ఉమయ్యా (ర)

ఈమె క్రితం అబూ సల్మాకు భార్యగా ఉండేవారు. హి.శ.4, జమా దిల్ ఆఖిరా నెలలో హజ్రత్ అబూ సల్మా(ర) చనిపోయిన తరువాత అదే సంవత్సరం షవ్వాల్ నెలలో మహాప్రవక్త (స) ఈమెను వివాహమాడారు.

7. జైనబ్ బిన్తె హజష్ బిన్ రియాబ్ (ర)

ఈమె బనూ అసద్ బిన్ కజీమా కుటుంబానికి సంబంధించిన వారు. దైవప్రవక్త (స) కు మేనత్త కూతురు కూడా. ఈమె వివాహం మొదట జైద్ బిన్ హారిసా (ర)తో జరిగింది. ఈయన్ను దైవప్రవక్త (స) గారి కుమారుడుగా తలచడం జరిగేది. కాని హజ్రత్ జైద్ (ర)తో ఆమెకు పొసగలేదు. జైద్(ర) ఆమెకు తలాక్ ఇచ్చారు. ఇద్దత్ గడువు పూర్తి అయిన తరువాత దైవప్రవక్త (స)ను సంబోధిస్తూ దివ్యఖుర్ఆన్‌లో ఈ ఆయత్ అవతరించింది:

فَلَمَّا قَضٰى زَيْدٌ مِّنْهَا وَطَرًا زَوَّجْنٰكَهَا

"జైద్ ఆమెతో తన అవసరం పూర్తి చేసుకున్న తరువాత మేము ఆమెను ఆయన (స) భార్యగా చేశాము."

ఆయనకు సంబంధించే అహ్జాబ్ సూరాలో మరిన్ని ఆయత్‌లు అవతరించాయి. ఆ ఆయత్‌లలో దత్తపుత్రునికి సంబంధించి ఖచ్చితమైన తీర్పు ఇవ్వడం జరిగింది- వివరాలు ముందు రాబోతున్నాయి- హజ్రత్ జైనబ్ (ర)తో దైవప్రవక్త (స) వివాహం హి.శ. 5, జీకాదా మాసంలో లేదా అంతకంటే కొంచెం ముందుగా జరిగింది.

8. జువైరియా బిన్తె హారిస్ (ర)

ఈమె తండ్రిగారు ఖుజాఅ తెగకు చెందిన బనుల్ ముస్తలిక్ సర్దారు. హజ్రత్ జువైరియా (ర) బనూ ముస్తలిక్ ఖైదీల వెంట బందీ అయివచ్చినవారు. బందీల పంపకం జరిగేటప్పుడు ఈమె సాబిత్ బిన్ కైస్ బిన్ షమాస్ (ర)గారి భాగానికి వచ్చారు. ఆయన, ఆమెతో, ఓ ధనరాశికి బదులు స్వతంత్రురాలుగా చేస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఆమె తరఫున ఆ మొత్తాన్ని కట్టి విడిపించి వివాహం చేసుకున్నారామెను. ఇది హి.శ. 5 లేదా 6, షాబాన్ నెలలో జరిగిన సంఘటన.

9. ఉమ్మె హబీబా రమలా బిన్తె అబీ సుఫ్‌యాన్ (ర)

ఈమె మునుపు ఉబైదుల్లాహ్ బిన్ హజష్ వివాహబంధంలో ఉన్న మహిళ. అతని వెంట హిజ్రత్ చేసి అబీసీనియాకు కూడా వెళ్ళారు. కాని ఉబైదుల్లాహ్ అక్కడకు వెళ్ళిన తరువాత ధర్మభ్రష్టుడై క్రైస్తవ మతాన్ని స్వీకరించాడు. అక్కడే చనిపోయాడు. అయితే ఉమ్మె హబీబా (ర) మాత్రం ఇస్లామ్ ధర్మంపై స్థిరంగా ఉండిపోయారు. దైవప్రవక్త (స), హిజ్రీ శక సంవత్సరం 7లో, అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీకు లేఖ ఇచ్చి నజాషీ వద్దకు పంపారు. ఆ లేఖలో ఉమ్మె హబీబా (ర)తో తమ నికాహ్ చేయమని కూడా రాశారు. నజాషీ, ఉమ్మె హబీబా స్వీకారంతో ఆమె నికాహ్ దైవప్రవక్త (స)తో చేసివేశాడు. షుర్జీల్ బిన్ హస్నా వెంట ఆమెను దైవప్రవక్త (స) వద్దకు పంపించడం జరిగింది.

10. హజ్రత్ సఫియ్యా (ర) బిన్తె హుయ్ బిన్ అక్తబ్

వీరు బనీ ఇస్రాయీల్ (యూదుల)కు చెందినవారు. ఖైబర్ యుద్ధం సందర్భంగా పట్టుబడి బందీగా వచ్చినవారు. కాని దైవప్రవక్త (స) ఆమెను

తన కోసం ఎంచుకొని స్వతంత్రురాలుగా చేసి వివాహమాడారు. ఇది ఖైబర్ విజయం హి.శ. 7 తరువాతి సంఘటన.

11. హజ్రత్ మైమూనా బిన్తె హారిస్ (ర)

ఈమె ఉమ్ముల్ ఫజ్ల్ లుబాబా బిన్తె హారిస్ సోదరి. దైవప్రవక్త (స) ఆమెను హిజ్రీ శక సంవత్సరం, జీకాదా నెలలో ఉమ్రయె కజా పూర్తి చేసి - ప్రామాణికమైన కథనం ప్రకారం, ఇహ్రామ్ నుండి హలాల్ అయిన తరువాత - వివాహమాడారు.

మహాప్రవక్త(స) వివాహమాడిన సతీమణుల సంఖ్య ఇలా పదకొండుకు చేరింది. వీరిలో ఇద్దరు హజ్రత్ ఖదీజా (ర) మరియు ఉమ్ముల్ మసాకీన్ హజ్రత్ జైనబ్ (ర) ఇద్దరూ ఆయన జీవించి ఉండగానే పరమపదించారు. మిగతా తొమ్మండుగురు సతీమణులు ప్రవక్త(స) మరణం తరువాత కూడా జీవించే ఉన్నారు. వారే కాకుండా, ఆయనతో సంసారం చేయని మరిద్దరు మహిళలున్నారు. వారిలో ఒకరు బనూ కిలాబ్‌కు చెందిన మహిళ అయితే మరొకరు 'కిందా' తెగకు చెందినవారు. ఈ కిందా తెగ మహిళే 'జోనియా'గా పిలువబడతారు. వీరితో దైవప్రవక్త (స) వివాహం జరిగిందా లేదా? వారి వంశ వృక్షం ఏమిటీ అనే విషయంలో సీరత్ చరిత్రకారుల నడుమ భేదాభిప్రాయాలున్నాయి. ఆ వివరాలేమిటో తెలిపే అవసరం ఇక్కడ లేదని అనుకుంటున్నాము.

ఇక స్త్రీ బానిసల విషయానికి వస్తే, దైవప్రవక్త (స) దగ్గర ఇద్దరు స్త్రీ బానిసలు ఉండేవారని తెలుస్తోంది. వారిలో ఒకరు 'మారియ కబ్తియా (ర)'. ఈమెను ఈజిప్టు చక్రవర్తి మకూకస్ దైవప్రవక్త (స)కు కానుకగా సమర్పించాడు. ఆమె గర్భాన ప్రవక్త (స) కుమారుడు ఇబ్రాహీం జన్మించారు. ఆయన బాల్యంలోనే హిజ్రీ శక సంవత్సరం 10, షవ్వాల్ నెల 28 లేక 29వ తేదీ (క్రీ.శ. జనవరి 27, 632)న మదీనాలో మరణించారు.

మరో బానిస స్త్రీ రైనా బిన్తె జైద్ (ర). ఈమె యూదుల తెగ బనీ నజీర్ లేదా బనూ కురైజాకు చెందినవారు: ఈమె బనూ కురైజా ఖైదీల్లో ఉండగా దైవప్రవక్త (స) ఆమెను తన కోసం ఎంపిక చేసుకొని తన దగ్గర ఉంచుకున్నారు.

కొందరు పరిశోధకులు, దైవప్రవక్త (స) ఆమెను బానిసగా కాకుండా స్వతంత్రు రాలిగా చేసి వివాహమాడారని తలుస్తారు. కాని ఇబ్నె ఖైమ్ దృష్టిలో మొదటిదే సరిఅయినది. అబూ ఉబైదా (ర), ఈ ఇద్దరు స్త్రీ బానిసలే కాకుండా మరిద్దరు స్త్రీ బానిసల గురించి చెప్పారు. ఆ ఇద్దరిలో ఒకరి పేరు జమీలా. ఈమె ఏదో ఒక యుద్ధంలో బందీ అయి వచ్చారు. మరొకరు ఎవరో ఓ స్త్రీ బానిస. ఆమెను హజ్రత్ జైనబ్ బిన్తె హజష్ ప్రవక్త (స)కు బహూకరించారు.[1]

ఇక్కడి వరకు చెప్పుకున్న తరువాత మనం కొంచెం సేపు ఆగి, మహాప్రవక్త (స)గారి జీవితానికి సంబంధించిన మరో పార్శ్వాన్ని స్పృశించ వలసిన అవసరం ఉంది. మహాప్రవక్త (స), లైంగిక శక్తి సమృద్ధిగా ఉన్న యవ్వన దశలోనే అంటే ముప్ఫై ఏండ్ల ప్రాయంలోనే ఒకే భార్యతో తృప్తిపడుతూ గడిపేశారు. ఆ భార్య కూడా దాదాపు వృద్ధాప్య దశకు చేరుకున్న భార్యే. అంటే మొదట ఖదీజా (ర) ఆ తరువాత హజ్రత్ సౌదా (ర)లు మాత్రమే. అయితే, ఆయన(స) వృద్ధాప్య దశకు చేరిన తరువాత హఠాత్తుగా ఒక వివాహం తరువాత మరొకటిగా తొమ్మిది వివాహాలు చేసుకోవడానికి ఆయనలో లైంగిక శక్తి అంతగా పెరిగిపోయిందన్న భావన ఏ విధంగా చూసినా సరియైన భావనేనా? కాదు. అలా జరగడానికి వీల్లేదు. దైవప్రవక్త (స) గారి యవ్వన దశ మరియు వృద్ధాప్య దశ రెంటిపై దృష్టిని సారించిన తరువాత ఏ వివేకవం తుడైనా అలాంటి భావన సరియైనది కాదు అని ఒప్పుకుంటాడు. యదార్థం ఏమిటంటే, ఆయన (స) ఇన్ని వివాహాలు, మరేవో అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేసుకున్నవే. ఈ వివాహాలు సాధారణ వివాహాలలో ఉండే నిర్ణీత ఉద్దేశ్యాలకంటే ఎంతో ఉన్నతమైనవి. ఇప్పుడు మనం ఆ ఉద్దేశ్యాలను కొద్దిగా తరచి చూద్దాం.

దైవప్రవక్త (స) హజ్రత్ ఆయిషా (ర), హజ్రత్ హఫ్సా (ర)లను వివాహ మాడి, హజ్రత్ అబూ బక్ర్ (ర), హజ్రత్ ఉమర్ (ర)లతో ఏ వియ్యాన్ని అయితే అందుకున్నారో, అలాగే హజ్రత్ ఉస్మాన్(ర)కు హజ్రత్ రుకయ్యా(ర), హజ్రత్ ఉమ్మె కుల్సూమ్ (ర)లను ఒకరి తరువాత ఒకరినిచ్చి, హజ్రత్ అలి (ర)గారికి తన ముద్దుల కుమార్తె హజ్రత్ ఫాతిమానిచ్చి పెళ్ళి చేసి ఏ వియ్యాన్ని అయితే అందుకున్నారో, ఆ వివాహాల ఉద్దేశ్యం, ఆ నలుగురు మహా

1. చూడండి, జాదుల్ ముఅద్-1/29.

పురుషులతో తన సంబంధాలను పటిష్ఠపర్చుకోవడమే. ఈ నలుగురూ గడ్డు సమయాల్లో ఇస్లామ్ కోసం త్యాగం చేసిన మహామహులు. వారి ప్రత్యేకత ఏమిటో మనందరికీ తెలిసిందే.

అరబ్బు ఆచారం ప్రకారం, వియ్యపు బంధుత్వం ఎంతో గౌరవమైన దృష్టితో చూడబడుతుంది. వారి దృష్టిలో అల్లుని బంధుత్వం అంటే, వివిధ తెగల నడుమ దగ్గరి సంబంధానికి పునాదిలాంటిది. అల్లునితో యుద్ధం చేయడం సిగ్గుచేటు. ఈ సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకొని మహాప్రవక్త (స) మరికొన్ని వివాహాలు చేసుకోవలసి వచ్చింది. ఉద్దేశ్యం, వివిధ వ్యక్తులు, వివిధ తెగల శత్రుత్వాన్ని నీరుగార్చడం. వారిలో అప్పటి వరకు రగులు కుంటున్న ద్వేషాగ్ని కీలలను ఆర్పివేయడం, హజ్రత్ ఉమ్మె సల్మా (ర) బనీ మఖ్జూమ్ తెగకు చెందిన మహిళ. ఈ తెగ అబూ జహల్ మరియు ఖాలిద్ బిన్ వలీద్‌లకు చెందిన తెగ. మహాప్రవక్త(స) ఆమెతో వివాహమాడగా, ఇదివరకు ఉహద్ యుద్ధంలో ఖాలిద్ బిన్ వలీద్ ప్రదర్శించిన కఠిన వైఖరి కాస్తా చల్లారిపోయింది. కాగా, కొన్ని రోజుల అనంతరం ఆయన తన ఇష్ట పూర్తిగా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. అలాగే అబూ సుఫ్యాన్ కుమార్తె ఉమ్మె హబీబా (ర)ను దైవప్రవక్త (స) వివాహమాడారు. ఆ తరువాత అబూ సుఫ్యాన్ ఇక మహాప్రవక్త (స)కు ఎదురుబడలేదు.

హజ్రత్ జువైరియా, హజ్రత్ సఫియ్యా (ర)లు ప్రవక్త (స)కు సతీమణు లైన తరువాత బనూ ముస్తలిక్ మరియు బనీ నజీర్ తెగలు ప్రవక్త (స)తో యుద్ధాలు మానేశారు. మహాప్రవక్త (స) ఈ ఇద్దరు మహిళలను పెళ్ళాడిన తరువాత చరిత్రలో ఈ రెండు తెగలు ఎలాంటి పోరాటాలకుగాని, కుట్రలకు గాని దిగినట్లు ఆధారాలు లభించవు. పైగా, హజ్రత్ జువైరియా (ర) తన జాతి స్త్రీలకంటే శుభాలనుగొని తెచ్చారు. అది ఎలాగంటే, దైవప్రవక్త (స) ఆమెతో వివాహమాడగా, సహాబా (ర) ఆమె తెగకు చెందిన వంద కుటుంబా లను, "వీరంతా దైవప్రవక్త (స) గారి అత్తవారి కుటుంబానికి చెందినవారు" అంటూ చెర నుండి విడుదల చేశారు. అలా వారి మనస్సులపై పడిన ప్రభావం ఎలాగుండిందో మనం అర్థం చేసుకోవచ్చు.

అన్నింటికంటే గొప్ప విషయం ఏమిటంటే, మహాప్రవక్త (స) ఓ అనాగరిక జాతికి శిక్షణ గరిపి, దాని హృదయాన్ని ప్రక్షాళన చేసి ఆ జాతి

వారికి సభ్యతా సంస్కారాలు నేర్పడానికి దైవం తరఫున నియమించబడిన మహా మనీషి. అప్పటివరకు ఈ జాతి నాగరికత, సభ్యతా సంస్కారాలు, సామాజిక కట్టుబాట్లు, సత్సమాజ నిర్మాణంలో పాల్గొనే బాధ్యతలు ఏవో తెలియని జాతి. ఇస్లామీయ సమాజ నిర్మాణం ఏ సూత్రాల పైన్నయితే నిర్మిం చవలసి ఉండిందో, ఆ నిర్మాణ కార్యక్రమంలో స్త్రీ పురుషుల కలివిడికి ఏ మాత్రం వీలులేదు. కాబట్టి అలా కలివిడి లేని సూత్రాలను అవలంబిస్తూ స్త్రీలకు నేరుగా శిక్షణ గరపడానికి వీలుండదు. విద్యావికాసాలు గరపడం, వారిని సుశిక్షితులుగా చేసే అవసరం పురుషులకు తోడు స్త్రీలకు కూడా అంతే ముఖ్యమైనది. ఇంకా చెప్పాలంటే ఆ అవసరం పురుషులకంటే అధికమే.

పల్లెల్లో, నగరాల్లో నివసించే అన్ని రకాల వయస్సు కలిగిన మహిళలకు శిక్షణ గరపడం, వారికి ధర్మశాస్త్ర ఆదేశాలను ఎరుకపర్చడం, వారిలో విద్యా బుద్ధులను వ్యాపింపజేసి వారి హృదయాల నుండి అజ్ఞానపు అంధకారాన్ని పోగొట్టడం మరియు వారిలో ధర్మజ్ఞాన ప్రచారాన్ని చేబట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ కారణం చేత, ఆ లక్ష్యసాధన కోసం దైవప్రవక్త(స)కు రకరకాల వయస్సులు, వివిధ రకాల సామర్థ్యాలు కలిగిన మహిళలను ఎంపిక చేసుకునే అవసరం ఎంతైనా ఉండింది.

కాబట్టి ప్రవక్త మహనీయుల ప్రైవేటు జీవితానికి సంబంధించిన విషయాలను కూడా ముస్లిం సమాజం ముందు పెట్టే ఘనత చాలా మట్టుకు ముస్లిముల మాతృమూర్తులు అయిన ప్రవక్త (స) సతీమణులకే దక్కిందన్న విషయం మనం గ్రహించగలం. ముఖ్యంగా అధిక కాలం వరకు జీవించిన హజ్రత్ ఆయిషా (ర) గారికి ఆ క్రెడిట్టు దక్కుతుంది. ఈమె దైవప్రవక్త (స)గారి ప్రతి కదలికను, ప్రతి ప్రవచనాన్ని ఉల్లేఖించినవారు.

ప్రవక్త మహనీయులు (స) చేసుకున్న వివాహాల్లో ఒక వివాహం, అప్పటి మూఢ ఆచారాన్నొకదాన్ని చెరిపివేయడానికి అమలులోనికి వచ్చింది. ఆ మూఢాచారం అరబ్బు సమాజంలో తాతముత్తాతల కాలం నుండి రివాజులో ఉండి బాగా ముదిరి పోయిన ఆచారం. ఇది ఒకరిని దత్తపుత్రునిగా చేసుకునే ఆచారం. అజ్ఞాన కాలంలో దత్తపుత్రునికి, సొంత కుమారునికి ఉండే

హక్కులన్నీ ఉండేవి. ఈ ఆచారం, సంప్రదాయం అరబ్బు సమాజం నుండి చెరిపివేయలేనంతగా వ్రేళ్ళూనుకొని ఉంది ఆ కాలంలో. అయితే ఈ మూఢా చారం, ఈ అజ్ఞానపు సంప్రదాయం, ఇస్లామ్ ప్రవేశపెట్టిన నికాహ్, తలాక్, వారసత్వం మరియు ఇతర సిద్ధాంతాలు, సూత్రాలకు పూర్తిగా భిన్నమైన ఆచారం. అదేకాకుండా అజ్ఞాన కాలంనాటి ఈ సంప్రదాయాన్ని మట్టుపెట్టడం ఇస్లామ్ ధర్మం యొక్క ప్రథమ లక్ష్యం కూడా. అందుకని దీన్ని చెరిపి వేయడానికి అల్లాహ్ తన ప్రవక్త (స) వివాహం హజ్రత్ జైనబ్ బిన్తె హజష్‌తో చేయడం జరిగింది. హజ్రత్ జైనబ్ (ర) మొదట హజ్రత్ జైద్ (ర)కు భార్యగా ఉండేవారు. ఈయన దైవప్రవక్త (స)కు దత్తపుత్రుడు. అయితే, ఆ భార్యాభర్తల నడుమ పొసగని కారణంగా హజ్రత్ జైద్ (ర) ఆమెకు తలాక్ (విడాకులు) ఇవ్వడానికి సిద్ధపడ్డారు. దైవతిరస్కారులు దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా అహ్జాబ్ యుద్ధానికి (అగడ్త యుద్ధానికి) సిద్ధపడుతున్న కాలమది. ఇటు దైవప్రవక్త (స)కు దైవం తరఫున దత్తత ఆచారాన్ని అంతమొందించే సూచనలు అందుతున్నాయి. ఆ కారణంచేత ఆయన (స) ఈ గడ్డు పరిస్థితిలో హజ్రత్ జైద్(ర) తన భార్యకు తలాక్ గనకా ఇస్తే, ఆ తరువాత ప్రవక్త (స) హజ్రత్ జైనబ్‌ను వివాహమాడినట్లయితే మునాఫిక్‌లు, బహుదైవారాధకులు, యూదులు అందరూ దాన్ని ఆసరాగా చేసుకొని, ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభిస్తారు. అమాయక ముస్లింలను రకరకాల అనుమానాలకు గురిచేసి వారిపై చెడు ప్రభావాలు పడేటట్లు చేస్తారేమో అనే ఆశంక తలెత్తింది. కాబట్టి, అప్పుడు ఆయన (స) ప్రయత్నం అంతా, హజ్రత్ జైద్ (ర) తన భార్యకు విడాకులు ఇవ్వకుండా ఉండాలన్నదే.

కాని అల్లాహ్‌కు ఈ ధోరణి నచ్చలేదు. ఆయన తన ప్రవక్త (స)కు హెచ్చరిక చేస్తూ ఈ క్రింది ఆయత్‌ను అవతరింపజేశాడు.

وَ اِذْ تَقُوْلُ لِلَّذِيْٓ اَنْعَمَ اللّٰهُ عَلَيْهِ وَاَنْعَمْتَ عَلَيْهِ اَمْسِكْ عَلَيْكَ زَوْجَكَ وَاتَّقِ اللّٰهَ
وَتُخْفِيْ فِيْ نَفْسِكَ مَا اللّٰهُ مُبْدِيْهِ وَتَخْشَى النَّاسَ ۚ وَاللّٰهُ اَحَقُّ اَنْ تَخْشٰىهُ ؕ

"ఓ ప్రవక్తా! అల్లాహ్, ఏ వ్యక్తికి మేలుచేశాడో ఆ వ్యక్తితో నీవు, 'నీ భార్యను విడిచిపెట్టకు, అల్లాహ్‌కు భయపడు' అని అంటున్న సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు నీవు బయటపెట్టదలచిన విషయాన్ని నీ మనస్సులో

దాచి ఉంచావు. నీవు ప్రజలకు భయపడుతున్నావు. వాస్తవానికి భయపడడానికి అల్లాహ్‌యే ఎక్కువ హక్కుదారుడు." (33 : 37)

ఎలాగైతేనేమి హజ్రత్ జైద్ (ర), జైనబ్ (ర)కు తలాక్ ఇచ్చేశారు. ఆమె ఇద్దత్ గడువు పూర్తి అయిన తరువాత ఆమెతో దైవప్రవక్త (స) వివాహానికి ఆదేశం అవతరించింది. ఈ ఆయత్‌లో అల్లాహ్ ఆయన (స) ఈ నికాహ్ నిర్బంధంగా చేసుకోవాలని ఆదేశించాడు. ఆ ఆయత్ ఇలా ఉంది:

فَلَمَّا قَضٰى زَيْدٌ مِّنْهَا وَطَرًا زَوَّجْنٰكَهَا لِكَیْ لَا يَكُوْنَ عَلَى الْمُؤْمِنِيْنَ حَرَجٌ فِيْٓ
اَزْوَاجِ اَدْعِيَآئِهِمْ اِذَا قَضَوْا مِنْهُنَّ وَطَرًا ۭ وَكَانَ اَمْرُ اللّٰهِ مَفْعُوْلًا ۝

"తరువాత జైద్ ఆమె విషయంలో తన అవసరాన్ని పూర్తి చేసుకున్నపుడు, మేము ఆమె (విడాకులు పొందిన స్త్రీ)తో నీకు వివాహం జరిపించాము. విశ్వాసులకు తమ దత్తపుత్రుల భార్యల విషయంలో, వారు తమ భార్యలకు సంబంధించిన తమ అవసరాన్ని పూర్తి చేసుకున్న పుడు ఏ విధమైన ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు." (33 : 37)

దీని ఉద్దేశ్యం ఏమిటంటే, దత్తపుత్రులకు సంబంధించిన అజ్ఞానపు ఆచారం, అంతకు పూర్వం అవతరించిన ఈ క్రింది ఆదేశాల ద్వారా అంతం చేసినట్లే కార్యరూపంగా అంతమొందించడం.

اُدْعُوْهُمْ لِاٰبَآئِهِمْ هُوَ اَقْسَطُ عِنْدَ اللّٰهِ

"దత్తపుత్రులను వారి తండ్రులతో ఉన్న సంబంధం ప్రకారం పిలవండి. ఇది అల్లాహ్ దృష్టిలో ఎంతో న్యాయసమ్మతమైన విషయం." (33 : 5)

مَا كَانَ مُحَمَّدٌ اَبَآ اَحَدٍ مِّنْ رِّجَالِكُمْ وَلٰكِنْ رَّسُوْلَ اللّٰهِ وَخَاتَمَ النَّبِيّٖنَ ۭ

"(మానవులారా!) ముహమ్మద్ మీలోని ఏ పురుషునికీ తండ్రికారు. కాని ఆయన అల్లాహ్ యొక్క ప్రవక్త. దైవప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరివారు." (33 : 40)

ఈ సందర్భంగా ఓ విషయాన్ని మనం గమనించాల్సి ఉంది. ఒక సమాజంలో ఏదైనా దుస్సంప్రదాయం లేదా దురాచారం బాగా వ్రేళ్ళూను

కొనిపోతే, కేవలం మాటల ద్వారా దాన్ని చెరిపివేయలేం. లేదా ఆ ఆచార సంప్రదాయాల్లో మార్పు తీసుకురావడం సాధ్యపడదు. ఏ వ్యక్తి అయితే దాన్ని తుడిచివేయడానికి కంకణం కట్టుకుంటాడో లేదా వాటిలో మార్పులు తెచ్చే కృషి చేస్తాడో, ఆ వ్యక్తి చేతలు కూడా దానికి తగిన విధంగా ఉండడం అవసరం. "హుదైబియా ఒప్పందం" సందర్భంగా ముస్లిముల వైఖరి ద్వారా ఆ యదార్థం మరింత తేటతెల్లం అవుతుంది. 'ఉర్వా బిన్ మస్‌ఊద్ సకఫీ' హుదైబియాకు వచ్చినప్పుడు ముస్లిముల సమర్పణ త్యాగనిరతి ఎలాంటిదో చూసి ఉన్నాడు. దైవప్రవక్త(స) ఉమ్మి వేసినప్పుడు అది సహాబాల(ర) చేతుల్లో పడుతోంది. వారు దాన్ని అందుకోడానికి, ఆయన (స) వుజూ చేయగా క్రింద ఒలుకుతున్న నీటిని అందుకోడానికి ఎగబడుతున్నారు. అవును! ఈ సహాబాలే ఆ చెట్టు క్రింద మరణాన్నయినా కొనితెచ్చుకుంటామని ప్రవక్త చేతుల మీద ప్రమాణం చేయడానికి తొందరపడుతున్నారు. వీరంతా ఎవరు? వారు హజ్రత్ అబూబక్ర్(ర), హజ్రత్ ఉమర్(ర)లాంటి త్యాగధనులు.

కానీ ఆ సహాబాల(ర) ను - ఎవరైతే ఆయన (స) పై తమ ప్రాణాలను సైతం అర్పించడం అదృష్టం అనుకుంటూ ఉండేవారో- ఒప్పందం కుదిరిన తరువాత, తమ తమ హదీ పశువుల్ని జిబహ్ చేయమని ఆదేశించగా వారిలో ఏ ఒక్కరూ తమ స్థానం నుంచి కదలలేదు. చివరికి ప్రవక్త (స)కు బాధ కూడా కలిగింది. పిదప ఆయన సతీమణి హజ్రత్ ఉమ్మె సల్మా(ర), మీరే లేచి మీ పశువులను జిబహ్ చేయండి అనే సలహా ఇచ్చారు. ఆ సలహాను పాటిస్తూ మహాప్రవక్త (స) తమ కుర్బానీ పశువులను జిబహ్ చేసేశారు. అప్పుడు ప్రతి సహాబీ(ర) ప్రవక్త(స)ను అనుసరించడానికి పరుగులు పెట్టనారంభించాడు. సహాబా లంతా తమ తమ పశువులను జిబహ్ చేసేశారు. ఈ సంఘటన ద్వారా మనకు తెలుస్తోందేమిటంటే, బాగా వ్రేళ్ళునుకొని పోయిన దురాచారాలను రూపుమాపాలంటే మాటలకు, చేతలకు ఉన్న ప్రభావంలో ఎంత తేడా ఉందనేదే. కాబట్టి దత్తత తీసుకునే అజ్ఞాన కాలపు ఆచారాన్ని అంతం చేయడానికిగాను మహాప్రవక్త (స) తన దత్తపుత్రుడు జైద్(ర) విడాలికులిచ్చిన భార్యతో ఆయన (స) వివాహం జరిపించడం జరిగింది.

ఈ నికాహ్ జరగగానే మునాఫిక్‌లు ఆయన (స)కు వ్యతిరేకంగా పెద్ద

ఎత్తున దుష్ప్రచారాల దుమారాలు లేపడం మొదలెట్టారు. రకరకాల దుష్ట ఆలోచనలను, అపోహల్ని వ్యాపింపజేశారు. వాటి ప్రభావాలు ఎంతో కొంత అమాయక ముస్లిములపై కూడా పడ్డాయి. ఈ ప్రాపగండాను బలపరచడానికి మరో షరయీ (ధర్మశాస్త్ర సంబంధమైన) అవకాశం మునాఫిక్‌ల చేతికి చిక్కింది. అదేమిటంటే, హజ్రత్ జైనబ్ (ర) మహాప్రవక్త (స)కు ఐదవ భార్య కావడం. అప్పటికే ముస్లిములకు నల్గురు భార్యలే ధర్మసమ్మతం అన్న విషయం తెలుసు. అదంతా ఒక ఎత్తు అయితే ఈ దుష్ప్రచారానికి ప్రాణంలాంటి విషయం, అప్పటి వరకు హజ్రత్ జైద్ (ర), దైవప్రవక్త (స)కు కుమారునిగానే తలచబడడం. ఆ కుమారుని భార్యతో నికాహ్ చేసుకోవడం అప్పటి ఆచారాల ప్రకారం వ్యభిచారంగా తలచబడడం. చివరకు అల్లాహ్ అహ్జాబ్ సూరాలో ఈ రెండు విషయాల గురించి ఆయతులు అవతరింప జేయవలసి వచ్చింది. ఆ దైవవాణి అవతరణ జరిగిన తరువాత, సహాబా(ర)కు, ఇస్లామ్ ధర్మంలో దత్తపుత్రునికి ఎలాంటి విలువ లేదు అని, అల్లాహ్ కొన్ని ఉన్నతమైన, ప్రత్యేకమైన ఉద్దేశ్యాల సాధన కోసం తన ప్రవక్తకు ప్రత్యేకంగా, భార్యల సంఖ్య విషయంలో ఇతరులెవరికీ ఇవ్వనటువంటి అనుమతిని ఒసగాడన్న విషయం తెలిసిపోయింది.

ఉమ్మహాతుల్ మోమినీన్ (విశ్వాసుల మాతృమూర్తులైన ప్రవక్త (స) సతీమణులు) ఎడల దైవప్రవక్త (స) చేసిన సంసారం తీరు ఎంతో గౌరవ ప్రదమైనది, ఉన్నతమైనది మరియు ఎంతో మర్యాదతో కూడుకున్నదిగా ఉండేది. దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, ఎంతో గడ్డు జీవితాన్ని గడుపుతున్నప్పటికీ, మహాప్రవక్త (స) సతీమణులు కూడా తమ దాంపత్య హక్కులను నిర్వర్తిస్తూ, ఆయన (స) ఎడల ఎంత గౌరవంగా, సమ్మతంగా, తృప్తిగా, మర్యాదగా, సహనంగా, సేవా తత్పరతతో మెలిగేవారు. ఈ గడ్డు పరిస్థితులను సహించడం మరొకరి వల్ల అయ్యేది కాదు. హజ్రత్ అనస్ (ర) ఓ ఉల్లేఖనంలో, "దైవప్రవక్త (స), తాము పరమపదించే వరకు మైదా పిండితో చేసిన రొట్టె తినడం గాని, నా కళ్ళతో (ఆయన ఇంట) వేయించిన మేకను చూడడంగాని జరగలేదు" అని చెప్పారు.[2]

2. సహీహ్ బుఖారి -2/956

హజ్రత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది: "అలా పస్తులతో రెండు నెలలు గడిచిపోయి మూడో నెల నెలవంక అగుపడే వరకు ప్రవక్త (స) ఇంట పొయ్యే వెలగకపోయేది." హజ్రత్ ఉర్వా (ర) ఆమెతో, "మరి మీరు ఏమి తినేవారు?" అని అడగగా, ఆమె, "కేవలం రెండు నల్లని పదార్థాలు. అంటే ఖర్జూరం మరియు నీరు."[3] దీనికి సంబంధించిన హదీసులు అనేకం ఉన్నాయి.

ఇంత గడ్డు పరిస్థితులు చోటుచేసుకొని ఉన్నప్పటికీ, ప్రవక్త (స) సతీమణులచే విమర్శకు గురిఅయ్యే ఏ పొరపాటూ జరగలేదు - కేవలం ఓసారి, అది కూడా మానవ బలహీనతల కారణంగా ఓ పొరపాటు తప్ప. ఈ పొరపాటును ఆధారంగా చేసుకొని కొన్ని ఆదేశాలు ఇవ్వవలసి ఉన్నందున అది జరిగిపోయింది. కాబట్టి అల్లాహ్ ఈ సందర్భంగా వారిని ఇలా హెచ్చరించాడు:

يَٰٓأَيُّهَا ٱلنَّبِيُّ قُل لِّأَزْوَٰجِكَ إِن كُنتُنَّ تُرِدْنَ ٱلْحَيَوٰةَ ٱلدُّنْيَا وَزِينَتَهَا فَتَعَالَيْنَ أُمَتِّعْكُنَّ وَأُسَرِّحْكُنَّ سَرَاحًا جَمِيلًا ۝ وَإِن كُنتُنَّ تُرِدْنَ ٱللَّهَ وَرَسُولَهُۥ وَٱلدَّارَ ٱلْءَاخِرَةَ فَإِنَّ ٱللَّهَ أَعَدَّ لِلْمُحْسِنَٰتِ مِنكُنَّ أَجْرًا عَظِيمًا ۝

"ఓ ప్రవక్తా! నీ భార్యలతో ఇలా అను; ఒకవేళ మీరు ప్రాపంచిక జీవితాన్నీ, దాని శోభనూ కోరుతూ ఉన్నట్లయితే, రండి, నేను మీకు ఎంతో కొంత ఇచ్చివేసి మంచి పద్ధతి ప్రకారం సాగనంపుతాను. కాని ఒకవేళ మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, పరలోక నివాసాన్ని కోరుతూ ఉన్నట్లయితే తెలుసుకోండి, మీలోని పుణ్యవతుల నిమిత్తం అల్లాహ్ గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు." **(33 : 28,29)**

ఇక పరిశుద్ధ సతీమణుల ఔన్నత్యాన్ని కూడా అంచనా వేయండి. వారంతా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)కే ప్రాధాన్యత ఇచ్చారు. వారిలో ఏ ఒక్కరూ ప్రాపంచిక సుఖభోగాల వైపునకు కన్నెత్తయినా చూడలేదు.

ఇలాగే సవతుల నడుమ ప్రతి రోజు కొన్ని మనస్పర్థలు ఏర్పడుతూనే

3. సహీహ్ బుఖారి-2/956

ఉంటాయి. కాని సవతుల సంఖ్య అధికమైనప్పటికీ అలాంటి సంఘటన జరగడం ఎప్పుడో ఒకప్పుడు చోటుచేసుకోవడం జరిగింది. అది కూడా మానవ బలహీనతల కారణంగానే. ఆ పొరపాటును అల్లాహ్ ఎత్తిచూపి వారిని హెచ్చరించినందున ఆ తరువాత అలాంటిది మరేదీ జరగలేదు. ఖుర్ఆన్ లోని తహ్రీమ్ సూరా మొదటి అయిదు ఆయత్‌లలో ఆ విషయమే చెప్పడం జరిగింది.

చివరగా, ఈ సందర్భంలో, బహుభార్యత్వం గురించి చర్చించే అవసరం లేదని అనుకుంటున్నాము. ఎందుకంటే దీన్ని అందరికంటే అతిగా విమర్శించే వారు ఐరోపా వారే. వారు ప్రస్తుతం ఏ రకమైన జీవితాన్నయితే గడుపు తున్నారో, మరే దురదృష్టకరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారో మనకు తెలుసు. బహు భార్యత్వ సిద్ధాంతాన్ని కాదని వారెలాంటి బాధలను కష్టాలను ఎదుర్కొంటున్నారో దాన్ని దృష్టిలో ఉంచుకుంటే, ఇక ఈ విషయాన్ని చర్చించే అవసరమే లేదని చెప్పడం సరిపోతుంది. పాశ్చాత్య సమాజపు దురదృష్టకర నికృష్ట జీవితం, బహుభార్యత్వ సిద్ధాంతం సత్యంపై ఆధారపడి ఉందనడానికి నిదర్శనం. వివేకుల కోసం ఇందులో గొప్ప గుణపాఠమూ ఉంది.

పరిపూర్ణ మూర్తిమత్వం

మహాప్రవక్త (స), వర్ణనాతీతమైన సౌందర్యం మరియు సుగుణాలరాశి. ఆయన శారీరక సౌందర్యం, సుగుణ సంపదల కారణంగా మనస్సులు ఆయన వైపునకు అనుకోకుండానే ఆకర్షింపబడేవి. ఆయన్ను గౌరవించే భావన హృదయాల్లో అట్టే వ్రేళ్ళూనుకుపోయేది. ఆ కారణంగా, ఆయన సంరక్షణ లోనూ, ఆయనను గౌరవించడంలోను ప్రజలు తమ ప్రాణాలను సైతం అర్పించడానికి సిద్ధపడేవారు. అలాంటి త్యాగనిరతి ప్రపంచంలో మరే వ్యక్తి ఎడల కానరాదు. ఆయన సహవాసులకు, ఆప్తులకు ఆయనంటే ప్రాణం. తమ మెడలు నరకబడినా సరే, మహాప్రవక్త (స)కు ఓ చిన్న ముల్లు గ్రుచ్చు కున్నా, ఆయనపై ఈగ వాలినా సహించేవారుకారు. మహాప్రవక్త (స)కు ప్రపం చంలో మరే మానవునికీ అబ్బని సుగుణ సంపద అబ్బింది. ఈ మూర్తిమత్వాన్నే చూసి ప్రజలు ఆయన వైపునకు మొగ్గుతూపోయారు. ఆ వ్యక్తిత్వం గురించి ఆయన సహచర సహాబా(ర)లు తమ నోటితో వర్ణించిన సారాంశాన్ని ఇక్కడ వివరి స్తున్నాము.

రూపురేఖలు

హిజ్రత్ చేసి మదీనా వెళ్ళేటప్పుడు మార్గమధ్యంలో దైవప్రవక్త (స) 'ఉమ్మె మఅబద్ కుజాయియా' గుడారాన్ని దర్శించి వెళ్ళారు. ఆయన వెళ్ళిపోయిన తరువాత ఆమె తన భర్తకు ప్రవక్త (స)గారి రూపురేఖలెలా ఉన్నాయో వివరించి చెబుతూ, "మెరిసే మేని వర్ఛస్సు, ఉజ్వలమైన ముఖార విందం, అందమైన ఆకారం, ఉబ్బుతనంలేని పొట్ట, బట్టతలలేని తల, భావ్యమైన విగ్రహం, సుర్మా కళ్ళు, పొడవాటి కనురెప్పలు, గంభీరమైన కంఠం, పొడవాటి మెడ, నలుపుతెలుపు కలిగిన కనుగ్రుడ్లు, సుర్మా రంగు కనురెప్పలు, ఒకదానితో ఒకటి కలిసిన పలుచటి కనుబొమ్మలు, మెరిసే నల్లని తల వెంట్రు కలు, గాంభీర్యం ఉట్టిపడే నిశ్శబ్దత, ఆహ్లాదపరిచే పలుకరింపు కలవారాయన.

దూరం నుండి చూస్తే ఉజ్వలంగా అందంగా అగుపించేవారు. దగ్గరి నుండి చూస్తే మధురానుభూతిని కలిగించే సుందరాకారం. మాటలు ఆకర్షణీయ మైనవి, ముక్కు సూటిగా మాట్లాడే స్వభావం. నోట ముత్యాలు రాలు తున్నాయా! అన్నట్లు మాట్లాడేవారు. మరీ పొట్టీకాదు, మరీ పొడవు కాకుండా మధ్యస్థమైన, రెండు కొమ్మల నడుమ పైకి వచ్చిన తాజా కొమ్మలా అందమైన మెరిసే మేను. సహచరులు ఆయన చుట్టూ చేరి ఆదేశాల కోసం ఎదురు చూస్తారు. ఏదైనా ఆదేశమిస్తే వారు వెంటనే అమలుపర్చడానికి ఎగబడతారు. పలుకులు మనస్సును నొప్పించేవిగా, అనవసరమైనవిగా ఉండవు."[1]

హజ్రత్ అలి (ర) ఆయన (స)లోని సుగుణాలను వర్ణిస్తూ ఇలా ఉల్లేఖించారు:

"దైవప్రవక్త (స) అంత పొడవూ కాదు, పొట్టీ కాదు. మాలో మధ్యస్థమైన ఎత్తుగలిగినవారు. వెంట్రుకలు ఇటు ఉంగరాల జుట్టు కాకుండా మరీ నిలబడి లేకుండా ఆ రెంటికీ మధ్యస్థంగా ఉండేవి. బుగ్గలు మరీ ఉబ్బువి కాదు. గడ్డం **(Chin)** నుదుర్లు అంత చిన్నవి కావు. ముఖం **(face)** కొంత గుండ్రంగా ఉంటుంది, మేని రంగు గులాబీ రంగు కలిగి ఉంది. కళ్ళు ఎరుపుదనాన్ని సంతరించుకున్నవి. కనురెప్పలు పొడవు, కీళ్ళు మరియు భుజాల ఎముకలు పెద్దవి. వక్షస్థలం నుండి నాభి వరకు వెంట్రుకలతో కూడిన తేలికైన చార. వెంట్రుకలు లేని మిగిలిన శరీరం. అరచేతులపై కాళ్ళపై మాంసం కండరాలు. ఏదో పల్లం వైపునకు నడుస్తున్నారా అని అనిపించేటట్లు కాళ్ళను కొంత ఊపుగా ఎత్తి భూమిపై వేసేవారు. ఒకరితో మాట్లాడేటప్పుడు పూర్తి జాగరూకతను పాటించి అతని మాటలను వినేవారు. రెండు గూడల నడుమ 'మొహైనబువ్వత్' (ప్రవక్త గుర్తుగా ఉండే చిహ్నం) ఉండేది. ఆయన ప్రవక్తలందరికంటే చివరివారు. అందరికంటే దాత; అందరికంటే ధైర్య వంతుడు, అందరికంటే సత్యసంధుడు. అందరికంటే ఇచ్చిన మాటను పాలించేవారు. అందరికంటే మృదుస్వభావుడు. అందరికంటే గౌరవనీ యుడూను. హఠాత్తుగా ఆయన్ను చూసిన వాని గుండెలు అదిరేవి. మిత్రులుగా కలిసే వారు ఆయన్ను ఆత్మీయులుగా తలిచేవారు. ఆయన సుగుణ సంపదను

1. జాదుల్ ముఆద్-2/54.

వర్ణించేవాడు, ఆయనకు పూర్వంగాని, ఆయన తరువాతగాని ఆయనలాంటి వారిని ఎవ్వరినీ చూడలేదు అని మాత్రమే చెప్పగలడు."[2]

హజ్రత్ అలి (ర) గారి మరో ఉల్లేఖనంలో, "పెద్ద తల, కీళ్ళ ఎముకలు బలమైనవని, వక్షస్థలం మధ్యన వెంట్రుకలతో కూడిన ఓ పొడవాటి చార ఉందని, నడిచేటప్పుడు కొంత వంగి, ఏదో పల్లం వైపునకు దిగుతున్నారా అని అనిపించేది" అని ఉంది.[3]

హజ్రత్ జాబిర్ బిన్ సమ్రా (ర) గారి వర్ణన:

"ముఖద్వారం (నోరు) విశాలమైనది, కళ్ళు లేత ఎరుపురంగు కలిగినవి, మడిమలు సన్నటివి."[4]

హజ్రత్ అబుత్తుఫైల్ (ర) ఇలా అంటారు:

"ఆయన మేనివర్ఛస్సు ఎరుపు, ముఖం సొగసైనది, మధ్యస్థమైన ఎత్తు కలిగి ఉండేవారు."[5]

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ ఉల్లేఖనం:

"ఆయన అరచేతులు వెడల్పు కలిగినవి. మెరిసే రంగు, అంత తెలుపూ కాదు మరీ అంత గోధుమ రంగూ కాదు. చనిపోయే వరకు ఆయన గడ్డం మరియు తల వెంట్రుకల్లో ఇరవైకంటే ఎక్కువ వెంట్రుకలు తెల్లబడలేదు.[6] కేవలం చెవుల వద్ద ప్రక్క వెంట్రుకల్లో కొంత తెలుపు వచ్చింది. తల వెంట్రు కల్లో కొన్ని మాత్రమే నెరిశాయి.[7]

హజ్రత్ అబూ హుజైఫా (ర) కథనం ప్రకారం, ఆయన పెదవి క్రింద అన్ఫకా (క్రింది పెదవికి ఆనుకొని ఉన్న వెంట్రుకల గచ్ఛం)లోనూ నరపు వచ్చేసింది.[8]

హజ్రత్ అబ్దుల్లా బిన్ బసర్ ఇలా అన్నారు; ఆయన (స) గారి గడ్డంలోని

2. ఇబ్నెహిషామ్-1/401, 402; తిర్మిజీ-4/303.
3. ఇబ్నెహిషామ్-1/401, 402; తిర్మిజీ-4/303.
4. సహీహ్ ముస్లిమ్-2/258.
5. సహీహ్ ముస్లిమ్-2/258.
6. సహీహ్ బుఖారి-1/502.
7. సహీహ్ బుఖారి-1/502; సహీహ్ ముస్లిమ్-2/259.
8. సహీహ్ బుఖారి-1/501, 502.
9. అయిజన్ 1/502.

కొన్ని వెంట్రుకలు శ్వేత వర్ణంలో ఉన్నాయి.[9] హజ్రత్ బరాఅ(ర) గారి వర్ణన ఇలా ఉంది:

ఆయన ఎత్తు మధ్యస్థం. రెండు భుజాల నడుమ విశాలత, తల వెంట్రుకలు చెవుల లోలకుల వరకు ఉన్నాయి. నేనాయన్ను ఎరుపు రంగు వస్త్రాలు తొడుగుకొని ఉండగా చూశాను.. ఏదీ ఆయనంత అందమైనదిగా నాకు అగుపడలేదు.[10]

దైవప్రవక్త (స) ప్రారంభంలో గ్రంథవహులను అనుసరించేవారు. అంటే తల దువ్వుకుంటే పాపిటి తీసేవారుకారు. కాని ఆ తరువాత తలలో పాపిట తీసేవారు.[11]

"ఆయన ముఖారవిందం అందరికంటే అందమైనది. ఆయన గుణ గణాలు అందరికంటే మిన్నయినవి.[12]

హజ్రత్ బరాఅ (ర)ను, దైవప్రవక్త (స) ముఖం తల్వార్ (ఖడ్గం)లా నిలువు ముఖమా అని అడిగినప్పుడు ఆయన (ర), "కాదు, ఆయన ముఖం పున్నమి చంద్రునిలాగుండేది" అని అన్నారు. మరో ఉల్లేఖనంలో, "ఆయన (స) ముఖం గుండ్రంగా ఉండేదని" ఉంది.[13]

రబీ బిన్తె ముఅవ్విజ్ ఇలా అన్నారు; మీరు గనక దైవప్రవక్త (స) గారిని చూస్తే ఉదయించే సూర్యుణ్ణి చూసినట్లు మీకు అనిపిస్తుంది.[14]

హజ్రత్ జాబిర్ బిన్ సమ్రాహ్ (ర)గారి ఉల్లేఖనం:

"నేను ఓ వెన్నెల రాత్రి ఆయన్ను చూశాను. ఆయన ఎర్రని దుస్తులు ధరించి ఉన్నారప్పుడు. నేను ఇటు దైవప్రవక్తను, అటు చంద్రుణ్ణి చూస్తూ పోయాను, చివరకు ఆయన (స) పున్నమి చంద్రుని కంటే అందంగా ఉన్నారనే నిర్ణయానికి వచ్చాను.[15]

హజ్రత్ అబూ హురైరా (ర)గారి ఉల్లేఖనం: "నేను దైవప్రవక్త (స)

10. సహీహ్ బుఖారి-1/502. 11. సహీహ్ బుకారి-1/503.
12. సహీహ్ బుఖారి-1/502, 503; సహీహ్ ముస్లిమ్-2/258.
13. సహీహ్ బుఖారి-1/502; సహీహ్ ముస్లిమ్-2/259.
14. మస్నద్ దారిమీ - మిష్కాత్-2/517.
15. తిర్మిజి ఫిషహాయిల్ పేజి నెం.2 దారిమి, మిష్కాత్2/517.

ముఖం అంతటి అందమైన దాన్ని మరేదీ చూడలేదు. సూర్యతేజం ఆయన ముఖారవిందాన్ని వెలుగొందిస్తూందా? అని అనిపించింది నాకు. అలాగే దైవప్రవక్త (స) కంటే వేగంగా నడిచే వారిని నేనెవ్వరినీ చూడలేదు. భూమి ఆయన కోసం చుట్టచుట్టుకుంటూందా అన్నట్లుండేది ఆయన నడిచినప్పుడు. మేము (ఆయన వెంట నడుస్తూ) అలసిపోయేవారం కాని ఆయనకు అదేమీ పట్టేది కాదు."[16]

హజ్రత్ కఅబ్ బిన్ మాలిక్ (ర), "ఆయన (స)కు ఆనందం కలిగినప్పుడు ఆయన ముఖారవిందం చంద్రబింబంలా వెలిగిపోయేది" అని ఉల్లేఖించారు.[17]

ఓసారి హజ్రత్ ఆయిషా (ర) దగ్గర ఆయన (స) కూర్చుని ఉన్నారు. చెమట పట్టినప్పుడు ముఖంలోని చారలు ఆ చెమట ద్వారా మెరవ నారంభించాయి. అది చూసిన హజ్రత్ ఆయిషా (ర), అబూ కబీర్ హజ్లీ అనే కవి చెప్పిన ఈ పద్యపాదాన్ని వల్లించారు. దాని అనువాదం ఇలా ఉంది:

"ఆయన ముఖంపై మెరిసే చారలు మేఘాల వెండి చారలు (Silver lining of the clouds) మెరిసినట్లున్నాయి."[18]

అబూ బక్ర్ (ర) ఈ పద్యపాదాన్ని చెప్పేవారు:

"ఆయన అమీన్ (అమానత్తుదారుడు), ఎంపిక చేయబడిన సదాచార సంపన్నులు. మేలు వైపునకు ఆహ్వానించేవారు. అంధకారాన్ని పారద్రోలే పున్నమి వెన్నెల."[19]

హజ్రత్ ఉమర్ (ర) జుహైర్ రచించిన ఈ పద్యపాదాన్ని చదివేవారు:

"మీరు మానవులు కాకుండా మరేదైనా అయితే, మీరే పున్నమి రాత్రిని వెలుగొందించే వారు." దైవప్రవక్త (స) అలాగే ఉండేవారు అని చెప్పేవారు ఆ తరువాత[20] దైవప్రవక్త (స) క్రోధాన్ని ప్రకటించినప్పుడు ఆయన రెండు బుగ్గలు దానిమ్మ గింజల్లా ఎరుపెక్కేవి.[21]

16. జామయె తిర్మిజీ-4/306; మిష్కాత్ - 2/518. 17. సహీహ్ బుఖారి-1/502.
18. రహ్మతుల్ లిల్ ఆలమీన్ - 2/172. 19. మేలాసతుస్సియర్-పుట. 20.
20. కులాసతుస్సియర్ - పుట. 20.
21. మిష్కాత్-1/22; తిర్మిజీ-అబ్వాబుల్ కద్ర్-2/35.

హజ్రత్ జాబిర్ బిన్ సమ్రా (ర) కథనం ఇలా ఉంది:

"ఆయన చీలమండలు అంత బలుపు కాకుండా సన్నగా ఉండేవి. ఆయన నవ్వాల్సి వస్తే కేవలం చిరునవ్వు నవ్వేవారు (మందహాసం చేసేవారు). ఆయన కళ్ళ వైపు గనక చూస్తే, సుర్మా పెట్టుకున్నారా అని అనిపించేది. అయినా ఆయన కళ్ళకు సుర్మా ఉండేది కాదు."[22]

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (ర), "ఆయన (స) ముందటి రెండు పళ్ళు కలుసుకోకుండా సందు కలిగి ఉండేవి. మాట్లాడేటప్పుడు ఆ రెండు మునిపళ్ళ మధ్య నుండి కాంతి వెలువడుతున్నట్లనిపించేది" అని అంటారు.[23]

"మెడ నున్నటి ఆటబొమ్మ మెడలా ఉండేది. కనురెప్పలు పొడవు, గడ్డం బవిరి గడ్డం, నుదురు విశాలమైనది. కనుబొమ్మలు ఒకదానితో ఒకటి కలిసి పోయినవి, పైకి ఉబికిన ముక్కు, కనబడీ కనబడనటువంటి బుగ్గలు, ఛాతీ నుండి నాభి వరకు ఓ సన్నని చారగా మొలిచిన వెంట్రుకలు. అవి తప్ప పొట్ట మీదగాని వక్షస్థలంపైగాని ఎక్కడా వెంట్రుకల్లేవు. అయితే భుజాలపై దండచేతుల మీద వెంట్రుకలుండేవి. పొట్టా, వక్షస్థలం రెండూ మట్టు మీరక సమంగా ఉండేవి. ఛాతీ విశాలమైనది, వెడల్పాటి మణికట్టులు, విశాలమైన అరచేతులు, నిలువుగా ఉండే ఎత్తు, అరికాళ్ళు లోతైనవి, అవయవాలు పెద్దవి, నడిచేటప్పుడు ఊపుగా నడిచేవారు. కొంత ముందుకు వంగి అడుగు వేసేవారు. నడక మధ్యస్థంగా ఉండేది."[24]

హజ్రత్ అనస్ (ర) కథనం:

"ప్రవక్త (స) అరచేతులకంటే మృదువైన ఏ పట్టు వస్త్రాన్నీ నేనింతవరకు ముట్టుకోలేదు. అలాగే, మహాప్రవక్త (స) కంటే మేలైన మరే ముష్క్ అంబర్ల సువాసనలను (కస్తూరి మరియు అంబర్ సుగంధ ద్రవ్యాలు) నేను ఆఘ్రాణించలేదు."[25]

హజ్రత్ అబూ హుజైఫా (ర) కథనం:

"నేను ప్రవక్త మహనీయుల హస్తాన్ని నా ముఖంపై పెట్టుకోగా, అది

22. జామియె తిర్మిజీ-4/306. 23. తిర్మిజీ, మిష్కాత్-2/518.
24. కులాసతుస్సియర్- పుట. 19, 20.
25. సహీహ్ బుఖారి-1/503; సహీహ్ ముస్లిమ్-2/257. 26. సహీహ్ బుఖారి-1/502

మంచుకంటే చల్లనిది, ముష్క్‌కంటే సువాసన గలదిగా ఉందని గ్రహించాను."[26]

హజ్రత్ జాబిర్ బిన్ సమ్రాహ్(ర)- ఆయన ఇంకా పిల్లవాడు- ఇలా ఉల్లేఖిస్తున్నారు:

"ఆయన (స) నా బుగ్గను నిమిరినప్పుడు, ఆ చేయి చాలా చల్లగా, సువాసనగా ఉంది. ఆయన అత్తరు ఉంచిన పాత్ర నుండి దాన్ని ముంచి తీశారా అని అనిపించింది నాకు." [27]

హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖనం:

"ఆయన (స) చెమట ముత్యమనే భ్రమను కలిగించేది." ఉమ్మె సులైమ్ (ర) ప్రకారం, "ఈ చెమటే అన్నిటికంటే మేలైన సువాసనద్రవ్యం."[28]

హజ్రత్ జాబిర్ ఇలా అంటారు:

"ఆయన (స) ఓ దారిన నడిచి వెళ్ళగా, ఆయన వెళ్ళిన తరువాత మరెవరైనా ఆ దారిన వెడితే, ఆయన (స) శరీరం చెమట సువాసనను ఆఘ్రాణించి, దైవప్రవక్త (స) ఈ మార్గంగుండా వెళ్ళారని తెలుసుకునేవాడు."[29]

మహాప్రవక్త (స) గారి రెండు గూడల నడుమ మొహైనబువ్వత్ (ప్రవక్త పదవికి సంబంధించిన చిహ్నం) ఓ పావురం గ్రుడ్డులా అగుపడేది. శరీరం రంగులో కలిసి, ఎడమ గూడకు దాపున ఉన్న 'కరీ' ఎముక (మెత్తటి ఎముక)కు ఆనుకొని ఉంది. దానిపై పైకి ఉబికిన అనేక పుట్టుమచ్చలుండేవి.[30]

పరిపూర్ణ వ్యక్తిత్వం - సద్గుణ ప్రాధిమ

మహాప్రవక్త (స) మంచి వాక్పటిమ కలవారు. ఆయనకు జలజలపారే సెలయేరులాంటి వక్తృత్వాన్ని, పదాలను విడమర్చి చెప్పే శక్తిని, అర్థం బోధపడేటట్లు వాక్యాల ప్రయోగం చేసే నేర్పును, మొగమాటం లేకుండా సార్థకమైన విశాల భావాలు బోధించే వాగ్ధరిని ప్రసాదించాడు దైవం. అదే కాకుండా, ఆయనకు అరబ్బులు మాట్లాడే భాషలన్నీ తెలుసుకునే జ్ఞానం లభించింది. ప్రతి తెగవారితో ఆయన, అలంకార సహితంగా వారి భాషలోనే

27. సహీహ్ ముస్లిమ్-2/256. 28. సహీహ్ ముస్లిమ్-2/256.
29. దారిమీ, మిష్కాత్-2/517. 30. సహీహ్ ముస్లిమ్-2/259, 260.

మాట్లాడేవారు. ఆయనకు బుద్వీల వాగ్ధాటి, ప్రసంగబలం మరియు నగరవాసుల స్వచ్ఛమైన పదోచ్ఛారణా కౌశలం, భాషాపటిమలు ఒసగబడ్డాయి. ఇది కాకుండా దైవవాణి రూపంలో ఉన్న అల్లాహ్ సహాయ సహకారాలు వాటికి అదనం.

ఓర్పు, సహనశక్తి, శక్తి ఉన్నప్పటికి క్షమించి వదలడం, కష్టాల్లో సహనాన్ని, సంయమనాన్ని పాటించడం లాంటి సుగుణాల ద్వారా అల్లాహ్ ఆయనకు శిక్షణ గరిపాడు. ప్రతి సహనశీలునికి సంబంధించిన ఏదో ఒక పొరపాటు ప్రజలకు తెలిసిపోతుంది. కాని మహాప్రవక్త (స)కు వ్యతిరేకంగా ఆయన శత్రువులు పెట్టే హింసలు, చేసే దౌర్జన్యాలు, ఆయనకు వ్యతిరేకంగా పోకిరి మూకల తెగింపు రోజురోజుకు పెరిగిపోతున్నా, ఆయన సహనం కూడా అంత పెరుగుతూపోయింది. హజ్రత్ ఆయిషా (ర) ఓ ఉల్లేఖనంలో ఇలా అంటారు:

"దైవప్రవక్త (స) రెండు విషయాల్లో ఏదో ఒకటి ఎంచుకోవలసి వస్తే, ఆయన (స) అందులోనూ, ఎలాంటి చెడు లేనటువంటి సులువైన విషయాన్నే ఎంచుకునేవారు. అదే పాపకార్యం అయితే అందరికంటే తాము దానికి దూరంగా ఉండేవారు. తన స్వవిషయంలో ఆయన ఎప్పుడూ ఒకరితో పగతీర్చుకోలేదు. అయితే అల్లాహ్ హరాం చేసిన వాటిని అధిగమిస్తే, అల్లాహ్ కోసం ఆయన ఆ వ్యక్తిని శిక్షించేవారు."[31]

మహాప్రవక్త (స) అందరికంటే ఎక్కువగా కోపోద్రేకాలకు దూరంగా ఉండేవారు. అలాగే అందరితో త్వరలోనే రాజీపడిపోయేవారు. దాతృత్వం విషయానికి వస్తే ఆ సుగుణాన్ని అంచనా వేయడానికి కూడా వీలుండదు. పేదరిక భయం లేనివాడు. దానధర్మాలు చేసినట్లే ఆయన (స) దానం చేసేవారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, మహాప్రవక్త(స) అందరికంటే ఎక్కువ దానం చేసేవారు. ఆయన దాతృత్వం రమజాన్ మాసంలో హజ్రత్ జిబ్రీల్(అ.స.) ఆయన్ను వచ్చి కలిసినప్పుడు మరీ పెరిగిపోయేది. హజ్రత్ జిబ్రీల్(అ.స.) రమజాన్ నెలలో ప్రతిరోజూ రాత్రి వచ్చి

31. సహీహ్ బుఖారి - 1/503. 32. సహీహ్ బుఖారి- 1/502.
33. సహీహ్ బుఖారి-1/502.

దివ్య ఖుర్ఆన్ పారాయణం చేయించేవారు. అప్పుడు ఆయన దాతృత్వం మరింత పెరిగిపోయేది.[32]

హజ్రత్ జాబిర్ (ర)గారి ఉల్లేఖనంలో, "ఆయన్ను ఏది అడిగినా 'లేదు' అనే మాటే ఆయన నోట రాలేదు" అని ఉంది.[33]

ధైర్యశౌర్య పరాక్రమాల్లో ఆయన స్థానం అందరికంటే మిన్న. అందరికీ తెలిసినదీను. మహాప్రవక్త (స) అందరికంటే ధైర్యస్తులు. ఎంతో కఠినమైన, కష్టతరమైన సమయాల్లో గొప్ప గొప్ప వీరులు సైతం వెనుకడుగు వేసినప్పటికీ ఆయన తన స్థానంలో స్థిరంగా నిలుచున్నారు. వెనక్కుతగ్గే బదులు అడుగు ముందుకే వేసిన సంఘటనలున్నాయి. ఆయన స్థయిర్యపరాక్రమాల్లో ఎలాంటి లోపం రాలేదు. పెద్ద పెద్ద రణధీరులు కూడా ఎప్పుడో ఒకప్పుడు వెనక్కు తగ్గారేమోగాని, దైవప్రవక్త (స) అలా ఎప్పుడూ చేయలేదు. హజ్రత్ అలి (ర) గారి ఉల్లేఖనం: 'యుద్ధజ్వాలలు బాగా ఎగిసి భయంకరమైన యుద్ధం జరిగేటప్పుడు మేము దాని ధాటికి తట్టుకోలేక దైవప్రవక్త (స)ను అడ్డుగా పెట్టి ఆయన వెనుకన నిలుచుండే యుద్ధం చేసేవారం. ఆయనకంటే మరెవ్వరూ శత్రువుకు దాపుగా ఉండేవాడు కాదు."[34]

హజ్రత్ అనస్ (ర) కథనం:

"ఓ రోజు రాత్రి మదీనా వారికి ప్రమాదం వచ్చిపడిందనే అనుమానం కలిగింది. ప్రజలు ఆ శబ్దం వైపునకు పరుగులు పెట్టారు. అప్పటికే దైవప్రవక్త (స) అక్కడకు వెళ్ళి తిరిగివస్తూ ఎదురుపడ్డారు వారికి. ఆయన అందరికంటే ముందే ఆ శబ్దం వైపునకు వెళ్ళి (ప్రమాదం గురించిన) ఆరా తీసి వెనక్కు మరిలారు. ఆ సమయంలో ఆయన (స), అబూ తల్హా(ర)గారి జీను లేని గుర్రంపై ఎక్కి ఉన్నారు. మెడలో ఖడ్గం వ్రేలాడుతూ ఉంది. "భయపడకండి, భయపడకండి" (అక్కడ ఏ ప్రమాదమూ లేదు) అని ధైర్యం చెబుతున్నారు ప్రజలకు."[35]

ఆయన అందరిలోనూ అధిక లజ్జ కలిగి చూపును పైకెత్తేవారు కాదు. అబూ సయీద్ ఖుద్రీ (ర) గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది:

"మహాప్రవక్త (స) పరదాలో ఉండే కన్యకంటే అధికంగా సిగ్గుపడేవారు.

34. 'షఫా', కాజీ అయాజ్ - 1/89; సహీహ్ మరియు సునన్‌లలో దీనికి సంబంధించిన ఉల్లేఖనం ఉంది.
35. సహీహ్ ముస్లిమ్-2/252; సహీహ్ బుఖారి-1/407.

ఆయనకు ఏ మాటైనా నచ్చకపోతే వెంటనే ఆయన ముఖకవళికల ద్వారా దాన్ని గుర్తించేవారం."[36]

ఆయన (స) ఎవ్వరినీ కళ్ళలో కళ్ళు పెట్టి చూడలేదు. చూపు క్రిందికే ఉంచేవారు. ఆకాశం వైపునకు చూసే బదులు భూమి వైపే ఎక్కువగా చూసేవారు. సాధారణంగా చూపులు వంచే చూసేవారు. సిగ్గు, ఆత్మాభిమానం ఎంత మెండైనదంటే, అయిష్టమైన మాటనూ ముఖం ముందు చెప్పేవారు కారు. అలాంటి విషయం ఏదైనా వింటే, ఆ చెప్పేవాని పేరును బహిర్గతం చేయకుండా, "ఏమిటీ! కొందరు ఇలా ప్రవర్తిస్తున్నారు?" అని మాత్రమే అనేవారు. 'ఫర్జక్' అనే కవి చెప్పిన ఈ కవితలోని పద్యపాదం పూర్తిగా ఆయన గుణసంపదను బహిర్గతం చేస్తోంది.

"ఆయన సిగ్గు వలన తన చూపులను పైకి ఎత్తరు. ఆయన మూర్తిమత్వం కారణంగా చూపులు పైకిలేచేవి కావు. ఆయన మందహాసం చేస్తున్నప్పుడే ఆయనతో మాట్లాడే వీలుపడుతుంది."

మహాప్రవక్త (స) అందరికంటే ఉత్తమమైన న్యాయనిర్ణేత, సౌశీల్యవంతులు, సత్యసంధుడు, గొప్ప అమానత్తుదారులు. ఈ విషయాన్ని ఆయన మిత్రులు, శత్రువులు సైతం ఒప్పుకుంటారు. ప్రవక్త పదవి లభించక పూర్వమే ఆయన్ను అందరూ 'అమీన్' అని పిలిచేవారు. అజ్ఞాన కాలంలోనే తీర్పు చెప్పమని ప్రజలు ఆయన దగ్గరకు వచ్చేవారు. 'జామయె తిర్మిజీ' గ్రంథంలో హజ్రత్ అలి (ర)గారి ఉల్లేఖనం ఒకటి ఇలా ఉంది:

ఓసారి అబూ జహల్ ఆయనతో, "మేము మిమ్మల్ని అసత్యవాది అని అనడం లేదు. అయితే, మీరు ఏదైతే తెచ్చారో (దివ్యఖుర్ఆన్) దాన్ని మాత్రమే మేము అసత్యమైనదిగా ఖరారు చేస్తున్నాం" అని అన్నాడు. ఇతని ఈ పలుకులకు అల్లాహ్ ఈ క్రింది ఆయత్‌ను అవతరింపజేశాడు.

فَإِنَّهُمْ لَا يُكَذِّبُونَكَ وَلَٰكِنَّ الظَّالِمِينَ بِآيَاتِ اللَّهِ يَجْحَدُونَ ۝

"ఓ ప్రవక్తా! ఈ ప్రజలు కల్పించే మాటల వల్ల నీకు బాధ కలుగుతుందనే విషయం మాకు బాగా తెలుసు. కాని వారు తిరస్కరించేది నిన్ను కాదు. ఈ దుర్మార్గులు వాస్తవానికి తిరస్కరిస్తున్నది అల్లాహ్ ఆయత్‌లనే."[37]

(6:33)

36. సహీహ్ బుఖారి-1/504.

'హెరిక్ల్ చక్రవర్తి' అబూ సుఫ్యాన్‌తో, ఈ ప్రవక్త (స) ఏదైతే చెప్పారో, అంతకుపూర్వం దాన్ని మీరు అసత్యం అని త్రోసిపుచ్చేవారా? అని అడగగా, అబూ సుఫ్యాన్, "లేదు" అని సమాధానమిచ్చాడు.

ఆయన (స) అందరికంటే అధిక నమ్రత కలిగి గర్వానికి దూరంగా ఉండేవారు. ఇతర రాజుల చుట్టూ వారి సేవకులు, ఆదేశపాలకులు నిలబడడం సహజం. అలా తన కోసం సహాబాలు నిలుచొని ఉండడాన్ని ఆయన కఠినంగా వారించారు. సాధువుల్ని పరామర్శించేవారు. నిరుపేదలతో కాలం గడిపేవారు. బానిస భోజనానికి పిలిస్తే అతనింటికి వెళ్ళేవారు. సహాబా (ర)ల నడుమ ఎలాంటి ప్రత్యేకత లేకుండా ఓ సాధారణ వ్యక్తిలా వచ్చి కూర్చునేవారు. హజ్రత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, "మహాప్రవక్త (స) తన చెప్పుల్ని, తమ బట్టలను తామే కుట్టుకునేవారు. సాధారణంగా అందరూ తమ ఇండ్లలో పని చేసినట్లే తమ ఇంట్లో పని చేసేవారు. ఆయన కూడా మనుషులలోని ఓ మనిషే. తమ వస్త్రాల్లో పేలు ఉన్నాయేమో అని వెదికేవారు. మేక పాలను పితికేవారు. తమ పనిని తాము స్వయంగా చేసుకునేవారు."[38]

దైవప్రవక్త (స) అందరికంటే అధికంగా ఇచ్చిన మాటను నెరవేర్చేవారు. బంధువులను ఆదుకునేవారు. ప్రజల ఎడల దయతో మెలిగేవారు. గృహ జీవన మర్యాదలను చక్కగా పాటించేవారు. ఆయన నైతిక సుగుణాలు అందరికంటే విశాలమైనవి. అనైతికత అంటే అసహ్యపడేవారు. ఆయన నోట ఎలాంటి దుర్భాషలు వెలువడలేదు. ఒకరిని తిట్టడంగాని, తూలనాడడంగాని జరిగేది కాదు. అలాగే బజారుల్లోనికి వెళ్ళి అరవడంగానీ జరగలేదు. తమ ఎడల దురుసుగా ప్రవర్తించేవారిని, తనను హింసించేవారిని క్షమించి వదలి వేసేవారు. ఎవ్వరూ తనకు వెనకాల నడవడానికి ఒప్పుకునేవారుకారు. ఆహార పానీయాదుల విషయంలో తమ స్త్రీ పురుష బానిసలపైగాని, సేవకులపైగాని ఎప్పుడూ ఆధిక్యతను చూపలేదు(అంటే తాను తినేదే వారికి పెట్టేవారు). తమ సేవకుడు చేయవలసిన పనిని తామే స్వయంగా చేసేసేవారు. ఎప్పుడూ తన సేవకుణ్ణి చీదరించుకోలేదు. అలాగే చేయవలసిన పనిని చేయనందుకుగాని, చేయకూడని పని చేసినందుకుగాని కోప్పడలేదు. సాధువులను

37. మిష్కాత్-2/521

38. మిష్కాత్-2/520

ప్రేమించేవారు. వారితో కలసి కూర్చునేవారు. వారి జనాజాలలో హాజరయ్యే వారు. పేదవారిని వారి పేదరికం వల్ల తక్కువగా చూడలేదు. ఓసారి ఓ ప్రయాణం సందర్భంగా ఓ మేకను కోయాలనే తీర్మానించడం జరిగింది. వారిలో ఒకడు నేను జిబహ్ చేస్తాను అనగా మరొకడు దాని తోలును నేను వలుస్తాను అని ముందుకు వచ్చాడు. మూడోవాడు వండే బాధ్యత నాదీ అని అన్నాడు. మహాప్రవక్త(స), "కట్టెలు తెచ్చే బాధ్యత నాది" అని అనగా సహాబా (ర), "మేము మీ పనిని కూడా చేసేస్తాం" అన్నారు. దానికి మహాప్రవక్త (స), "ఔను. నాకు తెలుసు, మీరు నా పని చేసి పెడతారని. కాని దాన్ని నేనంగీకరించను. నేను మీలో ప్రత్యేక వ్యక్తిని అనిపించుకోవడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే, మనిషి తన మిత్రుల్లో నేనే ప్రత్యేకత గలవాణ్ణి అని అనుకోవడాన్ని అల్లాహ్ ఇష్టపడడు" అని సెలవిచ్చారు. ఆ తరువాత ఆయన లేచివెళ్ళి కట్టెలు ఏరుకొని వచ్చారు."[39]

రండి, ఇప్పుడు మనం హింద్ బిన్ అబీ హాలా (ర) నోట దైవప్రవక్త (స) గుణగణాలను విందాం. 'హింద్' తన ఓ సుదీర్ఘమైన ఉల్లేఖనంలో ఇలా అంటున్నారు.

"ప్రవక్త మహనీయులు (స) ఒకదానిపై ఒకటి వరుసగా వచ్చిపడే దుఃఖాలతో సతమతమవుతూనే ఉండేవారు. ఎప్పుడూ ఏదో ఒక ఆలోచనే. సుఖం అనేదే ఎరుగరు. అవసరం వస్తే తప్ప మాట్లాడేవారు కారు. ఏ మాట చెప్పాలన్నా సందిగ్ధం లేకుండా నోరారా విడమర్చి చెప్పేవారు. చెప్పే విషయాన్ని సూటిగా చెప్పేవారు. అవసరానికి తగినంతగానే మాట్లాడేవారు. మృదు భాషి. దగా, కృతఘ్నతకు ఆమడ దూరంలో ఉండేవారు. మామూలు దైవానుగ్రహాన్ని సైతం గౌరవించేవారు. దేన్నీ నిందించేవారు కారు. భోజనంలో లోపాలను ఎంచడంగాని, పొగడడంగాని చేసేవారు కాదు. సత్యాన్ని విమర్శించినా లేదా నిరాకరించినా, పగ తీర్చుకునే వరకు ఊరుకునేవారు కాదు. అయితే, విశాల హృదయం కలిగి, వ్యక్తిగత విషయాల్లో ఉద్రేకపడడం గాని, పగతీర్చు కోవడం గాని చేసేవారుకారు. ఏదైనా చెప్పేటప్పుడు అరచేతిని జనం వైపునకు చాచి మాట్లాడేవారు. ఆశ్చర్యం కలిగినప్పుడు అరచేతిని వెనక్కు త్రిప్పేవారు. కోపం వచ్చినప్పుడు ముఖాన్ని త్రిప్పేసుకునేవారు. ఆనందం కలిగినప్పుడు చూపును

39. కులాసతుస్సియర్ - పుట. 22.

వంచేసుకునేవారు. ఆయన నవ్వంతా మందహాసమే. చిరునవ్వు నవ్వేటప్పుడు మునిపల్లు వడగళ్ళలా తెల్లగా మెరిసేవి.

తెలియని విషయం గురించి మాట్లాడేవారే కారు. సహచరులను, మిత్రులను పరస్పరం కలపడమేకాని వారి నడుమ మనస్పర్ధలు కలిగించే వారు కారు. ప్రతి జాతికి చెందిన పెద్ద మనుషుల్ని గౌరవించేవారు. వారినే ఆ జాతికి సంరక్షకులుగా చేసేవారు. పరుల (చెడుగు) నుండి జాగరూకులై అప్ర మత్తంగా ఉండేవారు. అయినప్పటికీ వారి ఎడల చిరునవ్వుతో మెలిగేవారు.

తమ అనుచరుల బాగోగులను చూస్తూ, ప్రజల పరిస్థితులను తెలుసు కుంటూ ఉండేవారు. ప్రతి మంచి వస్తువును పొగిడేవారు. ప్రతి చెడును తెగిడేవారు. ఎగుడు దిగుడులు లేని మనస్తత్వాన్ని ప్రదర్శిస్తూ మధ్యస్థంగా ఉండేవారు. ప్రజలు బాధపడకుండా అప్రమత్తులై ఉండేవారు. అన్ని పరిస్థితులనూ ఎదుర్కోడానికి సిద్ధపడి ఉండేవారు. సత్యం ఎడల చూపోపుగా ఉండకుండా, అసత్యం వైపునకు మ్రొగ్గేవారు కారు. ఆయన వెంట ఉన్న వారంతా అందరికంటే మేలైనవారు. వారిలోను ఆయనకు మరీ చేరువగా ఉన్నవారు అందరికంటే హితైషి. మంచి సహాయకుడో, మేలైన హితైషి ఎవరో వారే ఆయన దృష్టిలో గౌరవనీయులు.

మహాప్రవక్త (స) కూర్చున్నా, లేచి నిల్చున్నా, ప్రతి కదలికలోను దైవాన్ని తప్పక స్మరించేవారు. తన కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించుకునేవారుకారు. ప్రజలు కూర్చున్న చోటికి వెడితే, ఆ సభలో తనకు ఎక్కడ స్థానం దొరికితే అక్కడనే కూర్చునేవారు. ప్రతివారికి ఆ విషయాన్నే బోధించేవారు. కూర్చుని ఉన్న ప్రతి వ్యక్తికి అతని హక్కును ప్రసాదించేవారు. సభలో కూర్చున్న ఏ వ్యక్తి కూడా ఆయన దృష్టిలో తనకంటే గౌరవనీయుడు లేడనే తలచేవాడు. ఎవరైనా అవసరముండి ఆయన దగ్గరకు వచ్చి కూర్చున్నా లేదా వచ్చి నిలబడినా మహాప్రవక్త (స) అతని కోసం, అతను తిరిగి వెళ్ళిపోయేంత వరకు సహనంగా అక్కడనే ఉండిపోయేవారు. ఎవరైనా వచ్చి ఆయన్ను యాచిస్తే అతనికి ఇవ్వకుండా లేదా ఓ మేలైన మాటను చెప్పకుండా వెనక్కు పంపించే వారుకారు. దైవప్రవక్త (స) తన చిరునవ్వుతో, తన నైతిక సుగుణాలతో అందరికీ ఏదో ఒకటి ప్రసాదించినవారే. చివరకు ఆయన ప్రజల్లో తండ్రి స్థానాన్ని అలంకరించారు. అందరిలోనూ సరిసమాన హక్కులు కలిగి ఉండేవారు.

ఎవరికైనా ఆధిక్యత ఉంటే, అది అ వ్యక్తికి దైవం ఎడల గల భయభక్తుల విషయంలోనే. ఆయన (స) సభ విజ్ఞానం, వ్రీడ, సహనం, అమానత్తుల సభ. ఆ సభలో పెద్దగా అరవడంగాని, దైవంచే నిషేధించబడిన వాటిని అతిక్రమించడంగాని జరగకపోయేది- అంటే ఒకరి గౌరవానికి, మానమర్యాదలకు భంగం కలిగే భయం ఉండేది కాదు- ప్రజలు తఖ్వాతో (దైవం ఎడల భయపడుతూ) పరస్పరం ప్రేమించుకునేవారు. పెద్దల్ని గౌరవించేవారు. పిల్లలపై దయ చూపేవారు. పేదల అవసరాలను తీర్చేవారు. ఆగంతకుని ఎడల ప్రేమతో మెలిగేవారు.

మహనీయ ముహమ్మద్ (స) ముఖారవిందం ఎప్పుడూ విప్పారే ఉండేది. అందరికీ అర్థమయ్యేలా మాట్లాడేవారు. కరుణ ఉట్టిపడేటట్లు ప్రవర్తించేవారు. దగా, మోసం మరియు కఠినత్వానికి దూరంగా ఉండేవారు. పెద్దగా అరుస్తూ మాట్లాడేవారు కారు. దుర్భాషలుగాని, తిట్లుగాని ఎప్పుడూ ఆయన నోట వెలువడలేదు. అలాగే మరీ పొగిడేవారుకాదు. కోరిక లేని వాటి గురించి ఆలోచించేవారే కాదు. నిరాశానిస్పృహలు ఆయన దరికే చేరేవి కావు. ప్రవక్త మహనీయులు (స) తన మనస్సులో మూడు విషయాలకు చోటు ఇవ్వలేదు. 1) రియా (ప్రదర్శనాబుద్ధి), 2) యథేష్టము, 3) తెలియని విషయాలను చెప్పడం. అలాగే మూడు విషయాల ద్వారా ప్రజల మనస్సులను బాధించకుండా సురక్షితం చేశారు. అవి: 1) ఒకరిని నిందించడం, 2) ఒకరి గౌరవాన్ని భంగపర్చడం, 3) ఒకరి లోపాలను ఎంచడం. సత్ఫలితాన్నిచ్చే విషయాన్నే పలికేవారు. ఆయన(స) మాట్లాడేటప్పుడు, ఆయన వెంట ఉన్న వారు తలపై పక్షులు కూర్చున్నాయా అన్నట్లు కదలకుండా నిశ్శబ్దంగా ఉండి వినేవారు. ఆయన (స) తమ మాటను పూర్తి చేయగా సహచరులు ఆయనతో మాట్లాడేవారు. అనవసరమైన విషయాలను ప్రస్తావించేవారుకారు. ఒకడు మాట్లాడుతూ ఉండగా మిగిలిన వారు, అతను తన మాటను పూర్తి చేసేటంత వరకు నిశ్శబ్దాన్ని పాటిస్తూ వినేవారు. ఆయన (స) అందరికంటే ముందు మాట్లాడిన వారికి ముందుగా సమాధానం చెప్పేవారు. నవ్వు పుట్టించే విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు అందరితోపాటే తాము కూడా నవ్వేవారు. ఆశ్చర్యం కలిగినప్పుడు అందరితో పాటే ఆయన(స) కూడా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చేవారు. ఆగంతకుడు ఎవరైనా దగా మాటలు చెబుతూ ఉంటే సహనం వహించేవారు.

ఇంకా ఇలా బోధించేవారు: "నిరుపేద ఎవరైనా తన అవసరార్థం మీ దగ్గరకు వచ్చాడని గ్రహిస్తే మీరు అతని అవసరాన్ని తీర్చండి." ఆయన దైవాన్ని తప్ప మరెవ్వరినీ కీర్తించేవారు కారు."[40]

ఖారిజా బిన్ జైద్ (ర)గారి ఉల్లేఖనం: మహాప్రవక్త (స) తాను కూర్చుని ఉన్న సభలో అందరికంటే హుందాగా అగుపించేవారు. తమ శరీర అవయవాల్లో దేన్నీ వస్త్రాల నుండి బయటకు తీసేవారుకారు. చాలా మట్టుకు మౌనంగానే ఉండేవారు. అవసరం వస్తే తప్ప మాట్లాడేవారు కాదు. ఎవరైనా అసందర్భ ప్రేలాపనకు దిగితే అతని వైపు నుండి ముఖం త్రిప్పుకునేవారు. ఆయన నవ్వంతా మందహాసమే. మాటలు, అనవసరమైనవి, పూర్తి అర్థాన్ని ఇవ్వనివి కాకుండా ఖరాఖండిగా, సూటిగా ఉండేవి. ఆయన సహాబా (ర) (అనుచరులు) ఆయన్ను గౌరవిస్తూ పెద్దగా నవ్వకుండా మందహాసమే చేసేవారు. [41]

చెప్పొచ్చిందేమిటంటే, మహాప్రవక్త ముహమ్మద్ (స) సాటిలేని మేటి సుగుణాల రాశి. ఆయన ప్రభువు ఆయనకు సాటిలేని మర్యాదలను ప్రసాదించాడు. స్వయంగా, ఆయన(స)ను పొగుడుతూ దివ్యఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

وَإِنَّكَ لَعَلَىٰ خُلُقٍ عَظِيمٍ ④

"వ ఇన్నక లఅలా ఖుల్ఖిన్ అజీమ్" (68 : 4)

(నీవు నిస్సందేహంగా మహోన్నతమైన శీలం కలవాడవు)

ఇలాంటి శీలసంపద గలవారైనందునే మహాప్రవక్త (స) వైపునకు ప్రజలు ఆకర్షింపబడ్డారు. వారి హృదయాల్లో ఆయన (స) ప్రేమ నాటుకు పోయింది. ఆయన కోసం తమ ప్రాణాలనైనా అర్పించేటంతటి నాయకత్వపు స్థానం ఆయనకు లభించింది. ఈ సుగుణాల కారణంగానే ఆయన జాతి యొక్క కాఠిన్యం, అహంభావం అంతా పూర్తిగా మటుమాయమై, తండోప తండాలుగా దైవధర్మంలో చేరిపోయింది.

---

40. షఫా-ఖాజీ అయాజ్ - 1/121 - 126. ఇంకా చూడండి. షిమాయిలె తిర్మిజి.

41. షఫా-ఖాజీ అయాజ్ -107.

వెనుకటి పుటల్లో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)గారి సౌశీల్యం, సుగుణ సంపద, సంపూర్ణ వ్యక్తిత్వం గురించి ఏదైతే మేము వర్ణించగలిగామో, కేవలం అది మా ప్రయత్నం మట్టుకే. కాకపోతే, ఆయన (స) గౌరవ ప్రఖ్యాతులు, సౌశీల్యం, ఔత్కృష్ట్యాల ఎత్తుకు చేరడంగాని, వాటి లోతుల్ని కొలవడంగాని మనకు చేతనయ్యే పనేనా?

దివ్యజ్యోతి ద్వారా వెలుగొంది, దివ్యగ్రంథం చేత మహాగ్ర సౌశీల్య వంతుడుగా ఖరారు చేయబడ్డ ఆ మహోన్నత మానవ మహోపకారి ఔన్నత్యాన్ని కొలవడం ఎవరి తరం?

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ كَمَا صَلَّيْتَ عَلٰى اِبْرَاهِيْمَ وَعَلٰى اٰلِ اِبْرَاهِيْمَ اِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ۔
اَللّٰهُمَّ بَارِكْ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ كَمَا بَارَكْتَ عَلٰى اِبْرَاهِيْمَ وَعَلٰى اٰلِ اِبْرَاهِيْمَ اِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ۔

అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ కమా సలైత అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్.

అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్.

సఫీవుర్రహ్మాన్ అల్ ముబారక్‌పూరి

హుసైనాబాద్ ముబారక్‌పూర్ — రమజాన్ 16, హి.శ. 1404

ఆజంగఢ్ జిల్లా (యు.పి.) ఇండియా — జూన్ 17, 1984.

ఆధార గ్రంథాలు

క్ర.సం.	గ్రంథంపేరు	రచయిత	మరణం	పబ్లికేషన్	వెలువడిన
1.	అక్బారుల్ కిరామ్ బ అక్బారుల్ - మస్జిదుల్ హరామ్	షహాబుద్దీన్ అహ్మద్ బిన్ ముహమ్మదుల్ అసది. అల్‌మక్కి	1066 హిజ్రీ	అల్‌ముతబఉల్ సల్ఫియా బెనారస్	1396 హి.
2	అల్ అదబుల్ ముఫ్రిద్ -	ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ అల్ బుఖారి -	356 హిజ్రీ -	ఇస్తాంబోల్ -	1304 హి.
3	అల్ ఆలామ్ -	ఖైరుద్దీన్ అజ్జర్‌కలీ -	- కైరో -		1954 క్రీ.శ
4	అల్ బదాయా వన్నహాయా -	ఇస్మాయీల్ బిన్ కసీర్ అద్దిమిష్కి -		అస్సఆదత్, ఈజిప్ట్ -	1932 క్రీ.శ
5	బులూగుల్‌మరామ్ మిన్ అదుల్లతుల్ అహ్కామ్-	అహ్మద్ బిన్ హజ్ర్ అస్కలాని -	853 హి.శ -	అల్ కయ్యూమి, కాన్పూర్ -	1323 హి.
6	తారీక్ అర్జుల్ ఖుర్‌ఆన్ -	సయ్యద్ సులైమాన్ నద్వీ -	1373 హి.శ -	మారిఫ్ ప్రెస్, ఆజమ్‌గఢ్ -	1955 క్రీ.శ
7.	తారీకుల్ ఇస్లామ్ - అక్బర్‌షా నజీబాబాది -	మక్తబా రహ్మత్, దేవ్‌బంద్-			
8	తారీకుల్ ఉమమ్ వల్ ములూక్ -	ఇబ్నె జరీర్ తిబ్రీ -		అల్‌హుసీనతుల్ మిస్రియా, ఈజిప్ట -	
9	తారీక్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) -	అబుల్ ఫర్జ్ అబ్దుల్ రహ్మాన్ బినుల్ జూజీ -		అత్తోఖుల్ అద్‌బియా, ఈజిప్ట	
10.	తొహ్ఫాతుల్ అహ్వజీ -	అబుల్ అలీ అబ్దుర్రహ్మాన్ అల్ ముబారక్‌పూరి -	1353 హి. (1935క్రీ.శ) -	బర్కీప్రెస్, ఢిల్లీ (ఇండియా) -	1353 హి.
11.	తఫ్సీర్ ఇబ్నె కసీర్ -	ఇస్మాయీల్ బిన్ కసీర్ అద్దిమిష్కి -		దారుల్ ఉన్దులుస్, బీరట్	
12.	తఫ్హీముల్ ఖుర్‌ఆన్ -	అల్ ఉస్తాజ్ సయ్యద్ అబుల్ ఆలా అల్ మౌదూది -		మర్కజీ మక్తబా, జమాఅతె ఇస్లామీ	
13.	తల్ఖీహ్ ఫహూమ్ అహ్లల్ అస్ర్ -	అబుల్ ఫర్జ్ అబ్దుర్రహ్మాన్ బిన్ అల్‌జూజీ -	597 హి. -	జయ్యద్ ప్రెస్, ఢిల్లీ (ఇండియా)	
14.	జామె ఉత్తిర్మిజీ -	అబూ ఈసా ముహమ్మద్ బిన్ ఈసా బిన్ సూరతుత్తిర్మిజీ -	279 హి. -	అల్ మక్తబా రషీదియా, ఢిల్లీ.	
15.	అల్ జిహాద్ ఫిల్ ఇస్లామ్ (ఉర్దూ) -	సయ్యద్ అబుల్ ఆలా మౌదూది -		ఇస్లామిక్ పబ్లికేషన్స్, లాహోర్	

ఆధార గ్రంథాలు

క్ర.సం.	గ్రంథంపేరు	రచయిత	మరణం	పబ్లికేషన్	వెలువడిన
16.	కులాసతుస్సియర్ -	ముహిబ్బుద్దీన్ అబూ జాఫర్ అహ్మద్ బిన్ అబ్దుల్లా తిబ్రీ -	675 హి. -	వలీ ప్రింటింగ్ ప్రెస్, ఢిల్లీ (ఇండియా) -	1343 హి.
17.	రహ్మతుల్ లిల్ ఆలమీన్ -	ముహమ్మద్ సులైమాన్ సల్మాన్ మన్సూర్‌పూరి -	1930 క్రీ.శ.	హనీఫ్ బుక్ డిపో, ఢిల్లీ	
18.	రసూలె అక్రమ్ కీ సియాసీ జిన్దగీ -	డాక్టర్ హమీదుల్లాహ్ (పారిస్) -		సాలిమ్ కంపెనీ, దేవ్‌బంద్ -	1963 క్రీ.శ.
19.	అర్రౌజుల్ అన్ఫ్ -	అబుల్ ఖాసిం అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ అస్సుహైలీ -	581 హి. -	అల్ జమాలియా (ఈజిప్ట్) -	1332 హి.
20.	జాదుల్ ముఆద్ -	హాఫిజ్ ఇబ్నె ఖైమ్ -	751 హి. -	అల్ మిస్రియా -	1347 హి.
21.	అస్సరుత్తీన్-				
22.	సునన్ ఇబ్నె మాజా -	అబూ అబ్దుల్లాహ్ ముహమ్మద్ బిన్ యజీద్ బిన్ మాజతుల్ కర్వీనీ - 273 హి.			
23.	సునన్ అబీ దావూద్ -	అబూ దావూద్ సులైమాన్ అల్ అషఅసుల్ సజ్జానీ -	275 హి. -	మక్తబా రహీమియా, దేవ్‌బంద్ -	1375 హి.
24.	సుననున్నిసాయీ -	అబూ అబ్దుర్రహ్మాన్ అహ్మద్ బిన్ షుఅయి బున్నిసాయీ	303 హి. -	మక్తబా సల్ఫియా, లాహోర్	
25.	అస్సీరతుల్ హల్బియా -	ఇబ్నె బుర్హానుద్దీన్			
26.	అస్సీరతున్నబవియా -	అబూ ముహమ్మద్ అబ్దుల్ మలిక్ బిన్ హిషామ్ బిన్ అయ్యూబుల్ హుమైరీ -	213 హి. లేదా 218 హి. -	ముస్తఫల్బాబీ (ఈజిప్ట్) -	1375 హి.
27.	షరహ్ షజ్ వర్రజ్ హాబ్ -	అబూ ముహమ్మద్ అబ్దుల్లా జమాలుద్దీన్ బిన్ యూసుఫ్ -	671 హి. -	మత్బఉస్సఆదా, ఈజిప్ట్	
28.	షరహ్ సహీ ముస్లిమ్ -	అబూ జకరియా ముహియొద్దీన్ యహ్యా బిన్ షర్ఫున్నవీ -	676 హి. -	అల్ మక్తబా రషీదియా, ఢిల్లీ -	1376 హి.
29.	షరహ్ మవాహిబుల్ లదునియా -	అజ్జర్ఖావి - నుస్కతు అత్కి, యా మహాజూమ తుల్ అవాయిల్			
30.	అష్ఫా బతారీఫ్ హుకుకుల్ ముస్తఫా -	అల్‌ఖాజీ అయాజ్ -		మత్బాఅ ఉస్మానియా,	

ఆధార గ్రంథాలు

క్ర.సం.	గ్రంథంపేరు	రచయిత	మరణం	పబ్లికేషన్	వెలువడిన
31.	సహీహుల్ బుఖారీ -	ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ బుఖారి -	256 హి. -	అల్ మకతబా రహీమియా, దేవ్‌బంద్ -	1387 హి.
32.	సహీహ్ ముస్లిమ్ -	ముస్లిమ్ బిన్ అల్ హుజ్జాజ్ అల్ కుషేరీ -		అల్ మక్తబా రషీదియా, ఢిల్లీ -	1376 హి.
33.	సహీ ఫతుల్ జూకూక్-				
34.	సులహుల్ హుదైబియా -	ముహమ్మద్ అహ్మద్ బాషీల్ -		దారుల్ ఫిక్ర్ -	1391 హి.
35.	అత్తబాకుతుల్ కుబ్రా -	ముహమ్మద్ బిన్ సఅద్ -		బ్రిల్ లెడెన్ ప్రెస్ -	1322 హి.
36.	ఔనుల్ మాబూద్ షరహ్ అబూ దావూద్ -	అబూ తయ్యిబ్ షమ్సుల్ హక్ అల్ అజీమాబాదీ -		ప్రథమ ఎడిషన్	
37.	గజ్వయె ఉహద్ -	ముహమ్మద్ అహ్మద్ బాషీల్-		ద్వితీయ ముద్రణ	
38.	గజ్వయె బదరుల్ కుబ్రా -	ముహమ్మద్ అహ్మద్ బాషీల్ -			1376 హి.
39.	గజ్వయె ఖైబర్ -	ముహమ్మద్ అహ్మద్ బాషీల్ -		దారుల్ ఫిక్ర్ - 1391 హి.	
40.	గజ్వయె బనీ కురైజా -	ముహమ్మద్ అహ్మద్ బాషీల్ -			1376 హి.
41.	ఫత్‌హుల్ బారి -	అహ్మద్ బిన్ అలీ బిన్ హజ్ర్ అస్కలానీ -	852 హి.	అల్ ముతబ అతుల్ సల్ఫియా	
42.	ఫిక్‌హుస్సీయరహ్ -	ముహమ్మద్ అల్ గజాలి -		దారుల్ కితాబుల్, అరబీ -	1370 హి.
43.	ఫీ జిలాలిల్ ఖుర్ఆన్ -	సయ్యద్ ఖుతుబ్ -		దారుల్ హయాఉత్తరాస్, అరబీ	
44.	అల్ ఖుర్ఆనుల్ కరీమ్-				
45.	ఖలబుల్ జజీరతుల్ అరబ్ -	ఫుఆద్ హమ్‌జా -		అల్ మత్‌బ ఉస్సల్ఫియా మిస్ర్ (ఈజిప్ట్) -	1352 హి.
46.	మాజాఖసరుల్ ఆలం బ ఇన్హితాతుల్ ముస్లిమీన్ -	అసయ్యద్ అబుల్ హసన్ అలి అల్‌హుస్‌నిన్నద్వి -		మక్తబా దారుల్ ఉరూబా అల్ ఖాహిరహ్ -	1381 హి.

ఆధార గ్రంథాలు

క్ర.సం.	గ్రంథం పేరు	రచయిత	మరణం	పబ్లికేషన్	వెలువడిన
47.	ముహాజిరాతుత్తారీకుల్ ఉమముల్ ఇస్లామియా -	అష్షేక్ ముహమ్మదుల్ ఖిజ్రీ బిన్ -		అల్ మక్తబతుత్తిజా రియా అల్‌కుబ్రా (ఈజిప్ట్) -	1382 హి.
48.	ముక్తసరుస్సీరతుర్రసూల్ -	షేఖుల్ ఇస్లామ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ నజదీ -	1206 హి. -	మత్బఅతుస్సున్నతుల్ ముహమ్మదియా -	1375 హి.
49.	ముక్తసరుస్సీరతుర్రసూల్ -	అష్షేక్ అబ్దుల్లా బిన్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ నజది		మక్తబా సల్ఫియా, ఈజిప్ట్ -	1379 హి.
50.	మదారుకుత్తన్జీల్ - లిన్నసఫీ				
51.	మర్ఆతుల్ మఫాతీహ్ (సంపుటం-2) -	అష్షేక్ ఉబైదుల్లా రహ్మానీ ముబారక్ పూరీ -		నామి ప్రెస్, లక్నో -	1378 హి.
52.	మురవ్విజుజ్జహబ్ -	అబుల్ హసన్ అలీ మస్ఊది -		షర్కుల్ ఇస్లామియా దాయిరతుల్	
53.	అల్ ముస్తదరిక్ -	అబూ అబ్దుల్లాహ్ ముహమ్మద్ అల్ హాకిమ్ నీషాపూరి -		ముఆర్ఫుఉస్మానియా, హైదరాబాద్ (ఇండియా)	
54.	ముస్నదె అహ్మద్ -	ఇమామ్ అహ్మద్ బిన్ ముహమ్మద్ బిన్ హంబల్ -	264 హి.		
55.	ముస్నదుద్దారిమి -	అబూ ముహమ్మద్ అబ్దుల్లా బిన్ అబ్దుర్రహ్మాన్ అద్దారిమీ -	255 హి.		
56.	మిష్కాతుల్ మసాబీహ్ -	వలీయుద్దీన్ ముహమ్మద్ బిన్ అబ్దుల్లా తబ్రీజీ -		మక్తబా రహీమియా, దేవ్‌బంద్	
57.	మౌజముల్‌బుల్దాన్ -	యాకూతుల్ మహ్మూదీ			
58.	అల్ మవాహిబుల్ లదునియా లిల్‌కిస్తాని - -			మతబ ఉష్షరియా -	1336 హి.
59.	ముఅత్తా అల్ ఇమామె మాలిక్ -	అల్ ఇమామె మాలిక్ బిన్ అనస్ అల్ అస్బహీ -	69 హి. -	మక్తబ తుర్రహీమియా, దేవ్‌బంద్	
60.	వఫా ఉల్ వఫా -	అలీ బిన్ అహ్మదుస్సమ్‌హూదీ-			

అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్

మా ప్రచురణలు

క్ర.స.	పుస్తకాలు	వెల రూ.
1.	మహాప్రవక్త (స) మహితోక్తులు (Part-I)	175-00
2.	మహాప్రవక్త (స) మహితోక్తులు(Part-II)	150-00
3.	హదీసు మకరందం (Part-I)	250-00
4.	హదీసు మకరందం (Part-II)	225-00
5.	పవిత్ర ఖుర్‌ఆన్ పరిచయం	22-00
6.	ఇస్లాం ధర్మశాస్త్రం (Part-I)	45-00
7.	ఇస్లాం ధర్మశాస్త్రం (Part-II)	40-00
8.	ఇస్లాం జీవన శైలి	20-00
9.	హృదయాల విజేత ముహమ్మద్ (స)	27-00
10.	ఆదర్శ మహిళ హజ్రత్ ఆయిషా (ర.అ)	70-00
11.	దేవుడు ఒక్కడే	12-00
12.	మస్జిద్ వ్యవస్థ	20-00
13.	రమజాన్ శుభాలు	8-00
14.	తల్లిదండ్రుల హక్కులు	5-00
15.	భార్యాభర్తల హక్కులు	5-00
16.	సంతానం హక్కులు	5-00
17.	అజాన్	4-00
18.	బాలలు : ఇస్లాం	9-00
19.	స్త్రీ : ఇస్లాం వెలుగులో	18-00
20.	కారుణ్యం కురిసే వేళ	5-00
21.	ప్రవక్త గారి ప్రార్థనలు	16-00
22.	సత్యపథంలో అవరోధాలు	6-00
23.	రుజుమార్గం	12-00
24.	సూరె ఫాతిహా సారాంశం	5-00
25.	సుమధుర సందేశం	12-00
26.	ప్రవక్తల పిలుపు	12-00

27.	మానవ జీవితంపై నమాజ్ ప్రభావం	15-00
28.	వడ్డీ	8-00
29.	ఇస్లాం మెచ్చిన మహిళలు	14-00
30.	హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రహ్మలై)	12-00
31.	సమాధి....!?	4-00
32.	అసూయ	8-00
33.	మానసిక రుగ్మతలు	8-00
34.	ఆలస్యం అమృతం విషం	8-00
35.	పశ్చాత్తాపం	12-00
36.	పరదా	6-00
37.	ముహమ్మద్ (స) క్రీస్తు సహజ వారసులు	16-00
38.	ఇస్లాం నైతిక విధానం **(Part-I)**	15-00
39.	ఇస్లాం నైతిక విధానం **(Part-II)**	12-00
40.	మార్గదర్శక ఖలీఫా- హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి)	12-00
41.	మార్గదర్శక ఖలీఫా- హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి)	15-00
42.	మార్గదర్శక ఖలీఫా- హజ్రత్ ఉస్మాన్ గని (రజి)	12-00
43.	మార్గదర్శక ఖలీఫా-హజ్రత్ అలీ (రజి)	12-00
44.	అల్లాహ్ శరణు	8-00
45.	సమాధుల సందర్శన	10-00
46.	మహాప్రవక్త (స) దాంపత్య జీవితం	12-00
47.	తావీజులు - తాయెత్తులు	10-00
48.	సంపూర్ణ నమాజ్	30-00
49.	మహాప్రవక్త (సఅసం) జీవిత చరిత్ర	290-00

పుస్తకాల కొరకు ఈ క్రింది అడ్రస్‌కు సంప్రదించండి.

అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్

ఉజాలెషా ఈద్గాహ్ కాంపౌండ్, అక్బర్ బాగ్,
సయీదాబాద్, హైదరాబాదు-500 059.
ఫోన్: **040 - 24550007,**
9948332404. 9441055065

Notes

الرحيق المختوم

మహాప్రవక్త

(సల్లల్లాహు అలైహి వ సల్లం)

జీవిత చరిత్ర

అర్రహీఖుల్ మఖ్తూమ్

పవిత్ర మక్కా నగరంలోని "రాబితయె అలమె ఇస్లామీ" సంస్థ అధ్వర్యంలో దైవప్రవక్త(స) జీవిత చరిత్ర (సీరత్)పై జరిగిన అంతర్జాతీయ వ్యాస రచన పోటీల్లో మొదటి బహుమతి పొందిన పుస్తకం.

సంకలనం

మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరీ (రహ్మలై)

తెలుగు అనువాదం

యస్.యమ్. ఖాద్రి

అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్
హైదరాబాద్-500 059. ఆం.ప్ర. ఇండియా.